శ్రీరామాయ నమః

శ్రీమద్వాల్మీకి మహర్షి ప్రణీత

శ్రీమద్రామాయణము

బాలకాండము

శ్రీ చేదలవాడ సుందరరామశాస్త్రులుగారి
పరమార్థచంద్రికావ్యాఖ్యానము తోడుగా

ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు రచించిన
బాలానందినీ వ్యాఖ్యతో కూడినది

ప్రచురణ

ఆర్ష విజ్ఞాన ట్రస్టు
హైదరాబాదు
1987

ప్రథమ ముద్రణ 1987
ప్రతులు 2000
© ఆర్ష విజ్ఞాన ట్రస్టు, హైద్రాబాద్

ప్రతులకు :

శ్రీ పమిడిఘంటం శ్రీ రఘురామ్,
శ్రీరామసదనము, ప్లాట్ నం. 1261, రోడ్ నం. 45
జుబిలీ హిల్సు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ,
హైదరాబాదు. 500 034.

మూల్యము రూ. 60/-
R.R. Rs. 80/-
A. V. Trust

ముద్రణ :

శివాజీ ప్రెస్
4-4-53, గంజ్ బజార్,
సికింద్రాబాదు-3.

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

Sri Sankara Bhagavatpadacharya Parampapagatha

His Holiness Sri Kanchi Kamakoti Peetadhipathi

Jagadguru Sri Sankaracharya Swamigal

Srimatham : : Samsthanam,

Kancheepuram - 631 502

Camp : Gwaliar, (M. P.) Date : 13-11-86

శ్రీరామచరిత్రము ఎన్నిసారులు ఎవరు చెప్పినను వినినను చాలునని అనిపించదు. శ్రీమద్రామాయణములో ధర్మము, మాతృభక్తి, పితృభక్తి, ఆచార్యభక్తి, పతిభక్తి, సహోదరప్రేమ, ఆపత్కాలములలో సంరక్షణ యిటువంటి అనేక ధర్మసూక్ష్మములు చెప్పబడినవి. ఈ రామాయణము విదేశములలోను చదువబడుచున్నది. శ్రీమద్రామాయణము సాగరమునకు సమానమైనది. అట్టి శ్రీమద్వాల్మీకిరామాయణము బాలకాండము శ్రీ చెదలవాడ సుందరరామశాస్త్రిగారి పరమార్థచంద్రికావ్యాఖ్యానము తోడు పాటుతో శ్రీపుల్లెల శ్రీరామచంద్రుడుగారు రచించిన బాలానందినీవ్యాఖ్యతో తాత్పర్యముతో కూడియుండుట చూచి సంతోషపడుచున్నాము. ఈ గ్రంథము అందరును చదువుటచే సదుపయోగము కావలయునని ఆశీర్వదించుచున్నాము.

నారాయణస్మృతి

ట్రస్టు బోర్డు సభ్యులు

శ్రీ నీలంరాజు వేంకటశేషయ్య — అధ్యక్షులు
ఎడిటర్, ఆంధ్రప్రభ (రిటైర్డ్,) హైదరాబాద్

శ్రీ దేవులపల్లి రామానుజరావు — సభ్యులు
హైదరాబాద్

శ్రీ ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి — ,,
హైదరాబాద్

డా. వి. శాంతారామ్ — ,,
హైదరాబాద్

డా॥ ముక్తినూతలపాటి గురునాథ్ — కోశాధ్యక్షులు
విజయవాడ

శ్రీ పమిడిఘంటం శ్రీరఘురామ్ — కార్యదర్శి
హైదరాబాద్

ఆర్షవిజ్ఞాన ట్రస్టు

శ్రీరామసదనము

ప్లాట్ నం. 1861, రోడ్ నం. 45

జుబిలీ హిల్సు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ,

హైదరాబాదు-500 034.

శ్రీమద్రామాయణమును గూర్చి

ప్రముఖ పండితాభిప్రాయములు

౧

సీతారాముల పరిపూర్ణ పవిత్ర పాత్రలను ప్రదర్శించిన రామాయణమువంటి కావ్యము ప్రపంచమున నే యుగమునగాని, యే ప్రాంతమునగాని గల సారస్వతమున గలదా యని యెలుగెత్తి చాటనిమ్ము ! నైతికప్రబోధము, భాషాభావ సారళ్యములు అహమహమికతో చిరునవ్వు లొలికించి, చిద్విలాసమును వెలార్చిన యిట్టి పవిత్ర కావ్యమును మఱెచటను గాంచజాలము.

—ఆచార్య గ్రిఫిత్.

౨

రామాయణమువలె నానందమును చేకూర్చు కావ్యములు విస్తృత విశ్వ సాహిత్యమునం దరుదు. భాషాపవిత్రతను, హృదయస్పందనము నుజ్జ్వలింపజేయు కమనీయ కావ్యసన్నివేశములను, వీరవిక్రమ ప్రతిభా క్రమవర్ణనములను, పరస్పర వైరుధ్య ద్వంద్వప్రదర్శకము లగు స్వచ్ఛందావేశములను, నే కాలమునగాని, నే దేశమునగాని వెలువడిన సారస్వత ప్రపంచమున గాంచజాలము. కావ్యకళా శిల్పమున రామాయణము హోమరురచనముల దలదన్నుచున్నది. అగాధ మతభావ మూలములు రామాయణమునం దంతటను వ్యాప్తములై యున్నవి. ఇలియడ్, ఒడిసీలను రామాయణ మహాభారతములతో బోల్చుట అటికా, థీసలీనదులను సింధు గంగా నదులతో బోల్చుటయే.

—సర్ మోనియర్ విలియమ్స్.

౩

రామాయణము భారతీయుల సర్వసంపదగ విలసిల్లుచున్నది. ప్రపంచమున గల యే సారస్వతమునందునను యుగయుగములుగ, కవితను, భావమును మరి యే గ్రంథమును యిట్లు ప్రసరింపజేయలేదు.

—వింటర్ నిట్సు.

౪

హోమరు రచించిన ఇలియడ్, రామాయణమునకు ప్రతిధ్వని మాత్రమే. రామాయణమున కది యొక దుర్బల స్మారకము. అద్దాని యనుకరణము విస్పష్టము. ఇయ్యది నిరాకరింప వీలులేనిది. అల్పవిషయములందునను అట్టి యనుకరణమును గాంతుము.

—యమ్. జల్లికోట్.

౫

రామాయణమునుండియే ఇలియడ్ రచింపబడినదని నా పరిపూర్ణ విశ్వాసము.

—హిపోలిట్ ఫౌష్

౬

ప్రపంచకావ్యములలో రామాయణము పవిత్రమైనది.

—న్యూజెల్.

౭

పందొమ్మిదవ శతాబ్ది ఆశ్చర్యకర విషయముల రెండింటి ననుభవమునకు దెచ్చెను. (1) క్రీస్తుమతమునకు సంబంధించిన పెక్కు విషయములు భారతదేశము నందే జననమొందినవి. గ్రీకు పురాణములు మౌళికములు, స్వతస్సిద్ధములుగావు, అనుకరణములు మాత్రమే. (2) ఒక సుందర స్త్రీ మానభంగము నెడ పగను సాధించుటకై గ్రీకు దేవతలు, వీరులు దండయాత్రను సాగించిన గ్రీకుగాథ గంగాతీరవాసులైన సీతారాముల గాథ కనుకరణమే.

—ఎమిల్ బూమాఫ్.

౮

క్రీ. పూ. 3000 సంవత్సరములనాటికే యున్నత నాగరికత కాలవాలములగు గొప్పరాజ్యములు గల వను సత్యమును నేను నిరాకరింపజాలను. ఆ కాలమునకు పైగనే రామాయణవీరుడగు రాముని కాలమును నే నన్వేషింతును.

—కెప్టెన్ ట్రాయర్

౯

మహాకవి దాంతే కవితకు ముగ్ధుల మగుదుము. హోమరుకవి విరచిత ఇలియడ్ పఠనమున పరితృప్తుల మగుదుము. పాశ్చాత్య సాహిత్యమునందు వా రసామాన్యులు. కాని కావ్యశిల్పమున వాల్మీకియే సర్వశ్రేష్ఠులు. రామాయణమును బోలిన మహా కావ్యము పృథ్విలో మరియొకటి లేదు.

-అరవిందయోగి.

౧౦

రామాయణ, భారతములు భారతదేశపు స్వత్వములు. కవి కావ్యమున గుప్తముగ నుండి, యీ రెండింటను భారతీయ పూర్ణసంస్కృతిని ప్రకటించెను.

8

రామాయణ సరళానుష్టుప్ గీతికలయందు భారతీయహృదయము యుగ యుగములుగ స్పందించు చున్నది. ఆ అఖండ సచ్చిదానందామృతమును ఆకాంక్షించి, అనుభవించిన మనపూర్వుల చిత్రపటమును రామాయణము సదా ప్రదర్శించుచున్నది. అందు వర్ణింపబడిన భ్రాతృత్వమును, సత్యానురాగమును, పతి భక్తిని, సేవ్య సేవకులయందలి భక్తి ప్రేమలయెడ మనకుగల సరళ పూజ్యభావమును, హృదయపూర్వకాదరణమును మనము సంరక్షించుకొనజాలినచో బాహ్యసముద్రము నుండి ప్రవహించు వినిర్మల మారుతము గవాక్షములనుండి మన గృహములందు వ్యాపించును.

—రవీంద్రనాథ ఠాకూర్.

3

ద్వంద్వములతో మిళితమైన భౌతిక ప్రపంచమునకు భిన్నమగు ఆనందాను భవావిష్కరణమును వాల్మీకి రామాయణమున కాంతుము. సుఖదుఃఖములతో కారాడు ఈ జగత్తుతోడి సంబంధమును సచ్చిదానందముతో బోల్చుకొనుటయే ప్రేమ, కరుణ. ఆ కరుణనుండియే రామాయణకావ్యము సముద్భవిల్లెను. విశ్వవిఖ్యాత రామాయణ జన్మగాథారహస్య మిదియే.

—కె. యస్. రామస్వామిశాస్త్రి.

Opinions in English

The Ramayana like Gita interprets the universe as a battle field in which the ethical power wins its way through conflict with the unnatural nonethical. The epic poem contains precepts of the regulation of our conduct in all actions and conditions. It makes us alive to what we owe to our parents, to our friends, to mankind, to our country and what we are to do as children, as men, as citizens. It teaches us to love and practice virtues."

Benjemin Khan

This is the great, ancient epic of India. Rama and Sita are the ideals of the Indian nation.

Rama, the ancient idol of the heroic ages, the embodiment of truth, of morality, the ideal son, the ideal husband, the ideal father, and above all the ideal king, this Rama has been presented before us by the gerat sage Valmiki.

There is no other Pouranika story that has so permeated the whole nation, so entered its very life and has so tingled in every drop of blood of the race, as this ideal of Sita."

All children, especially girls worship Sita. The height of a girl's ambition is to be like Sita, the pure, the devoted, the all suffering."

In fact the Ramayana and Mahabharata are the two encyclopaedias of ancient Aryan life and wisdom, portraying an ideal civilization, which humanity as yet to aspire after.

Swami Vivekananda

"From the peasant in the field and the worker in the factory to the high-brow and the scholar, the story of Rama and Sita has been a living one. Among our great festivals which spread joy and comradeship amongst all our people, there is none which is so popular, more especially in northern India than the Celebration of the story of Rama and Sita. Valmiki wrote his immortal epic and in later days, Tulsidas, writing in homely language, made this story a part of the texture of the lives of our people. A story and a book which has had this powerful influence on millions of people, during some millenia of our changing history, must have peculiar virtue in it. I do not think any person can understand India or her people fully without possessing a knowledge of the two magnificient epics that are India's pride and treasure."

Jawaharlal Nehru

The Ramayana, I hold to be almost without a rival in the world's literature. Weather we judge by the grandeur of the theme, by the variety of the characters portrayed, by the tone of its idealism, or by the appeal that it makes to the devout heart, it ranks amongst the noblest monuments of poetic genius. Of the countless benefits -- one may call them blessings -- that the Ramayana can confer, the highest in the training of the emotions and of the spirit of the lessons it teaches, the highest seems to me to be the exaltation of DHARMA. On its alteer everything must be satisfied, reverently and cheerfully.

The author who conceived and delienated the character of Rama in such convincing detail as we have in the Ramayana is a supreme genius. Poet, prophet or seer has seldom presented to the mind of man so noble an apothesis of duty.

Rt. Hon. V. S. Srinivasa Sastri

Probably no work of world literature, secular in its origin has ever produced so profound an influence on the life and the thought of the people as the Ramayana"

Macdonell.

To me ...... Rama, described as the Lord of Sita, son of Dasharatha is the all-powerful essence whose name, inscribed in the heart, removes all suffering - mental, moral and physical.

Mahathma Gandhi

The Ramayana is not history or biography, it is a part of Hindu mythology. We cannot understand Greek life and Greek civilization without knowing all about Jews, Apollo, Hercules, Venus, Hector, Priam, Achilles, Ulysses and others. So also one cannot understand Hindu Dharma, unless one knows Rama and Sita, Bharata, Laxmana, Ravana, Kumbhakarna and Hanuman.

C. Rajagopalachari

Sri Rama is the pillar of Dharma for all time. It is his example and his inspiration that have been built into the edifice of our ancient culture. Dharma understood in terms of the twin concepts Satya and Tyaga so perfectly personified in one extolled as "Vigrahavan Dharmah", is the one unique constituent of the pattern of life handed down to us by our ancients which is valid for all time and for all peoples.

At the present day when amoral forces are making havoc of our lives, destorting our views and disrupting our foundations, we cannot do better than herken to the voice of Sri Rama, uttered through his several actions signifying the eternal ideals of our SANATANA DHARMA.

K. M. Munshi

Side by side with Maha Bharatha, Ramayana stands as the inspiror and the stimulus of the thoughts and the aspirations of India.

Dr. C. P. Ramaswami Aiyer

ముందు మాట

ఆర్షసంస్కృతికి మూలకందమైన గ్రంథరాశిని టీకాతాత్పర్య విశేషసహితంగా ప్రకటించాలనే ప్రధానోద్దేశంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, గౌరవ నీయులైన శ్రీ పమిడిఘంటం కోదండరామయ్యగారి అధ్యక్షతను ఆర్ష విజ్ఞాన ట్రస్టు అనే పేరుతో ఒక ధర్మసంస్థ నెలకొల్పబడింది.

బ్రహ్మశ్రీ చెదలవాడ సుందరరామశాస్త్రిగారి 'పరమార్థచంద్రికా' వ్యాఖ్యానం తోడుపాటుతో విద్వల్లోకానికి సుపరిచితమైన శ్రీమద్వాల్మీకి రామాయణాన్ని ఆబాల గోపాలానికి అందుబాటులో ఉండే భాషలో ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత శాఖాధ్యక్షులు శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు సంతరించిన బాలానందినీ వ్యాఖ్యా సహితంగా ఈ సంస్థ తొలిప్రచురణగా వెలువరించాలని కూడా నిర్ణయమైనది.

మా సంకల్పాన్ని విన్నవించడమే తడవుగా పరదేవతాస్వరూపులు, కంచి కామకోటి పరమాచార్యులు శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి యతీంద్రులు తమ ఆశీస్సులు అనుగ్రహించి మా ప్రయత్నాన్ని ప్రోత్సహించారు. శ్రీవారి ఆశీఃఫలితమే ఆంధ్రమహాజనుల కరకమలాలకు ఆనందోత్సాహాలతో నేడు మేము అందజేస్తున్న ఈ వాల్మీకి రామాయణ బాలకాండము.

మా సంస్థలో సభ్యులుగా నున్న ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు మొదటి నుండియు ఈ సంస్థకు సర్వవిధములుగా తోడ్పడిరి. వారు దివంగతులగుట ఈ సంస్థకు తీరని లోటుగా భావిస్తున్నాము.

ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారును ఈ సంస్థలో సభ్యులే. ఈ గ్రంథ మింత సుందరముగా వెలువడుటకు వారి పర్య వేక్షణమే కారణము.

రామాయణం ప్రాచీన భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే సర్వోత్తమ జాతీయకావ్యం. దేశకాలాలకూ, కులమతాలకూ అతీతంగా మానవులకు ఉత్తమ జీవనాన్ని ప్రదర్శించే ఆదర్శ గ్రంథం. ఈనాడు కులమత విచక్షణ లేకుండా భారత దేశంలోనే కాదు విదేశాలలో కూడా రామాయణం ఆసక్తితో పఠింపబడుతున్నది. ఆస్తికులనేకుల కిది నిత్య పారాయణగ్రంథంగా విలసిల్లుతున్నది.

ప్రపంచ విఖ్యాత మేధావులు ఈ గ్రంథాన్ని గూర్చి వెలువరించిన అభిప్రాయాలు తెలిసికొనుట మన కర్తవ్యం. అందులో కొన్ని ఆంధ్రీకృత అభిప్రాయాలు శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు వారి రామాయణ సుధాలహరిలో సేకరించినవే వారి సౌజన్యంతో మే మిందులో పొందుపరచాము.

ఈ గ్రంథముద్రణను గూర్చి తెలియగానే కొందరు అజ్ఞాతంగానే ఉంటూ, తమ పేర్లు వెల్లడిచేయకుండా మా సంస్థ ఎకౌంటులో డబ్బు జమచేసి పుణ్యం కట్టుకొన్నారు. వారికి మా సంస్థపక్షాన ధన్యవాదాలు తెలుపుకొనటం మా కర్తవ్యంగా భావిస్తున్నాము.

అచిరకాలంలోనే క్రమంగా తక్కిన రామాయణసంపుటాలు వెలువడగలవని మనవి చేస్తున్నాము. ఈ రామాయణాన్ని చదివినవా రందరికీ నైతిక విలువలు పెంపొందగలవనీ, ఆ అధ్యయనం వల్ల ఆర్షవిజ్ఞానవైభవం కొఱతపడకుండా తరతరాలుగా ఆచంద్రార్కం సముద్ధరించబడగలదనీ ఆశిస్తున్నాము.

నీలంరాజు వెంకట శేషయ్య

శ్రీ

బాలకాండాంతర్గత విషయసూచిక

సర్గ	విషయము	పుట
1.	నారదుడు వాల్మీకికి సంక్షిప్తముగ రామాయణకథ చెప్పుట.	1
2.	రామాయణప్రారంభము. తమసాతీరమున క్రౌంచపక్షిని వ్యాధుడు చంపగా చూచిన వాల్మీకి తన శోకమును శ్లోకరూపమున ప్రకటించుట. బ్రహ్మదేవుడు రామచరితవర్ణనాత్మక మగు కావ్యము రచింపు మని వాల్మీకిని ఆదేశించుట.	60
3.	రామాయణమునందలి విషయముల సంక్షిప్తవర్ణనము.	82
4.	వాల్మీకి ఇరువదినాలుగువేల శ్లోకముల రామాయణము రచించి దానిని కుశలవులకు నేర్పుట. వారు రామాయణగానము చేయుచుండగా విని మునులు వారిని, రామాయణమును ప్రశంసించుట. శ్రీరాముడు కుశలవులను తన కొలువునకు రావించి, ఆదరించి, వారు గానము చేయగా రామాయణమును వినుట.	96
5.	దశరథుడు పాలించుచున్న అయోధ్య గొప్పతనము.	108
6.	దశరథుడు రాజ్యపాలనము చేయు కాలమున పౌరుల సుఖైశ్వర్యాదుల వరనము.	118
7.	రాజామాత్యుల గుణనీత్యాదుల వర్ణనము.	130

సర్గ	విషయము	పుట
8.	సంతానోత్పత్తి నిమిత్తమై దశరథుడు అశ్వమేధయాగము చేయ సంకల్పించుట. మంత్రులును, బ్రాహ్మణులును దానిని ఆమోదించుట.	139
9.	సుమంత్రుడు దశరథునకు ఋశ్యశృంగునిగూర్చి సంక్షిప్తముగ చెప్పుట.	148
10.	ఋష్యశృంగుడు అంగదేశమునకు వచ్చుట. అతడు శాంతను వివాహమాడుట.	156
11.	సుమంత్రుని ఉపదేశము ప్రకారము దశరథుడు అంగదేశమునకు వెళ్లి రోమపాదుని ఒప్పించి శాంతాఋష్యశృంగులను అయోధ్యకు తీసికొని వచ్చుట.	168
12.	యాగము చేయింపు డని దశరథుడు ఋషులను కోరుట. తగు సంభారములను సమకూర్పు మని ఋషులు అతనితో చెప్పుట. దశరథుడు తన అమాత్యులను అందులకై ఆదేశించుట.	179
13.	దశరథుడు యాగము ప్రారంభింపచేయు మని వసిష్ఠుని కోరుట. అందులకై సేవకులను ఆజ్ఞాపించుట. వివిధదేశరాజుల నాహ్వానించుటకై వసిష్ఠుడు సుమంత్రుని ఆజ్ఞాపించుట. వచ్చిన రాజులకు ఆదర సత్కారములు చేయుట. పత్నీసమేతు డైన దశరథుడు యజ్ఞదీక్ష గ్రహించుట.	185
14.	దశరథుడు సాంగోపాంగముగా సరయూతీరమున అశ్వమేధయాగము చేయుట.	199
15.	ఋష్యశృంగుని యాధ్వర్యవమున దశరథుడు పుత్రేష్టి ప్రారంభించుట. దేవతలు ప్రార్థింపగా బ్రహ్మదేవుడు రావణవధోపాయము చెప్పుట. శ్రీమహావిష్ణువు దేవతల నోదార్చుట.	221

సర్గ	విషయము	పుట
16.	నరరూపమున అవతరించి రావణవధ చేయవలె నని దేవతలు శ్రీమహా విష్ణువును అభ్యర్థించుట. దశరథుడు పుత్రేష్టి చేయుచుండగా అగ్ని కుండమునుండి ఆవిర్భవించిన ప్రాజాపత్యపురుషుడు ఆతనికి పాయసము నిచ్చుట. దానిని భుజించి ఆతని భార్యలు గర్భవతు లగుట.	234
17.	బ్రహ్మదేవుడు ప్రేరేపింపగా దేవాదులు అనేకవానరవీరులను సృజించుట.	247
18.	రాజులను ఋష్యశృంగుని తమ దేశములకు పంపివేసి పత్నీసమేతు డైన దశరథుడు తన నగరమునకు తిరిగి వచ్చుట. శ్రీరామలక్ష్మణ భరతశత్రుఘ్నుల ఉత్పత్తి. వారికి జాతకర్మాది సంస్కారములు చేయుట. వారి శీలగుణాదుల వర్ణనము. విశ్వామిత్రుడు దశరథునివద్దకు వచ్చుట. ఆతనికి దశరథుడు సత్కారము చేయుట.	260
19.	"నేను చేయ తలపెట్టిన యాగమును రక్షించుటకై రాముని పంపుము" అని విశ్వామిత్రుడు కోరగా దశరథుడు మిగుల దుఃఖించుట.	282
20.	దశరథుడు తన కోరికను మన్నింపక పోవుటచే విశ్వామిత్రుడు కోపించుట.	290
21	విశ్వామిత్రుడు కోపోద్దీపితుడై పలికిన పలుకులు విని వసిష్ఠుడు రాముని విశ్వామిత్రునితో పంపుటకై దశరథునకు నచ్చజెప్పుట.	301
22.	దశరథుడు స్వస్త్యయనాదులు జరిపి రామలక్ష్మణులను విశ్వామిత్రునితో పంపుట. మార్గమధ్యమున విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు 'బల' 'అతిబల' అను విద్య లుపదేశించుట.	309
23.	శ్రీరామలక్ష్మణసమేతు డైన విశ్వామిత్రుడు సరయూగంగాసంగమము దగ్గర నున్న ఆశ్రమములో రాత్రి విశ్రమించుట.	318

సర్గ	విషయము	పుట
24.	నావపై ఎక్కి నదిని దాటుచున్నపుడు "నీరు బ్రద్దలగుచున్నట్లు ఇంత గంభీరధ్వని వచ్చుచున్న దేమి కారణము?" అని శ్రీరాముడు అడుగగా విశ్వామిత్రుడు ప్రత్యుత్తర మిచ్చుట. విశ్వామిత్రుడు మలద-కరూష-తాటకావనములను గూర్చి రామునకు తెలిపి తాటకను చంపు మని శ్రీరాముని ప్రేరేపించుట.	328
25.	శ్రీరాముడు ప్రశ్నింపగా విశ్వామిత్రుడు తాటకాజననము, ఆమె వివాహము, శాపము మొదలగు విషయములు చెప్పి ఆమెను సంహరింపు మని రాముని ప్రేరేపించుట.	340
26.	శ్రీరాముడు తాటకను సంహరించుట.	348
27.	విశ్వామిత్రుడు శ్రీరామునకు దివ్యాస్త్రము లుపదేశించుట.	361
29.	విశ్వామిత్రుడు శ్రీరామునకు ప్రయోగించిన అస్త్రములను ఎట్లు ఉపసంహరించవలెనో ఉపదేశించి మరికొన్ని అస్త్రములు కూడ ఉపదేశించుట. శ్రీరాముడు అచట నున్న ఆశ్రమమును గూర్చి ప్రశ్నించుట.	370
29.	విశ్వామిత్రుడు శ్రీరామునకు సిద్ధాశ్రమవృత్తాంతము చెప్పుట. రామలక్ష్మణులతో తన ఆశ్రమము చేరిన విశ్వామిత్రుని అచటి మునులందరును పూజించుట.	377
30.	శ్రీరాముడు రాక్షసులను సంహరించి విశ్వామిత్రుని యాగమును సంరక్షించుట.	389
31.	శ్రీరామాదులతో కలిసి విశ్వామిత్రుడు మిథిలకు ప్రయాణమగుట. వారు మార్గమధ్యమున, సాయంకాలము శోణభద్రతీరమున విశ్రమించుట.	399

సర్గ	విషయము	పుట
32.	బ్రహ్మపుత్రుడైన కుశుని నలుగురు పుత్రుల వర్ణనము, శోణభద్ర తీరప్రాంతమునందలి దేశమునకు వసువు అధిపతి యని చెప్పుట. వాయువు కోపముచే కుశనాభుని నూర్గురు కుమార్తెలను గూనువారినిగా చేయుట.	408
33.	కుశనాభుడు వాయువు విషయమున ధైర్యముతో, ఓర్పుతో ప్రవర్తించినందుకు తన కుమార్తెలను మెచ్చుకొనుట. బ్రహ్మదత్తుని జన్మవృత్తాంతము, అతడు కుశనాభుని కుమార్తెలను పరిణయమాడుట.	418
34.	గాధి జన్మవృత్తాంతము, విశ్వామిత్రుని సోదరి యైన కౌశికి ప్రశంస. కథ ముగించి విశ్వామిత్రుడు అర్ధరాత్రమును వర్ణించుచు, నిద్రించవలసినదిగా అందరిని ఆదేశించి, తాను కూడ నిద్రించుట.	428
35.	విశ్వామిత్రాదులు శోణభద్రను దాటి, గంగాతీరము చేరి, రాత్రి అచట నివసించుట. శ్రీరాముడు ప్రశ్నింపగా విశ్వామిత్రుడు గంగావతరణకథ చెప్పుట.	437
36.	దేవతలు పార్వతీశివుల రతిక్రీడలకు విఘ్నము కలిగింపగా పార్వతి దేవతలకును, భూదేవికిని శాపము నిచ్చుట.	446
37.	గంగనుండి కార్తికేయుడు జనించుట.	456
38.	సగరచక్రవర్తికి సంతానోత్పత్తి, అతడు యాగము చేయుటకై సంకల్పించి ప్రారంభించుట.	468
.	సగరచక్రవర్తి విడచిన యజ్ఞాశ్వమును దేవేంద్రుడు అపహరించుట, సగరుని కుమారులు యజ్ఞాశ్వమును వెదకుచు భూమిని భేదించుట. దేవత లందరును పోయి బ్రహ్మవద్ద మొరపెట్టుకొనుట.	477
40.	సగరపుత్రులు అచిరకాలమున నశింపగల రని చెప్పి బ్రహ్మదేవుడు దేవతల నూరడించుట, భూమిని త్రవ్వుచు పాతాళమునకు పోయిన	

సర్గ	విషయము	పుట
	సగరపుత్రులు అచట కపిలుని దగ్గర యజ్ఞాశ్వమును చూచి ఆతనిని చంపుటకై వెళ్లగా అతడు వారిని హుంకరించి భస్మము చేయుట.	487
41.	సగరచక్రవర్తి ఆజ్ఞచే అంశుమంతుడు రసాతలమునకు వెళ్ళి యజ్ఞాశ్వమును తీసుకొనివచ్చుట. అతడు తన పినతండ్రుల వినాశమును గూర్చియు, గంగోదకముతో తర్పణము చేసిననే వారు ఉద్ధరింపబడుదు రనియు సగరచక్రవర్తికి చెప్పుట.	497
42.	అంశుమంతుడు గంగను భూలోకమునకు తీసికొనివచ్చుటకై తపస్సు చేసి విఫలు డగుట. పిమ్మట భగీరథుడు తపస్సు చేసి బ్రహ్మదేవుని మెప్పింపగా బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఆతనితో భూలోకమునకు దిగు గంగను తన తలపై ధరించుటకై శివుని ప్రార్థించు మని చెప్పుట.	507
43.	భగీరథుని తపస్సుచే సంతసించిన శివుడు గంగను శిరస్సుపై ధరించి ఆమెను బిందుసరోవరమునందు విడచుట. అచట గంగ ఏడు ప్రవాహములుగ చీలి, భగీరథుని అనుసరించి పాతాళమునకు వెళ్ళి ఆతని తాతలగు సగరపుత్రులను ఉద్ధరించుట.	516
44.	బ్రహ్మదేవుడు భగీరథుని ప్రశంసించి గంగాజలముచే పితృతర్పణము చేయుటకై ఆతనికి అనుజ్ఞ ఇచ్చుట, అదంతయు చేసి భగీరథుడు తన పురమునకు వెళ్ళుట, గంగావతరణోపాఖ్యానమహిమను వర్ణించుట.	531
45.	దేవతలును, దైత్యులును కలిసి క్షీరసాగరమును మథించుట, రుద్రుడు హాలాహలవిషమును భక్షించుట, విష్ణువు క్రిందికి దిగబడిన మందర పర్వతమును పాతాళమునుండి ఉద్ధరించుట,దానితో మరల సముద్రమును మథింపగా దానినుండి ధన్వంతరి, అప్సరసలు, మద్యము, ఉచ్చైశ్శ్రవస్సు అను అశ్వము, కౌస్తుభము, అమృతము ఆవిర్భవించుట. దేవాసురుల మధ్య జరిగిన యుద్ధమునందు దైత్యులు మరణించుట.	539

సర్గ	విషయము	పుట
46.	పుత్రమరణముచే దుఃఖితురాలగు దితి ఇంద్రుని చంపగల పుత్రుడు లభించుటకై తపస్సు చేయుటకు కశ్యపుని అనుజ్ఞ పొంది, కుశప్లవము నందు తపస్సుచేయుట, ఇంద్రుడు ఆమెకు పరిచర్య చేయుట. ఆమె అశుచిగా ఉన్న అదను చూచి అతడు ఆమె గర్భములో ప్రవేశించి గర్భస్థశిశువును ఏడు ముక్కలుగా ఖండించుట.	555
47.	ఆ విధముగ ఖండింపబడిన తన గర్భస్థశిశువును ఏడుగురు మరుత్తులుగ చేసి స్వర్గమునందు రక్షింపు మని దితి ఇంద్రుని కోరగా అతడు అందులకు అంగీకరించుట. ఆ దితి తపస్సు చేసిన వనమునందే ఇక్ష్వాకుకుమారుడైన విశాలుడు విశాల అను నగరిని నిర్మించుట. ఆ కాలమునందు అక్కడ రాజుగా నున్న సుమతి విశ్వామిత్రుని పూజించుట.	564
48.	ఆ రాజు సత్కారముల నందికొని రామలక్ష్మణాదిసహితు డగు విశ్వామిత్రుడు ఆ రాత్రి అచట ఆగి మరునాడు మిథిలానగరిని సమీపించుట, అచట ఉన్న జనశూన్య మైన ఆశ్రమమును గూర్చి రాముడు ప్రశ్నించగా విశ్వామిత్రుడు గౌతముని భార్యయైన అహల్యకు శాపము ప్రాప్తించిన వృత్తాంతము చెప్పుట.	573
49.	శాపముచే అండములు పోయిన ఇంద్రునకు పితృదేవతలు మేషాండములు కూర్చుట. శ్రీరాముడు అహల్యను శాపవిముక్తురాలిని చేయుట. అహల్యాగౌతములు శ్రీరాముని సత్కరించుట.	585
50.	శ్రీరామాదులు మిథిలాపురి చేరుట. జనకుడు విశ్వామిత్రుని పూజించుట. జనకుడు రామలక్ష్మణులను గూర్చి అడుగగా విశ్వామిత్రుడు వారి విషయము చెప్పుట.	593
51.	శతానందుడు అడుగగా విశ్వామిత్రుడు అతనికి శ్రీరాముడు అహల్యాశాపవిముక్తి కలిగించిన వృత్తాంతము చెప్పుట. మిక్కిలి సంతసించిన	

సర్గ	విషయము	పుట
	శతానందుడు శ్రీరాముని అభినందించి విశ్వామిత్రుని పూర్వవృత్తాంతమును వర్ణించి చెప్పుట.	602
52.	వసిష్ఠుడు విశ్వామిత్రమహారాజును సత్కరించుటకై కావలసిన వస్తువుల నన్నింటిని సృజింపు మని కామధేనువును ఆదేశించుట.	612
53.	కామధేనువు సృజించిన అన్నపానాదులచే విశ్వామిత్రుడును, అతని సైన్యమును బాగుగ సంతృప్తి చెందిన పిమ్మట విశ్వామిత్రుడు కామధేనువును తన కిమ్మని వసిష్ఠుని కోరుట. వసిష్ఠు డాతని కోరికను నిరాకరించుట.	621
54.	విశ్వామిత్రుడు బలాత్కారమున వసిష్ఠుని ధేనువును అపహరించుటకై ప్రయత్నించుట. తనను విడచుట వసిష్ఠునకు సంమతము కాదను విషయము తెలిసిన కామధేనువు అతని ఆజ్ఞచే శకయవనాదులను సృజింపగా వారు విశ్వామిత్రసైన్యమును సంహరించుట.	630
55.	విశ్వామిత్రుని నూర్గురు పుత్రులతో సహా సైన్యమంతయు నశించగా ఆతడు తపస్సుచే శివుని ప్రసన్నుని చేసికొని, ఆ శివునివలన దివ్యాస్త్రములు సంపాదించి వాటిని వసిష్ఠాశ్రమముపై ప్రయోగించుట. ఆ అస్త్రములను వారించుటకై వసిష్ఠుడు బ్రహ్మదండమును చేత ధరించి విశ్వామిత్రుని ఎదుటకు వచ్చి నిలచుట.	639
56.	విశ్వామిత్రుడు వసిష్ఠునిపై వివిధాస్త్రములను ప్రయోగింపగా వసిష్ఠుడు తన బ్రహ్మదండముతో ఆ అస్త్రముల నన్నింటిని శమింపచేయుట. బ్రాహ్మణత్వమును సంపాదించుటకై విశ్వామిత్రుడు తపస్సు చేయ నిశ్చయించుకొనుట.	650
57.	విశ్వామిత్రుడు తపస్సు చేయుట. సశరీరస్వర్గము పొందుటకై తనచే యజ్ఞము చేయింపవలె నని త్రిశంకువు వసిష్ఠుని ప్రార్థించుట. ఆత డందులకు నిరాకరింపగా త్రిశంకుడు గురుపుత్రులవద్దకు వెళ్ళి తన అభిప్రాయము చెప్పుట.	658

సర్గ	విషయము.	పుట
58.	వసిష్ఠుని కాదని తమవద్దకు వచ్చినందుకు వారాతనిని నిందించి ఇంటికి వెళ్లు మని చెప్పుట. మరొక గురువు నాశ్రయింతు నని అతడు పలుకగా వారు అతనిని శపించుట. వారి శాపముచే చండాలత్వము పొందిన త్రిశంకువు విశ్వామిత్రు నాశ్రయించుట.	666
59.	విశ్వామిత్రుడు త్రిశంకువునకు ధైర్యము చెప్పి ఆతనిచే యజ్ఞము చేయించుటకై ఋషుల నాహ్వానించుట. తనను అధిక్షేపించిన మహోదయుని, వసిష్ఠపుత్రులను శపించుట.	675
60.	త్రిశంకువుచే యజ్ఞము చేయింపు డని విశ్వామిత్రుడు కోరగా ఋషులు యజ్ఞము నారంభించుట. త్రిశంకుడు సశరీరముగ స్వర్గమునకు వెళ్లుట. ఇంద్రుడు త్రిశంకువును స్వర్గమునుండి క్రిందికి త్రోసివేయగా కుపితుడైన విశ్వామిత్రుడు మరొక స్వర్గలోకమును సృజించుటకు ఉద్యమించుట. దేవతలు ప్రార్థింపగా ఆతడా ఉద్యమమునుండి విరమించుట.	684
61.	విశ్వామిత్రుడు పుష్కరతీర్థమునందు తపస్సు చేయుట. అంబరీషుడు ఋచీకు డను మునియొక్క మధ్యమపుత్రుని యజ్ఞపశువుగా వెల యిచ్చి కొని తీసికొని వెళ్లుట.	696
62.	విశ్వామిత్రుడు శునఃశేపుని రక్షించుట, మరల తపస్సు చేయుట.	704
63.	విశ్వామిత్రుడు "మహర్షిత్వమును" పొందుట. మేనక ఆతని తపస్సుకు భంగము కలిగించుట. "బ్రహ్మర్షిత్వము" సంపాదించుటకై విశ్వామిత్రుడు ఘోరతపస్సు చేయుట.	714
64.	తనతపస్సును భంగము చేయుటకై వచ్చిన రంభను శపించి విశ్వామిత్రుడు ఘోరతపస్సు చేసెద నని శపథము చేయుట.	724
65.	విశ్వామిత్రుడు ఘోరతపస్సు చేయగా ఆతనికి బ్రాహ్మణత్వము లభించుట. జనకమహారాజు విశ్వామిత్రుని ప్రశంసించి, ఆతని అనుజ్ఞగైకొని తన నివాసమునకు వెళ్లుట.	732

సర్గ	విషయము	పుట
66.	విశ్వామిత్రుని, రామలక్ష్మణులను తగు రీతి గౌరవించి జనకుడు వారికి శివధనుర్వృత్తాంతము చెప్పుట. శ్రీరాముడు ధనుస్సునకు నారి కట్టినచో అతనికి సీత నిచ్చెద నని జనకుడు తన నిశ్చయమును ప్రకటించుట.	746
67.	శ్రీరాముడు నారి కట్టి ధనస్సును లాగగా అది విరిగిపోవుట. విశ్వామిత్రుని ఆజ్ఞచే జనకుడు దశరథుని తీసికొనివచ్చుటకై మంత్రులను పంపుట.	756
68.	జనకుడు పంపిన వార్త విని దశరథుడు మంత్రిసమేతుడై మిథిలకు వెళ్లుటకై బయలుదేరుట.	766
69.	సేనాసమేతు డైన దశరథుడు మిథిల చేరగా జనకు డాతనిని సత్కరించుట.	774
70.	జనకుడు దూతలను పంపి సాంకాశ్యమునుండి తమ్ము డైన కుశధ్వజుని రప్పించుట. దశరథుని కోరిక ననుసరించి వసిష్ఠుడు సూర్యవంశీయ రాజులను వర్ణించి రామలక్ష్మణులకొరకై సీతా ఊర్మిళలను వర్ణించుట.	781
71.	జనకుడు తన వంశమును గూర్చి వర్ణించి చెప్పి శ్రీరామలక్ష్మణులకు సీతా—ఊర్మిళలను ఇచ్చెద నని అంగీకరించుట.	797
72.	విశ్వామిత్రుడు భరతశత్రుఘ్నులకొరకై కుశధ్వజుని కన్యలను వరించగా జనకు డందుకు అంగీకరించుట. దశరథుడు పుత్రుల మంగళముకొరకై నాందీశ్రాద్ధగోదానాదు లనుష్ఠించుట.	806
73.	శ్రీరామలక్ష్మణభరతశత్రుఘ్నుల వివాహము.	816
74.	విశ్వామిత్రుడు తన యాశ్రమమునకు వెళ్లిపోవుట. జనకుడు కన్యల కొరకు అత్యధికముగ అరణము నిచ్చుట. దశరథుడు సేనాసమేతుడై తన నగరమున కేగుచుండగా దారిలో పరశురాముడు వచ్చుట.	831

సర్గ	విషయము	పుట
75.	దశరథుని మాటలను లక్ష్యము చేయక పరశురాముడు శ్రీరామునితో "నీ వీ వైష్ణవధనుస్సుపై బాణసంధానము చేయుము" అని పలుకుట.	840
76.	శ్రీరాముడు వైష్ణవధనస్సును ఎక్కుపెట్టి, అమోఘ మైన బాణముతో పరశురాముడు తపస్సు చేసి సంపాదించుకొనిన పుణ్యలోకములను కొట్టివేయుట. పరశురాముడు తిరిగి మహేంద్రపర్వతము చేరుట.	851
77.	భార్యాసమేతులైన పుత్రులతో దశరథుడు అయోధ్యలో ప్రవేశించుట. శత్రుఘ్నసమేతుడై భరతుడు మేనమామ యింటికి వెళ్లుట. శ్రీరాముని సద్గుణములు చూచి ప్రజ లెల్లరు సంతోషించుట. సీతారాముల ప్రేమాతిశయవర్ణనము.	860



శ్రీః

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః

బాలానన్దినీ సహితమగు

శ్రీమద్రామాయణము : బాలకాండము

ప్రథమసర్గము

అవతరణిక :- చతుర్ముఖాంశసంభూతుడును, సర్వజ్ఞుడును, అయిన వాల్మీకి మహాముని—"యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదే వేతరో జనః, స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే" (మహాపురుషులు ఏది ఆచరింతురో ఇతరజనులు కూడ దానినే ఆచరింతురు. వారు దేనిని ప్రమాణముగ గ్రహింతురో దానినే లోకు లందరును ప్రమాణముగ గ్రహింతురు.) అను న్యాయమును అనుసరించి, లోకు లందరును గురువు నాశ్రయించి తాపత్రయవిముక్తి పొందెదరు గాక అను అభిప్రాయముతో, తాను పరమజ్ఞానియే యైనను నారదుని ఆశ్రయించి, తాప త్రయమును తొలగించునదియు, అత్యుత్తమలక్ష్యమును అగు బ్రహ్మస్వరూపమును తెలిసికొనెను. ఆ పరమరహస్యమును అందరికిని తెలియునట్లు రామాయణ రూపమున ప్రచురింపదలచి అది నిర్విఘ్నముగ పరిసమాప్తి నొందుటకై మొదట మంగళాచరణము చేయుచున్నాడు. గురువు ఉపదేశించిన విషయమును స్మరించుచు గురుస్మరణము కూడ చేయుటయే ఇచట మంగళము.

మూ. తపఃస్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్,
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుఙ్గవమ్. 1

ప్ర. అ. తపస్వీ=తపస్సుగల, వాల్మీకిః=వాల్మీకిమహర్షి, తపః స్వాధ్యాయ నిరతమ్ = తపస్సునందును వేదాధ్యయనమునందును ఆసక్తి కలవాడును, వాగ్విదాం=వాక్కు తెలిసినవారిలో, వరమ్=శ్రేష్ఠుడును, ముని పుఙ్గవమ్=మునులలో గొప్పవాడును అగు, నారదమ్=నారదుని, పరిపప్రచ్ఛ=ప్రశ్నించెను.

తాత్పర్యము :— తపఃశాలియగు వాల్మీకి, తపస్సును, వేదాధ్యయనమును చేయుటయందు ఆసక్తికలవాడును, వాక్కులు తెలిసినవారిలో శ్రేష్ఠుడును, మునులలో గొప్పవాడును అగు నారదుని ప్రశ్నించెను.

విశేషార్థములు :— తపస్వీ — కృచ్ఛ్రచాంద్రాయణాదివ్రతములను ఆచరించుచు నిత్యనైమిత్తికకర్మలను అనుష్ఠించుటయే తపస్సు. అట్టి తపస్సు కలవాడు తపస్వి.

'తపస్' అను పదమునకు 'విన్' అను మత్వర్థీయ (కలవాడు అను అర్థమును బోధించు) ప్రత్యయమును చేర్చగా 'తపస్వీ' అని అయినది. ఇక్కడ 'విన్' ప్రత్యయమునకు ప్రాశస్త్యము అర్థము. తపస్సు జ్ఞానసాధనమని వేదము చెప్పుచున్నది. అట్టి తపస్సే సాధనచతుష్టయసంపత్తి. అది కలవాడే వేదాంత శాస్త్రము చదువుటకు అధికారి. అందుచే - తపస్వీ=అట్టి తపస్సుకలవారిలో ఉత్తముడని అర్థము.

తపఃస్వాధ్యాయనిరతమ్ :— 'తపః' అను పదము "తప ఆలోచనే" అను ధాతువునుండి నిష్పన్నమయినది. జ్ఞానము అని అర్థము. "స్వాధ్యాయః" అనగా వేదము. ఈ తపఃస్వాధ్యాయములందు మిక్కిలి ఆసక్తి కలవాడు. లేదా 'తపః' అనగా బ్రహ్మను ప్రతిపాదించునది. బ్రహ్మప్రతిపాదకములగు వేదములందు అనగా వేదాంతములందు ఆసక్తికలవాడు. లేదా 'తపః' అనగా కృచ్ఛ్ర చాంద్రాయణాదులను ఆచరించుచు నిత్యనైమిత్తికకర్మలను అనుష్ఠించుట. 'స్వాధ్యాయః' అనగా అర్థజ్ఞానము కలుగువరకును వేదాధ్యయనము చేయుట. అట్టి తపః స్వాధ్యాయములందు ఆసక్తి కలవాడని అర్థము.

వాగ్విదామ్ :— వాక్ అనగా బ్రహ్మము. "బ్రహ్మను తెలిసికొనినవారిలో" లేదా, వాక్ అనగా శబ్దముల సాధుత్వమును బోధించు వ్యాకరణము. ఇది మిగిలిన ఐదు వేదాంగములకు ఉపలక్షణము. (ఉపలక్షణ మనగా చెప్పవలసిన వానిలో ఒక అంశమును మాత్రము చెప్పుట. దానిని బట్టి మిగిలిన వాటిని కూడ గ్రహించుకొనవలసి ఉండును). అందుచే 'వాగ్విదామ్' అనగా "శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అనెడి వేదాంగములారును తెలిసినవారిలో" అని అర్థము. లేదా 'వాక్' అనగా పద్దెనిమిది విద్యలు-(ఋగ్యజుస్సామాథర్వవేదములు, శిక్షాదులైన ఆరు వేదాంగములు, మీమాంస,

న్యాయవిస్తరము, ధర్మశాస్త్రము, పురాణము, ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వము, అర్థశాస్త్రము అనునవి.) ఆ పద్దెనిమిది విద్యలు తెలిసినవారిలో.

మునిపుఙ్గవమ్ :— 'ముని' అనగా మననము చేయువాడు. అనగా బ్రహ్మానుసంధానము చేయువాడు. "మునులలో గొప్పవాడు."

వాల్మీకిః :— వల్మీకమునుండి, అనగా పుట్టనుండి, పుట్టినవాడు. "అథా బ్రవీన్మహాతేజా బ్రహ్మా లోకపితామహః, వల్మీకప్రభవో యస్మాత్ తస్మా ద్వాల్మీకి రిత్యసౌ" ("ఈ ఋక్షుడు వల్మీకమునుండి పుట్టినాడు గాన వాల్మీకి" అని మహా తేజఃశాలియు, లోకము లన్నింటికి పితామహుడును అగు బ్రహ్మా చెప్పెను) అని బ్రహ్మకైవర్తమునందు వాల్మీకిశబ్దార్థము చెప్పబడి యున్నది. "ఋక్షోఽభూ ద్భార్గవ స్తస్మా ద్వాల్మీకి ర్యోఽభిధీయతే" (అతని వలన, అనగా ప్రచేతసుని వలన, వాల్మీకి అని ప్రసిద్ధుడైన భార్గవుడగు ఋక్షుడు పుట్టెను) అను విష్ణు పురాణవచనము వాల్మీకికే ఋక్షుడని మరియొక పేరు ఉన్నదనియు అతడు భృగువంశమునకు చెందిన ప్రచేతసుని కుమారుడనియు తెలుపుచున్నది. "చక్రే ప్రచేతసః పుత్రః" అను వచనము ఈ విషయమును బలపరచుచున్నది. దీని వలన వాల్మీకి భృగువంశమునకు చెందిన ప్రచేతసుని కుమారుడనియు, ఇతని అసలు పేరు ఋక్షుడనియు, శిలవలె కదలక మెదలక తపస్సు చేయుచుండగా అతని చుట్టు వల్మీకము (పుట్ట) మొలవగా దాని మధ్య కూర్చుండి తపస్సు చేయుటచే 'వాల్మీకి' అను పౌరుషనామముతో ప్రసిద్ధుడయ్యెననియు తెలియుచున్నది. 'ఋక్షుడు' మొదలగు పేర్లున్నను 'వాల్మీకి' అను పౌరుషనామధేయముతో నిర్దేశించుటచే ఈతనికి శమాదులును, మహాతపస్సును ఉన్నవని సూచింపబడుచున్నది. "తపస్వీ వాల్మీకిః" అను పదములచే ఈతనియందు వేదాంత శాస్త్రమునకు అధికారియగు వాని కుండవలసిన లక్షణము లున్నట్లు కూడ సూచింపబడినది.

"తపఃస్వాధ్యాయనిరతం వాగ్విదాం వరం, మునిపుఙ్గవం నారదం" అనునవి నారదునిలో గురువున కుండవలసిన లక్షణము లున్నట్లు సూచించుచున్నవి. "సాధనచతుష్టయ సంపన్నుడు బ్రహ్మస్వరూపమును తెలిసికొనుటకు, సమిధలను చేత గ్రహించి, శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడును అయిన గురువువద్దకు వెళ్ళవలెను" అని శ్రుతి చెప్పుచున్నది. గురువు అనగా శ్రోత్రియత్వము, బ్రహ్మనిష్ఠ

వి. 'ను' అను అవ్యయమును ప్రశ్నించుటయందును, 'ఇట్లా' 'అట్లా' అను వికల్పార్థమునందును ప్రయోగింతురు. "నుః పృచ్ఛాయాం వికల్పే చ" అని అమరము.

'చ' అను అవ్యయము (సముచ్చితార్థమును) చెప్పబడిన మరియొక అంశ మును కూడ చేర్చుట అను అర్థమును బోధించును. అనగా దీనికి 'మరియు' అని అర్థము. "గుణవంతుడును, వీర్యవంతుడును ఎవ్వడు" అని సముచ్చితార్థ మును బోధించును. ధర్మజ్ఞశ్చ—ధర్మ మనగా అలౌకికమగు, అనగా ఈలోక మునకు సంబంధించని, లేదా లౌకికప్రమాణములచే తెలియని, శ్రేయస్సాధనము. ఇక్కడ ఉన్న 'చ' కారముచే అనుక్తమగు అధర్మమును కూడ గ్రహింప వలెను. అనగా ధర్మమును అధర్మమును కూడ తెలిసికొనినవాడు అని అర్థము. 'కః' అనుదానిని ఒక్కమారు ప్రయోగించిననే చాలినను ఆదరాతిశయమును సూచించుటకై ఇది అనేక పర్యాయములు ప్రయోగింపబడినది. ఇది లేనిచోట్ల దీనిని అధ్యాహారము చేయవలెను. అనగా తెచ్చిపెట్టుకొని అర్థము చెప్పవలెను. సత్యవాక్యు డనగా అతి కష్టసమయములలో కూడ సత్యమునే పలుకువాడని అర్థము.

వైకుంఠాది లోకాంతరములలో ఇట్టి గుణములుగల నారాయణాదు లుండుట ప్రసిద్ధమే కావున ఆ లోకములను గూర్చి ప్రశ్నింపవలసిన పనిలేదు. అందుచే ఈ భూలోకమందు అని చెప్పబడినది. ఈ భూలోకములో కూడ కాలాం తరములందు నరసింహాద్యవతారము లున్నట్లు ప్రసిద్ధము గాన వాటిని కూర్చి ప్రశ్నింప పనిలేదు. అందుచే 'ఇప్పుడు' అని చెప్పబడినది. చకారములు ప్రయోగించుటవలన గుణవత్త్వము మొదలగు విశేషణములన్నియు కలిసి ఒకని యందే ఉండవలెనన్నట్లు సూచింపబడుచున్నది. అట్టి అనేక గుణ (విశేషణ) సముచ్చయమును బోధించుటకు ఒక్క చకారమే చాలును. అయినను అనేక చకారముల ప్రయోగము ఆదరాతిశయమును సూచించుచున్నది.

'గుణవాన్' ఇత్యాదిలక్షణములు వేదోక్తమహాపురుషలక్షణములను చెప్పు చున్నవి.

మూ. చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః,
విద్వాన్ కః కః సమర్థశ్చ కశ్చైకప్రియదర్శనః. 4

ప్ర. అ. కః=ఎవడు, చారిత్రేణ = మంచినడవడికతో, యుక్తః=కూడిన వాడు? కః=ఎవడు, సర్వభూతేషు=సమస్తప్రాణుల విషయమున, హితః=హిత మును చేయువాడు ? కః=ఎవడు, విద్వాన్=తెలిసికొనదగిన వాటినన్నింటిని తెలిసికొనినవాడు? కః=ఎవడు, సమర్థశ్చ=ఇతరులకు నిర్వహింపరాని కార్యము లనుకూడ నిర్వహించుటకు సమర్థుడు? కః=ఎవ్వడు, ఏకప్రియదర్శనః=ఒకే విధమున సంతోషజనకుడుగా కనబడువాడు ?

తా. మంచి నడవడి కలవాడును, సర్వప్రాణులకు హితము నాచరించు వాడును, విద్వాంసుడును, అసాధ్యములైన కార్యములను కూడ సాధించు సామర్థ్యము కలవాడును, చూచువారికి ఎల్లప్పుడును ఒకే విధముగ ఆనందము కలుగు విధమున కనబడువాడును అగు మహాపురుషుడు ఎవడు ?

వి. చరిత్రము అనగా కులక్రమాగత మగు ఆచారము. చరిత్రమే చారిత్రము. స్వార్థమున అణ్ ప్రత్యయము.

సర్వభూతేషు అనగా సాపరాధుల విషయమున గాని నిరపరాధుల విషయమున గాని, అందరి విషయమునను అని అర్థము. హితశబ్దమునకు "తత్కరోతి" అని ణిచ్ ప్రత్యయము; పచాద్యచ్, ణిలోపము చేయగా "హితః" అను పదము నిష్పన్నమై 'హితమును చేయువాడు' అను అర్థము వచ్చినది.

"ఏకప్రియదర్శనః" :– "క్షణే క్షణే యన్నవతా ముపైతి తదేవ రూపం రమణీయతాయాః" (క్షణ క్షణమునకును క్రొత్తగా కనబడుచుండుటయే సౌందర్య లక్షణము) అని చెప్పినట్లు ఎల్లప్పుడు చూచుచున్నను, ఎప్పటికప్పుడు అదే మొదటిసారి చూచినట్లు విస్మయమును కలుగచేయువాడు అని అర్థము. లేదా 'ఏక' శబ్దమునకు 'సాటిలేని' అని అర్థము. సాటిలేని సంతోషజనక మగు దర్శనము కలవాడు అని అర్థము. 3

మూ. ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః,
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే. 4

ప్ర. అ. ఆత్మవాన్=ధైర్యము కలవాడు, కః=ఎవడు? జితక్రోధః= జయింపబడిన కోపము కలవాడును, ద్యుతిమాన్=ప్రశస్తమైన కాంతి కల వాడును, అనసూయకః=అసూయలేనివాడును, కః=ఎవడు ? జాతరోషస్య=

పుట్టిన కోపము గల (కోపమువచ్చిన), కస్య=ఎవనికి, సంయుగే=యుద్ధము నందు, దేవాశ్చ=దేవతలు కూడ, బిభ్యతి=భయపడుదురు ?

తా. ధైర్యము కలవాడును, కోపమును జయించినవాడును, ప్రశస్తమైన కాంతి కలవాడును, అసూయ లేనివాడును ఎవడు ? యుద్ధములో కోపమువచ్చిన ఎవనిని చూచి దేవతలు కూడ భయపడుదురు ?

వి. 'ఆత్మ' శబ్దమున కిచట ధైర్యమని అర్థము. "ఆత్మా జీవే ధృతౌ దేహే స్వభావే పరమాత్మని" అని అమరము.

'జితక్రోధః' అను చోట 'క్రోధ' శబ్దము కామాదులకు ఉపలక్షణము. అందుచేత కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యము లను అరిషడ్వర్గమును జయించిన వాడని అర్థము.

'అసూయ' అనగా గుణములను దోషములుగ చిత్రించు ప్రవృత్తి. "అసూయా తు దోషారోపో గుణేష్వపి" అని అమరము. అసూయ లేనివాడు అనసూయుడు.

'దేవాశ్చ' అనునపుడు చకారము అసురాదులను కూడ చేర్చుటకు ప్రయోగింపబడినది. అందుచే "దేవాసురాదులు" అని అర్థము. లేదా 'చ' అనుదానికి 'కూడ' అని అర్థము. అనగా "దేవాశ్చ" అనుదానికి 'మిత్రులైన దేవతలు కూడ అని యర్థము. మిత్రులకే భయము కలుగు ననగా శత్రువుల మాట చెప్పవలెనా అని తాత్పర్యము. 4

మూ. ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే,
మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతు మేవంవిధం నరమ్. 5

ప్ర. అ. ఏతత్=దీనిని, అహమ్=నేను, శ్రోతుమ్=వినుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను, మే=నా యొక్క, కౌతూహలమ్=వేడుక, పరం హి=అధికము కదా. మహర్షే = ఓ మహర్షీ! త్వమ్=నీవు, ఏవంవిధమ్=ఇట్టి గుణములుగల, నరమ్=మనుష్యుని, జ్ఞాతుమ్=తెలిసికొనుటకు, సమర్థః=సమర్థుడవై, అసి=ఉన్నావు.

తా. నే నీ విషయమును విన గోరుచున్నాను. నాకు ఎక్కువ కుతూహల

ముగా ఉన్నది. ఓ మహర్షీ! ఇట్టి గుణములుగల మనుష్యుని గూర్చి నీకు తెలియుటకు అవకాశ మున్నది.

వి. "ఋషతీతి ఋషిః" — "ఋష గతౌ" అను ధాతువునుండి నిష్పన్నమైనది. జ్ఞానము యొక్క పారమును చెందినవాడు ఋషి.

"శ్రోతుమ్" అనుటచే — ఇట్టి గుణములు కలవానిని గూర్చి తెలిసికొనగోరి, తాము చెప్పగా వినవలెనని అడుగుచున్నాను కాని ఇట్టి పురుషు డుండుట అసంభావ్య మని ఆక్షేపించుటకు కాదు అను భావము సూచింపబడుచున్నది. 'ఇచ్ఛామి' అనుటచే — తా మనుగ్రహించి చెప్పినచో వినగోరుచున్నానే కాని తప్పక చెప్పవలెనని తమను నిర్బంధింపజాలను అని ద్యోతిత మగుచున్నది.

దీనియందు నాకు చాల కుతూహల మున్నదను విషయమును నా యింగితాకారములచే తా మీసరికి గ్రహించియే యుందురు అని సూచించుటకై 'హి' అను పదము ప్రయోగింపబడినది. మీరు జ్ఞానవంతులలో ఉత్తములు గావునను, ఇట్టి లోకోత్తరు డగు వ్యక్తిని గూర్చి తెలిసియుండుటకు మీకన్న సమర్థులు మరెవ్వరును ఉండరు కావునను, ఇంతవరకును మీ రాకకై నిరీక్షించి ఉంటిని అని ఉత్తరార్ధముచే సూచిత మగుచున్నది.

ఇచట వాల్మీకి ప్రశ్నించినది జనసామాన్యమునకు తెలిసిన రాముని గూర్చి కా దనియు, వేదాంతములును, నానావిధవిద్యలును ప్రతిపాదించిన సకల కల్యాణగుణములతో కూడియున్న పరతత్త్వమును గూర్చి ప్రశ్నించె ననియు, తెలియవలెను. నారదమహాముని కూడ ఈ ప్రశ్నముల అభిప్రాయము తెలిసికొని, అట్టి మంగళకరగుణములతో కూడిన పరతత్త్వమే రాము డని నిర్ణయించి, ఉత్తరము చెప్పెను. (గోవిందరాజు) 5

మూ. శ్రుత్వా చైత త్త్రిలోకజ్ఞో వాల్మీకే ర్నారదో వచః,
శ్రూయతామితి చామన్త్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్. 6

ప్ర. అ. త్రిలోకజ్ఞః=మూడు లోకములను ఎఱిగిన, నారదః=నారదుడు, వాల్మీకేః=వాల్మీకియొక్క, ఏతత్=ఈ, వచః=వాక్కును, శ్రుత్వా చ=విని(యు) "శ్రూయతామ్=వినబడుగాక", ఇతి=అని, ఆమన్త్ర్య చ=పిలిచి(యు), అనగా వాల్మీకిని అభిముఖునిగా చేసికొని, ప్రహృష్టః=సంతసించినవాడై, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. మూడు లోకముల వృత్తాంతము తెలిసిన నారదుడు వాల్మీకి మాటలను విని, సంతసించినవాడై "చెప్పెదను వినుము" అని పలికి, ఇట్లు చెప్పెను.

వి. త్రిలోకజ్ఞః — మూడు లోకములను ఎరిగినవాడు. లేదా త్రిలోక మనగా భూః, భువః, సువః, అనెడు మూడులోకములు గల బ్రహ్మాండము. దానిని ఎరిగినవాడు. లేదా 'త్రిలోక' శబ్దమునకు బద్ధులు, ముక్తులు, నిత్యులు అను మూడు విధములగు జను లని అర్థము. "లోకస్తు భువనే జనే" అని అమరము.

ప్రహృష్టః — ఈ వాల్మీకి సమస్తగుణసంపన్ను డైన మనుష్యుని తెలిసికొనగోరెను. ఈ గుణములు సామాన్యసార్వభౌమునిలో లభింపవు. జగద్రక్షణార్థము మనుష్యరూపమున అవతరించిన సాక్షాన్నారాయణు డొక్కడే ఇట్టి గుణములు కలవాడు. కావున నా కిపుడు భగవద్గుణములను కీర్తించుటకు అవకాశము లభించినది అని సంతసించినవాడై. 6

మూ. బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః,
మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః. 7

ప్ర. అ. మునే=ఓ వాల్మీకిమునీ ! బహవః=అనేకములును, లేదా అనంతములును, దుర్లభాః చ ఏవ=సాధారణుల కెంతమాత్రమును పొంద శక్యము కానివియు అగు, యే గుణాః = ఏ గుణములు, త్వయా=నీచేత, కీర్తితాః = వర్ణింపబడినవో, తైః=ఆ గుణములతో, యుక్తః=కూడిన, నరః=మనుష్యుడు, శ్రూయతామ్=వినబడుగాక, అహమ్=నేను, బుద్ధ్వా=తెలిసికొని, వక్ష్యామి=చెప్పెదను.

తా. ఓ వాల్మీకిమునీ ! నీవు అడిగిన గుణములు అనంతములు. సాధారణ మానవులలో దొరకవు. అట్టి గుణములతో కూడిన మహాపురుషుని నిశ్చయించి చెప్పెదను. సావధానముగా వినుము.

వి. నారదముని బ్రహ్మదేవునివలన రాముని చరిత్రమును సాంతముగా విని వచ్చినాడు. అట్టి గుణములను వినవలెనను కుతూహలముతో వాల్మీకి ప్రశ్నింపగా తాను ఉపదేశించుటకై వచ్చిన విషయమును గూర్చియే ఈతడు ప్రశ్నించినాడు కదా అను ఆనందముతో — "నేను తెలిసికొని ఉన్నాను గాన చెప్పెదను వినుము" అని పలికి చెప్ప మొదలిడెను అని వ్యాఖ్యానసారాంశము. 7

మూ. ఇక్ష్వాకువంశప్రభవో రామో నామ జనైః శ్రుతః,
నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ. 8

ప్ర. అ. ఇక్ష్వాకువంశప్రభవః = ఇక్ష్వాకుమహారాజుయొక్క వంశమే ఉత్పత్తి స్థానముగా గల (ఇక్ష్వాకువంశమునందు పుట్టిన), రామః నామ=రాము డనెడు మహాపురుషుడు, జనైః=జనులచేత, శ్రుతః=వినబడినవాడు, (అతడు) నియతాత్మా=నిశ్చిత మగు స్వభావము కలవాడు అనగా నిర్వికారస్వరూపుడు, మహావీర్యః=అచింత్యమైన శక్తి కలవాడు, ద్యుతిమాన్=ప్రశస్తమైన కాంతి కలవాడు, అనగా స్వయంప్రకాశస్వరూపుడు (పరాపేక్ష లేకుండ ప్రకాశించు చిత్స్వరూపుడు). ధృతిమాన్=ప్రశస్తమైన ధైర్యము కలవాడు, లేదా ప్రశస్తమైన ఆనందము కలవాడు. అనగా నిరతిశయానందస్వరూపుడు, వశీ=ఇంద్రియ నిగ్రహము కలవాడు, లేదా సమస్త ప్రపంచమును తన వశములో నుంచుకొనిన సర్వేశ్వరుడు.

తా. ఇక్ష్వాకువంశమునందు పుట్టిన రామునిగూర్చి జను లెల్లరును విని యున్నారు. ఇతడు నిశ్చితమైన స్వభావము కలవాడు. గొప్ప పరాక్రమము కలవాడు. మంచి కాంతి కలవాడు. ధైర్యము కలవాడు. ఇంద్రియనిగ్రహ వంతుడు. లేదా ఇక్ష్వాకువంశమునందు పుట్టిన రాముడు సాక్షాన్నారాయణ స్వరూపు డని లోకులచేత నిశ్చయింపబడినవాడు. నిర్వికారుడు, అచింత్య మైన శక్తి కలవాడు, స్వయంప్రకాశస్వరూపుడు, నిరతిశయానందస్వరూపుడు, సమస్త ప్రపంచమును తన వశములో నుంచుకొనిన సర్వేశ్వరుడు.

వి. "రమయతీతి రామః" అను వ్యుత్పత్తిచే 'రామః' అనగా రమింపచేయు వాడని (ఆనందింపచేయువాడని) అర్థము. "రామో రమయతాం వరః" (రమింప చేయువారిలో రాముడు శ్రేష్ఠుడు) అని చెప్పబడినది. లేదా "రమన్తే యోగినోఽనన్తే సత్యానన్దే చిదాత్మని, ఇతి రామపదేనాసౌ పరం బ్రహ్మాభిధీయతే" (అనంత సచ్చిదానందాత్మకు డైన ఇతనియందు యోగులు రమింతురు. ఇట్లు 'రామ' శబ్ద ముచే పరబ్రహ్మము చెప్పబడుచున్నది) అను అగస్త్యసంహితావచనానుసారము. "రమన్తే అస్మిన్ ఇతి రామః"—అనగా "వీనియందు యోగులు రమింతురు" అని రామశబ్దార్థము.

అనేక ప్రఖ్యాతవంశము లుండగా రాముడు ఇక్ష్వాకువంశమునందే అవత

రించుటకు కారణ మేమనగా — పూర్వము ఇక్ష్వాకు వను మహారాజు చిరకాలము శ్రీమన్నారాయణమూర్తిని ఆరాధించి తత్ఫలముగా రంగనాథుని పొందెను. ఆ రంగనాథుని ఆరాధించు అధికారము ఆ వంశమునందు పుట్టినవారికి సదాచారమై ఉండెను. ఆ పక్షపాతముచే శ్రీమహావిష్ణువు ఇక్ష్వాకువంశమునందే అవతరించెను (గోవిందరాజు). "ధ్యాయేత్సదా సవితృమణ్డల మధ్యవర్తీ నారాయణః సరసిజాసన సన్నివిష్టః" అను ప్రాచీనోక్తిని అనుసరించి సూర్యమండలాంతర్గత మగు తేజస్సే తన స్వరూపము గాన, శ్రీమహావిష్ణువు, సూర్యునిపై అభిమానముచే ఆతని వంశ మునందే జనించె నని ఉపాసకుల భావము. ఇది సాంప్రదాయికార్థము. 8

మూ. బుద్ధిమా న్నీతిమా న్వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః
విపులాంసో మహాబాహుః కమ్బుగ్రీవో మహాహనుః. 9

ప్ర. అ. (ఆ రాముడు) బుద్ధిమాన్=ప్రశస్తమైన బుద్ధికలవాడు, సర్వజ్ఞుడు, నీతిమాన్=ప్రశస్త మైన నీతి కలవాడు, లేదా, సృష్టిస్థితిలయరూప మర్యాదలు కలవాడు, వాగ్మీ=సమస్తవిద్యలు తెలిసినవాడు, శ్రీమాన్=అఖండైశ్వర్యము కల వాడు, శత్రునిబర్హణః=శత్రువులను నశింపచేయువాడు, విపులాంసః=ఎత్తైన మూపు కలవాడు, మహాబాహుః=బలిసిన బాహువులు కలవాడు, కమ్బుగ్రీవః= శంఖమువంటి కంఠము కలవాడు, మహాహనుః=ఎత్తైన చెక్కిళ్ల మీదిభాగము కలవాడు.

తా. ఆ రాముడు బుద్ధి, నీతి, సర్వశాస్త్ర పాండిత్యము, ఐశ్వర్యము కల వాడు. శత్రువులను నశింపచేయువాడు. ఆతని మూపులు ఉన్నత మైనవి; బాహు వులు బలిసినవి, కంఠము శంఖము వలె ఉండును. చెక్కిళ్ల పై భాగము ఉన్నత ముగ ఉండును.

వి. "విపులాంసః" — "కక్షః కుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణం స్కన్ధో లలాటికా, సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాస్తు సుఖప్రదాః" (ఏ ప్రాణుల కైనను, చంక, కడుపు, రొమ్ము, ముక్కు, మూపు, నొసలు — ఇవి ఉన్నతము లైనచో సుఖప్రద ములు) అని సాముద్రికశాస్త్రములో చెప్పినట్లు ఉన్నతము లైన మూపులు కలవా డని అర్థము.

"కమ్బుగ్రీవః" — "కమ్బుగ్రీవశ్చ నృపతి ర్లమ్బకర్ణోఽతిభూషణః" (శంఖ మువంటి కంఠము కలవాడు రాజగును. వ్రేలాడు చెవులు కలవానికి ఎక్కువ

భూషణము లుండును) అని సాముద్రికశాస్త్రములో చెప్పినట్లు శంఖమువంటి కంఠము కలవాడు అని అర్థము.

"మహాహనుః" — "మాంసలే తు హనూ యస్య భవత స్త్వీషదున్నతే, స నరో మృష్టమశ్నాతి యావదాయుః సుఖాన్వితః" (ఎవని చెక్కిళ్ల పై భాగములు బలిసి యుండుటచే కొంచెము ఎత్తుగా ఉండునో ఆతడు జీవితకాలమంతయు సుఖ మనుభవించుచు, మృష్టాన్నమును భుజించుచుండును") అని చెప్పినట్లు ఉన్నతము లైన హనువులు కలవా డని అర్థము. 9

మూ. మహోరస్కో మహేష్వాసో గూఢజత్రు రరిందమః,
ఆజానుబాహుః సుశిరాః సులలాటః సువిక్రమః. 10

ప్ర. అ. (ఆ రాముడు) మహోరస్కః=విశాల మైన వక్షఃస్థలము కలవాడు, మహేష్వాసః=గొప్ప ధనుస్సుకలవాడు, గూఢజత్రుః=పైకి కనబడని మూపుల సంధియెముకలు కలవాడు, అరిందమః=కామక్రోధాది శత్రువులను లేదా పాపములను పోగొట్టువాడు, ఆజానుబాహుః=మోకాళ్ల వరకును పొడవైన బాహువులు కలవాడు, సుశిరాః=సులక్షణములతో కూడిన శిరస్సు కలవాడు, సులలాటః=శుభలక్షణములు గల నుదురు కలవాడు, సువిక్రమః = అందమైన పాదవిన్యాసము (నడక) కలవాడు.

తా. ఆ రాముని వక్షఃస్థలము చాల విశాల మైనది. ధనుస్సు చాల గొప్పది. ఆతని మూపుల సంధి ఎముకలు పైకి కనబడవు. ఆతడు కామక్రోధాది శత్రువులను, పాపములను పోగొట్టువాడు. ఆతని బాహువులు మోకాళ్లవరకును వ్రేలాడుచుండును. ఆతని శిరస్సు, లలాటము కూడ మంచిలక్షణములతో ఒప్పుచుండును. నడక ఎంతో అందముగా ఉండును.

వి. "మహోరస్కః-""స్థిరం విశాలం కఠినమున్నతం మాంసలం సమమ్, వక్షో యస్య మహీపాల స్తత్సమో వా భవేన్నరః" (దృఢమై, విశాలమై, కఠినమై, ఉన్నతమై, బలిసి సమముగా ఉండు వక్షఃస్థలము కలవాడు రాజుగాని, రాజసముడు కాని అగును) అని శాస్త్రములో చెప్పిన లక్షణములు గల వక్షఃస్థలము కలవాడు.

"మహేష్వాసః"— ఈ శబ్దముచే "గొప్ప ధనుస్సును ధరింపతగినంత

దృఢ మైన శరీరము కలవాడు" అను అర్థము సూచింపబడుచున్నది. అందుచే ప్రక్రమభంగదోషము లేదు. —అనగా శరీరావయవములను వర్ణించు సందర్భమున ధనుస్సును గూర్చి వర్ణించుట ప్రారంభించినదానికి విరుద్ధముగా ఉన్నదిగాన ఇది ప్రక్రమభంగదోషము కదా అను శంకకు అవకాశము లేదు.

"గూఢజత్రుః"—"విషమై ర్జత్రుభి ర్నిస్స్వా అతిసూక్ష్మైశ్చ మానవాః, ఉన్నతై ర్భోగినో నిమ్నై ర్నిస్స్వాః పీనై ర్నరాధిపాః" (మూపుల సంధి ఎముకలకు జత్రువులు అని పేరు. ఇవి ఎచ్చుతగ్గులుగ గాని, అతిసూక్ష్మములుగ గాని ఉన్నచో దరిద్రు లగుదురు. ఉన్నతముగ ఉన్నచో భోగు లగుదురు. లోతుగా ఉన్నచో బీదవా రగుదురు. బలిసి ఉన్నచో రాజు లగుదురు) అని చెప్పినట్లు మాంసాధిక్యముచే బలిసి యుండుటవలన పైకి కనబడని జత్రువులు కలవా డని అర్థము.

"అరిందమః"—కామక్రోధాది శత్రువర్గమును పోగొట్టువా డని అర్థము. కామక్రోధాదులు లేనిచో కర్మము చేయుట జరుగదు. కర్మము లేకపోయినచో శరీరపరిగ్రహము (జన్మ ఎత్తుట) జరుగదు. ఐతే ఇపుడు రాముడు గ్రహించిన మనుష్యశరీరము కర్మమూలకము కాదు; లోకానుగ్రహార్థమే అని ఈ పదము సూచించుచున్నది.

"ఆజానుబాహుః"—"ఆజానులమ్బినౌ బాహూ వృత్తపీనౌ మహేశ్వరః" (గుండ్రముగా బలిసి మోకాళ్లవరకును వ్రేలాడు బాహువులు కలవాడు సార్వభౌము డగును) అను సాముద్రిక వచనానుసారము. సార్వభౌమలక్షణ మగు దీర్ఘబాహువులు కలవా డని అర్థము.

"సుశిరాః"—"సమవృత్తశిరాశ్చైవ ఛత్రాకారశిరా స్తథా, ఏకచ్ఛత్రాం మహీం భుఙ్క్తే దీర్ఘమాయుశ్చ జీవతి" (సమముగా గుండ్రముగా ఉండు శిరస్సు కలవాడును, గొడుగు వంటి శిరస్సు కలవాడును ఏకచ్ఛత్రాధిపత్యము చేయుచు దీర్ఘకాలము జీవించును) అని చెప్పినట్లు శుభలక్షణములు గల శిరస్సు కలవా డని అర్థము.

"సులలాటః"—"అర్ధచన్ద్రనిభం తుఙ్గం లలాటం యస్య స ప్రభుః" (అర్ధచంద్రాకారమై ఉన్నత మైన లలాటము కలవాడు రాజగును) అని చెప్పబడిన లక్షణములు గల లలాటము కలవా డని అర్థము.

"సువిక్రమః" — "సింహర్షభగజవ్యాఘ్రగతయో మనుజా మునే, సర్వత్ర సుఖమేధన్తే సర్వత్ర జయినః సదా" (సింహము, వృషభము, గజము, పెద్దపులి, వీటి నడకవంటి నడక గలవారు అంతటను జయమును పొందుచు సుఖముగా వృద్ధి పొందుదురు) అని జగద్వల్లభలో చెప్పినట్లు అంద మైన నడక కలవాడని అర్థము. 10

మూ. సమః సమవిభక్తాఙ్గః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్,
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః. 11

ప్ర. అ. (ఆ శ్రీరాముడు), సమః=అతిదీర్ఘము, లేదా అతిహ్రస్వము కానట్టి దేహముకలవాడు, సమవిభక్తాఙ్గః=హెచ్చుతగ్గులు లేకుండ విభజింపబడిన అవయవములు కలవాడు, స్నిగ్ధవర్ణః=ఇంపైన రంగు గలవాడు, ప్రతాపవాన్=ప్రశస్త మైన పరాక్రమము కలవాడు లేదా తేజస్సు కలవాడు, పీనవక్షాః=బలిసిన వక్షః స్థలము కలవాడు, విశాలాక్షః=విశాల మైన నేత్రములు కలవాడు, లక్ష్మీవాన్= ప్రశస్త మైన అవయవకాంతి కలవాడు, శుభలక్షణః=మంగళకరములైన సాముద్రికశాస్త్రోక్త లక్షణములు కలవాడు.

తా. ఆ శ్రీరాముని శరీరము చాల పొట్టిగా కాని, పొడవైనదిగా కాని లేదు. ఆతని అవయవము లన్నియు హెచ్చుతగ్గులు లేక సరిగా విభజింపబడి ఉన్నవి. శరీరపు చాయ చాల చక్కనిది. తేజస్సు చాల ప్రశంసనీయ మైనది. వక్షః స్థలము బలిసి ఉండును. నేత్రములు విశాలములు. అవయవముల శోభ ప్రశస్త మైనది. సాముద్రిక శాస్త్రములో చెప్పిన శుభలక్షణము లన్నియు ఆతని శరీరము నం దున్నవి.

వి. సమః — "షణ్ణవత్యఙ్గులోత్సేధః సార్వభౌమో భవేన్నృపః" (తొంబదియారు అంగుళముల పొడవు గల రాజు సార్వభౌము డగును) అని జగద్వల్లభలో చెప్పి నట్లు హెచ్చుతగ్గులు లేక తొంబదియారు అంగుళముల పొడవు ఉన్నవా డని అరము.

సమవిభక్తాఙ్గః — "భ్రువౌ నాసాపుటే నేత్రే కర్ణావోష్ఠే చ చూచుకే, కూర్పరౌ మణిబన్ధౌ చ జానునీ వృషణౌ కటీ, కరౌ పాదౌ స్ఫిజౌ యస్య సమౌ జ్ఞేయః స భూపతిః" (కనుబొమలు, నాసికారంధ్రములు, కన్నులు, చెవులు, పెదవులు, చనుమొనలు, మోచేతులు, మనికట్లు, మోకాళ్లు, వృషణములు, కటిప్రదేశములు,

హస్తములు, పాదములు, పిరుదులు — ఇవి హెచ్చుతగ్గులు లేక సమములుగా ఉన్నవాడు రాజు అగును) అని సాముద్రికశాస్త్రములో చెప్పిన ప్రకారము రాముని కనుబొమలు మొదలైన అవయవములు ఉన్న వని అర్థము.

స్నిగ్ధవర్ణః — "చక్షుఃస్నేహేన సౌభాగ్యం దన్తస్నేహేన భోజనమ్, త్వచి స్నేహేన శయ్యా చ పాదస్నేహేన వాహనమ్" (స్నేహ మనగా మెరుగు. నేత్రములలో మెరు గున్నచో సౌభాగ్యము, దంతములపై మెరు గున్నచో మంచి భోజనము, శరీరమునందు మెరు గున్నచో సుఖశయ్యయు, పాదములందు మెరు గున్నచో వాహనసౌఖ్యము కలుగును) అని చెప్పి నట్లు రాముని నేత్రాదులలో మెరుగు ఉన్న దని భావము. 11

మూ. ధర్మజ్ఞః సత్యసన్ధశ్చ ప్రజానాం చ హితే రతః,
యశస్వీ జ్ఞానసంపన్నః శుచిర్వశ్యః సమాధిమాన్. 12

ప్ర. అ. ధర్మజ్ఞః=శరణాగతరక్షణాది ధర్మములను ఎరిగినవాడు, సత్యసన్ధః=సత్య మైన ప్రతిజ్ఞ కలవాడు, ప్రజానామ్=ప్రజలకు, హితే=హితము చేయుటయందు, రతః=ఆసక్తి కలవాడు, యశస్వీ=గొప్ప కీర్తి కలవాడు, జ్ఞానసంపన్నః=అన్ని విషయములకు సంబంధించిన జ్ఞానముతో సంపన్నుడు, శుచిః=పరిశుద్ధ మైనవాడు, వశ్యః=గురుజనులకు లొంగి ఉండువాడు, లేదా ఆశ్రితులకు అందుబాటులో ఉండువాడు, సమాధిమాన్=ఆశ్రితులను ఎట్లు రక్షించ వలెనో ఆలోచించువాడు.

తా. శ్రీరాముడు శరణాగతరక్షణాది ధర్మములు బాగుగా తెలిసినవాడు, చేసిన ప్రతిజ్ఞను నిలుపుకొనును. ప్రజల హితమునకై ఎక్కువ ఆసక్తి చూపును. అన్ని విషయములును తెలిసినవాడు, పరిశుద్ధ మైన వాడు, అనగా నిజాయితీ కలవాడు, గురుజనులకు లొంగి ఉండువాడు, ఆశ్రితులకు అందుబాటులో ఉండు వాడు, ఆశ్రితులను రక్షించుటకై దీక్ష వహించిన వాడు.

వి. "సత్యసన్ధశ్చ" ఇత్యాది స్థలములలో ప్రయోగించిన 'చ' అను దానికి విశేషార్థ మేమియు లేదు. కేవలము పాదపూరణమునకై ప్రయోగింపబడినది. "తు హి చ స్మ హ వై పాదపూరణే" అని అమరము. 12

మూ. ప్రజాపతిసమః శ్రీమాన్ ధాతా రిపునిషూదనః,
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా. 13

ప్ర. అ. (ఆ రాముడు) ప్రజాపతిసమః = బ్రహ్మతో సమాన మైనవాడు, శ్రీమాన్=సమస్తలోకమును అతిశయించినవాడు, ధాతా=సమస్త ప్రపంచమును పోషించువాడు, రిపునిషూదనః=శత్రువులను జయించువాడు, జీవలోకస్య=ప్రాణి సముదాయమునకు(ను), రక్షితా=పాలించువాడు, ధర్మస్య=ధర్మమునకు(ను), పరిరక్షితా=బాగుగ రక్షించువాడు.

తా. శ్రీరాముడు బ్రహ్మతో సమానుడు. అందరిని మించినవాడు. సర్వ లోకములను పోషించువాడు. శత్రువులను నశింపచేయువాడు. సమస్తప్రపంచమును రక్షించువాడు. ధర్మమును బాగుగా రక్షించువాడు.

వి. జీవలోకస్య రక్షితా — కేవలము సార్వభౌము డైనవాడు తనవారిని లేదా మనుష్యులను మాత్రమే రక్షించకలిగి ఉండును. శ్రీరాము డట్లు కాదు. పిపీ లికాది బ్రహ్మపర్యంతము సకలప్రాణులను రక్షింపగలిగినవాడు. ఐతే పాపాత్ము లను కూడ రక్షించునా ? అను ప్రశ్న ఉదయించును. దీనికి సమాధానము "ధర్మస్య పరిరక్షితా" అను మాటలో ఉన్నది. ధర్మమును రక్షించుటవలన పాపు లను కూడ రక్షించువాడే అని సూచిత మగుచున్నది. అది ఎట్లనగా — చికిత్స కుడు శస్త్రచికిత్సాదులు చేయునపుడు తాత్కాలికముగ రోగికి చాల బాధకలిగించు వాడే అయినను, రోగమును పోగొట్టి చివరకు మహోపకారము చేసినవాడే అగు చున్నాడు. అట్లే పాపులను శిక్షించు సమయమున వారిపట్ల, ఆ సమయమున, క్రూరుడుగా కనబడినను, అధర్మమార్గములో పడి పాపములు చేయుచున్న ఆ పాపాత్ములను శిక్షించి ఉద్ధరించుటచే, వాస్తవమున, వారికే విశేషరక్షకు డగు చున్నా డని భావము.

"రక్షితా జీవలోకస్య" అని ప్రారంభించి చెప్పిన ఈ విశేషణములు భగ వంతుని అవతారలక్షణములను వర్ణించుచున్నవి (గోవిందరాజులు). ఇవన్నియు పరమేశ్వరున కుండదగిన లక్షణములే కాని ఇతరుల కెవ్వరికిని ఉండదగినవి కావు (మహేశ్వరతీర్థులు) 13

మూ. రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా,
వేదవేదాఙ్గతత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః. 14

ప్ర. అ. (ఆ రాముడు) స్వస్య = తనయొక్క, ధర్మస్య = శరణాగత రక్షణరూపధర్మమునకు లేదా క్షత్రియధర్మమునకు, రక్షితా=రక్షకుడు, స్వజనస్యచ=ఆశ్రయించిన బంధువులు మొదలైన తనవారికిని, రక్షితా=రక్షకుడు, వేదవేదాఙ్గతత్త్వజ్ఞః=వేదముల తత్త్వమును, వేదాంగముల తత్త్వమును తెలిసికొన్నవాడు, ధనుర్వేదే చ=ధనుర్వేదమునందు గూడ, నిష్ఠితః=పరిపూర్ణ మైన ప్రజ్ఞ కలవాడు.

తా. శ్రీరాముడు తన ధర్మమును చక్కగ పాటించుచు తనవారి నందరిని రక్షించుచుండును. వేదవేదాంగముల రహస్యము లన్నియు ఈతనికి తెలియును. ధనుర్వేదమునందు ఈతనికున్న జ్ఞానము అసాధారణ మైనది.

వి. ఋక్—యజుస్—సామ—అథర్వము లని వేదములు నాలుగు. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అని వేదాంగములారు.

"ధనుర్వేదే చ" అనునపుడు 'చ' శబ్దముచే ఆయుర్వేదము, గాంధర్వ వేదము, అర్థశాస్త్రము అను మిగిలిన మూడు ఉపవేదములను కూడ గ్రహించ వలెను.

'రక్షితా స్వస్య ధర్మస్య'-
ధర్మోపదేశసమయే జనాః సర్వేఽపి పణ్డితాః,
తదనుష్ఠానసమయే మునయోఽపి న పణ్డితాః".

(ఇతరులకు ధర్మము ఉపదేశించుటకు అందరును పండితులే. ఆ ధర్మమును ఆచరించు నపుడు మాత్రము మునులు కూడ అపండితుల వలె ప్రవర్తింతురు) అని చెప్పినట్లు చాలమంది ధర్మోపదేశము చేయుచుందురు గాని తాము ఆచరించరు. శ్రీరాముడు మాత్రము అట్లు కాదని అర్థము.

లేదా ధర్మ మనగా ధనుస్సు. "స్వామ్య స్వభావసుకృతేష్వస్త్రీ ధర్మం తు కార్ముకే" అని బాణనిఘంటువు. అందుచే "రక్షితా స్వస్య ధర్మస్య" అనగా తన ధనుస్సును రక్షించుకొనువాడు అని అర్థము. ఇచట ధర్మ శబ్దము ఉపలక్షణచే రథాదులు అను అర్థమును కూడ బోధించును. యుద్ధరంగములో తన ధనుస్సును,

రథములను, సారథిని, గుఱ్ఱములను, ఛత్రమును, కేతనమును రక్షించుకొన గలిగిన అతిరథశ్రేష్ఠు డని అర్థము.

లేదా శివధనుర్భంగము, పరశురామపరాభవము మొదలగు లోకోత్తరములగు కార్యములు చేసి తన శ్రీనారాయణావతారత్వరూప ధర్మమును రక్షించుకొనిన వాడు అని అరము.

స్వజనస్య చ రక్షితా — "రక్షితా జీవలోకస్య" అని పూర్వశ్లోకములో చెప్పిన జీవలోకరక్షణములో స్వజనరక్షణము కూడ అంతర్గత మైనను, మరల "స్వజనస్య చ రక్షితా" అని చెప్పుట రామునకు స్వజనులపై ఉన్న కరుణాతిశయమును సూచించుచున్నది.

బాంధవాదులను తిరస్కరించుట ప్రభువునకు సహజము. రాముడు మాత్రము అట్లు కాదు. "అత్యాసన్నం పరిత్యజ్య మునేర్దత్తం తు నిష్ఫలమ్" (చాల దగ్గరగా ఉన్న ఆశ్రితుని లేదా బంధువును కాదని మునీశ్వరునకు దానము చేసినను అది నిష్ఫలమే) అను శాస్త్రము ననుసరించి ఆశ్రితబాంధవులను విశేషించి రక్షించువాడు అని అర్థము. 14

మూ. సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్,
సర్వలోకప్రియః సాధు రదీనాత్మా విచక్షణః. 15

ప్ర. అ. (ఆ రాముడు), సర్వ శాస్త్రార్థతత్త్వజ్ఞః=సమస్త మైన శాస్త్రముల అర్థము, తత్త్వము తెలిసినవాడు, స్మృతిమాన్=జ్ఞప్తి కలవాడు, అనగా తెలిసిన విషయమును మరువనివాడు, ప్రతిభానవాన్=వ్యవహారమునందు ఉత్తరోత్తర యుక్తుల స్ఫూర్తి కలవాడు, సర్వలోకప్రియః=సమస్తజనులకును ఇష్టుడు. లేదా అందరు జనులును ఇష్టులుగా కలవాడు (అందరియందును ప్రీతి కలవాడు), సాధుః=తన కపకారము చేసినవారికి కూడ ఉపకారము చేయువాడు, అదీనాత్మా=అతిదుఃఖకాలమునందు కూడ కలత చెందని మనస్సు కలవాడు, విచక్షణః=వినువారికి హృదయానందము కలుగు నట్లు అనేకవిధములుగ మాటలాడువాడు. లేదా ఆ యా కాలములందు చేయదగిన పనులు చేయుటయందు చాతుర్యము కలవాడు.

తా. రాముడు వెనుక చెప్పిన వేదవేదాంగములే కాక మిగిలిన ధర్మశాస్త్ర—పురాణ—న్యాయ—మీమాంసా — సాంఖ్య—వైశేషిక—యోగశాస్త్రముల అభి

ప్రాయములను, సిద్ధాంతములను బాగుగా తెలిసికొనినవాడు. తెలిసికొన్న విషయము లను ఎన్నడును మరువడు. లోకవ్యవహారములలో ఈతనికి గల ఉత్తరోత్తర యుక్తుల స్ఫురణము గొప్పది. సమస్తజనులయందును ఈతనికి ప్రేమ అధికము; ఆ జనులకు కూడ రాము డనిన ప్రాణము. ఎట్టి కష్టకాలములం దైనను ఈతని మనస్సు కలత చెందదు. వినువారికి ఆనందము కలుగు నట్లు సంభాషణ చేయుట యందును, సమయోచితము లగు కార్యములను నిర్వహించుటయందును గొప్ప నేర్పు కలవాడు. 15

మూ. సర్వదాభిగతః సద్భిః సముద్ర ఇవ సిన్ధుభిః,
ఆర్యః సర్వసమశ్చైవ సదైకప్రియదర్శనః. 16

ప్ర. అ. (ఆ రాముడు), సముద్రః=సముద్రము, సిన్ధుభిః ఇవ=నదుల చేత వలె, సద్భిః=సత్పురుషులచేత, సర్వదా=ఎల్లప్పుడును, అభిగతః=పొంద బడినవాడు, ఆర్యః=చేరదగినవాడు, లేదా పూజ్యుడు, సర్వసమః=అందరి విష యమునందును సమముగా ప్రవర్తించువాడు, సదైకప్రియదర్శనః = ఎల్లపుడును ఒకే విధముగ ప్రీతికర మగు దర్శనము కలవాడు.

తా. నదులు ఎల్లపుడును, అనగా మూడు కాలములందును, సముద్ర మును చేరుచుండు నట్లు సత్పురుషులు ఎల్లవేళల రామునివద్దకు వచ్చుచుందురు. ఈతడు ప్రతి ఒక్కరును దగ్గరకు చేరవలసిన వ్యక్తి. పూజనీయుడు. అందరి విషయమునను సమముగా ప్రవర్తించువాడు. ఈతని దర్శనము ఎల్లప్పుడును ఒకే విధముగ ఆనందజనకముగా ఉండును.

వి. సర్వసమః — జాతివర్ణాదితారతమ్యము లేక సమస్త భూతముల విషయ మునను సమాన మగు ప్రేమతో వ్యవహరించువాడు. జాతిగుణవృత్త్యాది తార తమ్యములు లేక అందరును ఈతనిని ఆశ్రయింతురు. 'ఏవ' కారము "దీనిలో ఎన్నడును మార్పు లేదు" అని సూచించుచున్నది (గోవిందరాజులు).

'సర్వదా' అనుటవలన — సముద్రుని సేవించుటకు నదులకు కాలనియ మము ఏ విధముగ అక్కఱలేదో అట్లే రాముని సేవించుటయందు భక్తులకు కాలనియమము అక్కఱలే దని సూచింపబడినది.

"అభిగతః" అను శబ్దముచే "సత్పురుషులకు శ్రీరాముడే పరమప్రాప్య స్థానము" అని సూచితమగుచున్నది.

"సముద్రః సిన్ధుభిరివ" అను ఉపమానము, నదులకు సముద్రము తప్ప వేరు గతి లేనట్లు, సత్పురుషులకు రాముడు తప్ప గత్యంతరము లేదని సూచించు చున్నది. 16

మూ. స చ సర్వగుణోపేతః కౌసల్యానన్దవర్ధనః,
సముద్ర ఇవ గామ్భీర్యే ధైర్యేణ హిమవానివ. 17

ప్ర. అ. కౌసల్యానన్దవర్ధనః = కౌసల్యయొక్క ఆనందమును వృద్ధి పొందించు, సః చ=ఆ రాముడే, సర్వగుణోపేతః=అన్ని గుణములతో కూడిన వాడు, గామ్భీర్యే=తన హృదయములో నున్నదానిని బైటికి తెలియకుండ చేయుటయందు, సముద్రః ఇవ=సముద్రమువంటివాడు, ధైర్యేణ=ధైర్యముచేత, హిమవానివ=హిమవత్పర్వతమువంటివాడు.

తా. కౌసల్యకు ఆనందమును వృద్ధిపొందించు ఆ రాముడే సకలగుణములతో కూడినవాడు. అతడు గాంభీర్యమునందు సముద్రము వంటివాడు. ధైర్యమునందు హిమవత్పర్వతము వంటివాడు.

వి. 'స చ' అనునపుడు 'చ' కారమునకు 'ఏవ' అని యర్థము— "అతడే".

కౌసల్యానందవర్ధనః—దశరథుడు కోసలరాజపుత్రి యగు కౌసల్యయందే రాముని పుత్రునిగ పొందకలిగెను. అందుచే "కౌసల్యకు ఆనందమును పెంచువాడు" అని చెప్పబడినది (గోవిందరాజులు).

గాంభీర్య మనగా తన హృదయములో ఉన్నదానిని బైటికి తెలియనీయకుండుట. సముద్రుడు తనలో నున్న రత్నాదులను పైకి తెలియకుండ చేయుచుండునట్లు హృదయములో ఉన్నదానిని పైకి తెలియ నీయనివాడు అని అర్థము.

దుఃఖకారణ మున్నను దుఃఖమును పొంద కుండుట ధైర్యము. ఆ విషయమున రాముడు హిమవత్పర్వతము వంటివాడు. "గిరయో వర్షధారాభిర్హన్యమానా న వివ్యధుః, అభిభూయమానా వ్యసనైర్యథాధోక్షజచేతసః" (ఎన్నియో వ్యసనములు వచ్చినను విష్ణుభక్తులు ఏ విధముగ దుఃఖింపరో, అట్లే పర్వతములు వర్షధారలచే కొట్టబడుచున్నను దుఃఖింపలేదు) అని చెప్పినట్లు, వర్షములు కురియుట, పిడుగులు పడుట, మొదలగు దుఃఖకారణము లున్నను పర్వతములకు

వ్యథ కలుగదు. అట్టి పర్వతము లన్నిటికన్నను, పర్వతరా జగు హిమవంతుడు మిక్కిలి ధైర్యశాలి. రాముడు ధైర్యముచే అట్టి హిమవంతునితో సమాను డని అర్థము. 17

మూ. విష్ణునా సదృశో వీర్యే సోమవత్ప్రియదర్శనః,
కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః. 18
ధనదేన సమస్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః.

ప్ర. అ. (ఆ రాముడు) వీర్యే=పరాక్రమమునందు, విష్ణునా=విష్ణువుతో, సదృశః = సమాన మైనవాడు, సోమవత్ = చంద్రుడు వలె, ప్రియదర్శనః= ఆనందకర మైన దర్శనము కలవాడు, క్రోధే=కోపమునందు, కాలాగ్నిసదృశః= ప్రలయకాలాగ్నితో సమానుడు, క్షమయా = ఓర్పుచే, పృథివీసమః = భూమితో సమానుడు, త్యాగే=దానము చేయుటలో, ధనదేన = కుబేరునితో, సమః = సమానుడు, సత్యే = సత్యమునందు, అపరః = తనకంటె ఉత్కృష్ట మగు మరి ఎవరును లేని, ధర్మః ఇవ=ధర్మదేవత వంటివాడు.

తా. రాముడు పరాక్రమమునందు విష్ణువుతో సమానమైనవాడు. చంద్ర దర్శనము వలె ఈతని దర్శనము ఆనందకరము. కోపము వచ్చినప్పుడు ప్రలయకాలాగ్ని వలె చాల భయంకర మైనవాడు. ఓర్పులో భూమివంటి వాడు. ఇతరులకు దానము చేయుటలో కుబేరునివంటివాడు. సత్యమును సంరక్షించు విషయమున ధర్మదేవత వంటివాడు. ఈ విషయమున ఈతనిని మించినవా రెవరును లేరు.

వి. వీర్యే—తనకు క్షతి లేకుండ చూచుకొనుచు ఇతరులను జయింప గలిగిన సామర్థ్యమునకు వీర్య మని పేరు. రాముడు విష్ణువే అయినను అవతార రూప మగు ఉపాధి (భేదమునకు కారణము) ని పట్టి విష్ణువుకంటె భిన్నుడు గాన విష్ణువుతో పోల్చుట జరిగినది. లేదా "వీర్యము విషయమున విష్ణువైన తనతో సమానుడు" అని అర్థము. అనగా తనకు తానే సాటి కాని వేరెవ్వరును సాటి కారని భావము. విష్ణువునందలి సగము భాగము మాత్రమే రామునియం దుండుటచే విష్ణుసాదృశ్యము చెప్పబడినది (గోవిందరాజులు). మరి యొక ఉపమాన మేదియు లేనప్పుడు విష్ణువుతో సమాను డని చెప్పుటకన్న గత్యంతరము లేదు (మహేశ్వరతీర్థులు).

క్షమయా పృథివీసమః—తనను జనులు తొక్కినను, తవ్వినను, మరి ఏమి చేసినను భూమి ఓర్పుతో సహించును. అట్లే తన కెంత అపకారము చేసినను అచేతన పదార్థము వలె మిన్నక ఉండువాడు అని అర్థము.

ధనదేన సమస్త్యాగే—ఇచట "ధనద" (ధనము నిచ్చువాడు) అను శబ్దము ను ప్రయోగించుటచే కుబేరుని త్యాగవిశేషము సూచింపబడుచున్నది. "అట్టి కుబేరునితో సమానుడు".

సత్యే ధర్మ ఇవాపరః—అపరః=తనకంటె ఇతరమైన ఉత్కృష్టవస్తువు లేని, ధర్మదేవత వంటివాడు (గోవిందరాజులు). అపరః = రెండవ, ధర్మ దేవతయా, అన్నట్లు ఉన్నాడు (మహేశ్వరతీర్థులు). 18

అవ. నారదుడు, మొదట "ఇక్ష్వాకువంశప్రభవః" అను పదముచేత రామావతారమును చెప్పెను. "మహావీర్యః" "శత్రునిబర్హణః" అను పదములచేత తాటకామారీచవధ పరశురామపరాభవములను సూచించెను. "లక్ష్మీవాన్" "శ్రీమాన్" అను పదములచేత సీతాపరిణయమును తెలియజేసెను. "ధనుర్వేదే చ నిష్ఠితః" అను వాక్యముచేత కౌశికునివలన రామునికి కలిగిన సమస్తాస్త్రప్రాప్తిని తెలిపెను. ఇట్లు బాలకాండకథను చెప్పి ఇపుడు అయోధ్యాకాండకథను చెప్పుచున్నాడు (మహేశ్వరతీర్థ గోవిందరాజులు).

మూ. తమేవంగుణసమ్పన్నం రామం సత్యపరాక్రమమ్, 19
జ్యేష్ఠం శ్రేష్ఠగుణైర్యుక్తం ప్రియం దశరథస్సుతమ్.
ప్రకృతీనాం హితైర్యుక్తం ప్రకృతిప్రియకామ్యయా, 20
యౌవరాజ్యేన సంయోక్తుమైచ్ఛత్ప్రీత్యా మహీపతిః.

ప్ర. అ. మహీపతిః=భూమికి ప్రభువైన, దశరథః = దశరథుడు, ఏవం గుణసమ్పన్నమ్=ఇట్టి గుణములతో కూడినవాడును, సత్యపరాక్రమమ్=వ్యర్థము కాని పరాక్రమము కలవాడును, శ్రేష్ఠగుణైః = ఉత్తమములైన గుణములతో, యుక్తమ్=కూడినవాడును, ప్రియమ్=తనకు ప్రీతిపాత్రుడును, ప్రకృతీనామ్= ప్రజలకు, హితైః = సౌఖ్యమును కలిగించు కార్యములతో, యుక్తమ్ = కూడిన వాడును, జ్యేష్ఠం సుతమ్=జ్యేష్ఠకుమారుడును అగు, తమ్=ఆ, రామమ్=రాముని, ప్రకృతిప్రియకామ్యయా=ప్రజలకు ప్రియము చేయవలె ననెడు కోరికచేతను,

ప్రీత్యా=ప్రేమచేతను, యౌవరాజ్యేన=యౌవరాజ్యముతో, సంయోక్తుమ్=కూర్చుటకు, ఐచ్ఛత్=ఇచ్ఛయించెను.

తా. దశరథమహారాజు ప్రజలకు హితము చేయవలె నను కోరికతో, సమస్తసద్గుణసంపన్నుడును, అమోఘము లగు బలపరాక్రమములు కలవాడును, ఎల్లప్పుడును ప్రజల హితమునే కోరుచుండువాడును, తనకు ప్రీతిపాత్రుడును అగు జ్యేష్ఠకుమారు డైన రాముని యువరాజుగా చేయగోరెను. 19, 20.

మూ. తస్యాభిషేకసమ్భారాన్ దృష్ట్వా భార్యాథ కైకయీ, 21
పూర్వం దత్తవరా దేవీ వరమేనమయాచత,
వివాసనం చ రామస్య భరతస్యాభిషేచనమ్. 22

ప్ర. అ. అథ=పిమ్మట, తస్య=ఆ రామునియొక్క, అభిషేకసంభారాన్=యౌవరాజ్యాభిషేకముకొరకై తీసికొని వచ్చిన వస్తుసామగ్రిని, దృష్ట్వా=చూచి, పూర్వమ్=పూర్వము, దత్తవరా=ఇవ్వబడిన వరములు కలదియు, భార్యా=భార్యయు, దేవీ=రాణియు అయిన, కైకయీ=కైకయి, రామస్య=రాముని, వివాసనమ్=ప్రవాసమునకు పంపివేయుట, భరతస్య=భరతుని, అభిషేచనమ్=రాజ్యాభిషిక్తుని చేయుట అను, వరమ్ = వరమును, ఏనమ్=ఈ దశరథమహారాజును, అయాచత=యాచించెను.

తా. దశరథుని రాణులలో నొకతె యైన కైకయి రామాభిషేకమునకై సేకరించిన సాధనసామగ్రిని చూచి, దశరథుడు పూర్వము తనకు రెండు వరము లిచ్చి యుండుటచే, వాటిలో ఒక వరముగా రాముని అరణ్యమునకు పంపవలె ననియు, రెండవ వరముగా భరతుని రాజ్యాభిషిక్తుని చేయవలె ననియు, దశరథుని కోరెను. 21, 22.

మూ. స సత్యవచనాచ్చైవ ధర్మపాశేన సంయతః,
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్. 23

ప్ర. అ. సః=ఆ, దశరథః=దశరథుడు, సత్యవచనాత్=సత్యవచనము అనెడు కారణమువలన, ధర్మపాశేన=ధర్మ మనెడు త్రాడుచేత, సంయతః=కట్టబడినవాడై, ప్రియం సుతమ్ = ప్రియసుతు డైన, రామమ్ = రాముని, వివాసయామాస=అరణ్యమునకు పంపెను.

తా. సత్యవాక్యమును పరిపాలించవలె నను కారణముచే, ఆ దశరథుడు, ధర్మపాశముచే బంధింపబడినవాడై, తన ప్రియపుత్రు డైన రాముని వనమునకు పంపెను. 23

మూ. స జగామ వనం వీరః ప్రతిజ్ఞామనుపాలయన్,
పితుర్వచననిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్. 24

ప్ర. అ. వీరః=వీరుడైన, సః = ఆ రాముడు, కైకేయ్యాః = కైకేయికి, ప్రియకారణాత్=ప్రీతికి హేతువైన, పితుః=తండ్రియొక్క, వచననిర్దేశాత్ = మాట అనెడు ఆజ్ఞవలన, ప్రతిజ్ఞామ్=తన ప్రతిజ్ఞను, అనుపాలయన్=పాలించు కొనుచు, వనమ్=అరణ్యమును గూర్చి, జగామ=వెళ్లెను.

తా. అతి పరాక్రమశాలి యైన రాముడు కైకేయికి సంతోషము కలిగించు టకై, తండ్రి మాట మాత్రము చెప్పినంతనే దానిని ఆజ్ఞగా గ్రహించి, తన ప్రతి జ్ఞను నిలుపుకొనుచు అరణ్యమునకు వెళ్లెను.

వి. "ప్రతిజ్ఞామనుపాలయన్"—రాముడు కైకేయితో—"తద్బ్రూహి వచనం దేవి రాజ్ఞో యదభికాంక్షితమ్, కరిష్యే ప్రతిజానే చ రామో ద్విర్నాభిభాషతే" (తల్లీ! రాజుగారికి ఏది ఇష్టమో, ఆ మాటను చెప్పుము. దానిని చేసెదను. ప్రతిజ్ఞ చేయుచున్నాను. రాముడు రెండుమాటలు మాటలాడువాడు కాడు) అని పలికి ప్రతిజ్ఞ చేసెను. ఆ ప్రతిజ్ఞను రక్షించుచు అని అర్థము. 24

మూ. తం వ్రజన్తం ప్రియో భ్రాతా లక్ష్మణోఽనుజగామ హ,
స్నేహాద్వినయసంపన్నః సుమిత్రానన్దవర్ధనః, 25
భ్రాతరం దయితో భ్రాతుః సౌభ్రాత్రమనుదర్శయన్.

ప్ర. అ. వినయసంపన్నః = వినయముతో కూడినవాడును, భ్రాతుః = సోదరుడైన రామునకు, దయితః=ఇష్టుడును, ప్రియః భ్రాతా=సహజప్రీతి గల సోదరుడును అయిన, లక్ష్మణః=లక్ష్మణుడు, సుమిత్రానన్దవర్ధనః = సుమిత్ర యొక్క ఆనందమును వృద్ధిపొందించుచున్నవాడై, సౌభ్రాత్రమ్=సోదరస్నేహ మును, అనుదర్శయన్ = చూపుచు, వ్రజన్తమ్ = అరణ్యమునకు వెళ్లుచున్న, తమ్=ఆ, భ్రాతరమ్ = సోదరు డైన రాముని, స్నేహాత్ = స్నేహమువలన, అనుజగామ హ=అనుసరించి వెళ్లెను.

తా. లక్ష్మణుడు రామునికి చాల ఇష్టుడైన తమ్ముడు. అతనియందు సహజమైన ప్రేమ కలవాడు. వినయసంపన్నుడు. ఆతడు తన భ్రాతృస్నేహమును చూపుచు అరణ్యమునకు పోవుచున్న ఆ రాముని వెంట వెళ్లెను. ఇట్లు ఉత్తమ కార్యము చేయుటచే తల్లి యగు సుమిత్రకు కూడ ఆనందమును వృద్ధి పొందించెను. 25

మూ. రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమా హితా, 26
జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా,
సర్వలక్షణసంపన్నా నారీణాముత్తమా వధూః, 27
సీతా ప్యనుగతా రామం శశినం రోహిణీ యథా.

ప్ర. అ. రామస్య=రామునకు, దయితా=ఇష్టురాలును, భార్యా=భార్యయు, ప్రాణసమా=ప్రాణములతో సమానురాలును, నిత్యమ్=నిత్యమును, హితా = హితమును చేయునదియు, జనకస్య = జనకమహారాజుయొక్క, కులే = కులమునందు, జాతా=పుట్టినదియు, నిర్మితా=సుందోపసుందులను మోహింప చేయుటకై నిర్మింపబడిన, దేవమాయేవ=దేవమాయ వలె, (తిలోత్తమ వలె) లేదా అమృతమథనానంతరము రాక్షసులను మోహింపచేయుటకై సృజింపబడిన విష్ణువు యొక్క మాయామోహినీరూపము వలె ఉన్నదియు, సర్వలక్షణసంపన్నా = సాముద్రికశాస్త్రములో చెప్పిన అన్ని శుభలక్షణములతో కూడినదియు, నారీణామ్=స్త్రీలలో, ఉత్తమా=ఉత్తమురాలును, వధూః=దశరథుని కోడలు అగు, సీతాపి=సీత కూడ, రోహిణీ=రోహిణి, శశినం యథా=చంద్రుని వలె, రామమ్= రాముని, అనుగతా=అనుసరించి వెళ్లినది.

తా. జనకుని వంశమునందు పుట్టి, రాముని భార్యయై దశరథుని కోడలైన సీత రామునకు చాల ఇష్టురాలు. ప్రాణము వంటిది. ఆమె సర్వదా రామునకు హితమునే చేయుచుండును. రాక్షసులను మోహింపచేయుటకై సృజింపబడిన దేవమాయ వలె లోకోత్తర మైన సౌందర్యము కలది. సాముద్రికశాస్త్రములో చెప్పిన మంచి లక్షణము లన్నియు ఆమెయందు ఉన్నవి. స్త్రీలలో ఉత్తమురాలు. అట్టి సీత కూడ, రోహిణి చంద్రుని అనుసరించి నట్లు, ఆ రామచంద్రుని అనుసరించి వెళ్లెను. 26, 27

మూ. పౌరైరనుగతో దూరం పిత్రా దశరథేన చ, 28
శృఙ్గిబేరపురే సూతం గఙ్గాకూలే వ్యసర్జయత్.
గుహమాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్, 29
గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా.

ప్ర. అ. (ఆ రాముడు) పౌరైః = అయోధ్యాపురమునందు నివసించువారి చేతను, పిత్రా=తండ్రియైన, దశరథేన చ=దశరథునిచేతను, దూరమ్=చాల దూరమువరకును, అనుగతః=అనుసరింపబడెను. ధర్మాత్మా=ఆశ్రితరక్షణాది ధర్మముచే స్వరూపముగా గల, రామః=రాముడు, గఙ్గాకూలే = గంగాతీరమునందు ఉన్న, శృఙ్గిబేరపురే=శృంగిబేర మనెడు పట్టణమునందు, నిషాదాధిపతిమ్=బోయవారికి అధిపతియైన, ప్రియమ్=తనయందు ప్రీతి గల, గుహమ్=గుహుని, ఆసాద్య=చేరి, గుహేన=గుహునితోడను, లక్ష్మణేన = లక్ష్మణునితోడను, సీతయా చ=సీతాదేవితోడను, సహితః=కూడినవాడై, సూతమ్=సారథియైన సుమంత్రుని, వ్యసర్జయత్=వెనుకకు పంపివేసెను.

తా. పౌరులును, దశరథుడును చాల దూరమువరకు రాముని వెంబడించిరి. ధర్మాత్ము డైన ఆ రాముడు, గంగాతీరమునందు, శృంగిబేర మనెడు పట్టణములో, బోయల ప్రభు వైన గుహుని కలిసికొనెను. సీతాలక్ష్మణ గుహులతో కూడిన ఆ రాముడు తన సారథి యైన సూతుని వెనుకకు పంపివేసెను.

అర్థాంతరము — "గుహేన స హితో రామః" అనునపుడు "గుహేన, సః, హితః, రామః" అని పదచ్ఛేదము. సః రామః=ఆ రాముడు, గుహేన=గుహునిచేత, హితః=పంపబడెను, అనగా గంగను దాటింపబడెను.

తాత్పర్యము — ధర్మాత్ముడైన రాముడు గంగాతీరమునందు శృంగిబేరపురములో నున్న నిషాదాధిపతి యైన గుహుని చేరి, సారథిని వెనుకకు పంపివేసెను. ఆ గుహుడు సీతాలక్ష్మణసమేతు డగు రాముని గంగానది దాటించెను.

వి. పౌరులు పరమభక్తి కలవా రగుటచే రాముని చాల దూరమువరకు అనుసరించి వెళ్లిరి. మరల ఎక్కడ వియోగము కలుగునో అను భయమునకు పరమభక్తి యని పేరు. "పునర్విశ్లేషభీరుత్వం పరమా భక్తి రుచ్యతే".

"శృఙ్గిబేరమ్" అనగా జింకలు మొదలగు కొమ్ములు గల జంతువుల

శరీరములు, అనగా ఆ ఆకారము గల బొమ్మలు ఉండెడు పట్టణము అని అర్థము. "శృఙ్గిణాం బేరాణి యస్మిన్ తత్ శృఙ్గిబేరమ్" అని విగ్రహవాక్యము. బేరమ్ అనగా శరీరము. ఆ పట్టణమునందు జింకలు మొదలగు మృగముల బొమ్మలు నిర్మించి అచ్చుటచ్చుట ఉండెడివారు. వాటిని చూచి జింకలు మొదలైన మృగములు తమ సజాతీయమృగము లను భ్రాంతిచే వాటి దగ్గరకు రాగా వాటిని పట్టుకొనెడి వారు. దీనిని పట్టి ఆ పట్టణములో నివసించువారి సాధారణవృత్తి జీవహింస యని సూచిత మగుచున్నది. "గూహతీతి గుహః". "గుహూ సంవరణే" అను ధాతువునుండి నిష్పన్న మైనది. "పరద్రవ్యాదులను దాచువాడు" అని అర్థము. పరులను హింసించి, వారి ధనాదులను లాగికొని దాచువాడు గుహుడు. ఈ విధముగ గుహుడు కులవృత్తిచేతను, స్వవృత్తిచేతను కూడ అతినీచు డైనను, తనయందు ప్రేమ కలిగి వర్తించినంతమాత్రముచేతనే రాముడు వానియందు కూడ సీతాలక్ష్మణులపై నున్నంత స్నేహము నుంచెను. దీనిని పట్టి ఆశ్రితు డెట్టివా డైనను అతనిని రాముడు రక్షించు నని సూచిత మగుచున్నది (గోవిందరాజులు). 28, 29

మూ. తే వనేన వనం గత్వా నదీస్తీర్త్వా బహూదకాః, 30
చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్,
రమ్యమావసథం కృత్వా రమమాణా వనే త్రయః, 31
దేవగన్ధర్వసంకాశాస్తత్ర తే న్యవసన్సుఖమ్.

ప్ర. అ. తే=ఆ సీతారామలక్ష్మణులు, వనేన=ఒక వనమునుండి, వనమ్=మరి యొక వనమును, గత్వా=పొంది (చేరుచు), బహూదకాః = అధిక మైన జలము గల, నదీః=నదులను, తీర్త్వా=దాటి, అను=అటుతరువాత, భరద్వాజస్య=భరద్వాజమహర్షియొక్క, శాసనాత్=ఆజ్ఞవలన, చిత్రకూటమ్=చిత్రకూట పర్వతమును, ప్రాప్య=పొంది, రమ్యమ్=సుందర మైన, ఆవసథమ్=గృహమును, కృత్వా=నిర్మించుకొని, తే=అట్టి, అనగా అయోధ్యలో సమస్త సుఖములు అనుభవించిన, త్రయః=ముగ్గురును, తత్ర=ఆ చిత్రకూట పర్వతమునం దున్న వనే=వనమునందు, రమమాణాః=క్రీడించుచు, దేవగన్ధర్వసఙ్కాశాః=దేవతలతోను గంధర్వులతోను సమానులై, సుఖమ్=సుఖముగా, న్యవసన్=నివసించిరి.

తా. ఆ సీతారామలక్ష్మణులు ఒక వనమునుండి మరొక వనము చేరుచు,

గొప్ప గొప్ప నదులను దాటుచు, భరద్వాజమహర్షి ఆదేశము ప్రకారము చిత్ర కూటపర్వతమును చేరిరి. అచట ఒక పర్ణశాల నిర్మించుకొని దేవగంధర్వుల వలె సుఖముగా నివసించిరి.

అర్థాంతరములు — 'తే+అవనేన' అని పదచ్ఛేదము. వారు, అవనేన= పరస్పర రక్షణముచేత — ఒకరి నొకరు రక్షించుకొనుచు, వనం గత్వా........ వనే=వనమునందు, తే=ఆ అయోధ్యలో ఉండువారుగానే, అయోధ్యలో ఉన్నట్లే, రమమాణాః = క్రీడారసము ననుభవించుచు, సీతారాములు వనవిహారాదిక్రీడా రసము ననుభవించిరి. లక్ష్మణుడు తత్సేవారసము ననుభవించెను. దేవగన్ధర్వ సఙ్కాశాః — దేవ=లక్ష్మీనారాయణులతోను (దేవీ చ దేవశ్చ దేవౌ. "పుమాన్ స్త్రియా" అని ఏకశేషము) గన్ధర్వ=జీవన్ముక్తునితోను (గానం ధారయతీతి గన్ధర్వః, గానమును ధరించుచుండును. అనగా పాడుచుండును అని అర్థము) సంకాశాః=సమానులై, సీతారాములు లక్ష్మీనారాయణులతోను, లక్ష్మణుడు సామ గానపరు డగు జీవన్ముక్తునితోను సమానులు అని అర్థము.

తా. ఆ సీతారామలక్ష్మణులు ముగ్గురును పరస్పరము రక్షించుకొనుచు, అరణ్యములో ప్రవేశించి, నదులు దాటుచు, భరద్వాజాజ్ఞవలన చిత్రకూటపర్వత మునకు వెళ్లిరి. అచట ఒక పర్ణశాల నిర్మించుకొని అయోధ్యలో ఎట్లు సుఖముగా ఉండిరో అట్లే సుఖముగా నుండిరి. సీతారాములు లక్ష్మీనారాయణుల వలెను, సాక్షాల్లక్ష్మీనారాయణస్వరూపు లైన ఆ సీతారాములను సేవించు లక్ష్మణుడు సామగానపరాయణు డగు జీవన్ముక్తుని వలెను ఆనందముతో ఉండిరి.

మరి యొక అర్థము — వారు మువ్వురును, అవనేన సహ=స్థలప్రదేశ ముతో గూడ, వనం గత్వా=అరణ్యమును పొంది, స్థలప్రదేశమును అరణ్యమును కూడ పొంది అని అర్థము. బహూదకాః, నదీః, అను, తీర్త్వా, భరద్వాజస్య శాసనాత్ చిత్రకూటం ప్రాప్య రమ్యమ్ ఆవసథం కృత్వా, తే=వనవాసులుగానే, అనగా నాగరికులుగా నుండి నూతనముగా వనవాసు లైనవారి కుండెడు వైలక్షణ్య మేమియు లేక యెప్పటికిని వనములోనే వాసముచేయుచుండు వారుగానే అని అర్థము. "తత్ర వనే రమమాణాః దేవగన్ధర్వసఙ్కాశాః సుఖం న్యవసన్."

తా. ఆ సీతారామలక్ష్మణులు ముగ్గురును స్థలప్రదేశములలోను, వనప్రదేశ ములలోను సంచరించుచు, భరద్వాజాజ్ఞవలన చిత్రకూటపర్వతము చేరి, అచట

పర్ణశాల నిర్మించుకొని, నగరములో సుఖ మనుభవించినవారము అనెడు భేద మెంతమాత్రము లేక, మొదటినుండియు వనములోనే ఉండువారు ఎట్లు సంతోష ముతో ఉందురో అట్లే సంతోషముతో నున్నవారై, ఆ చిత్రకూటవనములో విహరించుచు, దేవగంధర్వుల వలె సుఖముగా నుండిరి.

మరి యొక అర్థము :—తే త్రయః, తేవనేన=క్రీడచేత, "తేవృ దేవనే" అను ధాతువునుండి నిష్పన్న మైనది. మిగిలినది పైన చెప్పినట్లే.

తా. ఆ సీతారామలక్ష్మణులు క్రీడించుచున్నట్లు సుఖముగా అరణ్యము ప్రవేశించి............మొ.

మరి యొక అర్థము :—తే త్రయః, తేవనేన=కాలినడకచేత,....శేషము పై విధముగానే.

తా. ఆ సీతారామలక్ష్మణులు కాలినడకచేత అరణ్యమును ప్రవేశించి....మొ.

భరద్వాజః :—బిభ్రత్ వాజః=భరద్వాజః, 'వాజః' అనగా 'ప్రజ' అని వేదములో చెప్పబడినది. "ప్రజలను భరించువాడు" అని అర్థము. లేదా—'వాజః' అనగా "రేతస్సు" అని వేదమునందు చెప్పబడినది. రేతస్సును ధరించినవాడు, అనగా నిత్యబ్రహ్మచారి అని అర్థము (ఇవి తనిశ్లోకిలో చెప్పిన అర్థములు). 30, 31

మూ. చిత్రకూటం గతే రామే పుత్రశోకాతురస్తథా, 32
రాజా దశరథః స్వర్గం జగామ విలపన్ సుతమ్.

ప్ర. అ. రామే=రాముడు, తథా (ఇది గోవిందరాజపాఠము) = అట్లు, చిత్రకూటం గతే = చిత్రకూటమునకు వెళ్లగా, పుత్రశోకాతురః = కుమారుని గూర్చిన దుఃఖముచేత పీడింపబడిన, రాజా దశరథః = దశరథమహారాజు, సుతమ్=కుమారుని గూర్చి, విలపన్=ఏడ్చుచు, స్వర్గమ్=స్వర్గమును గూర్చి, జగామ=వెళ్లెను.

తా. రాముడు చిత్రకూటమునకు వెళ్లిన పిమ్మట దశరథుడు పుత్రశోకము చేత పీడితుడై, పుత్రుని గూర్చి ఏడ్చుచు స్వర్గస్థు డయ్యెను.

వి. "తథా"కు బదులు 'తదా' అని మహేశ్వరతీర్థపాఠము. తదా= అప్పుడు. 32

మూ. మృతే తు తస్మిన్ భరతో వసిష్ఠప్రముఖైర్ద్విజైః, 33
నియుజ్యమానో రాజ్యాయ నైచ్ఛద్రాజ్యం మహాబలః.

ప్ర. అ. తస్మిన్=దశరథుడు, మృతే=మరణింపగా, మహాబలః=గొప్ప శక్తిగల, భరతః తు=భరతుడు కూడ, వసిష్ఠప్రముఖైః=వసిష్ఠుడు మొదలైన, ద్విజైః=బ్రాహ్మణులచేత, రాజ్యాయ=రాజ్యము చేయుటకు, నియుజ్యమానః=ఆజ్ఞాపింపబడిన వాడైనను, రాజ్యమ్=రాజ్యమును, నైచ్ఛత్=అంగీకరించలేదు.

తా. దశరథుడు మరణించిన పిదప వసిష్ఠాదులు రాజ్యము చేయు మని భరతుని ఆజ్ఞాపించిరి. అయినను, తనకు రాజ్యము చేయు సామర్థ్య మున్నను, భరతుడు రామునిపై తన కున్న గౌరవముచే, రాజ్యమునకు ఒప్పుకొనలేదు.

వి. ఇచట 'తు' అనుదానికి 'అపి' (కూడ) అని అర్థము. 33

మూ. స జగామ వనం వీరో రామపాదప్రసాదకః.

ప్ర.అ. వీరః=రాగద్వేషాదులను జయించిన, సః=ఆ భరతుడు, రామపాద ప్రసాదకః=పూజ్యుడైన రాముని ప్రసన్నునిగా చేసికొనువాడై, లేదా, రాముని పాదములను ప్రసన్నములుగా చేసికొనువాడై, వనమ్=అరణ్యమును గూర్చి, జగామ=వెళ్లెను.

తా రాగద్వేషాదులు జయించిన ఆ భరతుడు రాముని అనుగ్రహింప చేసికొనుటకై అరణ్యమునకు వెళ్లెను.

వి. "పాద" శబ్దమునకు 'పూజనీయము' అని అర్థము. "పూజ్యే తు పాదనామాఙ్కః" అని అమరము. 34

మూ. గత్వా తు సుమహాత్మానం రామం సత్యపరాక్రమమ్,
అయాచద్భ్రాతరం రామమార్యభావపురస్కృతః. 35

ప్ర. అ. ఆర్యభావపురస్కృతః = వినయముచే పూజింపబడిన, లేదా పూజింపబడిన వినయము గల ఆ భరతుడు, సుమహాత్మానమ్ = మిక్కిలి పూజ్యమైన హృదయము కలవాడును, సత్యపరాక్రమమ్=సత్యమునందు దృఢవ్రతము కలవాడును అగు, రామమ్=రాముని, గత్వా=చేరి, భ్రాతరమ్=సోదరుడైన, రామమ్=ఆ రాముని, అయాచత్=ప్రార్థించెను.

తా. భరతుడు వినయముతో సుమహాత్ముడును, సత్యవ్రతుడును, తన సోదరుడును అగు, రాముని చేరి ప్రార్థించెను.

వి. ఒక 'రామమ్' అను పదమునకు "సంతోషమును కలిగించువాడు" అని అర్థము చెప్పవచ్చును. రామం రామమ్=సంతోషముకలిగించు రాముని. 'తు' అనునది పాదపూరణార్థము.

మూ. త్వమేవ రాజా ధర్మజ్ఞ ఇతి రామం వచోఽబ్రవీత్.

ప్ర. అ. ధర్మజ్ఞః=ధర్మముల నెరిగిన, త్వమేవ=నీవే, రాజా=రాజువు; ఇతి=అని, రామమ్=రాముని గూర్చి, వచః=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. "నీవు సమస్తధర్మములు తెలిసినవాడవు. అన్నగా రుండగా తమ్ముడు రాజ్యము చేయరాదు అను ధర్మము నీకు తెలియనిది కాదు. అందుచేత నీవే రాజు కావలెను" అని భరతుడు రామునితో చెప్పెను. 35

మూ. రామోఽపి పరమోదారః సుముఖః సుమహాయశాః,
న చైచ్ఛత్పితురాదేశా ద్రాజ్యం రామో మహాబలః. 36

ప్ర. అ. రామోఽపి=సమస్తజనులను ఆనందింపచేయువాడైనను, పరమోదారోఽపి=స్వసాయుజ్యము మొదలైన అన్ని కోరికలను తీర్చువాడైనను, సుముఖోఽపి = యాచకులు లభించుటచే ప్రసన్నమైన ముఖము కలవాడైనను, సుమహాయశాః = దానాతిశయముచే కలిగిన గొప్ప కీర్తి కలవాడైనను, మహాబలః = ఒక బాణముచేత సమస్తరాక్షసులను సంహరించు నంత బలము కలవాడైనను, లేదా ఆశ్రితుల కోరికలను తీర్చు సామర్థ్యము కలవాడైనను, రామః=రాముడు, పితుః=తండ్రియొక్క, ఆదేశాత్=ఆజ్ఞవలన, రాజ్యమ్=రాజ్యమును, నైచ్ఛత్=కోరలేదు.

తా. రాముడు అందరికిని సంతోషమునే కలిగించును. తనను ఆశ్రయించిన వారికి సాయుజ్యము మొదలైన సకలాభీష్టములను ఇచ్చును. ఎవరైన యాచించినంతమాత్రముననే "యాచకుల మనోరథమును తీర్చు భాగ్యము నా కబ్బినది కదా" అని సంతోషించును. "న హ్యర్థినః కార్యవశాదుపేతాః కకుత్స్థవంశే విముఖాః ప్రయాన్తి" (ఏదైన కార్యమును కోరి కకుత్స్థవంశమువారివద్దకు వచ్చిన యాచకులు ఎన్నడును నిరాశులై వెళ్లరు) అని విష్ణుపురాణములో చెప్పినట్లు

ప్రసిద్ధ మైన దానజనితకీర్తికలవాడు. ఆశ్రయించినవారి అభీష్టములను నెరవేర్చుటకు సమర్థుడు. ఇంతటి మృదుస్వభావు డైనను రాముడు, తండ్రి యాజ్ఞను అనుసరింపవలెనను దీక్షచే, భరతుడు ఎంత ప్రార్థించినను రాజ్యమును స్వీకరించుటకు అంగీకరించలేదు.

వి. "న చ ఐచ్ఛత్" అని 'చ'కారమును ప్రయోగించుటచే తండ్రి చెప్పిన గడువు తరువాత రాజ్యమును గ్రహించుటకు అంగీకరించెను అని సూచితము. 36

మూ. పాదుకే చాస్య రాజ్యాయ న్యాసం దత్వా పునః పునః, 37
నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః.

ప్ర. అ. భరతాగ్రజః=రాముడు, రాజ్యాయ=రాజ్యముచేయుటకు, అస్య=ఈ భరతునకు, పాదుకే=(తన) పాదుకలను, న్యాసమ్=న్యాసమునుగా (ఇల్లడగా), దత్వా=ఇచ్చి, తతః=అటుపిమ్మట, పునః పునః=మాటిమాటికిని, భరతమ్=భరతుని, నివర్తయామాస=మరలించెను.

తా. "నేను వచ్చునంతవరకును నా పాదుకలను నా ప్రతినిధిగా రాజ్యము చేయుటకై ఉంచుకొనుము" అని చెప్పి, తన పాదుకలను భరతున కిచ్చి, రాముడు అతనికి అనేకవిధముల బోధించి అయోధ్యకు పంపెను. 37

మూ. స కామమనవాప్యైవ రామపాదావుపస్పృశన్, 38
నన్దిగ్రామేఽకరోద్రాజ్యం రామాగమనకాఙ్క్షయా.

ప్ర.అ. సః=ఆ భరతుడు, కామమ్=కోరికను, అనవాప్యైవ=పొందకయే, రామపాదౌ = రాముని పాదుకలను, ఉపస్పృశన్ = సేవించుచు, రామాగమన కాఙ్క్షయా=రాముడు తిరిగి రాగల డను కోరికతో, నన్దిగ్రామే = నందిగ్రామము నందు, రాజ్యమ్ అకరోత్=రాజ్యము చేసెను.

తా. రాముని తిరిగి తీసికొనివెళ్లవలె నన్న కోరిక తీరని భరతుడు ఆ రామపాదుకలనే సేవించుచు, రాముడు సుఖముగా తిరిగి రావలె నని మనస్సులో కోరుకొనుచు, అయోధ్యాసమీపమున నున్న నందిగ్రామ మనెడు గ్రామములో నివసించి, రాజ్యము చేసెను. 38

మూ. గతే తు భరతే శ్రీమాన్ సత్యసన్ధో జితేన్ద్రియః, 39
రామస్తు పునరాలక్ష్య నాగరస్య జనస్య చ,
తత్రాగమనమేకాగ్రో దణ్డకాన్ ప్రవివేశ హ. 40

ప్ర. అ. భరతే=భరతుడు, గతే తు=వెళ్లినవాడగుచుండగా, శ్రీమాన్=భరతాగమనముచే కలిగిన ప్రతిజ్ఞాభంగభయము పోవుటచే ప్రశస్తమైన కాంతి కలవాడును, సత్యసన్ధః=భరతుడు నిర్బంధించినను ఎంతమాత్రము చలింపని ప్రతిజ్ఞ కలవాడును, జితేన్ద్రియః=జయింపబడిన ఇంద్రియములు కలవాడును, అనగా భరతాదుల ప్రార్థనలు వ్యాజముగా గొని తాను తిరిగి పోయి భోగములను అనుభవింపవచ్చును. ఐనను అట్టి భోగచాపలము లేనివాడు అని అర్థము. రామః తు=రాముడు, నాగరస్య జనస్య చ=నగరజనముయొక్కయు,(చకారముచే భరతునియొక్కయు అని సూచన), పునః=మరల, తత్ర=ఆ చిత్రకూట పర్వతమునందు, ఆగమనమ్=రాకను, ఆలక్ష్య=ఊహించి, ఏకాగ్రః=(తండ్రియాజ్ఞను నిర్వర్తించుటకు) ఏకాగ్రచిత్తుడై, లేదా (విరోధులైనరాక్షసు లుండుటచే) సావధానుడై, దణ్డకాన్=దండకారణ్యమును, ప్రవివేశ హ=ప్రవేశించెను.

తా. భరతుడు వెళ్లగానే రాముడు, ఆతడు వచ్చుటచే తనకు కలిగిన ప్రతిజ్ఞాభంగభయము పోవుటచే సర్వాతిశాయి యగు కాంతి కలవాడై, భరతుడెంత నిర్బంధించినను తన ప్రతిజ్ఞనుండి చలింపక, కౌసల్యాభరతాదులు చేసిన ప్రార్థనలు వ్యాజముగా తీసికొని తాను మరల రాజ్యము నంగీకరించుటకు అవకాశ మున్నను, రాజ్యభోగములపై ఎంతమాత్రము చాపలము చూపక, అయోధ్యాపౌరులును భరతాదులును మాటిమాటికి ఆ చిత్రకూటపర్వతమునకు వచ్చుచుందురు అని ఊహించి, పితాజ్ఞాపాలనమునందు సావధానుడై దండకావనమును ప్రవేశించెను. 39-40

అవ :— ఇపుడు అరణ్యకాండకథను చెప్పుచున్నాడు—

మూ. ప్రవిశ్య తు మహారణ్యం రామో రాజీవలోచనః,
విరాధం రాక్షసం హత్వా శరభఙ్గం దదర్శ హ. 41
సుతీక్ష్ణం చాప్యగస్త్యం చ అగస్త్యభ్రాతరం తథా.

ప్ర. అ. రాజీవలోచనః = పద్మములవంటి నేత్రములు గల, రామః =

రాముడు, మహారణ్యమ్=దండకారణ్యమును, ప్రవిశ్య తు=ప్రవేశించగనే, విరాధమ్=విరాధు డను, రాక్షసమ్=రాక్షసుని, హత్వా=చంపి, శరభఙ్గమ్=శరభంగ మహర్షిని, సుతీక్ష్ణం చ=సుతీక్ష్ణమహర్షిని, అగస్త్యం చ = అగస్త్యుని, తథా = మరియు, అగస్త్యభ్రాతరం చ=అగస్త్యుని సోదరుని, దదర్శ హ=చూచెను.

తా. పద్మములవంటి నేత్రములు గల రాముడు, దండకారణ్యమును ప్రవేశించిన వెనువెంటనే విరాధు డను రాక్షసుని చంపి, శరభంగ — సుతీక్ష్ణ — అగస్త్యమహర్షులను, అగస్త్యుని సోదరుని చూచెను. 41

మూ. అగస్త్యవచనాచ్చైవ జగ్రాహైన్ద్రం శరాసనమ్, 42
ఖడ్గం చ పరమప్రీతస్తూణీ చాక్షయసాయకౌ.

ప్ర. అ. అగస్త్యవచనాత్ చ ఏవ=అగస్త్యుని మాటప్రకారమే, ఐన్ద్రమ్=ఇంద్రునిచే ఇవ్వబడిన, శరాసనమ్=ధనుస్సును, ఖడ్గం చ =కత్తిని, అక్షయసాయకౌ=అక్షయము లైన బాణములు గల, తూణీ చ = అమ్ముల పొదులను, పరమప్రీతః=చాల సంతసించినవాడై, జగ్రాహ=స్వీకరించెను.

తా. అగస్త్యుడు తన కింద్రు డిచ్చిన ధనుస్సును, కత్తిని, తరగని బాణములు గల అమ్ములపొదులను తీసికొను మని రామున కీయగా ఆతడు తనకు తగిన ఆయుధములు దొరకినందులకు చాల సంతసించి, వానిని గ్రహించెను. 42

మూ. వసతస్తస్య రామస్య వనే వనచరైః సహ,
ఋషయోఽభ్యాగమన్సర్వే వధా యాసురరక్షసామ్. 43

ప్ర. అ. తస్య రామస్య=ఆ రాముడు, వనే=శరభంగమహర్షి ఆశ్రమమునందు, వసతః=నివసించుచుండగా, సర్వే=అందరు, ఋషయః=ఋషులును, వనచరైః సహ = వానప్రస్థులైన మునులతో గూడ, అసురరక్షసాం వధాయ = అసురులను రాక్షసులను చంపు మని కోరుటకు, అభ్యాగమన్=వచ్చిరి.

తా. రాముడు శరభంగమహర్షి తపోవనములో వాసము చేయుచుండగా ఆ చుట్టు ప్రక్కల నున్న ఋషు లందరును, "అసురులను, రాక్షసులను సంహరింపుము" అని ప్రార్థించుటకై రామునివద్దకు వచ్చిరి.

అర్థాంతరము :— వనచరైః సహ వసతః తస్య రామస్య = మునులతో

కలిసి నివసించుచున్న ఆ రామునకు, ఋషులందరును, అసురరక్షసామ్ = (అసు+ర=ప్రాణములను గ్రహించువారు) తమను హింసించుచున్న రాక్షసుల యొక్క, వధకొరకై, అభ్యాగమన్=శరణాగతులైరి.

తా. శరభంగతపోవనమునందు మునులతో కూడి నివసించుచున్న ఆ రామునకు, దండకావనములో నివసించు ఋషు లందరును, తమను హింసించు చున్న రాక్షసులను చంపించుటకై, శరణాగతులైరి (గోవిందరాజులు). 43

మూ. స తేషాం ప్రతిశుశ్రావ రాక్షసానాం తథా వనే, 44
ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధః సంయతి రక్షసామ్,
ఋషీణామగ్నికల్పానాం దణ్డకారణ్యవాసినామ్. 45

ప్ర. అ. సః=రాముడు, రాక్షసానామ్= రాక్షసుల (నివాసమైన), వనే= వనమునందు, తేషామ్=ఆ ఋషుల, తథా=ఆ ప్రార్థనను, ప్రతిశుశ్రావ=అంగీక రించెను, రామేణ=రామునిచేత, అగ్నికల్పానామ్=అగ్నితో సమానులైన, దణ్డ కారణ్యవాసినామ్=దండకారణ్యమునందు నివసించుచున్న, ఋషీణామ్ = ఋషు లకు, సంయతి=యుద్ధమునందు, రక్షసామ్=రాక్షసులయొక్క, వధశ్చ=చంపు టయు, ప్రతిజ్ఞాతః=ప్రతిజ్ఞచేయబడినది.

తా. రాక్షసనివాస మైన ఆ వనములో ఆ ఋషులు చేసిన ప్రార్థనను రాముడు అంగీకరించెను. "యుద్ధములో రాక్షసులను సంహరించెదను" అని అగ్నితుల్యతేజస్కు లగు ఆ దండకారణ్యవాసిమునులకు మాట ఇచ్చెను. 44-45

మూ. తేన తత్రైవ వసతా జనస్థాననివాసినీ,
విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణీ. 46

ప్ర. అ. తత్రైవ=ఆ దండకారణ్యమునందు, వసతా = నివసించుచున్న, తేన=ఆ రామునిచేత, కామరూపిణీ=ఇష్టమువచ్చిన రూపము ధరింప సమర్థురా లును, జనస్థాననివాసినీ=జనస్థాన మను పేరు గల, దండకారణ్యమునకు సంబం ధించిన ఒక ప్రదేశమునందు వాసము చేయుచుండు నదియు అగు, శూర్పణఖా= శూర్పణఖ యనెడు, రాక్షసీ = రాక్షసస్త్రీ, విరూపితా = వికృత మైన రూపము కలదిగా చేయబడెను.

తా. రాము డా దండకారణ్యములోనే నివసించుచు, ఆ దండకారణ్యము నందు, రావణుని సేనానివేశస్థాన మగు జనస్థానమునందు వాసము చేయు, కామ రూపిణి యగు శూర్పణఖ యను రక్కసిని ముక్కుచెవులు కోసి విరూపిణిగా చేసెను.

వి. "శూర్పతుల్యాః నఖాః యస్యాః సా శూర్పణఖా"—చేటలవంటి గోళ్లు గల స్త్రీ. శూర్పణఖను విరూపిణిగా చేసినది లక్ష్మణుడు కాని రాముడు కాదు. అయినను—"రామస్య దక్షిణో బాహుః" అని లక్ష్మణుడు రాముని కుడిచెయ్యి వంటి వాడని చెప్పబడుటచేతను, లక్ష్మణుడు రామాజ్ఞచేతనే అట్లు చేసినందు వలనను రాముడే శూర్పణఖను విరూపిణిగా చేసినట్లు చెప్పబడినది (గోవింద రాజులు). 46

మూ. తతః శూర్పణఖావాక్యాదుద్యుక్తాన్ సర్వరాక్షసాన్,
ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసమ్, 47
నిజఘాన రణే రామస్తేషాం చైవ పదానుగాన్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, శూర్పణఖావాక్యాత్=శూర్పణఖయొక్క మాటవలన, ఉద్యుక్తాన్ = యుద్ధముచేయుటకు సన్నద్ధులైన, సర్వరాక్షసాన్ = అందరు రాక్షసులను, ఖరమ్=ఖరుని, త్రిశిరసం చైవ=త్రిశిరసుని, దూషణమ్= దూషణు డను, రాక్షసం చైవ = రాక్షసుని, తేషామ్ = వారియొక్క, పదానుగాన్+చ+ఏవ = అనుచరులను, రామః = రాముడు, రణే=యుద్ధమునందు, నిజఘాన=చంపెను.

తా. శూర్పణఖ విరూపిత యైన పిమ్మట ఆ శూర్పణఖ మాట విని యుద్ధమునకు వచ్చిన ఖరుని, త్రిశిరసుని, దూషణుని, వారి అనుచరులైన సకల రాక్షసులను రాముడు యుద్ధమునందు సంహరించెను. 47

మూ. వనే తస్మిన్నివసతా జనస్థాననివాసినామ్, 48
రక్షసాం నిహతాన్యాసన్ సహస్రాణి చతుర్దశ.

ప్ర. అ. తస్మిన్=ఆ, వనే=వనమునందు, నివసతా=నివసించుచున్న ఆ రామునిచేత, జనస్థాననివాసినామ్=జనస్థానమునందు నివసించుచున్న, రక్షసామ్=

రాక్షసులయొక్క, చతుర్దశ=పదునాలుగు, సహస్రాణి=వేలు, నిహతాని=చంపబడినవి, ఆసన్=అయినవి.

తా. దండకారణ్యమునందు నివసించు నపుడు రాముడు జనస్థానములో నివసించు రాక్షసులలో పదునాలుగు వేలమందిని సంహరించెను. 48

మూ. తతో జ్ఞాతివధం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః, 49
సహాయం వరయామాస మారీచం నామ రాక్షసమ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రావణః=రావణుడు, జ్ఞాతివధమ్=జ్ఞాతుల వధను, శ్రుత్వా=విని, క్రోధమూర్ఛితః=కోపముతో నిండినవాడై, మారీచం నామ=మారీచు డనెడు, రాక్షసమ్ = రాక్షసుని, సహాయమ్ = సహాయునిగా, వరయామాస=కోరెను.

తా. పిమ్మట రావణుడు జ్ఞాతుల మరణవార్త విని, మిక్కిలి కోపించినవాడై, తనకు సాహాయ్యము చేయు మని మారీచు డను రాక్షసుని కోరెను.

వి. "రావయతీతి రావణః"—"లోకముచే రోదనధ్వని చేయించువాడు" అని అర్థము. "రు శబ్దే" అను ధాతువునుండి నిష్పన్న మైనది. "విశ్రవసో విశ్రవణ రవణౌ" అను ప్రమాణమును పట్టి "విశ్రవసః అపత్యం పుమాన్ రావణః" అను విగ్రహముచే 'రావణః' అనగా విశ్రవసుని కుమారు డని అర్థము (గోవిందరాజులు). 49

మూ. వార్యమాణః సుబహుశో మారీచేన స రావణః, 50
న విరోధో బలవతా క్షమో రావణ తేన తే.

ప్ర. అ. సః=ఆ, రావణః=రావణుడు, "రావణ=ఓ రావణా! బలవతా=ఖరాదిరాక్షసులను చంపుటచే ప్రసిద్ధ మైన బలము గల, తేన = ఆ రామునితో, విరోధః=విరోధము, తే=నీకు, న క్షమః=తగినది కాదు, అని, సుబహుశః = అనేకపర్యాయములు, వార్యమాణః=అడ్డగింపబడినవాడు, (అభూత్=ఆయెను).

తా. "ఓ రావణా! మహాబలవంతులైన ఖరుడు మొదలగు పదునాలుగు వేల రాక్షసులను చంపి నట్టి బలవంతు డైన రామునితో వైరము పెట్టుకొనకుము" అని మారీచుడు రావణుని అనేకపర్యాయములు వారించెను. 50

మూ. అనాదృత్య తు తద్వాక్యం రావణః కాలచోదితః, 51
జగామ సహమారీచ స్తస్యాశ్రమపదం తదా.

ప్ర. అ. రావణః=రావణుడు, కాలచోదితః = మృత్యువుచే ప్రేరితుడై, తద్వాక్యమ్=ఆ వాక్యమును, అనాదృత్య తు=ఆదరింపకయే, సహమారీచః = మారీచునితో కూడినవాడై, తదా=అప్పుడు, తస్య=ఆ రామునియొక్క, ఆశ్రమ పదమ్=ఆశ్రమస్థానమును గూర్చి, జగామ=వెళ్లెను.

తా. మృత్యువు సమీపించుటచే రావణుడు మారీచుని మాటలు వినలేదు. అతనిని వెంటబెట్టుకొని రాముని ఆశ్రమమునకు వెళ్లెను. 51

మూ. తేన మాయావినా దూరమపవాహ్య నృపాత్మజౌ, 52
జహార భార్యాం రామస్య గృధ్రం హత్వా జటాయుషమ్.

ప్ర. అ. మాయావినా=మాయావియైన, తేన=ఆ మారీచునిచేత, నృపాత్మజౌ = రాజకుమారు లైన ఆ రామలక్ష్మణులను, దూరమ్ = దూరముగా, అపవాహ్య = తొలగిపోవు నట్లు చేయించి, జటాయుషమ్ = జటాయు వను, గృధ్రమ్=గ్రద్దను, హత్వా=చంపి, రామస్య = రామునియొక్క, భార్యామ్= భార్య యైన సీతను, జహార=అపహరించెను.

తా. మాయావి యైన మారీచుని ద్వారా రామలక్ష్మణులు పర్ణశాలనుండి చాల దూరము వెళ్లిపోవునట్లు చేసి, రాముని భార్య యగు సీతను అపహరించెను. ఆమెను విడిపించుటకై వచ్చిన జటాయువును చంపెను. 52

మూ. గృధ్రం చ నిహతం దృష్ట్వా హృతాం శ్రుత్వా చ మైథిలీమ్,
రాఘవః శోకసన్తప్తో విలలాపాకులేన్ద్రియః. 53

ప్ర. అ. రాఘవః=రాముడు, నిహతమ్=పడగొట్టబడిన, గృధ్రమ్=జటాయువును, దృష్ట్వా=చూచి, మైథిలీమ్=సీతను, హృతామ్ = హరింపబడిన దానినిగా, శ్రుత్వా చ=విని, శోకసన్తప్తః = దుఃఖముచే మిక్కిలి తపింపబడిన వాడై, ఆకులేన్ద్రియః = వ్యాకుల మైన ఇంద్రియములు కలవాడై, విలలాప= విలపించెను.

తా. రాముడు, చచ్చుటకు సిద్ధమై పడియున్న జటాయువును చూచి, ఆ

జటాయువువలన సీతాదేవిని రావణు డపహరించినట్లు విని, మిక్కిలి దుఃఖితుడై, ఇంద్రియములను వశములో ఉంచుకొనజాలక విలపించెను. 53

మూ. తతస్తేనైవ శోకేన గృధ్రం దగ్ధ్వా జటాయుషమ్, 54
మార్గమాణో వనే సీతాం రాక్షసం సందదర్శ హ.
కబన్ధం నామ రూపేణ వికృతం ఘోరదర్శనమ్. 55

ప్ర. అ. తేన=ఆ, శోకేనైవ = దుఃఖముచేతనే, తతః=వ్యాపింపబడిన ఆ రాముడు, గృధ్రమ్=గ్రద్ద యైన, జటాయుషమ్=జటాయువును, దగ్ధ్వా=దహించి, వనే=అరణ్యమందు, సీతామ్=సీతాదేవిని, మార్గమాణః=వెదకుచు, రూపేణ=ఆకారముచే, వికృతమ్ = వికారముగా నున్న, ఘోరదర్శనమ్=భయంకర మైన దర్శనముగల, కబన్ధం నామ=కబంధు డనెడు, రాక్షసమ్=రాక్షసుని, సందదర్శ హ=చూచెను.

తా. అత్యధిక మైన దుఃఖముతో రాముడు జటాయువునకు దహనసంస్కారము చేసి, సీతకై వెదకుచు, ఆ వనములో వికృత మైన ఆకారముతో, భయంకరముగా ఉన్న కబంధు డనెడి రాక్షసుని చూచెను. 54–55

మూ. తం నిహత్య మహాబాహుర్దదాహ స్వర్గతశ్చ సః,
స చాస్య కథయామాస శబరీం ధర్మచారిణీమ్, 56
శ్రమణీం ధర్మనిపుణా మభిగచ్ఛేతి రాఘవ.

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, ఆ రాముడు, తమ్=ఆ కబంధుని, నిహత్య=చంపి, దదాహ=కాల్చివేసెను, సః=ఆతడు, స్వర్గతశ్చ=స్వర్గమును పొందెను, స చ = స్వర్గమునకు వెళ్లుచున్న ఆ కబంధుడు, రాఘవ=ఓ రామా!, ధర్మచారిణీమ్ = ధర్మములను ఆచరించుచున్నదియు, ధర్మనిపుణామ్=ధర్మములయందు సమర్థురాలును, శ్రమణీమ్=సన్న్యాసాశ్రమమును స్వీకరించి ఉన్నదియు అగు, శబరీమ్ = శబరజాతిస్త్రీని గూర్చి, అభిగచ్ఛ=వెళ్లుము, ఇతి=అని, అస్య=ఈ రామునకు, కథయామాస=చెప్పెను.

తా. బలిష్ఠము లైన బాహువులు గల ఆ రాముడు ఆ కబంధుని చంపి, దహనసంస్కారము చేయగా, అతడు స్వర్గమునకు వెళ్లెను. అతడు స్వర్గమునకు

పోవుటకు ముందు—"ఓ రామా! ధర్మమును ఆచరించుటయందు నేర్పు కలదియు, ధర్మమును ఆచరించునదియు, అగు ఒక శబరస్త్రీ సన్న్యాసాశ్రమమును స్వీకరించియున్నది. ఆమె వద్దకు వెళ్లుము" అని చెప్పెను.

విశేషార్థము :—"చతుర్థమాశ్రమం ప్రాప్తాః శ్రమణా నామ తే స్మృతాః" (నాల్గవ ఆశ్రమమును స్వీకరించినవారు శ్రమణులు) అని చెప్పుటచే శ్రమణులనగా సన్న్యాసులు. కావున "శ్రమణీ" అని చెప్పబడినది.

జితేంద్రియురాలై మోక్షోపయుక్తాచారనిష్ఠ యగు స్త్రీ శ్రమణి; (మహేశ్వ

"నృపాయాం వైశ్యతో జాతః శబరః పరికీర్తితః, మధూని వృక్షాదానీయ విక్రీణీతే స్వవృత్తయే" (క్షత్రియస్త్రీకి వైశ్యునివలన పుట్టినవాడు శబరుడు. వృక్షములనుండి తేనెను తీసి, విక్రయించుట ఆతని జీవిక) అను నారదీయవచనానుసారముగా క్షత్రియస్త్రీకిని వైశ్యునకును పుట్టినది శబరి (గోవిందరాజులు).

బౌద్ధ సన్న్యాసులకు శ్రమణు లను నామము కలదు. ఇచట శ్రమణీశబ్దమున్నది గాన రామాయణము బుద్ధుని తరువాత వ్రాయబడిన దని కొందరు చెప్పుచుందురు. కాని, నాస్తికులకు బౌద్ధు లను పేరు ప్రాచీనకాలముననే ఉన్నది. శ్రమణశబ్దము స్మృతులలో ప్రయుక్త మైయున్నది. అందుచే పై వాదము యుక్తము కాదని మరికొందరు సమాధానము చెప్పుదురు. 56

మూ. సోఽభ్యగచ్ఛన్మహాతేజాః శబరీం శత్రుసూదనః, 57
శబర్యా పూజితః సమ్యగ్రామో దశరథాత్మజః.

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడును, శత్రుసూదనః=శత్రుసంహారకుడును అయిన, సః=ఆ రాముడు, శబరీమ్=శబరిని గూర్చి, అభ్యగచ్ఛత్=వెళ్లెను, దశరథాత్మజః రామః = దశరథుని కుమారు డైన రాముడు, శబర్యా=శబరిచేత, సమ్యక్=బాగుగా, పూజితః=పూజింపబడెను.

తా. మహాతేజశ్శాలియు, శత్రుసంహారకుడును అయిన రాముడు భక్తపరాధీనుడు గాన తానే స్వయముగ శబరి దగ్గరకు వెళ్లెను. శబరి ఆ రాముని చక్కగ పూజించెను.

వి. "దశరథాత్మజః" అను విశేషణము—అరువదివేల సంవత్సరములు, సంతానములేకయుండి తరువాత మహాప్రయత్నము చేసి సంతానము పొందిన దశరథుడు, తన ప్రియపుత్రుడగు రామునకిచ్చు భోజనము కంటెను ఆ శబరస్త్రీ ఇపుడిచ్చిన వన్యాహారముతో కూడిన ఆతిథ్యము రామునకు హెచ్చుగా ప్రీతి కలిగించినదని సూచించుచున్నది (గోవిందరాజులు). 57

అవ. ఇపుడు కిష్కింధాకాండ కథ చెప్పబడుచున్నది—

మూ. పమ్పాతీరే హనుమతా సఙ్గతో వానరేణ హ, 58
హనుమద్వచనాచ్చైవ సుగ్రీవేణ సమాగతః.

ప్ర. అ. పమ్పాతీరే=పంపాసరస్తీరమునందు, హనుమతా = హనుమంతుడనెడు, వానరేణ=వానరునితో, సఙ్గతః హ=చేరెను, హనుమద్వచనాత్=హనుమంతుని మాటవలన, సుగ్రీవేణ చైవ=సుగ్రీవునితోగూడ, సమాగతః=చేరెను.

తా. రాముడు పంపాసరస్తీరమున హనుమంతునితో పరిచయ మేర్పరచుకొని పిదప అతని మాట ప్రకారము సుగ్రీవునితో స్నేహము చేసికొనెను.

వి. హనుమాన్=ప్రశస్తమైన చెక్కిళ్ల మీది భాగము కలవాడు. పూర్వము హనుమంతుడు పుట్టుచునే సూర్యుని చూచి "ఇది ఒక ఫలము; దీనిని భక్షించెదను" అని తలచి అతనిపై కెగిరెను. ఇట్లు సూర్యుని వేడిని ఎంతమాత్రము లెక్కింపక మూడువందల యోజనముల వరకు పైకి లంఘింపగా, ఇంద్రుడు చూచి, కోపించి, హనుమంతునిపై వజ్రాయుధమును వేసెను. వజ్రము దెబ్బ తగిలి హనుమంతుడు ఒక కొండపై పడిపోగా అతని వామహనువు భగ్నమయ్యెను. అందుచే అతనికి హనుమంతు డను పేరు వచ్చెను. ఈ శబ్దముచే మహాపరాక్రమశాలి యని సూచింపబడుచున్నది.

"సీతను పోగొట్టుకొని దుఃఖితుడై అరణ్యములో సంచరించుచున్న రామునకు, మహాపరాక్రమశాలియైన హనుమంతుని స్నేహము ఘటిల్లెను. సంతోషము!" అని ఈ శ్లోకమునందు కవితాత్పర్యము (గోవిందరాజులు). 58

మూ. సుగ్రీవాయ చ తత్సర్వం శంసద్రామో మహాబలః, 59
ఆదితస్తద్యథావృత్తం సీతాయాశ్చ విశేషతః.

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము గల, రామః=రాముడు, ఆదితః= మొదటినుండియు, తత్=ఆ, సర్వమ్=సమస్త మైన, (వృత్తమ్=వృత్తాంతమును), విశేషతః=ప్రధానముగా, సీతాయాశ్చ=సీతయొక్క వృత్తాంతమును, యథావృత్తమ్=జరిగినది జరిగినట్లుగా, సుగ్రీవాయ చ = సుగ్రీవునకును, హనుమంతునకును కూడ, శంసత్=చెప్పెను.

తా. మహాబలు డగు రాముడు తనవృత్తాంతము నంతను, మొదటి నుండియు సుగ్రీవహనుమంతులకు చెప్పి, విశేషించి సీతావృత్తాంతమును వారికి తెలిపెను. 59

మూ. సుగ్రీవశ్చాపి తత్సర్వం శ్రుత్వా రామస్య వానరః,
చకార సఖ్యం రామేణ ప్రీతశ్చైవాగ్నిసాక్షికమ్. 60

ప్ర. అ. వానరః=వానరుడైన, సుగ్రీవః=సుగ్రీవుడు, రామస్య=రామునియొక్క, తత్ సర్వమ్=ఆ వృత్తాంతము నంతను, శ్రుత్వా=విని, ప్రీతః=సంతోషించినవాడై, అగ్నిసాక్షికం చైవ=అగ్ని సాక్షిగా ఉండగా, రామేణ=రామునితో, సఖ్యమ్=స్నేహమును, చకార=చేసెను.

తా. సుగ్రీవుడు రాముని వృత్తాంత మంతయు విని, తనవలెనే దుఃఖితుడైన మహాబలునితో పరిచయము కలిగినందుకు సంతోషించి, అగ్నిసాక్షికముగా రామునితో మైత్రి చేసికొనెను. 60

మూ. తతో వానరరాజేన వైరానుకథనం ప్రతి,
రామాయావేదితం సర్వం ప్రణయాద్దుఃఖితేన చ 61

ప్ర. అ. తతః=అటుపిమ్మట, దుఃఖితేన=దుఃఖితుడైన, వానరరాజేన= సుగ్రీవునిచేత, వైరానుకథనం ప్రతి = వాలితో కలిగిన వైరమును గూర్చిన ప్రశ్నకు సమాధానముగా, రామాయ = రామునకు, సర్వమ్ = అంతయు, ప్రణయాత్= స్నేహమువలన, ఆవేదితమ్=తెలుపబడెను.

తా. "నీకును వాలికిని విరోధ మెట్లు ఏర్పడినది?" అని రాముడు ప్రశ్నింపగా, సుగ్రీవుడు, దుఃఖించుచు, స్నేహముతో రామునకు ఆ వృత్తాంతము అంతయు తెలిపెను. 61

మూ. ప్రతిజ్ఞాతం చ రామేణ తదా వాలివధం ప్రతి, 62
వాలినశ్చ బలం తత్ర కథయామాస వానరః.

ప్ర. అ. తదా=అప్పుడు, రామేణ=రామునిచేత, వాలివధం ప్రతి=వాలిని చంపుటను గూర్చి, ప్రతిజ్ఞాతమ్=ప్రతిజ్ఞ చేయబడినది, తత్ర=అచట, వానరః=సుగ్రీవుడు, వాలినః=వాలియొక్క, బలమ్=బలమును, కథయామాస=వర్ణించి చెప్పెను.

తా. వాలిని చంపెద నని రాముడు ప్రతిజ్ఞచేసెను. సుగ్రీవుడు కూడ రామునకు—అరుణోదయము మొదలు సూర్యోదయము లోపల నాలుగు సముద్రములందును అర్ఘ్యములు విడుచుట మొదలగు వాలియొక్క బలవిశేషములను గూర్చి చెప్పెను. 62

మూ. సుగ్రీవః శఙ్కితశ్చాసీన్నిత్యం వీర్యేణ రాఘవే, 63
రాఘవప్రత్యయార్థం తు దున్దుభేః కాయముత్తమమ్,
దర్శయామాస సుగ్రీవో మహాపర్వతసన్నిభమ్. 64

ప్ర.అ. సుగ్రీవశ్చ=సుగ్రీవుడు, రాఘవే=రామునివిషయమున, వీర్యేణ=పరాక్రమముచేత, నిత్యమ్=ఎల్లప్పుడును, శఙ్కితః = సందేహము కలవాడై, ఆసీత్=ఉండెను, సుగ్రీవః=సుగ్రీవుడు, రాఘవప్రత్యయార్థమ్=రామునియందు తనకు నమ్మకము ఏర్పడుటకై, దున్దుభేః=దుందుభి యను రాక్షసునియొక్క, ఉత్తమమ్=శ్రేష్ఠమైన, మహాపర్వతసన్నిభమ్=గొప్ప పర్వతముతో సమానమైన, కాయమ్=కళేబరమును, దర్శయామాస=చూపెను.

తా. సుగ్రీవుడు రాముని చూచినది మొదలు "ఇతడు వాలిని చంప సమర్థుడో, కాడో" అని సందేహించుచుండెను. ఆతడు రామునివిషయమున తనకు నమ్మకము కలుగుటకై, కొండవలె నున్న, దుందుభి యను రాక్షసుని కళేబరమును రామునకు చూపెను. పూర్వ మొకప్పుడు దానిని వాలి చాలదూరముగ విసరివేసెను. 63—64

మూ. ఉత్స్మయిత్వా మహాబాహుః ప్రేక్ష్య చాస్థి మహాబలః,
పాదాఙ్గుష్ఠేన చిక్షేప సమ్పూర్ణం దశయోజనమ్. 65

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడును, మహాబలః = గొప్ప బలము కలవాడును అగు రాముడు, అస్థి=ఎముకను, ప్రేక్ష్య=చూచి, ఉత్స్మయిత్వా = గంభీరముగా కొంచెము నవ్వి, పాదాఙ్గుష్ఠేన = కాలి బొటన వ్రేలితో, సంపూర్ణం దశయోజనమ్=పూర్తి పదియోజనముల దూరము, చిక్షేప= చిమ్మెను.

తా. అంగుళ్యగ్రమాత్రముచే రాక్షసాది సమస్తలోకవిరోధులను వధించుటకు సమర్థములైన బాహువులును, లెక్కింపరాని వీర్యమును గల రాముడు—"నా విషయమై జ్ఞానులు కూడ మోహము పొందుచుందురు. అరణ్యములోని ఈ వానరుడు మోహము నొందుటలో ఏమి ఆశ్చర్యము" అని గంభీరముగా చిరునవ్వు నవ్వి, అస్థిమయమై పడి యున్న ఆ దుందుభి కళేబరమును చూచి, కొంచెమైనను తక్కువ కాకుండ పది యోజనముల దూరములో పడు నట్లు, దానిని తన పాదాంగుష్ఠముతో చిమ్మెను (మహేశ్వరతీర్థుల వ్యాఖ్యానము).

"ఉత్స్మయిత్వా" అను పదములో ఉన్న "ఉత్" అను ఉపసర్గను, 'చిక్షేప' అను క్రియాపదముతో కలిపి—"ఉచ్చిక్షేప=ఎత్తి విసరెను" అని గోవింద రాజులు అర్థము చెప్పిరి.

తా. ఊహింపరాని బలము కలవాడును, ఆ బలమునకు తగి నట్లు కార్యము చేయ సమర్థములైన బాహువులు కలవాడును అగు రాముడు అస్థిమయ మైన ఆ దుందుభికళేబరమును చూచి, "ఇది ఎంత ?" అని నవ్వి, కొంచెమైనను తక్కువ లేకుండ పది యోజనముల దూరములో పడునట్లు, దానిని తన పాదాంగుష్ఠముతో ఎత్తి విసరెను. 65

మూ. బిభేద చ పునః సాలాన్ సప్తైకేన మహేషుణా,
గిరిం రసాతలం చైవ జనయన్ ప్రత్యయం తదా. 66

ప్ర. అ. తదా=అప్పుడు, పునశ్చ=మరల, ప్రత్యయమ్=నమ్మకమును, జనయన్=పుట్టించుచు, ఏకేన=ఒక, మహేషుణా=గొప్పబాణముచేత, సప్త= ఏడు, సాలాన్=మద్దిచెట్లను, గిరిమ్=పర్వతమును, రసాతలం చైవ=పాతాళమును, బిభేద=భేదించెను.

తా. అప్పు డా రాముడు, సుగ్రీవున కింకను నమ్మకము కలుగుటకై ఒక్క బాణముచే ఏడు మద్దిచెట్లను, పర్వతమును, పాతాళమును భేదించెను. 66

మూ. తతః ప్రీతమనాశ్చైవ విశ్వస్తశ్చ మహాకపిః,
కిష్కిన్ధాం రామసహితో జగామ చ గుహాం తదా. 67

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తేన=దానిచేత, ప్రీతమనాః=సంతసించిన మనస్సు గల, సః=ఆ, మహాకపిః=సుగ్రీవుడు, విశ్వస్తశ్చ=నమ్మకము కూడ కుదిరినవాడై, తదా=అప్పుడు, రామసహితః=రామునితో కూడినవాడై, గుహామ్=గుహవలె నున్న, కిష్కిన్ధామ్=కిష్కింధానగరమును గూర్చి, జగామ=వెళ్లెను.

తా. రాముడు ఆ సప్తసాలాది భేదనము చేసిన పిమ్మట సుగ్రీవునకు నమ్మిక కుదిరెను. తనకు రాజ్యము లభించు నని అతడు సంతసించి, రాముని వెంటబెట్టుకొని గుహవలె నున్న కిష్కింధాపట్టణమునకు వెళ్లెను. 67

మూ. తతోఽగర్జద్ధరివరః సుగ్రీవో హేమపిఙ్గళః,
తేన నాదేన మహతా నిర్జగామ హరీశ్వరః. 68

ప్ర. అ. తతః = అటుపిమ్మట, హరివరః = వానరశ్రేష్ఠుడును, హేమపిఙ్గలః=బంగారము వలె పచ్చని రంగు గలవాడును అగు, సుగ్రీవః=సుగ్రీవుడు, అగర్జత్=గర్జించెను, తేన=ఆ, మహతా = గొప్పదైన, నాదేన = ధ్వనిచేత, హరీశ్వరః=వానరరాజైన వాలి, నిర్జగామ=బైటకువచ్చెను.

తా. కిష్కింధ ప్రవేశించి, బంగారువంటి వన్నె గల వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు గర్జించెను. ఆ మహానాదమును విని వాలి గృహమునుండి బైటకు వచ్చెను. 68

మూ. అనుమాన్య తదా తారాం సుగ్రీవేణ సమాగతః,
నిజఘాన చ తత్రైనం శరేణైకేన రాఘవః. 69

ప్ర. అ. తదా=అప్పుడు, తారామ్=భార్యయైన తారను, అనుమాన్య = ఒప్పించి, సుగ్రీవేణ= సుగ్రీవునితో, సమాగతః=చేరెను, రాఘవః చ=రాముడు, తత్ర=అచట, ఏనమ్ = ఈ వాలిని, ఏకేన = ఒక, శరేణ = బాణముచేత, నిజఘాన=చంపెను.

తా. వాలి, యుద్ధమునకు వెళ్లవద్దని నివారించుచున్న తారను ఒప్పించి

సుగ్రీవునితో యుద్ధమునకు తలపడెను. అచట రాముడు ఒక్క బాణముతో వాలిని చంపెను. 69

మూ. తతః సుగ్రీవవచనాద్ధత్వా వాలిన మాహవే,
సుగ్రీవమేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్. 70

ప్ర.అ. రాఘవః=రాముడు, సుగ్రీవవచనాత్=సుగ్రీవుని మాటప్రకారము, ఆహవే=యుద్ధమునందు, వాలినమ్=వాలిని, హత్వా=చంపి, తతః = అటు పిమ్మట, తద్రాజ్యే=ఆ వాలియొక్క రాజ్యమునందు, సుగ్రీవమేవ=సుగ్రీవునే, ప్రత్యపాదయత్=ప్రతిష్ఠించెను.

తా. రాముడు సుగ్రీవుని ప్రార్థనప్రకారము వాలిని సంహరించి, ఆతని రాజ్యమునందు సుగ్రీవునే పట్టాభిషిక్తుని చేసెను. 70

మూ. స చ సర్వాన్ సమానీయ వానరాన్ వానరర్షభః,
దిశః ప్రస్థాపయామాస దిదృక్షుర్జనకాత్మజామ్. 71

ప్ర. అ. సః=ఆ, వానరర్షభశ్చ=సుగ్రీవుడును, జనకాత్మజామ్ = సీతాదేవిని, దిదృక్షుః=చూడ ఇచ్ఛ కలవాడై, సర్వాన్=సమస్తమైన, వానరాన్=వానరులను, సమానీయ = రప్పించి, దిశః=దిక్కులను గూర్చి, ప్రస్థాపయామాస=పంపెను.

తా. వానరశ్రేష్ఠు డగు సుగ్రీవుడు వానరు లందరిని రప్పించి, సీతాదేవిని అన్వేషించుటకై అన్ని దిక్కులకు పంపెను. 71

అవ. ఇపుడు సుందరకాండకథను చెప్పుచున్నాడు—

మూ. తతో గృధ్రస్య వచనాత్సంపాతేర్హనుమాన్ బలీ,
శతయోజనవిస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్. 72

ప్ర. అ. తతః=అటుపిమ్మట, బలీ=బలశాలి యైన, హనుమాన్=హనుమంతుడు, సంపాతేః=సంపాతి యను పేరు గల, గృధ్రస్య=గ్రద్దయొక్క, వచనాత్=మాటవలన, శతయోజనవిస్తీర్ణమ్=నూరు యోజనముల వెడల్పు గల, లవణార్ణవమ్=లవణసముద్రమును, పుప్లువే=దాటెను.

తా. మహాబలశాలి యగు హనుమంతుడు సంపాతి యనెడు గ్రద్ధచెప్పిన ప్రకారము నూరు యోజనముల వెడల్పు గల లవణసముద్రమును దాటెను. 72

మూ. తత్ర లఙ్కాం సమాసాద్య పురీం రావణపాలితామ్,
దదర్శ సీతాం ధ్యాయన్తీమశోకవనికాం గతామ్. 73

ప్ర. అ. రావణపాలితామ్=రావణునిచే పాలింపబడిన, లఙ్కామ్=లంక అనెడు, పురీమ్=పట్టణమును, సమాసాద్య=చేరి, తత్ర=ఆ లంకాపురియందు, అశోకవనికాం గతామ్ = అశోకవనములో నున్న, ధ్యాయన్తీమ్ = (రామునే) ధ్యానము చేయుచున్న, సీతామ్=సీతను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు రావణుడు పాలించుచున్న లంకాపురము చేరి, అచట అశోకవనములో రామునే ధ్యానించుచు ఉన్న సీతాదేవిని చూచెను. 73

మూ. నివేదయిత్వాభిజ్ఞానం ప్రవృత్తిం చ నివేద్య చ,
సమాశ్వాస్య చ వైదేహీం మర్దయామాస తోరణమ్. 74

ప్ర.అ. అభిజ్ఞానమ్=గుర్తును, నివేదయిత్వా=సమర్పించి, ప్రవృత్తిం చ= వృత్తాంతమును, నివేద్య చ=విన్నవించి, వైదేహీమ్=సీతాదేవిని, సమాశ్వాస్య= ఓదార్చి, తోరణమ్=బహిర్ద్వారమును, మర్దయామాస=చూర్ణము చేసెను.

తా. హనుమంతుడు, తన చేతికి రాము డిచ్చిన అంగుళీయకమును సీతాదేవికి గుర్తుగా ఇచ్చి, సుగ్రీవునితో రామునకు మైత్రి కలుగుట మొదలగు వృత్తాంతమును విన్నవించి, ఆమెను ఊరడించి, అశోకవనబహిర్ద్వారమును చూర్ణము చేసెను. 74

మూ. పఞ్చ సేనాగ్రగాన్ హత్వా సప్త మన్త్రిసుతానపి,
శూరమక్షం చ నిష్పిష్య గ్రహణం సముపాగమత్. 75

ప్ర. అ. పఞ్చ=ఐదుగురు, సేనాగ్రగాన్ = సేనానాయకులను, సప్త= ఏడుగురు, మన్త్రిసుతానపి=మంత్రికుమారులను, హత్వా=చంపి, శూరమ్= శూరుడైన, అక్షం చ=అక్షుని, నిష్పిష్య=ముద్దచేసి, గ్రహణమ్=బంధనమును, సముపాగమత్=పొందెను.

తా. హనుమంతుడు సేనాపతుల నైదుగురిని, మంత్రిపుత్రులను ఏడుగురిని చంపి, శూరు డైన అక్షకుమారుని వధించి, ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్ర మునకు కట్టువడెను. 75

మూ. అస్త్రేణోన్ముక్తమాత్మానం జ్ఞాత్వా పైతామహాద్వరాత్,
మర్షయ న్రాక్షసాన్వీరో యన్త్రిణస్తాన్యదృచ్ఛయా, 76
తతో దగ్ధ్వా పురీం లఙ్కామృతే సీతాం చ మైథిలీమ్,
రామాయ ప్రియమాఖ్యాతుం పునరాయాన్మహాకపిః. 77

ప్ర. అ. వీరః=వీరుడైన, మహాకపిః=హనుమంతుడు, పైతామహాత్=బ్రహ్మ ఇచ్చిన, వరాత్ = వరమువలన, ఆత్మానమ్ = తనను, అస్త్రేణ=బ్రహ్మాస్త్రముచే, ఉన్ముక్తమ్ = విడువబడినవానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, యదృచ్ఛయా=మరి యొక కార్యమునందలి అపేక్షచేత, యన్త్రిణః = తనను త్రాటిచే కట్టిన, తాన్=ఆ, రాక్షసాన్=రాక్షసులను, మర్షయన్=సహించుచు, తతః=ఆ కార్య మైన తరువాత, మైథిలీమ్ సీతామ్ ఋతే=సీత తప్ప మిగిలిన, లఙ్కాం పురీమ్=లంకాపట్టణమును, దగ్ధ్వా=కాల్చి, రామాయ = రామునకు, ప్రియం = సంతోషవార్తను, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, పునః = మరల, ఆయాత్=వచ్చెను.

తా. పరాక్రమశాలి యగు హనుమంతుడు, పూర్వము బ్రహ్మదేవుడు తన కిచ్చిన వరముల ప్రభావమువలన, తనను బ్రహ్మాస్త్రబంధము వదలిపోయి నట్లు తెలిసినను, తనను త్రాళ్లచే కట్టి ఈడ్చుకొని పోవుచున్న రాక్షసులను వధించుటకు సమర్థు డైనను, రావణుని చూడ గోరి, ఆ రాక్షసుల బాధలను సహించెను. రావణునితో మాట లాడిన పిమ్మట సీతాదేవి నివసించు ప్రదేశము తప్ప లంకాపురి నంతయు కాల్చి, రామున కీ సంతోషవార్త చెప్పుటకై మరల రాముని సమీపమునకు వెళ్లెను. 76-77

మూ. సోఽభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణమ్,
న్యవేదయదమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః. 78

ప్ర. అ. అమేయాత్మా=లెక్కింపరాని బుద్ధి గల, సః=ఆ హనుమంతుడు,

మహాత్మానమ్=గొప్ప ధైర్యము గల, రామమ్=రాముని, అభిగమ్య=పొంది, ప్రదక్షిణమ్=ప్రదక్షిణము, కృత్వా = చేసి, సీతా=సీతాదేవి, దృష్టా=చూడ బడినది, ఇతి=ఇట్లని, తత్త్వతః=యథార్థముగా, న్యవేదయత్=తెలిపెను.

తా. అతిబుద్ధిశాలి యగు హనుమంతుడు, సీతావియోగము కలిగినను ఎంతమాత్రము ధైర్యము తగ్గని రామునివద్దకు వెళ్లి, ఆతనికి ప్రదక్షిణ నమస్కారము చేసి, "చూచితిని సీతను" అని యథార్థముగా విన్నవించెను.

వి. "సీతా దృష్టా" (సీతాదేవి చూడబడినది) అని చెప్పదగి ఉన్నను అట్లు చెప్పక "దృష్టా సీతా" (చూడబడినది సీత) అని చెప్పెను. 'సీతా' అని ఉచ్చరించినంత మాత్రముననే, పై పదము నుచ్చరించుటకు ముందు "సీత బ్రతికి యున్నదో లేదో; చూడబడినదో లేదో" అను అమంగళకర మగు శంక రామునకు కలుగకుండవలె నని అట్లు చెప్పెను. 78

అవ. యుద్ధకాండకథ చెప్పబడుచున్నది—

మూ. తతః సుగ్రీవసహితో గత్వా తీరం మహోదధేః,
సముద్రం క్షోభయామాస శరైరాదిత్యసన్నిభైః. 79

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సుగ్రీవసహితః=సుగ్రీవునితో కూడినవాడై, మహోదధేః = మహాసముద్రముయొక్క, తీరమ్ = తీరమును, గత్వా=చేరి, ఆదిత్యసన్నిభైః=సూర్యునితో సమాన మైన, శరైః=బాణములచే, సముద్రమ్=సముద్రుని, క్షోభయామాస=క్షోభింపచేసెను.

తా. సుగ్రీవునితో కలిసి రాముడు సముద్రతీరము చేరి, సముద్రుడు తనకు వశము కానందులకు కోపించి, సూర్యుని వలె తీక్ష్ణము లైన బాణములచే సముద్రుని క్షోభింపచేసెను. 79

మూ. దర్శయామాస చాత్మానం సముద్రః సరితాం పతిః,
సముద్రవచనాచ్చైవ నలం సేతుమకారయత్. 80

ప్ర. అ. సరితాం పతిః=నదులకు ప్రభు వైన, సముద్రః=సముద్రుడు, ఆత్మానమ్=తనరూపమును, దర్శయామాస=చూపించెను. (రాముడు), సముద్ర

వచనాచ్చైవ=సముద్రుని మాటప్రకారమే, నలమ్=నలుని (చేత), సేతుమ్ = సేతువును, అకారయత్=చేయించెను.

తా. నదులకు పతి యైన సముద్రుడు రాముని కోపమునకు భయపడి నిజ రూపముతో కనబడి చెప్పగా, అతని మాటలప్రకారము రాముడు నీలునిచే సేతువు కట్టించెను. 80

మూ. తేన గత్వా పురీం లఙ్కాం హత్వా రావణమాహవే,
రామః సీతా మనుప్రాప్య పరాం వ్రీడాముపాగమత్. 81

ప్ర. అ. రామః=రాముడు, తేన=ఆ సేతువుచే, లఙ్కాం పురీమ్=లంకా పట్టణమును, గత్వా=పొంది, ఆహవే=యుద్ధమునందు, రావణమ్=రావణుని, హత్వా = చంపి, సీతామ్ = సీతను, ప్రాప్య = పొంది, అను = అటుపిమ్మట, పరామ్=అధికమైన, వ్రీడామ్=సిగ్గును, ఉపాగమత్=పొందెను.

తా. రాముడు ఆ సేతుమార్గమున లంకలోనికి ప్రవేశించెను. యుద్ధము నందు రావణుని సంహరించెను. సీతను పొంది, "పరగృహములో చాలకాలము వసించిన భార్యను ఎట్లు పరిగ్రహింతును ?" అని చాల సిగ్గుపడెను. 81

మూ. తాముువాచ తతో రామః పరుషం జనసంసది,
అమృష్యమాణా సా సీతా వివేశ జ్వలనం సతీ. 82

ప్ర. అ. తతః = ఆకారణమువలన, రామః = రాముడు, జనసంసది= జనుల సమూహములో, తామ్=ఆ సీతనుగూర్చి (తో), పరుషమ్=పరుషముగా, ఉవాచ=పలికెను, సతీ=పతివ్రతయైన, సా సీతా=ఆ సీతాదేవి, అమృష్యమాణా= సహింపజాలనిదై, జ్వలనమ్=అగ్నిని, వివేశ=ప్రవేశించెను.

తా. ఆ కారణమువలన రాముడు జను లందరిలోను, సీతతో పరుషముగా మాటలాడెను. మహాపతివ్రత యగు ఆ సీతాదేవి ఆ మాటలను సహింపజాలక అగ్నిలో ప్రవేశించెను. 82

మూ. తతోఽగ్నివచనాత్సీతాం జ్ఞాత్వా విగతకల్మషామ్,
బభౌ రామః సంప్రహృష్టః పూజితః సర్వదైవతైః. 83

ప్ర. అ. తతః=పిమ్మట, రామః=రాముడు, అగ్నివచనాత్=అగ్ని మాట వలన, సీతామ్=సీతను, విగతకల్మషామ్=పాపములు లేనిదానినిగా, జ్ఞాత్వా= తెలిసికొని, సంప్రహృష్టః=సంతసించినవాడై, సర్వదైవతైః = సమస్తదేవతల చేతను, పూజితః=పూజింపబడినవాడై, బభౌ=ప్రకాశించెను.

తా. "సీత ఎట్టిపాపమును లేనిది" అని అగ్ని చెప్పగా రాముడు చాల సంతసించెను. దేవతలు పూజింపగా ప్రకాశించెను. 83

మూ. కర్మణా తేన మహతా త్రైలోక్యం సచరాచరమ్,
సదేవర్షిగణం తుష్టం రాఘవస్య మహాత్మనః. 84

ప్ర. అ. మహాత్మనః = గొప్ప ధైర్యము గల, రాఘవస్య = రాముని యొక్క, మహతా=గొప్పదైన, తేన కర్మణా=ఆ పనిచేత, సచరాచరమ్ = జంగమస్థావరములతో కూడినదియు, సదేవర్షిగణమ్ = దేవగణములతోడను మహర్షిగణములతోడను కూడిన, త్రైలోక్యమ్=లోకత్రయము, తుష్టమ్=సంత సించినది.

తా. మహాత్ముడైన రాముడు లోకకంటకుడైన రావణుని చంపుటచే స్థావరజంగమాత్మకములైన మూడు లోకములును, దేవతాఋషిగణ సహితముగా సంతోషించినవి.

వి. "అన్తఃసంజ్ఞా భవన్త్యేతే" (స్థావరములైన ఈ వృక్షాదులకు కూడ సూక్ష్మమైన సంజ్ఞ ఉండును) అని విష్ణుపురాణమునందు చెప్పినట్లు వృక్షాదిస్థావర ములు కూడ తమ సంతోషమును చిగిరించుట మొదలగు వానిచే సూచించును. (తిలకవ్యాఖ్య). 84

మూ. అభిషిచ్య చ లఙ్కాయాం రాక్షసేన్ద్రం విభీషణమ్,
కృతకృత్య స్తతో రామో విజ్వరః ప్రముమోద హ. 85

ప్ర. అ. రామః=రాముడు, విభీషణమ్ = విభీషణుని, రాక్షసేన్ద్రమ్= రాక్షసరాజునుగా, లఙ్కాయామ్=లంకయందు, అభిషిచ్య=అభిషేకముచేసి, తదా = అప్పుడు, కృతకృత్యః = ప్రతిజ్ఞారూపకార్యమును నిర్వర్తించినవాడై,

విగతజ్వరః=పోయిన సంతాపముగలవాడై, ప్రముమోద=సంతోషించెను, హ=ఆశ్చర్యము.

తా. రాముడు పూర్వము విభీషణుని సముద్రతీరమున అభిషిక్తుని చేసెను. ఇపుడు లంకాపురిలో కూడ విభీషణుని రాక్షసరాజునుగా అభిషిక్తుని చేసి, కృత కృత్యు డయ్యెను. తన ప్రతిజ్ఞ నెరవేరునో లేదో అను చింత తొలగిపోయెను. రాముని సత్యవ్రత మత్యాశ్చర్యకరము కదా!

అర్థాంతరము — విజ్వరః=పక్షి యైన జటాయువు విషయమునందు మాత్రమే సంతాపముకలవాడై, సంతోషించెను.

రాముడు తన ప్రతిజ్ఞ ప్రకారము విభీషణుని లంకాపురిలో అభిషిక్తుని చేసెను. కాని ఒక కొడుకు చనిపోయిన తండ్రి మరి యొక కొడుకునకు జరుగు ఉత్సవకాలమునందు సంతోషముతో నిండియున్నను చనిపోయిన కొడుకును తలచుకొని దుఃఖించు నట్లు రాజ్యాభిషేకము పొందకుండగనే చనిపోయిన జటాయువును తలచుకొని దుఃఖించుచు, ప్రతిజ్ఞ నెరవేరినందులకు సంతసించెను. 85

మూ. దేవతాభ్యో వరం ప్రాప్య సముత్థాప్య చ వానరాన్,
అయోధ్యాం ప్రస్థితో రామః పుష్పకేణ సుహృద్వృతః. 86

ప్ర. అ. రామః = రాముడు, దేవతాభ్యః = దేవతలనుండి, వరమ్ = వరమును, ప్రాప్య = పొంది, వానరాన్ = వానరులను, సముత్థాప్య చ = లేపి, సుహృద్వృతః=మిత్రులతో కూడినవాడై, పుష్పకేణ=పుష్పక మను విమానముచే, అయోధ్యామ్=అయోధ్యను గూర్చి, ప్రస్థితః=ప్రయాణ మాయెను.

తా. రాముడు తనను చూడ వచ్చిన దేవతలనుండి వరమును పొందెను. దాని ప్రకారము మృతు లైన వానరుల నందరిని బ్రతికించుకొనెను. స్నేహితులతో కూడి, పుష్పక విమానారూఢుడై అయోధ్యకు బయలుదేరెను. 86

మూ. భరద్వాజాశ్రమం గత్వా రామః సత్యపరాక్రమః,
భరతస్యాన్తికం రామో హనూమన్తం వ్యసర్జయత్. 87

ప్ర. అ. సత్యపరాక్రమః = సత్యమునందు స్థిరత్వము గల, రామః=సకలజనమనోహరు డైన, రామః=రాముడు, భరద్వాజాశ్రమమ్ = భరద్వాజుని

ఆశ్రమమును గూర్చి, గత్వా=వెళ్లి, హనూమన్తమ్=హనుమంతుని, భరతస్యాన్తి కమ్=భరతుని దగ్గరకు, వ్యసర్జయత్=పంపెను.

తా. సత్యమునందు స్థిరముగ నిలచువాడును, లోకాభిరాముడును అగు రాముడు భరద్వాజాశ్రమమునకు వెళ్లెను. హనుమంతుని భరతుని వద్దకు పంపెను. 87

మూ. పునరాఖ్యాయికాం జల్పన్ సుగ్రీవసహితశ్చ సః,
పుష్పకం తత్సమారుహ్య నన్దిగ్రామం యయౌ తదా. 88

ప్ర. అ. పునః=మరల, సుగ్రీవసహితః=సుగ్రీవునితో కూడిన, సః=ఆ రాముడు, ఆఖ్యాయికామ్ = పూర్వవృత్తాంతమును, జల్పన్=చెప్పుచు, తదా= అప్పుడు, నన్దిగ్రామమ్=నందిగ్రామమును, యయౌ=పొందెను.

తా. ఆ రాముడు సుగ్రీవవిభీషణాదులతో కూడి, పూర్వవృత్తాంతములను చెప్పుకొనుచు నందిగ్రామమునకు వెళ్లెను. 88

మూ. నన్దిగ్రామే జటాం హిత్వా భ్రాతృభిః సహితోఽనఘః,
రామః సీతామనుప్రాప్య రాజ్యం పునరవాప్తవాన్. 89

ప్ర. అ. అనఘః=పాపరహితుడైన, రామః=రాముడు, నన్దిగ్రామే= నందిగ్రామమునందు, భ్రాతృభిః = సోదరులతో, సహితః = కూడినవాడై, జటామ్=జడను, హిత్వా=విడచి, సీతామ్ = సీతాదేవిని, అనుప్రాప్య = పొంది, పునః=తిరిగి, రాజ్యమ్=రాజ్యమును, అవాప్తవాన్=పొందెను.

తా. ఎట్టి పాపములును లేని ఆ రాముడు నందిగ్రామమున సోదరుల నందరిని కలిసెను. వారందరును జటలను విడచిరి. మునివేషమును విడచుటచే సీతతో గార్హస్థ్యమును అవలంబించెను. మరల రాజ్యమును పొందెను. 89

మూ. ప్రహృష్టముదితో లోకస్తుష్టః పుష్టః సుధార్మికః,
నిరామయో హ్యరోగశ్చ దుర్భిక్షభయవర్జితః. 90

ప్ర. అ. లోకః = లోకము, ప్రహృష్టముదితః = గగుర్పాటు కలిగి సంతసించినది, తుష్టః=కోరిక తీరుటచే ప్రీతి చెందినది. పుష్టః=సంతోషముచే వృద్ధి

పొందిన శరీరము కలదైనది. సుధార్మికః=ధర్మతత్పరమై ఉన్నది. నిరామయః= పీడలులేనిదైనది. అరోగః=వ్యాధులులేనిదైనది. దుర్భిక్షభయవర్జితః = క్షామము వలన కలుగు భయము లేనిదిగా అయినది.

తా. రాముడు రాజ్యాభిషిక్తుడు కాగా, లోక మంతయు సంతోషాతిశయముచే గగుర్పాటు చెందెను. రాముడు రాజు కావలె ననెడు తమ కోరిక తీరుటచే ప్రజ లెల్లరు ప్రీతి చెందిరి. ఆనందాతిశయముచే స్థావర జంగమాత్మక మగు లోకము యొక్క శరీరము వృద్ధి చెందినది. ప్రజలందరును చక్కగా ధర్మము నాచరించుచుండిరి. లోకమందు పీడలు, వ్యాధులు, దుర్భిక్షముల భయము తొలగి పోయెను. 90

అ వ. ఉత్తరకాండకథను చెప్పుచున్నాడు—

మూ. న పుత్రమరణం కించిద్ద్రక్ష్యన్తి పురుషాః క్వచిత్,
నార్యశ్చావిధవా నిత్యం భవిష్యన్తి పతివ్రతాః. 91

ప్ర. అ. పురుషాః=పురుషులు, క్వచిత్=ఎక్కడను, కించిత్ = కొంచెమైనను, పుత్రమరణమ్=పుత్రమరణమును, న ద్రక్ష్యన్తి = చూడరు. నార్యశ్చ = స్త్రీలు కూడ, అవిధవాః=వైధవ్యము లేనివారై, నిత్యమ్=నిత్యము, పతివ్రతాః= పతివ్రతలు, భవిష్యన్తి=కాగలరు.

తా. రాముడు రాజ్యము చేయుచున్నపుడు తండ్రి యుండగా పుత్రుడు మరణించడు. స్త్రీలకు వైధవ్యదుఃఖము ఉండదు. వారు సర్వదా పతివ్రతలై యుందురు. 91

మూ. న చాగ్నిజం భయం కించిన్నాప్సు మజ్జన్తి జన్తవః,
న వాతజం భయం కించిన్నాపి జ్వరకృతం తథా, 92
న చాపి క్షుద్భయం తత్ర న తస్కరభయం తథా.

ప్ర. అ. తత్ర=ఆ రామరాజ్యమందు, అగ్నిజమ్=అగ్నివలన కలిగిన భయమ్=భయము, కించిత్ = కొంచెమైనను, న = లేదు, జన్తవః = ప్రాణులు, అప్సు = నీటిలో, న మజ్జన్తి = మునిగి మరణించవు. వాతజమ్ = వాయువువలన కలుగు, భయమ్ = భయము, కించిత్ = కొంచెమైనను, న = లేదు. తథా = మరియు, జ్వరకృతమ్ అపి = జ్వరము వలన కలుగు భయము కూడ, న = లేదు.

క్షుద్భయమ్ అపి = ఆకలివలన భయము కూడ, న = లేదు. తథా = మరియు, తస్కరభయమ్ = దొంగల భయము, న = లేదు.

తా. రాముని రాజ్యములో అగ్ని భయము కాని, జల భయము కాని, వాత భయము కాని, జ్వర భయము కాని, క్షుద్బాధ కాని, చోరభయము కాని లేదు. 92

మూ. నగరాణి చ రాష్ట్రాణి ధనధాన్యయుతాని చ,
నిత్యం ప్రముదితాః సర్వే యథా కృతయుగే తథా. 93

ప్ర. అ. నగరాణి చ = నగరములును, రాష్ట్రాణి చ = రాష్ట్రములును, ధన ధాన్యయుతాని = ధన ధాన్యములతో నిండినవి. సర్వే = అందరును, కృత యుగే = కృతయుగమునందు, యథా = ఎట్లో, తథా = అట్లే, నిత్యమ్ = ఎల్లప్పుడును, ప్రముదితాః = సంతోషముతో నున్నారు.

తా. నగరములు, దేశములు కూడ, ధనధాన్యసమృద్ధములై ఉన్నవి. కృతయుగములో వలెనే ప్రజ లందరును సంతోషవంతులై యున్నారు. 93

మూ. అశ్వమేధశతైరిష్ట్వా తథా బహుసువర్ణకైః, 94
గవాం కోట్యయుతం దత్త్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి.
అసంఖ్యేయం ధనం దత్త్వా బ్రాహ్మణేభ్యో మహాయశాః. 95

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల రాముడు, అశ్వమేధశతైః = వందలాది అశ్వమేధయాగములచేతను, తథా = మరియు, బహుసువర్ణకైః = బహుసువర్ణకము లనెడు యాగములచేతను, ఇష్ట్వా = దేవతలను తృప్తి పొందించి, గవామ్ = గోవులయొక్క, కోట్యయుతమ్ = పదివేల కోట్లను, అసంఖ్యేయమ్ = లెక్కింపరాని, ధనమ్ = ధనమును, బ్రాహ్మణేభ్యః = బ్రాహ్మణులకు, దత్త్వా = ఇచ్చి, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి (బ్రహ్మయగు తన స్థానమునకు), ప్రయాస్యతి = వెళ్లగలడు.

తా. గొప్ప కీర్తి గల రాముడు వందల కొలది అశ్వమేధయాగముల చేతను, అనేక 'బహుసువర్ణక' యాగములచేతను దేవతలను పూజించి, పదివేల కోట్లగోవులను, లెక్కింప రానంత ధనమును బ్రాహ్మణుల కిచ్చి, శాశ్వత మగు తన స్థానమును పొందగలడు.

వి. "సుబహూని సువర్ణాని యత్రోపకరణత్వతః, విద్యన్తే స క్రతుః సద్భిః స్మృతో బహుసువర్ణకః". (ఏ యాగమునందు మిక్కిలి అధిక మైన సువర్ణము ఉపకరణముగా అనగా సాధనముగా ఉండునో దానికి బహుసువర్ణక మని పేరు) అను ప్రమాణమును బట్టి బహుసువర్ణక మనగా అధికముగా బంగారము దానము చేయు యాగ మని అర్థము.

"మహాయశాః" అను పదముచే స్వల్ప మగు అపవాదమునకై సీతాదేవిని విడిచి పెట్టుట సూచిత మగుచున్నది (గోవిందరాజులు). 94-95

మూ. రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః,
చాతుర్వర్ణ్యం చ లోకేఽస్మిన్ స్వే స్వే ధర్మే నియోక్ష్యతి. 96

ప్ర. అ. రాఘవః = రాముడు, అస్మిన్ లోకే = ఈ లోకమునందు, శతగుణాన్ = వందరెట్లు, రాజవంశాన్ = రాజవంశములను, స్థాపయిష్యతి = స్థాపింపగలడు, చాతుర్వర్ణ్యమ్ = నాలుగు వర్ణములను, స్వే స్వే ధర్మే = తమ తమ ధర్మమునందు, నియోక్ష్యతి = ప్రవర్తింపచేయగలడు.

తా. రాముడు క్షత్రియులకు రాజ్యము లిచ్చి నూరింతలుగా వారి వంశములను వృద్ధి పొందింపగలడు. నాలుగు వర్ణములవారిని వారి వారి ధర్మములాచరించు నట్లు నియమించగలడు. 96

మూ. దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ.
రామో రాజ్యముపాసిత్వా బ్రహ్మలోకం గమిష్యతి. 97

ప్ర. అ. రామః = రాముడు, దశవర్షసహస్రాణి = పదివేల సంవత్సరములు, దశవర్షశతాని చ = పదివందల సంవత్సరములు, రాజ్యమ్ = రాజ్యమును, ఉపాసిత్వా = సేవించి, బ్రహ్మలోకమ్ = బ్రహ్మయైన విష్ణువుయొక్క లోకమును, గమిష్యతి = పొందగలడు.

తా. రాముడు పదకొండు వేల సంవత్సరముల పాటు రాజ్యమును ప్రజలకు సుఖము కలుగు నట్లు పాలించి, బ్రహ్మలోకమును చేరగలడు. 97

మూ. ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్,
యః పఠేద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే. 98

ప్ర. అ. పవిత్రమ్ = పరిశుద్ధిని కలిగించు నదియు, పాపఘ్నమ్ = పాపములను నశింపచేయునదియు, పుణ్యమ్ = పుణ్యమును చేయునదియు, వేదైః = వేదములతో, సమ్మితం చ = సమాన మైనదియు, అగు, రామచరితమ్ = రామచరితమును, యః = ఎవడు, పఠేత్ = చదువునో, అతడు, సర్వపాపైః = సమస్తపాపములచే, ప్రముచ్యతే = విముక్తు డగును.

తా. రామచరిత్ర పరిశుద్ధిని కలిగించును. పాపములను నశింపచేయును. పుణ్యములను ఇచ్చును. ఇది వేదముతో సమానము. దీనిని చదువువాని సర్వ పాపములును తొలగిపోవును. 98

మూ. ఏతదాఖ్యానమాయుష్యం పఠన్రామాయణం నరః,
సపుత్రపౌత్రః సగణః ప్రేత్య స్వర్గే మహీయతే. 99

ప్ర. అ. ఆయుష్యమ్ = ఆయుర్దాయమును వృద్ధి పొందించు నదియు, ఆఖ్యానమ్ = వాస్తవార్థము కలదియు అగు, ఏతత్ = ఈ, రామాయణమ్ = రామచరిత్రమును, పఠన్ = చదువుచున్న, నరః = మనుష్యుడు, సపుత్రపౌత్రః = పుత్రపౌత్రులతో కూడినవాడై, సగణః = భృత్యబంధుసమూహముతో కూడిన వాడై, భోగములను అనుభవించి, ప్రేత్య = మరణించి (మరణానంతరము), స్వర్గే = స్వర్గమునందు, మహీయతే = పూజింపబడును.

తా. రామాయణ మనెడు ఈ ఆఖ్యానము ఆయుర్దాయమును వృద్ధి పొందించును. దీనిని చదువువాడు పుత్రపౌత్రాదులతోను, భృత్యబంధుగణములతోను కూడి సర్వసౌఖ్యములను అనుభవించి, మరణానంతరము స్వర్గమునందు దేవతల చేత పూజింపబడును.

వి. "రామాయణమ్" రామస్య అయనమ్ = రాముని చరిత్రము. 'అయనమ్" అనునది "అయ గతౌ" అను ధాతువునుండి నిష్పన్న మైనది. 99

మూ. పఠన్ ద్విజో వాగృషభత్వమీయాత్,
స్యాత్ క్షత్రియో భూమిపతిత్వమీయాత్,
వణిగ్జనః పణ్యఫలత్వమీయాత్
జనశ్చ శూద్రోఽపి మహత్త్వమీయాత్. 100

ప్ర. అ. పఠన్ = ఈ రామాయణము చదువు, జనః = మనుష్యుడు, ద్విజః స్యాత్ = బ్రాహ్మణు డైనట్లైతే, వాగృషభత్వమ్ = అష్టాదశ విద్యలచే శ్రేష్ఠత్వమును, ఈయాత్ = పొందును. క్షత్రియః = క్షత్రియుడైనట్లైతే, భూమిపతిత్వమ్ = భూమండలమునకు ఆధిపత్యమును, ఈయాత్ = పొందును. వణిగ్జనః = వైశ్యు డైనట్లైతే, పణ్యఫలత్వమ్ = అమ్మెడి వస్తువుల నుండి లాభమును, ఈయాత్ = పొందును, శూద్రోఽపి చ = శూద్రు డైనట్లైతే, మహత్త్వమ్ = గొప్పతనమును, ఈయాత్ = పొందును.

తా. ఈ రామాయణమును బ్రాహ్మణుడు పఠించినచో అష్టాదశవిద్యలందును ప్రావీణ్యమును పొందును. క్షత్రియుడు పఠించినచో భూమండలాధిపతి యగును. వైశ్యుడు పఠించినచో వ్యాపారమునందు లాభమును పొందును. శూద్రుడు పఠించినచో గొప్పవా డగును. 100

మూ. ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే,
సంక్షేపో నామ ప్రథమః సర్గః

ప్ర. అ. ఇట్లు, ఆర్షే = ఋషిప్రోక్తమైన, రామాయణే = రామాయణమనెడు, ఆదికావ్యే = ఆదికావ్యమునందలి, బాలకాణ్డే = బాలకాండమునందు, సంక్షేపో నామ = సంక్షేప మని ప్రసిద్ధి గల, ప్రథమః = మొదటి, సర్గః = సర్గ, (సమాప్తః = సమాప్తము).

తా. ఇట్లు ఋషి ప్రోక్త మైన, రామాయణ మను ఆదికావ్యమునందలి బాలకాండమునందు, రామాయణ కథాసంక్షేపరూపమైన ప్రథమసర్గము ముగిసినది.

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు, బాలకాండలో ప్రథమసర్గ సమాప్తము.

అథ ద్వితీయః సర్గః

మూ. నారదస్య తు తద్వాక్యం శ్రుత్వా వాక్యవిశారదః,
పూజయామాస ధర్మాత్మా సహశిష్యో మహామునిః. 1

ప్ర. అ. నారదస్య = నారదునియొక్క, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా తు = వినినంతనే, వాక్యవిశారదః = వాక్యములయందు పండితుడును, ధర్మాత్మా = ధర్మమందు బుద్ధి గలవాడును అగు, మహామునిః = వాల్మీకి మహాముని, సహశిష్యః = శిష్యులతో కూడినవాడై, పూజయామాస = పూజించెను.

తా. వాల్మీకిమహాముని ధర్మబుద్ధి కలవాడు; వాక్యముల విశేషము తెలిసినవాడు. అందుచే నారదుడు చెప్పిన సంక్షేపరామాయణ రూప మగు వాక్యమును వినినంతనే దానిని శ్లాఘించెను. ఆయన శిష్యులు కూడ శ్లాఘించిరి.

విశేషార్థము — వాక్యవిశారదః = వాక్యరూపము లగు సమస్తశాస్త్రములందును పండితుడును, ధర్మాత్ముడును అగు వాల్మీకి, నారదస్య—"నరతీతి నరః ప్రోక్తః పరమాత్మా సనాతనః" (సనాతను డగు పరమాత్మ ప్రపంచముయొక్క సృష్టిస్థితిలయములను నడిపించును గాన నరు డని చెప్పబడుచున్నాడు) అను ప్రమాణమును పట్టి 'నరః' అనగా పరమాత్మ, "నరసంబన్ధి నారమ్"—పరమాత్మకు సంబంధించిన జ్ఞానము నారము. "నారం దదాతీతి నారదః —పరమాత్మకు సంబంధించిన జ్ఞానమును ఇచ్చువాడు నారదుడు. ఆశ్రితులకు బ్రహ్మోపదేశము చేయు అట్టి నారదుని యొక్క, తత్ = ఆ వేదాంత ప్రసిద్ధ మైన, వాక్యమును, వినినంతనే, మహామునిః = గొప్ప బ్రహ్మానుసంధానము చేయువాడై, శిష్యులతో కూడిన వాడై, పూజయామాస = శ్లాఘించెను (అని ప్రాచీనులు).

తా. సమస్త శాస్త్రార్థములు తెలిసికొని జ్ఞానమును కలిగించు కర్మల అనుష్ఠానము చేయుచున్న వాల్మీకి మహర్షి, బ్రహ్మోపదేశాచార్యు డైన నారద మహర్షి ఉపదేశించిన వేదాంతార్థములు వినినంతనే తాను బ్రహ్మానుభవమును పొందుటయే కాక శిష్యులకు కూడ ఆ అర్థమును ఉపదేశించి శిష్యులతో కూడినవాడై యెల్లప్పుడును ఆ వేదాంతపరమార్థానందమునే అనుభవించుచుండెను. 1

మూ. యథావత్పూజితస్తేన దేవర్షిర్నారద స్తథా,
ఆపృష్ట్వైవాభ్యనుజ్ఞాతస్స జగామ విహాయసమ్. 2

ప్ర. అ. దేవర్షిః = దేవతయును ఋషియును అయిన, సః = ఆ, నారదః = నారదుడు, తేన = ఆ వాల్మీకిచేత, తథా=అట్లు, యథావత్ = యథాయోగ్యముగ, పూజితః = పూజింపబడినవాడై, ఆపృష్ట్వైవ = ఆ వాల్మీకిని సంతోషపరచియే, అభ్యనుజ్ఞాతః = అనుజ్ఞను పొందినవాడై, విహాయసమ్ = ఆకాశమును, జగామ = పొందెను.

తా. దేవర్షి యైన నారదుడు వాల్మీకిచే యథోచితముగా పూజింపబడినవాడై, ఆ వాల్మీకిని ఆలింగనాదులచే సంతోషపరచి, వారి అనుజ్ఞ పొంది, ఆకాశ మార్గమున దేవలోకమునకు వెళ్లెను.

విశేషార్థము :— దేవర్షిః = దేవతలలో జ్ఞానపారంగతు డైన, ('ఋషి' శబ్దము "ఋషీ గతౌ" అను ధాతువునుండి నిష్పన్న మైనది). సః = ఆ (వాల్మీకికి జ్ఞానోపదేశము చేసిన), నారదః = జ్ఞానప్రదాత యగు నారదముని, తేన = శిష్యు డైన ఆ వాల్మీకమునిచేత, యథావత్ = గురువును పూజింపవలసిన రీతిలో, పూజితః = పూజింపబడినవాడై, ఆపృష్ట్వా = సంశయముల నన్నింటిని తీర్చుటచే సంతోషపరచి, అభ్యనుజ్ఞాత ఏవ = అనుజ్ఞ పొందినవాడై యే, విహాయసమ్ = ఆకాశ మగుటను (భావప్రధాననిర్దేశము), జగామ = పొందెను.

తా. దేవతలలో జ్ఞానపారంగతుడును, ఆశ్రితులకు జ్ఞానము ఇచ్చు వాడును అగు నారదమహాముని, వాల్మీకికి వేదాంత పరమార్థోపదేశము చేసి, ఆ వాల్మీకినుండి గురుపూజను పొంది, అతనికి గల సమస్త సంశయములను తీర్చి, సంతోషపరచెను. వాల్మీకికి పరమార్థోపదేశము చేయుటకు మాత్రమే నారదుడు గురుత్వాభిమానమును కల్పించుకున్నవాడు గాన ఆ యభిమానము కల్పితము. ఉపదేశానంతరము శాశ్వత మగు నిరభిమానత్వమే సిద్ధము. జ్ఞానోప దేశానంతరము వాల్మీకికి గల శిష్యత్వాభిమానము, నారదుని కున్న గురుత్వాభి మానము రెండును నశించుటవలన, మరల ఆకాశమువలె నిర్వికల్ప మగు తన స్వరూపమును పొందెను. 2

మూ. స ముహూర్తం గతే తస్మిన్ దేవలోకం మునిస్తదా,
జగామ తమసాతీరం జాహ్నవ్యాస్త్వవిదూరతః. 3

ప్ర. అ. తస్మిన్= ఆ నారదుడు, ముహూర్తమ్ = అల్పకాలములో, దేవలోకమ్=బ్రహ్మలోకమును, గతే=పొందగా, తదా=అప్పుడు, మునిః తు = వాల్మీకిమహాముని, జాహ్నవ్యాః = గంగానదికి, అవిదూరతః = సమీపమున నున్న, తమసాతీరమ్=తమసానది గట్టును, జగామ=పొందెను.

విశేషార్థములు :— తస్మిన్ = తన గురు వైన నారద మహాముని, ముహూర్తమ్=అల్పకాలమునందే, దేవలోకమ్=పరబ్రహ్మయొక్క స్థానమును, అనగా పరబ్రహ్మ స్వరూపమును, గతే=పొందగా, తదా=అప్పుడు, మునిః = బ్రహ్మానుసంధానము చేయు జ్ఞాని యైన వాల్మీకి, జాహ్నవ్యాః.... (ఇది వ్యాఖ్యాత్రయసారము).

తా. ఆ నారద మహాముని, వాల్మీకికి ఉపదేశించిన వెంటనే, వాల్మీకికి ఉపదేశము చేయుటకొరకు కల్పించుకొనిన గురుత్వము మొదలైన అభిమానమును వదలెను. తన యథార్థరూప మగు బ్రహ్మత్వమును పొందెను. పిదప, వాల్మీకి మహర్షి తాను బ్రహ్మవేత్త అగుటచే తనకు కర్మానుష్ఠానావశ్యకత లేకపోయినను —"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరే జనాః, స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే" (శ్రేష్ఠుడు ఏది ఆచరించునో దానినే ఇతర జనులును ఆచరింతురు. ఆ శ్రేష్ఠుడు దేనిని ప్రమాణముగా గ్రహించునో దానినే లోక మంతయు అనువర్తించును) అని గీతలో చెప్పినట్లు, ఉత్తమ మగు భృగువంశమునందు పుట్టిన వాడును, బ్రహ్మపుత్రు డైన నారదుని శిష్యుడును, జితేంద్రియు డగుటచే 'వాల్మీకి' అను సార్థక మైన నామధేయముతో ప్రసిద్ధుడును అగు తానే కర్మానుష్ఠానము చేయకున్నచో, కర్మానుష్ఠానము తప్ప మరి యొక మార్గము లేని సామాన్యజనులు కూడ కర్మానుష్ఠానమును విడచి వేయుదురు. అట్టివారు ఇటు చేయవలసిన కర్మానుష్ఠానము లేక, జ్ఞానమార్గమును అనుసరింపజాలక ఉభయభ్రష్టు లగుదురు. అందుచే అట్టి వారికి మార్గము చూపుటకై తాను కర్మానుష్ఠానమును విడువక, మాధ్యాహ్నికస్నానము చేయుటకై తమసాతీరమునకు వెళ్లెను. 3

మూ. స తు తీరం సమాసాద్య తమసాయా మహామునిః,
శిష్యమాహ స్థితం పార్శ్వే దృష్ట్వా తీర్థమకర్దమమ్. 4

ప్ర. అ. సః=ఆ, మహామునిః = వాల్మీకి, తమసాయాః=తమసానది యొక్క, తీరమ్=తీరమును, సమాసాద్య=చేరి, అకర్దమమ్=బురదలేని, తీర్థమ్=రేవును, దృష్ట్వా=చూచి, పార్శ్వే=ప్రక్కనే, స్థితమ్ = ఉన్న, శిష్యమ్=శిష్యుని గూర్చి, ఆహ=పలికెను.

తా. వాల్మీకిమహర్షి తమసానదీతీరము చేరి, బురద లేని రేవును చూచి, ప్రక్క నున్న శిష్యునితో ఇట్లు అనెను. 4

మూ. అకర్దమమిదం తీర్థం భరద్వాజ నిశామయ,
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా. 5

ప్ర. అ. భరద్వాజ=భరద్వాజుడా, సన్మనుష్యమనో యథా=సత్పురుషుని హృదయమువలె, అకర్దమమ్=బురద లేనిదియు, (హృదయపక్షమున "పాపము లేనిది" అని అర్థము), ప్రసన్నాంబు=నిర్మల మైన జలము కలదియు ("జలము వలె నిర్మల మైనదియు" అని హృదయపక్షమున అర్థము), రమణీయమ్= సుందరమైన, ఇదమ్=ఈ, తీర్థమ్=రేవును, నిశామయ=చూడుము.

తా. ఓ భరద్వాజుడా ! సత్పురుషుని హృదయము వలె నిష్పంకమై, నిర్మలజలమై, మనోహరమై ఉండు ఈ రేవును చూడుము.

విశేషార్థము — ఇచట ఉపమేయము తీర్థము. ఉపమానము సత్పురుషుని హృదయము. ఈ రెండింటికిని సాదృశ్యము అకర్దమత్వము, ప్రసన్నాంబుత్వము అను సమానధర్మములను పట్టి ఏర్పడినది. అయితే ఉపమేయపక్షమున ఈ పదములకు "బురద లేకుండుట" "నీరు నిర్మలముగ ఉండుట" యని అర్థములు. ఉపమానపక్షమున "పాపము లేకుండుట" "నీరువలె నిర్మలముగ ఉండుట" అని అర్థములు. ఈ విధముగ అర్థములో సామ్యము లేకపోయినను శబ్దసామ్యమును పట్టి—అనగా తీర్థమును అకర్దమమే, సన్మనుష్యమనస్సును అకర్దమమే; తీర్థము విమలాంబువే, సన్మనుష్యమనస్సును విమలాంబువే, అను సామ్యమును బట్టి తీర్థమును సన్మనుష్యమనస్సుతో పోల్చుట జరిగినది.

"అర్థతః శబ్దతో వాపి మనాక్కావ్యార్థసూచనమ్" (గ్రంథాదియందు అర్థమువలన గాని, శబ్దమువలన గాని కొంచెము కావ్యకథను సూచింపవలెను);

అను ఆలంకారికసరణిని అనుసరించి వాల్మీకిచే "అకర్దమమిదం తీర్థమ్" ఇత్యాదిగ్రంథ సందర్భమందు ఈ ఆదికావ్యముయొక్క కథ సూచింపబడినది. అందు "అకర్దమమిదం తీర్థమ్" అనుటచే పరిశుద్ధ మగు సముద్రసేతుస్థలము జ్ఞాపిత మైనది. (ఇది వ్యాఖ్యాత్రయసారము). 5

మూ. న్యస్యతాం కలశస్తాత దీయతాం వల్కలం మమ,
ఇదమేవావగాహిష్యే తమసాతీర్థము త్తమమ్. 6

ప్ర. అ. తాత=నాయనా! కలశః=జలపాత్రము, న్యస్యతామ్=క్రింద ఉంచబడుగాక, మమ=నాకు, వల్కలమ్=నారచీర, దీయతామ్=ఇవ్వబడుగాక, ఉత్తమమ్=శ్రేష్ఠమైన, ఇదమ్=ఈ, తమసాతీర్థమేవ=తమసానది రేవునే, అవగాహిష్యే=ప్రవేశించెదను.

తా. నాయనా! జలపాత్రను క్రింద నుంచుము. నాకు నారచీర ఇమ్ము. శ్రేష్ఠ మైన ఈ తమసాతీర్థమునందే స్నానము చేసెదను. 6

మూ. ఏవముక్తో భరద్వాజో వాల్మీకేన మహాత్మనా,
ప్రాయచ్ఛత మునేస్తస్య వల్కలం నియతో గురోః. 7

ప్ర. అ. మహాత్మనా=పూజ్యమైన మనస్సు గల, వాల్మీకేన=వాల్మీకి చేత, ఏవమ్ = ఈవిధముగా, ఉక్తః = పలుకబడిన, గురోః = గురువునకు, నియతః=విధేయు డైన, భరద్వాజః=భరద్వాజుడు, తస్య=ఆ, మునేః= వాల్మీకి మహామునికి, వల్కలమ్=నారచీరను, ప్రాయచ్ఛత=ఇచ్చెను.

తా. ఈ ప్రకారము, మహాత్ము డగు వాల్మీకి అడుగగా, గురు విధేయు డైన భరద్వాజుడు ఆ వాల్మీకికి నారచీర ఇచ్చెను. 7

మూ. స శిష్యహస్తాదాదాయ వల్కలం నియతేన్ద్రియః,
విచచార హ పశ్యంస్తత్సర్వతో విపులం వనమ్. 8

ప్ర. అ. నియతేన్ద్రియః=నిగ్రహింపబడిన ఇంద్రియములు గల, సః= ఆ వాల్మీకి, శిష్యహస్తాత్ = శిష్యుని చేతి నుండి, వల్కలమ్ = నారచీరను, ఆదాయ=తీసికొని, విపులమ్=విశాలమైన, తత్ = ఆ, వనమ్ = వనమును, సర్వతః=అంతటను, పశ్యన్=చూచుచు, విచచార హ=సంచరించెను.

తా. ఇంద్రియనిగ్రహము గల ఆ వాల్మీకి శిష్యుని చేతినుండి ఆ నార చీరను తీసికొని విశాల మైన ఆ వనమునంతను చూచుచు సంచరించెను. 8

మూ. తస్యాభ్యాశే తు మిథునం చరన్తమనపాయినమ్,
దదర్శ భగవాంస్తత్ర క్రౌఞ్చయోశ్చారునిస్వనమ్. 9

ప్ర. అ. భగవాన్=మాహాత్మ్యము గల ఆ వాల్మీకి, తత్ర = ఆ వనమునందు, తస్య=ఆ రేవునకు, అభ్యాశే=సమీపమునందు, అనపాయినమ్=ఎడబాటు లేనిదై, చరన్తమ్ = తిరుగుచున్న, చారునిస్వనమ్ = మంచి ధ్వని గల, క్రౌఞ్చయోః=క్రౌంచపక్షులయొక్క, మిథునమ్=జంటను, దదర్శ = చూచెను.

తా. శాపానుగ్రహాది మాహాత్మ్యము గల వాల్మీకి మహర్షి, ఆ వనములో, తమసాతీర్థమునకు సమీపముననే ఎడబాటు లేకుండ తిరుగుచున్న, మనోహరముగ కూయుచున్న క్రౌంచపక్షుల జంటను చూచెను.

వి. ఇచట కావ్యకథ సూచింపబడినది :—

భగవాన్=మాహాత్మ్యము గల, అనగా త్రికాలజ్ఞానము గల, వాల్మీకి మహర్షి, తస్య=ఆ సముద్రమునకు, అభ్యాశే=సమీపమునందు, తత్ర=ఆ లంకాపురియందు, చరన్తమ్=భోగములను అనుభవించుచున్నదియు, ("చర గతిభక్షణయోః" అను ధాతువునుండి నిష్పన్న మైనది), అనపాయినమ్=బ్రహ్మవరమువలన చాలకాలమునుండి అపాయము లేనిదియు, చారునిస్వనమ్=మనోహర మైన వీణానాదము కలదియు అగు, క్రౌఞ్చయోః=కుటిలు లగు రాక్షసుల ("క్రుఞ్చ గతికౌటిల్యాల్పీభావయోః" అను ధాతువునుండి నిష్పన్న మైనది), మిథునమ్=జంటను, దదర్శ = తెలిసికొనెను (గోవిందరాజులు).

తా. సముద్రతీరమునం దున్న లంకాపురిలో సమస్తభోగములను అనుభవించుచు, బ్రహ్మదేవుని వరముచేత దీర్ఘకాలమునుండి అపాయము లేక, మనోహర మగు వీణానాదము మొదలగు క్రీడారసములందు తేలుచున్న రాక్షసదంపతులను గూర్చి, భూతభవద్భవిష్యకాలముల జ్ఞానము గల ఆ వాల్మీకిమహర్షి తెలిసికొనెను. 9

మూ. తస్మాత్తు మిథునాదేకం పుమాంసం పాపనిశ్చయః,
జఘాన వైరనిలయో నిషాదస్తస్య పశ్యతః. 10

ప్ర. అ. పాపనిశ్చయః = పాపమైన నిర్ణయము కలవాడును, వైర నిలయః = వైరమునకు స్థానమైన వాడును అగు, నిషాదః = ఒక బోయవాడు, **తస్మాత్** = ఆ, మిథునాత్ = మిథునమునుండి, ఏకమ్ = ఒకటైన, పుమాంసం తు = పురుషపక్షిని మాత్రము, తస్య పశ్యతః = ఆ వాల్మీకమహర్షి చూచుచుండగనే ఏ మాత్రము సంకోచము లేక, జఘాన = చంపెను.

తా. క్రూరమైన నిర్ణయము కలవాడును, పశుపక్ష్యాదుల విషయమున నిష్కారణముగ ద్వేషముతో ప్రవర్తించువాడును అగు ఒక బోయవాడు, ఆ మహర్షి చూచుచున్నాడనెడు సంకోచమైనను లేక, ఆ జంటలో ఒక టగు మగ పక్షిని చంపెను.

వి. ఈ శ్లోకము కూడ కావ్యకథను సూచించుచున్నది :—

పాపనిశ్చయః = దుష్టుడను నిశ్చయము గల, అనగా రావణుడు దుష్టుడని నిశ్చయించిన, వైరనిలయః = దుష్టులతో వైరమునకు స్థానమైన, నిషాదః = సమస్త జగములకును ఆధారభూతుడైన విష్ణువు ("నిషీదన్తి అత్ర సర్వాణి జగన్తి ఇతి నిషాదః" —వీనియందు సమస్తజగత్తులును ఉండును గాన నిషాదుడు), తస్మాత్ మిథునాత్ = ఆ రాక్షసుల జంటనుండి, ఏకమ్ = ఒకడైన, పుమాంసమ్ = పురుషుడగు రావణుని, తస్య = ఆ జంటలో రెండవది యగు మండోదరి, పశ్యతః = చూచుచుండగా ఆమెను ఆదరింపక, అనగా ఆమెను చంపక, జఘాన = చంపెను. (గోవిందరాజులు).

తా. దుష్టుల విషయమున వైరము గల, సకల జగదాధారభూతుడగు శ్రీమహావిష్ణువు రావణుడు దుష్టుడని నిశ్చయించి, ఆ రాక్షసదంపతులలో ఒకడైన రావణుని మాత్రము చంపెను. మండోదరి దుష్టురాలు కాదు గాన ఆమెను చంపలేదు. 10

మూ. తం శోణితపరీతాఙ్గం వేష్టమానం మహీతలే,
భార్యా తు నిహతం దృష్ట్వా రురావ కరుణాం గిరమ్. 11

మూ. వియుక్తా పతినా తేన ద్విజేన సహచారిణా,
తామ్రశీర్షేణ మత్తేన పత్త్రిణా సహితేన వై. 12

ప్ర. అ. పతినా = భర్తయు, సహచారిణా = కూడ తిరుగు నదియు, తామ్రశీర్షేణ=ఎఱ్ఱని తల గలదియు, మత్తేన=మదించినదియు, పత్త్రిణా=మంచి రెక్కలు గలదియు, సహితేన = మనస్సాంగత్యము కలదియు అగు, తేన = ఆ, ద్విజేన=మగ పక్షితో, వియుక్తా=వియోగము పొందిన, భార్యా తు=భార్య యైన ఆడపక్షి యైతే, నిహతమ్ = కొట్టబడినదై, మహీతలే = భూమిపై, వేష్టమానమ్= పొరలుచున్నదియు, శోణితపరీతాఙ్గమ్=రక్తముచే కప్పబడిన శరీరము గలదియు అగు, తమ్ = ఆ మగ పక్షిని, దృష్ట్వా = చూచి, కరుణామ్ = కనికరమును పుట్టించు, గిరమ్ = వాక్కును, రురావ = పలికెను.

తా. ఆ నిషాదునిచే కొట్టబడి నేలపై పొరలుచు, రక్తముతో నిండిన ఆ మగ పక్షిని భార్య యైన ఆడ క్రౌంచపక్షి చూచినది. తనపై ఎంతో ప్రేమ కలిగి ఎల్లప్పుడును తనతో సంచరించు, అందమైన రెక్కలు, ఎఱ్ఱని తలయు గల, కామముచే మదించిన, భర్తతో వియోగము చెందిన ఆ క్రౌంచి అతిదీనముగ ఏడ్వ సాగినది.

వి. ఈ శ్లోకమునందు మండోదరీ ప్రలాపము సూచిత మైనది. భార్యా తు= మండోదరియు,........తామ్రశీర్షేణ = రత్నమయకిరీటముచే ఎర్రగా నుండు తల గలవాడును, పత్త్రిణా = వాహనాదులతో కూడినవాడును, మత్తేన = బ్రహ్మవరములచే మదించినవాడును, సహితేన = ఇంద్రజిత్కుంభకర్ణాదులతో కూడినవాడును అయిన, తేన=ఆ, ద్విజేన = బ్రాహ్మణు డగు రావణునిచే, వియుక్తా, నిహతం, మహీతలే, వేష్టమానం, శోణితపరీతాఙ్గం, తం, దృష్ట్వా, కరుణాం, గిరం, రురావ. (గోవిందరాజులు).

తా. పులస్త్యవంశమునందు పుట్టి, బ్రహ్మదేవునివలన వరములు పొంది, ఎదురు లేక గర్వించి, కుంభకర్ణాదులతో కూడి, మణిమయకిరీటాలంకృత శిరస్కుడై వెలిగిన తన ప్రియు డైన పెనిమిటిచే మండోదరి విడువబడెను. విష్ణువుచే చంపబడి నేలపై పొరలుచు నెత్తురుతో తడిసి పడి యున్న భర్త యగు రావణుని చూచి ఆమె కనికరము పుట్టునట్లు ఏడ్చెను. 11, 12

మూ. తదా తు తం ద్విజం దృష్ట్వా నిషాదేన నిపాతితమ్,
ఋషేర్ధర్మాత్మన స్తస్య కారుణ్యం సమపద్యత. 13

ప్ర. అ. తదా = అప్పుడు, నిషాదేన = బోయవానిచేత, నిపాతితమ్ = పడగొట్టబడిన, ద్విజమ్ = పక్షిని, దృష్ట్వా = చూచి, ధర్మాత్మనః = ధర్మస్వభావుఁడైన, తస్య=ఆ, ఋషేః=ఋషికి, కారుణ్యమ్=జాలి, సమపద్యత=కలిగెను.

తా. అపుడు ఆ బోయవానిచే పడగొట్టబడిన ఆ పక్షిని చూడగనే, ధర్మాత్ముఁడైన ఆ వాల్మీకిమహర్షికి జాలి కలిగెను.

వి. కావ్యార్థసూచనము ఈ శ్లోకములో కూడ ఉన్నది. తదా, నిషాదేన = విష్ణువుచేత, నిపాతితం, తం, ద్విజమ్ = బ్రాహ్మణుఁడైన రావణుని, దృష్ట్వా, ధర్మాత్మనః, తస్య, ఋషేః, కారుణ్యమ్ = జుగుప్స, సమపద్యత (గోవిందరాజులు).

తా. ఆ రావణుని విష్ణురూపుఁడగు రాముఁడు చంపగా చూచుచున్న ధర్మస్వభావుఁడైన ఆ వాల్మీకిమహర్షికి—"అధర్మాత్ముని స్మరణము కూడ అమంగళకరము" అని జుగుప్స కలిగినది. 13

మూ. తతః కరుణవేదిత్వాదధర్మోఽయమితి ద్విజః,
నిశామ్య రుదతీం క్రౌఞ్చీమిదం వచనమబ్రవీత్. 14

ప్ర. అ. తతః=పిమ్మట, ద్విజః=వాల్మీకిమహర్షి, రుదతీమ్=ఏడ్చుచున్న, క్రౌఞ్చీమ్ = ఆడుక్రౌంచపక్షిని, నిశామ్య = చూచి, కరుణవేదిత్వాత్ = కరుణ కలవాఁడగుటవలన, అయమ్ = ఈ రతికాలవధము, అధర్మః ఇతి = ధర్మము కాదు అని (తలచి), ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ వాల్మీకిమహర్షి ఏడ్చుచున్న క్రౌంచిని చూచి, దయ గలవాఁడై, 'రతికాలమందు చంపుట ధర్మము కాదు' అని తలచుచు ఇట్లని చెప్పెను.

వి. తతః, ... క్రౌఞ్చీమ్ = రాక్షసస్త్రీ యగు మండోదరిని, నిశామ్య, ... అయమ్ = ఈ పరభార్యాపహారము, అధర్మ ఇతి ....కరుణవేదిత్వాత్=జుగుప్స పొందినవాఁడగుటవలన, ఇదం, ... (గోవిందరాజులు).

తా. అటు పిమ్మట వాల్మీకిమహర్షి ఏడ్చుచున్న మండోదరిని చూచి, 'పరభార్య నపహరించిన ఈ రావణు డిప్పుడు ఇట్టి స్థితిని పొందినాడు కాబట్టి పరభార్య నపహరించుట ఎంతమాత్రము ధర్మము కాదు' అని తలచి జుగుప్స పొందినవాడై యిట్లని చెప్పెను. 14

మూ. మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః,
యత్ క్రౌఞ్చమిథునాదేకమవధీః కామమోహితమ్. 15

ప్ర. అ. అమ = నిర్భాగ్యు డైన, నిషాద = బోయవాడా ! త్వమ్=నీవు, యత్ = ఏ కారణమువలన, క్రౌఞ్చమిథునాత్ = క్రౌంచపక్షుల జంటనుండి, కామమోహితమ్ = కామముచే మోహము చెందియున్న, ఏకమ్ = ఒకదానిని, అవధీః=చంపితివో, (తత్=ఆకారణమువలన), శాశ్వతీః=స్థిరము లైన, సమాః= సంవత్సరములపాటు, ప్రతిష్ఠాం తు=ఉండుటను, మా గమః=పొందకపోవుదువు గాక.

తా. నిర్భాగ్యుడ వైన ఓ బోయవాడా ! నీవు క్రౌంచపక్షిదంపతులనుండి మన్మథపరవశ మైన ఒక దానిని చంపితివి. అందుచే నీవు చాలకాలము జీవించకుందువు గాక.

వి. 'త్వమగమః' అను నపుడు 'తు, అమ, గమః' అని పదచ్ఛేదము చేయబడినది.

'ఇది బ్రహ్మనుగ్రహముచే శ్రీమద్వాల్మీకిమహర్షి ముఖమునుండి మొట్టమొదట నిర్గమించిన శ్లోకము గాన ఇది కేవల శాపరూపము కాకూడదు. ఇది ఈ గ్రంథమునకు మంగళము' అని పూర్వాచార్యులు చెప్పిరి.

మానిషాద = లక్ష్మికి నివాసస్థాన మైన విష్ణువా ! త్వమ్ = నీవు, యత్= ఏ కారణమువలన, క్రౌఞ్చమిథునాత్ = రాక్షసదంపతు లైన రావణమండోదరుల నుండి, కామమోహితమ్ = కామపరవశ మగు, ఏకమ్ = ఒక డైన రావణుని, అవధీః,....శాశ్వతీః=స్థిరము లైన, సమాః=సంవత్సరములయందు, ప్రతిష్ఠామ్= మాహాత్మ్యమును, అగమః = పొందితివి.

తా. ఓ శ్రీనివాసుడా! రావణమండోదరులను రాక్షసదంపతులవద్దకు వెళ్లి, వారిలో ఒకడును, మన్మథపరవశుడై సీతాదేవి నపహరించినవాడును అగు రావణుని చంపితివి గాన నీవు శాశ్వతకాలము మాహాత్మ్యము పొందితివి.

"కావ్యార్థసూచనం కై శ్చిన్మా న్వ్యామేవ నిరూప్యతే" (మంగళశ్లోకమునందే కొందరు కావ్యార్థసూచనము చేయుదురు) అను ఆలంకారికవచనమును అనుసరించి ఇచట రామాయణకథ అంతయు సంక్షేపముగా సూచింపబడినది. "మా నిషాద" అను శబ్దముచే సీతావివాహపర్యంత మైన బాలకాండకథ సంగ్రహింపబడినది. "ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః" అనుటచే పితృవచన పరిపాలన మనెడు మాహాత్మ్యమును పొందుటను తెలుపు అయోధ్యాకాండకథ అంతయు సూచింపబడినది. ఈ వాక్యముచేతనే అరణ్యకాండకథ కూడ చూపబడినది. "క్రౌఞ్చమిథునాదేకమవధీః కామమోహితమ్" —ఈ వాక్యముచే కుటిలు లగు వానరదంపతు లైన తారావాలులలో ఒకరును, సుగ్రీవభార్య నపహరించిన వాడును అగు వాలిని చంపితివి అను అర్థముచే కిష్కింధాకాండకథ కూడ సూచిత మైనది. క్రౌఞ్చౌ = అల్పీభూతులు; అనగా కృశించినవారు. ఈ వాక్యముచేతనే కృశించిన సీతారాములలో ఒకతె యగు సీతాదేవి నపహరించి మిక్కిలి పీడించితివి అని సీతాదేవి విరహదుఃఖమును వర్ణించెడు సుందరకాండకథయును తెల్పబడినది. దీనిచేతనే రాక్షసదంపతు లగు రావణమండోదరులలో ఒక డైన రావణుని చంపితివి అని యుద్ధకాండకథయు గ్రథిత మైనది. మానిషాద = ఓ శ్రీనివాసుడా, అనగా ఓ దైవమా ! అని యర్థము. ఓ దైవమా ! పూర్వ మరణ్యావాసమునందు వియోగ దుఃఖమును అనుభవించుటచే అత్యంతకృశు లైన సీతారాములలో ఒకతె యైన సీతాదేవిని మరల అరణ్యములో చేర్చి మిక్కిలి పీడించితివి అను ఉత్తరకాండ కథయును చెప్పబడినది. (అందరు వ్యాఖ్యాతల మతము).

మూ. తస్యైవం బ్రువతశ్చిన్తా బభూవ హృది వీక్షతః,
శోకార్తేనాస్య శకునేః కిమిదం వ్యాహృతం మయా. 16

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, బ్రువతః = పలికిన, వీక్షతః=పరిశీలించుచున్న, తస్య = ఆ వాల్మీకిమహర్షియొక్క, హృది = హృదయమునందు, శకునేః = పక్షియొక్క, శోకార్తేన = శోకముచేత ఆర్తుడ నైన, మయా = నాచేత, వ్యాహృతమ్ = పలుకబడిన, ఇదమ్ = ఈ వాక్యము, కిమ్ = ఏమి ? అని, చిన్తా = ఆలోచన, బభూవ = కలిగెను.

తా. ఈ విధముగ పలికి పరిశీలించుకొనిన, ఆ వాల్మీకిమహర్షి మనస్సులో —"ఈ పక్షియొక్క శోకముచేత దుఃఖితుడ నైన నా నోటినుండి ఏమియిది ఈ విధముగా వెలువడినది ?" అను ఆలోచన కలిగెను. 16

మూ. చిన్తయన్ స మహాప్రాజ్ఞశ్చకార మతిమాన్ మతిమ్,
శిష్యం చైవాబ్రవీద్వాక్యమిదం స మునిపుఙ్గవః. 17

ప్ర. అ. మహాప్రాజ్ఞః = గొప్ప పండితుడును, మతిమాన్ = బుద్ధిమంతుడును అయిన, సః = ఆ వాల్మీకి, మతిం చకార = (ఇట్లు) నిశ్చయించెను. సః మునిపుఙ్గవః = ఆ మునిశ్రేష్ఠుడు, శిష్యమ్ = శిష్యునిగూర్చి, ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. మహాపండితుడును, బుద్ధిమంతుడును అయిన ఆ మునిపుంగవుడు ఒక నిశ్చయము చేసికొని శిష్యునితో ఇట్లు పలికెను. 17

మూ. పాదబద్ధోఽక్షరసమస్తన్త్రీలయసమన్వితః,
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా. 18

ప్ర. అ. మే శోకార్తస్య = నేను శోకపీడితుడనై యుండగా, ప్రవృత్తః = అప్రయత్నముగా బయలువెడలినదియు, పాదబద్ధః = నాలుగు పాదములతో కూర్చబడినదియు, అక్షరసమః = ప్రతిపాదమునందును సమానమైన అక్షరములు కలదియు, తన్త్రీలయసమన్వితః = వీణాతంత్రులపై కూర్చుటకు తగిన లయతో కూడినదియు అగు ఈ వాక్యము, శ్లోకః = శ్లోకముగా, భవతు = అగుగాక; అన్యథా = మరొక విధముగా, న = కాదు.

తా. నేను శోకార్తుడనై ఉండగా నా నోటినుండి బయలుదేరిన ఈ వాక్యము సమానమైన అక్షరములు గల నాలుగు పాదములలో కూర్చబడినది. వీణపై కూర్చి నృత్తగీతవాద్యములతో పాడుటకు అనుకూలముగా ఉన్నది. కావున దీనికి శ్లోకమను పేరుతో ప్రసిద్ధి రావలెను. మరొక పేరుతో కాదు. 18

మూ. శిష్యస్తు తస్య బ్రువతో మునేర్వాక్యమనుత్తమమ్,
ప్రతిజగ్రాహ సన్తుష్టస్తస్య తుష్టోఽభవద్గురుః. 19

ప్ర. అ. శిష్యస్తు = శిష్యుడును, బ్రువతః = ఈ విధముగా పలుకుచున్న, తస్య = ఆ, మునేః = వాల్మీకిమునియొక్క, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, వాక్యమ్ = 'మానిషాద' ఇత్యాది వాక్యమును, ప్రతిజగ్రాహ = స్వీకరించెను. గురుః = గురువు, తస్య = అతని విషయమున, తుష్టః అభవత్ = సంతోషించెను.

తా. వాల్మీకి మాటలను విని శిష్యుడు అత్యుత్తమ మైన "మా నిషాద" ఇత్యాది వాక్యమును స్వీకరించెను, అనగా దానిని కంఠస్థము చేసికొనెను. వాల్మీకి అందులకు సంతసించెను. 19

మూ. సోఽభిషేకం తతః కృత్వా తీర్థే తస్మిన్ యథావిధి,
తమేవ చిన్తయన్నర్థముపావర్తత వై మునిః. 20

తతః = అటు పిమ్మట, సః మునిః = ఆ వాల్మీకి మహర్షి, తస్మిన్ తీర్థే = ఆ తీర్థమునందు, యథావిధి = యథాశాస్త్రముగా, అభిషేకమ్ = స్నానమును, కృత్వా = చేసి, తమ్ = ఆ, అర్థమేవ = విషయమునే, చిన్తయన్ = ఆలోచించుచు, ఉపావర్తత వై = ఆశ్రమము వైపు మరలెను.

తా. పిమ్మట వాల్మీకిమహాముని ఆ తీర్థమునందు యథావిధిగా స్నానము చేసి, అక్కడ జరిగిన సంఘటనను గూర్చియే ఆలోచించుచు ఆశ్రమము వైపు మరలెను. 20

మూ. భరద్వాజస్తతః శిష్యో వినీతః శ్రుతవాన్ మునిః,
కలశం పూర్ణమాదాయ పృష్ఠతోఽనుజగామ హ. 21

ప్ర. అ. తతః = అటు పిమ్మట, శిష్యః = శిష్యుడును, వినీతః = వినయవంతుడును, శ్రుతవాన్ = శాస్త్రములు తెలిసినవాడును, మునిః = బ్రహ్మానుసంధానము చేయువాడును అగు, భరద్వాజః = భరద్వాజుడు, పూర్ణమ్ = నిండిన, కలశమ్ = కలశమును, ఆదాయ = గ్రహించి, పృష్ఠతః = వెనుక, అనుజగామ = వాల్మీకిని అనుసరించి వెళ్లెను.

తా. అప్పుడు, శాస్త్రపారంగతుడును, మననశీలుడును, వినయవంతుడును అగు శిష్యుడైన భరద్వాజుడు, జలపూర్ణ మైన కలశమును తీసికొని వాల్మీకిని వెంబడించెను. 21

మూ. స ప్రవిశ్యాశ్రమపదం శిష్యేణ సహ ధర్మవిత్,
ఉపవిష్టః కథాశ్చాన్యాశ్చకార ధ్యానమాస్థితః. 22

ప్ర. అ. ధర్మవిత్ = ధర్మములు తెలిసిన, సః = ఆ వాల్మీకి, శిష్యేణ సహ = శిష్యునితో కూడ, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును, ప్రవిశ్య = ప్రవేశించి, ధ్యానమ్ = ఆలోచనను, అనగా, అంతకు ముందు జరిగిన సంఘటనలను గూర్చి

ఆలోచనను, అస్థితః = పొందినవాడై, ఉపవిష్టః = కూర్చున్న వాడై, అన్యాః = ఇతరము లైన, కథాశ్చ = కథలను కూడ, చకార = చేసెను.

తా. ధర్మవేత్త యైన ఆ వాల్మీకి మహర్షి, శిష్యునితో గూడ ఆశ్రమము ప్రవేశించి, కూర్చున్నవాడై, అంతకు ముందు జరిగిన పక్షివృత్తాంతాదులనే స్మరించుచు, ఆ యా విషయములను గూర్చి ముచ్చటించెను.

మూ. ఆజగామ తతో బ్రహ్మా లోకకర్తా స్వయం ప్రభుః,
చతుర్ముఖో మహాతేజా ద్రష్టుం తం మునిపుఙ్గవమ్. 23

ప్ర. అ. తతః = అటు పిమ్మట, లోకకర్తా = లోకములను సృజించు వాడును, ప్రభుః = లోకములకు అధిపతియు, చతుర్ముఖః = నాలుగు ముఖములు కలవాడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును అగు, బ్రహ్మా = బ్రహ్మ దేవుడు, మునిపుఙ్గవమ్ = మునులలో శ్రేష్ఠుడైన, తమ్ = ఆ వాల్మీకిని, ద్రష్టుమ్ = చూచుటకు, స్వయమ్ = స్వయముగ, ఆజగామ = వచ్చెను.

తా. అప్పుడు, లోకములను సృజించిన వాడును, లోకముల కధిపతియు, నాలుగు ముఖములు కలవాడును, గొప్ప తేజస్సు కలవాడును అగు బ్రహ్మ దేవుడు ఆ మునిపుంగవుని చూచుటకై స్వయముగ వచ్చెను.

మూ. వాల్మీకిరథ తం దృష్ట్వా సహసోత్థాయ వాగ్యతః,
ప్రాఞ్జలిః ప్రయతో భూత్వా తస్థౌ పరమవిస్మితః. 24

ప్ర. అ. అథ = పిమ్మట, ప్రయతః = పరిశుద్ధుడైన, వాల్మీకిః = వాల్మీకి, తమ్ = ఆ బ్రహ్మదేవుని, దృష్ట్వా = చూచి, పరమవిస్మితః = మిక్కిలి ఆశ్చర్యము చెందినవాడై, సహసా = వెంటనే, ఉత్థాయ = లేచి, వాగ్యతః = మౌనము వహించిన వాడై, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, తస్థౌ = నిలబడెను.

తా. పరిశుద్ధు డైన ఆ వాల్మీకి బ్రహ్మను చూడగనే ఆశ్చర్యచకితుడై, వెంటనే లేచి, దోసిలి కట్టి మౌనముగా నిలబడెను.

వి. ఊర్ధ్వం ప్రాణా హ్యుత్క్రామన్తి యూనః స్థవిర ఆగతే,
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే"

(పెద్దవారు సమీపమునకు వచ్చుచుండగనే యువకుని ప్రాణములు పైకి లేచిపోవజూచును. ఎదురుగా వెళ్లి, వంగి నమస్కారము చేయుటచే ఆ ప్రాణములను మరల పొందును) అని ధర్మశాస్త్రములో చెప్పిన రీతిని బ్రహ్మదేవుని చూడగనే సవినయముగ లేచి నిలబడెనని అర్థము. 24

మూ. పూజయామాస తం దేవం పాద్యార్ఘ్యాసనవన్దనైః,
ప్రణమ్య విధివచ్చైనం పృష్ట్వానామయ మవ్యయమ్. 25

ప్ర. అ. తమ్ ఏనం దేవమ్ = అట్టి ఈ బ్రహ్మదేవుని, విధివత్ = యథాశాస్త్రముగా, ప్రణమ్య=నమస్కరించి, అవ్యయమ్=అవిచ్ఛిన్నమైన, అనామయం చ=కుశలమును, పృష్ట్వా=అడిగి, పాద్యార్ఘ్యాసనవన్దనైః = పాద్యము, అర్ఘ్యము, ఆసనము, నమస్కారము — వీటిచే, పూజయామాస = పూజించెను.

తా. వాల్మీకి బ్రహ్మదేవుని యథాశాస్త్రముగా నమస్కరించి, అవిచ్ఛిన్నమగు కుశలమును ప్రశ్నించి, పాద్యము, అర్ఘ్యము, ఆసనము, వందనము సమర్పించి పూజించెను. 25

మూ. అథోపవిశ్య భగవానాసనే పరమార్చితే,
వాల్మీకయే మహర్షయే సన్దిదేశాసనం తతః. 26

ప్ర. అ. అథ = అటు పిమ్మట, భగవాన్ = మాహాత్మ్యములుగల బ్రహ్మదేవుడు, పరమార్చితే=మిక్కిలి పూజింపబడిన, ఆసనే = ఆసనమునందు, ఉపవిశ్య = కూర్చుండి, మహర్షయే=మహర్షియైన, వాల్మీకయే = వాల్మీకి కొరకు, ఆసనమ్ = ఆసనమును, సందిదేశ = చూపెను.

తా. భగవంతుడైన బ్రహ్మదేవుడు పరమపూజిత మగు ఉత్తమాసనముపై కూర్చుండి "నీవు కూడ ఆసనముపై కూర్చుండుము" అని వాల్మీకితో చెప్పెను. 26

మూ. బ్రహ్మణా సమనుజ్ఞాతః సోఽప్యుపావిశదాసనే,
ఉపవిష్టే తదా తస్మిన్ సాక్షాల్లోకపితామహే,
తద్గతేనైవ మనసా వాల్మీకిర్ధ్యానమాస్థితః. 27

ప్ర. అ. సోఽపి=ఆ వాల్మీకికూడ, బ్రహ్మణా = బ్రహ్మచేత, సమనుజ్ఞాతః = అనుజ్ఞ ఇవ్వబడినవాడై, ఆసనే = ఆసనమునందు, ఉపావిశత్ =

కూర్చుండెను. తదా = అప్పుడు, లోకపితామహే = లోకములకు పితామహుడైన, తస్మిన్ = ఆ బ్రహ్మదేవుడు, సాక్షాత్ = ప్రత్యక్షముగా, ఉపవిష్టే = కూర్చున్నవా డగుచుండగా, వాల్మీకిః = వాల్మీకి, తద్గతేనైవ = ఆ క్రౌంచపక్షినే పొందిన, మనసా = మనస్సుతో, ధ్యానమ్ = చింతను, ఆస్థితః = అవలంబించెను.

తా. వాల్మీకి బ్రహ్మదేవుని అనుజ్ఞ పొంది ఆసనముపై కూర్చుండెను. లోకములకు పితామహుడైన ఆ బ్రహ్మదేవుడు ఎదురుగా కూర్చొనియుండగా, వాల్మీకి, మనస్సులో ఆ క్రౌంచపక్షినిగూర్చి మాత్రమే ఆలోచించుచుండెను. 27

మూ. పాపాత్మనా కృతం కర్మ వైరగ్రహణబుద్ధినా,
యస్తాదృశం చారురవం క్రౌఞ్చం హన్యాదకారణాత్. 28

ప్ర. అ. యః = ఏ బోయవాడు, తాదృశమ్ = అట్టి, చారురవమ్ = మధుర మైన ధ్వని గల, క్రౌఞ్చమ్ = క్రౌంచపక్షిని, అకారణాత్ = కారణము లేకుండగా, హన్యాత్ = చంపునో (చంపెనో), వైరగ్రహణబుద్ధినా = వైరముచే ఆ పక్షిని పట్టుకొనవలె నను బుద్ధి గల, పాపాత్మనా = ఆ పాపాత్మునిచే, కష్టమ్ = భయంకర మగు కార్యము, కృతమ్ = చేయబడినది.

తా. "అట్టి మధురధ్వని గల క్రౌంచపక్షిని నిష్కారణముగా, ఆ బోయవాడు చంపినాడు కదా ! ఆ పాపాత్ముడు వైరముచే దానిని పట్టుకొనవలె నను బుద్ధితో ఎంతటి ఘోరకార్యము చేసినాడు !" అని ఆలోచించుచుండెను. 28

మూ. శోచన్నేవ ముహుః క్రౌఞ్చీ ముపశ్లోకమిమం పునః,
జగావన్తర్గతమనా భూత్వా శోకపరాయణః. 29

ప్ర. అ. శోకపరాయణః = దుఃఖపరవశుడై, అన్తర్గతమనాః భూత్వా = లోలోపలనే ఏదియో ఆలోచించుకొనుచున్న మనస్సు కలవాడై, ముహుః = మాటిమాటికి, క్రౌఞ్చీమేవ = ఆడుక్రౌంచపక్షిని గూర్చియే, శోచన్ = దుఃఖించుచు, పునః = మరల, ఇమం శ్లోకమ్ = ఈ శ్లోకమును, ఉపజగౌ = గానము చేసెను.

తా. వాల్మీకి దుఃఖపరవశుడై, బాహ్యవిషయములపై ప్రవర్తించని మనస్సుతో, ఆ క్రౌంచిని గూర్చియే విచారించుచు, మానిషాదేత్యాది శ్లోకమును మరల మరల చదివెను. 29

మూ. తమువాచ తతో బ్రహ్మా ప్రహసన్మునిపుఙ్గవమ్,
శ్లోక ఏవ త్వయా బద్ధో నాత్ర కార్యా విచారణా. 30

ప్ర. అ. తతః = పిమ్మట, బ్రహ్మా = బ్రహ్మ, ప్రహసన్ = నవ్వుచు, తం మునిపుఙ్గవమ్ = ఆ మునిశ్రేష్ఠుని గూర్చి, ఉవాచ = పలికెను, త్వయా = నీచేత, బద్ధః = కూర్చబడినది, శ్లోకః ఏవ = శ్లోకమే, అత్ర = ఈ విషయమునందు, విచారణా = ఆలోచన, న కార్యా = చేయదగినది కాదు.

తా. బ్రహ్మదేవుడు నవ్వుచు వాల్మీకితో ఇట్లనెను—"నీవు కూర్చినది శ్లోకమే. ఈ విషయమున సందేహము లేదు." 30

మూ. మచ్ఛన్దాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ,
రామస్య చరితం సర్వం కురు త్వమృషిసత్తమ. 31

ప్ర. అ. బ్రహ్మన్=ఓ బ్రహ్మర్షీ, తే=నీయొక్క, ఇయమ్=ఈ, సరస్వతీ= వాక్కు, మచ్ఛన్దాదేవ = నాయొక్క ఇచ్ఛ ప్రకారమే, ప్రవృత్తా=పుట్టినది. ఋషి సత్తమ = ఓ ఋషిశ్రేష్ఠుడా ! రామస్య = రామునియొక్క, సర్వమ్=సమస్తమైన, చరితమ్ = చరితమును, త్వమ్ = నీవు, కురు = రచించుము.

తా. ఓ బ్రహ్మర్షీ ! నా ఇచ్ఛనే అనుసరించి ఈ వాక్కు నీయందు ఆవిర్భవించినది. ఓ ఋషిశ్రేష్ఠుడా ! నీవు రాముని చరితము నంతను కావ్యరూపమున రచింపుము.

వి. "బ్రహ్మన్" అని సంబోధించుటచే "నీవును బ్రహ్మ యగు నా అంశమున పుట్టినవాడ వగుటచే నీ ముఖమునుండి నా ఇచ్ఛ ప్రకారము సరస్వతి వెడలినది" అని సూచిత మగుచున్నది. "ఋషిసత్తమ" అనుటచే "నానృషిః కురుతే కావ్యమ్" (ఋషి కానివాడు కావ్యము వ్రాయజాలడు) అను న్యాయము ననుసరించి "నీవు కావ్యము చేయ శక్తి కలవారిలో శ్రేష్ఠుడవు కాబట్టి నీవు రచించిన కావ్యము అన్నింటి కన్నను శ్రేష్ఠ మగును" అని తెల్పబడుచున్నది (గోవిందరాజులు). 31

మూ. ధర్మాత్మనో గుణవతో లోకే రామస్య ధీమతః,
వృత్తం కథయ ధీరస్య యథా తే నారదాచ్ఛ్రుతమ్. 32

ప్ర. అ. ధర్మాత్మనః = ధర్మస్వభావుడును, లోకే = లోకమందు, గుణవతః = ప్రశస్తగుణములు కలవాడును, ధీమతః = బుద్ధిమంతుడును, ధీరస్య = ధైర్యశాలియు అగు, రామస్య = రామునియొక్క, వృత్తమ్ = చరిత్రమును, తే = నీచేత, నారదాత్ = నారదునివలన, యథా = ఏవిధముగా, శ్రుతమ్ = వినబడెనో, (ఆ విధముగా) కథయ = చెప్పుము.

తా. రాముడు ధర్మస్వభావుడు. లోకములో ప్రశస్తములైన గుణములు కలవాడు. పండితుడు. అట్టి రాముని చరిత్రమును నారదునినుండి నీవు వినినది వినినట్లుగ చెప్పుము. 32

మూ. రహస్యం చ ప్రకాశం చ యద్వృత్తం తస్య ధీమతః,
రామస్య సహసౌమిత్రే రాక్షసానాం చ సర్వశః, 33
వైదేహ్యాశ్చాపి యద్వృత్తం ప్రకాశం యది వా రహః,
తచ్చాప్యవిదితం సర్వం విదితం తే భవిష్యతి. 34

ప్ర. అ. ధీమతః = బుద్ధిమంతుడైన, సహసౌమిత్రేః = లక్ష్మణునితో కూడిన, తస్య రామస్య = ఆ రామునియొక్కయు, రాక్షసానాం చ = రాక్షసులయొక్కయు, రహస్యం చ = రహస్యమైనదియు, ప్రకాశం చ = అందరికిని తెలిసినదియు, సర్వశః = సర్వప్రకారము నైన, యత్ = ఏ, వృత్తమ్ = చరిత్రము కలదో, వైదేహ్యాశ్చాపి = సీతాదేవియొక్కయు (అపి శబ్దముచే భరతాదులయొక్కయు అని గ్రహింపవలెను) ప్రకాశం యది వా = అందరకును తెలిసినది గాని, రహో వా = రహస్యము గాని, యత్ వృత్తమ్ = ఏ చరిత్ర కలదో, తచ్చ = అదియు, అవిదితమపి = తెలియనిదైనను, తే = నీకు, విదితమ్ = తెలిసినదిగా, భవిష్యతి = కాగలదు.

తా. లక్ష్మణసహితుడైన రాముడు, సీత, భరతాదులు, రాక్షసులు —వీరందరి చరిత్రము, రహస్యమైనదైనను, ప్రకాశమైనదైనను, నీకింత వరకును తెలియనిది కూడ ఇపుడు స్పష్టముగా తెలియగలదు. 33, 34

మూ. న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి,
కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్. 35

ప్ర. అ. అత్ర=ఈ, కావ్యే = కావ్యమునందు, తే = నీయొక్క, వాక్ = వాక్కు, కాచిత్=ఒక్కటియు, అనృతా=అసత్యమైనది, న భవిష్యతి=కానేరదు, పుణ్యామ్ = పుణ్యమైనదియు, మనోరమామ్ = మనోహరమైనదియు అగు, రామ కథామ్ = రాముని కథను, శ్లోకబద్ధామ్ = శ్లోకబద్ధ మైనదానినిగా, కురు = చేయుము.

తా. ఈ కావ్యములో నీవు చెప్పిన ఒక్క మాట యైనను అసత్యము కానేరదు. పుణ్యము, మనోహరము అయిన రామకథను శ్లోకబద్ధము చేయుము. 35

మూ. యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే,
తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి. 36

ప్ర. అ. గిరయః = పర్వతములును, సరితః చ = నదులును, మహీతలే= భూతలమునందు, యావత్ = ఎంతవరకును, స్థాస్యన్తి = ఉండగలవో, తావత్ = అంతవరకును, రామాయణకథా = రామాయణకథ, లోకేషు = లోకములయందు, ప్రచరిష్యతి = ప్రవర్తింపగలదు.

తా. పర్వతములును, నదులును భూతలమునం దున్నంతవరకును రామాయణకథ లోకములలో వ్యాపించి ఉండును. 36

మూ. యావద్రామాయణకథా త్వత్కృతా ప్రచరిష్యతి,
తావదూర్ధ్వమధశ్చ త్వం మల్లోకేషు నివత్స్యసి. 37

ప్ర. అ. త్వత్కృతా = నీచేత రచింపబడిన, రామాయణకథా = రామాయణకథ, యావత్ = ఎంతవరకు, ప్రచరిష్యతి = ప్రచారములో నుండునో, తావత్ = అంతవరకును, త్వమ్ = నీవు, ఊర్ధ్వమ్ = పైన, అధశ్చ = క్రిందను, మల్లోకేషు = నా లోకములలో, నివత్స్యసి = నివసించగలవు.

తా. నీవు రచించిన రామాయణకథ ప్రచారములో నున్నంత కాలము, నీవు నేను సృజించిన ఊర్ధ్వలోకములలోను, అధోలోకములలోను స్వేచ్ఛగ సంచరించుచు ఉండగలవు. 37

మూ. ఇత్యుక్త్వా భగవాన్ బ్రహ్మా తత్రైవాన్తరధీయత,
తతః సశిష్యో భగవాన్మునిర్విస్మయమాయయౌ. 38

ప్ర. అ. భగవాన్ = మాహాత్మ్యముగల, బ్రహ్మ = బ్రహ్మదేవుడు, ఇతి= ఈ విధముగా, ఉక్త్వా = పలికి, తత్రైవ = అచటనే, అన్తరధీయత = అంతర్ధానము పొందెను, తతః = అటు పిమ్మట, సశిష్యః = శిష్యులతో కూడిన, భగవాన్ = మాహాత్మ్యము గల, మునిః = వాల్మీకి మహాముని, విస్మయమ్ = ఆశ్చర్యమును, ఆయయౌ = పొందెను.

తా. భగవంతుడైన బ్రహ్మదేవుడు ఈ విధముగ పలికి అచటనే అంతర్ధానము పొందెను. వాల్మీకి మహామునియు, శిష్యులును చాల ఆశ్చర్యము చెందిరి. 38

మూ. తస్య శిష్యాస్తతః సర్వే జగుః శ్లోకమిమం పునః,
ముహుర్ముహుః ప్రీయమాణాః ప్రాహుశ్చ భృశవిస్మితాః. 39

ప్ర. అ. తతః = పిమ్మట, తస్య = ఆతని, శిష్యాః = శిష్యులు, సర్వే = అందరును, ముహుర్ముహుః = మాటిమాటికిని, ప్రీయమాణాః = సంతోషించుచున్నవారై, పునః=మరల, ఇమం శ్లోకమ్ = ఈ శ్లోకమును, జగుః = గానము చేసిరి. భృశవిస్మితాః = మిక్కిలి ఆశ్చర్యపడినవారై, ప్రాహుశ్చ = పరస్పరము చెప్పుకొనిరి.

తా. పిమ్మట వాల్మీకిశిష్యు లందరును మాటి మాటికి సంతోషించుచు మరల ఈ శ్లోకమును పఠించి ఒకరి కొకరు చెప్పుకొనిరి. 39

మూ. సమాక్షరైశ్చతుర్భిర్యః పాదైర్గీతో మహర్షిణా,
సోఽనువ్యాహరణాద్భూయః శ్లోకః శ్లోకత్వమాగతః. 40

ప్ర. అ. యః=ఏది, సమాక్షరైః=సమానమైన సంఖ్యగల అక్షరములతో కూడిన, చతుర్భిః=నాలుగు, పాదైః=పాదములతో, మహర్షిణా=మహర్షిచే, గీతః= చెప్పబడినదో, సః = ఆ, శ్లోకః = శ్లోకము, అనువ్యాహరణాత్ = మాటిమాటికి పఠించుట వలన, భూయః=మరల, అనగా ఇంకను, శ్లోకత్వమ్=శ్లోకత్వమును, ఆగతః = పొందినది.

తా. సమసంఖ్యాకము లగు అక్షరములతో, నాలుగు పాదములతో, కూడినదై, మహర్షి గానము చేసిన ఈ శ్లోకము, మాటి మాటికిని గానము చేయుటచే ఇంకను శ్లోకత్వము ను పొందినది.

వి. శ్లోక శబ్దమునకు యశస్సు అని కూడ అర్థము. వాల్మీకి ముఖము నుండి వెలువడిన ఈ శ్లోకము, శిష్యు లందరును అత్యానందముతో మరల మరల పఠించుటచే అతనికి కీర్తిపతాక మైన దని భావము.

మూ. తస్య బుద్ధిరియం జాతా మహర్షేర్భావితాత్మనః,
కృత్స్నం రామాయణం కావ్యమీదృశైః కరవాణ్యహమ్. 41

ప్ర. అ. అహమ్ = నేను, కృత్స్నమ్ = సమ స్తమైన, రామాయణమ్ = రామాయణ మనెడు, కావ్యమ్ = కావ్యమును, ఈదృశైః = ఇట్టి శ్లోకములతో, కరవాణి = చేసెదను అని, ఇయమ్ = ఈ, బుద్ధిః = బుద్ధి, భావితాత్మనః = ధ్యానింపబడిన పరమాత్మగల, తస్య = ఆ, మహర్షేః = వాల్మీకిమహర్షికి, జాతా = కలిగెను.

తా. "రామాయణము సంతను ఈ శ్లోకవృత్తములో రచించెదను" అని పరమాత్మధ్యానపరాయణు డగు వాల్మీకిమహర్షి నిశ్చయించుకొనెను. 41

మూ. ఉదారవృత్తార్థపదైర్మనోరమై
స్తదాస్య రామస్య చకార కీర్తిమాన్,
సమాక్షరైః శ్లోకశతైర్యశస్వినో
యశస్కరం కావ్యముదారధీర్మునిః. 42

ప్ర. అ. కీర్తిమాన్ = కీర్తి కలవాడును, ఉదారధీః = గొప్ప బుద్ధి కలవాడును, మునిః = మననశీలుడును అగు వాల్మీకి, తదా = అప్పుడు, యశస్వినః = కీర్తిమంతుడైన, అస్య రామస్య = ఈ రామునియొక్క, యశస్కరమ్ = కీర్తిని కలిగించు, కావ్యమ్ = కావ్యమును, ఉదారవృత్తార్థపదైః = ఉత్తమ మైన పద్యములును, అర్థములును, శబ్దములును గల, మనోరమైః = మనోహరములైన, సమాక్షరైః = సమములైన అక్షరములు గల, శ్లోకశతైః = వందలకొలది శ్లోకముల చేత, చకార = రచించెను.

తా. కీర్తిమంతుడును, మహాబుద్ధిమంతుడును అగు వాల్మీకి యశశ్శాలి యగు ఆ రాముని మాహాత్మ్యమును తెలుపునట్టి కావ్యమును, మనోహరము లైనవియు, ఉత్తమము లైన వృత్తములతోడను, శబ్దార్థములతోడను ప్రకాశించునవియు, సమాక్షరములు కలిగినవియు అగు శ్లోకశతములతో నిర్మించెను.

మూ. తదుపగత సమాససన్ధియోగం
సమమధురోపనతార్థ వాక్యబద్ధమ్,
రఘువరచరితం మునిప్రణీతం
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్. 43

ఇత్యార్షే, శ్రీమద్రామాయణే, ఆదికావ్యే, బాలకాణ్డే ద్వితీయః సర్గః.

ప్ర. అ. ఉపగతసమాససన్ధియోగం = సమాససంధివ్యుత్పత్తులతో కూడిన దియు, సమమధురోపనతార్థ వాక్యబద్ధమ్=సమానములును, మధురములును అర్థ వంతములును అగు వాక్యములతో కూర్చబడినదియు, మునిప్రణీతమ్= వాల్మీకిచే రచింపబడినదియు అగు, తత్ = ఆ, రఘువరచరితమ్ = రామచరితమును, దశ శిరసః = రావణుని, వధం చ = వధను, నిశామయధ్వమ్=చూడండి (వినండి).

తా. వాల్మీకిముని రచించిన ఈ "రామచరితము"లో, "రావణవధ"లో సమాసములు నాతిదీర్ఘములు. సంధులు శ్రావ్యములు. శబ్దవ్యుత్పత్తి శాస్త్రసం మత మైనది. ఇందలి వాక్యములు సమములై, మధురములై, అర్థభరితములై ఉన్నవి. అట్టి ఈ కావ్యమును వినండి. 43

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు,
బాల కాండలో ద్వితీయసర్గ సమాప్తము.

శ్రీః

అథ తృతీయః సర్గః

మూ. శ్రుత్వా వస్తు సమగ్రం తద్ధర్మాత్మా ధర్మసంహితమ్,
వ్యక్తమన్వేషతే భూయో యద్వృత్తం తస్య ధీమతః. 1

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మస్వభావుడైన వాల్మీకి, ధర్మసంహితమ్=ధర్మముతో కూడిన, సమగ్రమ్ =సమస్తమైన, తత్ =ఆ, వస్తు =రామకథను, శ్రుత్వా=విని, ధీమతః=బుద్ధిమంతుడైన, తస్య=ఆ రామునియొక్క, వృత్తమ్=చరిత్రము, యత్ =ఏది కలదో, దానిని, వ్యక్తమ్ =స్పష్టమగునట్లు, భూయః=ఇంకను, అన్వేషతే =వెదకెను.

తా. ధర్మస్వభావుడైన వాల్మీకి, తనకు నారదుడు చెప్పిన ధర్మసహితమగు ఆ రామకథకంటె అధికముగ ఇంకను ఏమైన రామచరిత మున్నదా అని పరిశీలించెను. 1

మూ. ఉపస్పృశ్యోదకం సమ్యఙ్మునిః స్థిత్వా కృతాఞ్జలిః,
ప్రాచీనాగ్రేషు దర్భేషు ధర్మేణాన్వేషతే గతిమ్. 2

ప్ర. అ. మునిః =వాల్మీకి, ఉదకమ్ =ఉదకమును, ఉపస్పృశ్య =ఆచమనము చేసి, ప్రాచీనాగ్రేషు=తూర్పువైపునకు కొనలు గల, దర్భేషు=దర్భలపై, స్థిత్వా =కూర్చుండి, కృతాఞ్జలిః =కట్టబడిన దోసిలి కలవాడై, ధర్మేణ =తపోబలముచేత, గతిమ్ =రామచరిత్రముయొక్క రీతిని, సమ్యక్ =బాగుగా, అన్వేషతే =అన్వేషించెను.

తా. వాల్మీకి ఆచమనము చేసి, తూర్పుగా అగ్రభాగము లుండునట్లు పరచిన దర్భలపై కూర్చుండి, దోసిలి కట్టి, దివ్యదృష్టిచే రామచరితమును గూర్చి చక్కగా ఆలోచించెను. 2

మూ. రామలక్ష్మణసీతాభీ రాజ్ఞా దశరథేన చ,
సభార్యేణ సరాష్ట్రేణ యత్ప్రాప్తం తత్ర తత్త్వతః, 3

హసితం భాషితం చైవ గతిర్యా యచ్చ చేష్టితమ్,
తత్సర్వం ధర్మవీర్యేణ యథావత్సంప్రపశ్యతి. 4

ప్ర. అ. రామలక్ష్మణసీతాభిః=రామలక్ష్మణసీతలచేతను, రాజ్ఞా=రాజైన, దశరథేన చ =దశరథునిచేతను, సభార్యేణ=భార్యతో కూడిన రామునిచేతను, సరాష్ట్రేణ = రాష్ట్రముతో కూడిన రామునిచేతను, యత్ = ఏది, ప్రాప్తమ్ = పొందబడినదో, తత్ర = ఆ విషయమునందును, యా = ఏ, గతిః = గమనము కలదో దానిని, యత్ = ఏ, చేష్టితమ్ = చేష్టకలదో దానిని, హసితమ్ = వారి నవ్వును, భాషితం చైవ = వారి సంభాషణను, తత్సర్వమ్ = దాని నంతను, తత్త్వతః=యథార్థముగ, యథావత్=నడచినట్లుగ, ధర్మవీర్యేణ=తపోబలము చేత, లేదా బ్రహ్మానుగ్రహప్రభావముచేత, సంప్రపశ్యతి = చూచెను.

తా. వాల్మీకి తపఃప్రభావముచే, రామలక్ష్మణసీతలును, దశరథమహారాజును ఏమి చేసిరో, రాముడు భార్యాసహితుడై ఉన్నప్పుడును, రాజ్యముతో ఉన్నప్పుడును ఏమేమి పొందెనో ఆ విషయముల నన్నింటినీ యథార్థముగా తెలిసికొనెను. మరియు వారందరును ఎట్లు నవ్విరో, ఎట్లు మాటలాడిరో, ఎట్లు నడచిరో, ఇంకను ఏయే పనులు చేసిరో ఆ విషయముల నన్నింటిని కూడ తెలుసుకొనెను. 3, 4

మూ. స్త్రీతృతీయేన చ తదా యత్ప్రాప్తం చరతా వనే,
సత్యసన్ధేన రామేణ తత్సర్వం చాన్వవేక్షితమ్. 5

ప్ర. అ. స్త్రీతృతీయేన = భార్య మూడవదిగా గల, వనే చరతా=వనమునందు సంచరించుచున్న, సత్యసన్ధేన=సత్యమైన ప్రతిజ్ఞ గల, రామేణ=రాముని చేత, తదా = అప్పుడు, యత్ = ఏది, ప్రాప్తమ్ = పొందబడెనో, తత్సర్వమ్= అది యంతయు, అన్వవేక్షితమ్ = చూడబడెను.

తా. సత్యసంధుడైన రాముడు సీతాలక్ష్మణులతో కలిసి అరణ్యములో సంచరించు నపుడు ఏమేమి జరిగెనో అవి యన్నియు తెలుసుకొనెను. 5

మూ. తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగమాస్థితః,
పురా యత్తత్ర నిర్వృత్తం పాణావామలకం యథా. 6

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ధర్మాత్మా = ధర్మాత్ముడైన వాల్మీకి,

యోగమ్ = యోగమును, ఆస్థితః = పొందినవాడై, పురా = పూర్వము, తత్ర = అచట, యత్ = ఏది, నిర్వృత్తమ్ = జరిగినదో, తత్ సర్వమ్ = దానినంతను, పాణౌ = అరచేతియందు, ఆమలకం యథా = ఉసిరికాయను వలె, పశ్యతి = చూచెను.

తా. ధర్మాత్ముడైన వాల్మీకి, రామాదులకు సంబంధించిన వృత్తాంతము నంతను, యోగదృష్టిచే, అరచేతిలోని ఉసిరికాయను వలె స్పష్టముగా కనుగొనెను. 6

మూ. తత్సర్వం తత్త్వతో దృష్ట్వా ధర్మేణ స మహాద్యుతిః,
అభిరామస్య రామస్య చరితం కర్తు ముద్యతః. 7

కామార్థగుణసంయుక్తం ధర్మార్థగుణవిస్తరమ్,
సముద్రమివ రత్నాఢ్యం సర్వశ్రుతిమనోహరమ్. 8

ప్ర. అ. మహాద్యుతిః = గొప్పకాంతిగల, సః = వాల్మీకి, తత్ సర్వమ్ = ఆ చరిత్రమునంతను, తత్త్వతః = ఉన్నదున్నట్లుగా, ధర్మేణ=తపోబలముచేత, దృష్ట్వా = చూచి, కామార్థగుణసంయుక్తమ్ = కామము అర్థము అనెడు గుణములతో కూడినదియు, ధర్మార్థగుణవిస్తరమ్ = ధర్మమే ప్రయోజనముగా గల గుణములతో విస్తృత మైనదియును, రత్నాఢ్యమ్ = రత్నములతో నిండిన, సముద్రమివ=సముద్రము వలె ఉన్నదియును, సర్వశ్రుతిమనోహరమ్=అందరి చెవులను హృదయములను ఆకర్షించునదియు, లేదా సకలవేదముల హృదయమును సంగ్రహించునదియు అగు, అభిరామస్య=లోకాభిరాము డైన, రామస్య=రాముని యొక్క, చరితమ్ = చరిత్రను, కర్తుమ్ = రచించుటకు, ఉద్యతః = ఉద్యుక్తుడయ్యెను.

తా. మహాతేజఃశాలి యైన వాల్మీకి తపఃప్రభావముచే విషయముల నన్నింటిని తెలిసికొని, కామార్థము లనెడు పురుషార్థములతో సంబంధించి, ధర్మప్రధాన మైన గుణములు అధికముగా కలదియు, రత్నములతో సమృద్ధ మైన సముద్రము వలె నున్నదియు, అందరి చెవులను మనస్సులను ఆకర్షించునదియు, సకల వేదసారసంగ్రహరూపమును అగు, లోకాభిరాముడైన రాముని చరిత్రమును రచించుటకు ఉపక్రమించెను. 7, 8

మూ. స యథాకథితం పూర్వం నారదేన మహర్షిణా,
రఘువంశస్య చరితం చకార భగవానృషిః. 9

ప్ర. అ. భగవాన్=మాహాత్మ్యముగల, సః ఋషిః=ఆ వాల్మీకిమహర్షి, నారదేన మహర్షిణా=నారదమహర్షిచేత, పూర్వమ్=పూర్వము, యథా=ఏ విధముగా, కథితమ్ = చెప్పబడినదో, ఆ విధముగ, రఘువంశస్య = రఘువంశమునందు పుట్టిన రామునియొక్క, చరితమ్ = చరిత్రను, చకార = నిర్మించెను.

తా. భగవంతు డైన వాల్మీకి పూర్వము నారదమహర్షి తనకు చెప్పిన విధముగ రాముని చరిత్రమును రచించెను. 9

మూ. జన్మ రామస్య సుమహద్వీర్యం సర్వానుకూలతామ్,
లోకస్య ప్రియతాం క్షాన్తిం సౌమ్యతాం సత్యశీలతామ్. 10

ప్ర. అ. రామస్య=రామునియొక్క, జన్మ=అవతారమును, సుమహత్=మిక్కిలి గొప్పదైన, వీర్యమ్ = పరాక్రమమును, సర్వానుకూలతామ్=అందరికిని అనుకూలముగా ఉండుటను, లోకస్య = ప్రపంచమునకు, ప్రియతామ్ = ప్రేమపాత్రుడై ఉండుటను, క్షాన్తిమ్ = ఓర్పును, సౌమ్యతామ్=సౌందర్యమును, సత్యశీలతామ్ = సత్యశీలమును (వర్ణించెను).

తా. రాముని అవతారమును, ఆతని మహాపరాక్రమమును, అందరికిని అనుకూలుడుగాను ఇష్టుడుగాను ఉండుటను, ఓర్పును, సౌందర్యమును, సత్యశీలమును వర్ణించెను. 10

మూ. నానాచిత్రకథాశ్చాన్యా విశ్వామిత్రసమాగమే,
జానక్యాశ్చ వివాహం చ ధనుషశ్చ విభేదనమ్. 11

ప్ర. అ. విశ్వామిత్రసమాగమే=విశ్వామిత్రునితో చేరినపుడు, అన్యాః = ఇతరము లైన, నానాచిత్రకథాః = అనేకవిధము లైన విచిత్రము లైన కథలను, జానక్యాః = జానకియొక్క, వివాహం చ = వివాహమును, ధనుషః = ధనస్సుయొక్క, విభేదనం చ = భేదనమును (వర్ణించెను).

తా. విశ్వామిత్రుని కలిసి నప్పుడు జరిగిన విచిత్రము లైన అనేకకథలను, శివధనుర్భంగమును, జానకీపరిణయమును వర్ణించెను. 11

మూ. రామరామవివాదం చ గుణాన్దాశరథేస్తథా,
తథాభిషేకం రామస్య కైకేయ్యా దుష్టభావతామ్. 12

ప్ర. అ. రామరామవివాదం చ = పరశురామ దశరథరాముల వివాదమును, తథా = మరియు, దాశరథేః = రామునియొక్క, గుణాన్ = గుణములను, తథా = మరియు, రామస్య = రామునియొక్క, అభిషేకమ్ = అభిషేకమును, కైకేయ్యాః = కైకేయియొక్క, దుష్టభావతామ్ = దుష్టభావమును (వర్ణించెను).

తా. పరశురామునితో దశరథరాముని వివాదమును, రాముని సద్గుణములను, రాముని యౌవరాజ్యపట్టాభిషేకమునకై ప్రయత్నమును, కైకేయియొక్క దుష్టచింతనమును వర్ణించెను. 12

మూ. విఘాతం చాభిషేకస్య రాఘవస్య వివాసనమ్,
రాజ్ఞః శోకవిలాపం చ పరలోకస్య చాశ్రయమ్. 13

ప్ర. అ. అభిషేకస్య=రామాభిషేకమునకు, విఘాతం చ=విఘ్నమును, రామస్య = రామునియొక్క (ని),వివాసనమ్=అరణ్యమునకు పంపుటను, రాజ్ఞః= దశరథునియొక్క, శోకవిలాపం చ=దుఃఖముతో విలపించుటను, పరలోకస్య= స్వర్గలోకముయొక్క, ఆశ్రయం చ = ఆశ్రయించుటను (వర్ణించెను).

తా. రాముని యౌవరాజ్యపట్టాభిషేకమునకు విఘ్నము కలుగుట, రాముని అరణ్యవాసమునకు పంపుట, దశరథుడు దుఃఖార్తుడై విలపించుట, అతడు స్వర్గస్థు డగుట — ఈ విషయములను వర్ణించెను. 13

మూ. ప్రకృతీనాం విషాదం చ ప్రకృతీనాం విసర్జనమ్,
నిషాదాధిపసంవాదం సూతోపావర్తనం తథా. 14

ప్ర. అ. ప్రకృతీనామ్=ప్రజల, విషాదమ్=దుఃఖమును, ప్రకృతీనామ్= ప్రజల(ను), విసర్జనమ్ = విడచుటను, నిషాదాధిపసంవాదమ్ = గుహునితో సంభాషణమును, తథా = మరియు, సూతోపావర్తనమ్ = సారథి తిరిగి వచ్చుటను (వర్ణించెను).

తా. ప్రజలు దుఃఖించుటను, రాముడు వారిని విడచిపెట్టుటను, గుహు

నితో సంభాషణమును, సారథి యైన సుమంత్రుడు రాముని అరణ్యప్రాంతములో విడచి తిరిగి వచ్చుటను వర్ణించెను.

మూ. గఙ్గాయాశ్చాపి సంతారం భరద్వాజస్య దర్శనమ్,
భరద్వాజాభ్యనుజ్ఞానాచ్చిత్రకూటస్య దర్శనమ్. 15

ప్ర. అ. గఙ్గాయాః = గంగానదియొక్క (నదిని), సన్తారం చాపి = దాటుటను, భరద్వాజస్య = భరద్వాజుని, దర్శనమ్ = దర్శనమును, భరద్వాజాభ్యనుజ్ఞానాత్ = భరద్వాజుని ఆజ్ఞవలన, చిత్రకూటస్య = చిత్రకూటపర్వతముయొక్క, దర్శనమ్ = చూచుటను (వర్ణించెను).

తా. సీతారామలక్ష్మణులు గంగానదిని దాటుటను, భరద్వాజుని చూచుటను, భరద్వాజుని ఆజ్ఞ ప్రకారము వారు చిత్రకూటమునకు వెళ్లుటను వర్ణించెను. 15

మూ. వాస్తుకర్మ నివేశం చ భరతాగమనం తథా,
ప్రసాదనం చ రామస్య పితుశ్చ సలిలక్రియామ్. 16

ప్ర. అ. వాస్తుకర్మ = గృహనిర్మాణమును, నివేశం చ = ఆ గృహములో నివసించుటను, భరతాగమనమ్ = భరతుని ఆగమనమును, రామస్య = రాముని యొక్క, ప్రసాదనం చ = అనుగ్రహింపచేసుకొనుటను, తథా = మరియు, పితుః = తండ్రికి, సలిలక్రియామ్ = తర్పణము లిచ్చుటను (వర్ణించెను).

తా. రామాదులు చిత్రకూటమున గృహము నిర్మించుకొని దానిలో నివసించుటను, భరతుడు వచ్చి రాముని బ్రతిమాలుటను, రాముడు తండ్రికి ఔర్ధ్వదేహికక్రియలు చేయుటను వర్ణించెను. 16

మూ. పాదుకాగ్ర్యాభిషేకం చ నన్దిగ్రామనివాసనమ్,
దణ్డకారణ్యగమనం విరాధస్య వధం తథా. 17

ప్ర. అ. పాదుకాగ్ర్యాభిషేకం చ = శ్రేష్ఠము లైన పాదుకలకు రాజ్యాభిషేకమును, నన్దిగ్రామనివాసనమ్ = నందిగ్రామములో నివాసమును, దణ్డకారణ్యగమనమ్ = దండకారణ్యములోనికి వెళ్లుటను, తథా = మరియు, విరాధస్య = విరాధునియొక్క, వధమ్ = వధను (వర్ణించెను).

తా. భరతుడు రామపాదుకలకు పట్టాభిషేకము చేసి నందిగ్రామములో నివసించుటను, రాముడు దండకారణ్యములోనికి ప్రవేశించుటను, అచట విరాధుని చంపుటను వర్ణించెను. 17

మూ. దర్శనం శరభఙ్గస్య సుతీక్ష్ణేన సమాగమమ్,
అనసూయాసహాస్యామప్యఙ్గరాగస్య చార్పణమ్. 18

ప్ర. అ. శరభఙ్గస్య=శరభంగమహర్షియొక్క, దర్శనమ్=దర్శనమును, సుతీక్ష్ణేన = సుతీక్ష్ణమహర్షితో, సమాగమమ్ = సమాగమమును, అనసూయాసహాస్యామ్ అపి=అనసూయతో కలిసి కూర్చుండుటను, అఙ్గరాగస్య = అంగరాగముయొక్క, అర్పణం చ = ఇచ్చుటను (వర్ణించెను).

తా. రాముడు శరభంగసుతీక్ష్ణమహర్షుల దర్శనము చేయుటను, సీత అనసూయ దగ్గర కూర్చుండి, సంభాషణాదికము చేయుటను, అనసూయ సీతకు శరీరమునకు పూసికొనెడు అంగరాగమును ఇచ్చుటను వర్ణించెను. 18

మూ. అగస్త్యదర్శనం చైవ జటాయోరభిసఙ్గమమ్,
పఞ్చవట్యాశ్చ గమనం శూర్పణఖ్యాశ్చ దర్శనమ్. 19

ప్ర. అ. అగస్త్యదర్శనం చైవ = అగస్త్యమహామునిని చూచుటను, జటాయోః = జటాయువుయొక్క, అభిసంగమమ్=సమాగమమును, పఞ్చవట్యాః గమనమ్ = పంచవటికి వెళ్లుటను, శూర్పణఖ్యాః = శూర్పణఖయొక్క, దర్శనం చ = దర్శనమును (వర్ణించెను).

తా. రాముడు అగస్త్యుని దర్శనము చేయుటను, జటాయువును కలియుటను, పంచవటికి వెళ్లుటను, అచట శూర్పణఖను చూచుటను వర్ణించెను. 19

మూ. శూర్పణఖ్యాశ్చ సంవాదం విరూపకరణం తథా,
వధం ఖరత్రిశిరసోరుత్థానం రావణస్య చ. 20

ప్ర. అ. శూర్పణఖ్యాః=శూర్పణఖయొక్క, సంవాదమ్ = సంభాషణను, తథా = మరియు, విరూపకరణమ్ = ఆమెను విరూపముకలదానినిగా చేయుటను, ఖరత్రిశిరసోః = ఖరత్రిశిరస్కుల, వధమ్ = వధను, రావణస్య = రావణుని యొక్క, ఉత్థానం చ = ప్రయత్నప్రారంభమును (వర్ణించెను).

తా. శూర్పణఖతో జరిగిన సంభాషణమును, ఆమెకు రూపవికారము కలిగించుటను, ఖరుడు త్రిశిరస్కుడు అను రాక్షసులను రాముడు సంహరింపగా రావణుడు రామునకు అపకారము చేయుటకై ప్రయత్నము ప్రారంభించుటను వర్ణించెను. 20

మూ. మారీచస్య వధం చైవ వైదేహ్యా హరణం తథా,
రాఘవస్య విలాపం చ గృధ్రరాజనిబర్హణమ్. 21

ప్ర. అ. మారీచస్య = మారీచునియొక్క, వధం చైవ = వధను, తథా= మరియు, వైదేహ్యాః = సీతయొక్క, హరణమ్ = హరణమును, రాఘవస్య = రామునియొక్క, విలాపం చ = విలాపమును, గృధ్రరాజనిబర్హణమ్ = జటాయువును చంపుటను (వర్ణించెను).

తా. రాముడు మారీచుని చంపుటను, రావణుడు సీతను హరించుటను, జటాయువును చంపుటను రాముడు సీతకై విలపించుటను వర్ణించెను. 21

మూ. కబన్ధదర్శనం చైవ పమ్పాయాశ్చాపి దర్శనమ్,
శబర్యా దర్శనం చైవ హనూమద్దర్శనం తథా. 22

కబన్ధదర్శనం చైవ = కబంధుని దర్శనమును, పమ్పాయాశ్చాపి = పంపానదియొక్క కూడ, దర్శనమ్=దర్శనమును, శబర్యాః=శబరియొక్క, దర్శనం చైవ = దర్శనమును, తథా=మరియు, హనూమద్దర్శనమ్=హనుమంతునియొక్క దర్శనమును (వర్ణించెను).

తా. రాముడు కబంధుని, పంపానదస్సును, శబరిని, హనుమంతుని చూచుటను వర్ణించెను. 22

మూ. ఋశ్యమూకస్య గమనం సుగ్రీవేణ సమాగమమ్,
ప్రత్యయోత్పాదనం సఖ్యం వాలిసుగ్రీవవిగ్రహమ్. 23

ప్ర. అ. ఋశ్యమూకస్య = ఋశ్యమూకపర్వతమునకు, గమనమ్ = వెళ్లుటను, సుగ్రీవేణ = సుగ్రీవునితో, సమాగమమ్ = సమాగమమును, ప్రత్యయోత్పాదనమ్ = నమ్మకమును పుట్టించుటను, సఖ్యమ్ = స్నేహమును, వాలిసుగ్రీవవిగ్రహమ్ = వాలిసుగ్రీవుల యుద్ధమును (వర్ణించెను).

తా. రాముడు ఋశ్యమూకపర్వతమునకు వెళ్లి, సుగ్రీవుని కలిసికొని ఆతనితో స్నేహము చేసికొనుటను, అతనికి నమ్మకము కలిగించుటను, వాలి సుగ్రీవుల యుద్ధమును వర్ణించెను. 23

మూ. వాలిప్రమథనం చైవ సుగ్రీవప్రతిపాదనమ్,
తారావిలాపం సమయం వర్షరాత్రనివాసనమ్. 24

ప్ర. అ. వాలిప్రమథనం చైవ = వాలిని సంహరించుటను, సుగ్రీవప్రతిపాదనమ్=సుగ్రీవునకు రాజ్యము నిచ్చుటను, తారావిలాపమ్=తారయొక్క విలాపమును, సమయమ్=రామసుగ్రీవులు ఏర్పరచుకొనిన ఒడంబడికను, వర్షరాత్రనివాసనం = వర్షర్తురాత్రులందు నివసించుటను (వర్ణించెను).

తా. రాముడు వాలిని సంహరించుటను, తార విలపించుటను, రాముడు సుగ్రీవునకు రాజ్యము నిచ్చుటను, రామసుగ్రీవులమధ్య సీతాన్వేషణమును గూర్చి జరిగిన ఒప్పందమును, రాముడు వర్షర్తురాత్రులందు, యుద్ధమునకై తగు కాలము వచ్చువరకును వేచి యుండుటను వర్ణించెను. 24

మూ. కోపం రాఘవసింహస్య బలానాముపసఙ్గ్రహమ్,
దిశః ప్రస్థాపనం చైవ పృథివ్యాశ్చ నివేదనమ్. 25

ప్ర. అ. రాఘవసింహస్య = రఘువంశమునందు జనించినవారిలో శ్రేష్ఠుడైన రామునియొక్క, కోపమ్=కోపమును, బలానామ్=వానరసైన్యములయొక్క, ఉపసఙ్గ్రహమ్=చేర్చుటను, దిశః = దిక్కులనుగూర్చి, ప్రస్థాపనం చైవ=పంపుటను, పృథివ్యాః=భూమియొక్క, నివేదనమ్=వర్ణించి చెప్పుటను(వర్ణించెను).

తా. సుగ్రీవుడు ఆలస్యము చేయుటచే రామునకు కోపము కలుగుటను, సుగ్రీవుడు వానరసేనలను పిలిపించుటను, వారిని నాల్గు దిక్కులకు పంపుటను, సుగ్రీవుడు వారికి పృథివిపై నున్న వివిధప్రదేశములను గూర్చి వర్ణించి చెప్పుటను (వర్ణించెను). 25

మూ. అఙ్గులీయకదానం చ ఋక్షస్య బిలదర్శనమ్,
ప్రాయోపవేశనం చాపి సమ్పాతేశ్చాపి దర్శనమ్. 26

ప్ర. అ. అఙ్గులీయకదానం చ = హనుమంతునకు రాముడు తన ఉంగరమును ఇచ్చుటను, ఋక్షస్య బిలదర్శనమ్ = వానరులు ఋక్షుని బిలమును చూచుటను, ప్రాయోపవేశనం చాపి=ప్రాయోపవేశనమును, సమ్పాతేః=సంపాతియొక్క, దర్శనం చాపి = దర్శనమును (వర్ణించెను).

తా. రాముడు హనుమంతుని చేతికి తన ఉంగరమును ఇచ్చుటను, వానరులు ఋక్షబిలములో ప్రవేశించుటను, వారు సీతను కానక నిరాశులై ప్రాయోపవేశము చేయుటను, వారు సంపాతిని చూచుటను (వర్ణించెను). 26

మూ. పర్వతారోహణం చాపి సాగరస్య చ లఙ్ఘనమ్,
సముద్రవచనాచ్చైవ మైనాకస్య చ దర్శనమ్. 27

ప్ర. అ. పర్వతారోహణం చాపి = హనుమంతుడు మహేంద్రపర్వతమును ఎక్కుటను, సాగరస్య = సముద్రముయొక్క, లఙ్ఘనమ్ = దాటుటను, సముద్రవచనాత్ = సముద్రునిమాటవలన, మైనాకస్య = మైనాకపర్వతముయొక్క, దర్శనమ్ = దర్శనమును (వర్ణించెను).

తా. హనుమంతుడు మహేంద్రపర్వతము నెక్కి దానినుండి ఎగిరి సముద్రమును దాటుటను, సముద్రుడు ప్రేరేపింపగా వచ్చిన మైనాకపర్వతముయొక్క దర్శనమును వర్ణించెను. 27

మూ. సింహికాయాశ్చ నిధనం లఙ్కామలయదర్శనమ్,
రాత్రౌ లఙ్కాప్రవేశం చ ఏకస్యాథ విచిన్తనమ్. 28

ప్ర. అ. సింహికాయాః=సింహికయొక్క, నిధనమ్=మరణమును, లఙ్కామలయదర్శనమ్ = లంకలో నున్న పర్వతముయొక్క ఒక భాగమును చూచుటను, రాత్రౌ = రాత్రియందు, లఙ్కాప్రవేశం చ = లంకలో ప్రవేశించుటను, అథ = అటుపిమ్మట, ఏకస్య = ఒకడైన హనుమంతునియొక్క, విచిన్తనమ్ = ఆలోచించుటను వర్ణించెను. ("మలయః పర్వతాన్తరే, పర్వతాఙ్కే ప్రియోద్యానే" అని రత్నమాల).

తా. సింహికయొక్క మరణమును, హనుమంతుడు లంకలో ఉన్న పర్వతముయొక్క ఒక భాగమును చూచుటను (చేరుటను), రాత్రియందు లంకలో ప్రవేశించుటను, ఒంటరిగా ఉన్న ఆతడు ఆలోచన చేయుటను వర్ణించెను. 28

మూ. దర్శనం రావణస్యాపి పుష్పకస్య చ దర్శనమ్,
ఆపానభూమిగమనమవరోధస్య దర్శనమ్. 29

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, దర్శనమపి = దర్శనమును, పుష్పకస్య = పుష్పకముయొక్క, దర్శనమ్ = దర్శనమును, ఆపానభూమిగమనమ్ = మద్యపానము చేయు ప్రదేశమునకు వెళ్లుటను, అవరోధస్య = అంతఃపురముయొక్క, దర్శనమ్ = దర్శనమును (వర్ణించెను).

తా. హనుమంతుడు రావణుని, అతని పుష్పకమును చూచుటను, మద్యపానభూమికి వెళ్లి అచట రావణాంతఃపురస్త్రీలను చూచుటను వర్ణించెను. 29

మూ. అశోకవనికాయానం సీతాయాశ్చాపి దర్శనమ్,
అభిజ్ఞానప్రదానం చ రావణస్య చ దర్శనమ్. 30

ప్ర. అ. అశోకవనికాయానమ్=అశోకవనములోనికి వెళ్లుటను, సీతాయాః= సీతయొక్క, దర్శనం చాపి = దర్శనమును, అభిజ్ఞానప్రదానం చ = సీతకు ఆనవాలును ఇచ్చుటను, రావణస్య=రావణునియొక్క, దర్శనం చ = దర్శనమును (వర్ణించెను).

తా. హనుమంతుడు అశోకవనములో ప్రవేశించి అచట సీతను చూచుటను, ఆమెకు రాముని ఉంగరమును ఆనవాలుగా ఇచ్చుటను, పిమ్మట రావణుని చూచుటను (వర్ణించెను). 30

మూ. రాక్షసీతర్జనం చైవ త్రిజటాస్వప్నదర్శనమ్,
మణిప్రదానం సీతాయా వృక్షభఙ్గం తథైవ చ. 31

ప్ర. అ. రాక్షసీతర్జనం చైవ = రాక్షసస్త్రీలయొక్క తర్జనమును, త్రిజటాస్వప్నదర్శనమ్ = త్రిజటయొక్క స్వప్నదర్శనమును, సీతాయాః = సీతయొక్క, మణిప్రదానమ్ = మణిని ఇచ్చుటను, తథైవ చ = మరియు, వృక్షభఙ్గమ్ = వృక్షములను విరచుటను (వర్ణించెను).

తా. రాక్షసస్త్రీలు సీతను భయపెట్టుటను, త్రిజటాస్వప్నమును, సీత హనుమంతునకు చూడామణి ఇచ్చుటను, హనుమంతుడు అశోకవనములోని వృక్షములను విరచుటను వర్ణించెను. 31

మూ. రాక్షసీవిద్రవం చైవ కింకరాణాం నిబర్హణమ్,
గ్రహణం వాయుసూనోశ్చ లఙ్కాదాహాభిగర్జనమ్. 32

ప్ర. అ. రాక్షసీవిద్రవం చైవ=రాక్షసస్త్రీలు పారిపోవుటను, కిఙ్కరాణామ్= రావణుని భటులయొక్క, నిబర్హణమ్ = వధను, వాయుసూనోః=హనుమంతుని యొక్క, గ్రహణమ్ = గ్రహణమును, లఙ్కాదాహాభిగర్జనమ్ = లంకయొక్క దహనమును గర్జనమును (వర్ణించెను).

తా. రాక్షసస్త్రీలు పారిపోవుటను, హనుమంతుడు రావణుని భటులను చంపుటను, వాయునందనుడు ఇంద్రజిత్తు చేత పట్టువడుటను, అతడు లంకను దహించుచు గర్జించుటను వర్ణించెను. 32

మూ ప్రతిప్లవనమేవాథ మధూనాం హరణం తథా,
రాఘవాశ్వాసనం చాపి మణినిర్యాతనం తథా. 33

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ప్రతిప్లవనమ్=మరల సముద్రమును దాటుటను, తథా = మరియు, మధూనామ్ = తేనెలయొక్క, హరణమ్=హరించుటను, రాఘవాశ్వాసనం చాపి = రాముని ఓదార్చుటను, తథా = మరియు, మణినిర్యాతనమ్ = మాణిక్యమును ఇచ్చుటను (వర్ణించెను).

తా. హనుమంతుడు మరల సముద్రము దాటి వెనుకకు వచ్చుటను, వానరులు మధువనములో మధువును త్రాగుటను, హనుమంతుడు సీత వార్త తెలిపి, రాముని ఓదార్చి, ఆతనికి సీత ఇచ్చిన చూడామణిని సమర్పించుటను వర్ణించెను. 33

మూ. సంగమం చ సముద్రేణ నలసేతోశ్చ బన్ధనమ్,
ప్రతారం చ సముద్రస్య రాత్రౌ లఙ్కావరోధనమ్. 34

ప్ర. అ. సముద్రేణ=సముద్రముతో, సంగమమ్=కలియుటను, నలసేతోః బన్ధనం చ = నలునిచే సేతువుయొక్క బంధనమును, సముద్రస్య = సముద్రుని యొక్క, ప్రతారం చ = దాటుటను, రాత్రౌ=రాత్రియందు, లఙ్కావరోధనమ్= లంకను ముట్టడించుటను (వర్ణించెను).

తా. రాముడు సైన్యముతో సముద్రము చేరుటను, నలుడు సేతువు బంధించుటను, రాత్రి లంకను ముట్టడించుటను వర్ణించెను. 34

మూ. విభీషణేన సంసర్గం వధోపాయనివేదనమ్,
కుమ్భకర్ణస్య నిధనం మేఘనాదనిబర్హణమ్. 35

ప్ర.అ. విభీషణేన = విభీషణునితో, సంసర్గమ్ = సంబంధమును, వధోపాయనివేదనమ్ = అతడు రావణవధోపాయమును చెప్పుటను, కుమ్భకర్ణస్య = కుంభకర్ణునియొక్క, నిధనమ్ = వధను, మేఘనాదనిబర్హణమ్ = మేఘనాదుని సంహారమును (వర్ణించెను).

తా. విభీషణునితో సంబంధమును, అతడు రామునకు రావణవధోపాయమును చెప్పుటను, కుమ్భకర్ణమేఘనాదుల సంహారమును వర్ణించెను. 35

మూ. రావణస్య వినాశం చ సీతావాప్తిమరేః పురే,
విభీషణాభిషేకం చ పుష్పకస్య చ దర్శనమ్. 36

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, వినాశం చ = వినాశమును, సీతావాప్తిమ్ = సీతాప్రాప్తిని, అరేః పురే = శత్రువుయొక్క పురమైన లంకలో, విభీషణాభిషేకం చ = విభీషణుని అభిషేకమును, పుష్పకస్య = పుష్పకముయొక్క, దర్శనం చ = దర్శనమును (వర్ణించెను).

తా. రావణవధను, సీతాప్రాప్తిని, లంకలో విభీషణరాజ్యాభిషేకమును, పుష్పకదర్శనమును వర్ణించెను. 36

మూ. అయోధ్యాయాశ్చ గమనం భరతేన సమాగమమ్,
రామాభిషేకాభ్యుదయం సర్వసైన్యవిసర్జనమ్,
స్వరాష్ట్రరఞ్జనం చైవ వైదేహ్యాశ్చ విసర్జనమ్. 37

ప్ర. అ. అయోధ్యాయాః గమనమ్ = అయోధ్యాపట్టణమునకు వెళ్లుటను, భరతేన = భరతునితో, సమాగమమ్ = సమాగమమును, రామాభిషేకాభ్యుదయమ్ = రామరాజ్యాభిషేకోత్సవమును, సర్వసైన్యవిసర్జనమ్ = సకలసైన్యమును వెనుకకు పంపివేయుటను, స్వరాష్ట్రరఞ్జనం చైవ = తన రాష్ట్రమును ఆనందింపచేయుటను, వైదేహ్యాః విసర్జనం చ = సీతను విడచుటను (వర్ణించెను).

తా. రాముడు అయోధ్య చేరి భరతుని కలియుటను, రాముని పట్టాభిషేకోత్సవమును, రాముడు వానరసైన్యము నంతను వెనుకను పంపివేయుటను,

దేశములోని ప్రజ లందరును సంతోషించువిధమున రాముడు రాజ్యపాలనము చేయుటను, సీతను త్యజించుటను వర్ణించెను. 37

మూ. అనాగతం చ యత్కించి ద్రామస్య వసుధాతలే,
తచ్చకారోత్తరే కావ్యే వాల్మీకిర్భగవానృషిః. 38

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
తృతీయః సర్గః

ప్ర. అ. భగవాన్=మాహాత్మ్యము కల, వాల్మీకిః ఋషిః=వాల్మీకిమహర్షి, రామస్య=రామునకుసంబంధించిన, యత్కిఞ్చిత్=ఏ ఏ విషయము, వసుధాతలే = ఈ భూతలమునందు, అనాగతం చ = ముమ్ముందు జరుగవలసి ఉన్నదో, తత్ = దానిని, ఉత్తరే = ఉత్తరకథాప్రతిపాదకమగు, కావ్యే = కావ్యమునందు, చకార = రచించెను.

తా. భగవంతుడైన వాల్మీకి ముమ్ముందు జరుగనున్న రాముని చరిత్రము నంతను ఉత్తరకాండలో రచించెను. 38

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాల కాండలో తృతీయసర్గ సమాప్తము.

అథ చతుర్థః సర్గః

మూ. ప్రాప్తరాజ్యస్య రామస్య వాల్మీకిర్భగవానృషిః,
చకార చరితం కృత్స్నం విచిత్రపదమాత్మవాన్. 1

ప్ర. అ. భగవాన్=మాహాత్మ్యము కలవాడును, ఆత్మవాన్=బుద్ధిశాలియు, ఋషిః=కావ్యము చేయ సమర్థుడును అగు, వాల్మీకిః=వాల్మీకి, ప్రాప్తరాజ్యస్య=పొందబడిన రాజ్యము గల, రామస్య=రామునియొక్క, విచిత్రపదమ్=ఆశ్చర్యజనకము లగు శబ్దములు గల, కృత్స్నమ్=సమస్తమైన, చరితమ్=చరిత్రమును, చకార = రచించెను.

తా. భగవంతుడును, ఋషి యగుటచే కావ్యము చేయ సమర్థుడును అగు వాల్మీకి, రాముడు రాజ్యమును పాలించుచుండగా, అతని చరిత్రము నంతను విచిత్రములైన శబ్దములతో రచించెను.

వి. "ప్రాప్తరాజ్యస్య రామస్య చరితం భగవాన్ ఋషిః చకార" అనుటచే రాముడు రాజ్యము చేయుచున్న కాలమునందే వాల్మీకి రామాయణమును రచించెనని సూచిత మగుచున్నది. (గోవిందరాజులు). "తే వయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః" (నీ రాజ్యములో ఉన్న మమ్ములను నీవే రక్షింపవలెను) అని ఋషులు చెప్పుటచే, వాల్మీకి రామరాజ్యమునందే నివసించి ఆతని పవిత్రచరిత్రమును రచించెను (మహేశ్వరతీర్థులు). 1

మూ. చతుర్వింశత్సహస్రాణి శ్లోకానాముక్తవాన్ ఋషిః,
తథా సర్గశతాన్ పఞ్చ షట్కాణ్డాని తథోత్తరమ్. 2

ప్ర. అ. ఋషిః = వాల్మీకిమహర్షి, శ్లోకానాం చతుర్వింశత్సహస్రాణి = ఇరువదినాలుగువేల శ్లోకములను, తథా = మరియు, పఞ్చ = ఐదు, సర్గశతాన్= వందలసర్గలను, షట్కాణ్డాని = ఆరుకాండలను, తథా = మరియు, ఉత్తరమ్= ఉత్తరకాండను, ఉక్తవాన్ = చెప్పెను.

తా. వాల్మీకిమహర్షి రామాయణమును ఏడు కాండములలో, ఐదు వందల సర్గలలో, ఇరువదినాలుగు వేల శ్లోకములలో రచించెను. 2

మూ. కృత్వాపి తన్మహాప్రాజ్ఞః సభవిష్యం సహోత్తరమ్,
చిన్తయామాస కోన్వేతత్ప్రయుఞ్జీయాదితి ప్రభుః. 3

ప్ర. అ. మహాప్రాజ్ఞః = మహాబుద్ధిశాలియు, ప్రభుః = సమర్థుడును అగు వాల్మీకి, సహోత్తరమ్ = రామపట్టాభిషేకము తరువాత జరిగిన కథతో కూడినదియు, సభవిష్యమ్=అశ్వమేధము తరువాత జరిగిన కథతో కూడినదియు అగు, తత్ = రామాయణమును, కృత్వా=రచించి, ఏతత్=దీనిని, కః ను=ఎవడు, ప్రయుఞ్జీయాత్ = ప్రయోగించును, ఇతి = అని, చిన్తయామాస = ఆలోచించెను.

తా. మహాబుద్ధిశాలియు, సమర్థుడును అగు వాల్మీకి రామపట్టాభిషేకానంతరము జరిగిన కథతోడను, అశ్వమేధానంతరము జరిగిన కథతోడను రామాయణమును రచించి "దీనిని యుక్తరీతిలో పఠింపగలవారు ఎవరున్నారా?" అని ఆలోచించెను. 3

మూ. తస్య చిన్తయమానస్య మహర్షేర్భావితాత్మనః,
అగృహ్ణీతాం తతః పాదౌ మునివేషౌ కుశీలవౌ. 4

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మునివేషౌ=మునులవేషములను ధరించిన, కుశీలవౌ = గాయకులైన కుశలవులు, చిన్తయానస్య = ఆలోచించుచున్న, భావితాత్మనః = పరిశుద్ధమైన హృదయముగల, తస్య మహర్షేః = ఆ వాల్మీకమహర్షి యొక్క, పాదౌ = పాదములను, అగృహ్ణీతామ్ = గ్రహించిరి.

తా. పవిత్రహృదయుడగు వాల్మీకమహర్షి ఈ విధముగా ఆలోచించుచుండగా మునివేషధారులైన గాయకులగు కుశలవులు ఆయనకు పాదప్రణామము చేసిరి. 4

మూ. కుశీలవౌ తు ధర్మజ్ఞౌ రాజపుత్రౌ యశస్వినౌ,
భ్రాతరౌ స్వరసమ్పన్నౌ దదర్శాశ్రమవాసినౌ. 5

ప్ర. అ. ధర్మజ్ఞౌ = ధర్మముతెలిసినవారును, రాజపుత్రౌ = రాజకుమారులును, యశస్వినౌ = కీర్తి కలవారును, భ్రాతరౌ=సోదరులును, స్వరసంపన్నౌ=

మధురస్వరముకలవారును, ఆశ్రమవాసినౌ=ఆశ్రమములో నివసించువారునుఅగు, కుశీలవౌ = గాయకులు అగు (కుశలవులను) దదర్శ = చూచెను.

తా. వాల్మీకిమహర్షి ధర్మజ్ఞులు, కీర్తిమంతులు, మధురస్వరవంతులు, ఆశ్రమనివాసులు, సోదరులు, గాయకులు అగు కుశలవులను చూచెను. 5

మూ. స తు మేధావినౌ దృష్ట్వా వేదేషు పరినిష్ఠితౌ,
వేదోపబృంహణార్థాయ తావగ్రాహయత ప్రభుః. 6

ప్ర. అ. ప్రభుః = స్వతంత్రుడైన, సః = ఆ వాల్మీకి, మేధావినౌ=మేధావంతులును, వేదేషు=వేదములలో, పరినిష్ఠితౌ=దృఢ మైన జ్ఞానము కలవారును అగు వారిని, దృష్ట్వా=చూచి, వేదోపబృంహణార్థాయ=వేదములను పరిపుష్టము చేయుటకై రచింపబడిన రామాయణమును, తౌ = వారిని, అగ్రాహయత = గ్రహింపచేసెను.

తా. స్వతంత్రుడైన వాల్మీకి, సాంగవేదాధ్యయనము చేసిన, మేధావంతులైన ఆ ఇరువురిని చూచి, వేదార్థమునకు పరిపుష్టి కూర్చుటకై తాను రచించిన రామాయణమును వారికి ఉపదేశించెను. 6

మూ. కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్,
పౌలస్త్యవధమిత్యేవ చకార చరితవ్రతః. 7

ప్ర. అ. చరితవ్రతః = ఆచరింపబడిన ఉత్తమవ్రతములు గల వాల్మీకి కృత్స్నమ్=సమస్తమైన, కావ్యమ్=ఆ కావ్యమును, రామాయణమ్=రామాయణమనియు, సీతాయాః మహత్ చరితమ్ = సీతయొక్క గొప్ప చరిత్ర అనియు, పౌలస్త్యవధమ్ ఇత్యేవ = పౌలస్త్యవధ మనియు పేర్లతో, చకార = రచించెను.

తా. సకలవ్రతములను ఆచరించిన వాల్మీకి ఆ కావ్యమును "రామాయణము" "సీతాచరితము" "పౌలస్త్యవధము" అను పేర్లతో రచించి ఉండెను. 7

మూ. పాఠ్యే గేయే చ మధురం ప్రమాణైస్త్రిభిరన్వితమ్,
జాతిభిః సప్తభిర్బద్ధం తన్త్రీలయసమన్వితమ్. 8

రసైః శృఙ్గారకారుణ్య హాస్యవీరభయానకైః,
రౌద్రాదిభిశ్చ సంయుక్తం కావ్యమేతదగాయతామ్. 9

తౌ తు గాన్ధర్వతత్త్వజ్ఞౌ మూర్ఛనాస్థానకోవిదౌ,
భ్రాతరౌ స్వరసమ్పన్నౌ గన్ధర్వావివ రూపిణౌ. 10

రూపలక్షణసంపన్నౌ మధురస్వరభాషిణౌ,
బిమ్బాదివోద్ధృతౌ బిమ్బౌ రామదేహాత్తథాపరౌ. 11

ప్ర. అ. గాన్ధర్వతత్త్వజ్ఞౌ = సంగీతశాస్త్రముయొక్క యథార్థస్వరూపము తెలిసినవారును, మూర్ఛనాస్థానకోవిదౌ = స్వరమూర్ఛనల స్థానములు తెలిసిన వారును, భ్రాతరౌ = సోదరులును, స్వరసమ్పన్నౌ = మంచికంఠస్వరము కల వారును, రూపిణౌ = మనుష్యరూపము దాల్చిన, గన్ధర్వావివ = గంధర్వుల వలె ఉన్న వారును, రూపలక్షణసంపన్నౌ = మంచిరూపముతో మంచి లక్షణములతో కూడినవారును, మధురస్వరభాషిణౌ = మధుర మైన స్వరముతో మాటలాడు వారును, బిమ్బాత్ = మూలబింబ మైన, రామదేహాత్ = రాముని దేహమునుండి, ఉద్ధృతౌ = తీయబడిన, అపరౌ బిమ్బౌ ఇవ = వేరైన ప్రతిబింబములవలె ఉన్న వారును అగు, తౌ తు = ఆ కుశలవులు, పాఠ్యే = పఠింపదగిన అంశమునందును, గేయే చ = గానముచేయదగిన అంశమునందును, మధురమ్ = మధుర మైనదియు, త్రిభిః ప్రమాణైః = ద్రుత—మధ్య—విలంబితము లనెడు మూడు ప్రమాణములతో, అన్వితమ్ = కూడినదియు, సప్తభిః జాతిభిః = షడ్జ—మధ్యమ—గాంధార—నిషాద-ఋషభ—ధైవత—పంచమము లనెడు జాతులతో, బద్ధమ్ = కూర్చబడినదియు, తన్త్రీలయసమన్వితమ్ = వీణాతంత్రుల లయముతో కూడినదియు, శృఙ్గారకారుణ్య హాస్యవీరభయానకైః = శృంగార-కరుణ-హాస్య-వీర-భయానకరసములతోడను, రౌద్రాదిభిశ్చ = రౌద్రము మొదలైన, రసైః = రసములతోడను, సంయుక్తమ్ = కూడిన, ఏతత్ = ఈ, కావ్యమ్ = కావ్యమును, అగాయతామ్ = గానముచేసిరి.

తా. కుశలవులు ఆ కావ్యమును చక్కగా గానము చేసిరి. ఆ కావ్యము లోని చదువదగిన అంశము (సాహిత్యము), గానము చేయు అంశము (సంగీతము) కూడ మధురముగా ఉన్నవి. అనగా ఈ కావ్యములోని భాషార్థాది విషయములు మధురముగా నుండుటయే గాక, ఇది గానమునకు కూడ అనువుగా ఉండుటచే

దీని గానము కూడ మధురముగనే ఉన్నది. ద్రుత–మధ్య–విలంబితము అను మూడు ప్రమాణములను, షడ్జాదిసప్తస్వరములను కూడ ఇందు చక్కగ నిర్వహించుటకు వీలున్నది. ఇది వీణాతంత్రులపై లయ కలిపి పాడుటకు అనువుగ ఉన్నది. ఆ యా స్థానములలో ప్రసంగానుగుణముగా శృంగార–హాస్య–కరుణ–రౌద్ర–వీర–భయానక–బీభత్స–అద్భుత–శాంతరసములు నిర్వహింపబడినవి. దీనిని పాడిన కుశలవు లను సోదరులు కూడ సంగీతశాస్త్రరహస్యములు తెలిసినవారు. మూర్ఛనాస్థానములను గుర్తించకలిగినవారు. వీరి కంఠస్వరము అతిమధురము. మనుష్యరూపము ధరించిన గంధర్వుల వలె ఉన్నారు. అపూర్వసౌందర్యముతో, ఉత్తమలక్షణములతో అలరారుచున్న వారు మాటలాడు నపుడు కూడ వారి కంఠస్వరము ఎంతగానో ముచ్చట గొల్పుచు ఉండును. వారు రాముని శరీర మనెడు మూలబింబమునుండి వెలికి తీసిన రెండు ప్రతిబింబములా అన్నట్లు ఉండిరి. 8-11

మూ. తౌ రాజపుత్రౌ కార్త్స్న్యేన ధర్మ్యమాఖ్యానముత్తమమ్,
వాచోవిధేయం తత్సర్వం కృత్వా కావ్యమనిన్దితౌ. 12

ఋషీణాం చ ద్విజాతీనాం సాధూనాం చ సమాగమే,
యథోపదేశం తత్త్వజ్ఞౌ జగతుః సుసమాహితౌ. 13

ప్ర. అ. తౌ = ఆ, రాజపుత్రౌ = రాజపుత్రులు, ధర్మ్యమ్ = ధర్మప్రతిపాదకమును, ఉత్తమమ్ = ఉత్తమ మైనదియు అగు, తత్ సర్వమ్ ఆఖ్యానమ్= ఆ ఆఖ్యానమునంతను, కార్త్స్న్యేన = పూర్తిగా, వాచోవిధేయమ్ = కంఠస్థ మైన దానినిగా, కృత్వా = చేసి, అనిన్దితౌ = ఏ విధముగను తప్పు పట్టుటకు వీలులేనివారై, తత్త్వజ్ఞౌ = ఆ ఆఖ్యానమునకు సంబంధించిన తత్త్వమును బాగుగా తెలిసికొనినవారై, సుసమాహితౌ = బాగుగా సావధానచిత్తులై, యథోపదేశమ్= వాల్మీకిమహర్షి తమకు ఎట్లు ఉపదేశించెనో అదే విధమున, ఋషీణామ్=ఋషుల యొక్కయు, ద్విజాతీనామ్ = ద్విజులయొక్కయు, సాధూనాం చ=సత్పురుషుల యొక్కయు, సమాగమే = సమావేశములయందు, జగతుః = గానముచేసిరి.

తా. ఆ రాజకుమారులు ధర్మప్రతిపాదక మైన ఆ ఉత్తమకావ్యమును పూర్తిగా కంఠస్థము చేసికొని, దాని నెట్లు గానము చేయవలెనో ఆ రహస్యమును

బాగుగా తెలిసికొని, సావధానచిత్తులై, ఋషులు, ద్విజులు, సత్పురుషులు మొదలైన వారి సమావేశములలో, ఎవ్వరును తప్పు పట్టుటకు వీలు కాని విధమున గానము చేసిరి. 12, 13

మూ. మహాత్మానౌ మహాభాగౌ సర్వలక్షణలక్షితౌ,
తౌ కదాచిత్సమేతానామృషీణాం భావితాత్మనామ్,
ఆసీనానాం సమీపస్థావిదం కావ్యమగాయతామ్. 14

ప్ర. అ. మహాత్మానౌ = గొప్ప బుద్ధి కలవారును, మహాభాగౌ = గొప్ప భాగ్యము కలవారును, సర్వలక్షణలక్షితౌ = సమస్తమైన ఉత్తమలక్షణములతో కూడినవారును అగు, తౌ = వారు, కదాచిత్ = ఒకనాడు, సమేతానామ్ = ఒక చోట కలిసి ఉన్న, భావితాత్మనామ్ = పవిత్ర మైన హృదయము గల, ఆసీనానామ్ = కూర్చున్న, ఋషీణామ్ = ఋషులయొక్క, సమీపస్థౌ = సమీపమునందున్న వారై, ఇదమ్=ఈ, కావ్యమ్=కావ్యమును, అగాయతామ్=గానముచేసిరి.

తా. మహాబుద్ధిశాలులును, మహాభాగ్యవంతులును, సర్వలక్షణసంపన్నులును అగు ఆ కుశలవులు, ఒకనాడు, పవిత్రహృదయు లగు కొందరు ఋషీశ్వరులు కలిసి ఒక చోట కూర్చుని యుండగా, వారి ఎదుట ఈ కావ్యమును గానము చేసిరి. 14

మూ. తచ్ఛ్రుత్వా మునయః సర్వే బాష్పపర్యాకులేక్షణాః,
సాధు సాధ్వితి తావూచుః పరం విస్మయమాగతాః. 15

ప్ర. అ. సర్వే = సమస్తమైన, మునయః = మునులు, తత్ = ఆ కావ్యమును, శ్రుత్వా=విని, పరమ్ = గొప్ప, విస్మయమ్=ఆశ్చర్యమును, ఆగతాః= పొందినవారై, బాష్పపర్యాకులేక్షణాః=కన్నీటిచే వ్యాకుల మైన చూపు కలవారై, సాధు సాధు ఇతి = "బాగు బాగు" అని, తౌ = కుశలవులను గూర్చి, ఊచుః = పలికిరి.

తా. వారి కావ్యగానమును విన్న మును లందరును మిక్కిలి ఆశ్చర్యము చెంది, ఆనందబాష్పము కార్చుచు, "బాగు! బాగు!" అని వారిని మెచ్చుకొనిరి. 15

మూ. తే ప్రీతమనసః సర్వే మునయో ధర్మవత్సలాః,
ప్రశశంసుః ప్రశ స్తవ్యౌ గాయమానౌ కుశీలవౌ. 16

ప్ర. అ. ధర్మవత్సలాః = ధర్మమునందు ఆసక్తిగల, తే = ఆ, సర్వే = సమస్తమైన, మునయః = మునులు, ప్రీతమనసః = సంతసించిన మనస్సులు కల వారై, ప్రశస్తవ్యౌ = ప్రశంసార్హులైన, గాయమానౌ = గానము చేయుచున్న, కుశీలవౌ = గాయకులను (కుశలవులను), ప్రశశంసుః = ప్రశంసించిరి.

తా. ధర్మమునందు ఆసక్తి గల ఆ మును లందరును సంతోషించిన హృదయము కలవారై ప్రశంసార్హులైన, గానము చేయుచున్న ఆ కుశలవులను ప్రశంసించిరి. 16

మూ. అహో గీతస్య మాధుర్యం శ్లోకానాం చ విశేషతః,
చిరనిర్వృత్తమప్యేతత్ప్రత్యక్షమివ దర్శితమ్. 17

ప్ర. అ. గీతస్య=గానముయొక్క, మాధుర్యమ్=మాధుర్యము, అహో= ఎంత ఆశ్చర్యకరముగా ఉన్నది. విశేషతః = ప్రధానముగా, శ్లోకానాం తు = శ్లోకముల (మాధుర్యము, ఎంత ఆశ్చర్యకరముగా ఉన్నది!). ఏతత్ = ఈ చరిత్రము, చిరనిర్వృత్తమపి = చాలకాలము క్రితము జరిగిన దైనను, ప్రత్యక్షమివ = ప్రత్యక్షముగ జరుగుచున్నట్లు, దర్శితమ్ = చూపబడినది.

తా. గీతము చాల మధురముగా ఉన్నది. శ్లోకములు ఇంకను మధురములుగా ఉన్నవి. పూర్వ మేనాడో జరిగిన కథ ఇపుడు కండ్లకు కట్టి నట్లు వర్ణింపబడినది. 17

మూ. ప్రవిశ్య తావుభౌ సుష్ఠు భావం సమ్యగగాయతామ్,
సహితౌ మధురం రక్తం సంపన్నం స్వరసమ్పదా. 18

ప్ర. అ. తౌ ఉభౌ=వారిరువురును, సహితౌ=కలిసినవారై, అనగా లయ తప్పనివారై గొంతుకలు కలిపి, భావమ్= అభిప్రాయమును, సుష్ఠు = బాగుగా, ప్రవిశ్య = ప్రవేశించి, మధురమ్=మధురముగాను, రక్తమ్=మనోహరముగాను, స్వరసమ్పదా=షడ్జాదిస్వరసంపదతో, సంపన్నమ్=కూడునట్లుగాను, సమ్యక్= బాగుగా, అగాయతామ్ = గానముచేసిరి.

తా. వారిద్దరును కంఠములు చక్కగా కలిపి, భావావేశముతో, మధురముగాను, మనోహరముగాను, షడ్జాది స్వరములు చెడకుండగను, పాడిరి. 18

మూ. ఏవం ప్రశస్యమానౌ తౌ తపఃశ్లాఘ్యైర్మహాత్మభిః,
సంరక్తతరమత్యర్థం మధురం తావగాయతామ్. 19

ప్ర. అ. తపఃశ్లాఘ్యైః = తపస్సుచే కొనియాడదగిన, మహాత్మభిః = మహాత్ములచేత, ఏవమ్ = ఈ విధముగా, ప్రశస్యమానౌ = ప్రశంసింపబడుచున్న, తౌ = వారు, సంరక్తతరమ్ = మిక్కిలి మనోహరముగా ఉండునట్లును, అత్యర్థమ్ = మిక్కిలి, మధురమ్ = మధురముగాను, అగాయతామ్ = గానముచేసిరి.

మహాతపఃశాలు లగు ఆ మహాత్ము లీవిధముగా కొనియాడగా కుశలవులు అతిమధురముగాను, మనోహరముగాను గానము చేసిరి. 19

మూ. ప్రీతః కశ్చిన్మునిస్తాభ్యాం సంస్థితః కలశం దదౌ,
ప్రసన్నో వల్కలం కశ్చిద్దదౌ తాభ్యాం మహాయశాః. 20

ప్ర. అ. కశ్చిత్ = ఒకానొక, మునిః = ముని, ప్రీతః = సంతసించినవాడై, సంస్థితః = లేచినవాడై, తాభ్యామ్ = ఆ కుశలవులకు, కలశమ్ = కలశమును, దదౌ = ఇచ్చెను. మహాయశాః = గొప్పకీర్తిగల, కశ్చిత్ = ఒకానొకముని, ప్రసన్నః = సంతసించినవాడై, వల్కలమ్ = నారచీరను, దదౌ = ఇచ్చెను.

తా. ఒకానొక మహర్షి సంతోషించినవాడై లేచి వారికి ఒక కలశమును బహూకరించెను. మరి యొక మహర్షి సంతసించి నారచీరను బహూకరించెను. 20

మూ. ఆశ్చర్యమిద మాఖ్యానం మునినా సంప్రకీర్తితమ్,
పరం కవీనా మాధారం సమాప్తం చ యథాక్రమమ్. 21

ప్ర. అ. మునినా = వాల్మీకిమునిచేత, సంప్రకీర్తితమ్ = చెప్పబడిన, ఇదమ్ = ఈ, ఆఖ్యానమ్ = ఆఖ్యానము, ఆశ్చర్యమ్ = ఆశ్చర్యకర మైనది, కవీనామ్ = కవులకు, పరమ్ = అత్యంతము, ఆధారమ్ = ఆధార మైనది, యథాక్రమమ్ = క్రమము ననుసరించి, సమాప్తం చ = సమాప్తము చేయబడినది.

తా. వాల్మీకి రచించిన ఈ రామాయణము చాల ఆశ్చర్యకర మైనది. రాబోవు కవు లందరికిని ఆధార మైనది. క్రమము ప్రకారము పూర్తి చేయ బడినది. 21

మూ. అభిగీతమిదం గీతం సర్వగీతేషు కోవిదౌ,
ఆయుష్యం పుష్టిజనకం సర్వశ్రుతిమనోహరమ్, 22

ప్రశస్యమానౌ సర్వత్ర కదాచిత్తత్ర గాయకౌ,
రథ్యాసు రాజమార్గేషు దదర్శ భరతాగ్రజః. 23

ప్ర. అ. ఆయుష్యమ్ = ఆయుస్సును పెంచునదియు, పుష్టిజనకమ్ = పుష్టిని కలిగించునదియు, సర్వశ్రుతిమనోహరమ్ = అందరి చెవులకును ఇంపుగా నుండునదియు, అభిగీతమ్ = చక్కగా పాడబడినదియు అగు, ఇదమ్ = ఈ, గీతమ్ = గీతమును గూర్చి, ప్రశస్యమానౌ = ప్రశంసించబడుచున్నవారును, రథ్యాసు = వీధులందును, రాజమార్గేషు = రాజమార్గములందును, సర్వత్ర = అంతటను, గాయకౌ = గానముచేయుచున్నవారును, సర్వగీతేషు = సమస్తవిధము లగు గానములందును, కోవిదౌ = సమర్థులును అగు ఆ కుశలవులను, కదాచిత్ = ఒకానొకప్పుడు, భరతాగ్రజః = రాముడు, తత్ర = అచట, దదర్శ = చూచెను.

తా. ఆయుస్సును వృద్ధిపొందించునదియు, పుష్టిని కలిగించునదియు, అందరి చెవులకును ఇంపుగా నుండునదియు అగు ఆ గీతమును చక్కగా పాడుటచే అందరును ఆ కుశలవులను ప్రశంసించుచుండిరి. వారు వీధులందును, రాజమార్గములందును, ఇతరప్రదేశములందును గానము చేయుచుండగా ఒకనాడు రాముడు వారిని చూచుట సంభవించెను. 22, 23

మూ. స్వవేశ్మ చానీయ తతో భ్రాతరౌ స కుశీలవౌ,
పూజయామాస పూజార్హౌ రామః శత్రునిబర్హణః. 24

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శత్రునిబర్హణః = శత్రువులను సంహరించు, సః = ఆ, రామః = రాముడు, పూజార్హౌ = గౌరవమునకు తగిన, భ్రాతరౌ = సోదరులైన, కుశీలవౌ = గాయకులను (కుశలవులను), స్వవేశ్మ = తన గృహమును గూర్చి, ఆనీయ = తీసుకొనివచ్చి, పూజయామాస = గౌరవించెను.

తా. రాముడు గౌరవార్హులైన ఆ కుశలవులను తన ఇంటికి రప్పించి గౌరవించెను. 24

మూ. ఆసీనః కాఞ్చనే దివ్యే స చ సింహాసనే ప్రభుః,
ఉపోపవిష్టః సచివైర్భ్రాతృభిశ్చ పరన్తపః. 25

ప్ర. అ. పరన్తపః = శత్రువులను పీడించు, సః ప్రభుః = ఆ రాముడు, సచివైః = మంత్రులచేతను, భ్రాతృభిశ్చ = సోదరులచేతను, ఉపోపవిష్టః=చుట్టబడినవాడై, దివ్యే = దివ్యమైన, కాఞ్చనే = బంగారువికారమైన, సింహాసనే = సింహాసనమునందు, ఆసీనః = కూర్చుండెను.

తా. (శత్రుభయంకరుడగు ఆ) రాముడు, మంత్రులును, సోదరులును సమీపమున కూర్చొని యుండగా, దివ్యమైన కనకసింహాసనమును అలంకరించి ఉండెను. 25

మూ. దృష్ట్వా తు రూపసమ్పన్నౌ తావుభౌ నియతస్తదా,
ఉవాచ లక్ష్మణం రామః శత్రుఘ్నం భరతం తథా. 26

ప్ర. అ. నియతః = నియమవంతుడైన, రామః = రాముడు, తదా = అప్పుడు, రూపసమ్పన్నౌ=మంచిరూపముతో కూడిన, తౌ=ఆ, ఉభౌ=ఇద్దరిని, దృష్ట్వా = చూచి, లక్ష్మణమ్ = లక్ష్మణుని, శత్రుఘ్నమ్=శత్రుఘ్నుని, తథా= మరియు, భరతమ్ = భరతునిగూర్చి, ఉవాచ = పలికెను.

తా. అప్పుడా రాముడు, మంచి రూపముతో ప్రకాశించుచున్న వారిరువురిని చూచి భరత లక్ష్మణ శత్రుఘ్నులతో ఇట్లనెను. 26

మూ. శ్రూయతామిద మాఖ్యానమనయోర్దేవవర్చసోః,
విచిత్రార్థపదం సమ్యగ్గాయకౌ తావచోదయత్. 27

ప్ర. అ. దేవవర్చసోః = దేవతలవంటి కాంతిగల, అనయోః = వీరిద్దరియొక్క, విచిత్రార్థపదమ్=విచిత్రమైన అర్థములును పదములును గల, ఇదమ్= ఈ, ఆఖ్యానమ్ = ఆఖ్యానము, సమ్యక్ = బాగుగా, శ్రూయతామ్=వినబడుగాక, (ఇట్లు పలికి) తౌ గాయకౌ = ఆ గాయకులను, అచోదయత్ = ప్రేరేపించెను.

తా. "దేవతల వంటి తేజస్సు గల వీరిద్దరు పాడ నున్న, విచిత్ర మైన పదములును, అర్థములును గల ఈ ఆఖ్యానమును శ్రద్ధగా వినుడు" అని వారితో పలికి, కుశలవులను పాడు డని నియోగించెను. 27

మూ. తౌ చాపి మధురం రక్తం స్వంచితాయతనిస్వనమ్,
తన్త్రీలయవదత్యర్థం విశ్రుతార్థమగాయతామ్. 28

ప్ర. అ. తౌ చ = వారిరువురు, మధురమ్ = మధురముగాను, రక్తమ్ = రాగయుక్తము గాను, స్వంచితాయతనిస్వనమ్=బాగుగా ఒప్పుచున్న దీర్ఘ మైన ధ్వని కలుగునట్లుగాను, తన్త్రీలయవత్ = వీణాతంత్రుల లయకు సరిపడు నట్లుగాను, అత్యర్థమ్=మిక్కిలి, విశ్రుతార్థమ్=స్పష్ట మైన అర్థము కలుగు నట్లుగాను, అగాయతామ్ = గానము చేసిరి.

తా. ఆ కుశలవులు మధురముగాను, రాగయుక్తముగాను గానము చేసిరి. వారి కంఠధ్వని చాల చక్కగ దీర్ఘముగ ఉండెను. వారి పాట వీణాతంత్రుల లయమునకు సరిపడి ఉండెను. అర్థము స్పష్టముగ తెలియుచుండెను. 28

మూ. హ్లాదయత్సర్వగాత్రాణి మనాంసి హృదయాని చ,
శ్రోత్రాశ్రయసుఖం గేయం తద్బభౌ జనసంసది. 29

ప్ర. అ. శ్రోత్రాశ్రయసుఖమ్ = శ్రవణేంద్రియమునకు సుఖకరముగా ఉన్న, తత్ = ఆ, గేయమ్ = పాట, జనసంసది = జనసమూహమునందు, సర్వగాత్రాణి = అన్ని అవయవములను, మనాంసి=మనస్సులను, హృదయాని చ = మనస్సులకు స్థానములైన హృదయములను, హ్లాదయత్ = సంతోషింపచేయుచున్నదై, బభౌ = ప్రకాశించెను.

తా. జనసమూహములో ఆ కుశలవుల గానము వీనులకు విందుగా నుండి, వినువారి సర్వేంద్రియములను, మనస్సులను, హృదయములను ఆనందింపచేసెను. 29

మూ. ఇమౌ మునీ పార్థివలక్షణాన్వితౌ
కుశీలవౌ చైవ మహాతపస్వినౌ,

మమాపి తద్భూతికరం ప్రవక్ష్యతే
మహానుభావం చరితం నిబోధత. 30

ప్ర. అ. ఇమౌ = ఈ, మునీ = మునులు, పార్థివలక్షణాన్వితౌ = రాజలక్షణములతో కూడి యున్నారు. కుశీలవౌ చైవ = గాయకులైనను, మహాతపస్వినౌ=గొప్ప తపఃశాలులు. మమాపి=నాకు కూడ, భూతికరమ్=శేయస్కరమగు, మహానుభావమ్ = గొప్ప శక్తి గల, తత్ చరితమ్ = ఆ సీతాచరిత్రము, ప్రవక్ష్యతే = చెప్పబడును, నిబోధత = సావధానచిత్తులై వినండి.

తా. ఓ జనులారా! వీరిరువురు మునులే అయినను రాజలక్షణములతో ప్రకాశించుచున్నారు. గాయకులే అయినను గొప్ప తపస్సు కలవారు. వీరు గానము చేయనున్న సీతాచరితము నాకు కూడ ఊరట కలిగించున దగుటచే శ్రేయస్కరము. సావధానచిత్తులై వినుడు (అని శ్రీరాముడు అక్కడ నున్న వారితో పలికెను). 30

మూ. తతస్తు తౌ రామవచఃప్రచోదితా
వగాయతాం మార్గవిధానసమ్పదా,
స చాపి రామః పరిషద్గతః శనై
ర్బుభూషయా సక్తమనా బభూవహ. 31

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే
బాలకాణ్డే చతుర్థః సర్గః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తౌ=ఆ కుశలవులు, రామవచఃప్రచోదితౌ= రాముని వాక్కుచే ప్రేరేపింపబడిన వారై, మార్గవిధానసమ్పదా = మార్గ మనెడి గానవిధానసంపదతో, అగాయతామ్ = గానము చేసిరి. పరిషద్గతః = పరిషత్తులో ఉన్న, సః = ఆ, రామః అపి = రాముడు కూడ, శనైర్బుభూషయా = శాంతచిత్తుడు కావలె నను ఇచ్ఛతో, సక్తమనాః=ఆ గానమునందు ఆసక్తమైన మనస్సు కలవాడు, బభూవ = అయ్యెను.

తా. రాముడు ప్రేరేపించగా, ఆ కుశలవులు, మార్గదేశిపద్ధతు లనెడు రెండు గానపద్ధతులలో మార్గపద్ధతినే చక్కగా అవలంబించి గానము చేసిరి. పరిషత్తులో నున్న రాముడు కూడ మనఃశాంతి పొంద వలె ననెడు అభిలాషచే ఆ గానమునందు ఆసక్తచిత్తు డయ్యెను. 31

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో చతుర్థసర్గ సమాప్తము.

అథ పఞ్చమః సర్గః

మూ. సర్వా పూర్వమియం యేషామాసీత్కృత్స్నా వసుంధరా,
ప్రజాపతిముపాదాయ నృపాణాం జయశాలినామ్. 1

ప్ర. అ. సర్వా = సకలద్వీపాత్మక మైన, కృత్స్నా = సమస్త మైన, ఇయం వసుధా = ఈ భూమి, ప్రజాపతిమ్ ఉపాదాయ = మనుప్రజాపతి మొదలుకొని, జయశాలినామ్ = విజయవంతు లైన, యేషామ్ = ఏ, నృపాణామ్ = రాజులకు సంబంధించినదిగా, పూర్వమ్ = పూర్వము, ఆసీత్ = ఉండెనో.

తా. అష్టాదశద్వీప పరిమిత యైన ఈ భూమి యంతయు, పూర్వము, మనుచక్రవర్తి మొదలుకొని, విజయవంతు లైన ఏ రాజుల వశములో ఉండెడిదో.

ఈ శ్లోకమునకు మూడవ శ్లోకముతో అన్వయము.

'సర్వా' 'కృత్స్నా' శబ్దములకు అర్థములో భేదము లేదు. రెండు పదములను ప్రయోగించుటచే 'సర్వా' అనుదానికి 'అన్ని ద్వీపభేదములు కలది' అనియు, 'కృత్స్నా' అనుదానికి "సమస్త మైనది" అనియు అర్థము చెప్పబడినది.

రామాయణ భారత పురాణాదిప్రాచీన గ్రంథాలలో ఇలాంటి పునరుక్తులు, పాద పూరణానికి మాత్రమే ఉపయోగించే "చ, వా, తు, హ, వై," మొదలైన పదాలు అత్యధికముగా ఉండును. వాటిని ఆ విధముగానే గ్రహించుట మంచిది. ఏదో అపూర్వార్థము కల్పించుట హృదయంగమముగా ఉండదు. ప్రకరణాదులను పట్టి భాషకు స్వభావసిద్ధముగా ఉన్న అర్థమును మాత్రమే గ్రహించుట యుక్తము. 1

మూ. యేషాం స సగరో నామ సాగరో యేన ఖానితః,
షష్టిః పుత్రసహస్రాణి యం యాన్తం పర్యవారయన్. 2

ప్ర. అ. యేన = ఎవనిచేత, సాగరః = సముద్రము, ఖానితః = త్రవ్వించబడినదో, యాన్తమ్ = యుద్ధమునకు వెళ్లుచున్న, యమ్ = ఎవనిని, షష్టిః పుత్రసహస్రాణి = అరువది వేలమంది కుమారులు, పర్యవారయన్ = చుట్టుకొని ఉండెడివారో, సః = అట్టి, సగరో నామ = సగరు డనే రాజు, యేషామ్ = ఏ రాజులలో ఉండెడివాడో.

తా. ఏ రాజులలో సగరు డనెడు చక్రవర్తి ఉండెడివాడో—ఆ సగరచక్ర వర్తి ఈ సాగరమును త్రవ్వించగా అది వైశాల్యమును పొందినది. ఆతడు యుద్ధ యాత్రకై బయలుదేరి నపుడు అతనితో కూడ అరువదివేలమంది కుమారులు వెళ్లెడివారు. 2

మూ. ఇక్ష్వాకూణామిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనామ్,
మహదుత్పన్నమాఖ్యానం రామాయణమితి శ్రుతమ్. 3

ప్ర. అ. తేషామ్ = అట్టి, మహాత్మనామ్ = మహాత్ములైన, ఇక్ష్వాకూణాం రాజ్ఞామ్ = ఇక్ష్వాకువంశమునందు పుట్టిన రాజులయొక్క, వంశే = వంశము నందు, రామాయణమితి = రామాయణ మని, శ్రుతమ్ = ప్రసిద్ధి కాంచిన, మహత్ = పూజ్య మైన, ఇదమ్ = ఈ, ఆఖ్యానమ్ = ఆఖ్యానము, ఉత్పన్నమ్ = పుట్టినది.

తా. రామాయణ మని ప్రసిద్ధి చెందిన ఈ పవిత్ర మైన ఆఖ్యానము అట్టి మహాత్ము లైన ఇక్ష్వాకువంశరాజుల వంశములో పుట్టినది. 3

మూ. తదిదం వర్తయిష్యామి సర్వం నిఖిలమాదితః,
ధర్మకామార్థసహితం శ్రోతవ్యమనసూయయా. 4

ప్ర. అ. తత్ = అట్టి, ఇదమ్ = ఈ రామాయణమును, సర్వమ్ = సమస్త మైన దానిని, వర్తయిష్యామి = లోకములో ప్రవర్తింపచేసెదను. ధర్మకామార్థ సహితమ్ = ధర్మార్థకామము లనెడు పురుషార్థములతో కూడిన, నిఖిలమ్ = ఈ రామాయణ మంతయును, ఆదితః = ప్రారంభము నుండియు, అనసూయయా = అసూయ లేకుండగా, శ్రోతవ్యమ్ = వినదగినది.

తా. అట్టి ఈ రామాయణము నంతను లోకములో ప్రవర్తింపచేసెదను. ధర్మార్థ కామము లనెడు పురుషార్థములను ప్రతిపాదించు ఈ రామాయణమును పూర్తిగ మొదటినుండియు అసూయాభావము లేనివారై వినుడు. 4

మూ. కోసలో నామ ముదితస్స్ఫీతో జనపదో మహాన్,
నివిష్టః సరయూతీరే ప్రభూతధనధాన్యవాన్. 5

ప్ర. అ. ప్రభూతధనధాన్యవాన్ = అధిక మైన ధనధాన్యములు కలదియు,

ముదితః=సంతోషముతో కూడినదియు, స్ఫీతః=విశాలమైనదియు అగు, కోసలో నామ = కోసల మనెడు, మహాన్ = గొప్పదైన, జనపదః = దేశము, సరయూ తీరే = సరయూనదీతీరమునందు, నివిష్టః = నెలకొని యున్నది.

తా. ధనధాన్యములతో తులతూగుచు నిత్యసంతుష్టులైన ప్రజలు గల, విశాల మైన కోసల మనెడు ఒక గొప్ప దేశము సరయూతీరమున నెలకొని యున్నది. 5

మూ. అయోధ్యా నామ నగరీ తత్రాసీల్లోకవిశ్రుతా,
మనునా మానవేన్ద్రేణ యా పురీ నిర్మితా స్వయమ్. 6

ప్ర. అ. తత్ర = ఆ కోసలదేశమునందు, యా పురీ = ఏ పట్టణము, మానవేన్ద్రేణ=మానవులకు ప్రభు వైన, మనునా=మనుచక్రవర్తిచేత, స్వయమ్= స్వయముగా, నిర్మితా = నిర్మింపబడినదో అట్టి, అయోధ్యా నామ = అయోధ్య యను పేరు గల, విశ్రుతా = ప్రసిద్ధ మైన, నగరీ = నగరి, ఆసీత్=ఉండెను.

తా. ఆ కోసలదేశములో అయోధ్యయను ఒక ప్రసిద్ధ మైన పట్టణము ఉండెను; సకలమానవులకును ప్రభు వైన మనుచక్రవర్తి స్వయముగ దానిని సంకల్పబలముచే నిర్మించెను. 6

మూ. ఆయతా దశ చ ద్వే చ యోజనాని మహాపురీ,
శ్రీమతీ త్రీణి విస్తీర్ణా సువిభక్తమహాపథా. 7

ప్ర. అ. శ్రీమతీ=శోభాయుత మైనదియు, సువిభక్తమహాపథా=చక్కగా ఏర్పరుపబడిన విశాల మైన మార్గములు గల, మహాపురీ = మహానగర మైన ఆ అయోధ్య, దశ చ ద్వే చ = పంద్రెండు, యోజనాని = యోజనములను, ఆయతా = దీర్ఘమైనది, త్రీణి = మూడు యోజనములను, విస్తీర్ణా=వెడల్పైనది.

తా. చక్కగా ఏర్పరుపబడిన విశాలము లైన మార్గములతో శోభాయుత ముగా ఉన్న ఆ అయోధ్యానగరము పంద్రెండు యోజనముల పొడవు, మూడు యోజనముల వెడల్పు కలదై ఉండెను. 7

మూ. రాజమార్గేణ మహతా సువిభక్తేన శోభితా,
ముక్తపుష్పావకీర్ణేన జలసిక్తేన నిత్యశః. 8

ప్ర. అ. సువిభక్తేన = చక్కగా ఏర్పరుపబడినదియు, ముక్తపుష్పావకీర్ణేన = చల్లబడిన పుష్పములతో వ్యాప్తమైనదియు, నిత్యశః = ఎల్లప్పుడును, జలసిక్తేన = నీటితో తడపబడిన, మహతా = విశాల మైన, రాజమార్గేణ = రాజమార్గముచే, శోభితా = ప్రకాశింపచేయబడినది.

తా. అయోధ్యానగరము, చక్కగా ఏర్పరచిన, విశాల మైన రాజమార్గముతో ఒప్పారుచుండెను. దానియందంతటను పుష్పములు చల్లుచుండెడివారు. నిత్యము నీరు చల్లి తడుపుచుండెడివారు. 8

మూ. తాం తు రాజా దశరథో మహారాష్ట్రవివర్ధనః,
పురీమావాసయామాస దివం దేవపతిర్యథా. 9

ప్ర. అ. మహారాష్ట్రవివర్ధనః = గొప్ప రాజ్యమును వృద్ధి పొందించు, దశరథః = దశరథు డనెడు, రాజా = రాజు, దేవపతిః = దేవేంద్రుడు, దివం యథా = స్వర్గమును వలె, తాం పురీమ్ = ఆ అయోధ్యాపట్టణమును, ఆవాసయామాస = నివాసముగా చేసికొనెను.

తా. విశాల మైన రాజ్యమును పరిపాలింప సమర్థు డైన దశరథు డను రాజు, దేవేంద్రుడు స్వర్గములో నివసించి నట్లు, ఆ పట్టణములో నివసించెను. 9

మూ. కవాటతోరణవతీం సువిభక్తాన్తరాపణామ్,
సర్వయన్త్రాయుధవతీముపేతాం సర్వశిల్పిభిః. 10

ప్ర. అ. కవాటతోరణవతీమ్ = ప్రశస్తము లైన నగరము వెలుపలి తలుపులును దారుబంధములును కలదియు, సువిభక్తాన్తరాపణామ్ = చక్కగా తీర్చి దిద్దిన మధ్య ప్రదేశములు గల అంగళ్లు కలదియు, సర్వయన్త్రాయుధవతీమ్ = సమస్త మైన యంత్రములు ఆయుధములు కలదియు, సర్వశిల్పిభిః = సమస్తశిల్పులతో, ఉపేతామ్ = కూడినదియు అగు, "పురీం దశరథః ఆవాసయామాస" అను 22వ శ్లోకములో ఉన్న వాక్యముతో ఈ శ్లోకము మొదలు అన్ని శ్లోకములకును అన్వయము.

తా. ఆ అయోధ్యానగరమునకు వెలుపల నున్న తలుపులును, దారుబంధములును, చాల దృఢ మైనవి. అంగడి వీథులన్నియు మధ్యలో చక్కగా తీర్చి

దిద్దబడి యున్నవి. అచ్చటచ్చట అనేక విధము లైన యంత్రములును, ఆయుధ ములును నెలకొల్పబడి ఉన్నవి. ఎందరో శిల్పులు ఈ నగరములో నివసించు చుండిరి 10

మూ. సూతమాగధసంబాధాం శ్రీమతీమతులప్రభామ్,
ఉచ్చాట్టాలధ్వజవతీం శతఘ్నిశతసఙ్కులామ్. 11

ప్ర. అ. సూతమాగధసంబాధామ్ = స్తోత్రములు చేయు సూతులచేతను, కులవంశములను పొగడు మాగధులచేతను ఇరుకుగా ఉన్నదియు, శ్రీమతీమ్ = సమృద్ధి కలదియు, అతులప్రభామ్ = సాటి లేని కాంతి కలదియు, ఉచ్చాట్టాల ధ్వజవతీమ్ = ఉన్నతము లైన కోటబురుజులును ధ్వజములును కలదియు, శతఘ్నిశతసఙ్కులామ్ = వందలకొలది శతఘ్ను లనెడు ఆయుధములతో (నూరుగురిని ఒక్కమారుగా చంపు ఆయుధము) నిండినదియును....

తా. ఆ నగరమందు ఎందరో సూతులును, మాగధులును నివసించు చుండిరి. అది అత్యధిక సమృద్ధితో, సాటిలేని శోభతో, ప్రకాశించుచుండెను. ఇందలి కోట బురుజులును, ధ్వజములును చాల ఉన్నతముగ ఉండెను. వందలాది శతఘ్నులు అచ్చటచ్చట అమర్చబడి ఉండెను. 11

మూ. వధూనాటకసంఘైశ్చ సంయుక్తాం సర్వతః పురీమ్,
ఉద్యానామ్రవణోపేతాం మహతీం సాలమేఖలామ్. 12

ప్ర. అ. వధూనాటకసంఘైశ్చ = స్త్రీల (నాట్యకత్తెల) యొక్కయు నటులయొక్కయు సంఘములతో, సంయుక్తామ్ = కూడినదియు, సర్వతః పురీమ్ = నలువైపుల శాఖానగరములు గలదియు, ఉద్యానామ్రవణోపేతామ్ = ఉద్యానవనములతోడను, మామిడి తోపులతోడను కూడినదియు, మహతీమ్ = విశాల మైనదియు, సాలమేఖలామ్ = ప్రాకారమే వడ్డాణముగా కలదియు....

తా. ఈ నగరములో ఎన్నియో నటీనటసంఘము లుండెడివి. నలు వైపుల శాఖానగరములు ఉండెను. అచ్చటచ్చట ఉద్యానవనములును, మామిడితోపులును ఉండెను. అతివిశాలమైన ఈ నగరమునకు చుట్టును ఉన్న ఉన్నత మైన ప్రాకారము దీనికి వడ్డాణము వలె ఉండెను. 12

మూ. దుర్గగమ్భీరపరిఘాం దుర్గామన్యైర్దురాసదామ్,
వాజివారణసంపూర్ణాం గోభిరుష్ట్రైః ఖరైస్తథా. 13

ప్ర. అ. దుర్గగమ్భీరపరిఘామ్ = ప్రవేశింప శక్యము కాని అగాధ మైన అగడ్త కలదియును, దుర్గామ్ = ప్రవేశింప శక్యము కానిదియు, అన్యైః=శత్రువుల చేత, దురాసదామ్ = ఆక్రమింప శక్యము కానిదియు, వాజివారణసంపూర్ణామ్ = గుఱ్ఱములతోడను ఏనుగులతోడను నిండినదియు, తథా = మరియు, గోభిః = గోవులతోడను, ఉష్ట్రైః = ఒంటెలతోడను, ఖరైః = గాడిదలతోడను (నిండినదియు)........

తా. ఆ నగరము చుట్టును ప్రవేశింప శక్యము కాని, అగాధ మైన అగడ్త ఉండెను. ఎవ్వరును ఆ నగరములో ప్రవేశించి దానిని ఆక్రమింపజాలరు. అది గుఱ్ఱములు, ఏనుగలు, గోవులు, ఒంటెలు, గాడిదలు మొదలైనవాటితో నిండియుండెను. 13

మూ. సామన్తరాజసంఘైశ్చ బలికర్మభిరావృతామ్,
నానాదేశనివాసైశ్చ వణిగ్భిరుపశోభితామ్. 14

ప్ర. అ. బలికర్మభిః = కప్పము కట్టునట్టి, సామన్తరాజసంఘైశ్చ = సామంతరాజుల సమూహములచే, ఆవృతామ్ = నిండి యున్నదియు, నానాదేశనివాసైః = అనేకదేశములందు నివసించువారైన, వణిగ్భిః చ = వర్తకులచే గూడ, ఉపశోభితామ్ = ప్రకాశింపచేయబడినదియు....

తా. ఆ నగరము కప్పముకట్టుటకై వచ్చిన సామంతరాజులచేతను, నానాదేశములనుండి వచ్చిన వర్తకులచేతను వ్యాప్తమై యుండెడిది. 14

మూ. ప్రాసాదై రత్నవికృతైః పర్వతైరుపశోభితామ్,
కూటాగారైశ్చ సంపూర్ణామిన్ద్రస్యేవామరావతీమ్. 15

ప్ర. అ. రత్నవికృతైః = రత్నములతో విశేషరూపమున అలంకరింపబడిన, ప్రాసాదైః = మేడలతోడను, పర్వతైః = క్రీడాపర్వతములతోడను, ఉప

శోభితామ్=ప్రకాశింపచేయబడినదియు, కూటాగారైః చ=మేడలపై మేడలతోడను, సంపూర్ణామ్ = నిండినదియును, ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క, అమరావతీమివ = అమరావతీ నగరము వలె నున్నదియు, ...

తా. ఆ నగరము రత్నములతో అలంకరించిన రాజగృహములతోడను, క్రీడాపర్వతములతోడను ప్రకాశించుచుండెను. మేడలపై కట్టిన మేడలతో నిండి ఇంద్రుని రాజధాని యగు అమరావతివలె ఉండెను. 15

మూ. చిత్రామష్టాపదాకారాం వరనారీగణైర్యుతామ్,
సర్వరత్నసమాకీర్ణాం విమానగృహశోభితామ్. 16

ప్ర. అ. చిత్రామ్ = ఆశ్చర్యకర మైనదియు, లేదా, వివిధవర్ణములు కలదియు, అష్టాపదాకారామ్ = జూద మాడెడి పీటయొక్క ఆకారమువంటి ఆకారము కలదియు, వరనారీగణైః = సుందరు లైన స్త్రీల గణములతో, యుతామ్ = కూడినదియు, సర్వరత్నసమాకీర్ణామ్ = సమస్త మైన రత్నములతో వ్యాప్త మైనదియు, విమానగృహశోభితామ్ = ఏడంతస్తుల భవనములతో ప్రకాశించునదియు.

తా. జూదమాడు పీటవంటి ఆకారము గల ఆ నగరము చాల ఆశ్చర్య జనకమై సుందరు లగు స్త్రీలతో నిండి యుండెను. అన్ని విధము లైన రత్నములును ఇచట ఉండెను. ఏడంతస్తుల విశాలభవనములతో ప్రకాశించుచుండెను. 16

మూ. గృహగాఢా మవిచ్ఛిద్రాం సమభూమౌ నివేశితామ్,
శాలితణ్డులసంపూర్ణామిక్షుకాణ్డరసోదకామ్. 17

ప్ర. అ. గృహగాఢామ్ = ఇండ్లతో దట్ట మైనదియు, అవిచ్ఛిద్రామ్ = ఏదో ఒక విధముగ ఉపయోగింపక విడచిన చోటు లేనిదియు, సమభూమౌ = మిట్టపల్లములు లేని భూమిపై, నివేశితామ్ = నిర్మింపబడినదియు, శాలితణ్డుల సంపూర్ణామ్ = వరిబియ్యముతో నిండినదియు, ఇక్షుకాణ్డరసోదకామ్ = చెఱకు కఱ్ఱరసము వంటి ఉదకము కలదియు....

తా. ఆ నగరములో దట్టముగ ఇండ్లు కట్టబడెను. అనుపయుక్త మైన స్థల మేదియు లేకుండెను. అది మిట్ట పల్లములు లేని భూమిపై నిర్మింపబడెను.

పరిబియ్యము సమృద్ధిగ లభించుచుండెడివి. ఉదకము చెఱకురసము వలె మధుర
ముగ నుండెను. 17

మూ. దున్దుభీభిర్మృదఙ్గైశ్చ వీణాభిః పణవై స్తథా,
నాదితాం భృశమత్యర్థం పృథివ్యాం తామను త్తమామ్. 18

ప్ర. అ. దున్దుభీభిః = దుందుభులచేతను, మృదఙ్గైశ్చ = మృదంగములచే
తను, వీణాభిః = వీణలచేతను, తథా = మరియు, పణవైః = తమ్మటముల
చేతను, భృశమ్ = మిక్కిలి, నాదితామ్ = ధ్వనింప చేయబడినదియు, పృథి
వ్యామ్=భూమియందు, అత్యర్థమ్ = మిక్కిలి, అను త్తమామ్ = శ్రేష్ఠ మైనదియు,
తామ్ = ప్రసిద్ధ మైనదియు....

తా. ఆ నగరమునందు దుందుభి మృదంగ వీణా పణవాది మంగళ వాద్య
ముల ధ్వనులు ఎల్లప్పుడును మిన్ను ముట్టుచుండెడివి. భూమిలో దీనికంటె ఉత్తమ
మైన పట్టణము మరొకటి లేదు. 18

మూ. విమానమివ సిద్ధానాం తపసాధిగతం దివి,
సునివేశితవేశ్మాన్తాం నరో త్తమసమావృతామ్. 19

ప్ర. అ. దివి = స్వర్గమునందు, తపసా = తపస్సుచేత, అధిగతమ్ =
పొందబడిన, సిద్ధానామ్ = సిద్ధులయొక్క, విమానమివ = విమానము వలె
నున్నదియు, సునివేశిత వేశ్మాన్తామ్ = చక్కగా ఏర్పరుపబడిన గృహప్రదేశ
ములు కలదియు, నరో త్తమసమావృతామ్ = ఉత్తము లగు మనుష్యులతో
నిండినదియు, ...

తా. సిద్ధులు తపఃశ క్తిచే స్వర్గమునందు నిర్మించుకొనిన విమానము వలె
ఉన్న ఆ అయోధ్యలో గృహములు బారులు దీర్చి చక్కగ నిర్మింపబడినవి.
ఉత్తము లైన మనుష్యులు అచట నివసించెడివారు. 19

మూ. యే చ బాణైర్న విధ్యన్తి వివి క్తమపరాపరమ్,
శబ్దవేధ్యం చ వితతం లఘుహస్తా విశారదాః. 20

సింహవ్యాఘ్రవరాహాణాం మత్తానాం నర్దతాం వనే,
హన్తారో నిశితైః శస్త్రైర్బలాద్బాహుబలైరపి. 21

తాదృశానాం సహస్రైస్తామభిపూర్ణాం మహారథైః,
పురీమావాసయామాస రాజా దశరథస్తదా. 22

ప్ర. అ. లఘుహస్తాః = చేతిచురుకు గల, విశారదాః = నేర్పరులైన, యే = ఎవరు, వివిక్తమ్ = ఒంటరిగా ఉన్నవానిని, అపరాపరమ్ = ముందు వెనుక లేనివానిని, అనగా తండ్రి గాని కుమారుడు గాని లేనివానిని, శబ్దవేధ్యమ్ = శబ్దమును పట్టి కొట్టుటకు అనువుగా ఉన్నవానిని, వితతం చ = పారిపోవుచున్న వానిని, బాణైః = బాణములచే, న విధ్యన్తి = కొట్టరో, వనే = వనమునందు, నర్దతామ్ = గర్జించుచున్న, మత్తానామ్ = మదించిన, సింహవ్యాఘ్రవరాహాణామ్ = సింహవ్యాఘ్రవరాహములకు (ను), నిశితైః = వాడియైన, శస్త్రైః = ఆయుధములచే, బలాత్ = ఆయుధబలమువలనను, బాహుబలైరపి = బాహుబలములచేతను, హన్తారః = చంపువారో, తాదృశానామ్ = అట్టి వారి యొక్క, మహారథైః = మహారథులైన, సహస్రైః = సహస్రములతో, అభిపూర్ణామ్ = నిండిన, తామ్ = ఆ, పురీమ్ = అయోధ్యానగరమును, తదా = అప్పుడు, రాజా దశరథః = దశరథమహారాజు, ఆవాసయామాస = నివాసముగా చేసికొనెను.

తా. ఈ నగరములో వేలకొలది మహారథులైన వీరు లుండిరి. వారు బాణప్రయోగమునందు హస్తలాఘవము గలవారు. ఒంటరిగా ఉన్న వానిని, తండ్రి గాని కుమారుడు గాని (వెనుక ముందు) లేనివానిని, శబ్దమును పట్టి కొట్టుటకు వీలుగా ఉన్నవానిని, పారిపోవుచున్న వానిని ఎన్నడును బాణములచే కొట్టెడి వారు కారు. మదించి వనములలో గర్జించు చున్న సింహవ్యాఘ్రవరాహాది క్రూరమృగములను తీక్ష్ణములైన ఆయుధములచేత గాని, ఆయుధములు లేకుండ కేవల బాహుబలముచేత గాని చంపెడివారు. అట్టి అయోధ్యానగరమును దశరథ మహారాజు నివాసముగా చేసికొని రాజ్యము పాలించెను. 21, 22

మూ. తామగ్నిమద్భిర్గుణవద్భిరావృతాం,
ద్విజోత్తమైర్వేదషడఙ్గపారగైః,

సహస్రదైః సత్యరతైర్మహాత్మభి
ర్మహర్షికల్పై ఋషిభిశ్చ కేవలైః. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పఞ్చమః సర్గః.

ప్ర. అ. అగ్నిమద్భిః = ఆహితాగ్నులును, గుణవద్భిః = గుణవంతులును, వేదషడఙ్గపారగైః = ఋగ్యజుస్సామాథర్వవేదములందును శిక్షావ్యాకరణచ్ఛందో నిరుక్తజ్యోతిషకల్పము లనెడు ఆరు వేదాంగములందును పూర్ణ మైన పాండిత్యము కలవారును, సహస్రదైః = వేలకొలది దానము చేయువారును, సత్యరతైః = సత్య నిరతులును, మహాత్మభిః = గొప్ప బుద్ధి కలవారును, మహర్షికల్పైః = మహర్షు లతో సమానులును, కేవలైః ఋషిభిః చ = కేవలఋషులును అగు, ద్విజోత్తమైః = ఉత్తము లైన బ్రాహ్మణక్షత్రియ వైశ్యులచేత, ఆవృతామ్ = నిండి యున్న, తామ్ = ఆ అయోధ్యను, (దశరథుడు వాసముగ చేసికొనెను).

తా. ఈ అయోధ్యానగరములోని ద్విజు లందరును, అనగా బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు ఆహితాగ్నులు, సద్గుణవంతులు, వేదవేదాంగనిష్ణాతులు, అనంత దానము చేయువారు, సత్యనిరతులు, మహాబుద్ధిశాలులు. వీరిలో కొందరు మహ ర్షులవంటి వారై ఉండగా మరి కొందరు సాక్షాత్తు ఋషులే.

"బాలానన్దిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
బాలకాండలో పంచమ సర్గ సమాప్తము.

అథ షష్ఠః సర్గః

మూ. తస్యాం పుర్యామయోధ్యాయాం వేదవిత్సర్వసఙ్గ్రహః,
దీర్ఘదర్శీ మహాతేజాః పౌరజానపదప్రియః, 1

ఇక్ష్వాకూణామతిరథో యజ్వా ధర్మరతో వశీ,
మహర్షికల్పో రాజర్షిస్త్రిషు లోకేషు విశ్రుతః. 2

బలవాన్నిహతామిత్రో మిత్రవాన్విజితేన్ద్రియః,
ధనైశ్చ సంగ్రహైశ్చాన్యైః శక్రవైశ్రవణోపమః. 3

యథా మనుర్మహాతేజా లోకస్య పరిరక్షితా,
తథా దశరథో రాజా వసన్ జగదపాలయత్. 4

ప్ర. అ. వేదవిత్=వేదములు తెలిసినవాడును, సర్వసంగ్రహః=శూరులు పండితులు మొదలైన సర్వజనులను దానాదులచే వశములో నుంచుకొనెడు వాడును, దీర్ఘదర్శీ=చాలకాలము తరువాత జరుగబోవు విషయములను ఇప్పుడే తెలుసుకొనెడు శక్తి కలవాడును, మహాతేజాః=గొప్ప పరాక్రమము కలవాడును, పౌరజానపదప్రియః = పట్టణాలలో నివసించు వారికిని గ్రామాలలో నివసించు వారికిని ఇష్టుడును, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకురాజులలో, అతిరథః = చాలమంది మహారథులతో ఒంటరిగా యుద్ధము చేయ గల రథికశ్రేష్ఠుడును, యజ్వా = యజ్ఞములు చేసినవాడును, ధర్మరతః = ధర్మమునందు ఆసక్తి కలవాడును, వశీ = జనులను అదుపులో ఉంచగలిగినవాడును, మహర్షికల్పః = మహర్షితో సమానుడును, రాజర్షిః = రాజును ఋషియు ఐనవాడును, త్రిషు లోకేషు = భూలోకభువర్లోకసువర్లోకములయందు, విశ్రుతః = ప్రసిద్ధుడును, బలవాన్ = అధికమైన సైన్యము కలవాడును, నిహతామిత్రః=చంపబడిన శత్రువులు కలవాడును, మిత్రవాన్ = మంచి మిత్రులు కలవాడును, విజితేన్ద్రియః = జయింపబడిన ఇంద్రియములు కలవాడును, ధనైశ్చ=ధనములచేతను, అన్యైః=ఇతరము లైన, సఙ్గ్రహైశ్చ = కూడబెట్టబడిన వస్తువులచేతను, శక్రవైశ్రవణోపమః=దేవేంద్రుని

తోడను కుబేరునితోడను సమానుడును అగు, రాజా దశరథః=దశరథమహారాజు, తస్యామ్ = ఆ, అయోధ్యాయాం పుర్యామ్ = అయోధ్యాపురియందు, వసన్ = నివసించుచు, లోకస్య = లోకమునకు, పరిరక్షితా = రక్షకుడును, మహాతేజాః = గొప్పపరాక్రమశాలియు అగు, మనుః = మనువు, యథా = ఎట్లో, తథా = అట్లు, జగత్ = జగత్తును, అపాలయత్ = పాలించెను.

తా. దశరథమహారాజు ఆ అయోధ్యాపురిలో నివసించుచు, సర్వలోక రక్షకుడును, మహాతేజఃశాలియు అగు మను వెట్లు పరిపాలించెనో, అట్లు జగత్తు నంతను పరిపాలించెను. ఆ దశరథుడు వేదవేత్త. శూరపండితాదులను దానాదులచే వశము చేసికొనెను. ఎప్పుడో జరుగ బోవు విషయములను గ్రహింపగల వాడు. గొప్ప పరాక్రమము కలవాడు. పౌరులకును జానపదులకును ఇష్టుడు. ఇక్ష్వాకువంశరాజులలో అతిరథుడు. ఎన్నో యాగములు చేసినవాడు. ధర్మమునం దాసక్తి కలవాడు. సర్వజనులను వశమునం దుంచుకొనువాడు. మహర్షితో సమానుడు; రాజుగా ఉండియు ఋషి యైనవాడు. మూడు లోకములందును ప్రసిద్ధుడు. గొప్ప సైన్యము కలవాడు. శత్రువుల నందరిని నశింపచేసినవాడు. మంచి మిత్రసంపద గలవాడు. ఇంద్రియములను జయించినవాడు. ధనములచేతను, ఇతరవస్తుసంగ్రహముచేతను ఇంద్రకుబేరతుల్యుడు. 1-4

మూ. తేన సత్యాభిసంధేన త్రివర్గమనుతిష్ఠతా,
పాలితా సా పురీ శ్రేష్ఠా ఇన్ద్రేణేవామరావతీ. 5

ప్ర. అ. సత్యాభిసందేన = సత్యమునందు పట్టుదలకలవాడును, త్రివర్గమ్ = ధర్మార్థకామము లనెడు మూడు పురుషార్థములను, అనుతిష్ఠతా = అనుసరించువాడును అగు, తేన = ఆ దశరథునిచేత, శ్రేష్ఠా = శ్రేష్ఠ మైన, సా పురీ = ఆ అయోధ్య, ఇన్ద్రేణ = ఇంద్రునిచేత, అమరావతీవ = అమరావతి వలె, పాలితా = పాలింపబడెను.

తా. సత్యమునందు పట్టుదల కలిగి ధర్మార్థ కామము లనెడు మూడు పురుషార్థములకును సమప్రాధాన్య మిచ్చి వాటి ననుసరించుచున్న ఆ దశరథుడు, ఇంద్రుడు అమరావతిని వలె, అయోధ్యను పాలించెను.

మూ. తస్మిన్ పురవరే హృష్టా ధర్మాత్మానో బహుశ్రుతాః,
నరాస్తుష్టా ధనైః స్వైః స్వైరలుబ్ధాః సత్యవాదినః. 6

ప్ర. అ. తస్మిన్ = ఆ, పురవరే = అయోధ్యాపురమునందు (నివసించు), నరాః = మనుష్యులు, హృష్టాః = సంతోషముకలవారు, ధర్మాత్మానః = ధర్మ స్వభావులు, బహుశ్రుతాః = అధికముగ శాస్త్రాధ్యయనము చేసినవారు, స్వైః స్వైః= తమ తమ, ధనైః = ధనములతో, తుష్టాః = సంతృప్తి చెందినవారు, అలుబ్ధాః=దురాశ లేనివారు, సత్యవాదినః = సత్యమునే మాటలాడువారు.

తా. అయోధ్యాపురములో నివసించు నరు లందరును సంతోషవంతులు, ధర్మాత్ములు, చక్కగ శాస్త్రాభ్యాసము చేసినవారు, తమ కున్నదానితో తృప్తి చెందినవారు. ఆశ లేనివారు. సత్యమునే పలుకువారు. 6

మూ. నాల్పసన్నిచయః కశ్చిదాసీత్తస్మిన్ పురోత్తమే,
కుటుమ్బీ యో హ్యసిద్ధార్థోఽగవాశ్వధనధాన్యవాన్. 7

ప్ర. అ. తస్మిన్ = ఆ, పురోత్తమే = శ్రేష్ఠనగర మైన అయోధ్యయందు, యః = ఎవడు, అల్పసన్నిచయః = అల్ప మైన కూడబెట్టిన ధనము కలవాడో, అసిద్ధార్థః=ధర్మార్థకామము లనెడు మూడు పురుషార్థములు సిద్ధించనివాడో, అగవాశ్వధనధాన్యవాన్ = గోవులు, అశ్వములు, ధనధాన్యములు లేనివాడో, అట్టి, కుటుమ్బీ = కుటుంబవంతుడు, కశ్చిత్ = ఒక్కడును, నాసీత్ = లేకుండెను.

తా. ఆ నగరములో తక్కువ ధనమును మాత్రమే సంపాదించినవాడు గాని, ధర్మార్థకామము లనెడు పురుషార్థములను సాధించనివాడు గాని, గవాశ్వ ధనధాన్యములు లేనివాడు గాని అయిన కుటుంబి ఒక్కడును లేకుండెను.

వి. కుటుంబి అనగా—తల్లిదండ్రులు, ఇద్దరు కుమారులు, ఇద్దరు కోడళ్లు, కుమార్తె, భార్య, అతిథి, తాను కలిసి మొత్తము పదిమంది పోష్యవర్గము కలవాడు. 7

మూ. కామీ వా న కదర్యో వా నృశంసః పురుషః క్వచిత్,
ద్రష్టుం శక్యమయోధ్యాయాం నావిద్వాన్న చ నాస్తికః. 8

ప్ర. అ. కామీ వా = కాముకుడు గాని, కదర్యో వా = లోభముచేత ధర్మ కార్యాలను, కొడుకులను, భార్యను, తల్లిదండ్రులను, తోడబుట్టువులను పీడించు వాడు గాని, నృశంసః=క్రూరుడు కాని అయిన, పురుషః=పురుషుడు, అయోధ్యా

యామ్ = అయోధ్యలో, క్వచిత్ = ఎక్కడను, ద్రష్టుమ్ = చూచుటకు, న శక్యమ్ = శక్యముకాదు, అవిద్వాన్ = విద్వాంసుడు కానివాడు, న=చూచుటకు శక్యముకాదు, నాస్తికః = నాస్తికుడును, న = చూచుటకు శక్యము కాదు.

తా. కాముకుడు గాని, లోభి కాని, క్రూరుడు కాని, విద్యావిహీనుడు కాని, నాస్తికుడు కాని, ఆ అయోధ్యలో వెదకినను కానరాడు. 8

మూ. సర్వే నరాశ్చ నార్యశ్చ ధర్మశీలాః సుసంయతాః,
ఉదితాః శీలవృత్తాభ్యాం మహర్షయ ఇవామలాః. 9

ప్ర. అ. సర్వే=సమస్తమైన, నరాశ్చ=నరులును, నార్యశ్చ=స్త్రీలును, ధర్మశీలాః = ధర్మస్వభావము కలవారు, సుసంయతాః = మంచి ఇంద్రియనిగ్రహము కలవారు. శీలవృత్తాభ్యామ్ = మంచి స్వభావముతోడను, మంచి నడవడికతోడను, ఉదితాః = అభివృద్ధి పొందువారు, మహర్షయః ఇవ=మహర్షులు వలె, అమలాః = నిర్మలమైనవారు.

తా. ఆ నగరములోని స్త్రీలు, పురుషులు కూడ, ధర్మశీలులు. మంచి ఇంద్రియనిగ్రహము కలవారు. మంచి స్వభావముతో, మంచి నడవడికతో ఒప్పుచున్నవారు. మహర్షుల వలె పరిశుద్ధమైనవారు. 9

మూ. నాకుణ్డలీ నామకుటీ నాస్రగ్వీ నాల్పభోగవాన్,
నామృష్టో నానులిప్తాఙ్గో నాసుగన్ధశ్చ విద్యతే. 10

ప్ర. అ. అకుణ్డలీ = కర్ణభూషణములు లేనివాడు, న విద్యతే = లేడు, అమకుటీ = శిరోభూషణము లేనివాడు, న = లేడు, అస్రగ్వీ = పుష్పమాలలు ధరించనివాడు, న = లేడు, అల్పభోగవాన్ = అల్పమైన భోగములు కలవాడు, న=లేడు, అమృష్టః=అభ్యంగస్నానము చేయనివాడు, న=లేడు, నానులిప్తాఙ్గః= పైపూత లేని శరీరము కలవాడు, (న = లేడు), అసుగన్ధశ్చ = సుగంధము లేనివాడును, న = లేడు.

తా. ఆ నగరములో కర్ణభూషణములు లేనివాడు గాని, శిరోభూషణము లేనివాడు గాని, పుష్పమాలలు ధరించనివాడు గాని, భోగములలో కొరత ఉన్నవాడు గాని, అభ్యంగస్నానము చేయనివాడు గాని, శరీరమునకు అంగరాగమును

పూసికొననివాడు గాని, మంచి సుగంధద్రవ్యములను సేవించనివాడు గాని లేడు. 10

మూ. నామృష్టభోజీ నాదాతా నాప్యనఙ్గదనిష్కధృక్,
నాహస్తాభరణో వాపి దృశ్యతే నాప్యనాత్మవాన్. 11

ప్ర. అ. అమృష్టభోజీ=కడుపునిండ భోజనము చేయనివాడు, న దృశ్యతే = కనబడడు, అదాతా = దానగుణము లేనివాడు, న = కనబడడు, అనఙ్గద నిష్కధృక్ అపి = బాహుపురులను కంఠాభరణములను ధరించనివాడు కూడ, న = కనబడడు, అహస్తాభరణో వాపి = కడియములు లేనివాడును, న = కనబడడు, అనాత్మవానపి = జితేంద్రియుడు కానివాడు కాని, న = కనబడడు.

తా. ఆ నగరములో, కడుపునిండ తిండి లేనివాడు గాని, దానము చేయనివాడు గాని, బాహుపురులను, కంఠాభరణములను ధరించనివాడు గాని, ముంజేతికి అలంకారము లేనివాడు గాని, ఇంద్రియనిగ్రహము లేనివాడు గాని ఒక్కడును కనబడడు. 11

మూ. నానాహితాగ్నిర్నాయజ్వా న క్షుద్రో వా న తస్కరః,
కశ్చిదాసీదయోధ్యాయాం న చ నిర్వృత్తసంకరః. 12

ప్ర. అ. అయోధ్యాయామ్=అయోధ్యాపట్టణమునందు, అనాహితాగ్నిః= ఆహితాగ్ని కానివాడు, న ఆసీత్ = లేకుండెను, అయజ్వా = యాగము చేయనివాడు, న = లేకుండెను, క్షుద్రః=నీచుడు, న = లేకుండెను, తస్కరః=దొంగ, న = లేకుండెను, నిర్వృత్తసంకరః = వర్ణసంకరము చేసినవాడు, కశ్చిత్ = ఒక్కడును, న = లేకుండెను.

తా. అయోధ్యలో ఆహితాగ్ని కానివాడు కాని, యాగము చేయనివాడు కాని, నీచుడు కాని, దొంగ గాని, వర్ణసంకరము చేసినవాడు గాని ఒక్కడును లేకుండెను. 12

మూ. స్వకర్మనిరతా నిత్యం బ్రాహ్మణా విజితేన్ద్రియాః,
దానాధ్యయనశీలాశ్చ సంయతాశ్చ పరిగ్రహే. 13

ప్ర. అ. బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, నిత్యమ్ = ఎల్లప్పుడును, స్వకర్మ నిరతాః = తమ కర్మలయందు ఆసక్తికలవారై, విజితేన్ద్రియాః = జయింపబడిన ఇంద్రియములు కలవారై, దానాధ్యయనశీలాః చ=దానముచేయుట అధ్యయనము చేయుట స్వభావముగా కలవారై, పరిగ్రహే = దానముపట్టుటయందు, సంయతాశ్చ = సంకోచముకలవారై, (గోవిందరాజులు) పరిగ్రహే = భార్యయందు, సంయతాశ్చ = నియమము కలవారై (మహేశ్వరతీర్థులు) (ఉండిరి).

తా. బ్రాహ్మణు లెల్లప్పుడును తమ కర్మలయం దాసక్తులై, ఇంద్రియ నిగ్రహవంతులై, దానము చేయుట, వేదాధ్యయనము చేయుట అను స్వాభావిక గుణములతో ఒప్పుచు, తప్పనిసరియైనపుడు మాత్రమే దానము పట్టుచు, స్వభార్యా మాత్రగాములై, పరభార్యావిముఖులై ఉండెడివారు. 13

మూ. న నాస్తికో నానృతకో న కశ్చిదబహుశ్రుతః,
నాసూయకో న చాశక్తో నావిద్వాన్ విద్యతే తదా. 14

ప్ర. అ. తదా = దశరథుడు రాజ్యముచేయు కాలమున, కశ్చిత్ = ఒక్కడును, నాస్తికః = నాస్తికుడు, న = లేడు, అనృతకః = అసత్య మాడువాడు, న = లేడు, అబహుశ్రుతః = ఎక్కువ శాస్త్రాభ్యాసము చేయనివాడు, న = లేడు, అసూయకః = గుణములందు దోషములను ఆరోపించువాడు, న = లేడు. అశక్తః = అసమర్థుడు, న = లేడు, అవిద్వాన్ = జ్ఞానము లేనివాడు, న = లేడు.

తా. దశరథుడు రాజ్యము పాలించు కాలమున రాజధాని యైన అయోధ్య లోనే కాక, రాజ్యమునం దెచ్చటను (గోవిందరాజులు), నాస్తికుడు గాని, అసత్య వాది కాని, శాస్త్రాభ్యాసము చేయనివాడు గాని, అసూయ కలవాడు గాని, అసమర్థుడు కాని, వివిధ విషయజ్ఞానము లేనివాడు గాని లేకుండెను. 14

మూ. నాషడఙ్గవిదత్రాసీన్నావ్రతో నాసహస్రదః,
న దీనః క్షిప్తచిత్తో వా వ్యథితో వాపి కశ్చన. 15

ప్ర. అ. అత్ర = ఈ అయోధ్యయందు, అషడఙ్గవిత్ = శిక్షా-వ్యాకరణ-చ్ఛందో-నిరుక్త-జ్యోతిష-కల్పము లనెడు ఆరు వేదాంగములు తెలియనివాడు, నాసీత్ = లేకుండెను. అవ్రతః = చాంద్రాయణాదివ్రతముల నాచరించనివాడు,

న = లేకుండెను, అసహస్రదః=వేలకొలది దానముచేయనివాడు, న=లేకుండెను, దీనః = దీనుడు, న = లేకుండెను, క్షిప్తచిత్తో వా=కలతచెందిన చిత్తముకలవాడు, న = లేకుండెను, వ్యథితః = బాధలకు గురి యైనవాడును, కశ్చన = ఒక్కడును, న = లేకుండెను.

తా. అయోధ్యలో ఏ ఒక్కడును, షడంగవేత్త కానివాడు కాని, వ్రతానుష్ఠానము లేనివాడు కాని, వేలకొలది ద్రవ్యము దానము చేయనివాడు కాని, దీనుడు కాని, కలతచెందిన మనస్సు కలవాడు కాని, బాధలకు గురి యైనవాడు గాని లేకుండెను. 15

మూ. కశ్చిన్నరో వా నారీ వా నాశ్రీమాన్ నాప్యరూపవాన్,
ద్రష్టుం శక్యమయోధ్యాయాం నాపి రాజన్యభక్తిమాన్. 16.

ప్ర. అ. అయోధ్యాయామ్ = అయోధ్యలో, నరో వా = పురుషుడు గాని, నారీ వా = స్త్రీ కాని, కశ్చిత్ = ఒక్కరును, అశ్రీమాన్ = ఐశ్వర్యము లేనివాడు, ద్రష్టుమ్ = చూచుటకు, న శక్యమ్ = శక్యము కాదు. అరూపవాన్ అపి = సౌందర్యము లేనివాడు, న = చూడ శక్యము కాదు. రాజని = రాజునందు, అభక్తిమాన్ = భక్తి లేనివాడును, న = చూడ శక్యము కాదు.

తా. అయోధ్యానగరిలో ఐశ్వర్యము, సౌందర్యము, రాజభక్తి లేని పురుషుడు కాని స్త్రీ కాని మచ్చునకైనను కానరారు. 16

మూ. వర్ణేష్వగ్ర్యచతుర్థేషు దేవతాతిథిపూజకాః,
కృతజ్ఞాశ్చ వదాన్యాశ్చ శూరా విక్రమసంయుతాః, 17

దీర్ఘాయుషో నరాస్సర్వే ధర్మం సత్యం చ సంశ్రితాః,
సహితాః పుత్రపౌత్రైశ్చ నిత్యం స్త్రీభిః పురోత్తమే. 18

ప్ర. అ. పురోత్తమే = ఆ అయోధ్యలో, అగ్ర్యచతుర్థేషు = మొదటి దైన బ్రాహ్మణవర్ణము నాల్గవదిగా గల, వర్ణేషు = క్షత్రియ-వైశ్య-శూద్రవర్ణముల యందు, సర్వే = సమస్తమైన, నరాః = పురుషులు, దేవతాతిథిపూజకాః = దేవతలను అతిథులను పూజించువారు. కృతజ్ఞాః చ = చేసిన మేలును మరువని వారు వదాన్యాశ్చ = దాతృత్వము కలవారు, శూరాః = శూరులు, విక్రమసంయుతాః =

పరాక్రమముతో కూడినవారు, దీర్ఘాయుషః = దీర్ఘాయుర్దాయము కలవారు, నిత్యమ్ = ఎల్లప్పుడును, పుత్రపౌత్రైః = పుత్రపౌత్రులతోడను, స్త్రీభిశ్చ = స్త్రీలతోడను, సహితాః = కూడి యుండువారు. ధర్మమ్ = ధర్మమును, సత్యం చ = సత్యమును, సంశ్రితాః = ఆశ్రయించినవారు.

తా. అయోధ్యానగరములో నాలుగువర్ణములకును చెందిన పురుషు లందరును దేవతాతిథిపూజ చేయువారు, కృతజ్ఞులు, ఉదారులు, శూరులు, పరాక్రమవంతులు. దీర్ఘాయుర్దాయవంతులై, సత్యధర్మపరులై, ఎల్లప్పుడును దారపుత్ర పౌత్రాదులతో కలసి ఆనందించెడివారు. 17, 18

మూ. క్షత్రం బ్రహ్మముఖం చాసీద్వైశ్యాః క్షత్రమనువ్రతాః,
శూద్రాః స్వధర్మనిరతాస్త్రీన్ వర్ణానుపచారిణః. 19

ప్ర. అ. క్షత్రమ్ = క్షత్రియజాతి, బ్రహ్మముఖమ్ = బ్రాహ్మణులను అనుసరించునదై, ఆసీత్ = ఉండెను, వైశ్యాః = వైశ్యులు, క్షత్రమ్ = క్షత్రియ జాతిని, అనువ్రతాః = అనుసరించి యుండెడివారు, శూద్రాః = శూద్రులు, త్రీన్ వర్ణాన్ = మూడు వర్ణములను, ఉపచారిణః = ఉపచారము చేయువారై, స్వధర్మ నిరతాః = తమ ధర్మమునందు ఆసక్తులై యుండిరి.

తా. క్షత్రియులు బ్రాహ్మణులను, వైశ్యులు క్షత్రియులను అనుసరించి ఉండెడివారు. శూద్రులు మూడు వర్ణములవారికిని ఉపచారము చేయుచు స్వధర్మ నిరతులై యుండెడి వారు. 19

మూ. సా తేనేక్ష్వాకునాథేన పురీ సుపరిరక్షితా,
యథా పురస్తాన్మనునా మానవేన్ద్రేణ ధీమతా. 20

ప్ర. అ. సా పురీ = ఆ అయోధ్య, పురస్తాత్ = పూర్వమునందు, మానవేన్ద్రేణ = మానవులందరికి ప్రభువును, ధీమతా = బుద్ధిమంతుడును అగు, మనునా = మనుచక్రవర్తిచేత, యథా = ఎట్లుపాలింపబడెనో అట్లే, తేన = ఆ, ఇక్ష్వాకునాథేన = దశరథునిచేత, సుపరిరక్షితా = బాగుగా రక్షింపబడినది.

తా. మానవేంద్రుడును, బుద్ధిశాలియు అగు మనుచక్రవర్తి పూర్వ మెట్లు పాలించెనో అట్లే ఆ దశరథుడు ఆ అయోధ్యను చక్కగ పరిరక్షించెను. 20

మూ. యోధానామగ్నికల్పానాం పేశలానామమర్షిణామ్,
సంపూర్ణా కృతవిద్యానాం గుహా కేసరిణామివ. 21

ప్ర. అ. అగ్నికల్పానామ్=అగ్నితో సమానులును, పేశలానామ్=నేర్పు కలవారును, అమర్షిణామ్ = = పౌరుషము కలవారును, కృతవిద్యానామ్=అభ్యసింపబడిన విద్యలు కలవారును అగు, యోధానామ్ = యోధుల సమూహములతో, కేసరిణామ్ = సింహముల సమూహముతో, గుహా ఇవ = గుహ వలె, సంపూర్ణా = నిండి యున్నది.

• తా. ఆ అయోధ్య, అగ్నితుల్యులు, నేర్పుకలవారు, పౌరుషవంతులు, శస్త్రవిద్యానిపుణులు అగు యోధులతో పర్వతగుహ వలె నిండి యుండెను. 21

మూ. కామ్భోజవిషయే జాతైర్బాహ్లీకైశ్చ హయోత్తమైః,
వనాయుజైర్నదీజైశ్చ పూర్ణా హరిహయోత్తమైః. 22

ప్ర. అ. కామ్భోజవిషయే = కాంభోజదేశమునందు, జాతైః = పుట్టినవి, బాహ్లీకైః=బాహ్లీకదేశమునందు పుట్టినవియు, వనాయుజైః=వనాయుదేశమునందు పుట్టినవియు, నదీజైశ్చ = సింధుదేశమునందు పుట్టినవియు, హరిహయోత్తమైః= ఇంద్రుని అశ్వ మైన ఉచ్చైఃశ్రవము వలె ఉత్తమ మైనవియు అగు, హయోత్తమైః = ఉత్తమము లైన అశ్వములతో, పూర్ణా = నిండినది.

తా. కాంభోజ—బాహ్లీక— వనాయు—సింధుదేశములలో పుట్టిన, ఉచ్చైఃశ్రవస్తుల్యములగు ఉత్తమాశ్వములతో ఆ అయోధ్య నిండి యుండెను. 22

మూ. విన్ధ్యపర్వతజైర్మత్తైః పూర్ణా హైమవతైరపి,
మదాన్వితైరతిబలైర్మాతఙ్గైః పర్వతోపమైః. 23

ఐరావతకులీనైశ్చ మహాపద్మకులైస్తథా,
అఞ్జనాదపి నిష్క్రాన్తైర్వామనాదపి చ ద్విపైః. 24

ప్ర. అ. మత్తైః = మదించిన, విన్ధ్యపర్వతజైః = వింధ్యపర్వతమునందు పుట్టిన, మాతఙ్గైః = ఏనుగులచేతను, మదాన్వితైః = మదముతో కూడిన, అతిబలైః = గొప్ప బలము గల, పర్వతోపమైః = పర్వతముతో సమాన మైన,

హైమవతైరపి = హిమవత్పర్వతమునందు పుట్టిన ఏనుగులచేతను, ఐరావతకులీనైశ్చ=ఇంద్రుని ఏను గైన ఐరావతముయొక్క కులమునందు పుట్టిన, ద్విపైశ్చ= ఏనుగులచేతను, తథా = మరియు, మహాపద్మకులైః=పుండరీక మనెడు దిగ్గజము యొక్క కులమునందు పుట్టిన ఏనుగులచేతను, అఞ్జనాత్ = వరుణ దిగ్గజ మైన అంజన మను ఏనుగనుండి (వంశమందు), నిష్పన్నైః = పుట్టిన ఏనుగులచేతను, వామనాదపి = యమదిగ్గజ మైన వామనమువలన బుట్టిన ఏనుగులచేతను, పూర్ణా= నిండినది.

తా. వింధ్యపర్వతమునందు పుట్టిన మత్తగజములతోను, గొప్ప బలము గలవియు, పర్వతముతో సమాన మైనవియు, మదముతో కూడినవియు అగు హిమవత్పర్వతజన్యము లైన ఏనుగులతోను, ఐరావతకులమునందు, మహాపద్మ కులమునందు, అంజనకులమునందు, వామనకులమునందు పుట్టిన ఏనుగులతోను అయోధ్య నిండియుండెను. 23, 24

మూ. భద్రైర్మన్ద్రైర్మృగైశ్చైవ భద్రమన్ద్రమృగైస్తథా,
భద్రమన్ద్రైర్భద్రమృగైర్మృగమన్ద్రైశ్చ సా పురీ,
నిత్యమత్తైస్సదా పూర్ణా నాగైరచలసన్నిభైః. 25

ప్ర. అ. సా పురీ=ఆ అయోధ్యాపట్టణము, భద్రైః=భద్రజాతీయములును, మన్ద్రైః = మంద్రజాతీయములును, మృగైశ్చైవ = మృగజాతీయములును, భద్రమన్ద్రమృగైః = భద్రమంద్రమృగము లనెడు మూడు జాతుల సంకీర్ణ లక్షణములు కలవియు, భద్రమన్ద్రైః = భద్రమంద్రము లనెడు రెండు జాతుల సంకీర్ణలక్షణములు కలవియు, భద్రమృగైః = భద్రమృగము లనెడు రెండు జాతుల సంకీర్ణలక్షణములు కలవియు, మృగమన్ద్రైశ్చ=మృగమంద్రము లనెడు రెండు జాతుల సంకీర్ణలక్షణములు కలవియు, నిత్యమత్తైః=నిత్యము మదించి యున్న, అచలసన్నిభైః=పర్వతములతో సమానము లైన, నాగైః=ఏనుగులతో, సదా=ఎల్లప్పుడును, పూర్ణా = నిండియుండెను.

తా. భద్రజాతీయములు, మంద్రజాతీయములు, మృగజాతీయములు, భద్ర మంద్రమృగజాతీయములు, భద్రమంద్రజాతీయములు, భద్రమృగజాతీయములు, మృగమంద్రజాతీయములు, ఎల్లప్పుడును మదించి యున్నవియు, పర్వతములతో సమానములును అగు ఏనుగులతో ఆ నగరము ఎల్లప్పుడును నిండియుండెను. 25

మూ. సా యోజనే చ ద్వే భూయః సత్యనామా ప్రకాశతే,
యస్యాం దశరథో రాజా వసన్ రాజ్యమపాలయత్. 26

ప్ర. అ. దశరథః రాజా = దశరథమహారాజు, యస్యామ్ = ఏ అయోధ్య యందు, వసన్ = నివసించుచు, జగత్ = జగత్తును, అపాలయత్ = పాలించెనో, సా = ఆ అయోధ్య, భూయః = ఇంకను, బైటకూడ, ద్వే యోజనే = రెండు యోజనముల దూరమున గూడ, సత్యనామా = యథార్థమైన పేరు కలదై, ప్రకాశతే = ప్రకాశించుచున్నది.

తా. ప్రపంచము నంతను పాలించుచున్న దశరథమహారాజునకు నివాసస్థాన మైన అయోధ్య బైట కూడ రెండు యోజనముల వరకును శత్రువులచే ఎదిరింప శక్యము కానిదై, అయోధ్య యను తన నామధేయమును సార్థకము చేసికొని ప్రకాశించుచుండెను. 26

మూ. తాం పురీం స మహాతేజా రాజా దశరథో మహాన్,
శశాస శమితామిత్రో నక్షత్రాణీవ చన్ద్రమాః. 27

ప్ర. అ. మహాతేజాః = గొప్పపరాక్రమము గలవాడును, మహాన్ = పూజింపదగినవాడును అగు, దశరథః = దశరథమహారాజు, శమితామిత్రః = శాంతింపచేయబడిన శత్రువులు కలవాడై, తామ్ = ఆ, పురీమ్ = అయోధ్యాపట్టణమును, చన్ద్రమాః = చంద్రుడు, నక్షత్రాణీవ = నక్షత్రములను వలె, శశాస = పరిపాలించెను.

తా. మహాతేజఃశాలియు, పూజ్యుడును అయిన దశరథమహారాజు శత్రువుల నందరిని అణచి, అయోధ్యానగరమును, చంద్రుడు నక్షత్రములను పాలించినట్లు పాలించెను. 27

మూ. తాం సత్యనామాం దృఢతోరణార్గలాం
గృహైర్విచిత్రైరుపశోభితాం శివామ్,
పురీమయోధ్యాం నృసహస్రసంకులాం
శశాస వై శక్రసమో మహీపతిః. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే
బాలకాణ్డే షష్ఠః సర్గః.

ప్ర. అ. దృఢతోరణార్గలామ్ = దృఢమైన తోరణములును (ద్వారములును) గడియలును కలదియు, విచిత్రైః = విచిత్రము లైన, గృహైః = గృహములచేత, ఉపశోభితామ్ = ప్రకాశింపచేయబడినదియు, శివామ్ = మంగళకరమైనదియు, నృసహస్రసంకులామ్ = వేలకొలది మనుష్యులతో నిండినదియు, సత్యనామామ్ = యథార్థ మైన పేరుగలదియు అగు, అయోధ్యాం పురీమ్ = అయోధ్యానగరమును, శక్రసమః = దేవేంద్రునితో సమానుడైన, మహీపతిః = దశరథమహారాజు, శశాస వై = పరిపాలించెను.

తా. ఇంద్రునితో సమానుడైన ఆ దశరథుడు దృఢ మైన తోరణములును, గడియలును కలదియు, విచిత్రము లైన గృహములతో ప్రకాశించునదియు, మంగళకర మైనదియు, వేలకొలది జనులతో నిండినదియు, యథార్థ మైన పేరు గలదియు, అగు ఆ అయోధ్యను పరిపాలించెను. 28

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో షష్ఠసర్గ సమాప్తము.

అథ స ప్తమః సర్గః

మూ. తస్యామాత్యా గుణైరాసన్నిక్ష్వాకోస్తు మహాత్మనః,
మన్త్రజ్ఞాశ్చేఙ్గితజ్ఞాశ్చ నిత్యం ప్రియహితే రతాః. 1

ప్ర. అ. మహాత్మనః=గొప్పబుద్ధి గల, తస్య = ఆ, ఇక్ష్వాకోః=ఇక్ష్వాకు వంశమునందు పుట్టిన దశరథునకు, గుణైః = మంత్రుల కుండవలసిన ప్రజ్ఞాది గుణములచేత, మన్త్రజ్ఞాశ్చ = ఆలోచన తెలిసినవారును, ఇఙ్గితజ్ఞాశ్చ = ఇతరుల అభిప్రాయములను వారి ముఖాదులనుపట్టి తెలుసుకొనువారును, నిత్యమ్ = ఎల్లప్పుడును, ప్రియహితే = రాజునకు ఇష్టము లాభకరము అయిన కార్యమునందు, రతాః = ఆసక్తికలవారును అగు, అమాత్యాః = మంత్రులు, ఆసన్ = ఉండిరి.

తా. మహాత్ముడైన దశరథునకు, ప్రజ్ఞాదిగుణములచే మంత్రణమునందు సమర్థులును, ఇతరుల ఆకారాదులను పట్టి వారి మనస్సులోని అభిప్రాయమును తెలిసికొనగలవారును, ఎల్లప్పుడును తమ ప్రభువునకు ఇష్టము, హితము అగు కార్యమును చేయుటయందు ఆసక్తి కలవారును అగు మంత్రులు ఉండిరి. 1

మూ. అష్టౌ బభూవుర్వీరస్య తస్యామాత్యా యశస్వినః,
శుచయశ్చానురక్తాశ్చ రాజకృత్యేషు నిత్యశః. 2

ప్ర. అ. వీరస్య=వీరుడును, యశస్వినః=కీర్తిమంతుడును అగు, తస్య= ఆ దశరథునకు, శుచయః = వ్యవహారములందు పరిశుద్ధులును, నిత్యమ్ = ఎల్లప్పుడును, రాజకృత్యేషు = రాజకార్యములయందు, అనురక్తాశ్చ = ఆసక్తి కలవారును అగు, అష్టౌ=ఎనమండుగురు, అమాత్యాః=మంత్రులు, బభూవుః= = ఉండిరి.

తా. మహావీరుడును, యశశ్శాలియు అగు ఆ దశరథునకు లంచములు తీసికొనుట మొదలగు దోషములు లేక వ్యవహారశుద్ధి కలవారును, ఎల్లప్పుడు రాజకార్యవ్యాపృతులును అగు ఎనమండుగురు మంత్రులు ఉండిరి. 2

మూ. ధృష్టిర్జయన్తో విజయః సిద్ధార్థో హ్యర్థసాధకః,
అశోకో మన్త్రిపాలశ్చ సుమన్త్రశ్చాష్టమోఽభవత్. 3

ప్ర. అ. ధృష్టిః=ధృష్టి, జయన్తః=జయంతుడు, విజయః = విజయుడు, సిద్ధార్థః = సిద్ధార్థుడు, అర్థసాధకః = అర్థసాధకుడు, అశోకః = అశోకుడు, మన్త్రిపాలశ్చ = మంత్రపాలుడు, అను మంత్రు లుండిరి. సుమన్త్రః=సుమంత్రుడను, అష్టమః = ఎనిమిదవ మంత్రి, అభవత్ = ఉండెను.

తా. ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు అని ఈ ఎనమండుగురు మంత్రుల పేర్లు. 3

మూ. ఋత్విజౌ ద్వావభిమతౌ తస్యాస్తామృషిసత్తమౌ,
వసిష్ఠో వామదేవశ్చ మన్త్రిణశ్చ తథాపరే. 4

ప్ర. అ. తస్య = ఆ దశరథునకు, వసిష్ఠః=వసిష్ఠుడును, వామదేవశ్చ= వామదేవుడును అను, ద్వౌ=ఇద్దరు, ఋషిసత్తమౌ=ఋషిశ్రేష్ఠులు, అభిమతౌ= ఎక్కువగా ఇష్టులైన, ఋత్విజౌ=ఋత్విక్కులుగా, ఆస్తామ్=ఉండిరి. తథా= మరియు, అపరే = మరికొందరు, మన్త్రిణశ్చ = మంత్రులును, ఉండిరి.

తా. వసిష్ఠుడు, వామదేవుడు అను ఇద్దరు ఋషిసత్తములు దశరథునకు ప్రధానులైన ఋత్విక్కులుగా ఉండిరి. మరి కొందరు మంత్రులు కూడ ఉండిరి. 4

మూ. విద్యావినీతా హ్రీమన్తః కుశలా నియతేన్ద్రియాః,
శ్రీమన్తశ్చ మహాత్మానః శాస్త్రజ్ఞా దృఢవిక్రమాః. 5

కీర్తిమన్తః ప్రణిహితా యథావచనకారిణః,
తేజఃక్షమాయశఃప్రాప్తాః స్మితపూర్వాభిభాషిణః. 6

ప్ర. అ. (వారు), విద్యావినీతాః = అన్ని విద్యలందును శిక్షితులు, హ్రీమంతః = అకార్యముచేయుటకు సిగ్గుపడువారు, కుశలాః = నేర్పరులు, నియయాః = నిగ్రహించుకొనబడిన ఇంద్రియములు కలవారు. శ్రీమన్తశ్చ =

ఐశ్వర్యవంతులు, మహాత్మానః = గొప్ప బుద్ధిమంతులు, శాస్త్రజ్ఞాః=శాస్త్రములు తెలిసినవారు. దృఢవిక్రమాః=దృఢ మైన పరాక్రమము కలవారు, కీర్తిమన్తః= కీర్తి కలవారు, ప్రణిహితాః = సావధానమైన చిత్తముకలవారు. యథావచన కారిణః = చెప్పిన విధముగా చేయువారు, తేజఃక్షమాయశఃప్రాప్తాః = తేజస్సును, ఓర్పును, కీర్తిని పొందినవారు, స్మితపూర్వాభిభాషిణః = చిరునవ్వు నవ్వుచు మాటలాడువారు.

తా. ఆ మంత్రులు సమస్తవిద్యలు నేర్చినవారు, అకార్యములను చేయుటకు సిగ్గుచెందువారు. నేర్పు కలవారు, ఇంద్రియనిగ్రహవంతులు, ఐశ్వర్యవంతులు, మహాబుద్ధిశాలులు, శాస్త్రజ్ఞానము కలవారు. దృఢమైన పరాక్రమము కలవారు, కీర్తిమంతులు. కార్యములు చేయు నపుడు ఏకాగ్రచిత్తము కలవారు, చెప్పిన విధముగ చేయువారు, తేజస్సు, ఓర్పు, కీర్తి కలవారు, చిరునవ్వు నవ్వుచూ మాటలాడువారు. 5, 6

మూ. క్రోధాత్కామార్థహేతోర్వా న బ్రూయురనృతం వచః,
తేషామవిదితం కించిత్స్వేషు నాస్తి పరేషు వా,
క్రియమాణం కృతం వాపి చారేణాపి చికీర్షితమ్. 7

ప్ర.అ. క్రోధాత్ = కోపమువలనగాని, కామార్థహేతోర్వా = కామమువలన గాని, ధనముకొరకుగాని, అనృతమ్ = అసత్య మైన, వచః = వాక్యమును, న బ్రూయుః = పలకరు. స్వేషు = తమవారిలో గాని, పరేషు వా = శత్రువులలో గాని, క్రియమాణమ్ = చేయబడుచున్నది గాని, కృతం వాపి = చేయబడినది గాని, చికీర్షితమ్ = చేయ తలపెట్టినది గాని, తేషామ్ = వారికి, చారేణ = గూఢచారుల ద్వారా, అవిదితమ్ = తెలియనిది, కించిత్ =ఏమియు, నాస్తి=లేదు.

తా. కోపమువలన గాని, కామముచేత గాని, ధనముకొరకు గాని వారెన్నడు అసత్య మాడెడివారు కాదు. స్వపరరాష్ట్రములలో చేయబడినది కాని, చేయబడుచున్నది కాని, చేయబడ నున్నది గాని, వారికి గూఢచారుల ద్వారా తెలియనిది ఏదియు లేకుండెను. 7

మూ. కుశలా వ్యవహారేషు సౌహృదేషు పరీక్షితాః,
ప్రాప్తకాలం తు తే దణ్డం ధారయేయుః సుతేష్వపి. 8

ప్ర. అ. తే = ఆ మంత్రులు, వ్యవహారేషు = వ్యవహారములయందు, కుశలాః = సమర్థులు, సౌహృదేషు = స్నేహములవిషయమున, పరీక్షితాః= పరీక్షింపబడినవారు, సుతేష్వపి = కుమారుల విషయమునందు కూడ, ప్రాప్త కాలమ్ = సరి యైన, దణ్డమ్ = దండమును, ధారయేయుః = విధించెడివారు.

తా. ఆ మంత్రులు వ్యవహారదక్షులు. వీరికి ఎట్టి స్నేహితు లున్నారో (రాజుచేత) పరీక్షించబడినవారు. కుమారులకు కూడ, ఆవశ్యక మైనపుడు సరి యైన దండమును విధించెడివారు. 8

మూ. కోశసఙ్గ్రహణే యుక్తా బలస్య చ పరిగ్రహే,
అహితం చాపి పురుషం న విహింస్యురదూషకమ్. 9

ప్ర. అ. కోశసంగ్రహణే = ధనాగారమును నింపుటయందును, బలస్య= సైన్యముయొక్క, పరిగ్రహే చ = సమకూర్చుటయందును, యుక్తాః = మిక్కిలి శ్రద్ధ చూపెడివారు. అదూషకమ్ = అపరాధముచేయని, అహితం పురుషమపి= శత్రువును కూడ, న విహింస్యుః = బాధించరు.

తా. ఆ మంత్రులు రాజ్యధనాగారమును నింపుట, సైన్యమును సమ కూర్చుట మొదలైన రాజ్యకార్యములందు సర్వదా ఆసక్తి చూపెడివారు. అప రాధము చేయనిచో శత్రువు నైనను హింసించరు. 9

మూ. వీరాశ్చ నియతోత్సాహా రాజశాస్త్రమనుష్ఠితాః,
శుచీనాం రక్షితారశ్చ నిత్యం విషయవాసినామ్. 10

ప్ర. అ. వీరాశ్చ = వీరులు, నియతోత్సాహాః = స్థిర మైన ఉత్సాహము కలవారు, రాజశాస్త్రమ్ = రాజశాస్త్రమును, అనుష్ఠితాః=అనుసరించి ప్రవర్తించు వారు, విషయవాసినామ్ = దేశములో నివసించు, శుచీనామ్ = సత్పురుషులకు, నిత్యమ్ = ఎల్లప్పుడును, రక్షితారశ్చ = రక్షకులు.

తా. ఆ మంత్రులు వీరులు, చలించని ఉత్సాహము కలవారు, రాజశా స్త్రప్రకారము కార్యములను అనుష్ఠించువారు, దేశములో నున్న సత్పురుషులకు ఎట్టి ఉపద్రవములు కలుగకుండ ఎల్లప్పుడును కాపాడుచుండెడివారు. 10

మూ. బ్రహ్మక్షత్రమహింసన్తస్తే కోశం సమపూరయన్,
సుతీక్ష్ణదణ్డాః సంప్రేక్ష్య పురుషస్య బలాబలమ్. 11

ప్ర. అ. బ్రహ్మ = బ్రాహ్మణజాతిని, క్షత్రమ్ = క్షత్రియజాతిని, అహింసన్తః = హింసించనివారై, తే = వారు, కోశమ్ = ధనాగారమును, సమపూరయన్ = నింపిరి, పురుషస్య = అపరాధి యైన పురుషునియొక్క, బలాబలమ్ = బలాబలములను, సంప్రేక్ష్య = చూచి, సుతీక్ష్ణదణ్డాః = చాలతీక్ష్ణ మైన దండము ఇచ్చెడివారు.

తా. ఆ మంత్రులు బ్రాహ్మణక్షత్రియులకు బాధ కలుగకుండ చూచుచు కోశమును నింపెడివారు. అపరాధియొక్క బలాబలములను పరీక్షించి, తగు విధముగ తీక్ష్ణ మైన దండమును విధించెడివారు, (బలవంతుడైనచో అధికదండము దుర్బలుడైనచో అల్పదండము ఇచ్చెడివారు. లేదా అపరాధము యొక్క బలాబలములను పరీక్షించి శిక్షించెడివారు). 11

మూ. శుచీనామేకబుద్ధీనాం సర్వేషాం సంప్రజానతామ్,
నాసీత్పురే వా రాష్ట్రే వా మృషావాదీ నరః క్వచిత్. 12

ప్ర. అ. శుచీనామ్ = పరిశుద్ధ మైన నడవడిక గలవారును, ఏకబుద్ధీనామ్ = ఐకమత్యముతో ప్రవర్తించువారును అగు, సర్వేషామ్ = ఆ అందరు మంత్రులును, సంప్రజానతామ్ = రాజ్యతంత్రమును విచారించుచుండగా, పురే వా = పట్టణమునందు గాని, రాజ్యే వా = రాజ్యమునందు గాని, క్వచిత్ = ఎక్కడను, మృషావాదీ = అసత్యమును పలికెడి, నరః = మనుష్యుడు, నాసీత్ = లేకుండెను.

తా. పరిశుద్ధ మైన నడవడిక గల ఆ మంత్రు లందరును ఐకమత్యముతో రాజకార్యములను చక్కబెట్టుచుండగా, నగరములో గాని, రాజ్యములో గాని, ఎచ్చటను, అసత్యమాడువాడు ఒక్కడును ఉండెడివాడు కాదు. 12

మూ. కశ్చిన్న దుష్టస్తత్రాసీత్పరదారరతో నరః,
ప్రశాన్తం సర్వమేవాసీద్రాష్ట్రం పురవరం చ తత్. 13

ప్ర. అ. తత్ర = ఆ రాజ్యమునందు, దుష్టః = దుష్టుడు కాని, పరదార రతః = పరభార్యలయందు ఆసక్తి కలవాడు గాని అయిన, నరః = మనుష్యుడు, కశ్చిత్ = ఒక్కడును, నాసీత్ = లేకుండెను, సర్వమ్ = సమస్తమైన, రాష్ట్రమ్ = రాష్ట్రము, తత్ = ఆ, పురవరం చ = పట్టణశ్రేష్ఠమైన అయోధ్యయు, ప్రశాన్తమ్ = శాంతిపూర్ణమై, ఆసీత్ = ఉండెను.

తా. ఆ రాజ్యములో దుష్టుడు గాని, పరభార్యాసక్తుడు కాని లేకుండెను. ఆ రాష్ట్రమునం దంతటను, అయోధ్యయందును శాంతి నెలకొని ఉండెను. 13

మూ. సువాససస్సువేషాశ్చ తే చ సర్వే సుశీలినః,
హితార్థం చ నరేన్ద్రస్య జాగ్రతో నయచక్షుషా. 14

ప్ర. అ. తే సర్వే = ఆ మంత్రులందరును, సువాసనః = మంచి వస్త్రములను ధరించెడివారు, సువేషాశ్చ = మంచి వేషము కలవారు, సుశీలినః = మంచి శీలము కలవారు, నరేన్ద్రస్య = రాజుయొక్క, హితార్థమ్ = హితముకొరకు, నయచక్షుషా = నీతి యనెడు నేత్రముతో, జాగ్రతః = మేల్కొని యుండెడివారు.

తా. ఆ మంత్రు లందరును మంచి వస్త్రములు, వేషములు ధరించెడివారు. మంచి శీలము కలవారు. నీతినేత్రములతో సర్వదా మేల్కొని యుండి రాజు యొక్క హితముకొరకు పాటుపడెడి వారు. 14

మూ. గురౌ గుణగృహీతాశ్చ ప్రఖ్యాతాశ్చ పరాక్రమే,
విదేశేష్వపి విఖ్యాతాస్సర్వతో బుద్ధినిశ్చయాత్. 15

ప్ర. అ. గురౌ = మాతాపిత్రాది గురుజనమునందు, గుణగృహీతాః = గుణములను మాత్రమే గ్రహించువారు, పరాక్రమే = పరాక్రమమువిషయమున, ప్రఖ్యాతాః = ప్రసిద్ధి పొందినవారు, సర్వతః = అన్ని విషయములందును, బుద్ధి నిశ్చయాత్ = బుద్ధియొక్క నిశ్చయమువలన, విదేశేష్వపి = విదేశములలో కూడ, విజ్ఞాతాః = ప్రసిద్ధులు.

తా. ఆ మంత్రులు మాతాపిత్రాదు లగు పెద్దలలో ఉన్న గుణములను మాత్రమే గ్రహించెడివారు. పరాక్రమముచే ప్రసిద్ధులు, అన్ని విషయములను గ్రహింప గలిగిన బుద్ధిబలమును బట్టి విదేశములలో కూడ ప్రఖ్యాతి గడించినవారు. 15

మూ. సన్ధివిగ్రహతత్త్వజ్ఞాః ప్రకృత్యా సమ్పదాన్వితాః, 16
మన్త్రసంవరణే శక్తాః శక్తాః సూక్ష్మాసు బుద్ధిషు,
నీతిశాస్త్రవిశేషజ్ఞాః సతతం ప్రియవాదినః. 17

ప్ర. అ. సన్ధివిగ్రహతత్త్వజ్ఞాః=సంధివిగ్రహముల తత్త్వము నెరిగినవారు. ప్రకృత్యా = స్వభావముచేత, సమ్పదా = సంపదతో, అన్వితాః = కూడినవారు, మన్త్రసంవరణే=మంత్రమును దాచుటయందు, శక్తాః=సమర్థులు, సూక్ష్మాసు= సూక్ష్మము లైన, బుద్ధిషు = బుద్ధులయందు, శక్తాః = సమర్థులు, నీతిశాస్త్ర విశేషజ్ఞాః=నీతిశాస్త్రములోని విశేషములు తెలిసినవారు, సతతమ్=ఎల్లప్పుడును, ప్రియవాదినః = ప్రియ మైన మాటలు పలుకువారు.

తా. ఆ మంత్రులందరును శత్రువులతో ఎప్పుడు ఎట్లు సంధిచేసికొన వలెనో, ఎప్పుడు వారితో యుద్ధము చేయవలెనో బాగుగ తెలిసినవారు. సహజముగ ఐశ్వర్యవంతులు. ఆలోచనలను రహస్యముగ ఉంచుటయందును, సూక్ష్మ విషయములను గ్రహించి నిర్ణయములు చేయుటయందును సమర్థులు. నీతిశాస్త్రములోని విశేషము లన్నియు తెలిసినవారు. ఇతరుల మనస్సును నొప్పింపని విధమున మాటలాడువారు. 16, 17

మూ. ఈదృశైస్తైరమాత్యైస్తు రాజా దశరథోఽనఘః,
ఉపపన్నో గుణోపేతై రన్వశాసద్వసున్ధరామ్. 18

ప్ర. అ. అనఘః = ఎట్టిదోషములును లేని, దశరథః రాజా = దశరథ మహారాజు, గుణోపేతైః = సద్గుణములు గల, ఈదృశైః=ఇట్టి, అమాత్యైః= మంత్రులతో, ఉపేతః = కూడినవాడై, వసున్ధరామ్ = భూమిని, అన్వశాసత్ = పరిపాలించెను.

తా. ఎట్టిదోషములును లేని దశరథమహారాజు, ఇట్టి సద్గుణోపేతు లైన మంత్రుల సాహాయ్యముతో భూమిని పరిపాలించెను. 18

మూ. అవేక్షమాణశ్చారేణ ప్రజా ధర్మేణ రఞ్జయన్,
ప్రజానాం పాలనం కుర్వన్ అధర్మాన్ పరివర్జయన్. 19

విశ్రుతస్త్రిషు లోకేషు వదాన్యః సత్యసఙ్గరః,
స తత్ర పురుషవ్యాఘ్రః శశాస పృథివీమిమామ్. 20

ప్ర. అ. పురుషవ్యాఘ్రః = పురుషులలో శ్రేష్ఠుడైన, సః = ఆ దశరథ మహారాజు, చారేణ = గూఢచారిచేత, అవేక్షమాణః = చూచుచు, ప్రజాః = ప్రజలను, రఞ్జయన్ = సంతోషపెట్టుచు, ప్రజానామ్ = ప్రజలయొక్క, పాలనమ్ = రక్షణను, కుర్వన్ = చేయుచు, అధర్మాన్ = అధర్మములను, పరివర్జయన్ = విసర్జించుచు, వదాన్యః = ఉదారుడనియు, సత్యసఙ్గరః = సత్యమైన ప్రతిజ్ఞకలవాడనియు, త్రిషు లోకేషు = మూడు లోకములలో, విశ్రుతః = ప్రసిద్ధుడై, ఇమామ్ = ఈ, పృథివీమ్ = భూమిని, ధర్మేణ = ధర్మముచేత, శశాస = పరిపాలించెను.

తా. ఔదార్యవంతుడనియు, ప్రజ్ఞను నిలుపుకొనువాడనియు మూడు లోకములలో ప్రసిద్ధి గాంచిన, పురుష శ్రేష్ఠుడైన ఆ దశరథుడు, రాజ్యములోని విషయముల నన్నింటిని గూఢచారుల ద్వారా తెలిసికొనుచు, ప్రజలను ఆనందింపచేసి, వారిని రక్షించుచు, అధర్మములను తొలగించుచు, ఈ భూమి నంతను ధర్మముతో పరిపాలించెను. 19, 20

మూ. నాధ్యగచ్ఛద్విశిష్టం వా తుల్యం వా శత్రుమాత్మనః,
మిత్రవాన్నతసామన్తః ప్రతాపహతకణ్టకః, 21
స శశాస జగద్రాజా దివం దేవపతిర్యథా.

ప్ర. అ. మిత్రవాన్ = స్నేహితులు కలవాడును, నతసామన్తః = లొంగి ఉన్న సామంతులు కలవాడును, ప్రతాపహతకణ్టకః = ప్రతాపముచేత చంపబడిన శత్రువులుగలవాడును అగు, ఆ దశరథుడు, ఆత్మనః = తనకంటె, విశిష్టం వా = గొప్పవాడైన, లేదా, తుల్యం వా = సమానుడైన, శత్రుమ్ = శత్రువును, నాధ్యగచ్ఛత్ = పొందలేదు, సః రాజా = ఆ రాజు, దేవపతిః = దేవేంద్రుడు, దివం యథా = స్వర్గమును వలె, జగత్ = జగత్తును, శశాస = పరిపాలించెను.

తా. ఆ దశరథునకు ఎందరో మిత్రు లుండిరి. సామంతరాజు లందరును లొంగి ఉండిరి. అతడు తనకు బాధ కలిగించువారి నందరిని ప్రతాపముచేత సంహరించెను. అందుచే ఆతనిని మించినవాడుగాని, ఆతనితో సమానుడు

గాని అయిన శత్రు వొక్కడును లేకుండెను. అతడు, దేవేంద్రుడు స్వర్గమును పాలించి నట్లు ఈ జగత్తు నంతను పాలించెను. 21

మూ. తైర్మన్త్రిభిర్మన్త్రహితే నివిష్టైః
వృతో ఽనురక్తైః కుశలైః సమర్థైః,
స పార్థివో దీప్తిమవాప యుక్త
స్తేజోమయై ర్గోభిరివోదితో ఽర్కః. 22

ఇత్యార్షే, శ్రీమద్రామాయణే, ఆదికావ్యే, బాలకాణ్డే సప్తమః సర్గః.

ప్ర. అ. మన్త్రహితే = ఆలోచనయందును తన హితమునందును, నివిష్టైః=ఆసక్తి కలవారును, అనురక్తైః=అనురాగము కలవారును, కుశలైః= నేర్పరులును, సమర్థైః = సమర్థులును అయిన, తైః మన్త్రిభిః = అ మంత్రులతో, వృతః = కూడిన, సః పార్థివః = ఆ రాజు, తేజోమయైః=తేజోరూపము లైన, గోభిః = కిరణములతో, యుక్తః = కూడిన, ఉదితః = ఉదయించిన, అర్కః ఇవ = సూర్యుడు వలె, దీప్తిమ్ = కాంతిని, అవాప = పొందెను.

తా. ఆలోచనలయందును, తనకు మేలు చేయుటయందును ఆసక్తి గల వారును, అనురక్తులును, సమర్థులును, నేర్పు కలవారును అగు ఆ మంత్రులతో, దశరథమహారాజు, తేజోరూపము లైన కిరణములతో కూడిన ఉదయించుచున్న సూర్యుడు వలె ప్రకాశించెను.

వి. "మన్త్రహితే నియుక్తైః" అని గోవిందరాజసంమతపాఠము. "మంత్ర హితములందు నియమింపబడినవారు" అని అర్థము. 22

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
బాలకాండలో సప్తమసర్గ సమాప్తము.

అథ అష్టమః సర్గః

మూ. తస్య త్వేవం ప్రభావస్య ధర్మజ్ఞస్య మహాత్మనః,
సుతార్థం తప్యమానస్య నాసీద్వంశకరః సుతః. 1

ప్ర. అ. ఏవంప్రభావస్య = ఇట్టి ప్రభావము కలవాడును, ధర్మజ్ఞస్య = ధర్మము తెలిసినవాడును, మహాత్మనః = గొప్ప బుద్ధి కలవాడును, సుతార్థమ్ = కుమారులకొరకు, తప్యమానస్య = పరితపించుచున్నవాడును అగు, తస్య = ఆ దశరథునకు, వంశకరః = వంశమును నిలుపునట్టి, సుతః = కుమారుడు, నాసీత్ = కలుగలేదు.

తా. ఇట్టి ప్రభావము గల, ధర్మజ్ఞుడైన, మహానుభావుడైన ఆ దశరథునకు చాల కాలము వరకును, వంశమును నిలబెట్టు కుమారుడు కలుగలేదు. అందుచే అతడు పరితపించుచుండెను. 1

మూ. చిన్తయానస్య తస్యైవం బుద్ధిరాసీన్మహాత్మనః,
సుతార్థం హయమేధేన కిమర్థం న యజామ్యహమ్. 2

ప్ర. అ. చిన్తయానస్య = పుత్రులకొరకై చింతించుచున్న, తస్య = ఆ, మహాత్మనః = మహాత్మునకు, ఏవమ్ = ఈ విధముగ, బుద్ధిః = బుద్ధి, ఆసీత్ = కలిగెను, "అహమ్ = నేను, సుతార్థమ్ = కుమారులకొరకై, హయమేధేన = అశ్వమేధయాగముచేత, కిమర్థమ్ = ఎందువలన, న యజామి = దేవతల నారాధింపకూడదు ?"

తా. పుత్రులు జనించలేదని చింతించుచున్న ఆ మహాత్ముని మనస్సులో "నేను సుతులను పొందుటకై అశ్వమేధయాగము చేయవచ్చును కదా ?" అను అభిప్రాయము కలిగెను. 2

మూ. స నిశ్చితాం మతిం కృత్వా యష్టవ్యమితి బుద్ధిమాన్,
మన్త్రిభిః సహ ధర్మాత్మా సర్వైరేవ కృతాత్మభిః. 3

తతోఽబ్రవీదిదం రాజా సుమన్త్రం మన్త్రిసత్తమమ్,
శీఘ్రమానయ మే సర్వాన్ గురూంస్తాన్ సపురోహితాన్. 4

ప్ర. అ. బుద్ధిమాన్ = బుద్ధిమంతు డైన, ధర్మాత్మా = ధర్మాత్ము డైన, సః రాజా = ఆ రాజు, కృతాత్మభిః = పరిశుద్ధ మైన బుద్ధి గల, సర్వైరేవ = సమస్తమైన, మన్త్రిభిః = మంత్రులతో కూడ కలసి, యష్టవ్యమితి = యాగము చేయవలెను అని, నిశ్చితామ్ = నిశ్చిత మైన, మతిం కృత్వా = ఆలోచన చేసి, తతః = అటుపిమ్మట, మన్త్రిసత్తమమ్ = మంత్రిశ్రేష్ఠ డైన, సుమన్త్రమ్ = సుమంత్రుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. సపురోహితాన్ = పురోహితులతో గూడిన, తాన్ = ఆ, సర్వాన్ = సమస్త మైన, మే గురూన్ = నా గురువులను, ఆనయ = తీసికొని రమ్ము.

తా. బుద్ధిమంతుడును, ధర్మాత్ముడును అయిన ఆ రాజు, పరిశుద్ధ మైన బుద్ధి గల మంత్రు లందరితో సంప్రదించి, యాగము చేయవలెనని గట్టిగా నిశ్చయించి—"పురోహితులతో కూడ, నా గురువుల సందరిని తీసికొని రమ్ము" అని మంత్రిసత్తము డైన సుమంత్రుని ఆదేశించెను. 4, 3

మూ. తతః సుమన్త్రస్త్వరితం గత్వా త్వరితవిక్రమః,
సమానయత్స తాన్ సర్వాన్ సమస్తాన్వేదపారగాన్. 5

సుయజ్ఞం వామదేవం చ జాబాలిమథ కాశ్యపమ్,
పురోహితం వసిష్ఠం చ యే చాన్యే ద్విజసత్తమాః. 6

ప్ర. అ. తతః = పిమ్మట, త్వరితవిక్రమః = శ్రేష్ఠ మైన గమనము గల, సః సుమన్త్రః = ఆ సుమంత్రుడు, త్వరితమ్ = శీఘ్రముగా, గత్వా = వెళ్లి, సుయజ్ఞమ్ = సుయజ్ఞుని, వామదేవం చ = వామదేవుని, అథ = మరియు, జాబాలిమ్ = జాబాలిని, కాశ్యపమ్ = కాశ్యపుని, పురోహితమ్ = పురోహితు డైన, వసిష్ఠం చ = వసిష్ఠుని, అన్యే = ఇతరు లైన, యే ద్విజసత్తమాః = ఏ బ్రాహ్మణోత్తములు కలరో, వేదపారగాన్ = వేదముల అంతమును చూచిన, సమస్తాన్ = ఒకచోట చేర్చబడిన, తాన్ సర్వాన్ = వారి నందరిని, సమానయత్ = తీసికొనివచ్చెను.

తా. సుమంత్రుడు శీఘ్రముగా వెళ్లి, సుయజ్ఞుని, వామదేవుని, జాబాలిని,

కాశ్యపుని, పురోహితుడైన వసిష్ఠుని, తదితరులైన బ్రాహ్మణోత్తములను, సర్వ
వేదములు తెలిసిన వీరందరిని ఒక్కసారిగ తీసికొని వచ్చెను. 5, 6

మూ. తాన్ పూజయిత్వా ధర్మాత్మా రాజా దశరథ స్తదా,
ఇదం ధర్మార్థసహితం శ్లక్ష్ణం వచనమబ్రవీత్. 7

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ము డైన, దశరథః రాజా=దశరథమహారాజు, తదా=అప్పుడు, తాన్ = వారిని, పూజయిత్వా = పూజించి, ధర్మార్థసహితమ్ = ధర్మార్థములతో కూడిన, శ్లక్ష్ణమ్ = మృదు వైన, ఇదం వచనమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ధర్మాత్ము డైన ఆ దశరథమహారాజు వారిని ఆదరించి, ధర్మార్థములతో కూడిన, మధుర మైన వచనమును పలికెను. 7

మూ. మమ లాలప్యమానస్య పుత్రార్థం నాస్తి వై సుఖమ్,
తదహం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ. 8

ప్ర. అ. పుత్రార్థమ్=పుత్రులకొరకు, లాలప్యమానస్య=బాధపడుచున్న, మమ = నాకు, సుఖమ్ = సుఖము, నాస్తి వై=లేదు. తత్=ఆ కారణమువలన, అహమ్=నేను, హయమేధేన యక్ష్యామి=అశ్వమేధయాగము చేయుదును, ఇతి= అని, మమ = నాకు, మతిః = అభిప్రాయము.

తా. పుత్రులు లేరని బాధపడుచున్న నాకు సుఖ మనునది లేదు. అందుచే అశ్వమేధయాగము చేయ వలె నని నాకు అభిలాష కలిగినది. 8

మూ. తదహం యష్టుమిచ్ఛామి శాస్త్రదృష్టేన కర్మణా,
కథం ప్రాప్స్యామ్యహం కామం బుద్ధిరత్ర విచార్యతామ్. 9

ప్ర. అ. తత్ = ఆకారణమువలన, అహమ్ = నేను, శాస్త్రదృష్టేన = శాస్త్రోక్త మైన, కర్మణా = కర్మచేత, యష్టుమ్=అశ్వమేధయాగము చేయుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను. కామమ్=కోరికను, కథమ్ = ఎట్లు, అహమ్=నేను, ప్రాప్స్యామి = పొందగలనో, అత్ర = ఈ విషయమున, బుద్ధిః = ఉపాయము, విచార్యతామ్ = ఆలోచింపబడుగాక,

తా. అందుచే నేను యథాశాస్త్రముగ యజ్ఞము చేయదలచుచున్నాను. నా కోరిక ఎట్లు తీరునో ఉపాయము ఆలోచింపుడు. 9

మూ. తతః సాధ్వితి తద్వాక్యం బ్రాహ్మణాః ప్రత్యపూజయన్,
వసిష్ఠప్రముఖాస్సర్వే పార్థివస్య ముఖాచ్చ్యుతమ్. 10

ప్ర. అ. తతః = అటు పిమ్మట, వసిష్ఠప్రముఖాః=వసిష్ఠుడు మొదలైన, బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, సర్వే = అందరును, పార్థివస్య = రాజుయొక్క, ముఖాత్=ముఖమునుండి, చ్యుతమ్=వెలువడిన, తత్ వాక్యమ్=ఆ వాక్యమును, సాధు ఇతి = చాల బాగున్న దని, ప్రత్యపూజయన్ = అభినందించిరి.

తా. వసిష్ఠుడు మొద లైన ఆ బ్రాహ్మణు లందరును దశరథుని నిర్ణయము చాల బాగున్నదని అభినందించిరి. 10

మూ. ఊచుశ్చ పరమప్రీతాః సర్వే దశరథం వచః,
సమ్భారాః సమ్భ్రియన్తాం తే తురగశ్చ విముచ్యతామ్. 11

ప్ర. అ. సర్వే = వారందరును, పరమప్రీతాః = మిక్కిలి సంతసించిన వారై, దశరథమ్ = దశరథుని గూర్చి, వచః=వాక్కును, ఊచుశ్చ=పలికిరి కూడ, సంభారాః = ఉపకరణములు, సంభ్రియన్తామ్ = కూర్చబడుగాక, తే = నీయొక్క, తురగశ్చ = గుఱ్ఱముకూడ, విముచ్యతామ్ = విడువబడుగాక.

తా. వారందరును చాల సంతసించి దశరథునితో "కావలసిన వస్తుసామగ్రిని సమకూర్చి అశ్వమును విడువుము," అని పలికిరి. 11

మూ. సర్వథా ప్రాప్స్యసే పుత్రానభిప్రేతాంశ్చ పార్థివ,
యస్య తే ధార్మికీ బుద్ధిరియం పుత్రార్థమాగతా. 12

ప్ర. అ. పార్థివ = ఓ రాజా !, యస్య = ఏ, తే = నీకు, పుత్రార్థమ్ = పుత్రులకొరకై, ఇయమ్ = ఈ, ధార్మికీ = ధర్మసంమత మైన, బుద్ధిః = బుద్ధి, ఆగతా = కలిగినదో, అట్టి నీవు, అభిప్రేతాన్=ఇష్టులైన, పుత్రాన్=పుత్రులను, సర్వథా = తప్పక, ప్రాప్స్యసే = పొందగలవు.

తా. "ఓ రాజా! పుత్రులు కావలెనని నీకు కలిగిన ఈ బుద్ధి చాల ధర్మ సంమత మైనది. నీకు తప్పక, ఇష్టు లైన పుత్రులు కలుగుదురు. 12

మూ. తతః ప్రీతోఽభవ ద్రాజా శ్రుత్వా తద్ద్విజభాషితమ్,
అమాత్యాంశ్చాబ్రవీద్రాజా హర్షపర్యాకులేక్షణః. 13

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాజా = రాజు, తత్ ద్విజభాషితమ్ = ఆ బ్రాహ్మణుల వాక్యమును, శ్రుత్వా = విని, ప్రీతః = సంతసించినవాడు, అభవత్ = అయెను. రాజా = రాజు, హర్షపర్యాకులేక్షణః = ఆనందముతో వ్యాకుల మైన చూపులు కలవాడై, అమాత్యాన్ = మంత్రులను గూర్చి, అబ్రవీత్ చ = పలికెను.

తా. రాజు బ్రాహ్మణుల మాటలకు సంతసించి, ఆనందము తొణికిసలాడు చున్న చూపులతో, మంత్రులతో ఇట్లు పలికెను. 13

మూ. సంభారాః సంభ్రియన్తాం మే గురూణాం వచనాదిహ,
సమర్థాధిష్ఠితశ్చాశ్వస్సోపాధ్యాయో విముచ్యతామ్. 14

ప్ర. అ. ఇహ = ఇచట, మే గురూణామ్ = నా గురువుల, వచనాత్ = మాటప్రకారము, సంభారాః = యజ్ఞమునకు కావలసిన వస్తుసామగ్రి, సంభ్రియన్తామ్ = సమకూర్చబడుగాక, సమర్థాధిష్ఠితః = సమర్థు లైన వీరులచే రక్షింపబడిన, సోపాధ్యాయః = ఉపాధ్యాయులతో కూడిన, అశ్వః = అశ్వము, విముచ్యతామ్ = విడువబడుగాక.

తా. నా గురువులు చెప్పిన విధముగ యజ్ఞసంభారములను సమకూర్చి, సమర్థు లైన వీరులచే రక్షింపబడుచున్న అశ్వమును విడచి, దాని వెంట ఉపాధ్యాయులను కూడ పంపుడు. 14

మూ. సరయ్వాశ్చోత్తరే తీరే యజ్ఞభూమిర్విధీయతామ్,
శాన్తయశ్చాభివర్ధన్తాం యథాకల్పం యథావిధి. 15

ప్ర. అ. సరయ్వాః = సరయూనదియొక్క, ఉత్తరే తీరే = ఉత్తరతీరమునందు, యజ్ఞభూమిః = యజ్ఞశాల, విధీయతామ్ = నిర్మింపబడుగాక, యథా

కల్పమ్ = పద్ధతి ప్రకారముగా, యథావిధి = శాస్త్రప్రకారముగా, శాన్తయశ్చ = శాంతులు కూడ, అభివర్ధన్తామ్ = వృద్ధిపొందుగాక.

తా. సరయూనది ఉత్తరతీరమున యజ్ఞభూమిని ఏర్పాటు చేయుడు. శాస్త్రోక్తప్రకారముగ, నియమబద్ధముగ శాంతికార్యములను జరిపించుడు. 15

మూ. శక్యః ప్రాప్తుమయం యజ్ఞః సర్వేణాపి మహీక్షితా,
నాపరాధో భవేత్కష్టో యద్యస్మిన్ క్రతుసత్తమే. 16

ప్ర. అ. అస్మిన్ = ఈ, క్రతుసత్తమే = శ్రేష్ఠ మైన యజ్ఞమునందు, కష్టః = కష్ట మైన, అపరాధః = పొరబాటు, న భవేత్ యది = జరుగకపోయిన పక్షమున, అయం యజ్ఞః = ఈ యజ్ఞము, సర్వేణాపి మహీక్షితా = ప్రతిరాజుచేతను, ప్రాప్తుమ్ = పొందుటకు, శక్యః = శక్యమైనది.

తా. ఈ అశ్వమేధయాగములో అపాయకర మైన అపచార మేమియు కలుగని పక్షాన అందరు రాజులును దీనిని చేయ గలిగియుండెడివారు. 16

మూ. ఛిద్రం హి మృగయన్తేఽత్ర విద్వాంసో బ్రహ్మరాక్షసాః,
నిహతస్య చ యజ్ఞస్య సద్యః కర్తా వినశ్యతి. 17

ప్ర. అ. అత్ర = ఈ అశ్వమేధయాగమునందు, విద్వాంసః = పండితు లైన, బ్రహ్మరాక్షసాః = బ్రహ్మరాక్షసులు, ఛిద్రమ్ = అపచారమును, మృగయన్తే హి = వెదకుచుందురు కదా, నిహతస్య = కొట్టువడిన, యజ్ఞస్య = యాగముయొక్క, కర్తా చ = కర్త, సద్యః = వెంటనే, వినశ్యతి = నశించును.

తా. అశ్వమేధయాగములో ఏమైన ప్రమాదము కలుగునా యని పండితు లైన బ్రహ్మరాక్షసులు చూచుచు వేచియుందురు. యజ్ఞమునకు భంగము వాటిల్లినచో యజమానుడు వెంటనే నశించును. 17

వి. యాగములు చేయు నపుడు ఏదైన అపచారము చేసిన బ్రాహ్మణులు మరణాంతరము బ్రహ్మరాక్షసు లగుదు రని సంప్రదాయజ్ఞులు చెప్పుదురు.

మూ. తద్యథా విధిపూర్వం మే క్రతురేష సమాప్యతే,
తథా విధానం క్రియతాం సమర్థాః కరణేష్విహ. 18

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, మే = నాయొక్క, ఏషః క్రతుః = ఈ యజ్ఞము, విధిపూర్వమ్ = యథాశాస్త్రముగ, యథా = ఎట్లు, సమావ్యతే = సమాప్తి పొందింపబడునో, తథా = అట్లు, విధానమ్ = ఏర్పాటు, క్రియతామ్ = చేయబడుగాక, (మీరు), ఇహ = ఇచట, కరణేషు = కార్యములయందు, సమర్థాః = సమర్థులు.

తా. అందుచే, ఈ క్రతువు శాస్త్రప్రకారము పూర్తి యగునట్లు చూడుడు. మీరందరును కార్యములయందు ఆరితేరినవారే కదా. 18

మూ. తథేతి చాబ్రువన్ సర్వే మన్త్రిణః ప్రత్యపూజయన్,
పార్థివేన్ద్రస్య తద్వాక్యం యథాజ్ఞప్తం నిశమ్య తే. 19

ప్ర. అ. తే మన్త్రిణః=ఆ మంత్రులు, సర్వే=అందరును, పార్థివేన్ద్రస్య= దశరథునియొక్క, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, నిశమ్య = విని, ప్రత్యపూజయన్ = అభినందించిరి, యథా = ఎట్లు, ఆజ్ఞప్తమ్ = ఆజ్ఞాపింపబడినదో, తథా ఇతి = అటులనే చేసెదము అని, అబ్రువన్ చ = పలికిరి కూడ.

తా. ఆ మంత్రులందరును దశరథుని మాటలు విని, ఆయనను అభినందించి, "తాము ఆజ్ఞాపించిన విధముననే చేసెదము" అని పలికిరి. 19

మూ. తథా ద్విజాస్తే ధర్మజ్ఞా వర్ధయన్తో నృపోత్తమమ్,
అనుజ్ఞాతాస్తతస్సర్వే పునర్జగ్ముర్యథాగతమ్. 20

ప్ర. అ. ధర్మజ్ఞాః = ధర్మములు తెలిసిన, తే ద్విజాః=ఆ బ్రాహ్మణులు, తథా=ఆవిధముగా, నృపోత్తమమ్=దశరథుని, వర్ధయన్తః=వృద్ధిపొందించుచు, అనుజ్ఞాతాః = అనుజ్ఞ పొందినవారై, తతః = అటుపిమ్మట, సర్వే = అందరును, యథాగతమ్ = వచ్చినట్లు, పునః = తిరిగి, జగ్ముః = వెళ్లిరి.

తా. ఆ బ్రాహ్మణు లందరును ఈ విధముగ దశరథుని ఉత్సాహమును వృద్ధిపొందించి, అనుజ్ఞ తీసికొని, తిరిగి వెళ్లిరి. 20

మూ. విసర్జయిత్వా తాన్ విప్రాన్ సచివానిదమబ్రవీత్,
ఋత్విగ్భిరుపదిష్టోఽయం యథావత్క్రతురాప్యతామ్. 21

ప్ర. అ. (దశరథుడు), తాన్ విప్రాన్ = ఆ బ్రాహ్మణులను, విసర్జయిత్వా = పంపివేసి, సచివాన్ = మంత్రులనుగూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ఋత్విగ్భిః = ఋత్విక్కులచేత, ఉపదిష్టః = ఉపదేశించబడిన, అయమ్ = ఈ, క్రతుః = యాగము, యథావత్ = యథాశాస్త్రముగ, ఆప్యతామ్ = పొందబడుగాక.

తా. దశరథుడు ఆ బ్రాహ్మణులు వెడలిపోయిన తరువాత, మంత్రులతో, "ఋత్విక్కులు చెప్పిన ఈ యాగము యథాశాస్త్రముగ జరుగునట్లు చూడుడు" అని పలికెను. 21

మూ. ఇత్యుక్త్వా నృపశార్దూలః సచివాన్ సముపస్థితాన్,
విసర్జయిత్వా స్వం వేశ్మ ప్రవివేశ మహాద్యుతిః. 22

ప్ర. అ. మహాద్యుతిః = గొప్ప కాంతి గల, నృపశార్దూలః = ఆ రాజశ్రేష్ఠుడు, సముపస్థితాన్ = దగ్గర ఉన్న, సచివాన్ = మంత్రులను గూర్చి, ఇతి = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, విసర్జయిత్వా = వారినందరిని పంపివేసి, స్వమ్ = తన సంబంధ మైన, వేశ్మ = గృహమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. గొప్ప కాంతి గల ఆ రాజశ్రేష్ఠుడు సమీపమున నున్న సచివులను ఈ విధముగ ఆజ్ఞాపించి, వారిని పంపివేసి, ఇంటిలోనికి ప్రవేశించెను. 22

మూ. తతః స గత్వా తాః పత్నీర్నరేన్ద్రో హృదయప్రియాః,
ఉవాచ దీక్షాం విశత యక్ష్యేఽహం సుతకారణాత్. 23

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః నరేన్ద్రః = ఆ నరేంద్రుడు, హృదయప్రియాః = తన హృదయమునకు ప్రియ లైన, తాః పత్నీః = ఆ భార్యలను, గత్వా = సమీపించి, అహమ్ = నేను, సుతకారణాత్ = పుత్రులకొరకై, యక్ష్యే = యాగము చేయగలను, దీక్షామ్ = దీక్షను, విశత = ప్రవేశించండి, అని, ఉవాచ = పలికెను.

తా. దశరథుడు తన మనస్సునకు చాల ఇష్టలైన పత్నుల దగ్గరకు వెళ్లి, "నేను యాగము చేయనున్నాను; అందుచే మీరు కూడ దీక్ష వహింపుడు" అని పలికెను.

వి. భర్తతో కలిసి యజ్ఞయాగాదులు చేయు అర్హత గల భార్య "పత్ని". 23

మూ. తాసాం తేనాతికాన్తేన వచనేన సువర్చసామ్,
ముఖపద్మాన్యశోభన్త పద్మనీవ హిమాత్యయే. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
అష్టమః సర్గః.

ప్ర. అ. అతికాన్తేన = మిక్కలి మనోహర మైన, తేన వచనేన = ఆ వాక్కు చేత, సువర్చసామ్ = మంచికాంతిగల, తాసామ్ = ఆ దశరథపత్నులయొక్క, ముఖపద్మాని = ముఖపద్మములు, హిమాత్యయే = హేమంతఋతువుయొక్క అంతమునందు, పద్మానీవ = పద్మములు వలె, అశోభన్త = ప్రకాశించినవి.

తా. అతి మనోహర మైన ఆ మాట వినగానే మంచి తేజస్సు గల ఆ దశరథపత్నుల ముఖపద్మములు, మంచు తొలగినపుడు పద్మములు ప్రకాశించి నట్లు ప్రకాశించినవి. 24

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలోని అష్టమసర్గ సమాప్తము.

అథ నవమః సర్గః

మూ. ఏతచ్ఛ్రుత్వా రహః సూతో రాజానమిదమబ్రవీత్,
ఋత్విగ్భిరుపదిష్టోఽయం పురా వృత్తో మయా శ్రుతః. 1

ప్ర. అ. ఏతత్ = ఈ విషయమును, శ్రుత్వా=విని, సూతః=సారథియైన సుమంత్రుడు, రాజానమ్ = రాజును గూర్చి, రహః = రహస్యమునందు, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ఋత్విగ్భిః = ఋత్విక్కులచేత, ఉపదిష్టః = ఉపదేశింపబడిన, అయమ్ = ఈ ఉపాయము, పురా = పూర్వము, వృత్తః=జరిగినది, అనగా చర్చింపబడినది. మయా=నాచేత, శ్రుతః=వినబడినది.

తా. ఈ విషయమును విన్న సుమంత్రుడు రహస్యముగ దశరథునితో ఇట్లు పలికెను. ఋత్విక్కులు చెప్పిన ఈ ఉపాయము పూర్వము చర్చింపబడగా నేను వింటిని. 1

మూ. సనత్కుమారో భగవాన్ పూర్వం కథితవాన్ కథామ్,
ఋషీణాం సన్నిధౌ రాజన్ తవ పుత్రాగమం ప్రతి. 2

ప్ర. అ. రాజన్ = రాజా! భగవాన్ = మాహాత్మ్యము గల, సనత్కుమారః = సనత్కుమారుడు, తవ = నీ యొక్క, పుత్రాగమం ప్రతి = పుత్ర ప్రాప్తిని గూర్చి, కథామ్ = కథను, ఋషీణామ్ = ఋషులయొక్క, సన్నిధౌ= సమీపమునందు, పూర్వమ్ = పూర్వమున, కథితవాన్ = చెప్పినాడు.

తా. ఓ రాజా! నీ పుత్రప్రాప్తిని గూర్చిన కథను, పూర్వ మొకప్పుడు, సనత్కుమారుడు ఋషులతో చెప్పినాడు. 2

మూ. కాశ్యపస్య తు పుత్రోఽస్తి విభణ్డక ఇతి శ్రుతః,
ఋష్యశృఙ్గ ఇతి ఖ్యాతస్తస్య పుత్రో భవిష్యతి. 3

ప్ర. అ. కాశ్యపస్య = కాశ్యపునకు, విభణ్డకః ఇతి = విభండకు డని, శ్రుతః = ప్రసిద్ధు డైన, పుత్రః = కుమారుడు, అస్తి=ఉన్నాడు, తస్య = అతనికి,

ఋష్యశ్రృఙ్గః ఇతి = ఋష్య శృంగు డని, ఖ్యాతః = ప్రసిద్ధు డైన, పుత్రః = పుత్రుడు, భవిష్యతి = పుట్టగలడు.

తా. "కాశ్యపునకు విభండకు డను కుమారుడు కలడు. ఆతనికి ఋష్య శృంగు డను పుత్రుడు కలుగును. 3

మూ. స వనే నిత్యసంవృద్ధో మునిర్వనచరః సదా,
నాన్యం జానాతి విప్రేన్ద్రో నిత్యం పిత్రనువర్తనాత్. 4

ప్ర. అ. వనే = వనమునందు, నిత్యసంవృద్ధః = నిత్యము పెరిగిన వాడై, సదా = ఎల్లప్పుడును, వనచరః = వనమునందే సంచరించు, విప్రేన్ద్రః = బ్రాహ్మణశ్రేష్ఠుడైన, సః మునిః = ఆ ఋష్యశృంగముని, నిత్యమ్ = ఎల్లపుడును, పిత్రనువర్తనాత్ = తండ్రినే అనుసరించి ఉండుట వలన, అన్యమ్ = ఇతరుల నెవ్వరిని, న జానాతి = ఎరుగడు.

తా. వనములోనే పెరిగి, నిత్యము వనములోనే సంచరించుచు, సర్వదా తండ్రితోడనే ఉండు ఆ ఋశ్యశృంగుడు తండ్రిని తప్ప వేరే ఎవ్వరిని ఎరుగడు. 4

మూ. ద్వైవిధ్యం బ్రహ్మచర్యస్య భవిష్యతి మహాత్మనః,
లోకేషు ప్రథితం రాజన్ విప్రైశ్చ కథితం సదా. 5

ప్ర. అ. రాజన్ = ఓ రాజా ! మహాత్మనః = మహాత్ము డైన ఆ ఋశ్య శృంగునకు, లోకేషు = లోకములయందు, ప్రథితమ్ = ప్రసిద్ధ మైనదియు, సదా = ఎల్లప్పుడును, విప్రైః = బ్రాహ్మణులచేత, కథితమ్ = కొనియాడబడి నదియు అగు, బ్రహ్మచర్యస్య = బ్రహ్మచర్యముయొక్క, ద్వైవిధ్యమ్ = ద్వివిధత్వము, అనగా రెండువిధము లైన బ్రహ్మచర్యము, భవిష్యతి = కాగలదు, లేదా, బ్రహ్మచర్యమునకు, ద్వైవిధ్యమ్ = విఘాతము, రాగలదు.

తా. రాజా ! ఆ ఋష్యశృంగుడు, లోకములలో ప్రసిద్ధ మైనదియు, బ్రాహ్మణులచే సర్వదా కొనియాడబడునదియు అగు, వ్రతిత్వము, ప్రాజాపత్యము అని రెండు విధము లైన బ్రహ్మచర్యమును అవలంబింపగలడు. లేదా ఆతని బ్రహ్మచర్యమునకు విఘాతము రాగలదు. 5

మూ. తస్యైవం వర్తమానస్య కాలః సమభివర్తత,
అగ్నిం శుశ్రూషమాణస్య పితరం చ యశస్వినమ్. 6

ప్ర. అ. అగ్నిమ్ = అగ్నిని, యశస్వినమ్ = యశఃశాలి యగు, పితరం చ = తండ్రిని, శుశ్రూషమాణస్య = సేవించుచున్న, ఏవమ్ = ఈ విధముగ, వర్తమానస్య = ఉంటూన్న, తస్య = ఆతనికి, కాలః = కాలము, సమభివర్తత = గడవగలదు.

తా. అగ్నిని, యశఃశాలి యైన తన తండ్రిని సేవించుచు అతడు వ్రతిత్వమను బ్రహ్మచర్యమున కొంత కాలము గడుపగలడు. 6

మూ. ఏతస్మిన్నేవ కాలే తు రోమపాదః ప్రతాపవాన్,
అఙ్గేషు ప్రథితో రాజా భవిష్యతి మహాబలః. 7

ప్ర. అ. ఏతస్మిన్నేవ కాలే = ఈ కాలమునందే, అఙ్గేషు = అంగదేశమునందు, ప్రతాపవాన్ = ప్రతాపము కలవాడును, మహాబలః = గొప్ప బలము కలవాడును అగు, ప్రథితః = ప్రసిద్ధుడైన, రోమపాదః రాజా = రోమపాదు డనెడు రాజు, భవిష్యతి = ఉండగలడు.

తా. ఈ కాలమునందే, అంగదేశములో, ప్రతాపశాలియు, ప్రసిద్ధుడును, మహాబలుడును అగు రోమపాదు డను రాజు ఉండగలడు. 7

మూ. తస్య వ్యతిక్రమాద్రాజ్ఞో భవిష్యతి సుదారుణా,
అనావృష్టిః సుఘోరా వై సర్వభూతభయావహా. 8

ప్ర. అ. తస్య = ఆ, రాజ్ఞః = రాజుయొక్క, వ్యతిక్రమాత్ = ధర్మాతిక్రమము వలన, సుదారుణా = చాల దారుణ మైనదియు, సుఘోరా = చాల ఘోర మైనదియు, సర్వభూతభయావహా = సమస్త ప్రాణులకును భయమును కలిగించునదియు అగు, అనావృష్టిః = అనావృష్టి, భవిష్యతి = కాగలదు.

తా. ఆ రాజు ధర్మాతిక్రమము చేయుటచే అతని రాజ్యములో సర్వ ప్రాణులకును భయంకర మైన తీవ్ర మైన అనావృష్టి కలుగును. 8

మూ. అనావృష్ట్యాం తు వృత్తాయాం రాజా దుఃఖసమన్వితః,
బ్రాహ్మణాన్ శ్రుతవృద్ధాంశ్చ సమానీయ ప్రవక్ష్యతి. 9

ప్ర. అ. అనావృష్ట్యామ్ = అనావృష్టి, వృత్తాయామ్ = ఏర్పడిన దగుచుండగా, రాజా = రాజు, దుఃఖసమన్వితః = దుఃఖముతో కూడినవాడై, శ్రుతవృద్ధాన్ = శాస్త్రాభ్యాసము చేత వృద్ధు లైన, బ్రాహ్మణాన్ = బ్రాహ్మణులను, సమానీయ = పిలిపించి, ప్రవక్ష్యతి = ఇట్లు పలుకును.

తా. అనావృష్టి కలిగినందులకు మిక్కిలి దుఃఖించుచు, ఆ రాజు, విద్యా వృద్ధు లైన బ్రాహ్మణులను పిలిపించి ఇట్లు చెప్పును. 9

మూ. భవన్తః శ్రుతధర్మాణో లోకచారిత్రవేదినః,
సమాదిశన్తు నియమం ప్రాయశ్చిత్తం యథా భవేత్. 10

ప్ర. అ. భవన్తః = మీరందరును, శ్రుతధర్మాణః = వినబడిన ధర్మములు కలవారు, లోకచారిత్రవేదినః = లోకముయొక్క చరిత్రను ఎరిగినవారు, యథా = ఏ విధముగ, ప్రాయశ్చిత్తమ్ = ప్రాయశ్చిత్తము, భవేత్ = అగునో, (ఆ విధముగ), నియమమ్ = నియమమును, సమాదిశత = ఉపదేశించండి.

తా. "మీరు సమస్తధర్మములు, లోకాచారములు తెలిసినవారు. ఈ అనావృష్టికి కారణ మైన పాపము తొలగిపోవుటకై ఏదైన నియమమును ఉపదేశింపుడు." 10

మూ. వక్ష్యన్తి తే మహీపాలం బ్రాహ్మణా వేదపారగాః,
విభణ్డకసుతం రాజన్ సర్వోపాయైరిహానయ. 11

ప్ర. అ. వేదపారగాః = సకల వేదముల అధ్యయనము చేసిన, తే బ్రాహ్మణాః = ఆ బ్రాహ్మణులు, మహీపాలమ్ = రాజును గూర్చి, వక్ష్యన్తి = ఇట్లు చెప్పగలరు, రాజన్ = ఓ రాజా ! విభణ్డకసుతమ్ = విభండకుని కుమారుడైన ఋశ్యశృంగుని, సర్వోపాయైః = అన్ని ఉపాయములచేతను, ఇహ = ఇచటికి, ఆనయ = తీసికొని రమ్ము.

తా. వేదములలో ప్రవీణు లైన ఆ బ్రాహ్మణులు ఆ రాజుతో ఇట్లు చెప్ప

గలరు— "రాజా! అన్ని ఉపాయములను ప్రయోగించి, ఋశ్యశృంగుని ఇచటకు రప్పింపుము." 11

మూ. ఆనాయ్య చ మహీపాల ఋశ్యశృఙ్గం సుసత్కృతమ్,
ప్రయచ్ఛ కన్యాం శాన్తాం వై విధినా సుసమాహితః. 12

ప్ర. అ. మహీపాల = ఓ రాజా!, సుసత్కృతమ్ = బాగుగా సత్కరింపబడిన, ఋశ్యశృఙ్గమ్=ఋశ్యశృంగుని, ఆనాయ్య=రప్పించి, సుసమాహితః= బాగుగా శ్రద్ధకలవాడవై, కన్యామ్=నీ కన్య యైన, శాన్తామ్=శాంతను, విధినా= యథాశాస్త్రముగా, ప్రయచ్ఛ = ఇమ్ము.

తా. ఓ రాజా! ఋశ్యశృంగుని రప్పించి, ఆతనిని బాగుగా సత్కరించి, శ్రద్ధాయుక్తుడవై శాంతను ఆతని కిచ్చి, యథాశాస్త్రముగ వివాహము చేయుము. 12

మూ తేషాం తు వచనం శ్రుత్వా రాజా చిన్తాం ప్రపత్స్యతే,
కేనోపాయేన వై శక్య ఇహానేతుం స వీర్యవాన్. 13

ప్ర. అ. తేషామ్ = వారియొక్క, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, రాజా = రాజు, వీర్యవాన్ = ఇంద్రియనిగ్రహము గల, సః = ఆతడు, ఇహ = ఇచటకు, ఆనేతుమ్ = తీసికొని వచ్చుటకు, కేన ఉపాయేన = ఏ ఉపాయముచే, శక్యః = శక్య మైనవాడు, అని, చిన్తామ్ = చింతను, ప్రపత్స్యతే = పొందగలడు.

తా. వారి మాటలను విని, రాజు, "జితేంద్రియు డైన ఆ ఋశ్యశృంగుని తీసికొని వచ్చుటకు ఉపాయమేమి?" అని ఆలోచింపగలడు. 13

మూ. తతో రాజా వినిశ్చిత్య సహ మన్త్రిభిరాత్మవాన్,
పురోహితమమాత్యాంశ్చ తతః ప్రేష్యతి సత్కృతాన్. 14

ప్ర. అ. తతః = అటు పిమ్మట, ఆత్మవాన్ = బుద్ధిశాలి యగు, రాజా= రాజు, మన్త్రిభిః సహ = మంత్రులతో కూడ కలిసి, వినిశ్చిత్య = నిశ్చయించి, తతః = అటు పిమ్మట, సత్కృతాన్ = సత్కరింపబడిన, పురోహితమ్ = పురోహితుని, అమాత్యాంశ్చ = మంత్రులను, ప్రేష్యతి = ప్రేరేపింపగలడు.

తా. అంత ధీమంతు డగు ఆ రాజు మంత్రులతో ఆలోచించి, నిశ్చయము చేసి, ఋశ్యశృంగుని తీసికొని వచ్చుటకై పురోహితుని, అమాత్యులను ప్రేరేపింప గలడు. 14

మూ. తే తు రాజ్ఞో వచః శ్రుత్వా వ్యథితా వినతాననాః,
న గచ్ఛేమ ఋషేర్భీతా అనునేష్యన్తి తం నృపమ్. 15

ప్ర. అ. తే=వారు, రాజ్ఞః=రాజుయొక్క, వచః = మాటను, శ్రుత్వా= విని, ఋషేః = విభాండకఋషి నుండి, భీతాః = భయపడినవారై, వ్యథితాః= బాధపడుచున్నవారై, వినతాననాః = వంచబడిన ముఖములు కలవారై, న గచ్ఛేమ = వెళ్లము, అని, తమ్ = ఆ, నృపమ్ = రాజును, అనునేష్యన్తి = ప్రతిమాలుకొనగలరు.

తా. వారు రాజు మాటలు విని, విభండకమునికి భయపడి, బాధతో తలలు వంచి, "మేము అచటికి వెళ్లజాలము" అని ఆ రాజును ప్రతిమాలెదరు. 15

మూ. వక్ష్యన్తి చిన్తయిత్వా తే తస్యోపాయాంశ్చ తత్క్షమాన్,
ఆనేష్యామో వయం విప్రం న చ దోషో భవిష్యతి. 16

ప్ర. అ. తే = వారు, చిన్తయిత్వా = ఆలోచించి, తత్క్షమాన్ = ఆతనిని తీసికొని వచ్చుటకు ఉపయోగించు, ఉపాయాన్ = ఉపాయములను, తస్య = ఆ రాజునకు, వక్ష్యన్తి = చెప్పగలరు, వయమ్ = మేము, విప్రమ్ = ఆ ఋశ్యశృంగుని, ఆనేష్యామః = తీసికొని వచ్చెదము. దోషః = దోష మేమియు, న భవిష్యతి చ = ఉండదు కూడ.

తా. పిమ్మట వారు ఆలోచించి, అందుకు తగిన ఉపాయములను కనుగొని "మేము దోష మేమియు కలుగకుండ ఆ ఋషిని తీసికొని వచ్చెదము" అని ఆ రాజుతో చెప్పెదరు. 16

మూ. ఏవమఙ్గాధిపేనైవ గణికాభిః ఋషేః సుతః,
ఆనీతోఽవర్షయద్దేవశ్శాన్తా చాస్మై ప్రదీయతే. 17

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగ, అఙ్గాధిపేన = అంగదేశరాజైన రోమపాదునిచేత, గణికాభిః = వేశ్యల సాహాయ్యముతో, ఋషేః సుతః = ఋషి

కుమారుడు, ఆనీతః = తీసికొని రాబడును, దేవః = దేవుడు, అవర్షయత్ = వర్షింపగలడు, అస్మై = ఋశ్యశృంగునకు, శాన్తా = శాంత, ప్రదీయతే చ = ఇవ్వబడును.

తా. రోమపాదుడు గణికల సాహాయ్యముతో ఋశ్యశృంగుని తీసికొని రాగలడు. వర్షములు కురియును. శాంతను ఆతని కిత్తురు. 17

మూ. ఋశ్యశృఙ్గస్తు జామాతా పుత్రాంస్తవ విధాస్యతి,
సనత్కుమారకథితమేతావద్వ్యాహృతం మయా. 18

ప్ర. అ. జామాతా = అల్లుడైన, ఋశ్యశృఙ్గస్తు = ఋశ్యశృంగుడు, తవ = నీకు, పుత్రాన్ = పుత్రులను, విధాస్యతి = కలుగు నట్లు చేయును. ఏతావత్ = ఇంత వరకును, సనత్కుమార కథితమ్ = సనత్కుమారునిచే చెప్పబడినది, మయా = నాచేత, వ్యాహృతమ్ = నీకు చెప్పబడినది.

తా. జామాత యైన ఋశ్యశృంగుడు నీకు పుత్రులు కలుగు విధానము చేయగలడు. ఈ విషయమును సనత్కుమారుడు చెప్పగా విని నేను నీకు చెప్పుచున్నాను. 18

మూ. అథ హృష్టో దశరథః సుమన్త్రం ప్రత్యభాషత,
యథర్శ్యశృఙ్గస్త్వానీతో విస్తరేణ త్వయోచ్యతామ్. 19

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
నవమః సర్గః.

ప్ర. అ. అథ = అటు పిమ్మట, హృష్టః = సంతసించిన, దశరథః = దశరథుడు, సుమన్త్రం ప్రతి = సుమంత్రుని గూర్చి, అభాషత = పలికెను. ఋశ్యశృఙ్గః = ఋశ్యశృంగుడు, యథా = ఏ విధముగా, ఆనీతః = తీసికొని రాబడెనో, ఆ విషయమంతయు, త్వయా = నీచేత, విస్తరేణ = సవిస్తరముగ, ఉచ్యతామ్ = చెప్పబడుగాక.

తా. దశరథుడు సంతోషించి, ఆ ఋశ్యశృంగుని ఎట్లు తీసుకొని వచ్చిరో సవిస్తరముగ చెప్పు మని సుమంత్రునితో పలికెను. 19

(ఇచట సర్గసమాప్తి యుక్తముగ లేదు. ఇది లేఖకుల దోషమై ఉండును అని గోవిందరాజుల అభిప్రాయము).

"బాలానన్దిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
బాలకాండలో నవమసర్గ సమాప్తము.

అథ దశమః సర్గః

మూ. సుమన్త్రశ్చోదితో రాజ్ఞా ప్రోవాచేదం వచ స్తదా,
యథర్శ్యశృఙ్గస్త్వానీతః శృణు మే మన్త్రిభిః సహ. 1

ప్ర. అ. రాజ్ఞా = రాజుచేత, చోదితః = ప్రేరితు డైన, సుమన్త్రః = సుమంత్రుడు, తదా = అప్పుడు, ఇదమ్ = ఈ వాక్యమును, ప్రోవాచ = పలికెను, సః = ఆ, ఋశ్యశృఙ్గః = ఋశ్యశృంగుడు, మన్త్రిభిః=మంత్రులచేత, యథా= ఏ విధముగా, ఆనీతః = తీసికొని రాబడెనో, మే=నానుండి, శృణు = వినుము, ('హ' కు అర్థము లేదు).

తా. ఈ విధముగ దశరథుడు ప్రశ్నింపగా సుమంత్రుడు ఇట్లు పలికెను. మంత్రులు ఋశ్యశృంగుని ఎట్లు తీసికొని వచ్చిరో చెప్పెదను; వినుము. 1

మూ. రోమపాదమువాచేదం సహామాత్యః పురోహితః,
ఉపాయో నిరపాయోఽయమస్మాభిరభిచిన్తితః. 2

ప్ర. అ. సహామాత్యః=అమాత్యులతో కూడిన, పురోహితః=పురోహితుడు, రోమపాదమ్ = రోమపాదునిగూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను, అస్మాభిః = మాచేత, నిరపాయః = అపాయము లేని, అయమ్ = ఈ, ఉపాయః = ఉపాయము, అభిచిన్తితః = ఆలోచించబడినది.

తా. అమాత్యులును పురోహితుడును, రోమపాదునితో ఇట్లు పలికిరి మేము అపాయము లేని ఒక ఉపాయము ఆలోచించినాము. 2

మూ. ఋశ్యశృఙ్గో వనచర స్తపఃస్వాధ్యాయసంయుతః,
అనభిజ్ఞః స నారీణాం విషయాణాం సుఖస్య చ. 3

ఋశ్యశృఙ్గః = ఋశ్యశృంగుడు, వనచరః = వనమునందే తిరుగుచున్న వాడై, తపః స్వాధ్యాయ సంయుతః = తపస్సుతోడను స్వాధ్యాయాధ్యయనము తోడను కూడినవాడు. సః = అతడు, నారీణామ్ = స్త్రీలకును (ను), విష

యాణామ్ = భోగములకును, సుఖస్య చ = సుఖమునకును, అనభిజ్ఞః = ఎరుగని వాడు.

తా. ఋశ్యశృంగుడు అడవులలోనే సంచరించుచు, తపః స్వాధ్యాయ నిరతుడై ఉన్నాడు. ఆతడు స్త్రీ సుఖమును గాని, ఇతర విషయ సుఖములను గాని అనుభవించి ఎరుగడు. 3

మూ. ఇన్ద్రియార్థైరభిమతై ర్నరచిత్త ప్రమాథిభిః,
పురమానాయయిష్యామః క్షిప్రం చాధ్యవసీయతామ్. 4

ప్ర. అ. నరచిత్త ప్రమాథిభిః = మానవుల చిత్తములను క్షోభపెట్టు, అభిమతైః = ఇష్ట మైన, ఇన్ద్రియార్థైః = ఇంద్రియములచే అనుభవించ దగు భోగములచేత, పురమ్ = పట్టణమును గూర్చి, ఆనాయయిష్యామః = రప్పించెదము, క్షిప్రమ్ = శీఘ్రముగా, అధ్యవసీయతామ్ = నిర్ణయము చేయబడుగాక.

తా. మానవులకు అభిమతములును, వారి మనస్సులను క్షోభపెట్టునవియు అగు ఇంద్రియార్థములచే ఆతనిని లోభపెట్టి పట్టణమునకు తీసికొని వచ్చెదము. శీఘ్రముగ నిశ్చయింపుము. 4

మూ. గణికా స్తత్ర గచ్ఛన్తు రూపవత్యః స్వలఙ్కృతాః,
ప్రలోభ్య వివిధోపాయైరానేష్య న్తీహ సత్కృతాః. 5

ప్ర. అ. రూపవత్యః = సౌందర్యము కలవారును, స్వలఙ్కృతాః = బాగుగా అలంకరింపబడివారును అయిన, గణికాః = వేశ్యలు, సత్కృతాః = నీచే సత్కరింపబడినవారై, తత్ర = అచటకు, గచ్ఛన్తు = వెళ్లెదరుగాక, వివిధోపాయైః = అనేక విధము లైన ఉపాయములచేత, ప్రలోభ్య = లోభపెట్టి, ఇహ = ఇచటికి, ఆనేష్య న్తి = తీసికొనిరాగలరు.

తా. సౌందర్యవతు లైన, చక్కగ అలంకరించుకొనిన గణికలను సత్కరించి అచటికి పంపుము. వారు అనేకవిధము లైన ఉపాయములచే ఆతనిని లోభపెట్టి తీసికొనిరాగలరు. 5

మూ. శ్రుత్వా తథేతి రాజా చ ప్రత్యువాచ పురోహితమ్,
పురోహితో మన్త్రిణశ్చ తథా చక్రుశ్చ తే తదా. 6

ప్ర. అ. రాజా చ = రాజు, శ్రుత్వా = విని, తథా = అటులనే చేయుడు, ఇతి = అని, పురోహితమ్=పురోహితుని గూర్చి, ప్రత్యువాచ=పలికెను, తదా= అప్పుడు, పురోహితః = పురోహితుడును, తే = ఆ, మన్త్రిణశ్చ = మంత్రులును, తథా = అట్లు, చక్రుః = చేసిరి.

తా. రాజు ఆ మాటలు విని "అటులనే చేయుడు" అని అనుమతించగా పురోహితుడును, మంత్రులును ఆ విధముగ చేసిరి. 6

మూ. వారముఖ్యాశ్చ తచ్ఛ్రుత్వా వనం ప్రవివిశుర్మహత్.
ఆశ్రమస్యావిదూరేఽస్మిన్ యత్నం కుర్వన్తి దర్శనే, 7
ఋషిపుత్రస్య ధీరస్య నిత్యమాశ్రమవాసినః.

ప్ర. అ. తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా=విని, వారముఖ్యాః=సౌందర్యవతులైన వేశ్యలు, మహత్ = గొప్పదైన, వనమ్ = వనమును, ప్రవివిశుః = ప్రవేశించిరి, ఆశ్రమస్య = ఆశ్రమముయొక్క, అస్మిన్=ఈ, అవిదూరే=సమీప ప్రదేశమునందు, ధీరస్య = ఇంద్రియనిగ్రహముకలవాడుకు, నిత్యమ్ = ఎల్లప్పుడును, ఆశ్రమవాసినః = ఆశ్రమమునందే నివసించువాడును అగు, ఋషిపుత్రస్య = ఋషికుమారునియొక్క, దర్శనే = దర్శనమునందు, యత్నమ్ = ప్రయత్నమును, కుర్వన్తి = చేయుచుండిరి.

తా. ఆ వాక్యమును విని, ఉత్తమ సౌందర్యవతులైన వేశ్యాస్త్రీలు ఆ అరణ్యమును ప్రవేశించి, ఆశ్రమమునకు సమీపమున నివాస మేర్పరచుకొని, ఎల్లప్పుడును ఆశ్రమమునందే నివసించు, ఇంద్రియనిగ్రహవంతుడైన ఆ ఋశ్యశృంగుని దర్శనమునకై ప్రయత్నము చేయుచుండిరి. 7

మూ. పితుః స నిత్యసన్తుష్టో నాతిచక్రామ చాశ్రమాత్,
న తేన జన్మప్రభృతి దృష్టపూర్వం తపస్వినా, 8
స్త్రీ వా పుమాన్వా యచ్చాన్యత్సర్వం నగరరాష్ట్రజమ్.

ప్ర. అ. నిత్యసంతుష్టః=నిత్యము సంతుష్టుడైన, సః=ఆ ఋశ్యశృంగుడు, పితుః = తండ్రియొక్క, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, నాతిచక్రామ = బైటకు వెళ్లలేదు, తపస్వినా=తపశ్శాలి యైన, తేన= అతనిచేత, జన్మప్రభృతి=పుట్టినది

మొదలు, స్త్రీ వా = స్త్రీకాని, పుమాన్వా = పురుషుడు కాని, నగరరాష్ట్రజమ్ = నగరములందును, ఇతరరాష్ట్రప్రదేశమునందును పుట్టిన, సర్వమ్ = సమస్తమైన, యత్ = ఏ, అన్యత్ = ఇతరవస్తువు గలదో అది గాని, న దృష్టపూర్వమ్ = పూర్వ మెన్నడును చూడబడలేదు.

తా. ఏ కోరికలును లేక నిత్యసంతుష్టుడుగా ఉన్న ఆ ఋశ్యశృంగుడు తన తండ్రి ఆశ్రమము దాటి ఎన్నడును బైటకు వెళ్లలేదు. పుట్టినది మొదలు ఆతడు, పురుషుని గాని, స్త్రీని గాని, నగరగ్రామాదులలోని ఏ ఇతర వస్తువును గాని చూచి ఉండలేదు. 8

మూ. తతః కదాచిత్తం దేశమాజగామ యదృచ్ఛయా,
విభణ్డకసుతస్తత్ర తాశ్చాపశ్యద్వరాఙ్గనాః. 9

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కదాచిత్ = ఒక రోజున, విభణ్డకసుతః = ఋశ్యశృంగుడు, యదృచ్ఛయా = దైవవశముచేత, తం దేశమ్ = ఆ ప్రదేశ మును గూర్చి, ఆజగామ = వచ్చెను, తత్ర = అచట, తాః = ఆ, వరాఙ్గనాః = ఉత్తమవేశ్యాస్త్రీలను, అపశ్యత్ చ = చూచెను.

తా. ఒకనాడు ఋశ్యశృంగుడు దైవవశమున ఆ ప్రదేశమునకు వెళ్లి ఆ స్త్రీలను చూచెను. 9

మూ. తాశ్చిత్రవేషాః ప్రమదా గాయన్త్యో మధురస్వరాః,
ఋషిపుత్రముపాగమ్య సర్వా వచనమబ్రువన్. 10

ప్ర. అ. చిత్రవేషాః = చిత్ర మైన వేషము కలవారును, మధురస్వరాః = మధుర మైన కంఠస్వరము కలవారును, గాయన్త్యః = గానము చేయుచున్నవారును అగు, తాః = ఆ, ప్రమదాః = స్త్రీలు, సర్వాః = అందరును, ఋషిపుత్రమ్ = ఋషికుమారుని, ఉపాగమ్య = సమీపించి, అబ్రువన్ = పలికిరి.

తా. చిత్రవేషములు ధరించి మదముతో కూడిన ఆ స్త్రీలు మధురస్వర ముతో గానము చేయుచుండిరి. ఋశ్యశృంగుని చూడగనే వారందరును ఆతనిని సమీపించి ఇట్లు పలికిరి. 10

మూ. కస్త్వం కిం వర్తసే బ్రహ్మన్ జ్ఞాతుమిచ్ఛామహే వయమ్,
ఏకస్త్వం విజనే ఘోరే వనే చరసి శంస నః. 11

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణుడా! త్వమ్ = నీవు, కః = ఎవ్వడవు? కిం వర్తసే = ఏ విధముగ ప్రవర్తించుచున్నావు? త్వమ్ = నీవు, ఏకః = ఒక్కడవే, విజనే = జనశూన్య మైన, ఘోరే = భయంకరమైన, వనే = వనమునందు, (కిం) చరసి = ఎందుకు సంచరించుచున్నావు. వయమ్ = మేము, జ్ఞాతుమ్ = తెలుసుకొనుటకు, ఇచ్ఛామహే = కోరుచున్నాము, నః = మాకు, శంస = చెప్పుము.

తా. ఓ బ్రాహ్మణుడా! నీ వెవ్వడవు! నీ జీవన విధాన మేమి? జనశూన్య మైన ఈ ఘోరవనములో ఏల సంచరించుచున్నావు? తెలిసికొనవలె నని కోరుచున్నాము, చెప్పుము. 11

మూ. అదృష్టరూపాస్తాస్తేన కామ్యరూపా వనే స్త్రియః,
హార్దాత్తస్య మతిర్జాతా వ్యాఖ్యాతుం పితరం స్వకమ్. 12

ప్ర. అ. కామ్యరూపాః = కోరదగిన రూపములు గల, తాః స్త్రియః = ఆ స్త్రీలు, తేన = ఆతనిచేత, వనే = వనమునందు, అదృష్టరూపాః = పూర్వ మెన్నడును చూడబడని రూపములు కలవారు. హార్దాత్ = ఆ కారణముచే కలిగిన స్నేహమువలన, తస్య = ఆతనికి, స్వకం పితరమ్ = తన తండ్రిని గూర్చి, వ్యాఖ్యాతుమ్ = చెప్పుటకు, మతిః = అభిప్రాయము, జాతా = కలిగినది.

తా. ఆ స్త్రీల సౌందర్యము చాల మనోహరముగ నుండెను. ఆత డట్టి సౌందర్యవతులను పూర్వ మెన్నడును ఆ వనములో చూడలేదు. అందుచే వారిపై స్నేహము కలిగి ఆతడు తన తండ్రిని గూర్చి చెప్పవలెనని నిశ్చయించుకొనెను. 12

మూ. పితా విభణ్డకోఽస్మాకం తస్యాహం సుత ఔరసః,
ఋశ్యశృఙ్గ ఇతి ఖ్యాతం నామ కర్మ చ మే భువి. 13

ప్ర. అ. విభణ్డకః = విభండకుడు, అస్మాకమ్ = మాయొక్క, పితా = తండ్రి, అహం = నేను, తస్య = ఆతనియొక్క, ఔరసః సుతః = ఔరసు డైన

కుమారుడను, మే = నాయొక్క, ఋశ్యశృఙ్గ ఇతి = ఋశ్యశృంగు డను, నామ=పేరు, కర్మ చ=పనియు, భువి=భూమియందు, ఖ్యాతమ్=ప్రసిద్ధ మైనది.

తా. నేను విభండకుని ఔరసపుత్రుడను. ఋష్యశృంగు డని నా పేరు, కర్మయు లోకమున ప్రసిద్ధములు.

వి. "నా కర్మ కూడ ప్రసిద్ధము" అనగా—ఋశ్యశృంగునకు ఆ పేరు తలపై ఒక కొమ్ము ఉండుటచే వచ్చినది గాన 'కర్మ' అనునది "అట్టి విశేషము" అను నర్థమున ప్రయోగింపబడినది. 14

మూ. ఇహాశ్రమపదోఽస్మాకం సమీపే శుభదర్శనాః,
కరిష్యే వోఽత్ర పూజాం వై సర్వేషాం విధిపూర్వకమ్. 15

ప్ర. అ. శుభదర్శనాః = మంగళప్రద మైన దర్శనము కలవారలారా! అస్మాకమ్ = మాయొక్క, ఆశ్రమపదః = ఆశ్రమము, ఇహ=ఇచట, సమీపే = సమీపముననే ఉన్నది, అత్ర = ఇచట, వః సర్వేషామ్ = మీ అందరియొక్క, పూజామ్ = పూజను, విధిపూర్వకమ్=యథాశాస్త్రముగా, కరిష్యే=చేయగలను.

తా. ఓ శుభదర్శనులారా! మా ఆశ్రమము, ఇచట సమీపముననే ఉన్నది. మీ అందరికిని మా ఆశ్రమములో, యథాశాస్త్రముగ అతిథిసత్కారము చేసెదను.

వి. స్త్రీలతో మాటలాడు నపుడు "సర్వేషామ్" అని పుంలింగప్రయోగ మును చేయుటచే ఋశ్యశృంగునకు స్త్రీపుంభేదము తెలియ దని సూచిత మగు చున్నది. 15

మూ. ఋషిపుత్రవచః శ్రుత్వా సర్వాసాం మతిరాస వై,
తదాశ్రమపదం ద్రష్టుం జగ్ముస్సర్వాశ్చ తేన తాః. 16

ప్ర. అ. ఋషిపుత్రవచః = ఋషికుమారుని వాక్యమును, శ్రుత్వా=విని, సర్వాసామ్ = ఆ వేశ్యాస్త్రీల కందరికిని, తత్ ఆశ్రమపదమ్ = ఆ ఆశ్రమమును, ద్రష్టుమ్ = చూచుటకు, మతిః = కోరిక, ఆస వై = కలిగినది. సర్వాః=వారంద రును, తేన = వానితో కూడ, జగ్ముః చ = వెళ్లిరి కూడ.

తా. ఋశ్యశృంగుని మాట విన్న పిదప ఆ వేశ్యలకు ఆ ఆశ్రమమును చూడ వలె నను కోరిక కలిగినది. వారందరును ఆతనితో కలిసి వెళ్లిరి. 16

మూ. ఆగతానాం తతః పూజామృషిపుత్రశ్చకార హ,
ఇదమర్ఘ్యమిదం పాద్యమిదం మూలం ఫలం చ నః. 17

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ఋషిపుత్రః = ఋషికుమారుడు, ఇదమ్= ఇది, నః = మాయొక్క (మేము సమర్పించు) అర్ఘ్యమ్ = అర్ఘ్యము, ఇదమ్ = ఇది, పాద్యమ్ = పాద్యము, ఇదమ్ = ఇది, మూలమ్ = మూలము, ఫలం చ = ఫలము, అని చెప్పుచు, ఆగతానామ్ = ఆశ్రమమునకు వచ్చిన ఆ స్త్రీల యొక్క, పూజామ్ = పూజను, చకార హ = చేసెను.

తా. పిదప ఆ ఋశ్యశృంగుడు "ఇది మేము సమర్పించు అర్ఘ్యము, ఇది పాద్యము, ఇవి కందమూలఫలములు" అని పలుకుచు వారి పూజ చేసెను. 17

మూ. ప్రతిగృహ్య చ తాం పూజాం సర్వా ఏవ సముత్సుకాః,
ఋషేర్భీతాశ్చ శీఘ్రం తా గమనాయ మతిం దధుః. 18

ప్ర. అ. తాః సర్వాః = ఆ వేశ్యలందరును, సముత్సుకాః = ఉత్సాహము కలవారై, తాం పూజామ్ = ఆ పూజను, ప్రతిగృహ్య = స్వీకరించి, ఋషేః = విభండకమహర్షివలన, భీతాః = భయపడినవారై, శీఘ్రమ్ = శీఘ్రముగా, గమనాయ = తిరిగి వెళ్లుటకు, మతిమ్ = బుద్ధిని, దధుః = ధరించిరి (నిశ్చయించిరి).

తా. ఆ వేశ్యలు ఉత్సాహముతో ఆ పూజ నందికొని, విభండక మహర్షి ఎక్కడ వచ్చునో అని భయపడుచు, శీఘ్రముగ మరలి పోవలె నని నిశ్చయించిరి. 18

మూ. అస్మాకమపి ముఖ్యాని ఫలానీమాని వై ద్విజ,
గృహాణ ప్రతి భద్రం తే ప్రభక్షయస్వ చ మా చిరమ్. 19

ప్ర. అ. ద్విజ = ఓ బ్రాహ్మణుడా ! అస్మాకమ్ = మాయొక్క, ముఖ్యాని = ప్రధానమైన, ఇమాని ఫలాన్యపి = ఈ ఫలములను కూడ, ప్రతి

గృహాణ = తీసికొనుము, తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక, భక్షయస్వ = భక్షించుము, చిరమ్ = ఆలస్యము, మా = చేయవద్దు.

తా. ఓ బ్రాహ్మణా! ఇవి మేము భుజించు ఫలములలో శ్రేష్ఠ మైనవి. తీసికొనుము. నీకు క్షేమ మగును. శీఘ్రముగ భక్షించుము. 19

మూ. తతస్తాస్తం సమాలిఙ్గ్య సర్వా హర్షసమన్వితాః,
మోదకాన్ ప్రదదు స్తస్మై భక్ష్యాంశ్చ వివిధాన్ బహూన్. 20

ప్ర. అ. తతః = పిమ్మట, తాః సర్వాః = వారందరును, తమ్ = వానిని, సమాలిఙ్గ్య = కౌగలించుకొని, హర్షసమన్వితాః = ఆనందముతో కూడినవారై, తస్మై = అతనికి, బహూన్ = అనేక మైన, మోదకాన్ = మధుర పదార్థములను, వివిధాన్ = అనేక విధము లైన, భక్ష్యాంశ్చ = ఇతర భక్ష్యములను, ప్రదదుః = ఇచ్చిరి.

తా. అంతట ఆ వేశ్యలందరును ఋశ్యశృంగుని ఆనందముతో కౌగలించుకొని, అతనికి అనేక మైన మధురపదార్థములను, ఇతరము లైన వివిధభక్ష్యములను ఇచ్చిరి. 20

మూ. తాని చాస్వాద్య తేజస్వీ ఫలానీతి స్మ మన్యతే,
అనాస్వాదితపూర్వాణి వనే నిత్యనివాసినామ్. 21

ప్ర. అ. తేజస్వీ = బ్రహ్మతేజము గల ఆ ఋశ్యశృంగుడు, వనే = వనమునందు, నిత్యనివాసినామ్ = నిత్యము నివసించువారికి (చే), అనాస్వాదితపూర్వాణి = పూర్వ మెన్నడును రుచిచూడబడని, తాని = వాటిని, ఆస్వాద్య = తిని, ఫలాని ఇతి = ఫలములే అని, మన్యతే స్మ = తలచెను.

తా. బ్రహ్మతేజముతో ఒప్పు ఆ ఋశ్యశృంగుడు, సర్వదా వనమునందే నివసించువారు పూర్వ మెన్నడును రుచి చూచి ఎరుగని వాటిని తిని, అవి ఫలములే అని అనుకొనెను. 21

మూ. ఆపృచ్ఛ్య చ తదా విప్రం వ్రతచర్యాం నివేద్య చ,
గచ్ఛన్తి స్మాపదేశాత్తా భీతా స్తస్య పితు స్స్త్రియః. 22

ప్ర. అ. తదా = అప్పుడు, తాః స్త్రియః = ఆ స్త్రీలు, విప్రమ్ = ఋశ్యశృంగుని, ఆపృచ్ఛ్య = అడిగి, వ్రతచర్యామ్ = నిత్యకర్మానుష్ఠానమును, నివేద్య = తెలిపి, తస్య = ఆతని, పితుః = తండ్రివలన, భీతాః = భయపడిన వారై, అపదేశాత్ = కర్మానుష్ఠాన మనే వంకతో, గచ్ఛన్తి స్మ = వెళ్లిపోయిరి.

తా. ఆతని తండ్రి వచ్చి ఏమి శపించునో అని భయపడిన ఆ స్త్రీలు, ఆతనివద్ద సెలవు గైకొని, కర్మానుష్ఠానము చేసికొనవలె నను నెపముతో వెళ్లిపోయిరి. 22

మూ. గతాసు తాసు సర్వాసు కాశ్యపస్యాత్మజో ద్విజః,
అస్వస్థహృదయశ్చాసీ ద్దుఃఖాత్ స్మ పరివర్తతే. 23

ప్ర. అ. తాసు సర్వాసు = ఆ వేశ్య లందరును, గతాసు సతీషు = వెళ్లిపోయిన వారగుచుండగా, కాశ్యపస్య = కాశ్యపకుమారుడైన విభండకుని, ఆత్మజః = కుమారు డైన, ద్విజః = ఆ బ్రాహ్మణుడు, అస్వస్థహృదయః = అస్వస్థమైన మనస్సు కలవాడు, ఆసీత్ = ఆయెను. దుఃఖాత్ = దుఃఖమువలన, పరివర్తతే స్మ = తిరుగాడుచుండెను.

తా. వేశ్యలు వెళ్లిపోయిన పిదప, ఋశ్యశృంగుడు మనస్సునందు స్వాస్థ్యము చెడి, దుఃఖముతో తిరుగాడుచుండెను. 23

మూ. తతోఽపరేద్యుస్తం దేశమాజగామ స వీర్యవాన్,
మనోజ్ఞా యత్ర తా దృష్టా రూపవత్యస్స్వలఙ్కృతాః. 24

ప్ర. అ. తతః = పిమ్మట, వీర్యవాన్ = తపఃశక్తిగల, సః = ఆతడు, అపరేద్యుః = మరునాడు, మనోజ్ఞాః=మనస్సుకు ఇంపైనవారును, రూపవత్యః= సౌందర్యవతులును, స్వలఙ్కృతాః = చక్కగా అలంకరించుకొన్నవారును అగు, తాః = ఆ వేశ్యలు, యత్ర = ఎచట, దృష్టాః=చూడబడిరో, తం దేశమ్= ఆ ప్రదేశమును గూర్చి, ఆజగామ = వచ్చెను.

తా. తపశ్శాలి యగు ఆ ఋశ్యశృంగుడు మరునాడు బయలుదేరి, మనోహర రూపవతులును, సర్వాలంకారభూషితలును అగు ఆవేశ్యలను తాను పూర్వము చూచిన ప్రదేశమునకు వచ్చెను. 24

మూ. దృష్ట్వైవ తా స్తదా విప్రమాయా న్తం హృష్టమానసాః,
ఉపసృత్య తతః సర్వాస్తాసమూచురిదం వచః. 25

ప్ర. అ. తదా = అప్పుడు, తాః = ఆ స్త్రీలు, ఆయా న్తమ్ = వచ్చుచున్న, తమ్ = ఆ, విప్రమ్ = బ్రాహ్మణుని, దృష్ట్వా ఏవ = చూడగనే, హృష్టమానసాః = సంతోషించిన మనస్సు కలవారై రి, తాః సర్వాః = వారందరును, తతః = పిమ్మట, ఉపసృత్య = సమీపించి, తమ్ = ఆతనిని గూర్చి, ఇదం వచః = ఈ వాక్యను, ఊచుః = పలికిరి.

తా. ఆతడు తమ వద్దకు వచ్చుచున్నట్లు చూడగనే సంతసించి, ఆ వేశ్య లందరును ఆతని దగ్గరకు వెళ్లి ఇట్లు పలికిరి. 25

మూ. ఏహ్యాశ్రమపదం సౌమ్య హ్యాస్మాకమితి చాబ్రువన్,
తత్రాప్యేష విధిః శ్రీమాన్ విశేషేణ భవిష్యతి. 26

ప్ర. అ. హే సౌమ్య = ఓ సౌమ్యుడా ! అస్మాకమ్ = మాయొక్క, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును గూర్చి, ఏహి = రమ్ము. తత్ర = అచట, శ్రీమాన్ = శోభాయుక్త మైన, ఏషః విధిః = ఈ అతిథిసత్కారము, విశేషేణ = విశేష రూపమున, భవిష్యతి = జరుగగలదు, ఇతి చ = అనియు, అబ్రువన్ = పలికిరి.

తా. "ఓ సౌమ్యుడా ! మా ఆశ్రమమునకు రమ్ము, అచట నీకు విశేష రూపమున చక్కని అతిథిసత్కారము చేయగలము" అని పలికిరి. 26

మూ. శ్రుత్వా తు వచనం తాసాం సర్వాసాం హృదయఙ్గమమ్,
గమనాయ మతిం చక్రే తం చ నిన్యు స్తదా స్త్రియః. 27

ప్ర. అ. తాసాం సర్వాసామ్ = వారందరియొక్క, హృదయఙ్గమమ్ = మనోహర మైన, వచనం = వాక్యమును, శ్రుత్వా = వినిః, గమనాయ = వెళ్లుటకు, మతిమ్ = బుద్ధిని, చక్రే = చేసెను. తదా = అప్పుడు, స్త్రియః = ఆ వేశ్యలు, తమ్ = ఆతనిని, నిన్యుః = తీసికొని వెళ్లిరి.

తా. వాళ్లు పలికిన మనోహర మైన మాటలు విని ఆతడు వారితో వెళ్లుటకు ఇచ్చగించెను. వారు ఆతనిని తీసికొని వెళ్లిరి. 27

మూ. తత్ర చానీయమానే తు విప్రే తస్మిన్ మహాత్మని,
వవర్ష సహసా దేవో జగత్ప్రహ్లాదయం స్తదా. 28

ప్ర. అ. మహాత్మని = మహాత్ముడైన, తస్మిన్ = ఆ, విప్రే = బ్రాహ్మణుడు, ఆనీయమానే = తీసికొని రాబడుచుండగా, తదా = అప్పుడు, దేవః = వర్షాధిష్ఠాన దేవత యైన పర్జన్యుడు, జగత్ = జగత్తును, ప్రహ్లాదయన్ = సంతోషింపచేయుచు, సహసా = వెంటనే, తత్ర = ఆ అంగదేశమునందు, వవర్ష = వర్షించెను.

తా. మహాత్ముడైన ఆ ఋశ్యశృంగుడు అంగదేశములో ప్రవేశించెనో లేదో, వెంటనే, పర్జన్యుడు, జగత్తుకు ఆహ్లాదము కలుగునట్లు వర్షించెను. 28

మూ. వర్షేణైవాగతం విప్రం విషయం స్వం నరాధిపః,
ప్రత్యుద్గమ్య మునిం ప్రహ్వః శిరసా చ మహీం గతః. 29

ప్ర. అ. నరాధిపః = రాజు, వర్షేణైవ = వర్షముతో కూడ, స్వమ్ = తన, విషయం = దేశమును, ఆగతమ్ = చేరిన, మునిమ్ = ముని యైన, విప్రమ్ = బ్రాహ్మణుని, ప్రత్యుద్గమ్య = ఎదురు వెళ్లి, ప్రహ్వః = వంగినవాడై; శిరసా = శిరస్సుతో, మహీమ్ = భూమిని, గతః = పొందెను.

తా. తన వెంట వర్షమును కూడ తీసికొని వచ్చిన ఆ ఋశ్యశృంగునికి ఎదురేగి, నమ్రుడై, రోమపాదుడు సాష్టాంగప్రణామ మాచరించెను. 29

మూ. అర్ఘ్యం చ ప్రదదౌ తస్మై న్యాయతః సుసమాహితః,
వవ్రే ప్రసాదం విప్రేన్ద్రాన్మా విప్రం మన్యురావిశత్. 30

ప్ర. అ. సుసమాహితః = ఏకాగ్రచిత్తుడై, తస్మై = ఆతనికి, అర్ఘ్యం చ = అర్ఘ్యమును, న్యాయతః = శాస్త్రప్రకారము, ప్రదదౌ = ఇచ్చెను, విప్రేన్ద్రాత్ = ఆ ఋశ్యశృంగుని వలన, ప్రసాదమ్ = అనుగ్రహమును, వవ్రే = కోరెను, విప్రమ్ = ఆ ఋశ్యశృంగుని, మన్యుః = కోపము, మా ఆవిశత్ = ప్రవేశించలేదు, లేదా విప్రమ్ = విభండకమహర్షిని, మన్యుః కో = పము, మావిశత్ = ప్రవేశించకుండుగాక, అని, విప్రేన్ద్రమ్ = ఋశ్యశృంగుని, ప్రసాదమ్ = అనుగ్రహమును, వవ్రే = కోరెను.

తా. రోమపాదుడు శ్రద్ధాపూర్వకముగ ఆతనిని అర్ఘ్యపాద్యాదులతో సత్కరించెను. ఆతని అనుగ్రహమును కోరెను. ఋశ్యశృంగునకు కోప మేమియు కలుగలేదు. లేదా నిన్ను ఇచటికి తీసికొని వచ్చినందులకు నీ తండ్రికి కోపము రాకుండు నట్లు అనుగ్రహింపు మని వేడెను. 30

మూ. అన్తఃపురం ప్రవిశ్యాస్మై కన్యాం దత్వా యథావిధి,
శాన్తాం శా న్తేన మనసా రాజా హర్షమవాప సః. 31

ప్ర. అ. సఃరాజా = ఆ రాజు, అన్తఃపురమ్=అంతపురమును, ప్రవిశ్య= ప్రవేశించి, లేదా పురములోనికి ప్రవేశించి, కన్యామ్ = కన్యయైన, శాన్తామ్ = శాంతను, అస్మై = ఈతనికి, యథావిధి = యథాశాస్త్రముగ, దత్వా = ఇచ్చి, శా న్తేన = శాంత మైన, మనసా=మనస్సుతో, హర్షమ్=ఆనందమును, అవాప= పొందెను.

తా. ఆ రాజు ఋశ్యశృంగునితో పురములో ప్రవేశించి, ఆతనికి శాంత నిచ్చి యథావిధిగ వివాహము చేసి, మనస్సు కుదుటపడి ఆనందించెను. 31

మూ. ఏవం స న్యవసత్తత్ర సర్వకామైః సుపూజితః.

ఇత్యార్షే, శ్రీమద్రామాయణే, ఆదికావ్యే బాలకాణ్డే
దశమః సర్గః.

ప్ర. అ. సః = ఋశ్యశృంగుడు, ఏవమ్ = ఈ విధముగ, సర్వకామైః= సమస్త భోగములచే, సుపూజితః=బాగుగా పూజింపబడిన వాడై, తత్ర=అచటనే, న్యవసత్ = నివసించెను.

తా. ఈ విధముగ సమస్త భోగములును సమకూర్చి పూజింపబడిన ఋశ్యశృంగుడు ఆ అంగరాజ్యమునందే నివసించెను.

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలోని
దశమ సర్గ సమాప్తము.

అథ ఏకాదశః సర్గః

మూ. భూయ ఏవ హి రాజేన్ద్ర శృణు మే వచనం హితమ్,
యథా స దేవప్రవరః కథాయామేవమబ్రవీత్. 1

ప్ర. అ. రాజేన్ద్ర=ఓ మహారాజా! సః=ఆ, దేవప్రవరః = దేవతలలో శ్రేష్ఠుడైన సనత్కుమారుడు, యథా = ఏ విధముగా, కథాయామ్=కథయందు, అబ్రవీత్ = చెప్పెనో, ఏవమ్ = ఈ విధముగ, మే = నాయొక్క, హితమ్ = హిత మైన, వచనమ్ = వచనమును, భూయః ఏవ=మరల, శృణు=వినుము.

తా. మహారాజా! సనత్కుమారుడు కథలో ఇంక ఏమని చెప్పినాడో చెప్పెదను. హితకర మగు ఆ విషయమును వినుము. 1

మూ. ఇక్ష్వాకూణాం కులే జాతో భవిష్యతి సుధార్మికః,
నామ్నా దశరథో నామ శ్రీమాన్ సత్యప్రతిశ్రవః. 2

ప్ర. అ. శ్రీమాన్ = కాంతి కలవాడును, సత్యప్రతిశ్రవః = సత్య మైన ప్రతిజ్ఞ కలవాడును, నామ్నా = పేరుచేత, దశరథో నామ = దశరథు డను ప్రసిద్ధి కలవాడును, సుధార్మికః=గొప్ప ధార్మికుడును అయిన రాజు, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకురాజుల, కులే = కులమునందు, జాతః భవిష్యతి=పుట్టగలడు.

తా. శ్రీమంతుడును, సత్యప్రతిజ్ఞుడును, పరమధార్మికు డును అగు దశరథు డను పేరు గల రాజు ఇక్ష్వాకువంశములో పుట్టగలడు. 2

మూ. అఙ్గరాజేన సఖ్యం చ తస్య రాజ్ఞో భవిష్యతి,
కన్యా చాస్య మహాభాగా శాన్తా నామ భవిష్యతి. 3

ప్ర. అ. తస్య రాజ్ఞః = ఆ రాజునకు, అఙ్గరాజేన=అంగరాజుతో, సఖ్యం చ = స్నేహముకూడ, భవిష్యతి = కాగలదు. అస్య = ఈ అంగరాజుయొక్క, మహాభాగా=పూజ్య మైన భాగ్యముగల, శాన్తా నామ=శాంత యనెడు, కన్యా= కుమార్తె, భవిష్యతి = పుట్టగలదు.

ఆ దశరథునకు అంగరాజుతో స్నేహ మేర్పడును. ఆ అంగరాజునకు శాంత యనెడు మహాభాగ్యవతి యగు కుమార్తె పుట్టగలదు. 3

మూ. పుత్రస్తు సోఽఙ్గరాజస్య రోమపాద ఇతి శ్రుతః,
తం స రాజా దశరథో గమిష్యతి మహాయశాః. 4

ప్ర. అ. సః = ఆ, అఙ్గరాజస్య పుత్రస్తు = అంగరాజు పుత్రు డైతే, రోమపాద ఇతి=రోమపాదు డని, శ్రుతః=ప్రసిద్ధుడు (కాగలడు). మహాయశాః= గొప్ప కీర్తి గల, సః = ఆ, దశరథః రాజా = దశరథమహారాజు, తమ్ = ఆ రోమపాదుని గూర్చి, గమిష్యతి = వెళ్లగలడు.

తా. ఆ అంగరాజకుమారుని పేరు రోమపాదుడు. గొప్ప కీర్తి గల ఆ దశరథమహారాజు ఆతనివద్దకు వెళ్లగలడు.

వి. పై శ్లోకములో అంగరా జనగా రోమపాదుడు. ఈ శ్లోకములో అంగరా జనగా రోమపాదుని తండ్రి. 4

మూ. అనపత్యోఽస్మి ధర్మాత్మన్ శాన్తాభర్తా మమ క్రతుమ్,
ఆహరేత త్వయాజ్ఞప్తస్సన్తానార్థం కులస్య చ. 5

ప్ర. అ. ధర్మాత్మన్ = ఓ ధర్మాత్ముడా! అనపత్యః = సంతానములేని వాడనై, అస్మి = ఉన్నాను. శాన్తాభర్తా = శాంతయొక్క భర్త, త్వయా = నీచేత, ఆజ్ఞప్తః = ఆజ్ఞాపింపబడినవాడై, మమ = నాయొక్క, కులస్య=కులము యొక్క, సంతానార్థమ్ = అవిచ్ఛిన్నత్వమునకై, క్రతుమ్ = యజ్ఞమును, ఆహరేత = నిర్వహించుగాక,

తా. "ఓ ధర్మాత్ముడా! నాకు పుత్రులు కలుగలేదు, అందుచేత ఋష్యశృంగుని నీవు పంపి, నాకు పుత్రులు కలుగుట ద్వారా నా వంశము అవిచ్ఛిన్నముగ ఉండుటకై క్రతువును చేయుటలో సాహాయ్యము చేయుము. 5

మూ. శ్రుత్వా రాజ్ఞోఽథ తద్వాక్యం మనసా స విచిన్త్య చ,
ప్రదాస్యతే పుత్రవన్తం శాన్తాభర్తారమాత్మవాన్. 6

ప్ర. అ. ఆత్మవాన్=బుద్ధిశాలి యగు ఆ రోమపాదుడు, రాజ్ఞః=ఆ రాజు యొక్క, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, అథ=అటుపిమ్మట,

మనసా = మనస్సుతో, సంవిచిన్త్య చ=ఆలోచించి, పుత్రవన్తమ్=పుత్రులు గల, శాన్తాభర్తారమ్ = శాంతయొక్క భర్తను, ప్రదాస్యతే = ఇవ్వగలడు.

తా. రోమపాదుడు దశరథుని మాటలు విని, బాగుగా ఆలోచించి, పుత్రులు గల — అనగా తపోమహిమచే ఇతరులకు పుత్రులను అనుగ్రహింపగల, ఋశ్యశృంగుని పంపగలడు. 6

మూ. ప్రతిగృహ్య చ తం విప్రం స రాజా విగతజ్వరః,
ఆహరిష్యతి తం యజ్ఞం ప్రహృష్టేనాన్తరాత్మనా. 7

ప్ర. అ. సః రాజా = ఆ దశరథమహారాజు, తమ్ = ఆ, విప్రమ్ = బ్రాహ్మణుని, ప్రతిగృహ్య చ=స్వీకరించి (తన వెంటబెట్టుకొని), విగతజ్వరః= తొలగిపోయిన మనోవ్యథ కలవాడై, ప్రహృష్టేన = సంతోషించిన, అన్తరాత్మనా = హృదయముతో, తం యజ్ఞమ్ = ఆ యజ్ఞమును, ఆహరిష్యతి = అనుష్ఠింపగలడు.

తా. దశరథుడు ఋశ్యశృంగుని తోడ్కొని వచ్చి, మనోవ్యథ శాంతింపగా, సంతోషించిన మనస్సుతో యజ్ఞము చేయగలడు. 7

మూ. తం చ రాజా దశరథో యష్టుకామః కృతాఞ్జలిః,
ఋశ్యశృఙ్గం ద్విజశ్రేష్ఠం వరయిష్యతి ధర్మవిత్. 8

యజ్ఞార్థం ప్రసవార్థం చ స్వర్గార్థం చ నరేశ్వరః,
లభతే చ స తం కామం ద్విజముఖ్యాద్విశాంపతిః. 9

ప్ర. అ. యష్టుకామః = యాగముచేయవలెనను కోరిక కలవాడును, ధర్మవిత్ = ధర్మముల నెరిగినవాడును, నరేశ్వరః = నరులకు ప్రభువును అయిన, దశరథః రాజా = దశరథమహారాజు, కృతాఞ్జలిః = కట్టబడినదోసిలి కలవాడై, ద్విజశ్రేష్ఠమ్=ద్విజులలో శ్రేష్ఠుడైన, ఋశ్యశృఙ్గమ్=ఋశ్యశృంగుని, యజ్ఞార్థమ్ = యజ్ఞముకొరకును, ప్రసవార్థం చ=సంతానముకొరకును, స్వర్గార్థం చ = స్వర్గముకొరకును, వరయిష్యతి = కోరగలడు; సః విశాంపతిః=ఆ రాజు, ద్విజముఖ్యాత్ = ఆ బ్రాహ్మణశ్రేష్ఠునివలన, తం కామమ్ = ఆ కోరికను, లభతే చ=పొందునుకూడ.

తా. ధర్మవేత్త యైన ఆ దశరథుడు, దోసిలి ఒగ్గి నాకు సంతానము, స్వర్గము కూడ కలుగు నట్లు యజ్ఞము చేయించు మని ఆ ఋశ్యశృంగుని ప్రార్థింప గలడు. ఆ బ్రాహ్మణోత్తమునివలన ఆ కోరికలను పొందగలడు. 9

మూ. పుత్రాశ్చాస్య భవిష్యన్తి చత్వారోఽమితవిక్రమాః,
వంశప్రతిష్ఠానకరా స్సర్వలోకేషు విశ్రుతాః. 10

ప్ర. అ. అస్య = ఈతనికి, అమితవిక్రమాః = అమిత మైన పరాక్రమము కలవారును, వంశప్రతిష్ఠానకరాః = వంశమునకు ప్రతిష్ఠ కలిగించువారును, సర్వలోకేషు = సమస్తలోకములందును, విశ్రుతాః = ప్రసిద్ధులును అగు, చత్వారః = నలుగురు, పుత్రాః = పుత్రులు, భవిష్యన్తి = పుట్టగలరు.

తా. ఆ దశరథునకు అమితపరాక్రమము కలవారును, వంశప్రతిష్ఠకు కారణ మైనవారును, సర్వలోకములందు ప్రసిద్ధులును అగు నలుగురు పుత్రులు జనింపగలరు. 10

మూ. ఏవం స దేవప్రవరః పూర్వం కథితవాన్ కథామ్,
సనత్కుమారో భగవాన్ పురా దేవయుగే ప్రభుః. 11

ప్ర. అ. దేవప్రవరః = దేవతలలో శ్రేష్ఠుడును, భగవాన్ = మాహాత్మ్యము కలవాడును, ప్రభుః = సమర్థుడును అగు, సః = ఆ, సనత్కుమారః = సనత్కుమారుడు, పురా = పూర్వమునందు, దేవయుగే = కృతయుగమునందు, కథామ్ = కథను, ఏవమ్ = ఈ విధముగా, కథితవాన్ = చెప్పినాడు.

తా. పూర్వము కృతయుగములో దేవతాశ్రేష్ఠు డైన సనత్కుమారుడు కథను ఈ విధముగా చెప్పెను. 11

మూ. స త్వం పురుషశార్దూల తమానయ సుసత్కృతమ్,
స్వయమేవ మహారాజ గత్వా సబలవాహనః. 12

ప్ర. అ. పురుషశార్దూల = పురుషశ్రేష్ఠుడ వైన, మహారాజ = ఓ మహారాజా! సః త్వమ్ = అట్టి, నీవు, సబలవాహనః = సైన్యముతోడను వాహనములతోడను కూడినవాడవై, స్వయమేవ = స్వయముగానే, గత్వా = వెళ్లి, సుసత్కృతమ్ = బాగుగా సత్కరింపబడిన, తమ్ = ఆతనిని, ఆనయ = తీసికొనిరమ్ము.

తా. పురుషశ్రేష్ఠుడ వైన ఓ మహారాజా! నీవే స్వయముగ సైన్యవాహనాదులతో వెళ్లి ఆదరపూర్వకముగా ఋశ్యశృంగుని తీసికొని రమ్ము. 12

మూ. అనుమాన్య వసిష్ఠం చ సూతవాక్యం నిశమ్య చ,
సాన్తఃపురః సహామాత్యః ప్రయయౌ యత్ర స ద్విజః. 13

ప్ర. అ. సూతవాక్యమ్=సుమంత్రుని వాక్యమును, నిశమ్య=విని, వసిష్ఠం చ = వసిష్ఠుని కూడ, అనుమాన్య = అంగీకరింపచేసి, సాన్తఃపురః = అంతఃపురముతో కూడినవాడై, సహామాత్యః = అమాత్యులతో కూడినవాడై, సః ద్విజః= ఆ బ్రాహ్మణుడు, యత్ర = ఎచట నున్నాడో అచటికి, ప్రయయౌ = వెళ్లెను.

తా. దశరథుడు సుమంత్రుని మాటలు విని, వసిష్ఠుని అనుమతి కూడ గైకొని, అంతఃపురామాత్యాదులతో కలిసి ఆ ఋశ్యశృంగుడున్న దేశమునకు వెళ్లెను. 13

మూ. వనాని సరితశ్చైవ వ్యతిక్రమ్య శనైః శనైః,
అభిచక్రామ తం దేశం యత్ర వై మునిపుఙ్గవః. 14

ప్ర. అ. శనైః శనైః=మెల్లమెల్లగా, వనాని=వనములను, సరితశ్చైవ= నదులను, వ్యతిక్రమ్య = దాటి, మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడు, యత్ర = ఎచట నుండెనో, తం దేశమ్ = ఆ దేశమును, అభిచక్రామ = ప్రవేశించెను.

తా. వనములను, నదులను, మెల్లమెల్లగ దాటుచు, ఆ ఋశ్యశృంగుడున్న దేశమును చేరెను. 14

మూ. ఆసాద్య తం ద్విజశ్రేష్ఠం రోమపాదసమీపగమ్,
ఋషిపుత్రం దదర్శాదౌ దీప్యమానమివానలమ్. 15

ప్ర. అ. ఆసాద్య = సమీపించి, రోమపాదసమీపగమ్ = రోమపాదుని సమీపమునం దున్నవాడును, దీప్యమానమ్ = ప్రజ్వలించుచున్న, అనలమివ = అగ్ని వలె నున్నవాడును, ద్విజశ్రేష్ఠమ్ = బ్రాహ్మణశ్రేష్ఠుడును అగు, తం ఋషిపుత్రమ్ = ఆ ఋషికుమారుని, ఆదౌ = ముందుగనే, దదర్శ = చూచెను.

తా. ఆ నగరము చేరగనే దశరథుడు, రోమపాదుని సమీపమున ఉన్న ద్విజశ్రేష్ఠు డైన ఋశ్యశృంగుని చూచెను, ఆతడు ప్రజ్వలించుచున్న అగ్ని వలె ప్రకాశించుచుండెను. 15

మూ. తతో రాజా యథాన్యాయం పూజాం చక్రే విశేషతః,
సఖిత్వాత్తస్య వై రాజ్ఞః ప్రహృష్టేనాన్తరాత్మనా. 16

ప్ర. అ. తతః = పిమ్మట, రాజా = రోమపాదుడు, ప్రహృష్టేన = సంతసించిన, అన్తరాత్మనా = హృదయముతో, యథాన్యాయమ్ = శాస్త్రానుసారముగ, సఖిత్వాత్ = స్నేహితు డగుటవలన, విశేషతః = అధికముగను, తస్య = ఆ, రాజ్ఞః = దశరథునియొక్క, పూజామ్ = పూజను, చక్రే = చేసెను.

తా. దశరథుని రాకచే సంతోషించిన రోమపాదుడు, యథాశాస్త్రముగను, మిత్రు డగుటచే విశేషముగను, దశరథునికి ఆదరసత్కారములు చేసెను. 16

మూ. రోమపాదేన చాఖ్యాతమృషిపుత్రాయ ధీమతే,
సఖ్యం సంబన్ధకం చైవ తదా తం ప్రత్యపూజయత్. 17

ప్ర. అ. రోమపాదేన = రోమపాదునిచేత, సఖ్యమ్ = స్నేహము, సంబన్ధకం చైవ = సంబంధము, ధీమతే = బుద్ధిమంతుడైన, ఋషిపుత్రాయ = ఋషికుమారునకు, ఆఖ్యాతమ్ = చెప్పబడినది. తదా = అప్పుడు, తమ్ = ఆ దశరథుని, ప్రత్యపూజయత్ = పూజించెను.

తా. రోమపాదుడు తనకు దశరథునితో ఉన్న స్నేహబాంధవ్యములను గూర్చి ఋశ్యశృంగునకు చెప్పగా ఆతడు దశరథుని పూజించెను. 17

మూ. ఏవం సుసత్కృతస్తేన సహోషిత్వా నరర్షభః,
సప్తాష్ట దివసాన్ రాజా రాజానమిదమబ్రవీత్. 18

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, సత్కృతః = సత్కరింపబడిన, నరర్షభః = నరశ్రేష్ఠు డైన, రాజా = దశరథుడు, తేన సహ = ఆతనితో కూడ, సప్తాష్ట = ఏడెనిమిది, దివసాన్ = దివసములపాటు, ఉషిత్వా = ఉండి, రాజానమ్ = రోమపాదుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఈ విధముగ నరశ్రేష్ఠ దగు దశరథుడు రోమపాదుడు చేసిన సత్కారముల నందికొని, ఏడెనిమిది దివసములు ఆతని అతిథిగా ఉండి, ఆతనితో ఇట్లనెను. 19

మూ. శాన్తా తవ సుతా రాజన్ సహ భర్త్రా విశాంపతే,
మదీయనగరం యాతు కార్యం హి మహదుద్యతమ్. 19

ప్ర. అ. విశాంపతే = ప్రజలకు ప్రభువైన, రాజన్ = రాజా ! తవ సుతా = నీ కుమార్తె యైన, శాన్తా = శాంత, సహభర్త్రా = భర్తతో కూడ, మదీయ నగరమ్ = నా పట్టణమును గూర్చి, యాతు = వెళ్ళుగాక. మహత్ = గొప్ప, కార్యమ్ = పని, ఉద్యతమ్ = ప్రారంభింప నిశ్చయింపబడినది.

తా. ఓ రాజా ! నే నొక గొప్ప కార్యము తలపెట్టితిని. నీ కుమార్తె యైన శాంతను, భర్తతో కూడ, నా నగరమునకు పంపుము. 19

మూ. తథేతి రాజా సంశ్రుత్య గమనం తస్య ధీమతః,
ఉవాచ వచనం విప్రం గచ్ఛ త్వం సహ భార్యయా. 20

ప్ర. అ. రాజా = రోమపాదుడు, తథా ఇతి = అటులనే అని, ధీమతః = బుద్ధిశాలి యైన, తస్య = ఆ ఋశ్యశృంగుని యొక్క, గమనమ్ = గమనమును, సంశ్రుత్య = అంగీకరించి, త్వమ్ = నీవు, భార్యయా సహ = భార్యతో కలిసి, గచ్ఛ = వెళ్లుము, అని, విప్రమ్ = బ్రాహ్మణుని గూర్చి, వచనమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రోమపాదుడు, ధీమంతు డైన ఋశ్యశృంగుని అయోధ్యాగమనమునకు అంగీకరించి "నీవు భార్యతో అయోధ్యకు వెళ్లుము" అని ఋశ్యశృంగునితో పలికెను. 20

మూ. ఋషిపుత్రః ప్రతిశ్రుత్య తథేత్యాహ నృపం తదా,
స నృపేణాభ్యనుజ్ఞాతః ప్రయయౌ సహ భార్యయా. 21

ప్ర. అ. తదా = అప్పుడు, ఋషిపుత్రః = ఋషికుమారుడు, ప్రతిశ్రుత్య = అంగీకరించి, నృపమ్ = రాజును గూర్చి, తథా ఇతి = "అటులనే చేసెదను" అని,

ఆహ = పలికెను. నృపేణ = రాజుచేత, అభ్యనుజ్ఞాతః = ఇవ్వబడిన అనుజ్ఞ కలవాడై, భార్యయా సహ = భార్యతో కూడ, ప్రయయౌ = వెళ్లెను.

తా. ఋశ్యశృంగుడు అందులకు అంగీకరించి, అటులనే చేసెద నని పలికి, రోమపాదుని అనుజ్ఞ గైకొని భార్యాసమేతుడై వెళ్లెను. 21

మూ. తావన్యోన్యాఞ్జలిం కృత్వా స్నేహాత్సంశ్లిష్య చోరసా,
ననన్దతుర్దశరథో రోమపాదశ్చ వీర్యవాన్. 22

ప్ర. అ. తౌ = ఆ, దశరథః = దశరథుడును, వీర్యవాన్ = పరాక్రమ శాలియగు, రోమపాదశ్చ = రోమపాదుడును, అన్యోన్యాఞ్జలిమ్ = పరస్పరము దోసిలిని, కృత్వా = చేసి, స్నేహాత్ = స్నేహమువలన, ఉరసా = వక్షస్థలముచే, సంశ్లిష్య = కౌగలించుకొని, ననన్దతుః = సంతోషించిరి.

తా. దశరథరోమపాదు లిద్దరును ఒకరి కొకరు దోసిలి ఒగ్గి నమస్కారము చేసికొని, వక్షస్థలములు కలియు నట్లు కౌగలించుకొని, సంతోషించిరి. 22

మూ. తతః సుహృదమాపృచ్ఛ్య ప్రస్థితో రఘునన్దనః,
పౌరేభ్యః ప్రేషయామాస దూతాన్వై శీఘ్రగామినః. 23

ప్ర. అ. తతః = పిమ్మట, రఘునన్దనః = దశరథుడు, సుహృదమ్ = మిత్రుని, ఆపృచ్ఛ్య=వీడ్కొని, ప్రస్థితః=ప్రయాణమైనవాడై, శీఘ్రగామినః= శీఘ్రముగా వెళ్లగలిగిన, దూతాన్ = దూతలను, పౌరేభ్యః = పౌరులకు, ప్రేషయామాస = పంపెను.

తా. మిత్రునివద్ద సెలవు గైకొని బయలుదేరిన దశరథుడు, శీఘ్రముగా వెళ్లగలిగిన దూతలను అయోధ్యాపౌరులకు తమ రాక తెలుపుటకై పంపెను. 23

మూ. క్రియతాం నగరం సర్వం క్షిప్రమేవ స్వలఙ్కృతమ్,
ధూపితం సిక్తసంమృష్టం పతాకాభిరలఙ్కృతమ్. 24

ప్ర. అ. సర్వమ్ = సమస్తమైన, నగరమ్ = నగరము, క్షిప్రమేవ = శీఘ్రముగ, స్వలఙ్కృతమ్ = బాగుగా అలంకరింపబడినదిగాను, ధూపితమ్ =

ధూపము వేయబడినదిగాను, సిక్తసంమృష్టమ్ = తడిపి తుడవబడినదిగాను, పతాకాభిః = జండాలచేత, అలఙ్కృతమ్ = అలంకరింపబడినదిగాను, క్రియతామ్= చేయబడుగాక.

తా. దశరథుడు అయోధ్యాపౌరుల కీ విధముగ కబురు పంపెను. "నగరము నంతను వెంటనే చక్కగా అలంకరింపుడు. ధూపసుగంధములను వ్యాపింప చేయుడు. మార్గములు తుడిచి నీళ్లు చల్లుడు. పతాకలు ఎగురవేయుడు." 24

మూ. తతః ప్రహృష్టాః పౌరాస్తే శ్రుత్వా రాజానమాగతమ్,
తథా ప్రచక్రుస్తత్సర్వం రాజ్ఞా యత్ప్రేషితం యథా. 25

ప్ర. అ. తతః = పిమ్మట, తే పౌరాః = ఆ పౌరులు, రాజానమ్ = రాజును, అగతమ్ = వచ్చిన వానినిగా, శ్రుత్వా = విని, ప్రహృష్టాః = సంతసించినవారై, రాజ్ఞా = రాజుచేత, యత్ = ఏది, యథా = ఎట్లు, ప్రేషితమ్ = పంపబడెనో, తత్ = దానిని, సర్వమ్ = అంతను, తథా = అట్లు, ప్రచక్రుః = చేసిరి.

తా. రాజు వచ్చుచున్నట్లు వినిన పౌరులు చాల సంతసించి, ఆయన ఆజ్ఞాపించిన విధమున నగరాలంకారములు చేసిరి. 25

మూ. తతః స్వలంకృతం రాజా నగరం ప్రవివేశ హ,
శఙ్ఖదున్దుభినిర్ఘోషైః పురస్కృత్య ద్విజర్షభమ్. 26

ప్ర. అ. తతః = పిమ్మట, రాజా = దశరథుడు, ద్విజర్షభమ్ = ఆ బ్రాహ్మణశ్రేష్ఠుని, పురస్కృత్య = ఎదుట ఉంచుకొని, స్వలంకృతమ్ = బాగుగా అలంకరింపబడిన, తత్ = ఆ, నగరమ్ = నగరమును, శఙ్ఖదున్దుభినిర్ఘోషైః = శంఖదుందుభుల ధ్వనులతో, ప్రవివేశ హ = ప్రవేశించెను.

తా. దశరథుడు ఆ ఋశ్యశృంగుని ఎదుట ఉంచుకొని, చక్కగ అలంకరింపబడిన అయోధ్యానగరమును శంఖదుందుభిమంగళధ్వనులతో ప్రవేశించెను. 26

మూ. తతః ప్రముదితాః సర్వే దృష్ట్వా తం నాగరా ద్విజమ్,
ప్రవేశ్యమానం సత్కృత్య నరేన్ద్రేణేన్ద్రకర్మణా. 27

ప్ర. అ. తతః = పిమ్మట, సర్వే = సమస్త మైన, నాగరాః = పౌరులు, ఇన్ద్రకర్మణా = ఇంద్రుని వంటి కర్మ గల, నరేన్ద్రేణ=రాజుచేత, సత్కృత్య= సత్కరించి, ప్రవేశ్యమానమ్ = ప్రవేశపెట్టబడుచున్న, తమ్ = ఆ, ద్విజమ్ = బ్రాహ్మణుని, దృష్ట్వా = చూచి, ప్రముదితాః = సంతోషించిరి.

తా. దేవేంద్రునితో సమాను డైన ఆ నరేంద్రునిచే సత్కృతుడై అయోధ్యలో ప్రవేశించుచున్న ఋష్యశృంగుని చూచి పౌరు లెల్లరు సంతోషించిరి. 27

మూ. అన్తఃపురం ప్రవేశ్యైనం పూజాం కృత్వా చ శాస్త్రతః,
కృతకృత్యం తదాత్మానం మేనే తస్యోపవాహనాత్. 28

ప్ర. అ. ఏనమ్ = ఋశ్యశృంగుని, అన్తఃపురం ప్రవేశ్య = అంతఃపురములో ప్రవేశపెట్టి, శాస్త్రతః = శాస్త్రానుసారముగా, పూజాం చ = పూజను, కృత్వా = చేసి, తదా = అప్పుడు, తస్య=అతనియొక్క (ని), ఉపవాహనాత్= తీసికొని వచ్చుటవలన, ఆత్మానమ్=తనను, కృతకృత్యమ్=కృతకృత్యునిగా, మేనే = తలచెను.

తా. దశరథు డా ఋశ్యశృంగుని అంతఃపురములోనికి తీసికొని వెళ్లి, యథాశాస్త్రముగ పూజించెను. ఆతనిని తీసికొనివచ్చుటచే, తన కర్తవ్యము పూర్తి యైనట్లు సంతసించెను. 28

మూ. అన్తఃపురస్త్రియః సర్వాః శాన్తాం దృష్ట్వా తథాగతామ్,
సహ భర్త్రా విశాలాక్షీం ప్రీత్యానన్దముపాగమన్. 29

ప్ర. అ. అన్తఃపురస్త్రియః = అంతఃపురములోని స్త్రీలు, సర్వాః = అందరును, తథా = ఆ విధముగా, భర్త్రా సహ = భర్తతో కూడ, ఆగతామ్=వచ్చిన, విశాలాక్షీమ్ = విశాలము లైన నేత్రములు గల, శాన్తామ్ = శాంతను, దృష్ట్వా= చూచి, ప్రీత్యా = ప్రేమతో, ఆనన్దమ్ = ఆనందమును, ఉపాగమన్ = పొందిరి.

తా. భర్తతో కలిసి వచ్చిన, విశాలాక్షి యైన శాంతను చూచి, అంతఃపురస్త్రీ లందరును ప్రేమతో ఆనందభరిత లైరి. 29

మూ. పూజ్యమానా చ తాభిః సా రాజ్ఞా చైవ విశేషతః,
ఉవాస తత్ర సుఖితా కంచిత్కాలం సహర్త్విజా. 30

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకాదశః సర్గః.

ప్ర. అ. సా = ఆమె, తాభిః = వారిచేతను, విశేషతః = విశేషముగా, రాజ్ఞా చైవ = రాజుచేతను, పూజ్యమానా = పూజింపబడుచున్నదై, సుఖితా = సుఖవంతురాలై, ఋత్విజా సహ = ఋత్విక్కుతో కూడ, కంచిత్కాలమ్ = కొంతకాలము, తత్ర = అచట, ఉవాస = నివసించెను.

తా. అంతఃపురస్త్రీలును, విశేషముగ దశరథుడును, ఆదరింపగా, ఆ శాంత, ఋష్యశృంగునితో, సుఖముగ కొంతకాలము అయోధ్యలో ఉండెను. 30

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో
ఏకాదశసర్గ సమాప్తము.

అథ ద్వాదశః సర్గః

మూ. తతః కాలే బహుతిథే కస్మింశ్చిత్సుమనోహరే,
వసన్తే సమనుప్రాప్తే రాజ్ఞో యష్టుం మనోఽభవత్. 1

ప్ర. అ. తతః = పిమ్మట, బహుతిథే కాలే = చాలకాలము గడచినదగుచుండగా, సుమనోహరే = బాగుగా మనోహర మైన, కస్మింశ్చిత్ = ఒకానొక, వసన్తే = వసంతము, సమనుప్రాప్తే = వచ్చినదగుచుండగా, రాజ్ఞః = రాజునకు, యష్టుమ్ = యాగముచేయుటకు, మనః అభవత్ = కోరిక కలిగెను.

తా. ఈ విధముగ చాలకాలము గడచిన పిదప, ఒక మనోహర మగు వసంతఋతువు వచ్చెను. అపుడు యజ్ఞము చేయవలె నని దశరథునకు అభిలాష కలిగెను. 1

మూ. తతః ప్రసాద్య శిరసా తం విప్రం దేవవర్ణినమ్,
యజ్ఞాయ వరయామాస సన్తానార్థం కులస్య వై. 2

ప్ర. అ. తతః=పిమ్మట, దేవవర్ణినమ్=దేవతుల్యు డైన, తం విప్రమ్= ఆ బ్రాహ్మణుని, శిరసా = శిరస్సు వంచి నమస్కరించుటచే, ప్రసాద్య = అనుగ్రహింపచేసికొని, కులస్య = కులముయొక్క, సన్తానార్థమ్ = అవిచ్ఛిన్నత్వము కొరకు, అనగా పుత్రపౌత్రాదిపారంపర్యసిద్ధి కొరకు, యజ్ఞాయ = యజ్ఞము చేయించుటకై, వరయామాస = వరించెను.

తా. అంతట దశరథుడు దేవతుల్యు డైన ఋష్యశృంగునికి నమస్కరించి, అనుగ్రహింపచేసుకొని, "నా వంశము పుత్రపౌత్రాద్యభివృద్ధితో అవిచ్ఛిన్నముగా ఉండునట్లు యజ్ఞము చేయింపుము" అని పలికి, ఆతనిని ఋత్విక్కుగా వరించెను. 2

మూ. తథేతి చ స రాజానమువాచ చ సుసత్కృతః,
సంభారాః సంభ్రియన్తాం తే తురగశ్చ విముచ్యతామ్. 3

ప్ర. అ. సుసత్కృతః = బాగుగా సత్కరింపబడిన, సః = ఋశ్యశృంగుడు, తథేతి = అటులనే చేయించెదను అని, రాజానమ్ = రాజును గూర్చి, ఉవాచ = పలికెను. సంభారాః = సంభారములు, సంభ్రియన్తామ్ = ఏర్పరుపబడుగాక. తే = నీయొక్క, తురగః = అశ్వము, విముచ్యతాం చ = విడువబడుగాక.

తా. బాగుగా ఆదరింపబడిన ఋష్యశృంగుడు "అటులనే చేయించెదను; యజ్ఞసంభారము లన్నియు ప్రోగు చేయించుము. యజ్ఞాశ్వమును విడుపుము" అని పలికెను. 3

మూ. తతో రాజాబ్రవీద్వాక్యం సుమన్త్రం మన్త్రిసత్తమమ్,
సుమన్త్రావాహయ క్షిప్రం ఋత్విజో బ్రహ్మవాదినః. 4

సుయజ్ఞం వామదేవం చ జాబాలి మథ కాశ్యపమ్,
పురోహితం వసిష్ఠం చ యే చాన్యే ద్విజసత్తమాః. 5

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాజా = రాజు, మన్త్రిసత్తమమ్ = మంత్రిశ్రేష్ఠుడైన, సుమన్త్రమ్ = సుమంత్రుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. సుమన్త్ర = ఓ సుమంత్రుడా ! క్షిప్రమ్ = శీఘ్రముగా, బ్రహ్మవాదినః = వేదవిదులైన, ఋత్విజః = ఋత్విక్కులను, సుయజ్ఞమ్ = సుయజ్ఞుని, వామదేవం చ = వామదేవుని, జాబాలిమ్ = జాబాలిని, అథ = మరియు, కాశ్యపమ్ = కాశ్యపుని, పురోహితమ్ = పురోహితుడైన, వసిష్ఠం చ = వసిష్ఠుని, యే = ఏ, అన్యే = ఇతరులైన, ద్విజోత్తమాః = బ్రాహ్మణోత్తములు గలరో వారిని, ఆవాహయ = రప్పింపుము.

తా. అంత దశరథుడు మంత్రిశ్రేష్ఠుడైన సుమంత్రునితో — "సుమంత్రా ! బ్రహ్మవాదులైన ఋత్విక్కులను, సుయజ్ఞుడు మొదలగువారిని, పురోహితుడైన వసిష్ఠుని, ఇతరులైన బ్రాహ్మణోత్తములను శీఘ్రముగా రప్పింపుము" అని పలికెను. 4, 5

మూ. తతః సుమన్త్రస్త్వరితం గత్వా త్వరితవిక్రమః,
సమానయత్స తాన్ సర్వాన్ సమస్తాన్ వేదపారగాన్. 6

ప్ర. అ. తా. చూ. శ్లో. 6. సర్గ, 8. (సుమంత్రుడు వారి నందరిని తీసి కొనివచ్చెను.) 6

మూ. తాన్ పూజయిత్వా ధర్మాత్మా రాజా దశరథస్తదా,
ధర్మార్థసహితం యుక్తం శ్లక్ష్ణం వచనమబ్రవీత్. 7

మమ లాలప్యమానస్య పుత్రార్థం నాస్తి వై సుఖమ్,
తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ. 8

ప్ర. అ. తా. చూ. శ్లో. 7, 8. సర్గ. 8. (దశరథుడు వారిని పూజించి "సంతానముకొరకై అశ్వమేధము చేయగోరుచున్నాను" అని పలికెను.) 7, 8

మూ. తదహం యష్టుమిచ్ఛామి శాస్త్రదృష్టేన కర్మణా,
ఋషిపుత్రప్రభావేన కామాన్ ప్రాప్స్యామి చాప్యహమ్. 9

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, శాస్త్రదృష్టేన=శాస్త్రవిహిత మైన, కర్మణా=విధానముచే, యష్టుమ్ ఇచ్ఛామి=యాగము చేయవలెనని కోరుచున్నాను. ఋషిపుత్రప్రభావేన=ఋషికుమారుని ప్రభావముచే, అహమ్=నేను, కామాన్=కోరికలను, ప్రాప్స్యామి చ=పొందగలను కూడ.

తా. అందుచే యథావిధిగ యాగము చేయగోరుచున్నాను. ఋశ్యశృంగుని ప్రభావముచే నా కోరికలు తీరును. 9

మూ. తతః సాధ్వితి తద్వాక్యం బ్రాహ్మణాః ప్రత్యపూజయన్,
వసిష్ఠప్రముఖాః సర్వే పార్థివస్య ముఖాచ్చ్యుతమ్. 10

ప్ర. అ. తా. చూ. శ్లో. 10. సర్గ. 8. 10

మూ. ఋశ్యశృఙ్గపురోగాశ్చ ప్రత్యూచుర్నృపతిం తదా,
సంభారాః సంభ్రియన్తాం తే తురగశ్చ విముచ్యతామ్. 11

ప్ర. అ. ఋశ్యశృఙ్గపురోగాః=ఋష్యశృంగుడు మొదలైనవారు, తదా=అప్పుడు, నృపతిమ్=రాజును గూర్చి, ప్రత్యూచుః=పలికిరి. సంభారాః=యజ్ఞ

సంభారములు, సంభ్రియన్తామ్=సమకూర్చబడుగాక, తే=నీయొక్క, తురగః=అశ్వము, విముచ్యతాం చ=విడువబడుగాక.

తా. ఋశ్యశృంగాదులు రాజుతో ఇట్లనిరి—"యజ్ఞసంభారములను సమకూర్చుము. అశ్వమును విడువుము." 11

మూ. సర్వథా ప్రాప్స్యసే పుత్రాంశ్చత్వారోఽమితవిక్రమాన్,
యస్య తే ధార్మికీ బుద్ధిరియం పుత్రార్థమాగతా. 12

ప్ర. అ. యస్య తే=ఏ నీకు, పుత్రార్థమ్=పుత్రులకొరకై, ఇయమ్=ఈ, ధార్మికీ బుద్ధిః=ధర్మసంమత మైన బుద్ధి, ఆగతా=కలిగినదో, అట్టి నీవు, సర్వథా=తప్పక, అమితవిక్రమాన్=అనంతపరాక్రమవంతు లైన, చత్వారః=నలుగురు, పుత్రాన్=పుత్రులను, ప్రాప్స్యసే=పొందగలవు.

తా. నీకు పుత్రులకొరకై ధర్మసంమత మైన బుద్ధి జనించినందులకు, నీకు తప్పక అనంతపరాక్రమవంతు లగు నలుగురు పుత్రులు జనింపగలరు. 12

మూ. తతః ప్రీతోఽభవద్రాజా శ్రుత్వా తద్ద్విజభాషితమ్,
అమాత్యాంశ్చాబ్రవీద్రాజా హర్షేణేదం శుభాక్షరమ్. 13

ప్ర. అ. తా. చూ. శ్లో. 13. సర్గ. 8. (హర్షేణ=సంతోషముతో, శుభాక్షరమ్=మంచి అక్షరములుగల, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్), ఈ మాటలకు సంతసించిన దశరథుడు అమాత్యులతో ఇట్లు పలికెను. 13

మూ. గురూణాం వచనాచ్ఛీఘ్రం సంభారాః సంభ్రియన్తు మే,
సమర్థాధిష్ఠితశ్చాశ్వః సోపాధ్యాయో విముచ్యతామ్. 14

ప్ర. అ. తా. చూ. శ్లో. 14. సర్గ. 8. 14

మూ. సరయ్వాశ్చోత్తరే తీరే యజ్ఞభూమిర్విధీయతామ్,
శాన్తయశ్చాభివర్ధన్తాం యథాకల్పం యథావిధి. 15

శక్యః ప్రాప్తుమయం యజ్ఞః సర్వేణాపి మహీక్షితా,
నాపరాధో భవేత్కష్టో యద్యస్మిన్ క్రతుసత్తమే. 16

ఛిద్రం హి మృగయన్తేఽత్ర విద్వాంసో బ్రహ్మరాక్షసాః,
నిహతస్య చ యజ్ఞస్య సద్యః కర్తా వినశ్యతి. 17

తద్యథా విధిపూర్వం మే క్రతురేష సమాప్యతే,
తథా విధానం క్రియతాం సమర్థాః కరణేష్విహ. 18

ప్ర. అ. తా. మూ. శ్లో. 15, 16, 17, 18. సర్గ. 8. 15-18

తథేతి చ తతః సర్వే మన్త్రిణః ప్రత్యపూజయన్,
పార్థివేన్ద్రస్య తద్వాక్యం యథాజ్ఞప్తమకుర్వత. 19

ప్ర. అ. తతః=పిమ్మట, మన్త్రిణః=మంత్రులు, సర్వే=అందరును, పార్థివేన్ద్రస్య=రాజశ్రేష్ఠునియొక్క, తత్ వాక్యమ్=ఆ వాక్యమును, తథేతి=అటులనే చేయగలము అని, ప్రత్యపూజయన్ = అభినందించిరి. యథాజ్ఞప్తమ్ = ఆజ్ఞాపించిన ప్రకారము, అకుర్వత=చేసిరి.

తా. మంత్రు లందరును దశరథుని మాటలను అభినందించి, అతడు ఆజ్ఞాపించిన విధముగ చేసిరి. 19

మూ. తతో ద్విజాస్తే ధర్మజ్ఞమస్తువన్ పార్థివర్షభమ్,
అనుజ్ఞాతాస్తతస్సర్వే పునర్జగ్ముర్యథాగతమ్. 20

ప్ర. అ. తతః=పిమ్మట, తే ద్విజాః = ఆ బ్రాహ్మణులు, ధర్మజ్ఞమ్ = ధర్మము నెరిగిన, పార్థివర్షభమ్=రాజశ్రేష్ఠుని, అస్తువన్=స్తుతించిరి, అనుజ్ఞాతాః=అనుజ్ఞ ఈయబడినవారై, తతః = అచటినుండి, పునః = మరల, యథాగతమ్=వచ్చిన విధముననే, జగ్ముః=వెళ్లిరి.

తా. పిమ్మట ఆ బ్రాహ్మణులు ధర్మజ్ఞుడైన దశరథుని కొనియాడి, అతని అనుజ్ఞ గైకొని, స్వస్థానములకు తిరిగి వెళ్లిరి. 20

మూ. గతేష్వథ ద్విజాగ్ర్యేషు మన్త్రిణస్తాన్నరాధిపః,
విసర్జయిత్వా స్వం వేశ్మ ప్రవివేశ మహాద్యుతిః. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ద్వాదశః సర్గః.

ప్ర. అ. అథ=అటు పిమ్మట, ద్విజాగ్ర్యేషు=బ్రాహ్మణశ్రేష్ఠులు, గతేషు సత్సు=వెళ్లినవా రగుచుండగా, మహాద్యుతిః = గొప్ప కాంతి గల, నరాధిపః= రాజు, తాన్ మన్త్రిణః=ఆ మంత్రులను, విసర్జయిత్వా=పంపివేసి, స్వం వేశ్మ= తన=గృహమును, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. బ్రాహ్మణులు వెడలిపోయిన పిమ్మట, తేజశ్శాలి యగు దశరథుడు మంత్రులను కూడ పంపివేసి తన గృహమును ప్రవేశించెను. 21

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో పండ్రెండవసర్గ సమాప్తము.

అథ త్రయోదశః సర్గః

మూ. పునః ప్రాప్తే వసన్తే తు పూర్ణస్సంవత్సరోఽభవత్,
ప్రసవార్థం గతో యష్టుం హయమేధేన వీర్యవాన్. 1

ప్ర. అ. పునః=మరల, వసన్తే=వసంతర్తువు, ప్రాప్తే సతి=వచ్చినదగుచుండగా, సంవత్సరః=సంవత్సరము, పూర్ణః అభవత్=నిండెను. వీర్యవాన్=పరాక్రమవంతుడైన దశరథుడు, ప్రసవార్థమ్ = సంతానము కొరకు, హయమేధేన=అశ్వమేధముచే, యష్టుమ్ = దేవతల పూజచేయటకు, గతః = యజ్ఞశాలలో ప్రవేశించెను.

తా. సంవత్సరము పూర్తయై తిరిగి వసంతఋతువు వచ్చినది. దశరథుడు సంతానముకొరకై అశ్వమేధయాగము చేయు సంకల్పముతో యజ్ఞశాలలో ప్రవేశించెను. 1

వి. 'మొదటి వసంతఋతువునందు, చిత్రాపూర్ణిమయందు సాంగ్రహణేష్టి చేసి, ప్రతిపత్తునందు బ్రహ్మౌదన మేధ్యాశ్వబంధన స్నాపన ప్రోక్షణ విమోచనాదులు చేయవలెను. అట్లు చేసి నలుగురు ఋత్విక్కులు సిద్ధముగా ఉండవలెను' అని శ్రౌతసూత్రములో చెప్పిన విధముగ "సావిత్రమష్టాకపాలం ప్రాతర్నిర్వపతి" అనునియమము ననుసరించి ప్రతిదినము సావిత్రాదికర్మములు చేయుచుండవలెను. ఈ విధముగ ఒక సంవత్సరము పూర్తియైన తరువాత మరల ప్రధానదీక్ష ప్రారంభ మగును.

మూ. అభివాద్య వసిష్ఠం చ న్యాయతః ప్రతిపూజ్య చ,
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం ప్రసవార్థం ద్విజోత్తమమ్. 2

ప్ర. అ. ద్విజోత్తమమ్=బ్రాహ్మణశ్రేష్ఠుడైన, వసిష్ఠమ్=వసిష్ఠుని, అభివాద్య = నమస్కరించి, న్యాయతః = శాస్త్రానుసారముగా, ప్రతిపూజ్య చ = పూజించి, ప్రసవార్థమ్=సంతానము కొరకు, ప్రశ్రితమ్ = వినయముతో కూడిన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. దశరథుడు బ్రాహ్మణశ్రేష్ఠుడైన వసిష్ఠుని నమస్కరించి, యథాశాస్త్రముగ పూజించి, పుత్రార్థియై, వినయపూర్వకముగ ఇట్లు పలికెను. 2

మూ. యజ్ఞో మే క్రియతాం బ్రహ్మన్ యథోక్తం మునిపుఙ్గవ,
యథా న విఘ్నః క్రియతే యజ్ఞాఙ్గేషు విధీయతామ్. 3

ప్ర. అ. మునిపుఙ్గవ=మునిశ్రేష్ఠుడవైన, బ్రహ్మన్=ఓ బ్రాహ్మణోత్తమా! మే = నాయొక్క, యజ్ఞః=యజ్ఞము, యథోక్తమ్=శాస్త్రోక్తరీతిగా, క్రియతామ్= చేయబడుగాక, యజ్ఞాఙ్గేషు = యజ్ఞముయొక్క అంగములయందు, విఘ్నః = విఘ్నము, యథా = ఏ విధముగ, న క్రియతే = చేయబడదో, ఆ విధముగ, విధీయతామ్ = చేయబడుగాక.

తా. ఓ మునిసత్తమా! నా యజ్ఞము యథాశాస్త్రముగ జరుగునట్లును, యజ్ఞాంగములలో ఎట్టి విఘ్నములు కలుగకుండునట్లును చూడుము. 3

మూ. భవాన్ స్నిగ్ధః సుహృన్మహ్యం గురుశ్చ పరమో మతః,
వోఢవ్యో భవతా చైవ భారో యజ్ఞస్య చోద్యతః. 4

ప్ర. అ. భవాన్ = నీవు, మహ్యమ్=నాకు, స్నిగ్ధః = స్నేహము గల, సుహృత్=మిత్రుడవు. పరమః=గొప్పవాడును, మహాన్ = పూజ్యుడును అగు, గురుః = పురోహితుడవు. యజ్ఞస్య=ఈ యజ్ఞముయొక్క, ఉద్యతః=ప్రారంభింపబడిన, భారః=భారము, భవతైవ=నీ చేతనే, వోఢవ్యః=వహింపదగినది.

తా. నీవు నా విషయమున స్నేహము గల మిత్రుడవు; పూజ్యుడవైన ఉత్తమ పురోహితుడవు; ప్రారంభింపబడిన ఈ యజ్ఞకార్యభారమును నీవే వహింపవలెను. 4

మూ. తథేతి చ స రాజానమబ్రవీద్ద్విజసత్తమః,
కరిష్యే సర్వమేవైతద్భవతా యత్సమర్థితమ్. 5

ప్ర. అ. ద్విజసత్తమః = బ్రాహ్మణోత్తముడైన, సః = ఆవసిష్ఠుడు, భవతా = నీ చేత, యత్ = ఏది, సమర్థితమ్=ప్రార్థింపబడినదో, లేదా నిర్ణయింపబడినదో, ఏతత్ = దీనిని, సర్వమ్=సమస్తమును, తథా = ఆ విధముగనే,

కరిష్యే=చేయగలను, ఇతి=అని, రాజానమ్=రాజును గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. అంతయు నీవు కోరి నట్లే చేసెదను అని ఆ బ్రాహ్మణోత్తముడు దశరథునితో పలికెను. 5

మూ. తతోఽబ్రవీద్ద్విజాన్వృద్ధాన్యజ్ఞకర్మసు నిష్ఠితాన్,
స్థాపత్యే నిష్ఠితాంశ్చైవ వృద్ధాన్ పరమధార్మికాన్. 6

కర్మాన్తికాన్ శిల్పకరాన్ వర్ధకీన్ ఖనకానపి,
గణకాన్ శిల్పినశ్చైవ తథైవ నటనర్తకాన్. 7

తథా శుచీన్ శాస్త్రవిదః పురుషాన్ సుబహుశ్రుతాన్,
యజ్ఞకర్మ సమీహన్తాం భవన్తో రాజశాసనాత్. 8

ఇష్టకా బహుసాహస్రీ శీఘ్రమానీయతామితి,
ఔపకార్యాః క్రియన్తాం చ రాజ్ఞాం బహుగుణాన్వితాః. 9

ప్ర. అ. తతః = పిమ్మట, యజ్ఞకర్మసు = యజ్ఞమునకు సంబంధించిన పనులందు, నిష్ఠితాన్ = సమర్థులైన, వృద్ధాన్ = వృద్ధులైన, ద్విజాన్ = బ్రాహ్మణులను, వృద్ధాన్ = వృద్ధులును, పరమధార్మికాన్ = చాలధార్మికులైన, స్థాపత్యే = వాస్తుకర్మయందు, నిష్ఠితాంశ్చైవ=సమర్థులను, కర్మాన్తికాన్=కార్య నిర్వాహకులను, శిల్పకరాన్ = ఇటికలు మొదలైనవి నిర్మించువారిని, వర్ధకీన్= వడ్రంగులను, ఖనకానపి = త్రవ్వువారిని, గణకాన్ = లెక్కలు కట్టువారిని, శిల్పినశ్చైవ=చిత్రాదులను నిర్మించు శిల్పులను, తథైవ = మరియు, నటనర్తకాన్ = నటులను, నర్తకులను (రసము నభినయించువారు నటులు, భావము లభినయించువారు నర్తకులు), తథా=మరియు, శుచీన్ = పరిశుద్ధమైన చరిత్ర గల, శాస్త్రవిదః=శాస్త్రవేత్తలను, సుబహుశ్రుతాన్ = చాల విషయములను విని తెలిసికొనిన, పురుషాన్ = పురుషులను గూర్చి, భవన్తః=మీరు, రాజశాసనాత్= రాజాజ్ఞవలన, యజ్ఞకర్మ = యజ్ఞమునకు కర్మను, సమీహన్తామ్ = చేయుటకు నిర్ణయింతురుగాక. బహుసాహస్రీ=అనేకసహస్రముల సంఖ్యలో ఉన్న, ఇష్టకా=

ఇటుక, శీఘ్రమ్=శీఘ్రముగా. ఆనీయతామ్=తీసికొని రాబడుగాక, రాజ్ఞామ్= రాజులకు, బహుగుణాన్వితాః=అనేకగుణములతో కూడిన, ఔపకార్యాః=తాత్కాలికనివాసభవనములు, క్రియన్తామ్=చేయబడుగాక. అని, అబ్రవీత్=పలికెను.

తా. పిమ్మట వసిష్ఠుడు యజ్ఞకర్మలయందు ఆరితేరిన వృద్ధు లైన బ్రాహ్మణులను, వాస్తుకర్మయందు ప్రజ్ఞ గల పరమధార్మికు లైన వృద్ధులను, వివిధకర్మచారులను, ఇటికలు మొదలగువాటిని నిర్మించు శిల్పకారులను, వడ్రంగులను, త్రవ్వువారిని, లెక్కలుకట్టువారిని, చిత్రలేఖనాదినిపుణు లైన శిల్పులను, నటులను, నర్తకులను, పరిశుద్ధ మైన చరిత్ర గల శాస్త్రవేత్తలను అనేకవిషయముల అనుభవము గల పురుషులను, పిలిపించి ఇట్లా జ్ఞాపించెను— "మీరందరును రాజాజ్ఞానుసారముగా యజ్ఞమునకు సంబంధించిన పనులు చేయుటకు పూనుకొనుడు. అనేక సహస్రముల ఇటికను తెప్పింపుడు. అతిథులుగా రాబోవు రాజుల నివాసము నకై వివిధవస్తుసామాగ్రితో కూడిన తాత్కాలికభవనములను నిర్మింపుడు." 6-9

మూ. బ్రాహ్మణావసథాశ్చైవ కర్తావ్యాః శతశః శుభాః,
భక్ష్యాన్నపానైర్బహుభిః సముపేతాః సునిష్ఠితాః. 10

ప్ర. అ. శుభాః = మంగళకర మైనవియు, బహుభిః = అనేక మైన, భక్ష్యాన్నపానైః=భక్ష్యములతోడను, పానీయములతోడను; సముపేతాః=కూడినవియు, సునిష్ఠితాః=చక్కగ నెలకొల్పబడినవియు అగు, బ్రాహ్మణావసథాః చైవ= బ్రాహ్మణుల కొరకై న గృహములు కూడ, శతశః=వందలకొలది, కర్తవ్యాః= నిర్మింపదగినవి.

తా "బ్రాహ్మణుల నివాసముకొరకై వందలకొలది అంద మైన గృహములను నిర్మించి, అనేకవిధముల భక్ష్య-అన్న-పానాదులను సమకూర్చుడు". 10

మూ. తథా పౌరజనస్యాపి కర్తవ్యా బహువిస్తరాః,
ఆవాసా బహుభక్ష్యా వై సర్వకామైరుపస్థితాః. 11

ప్ర. అ. తథా = అట్లే, పౌరజనస్యాపి = పౌరజనులకొరకై, బహువిస్తరాః=చాల వైశాల్యము గలవియు, బహుభక్ష్యాః=అనేకము లైన భక్ష్యములు కలవియు, సర్వకామైః=సమస్తభోగ్యవస్తువులతో, ఉపస్థితాః=కూడిన, ఆవాసాః= నివాసగృహములు, కర్తవ్యాః=చేయదగినవి.

తా. "పౌరజనులకొరకు గూడ, అతివిశాలములును, వివిధభక్ష్యభోగాదులతో కూడినవియు అగు నివాన గృహములను నిర్మింపుడు." 11

మూ. తథా జానపదస్యాపి జనస్య బహుశోభనమ్,
దాతవ్యమన్నం విధివత్సత్కృత్య న తు లీలయా. 12

ప్ర. అ. తథా=అట్లే, జానపదస్య=గ్రామములకు సంబంధించిన, జనస్యాపి=జనులకు కూడ, బహుశోభనమ్=చాల మంచి దైన, అన్నమ్=అన్నము, విధివత్=యథోచితముగ, సత్కృత్య=సత్కరించి, దాతవ్యమ్=ఇవ్వదగినది. లీలయా తు=అనాదరముతో మాత్రము, న=కాదు.

తా. "అట్లే గ్రామములనుండి వచ్చిన జనులను యథోచితరీతిని సత్కరించి, వారికి మంచి ఆహారమును ఇవ్వవలెను. అనాదరముగా ఇవ్వకూడదు." 12

మూ. సర్వే వర్ణా యథా పూజాం ప్రాప్నువన్తి సుసత్కృతాః,
న చావజ్ఞా ప్రయోక్తవ్యా కామక్రోధవశాదపి. 13

ప్ర. అ. సర్వే = అన్ని, వర్ణాః=వర్ణములవారును, సుసత్కృతాః = బాగుగా సత్కరింపబడినవారై, యథా=ఏ విధముగా, పూజామ్=పూజను, ప్రాప్నువన్తి=పొందెదరో, అట్లు చేయవలెను. కామక్రోధవశాదపి=కామమువలన గాని క్రోధమువలన గాని, అవజ్ఞా=అనాదరము, న ప్రయోక్తవ్యా=చేయదగినది కాదు.

తా. "అన్ని వర్ణములవారును బాగుగా సత్కరింపబడినవారై పూజ లందుకొను నట్లు చూడవలెను, వారిలో ఎవరైన కామక్రోధాదులను చూపినను వారిని అవమానింపరాదు." 13

మూ. యజ్ఞకర్మసు యే వ్యగ్రాః పురుషాః శిల్పినస్తథా,
తేషామపి విశేషేణ పూజా కార్యా యథాక్రమమ్.
తే చ స్యుః సంభృతాః సర్వే వసుభిర్భోజనేన చ. 14

ప్ర. అ. యే పురుషాః=ఏ పురుషులును, తథా=మరియు, శిల్పినః=శిల్పులును, యజ్ఞకర్మసు=యజ్ఞకర్మలయందు, వ్యగ్రాః=నిమగ్నులై యుందురో

తేషామపి=వారికి కూడ, విశేషేణ=ప్రధానముగ, యథాక్రమమ్=క్రమానుసారముగ, అనగా యథోచితముగ, పూజా=పూజ, కార్యా=చేయదగినది, తే సర్వే=వారందరును, వసుభిః=ధనములచేతను, భోజనేన చ=భోజనముచేతను, సంభృతాః=నింపబడినవారు, స్యుః=అగుదురుగాక.

తా. "యజ్ఞమునకు సంబంధించిన పనులు నిర్వహించుచున్న పురుషులను, శిల్పులను విశేషరీతిని, వారి వారి అర్హతల ననుసరించి సత్కరించవలెను. వారికి వలసి నంత ధనము నిచ్చి భోజనము పెట్టవలెను." 14

మూ. యథా సర్వం సువిహితం న కించిత్ పరిహీయతే,
తథా భవన్తః కుర్వన్తు ప్రీతిస్నిగ్ధేన చేతసా. 15

ప్ర. అ. సర్వమ్ = అంతయు, యథా = ఎట్లు, సువిహితమ్ = చక్కగా నిర్వహింపబడినదై అగునో, కించిత్ = ఏమియు, న పరిహీయతే=విడువబడదో, తథా = ఆ విధముగ, భవన్తః = మీరు, ప్రీతిస్నిగ్ధేన = ప్రేమతో ఆర్ద్రమైన, చేతసా = చిత్తముతో, కుర్వన్తు = చేయుదురుగాక.

తా. "అన్ని పనులును సరిగా జరుగు నట్లును, ఏమియు లోటు రానట్లును, మీరు, ప్రేమార్ద్రమైన మనస్సుతో, ఏర్పరుపవలెను." 15

మూ. తతః సర్వే సమాగమ్య వసిష్ఠ మిదమబ్రువన్. 16
యథోక్తం తత్సువిహితం న కించి త్పరిహీయతే,
యథోక్తం తత్కరిష్యామో న కించిత్ పరిహాస్యతే. 17

ప్ర. అ. తతః = పిమ్మట, సర్వే = అందరును, సమాగమ్య = వచ్చి, వసిష్ఠమ్ = వసిష్ఠుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రువన్ = పలికిరి, యథా = ఏ విధముగా, ఉక్తమ్ = చెప్పబడినదో, తత్ = అది, ఆ విధముగ, సువిహితమ్ = బాగుగా ఏర్పరుపబడినది. కించిత్ = ఏదియు, న పరిహీయతే = విడువబడుటలేదు, యథోక్తమ్=ఏ విధముగా చెప్పబడినదో, తత్ = దానిని, ఆ విధముగ, కరిష్యామః = చేయగలము, కించిత్ = ఏమియు, న పరిహాస్యతే = విడువబడదు.

తా. పిమ్మట వారందరును వచ్చి వసిష్ఠునితో ఇట్లు చెప్పిరి. "తాము చెప్పిన విధమున గృహనిర్మాణాదికము జరుగుచున్నది. ఏ లోటును లేదు. తాము చెప్పిన విధమున అన్నదానాదికము కూడ ఏ లోటును లేకుండ, చేయ గలము" 16, 17

మూ. తతః సుమన్త్రమానీయ వసిష్ఠో వాక్యమబ్రవీత్,
నిమన్త్రయస్వ నృపతీన్ పృథివ్యాం యే చ ధార్మికాః. 18

ప్ర. అ. తతః = పిమ్మట, వసిష్ఠః = వసిష్ఠుడు, సుమన్త్రమ్=సుమంత్రుని, ఆనీయ = పిలిపించి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్=పలికెను, పృథివ్యామ్= భూమియందు, ధార్మికాః = ధార్మికులైన, యే = ఏ రాజు లున్నారో, అట్టి, నృపతీన్ = రాజులను, నిమన్త్రయస్వ = ఆహ్వానించుము.

తా. పిదప వసిష్ఠుడు సుమంత్రుని పిలిపించి ఇట్లు చెప్పెను. "ఈ భూమండలములో నున్న ధార్మికులైన రాజుల నందరిని అహ్వానింపుము". 18

మూ. బ్రాహ్మణాన్ క్షత్రియాన్ వైశ్యాన్ శూద్రాంశ్చైవ సహస్రశః,
సమానయస్వ సత్కృత్య సర్వదేశేషు మానవాన్. 19

ప్ర. అ. సర్వదేశేషు = సమస్తదేశములందు ఉన్న, మానవాన్ = మానవులను, బ్రాహ్మణాన్=బ్రాహ్మణులను, క్షత్రియాన్ = క్షత్రియులను, వైశ్యాన్ = వైశ్యులను, శూద్రాంశ్చైవ=శూద్రులను, సహస్రశః = వేలకొలది, సత్కృత్య= సత్కరించి, సమానయస్వ=తీసికొనిరమ్ము.

తా. "మన రాజ్యములోనివారినే కాక, సమస్తదేశములలో ఉన్న వేలకొలది బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులను కూడ గౌరవపూర్వకముగా తీసికొని రమ్ము." 19

మూ. మిథిలాధిపతిం శూరం జనకం సత్యవిక్రమమ్,
నిష్ఠితం సర్వశాస్త్రేషు తథా వేదేషు నిష్ఠితమ్. 20

తమానయ మహాభాగం స్వయమేవ సుసత్కృతమ్,
పూర్వసంబన్ధినం జ్ఞాత్వా తతః పూర్వం బ్రవీమి తే. 21

ప్ర. అ. మిథిలాధిపతిమ్=మిథిలకు ప్రభువును, శూరమ్ = శూరుడును, సత్యవిక్రమమ్ = యథార్థ మైన పరాక్రమము కలవాడును, సర్వశాస్త్రేషు = సకలశాస్త్రములందును, నిష్ఠితమ్=సమర్థుడును, తథా=మరియు, వేదేషు=వేదము లందు, నిష్ఠితమ్ = సమర్థుడును, మహాభాగమ్ = గొప్ప భాగ్యము కలవాడును అగు, తం జనకమ్=ఆ జనకమహారాజును, పూర్వసంబన్ధినమ్=పూర్వసంబంధము కలవానినిగా, జ్ఞాత్వా=తెలుసుకొని, సుసత్కృతమ్=బాగుగా సత్కరింపబడిన వానినిగా చేసి, స్వయమేవ=స్వయముగనే, ఆనయ=తీసుకొని రమ్ము, తతః= ఆ కారణమువలననే, పూర్వమ్=ముందుగా, తే=నీకు, బ్రవీమి=చెప్పుచున్నాను.

తా. "శూరుడును, సత్యపరాక్రమవంతుడును, సర్వవేదశాస్త్రములలో నిష్ణాతుడును, మహాభాగ్యవంతుడును అగు, మిథిలాధిపతి యైన జనకుడు, మనకు పూర్వసంబంధి యను విషయమును గుర్తు ఉంచుకొని, తగు విధములగు సత్కారములతో, స్వయముగ తీసికొని రమ్ము. మనకు పూర్వసంబంధి యగుటచే ఆయన విషయమును నీకు ముందుగా చెప్పుచున్నాను." 20, 21

మూ. తథా కాశీపతిం స్నిగ్ధం సతతం ప్రియవాదినమ్,
వయస్యం రాజసింహస్య స్వయమేవానయస్వ హ. 22

ప్ర. అ. తథా=మరియు, స్నిగ్ధమ్=స్నేహశీలుడును, సతతమ్=ఎల్లప్పుడు, ప్రియవాదినమ్=ప్రియముగా మాటలాడువాడును, రాజసింహస్య=రాజశ్రేష్ఠ డైన దశరథునియొక్క, వయస్యమ్=మిత్రుడును అగు, కాశీపతిమ్=కాశీరాజును, స్వమేవ=స్వయముగనే, ఆనయస్వ హ=తీసికొనిరమ్ము.

తా. "స్నేహశీలుడును, ఎల్లప్పుడును ప్రియముగపలుకువాడును, మన మహారాజుకు మిత్రుడును అగు కాశీరాజును కూడ నీవు స్వయముగ వెళ్లి పిలచి, తీసికొని రమ్ము." 22

మూ. తథా కేకయరాజానం వృద్ధం పరమధార్మికమ్,
శ్వశురం రాజసింహస్య సపుత్రం త్వమిహానయ. 23

ప్ర. అ. తథా=మరియు, పరమధార్మికమ్=చాల ధార్మికుడును, రాజసింహస్య=దశరథునియొక్క, శ్వశురమ్=మామగారును అగు, వృద్ధమ్=వృద్ధు

దైన, కేకయరాజానం=కేకయరాజును, సపుత్రమ్=పుత్రసమేతముగా, త్వమ్=నీవే స్వయముగ, ఇహ=ఇచటకు, ఆనయ=తీసికొని రమ్ము.

తా. పరమధార్మికుడును, మన మహారాజుగారి మామగారును అగు వృద్ధుడైన కేకయదేశరాజును కూడ, పుత్రసమేతముగ తీసికొని రమ్ము. 23

మూ. అఙ్గేశ్వరం మహాభాగం రోమపాదం సుసత్కృతమ్,
వయస్యం రాజసింహస్య సమానయ యశస్వినమ్. 24

ప్ర. అ. అఙ్గేశ్వరమ్=అంగదేశమునకు ప్రభు వైనవాడును, మహాభాగమ్=మహాభాగ్యవంతుడును, రాజసింహస్య=రాజశ్రేష్ఠుడైన దశరథుని యొక్క, వయస్యమ్=మిత్రుడును, యశస్వినమ్=యశఃశాలియు అగు, రోమపాదమ్=రోమపాదుని, సుసత్కృతమ్=బాగుగా సత్కరింపబడినవానినిగా చేసి, సమానయ=తీసికొనిరమ్ము.

తా. అంగదేశాధిపతియు, మహాభాగ్యవంతుడును అయిన రోమపాదుడు, మన మహారాజునకు మిత్రుడు. ఆ యశఃశాలిని గూడ బాగుగా సత్కరించి తీసికొనిరమ్ము. 24

మూ. ప్రాచీనాన్ సిన్ధుసౌవీరాన్ సౌరాష్ట్రేయాంశ్చ పార్థివాన్,
దాక్షిణాత్యాన్నరేన్ద్రాంశ్చ సమస్తానానయస్వ హ. 25

ప్ర. అ. ప్రాచీనాన్=తూర్పుదిక్కున ఉన్న దేశాల రాజులను, సిన్ధుసౌవీరాన్=సింధుసౌవీరదేశరాజులను, సౌరాష్ట్రేయాన్=సురాష్ట్రదేశమునకు సంబంధించిన, పార్థివాన్=రాజులను, దాక్షిణాత్యాన్=దక్షిణదేశమునకు సంబంధించిన, నరేన్ద్రాంశ్చ=రాజులను, సమస్తాన్=అందరిని, ఆనయస్వ హ=తీసికొని రమ్ము (ఆహ్వానింపుము).

తా. తూర్పుదేశాలరాజులను, సింధుసౌవీరసౌరాష్ట్రదేశాలరాజులను, దక్షిణదేశరాజులను, అందరిని తీసికొనిరమ్ము. 25

మూ. సన్తి స్నిగ్ధాశ్చ యే చాన్యే రాజానః పృథివీతలే,
తానానయ యథాక్షిప్రం సానుగాన్ సహబాన్ధవాన్. 26

ప్ర. అ. పృథివీతలే=భూమండలమునందు, స్నిగ్ధాః=మిత్రులైన, యే చ=ఏ, అన్యే=ఇతరులైన, రాజానః=రాజులు గలరో, తాన్=వారిని, సానుగాన్=అనుచరసహితముగా, సహబాన్ధవాన్=బంధుసమేతముగా, యథాక్షిప్రమ్=వీలగునంత తొందరగా, ఆనయ=తీసికొనిరమ్ము.

తా. మన రాజ్యముతో స్నేహసంబంధము గల భూతలమునందలి ఇతర రాజుల నందరిని గూడ, వారి పరివారబంధువులతో సహ, వీలైనంత త్వరగా తీసికొనిరమ్ము (ఆహ్వానింపుము). 26

మూ. వసిష్ఠవాక్యం తచ్ఛ్రుత్వా సుమన్త్రస్త్వరితస్తదా,
వ్యాదిశత్పురుషాంస్తత్ర రాజ్ఞామానయనే శుభాన్. 27

ప్ర. అ. తత్=ఆ, వసిష్ఠవాక్యమ్=వసిష్ఠుని వాక్యమును, శ్రుత్వా=విని, సుమన్త్రః=సుమంత్రుడు, తదా=అప్పుడు, త్వరితః=తొందరపడుచున్నవాడై, తత్ర=అచటికి, రాజ్ఞామ్=రాజులయొక్క, ఆనయనే=తీసికొనివచ్చుట యందు (కొరకు), శుభాన్=సద్గుణవంతులైన, పురుషాన్=పురుషులను, వ్యాదిశత్=ఆజ్ఞాపించెను.

తా. వసిష్ఠుని ఆజ్ఞప్రకారము, సుమంత్రుడు రాజులను తీసికొని వచ్చుటకై సద్గుణవంతులగు పురుషులను వెంటనే పంపెను. 27

మూ. స్వయమేవ హి ధర్మాత్మా ప్రయయౌ మునిశాసనాత్,
సుమన్త్రస్త్వరితో భూత్వా సమానేతుం మహీక్షితః. 28

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడగు, సుమన్త్రః=సుమంత్రుడు, మునిశాసనాత్=మునియొక్క శాసనమువలన, త్వరితః భూత్వా=తొందరకలవాడై, మహీక్షితః=రాజులను, సమానేతుమ్=తీసికొనివచ్చుటకు, స్వయమేవ=స్వయముగానే, ప్రయయౌ=వెళ్లెను.

తా. వసిష్ఠుని ఆజ్ఞప్రకారము, ధర్మాత్ముడైన సుమంత్రుడు జనక కేకయ రాజాదులను స్వయముగ తీసికొనివచ్చుటకై శీఘ్రముగా వెళ్లెను. 28

మూ. తే చ కర్మాన్తికాస్సర్వే వసిష్ఠాయ చ ధీమతే,
సర్వం నివేదయన్తి స్మ యజ్ఞే యదుపకల్పితమ్. 29

ప్ర. అ. తే=ఆ, కర్మాన్తికాః=కర్మకారులు, సర్వే=అందరును, యజ్ఞే=యజ్ఞముకొరకై, యత్=ఏది, ఉపకల్పితమ్=చేయబడినదో, సర్వమ్=దానినంతను, ధీమతే=బుద్ధిమంతుడైన, వసిష్ఠాయ=వసిష్ఠునకు, నివేదయన్తి స్మ=తెలిపిరి.

తా. ఆ యా కార్యములందు నియుక్తులైన కర్మకారు లందరును తాము యజ్ఞము విషయమున చేసిన పనుల నన్నింటిని వసిష్ఠునకు విన్నవించిరి. 29

మూ. తతః ప్రీతో ద్విజశ్రేష్ఠస్తాన్ సర్వానిదమబ్రవీత్,
అవజ్ఞయా న దాతవ్యం కస్య చిల్లీలయాపి వా. 30
అవజ్ఞయా కృతం హన్యాద్దాతారం నాత్ర సంశయః.

ప్ర. అ. తతః=పిమ్మట, ప్రీతః=సంతోషించిన, ద్విజశ్రేష్ఠః=బ్రాహ్మణశ్రేష్ఠుడు, తాన్ సర్వాన్=వారి నందరిని గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను. కస్య చిత్=ఎవనికిని, అవజ్ఞయా=అనాదరముతో గాని, లీలయాపి వా=అశ్రద్ధతో గాని, న దాతవ్యమ్=ఇవ్వకూడదు. అవజ్ఞయా=అనాదరముతో, కృతమ్=చేయబడిన దానము, దాతారమ్=దాతను, హన్యాత్=చంపును. అత్ర=ఈ విషయమున, సంశయః=సంశయము, న=లేదు.

తా. అది విని సంతోషించిన వసిష్ఠుడు వారితో ఇట్లనెను. "ఎవ్వరికైన ఏదైన ఇచ్చు నపుడు, అనాదరముగ గాని, అశ్రద్ధగ గాని ఇవ్వకూడదు. అనాదరముతో చేసిన దానమునకు ఫలితముగ దాత నశించును." 30

మూ. తతః కైశ్చిదహోరాత్రైరుపయాతా మహీక్షితః, 31
బహూని రత్నాన్యాదాయ రాజ్ఞో దశరథస్య వై.

ప్ర. అ. తతః=పిమ్మట, మహీక్షితః=రాజులు, రాజ్ఞః దశరథస్య=దశరథమహారాజునకు, బహూని = అనేకమైన, రత్నాని = రత్నములను; ఆదాయ=తీసికొని, కైశ్చిత్=కొన్ని, అహోరాత్రైః=దినములలో, ఉపయాతాః=వచ్చిరి.

తా. అంతట కొన్ని దివసములలో, నానాదేశములకు చెందిన రాజులు, దశరథమహారాజునకు ఉపాయనముగా అనేకరత్నములను తీసికొని, అయోధ్యానగరము చేరిరి. 31

మూ. తతో వసిష్ఠః సుప్రీతో రాజానమిదమబ్రవీత్. 32
ఉపయాతా నరవ్యాఘ్ర రాజానస్తవ శాసనాత్,
మయాపి సత్కృతాః సర్వే యథార్హం రాజసత్తమాః. 33

ప్ర. అ. తతః=పిమ్మట, సుప్రీతః=మిక్కిలి సంతసించిన, వసిష్ఠః=వసిష్ఠుడు. రాజానమ్=దశరథుని గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను, నరవ్యాఘ్ర=ఓ నరశ్రేష్ఠుడా! తవ=నీ యొక్క, శాసనాత్=శాసనము వలన, రాజానః=రాజులు, ఉపయాతాః=వచ్చినారు. రాజసత్తమాః=రాజశ్రేష్ఠులైన, సర్వే = వారందరును, యథార్హమ్=యోగ్యతానుసారముగా, మయా = నాచేత, సత్కృతాః అపి=సత్కరింపబడినవారు కూడ.

తా. అపుడు వసిష్ఠుడు సంతోషించి దశరథునితో ఇట్లనెను :— "ఓ! నరశ్రేష్ఠుడా! నీ ఆజ్ఞ ప్రకారము రాజు లందరును వచ్చినారు. నేను వారి నందరిని తగు రీతిని సత్కరించినాను. 32, 33

మూ. యజ్ఞీయం చ కృతం రాజన్ పురుషైః సుసమాహితైః,
నిర్యాతు చ భవాన్యష్టుం యజ్ఞాయతనమన్తికాత్. 34

ప్ర. అ. రాజన్ = ఓ రాజా! సుసమాహితైః = మిక్కిలి సావధానచిత్తులైన, పురుషైః = పురుషులచేత, యజ్ఞీయమ్ = యజ్ఞమునకై కావలసిన కార్యమంతయు, కృతమ్ = చేయబడినది. భవాన్ = నీవు, యష్టుమ్=యాగము చేయుటకై, అన్తికాత్ = సమీపమున నున్న, యజ్ఞాయతనమ్ = యజ్ఞశాలను గూర్చి, నిర్యాతు = బయలువెడలెదవుగాక.

తా. రాజా! కర్మచారులు సావధానచిత్తులై యజ్ఞమునకై కావలసిన సాధన సామగ్రిని సమకూర్చినారు. ఇంక నీవు యజ్ఞము ప్రారంభించుటకై, సమీపముననే ఉన్న యాగశాలకు బయలుదేరుము. 34

మూ. సర్వకామైరుపహృతైరుపేతం వై సమన్తతః,
ద్రష్టుమర్హసి రాజేన్ద్ర మనసేవ వినిర్మితమ్. 35

ప్ర. అ. రాజేన్ద్ర=ఓ రాజశ్రేష్ఠుడా! ఉపహృతైః = చేర్చబడిన, సర్వకామైః = సమస్తభోగ్యవస్తువులతోడను, సమన్తతః = అంతటను, ఉపేతమ్ =

కూడినదియు, మనసా = మనస్సుచే, వినిర్మితమ్ ఇవ = నిర్మించబడినట్లున్న ఈ యాగశాలను, ద్రష్టుమ్=చూచుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ రాజేంద్రా ! సమకూర్చిన సమస్తభోగ్యవస్తువులతో అంతటను నిండి, మనస్సుచే నిర్మించబడినదా అన్నట్లు ఆశ్చర్యకర మగు ఈ యాగశాలను చూడుము." 35

మూ. తథా వసిష్ఠవచనా దృశ్యశృఙ్గస్య చోభయోః,
శుభే దివసనక్షత్రే నిర్యాతో జగతీపతిః. 36

ప్ర. అ. తథా=అట్లు, వసిష్ఠవచనాత్=వసిష్ఠుని వాక్యమువలనను, ఋశ్యశృఙ్గస్య చ=ఋశ్యశృంగుని వాక్యమువలనను, ఉభయోః = వారిద్దరియొక్క వచనమువలన, జగతీపతిః = భూభర్త, శుభే = శుభ మైన, దివసనక్షత్రే = దివసమునందు, నక్షత్రమునందు, నిర్యాతః = బయలువెడలెను.

తా. (ఋశ్యశృంగుడు కూడ వసిష్ఠుడు చెప్పినవిధముననే చెప్పెను). ఆ వసిష్ఠఋశ్యశృంగుల వచనము ననుసరించి, దశరథుడు శుభనక్షత్రముతో కూడిన శుభదివసమునందు, యాగశాలలో ప్రవేశించుటకై బయలుదేరెను. 36

వి. రామాయణకాలమువారికి వారములు తెలియవు. అందుచే శుభవారము చేర్చుట అసంగతము.

మూ. తతో వసిష్ఠప్రముఖాస్సర్వ ఏవ ద్విజోత్తమాః,
ఋశ్యశృఙ్గం పురస్కృత్య యజ్ఞకర్మారభం స్తదా. 37
యజ్ఞవాటగతాః సర్వే యథాశాస్త్రం యథావిధి.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రయోదశః సర్గః.

ప్ర అ. తతః=పిమ్మట, వసిష్ఠప్రముఖాః = వసిష్ఠుడు మొదలైన, సర్వే ఏవ=సమస్తమైన ఋత్విక్కులును, సర్వే=సమస్తమైన, ద్విజోత్తమాః=బ్రాహ్మణశ్రేష్ఠులును, యజ్ఞవాటగతాః = యజ్ఞవాటమును చేరినవారై, యథాశాస్త్రమ్ =

శాస్త్రానుసారముగాను, యథావిధి = విధిప్రకారముగాను, తదా = అప్పుడు, ఋశ్యశృఙ్గమ్ = ఋశ్యశృంగుని, పురస్కృత్య = ముందు ఉంచుకొని, యజ్ఞకర్మ = యజ్ఞకర్మను, ఆరభన్ = ప్రారంభించిరి.

తా. పిమ్మట వసిష్ఠుడు మొదలైన వారందరును యాగశాలలో ప్రవేశించి, ఋశ్యశృంగుని ముందు ఉంచుకొని, యథాశాస్త్రముగ, కల్పోక్తప్రకారమున యాగమును చేయ ప్రారంభించిరి. 37

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు

బాలకాండలో పదమూడవసర్గ సమాప్తము.

అథ చతుర్దశః సర్గః

మూ. అథ సంవత్సరే పూర్ణే తస్మిన్ ప్రాప్తే తురఙ్గమే,
సరయ్వాశ్చోత్తరే తీరే రాజ్ఞో యజ్ఞోఽభ్యవర్తత. 1

ప్ర. అ. అథ = అటు పిమ్మట, సంవత్సరే=సంవత్సరము, పూర్ణే సతి= నిండినదగుచుండగా, తస్మిన్=ఆ, తురఙ్గమే=అశ్వము, ప్రాప్తే సతి = వచ్చినదగుచుండగా, సరయ్వాః=సరయూనది యొక్క, ఉత్తరే తీరే=ఉత్తరపు టొడ్డునందు, రాజ్ఞః=రాజుయొక్క, యజ్ఞశ్చ=యాగము, అభ్యవర్తత=ప్రారంభమైనది.

తా. సంవత్సరము పూర్తియై అశ్వము తిరిగి వచ్చినది. అపుడు సరయూనది ఉత్తరతీరమునందు, దశరథుని యజ్ఞము ప్రారంభ మయ్యెను. 1

మూ. ఋశ్యశృఙ్గం పురస్కృత్య కర్మ చక్రుర్ద్విజర్షభాః,
అశ్వమేధే మహాయజ్ఞే రాజ్ఞోఽస్య సుమహాత్మనః. 2

ప్ర. అ. సుమహాత్మనః = మిక్కిలి పూజింపదగిన బుద్ధి గల, అస్య రాజ్ఞః=ఈ రాజుయొక్క, అశ్వమేధే మహాయజ్ఞే = అశ్వమేధ యాగమునందు, ద్విజర్షభాః=బ్రాహ్మణశ్రేష్ఠులు, ఋశ్యశృఙ్గమ్=ఋశ్యశృంగుని, పురస్కృత్య= ముందు ఉంచుకొని, కర్మ=కార్యమును, చక్రుః=చేసిరి.

తా. మహాత్ముడైన ఆ దశరథుని అశ్వమేధయాగమునందు, బ్రాహ్మణశ్రేష్ఠులు ఋశ్యశృంగుని ముందు ఉంచుకొని, కార్యములు చేసిరి. 2

మూ. కర్మ కుర్వన్తి విధివద్యాజకా వేదపారగాః,
యథావిధి యథాన్యాయం పరిక్రామన్తి శాస్త్రతః. 3

ప్ర. అ. వేదపారగాః = వేదముల పారమును చూచిన, యాజకాః = ఋత్విక్కులు, విధివత్=యథాశాస్త్రముగ, కర్మ=కార్యమును, కుర్వన్తి=చేసిరి, యథావిధి=వేదములలో ఉన్న విధివాక్యముల ననుసరించి, యథాన్యాయమ్= న్యాయమును అనుసరించి, శాస్త్రతః=శాస్త్రములో చెప్పిన విధమున, పరిక్రామన్తి= సంచరించిరి.

తా. వేదములలో మహాపండితు లైన ఋత్విక్కులు కర్మ లన్నియు యథా శాస్త్రముగ ఆచరించిరి. వారు వేదవిధుల ప్రకారము, న్యాయానుసారము నంచరించిరి. 3

మూ. ప్రవర్గ్యం శాస్త్రతః కృత్వా తథై వోపసదం ద్విజాః,
చక్రుశ్చ విధివత్సర్వమధికం కర్మ శాస్త్రతః. 4

ప్ర. అ. ద్విజాః=బ్రాహ్మణులు, ప్రవర్గ్యమ్=ప్రవర్గ్యమును, శాస్త్రతః= శాస్త్రానుసారముగా, కృత్వా=చేసి, తథైవ=మరియు, ఉపసదమ్=ఉపసదమును కూడ, విధివత్ = యథావిధిగా చేసి, అధికమ్ = ఇంకను ఇతర మైన, సర్వం కర్మ=కర్మ నంతను, శాస్త్రతః=శాస్త్రప్రకారముగా, చక్రుః=చేసిరి.

తా. బ్రాహ్మణులు అశ్వమేధాంగము లగు ప్రవర్గ్యమును, ఉపసదమును, తదితరకర్మలను శాస్త్రానుసారము నిర్వర్తించిరి. 4

మూ. అభిపూజ్య తతో హృష్టాః సర్వే చక్రుర్యథావిధి,
ప్రాతఃసవనపూర్వాణి కర్మాణి మునిపుఙ్గవాః. 5

ప్ర. అ. తతః=పిమ్మట, మునిపుఙ్గవాః=మునిశ్రేష్ఠులు, సర్వే=అందరును, హృష్టాః=సంతోషముకలవారై, అభిపూజ్య=ఆ యా దేవతలను పూజించి, ప్రాతః సవనపూర్వాణి = ప్రాతఃసవనము మొదలైన, కర్మాణి=కర్మలను, యథావిధి= యథాశాస్త్రముగా, చక్రుః=చేసిరి.

తా. ఆ మునిశ్రేష్ఠు లందరును సంతుష్టాంతరంగులై, ఆహూతు లైన దేవతలను పూజించి, ప్రాతఃసవనాదికర్మలను యథావిధిగ చేసిరి. 5

మూ. ఐన్ద్రశ్చ విధివద్దత్తో రాజా చాభిషుతోఽనఘః,
మాధ్యన్దినం చ సవనం ప్రావర్తత యథాక్రమమ్. 6

ప్ర. అ. ఐన్ద్రశ్చ = ఇంద్రదేవతను ఉద్దేశించిన హవిస్సు, విధివత్ = యథాశాస్త్రముగా, దత్తః=ఇవ్వబడినది, అనఘః=దోషరహితమైన, రాజా చ= సోమలత కూడ, అభిషుతః=నలగగొట్టి రసము తీయబడినది, మాధ్యన్దినమ్= మాధ్యందిన మైన, (మధ్యాహ్నము చేయదగిన) సవనమ్ = సవనము, యథా క్రమమ్=క్రమానుసారముగ, ప్రావర్తత=జరిగెను.

తా. ఇంద్రునకు హవిర్భాగములను సమర్పించి నిర్దిష్ట మైన సోమలతను నలగకొట్టి రసము తీసిరి. ఈ విధముగ మాధ్యందిన సవనము యథాశాస్త్రముగ చేయబడెను. 6

మూ. తృతీయసవనం చైవ రాజ్ఞోఽస్య సుమహాత్మనః,
చక్రుస్తే శాస్త్రతో దృష్ట్వా తథా బ్రాహ్మణపుఙ్గవాః. 7

ప్ర. అ. తథా=అట్లే, తే బ్రాహ్మణపుఙ్గవాః=ఆ బ్రాహ్మణశ్రేష్ఠులు, శాస్త్రతః=శాస్త్రమునుండి, దృష్ట్వా=చూచి, సుమహాత్మనః = చాల పూజ్య మైన బుద్ధిగల, అస్య రాజ్ఞః=ఈ దశరథమహారాజు యొక్క, తృతీయసవనం చైవ=తృతీయ సవనమును కూడ, చక్రుః=చేసిరి.

తా. ఆ బ్రాహ్మణశ్రేష్ఠులు, బుద్ధిశాలి యగు ఆ దశరథుని తృతీయసవనమును కూడ యథాశాస్త్రముగ పూర్తిచేసిరి. 7

మూ. న చాహుతమభూత్తత్ర స్ఖలితం వాపి కించన,
దృశ్యతే బ్రహ్మవత్సర్వం క్షేమయుక్తం హి చక్రిరే. 8

ప్ర. అ. తత్ర=ఆ యజ్ఞమునందు, అహుతమ్ = దోషములతో కూడిన హోమము, నాభూత్=జరుగలేదు. కించన=ఏదియు, స్ఖలితమ్=పొరబాటుకూడ, నాభూత్=జరుగలేదు. సర్వమ్=అంతయు, బ్రహ్మవత్=మంత్రయుక్తముగానే, దృశ్యతే=కనబడుచున్నది. క్షేమయుక్తమ్=క్షేమముతో కూడిన విధముననే, చక్రిరే హి=చేసిరి కదా.

తా. ఆ యజ్ఞములో హోమములను చేయుటలో కాని, మరి ఏ ఇతర కర్మలలో గాని, ఒక్క పొరబాటు కూడ జరుగలేదు. అంతయు మంత్రపూర్వకముగ జరిగెను. అన్నియు క్షేమకరములుగా ఉండునట్లు చేసిరి. 8

మూ. న తేష్వహస్సు శ్రాన్తో వా క్షుధితో వాపి దృశ్యతే,
నావిద్వాన్ బ్రాహ్మణస్తత్ర నాశతానుచరస్తథా. 9

ప్ర. అ. తేషు=ఆ, అహస్సు=దినములలో, శ్రాన్తః=అలసినవాడు, న దృశ్యతే=కనబడడు. క్షుధితో వాపి=లేదా ఆకలిగొన్నవాడు, న=కనబడడు,

తత్ర=అచట, అవిద్వాన్=విద్వాంసుడుకాని, బ్రాహ్మణః=బ్రాహ్మణుడు, న=కనబడడు. తథా=అట్లే, అశతానుచరః=నూర్గురు అనుచరులు లేనివాడు (అనగా కూడా నూర్గురు శిష్యులు లేని బ్రాహ్మణుడు), న=కనబడడు.

తా. ఆ దివసములలో అలసినవాడు గాని, ఆకలిగొన్నవాడు గాని, విద్యా విహీనుడైన బ్రాహ్మణుడు గాని, నూరుగురు శిష్యులు కూడ లేని బ్రాహ్మణుడు కాని, కనబడలేదు. 9

మూ. బ్రాహ్మణా భుఞ్జతే నిత్యం నాథవన్తశ్చ భుఞ్జతే,
తాపసా భుఞ్జతే చాపి శ్రమణా భుఞ్జతే తథా. 10

ప్ర. అ. నిత్యమ్=నిత్యము, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, భుఞ్జతే=భుజించుచుండిరి. నాథవన్తశ్చ=ప్రభువులు కలవారును, అనగా దాసులును, భుఞ్జతే=భుజించుచుండిరి. తాపసాశ్చాపి=మునులు కూడ, భుఞ్జతే=భుజించుచుండిరి. తథా=మరియు, శ్రమణాః=సంన్యాసులును, భుఞ్జతే=భుజించుచుండిరి.

తా. ఆ యాగము జరిగినన్నాళ్ళును, బ్రాహ్మణులు, దాసులు, మునులు, సంన్యాసులు అందరును తృప్తిగా భుజించుచుండిరి. 10

వి. శ్రమణులనగా— "చతుర్థమాశ్రమం ప్రాప్తాః శ్రమణా నామ తే స్మృతాః" అను స్మృతివాక్యము ననుసరించి సంన్యాసు లని అర్థము. అందుచే దీనికి బౌద్ధసంన్యాసు లని అర్థము చెప్పి, రామాయణము బౌద్ధమతావిర్భావానంతరము వ్రాయబడినది అని చెప్పుట అయుక్త మని కొందరి అభిప్రాయము.

మూ. వృద్ధాశ్చ వ్యాధితాశ్చైవ స్త్రియో బాలాస్తథైవ చ,
అనిశం భుఞ్జమానానాం న తృప్తిరుపలభ్యతే. 11

ప్ర. అ. వృద్ధాః=ముసలివారును, వ్యాధితాశ్చైవ=రోగపీడితులును, స్త్రియః=స్త్రీలును, తథైవ చ=మరియు, బాలాః=బాలులును, (భుఞ్జతే=తినుచుండిరి), అనిశమ్=ఎల్లప్పుడును, భుఞ్జమానానామ్=తినుచున్న వీరికి, తృప్తిః=తృప్తి, న ఉపలభ్యతే=పొందబడుటలేదు.

తా. వృద్ధులును, రోగములతో బాధపడుచున్నవారును, స్త్రీలును, బాలురును తినుచుండిరి. ఈ విధముగ నిరంతరము భుజించుచున్నను వారికి తృప్తి

కలుగుటలేదు. భోజనము అంత మధురముగా ఉన్నదని భావము. లేదా—ఇంత మంది ఈ విధముగ నిరంతరము భుజించుచున్నను వడ్డించువారికిని, దశరథునకును, తృప్తి కలుగుట లేదు అని భావము. 11

మూ. దీయతాం దీయతామన్నం వాసాంసి వివిధాని చ,
ఇతి సంచోదితా స్తత్ర తథా చక్రురనేకశః. 12

ప్ర. అ. అన్నమ్=అన్నము, దీయతాం, దీయతామ్ = ఇవ్వబడుగాక, ఇవ్వబడుగాక. వివిధాని=అనేకవిధము లైన, వాసాంసి చ=వస్త్రములును, ఇవ్వబడుగాక. ఇతి=ఈ విధముగా, తత్ర=ఆ యాగభూమియందు, సంచోదితాః=ప్రేరేపింపబడినవారై, అనేకశః=అనేకవిధములుగ, తథా=ఆ విధముగ, చక్రుః=చేసిరి.

తా. "అన్నము పెట్టండి పెట్టండి; అనేకవిధము లైన వస్త్రాలు కూడ పంచిపెట్టండి, పంచిపెట్టండి", అని దశరథమంత్ర్యాదులచే ప్రేరితులై, అచటివారు ఆ విధముగ చేసిరి. 12

మూ. అన్నకూటాశ్చ బహవో దృశ్యన్తే పర్వతోపమాః,
దివసే దివసే తత్ర సిద్ధస్య విధివత్తదా. 13

ప్ర. అ. తత్ర=అచట, తదా=అప్పుడు, విధివత్=తగురీతిని, సిద్ధస్య=సిద్ధ మైన, అన్నకూటాః=భోజ్యపదార్థముల రాసులు, బహవః=అనేకము, పర్వతోపమాః = పర్వతముల వలె, దివసే దివసే = ప్రతిదివసమునందు, దృశ్యన్తే=కనబడు చుండెను.

తా. అచట ప్రతిదినమునందు, శ్రద్ధగా వండిన భోజ్యపదార్థముల రాసులు అనేకములు పర్వతము వలె కనబడు చుండెను. 13

మూ. నానాదేశా దనుప్రాప్తాః పురుషాః స్త్రీగణా స్తథా,
అన్నపానైః సువిహితా స్తస్మిన్యజ్ఞే మహాత్మనః. 14

ప్ర. అ. మహాత్మనః=ఆ మహాత్మునియొక్క, తస్మిన్ యజ్ఞే=ఆ యజ్ఞమునందు, నానాదేశాత్=అనేకదేశములనుండి, అనుప్రాప్తాః=వచ్చిన, పురుషాః=

పురుషులును, తథా=మరియు, స్త్రీగణాః=స్త్రీసముదాయములును, అన్నపానైః=అన్నపానములచే, సువిహితాః=బాగుగా తృప్తిపొందింపబడిరి.

తా. దశరథుని యజ్ఞమునందు నానాదేశములనుండి వచ్చిన స్త్రీపురుషులు, అన్నపానములచే తృప్తి పొందింపబడిరి. 14

మూ. అన్నం హి విధివత్స్వాదు ప్రశంసన్తి ద్విజర్షభాః,
అహో తృప్తాః స్మ భద్రం తే ఇతి శుశ్రావ రాఘవః 15

ప్ర. అ. ద్విజర్షభాః=బ్రాహ్మణశ్రేష్ఠులు, విధివత్=వండవలసిన పద్ధతిలో వండిన, స్వాదు=మధుర మైన, అన్నమ్=అన్నమును, ప్రశంసన్తి=ప్రశంసించిరి, రాఘవః=దశరథుడు,—"అహో=ఆహా! తృప్తాః స్మః=సంతృప్తుల మైనాము; తే=నీకు, భద్రమ్=భద్ర మగుగాక," ఇతి=ఈ విధమగు మాటలను, శుశ్రావ=వినెను.

తా. యథావిధిగ వండిన, మధుర మైన అన్నమును భుజించిన బ్రాహ్మణశ్రేష్ఠులు, "ఆహా! తృప్తి చెందినాము. నీకు మంగళ మగుగాక" అని పలుకుచుండగా, దశరథుడు విని ఆనందించెను. 15

మూ. స్వలఙ్కృతాశ్చ పురుషా బ్రాహ్మణాన్ పర్యవేషయన్,
ఉపాసతే చ తానన్యే సుమృష్టమణికుణ్డలాః. 16

ప్ర. అ. స్వలఙ్కృతాః=బాగుగా అలంకరించుకొనిన, పురుషాః=పురుషులు, బ్రాహ్మణాన్=బ్రాహ్మణులకు, పర్యవేషయన్=వడ్డించిరి. సుమృష్టమణికుణ్డలాః=మంచి కాంతి గల మణులతో కూడిన మండలములు గల, అన్యే చ=మరి కొందరు, తాన్=వారిని, ఉపాసతే చ=సేవించిరి.

తా. చక్కగా అలంకరించుకొనిన పురుషులు బ్రాహ్మణులకు వడ్డించుచున్నప్పుడు, మంచి మణికుండలములు ధరించిన మరి కొందరు ఆ వడ్డించువారికి సాహాయ్యము చేసిరి. 16

మూ. కర్మాన్తరే తదా విప్రా హేతువాదాన్ బహూనపి,
ప్రాహుశ్చ వాగ్మినో ధీరాః పరస్పరజిగీషయా. 17

ప్ర. అ. తదా=అప్పుడు, వాగ్మినః=వాక్చాతుర్యము కల, ధీరాః=బుద్ధిశాలు లైన, విప్రాః=బ్రాహ్మణులు, తదా=అప్పుడు, కర్మాన్తరే=కర్మల మధ్య యందు, పరస్పరజిగీషయా=పరస్పరము జయించవలె నను కోరికతో, బహూన్=అనేక మైన, హేతువాదాన్=యుక్తివాదములను, ప్రాహుః చ=పలికిరి కూడ.

తా. కర్మకును కర్మకును మధ్య అవకాశము లభించినపుడు, వాక్చాతుర్యము కలవారును, బుద్ధిశాలులును అగు బ్రాహ్మణులు, ఒండొరులను జయించవలె నను అభిలాషతో అనేకశాస్త్రములకు సంబంధించిన వాగ్వాదములను చేసిరి. 17

మూ. దివసే దివసే తత్ర సంస్తరే కుశలా ద్విజాః,
సర్వకర్మాణి చక్రుస్తే యథాశాస్త్రం ప్రచోదితాః. 18

ప్ర. అ. సంస్తరే=యజ్ఞమునందు, కుశలాః=నేర్పరు లైన, ద్విజాః=బ్రాహ్మణులు, దివసే దివసే = ప్రతిదినమునందును, తత్ర = అచట, ప్రచోదితాః=వసిష్ఠాదులచే ప్రేరేపింపబడినవారై, స్వకర్మాణి=స్వకర్మలను, యథాశాస్త్రమ్=శాస్త్రానుసారముగ, చక్రుః=చేసిరి.

తా. అచట, యజ్ఞకర్మలలో నేర్పు గల బ్రాహ్మణులు, ప్రతిదినమునందును, సర్వకర్మలను, వసిష్ఠాదుల పర్యవేక్షణములో, యథాశాస్త్రముగ నిర్వర్తించిరి. 18

మూ. నాషడఙ్గవిదత్రాసీన్నావ్రతో నాబహుశ్రుతః,
సదస్యాస్తస్య వై రాజ్ఞో నావాదకుశలా ద్విజాః. 19

ప్ర. అ. అత్ర=ఈ యాగశాలలో, అషడఙ్గవిత్=ఆరు వేదాంగములు తెలియని వాడు, నాసీత్=లేకుండెను. అవ్రతః=వ్రతానుష్ఠానము చేయని వాడు, న = లేకుండెను. అబహుశ్రుతః = అధికశాస్త్రపరిచయము లేనివాడు, న = లేకుండెను. తస్య=ఆ, రాజ్ఞః=రాజుయొక్క, సదస్యాః=సదస్యులు, అవాదకుశలాః=శాస్త్రవాదములో కుశలులు కానివారు, న వై=లేకుండిరి.

తా. అచట షడంగవేత్త కానివాడు కాని, వ్రతానుష్ఠానము చేయనివాడు

గాని, బహుశాస్త్రపరిచయము లేనివాడు గాని లేకుండెను. దశరథుని యజ్ఞ సదస్సులో శాస్త్రవాదకౌశలము లేని బ్రాహ్మణు లెవ్వరును సదస్యులుగా లేకుండిరి. 19

మూ. ప్రాప్తే యూపోచ్ఛ్రయే తస్మిన్ షడ్బైల్వాః ఖాదిరాస్తథా,
తావన్తో బిల్వసహితాః పర్ణినశ్చ తథాపరే. 20

శ్లేష్మాతకమయస్త్వేకో దేవదారుమయస్తథా,
ద్వావేవ విహితౌ తత్ర బాహువ్యస్తపరిగ్రహౌ. 21

ప్ర. అ. తస్మిన్=ఆ యజ్ఞమునందు, యూపోచ్ఛ్రయే=యూపస్తంభములను ఎత్తవలసిన సమయము, ప్రాప్తే సతి=వచ్చిన దగుచుండగా, బైల్వాః=బిల్వదారువుతో చేసిన, షట్=ఆరు యూపస్తంభములును, తథా=మరియు, బిల్వ సహితాః=బిల్వస్తంభములకు దగ్గరగా ఉండు, తావన్తః=అంత సంఖ్యయే గల, ఖాదిరాః=చంద్రకఱ్ఱతో చేసిన స్తంభములును, తథా=మరియు, పర్ణినః చ=పలాశదండనిర్మితము లగు, అపరే=మరి కొన్ని స్తంభములును, ఏకః=ఒక, శ్లేష్మాతకమయః=శ్లేష్మాతకదారువుతో చేసిన స్తంభము, తథా=మరియు, దేవ దారుమయః=దేవదారువు కఱ్ఱతో చేసిన రెండు స్తంభములును, (శాస్త్రానుసారము దేవదారుస్తంభములు రెండు గాన ఏకవచన మున్నను ద్వివచనార్థము చెప్ప బడినది). నిలుపబడినవి. తత్ర=అచట, ద్వౌ=రెండు స్తంభములు, బాహువ్యస్తపరిగ్రహౌవేవ=చాపిన రెండు బాహువులచే స్పృశింపదగినవిగా, విహితౌ=నిర్మింపబడినవి.

తా. ఆ యజ్ఞములో యూపస్తంభములను నిలుపవలసిన సమయము వచ్చినది. ఆరు మారేడుకఱ్ఱతో చేసిన యూపములు, ఆరు చంద్రకఱ్ఱతో చేసిన యూపములును, మోదుగ కఱ్ఱతో చేసిన యూపములు ఆరును, శ్లేష్మాతకవృక్షము కఱ్ఱతో చేసిన ఒక యూపము, దేవదారుచెట్టు కఱ్ఱతో చేసిన యూపములు రెండును నిలుపబడినవి. ఒక యూపమునకును యూపమునకును మధ్య బారెడు దూరము ఉండు నట్లు నిలుపబడినవి. 20, 21

మూ. కారితాః సర్వ ఏవైతే శాస్త్రజ్ఞైర్యజ్ఞకోవిదైః,
శోభార్థం తస్య యజ్ఞస్య కాఞ్చనాలఙ్కృతా భవన్. 22

ప్ర. అ. శాస్త్రజ్ఞైః=శాస్త్రము నెరిగిన, యజ్ఞకోవిదైః=యజ్ఞమును గూర్చి బాగుగా తెలిసిన వారిచేత, కారితాః=చేయించబడిన, తే సర్వే ఏవ=ఆ యూప స్తంభము లన్నియు, తస్య యజ్ఞస్య=ఆ యజ్ఞముయొక్క, శోభార్థమ్=శోభ కొరకు, కాఞ్చనాలఙ్కృతాః=బంగారముచే అలంకరింపబడినవై, అభవన్=అయినవి.

తా. యజ్ఞప్రవీణులు యథాశాస్త్రముగ చేయించిన ఆ యూపస్తంభములను, యజ్ఞములో శోభగా ఉండుటకె బంగారముతో అలంకరించిరి. 22

మూ. ఏకవింశతియూపాస్తే ఏకవింశత్యరత్నయః,
వాసోభిరేకవింశద్భిరేకైకం సమలఙ్కృతాః. 23

ప్ర. అ. ఏకవింశత్యరత్నయః=ఇరువదియొక్క అరత్నుల ఎత్తు గల, తే=ఆ, ఏకవింశతియూపాః=ఇరువదియొక్క యూపములు, ఏకవింశద్భిః=ఇరువదియొక్క, వాసోభిః=వస్త్రములచే, ఏకైకమ్=ఒక యూపమునకు ఒక వస్త్రము చొప్పున, సమలఙ్కృతాః=అలంకరింపబడినవి.

తా. ఇరువదియొక్క అరత్నుల ఎత్తు ఉన్న ఆ ఇరువదియొక్క యూప స్తంభములను ఇరువదియొక్క వస్త్రములు చుట్టి అలంకరించిరి. 23

వి. 'అరత్ని' అనగా మోచేయినుండి చిటికెన ప్రేలి చివరి వరకును ఉన్న హస్తభాగము. మూర.

మూ. విన్యస్తా విధివత్సర్వే శిల్పిభిః సుకృతా దృఢాః,
అష్టాశ్రయః సర్వ ఏవ శ్లక్ష్ణరూపసమన్వితాః. 24

ప్ర. అ. సర్వే=అవి అన్నియు, శిల్పిభిః=శిల్పులచేత, సుకృతాః=బాగుగా చేయబడినవి, దృఢాః=దృఢముగా నున్నవి, అష్టాశ్రయః=ఎనిమిది అంచులు కలవి, శ్లక్ష్ణరూపసమన్వితాః=నున్నని రూపము కలవి. సర్వే ఏవ=ఆ స్తంభము లన్నియు, విధివత్=యథాశాస్త్రముగా, విన్యస్తాః=నిలుపబడినవి.

తా. ఆ స్తంభములు నున్నగా, దృఢముగా, ఎనిమిది అంచులు ఉండు నట్లుగా శిల్పులచే చక్కగ నిర్మింపబడినవి. వాటి నన్నింటిని యథాశాస్త్రముగ నిలిపిరి. 24

మూ. ఆచ్ఛాదితాస్తే వాసోభిః పుష్పైర్గన్ధైశ్చ భూషితాః,
సప్తర్షయో దీప్తిమన్తో విరాజన్తే యథా దివి. 25

ప్ర. అ. వాసోభిః=వస్త్రములచేత, ఆచ్ఛాదితాః=అచ్ఛాదింపబడినవియు, పుష్పైః=పుష్పములచేతను, గన్ధైశ్చ=గంధములచేతను, భూషితాః=అలంకరింపబడినవియు అగు, తే=ఆ యూపములు, దీప్తిమన్తః=కాంతిగలవై, దివి=ఆకాశమునందు, సప్తర్షయః యథా=సప్తర్షుల వలె, విరాజన్తే=ప్రకాశించుచున్నవి.

తా. వస్త్రములు కప్పి, పుష్పసుగంధాదులతో అలంకరించిన ఆ యూపస్తంభములు, ఆకాశమునందు సప్తర్షుల వలె, దీప్తిమంతములై ప్రకాశించినవి. 25

మూ. ఇష్టకాశ్చ యథాన్యాయం కారితాశ్చ ప్రమాణతః,
చితోఽగ్నిర్బ్రాహ్మణైస్తత్ర కుశలైః శుల్బకర్మణి. 26

ప్ర. అ. తత్ర=అచట, యథాన్యాయమ్=శాస్త్రానుసారముగా, ప్రమాణతః=కావలసిన కొలత ప్రకారము, ఇష్టకాః=ఇటికలు, కారితాః=చేయించబడినవి. తత్ర=అచట, శుల్బకర్మణి=ఒంటిపేట త్రాడులో కొలతలు వేయుట అను పనియందు, కుశలైః=నేర్పరులైన, బ్రాహ్మణైః=బ్రాహ్మణులచేత, అగ్నిః=అగ్నివేదిక, చితః=ఇటుకలను పేర్చి కట్టబడినది.

తా. శాస్త్రములో చెప్పిన కొలత ప్రకారము నిర్మించిన ఇటికలు పేర్చి, శుల్బకర్మయందు నిపుణులైన బ్రాహ్మణులు అగ్నివేదికలు కట్టిరి. 26

వి. ఒంటిపేట త్రాడుకు శుల్బ మని పేరు. వేరువేరు యజ్ఞములలో వేరు వేరు కొలతలతో, వేరు వేరు ఆకారములలో వేదికలు కట్టవలెను. అందుచే ఈ శుల్బము సహాయముతో జ్యామితి (జ్యా=భూమి, మితి=కొలత) చేసి వేదికలు కట్టెడివారు.

మూ. సచిత్యో రాజసింహస్య సంచితః కుశలైర్ద్విజైః,
గరుడో రుక్మపక్షో వై త్రిగుణోఽష్టాదశాత్మకః. 27

ప్ర. అ. కుశలైః=నేర్పరులైన, ద్విజైః=బ్రాహ్మణులచేత, రుక్మపక్షః=బంగారు రెక్కలు కలదియు, త్రిగుణః = మూడు రెట్లు కలదియు, అష్టా

దశాత్మకః=పదునెనిమిది అను సంఖ్యలో ఉన్నదియు అగు, గరుడః=గరుడాకార మైన వేది, రాజసింహస్య=రాజశ్రేష్ఠు డైన దశరథునియొక్క, నచిత్యః=నిత్యాగ్నితో కూడినది, సంచితః=పేర్చబడినది.

తా. దశరథుని చిత్యాగ్నిని ఉంచుటకు వీలుగా, నేర్పు గల బ్రాహ్మణులు గరుడాకార మైన వేదికను నిర్మించిరి. దీనిని ఇతరవేదికలకంటె మూడు రెట్లు ఇటికలు ఎక్కువగా ఉంచి కట్టుటచే మొత్తము పద్దెనిమిది వరుస లైనవి.

వి. అశ్వమేధములో అగ్నిని ఉంచవలసిన వేదికచుట్టూ గరుడాకారములో నిర్మింతురు. ఆ గరుత్మంతుడు తూర్పుదిశకు అభిముఖముగా ఉండి, రెక్కలను, పుచ్ఛమును విస్తృతము చేసి క్రిందికి తలవంచి చూచుచున్నట్లు ఉండును. ఇటికలను పేర్చుటకు 'చయనము' అని పేరు. వాజసనేయశాఖ (శుక్లయజుర్వేద శాఖ)కు చెందినవారు చేయు ఇతరయజ్ఞములలో ఈ వేదిక కట్టు నపుడు ఆరు వరసలు (ప్రస్తారములు) వేయుదురు. అశ్వమేధములో దానికి మూడు రెట్లు $(6\ 3 = 18)$ వేయుదురు. అందుచే "అష్టాదశాత్మకః" అని చెప్పబడినది. కృష్ణయజుశ్శాఖకు చెందినవారు ఇతరయజ్ఞములలో ఐదు ప్రస్తారములను, అశ్వమేధములో $(5\times3 = 15)$ పదిహేను ప్రస్తారములను వేయుదురు. దశరథుడు శుక్లయజుశ్శాఖకు చెందినవా డని దీనిని పట్టి తెలియుచున్నది. 'చిత్యః' అనగా ఈ విధముగా చయనము చేసిన వేదికపై నెలకొల్పబడిన అగ్ని అని యర్థము. 27

మూ. నియుకాః స్తత పశవ స్తతదుద్దిశ్య దైవతమ్,

ఉరగాః పక్షిణశ్చైవ యథాశాస్త్రం ప్రచోదితాః. 28

ప్ర. అ. తత్ర=అచట, యథాశాస్త్రమ్=శాస్త్రానుసారముగా, ప్రచోదితాః=విహితము లైన, పశవః=పశువులును, ఉరగాః=సర్పములును, పక్షిణశ్చైవ=పక్షులును, తత్తత్=ఆ యా, దైవతమ్ ఉద్దిశ్య=దేవతను ఉద్దేశించి, నియుక్తాః=కట్టబడినవి.

తా. శాస్త్రములో చెప్పిన విధానము ననుసరించి, ఆ యా దేవతలకొరకై, పశువులును, సర్పములును కట్టబడినవి. 28

మూ. శామిత్రే తు హయస్తత్ర తథా జలచరాశ్చ యే,
ఋత్విగ్భిః సర్వమేవైతన్నియుక్తం శాస్త్రతస్తదా 29

ప్ర. అ. శామిత్రే తు=పశువిశసనకర్మయందు (పశువులను చంపి చేయు కర్మయందు) మాత్రము, తత్ర=అచట, హయః=అశ్వము, తథా=మరియు, యే=ఏ, జలచరాః=కూర్మాదిజలచరము లున్నవో అవియు, ఏతత్సర్వమ్=ఇది యంతయు (ఇవి అన్నియు), ఋత్విగ్భిః=ఋత్విక్కులచేత, శాస్త్రతః=శాస్త్రానుసారముగా, నియుక్తమ్=కట్టబడెను.

తా. ఇంతలో పశువిశసనము చేయు సమయము వచ్చి నపుడు, అశ్వమును, కొన్ని జలచరములను, ఋత్విక్కులు శాస్త్రానుసారముగా యూపములకు బంధించిరి. 29

వి. అశ్వమేధమున అనేకము లైన అరణ్యమృగములను, గ్రామ్యమృగములను బలియిచ్చెదరు. వాటిలో అరణ్యమృగాదులను కొన్నింటిని అగ్నికి ప్రదక్షిణము చేయించి విడిచివేయుదురు. గ్రామ్యమృగములను మాత్రమే చంపుదురు.

మూ. పశూనాం త్రిశతం తత్ర యూపేషు నియతం తదా,
అశ్వరత్నోత్తమం తస్య రాజ్ఞో దశరథస్య చ. 30

ప్ర. అ. తదా=అప్పుడు, తత్ర=అచట, పశూనామ్=పశువులయొక్క, త్రిశతమ్=మూడుశతములును, తస్య=ఆ, దశరథస్య రాజ్ఞః=దశరథమహారాజుయొక్క, అశ్వరత్నోత్తమమ్ = రత్నముల వంటి అశ్వములలో శ్రేష్ఠ మైన అశ్వము, యూపేషు=యూపస్తంభములయందు, నియతమ్=కట్టబడెను.

తా. మూడువందల పశువులను, దశరథుని ఉత్తమాశ్వమును యూపస్తంభములకు కట్టిరి. 30

మూ. కౌసల్యా తం హయం తత్ర పరిచర్య సమన్తతః,
కృపాణైర్విశశాసైనం త్రిభిః పరమయా ముదా. 31

ప్ర. అ. తత్ర=అచట, కౌసల్యా=కౌసల్య, తమ్=ఆ, హయమ్=అశ్వమును, సమన్తతః=అంతటను, పరిచర్య=ప్రదక్షిణము చేసి, పరమయా=గొప్ప

ద్దైన, ముదా=సంతోషముతో, త్రిభిః=మూడు, కృపాణైః=కత్తులచేత, ఏనమ్=దీనిని, విశశాస=చంపెను.

తా. కౌసల్య ఆ అశ్వమునకు ప్రదక్షిణము చేసి, దానిని మూడు కత్తులతో చంపెను.

వి. "యజమానుని భార్యలు బంగారు సూదులతో అశ్వమును గ్రుచ్చవలెను" అని శాస్త్ర ముండుటచే కౌసల్యయే కాక సుమిత్రా కైకేయిలు కూడ బంగారు సూదులతో (కృపాణైః) అంతకు పూర్వమే చంపబడిన అశ్వమును గ్రుచ్చిరి, అని గోవిందరాజులు. 31

మూ. పతత్రిణా తదా సార్ధం సుస్థితేన చ చేతసా,
అవసద్రజనీమేకాం కౌసల్యా ధర్మకామ్యయా. 32

ప్ర. అ. తదా=అప్పుడు, కౌసల్యా = కౌసల్య, సుస్థితేన = స్థిర మైన, చేతసా=చిత్తముతో, ధర్మకామ్యయా=ధర్మాచరణ శ్రద్ధతో, పతత్రిణా సార్ధమ్=గుఱ్ఱముతో కూడ, ఏకామ్=ఒక, రజనీమ్=రాత్రి, అవసత్=నివసించెను.

తా. ధర్మశ్రద్ధావతి యగు కౌసల్య స్థిర మైన చిత్తముతో, ఒక రాత్రి ఆ అశ్వసమీపమున శాస్త్రోక్తరీతిని నివసించెను. 32

మూ. హోతాధ్వర్యుస్తథోద్గాతా హస్తేన సమయోజయన్,
మహిష్యా పరివృత్త్యా చ వావాతాం చ తథాపరామ్. 33

ప్ర. అ. హోతా=హోతయు, అధ్వర్యుః=అధ్వర్యుడు, తథా=మరియు, ఉద్గాతా= ఉద్గాతయు, మహిష్యా=పట్టమహిషితోను, పరివృత్త్యా చ=పరివృత్తితోను, వావాతామ్ = వావాత అనెడు, అపరామ్ = మరియొకతెను, హస్తేన=హస్తముతో, సమయోజయన్=కూర్చిరి, అనగా గ్రహించిరి.

తా. హోత, అధ్వర్యువు, ఉద్గాత అను ఋత్విక్కులు, రాజమహిషిని, పరివృత్తిని, వావాతను, గ్రహించిరి.

వి. రాజుతోపాటు రాజ్యాభిషేకమును పొందిన భార్య మహిషి. ఉపేక్షిత భార్య పరివృత్తి, భోగినీస్త్రీ (ఉంపుడుకత్తె) వావాత. రాజుకు పాత్ర అందించు

నది పాలాకలి. "కృతాభిషేకా మహిషీ పరివృత్తిరుపేక్షితా, వావాతా భోగినీ పాత్రప్రదా పాలాకలీ మతా" (వైజయంతి). అశ్వమేధములో యజమానుడు ఈ నలుగురు స్త్రీలను నలుగురు ఋత్విక్కులకును దక్షిణగా ఇవ్వవలె నట. వారు వాళ్లను పరిగ్రహించి, వారికి బదులుగా మరొక వస్తువు నేదైన తీసికొని, వారిని తిరిగి యజమానునకు ఇచ్చివేయుదురు. ఈ శ్లోకములో బ్రహ్మ అనే ఋత్విక్కునూ, పాలాకలిని చెప్పకపోయినను వారిని గూడ చెప్పి నట్లు గ్రహించవలె నని గోవిందరాజులు వ్రాసిరి. 33

మూ. పతత్రిణస్తస్య వపాముద్ధృత్య నియతేన్ద్రియః,
ఋత్విక్పరమసంపన్నః శ్రపయామాస శాస్త్రతః. 34

ప్ర. అ. నియతేన్ద్రియః=నిగ్రహింపబడిన ఇంద్రియములు కలవాడును, పరమసంపన్నః=మిక్కిలి శాస్త్రజ్ఞానసంపన్నుడును అగు, ఋత్విక్=ఋత్విక్కు, తస్య=ఆ, పతత్రిణః=అశ్వముయొక్క, వపామ్=వపను, ఉద్ధృత్య=తీసి, శాస్త్రతః=శాస్త్రానుసారముగా, శ్రపయామాస=పక్వము చేసెను.

తా. ఇంద్రియనిగ్రహవంతుడును, ఉత్తమజ్ఞానసంపన్నుడును అగు ఋత్విక్కు, ఆ అశ్వముయొక్క వపను తీసి, యథాశాస్త్రముగ పక్వము చేసెను. 34

మూ. ధూమగన్ధం వపాయాస్తు జిఘ్రతి స్మ నరాధిపః,
యథాకాలం యథాన్యాయం నిర్ణుదన్ పాపమాత్మనః. 35

ప్ర. అ. నరాధిపః=రాజు, యథాకాలమ్=కాలానుసారముగా, యథాన్యాయమ్=శాస్త్రానుసారముగా, ఆత్మనః=తనయొక్క, పాపమ్=పాపమును, నిర్ణుదన్=తొలగించుకొనుచు, వపాయాః=వపయొక్క, ధూమగన్ధమ్=ధూమము యొక్క గంధమును, జిఘ్రతి స్మ=వాసన చూచెను.

తా. దశరథుడు, తగిన సమయమున, శాస్త్రానుసారముగ, తన పాపమును తొలగించుకొనుటకై వపాధూమగంధమును వాసనచూచెను. 35

మూ. హయస్య యాని చాఙ్గాని తాని సర్వాణి బ్రాహ్మణాః,
అగ్నౌ ప్రాస్యంతి విధివత్సమన్త్రాః షోడశర్త్విజః. 36

ప్ర. అ. హయస్య=అశ్వముయొక్క, యాని=ఏ, అఙ్గాని=వివిధము లైన అవయవములు గలవో, తాని సర్వాణి=వాటిని అన్నింటిని, సమన్త్రైః= మంత్రములతో కూడిన, ఋత్విజః=ఋత్విక్కు లైన, షోడశ=పదహారుగురు, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, అగ్నౌ=అగ్నియందు, ప్రాస్యన్తి=హోమము చేసిరి.

తా. పదహారుగురు ఋత్విక్కులు, అశ్వముయొక్క వివిధాంగములను, సమంత్రకముగ అగ్నిలో హోమము చేసిరి. 36

మూ. ప్లక్షశాఖాసు యజ్ఞానామన్యేషాం క్రియతే హవిః,
అశ్వమేధస్య యజ్ఞస్య వైతసో భాగ ఇష్యతే. 37

ప్ర. అ. అన్యేషామ్=ఇతరములైన, యజ్ఞానామ్= యజ్ఞములయొక్క, హవిః=హవిస్సు, ప్లక్షశాఖాసు=జువ్వికొమ్మలయందు, క్రియతే=ఉంచబడును. అశ్వమేధస్య యజ్ఞస్య=అశ్వమేధ యజ్ఞముయొక్క, భాగః=హవిర్భాగము, వైతసః=ప్రబ్బలితీగయందు సంస్కరింపబడునదిగ, ఇష్యతే=విధింపబడుచున్నది.

తా. ఇతరయజ్ఞములలో హవిస్సును జువ్వికొమ్మలపై ఉంచి సంస్కరింప వలెను. అశ్వమేధమునందు మాత్రము ప్రబ్బలితీగపై ఉంచి సంస్కరించ వలెను. 37

మూ. త్ర్యహోఽశ్వమేధః సంఖ్యాతః కల్పసూత్రేణ బ్రాహ్మణైః,
చతుష్టోమమహ స్తస్య ప్రథమం పరికల్పితమ్. 38

ప్ర. అ. బ్రాహ్మణైః=బ్రాహ్మణులచేత, కల్పసూత్రేణ=కల్పసూత్రము ప్రకారము, అశ్వమేధః=అశ్వమేధము, త్ర్యహః=మూడురోజుల పాటు చేయ వలసినదిగా, సంఖ్యాతః=చెప్పబడినది. తస్య=దానియొక్క, ప్రథమమ్= మొదటిదైన, అహః=దివసము, చతుష్టోమః=చతుష్టోమ మని, పరికల్పితమ్= ఏర్పరుపబడినది.

తా. కల్పసూత్రానుసారముగా అశ్వమేధము మూడు దినములలో చేయ వలసిన యజ్ఞము, మొదటి దివసమునకు చతుష్టోమ మని పేరు. 38

మూ. ఉక్థ్యం ద్వితీయం సంఖ్యాతమతిరాత్రం తథోత్తరమ్,
కారితా స్తత్ర బహవో విహితాః శాస్త్రదర్శనాత్. 39

ప్ర. అ. ద్వితీయమ్=రెండవది, ఉక్థ్యమ్=ఉక్థ్యమనియు, తథా= మరియు, ఉత్తరమ్=తరువాతిది, అతిరాత్రమ్=అతిరాత్ర మనియు, సంఖ్యాతమ్=చెప్పబడినది. తత్ర=ఆ అశ్వమేధమునందు, శాస్త్రదర్శనాత్=శాస్త్రము యొక్క దర్శనమువలన, విహితాః=విధింపబడిన, బహవః=అనేకక్రతువులు, కారితాః=చేయింపబడినవి.

తా. రెండవ దివసమునకు ఉక్థ్య మనియు, మూడవదానికి అతిరాత్ర మనియు పేర్లు. శాస్త్రానుసారముగా విహితము లగు అనేకము లైన ఇతర క్రతువులను కూడ దశరథుడు ఆ సమయమున చేయించెను. 39

మూ. జ్యోతిష్టోమాయుషీ చైవమతిరాత్రౌ వినిర్మితౌ,
అభిజిద్విశ్వజిచ్చైవమప్తోర్యామో మహాక్రతుః. 40

ప్ర. అ. జ్యోతిష్టోమాయుషీ = జ్యోతిష్టోమాయుర్యాగములు, ఏవమ్ = మరియు, అతిరాత్రౌ=అతిరాత్రయాగములును, నిర్మితౌ=వినిర్మింపబడినవి. అభిజిత్=అభిజిద్యాగము, విశ్వజిత్=విశ్వజిద్యాగము, ఏవమ్=మరియు, అప్తోర్యామః=అప్తోర్యామ మను పేరు గల, మహాక్రతుః=మహాక్రతువు, చేయబడినవి.

తా. జ్యోతిష్టోమ ఆయుర్యాగములు, రెండు అతిరాత్రములు, అభిజిద్యాగ విశ్వజిద్యాగములు, అప్తోర్యామ మను మహాక్రతువు చేయబడినవి. 40

మూ. ప్రాచీం హోత్రే దదౌ రాజా దిశం స్వకులవర్ధనః,
అధ్వర్యవే ప్రతీచీం తు బ్రహ్మణే దక్షిణాం దిశమ్. 41

ఉద్గాత్రే చ తథోదీచీం దక్షిణైషా వినిర్మితా,
అశ్వమేధే మహాయజ్ఞే స్వయంభూవిహితే పురా. 42

ప్ర. అ. స్వకులవర్ధనః = తన వంశమును వృద్ధి పొందించు, రాజా = దశరథమహారాజు, హోత్రే = హోతకు, ప్రాచీం దిశమ్ = తూర్పు దిక్కును, దదౌ = ఇచ్చెను. అధ్వర్యవే = అధ్వర్యునకు, ప్రతీచీమ్ = పశ్చిమదిక్కును, బ్రహ్మణే = బ్రహ్మకు, దక్షిణాం దిశమ్=దక్షిణదిక్కును, తథా = మరియు, ఉద్గాత్రే = ఉద్గాతకు, ఉదీచీమ్ = ఉత్తరదిక్కును, ఇచ్చెను. పురా = పూర్వము, స్వయంభూవిహితే = బ్రహ్మచేత విధింపబడిన, అశ్వమేధే మహాయజ్ఞే=అశ్వమేధ యజ్ఞమునందు, ఏషా = ఈ, దక్షిణా=దక్షిణ, వినిర్మితా = నిర్మింపబడినది.

తా. తన వంశమునకు అభివృద్ధి చేకూర్చు దశరథమహారాజు తూర్పు దిక్కునందున్న దేశమును హోతకును, పశ్చిమదిక్కునందున్న దేశమును అధ్వర్యునకును, దక్షిణదిక్కునందున్న దేశమును బ్రహ్మకును, ఉత్తరదిక్కునం దున్న దేశమును ఉద్గాతకును ఇచ్చివేసెను. పూర్వము బ్రహ్మ విధించిన అశ్వమేధ యాగములో ఈ విధముగ దక్షిణ ఈయవలె నని నిర్ణయింపబడినది. 41, 42

మూ. క్రతుం సమాప్య తు తదా న్యాయతః పురుషర్షభః,
ఋత్విగ్భ్యో హి దదౌ రాజా తాం ధరాం క్రతువర్ధనః. 43

ప్ర. అ. పురుషర్షభః = పురుషశ్రేష్ఠు డైన, రాజా = రాజు, క్రతువర్ధనః = క్రతువును వృద్ధి పొందించుచు, క్రతుమ్ = క్రతువును, సమాప్య = పూర్తి చేసి, తదా = అప్పుడు, న్యాయతః = శాస్త్రానుసారముగా, తాం ధరామ్ = ఆ భూమిని, ఋత్విగ్భ్యః = ఋత్విక్కులకు, దదౌ = ఇచ్చెను.

తా. పురుషశ్రేష్ఠు డైన దశరథుడు ఆ క్రతువును పూర్తిచేసి, దాని ఫలము పరిపూర్ణముగ లభించుటకై, ఈ భూమి నంతను ఋత్విక్కులకు దానము చేసెను. 43

మూ. ఋత్విజస్త్వబ్రువన్ సర్వే రాజానం గతకల్మషమ్,
భవానేవ మహీం కృత్స్నామేకో రక్షితుమర్హతి. 44

ప్ర. అ. సర్వే = సమస్త మైన, ఋత్విజస్తు = ఋత్విక్కు లైతే, గతకల్మషమ్ = పాపరహితు డైన, రాజానమ్ = రాజునుగూర్చి, అబ్రువన్ = పలికిరి. భవాన్ = నీవు, ఏకః ఏవ = ఒక్కడవే, కృత్స్నామ్ = సమస్త మైన, మహీమ్ = భూమిని, రక్షితుమ్ = రక్షించుటకు, అర్హసి = తగియున్నావు.

తా. కాని, ఆ ఋత్విక్కు లందరును, పాపరహితు డైన ఆ దశరథునితో ఇట్లనిరి :— "ఈ భూమి నంతను రక్షింప గలవాడవు నీవొక్కడవే". 44

మూ. న భూమ్యా కార్యమస్మాకం న హి శక్తాః స్మ పాలనే,
రతాః స్వాధ్యాయకరణే వయం నిత్యం హి భూమిప. 45
నిష్క్రయం కించిదేవేహ ప్రయచ్ఛతు భవానితి.

ప్ర. అ. భూమిప=ఓరాజా!, భూమ్యా=భూమిచేత, అస్మాకమ్=మాకు, కార్యమ్=పని, న=లేదు. పాలనే=పాలించుటయందు, శక్తాః=సమర్థులము, న హి=కాము. వయమ్=మేము, నిత్యమ్=ఎల్లప్పుడును, స్వాధ్యాయకరణే=స్వాధ్యాయాధ్యయనమునందు, రతాః హి=ఆసక్తులము కదా! భవాన్ = నీవు, ఇహ=ఈ భూమివిషయమున, కించిత్=ఏదైన, నిష్క్రియమ్=మూల్యమును, ప్రయచ్ఛతు=ఇచ్చెదవుగాక.

తా. "భూమిని పరిపాలించు ఓ దశరథమహారాజా! ఎల్లప్పుడు స్వాధ్యాయాధ్యయనము చేసికొనుచుండు మాకు భూమితో పని లేదు. ఈ భూమికి బదులుగ, స్వల్పముగ, ఏదైన ధనము నిమ్ము."

వి. నిష్క్రియమ్=ఏదైన ఒకదానికి బదులు ఇచ్చు ధనము మొ. 45

మూ. మణిరత్నం సువర్ణం వా గావో యద్వా సముద్యతమ్, 46
తత్ప్రయచ్ఛ నరశ్రేష్ఠ ధరణ్యా న ప్రయోజనమ్.

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడా! మణిరత్నమ్=శ్రేష్ఠ మైన మాణిక్యము గాని, సువర్ణం వా=బంగారము గాని, గావః=గోవులు గాని, యద్వా=ఏది, సముద్యతమ్=సిద్ధముగా నున్నదో, తత్=అది గాని, ప్రయచ్ఛ=ఇమ్ము. ధరణ్యా=భూమితో, ప్రయోజనమ్=ప్రయోజనము, న=లేదు.

తా. "శ్రేష్ఠ మైన మాణిక్యము గాని, బంగారము గాని, గోవులు గాని, ఏ వస్తువు లభ్యమో అది గాని ఇమ్ము. మాకు భూమితో ప్రయోజనము లేదు." 46

మూ. ఏవముక్తో నరపతిర్బ్రాహ్మణై ర్వేదపారగైః, 47
గవాం శతసహస్రాణి దశ తేభ్యో దదౌ నృపః,
శతకోటీః సువర్ణస్య రజతస్య చతుర్గుణమ్. 48

ప్ర. అ. నరపతిః=నరులకు ప్రభు వైన, నృపః=రాజు, వేదపారగైః=వేదముల పారమును చూచిన, బ్రాహ్మణైః = బ్రాహ్మణులచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః = పలకబడిన వాడై, తేభ్యః = వారికి, గవామ్ = గోవుల యొక్క, దశ శతసహస్రాణి=పది లక్షలను, సువర్ణస్య = బంగారముయొక్క,

శతకోటిః=నూరు కోట్లను, రజతస్య = వెండియొక్క, చతుర్గుణమ్ = నాలుగు రెట్లను, దదౌ = ఇచ్చెను.

తా. వేదములలో నిష్ణాతులైన ఆ బ్రాహ్మణులు ఇట్లు చెప్పగా, దశరథుడు వారికి పది లక్షల గోవులను, వంద కోట్ల బంగారునాణెములను, నాలుగు వందల కోట్ల వెండినాణెములను ఇచ్చెను. 48

మూ. ఋత్విజశ్చ తతః సర్వే ప్రదదుః సహితా వసు,
ఋశ్యశృఙ్గాయ మునయే వసిష్ఠాయ చ ధీమతే. 49

ప్ర. అ. తతః = అటు పిమ్మట, ఋత్విజః = ఋత్విక్కులు, సర్వే = అందరును, సహితాః = కలిసినవారై, వసు = ఆ ధనమును, ఋశ్యశృఙ్గాయ మునయే=ఋశ్యశృంగమునికిని, ధీమతే = బుద్ధిమంతుడైన, వసిష్ఠాయ చ = వసిష్ఠునకును, ప్రదదుః = ఇచ్చిరి.

తా. ఆ ఋత్విక్కు లందరును కలిసి ఆ ధనమును ఋశ్యశృంగునకును, ధీమంతుడైన వసిష్ఠునకును ఇచ్చిరి. 49

మూ. తతస్తే న్యాయతః కృత్వా ప్రవిభాగం ద్విజోత్తమాః,
సుప్రీతమనసః సర్వే ప్రత్యూచుర్ముదితా భృశమ్. 50

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుప్రీతమనసః = బాగుగా సంతోషించిన మనస్సులు గల, తే = ఆ, ద్విజోత్తమాః = బ్రాహ్మణోత్తములు, సర్వే = అందరును, న్యాయతః = న్యాయముగా, ప్రవిభాగమ్ = పంపకమును, కృత్వా = చేసి, భృశమ్ = మిక్కిలి, ముదితాః = సంతోషించినాము అని, ప్రత్యూచుః = తిరిగి పలికిరి.

తా. అంతట సంతోషించిన మనస్సులు గల ఆ బ్రాహ్మణోత్తము లందరును న్యాయానుసారముగ ఆ ధనమును పంచుకొని, "చాల ఆనందించితిమి" అని రాజుతో పలికిరి. 50

మూ. తతః ప్రసర్పకేభ్యస్తు హిరణ్యం సుసమాహితః,
జామ్బూనదం కోటిసంఖ్యం బ్రాహ్మణేభ్యో దదౌ తదా. 51

ప్ర. అ. తతః = అటు పిమ్మట, తదా = అప్పుడు, సుసమాహితః = చాల శ్రద్ధకలవాడై, ప్రసర్పకేభ్యః = యాగము చూచుటకై వచ్చిన, బ్రాహ్మణేభ్యః= బ్రాహ్మణులకు, కోటిసంఖ్యమ్ = కోటి సంఖ్య గల, జామ్బూనదమ్ = బంగారమును, దదౌ = ఇచ్చెను.

తా. పిమ్మట, దశరథుడు శ్రద్ధాయుక్తుడై యాగమును చూచుటకై వచ్చిన బ్రాహ్మణులకు, కోటి బంగారు నాణెము లిచ్చెను. 51

మూ. దరిద్రాయ ద్విజాయాథ హస్తాభరణముత్తమమ్,
కస్మైచిద్యాచమానాయ దదౌ రాఘవనన్దనః. 52

ప్ర. అ. అథ=అటు పిమ్మట, రాఘవనన్దనః = దశరథుడు, యాచమానాయ=యాచించుచున్న, కస్మైచిత్ = ఒకానొక, దరిద్రాయ = దరిద్రుడైన, బ్రాహ్మణాయ=బ్రాహ్మణునకు, ఉత్తమమ్ = ఉత్తమమైన, హస్తాభరణమ్ = హస్తాభరణమును, దదౌ=ఇచ్చివేసెను.

తా. ఇంతలో ఒక దరిద్రబ్రాహ్మణుడు వచ్చి యాచింపగా, దశరథుడాతనికి తన చేత నున్న ఆభరణమును ఇచ్చివేసెను. 52

మూ. తతః ప్రీతేషు నృపతిః ద్విజేషు ద్విజవత్సలః,
ప్రణామమకరోత్తేషాం హర్షపర్యాకులేక్షణః. 53

ప్ర. అ. తతః=పిమ్మట, ద్విజవత్సలః=బ్రాహ్మణులయందు ప్రేమగల, నృపతిః=రాజు, ద్విజేషు=బ్రాహ్మణులు, ప్రీతేషు సత్సు=సంతసించినవారగుచుండగా, హర్షపర్యాకులేక్షణః=ఆనందముతో వ్యాకులమైన చూపులుకలవాడై, తేషామ్=వారియొక్క (వారికి), ప్రణామమ్=నమస్కారమును, అకరోత్= చేసెను.

తా. బ్రాహ్మణులయందు అధికప్రేమ గల దశరథుడు, వారందరును సంతృప్తిపొంది నట్లు చూచి, ఆనందముచే వ్యాకులములైన చూపులతో, వారికి నమస్కరించెను. 53

మూ. తస్యాశిషోఽథ విధివద్బ్రాహ్మణైః సముదీరితాః,
ఉదారస్య నృవీరస్య ధరణ్యాం ప్రణతస్య చ. 54

ప్ర. అ. అథ=అనంతరము, ఉదారస్య = దానశీలుడును, నృవీరస్య= మానవులలో గొప్ప వీరుడును, ధరణ్యామ్ = భూమిపై, ప్రణతస్య = వంగి నమస్కరించుచున్నవాడును అగు, తస్య=ఆతనికి, బ్రాహ్మణైః=బ్రాహ్మణులచేత, విధివత్ = యథాశాస్త్రముగా, ఆశిషః = ఆశీర్వచనములు, సముదీరితాః = పలకబడినవి.

తా. సాష్టాంగప్రణామము చేయుచున్న, ఆ మహాదాత యైన దశరథుని బ్రాహ్మణులు యథాశాస్త్రముగ ఆశీర్వదించిరి. 54

మూ. తతః ప్రీతమనా రాజా ప్రాప్య యజ్ఞమనుత్తమమ్,
పాపాపహం స్వర్నయనం దుష్కరం పార్థివర్షభైః. 55

ప్ర. అ. తతః=పిమ్మట, రాజా=రాజు, పాపాపహమ్=పాపములను తొలగించునదియు, స్వర్నయనమ్ = స్వర్గమును చేర్చునదియు, పార్థివర్షభైః = శ్రేష్ఠులైన రాజులచేతకూడ, దుష్కరమ్=చేయ శక్యము కానిదియు, అనుత్తమమ్= అత్యుత్తమ మైనదియు అగు, యజ్ఞమ్=యజ్ఞమును, ప్రాప్య=పొంది, ప్రీత మనాః=సంతోషించిన మనస్సు కలవా డయ్యెను.

తా. అశ్వమేధయాగము సర్వపాపములను తొలగించును. స్వర్గమునకు తీసికొని వెళ్లును. గొప్ప రాజులు కూడ దీనిని చేయజాలరు. అట్టి అత్యుత్తమ మైన అశ్వమేధయాగము పూర్తిచేసికొని దశరథుడు చాల సంతసించెను. 55

మూ. తతోఽబ్రవీదృశ్యశృఙ్గం రాజా దశరథ స్తదా,
కులస్య వర్ధనం త్వం తు కర్తుమర్హసి సువ్రత. 56

ప్ర. అ. తతః = పిమ్మట, దశరథః రాజా=దశరథమహారాజు, తదా = అప్పుడు, ఋశ్యశృఙ్గమ్=ఋశ్యశృంగుని గూర్చి, అబ్రవీత్=పలికెను. సువ్రత= మంచి వ్రతము కలవాడా ! కులస్య = కులమునకు, వర్ధనమ్ = వృద్ధి కలిగించు కర్మను, కర్తుమ్ = చేయుటకు, అర్హసి=తగిఉన్నావు.

తా. పిమ్మట దశరథుడు "ఓ! మహామునీ ! నా వంశముయొక్క వృద్ధికి హేతు వగు కర్మను చేయుము" అని ఋశ్యశృంగుని ప్రార్థించెను. 56

మూ. తథేతి చ స రాజానమువాచ ద్విజసత్తమః,
భవిష్యన్తి సుతా రాజంశ్చత్వారస్తే కులోద్వహాః. 57

ఇత్యార్షే, శ్రీమద్రామాయణే, ఆదికావ్యే బాలకాణ్డే చతుర్దశః సర్గః.

ప్ర. అ. ద్విజసత్తమః=ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు, తథేతి=అటులనే చేయించెదను అని, రాజానమ్=రాజును గూర్చి, ఉవాచ=పలికెను, రాజన్=ఓ రాజా! తే=నీకు, కులోద్వహాః=కులము నుద్ధరించు, చత్వారః=నలుగురు, సుతాః=కుమారులు, భవిష్యన్తి=పుట్టగలరు.

తా. "ఓ రాజా! అటులనే చేయించెదను. నీకు వంశోద్ధారకులైన నలుగురు కుమారులు పుట్టగలరు" అని ఋశ్యశృంగుడు పలికెను. 57

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
బాలకాండలో చతుర్దశసర్గ (14) సమాప్తము.

అథ పఞ్చదశః సర్గః

మూ. మేధావీ తు తతో ధ్యాత్వా స కించిదిదముత్తరమ్,
లబ్ధసంజ్ఞస్తతస్తం తు వేదజ్ఞో నృపమబ్రవీత్. 1

ప్ర. అ. తతః=పిమ్మట, మేధావీ=మేధావంతుడును, వేదజ్ఞః=వేదములు ఎరిగినవాడును అగు, సః=అతడు, కించిత్=కొంచెము, ధ్యాత్వా=ఆలోచించి, తతః=పిమ్మట, లబ్ధసంజ్ఞః=పొందబడిన స్మృతికలవాడై, తమ్=ఆ, నృపమ్=రాజును గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. మేధావంతుడును, సకలవేదనిష్ణాతుడును అగు ఋశ్యశృంగుడు కొంచెము ఆలోచించి, ఏ కర్మ చేసిన బాగుండునో గుర్తు చేసికొని దశరథునితో ఇట్లనెను. 1

మూ. ఇష్టిం తేఽహం కరిష్యామి పుత్రీయాం పుత్రకారణాత్,
అథర్వశిరసి ప్రోక్తైర్మన్త్రైః సిద్ధాం విధానతః. 2

ప్ర. అ. అహమ్=నేను, తే=నీకు, పుత్రకారణాత్=పుత్రులు కలుగుటకై, అథర్వశిరసి = అథర్వశిరస్సు అను వేదభాగమునందు, ప్రోక్తైః=చెప్పబడిన, మన్త్రైః=మంత్రములచేత, సిద్ధామ్=ఏర్పడునదియు (చేయబడునదియు), పుత్రీయామ్=పుత్రులను ఇవ్వగలదియు అగు, ఇష్టిమ్=యాగమును, విధానతః=శాస్త్రానుసారముగ, కరిష్యామి=చేయగలను.

తా. "నీకు పుత్రులు కలుగుటకై, పుత్రీయేష్టిని చేయించెదను. దీనిని అథర్వశిరస్సు అనెడు వేదభాగములో నున్న మంత్రములచే చేయించవలెను." 2

మూ. తతః ప్రాక్రమ్య తామిష్టిం పుత్రీయాం పుత్రకారణాత్,
జుహావ చాగ్నౌ తేజస్వీ మన్త్రదృష్టేన కర్మణా. 3

ప్ర. అ. తతః = పిమ్మట, పుత్రకారణాత్ = పుత్రులకొరకై, పుత్రీయామ్ = పుత్రులను కలిగించు, తామ్ ఇష్టిమ్=ఆ ఇష్టిని, ప్రాక్రమ్య=ప్రారం

ఖించి, తేజస్వీ = బ్రహ్మతేజస్సు గల ఆ ఋశ్యశృంగుడు, మంత్రదృష్టేన = మంత్రోక్తమైన, కర్మణా = కర్మచేత, అగ్నౌ = అగ్నియందు, జుహావ చ = హోమము చేసెను.

తా. బ్రహ్మతేజోవంతు డగు ఋశ్యశృంగుడు, దశరథునకు పుత్రులు కలుగుటకై, పుత్రియేష్టిని ప్రారంభించి, మంత్రోక్తవిధానముతో అగ్నిలో హోమము చేసెను. 3

మూ. తతో దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
భాగప్రతిగ్రహార్థం వై సమవేతా యథావిధి. 4

ప్ర. అ. తతః = పిమ్మట, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలును, సిద్ధాశ్చ = సిద్ధులును, పరమర్షయః = గొప్ప ఋషులును, యథావిధి = యథాశాస్త్రముగా, భాగప్రతిగ్రహార్థం = యజ్ఞభాగములను స్వీకరించుటకు, సమవేతాః వై = కలసిరి.

తా. అంతట, దేవతలును, గంధర్వులును, సిద్ధులును, పరమర్షులును, శాస్త్రాను సారముగా తమ తమ యజ్ఞభాగములను స్వీకరించుటకై అచట కలిసిరి. 4

మూ. తాః సమేత్య యథాన్యాయం తస్మిన్ సదసి దేవతాః,
అబ్రువన్ లోకకర్తారం బ్రహ్మాణం వచనం మహత్. 5

ప్ర. అ. తాః = ఆ, దేవతాః = దేవతలు, యథాన్యాయమ్ = న్యాయాను సారముగా, తస్మిన్ = ఆ, సదసి = సదస్సునందు, సమేత్య = కలిసి, లోక కర్తారమ్ = లోకములను సృజించు, బ్రహ్మాణమ్ = బ్రహ్మదేవుని గూర్చి, మహత్ = పూజ్య మైన, వచనమ్ = వచనమును, అబ్రువన్ = పలికిరి.

తా. ఆ దేవతలందరును శాస్త్రానుసారముగ ఆ సదస్సులో చేరి, సకల లోకస్రష్ట యగు బ్రహ్మదేవుని సమీపించి, పూజ్య మైన వాక్యములు పలికిరి. 5

మూ. భగవన్ త్వత్ప్రసాదేన రావణో నామ రాక్షసః,
సర్వాన్నో బాధతే వీర్యా చ్ఛాసితుం తం న శక్నుమః. 6

ప్ర. అ. భగవన్=ఓ భగవంతుడా! రావణో నామ=రావణు డనెడు, రాక్షసః = రాక్షసుడు, త్వత్ప్రసాదేన = నీ అనుగ్రహముచేత, వీర్యాత్ = పరాక్రమము వలన, నః = మమ్ములను, సర్వాన్=అందరిని, బాధతే = బాధించుచున్నాడు. తమ్=వానిని, శాసితుమ్=శిక్షించుటకు, న శక్నుమః=సమర్థులము కాజాలకున్నాము.

తా. ఓ! భగవంతుడా! రావణు డనెడు రాక్షసుడు, నీ వరప్రసాదము వలన కలిగిన పరాక్రమముతో మమ్ముల నందరిని బాధించుచున్నాడు. ఆతనిని శిక్షింపజాలకున్నాము. 6

మూ. త్వయా తస్మై వరో దత్తః ప్రీతేన భగవన్ పురా,
మానయన్తశ్చ తం నిత్యం సర్వం తస్య క్షమామహే. 7

ప్ర. అ. భగవన్=భగవంతుడా! పురా = పూర్వము, ప్రీతేన=సంతోషించిన, త్వయా=నీచేత, తస్మై=వానికి, వరః=వరము, దత్తః=ఇవ్వబడినది. తమ్=ఆ వరమును, మానయన్తః=గౌరవించుచు, తస్య=ఆతనియొక్క, సర్వమ్=సమస్త మైన దుష్టత్వమును, నిత్యమ్ = ఎల్లప్పుడును, క్షమామహే = క్షమించుచున్నాము.

తా. భగవంతుడా! పూర్వ మాతని తపస్సుకు సంతసించిన నీవు ఆతనికి వర మిచ్చితివి. ఆ వరమును గౌరవించుచు మేము ఆతడు చేయు అపకారమును సర్వదా క్షమించుచున్నాము. 7

మూ. ఉద్వేజయతి లోకాంస్త్రీనుచ్ఛ్రితాన్ ద్వేష్టి దుర్మతిః,
శక్రం త్రిదశరాజానం ప్రధర్షయితుమిచ్ఛతి. 8

ప్ర. అ. దుర్మతిః=ఆ దుర్మతి, త్రీన్=మూడు, లోకాన్=లోకములను, ఉద్వేజయతి=పీడించుచున్నాడు. ఉచ్ఛ్రితాన్=ఉన్నతపదములలో ఉన్నవారిని, ద్వేష్టి=ద్వేషించుచున్నాడు. త్రిదశరాజానమ్=దేవరాజైన, శక్రమ్=ఇంద్రుని, ప్రధర్షయితుమ్=అవమానించుటకు, ఇచ్ఛతి=ఇచ్ఛయించుచున్నాడు.

తా. దుర్బుద్ధి యైన ఆ రావణుడు మూడు లోకములను పీడించుచున్నాడు. లోకపాలులతో ద్వేషము వహించుచున్నాడు. దేవాధీశు డైన ఇంద్రుని కూడ అవమానింప చూచుచున్నాడు. 8

మూ. ఋషీన్యక్షాన్సగన్ధర్వానసురా న్బ్రాహ్మణాం స్తథా,
అతిక్రామతి దుర్ధర్షో వరదానేన మోహితః. 9

ప్ర. అ. దుర్ధర్షః = ఎదిరింప శక్యము కాని అతడు, వరదానేన = వరదానముచేత, మోహితః = గర్వితుడై, ఋషీన్ = ఋషులను, యక్షాన్ = యక్షులను, సగన్ధర్వాన్=గంధర్వులతో కూడిన, అసురాన్ = అసురులను, తథా = మరియు, బ్రాహ్మణాన్ = బ్రాహ్మణులను, అతిక్రామతి = అవమానించుచున్నాడు.

తా. వరముచే కన్ను గానక, ఆ రావణుడు, ఋషులను, గంధర్వులను, అసురులను, బ్రాహ్మణులను అవమానించుచున్నాడు. వాని నెవ్వరును, జయింప జాలకున్నారు. 9

మూ. నైనం సూర్యః ప్రతపతి పార్శ్వే వాతి న మారుతః,
చలోర్మిమాలీ తం దృష్ట్వా సముద్రోఽపి న కమ్పతే. 10

ప్ర. అ. ఏనమ్ = వీనిని, సూర్యః = సూర్యుడు, న ప్రతపతి = తపింపచేయుటలేదు. మారుతః = గాలి, పార్శ్వే = దగ్గర, న వాతి = వీచుటలేదు. చలోర్మిమాలీ=చంచలము లైన తరంగపంక్తులు గల, సముద్రోఽపి=సముద్రుడు కూడ, తమ్ = ఆతనిని, దృష్ట్వా = చూచి, న కమ్పతే=కదలుటలేదు.

తా. సూర్యుడు ఈతనికి వేడి కలిగించడు. వాయువు ఇతని ప్రక్కను వలుటకు భయపడును. ఎల్లప్పుడును చలించు తరంగపంక్తులు గల సముద్రుడు కూడ ఈతనిని చూడగనే స్తంభించిపోవును. 10

మూ. తన్మహన్నో భయం తస్మాద్రాక్షసాద్ఘోరదర్శనాత్,
వధార్థం తస్య భగవన్నుపాయం కర్తుమర్హసి. 11

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, ఘోరదర్శనాత్=ఘోర మైన దర్శనము గల, తస్మాత్=ఆ, రాక్షసాత్=రాక్షసునినుండి, నః=మాకు, మహత్=గొప్ప, భయమ్=భయము. భగవన్=భగవంతుడా! తస్య=వానియొక్క, వధార్థమ్= వధకొరకై, ఉపాయమ్=ఉపాయమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి=తగుదువు.

తా. వాని దర్శనమే చాల ఘోర మైనది. అట్టి వానినుండి మాకు గొప్ప భయము వచ్చిపడినది. భగవంతుడా ! వానిని చంపుటకై ఏదైన ఒక ఉపాయ మును చేయుము. 11

మూ. ఏవముక్తః సురైః సర్వైశ్చిన్తయిత్వా తతోఽబ్రవీత్,
హన్తాయం విదిత స్తస్య వధోపాయో దురాత్మనః. 12

ప్ర. అ. సర్వైః=సమస్త మైన, సురైః=దేవతలచేత, ఏవమ్=ఈవిధ ముగా, ఉక్తః=పలకబడిన బ్రహ్మదేవుడు, చిన్తయిత్వా=ఆలోచించి, తతః= అటుపిమ్మట, అబ్రవీత్=పలికెను. తస్య=ఆ, దురాత్మనః=దురాత్మునియొక్క, అయమ్=ఈ, వధోపాయః = చంపుటకు ఉపాయము, విదితః = తెలిసినది. హన్త=ఆహా !

తా. దేవతల మాటలు విని బ్రహ్మదేవుడు ఆలోచించి, ఇట్లు పలికెను. "ఆహా ! ఈ దురాత్ముని చంపుటకు ఒక ఉపాయము తోచినది." 12

మూ. తేన గన్ధర్వయక్షాణాం దేవదానవరక్షసామ్,
అవధ్యోఽస్మీతి వాగుక్తా తథేత్యుక్తం చ తన్మయా. 13

ప్ర. అ. తేన=వానిచేత, గన్ధర్వయక్షాణామ్=గంధర్వులకు యక్షులకు, దేవదానవరక్షసామ్=దేవతలకు దానవులకు రాక్షసులకు, అవధ్యః=చంపశక్యము కానివాడను, అస్మి=అగుదును గాక, ఇతి=అని, వాక్=వాక్కు, ఉక్తా=పలక బడినది. మయా చ=నా చేత కూడ, తత్=అది, తథా=అట్లే అగుగాక అని, ఉక్తమ్=చెప్పబడినది.

తా. దేవదానవరాక్షసగంధర్వయక్షుల చేతిలో నాకు చావు లేకుండు గాక అని అతడు పలుకగా, అట్లే అగుగాక అని నే నంటిని. 13

మూ. నాకీర్తయదవజ్ఞానాత్తద్రక్షో మానుషాం సదా,
తస్మాత్స మానుషాద్వధ్యో మృత్యుర్నాన్యోఽస్య విద్యతే. 14

ప్ర. అ. తత్ రక్షః=ఆ రాక్షసుడు, అవజ్ఞానాత్ = అనాదరమువలన, తదా = అప్పుడు, మానుషాన్ = మనుష్యులను, న అకీర్తయత్ = చెప్పలేదు.

తస్మాత్ = ఆ కారణమువలన, సః = ఆతడు, మానుషాత్ = మనుష్యునివలన, వధ్యః=చంపదగినవాడు. అస్య = వానికి, అన్యః = మరియొక, మృత్యుః= మరణహేతువు, న విద్యతే = లేదు.

తా. అప్పుడా రాక్షసుడు మనుష్యుల విషయమై అనాదరముచే వారిని పేర్కొనలేదు. కావున ఆ రాక్షసుడు మనుష్యుని చేతిలో చచ్చుటకు అవకాశ మున్నది. మరొక మరణోపాయము లేదు. 14

మూ. ఏతచ్ఛ్రుత్వా ప్రియం వాక్యం బ్రహ్మణా సముదాహృతమ్,
దేవా మహర్షయః సర్వే ప్రహృష్టాస్తేఽభవం స్తదా. 15

ప్ర. అ. తదా = అప్పుడు, బ్రహ్మణా = బ్రహ్మచేత, సముదాహృతమ్= చెప్పబడిన, ఏతత్ = ఈ, ప్రియమ్ = ప్రియమైన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, తే దేవాః=ఆ దేవతలును, మహర్షయః = మహర్షులును, సర్వే= అందరును, ప్రహృష్టాః అభవన్=సంతసించిరి.

తా. బ్రహ్మదేవుడు పల్కిన ఈ ప్రియవాక్యమును విని, దేవతలును, మహర్షులును, అందరును చాల సంతసించిరి. 15

మూ. ఏతస్మిన్నన్తరే విష్ణురుపయాతో మహాద్యుతిః,
శఙ్ఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః. 16

ప్ర. అ. ఏతస్మిన్=ఈ, అన్తరే=అవకాశమునందు, మహాద్యుతిః= గొప్ప కాంతికలవాడును, శఙ్ఖచక్రగదాపాణిః=శంఖచక్రగదలు హస్తములందు కలవాడును, పీతవాసాః=పచ్చని వస్త్రమును ధరించినవాడును, జగత్పతిః = జగత్తుకు ప్రభువును అయిన, విష్ణుః=విష్ణువు, ఉపయాతః = వచ్చెను.

తా. ఇంతలో, గొప్ప కాంతి కలవాడును జగత్తున కంతకును ప్రభువును అయిన విష్ణువు శంఖచక్రగదాహస్తుడై, పీతాంబరధారియై అచటికి వచ్చెను. 16

మూ. బ్రహ్మణా చ సమాగమ్య తత్ర తస్థౌ సమాహితః,
తమబ్రువన్ సురాస్సర్వే సమభిష్టూయ సన్నతాః. 17

ప్ర. అ. బ్రహ్మణా=బ్రహ్మతో, సమాగమ్య=కలిసి, తత్ర = అచట, సమాహితః=ఏకాగ్రచిత్తుడై, తస్థౌ=ఉండెను. సురాః=దేవతలు, సర్వే=అంద రును, సన్నతాః=నమస్కరించుచున్నవారై, తమ్ = ఆతనిని, సమభిష్టూయ = స్తుతించి, అబ్రువన్=ఇట్లు పలికిరి.

తా. విష్ణువు బ్రహ్మను కలిసి, మౌనముగా నిలబడెను. అంతట దేవత లందరును నమస్కరించి స్తుతించుచు ఆ విష్ణువుతో ఇట్లనిరి. 17

మూ. త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హితకామ్యయా,
రాజ్ఞో దశరథస్య త్వమయోధ్యాధిపతేః ప్రభోః. 18

ధర్మజ్ఞస్య వదాన్యస్య మహర్షిసమతేజసః,
తస్య భార్యాసు తిసృషు హ్రీశ్రీకీర్త్యుపమాసు చ. 19
విష్ణో పుత్రత్వమాగచ్ఛ కృత్వాత్మానం చతుర్విధమ్.

ప్ర. అ. విష్ణో=ఓ విష్ణూ! లోకానామ్=లోకములయొక్క, హితకామ్యయా= హితమునందు కోరికచేత, త్వామ్= నిన్ను, నియోక్ష్యామహే = నియమించు చున్నాము. విష్ణో=ఓ ! విష్ణూ ! త్వమ్=నీవు, అయోధ్యాధిపతేః = అయోధ్యకు అధిపతియు, ప్రభోః=ప్రభువును, ధర్మజ్ఞస్య=ధర్మముల నెరిగినవాడును, వదా న్యస్య=ఔదార్యవంతుడును, మహర్షిసమతేజసః=మహర్షితో సమాన మైన తేజస్సు కలవాడును అగు, తస్య దశరథస్య రాజ్ఞః=ఆ దశరథమహారాజుయొక్క, హ్రీశ్రీ కీర్త్యుపమాసు=హ్రీ, శ్రీ, కీర్తి అను దక్షపుత్రికలతో సమానులైన, తిసృషు = ముగ్గురు, భార్యాసు=భార్యలయందు, ఆత్మానమ్=తనను, చతుర్విధమ్=నాలుగు విధము లైనవానినిగా, కృత్వా=చేసి, పుత్రత్వమ్=పుత్రత్వమును, ఆగచ్ఛ= పొందుము.

తా. ఓ విష్ణూ ! లోకముల హితముకొరకై నిన్ను ఒక కార్యము చేయు టకై వేడుచున్నాము. అయోధ్యాధిపతి యైన దశరథుడు ధర్మజ్ఞుడు. ఔదార్య వంతుడు, మహర్షి వంటి తేజస్సు కలవాడు, సత్ప్రభువు. నీవు నాలుగు విధము లుగా ఏర్పడి హ్రీ-శ్రీ-కీర్తుల వంటి ఆతని ముగ్గురి భార్యలలో పుత్రులుగా ఆవిర్భవింపుము. 18, 19

మూ. తత్ర త్వం మానుషో భూత్వా ప్రవృద్ధం లోకకణ్టకమ్, 20
అవధ్యం దైవతైర్విష్ణో సమరే జహి రావణమ్.

ప్ర. అ. విష్ణో=ఓ విష్ణూ, త్వమ్=నీవు, తత్ర=దశరథభార్యలయందు, మానుషః = మనుష్యుడుగా, భూత్వా=జనించి, ప్రవృద్ధమ్ = పెచ్చుపెరిగి పోవు చున్నవాడును, లోకకణ్టకమ్=లోకములకు కంటకము వంటి వాడును, దైవతైః= దేవతలచేత, అవధ్యమ్=చంప శక్యము కానివాడును అగు, రావణమ్ = రావణుని, సమరే = యుద్ధమునందు, జహి=చంపుము.

తా. ఓ విష్ణూ! నీవు ఆ దశరథభార్యలయందు మనుష్యుడుగా జన్మించి, మితిమీరిపోవుచున్నవాడును, లోకములకు కంటకము వలె నున్నవాడును, దేవతలచే చంప శక్యముకానివాడును అగు రావణుని యుద్ధమునందు సంహరించుము. 20

మూ. స హి దేవాంశ్చ గన్ధర్వాన్ సిద్ధాంశ్చ మునిసత్తమాన్, 21
రాక్షసో రావణో మూర్ఖో వీర్యోత్సేకేన బాధతే.

ప్ర. అ. సః = ఆ, మూర్ఖః = మూర్ఖుడైన, రాక్షసః = రాక్షసుడైన, రావణః = రావణుడు, దేవాంశ్చ = దేవతలను, గన్ధర్వాన్ = గంధర్వులను, సిద్ధాంశ్చ=సిద్ధులను, మునిసత్తమాన్ = మునిశ్రేష్ఠులను, వీర్యోత్సేకేన = వీర్య గర్వముచే, బాధతే హి = బాధించుచున్నాడు కదా.

తా. మూర్ఖుడైన రాక్షసుడు, ఆ రావణుడు, వీర్యమదముచే, దేవతలను, గంధర్వులను, సిద్ధులను, మునిశ్రేష్ఠులను బాధించుచున్నాడు. 21

మూ. ఋషయశ్చ తతస్తేన గన్ధర్వాప్సరసస్తథా, 22
క్రీడన్తో నన్దనవనే క్రూరేణ కిల హింసితాః.

ప్ర. అ. తతః = ఆ పరాక్రమగర్వమువలన, తేన=ఆ, క్రూరేణ = క్రూరునిచేత, ఋషయశ్చ = ఋషులును, తథా = మరియు, నన్దనవనే = నందనవనమునందు, క్రీడన్తః = క్రీడించుచున్న, గన్ధర్వాప్సరసః = గంధర్వులు, అప్సరసలును, హింసితాః కిల=హింసింపబడినారుకదా.

తా. ఆ కూ్రరుడు, ఎందరో ఋషులను, నందనవనములో విహరించు చున్న గంధర్వులను, అప్సరసలను హింసించినాడు కదా ! 22

మూ. వధార్థం వయమాయాతా స్తస్య వై మునిభిః సహ, 23
సిద్ధగన్ధర్వయక్షాశ్చ తతస్త్వాం శరణం గతాః.

ప్ర. అ. వయమ్=మేము, సిద్ధగన్ధర్వయక్షాశ్చ=సిద్ధులు, గంధర్వులు, యక్షులును, మునిభిః సహ=మునులతో, తస్య=వానియొక్క, వధార్థమ్=వధ కొరకై, ఆయాతాః=వచ్చిఉన్నాము. తతః=ఆ కారణమువలన, (మేమందర మును), త్వామ్=నిన్ను, శరణం గతాః=శరణు పొందినాము.

తా. కావున, సిద్ధగంధర్వయక్షులును, మేమును, మునులతో కలిసి నిన్ను వేడుకొనుటకై ఇచటికి వచ్చినాము. మేమందరము నిన్ను శరణు పొందు చున్నాము. 23

మూ. త్వం గతిః పరమా దేవ సర్వేషాం నః పరంతప, 24
వధాయ దేవశత్రూణాం నృణాం లోకే మనః కురు

ప్ర. అ. పరంతప=శత్రువులను బాధించు, దేవ=ఓ విష్ణుదేవుడా ! త్వమ్=నీవే, నః సర్వేషామ్=మాకందరికిని, పరమా=శ్రేష్ఠమైన, గతిః=గతి యైనవాడవు, దేవశత్రూణామ్=రాక్షసులయొక్క, వధాయ=సంహారముకొరకు, నృణాం లోకే=మనుష్యలోకమునందు, మనః=మనస్సును, కురు=చేయుము.

తా. ఓ ! శత్రువినాశకా ! నీవే మాకు అందరికిని అత్యుత్తమ మైన గతివి. రాక్షససంహారము చేయుటకై నరలోకమున జనింప నిశ్చయము చేయుము. 24

మూ. ఏవముక్తస్తు దేవేశో విష్ణుస్త్రిదశపుఙ్గవః, 25
పితామహపురోగాంస్తాన్ సర్వలోకనమస్కృతః,
అబ్రవీత్త్రిదశాన్ సర్వాన్ సమేతాన్ ధర్మసంహితాన్. 26

ప్ర. అ. త్రిదశపుఙ్గవః=దేవతలలో శ్రేష్ఠుడును, సర్వలోకనమస్కృతః= సర్వలోకములచే నమస్కరింపబడినవాడును, దేవేశః=దేవతల ప్రభువును అగు, విష్ణుః=విష్ణువు, ఏవమ్=ఈ విధముగా, ఉక్తః=పలకబడినవాడై, సమేతాన్= అచట కలిసినవారును, ధర్మసంహితాన్=ధర్మముతో కూడినవారును, పితామహ

పురోగాన్=బ్రహ్మ మొదలైన, తాన్=ఆ, సర్వాన్=సమస్తమైన, త్రిదశాన్=దేవతలను గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. దేవతల ప్రభువును, దేవతాశ్రేష్ఠుడును, సర్వలోకములచే నమస్కరింపబడినవాడును, అగు విష్ణువు, ఈ విధముగా ప్రార్థింపబడినవాడై, ధర్మమును అనుసరించువారగు అచటికి చేరిన బ్రహ్మాది దేవతల నందరిని ఉద్దేశించి ఇట్లు పలికెను. 25, 26

మూ. భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్,
సపుత్రపౌత్రం సామాత్యం సమిత్రజ్ఞాతిబాన్ధవమ్, 27

హత్వా క్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్,
దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ,
వత్స్యామి మానుషే లోకే పాలయన్ పృథివీమిమామ్. 28

ప్ర. అ. భయమ్=భయమును, త్యజత=విడవండి, భద్రమ్=క్షేమమగుగాక. వః=మీయొక్క, హితార్థమ్=హితముకొరకు, సపుత్రపౌత్రమ్ = పుత్రపౌత్రులతో కూడినవాడును, సామాత్యమ్ = అమాత్యులతో కూడినవాడును, సమిత్రజ్ఞాతిబాన్ధవమ్ = మిత్రులతో జ్ఞాతులతో బంధువులతో కూడినవాడును, క్రూరమ్ = క్రూరుడును, దురాత్మానమ్ = దుష్టస్వభావము కలవాడును, దేవర్షీణామ్=దేవతలకును ఋషులకును, భయావహమ్ = భయము కలిగించువాడును అగు, రావణమ్ = రావణుని, యుధి=యుద్ధమునందు, హత్వా=చంపి, ఇమామ్ = ఈ, పృథివీమ్ = భూమిని, పాలయన్ = పాలించుచు, దశవర్షసహస్రాణి = పదివేల సంవత్సరములును, దశవర్షశతాని చ = పది వందల సంవత్సరములును, మానుషే లోకే = మనుష్యలోకమునందు, వత్స్యామి = నివసింపగలను.

తా. "భయము విడిచిపెట్టుడు. మీకు క్షేమ మగును. మీ హితము కొరకై, నేను, క్రూరుడును, దురాత్ముడును, దేవతలకు (మీకును) ఋషులకు భయము కలిగించువాడును అగు రావణుని, వాని పుత్ర-పౌత్ర-అమాత్య-మిత్ర-జ్ఞాతి-బాంధవులను, యుద్ధమునందు సంహరించి, పదకొండువేల సంవత్సరములు మర్త్యలోకములో నివసించి, ఈ భూమిని పాలింపగలను." 27, 28

మూ. ఏవం దత్త్వా వరం దేవో దేవానాం విష్ణురాత్మవాన్, 29
మానుషే చిన్తయామాస జన్మభూమిమథాత్మనః.

ప్ర. అ. ఆత్మవాన్=ఉత్తమబుద్ధికలవాడగు, విష్ణుః దేవః=విష్ణుదేవుడు, దేవానామ్=దేవతలకు, ఏవమ్=ఈవిధముగా, వరమ్=వరమును, దత్త్వా=ఇచ్చి, అథ = పిమ్మట, ఆత్మనః = తనకు, మానుషే = మనుష్యలోకమునందు, జన్మ భూమిమ్ = అవతరించుటకు తగిన స్థానమును గూర్చి, చిన్తయామాస = ఆలోచించెను.

తా. బుద్ధిమంతు డగు విష్ణుదేవుడు దేవతలకు ఈ విధముగా వరము నిచ్చి, తాను మనుష్యలోకములో అవతరించుటకు తగిన స్థానమును గూర్చి ఆలోచించెను. 29

మూ. తతః పద్మపలాశాక్షః కృత్వాత్మానం చతుర్విధమ్, 30
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్.

ప్ర. అ. తతః = పిమ్మట, పద్మపలాశాక్షః = పద్మపు రేకుల వంటి కన్నులు గల విష్ణువు, తదా = అప్పుడు, ఆత్మానమ్ = తనను, చతుర్విధమ్ = నాలుగు విధములుగా, కృత్వా = చేసి, దశరథం నృపమ్=దశరథమహారాజును, పితరమ్ = తండ్రినిగా, రోచయామాస = ఇష్టపడెను.

తా. అంత, పద్మము రేకుల వంటి నేత్రములు గల ఆ విష్ణువు, అప్పుడు, తనను నాలుగు విధములుగా చేసి, దశరథుని తన తండ్రిగా చేసికొనుటకు ఇష్ట పడెను. 30

మూ. తతో దేవాః సగన్ధర్వాస్సరుద్రాః సాప్సరోగణాః,
స్తుతిభిర్దివ్యరూపాభిస్తుష్టువుర్మధుసూదనమ్. 31

ప్ర. అ. తతః=పిమ్మట, సగన్ధర్వాః=గంధర్వులతో కూడిన, సరుద్రాః= రుద్రులతో కూడిన, సాప్సరోగణాః = అప్సరఃస్త్రీల సముదాయములో కూడిన, దేవాః=దేవతలు, దివ్యరూపాభిః=దివ్యమైన రూపము గల, స్తుతిభిః=స్తోత్రముల చేత, మధుసూదనమ్=మధువు అను రాక్షసుని చంపిన విష్ణువును, తుష్టువుః = సుతించిరి.

తా. అంతట దేవతలును, గంధర్వులును, రుద్రులును అప్సరస్త్రీ గణములును దివ్యము లగు స్తోత్రములతో ఆ విష్ణువును స్తుతించిరి. 31

మూ. తముద్ధతం రావణముగ్రతేజసం
ప్రవృద్ధదర్పం త్రిదశేశ్వరద్విషమ్,
విరావణం సాధు తపస్వికణ్టకం
తపస్వినాముద్ధర తం భయావహమ్. 32

ప్ర. అ. ఉద్ధతమ్ = విజృంభించినవాడును, ఉగ్రతేజసమ్ = భయంకరమైన పరాక్రమము కలవాడును, ప్రవృద్ధ దర్పమ్ = వృద్ధిపొందిన దర్పము కలవాడును, త్రిదశేశ్వరద్విషమ్ = దేవేంద్రుని ద్వేషించుచున్నవాడును, తపస్వికణ్టకమ్ = మహర్షులకు కంటకము వంటివాడును, తపస్వినామ్ = మహర్షులకు, భయావహమ్ = భయము కలిగించువాడును, అగు, తమ్ = ప్రసిద్ధుడైన, తమ్ = ఆ, రావణమ్=రావణుని, సాధు = చక్కగా, ఉద్ధర = ఉన్మూలించుము.

తా. భయంకరమైన పరాక్రమము గల ఆ రావణుడు వృద్ధిపొందిన గర్వముతో విజృంభించుచున్నాడు. ఇంద్రుని ద్వేషించుచున్నాడు. లోకములను ఏడ్పించుచున్నాడు. మునులను బాధించుచు సర్వదా వారికి భయహేతు వగుచున్నాడు. అట్టివానిని పూర్తిగ ఉన్మూలించుము. 32

మూ. తమేవ హత్వా సబలం సబాన్ధవం
విరావణం రావణమగ్ర్యపౌరుషమ్
స్వర్లోకమాగచ్ఛ గతజ్వరశ్చిరం
సురేన్ద్రగుప్తం గతదోషకల్మషమ్. 33

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పంచదశః సర్గః.

ప్ర. అ. సబలమ్ = సైన్యముతో కూడినవాడును, సబాన్ధవమ్ = బంధువులతో కూడినవాడును, విరావణమ్ = లోకములను ఏడ్పించువాడును, అగ్ర్యపౌరుషమ్ = శ్రేష్ఠమైన పౌరుషము కలవాడును అగు, తమ్ ఏవ = ఆ,

రావణమ్ = రావణుని, హత్వా = చంపి, చిరమ్ = చిరకాలము, గతజ్వరః = పోయిన వ్యథ కలవాడవై, సురేన్ద్రగుప్తమ్ = దేవేంద్రునిచే రక్షింపబడినదియు, గతదోషకల్మషమ్ = పోయిన దోషములును కల్మషములును గల, స్వర్లోకమ్= స్వర్గలోకమును గూర్చి, ఆగచ్ఛ = రమ్ము.

తా. గొప్ప పౌరుషము కలవాడును, లోకములను ఏడ్పించువాడును అగు ఆ రావణుని, సైన్యబాంధవాదిసహితముగ చంపి, చాలకాలము పాటు ఏ చింతలు లేనివాడవై, దేవేంద్రునిచే రక్షింపబడినదియు, దోషములు కాని, పాపములు కాని లేనిదియు అగు స్వర్గలోకమునకు తిరిగి రమ్ము. 33

వి. "సురేన్ద్రగుప్తమ్" అనుదానిని సురేన్ద్ర+గుప్తమ్ అని విడదీసి, సురేంద్ర = ఓ సురశ్రేష్ఠుడా, గుప్తమ్ = రహస్యమైనదియు, చిరమ్ = పురాతనమైనదియు అగు, స్వర్లోకమ్ = వైకుంఠమును, ఆగచ్ఛ = చేరుము — అని కొందరి వ్యాఖ్య. విష్ణువు వైకుంఠనివాసి అని ఈ ఘట్టములో రామాయణములో ఎక్కడను లేదు. ఈ అర్థము లన్నియు అర్వాచీనములైన సంప్రదాయములను పట్టి చెప్పునవి.

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలోని పదునైదవసర్గ సమాప్తము.

అథ షోడశః సర్గః

మూ. తతో నారాయణో దేవో నియుక్తః సురసత్తమైః,
జానన్నపి సురానేవం శ్లక్ష్ణం వచనమబ్రవీత్. 1

ప్ర. అ. తతః = పిమ్మట, సురసత్తమైః = దేవతాశ్రేష్ఠులచేత, నియుక్తః = ఈ విధముగా నియమింపబడిన, నారాయణః దేవః = విష్ణువు, జానన్నపి = తెలిసినవాడే అయినను, సురాన్ = దేవతలను గూర్చి, ఏవమ్ = ఈ విధముగా, శ్లక్ష్ణమ్ = మృదువైన, వచనమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఈ విధముగ దేవతలచే నియుక్తుడైన విష్ణువు, తెలిసినవాడే యైనను, తెలియనట్లు దేవతలతో, మధురముగా ఇట్లనెను. 1

మూ. ఉపాయః కో వధే తస్య రావణస్య దురాత్మనః,
యమహం తం సమాస్థాయ నిహన్యామృషికణ్టకమ్. 2

ప్ర. అ. దురాత్మనః = దురాత్ముడైన, తస్య రావణస్య = ఆ రావణుని యొక్క, వధే = వధవిషయమున, ఉపాయః = ఉపాయము, కః = ఏమి? యమ్ = ఏ ఉపాయమును, ఆస్థాయ = అవలంబించి, ఋషికణ్టకమ్ = ఋషులకు బాధను కలిగించుచున్న, తమ్ = వానిని, అహమ్ = నేను, నిహన్యామ్ = చంపుదునో.

తా. ఋషులకు బాధలను కలిగించుచున్న, దురాత్ముడైన రావణుని వధించుటకు ఉపాయమేమి? ఆ ఉపాయముచే నేను రావణుని వధించెదను. 2

మూ. ఏవముక్తాస్సురాః సర్వే ప్రత్యూచుర్విష్ణుమవ్యయమ్,
మానుషీం తనుమాస్థాయ రావణం జహి సంయుగే. 3

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, ఉక్తాః = పలకబడిన, సురాః = దేవతలు, సర్వే = అందరును, అవ్యయమ్ = నాశరహితుడైన, విష్ణుమ్ = విష్ణువును గూర్చి, ప్రత్యూచుః = తిరిగి పలికిరి. మానుషీమ్ = మనుష్యసంబంధమైన,

తనుమ్ = శరీరమును, ఆస్థాయ = అవలంబించి, సంయుగే = యుద్ధమునందు, రావణమ్ = రావణుని, జహి = సంహరించుము.

తా. "మనుష్యశరీరమును ధరించి, యుద్ధరంగమున రావణుని వధింపుము" అని దేవతలు ప్రత్యుత్తర మిచ్చిరి. 3

మూ. స హి తేపే తపస్తీవ్రం దీర్ఘకాలమరిన్దమ,
యేన తుష్టోఽభవద్బ్రహ్మ లోకకృల్లోకపూర్వజః. 4

ప్ర. అ. అరిందమ = ఓ శత్రువినాశకుడా ! సః=ఆతడు, దీర్ఘకాలమ్= చాలకాలము, తీవ్రమ్ = తీవ్రమైన, తపః = తపస్సును, తేపే = చేసెను (తపించెను). యేన = దేనిచేత, లోకకృత్ = లోకములను సృజించినవాడును, లోకపూర్వజః = లోకములకు ముందు పుట్టినవాడును అగు, బ్రహ్మ = బ్రహ్మదేవుడు, తుష్టః = సంతోషించినవాడై, అభవత్ = ఆయెనో.

తా. "ఓ ! శత్రువినాశకా ! ఆ రావణుడు చాలకాలము తీవ్రమైన తపస్సు చేయగా, సర్వలోకములకంటెను పూర్వము జనించిన వాడును, సకలలోకస్రష్టయు అగు బ్రహ్మదేవుడు ఆ తపస్సునకు సంతోషించెను." 4

మూ. సంతుష్టః ప్రదదౌ తస్మై రాక్షసాయ వరం ప్రభుః.
నానావిధేభ్యో భూతేభ్యో భయం నాన్యత్ర మానుషాత్. 5
అవజ్ఞాతాః పురా తేన వరదానే హి మానవాః.

ప్ర. అ. సంతుష్టః = సంతోషించిన, ప్రభుః=ఆ సర్వసమర్థుడు, తస్మై= ఆ, రాక్షసాయ = రాక్షసునకు, మానుషాత్ అన్యత్ర = మనుష్యుడు తప్ప, నానావిధేభ్యః = అనేకవిధములైన, భూతేభ్యః = ప్రాణులనుండి, భయమ్ = భయము, న = లేదు, అని, వరమ్ = వరమును, ప్రదదౌ = ఇచ్చెను. పురా = పూర్వము, వరదానే = వరదానసమయమునందు, తేన = వానిచేత, మానవాః = మానవులు, అవజ్ఞాతాః = అనాదరము చేయబడినారు.

తా. "సంతోషించిన ఆ బ్రహ్మదేవుడు— "మనుష్యులు తప్ప మరి ఏ ఇతరప్రాణులనుండియు నీకు భయము లేకుండుగాక" అని ఆ రాక్షసునకు

వరము నిచ్చెను, ఎందువల్ల ననగా, వరదానసమయమున ఆతడు (రావణుడు) మానవుల విషయమున అనాదరమును చూపెను." 5

మూ. ఏవం పితామహాత్తస్మాద్వరం ప్రాప్య స దర్పితః, 6
ఉత్సాదయతి లోకాంస్త్రీన్ స్త్రియశ్చాప్యపకర్షతి,
తస్మాత్తస్య వధో దృష్టో మానుషేభ్యః పరంతప. 7

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, తస్మాత్ = ఆ, పితామహాత్ = బ్రహ్మదేవునినుండి, వరమ్ = వరమును, ప్రాప్య = పొంది, సః = ఆతడు, దర్పితః = గర్వించినవాడై, త్రీన్ = మూడు, లోకాన్ = లోకములను, ఉత్సాదయతి = పీడించుచున్నాడు, స్త్రియః = స్త్రీలను, అపకర్షతి చ = బలాత్కరించుచున్నాడు కూడా. తస్మాత్ = ఆకారణమువలన, పరంతప = ఓ శత్రుసంహారకుడా ! తస్య = వానియొక్క, వధః = వధ, మానుషేభ్యః = మనుష్యులనుండి, దృష్టః = చూడబడినది.

తా. "ఈ విధముగ బ్రహ్మదేవునినుండి వరమును పొంది, ఆతడు దృప్తుడై మూడు లోకాలను పీడించుచున్నాడు. స్త్రీలను బలాత్కరించుచున్నాడు. వానిని సంహరింపగలవారు మనుష్యులు మాత్రమే." 6, 7

మూ. ఇత్యేతద్వచనం శ్రుత్వా సురాణాం విష్ణురాత్మవాన్,
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్. 8

ప్ర. అ. ఇతి = ఈ విధముగా, సురాణామ్ = దేవతలయొక్క, ఏతత్ = ఈ, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ఆత్మవాన్ = బుద్ధిమంతుడైన, విష్ణుః = విష్ణువు, తదా = అప్పుడు, దశరథం నృపమ్ = దశరథమహారాజును, పితరమ్ = తండ్రినిగా, రోచయామాస = ఇష్టపడెను.

తా. బుద్ధిమంతుడైన విష్ణువు దేవతల ఈ వాక్యమును విని, అప్పుడు, దశరథుని తండ్రిగా చేసికొనవలె నని ఇచ్ఛయించెను. 8

మూ. స చాప్యపుత్రో నృపతిస్తస్మిన్ కాలే మహాద్యుతిః,
అయజత్పుత్రియామిష్టిం పుత్రేప్సురరిసూదనః. 9

ప్ర. అ. తస్మిన్ కాలే=ఆ సమయమునందు, మహాద్యుతిః=గొప్ప కాంతి కలవాడును, అరిసూదనః=శత్రువులను నశింపచేయువాడును అగు, సః నృపతిః= ఆ రాజు, అపుత్రః=పుత్రులు లేనివాడై, పుత్రేప్సుః=పుత్రులను పొందదలచినవాడై, పుత్రియామ్ ఇష్టిమ్ = పుత్రులను కలిగించు ఇష్టిని, అయజత్ = యజించెను (చేసెను).

తా. గొప్ప తేజస్సు కలవాడును, శత్రుసంహారకుడును అగు దశరథుడు, పుత్రులు లేక పోవుటచే, అదే సమయమున, పుత్రులను ఇచ్చు ఒక యాగమును చేయుచుండెను. 9

మూ. స కృత్వా నిశ్చయం విష్ణురామన్త్ర్య చ పితామహమ్,
అన్తర్ధానం గతో దేవైః పూజ్యమానో మహర్షిభిః. 10

ప్ర. అ. సః =ఆ, విష్ణుః = విష్ణువు, నిశ్చయమ్ = నిశ్చయమును, కృత్వా = చేసి, పితామహమ్ = బ్రహ్మదేవుని, ఆమన్త్ర్య = వీడ్కొని, దేవైః = దేవతలచేతను, మహర్షిభిః = మహర్షులచేతను, పూజ్యమానః = పూజింపబడుచున్న వాడై, అన్తర్ధానం గతః = అంతర్ధానము పొందెను.

తా. విష్ణువు ఈ విధముగా నిశ్చయించుకొని, బ్రహ్మదేవుని వీడ్కొని, దేవతలచేతను, మహర్షులచేతను పూజింపబడుచున్నవాడై అంతర్ధానము పొందెను. 10

మూ. తతో వై యజమానస్య పావకాదతులప్రభమ్,
ప్రాదుర్భూతం మహద్భూతం మహావీర్యం మహాబలమ్. 11

కృష్ణరక్తామ్బరధరం రక్తాస్యం దున్దుభిస్వనమ్,
స్నిగ్ధహర్యక్షతనుజశ్మశ్రు ప్రవరమూర్ధజమ్. 12

శుభలక్షణసమ్పన్నం దివ్యాభరణభూషితమ్,
శైలశృంగసముత్సేధం దృప్తశార్దూలవిక్రమమ్. 13

దివాకరసమాకారం దీప్తానలశిఖోపమమ్,
తప్తజామ్బూనదమయీం రాజతాంతపరిచ్ఛదామ్. 14

దివ్యపాయససంపూర్ణాం పాత్రీం పత్నీమివ ప్రియామ్,
ప్రగృహ్య విపులాం దోర్భ్యాం స్వయం మాయామయీమివ. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, యజమానస్య = యాగము చేయుచున్న ఆ దశరథునియొక్క, పావకాత్ = అగ్నినుండి, అతులప్రభమ్ = సాటిలేని కాంతి కలదియు, మహావీర్యమ్ = గొప్ప వీర్యము కలదియు, మహాబలమ్ = గొప్ప బలము గలదియు, కృష్ణరక్తాम्बर ధరమ్ = నల్లని ఎఱ్ఱని వస్త్రములను ధరించినదియు, రక్తాస్యమ్ = ఎఱ్ఱని ముఖము కలదియు, దున్దుభిస్వనమ్ = దుందుభిధ్వని వంటి ధ్వని కలదియు, స్నిగ్ధహర్యక్షతనుజశ్మశ్రుప్రవరమూర్ధజమ్ = మెత్తగా నున్న సింహరోమసదృశము లైన మీసములును శ్రేష్ఠము లైన కేశములును కలదియు, శుభలక్షణసంపన్నమ్ = శుభలక్షణములతో కూడినదియు, దివ్యాభరణభూషితమ్ = దివ్యములైన ఆభరణములచే అలంకరింపబడినదియు, శైలశృఙ్గసముత్సేధమ్ = పర్వతశిఖరము వంటి ఔన్నత్యము కలదియు, దృప్తశార్దూలవిక్రమమ్ = గర్వించిన పెద్దపులి వంటి నడక గలదియు, దివాకరసమాకారమ్ = సూర్యునితో సమాన మైన ఆకారము కలదియు, దీప్తానలశిఖోపమమ్ = ప్రజ్వలించుచున్న అగ్నిశిఖతో సమాన మైనదియు అగు, మహత్ = గొప్ప, భూతమ్ = భూతము, తప్తజామ్బూనదమయీమ్ = కరిగిన బంగారముతో చేయబడిన, రాజతాన్తపరిచ్ఛదామ్ = వెండితో చేయబడిన మూత కల, దివ్యపాయససంపూర్ణామ్ = దివ్యపాయసముతో నిండిన, మాయామయీమివ = మాయానిర్మితమా అన్నట్లున్న, విపులామ్ = పెద్దదైన, పాత్రీమ్ = పాత్రను, ప్రియామ్ = ప్రియురాలైన, పత్నీమివ = భార్యనువలె, స్వయమ్ = స్వయముగ, దోర్భ్యామ్ = రెండుచేతులతో, ప్రగృహ్య = గ్రహించి, ప్రాదుర్భూతమ్ = ఆవిర్భవించెను.

తా. దశరథుడు యజ్ఞము చేయుచుండగా ఆ అగ్నికుండమునుండి సాటిలేని కాంతి గల ఒక మహాభూతము ఆవిర్భవించెను. దాని బలపరాక్రమములు అసాధారణములు. అది నలుపు—ఎరుపురంగులు గల వస్త్రమును ధరించెను. ముఖము ఎఱ్ఱగ నుండెను. దాని కంఠధ్వని దుందుభిధ్వని వలె గంభీరముగ నుండెను. మెత్తగా నున్న దాని రోమములును, మీసములును, వెంట్రుకలును సింహముజూలు రంగులో ఉండెను. పర్వతశిఖరము వంటి ఔన్నత్యము గల ఆ

భూతముయొక్క నడక దర్పముతో కూడిన పెద్దపులి నడక వలె నుండెను. దాని ఆకారము సూర్యుని ఆకారమువలెను, అది ప్రజ్వలించుచున్న అగ్నిశిఖవలెను ఉండెను. ఆ భూతము తన రెండు చేతులతో ఒక మేలిమి బంగారు పాత్రను, ప్రియురాలైన భార్యను వలె, అత్యాదరముతో తీసికొనివచ్చెను. దివ్యపాయసముతో నిండి యున్న ఆ బంగారుపాత్రపై వెండి మూత యుండెను. అది మాయచే నిర్మింపబడినదా అన్నట్లు అత్యద్భుతముగ నుండెను. 11-15

మూ॰ సమవేక్ష్యాబ్రవీద్వాక్యమిదం దశరథం నృపమ్,
ప్రాజాపత్యం నరం విద్ధి మామిహాభ్యాగతం నృప. 16

ప్ర. అ. దశరథం నృపమ్ = దశరథమహారాజును, సమవేక్ష్య = చూచి, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. నృప = ఓ రాజా! ఇహ = ఇచటికి, అభ్యాగతమ్ = వచ్చిన నన్ను, ప్రాజాపత్యం = ప్రజాపతి నుండి వచ్చిన, (ప్రజాపతికి సంబంధించిన), నరమ్ = పురుషునిగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. ఆ భూతము దశరథమహారాజును చూచి ఇట్లు పలికెను. "ఓ రాజా! నేను ప్రజాపతి పంపగా ఇచటకు వచ్చినాను". 16

మూ. తతః పరం తదా రాజా ప్రత్యువాచ కృతాఞ్జలిః,
భగవన్ స్వాగతం తేఽస్తు కిమహం కరవాణి తే. 17

ప్ర. అ. తతః పరమ్ = అటుపిమ్మట, తదా = అప్పుడు, రాజా = రాజు, కృతాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, ప్రత్యువాచ = తిరిగి పలికెను. భగవన్ = ఓ పూజ్యుడా! తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము, అస్తు = అగుగాక. అహమ్ = నేను, తే = నీకు, కిమ్ = ఏమి, కరవాణి = చేయుదును.

తా. పిదప ఆ రాజు చేతులు జోడించి— "పూజ్యుడా! నీకు స్వాగతము. నీ కొరకు నేనేమి చేయుదును?" అని పలికెను. 17

మూ. అథో పునరిదం వాక్యం ప్రాజాపత్యో నరోఽబ్రవీత్,
రాజన్నర్చయతా దేవానద్య ప్రాప్తమిదం త్వయా. 18

ప్ర. అ. అథో = అటుపిమ్మట, ప్రాజాపత్యః నరః = ప్రజాపతి పంపగా వచ్చిన ఆ పురుషుడు, పునః = మరల, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రాజన్ = ఓరాజా! దేవాన్ = దేవతలను, అర్చయతా = పూజించుచున్న, త్వయా = నీచేత, అద్య = ఈ రోజున, ఇదమ్ = ఇది, ప్రాప్తమ్ = పొందబడినది.

తా. ఆ ప్రాజాపత్యపురుషుడు ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "రాజా! నీవు దేవతలను అర్చించుచున్నందుకు ఫలితముగా నేడు ఇది నీకు లభించినది." 18

మూ. ఇదం తు నృపశార్దూల పాయసం దేవనిర్మితమ్,
ప్రజాకరం గృహాణ త్వం ధన్యమారోగ్యవర్ధనమ్. 19

ప్ర. అ. నృపశార్దూల = ఓ రాజశ్రేష్ఠుడా! దేవనిర్మితమ్ = దేవతల చేత నిర్మింపబడినదియు, ప్రజాకరమ్ = సంతానమును ఇచ్చునదియు, ధన్యమ్ = ధనము నిచ్చునదియు, ఆరోగ్యవర్ధనమ్ = ఆరోగ్యమును వృద్ధి పొందించునదియు అగు, ఇదమ్ = ఈ, పాయసమ్ = పాయసమును, త్వమ్ = నీవు, గృహాణ = గ్రహించుము.

తా. "ఓ రాజశ్రేష్ఠుడా! ఈ పాయసము దేవతలు నిర్మించినది. సంతానము నిచ్చును; ధనమును ఇచ్చును; ఆరోగ్యమును పెంచును; దీనిని తీసికొనుము." 19

మూ. భార్యాణామనురూపాణామశ్నీతేతి ప్రయచ్ఛ వై,
తాసు త్వం ప్రాప్స్యసే పుత్రాన్ యదర్థం యజసే నృప. 20

ప్ర. అ. నృప = ఓరాజా! అశ్నీత = భుజింపుడు, ఇతి = అని చెప్పి, అనురూపాణామ్ = తగిన, భార్యాణామ్ = భార్యలకు, ప్రయచ్ఛ వై = ఇమ్ము. యదర్థమ్ = ఏ పుత్రులకొరకై, యజసే = యాగము చేయుచున్నావో, పుత్రాన్ = అట్టి పుత్రులను, తాసు = వారియందు, త్వమ్ = నీవు, లప్స్యసే = పొందగలవు.

తా. "రాజా! 'తినుడు' అని చెప్పి ఈ పాయసమును తగిన భార్యల కిమ్ము, నీవు పుత్రులకొరకై యాగము చేయుచున్నావు కదా. ఆ భార్యలయందు నీకు పుత్రులు జనించగలరు." 20

మూ. తథేతి నృపతిః ప్రీతః శిరసా ప్రతిగృహ్య తామ్,
పాత్రీం దేవాన్నసంపూర్ణాం దేవదత్తాం హిరణ్మయీమ్. 21

ప్ర. అ. నృపతిః = రాజు, తథేతి = అటులనే చేసెదను అని పలికి, తామ్ = ఆ, దేవాన్న సంపూర్ణామ్ = దేవతలచే వండబడిన అన్నముతో నిండినదియు, దేవదత్తామ్ = దేవతలచేత ఇవ్వబడినదియు, హిరణ్మయీమ్ = బంగారు వికార మైనదియు అగు, పాత్రీమ్ = పాత్రను, శిరసా = శిరస్సుతో, ప్రతిగృహ్య = స్వీక రించి, ప్రీతః = సంతోషించెను.

తా. దశరథుడు, దేవతలు వండిన అన్నముతో నిండిన, దేవతలు పంపిన, ఆ బంగారు పాత్రను శిరస్సు వంచి, సవినయముగ అందికొని సంతోషించెను. 21

మూ. అభివాద్య చ తద్భూతమద్భుతం ప్రియదర్శనమ్,
ముదా పరమయా యుక్తశ్చకారాభిప్రదక్షిణమ్. 22

ప్ర. అ. పరమయా = గొప్పదైన, ముదా = సంతోషముతో, యుక్తః = కూడినవాడై, అద్భుతమ్ = ఆశ్చర్యకర మైనదియు, ప్రియదర్శనమ్ = సంతోష జనకమైన దర్శనము కలదియు అగు, తత్ భూతమ్ = ఆ భూతమును, అభి వాద్య = నమస్కరించి, అభిప్రదక్షిణమ్ = ప్రదక్షిణమును, చకార = చేసెను.

తా. మిక్కిలి సంతోషించిన దశరథుడు, చూచెడివారికి సంతోషము కలిగించు, ఆ అద్భుతమైన భూతమునకు ప్రదక్షిణము చేసి నమస్కరించెను. 22

మూ. తతో దశరథః ప్రాప్య పాయసం దేవనిర్మితమ్,
బభూవ పరమప్రీతః ప్రాప్య విత్తమివాధనః. 23

ప్ర. అ. తతః = పిమ్మట, దశరథః = దశరథుడు, దేవనిర్మితమ్ = దేవతలచే నిర్మింపబడిన, పాయసమ్ = పాయసమును, ప్రాప్య = పొంది, విత్తమ్ = ధనమును, ప్రాప్య = పొంది, అధనః ఇవ = దరిద్రుడు వలె, పరమప్రీతః = మిక్కిలి సంతసించినవాడు, బభూవ = అయెను.

తా. దశరథుడు దేవతలు నిర్మించిన ఆ పాయసము లభించుటచే, ధనము లభించిన నిరుపేద వలె చాల సంతసించెను. 23

మూ. తత స్తదద్భుతప్రఖ్యం భూతం పరమభాస్వరమ్,
సంవర్తయిత్వా తత్ కర్మ తత్రై వాన్తరధీయత. 24

ప్ర. అ. తతః=పిమ్మట, అద్భుతప్రఖ్యమ్ = అద్భుత మైన ఆకారము కలదియు, పరమభాస్వరమ్ = మిక్కిలి ప్రకాశించునదియు అగు, తత్ భూతమ్= ఆ భూతము, తత్ = ఆ, కర్మ = పనిని, సంవర్తయిత్వా = చేసి, తత్రైవ = అచటనే, అంతరధీయత=అంతర్ధానము చెందెను.

తా. అద్భుత మైన ఆకారముతో పరమతేజోవంత మగు ఆ భూతము, ఆ పని చేసి, అచటనే అంతర్ధానము చెందెను. 24

మూ. హర్షరశ్మిభిరుద్ద్యోతం తస్యాన్తఃపురమాబభౌ,
శారదస్యాభిరామస్య చంద్రస్యేవ నభోఽంశుభిః 25

ప్ర. అ. హర్షరశ్మిభిః=ఆనందకిరణములచేత, ఉద్ద్యోతమ్=వెలుగొందుచున్న, తస్య=అతనియొక్క, అన్తఃపురమ్ = అంతఃపురము, అభిరామస్య= మనోహరుడైన, శారదస్య = శరత్కాలమునకు సంబంధించిన, చన్ద్రస్య = చంద్రునియొక్క, అంశుభిః=కిరణములచేత, నభః ఇవ=ఆకాశము వలె, ఆబభౌ= ప్రకాశించెను.

తా. సంతోషకాంతులతో వెలుగొందుచున్న దశరథాంతఃపురము, మనోహరు డైన శరచ్చంద్రుని కిరణములచే ఆకాశము వలె ప్రకాశించెను. 25

మూ. సోఽన్తఃపురం ప్రవిశ్యైవ కౌసల్యామిదమబ్రవీత్,
పాయసం ప్రతిగృహ్ణీష్వ పుత్రీయం త్విదమాత్మనః. 26

ప్ర. అ. సః=అతడు, అన్తఃపురమ్ = అంతఃపురమును, ప్రవిశ్యైవ= ప్రవేశించగనే, కౌసల్యామ్ = కౌసల్యను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను. ఆత్మనః=నీకు, పుత్రీయమ్ = పుత్రులను కలుగజేయు, ఇదమ్=ఈ, పాయసమ్=పాయసమును, ప్రతిగృహ్ణీష్వ=స్వీకరించుము.

తా. ఆతడు అంతఃపురములో ప్రవేశించి— "నీకు పుత్రులను కలిగించు ఈ పాయసమును తీసికొనుము" అని కౌసల్యతో పలికెను. 26

మూ. కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా,
అర్ధాదర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః. 27

కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థకారణాత్,
ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమమ్. 28

అనుచిన్త్య సుమిత్రాయై పునరేవ మహీపతిః,
ఏవం తాసాం దదౌ రాజా భార్యాణాం పాయసం పృథక్. 29

ప్ర. అ. తదా=అప్పుడు, నరపతిః=రాజు, కౌసల్యాయై = కౌసల్యకు, పాయసార్ధమ్=పాయసములో సగమును, దదౌ=ఇచ్చెను. నరాధిపః = రాజు, అర్ధాత్=మిగిలిన సగమునుండి, అర్ధమ్ = సగభాగమును, సుమిత్రాయై అపి= సుమిత్రకు కూడ, దదౌ = ఇచ్చెను. అవశిష్టార్ధమ్ = మిగిలిన దానిలో సగమును, పుత్రార్థకారణాత్=పుత్రప్రయోజన మనే కారణము వలన, కైకేయ్యై= కైకేయికి, దదౌ=ఇచ్చెను. మహీపతిః = రాజు, అనుచిన్త్య = ఆలోచించి, పాయసస్య=పాయసముయొక్క, అమృతోపమమ్=అమృతముతో సమాన మైన, అవశిష్టార్ధమ్=మిగిలిన సగమును, పునరేవ=మరల, సుమిత్రాయై=సుమిత్రకు, ప్రదదౌ=ఇచ్చెను. ఏవమ్=ఈ విధముగా, రాజా=రాజు, తాసాం భార్యాణామ్=ఆ భార్యలకు, పృథక్=వేరు వేరుగా, పాయసమ్=పాయసమును, దదౌ = ఇచ్చెను.

తా. దశరథుడు అప్పుడు పాయసములో సగముభాగమును కౌసల్యకిచ్చెను. మిగిలిన సగము భాగములోని సగము భాగమును (అనగా నాల్గవ భాగమును) సుమిత్ర కిచ్చెను. మిగిలిన దానిలో సగము భాగమును అనగా ఎనిమిదవ భాగమును కైకేయికి ఇచ్చెను. మిగిలిన ఎనిమిదవ భాగమును మరల ఆలోచించి, సుమిత్రకు ఇచ్చెను. ఈ విధముగా రాజు భార్యలు ముగ్గురికిని వేరు వేరుగా పాయసము నిచ్చెను.

వి. ఈ శ్లోకాలకు ఈ అర్థమే పదానుసారి యైన అర్థము. కొందరు వ్యాఖ్యాతలు ఈ అర్థాలను ఇటు లాగి అటు లాగి వేరువేరుగా చెప్పి ఉన్నారు. అధ్యాత్మ రామాయణాదులలో ఉన్న విషయాలను సమన్వయించుటకొరకు, అట్లే విష్ణువు నాలుగు భాగాలు అయి దశరథుని నలుగురు కుమారులుగా జనింప నిశ్చయించెను అని వెనుక చెప్పిన దానిని పట్టి పాయసము కూడా ఏ భార్యకు ఎంత భాగము వచ్చినది, నాల్గవభాగమా, ఎనిమిదవభాగమా— ఇలాంటి ప్రశ్నలు వేసుకొని వేరు వేరు విధాల వ్యాఖ్యానాలు చేసినారు. స్పష్టముగ ఉన్న శ్లోకాల అర్థాలను

మన ఇచ్ఛ వచ్చి నట్లు మార్పుచేయుట నమంజసము కాదు. ఇట్టి వ్యాఖ్యానాలు కేవలము అల్పజ్ఞులకు దిగ్భ్రాంతి కలిగించుటకు మాత్రమే ఉపయోగించును.

"విష్ణో పుత్రత్వమాగచ్ఛ కృత్వాత్మానం చతుర్విధమ్" "తతః పద్మపలాశాక్షః కృత్వాత్మానం చతుర్విధమ్" ఇత్యాదివాక్యాలకు—విష్ణువు నాలుగు ముక్కలుగా అయిపోయి రామాదిరూపాలలో జనించినా డని కాదు. అనంతస్వరూపానికి భాగము లనగా ఏమి? విష్ణువు రామాద్యవతారము లెత్తినపుడు వైకుంఠము ఖాళీగా ఉండెనా? రాముని రూపములో విష్ణువు వచ్చెను కదా; పరశురాముని విషయమేమైనట్లు. అతడు కూడ విష్ణ్వవతారమే కదా? శ్రీకృష్ణుడు విష్ణ్వవతారమే. మరి బలరాముడు కూడ విష్ణ్వవతారమే అని చెప్పుట కూడ ఉన్నది కదా? రూపరహితుడు, దేశకాలాదిపరిచ్ఛేదాతీతుడు అయిన పరమాత్మ నామరూపాలతో దేశకాలపరిచ్ఛిన్నుడుగా కనబడుటయే అవతారము. అనంతస్వరూపునకు, అప్రమేయునకు భాగకల్పనయే అసంగతము. ఆ పారమేశ్వరశక్తియే వివిధరూపములలో అవతరించినది అని చెప్పుట యుక్తము. రాముడు విష్ణువులో అర్ధభాగ మనీ, లక్ష్మణుడు చతుర్థభాగ మనీ, భరతుడు అష్టమభాగ మనీ, శత్రుఘ్నుడు కూడ అష్టమభాగ మనీ ముందుగా నిర్ణయించుకొని, పాయసము కూడ ఆ విధముగా పంచిననే కుదురు నని అనుకొని ఇష్టము వచ్చి నట్లు చేసిన వ్యాఖ్యలు, ఆ వ్యాఖ్యాతలు ఎంతటి ప్రాచీను లైనను, ఆమోదకరములు కావు. లక్ష్మణుడు ఆదిశేషావతారమని కూడ సంప్రదాయ మున్నది కదా. దాని సమన్వయము చేయుట ఎట్లు? శ్రీరాముడు అర్ధావతార మని చెప్పుట "వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే" అని విశ్వసించినవారికి అంతగా అంగీకారయోగ్యము కాదు. వారికి శ్రీరాముడు పూర్ణావతారము. 27, 28, 29

మూ. తాస్త్వేతత్పాయసం ప్రాప్య నరేన్ద్రస్యోత్తమాః స్త్రియః,
సంమానం మేనిరే సర్వాః ప్రహర్షోదితచేతసః. 30

ప్ర. అ. నరేన్ద్రస్య = రాజుయొక్క, ఉత్తమాః=ఉత్తమలైన, తాః=ఆ, స్త్రియః = భార్యలు, సర్వాః = అందరును, ఏతత్ = ఈ, పాయసమ్ = పాయసమును, ప్రాప్య = పొంది, ప్రహర్షోదితచేతసః=పుట్టిన సంతోషము గల మనస్సులు కలవారై, సంమానమ్ = బహుమానమునుగా, మేనిరే = భావించిరి.

తా. ఉత్తమగుణవతు లగు ఆ రాజభార్య లందరును ఆ పాయసము

లభించినందులకు చాల సంతోషించిన మనస్సులతో దానిని గొప్ప బహుమానముగా భావించిరి. 30

మూ. తతస్తు తాః ప్రాశ్య తదుత్తమస్త్రియో
మహీపతేరుత్తమపాయసం పృథక్,
హుతాశనాదిత్యసమానతేజస
శ్చిరేణ గర్భాన్ ప్రతిపేదిరే తదా. 31

ప్ర. అ. తతః = పిమ్మట, మహీపతేః = రాజుయొక్క, తాః ఉత్తమస్త్రియః = ఆ ఉత్తమభార్యలు, తత్ = ఆ, ఉత్తమపాయసమ్ = ఉత్తమ మైన పాయసమును, పృథక్ = వేరుగా, ప్రాశ్య = భుజించి, హుతాశనాదిత్యసమానతేజసః = అగ్నితోడను సూర్యునితోడను సమానమైన తేజస్సుకలవారై, చిరేణ = చాల కాలమునకు, తదా = అప్పుడు, గర్భాన్ = గర్భములను, ప్రతిపేదిరే = పొందిరి.

తా. ఉత్తమగుణవతు లగు ఆ దశరథుని భార్యలు ఆ ఉత్తమ మైన పాయసమును భుజించి, అగ్న్యాదిత్యుల వంటి తేజస్సుతో ఒప్పుచు, చాలకాలము తరువాత, అప్పుడు గర్భములను ధరించిరి.

వి. 'చిరేణ' అనగా ఎప్పుడో పుత్రవతులు కావలసిన వారు. ఇంతకాలమునకు ఇపుడు గర్భవతు లైరి అని భావము. 31

మూ. తతస్తు రాజా ప్రసమీక్ష్య తాః స్త్రియః
ప్రరూఢగర్భాః ప్రతిలబ్ధమానసః,
బభూవ హృష్టస్త్రిదివే యథా హరిః
సురేన్ద్రసిద్ధర్షి గణాభిపూజితః. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షోడశః సర్గః.

ప్ర. అ. తతః = పిమ్మట, రాజా = రాజు, ప్రరూఢగర్భాః = ఆవిర్భవించిన గర్భములు గల, తాః స్త్రియః = ఆ భార్యలను, ప్రసమీక్ష్య = చూచి,

ప్రతిలబ్ధమానసః = మరల పొందబడిన మనస్సు కలవాడై, త్రిదివే = స్వర్గమునందు, సురేన్ద్రసిద్ధర్షిగణాభిపూజితః = దేవేంద్రునిచేతను, సిద్ధులచేతను, ఋషిగణములచేతను పూజింపబడిన, హరిః యథా = విష్ణువు వలె, హృష్టః = సంతసించినవాడు, బభూవ = ఆయెను.

తా. దశరథుడు గర్భవతులైన భార్యలను చూచి స్వస్థచిత్తుడై, స్వర్గమునందు దేవేంద్రసిద్ధఋష్యాదులచే పూజింపబడిన విష్ణువు వలె సంతసించెను.

వి. కొందరు వ్యాఖ్యాతలు 'హరిః' అనగా ఇంద్రుడనియు, "సురేన్ద్ర" అనగా దేవతాశ్రేష్ఠులనియు అర్థము వ్రాసిరి. విష్ణువు వైకుంఠములో నుండును గాని స్వర్గములో ఎట్లుండు నని వారి ఆశయము. వాల్మీకి ఎచ్చటను వైకుంఠమును పేర్కొనలేదు. హరిబ్రహ్మాదులందరును స్వర్గనివాసులే. 32

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలోని పదియారవ సర్గ సమాప్తము.

అథ సప్తదశః సర్గః

మూ. పుత్రత్వం తు గతే విష్ణౌ రాజ్ఞస్తస్య మహాత్మనః,
ఉవాచ దేవతాః సర్వాః స్వయమ్భూర్భగవానిదమ్. 1

ప్ర. అ. విష్ణౌ = విష్ణువు, మహాత్మనః = మహాత్ముడైన, తస్య రాజ్ఞః = ఆ రాజుయొక్క (నకు), పుత్రత్వమ్=పుత్రత్వమును, గతే సతి=పొందినవాడగు చుండగా, భగవాన్=భగవంతుడైన, స్వయంభూః = బ్రహ్మదేవుడు, సర్వాః = సమస్త మైన, దేవతాః = దేవతలను గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, ఉవాచ= పలికెను.

తా. విష్ణువు దశరథమహారాజునకు పుత్రుడగుటకు నిర్ణయించుకొనిన పిమ్మట బ్రహ్మదేవుడు దేవత లందరితో ఇట్లు చెప్పెను. 1

మూ. సత్యసంధస్య వీరస్య సర్వేషాం నో హితైషిణః,
విష్ణోః సహాయాన్ బలినః సృజధ్వం కామరూపిణః. 2

ప్ర. అ. సత్యసంధస్య = సత్య మైన ప్రతిజ్ఞకలవాడును, వీరస్య = వీరుడును, నః సర్వేషామ్ = మన అందరియొక్క, హితైషిణః = హితమును కోరువాడును అగు, విష్ణోః=విష్ణువునకు, సహాయాన్=సహాయభూతు లైన, బలినః= బలవంతు లైన, కామరూపిణః = కోరిన రూపములు ధరించ గలిగిన పుత్రులను, సృజధ్వమ్ = సృష్టించుడు.

తా. సత్యసంధుడును, మహావీరుడును, మన అందరి హితమును కోరువాడును అగు విష్ణువునకు సహాయులుగ ఉండుటకై, బలవంతులును, కామరూపులును అగు పుత్రులను సృజింపుడు. 2

మూ. మాయావిదశ్చ శూరాంశ్చ వాయువేగసమాన్ జవే,
నయజ్ఞాన్ బుద్ధిసంపన్నాన్ విష్ణుతుల్యపరాక్రమాన్, 3

అసంహార్యానుపాయజ్ఞాన్ దివ్యసంహననాన్వితాన్,
సర్వాస్త్రగుణసంపన్నాన్ అమృతప్రాశనానివ. 4

అప్సరస్సు చ ముఖ్యాసు గన్ధర్వాణాం తనూషు చ,
సృజధ్వం హరిరూపేణ పుత్రాంస్తుల్యపరాక్రమాన్. ౫

ప్ర. అ. మాయావిదః చ = మాయల నెరిగిన వారును, శూరాన్ చ = శూరులును, జవే = వేగమునందు, వాయువేగసమాన్=వాయువేగముతో సమానులును, నయజ్ఞాన్ = నీతి తెలిసినవారును, బుద్ధిసంపన్నాన్ = బుద్ధితో కూడిన వారును, విష్ణుతుల్యపరాక్రమాన్ = విష్ణువుతో సమానమైన పరాక్రమము కల వారును, అసంహార్యాన్ = సంహరింప శక్యము కానివారును, ఉపాయజ్ఞాన్ = ఉపాయము తెలిసినవారును, దివ్యసంహననాన్వితాన్ = దివ్యమైన శరీరములతో కూడిన వారును, సర్వాస్త్రగుణసంపన్నాన్=సమస్తమైన అస్త్రగుణములతో కూడిన వారును, అమృతప్రాశనానివ=అమృతమును భుజించిన వారితో సమానులును, తుల్యపరాక్రమాన్ = మీతో సమాన మైన పరాక్రమము కలవారును అగు, పుత్రాన్ = పుత్రులను, ముఖ్యాసు = ముఖ్యులైన, అప్సరస్సు చ = అప్సరసల యందును, గన్ధర్వీణామ్ = గంధర్వస్త్రీల, తనూషు చ = శరీరములందును, హరి రూపేణ=వానరరూపమున, సృజధ్వమ్ = సృష్టింపుడు.

తా. అన్ని మాయలు తెలిసినవారు, శూరులు, వాయువేగముతో సమానమైన వేగము కలవారు, నీతిజ్ఞులు, బుద్ధిసంపన్నులు, విష్ణువుతో సమాన మైన పరాక్రమము కలవారు, చంప శక్యము కానివారు, వివిధోపాయజ్ఞులు, దివ్య శరీరములు కలవారు, సర్వాస్త్రముల శక్తివంటి శక్తి కలవారు, అమృతమును భుజించినవారు వలె క్షుత్పిపాసాదులు లేనివారు, మీతో సమాన మైన పరాక్రమము కలవారు అగు పుత్రులను, ఉత్తమాప్సరస్త్రీలయందును, గంధర్వస్త్రీలయందును, వానరరూపమున సృజింపుడు.

వి. పార్వతి శపించుటచే దేవతలు తమ భార్యలయందు సంతానమును పొందజాలరు. అందుచే "అప్సరసలందును, గంధర్వస్త్రీలయందును" అని చెప్ప బడినది. "నీకు వానరులవలన భయము కలుగు గాక" అని నందికేశ్వరుడు రావణుని శపించెను. అందుచే "వానరరూపులైన పుత్రులను కనుడు" అని చెప్ప బడినది (గోవిందరాజ మహేశ్వరతీర్థులు). 3-5

మూ. పూర్వమేవ మయా సృష్టో జామ్బవానృక్షపుఙ్గవః,
జృమ్భమాణస్య సహసా మమ వక్త్రాదజాయత. 6

ప్ర. అ. జామ్బవాన్=జాంబవంతు డనెడు, ఋక్షపుఙ్గవః=ఋక్షశ్రేష్ఠుడు, పూర్వమేవ = పూర్వమునందే, మయా = నాచేత, సృష్టః = సృజింపబడినాడు. జృమ్భమాణస్య = ఆవులించుచున్న, మమ = నాయొక్క, వక్త్రాత్=ముఖము నుండి, సహసా = హటాత్తుగా, అజాయత = పుట్టెను.

తా. ఎలుగుబంటులలో శ్రేష్ఠుడైన జాంబవంతుని నేను చాలకాలము క్రితమే సృజించి ఉన్నాను. నేను ఆవులించినపుడు అతడు నా ముఖమునుండి హటాత్తుగా ఆవిర్భవించినాడు. 6

మూ. తే తథోక్తా భగవతా తత్ప్రతిశ్రుత్య శాసనమ్,
జనయామాసురేవం తే పుత్రాన్వానరరూపిణః. 7

ప్ర. అ. భగవతా = బ్రహ్మదేవునిచేత, తథా = ఆవిధముగా, ఉక్తాః = పలకబడిన, తే = వారు, తత్ = ఆ, శాసనమ్ = ఆజ్ఞను, ప్రతిశ్రుత్య=అంగీకరించి, ఏవమ్=ఈ విధముగా, వానరరూపిణః=వానరరూపములుగల, పుత్రాన్= పుత్రులను, జనయామాసుః = పుట్టించిరి.

తా. బ్రహ్మదేవుని ఆజ్ఞప్రకారము ఆ దేవతలు వానరరూపములలో ఉన్న పుత్రులను సృజించిరి. 7

మూ. ఋషయశ్చ మహాత్మానః సిద్ధవిద్యాధరోరగాః.
చారణాశ్చ సుతాన్వీరాన్ ససృజుర్వనచారిణః. 8

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, ఋషయశ్చ = ఋషీశ్వరులును, సిద్ధవిద్యాధరోరగాః = సిద్ధ-విద్యాధర-ఉరగులును, చారణాః చ = చారణులును, వీరాన్ = వీరులైన, వనచారిణః = వానరరూపులగు, సుతాన్ = కుమారులను, ససృజుః = సృజించిరి.

తా. మహావీర్యవంతు లగు ఋషులు, సిద్ధులు, విద్యాధరులు, ఉరగులు, చారణులు కూడ వీరులైన కుమారులను వానరరూపములలో సృజించిరి. 8

మూ. వానరేన్ద్రం మహేన్ద్రాభమిన్ద్రో వాలినమూర్జితమ్,
సుగ్రీవం జనయామాస తపనస్తపతాం వరః. 9

ప్ర. అ. ఇన్ద్రః = ఇంద్రుడు, మహేన్ద్రాభమ్ = మహేంద్రపర్వతముతో సమానుడును, ఊర్జితమ్ = దృఢ మైన దేహము కలవాడును అగు, వాలినమ్ = వాలి యను పేరు గల, వానరేన్ద్రమ్ = వానరరాజును, జనయామాస = పుట్టించెను. తపతామ్ = వేడిమిని కలిగించువారిలో, వరః = శ్రేష్ఠుడైన, తపనః = సూర్యుడు, సుగ్రీవమ్ = సుగ్రీవుని, (పుట్టించెను).

తా. దేవేంద్రుడు మహేంద్రపర్వతము వంటి శరీరము కలవాడును, మహాబలవంతుడును అగు వాలి యనెడు వానరేంద్రుని పుట్టించెను. తేజశ్శాలులలో గొప్పవాడైన సూర్యుడు సుగ్రీవుని పుట్టించెను. 9

మూ. బృహస్పతిస్త్వజనయత్తారం నామ మహాహరిమ్,
సర్వవానరముఖ్యానాం బుద్ధిమన్తమనుత్తమమ్. 10

ప్ర. అ. బృహస్పతిస్తు = బృహస్పతి యైతే, సర్వవానరముఖ్యానామ్ = సమస్త మైన వానరశ్రేష్ఠులలో, అనుత్తమమ్ = తనను మించినవారు లేని, బుద్ధిమన్తమ్ = బుద్ధిమంతుడైన, తారం నామ = తారుడను పేరు గల, మహాహరిమ్ = గొప్ప వానరుని, అజనయత్ = పుట్టించెను.

తా. బృహస్పతి, వానరశ్రేష్ఠు లందరిలోను మహాబుద్ధిమంతుడైన తారుడనే గొప్ప వానరుని సృజించెను. 10

మూ. ధనదస్య సుతః శ్రీమాన్ వానరో గంధమాదనః,
విశ్వకర్మా త్వజనయన్నలం నామ మహాహరిమ్. 11

ప్ర. అ. శ్రీమాన్ = కాంతి గల, గన్ధమాదనః = గంధమాదను డనెడు, వానరః = వానరుడు, ధనదస్య = కుబేరునియొక్క, సుతః = కుమారుడు. విశ్వకర్మా తు = విశ్వకర్మయైతే, నలం నామ = నలుడనెడు, మహాహరిమ్ = గొప్ప వానరుని, అజనయత్ = పుట్టించెను.

తా. కుబేరుడు శ్రీమంతు డగు గంధమాదను డనెడు కుమారుని సృజించెను. విశ్వకర్మ నలుడనెడు పేరు గల గొప్ప వానరుని పుట్టించెను. 11

మూ. పావకస్య సుతః శ్రీమాన్ నీలోఽగ్నిసదృశప్రభః,
తేజసా యశసా వీర్యాదత్యరిచ్యత వానరాన్. 12

ప్ర. అ. పావకస్య=అగ్నియొక్క, సుతః = కుమారుడును, శ్రీమాన్= శ్రీమంతుడును, అగ్నిసదృశప్రభః = అగ్నితో సమాన మైన కాంతి కలవాడును అగు, నీలః = నీలుడు, తేజసా=తేజస్సుచేతను, యశసా=కీర్తిచేతను, వీర్యాత్= పరాక్రమమువలనను, వానరాన్=ఇతరవానరులను, అత్యరిచ్యత = అతిశయించి ఉండెను.

తా. శ్రీమంతుడును, అగ్నితో సమాన మైన తేజస్సు కలవాడును, అగ్ని కుమారుడును అగు నీలుడు తేజఃకీర్తివీర్యములచే ఇతరవానరుల నందరిని మించి ఉండెను. 12

మూ. రూపద్రవిణసంపన్నావశ్వినౌ రూపసమ్మతౌ,
మైన్దం చ ద్వివిదం చైవ జనయామాసతుః స్వయమ్. 13

ప్ర. అ. రూపద్రవిణసంపన్నౌ=రూప మనెడు ధనముచే సమృద్ధు లైన, అశ్వినౌ = అశ్వినీదేవతలు, స్వయమ్ = తాము, రూపసంమతౌ = రూపముచే గౌరవింపబడిన, మైన్దం చ = మైందుని, ద్వివిదం చైవ = ద్వివిదుని, జనయామాసతుః = పుట్టించిరి.

తా. సౌందర్య మనెడు ధనము గల అశ్వినీదేవతలు, ప్రశస్త సౌందర్యవంతు లగు మైందుడు, ద్వివిదుడు అను వానరులను పుట్టించిరి. 13

మూ. వరుణో జనయామాస సుషేణం వానరర్షభమ్,
శరభం జనయామాస పర్జన్యస్తు మహాబలమ్. 14

ప్ర. అ. వరుణః = వరుణుడు, సుషేణమ్ = సుషేణు డనెడు, వానరర్షభమ్ = వానరశ్రేష్ఠుని, జనయామాస = పుట్టించెను, పర్జన్యస్తు = పర్జన్యుడైతే, మహాబలమ్=గొప్ప బలము గల, శరభమ్=శరభుని, జనయామాస = పుట్టించెను.

తా. వరుణుడు సుషేణు డనెడు వానరశ్రేష్ఠుని, పర్జన్యుడు మహాబలశాలి యగు శరభుని పుట్టించిరి. 14

మూ. మారుతస్యాత్మజః శ్రీమాన్ హనుమాన్నామ వీర్యవాన్,
వజ్రసంహననోపేతో వైనతేయసమో జవే. 15

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడును, వీర్యవాన్ = పరాక్రమశాలియు, వజ్రసంహననోపేతః=వజ్రమువంటి దేహము కలవాడును, జవే=వేగమునందు, వైనతేయసమః = గరుత్మంతునితో సమానుడును అగు, హనుమాన్ నామ = హనుమంతు డను పేరు గల వానరుడు, మారుతస్య = వాయుదేవునియొక్క, ఆత్మజః = కుమారుడు.

తా. వాయుదేవునకు శ్రీమంతుడును, వీర్యవంతుడును, వజ్రము వంటి దేహము కలవాడును, వేగమునందు గరుత్మంతునితో సమానుడును అగు హనుమంతుడు కుమారుడుగ జనించెను. 15

మూ. తే సృష్టా బహుసాహస్రా దశగ్రీవవధే రతాః,
అప్రమేయబలా వీరా విక్రాన్తాః కామరూపిణః. 16

ప్ర. అ. దశగ్రీవవధే = రావణుని వధించుటయందు, రతాః = ఆసక్తి కలవారును, అప్రమేయబలాః = కొలవ శక్యము కాని బలము కలవారును, విక్రాన్తాః = పరాక్రమవంతులును, కామరూపిణః = స్వేచ్ఛానుసారముగా వివిధ రూపములను ధరించకలవారును, బహుసాహస్రాః=అనేకవేలసంఖ్య కలవారును అగు, తే వీరాః = ఆ వీరులు, సృష్టాః = సృజింపబడినారు.

తా. అమేయ మైన బలపరాక్రమములు గలవారును, కామరూపులును అగు వేలకొలది వీరులు దశగ్రీవుని వధకొరకై సృష్టింపబడిరి. 16

మూ. మేరుమన్దరసంకాశా వపుష్మన్తో మహాబలాః,
ఋక్షవానరగోపుచ్ఛాః క్షిప్రమేవాభిజజ్ఞిరే. 17

ప్ర. అ. మేరుమన్దరసంకాశాః = మేరుమందరపర్వతములతో సమానులును, వపుష్మన్తః = మంచిదేహములు కలవారును, మహాబలాః=గొప్ప బలము కలవారును అగు, ఋక్షవానరగోపుచ్ఛాః = ఎలుగుబంటులు, వానరులు, కొండముచ్చులు, క్షిప్రమేవ = శీఘ్రముగనే, అభిజజ్ఞిరే = పుట్టిరి.

తా. మేరుమందరపర్వతముల వలె మహోన్నతము లైన దేహములుగల, మహాబలవంతు లగు ఋక్ష—వానర—గోపుచ్ఛులు శీఘ్రముగనే జనించిరి. 17

మూ. యస్య దేవస్య యద్రూపం వేషో యశ్చ పరాక్రమః,
అజాయత సమస్తేన తస్య తస్య సుతః పృథక్. 18

ప్ర. అ. యస్య = ఏ, దేవస్య = దేవునకు, యత్ = ఏ, రూపమ్ = రూపమో, వేషః = ఏ వేషమో, పరాక్రమశ్చ = పరాక్రమము కూడ, యః = ఏదియో, తస్య తస్య = ఆ యా దేవునియొక్క, సుతః = కుమారుడు, పృథక్ = వేరుగా, తేన = ఆ దేవునితో, సమః = సమానుడై, అజాయత = పుట్టెను.

తా. ఏ దేవునకు ఏ రూపము, ఏ వేషము, ఏ పరాక్రమము ఉండెనో ఆ దేవుని కుమారుడు కూడ అదే రూపము, అదే వేషము, అదే పరాక్రమము కలిగి ఉండెను. 18

మూ. గోలాఙ్గూలీషు చోత్పన్నాః కేచిత్సంమతవిక్రమాః,
ఋక్షీషు చ తథా జాతా వానరాః కిన్నరీషు చ. 19

ప్ర. అ. సంమతవిక్రమాః = బహుమానింపబడిన పరాక్రమము గల, కేచిత్ = కొందరు, వానరాః = వానరులు, గోలాఙ్గూలీషు = ఆడ కొండముచ్చుల యందు, ఉత్పన్నాః = పుట్టినారు. తథా = అట్లే, (మరికొందరు వానరులు), ఋక్షీషు = ఆడ ఎలుగుబంటులయందును, కిన్నరీషు చ = కిన్నరస్త్రీలయందును, జాతాః = పుట్టినారు.

తా. కొనియాడదగిన పరాక్రమము గల కొందరు గోలాంగూలస్త్రీల యందును, కొందరు ఋక్షస్త్రీలయందును, కిన్నరస్త్రీలయందును జనించిరి. 19

మూ. దేవా మహర్షిగన్ధర్వాస్తార్క్ష్యా యక్షా యశస్వినః,
నాగాః కింపురుషాశ్చైవ సిద్ధవిద్యాధరోరగాః. 20

బహవో జనయామాసుర్హృష్టాస్తత్ర సహస్రశః,
వానరాన్ సుమహాకాయాన్ సర్వాన్వై వనచారిణః. 21

అప్సరస్సు చ ముఖ్యాసు తథా విద్యాధరీషు చ,
నాగకన్యాసు చ తథా గన్ధర్వీణాం తనూషు చ. 22

ప్ర. అ. దేవాః = దేవతలు, మహర్షిగన్ధర్వాః = మహర్షులు గంధర్వులు,

తార్క్ష్యాః=గరుడులు, యక్షాః = యక్షులు, యశస్వినః = కీర్తి గల, నాగాః = నాగులు, కింపురుషాశ్చైవ = కింపురుషులును, సిద్ధవిద్యాధరోరగాః = సిద్ధులు, విద్యాధరులు ఉరగులు, బహవః = అనేకులు, హృష్టాః = సంతసించినవారై, తత్ర = ఆ సమయమున, ముఖ్యాసు = ప్రధానలైన, అప్సరస్సు = అప్సరసల యందును, తథా = మరియు, విద్యాధరీషు చ = విద్యాధరస్త్రీలయందును, నాగ కన్యాసు = నాగకన్యలయందు, తథా = మరియు, గన్ధర్వీనామ్ = గంధర్వస్త్రీల, తనూషు చ = శరీరములయందును, సుమహాకాయాన్ = గొప్పదేహములు కల వారును, వనచారిణః = వనములయందు సంచరించువారును అగు, సర్వాన్ = సమస్తమైన, వానరాన్ = వానదులను, సహస్రశః = వేలకొలది, జనయామాసుః= పుట్టించిరి.

తా. ఆ సమయమున దేవ—మహర్షి—గంధర్వ—తార్క్ష్య—యక్ష—నాగ—కిం పురుష—సిద్ధ,—విద్యాధర—ఉరగులు అనేకులు చాల సంతసించినవారై ప్రధాన లైన అప్సరసలందును, విద్యాధర—నాగ—గంధర్వస్త్రీలయందును, గొప్ప దేహములు కలవారును, వనములలో సంచరించువారును అగు వానరులను వేలకొలది సృజించిరి. 20, 21, 22

మూ. కామరూపబలోపేతా యథాకామం విచారిణః,
సింహశార్దూలసదృశా దర్పేణ చ బలేన చ. 23

ప్ర. అ. (ఆ వానరులు), కామరూపబలోపేతాః = స్వేచ్ఛానుసారము లభించు రూపము కలవారు, బలవంతులు. యథాకామమ్=స్వేచ్ఛగా, విచారిణః= సంచరించువారు. దర్పేణ చ = దర్పముచేతను, బలేన చ=బలముచేతను, సింహ శార్దూలసదృశాః = సింహములతోడను, పులులతోడను సమానులు.

తా. ఆ వానరు లందరును ఇచ్ఛవచ్చిన రూపము ధరించగలరు. బలా ఢ్యులు, స్వేచ్ఛగా సంచరించువారు, దర్పబలములచే సింహశార్దూలములతో సమానులు. 23

మూ. శిలాప్రహరణాః సర్వే సర్వే పాదపయోధినః,
నఖదంష్ట్రాయుధాః సర్వే సర్వే సర్వాస్త్రకోవిదాః. 24

ప్ర. అ. సర్వే=అందరును, శిలాప్రహరణాః = శిలలే ఆయుధములుగా కలవారు. సర్వే = అందరును, పాదపయోధినః = వృక్షములతో యుద్ధము చేయువారు. సర్వే = అందరును, నఖదంష్ట్రాయుధాః=గోళ్ళు, కోరలు ఆయుధములుగా కలవారు. సర్వే=అందరును, సర్వాస్త్రకోవిదాః = అన్ని అస్త్రములను గూర్చి తెలిసినవారు.

తా. ఆ వానరులందరును యుద్ధములలో శిలలు, వృక్షములు, గోళ్ళు, కోరలు—వీటిని ఆయుధములుగా ఉపయోగించెడివారు. వారికి అన్ని అస్త్రములను గూర్చియు తెలియును. 24

మూ. విచాలయేయుః శైలేన్ద్రాన్ భేదయేయుః స్థిరాన్ ద్రుమాన్,
క్షోభయేయుశ్చ వేగేన సముద్రం సరితాం పతిమ్. 25

ప్ర. అ. శైలేన్ద్రాన్=పర్వతశ్రేష్ఠములను, విచాలయేయుః=కదల్చివేయగలరు. స్థిరాన్=స్థిరముగా నున్న, ద్రుమాన్ = వృక్షములను, భేదయేయుః = బ్రద్దలుకొట్టగలరు. వేగేన=వేగముచేత, సరితాం పతిమ్ = నదుల పతి యైన, సముద్రమ్=సముద్రమును, క్షోభయేయుః=క్షోభింపచేయగలరు.

తా. ఆ వానరు లందరును మహాపర్వతములను ఊపివేయగలరు. స్థిరములైన మహావృక్షములను పెకిలించగలరు. వేగముచే, సకలనదులకును గమ్యస్థానమైన సముద్రమును కూడ కలతపెట్టగలరు. 25

మూ. దారయేయుః క్షితిం పద్భ్యామాప్లవేయుర్మహార్ణవమ్,
నభస్థ్సలం విశేయుశ్చ గృహ్ణీయురపి తోయదాన్. 26

ప్ర. అ. పద్భ్యామ్=పాదములచేత, క్షితిమ్=భూమిని, దారయేయుః= చీల్చివేయగలరు. మహార్ణవమ్ = మహాసముద్రమును, ఆప్లవేయుః = దుమికి దాటగలరు. నభస్థ్సలమ్=ఆకాశమును, విశేయుశ్చ = ప్రవేశింపగలరు. తోయదానపి= మేఘములను కూడ, గృహ్ణీయుః=గ్రహింపగలరు.

తా. వారు పాదములచేత భూమిని చీల్చివేయగలరు. సముద్రమును దాటగలరు. ఆకాశములో ప్రవేశించి మేఘాలను కూడ గ్రహింపగలరు. 26

మూ. గృహ్ణీయు రపి మాతఙ్గాన్మత్తాన్ ప్రవ్రజతో వనే,
నర్దమానాశ్చ నాదేన పాతయేయుర్విహఙ్గమాన్. 27

ప్ర. అ. వనే = అరణ్యమునందు, ప్రవ్రజతః = సంచరించుచున్న, మత్తాన్ = మదించిన, మాతఙ్గాన్ అపి = ఏనుగులను గూడ, గృహ్ణీయుః = పట్టుకొనగలరు. నర్దమానాః = ధ్వనిచేయుచున్నవారై, నాదేన=ధ్వనిచేత, విహఙ్గమాన్ = పక్షులను, పాతయేయుః = పడిపోవునట్లు చేయగలరు.

తా. అరణ్యములలో సంచరించు మతగజములను కూడ పటుకొనగలరు. వానరుల అరపులు విని పక్షులు క్రిందకు పడిపోవును కూడ. 27

మూ. ఈదృశానాం ప్రసూతాని హరీణాం కామరూపిణామ్,
శతం శతసహస్రాణి యూథపానాం మహాత్మనామ్. 28

ప్ర. అ. కామరూపిణామ్ = ఇష్ట మైన రూపములను ధరింప గలిగిన వారును, యూథపానామ్ = సేనానాయకులును, మహాత్మనామ్ = అధికధైర్యవంతులును, అగు, ఈదృశానామ్ = ఇట్టి, హరీణామ్ = వానరులయొక్క, శతమ్ = నూరు, శతసహస్రాణి = లక్షలు, ప్రసూతాని = పుట్టింపబడినవి.

తా. కామరూపులును, సేనానాయకులును, మహాత్ములును, అగు ఇట్టి వానరులు నూరులక్షలు (కోటిమంది) సృజింపబడిరి. 28

మూ. తే ప్రధానేషు యూథేషు హరీణాం హరియూథపాః,
బభూవుర్యూథపశ్రేష్ఠా వీరాంశ్చాజనయన్ హరీన్. 29

ప్ర. అ. తే=ఆ, హరియూథపాః=వానరసేనానాయకులు, హరీణామ్= వానరులయొక్క, ప్రధానేషు = ప్రధానములైన, యూథేషు = సేనలయందు, యూథపశ్రేష్ఠాః=సేనానాయకులలో ముఖ్యులుగా, బభూవుః=అయిరి. వీరాన్= వీరులైన, హరీన్ = వానరులను, అజనయన్ చ = పుట్టించిరి.

తా. ఆ వానరసేనానాయకులు వానరుల ముఖ్యసేనలకు నాయకులై, వీరులగు వానరులను పుట్టించిరి. 29

మూ. అన్యే ఋక్షవతః ప్రస్థానవతస్థుస్సహస్రశః,
అన్యే నానావిధాన్ శైలాన్ భేజిరే కాననాని చ. 30

ప్ర. అ. అన్యే = కొందరు వానరులు, సహస్రశః = వేలకొలది, ఋక్ష వతః = ఋక్షవత్పర్వతముయొక్క, ప్రస్థాన్ = చరియలను, అవతస్థుః = ఆశ్ర యించి యుండిరి. అన్యే = మరి కొందరు, నానావిధాన్ = అనేకవిధములైన, శైలాన్ = పర్వతములను, కాననాని చ = అడవులను, భేజిరే = పొందిరి.

తా. వేలకొలది వానరులు కొందరు ఋక్షవత్పర్వతము పైన నివసించిరి. మరి కొందరు అనేక పర్వతములపైనను, అడవులందును నివసించిరి. 30

మూ. సూర్యపుత్రం చ సుగ్రీవం శక్రపుత్రం చ వాలినమ్,
భ్రాతరావుపతస్థుస్తే సర్వ ఏవ హరీశ్వరాః, 31
నలం నీలం హనూమన్తమన్యాంశ్చ హరియూథపాన్.

ప్ర. అ. తే = ఆ, హరీశ్వరాః = వానరులు, సర్వే = అందరును, భ్రాతరౌ = సోదరులైన, సూర్యపుత్రమ్ = సూర్యుని కుమారుడైన, సుగ్రీవమ్ = సుగ్రీవుని, శక్రపుత్రమ్=ఇంద్రుని పుత్రుడైన, వాలినం చ=వాలిని, నలమ్= నలుని, నీలమ్ = నీలుని, హనూమన్తమ్ = హనుమంతుని, అన్యాన్=ఇతరులైన, హరియూథపాంశ్చ = వానర సేనానాయకులను, ఉపతస్థుః = సేవించిరి.

తా. ఆ వానరశ్రేష్ఠులందరు, ఇంద్రసూర్యుల కుమారులును సోదరులును అగు వాలిసుగ్రీవులను, నలుని, నీలుని, హనుమంతుని, తదితరవానర సేనా నాయకులను సేవించుచుండిరి. 31

మూ. తే తార్క్ష్యబలసంపన్నాః సర్వే యుద్ధవిశారదాః. 32
విచరన్తోఽర్దయన్ దర్పాత్సింహవ్యాఘ్రమహోరగాన్,

ప్ర. అ. తార్క్ష్యబలసంపన్నాః=గరుత్మంతుని వంటి బలము కలవారును, యుద్ధవిశారదాః = యుద్ధమునందు సమర్థులును అగు, తే సర్వే = వారందరును, విచరన్తః = సంచరించుచు, దర్పాత్ = గర్వము వలన, సింహవ్యాఘ్రమహోర గాన్=సింహములను, వ్యాఘ్రములను, మహాసర్పములను, అర్దయన్=పీడించిరి.

తా. గరుత్మంతుని వంటి బలము కలవారును, యుద్ధసమర్థులును అగు

ఆ వానరు లందరును సంచరించుచు, దర్పముచేత, సింహవ్యాఘ్రమహోరగము లను పీడించిరి. అనగా వాటికి కూడ భయము కలుగు నట్లు సంచరించిరి. 32

మూ. తాంశ్చ సర్వాన్ మహాబాహుర్వాలీ విపులవిక్రమః,
జుగోప భుజవీర్యేణ ఋక్షగోపుచ్ఛవానరాన్. 33

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడును, విపులవిక్రమః= గొప్ప పరాక్రమము కలవాడును అయిన, వాలీ=వాలి, తాన్=ఆ, సర్వాన్= సమస్త మైన, ఋక్షగోపుచ్ఛవానరాన్=ఋక్ష-గోపుచ్ఛ (కొండముచ్చు) వానరు లను, భుజవీర్యేణ=భుజపరాక్రమముచేత, జుగోప=రక్షించెను.

తా. గొప్ప బాహువులుగల, అధికపరాక్రమవంతు డైన వాలి తన భుజ బలముచేత ఆ ఋక్షగోపుచ్ఛవానరులను రక్షించెను. 33

మూ. తైరియం పృథివీ శూరైః సపర్వతవనార్ణవా,
కీర్ణా వివిధసంస్థానైర్నానావ్యఞ్జనలక్షణైః. 34

ప్ర. అ. శూరైః=శూరులును, వివిధసంస్థానైః=అనేకవిధము లైన శరీర ములు కలవారును, నానావ్యఞ్జనలక్షణైః=నానావిధములైన దేహములకు సంబం ధించిన గుర్తులును, జాతికి సంబంధించిన గుర్తులును కలవారును అగు, తైః= వారిచేత, సపర్వతవనార్ణవా=పర్వత-వన-సముద్రములతో కూడిన, ఇయమ్= ఈ, పృథివీ=భూమి, కీర్ణా=వ్యాప్త మైనది.

తా. అనేకవిధము లైన శారీరనిర్మాణములును, అనేక విధము లైన దేహ, జాత్యాదిచిహ్నములును గల ఆ శూరు లైన వానరులు, పర్వత-వన-సముద్ర సహిత మగు ఈ భూమిని ఆవరించి ఉండిరి. 34

మూ. తైర్మేఘబృన్దాచలకూటకల్పై
ర్మహాబలైర్వానరయూథపాలైః,
బభూవ భూర్భీమశరీరరూపైః
స్సమావృతా రామసహాయహేతోః. 35

ఇత్యార్షే శ్రీమద్రామాయణే, ఆదికావ్యే
సప్తదశః సర్గః.

ప్ర. అ. మేఘబృన్దాచలకూటకల్పైః = మేఘసముదాయములతోడను పర్వతశిఖరములతోడను సమానులైన, మహాబలైః=గొప్ప బలము గల, భీమ శరీరరూపైః=భయంకరమైన శరీరములు ఆకారములు గల, తైః=ఆ, వానర యూథపాలైః=వానర సేనానాయకులచేత, భూః=భూమి, రామసహాయ హేతోః= రామునకు సహాయము చేయుటకై, సమావృతా=ఆవరింపబడినది, బభూవ= ఆయెను.

తా. మేఘముల గుంపులతోడను పర్వతశిఖరములతోడను సమానులును, మహాబలవంతులును, భయంకరములైన శరీరములు కలవారును, రామునికి సాహాయ్యము చేయుటకై ఆవిర్భవించినవారును అగు ఆ వానర సేనానాయకులచే ఈ భూమి యంతయు ఆవరింపబడి యుండెను. 35

"బాలానన్దిని" యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
బాలకాండలో సప్తదశసర్గ సమాప్తము.

అథ అష్టాదశః సర్గః

మూ. నివృత్తే తు క్రతౌ తస్మిన్ హయమేధే మహాత్మనః,
ప్రతిగృహ్యా సురా భాగాన్ ప్రతిజగ్మ్ముర్యథాగతమ్. 1

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన దశరథునియొక్క, తస్మిన్ = ఆ, హయమేధే = అశ్వమేధ మనెడు, క్రతౌ=యాగము, నివృత్తే సతి = పూర్తి కాగా, సురాః = దేవతలు, భాగాన్ = భాగములను, ప్రతిగృహ్యా = స్వీకరించి, యథాగతమ్ = వచ్చినట్లుగానే, ప్రతిజగ్మ్ముః = తిరిగి వెళ్లిరి.

తా. మహాత్ము డైన దశరథుడు ప్రారంభించిన అశ్వమేధపుత్రకామేష్టులు పూర్తి యైనవి. దేవతలు హవిర్భాగములను తీసికొని తమ తమ స్థానములకు వెడలిపోయిరి. 1

మూ. సమాప్తదీక్షానియమః పత్నీగణసమన్వితః,
ప్రవివేశ పురీం రాజా సభృత్యబలవాహనః. 2

ప్ర. అ. పత్నీగణసమన్వితః = భార్యల సముదాయముతో కూడిన, రాజా=రాజు, సమాప్తదీక్షానియమః=సమాప్త మైన దీక్షానియమములు కలవాడై, సభృత్యబలవాహనః = భృత్యులతో, సేనలతో, వాహనములతో కూడినవాడై, పురీమ్ = పట్టణమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. పత్నీసమేతు డైన దశరథుడు యాగదీక్షానియమములను పూర్తి చేసికొని, భృత్య-బల-వాహనాదులతో అయోధ్యానగరమును ప్రవేశించెను. 2

మూ. యథార్హం పూజితాస్తేన రాజ్ఞా వై పృథివీశ్వరాః,
ముదితాః ప్రయయుర్దేశాన్ ప్రణమ్య మునిపుఙ్గవమ్. 3

ప్ర. అ. పృథివీశ్వరాః=రాజులు, తేన రాజ్ఞా=ఆ రాజుచేత, యథార్హమ్= తగు విధముగా, పూజితాః=పూజింపబడినవారై, ముదితాః = సంతోషించినవారై, ముని పుఙ్గవమ్=మునిశ్రేష్ఠుని, ప్రణమ్య=నమస్కరించి, దేశాన్=తమదేశము లను గూర్చి, ప్రయయుః = వెళ్లిరి.

తా. యాగమునకు ఆహూతులై వచ్చిన రాజు లందరును, తగు విధముగ దశరథునిచేత పూజింపబడినవారై, వసిష్ఠునకు నమస్కారము చేసి, సంతోషముతో స్వదేశములకు వెళ్లిరి. 3

మూ. శ్రీమతాం గచ్ఛతాం తేషాం స్వపురాణి పురాత్తతః,
బలాని రాజ్ఞాం శుభ్రాణి ప్రహృష్టాని చకాశిరే. 4

ప్ర. అ. తతః పురాత్=ఆ పట్టణమునుండి, స్వపురాణి=తమ పురములను గూర్చి, గచ్ఛతామ్=వెళ్లుచున్న, శ్రీమతామ్ = శ్రీమంతులైన, తేషామ్ = ఆ, రాజ్ఞామ్ = రాజులయొక్క, శుభ్రాణి = శుభ్రముగా నున్న, ప్రహృష్టాని = సంతసించిన, బలాని=సైన్యములు, చకాశిరే=ప్రకాశించినవి.

తా. అయోధ్యాపురినుండి తమ పురములకు బయలుదేరిన ఆ రాజుల సైన్యములు, శుభ్రములై ఆనందముకలవై ప్రకాశించినవి.

వి. 'శుభ్రాణి' అనుదానికి దశరథు డిచ్చిన వస్త్రాదులచే తెల్లగా నున్నవి అని కొందరివ్యాఖ్య. అంతకంటె—సైనికులు అందరును ఒక నియమిత మగు వేషమును (Uniform) ధరింతురు గాన వారు ప్రయాణముచేసి పోవుచున్నప్పుడు చాల అందముగా కనబడి రనియు, అదియే శుభ్రత్వ మనియు చెప్పుట యుక్తము. 4

మూ. గతేషు పృథివీశేషు రాజా దశరథస్తదా,
ప్రవివేశ పురీం శ్రీమాన్ పురస్కృత్య ద్విజోత్తమాన్. 5

ప్ర. అ. పృథివీశేషు=రాజులు, గతేషు సత్సు=తిరిగి వెళ్లిపోయినవారగుచుండగా, తదా = అప్పుడు, శ్రీమాన్ = శోభాయుక్తుడైన, రాజా దశరథః = దశరథమహారాజు, ద్విజోత్తమాన్ = బ్రాహ్మణశ్రేష్ఠులను, పురస్కృత్య=ఎదుట ఉంచుకొని, పురీమ్ = నగరమును, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. రాజులు వెడలిపోయినపిదప శ్రీమంతు డగు దశరథమహారాజు, సద్బ్రాహ్మణులను ముందిడుకొని నగరము ప్రవేశించెను. 5

మూ శాన్తయా ప్రయయౌ సార్ధం ఋశ్యశృఙ్గః సుపూజితః,
అన్వీయమానో రాజ్ఞాథ సానుయాత్రేణ ధీమతా. 6

ప్ర. అ. అథ=పిమ్మట, ఋశ్యశృఙ్గః=ఋశ్యశృంగుడు, సుపూజితః= బాగుగా పూజింపబడినవాడై, సానుయాత్రేణ=అనుచరులతో కూడిన, ధీమతా = ధీమంతు డైన, రాజ్ఞా=రోమపాదునిచేత, అన్వీయమానః=అనుసరింపబడుచున్న వాడై, శాన్తయా సార్ధమ్=శాంతతోకూడ, ప్రయయౌ = వెళ్లెను.

తా. దశరథుని నుండి బాగుగా పూజల నందుకొనిన ఋశ్యశృంగుడు కూడ, పరివారసమేతు డైన రోమపాదుడు అనుసరింప, శాంతతో కూడ తిరిగి స్వస్థానమునకు వెళ్లెను. 6

మూ. ఏవం విసృజ్య తాన్సర్వా న్రాజా సంపూర్ణమానసః,
ఉవాస సుఖిత స్తత్ర పుత్రోత్పత్తిం విచిన్తయన్. 7

ప్ర. అ. రాజా=దశరథుడు, ఏవమ్ = ఈ విధముగా, తాన్ సర్వాన్= వారినందరిని, విసృజ్య=పంపివేసి, సంపూర్ణమానసః = నిండిన మనస్సు కల వాడై, పుత్రోత్పత్తిమ్=పుత్రుల ఉత్పత్తిని గూర్చి, విచిన్తయన్=ఆలోచించుచు, తత్ర=అచట, సుఖితః = సుఖవంతుడై, ఉవాస=నివసించెను.

తా. దశరథుడు ఈ విధముగా వారి నందరిని పంపివేసి, ఆనందముతో నిండిన మనస్సు కలవాడై, కుమారుల ఉత్పత్తికై ఎదురు చూచుచు, సుఖముగా నుండెను. 7

మూ. తతో యజ్ఞే సమాప్తే తు ఋతూనాం షట్సమత్యయుః,
తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ, 8

నక్షత్రేఽదితిదైవత్యే స్వోచ్చసంస్థేషు పఞ్చసు,
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతావిన్దునా సహ, 9

ప్రోద్యమానే జగన్నాథం సర్వలోకనమస్కృతమ్,
కౌసల్యాజనయ ద్రామం సర్వలక్షణసంయుతమ్, 10
విష్ణోరర్ధం మహాభాగం పుత్రమైక్ష్వాకవర్ధనమ్.

ప్ర. అ. తతః=పిమ్మట, యజ్ఞే=యజ్ఞము, సమాప్తే = సమాప్తమైన తరువాత, ఋతునామ్ = ఋతువులయొక్క, షట్ = ఆరు (ఆరుఋతువులు),

సమత్యయుః = గడిచినవి, తతః = పిమ్మట, ద్వాదశే మాసే = పంౘ్రెండవ మాసమునందు, చైత్రే=చైత్రమునందు, నావమికే తిథౌ = నవమితిథియందు, అదితిదైవత్యే = అదితి దేవతగా గల, నక్షత్రే = నక్షత్రమునందు, పఞ్చసు = ఐదు, గ్రహేషు = గ్రహములు, స్వోచ్చసంస్థేషు=తమ తమ ఉచ్చస్థానములందు ఉండగా, కర్కటే లగ్నే = కర్కటలగ్నమునందు, వాక్పతౌ=బృహస్పతి, ఇన్దునా సహ=చంద్రునితోకూడ, ప్రోద్యమానే=ఉదయించుచుండగా, కౌసల్యా= కౌసల్య, జగన్నాథమ్=సకలజగత్తులకును ప్రభు వైనవాడును, సర్వలోకనమస్కృతమ్ = సర్వలోకములచే నమస్కరింపబడినవాడును, సర్వలక్షణసంయుతమ్=సకలలక్షణములతో కూడినవాడును, విష్ణోః = విష్ణువుయొక్క, అర్ధమ్= అంశయైనవాడును, మహాభాగమ్ = గొప్పభాగ్యము కలవాడును, ఇక్ష్వాకవర్ధనమ్ = ఇక్ష్వాకువంశీయులను వృద్ధిపొందించువాడును అగు, రామమ్ = రాముని, పుత్రమ్=పుత్రునిగా, అజనయత్ = కనెను.

తా. యజ్ఞము పూర్తి యైన తరువాత ఆరు ఋతువులు గడచినవి. అనగా ఒక సంవత్సరము చాలవరకు పూర్తి యైనది. తరువాత వచ్చిన పంౘ్రెండవ మాస మగు చైత్రమాసమునందు, పునర్వసునక్షత్రయుక్త నవమీతిథియందు, ఐదు గ్రహములు తమ తమ ఉచ్చస్థానములం దుండగా—అనగా సూర్య-కుజ-గురు-శుక్ర-శనులు-తమ ఉచ్చస్థానములగు మేష-మకర-కర్కటక-మీన-తులా-రాసులందుండగా-గురుడు చంద్రునితో కలసి యున్న కర్కటలగ్నమునందు, కౌసల్య, సకలజగన్నాథుడును, సర్వలోకనమస్కృతుడును, సర్వలక్షణసంపన్నుడును, విష్ణువు యొక్క అంశ యైనవాడును, మహాభాగ్యవంతుడును, ఇక్ష్వాకువంశవర్ధనుడును అగు రాముని పుత్రునిగా కనెను.

వి. విష్ణువునకు అంశకల్పన వ్యావహారికము. విష్ణ్వర్ధాంశభూతుడు సకలజగన్నాథుడు కాజాలడు. సకలజగన్నాథుడైనచో అర్ధాంశత్వ మయుక్తము. శ్రీరాముడు మహావిష్ణువుయొక్క పూర్ణావతారము. 10

మూ. కౌసల్యా శుశుభే తేన పుత్రేణామితతేజసా, 11
యథా వరేణ దేవానా మదితిర్వజ్రపాణినా.

ప్ర. అ. కౌసల్యా=కౌసల్య, అమితతేజసా = అమితమైన తేజస్సు గల,

తేన పుత్రేణ = ఆ పుత్రునిచేత, దేవానామ్ = దేవతలలో, వరేణ=శ్రేష్ఠుడైన, వజ్రపాణినా=దేవేంద్రునిచేత, అదితిః యథా=అదితివలె, శుశుభే=ప్రకాశించెను.

తా. అమితమైన తేజస్సు గల ఆ కుమారునితో కౌసల్య, దేవతలలో శ్రేష్ఠుడైన దేవేంద్రునితో అతని తల్లియైన అదితివలె ప్రకాశించెను.

మూ. భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః, 12
సాక్షాద్విష్ణోశ్చతుర్భాగః సర్వైః సముదితో గుణైః.

ప్ర. అ. సత్యపరాక్రమః = సత్య మైన పరాక్రమము కలవాడును, సాక్షాత్=సాక్షాత్తు, విష్ణోః=విష్ణువుయొక్క, చతుర్భాగః=నాల్గవ భాగ మైన వాడును, సర్వైః = సమస్త మైన, గుణైః = గుణములతో, సముదితః = కూడిన వాడును అగు, భరతో నామ = భరతు డనెడు పుత్రుడు, కైకేయ్యామ్ = కైకేయియందు, జజ్ఞే = పుట్టెను.

తా. సత్యపరాక్రముడును, సాక్షాత్తు విష్ణువుయొక్క నాల్గవభాగ మైన వాడును, సమస్త సద్గుణ సంపన్నుడును అగు భరతు డను పుత్రుడు కైకేయి యందు జనించెను. 12

మూ. అథ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాజనయత్సుతౌ, 13
వీరౌ సర్వాస్త్రకుశలౌ విష్ణోరర్ధసమన్వితౌ.

ప్ర. అ. అథ = పిమ్మట, సుమిత్రా = సుమిత్ర, వీరౌ = వీరులును, సర్వాస్త్రకుశలౌ=సకలాస్త్రములందును నేర్పుకలవారును, విష్ణోః=విష్ణువుయొక్క, అర్ధసమన్వితౌ = అంశములతో కూడినవారును అగు, లక్ష్మణశత్రుఘ్నౌ = లక్ష్మణశత్రుఘ్ను లనెడు, సుతౌ = కుమారులను, అజనయత్ = కనెను.

తా. పిమ్మట సుమిత్ర, సకలాస్త్రములందును నేర్పు కలవారును, విష్ణువు యొక్క అంశతో కూడినవారును, వీరులును అగు లక్ష్మణశత్రుఘ్ను లను సుతులను కనెను.

మూ. పుష్యే జాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః, 14
సార్పే జాతౌ తు సౌమిత్రీ కుళీరేఽభ్యుదితే రవౌ.

ప్ర. అ. ప్రసన్నధీః = ప్రసన్నమైన బుద్ధి గల, భరతః = భరతుడు, పుష్యే = పుష్యమీనక్షత్రమునందు, మీనలగ్నే = మీనలగ్నమునందు, జాతః = పుట్టెను, సౌమిత్రీ = సుమిత్రాకుమారులు, సార్పే = ఆశ్రేషానక్షత్రమునందు, కుళీరే = కర్కాటకలగ్నమునందు, రవౌ = సూర్యుడు, అభ్యుదితే= ఉదయించిన వాడగుచుండగా, అనగా మరునాడు అని అర్థము (కొందరు వ్రాసి నట్లు మధ్యాహ్న సమయమున అని కాదు) జాతౌ = పుట్టిరి.

తా. నిర్మల మైన బుద్ధి గల భరతుడు పుష్యమీనక్షత్రమునందు, మీన లగ్నమున పుట్టెను. మరునాడు లక్ష్మణశత్రుఘ్నులు, ఆశ్రేషానక్షత్రమునందు, కర్కాటకలగ్నమున మధ్యాహ్నసమయమున పుట్టిరి. 14

మూ. రాజ్ఞః పుత్రా మహాత్మానశ్చత్వారో జజ్ఞిరే పృథక్, 15
గుణవన్తోఽనురూపాశ్చ రుచ్యా ప్రోష్ఠపదోపమాః.

ప్ర. అ. గుణవన్తః=గుణములు కలవారును, అనురూపాః=తగినవారును, రుచ్యా = కాంతిచేత, ప్రోష్ఠపదోపమాః = పూర్వాభాద్రోత్తరాభాద్రనక్షత్రములతో సమానులును, మహాత్మానః = గొప్ప బుద్ధి కలవారును అగు, రాజ్ఞః = రాజు యొక్క, చత్వారః=నలుగురు, పుత్రాః = పుత్రులు, పృథక్ = వేరు వేరుగా, జజ్ఞిరే = పుట్టిరి.

తా. ఈ విధముగ దశరథునకు, గుణవంతులును, అనురూపులును, పూర్వాభాద్రోత్తరాభాద్రములు అను నాలుగు నక్షత్రముల వంటి కాంతి కల వారును, బుద్ధిమంతులును అగు నలుగురు పుత్రులు జనించిరి. 15

మూ. జగుః కలం చ గన్ధర్వా ననృతుశ్చాప్సరోగణాః, 16
దేవదున్దుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖాచ్చ్యుతా,
ఉత్సవశ్చ మహానాసీదయోధ్యాయాం జనాకులః. 17

ప్ర. అ. గన్ధర్వాః = గంధర్వులు, కలమ్ = మధురముగా, జగుః = గానముచేసిరి. అప్సరోగణాః=అప్సరఃస్త్రీసమూహములు, ననృతుః = నాట్యము చేసినవి. దేవదున్దుభయః = దేవతల దుందుభులు, నేదుః = మ్రోగినవి, ఖాత్ = ఆకాశమునుండి, పుష్పవృష్టిశ్చ=పుష్పవర్షము కూడ, చ్యుతా=పడినది, అయో

ధ్యాయామ్=అయోధ్యలో, జనాకులః=జనులచే వ్యాకుల మైన, మహాన్=గొప్ప, ఉత్సవశ్చ = ఉత్సవము కూడ, ఆసీత్ = ఆయెను.

తా. ఆ సమయమున గంధర్వులు మధురముగా గానము చేసిరి. అప్సరసలు నాట్యము చేసిరి. దేవదుందుభులు మ్రోగినవి. ఆకాశమునుండి పుష్ప వర్షము కురిసినది. అయోధ్యలో ఎందరో జనులు పాల్గొనిన గొప్ప ఉత్సవము జరిగినది. 17

మూ. రథ్యాశ్చ జనసంబాధా నటనర్తకసంకులాః,
గాయనైశ్చ విరావిణ్యో వాదనైశ్చ తథాపరైః. 18

ప్ర. అ. రథ్యాః = వీధులు, జనసంబాధాః = జనులచేత ఇరుకైనవిగాను, నటనర్తకసంకులాః=నటులతోడను నర్తకులతోడను వ్యాప్త మైనవి గాను, గాయనైశ్చ = గానముచేయువారిచేతను, వాదనైః = వాద్యములు మ్రోగించువారిచేతను, తథా=మరియు, అపరైః = ఇతరులైన వందిమాగధాదులచేతను, విరావిణ్యః = బాగుగా ధ్వని చేయుచున్నవిగాను, అయినవి.

తా. జనులతో కిక్కిరిసి ఉన్న వీధు లన్నియు నటనర్తకాదులతో నిండి పోయినవి. గాయకుల ధ్వనులు, వాద్యధ్వనులు వందిమాగధాదులు చేయు ధ్వనులును మిన్ను ముట్టినవి. 18

మూ. ప్రదేయాంశ్చ దదౌ రాజా సూతమాగధవన్దినామ్,
బ్రాహ్మణేభ్యో దదౌ విత్తం గోధనాని సహస్రశః. 19

ప్ర. అ. రాజా=రాజు, సూతమాగధవన్దినామ్=పౌరాణికులకును, వంశావళిని కీర్తించువారికిని, స్తోత్రపాఠము చేయువారికిని, ప్రదేయాన్ చ=ఇవ్వదగిన పారితోషికములను, దదౌ = ఇచ్చెను, బ్రాహ్మణేభ్యః = బ్రాహ్మణులకొరకు, విత్తమ్=ధనమును, సహస్రశః=వేలకొలది, గోధనాని=గోవు లనెడు ధనములను, దదౌ=ఇచ్చెను.

తా. దశరథుడు సూత-మాగధ-వందులకు పారితోషికములను పంచి పెట్టెను. బ్రాహ్మణులకు అధికసంఖ్యాకము లగు గోవులను, తదితరవస్తువులను దానము చేసెను. 19

మూ. అతీత్యైకాదశాహం తు నామకర్మ తథాకరోత్,
జ్యేష్ఠం రామం మహాత్మానం భరతం కైకయీసుతమ్. 20

సౌమిత్రిం లక్ష్మణమితి శత్రుఘ్న మపరం తథా,
వసిష్ఠః పరమప్రీతో నామాని కురుతే తదా. 21

ప్ర. అ. తథా=మరియు, ఏకాదశాహమ్=పదకొండు రోజులు, అతీత్య=దాటి, నామకర్మ = నామకరణమును, అకరోత్ = చేసెను, మహాత్మానమ్=మహాత్ముడైన, జ్యేష్ఠమ్=పెద్దకుమారుని, రామమ్=రామునిగాను, కైకయీసుతమ్ = కైకయీపుత్రుని, భరతమ్=భరతునిగాను, సౌమిత్రిమ్ = ఒక సుమిత్రా కుమారుని, లక్ష్మణమితి=లక్ష్మణుని గాను, అపరమ్=రెండవ సుమిత్రాకుమారుని, శత్రుఘ్నమ్=శత్రుఘ్నుని గాను, పరమప్రీతః=మిక్కిలి సంతోషించిన, వసిష్ఠః=వసిష్ఠుడు, తదా = అప్పుడు, నామాని = పేర్లను, కురుతే = చేసెను.

తా. పదకొండు దినముల తరువాత నామకరణము జరిగెను. ఆనంద భరితహృదయుడైన వసిష్ఠుడు జ్యేష్ఠ డగు కౌసల్యాపుత్రునకు రాము డనియు, కైకేయీపుత్రునకు భరతు డనియు, సుమిత్రాపుత్రులకు లక్ష్మణశత్రుఘ్ను లనియు నామధేయములు చేసెను.

వి. "రమన్తే సర్వే జనాః గుణైః అస్మిన్ ఇతి రామః". అను వ్యుత్పత్తి చేత, "సర్వజనులును సద్గుణములను బట్టి ఎవని విషయమున అనందవంతు లగుదురో అతడు రాముడు" అని "రామ" శబ్దార్థము. లక్ష్మీః అస్య అస్తీతి లక్ష్మణః"—సంపద, శోభ కలవాడు లక్ష్మణుడు. "బిభర్తీతి భరతః"—రాజ్యమును భరించినవాడు కావున భరతుడు. "శత్రూన్ హన్తీతి శత్రుఘ్నః"—శత్రువులను చంపువాడు శత్రుఘ్నుడు.

క్షత్రియులకు జాతాశౌచము పంద్రెండు దినము లని శ్రుతులలో ఉన్నది. క్షత్రియులకు నామకరణము పదమూడవ దినమున చేయవలె నని స్మృతులలో నున్నది. అందుచే "ఏకాదశాహమ్" అను పదమునకు లక్ష్మణ శత్రుఘ్నులు పుట్టిన తరువాత పదకొండు రోజులు దాటిన తరువాత అని అర్థము చెప్పుకొనవలె నని గోవిందరాజుల వ్యాఖ్య. అట్లైనను రామభరతులు పుట్టిన పదమూడవ దివసమైనను సౌమిత్రులు పుట్టిన పంద్రెండవ దివసమే కదా? వారి జన్మాశౌచ

మట్లే ఉన్నది కదా. స్మృతికర్త యైన వసిష్ఠుడు ఏకాదశదివసానంతరము నామ కరణము చేసినా డని చెప్పినపుడు మనకు ఈవికల్పము లెందులకు? రామభరతు లకు ఒకనాడు, సౌమిత్రులకు మరొకనాడు నామకరణములు చేసి ఉండవచ్చును కదా? జాతకర్మకు వలె నామకరణమునకు కూడ సూతక నిషేధము ఆనాడు లేదేమో? మన భావాలు, సంప్రదాయాలు, ఆచారాలు ప్రాచీనగ్రంథాలలో చేర్చి వ్యాఖ్యానించుట యుక్తము కాదు. వాక్యార్థమును యథాతథముగా గ్రహించి ఇది అనాటి పరిస్థితి కదా అని అనుకొనుట యుక్తము. 32

మూ. బ్రాహ్మణాన్ భోజయామాస పౌరాన్ జానపదానపి,
అదదాద్బ్రాహ్మణానాం చ రత్నౌఘమమితం బహు. 22
తేషాం జన్మక్రియాదీని సర్వకర్మాణ్యకారయత్.

ప్ర. అ. బ్రాహ్మణాన్=బ్రాహ్మణులను, పౌరాన్ = నగరములలో ఉన్న వారిని, జానపదానపి=గ్రామీణులను, భోజయామాస=భుజింపచేసెను, బ్రాహ్మణానాం = బ్రాహ్మణులకు, అమితమ్ = అమితమైన, బహు = అత్యధిక మైన, రత్నౌఘమ్=రత్నసముదాయమును, అదదాత్ = ఇచ్చెను, తేషాం = ఆ పుత్రులకు, జన్మక్రియాదీని = జన్మక్రియ మొదలైన, సర్వకర్మాణి=సమస్తకర్మలను, అకారయత్ = చేయించెను.

తా. దశరథుడు బ్రాహ్మణులకును, పౌరులకును, జానపదులకును సంతర్పణములు చేసి బ్రాహ్మణులకు అత్యధిక మగు రత్నసముదాయమును దానము చేసెను. ఈ విధముగ దశరథుడు కుమారులకు జాతకర్మ-నామకరణ-అన్నప్రాశన-చౌలోపనయనాదిసంస్కారము లన్నియు యథాకాలముగ చేయించెను. 22

మూ. తేషాం కేతురివ జ్యేష్ఠో రామో రతికరః పితుః, 23
బభూవ భూయో భూతానాం స్వయం భూరివ సంమతః.

ప్ర. అ. తేషామ్ = వారిలో, జ్యేష్ఠః = పెద్దవాడైన, రామః = రాముడు, కేతురివ = ధ్వజము వలె, పితుః=తండ్రికి, భూయః = మిక్కిలి, రతికరః= ప్రీతిజనకుడై, స్వయంభూరివ=బ్రహ్మదేవుడు వలె, భూతానామ్=సకలప్రాణులకును, సంమతః = ఆదరపాత్రుడు, బభూవ = ఆయెను.

తా. వారిలో పెద్దవాడైన రాముడు ధ్వజము వలె సర్వోన్నతుడై, తండ్రికి చాల ప్రీతిని కలిగించెను. బ్రహ్మదేవుడు వలె సమస్తప్రాణుల ఆదరమును చూరకొనెను. 23

మూ. సర్వే వేదవిదః శూరాస్సర్వే లోకహితే రతాః, 24
సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వే సముదితా గుణైః.

ప్ర. అ. సర్వే=అందరును, వేదవిదః = వేదవేత్తలే, శూరాః=శూరులే, సర్వే=అందరును, లోకహితే = లోకక్షేమమునందు, రతాః = ఆసక్తి కలవారే, సర్వే = అందరును, జ్ఞానోపసంపన్నాః = జ్ఞానముతో కూడినవారే, సర్వే= అందరును, గుణైః = సద్గుణములతో, సముదితాః = కూడినవారే.

తా. ఆ దశరథపుత్రులందరును వేదవేత్తలే, అందరును శూరులే, అందరును జ్ఞానసంపన్నులే. అందరును సద్గుణశోభితులే. అందరును లోకక్షేమమునందు ఆసక్తి కలవారే. 24

మూ. తేషామపి మహాతేజా రామః సత్యపరాక్రమః, 25
ఇష్టః సర్వస్య లోకస్య శశాఙ్క ఇవ నిర్మలః.

ప్ర. అ. తేషామపి = వారందరిలోకిని, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, సత్యపరాక్రమః = వ్యర్థము కాని పరాక్రమము కలవాడును, అగు, రామః = రాముడు, నిర్మలః = కలంకరహితు డగు, శశాఙ్కః ఇవ = చంద్రుడు వలె, సర్వస్య=సమస్త మైన, లోకస్య=లోకమునకు, ఇష్టః = ఇష్టమైనవాడు.

తా. వారందరిలో కూడ, మహాతేజఃశాలియు, సత్యపరాక్రముడును అగు రాముడు, నిర్మలు డైన చంద్రుడు వలె సకలలోకమునకు ఇష్టుడై ఉండెను. 25

మూ. గజస్కన్ధేఽశ్వపృష్ఠే చ రథచర్యాసు సమ్మతః, 26
ధనుర్వేదే చ నిరతః పితృశుశ్రూషణే రతః.

ప్ర. అ. గజస్కన్ధే=ఏనుగ మూపు నెక్కుటయందును, అశ్వపృష్ఠే చ= గుఱ్ఱము వీపుపై ఎక్కి ప్రయాణములు చేయుటయందును, రథచర్యాసు=రథము యొక్క నడకలయందును, సంమతః = సమర్థు డని అందరిచేతను అంగీకరింప

బడినవాడు, ధనుర్వేదే చ=ధనుర్వేదమునందు కూడ, నిరతః=ఆసక్తి కలవాడు, పితృశుశ్రూషణే = తలిదండ్రుల సేవ చేయుటయందు, రతః = ఆసక్తి కలవాడు.

తా. రాముడు గజాశ్వరథములపై నెక్కి యుద్ధము చేయుటయందు సమర్థుడని పేరెన్నిక గనెను. అతడు ధనుర్వేదమునందు శ్రద్ధ కలవాడు. పితృసేవచేయుటయందు ఆసక్తి కలవాడు. 26

మూ. బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః, 27
రామస్య లోకరామస్య భ్రాతుర్జ్యేష్ఠస్య నిత్యశః.

ప్ర. అ. లక్ష్మివర్ధనః = సంపదను వృద్ధిపొందించు, లక్ష్మణః = లక్ష్మణుడు, బాల్యాత్ ప్రభృతి = బాల్యమునుండియు, లోకరామస్య = లోకమునకు మనోహరుడును, జ్యేష్ఠస్య భ్రాతుః = జ్యేష్ఠసోదరుడును అగు, రామస్య = రాముని విషయమున, నిత్యశః=ఎల్లప్పుడును, సుస్నిగ్ధః = బాగుగా స్నేహము కలవాడై, ఉండెను.

తా. సంపదలను వృద్ధిపొందించు లక్ష్మణుడు, చిన్నతనము నుండియు, లోకములకు మనోహరుడును, జ్యేష్ఠసోదరుడును అగు రాముని విషయమున సర్వదా అత్యధిక స్నేహము కలవాడై ఉండెను. 27

మూ. సర్వప్రియకరస్తస్య రామస్యాపి శరీరతః, 28
లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః.

ప్ర. అ. లక్ష్మిసంపన్నః=శోభాసంపన్నుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, శరీరతః అపి=శరీరమును కూడ అర్పించి, సర్వప్రియకరః = సమస్తవిధములగు ప్రియములను చేయుచు, తస్య = ఆ, రామస్య = రామునకు, అపరః = రెండవ, బహిఃప్రాణ ఇవ = బైట సంచరించు ప్రాణము వలె ఉండెను.

తా. రామునకు సకలప్రియములను చేకూర్చుటకై శరీరమును కూడ అర్పించుటకు వెనుతీయని లక్ష్మిసంపన్నుడైన లక్ష్మణుడు రామునకు, బైట సంచరించు చున్న మరి యొక ప్రాణమా అన్నట్లు అపారస్నేహాస్పదుడయ్యెను. 28

మూ. న చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః, 29
మృష్టమన్న ముపానీత మశ్నాతి న చ తం వినా.

ప్ర. అ. పురుషోత్తమః = పురుషశ్రేష్ఠుడైన రాముడు, తేన వినా = ఆ లక్ష్మణుడు లేకుండ, నిద్రామ్ = నిద్రను, న లభతే = పొందడు, ఉపానీతమ్ = తీసికొనిరాబడిన, మృష్టమ్ = శ్రేష్ఠమైన, అన్నం చ = అన్నమును కూడ, తం వినా = అతడు లేకుండ, న అశ్నాతి = భుజింపడు.

తా. లక్ష్మణుడు ప్రక్కన లేకున్నచో శ్రీరాముడు నిద్రపోయెడివాడు కాదు. అతడు లేనిచో మధురమైన ఆహారమును కూడ భుజించెడివాడు కాదు.

మూ. యదా హి హయమారూఢో మృగయాం యాతి రాఘవః, 30
తదైనం పృష్ఠతోఽన్వేతి సధనుః పరిపాలయన్.

ప్ర. అ. రాఘవః = రాముడు, హయమ్ = అశ్వమును, అరుహ్య = ఎక్కి, యదా = ఎప్పుడు, మృగయాం = వేటనుగూర్చి, యాతి = వెళ్లెనో, తదా = అప్పుడు, సః = ఆ లక్ష్మణుడు, ధనుః = ధనుస్సును, పరిపాలయన్ = ధరించినవాడై, ఏనమ్ = ఈ రాముని, పృష్ఠతః = వెనుకనే, అన్వేతి = అనుసరించి వెళ్లును.

తా. రాముడు అశ్వము నెక్కి వేటకై బయల్వెడలినపుడు లక్ష్మణుడు ధనుస్సు చేత బూని అతని వెనుకనే వెళ్లెడివాడు. 30

మూ. భరతస్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః, 31
ప్రాణైః ప్రియతరో నిత్యం తస్య చాసీత్తథా ప్రియః.

ప్ర. అ. లక్ష్మణావరజః = లక్ష్మణుని తమ్ముడైన, సః = ఆ, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, భరతస్యాపి = భరతునకు, నిత్యమ్ = ఎల్లప్పుడును, ప్రాణైః = ప్రాణములచేత, ప్రియతరః = ఎక్కువ ఇష్టుడయ్యెను, (భరతుడు, తస్య చ = ఆ శత్రుఘ్నునకు కూడ, తథా = ఆ విధముగనే, ప్రియః = ఇష్టుడు, ఆసీత్ = ఆయెను.

తా. అట్లే లక్ష్మణుని తమ్ముడైన శత్రుఘ్నుడు భరతునకు ప్రాణముల

కంటె ఎక్కువ ప్రియ డయ్యెను. శత్రుఘ్నునకు భరతుడును అట్లే ప్రియు డయ్యెను. 31

మూ. స చతుర్భిర్మహాభాగైః పుత్రైర్దశరథః ప్రియైః, 32
బభూవ పరమప్రీతో దేవైరివ పితామహః.

ప్ర. అ. సః = ఆ దశరథుడు, మహాభాగైః = మహాభాగ్యవంతులైన, చతుర్భిః=నలుగురు, పుత్రైః = పుత్రులతో, పితామహః=బ్రహ్మదేవుడు, దేవైః ఇవ=దేవతలతో వలె, పరమప్రీతః=చాల సంతసించినవాడు, బభూవ=అయెను.

తా. భాగ్యశాలులును, ప్రియులును అగు ఆ నలుగురు కుమారులతో దశరథుడు, దేవతలతో బ్రహ్మదేవుడు వలె చాల సంతోషించెను. 33

మూ. తే యదా జ్ఞానసంపన్నాః సర్వైః సముదితా గుణైః,
హ్రీమన్తః కీర్తిమన్తశ్చ సర్వజ్ఞా దీర్ఘదర్శినః. 33
తేషామేవంప్రభావానాం సర్వేషాం దీప్తతేజసామ్,
పితా దశరథో హృష్టో బ్రహ్మ లోకాధిపో యథా. 34

ప్ర. అ. తే = వారు, యదా = ఎప్పుడు, జ్ఞానసంపన్నాః = జ్ఞానముతో కూడినవారుగాను, సర్వైః = సమస్త మైన, గుణైః=గుణములతో, సముదితాః= కూడినవారుగాను, హ్రీమన్తః=లజ్జ కలవారుగను, కీర్తిమన్తశ్చ = కీర్తి కలవారు గాను, సర్వజ్ఞాః=అన్నియు తెలిసిన వారుగాను, దీర్ఘదర్శినః=దూరముగా ఆలోచించ గలవారుగాను, (అయిరో, అప్పుడు), ఏవంప్రభావానామ్=ఇట్టి ప్రభావము గల, దీప్తతేజసామ్=ప్రకాశించుచున్న తేజస్సు గల, తేషాం సర్వేషామ్ = వారు అందరి విషయమునను, పితా=తండ్రి యైన, దశరథః=దశరథుడు, లోకాధిపః= లోకాధిపతి యైన, బ్రహ్మ యథా=బ్రహ్మదేవుడు వలె, హృష్టః=సంతోషించెను.

తా. ఆ కుమారు లందరును జ్ఞానసంపన్నులు, సర్వగుణభూషితులు, తప్పు పనులు చేయుటకు సిగ్గుపడెడువారు, కీర్తిని సంపాదించినవారు, అన్ని విషయము లందును జ్ఞానము సంపాదించినవారు, దీర్ఘాలోచన చేయ సమర్థులై యుండిరి. ఇట్టి ప్రభావము గల తేజశ్శాలు లగు ఆ పుత్రులను చూచుకొని దశరథమహారాజు సకలలోకప్రభు వగు ప్రజాపతి వలె సంతుష్టాంతరంగు డయ్యెను. 34

మూ. తే చాపి మనుజవ్యాఘ్రా వైదికాధ్యయనే రతాః, 35
పితృశుశ్రూషణరతా ధనుర్వేదే చ నిష్ఠితాః.

ప్ర. అ. తే = ఆ, మనుజవ్యాఘ్రాః అపి = మనుష్యశ్రేష్ఠులు కూడ, వైదికాధ్యయనే=వేదాధ్యయనమునందు, రతాః=శ్రద్ధావంతులుగను, పితృశుశ్రూషణరతాః = తలిదండ్రులకు శుశ్రూష చేయుటయందు ఆసక్తి కలవారుగాను, ధనుర్వేదే = ధనుర్వేదమునందు, నిష్ఠితాశ్చ = నిష్ణాతులుగను ఉండిరి.

తా. ఆ రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వేదాధ్యయనమందు శ్రద్ధావంతులై, తలిదండ్రులను సేవించుటయందు ఆసక్తి కలవారై, ధనుర్వేదమునందు కూడ నైపుణ్యమును సంపాదించిరి. 35

మూ. అథ రాజా దశరథస్తేషాం దారక్రియాం ప్రతి, 36
చిన్తయామాస ధర్మాత్మా సోపాధ్యాయః సబాన్ధవః.

ప్ర. అ. అథ = పిమ్మట, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రాజా దశరథః= దశరథమహారాజు, సోపాధ్యాయః = పురోహితునితో కూడినవాడై, సబాన్ధవః = బంధువులతో కూడినవాడై, తేషామ్=ఆ కుమారులయొక్క, దారక్రియాం ప్రతి= వివాహమును గూర్చి, చిన్తయామాస = ఆలోచించెను.

తా. ఒకనాడు, దశరథమహారాజు, పురోహితునితోడను, బంధువులతోడను కలిసి ఆ కుమారుల వివాహమును గూర్చి ఆలోచించుచుండెను. 36

మూ. తస్య చిన్తయమానస్య మన్త్రిమధ్యే మహాత్మనః,
అభ్యగచ్ఛన్మహాతేజా విశ్వామిత్రో మహామునిః. 37

ప్ర. అ. మహాత్మనః = పూజ్యమైన బుద్ధి గల, తస్య = ఆ దశరథుడు, మన్త్రిమధ్యే=మంత్రుల మధ్యయందు, చిన్తయమానస్య =ఆలోచించుచుండగా, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః మహామునిః = మహాముని యైన విశ్వామిత్రుడు, అభ్యగచ్ఛత్=వచ్చెను.

తా. బుద్ధిశాలి యగు దశరథుడు మంత్రులతో ఆలోచించుచుండగా, మహాతేజశ్శాలి యగు విశ్వామిత్రమహాముని అచటకు వచ్చెను. 37

మూ. స రాజ్ఞో దర్శనాకాంక్షీ ద్వారాధ్యక్షానువాచ హ. 38
శీఘ్రమాఖ్యాత మాం ప్రాప్తం కౌశికం గాధినః సుతమ్.

ప్ర. అ. సః = అతడు, రాజ్ఞః = రాజుయొక్క, దర్శనాకాంక్షీ = దర్శనమును కోరుచున్నవాడై, ద్వారాధ్యక్షాన్ = ద్వారపాలకులను గూర్చి, ఉవాచ హ=పలికెను. "గాధినః=గాధియొక్క, సుతమ్=కుమారుడును, కౌశికమ్ = కుశికవంశమునందు పుట్టినవాడును అగు, మామ్=నన్ను, ప్రాప్తమ్ = వచ్చినవానినిగా, శీఘ్రమ్=శీఘ్రముగా, ఆఖ్యాత = చెప్పుడు."

తా. రాజదర్శనమును కోరుచున్న ఆతడు, ద్వారపాలకులతో "కుశికవంశీయుడును, గాధికుమారుడును అగు విశ్వామిత్రుడు వచ్చినాడు అని శీఘ్రముగ చెప్పుడు" అని పలికెను. 38

మూ. తచ్ఛ్రుత్వా వచనం త్రాసాద్రాజ్ఞో వేశ్మ ప్రదుద్రువుః, 39
సంభ్రాన్తమనసః సర్వే తేన వాక్యేన చోదితాః.

ప్ర. అ. తత్ = ఆ, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, సర్వే = వారందరును, సంభ్రాన్తమనసః=కలతపడినమనస్సుకలవారై, తేన=ఆ, వాక్యేన= వాక్యముచేత, చోదితాః = ప్రేరేపింపబడినవారై, రాజ్ఞః = రాజుయొక్క, వేశ్మ = గృహమునుగూర్చి, ప్రదుద్రువుః = పరుగెత్తిరి.

తా. ఆ మాట వినగనే ద్వారపాలకు లందరును, ఆ వాక్యముచే ప్రేరేపింపబడినవారై, భయపడిన చిత్తముతో, రాజగృహమునకు పరుగెత్తి వెళ్లిరి. 39

మూ. తే గత్వా రాజభవనం విశ్వామిత్రమృషిం తదా,
ప్రాప్తమావేదయామాసుర్నృపాయైక్ష్వాకవే తదా. 40

ప్ర. అ. తదా = అప్పుడు, తే = వారు, రాజభవనమ్ = రాజగృహమును గూర్చి, గత్వా = వెళ్లి, తదా = అప్పుడు, విశ్వామిత్రమ్ ఋషిమ్ = విశ్వామిత్ర మహర్షిని, ప్రాప్తమ్ = వచ్చినవానినిగా, ఐక్ష్వాకవే = ఇక్ష్వాకువంశీయుడైన, నృపాయ = దశరథునకు, ఆవేదయామాసుః = తెలిపిరి.

తా. వారు రాజప్రాసాదము చేరి విశ్వామిత్రమహర్షి వచ్చినా డని దశరథు నకు తెలిపిరి. 40

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా సపురోధాః సమాహితః, 41
ప్రత్యుజ్జగామ తం హృష్టో బ్రహ్మాణమివ వాసవః.

ప్ర. అ. తేషామ్ = ఆ ద్వారపాలకులయొక్క, తత్ = ఆ, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, హృష్టః=సంతసించిన ఆ దశరథుడు, సపురోధాః= పురోహితులతో కూడినవాడై, సమాహితః = సావధానచిత్తుడై, తమ్ = ఆతనిని, వాసవః = దేవేంద్రుడు, బ్రహ్మాణమివ = బ్రహ్మను వలె, ప్రత్యుజ్జగామ = ఎదుర్కొనెను.

తా. వారి మాటలు విన్న దశరథుడు, సంతసించి, పురోహితసమేతుడై, సావధానచిత్తుడై, దేవేంద్రుడు బ్రహ్మకు వలె, ఆతనికి ఎదురేగెను. 41

మూ. తం దృష్ట్వా జ్వలితం దీప్తతపసం సంశితవ్రతమ్, 42
ప్రహృష్టవదనో రాజా తతోఽర్ఘ్యముపహారయత్.

ప్ర. అ. తతః=పిమ్మట, రాజా = రాజు, జ్వలితమ్ = ప్రకాశించుచున్న వాడును, దీప్తతపసమ్=ప్రకాశించుచున్న తపస్సు కలవాడును, సంశితవ్రతమ్= తీవ్రము లైన నియమములు కలవాడును అగు, తమ్ = ఆతనిని, దృష్ట్వా=చూచి, ప్రహృష్టవదనః=వికసించిన ముఖముకలవాడై, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, ఉప హారయత్=ఇచ్చెను.

తా. గొప్పతపఃశక్తితో ప్రజ్వలించుచున్నవాడును, కఠినవ్రతములను ఆచరించువాడును అగు ఆ విశ్వామిత్రుని చూచి దశరథుడు ఆనందముచే విక సించిన ముఖము కలవాడై, అర్ఘ్యము సమర్పించెను. 42

మూ. స రాజ్ఞః ప్రతిగృహ్యార్ఘ్యం శాస్త్రదృష్టేన కర్మణా, 43
కుశలం చావ్యయం చైవ పర్యపృచ్ఛన్నరాధిపమ్.

ప్ర. అ. సః = ఆతడు, శాస్త్రదృష్టేన = శాస్త్రమునందు చూడబడిన, కర్మణా=విధానముచేత, రాజ్ఞః = రాజునుండి, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, ప్రతి

గృహ్య=స్వీకరించి, నరాధిపమ్=రాజును, కుశలం చ=కుశలమును, అవ్యయం చైవ=ఎట్టి లోటు లేకపోవుటను గూర్చి, పర్యపృచ్ఛత్ = ప్రశ్నించెను.

తా. విశ్వామిత్రుడు శాస్త్రోక్తరీతిని దశరథమహారాజు సమర్పించిన అర్ఘ్యము స్వీకరించి, "ఎట్టి ఆపదలును లేక కుశలముగా నున్నావా?" అని అతనిని ప్రశ్నించెను. 43

మూ. పురే కోశే జనపదే బాన్ధవేషు సుహృత్సు చ, 44
కుశలం కౌశికో రాజ్ఞః పర్యపృచ్ఛత్సుధార్మికః.

ప్ర. అ. సుధార్మికః = మంచి ధార్మికు డైన, కౌశికః = విశ్వామిత్రుడు, రాజ్ఞః = రాజుయొక్క, పురే = పట్టణములందును, కోశే = ధనాగారమునందును, జనపదే = గ్రామములందును, బాన్ధవేషు = బంధువులందును, సుహృత్సు చ = మిత్రులందును, కుశలమ్ = కుశలమును, పర్యపృచ్ఛత్ = ప్రశ్నించెను.

తా. మిక్కిలి ధార్మికు డైన విశ్వామిత్రుడు — "నీ రాజ్యములోని నగరములందును, గ్రామములందును, అందరును క్షేమముగా ఉన్నారా? ధనాగారము సమృద్ధముగా ఉన్నదా? నీ సుహృద్బాంధవు లందరును క్షేమమే కదా!" అని దశరథుని ప్రశ్నించెను. 44

మూ. అపి తే సన్నతాః సర్వే సామన్తా రిపవో జితాః, 45
దైవం చ మానుషం చాపి కర్మ తే సాధ్వనుష్ఠితమ్.

ప్ర. అ. సామన్తాః = సామంతరాజులు, సర్వే = అందరును, తే = నీకు, అపి సన్నతాః = వంగి ఉన్నారా? రిపవః = శత్రువులు, జితాః = జయింపబడినారా? తే = నీయొక్క, దైవతం = దేవతానుగ్రహముకొరకు చేయు, కర్మ = కర్మయు, మానుషం చాపి = మనుష్యప్రయత్నసాధ్య మగు కర్మయు, సాధు = చక్కగా, అనుష్ఠితమ్ = చేయబడినదా?

తా. నీకు సామంతరాజు లందరును లొంగి ఉన్నారా? శత్రువుల నందరిని జయించినావా? దేవతాప్రీతికర మైన యజ్ఞయాగాదులను, మానవప్రయత్నసాధ్య మైన సామదానభేదదండాద్యుపాయములను చక్కగ అనుష్ఠించుచున్నావా? 45

మూ. వసిష్ఠం చ సమాగమ్య కుశలం మునిపుఙ్గవః, 46
ఋషీంశ్చ తాన్ యథాన్యాయం మహాభాగానువాచ హ.

ప్ర. అ. మునిపుఙ్గవః=మునిశ్రేష్ఠుడు, వసిష్ఠం చ=వసిష్ఠుని, తాన్=ఆ, మహాభాగాన్ = మహానుభావులైన, ఋషీంశ్చ=ఋషులను, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, సమాగమ్య=సమీపించి, కుశలమ్=క్షేమమును, ఉవాచ= పలికెను. (ప్రశ్నించెను).

తా. ఆ మునిపుంగవుడు, వసిష్ఠుని, అచట నున్న మహానుభావు లగు ఇతర ఋషులను సమీపించి, న్యాయానుసారముగా వారి కుశల మడిగెను. 46

మూ. తే సర్వే హృష్టమనస స్తస్య రాజ్ఞో నివేశనమ్, 47
వివిశుః పూజితా స్తత్ర నిషేదుశ్చ యథార్హతః.

ప్ర. అ. తే సర్వే = వారందరును, హృష్టమనసః=సంతోషించిన మనస్సు కలవారై, తస్య=ఆ, రాజ్ఞః=రాజుయొక్క, నివేశనమ్=గృహమును, వివిశుః= ప్రవేశించిరి, తత్ర = అచట, యథార్హతః=యోగ్యతానుసారముగా, పూజితాః= పూజింపబడినవారై, నిషేదుశ్చ = కూర్చుండిరి.

తా. ఆ ఋషులందరును సంతసించి దశరథుని గృహమును ప్రవేశించిరి. అచట యోగ్యతానుసారముగా పూజింపబడినవారై కూర్చుండిరి. 47

మూ. అథ హృష్టమనా రాజా విశ్వామిత్రం మహామునిమ్, 48
ఉవాచ పరమోదారో హృష్టస్తమభిపూజయన్.

ప్ర. అ. అథ=అటు పిమ్మట, పరమోదారః = మిక్కిలి ఔదార్యవంతు డైన, రాజా=రాజు, హృష్టమనాః=సంతోషించిన మనస్సు కలవాడై, తమ్=ఆ, మహామునిమ్=మహాముని యైన, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని, అభిపూజయన్= పూజించుచున్నవాడై, హృష్టః=సంతసించినవాడై, ఉవాచ = పలికెను.

తా. గొప్పదాత యైన దశరథుడు విశ్వామిత్రుని రాకచే సంతోషించిన మనస్సు కలవాడై, ఆ విశ్వామిత్రమహామునిని పూజించి, సంతోషముతో ఇట్లనెను. 48

మూ. యథాఽమృతస్య సంప్రాప్తిర్యథా వర్షమనూదకే 49
యథా సదృశదారేషు పుత్రజన్మాప్రజస్య చ,
ప్రణష్టస్య యథా లాభో యథా హర్షో మహోదయే, 50
తథైవాగమనం మన్యే స్వాగతం తే మహామునే.

ప్ర. అ. మహామునే = ఓ మహామునీ ! అమృతస్య=అమృతముయొక్క, సంప్రాప్తిః = ప్రాప్తి, యథా = ఎట్లో, అనూదకే = నీళ్లులేని ప్రదేశమునందు, వర్షమ్=వర్షము, యథా = ఎట్లో, అప్రజస్య=సంతానములేనివానికి, సదృశదారేషు=తగిన భార్యయందు, పుత్రజన్మ=పుత్రోత్పత్తి, యథా=ఎట్లో, ప్రణష్టస్య=పోగొట్టుకొనిన వస్తువుయొక్క, లాభః=లాభము, యథా = ఎట్లో, మహోదయే= గొప్ప అభివృద్ధి కలిగినపుడు, హర్షః=సంతోషము, యథా=ఎట్లో, తే=నీయొక్క, ఆగమనమ్=రాక, తథా ఏవ=అట్లే అని, మన్యే=తలచుచున్నాను, స్వాగతమ్= నీకు స్వాగత మగుగాక.

తా. ఓ మహామునీ ! నీ రాక అమృతప్రాప్తి వంటిది. నీళ్లు లేనిచోట వానలు కురియుట వంటిది. సంతానము లేనివానికి అనుకూల యగు భార్యయందు పుత్రుడు జనించుటవంటిది. పోగొట్టుకొనిన వస్తువు మరల దొరకుట వంటిది. గొప్ప అభివృద్ధి లభించినపుడు కలుగు హర్షము వంటిది. నీకు స్వాగతము అగు గాక. 49, 50

మూ. కం చ తే పరమం కామం కరోమి కిము హర్షితః, 51
పాత్రభూతోఽసి మే బ్రహ్మన్ దిష్ట్యా ప్రాప్తోఽసి కౌశిక,
అద్య మే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్. 52

ప్ర. అ. బ్రహ్మన్=ఓ బ్రాహ్మణోత్తమా ! హర్షితః=సంతోషించిన నేను, తే=నీకు, పరమమ్=ఉత్తమ మైన, కం కామమ్=ఏ కోరికను, కిము=ఏ విధముగా, కరోమి=చేయుదును, మే=నాకు, పాత్రభూతః = సత్పాత్రగా, అసి = అయి ఉన్నావు, కౌశిక=ఓ విశ్వామిత్రుడా, దిష్ట్యా = దైవవశముచేత, ప్రాప్తః అసి=వచ్చినావు, అద్య=ఈనాడు, మే=నాయొక్క, జన్మ=జన్మ, సఫలమ్= సఫల మైనది, జీవితం చ=జీవితము కూడ, సుజీవితమ్=మంచి జీవితము.

తా. ఓ విశ్వామిత్రుడా! సంతోషించిన నేను నీకు ఏ కోరికను, ఎట్లు తీర్చవలెనో చెప్పుము. నీవు సత్పాత్రవు, నా అదృష్టముచే వచ్చినావు, ఈనాడు నా జన్మ సఫల మైనది. జీవితము సుజీవిత మైనది. 52

మూ. పూర్వం రాజర్షి శబ్దేన తపసా ద్యోతిత ప్రభః,
బ్రహ్మర్షిత్వమనుప్రాప్తః పూజ్యోసి బహుధా మయా. 53

ప్ర. పూర్వమ్=పూర్వము, రాజర్షిశబ్దేన=రాజర్షి అనే శబ్దముచే, ద్యోతిత ప్రభః=సూచింపబడిన శక్తి గల నీవు, అను = అనంతరమునందు, తపసా= తపస్సుచేత, బ్రహ్మర్షిత్వమ్ = బ్రహ్మర్షిత్వమును, ప్రాప్తః=పొందినావు, మయా= నాచేత, బహుధా=అనేక విధములుగా, పూజ్యః=పూజింపదగినవాడవు, అసి= అయి ఉన్నావు.

తా. మొదట నీకు రాజర్షి అను బిరుదము ఉండెడిది. అది నీ శక్తిని సూచించునది. పిదప తపస్సుచేత బ్రహ్మర్షిత్వమును పొందినావు. నీవు నాకు సర్వథా పూజ్యుడవు. 54

మూ. తదద్భుతమిదం బ్రహ్మన్ పవిత్రం పరమం మమ,
శుభక్షేత్రగతశ్చాహం తవ సందర్శనాత్ప్రభో. 54

ప్ర. అ. బ్రహ్మన్=ఓ బ్రాహ్మణోత్తమా! తత్=ఆ కారణము వలన, ఇదమ్=ఈ నీ యాగమనము, అద్భుతమ్ = చాల ఆశ్చర్యజనక మైనది, మమ= నాకు, పరమమ్ = గొప్ప, పవిత్రమ్=పవిత్ర మైనది, ప్రభో = ఓ ప్రభూ! తవ=నీ యొక్క, సందర్శనాత్=దర్శనమువలన, అహమ్=నేను, శుభక్షేత్ర గతశ్చ=పుణ్యక్షేత్రములో నున్నవాడను.

తా. నీవు వచ్చుట చాల ఆశ్చర్యజనకము. నాకు చాల పవిత్రత్వమును చేకూర్చుచున్నది. నీ దర్శనమువలన నేను పుణ్యక్షేత్రములో నివసించి నట్లున్నది. 54

మూ. బ్రూహి యత్ప్రార్థితం తుభ్యం కార్యమాగమనం ప్రతి,
ఇచ్ఛామ్యనుగృహీతోఽహం త్వదర్థపరివృద్ధయే. 55

ప్ర. అ. ఆగమనం ప్రతి = ఇచటికి వచ్చుటను గూర్చి, తుభ్యమ్=నీకు, ప్రార్థితమ్=కోరబడిన, యత్=ఏ, కార్యమ్=కార్యమున్నదో, దానిని, బ్రూహి= చెప్పుము, అహమ్ = నేను, అనుగృహీతః=అనుగ్రహింపబడినవాడనై, త్వదర్థ పరివృద్ధయే = నీ కార్యము యొక్క వృద్ధికొరకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. నీవు ఏ కార్యమును కోరి ఇచటకు వచ్చితివో చెప్పుము. ఆజ్ఞారూప మగు అనుగ్రహము చేయుము. నీ కార్యమును సాధించుటకు సిద్ధముగా నున్నాను. 55

మూ. కార్యస్య న విమర్శం చ గన్తుమర్హసి కౌశిక,
కర్తా చాహమశేషేణ దైవతం హి భవాన్మమ. 56

ప్ర. అ. కౌశిక = విశ్వామిత్రుడా ! కార్యస్య = కార్యము విషయమున, విమర్శమ్=ఆలోచనను, గన్తుమ్=పొందుటకు, న అర్హసి = తగవు, అహమ్= నేను, విశేషేణ=పూర్తిగా, కర్తా చ = ఆ కార్యము చేయగలవాడను. భవాన్= నీవు, మమ=నాకు, దైవతం హి=దేవతవు కదా.

తా. విశ్వామిత్రా ! నీవు వచ్చిన కార్యము చాల గొప్పది కావచ్చును. అయినను సందేహింపకుము. నేను దానిని పూర్తిగ నెరవేర్చెదను. నీవు నాకు దైవతము వంటి వాడవు. 56

మూ. మమ చాయమనుప్రాప్తో మహానభ్యుదయో ద్విజ,
తవాగమనజః కృత్స్నో ధర్మశ్చానుత్తమో మమ. 57

ప్ర. అ. ద్విజ = ఓ బ్రాహ్మణోత్తమా ! మమ = నాకు, అయమ్ = ఈ, మహాన్=గొప్ప, అభ్యుదయః = అభివృద్ధి, అనుప్రాప్తః = లభించినది. మమ = నాకు, తవ ఆగమనజః=నీ రాకవల్ల కలిగిన, కృత్స్నః=సమస్తమైన, ధర్మః= ధర్మము, అనుత్తమః = చాల గొప్పది.

తా. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! ఈనాడు నాకు గొప్ప అభ్యుదయము లభించి నది. నీ రాకవలన నాకు కలిగిన ఈ ధర్మము చాల గొప్పది. 57

మూ. ఇతి హృదయసుఖం నిశమ్య వాక్యం.
శ్రుతిసుఖమాత్మవతా వినీతముక్తమ్,

ప్రథితగుణయశా గుణైర్విశిష్టః
పరమఋషిః పరమం జగామ హర్షమ్. 58

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
అష్టాదశః సర్గః.

ప్ర. అ. ఆత్మవతా = బుద్ధిమంతు డగు దశరథునిచేత, ఇతి = ఈ విధముగా, వినీతమ్ = వినయపూర్వకముగా, ఉక్తమ్ = పలకబడిన, హృదయసుఖమ్ = హృదయమునకు సుఖకర మైన, శ్రుతిసుఖమ్ = చెవులకు సుఖకర మైన, వాక్యమ్ = వాక్యమును, నిశమ్య = విని, ప్రథితగుణయశాః = ప్రసిద్ధ మైన గుణములును కీర్తియు కలవాడును, గుణైః = సద్గుణములచే, విశిష్టః = శ్రేష్ఠుడును అయిన, పరమఋషిః = గొప్పవా డైన ఋషి, పరమమ్ = గొప్ప, హర్షమ్ = సంతోషమును, జగామ = పొందెను.

తా. బుద్ధిమంతు డగు దశరథుడు వినయపూర్వకముగా పలికిన, శ్రోత్రములకును, హృదయమునకును సుఖమును కలిగించువాక్యములను విని, ప్రసిద్ధము లైన గుణములు కీర్తి కలవాడును, సద్గుణములచే శ్రేష్ఠుడును అగు విశ్వామిత్రుడు చాల ఆనందించెను. 58

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో పదునెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనవింశః సర్గః

మూ. తచ్ఛ్రుత్వా రాజసింహస్య వాక్యమద్భుతవిస్తరమ్,
హృష్టరోమా మహాతేజా విశ్వామిత్రోఽభ్యభాషత. 1

ప్ర. అ. రాజసింహస్య = రాజశ్రేష్ఠునియొక్క, తత్ = ఆ, అద్భుతవిస్తరమ్=ఆశ్చర్యకరమును విస్తృతమును అగు, వాక్యమ్=వాక్యమును, శ్రుత్వా= విని, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, హృష్టరోమాః = గగుర్పొడిచిన రోమములు కలవాడై, అభ్యభాషత = పలికెను.

తా. ఆ రాజశ్రేష్ఠుని ఆశ్చర్యకరములును, విస్తృతములును అగుమాటలు విని, మహాతేజఃశాలి యగు విశ్వామిత్రుడు ఆనందముచే గగుర్పాటు కలిగిన శరీరముకలవాడై, ఇట్లు పలికెను. 1

మూ. సదృశం రాజశార్దూల తవైతద్భువి నాన్యథా,
మహావంశప్రసూతస్య వసిష్ఠవ్యపదేశినః. 2

ప్ర. అ. రాజశార్దూల = ఓ రాజశ్రేష్ఠుడా ! భువి = భూమియందు, మహావంశప్రసూతస్య = గొప్పవంశమునందు పుట్టినవాడును, వసిష్ఠవ్యపదేశినః = వసిష్ఠుని ఉపదేశములను పొందినవాడును అగు, తవ = నీకు, ఏతత్ = ఇదియే, సదృశమ్=తగియున్నది. అన్యథా=మరి యొక విధముగా నైనచో, న=కాదు.

తా. ఓ రాజశ్రేష్ఠుడా ! మహావంశమునందు పుట్టి వసిష్ఠుని ఉపదేశములను పొందుచున్న నీవు ఈ విధముగ మాటలాడుటయే యుక్తము. మరొక విధముగ మాటలాడుట అసంభావ్యము. 2

మూ. యత్తు మే హృద్గతం వాక్యం తస్య కార్యస్య నిశ్చయమ్,
కురుష్వ రాజశార్దూల భవ సత్యప్రతిశ్రవాః. 3

ప్ర. అ. రాజశార్దూల = రాజశ్రేష్ఠుడా, మే=నా యొక్క, హృద్గతమ్= మనస్సులో ఉన్న, యత్=ఏ కార్యము, వాక్యమ్=చెప్పదగియున్నదో, తస్య=ఆ,

కార్యస్య=కార్యము యొక్క, నిశ్చయమ్ = నిశ్చయమును, కురుష్వ = చేయుము, సత్యప్రతిశ్రవాః=సత్యమైన ప్రతిజ్ఞ కలవాడవు, భవ=అగుము.

తా. ఓ రాజశ్రేష్ఠా ! నా మనస్సులో నున్న కార్యమును చెప్పెదను. దానిని తప్పక చేయుము. ప్రతిజ్ఞను నిలబెట్టుకొనుము. 3

మూ. అహం నియమమాతిష్ఠే సిద్ధ్యర్థం పురుషర్షభ,
తస్య విఘ్నకరౌ ద్వౌ తు రాక్షసౌ కామరూపిణౌ. 4

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా ! అహమ్=నేను, సిద్ధ్యర్థమ్ = సిద్ధికొరకు, నియమమ్=నియమమును, ఆతిష్ఠే=అవలంబించి ఉన్నాను. తు= కాని, కామరూపిణౌ= స్వేచ్ఛారూపము గల, ద్వౌ=ఇద్దరు, రాక్షసౌ=రాక్షసులు, తస్య = దానికి, విఘ్నకరౌ=విఘ్నము చేయువారుగా ఉన్నారు.

తా. ఓ పురుషశ్రేష్ఠుడా ! నేను ఒక సిద్ధికొరకై ఒక నియమమును అవలంబించి ఉన్నాను. కాని కామరూపవంతులగు ఇద్దరు రాక్షసులు దానికి విఘ్నము చేయుచున్నారు. 4

మూ. వ్రతే మే బహుశశ్చీర్ణే సమాప్త్యాం రాక్షసావిమౌ,
మారీచశ్చ సుబాహుశ్చ వీర్యవంతౌ సుశిక్షితౌ, 5
సమాంసరుధిరౌఘేణ వేదిం తామభ్యవర్షతామ్.

ప్ర. అ. బహుశః = చాలవరకు, చీర్ణే = చేయబడిన, మే=నాయొక్క, వ్రతే = వ్రతమునందు, సమాప్త్యామ్ = సమాప్తిసమయమునందు, వీర్యవన్తౌ = పరాక్రమవంతులును, సుశిక్షితౌ = బాగుగా అభ్యాసము చేసినవారును అగు, మారీచశ్చ = మారీచుడును, సుబాహుశ్చ = సుబాహువు, సమాంసరుధిరౌఘేణ = మాంసముతో కూడిన రక్తప్రవాహముతో, తామ్=ఆ, వేదిమ్ = వేదిని, అభ్యవర్షతామ్ = వర్షించిరి.

తా. నా వ్రతము సమాప్తి చెందు సమయమునకు, వీర్యవంతులును, సుశిక్షితులును అగు మారీచసుబాహువులు వచ్చి, మాంసముతో కూడిన రక్తప్రవాహముతో యజ్ఞవేదికను వర్షించుచుండిరి. 5

మూ. అవధూతే యథా భూతే తస్మిన్నియమనిశ్చయే, 6
కృతశ్రమో నిరుత్సాహ స్తస్మాద్దేశాదపాక్రమే.

ప్ర. అ. తస్మిన్ = ఆ, నియమనిశ్చయే=దీక్షాసంకల్పము, అవదూతే= పాడుచేయబడినదై, తథా భూతే=ఆ విధముగా అయిపోగా, కృతశ్రమః = అంత శ్రమ చేసిన నేను, నిరుత్సాహః = భగ్నోత్సాహుడనై, తస్మాత్ = ఆ, దేశాత్= దేశమునుండి, అపాక్రమే = తొలగివచ్చినాను.

తా. ఆ వ్రతసంకల్పము విఘ్నితమై అట్లయిపోయినది. దానికై ఇంత శ్రమపడిన నేను భగ్నోత్సాహుడనై ఆ దేశమును వదలి వచ్చితిని. 6

మూ. న చ మే క్రోధముత్స్రష్టుం బుద్ధిర్భవతి పార్థివ, 7
తథాభూతా హి సా చర్యా న శాప స్తత్ర ముచ్యతే.

ప్ర. అ. పార్థివ = ఓరాజా! క్రోధమ్ = కోపమును, ఉత్స్రష్టుమ్ = విడచుటకు (చూపుటకు), మే = నాకు, బుద్ధిః = బుద్ధి, న భవతి=కలుగుటలేదు. సా = ఆ, చర్యా = వ్రతచర్య, తథా భూతా హి = అట్టిదికదా, తత్ర = ఆ యాగ సమయమునందు, శాపః = శాపము, న ముచ్యతే = విడువబడదు.

తా. ఓ రాజా! ఆ సమయమున కోపము చూపుటకు బుద్ధి కలుగుటలేదు. ఆ యజ్ఞము అట్టిది. అట్టి యజ్ఞములలో శాపము ఇవ్వకూడదు. 7

మూ. స్వపుత్రం రాజశార్దూల రామం సత్యపరాక్రమమ్, 8
కాకపక్షధరం శూరం జ్యేష్ఠం మే దాతుమర్హసి.

ప్ర. అ. రాజశార్దూల=ఓ రాజశ్రేష్ఠుడా! సత్యపరాక్రమమ్ = సత్యమైన పరాక్రమము కలవాడును, కాకపక్షధరమ్ = జునపములను ధరించుచున్న వాడును, శూరమ్=శూరుడును, స్వపుత్రమ్=నీ కుమారుడైన, జ్యేష్ఠమ్=పెద్దవాడైన, రామమ్=రాముని, మే = నాకు, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ రాజశ్రేష్ఠుడా! శూరుడును, సత్యమైన పరాక్రమము కలవాడును, జునపములు ధరించు కౌమారవయస్సులో నున్నవాడు అగు, నీ జ్యేష్ఠ కుమారుడైన రాముని నా కిమ్ము. 8

మూ. శక్తో హ్యేష మయా గుప్తో దివ్యేన స్వేన తేజసా, 9
రాక్షసా యే వికర్తారస్తేషామపి వినాశనే.

ప్ర. అ. మయా = నాచేత, గుప్తః = రక్షించబడిన, ఏషః = ఈతడు, దివ్యేన = దివ్యమైన, స్వేన = తనసంబంధమైన, తేజసా = తేజస్సుచేత, యే = ఏ, వికర్తారః = విఘ్నముచేయు, రాక్షసాః = రాక్షసులు కలరో, తేషామపి = వారియొక్క కూడ, వినాశనే = నశింపచేయుటయందు, శక్తః = సమర్థుడు కదా.

తా. నాచే రక్షింపబడిన ఈ రాముడు, తన సహజదివ్యతేజస్సుచేత, విఘ్నకారులగు రాక్షసులను సంహరింప సమర్థుడు. 9

మూ. శ్రేయశ్చాస్మై ప్రదాస్యామి బహురూపం న సంశయః, 10
త్రయాణామపి లోకానాం యేన ఖ్యాతిం గమిష్యతి.

ప్ర. అ. అస్మై = ఈతనికి, బహురూపమ్ = అనేకవిధములైన, శ్రేయశ్చ = శ్రేయస్సును కూడ, ప్రదాస్యామి = ఇచ్చెదను. సంశయః = సంశయము, న = లేదు, యేన = దేనిచేత, త్రయాణామ్ = మూడు, లోకానామపి = లోకములలో, ఖ్యాతిమ్ = ప్రసిద్ధిని, గమిష్యతి = పొందగలడో.

తా. రామునకు అనేకవిధములైన శ్రేయస్సును ఇవ్వగలను. దానిచే ఇతడు మూడు లోకములలో కీర్తిని పొందగలడు. సందేహము లేదు. 10

మూ. న చ తౌ రామమాసాద్య శక్తౌ స్థాతుం కథం చన. 11
న చ తౌ రాఘవాదన్యో హన్తుముత్సహతే పుమాన్.

ప్ర. అ. తౌ = ఆ మారీచసుబాహులు, రామమ్ = రాముని, ఆసాద్య = పొంది, కథం చన = ఏ విధముగను, స్థాతుమ్ = నిలుచుటకు, న శక్తౌ = సమర్థులు కారు. రాఘవాత్ = రామునికంటె, అన్యః = ఇతరుడైన, పుమాన్ = పురుషుడు, తౌ = వారిని, హన్తుమ్ = చంపుటకు, న ఉత్సహతే = సమర్థుడు కాడు.

తా. ఆ మారీచసుబాహువులు రాముని ఎదుట ఏ విధముగను నిలువజాలరు. రాముడు తప్ప మరెవ్వరును వారిని చంపజాలరు. 11

మూ. వీర్యోత్సిక్తౌ హి తౌ పాపౌ కాలపాశవశం గతౌ. 12
రామస్య రాజశార్దూల న పర్యాప్తౌ మహాత్మనః.

ప్ర. అ. వీర్యోత్సిక్తౌ=వీర్యముచేత గర్వించిన, తౌ = ఆ, పాపౌ=పాపాత్ములు, కాలపాశవశం=యమపాశముయొక్క వశమును, గతౌ = పొందినారు, రాజశార్దూల = ఓ రాజశ్రేష్ఠుడా! మహాత్మనః=మహాత్ముడైన, రామస్య=రామునను, న పర్యాప్తౌ=సరిపడువారు కారు.

తా. ఓ రాజశ్రేష్ఠుడా! పరాక్రమముచే గర్వించిన ఆ మారీచసుబాహువులు యముని పాశములకు వశులు కావలసి యున్నది. వారు మహాత్ముడైన రామునకు యుద్ధమునందు చాలరు. 12

మూ. న చ పుత్రకృతస్నేహం కర్తుమర్హసి పార్థివ, 13
అహం తే ప్రతిజానామి హతౌ తౌ విద్ధి రాక్షసౌ.

ప్ర. అ. పార్థివ = ఓరాజా! పుత్రకృతమ్=పుత్రునియందు చేయబడు, స్నేహమ్ = స్నేహమును, కర్తుమ్ = చేయుటకు, న అర్హసి = తగవు. తౌ=ఆ, రాక్షసౌ = రాక్షసులను, హతౌ = చంపబడినవారినిగా, విద్ధి = తెలుసుకొనుము. అహమ్ = నేను, తే = నీకు, ప్రతిజానామి = ప్రతిజ్ఞ చేయుచున్నాను.

తా. ఓ రాజా! రామునియందున్న పుత్రస్నేహముచే వెనుదీయకుము. ఆ రాక్షసులు రామునిచే సంహరింపబడినారనియే నిశ్చయించుకొనుము. నేను నీకు ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను.

మూ. అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్, 14
వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః.

ప్ర. అ. మహాత్మానమ్ = మహాత్ముడును, సత్యపరాక్రమమ్=సత్యమైన పరాక్రమము కలవాడును అగు, రామమ్ = రాముని గూర్చి, అహమ్ = నేను, వేద్మి=ఎరుగుదును, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, వసిష్ఠోఽపి=వసిష్ఠుడును, యే=ఏ, తపసి స్థితాః=తపస్సులో నున్న, ఇమే=ఈ మహర్షులు గలరో, వీరును (ఎరుగుదురు).

తా. మహాత్ముడును, సత్యపరాక్రముడును అగు రాము డెట్టివాడో నాకు తెలియును, వసిష్ఠునకు తెలియును. ఈ మహర్షులకు తెలియును. రాముడు నీ

కుమారు డగుటచే నీవాతనిని సామాన్యునిగ తలపవచ్చును. ఆతని యథార్థ స్వరూపము మావంటి తపోధనులకు మాత్రమే తెలియును. 14

మూ. యది తే ధర్మలాభం చ యశశ్చ పరమం భువి, 15
స్థితమిచ్ఛసి రాజేన్ద్ర రామం మే దాతుమర్హసి.

ప్ర. అ. రాజేన్ద్ర=ఓ రాజశ్రేష్ఠుడా! తే=నీకు, ధర్మలాభమ్=ధర్మము యొక్క లాభమును, ఇచ్ఛసి యది = కోరినట్లైతే, పరమమ్ = గొప్పదైన, యశశ్చ=కీర్తిని కూడ, భువి = భూమియందు, స్థితమ్ = ఉండుదానినిగా, (ఇచ్ఛసి యది = కోరినట్లైతే), రామమ్ = రాముని, మే = నాకు, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ రాజేంద్రా! నీవు ధర్మము కావలె నని కోరినట్లైతే, నీ గొప్ప కీర్తి భూలోకమున స్థిరముగా నుండ వలె నని నీకు అభిలాష ఉన్నట్లైతే, రాముని నా కిమ్ము. 15

మూ. యది హ్యనుజ్ఞాం కాకుత్స్థ దదతే తవ మన్త్రిణః, 16
వసిష్ఠప్రముఖాః సర్వే తతో రామం విసర్జయ.

ప్ర. అ. కాకుత్స్థ = ఓ కకుత్స్థవంశీయుడా! తవ = నీ యొక్క, మన్త్రిణః = మంత్రులును, వసిష్ఠప్రముఖాః=వసిష్ఠుడు మొదలుగా గల, సర్వే= అందరును, అనుజ్ఞామ్=అనుజ్ఞను, దదతే యది = ఇచ్చినట్లైతే, తతః = అటు పిమ్మట, రామమ్=రాముని, విసర్జయ = ఇమ్ము.

తా. దశరథమహారాజా! నీ మంత్రులును వసిష్ఠాదులును అనుజ్ఞ ఇచ్చిననే రాముని పంపుము. 16

మూ. అభిప్రేతమసంసక్తమాత్మజం దాతుమర్హసి, 17
దశరాత్రం హి యజ్ఞస్య రామం రాజీవలోచనమ్.

ప్ర. అ. అభిప్రేతమ్=ఇష్టుడైన, ఆత్మజమ్ = కుమారుడును, రాజీవలోచనమ్ = పద్మములవంటి నేత్రములు కలవాడును అగు, రామమ్ = రాముని,

అనంనక్తమ్ = ఆలస్యము లేకుండగా, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, దశరాత్రమ్ = పదిదినములు, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. పద్మపత్రవిశాలాక్షు డైన, నీ ప్రియపుత్రు డైన రాముని పది దినములు జరుగు యాగమును రక్షించుటకై, ఆలస్యము చేయక నా కిమ్ము. 17

మూ. నాత్యేతి కాలో యజ్ఞస్య యథాయం మమ రాఘవ, 18
తథా కురుష్వ భద్రం తే మా చ శోకే మనః కృథాః.

ప్ర. అ. రాఘవ=ఓ దశరథమహారాజా ! మమ=నాయొక్క, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, అయం కాలః = ఈ సమయము, యథా = ఎట్లు, నాత్యేతి = దాటిపోకుండ ఉండునో, తథా = ఆ విధముగా, కురుష్వ = చేయుము, శోకే = దుఃఖమునందు, మనః = మనస్సును, మా కృథాః = చేయకుము.

తా. దశరథమహారాజా! నా యజ్ఞసమయము దాటిపోకుండునట్లు చూడుము. నీకు క్షేమ మగును. దుఃఖింపకుము. 18

మూ. ఇత్యేవముక్త్వా ధర్మాత్మా ధర్మార్థసహితం వచః, 19
విరరామ మహాతేజాః విశ్వామిత్రో మహామునిః.

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడును, మహాతేజాః = గొప్ప తేజస్సుకలవాడును, మహామునిః = మహామునియు అగు, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, ఇత్యేవమ్ = ఈ విధముగా, ధర్మార్థసహితమ్ = ధర్మార్థములతో కూడిన, వచః = వాక్కును, ఉక్త్వా = పలికి, విరరామ = విరమించెను.

తా. ధర్మాత్ముడును, మహాతేజఃశాలియు అగు విశ్వామిత్ర మహాముని, ఈ విధముగ ధర్మార్థసహిత మగు వాక్యము పలికి ఊరకుండెను. 19

మూ. స తన్నిశమ్య రాజేన్ద్రో విశ్వామిత్రవచః శుభమ్, 20
శోకమభ్యగమత్తీవ్రం వ్యషీదత భయాన్వితః.

ప్ర. అ. సః = ఆ, రాజేన్ద్రః=రాజశ్రేష్ఠుడు, శుభమ్ = శుభకర మైన, తత్=ఆ, విశ్వామిత్రవచః=విశ్వామిత్రుని వాక్యమును, నిశమ్య=విని, తీవ్రమ్=

తీవ్ర మైన, శోకమ్=శోకమును, అభ్యగమత్=పొందెను. భయాన్వితః = భయముతో కూడినవాడై, వ్యథితః=క్రుంగిపోయెను.

తా. దశరథుడు విశ్వామిత్రుడు పలికిన ఆ శుభకర మగు వాక్యమును విని, తీవ్ర మైన శోకమును పొంది భయముతో క్రుంగిపోయెను. 20

మూ. ఇతి హృదయమనోవిదారణం
మునివచనం తదతీవ శుశ్రువాన్,
నరపతిరభవన్మహాం స్తదా
వ్యథితమనాః ప్రచచాల చాసనాత్. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకోనవింశః సర్గః.

ప్ర. అ. ఇతి = ఈ విధముగా, హృదయమనోవిదారణమ్ = హృదయమును మనస్సును చీల్చివేయు, తత్ = ఆ, మునివచనమ్ = మునివాక్యమును, శుశ్రువాన్ = వినిన, మహాన్ = పూజ్యుడైన, నరపతిః = రాజు, తదా=అప్పుడు, వ్యథితమనాః=వ్యథ చెందిన మనస్సు కలవాడు, అభవత్=ఆయెను, ఆసనాత్= ఆసనమునుండి, చచాల చ = చలించిపోయెను కూడ.

తా. విశ్వామిత్రుడు పలికిన ఆ మాటలు దశరథుని హృదయమును మనస్సును చీల్చివేసినవి. ఆ మాటలు విన్న ఆ రాజు మనస్సులో వ్యథ చెందెను. ఆసనమునుండి చలించెను. 21

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో పందొమ్మిదవసర్గ సమాప్తము.

అథ వింశః సర్గః

మూ. తచ్ఛ్రుత్వా రాజశార్దూలో విశ్వామిత్రస్య భాషితమ్,
ముహూర్తమివ నిస్సంజ్ఞః సంజ్ఞావానిదమబ్రవీత్. 1

ప్ర. అ. రాజశార్దూలః = ఆ రాజశ్రేష్ఠుడు, విశ్వామిత్రస్య = విశ్వామిత్రుని యొక్క, తత్ భాషితమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, ముహూర్తమివ = క్షణకాలముపాటు, నిస్సంజ్ఞః = సంజ్ఞ కోల్పోయినవాడై, సంజ్ఞావాన్ = మరల సంజ్ఞ పొంది, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. విశ్వామిత్రుని మాటలు వినగానే దశరథుడు క్షణకాలముపాటు నిశ్చేష్టు డయ్యెను. మరల సంజ్ఞ పొంది ఇట్లు పలికెను. 1

మూ. ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః,
న యుద్ధయోగ్యతామస్య పశ్యామి సహ రాక్షసైః. 2

ప్ర. అ. రాజీవలోచనః = పద్మముల వంటి నేత్రములు గల, మే = నా యొక్క, రామః = రాముడు, ఊనషోడశవర్షః = పదహారు సంవత్సరములకంటె తక్కువ వయస్సువాడు. అస్య = ఈతనికి, రాక్షసైః సహ = రాక్షసులతో కూడ, యుద్ధయోగ్యతామ్ = యుద్ధము చేయు యోగ్యతను, న పశ్యామి = చూడను.

తా. రాజీవలోచను డైన నా రామునకు పదహారు సంవత్సరములు కూడ నిండ లేదు. ఈతనికి రాక్షసులతో యుద్ధము చేయు యోగ్యత ఉన్న దని నేను భావింపను.

వి. అరణ్యకాండములో మారీచుడు రాముని గూర్చి రావణునితో—"విశ్వామిత్రయాగ రక్షణకాలమునాటికి రామునకు పండ్రెండు ఏండ్ల వయస్సు" అని చెప్పనున్నాడు—"బాలో ద్వాదశవర్షోయమకృతాస్త్రశ్చ రాఘవః". దానిని పట్టి ఇచట "ఊనషోడశవర్షః" అనగా "పండ్రెండేండ్ల వయస్సువాడు" అని యర్థము. (గోవిందరాజులు). 2

మూ. ఇయమక్షౌహిణీ పూర్ణా యస్యాహం పతిరీశ్వరః,
అనయా సంవృతో గత్వా యోద్ధాహం తైర్నిశాచరైః. 3

ప్ర. అ. పూర్ణా=నిండిన, ఇయమ్=ఈ, అక్షౌహిణీ=అక్షౌహిణి ఉన్నది. యస్యాః=దేనికి, అహమ్=నేను, పతిః=అధిపతినో; ఈశ్వరః=నియమించు వాడనో. అనయా=ఈ అక్షౌహిణితో, సంవృతః=కూడినవాడనై, గత్వా=వెళ్లి, అహమ్=నేను, తైః=ఆ, నిశాచరైః=రాక్షసులతో, యోద్ధా=యుద్ధము చేయ గలను.

తా. ఇదిగో; ఈ అక్షౌహిణి పూర్ణముగ నున్నది. దీనికి నేను అధిపతిని; నియామకుడను. దీనితో వెళి నేను రాక్షసులతో యుద్ధము చేయగలను. 3

మూ. ఇమే శూరాశ్చ విక్రాన్తా భృత్యా మేఽస్త్రవిశారదాః,
యోగ్యా రక్షోగణైర్యోద్ధుం న రామం నేతుమర్హసి. 4

ప్ర. అ. మే=నాయొక్క, భృత్యాః=భృత్యులైన, ఇమే=ఈ సైనికులు, శూరాశ్చ=శూరులు; విక్రాన్తాః=పరాక్రమము కలవారు; అస్త్రవిశారదాః=అస్త్రము లందు నేర్పు గలవారు; రక్షోగణైః=రాక్షసగణములతో, యోద్ధుమ్=యుద్ధము చేయుటకు, యోగ్యాః=తగినవారు. రామమ్=రాముని, నేతుమ్=తీసికొనివెళ్లు టకు, నార్హసి=తగవు.

తా. నా పోషణలో నున్న ఈ సైనికులు శూరులు; విక్రమవంతులు; అస్త్ర ములయందు సమర్థులు. వీరు రాక్షసులతో యుద్ధము చేయుటకు యోగ్యులు. నీవు రాముని తీసికొని వెళ్లవలదు. 4

మూ. అహమేవ ధనుష్పాణిర్గోప్తా సమరమూర్ధని,
యావత్ప్రాణాన్ ధరిష్యామి తావద్యోత్స్యే నిశాచరైః. 5

ప్ర. అ. అహమేవ=నేనే, ధనుష్పాణిః=ధనుస్సు హస్తమునందు కల వాడనై, గోప్తా=రక్షించగలవాడను. యావత్=ఎంతవరకు, ప్రాణాన్=ప్రాణ ములను, ధరిష్యామి=ధరింతునో, తావత్=అంతవరకు, సమరమూర్ధని= యుద్ధముయొక్క అగ్రభూమియందు, నిశాచరైః = రాక్షసులతో, యోత్స్యే = యుద్ధము చేయగలను.

తా. ధనుర్ధారినై నేనే యాగమును రక్షించెదను. నా ప్రాణము లున్నంత వరకును యుద్ధాగ్రమునందు రాక్షసులతో యుద్ధము చేసెదను. 5

మూ. నిర్విఘ్నా వ్రతచర్యా సా భవిష్యతి సురక్షితా,
అహం తత్రాగమిష్యామి న రామం నేతుమర్హసి. 6

ప్ర. అ. అహమ్=నేను, తత్ర=అచటికి, ఆగమిష్యామి=వచ్చెదను, సా=ఆ, వ్రతచర్యా=వ్రతానుష్ఠానము, సురక్షితా=బాగుగా రక్షింపబడినదై, నిర్విఘ్నా=విఘ్నములు లేనిది, భవిష్యతి=కాగలదు. రామమ్=రాముని, నేతుమ్=తీసికొని వెళ్లుటకు, నార్హసి=తగవు.

తా. నేనే అచటికి వచ్చి, యాగమును రక్షించి అది నిర్విఘ్నముగ కొనసాగునట్లు చేసెదను. రాముని తీసికొనివెళ్లవలదు. 6

మూ. బాలో హ్యకృతవిద్యశ్చ న చ వేత్తి బలాబలమ్,
న చాస్త్రబలసంయుక్తో న చ యుద్ధవిశారదః. 7
న చాసౌ రక్షసాం యోగ్యః కూటయుద్ధా హి తే ధ్రువమ్.

ప్ర. అ. హి=ఏలననగా, (రాముడు), బాలః=బాలుడు; అకృతవిద్యశ్చ=బాగుగా నేర్వబడని విద్యలు కలవాడు; బలాబలమ్=బలాబలములను, న వేత్తి=ఎరుగడు; అస్త్రబలసంయుక్తః చ=అస్త్రబలముతో కూడినవాడు కూడ, న=కాడు; యుద్ధవిశారదః చ=యుద్ధమునందు నేర్పు కలవాడు కూడ, న=కాడు; అసౌ=ఇతడు, రక్షసామ్=రాక్షసులకు, యోగ్యః=తగినవాడు, న=కాడు; తే=వారు, ధ్రువమ్=నిశ్చయముగా, కూటయుద్ధాః హి=కపటయుద్ధము కలవారు కదా!

తా. నా రాముడు చిన్నవాడు; పూర్తిగ విద్యలను నేర్వలేదు; శత్రువుల బలాబలములను గుర్తింపజాలడు; ఇంకను అస్త్రబలమును సంపాదింపలేదు. యుద్ధమునందు నేర్పు లేని వాడు. రాక్షసులు తప్పక కపటయుద్ధము చేయుదురు. అందుచే వారితో యుద్ధముచేయుటకు రాముడు తగినవాడు కాడు. 7

మూ. విప్రయుక్తో హి రామేణ ముహూర్తమపి నోత్సహే, 8
జీవితుం మునిశార్దూల న రామం నేతుమర్హసి.

ప్ర. అ. రామేణ=రామునితో, విప్రయుక్తః=వియోగము పొందినవాడనై, ముహూర్తమపి=క్షణకాల మైనను, జీవితుమ్=జీవించుటకు, నోత్సహే=సమర్థు

డను కాను. మునిశార్దూల=మునిశ్రేష్ఠుడా! రామమ్=రాముని, నేతుమ్=తీసికొని వెళ్లుటకు, నార్హసి=తగవు.

తా. ఓ మునిశ్రేష్ఠా! రాముడు లేనిచో క్షణకాల మైనను జీవింపజాలను. రాముని తీసికొనివెళ్లవలదు. 8

మూ. యది వా రాఘవం బ్రహ్మన్ నేతుమిచ్ఛసి సువ్రత, 9
చతురఙ్గసమాయుక్తం మయా చ సహితం నయ.

ప్ర. అ. సువ్రత = మంచి వ్రతము కలవాడా! బ్రహ్మన్=ఓ బ్రాహ్మణుడా! వా=లేక, రామమ్=రాముని, నేతుమ్=తీసికొనివెళ్లుటకు, ఇచ్ఛసి యది=ఇచ్ఛయించుచున్నట్లైతే, చతురఙ్గసమాయుక్తమ్=చతురంగబలముతో కూడినవానిని, మయా చ=నాతో కూడ, సహితమ్=కూడినవానిని, నయ=తీసికొని వెళ్లుము.

తా. ఉత్తమవ్రతవంతుడవైన ఓ విశ్వామిత్రా! రామునే తీసికొని వెళ్లవలె నని నీకు ఇచ్ఛ ఉన్నచో, అతనితో పాటు చతురంగబలమును, నన్ను కూడ తీసికొనివెళ్లుము. 9

మూ. షష్టిర్వర్షసహస్రాణి మమ జాతస్య కౌశిక, 10
దుఃఖేనోత్పాదితశ్చాయం న రామం నేతుమర్హసి.

ప్ర. అ. కౌశిక=ఓ విశ్వామిత్రుడా! జాతస్య=పుట్టిన, మమ=నాకు, షష్టిః=అరువది, వర్షసహస్రాణి=సంవత్సరముల సహస్రములు, కడచినవి. అయమ్=ఈతడు, దుఃఖేన=అతిశ్రమచేత, ఉత్పాదితః=కనబడినాడు. రామమ్=రాముని, నేతుమ్=తీసికొనివెళ్లుటకు, న అర్హసి=తగవు.

తా. విశ్వామిత్రా! అరవైవేల సంవత్సరముల వయస్సునందు, ఎంతో శ్రమపడి ఈతనిని కన్నాను. రాముని తీసికొని వెళ్లవలదు. 10

మూ. చతుర్ణామాత్మజానాం హి ప్రీతిః పరమికా మమ, 11
జ్యేష్ఠం ధర్మప్రధానం చ న రామం నేతుమర్హసి.

ప్ర. అ. చతుర్ణామ్=నలుగురు, ఆత్మజానామ్=కుమారులవిషయమున, మమ=నాకు, పరమికా=గొప్ప, ప్రీతిః హి=ప్రేమ ఉన్నది కదా. జ్యేష్ఠమ్=పెద్దవాడును, ధర్మప్రధానం చ=ధర్మవిషయమున ప్రధానుడును అగు, రామమ్=రాముని, నేతుమ్=తీసికొని వెళ్లుటకు, నార్హసి=తగవు.

తా. నలుగురు కుమారుల విషయమునందును నాకు గొప్ప ప్రేమ ఉన్నది. కాని జ్యేష్ఠుడును, అందుచే ధర్మవిషయమున ప్రధానుడును అగు రాముని తీసికొనివెళవలదు. 11

మూ. కింవీర్యా రాక్షసాస్తే చ కస్య పుత్రాశ్చ కే చ తే, 12
కథంప్రమాణాః కే చైతాన్ రక్షన్తి మునిపుఙ్గవ.

ప్ర. అ. మునిపుఙ్గవ=మునిశ్రేష్ఠుడా! తే రాక్షసాః=ఆ రాక్షసులు, కింవీర్యాః=ఎట్టి వీర్యము కలవారు? కస్య=ఎవనియొక్క, పుత్రాః=పుత్రులు? తే=వారు, కే = ఎవరు? కథంప్రమాణాః=ఎంతటిప్రమాణము కలవారు? ఏతాన్=వీరిని, కే=ఎవరు, రక్షన్తి=రక్షించుచున్నారు?

తా. ఓ మునిశ్రేష్ఠుడా! ఆ రాక్షసుల పరాక్రమ మెట్టిది? వారు ఎవరు? ఎవరి కుమారులు? వారి ప్రమాణము ఎంత? వారిని ఎవరు రక్షించుచున్నారు? 12

మూ. కథం చ ప్రతికర్తవ్యం తేషాం రామేణ రక్షసామ్, 13
మామకైర్వా బలైర్బ్రహ్మన్ మయా వా కూటయోధినామ్.

ప్ర. అ. బ్రహ్మన్=బ్రాహ్మణుడా! కూటయోధినామ్=కపటయుద్ధము చేయు, తేషాం రక్షసామ్=ఆ రాక్షసుల విషయమున, రామేణ=రామునిచేత కాని, మామకైః=నా సంబంధ మైన, బలైః వా=సైన్యములచేత గాని, మయా వా=నాచేత కాని, కథమ్=ఎట్లు, ప్రతికర్తవ్యమ్=ప్రతిక్రియ చేయదగినది?

తా. ఓ విశ్వామిత్రా! కపటయుద్ధము చేయు ఆ రాక్షసుల విషయమున రాముడు కాని, నా సైన్యములు కాని, నేను కాని ఎట్లు ప్రతిక్రియ చేయవలసి యుండును? 13

మూ. సర్వం మే శంస భగవన్ కథం తేషాం మయా రణే, 14
స్థాతవ్యం దుష్టభావానాం వీర్యోత్సిక్తా హి రాక్షసాః.
తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రోఽభ్యభాషత. 15

ప్ర. అ. భగవన్ = ఓ పూజ్యుడా! దుష్టభావానామ్ = దుష్టస్వభావులైన, తేషామ్=వారియెదుట, మయా=నాచేత, రణే=యుద్ధమునందు, కథమ్=ఎట్లు, స్థాతవ్యమ్=ఉండదగినది? సర్వమ్=ఈ విషయమునంతను, మే = నాకు, శంస = చెప్పుము, రాక్షసాః = రాక్షసులు, వీర్యోత్సిక్తాః హి=వీర్యముచేత గర్వితులు కదా. తస్య=ఆతనియొక్క, తత్=ఆ, వచనమ్=వాక్యమును, శ్రుత్వా=విని, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, అభ్యభాషత=పలికెను.

తా. దుష్టస్వభావులైన ఆ రాక్షసులతో యుద్ధమునందు నే నెట్లు మెలగవలెను? ఈ విషయము లన్నియు చెప్పుము. రాక్షసులు పరాక్రమముచే గర్వించుచుందురు కదా? దశరథుని మాటలు విని విశ్వామిత్రుడు ఇట్లు పలికెను. 15

మూ. పౌలస్త్యవంశప్రభవో రావణో నామ రాక్షసః,
స బ్రహ్మణా దత్తవరస్త్రైలోక్యం బాధతే భృశమ్, 16
మహాబలో మహావీర్యో రాక్షసైర్బహుభిర్వృతః.

ప్ర. అ. పౌలస్త్యవంశప్రభవః=పౌలస్త్యుని వంశమునందు పుట్టుక గల, రావణో నామ=రావణు డను పేరు గల, రాక్షసః=రాక్షసుడు (ఉన్నాడు). మహాబలః=గొప్ప బలము కలవాడును, మహావీర్యః=గొప్ప పరాక్రమము కల వాడును అగు, సః=అతడు, బ్రహ్మణా=బ్రహ్మచేత, దత్తవరః=ఇవ్వబడిన వరముగలవాడై, బహుభిః=అనేకులైన, రాక్షసైః=రాక్షసులతో, వృతః=కూడిన వాడై, త్రైలోక్యమ్=మూడులోకములను, భృశమ్=మిక్కిలి, బాధతే=బాధించు చున్నాడు.

తా. పౌలస్త్యవంశమునందు జనించిన రావణుడను రాక్షసు డున్నాడు. మహాబలవంతుడును, మహావీర్యవంతుడును అగు ఆతడు బ్రహ్మనుండి వరమును పొంది, చాలమంది రాక్షసులతో కలిసి, మూడు లోకములను మిక్కిలి పీడించు చున్నాడు. 16

మూ. శ్రూయతే హి మహావీర్యో రావణో రాక్షసాధిపః, 17
సాక్షాద్వైశ్రవణభ్రాతా పుత్రో విశ్రవసో మునేః.

ప్ర. అ. సాక్షాత్=సాక్షాత్తు, వైశ్రవణభ్రాతా=కుబేరుని సోదరుడును, విశ్రవసః=విశ్రవసు డనే, మునేః=మునియొక్క, పుత్రః=పుత్రుడును, రాక్షసాధిపః=రాక్షసుల ప్రభువును ఐన, రావణః=రావణుడు, మహావీర్యః=గొప్ప పరాక్రమము కలవాడుగా, శ్రూయతే=వినబడుచున్నాడు.

తా. రాక్షసరాజైన ఆ రావణుడు విశ్రవసు డను మునియొక్క పుత్రుడు. సాక్షాత్తు కుబేరుని సోదరుడు. ఆతడు గొప్ప పరాక్రమము కలవా డని వినుచున్నాము. 17

మూ. యదా స్వయం న యజ్ఞస్య విఘ్నకర్తా మహాబలః, 18
తేన సంచోదితౌ ద్వౌ తు రాక్షసౌ సుమహాబలౌ,
మారీచశ్చ సుబాహుశ్చ యజ్ఞవిఘ్నం కరిష్యతః. 19

ప్ర. అ. మహాబలః=గొప్పబలముగల ఆ రావణుడు, యదా=ఎప్పుడు, స్వయమ్=స్వయముగా, యజ్ఞస్య=యజ్ఞమునకు, విఘ్నకర్తా=విఘ్నముచేయువాడు, న=కాడో, తేన=వానిచేత, సంచోదితౌ=ప్రేరేపించబడిన, మారీచశ్చ=మారీచుడును, సుబాహుశ్చ=సుబాహువు అనెడు, ద్వౌ=ఇద్దరు, రాక్షసౌ=రాక్షసులు, విఘ్నమ్=విఘ్నమును, కరిష్యతః=చేయగలరు.

తా. మహాబలు డైన ఆతడు స్వయముగా యజ్ఞమునకు విఘ్నము చేయడు కాని, ఆతనిచే ప్రేరేపింపబడిన మారీచసుబాహువు లనెడు ఇద్దరు రాక్షసులు యజ్ఞవిఘ్నము చేయుచుందురు. 18-19

మూ. ఇత్యుక్తో మునినా తేన రాజోవాచ మునిం తదా,
న హి శక్తోఽస్మి సంగ్రామే స్థాతుం తస్య దురాత్మనః. 20

ప్ర. అ. ఇతి=ఈ విధముగా, తేన మునినా=ఆ మునిచేత, ఉక్తః=పలకబడిన, రాజా=రాజు, తదా=అప్పుడు, మునిమ్=మునినిగూర్చి, ఉవాచ=పలికెను. సంగ్రామే=యుద్ధమునందు, తస్య=ఆ, దురాత్మనః=దురాత్ముని ఎదుట, స్థాతుమ్=నిలుచుటకు, శక్తః న అస్మి=సమర్థుడను కాను.

తా. విశ్వామిత్రుడు ఇట్లు చెప్పగా విని దశరథుడు ఆతనితో ఇట్లనెను. నేను యుద్ధమునందు ఆ దురాత్ముని ఎదుట నిలువజాలను. 20

మూ. స త్వం ప్రసాదం ధర్మజ్ఞ కురుష్వ మమ పుత్రకే,
మమ చైవాల్పభాగ్యస్య దైవతం హి భవాన్ గురుః. 21

ప్ర. అ. ధర్మజ్ఞ=ధర్మములు తెలిసినవాడా! సః త్వమ్= అట్టి, నీవు, మమ=నాయొక్క, పుత్రకే=చిన్ని కుమారునియందును, అల్పభాగ్యస్య=అల్పమైన భాగ్యము గల, మమ చ=నా విషయమునందును, ప్రసాదమ్=అనుగ్రహమును, కురుష్వ=చేయుము. గురుః=గురువైన, భవాన్=నీవు, దైవతం హి=దైవతము కదా?

తా. సర్వధర్మములును తెలిసిన ఓ విశ్వామిత్రా ! నీవు నా చిన్నికొమరునియందును, అల్పభాగ్యుడనైన నాయందును అనుగ్రహము చూపుము. గురువైన నీవు దైవము కదా. 21

మూ. దేవదానవగన్ధర్వా యక్షాః పతగపన్నగాః,
న శక్తా రావణం సోఢుం కిం పునర్మానవా యుధి. 22

ప్ర. అ. దేవదానవగన్ధర్వాః = దేవదానవగంధర్వులు కాని, యక్షాః = యక్షులు కాని, పతగపన్నగాః=పక్షులును సర్పములును గాని, యుధి=యుద్ధమునందు, రావణమ్=రావణుని, సోఢుమ్=సహించుటకు, న శక్తాః = సమర్థులు కారు. మానవాః=మానవులు, కిం పునః=చెప్పనేల?

తా. దేవదానవగంధర్వయక్షపతగపన్నగులు కూడ ఎదుట నిలిచి రావణునితో యుద్ధము చేయజాలరు. మానవుల మాట చెప్పవలెనా? 22

మూ. స హి వీర్యవతాం వీర్యమాదత్తే యుధి రాక్షసః,
తేన చాహం న శక్తోఽస్మి సంయోద్ధుం తస్య వా బలైః. 23
సబలో వా మునిశ్రేష్ఠ సహితో వా మమాత్మజైః.

ప్ర. అ. సః రాక్షసః=ఆ రాక్షసుడు, యుధి = యుద్ధమునందు, వీర్యవ

తామ్=వీర్యవంతులయొక్క, వీర్యమ్=వీర్యమును, ఆదత్తే హి=గ్రహించి వేయునుకదా? మునిశ్రేష్ఠ=ఓమునిశ్రేష్ఠుడా! సబలో వా=సైన్యముతో కూడిన వాడనైనను, మమ=నాయొక్క, ఆత్మజైః=కుమారులతో, సహితో వా=కూడిన వాడనైనను, అహమ్=నేను, తేన=వానితో గాని, తస్య=ఆతనియొక్క, బలైః వా=సైన్యముతో గాని, సంయోద్ధుమ్=యుద్ధముచేయుటకు, శక్తః=సమర్థుడను, నాస్మి=కాను.

తా. ఆ రాక్షసుడు యుద్ధములో వీర్యవంతుల వీర్యమును గ్రహించి వేయును. ఓ మునిశ్రేష్ఠా! సైన్యముతో కూడినవాడనై గాని, నా కుమారులతో కలిసి గాని, నేను, ఆతనితో గాని, ఆతని సైన్యముతో గాని యుద్ధము చేయ జాలను. 23

మూ. కథమప్యమరప్రఖ్యం సంగ్రామాణామకోవిదమ్, 24
బాలం మే తనయం బ్రహ్మన్ నైవ దాస్యామి పుత్రకమ్.

ప్ర. అ. బ్రహ్మన్=ఓబ్రాహ్మణోత్తమా! అమరప్రఖ్యమ్= దేవతలతో సమానుడును, సంగ్రామాణామ్=యుద్ధములకు, అకోవిదమ్=ఎరుగనివాడును, బాలమ్=బాలుడును, పుత్రకమ్=పుంనామనరకమునుండి రక్షించువాడును అగు, మే=నాయొక్క, తనయమ్=కుమారుని, కథమపి=ఏ విధముగను, నైవ దాస్యామి=ఇవ్వనే ఇవ్వను.

తా. విశ్వామిత్రా! బాలుడైన నా కుమారుడు దేవతలతో సమానుడు. యుద్ధపరిచయము లేనివాడు. పున్నామనరకమునుండి నన్ను ఉద్ధరించువాడు. వీనిని ఏమైనను నీకీయజాలను. 24

మూ. అథ కాలోపమౌ యుద్ధే సుతౌ సున్దోపసున్దయోః, 25
యజ్ఞవిఘ్నకరౌ తౌ తే నైవ దాస్యామి పుత్రకమ్.

ప్ర. అ. అథ=మరియు, తే=నీయొక్క, యజ్ఞవిఘ్నకరౌ=యజ్ఞమునకు విఘ్నము చేయు, సున్దోపసున్దయోః సుతౌ=సుందోపసుందుల కుమారులు, యుద్ధే=యుద్ధమునందు, కాలోపమౌ=యమునితో సమానులు. పుత్రకమ్=నా కుమారుని, నైవ దాస్యామి=ఇవ్వను.

తా. నీకు యజ్ఞవిఘ్నము చేయు ఆ సుందోపసుందకుమారులైన మారీచ సుబాహువులు యుద్ధమునందు యమునివంటివారు. అందుచే నా కుమారుని నీకు ఇవ్వజాలను. 25

మూ. మారీచశ్చ సుబాహుశ్చ వీర్యవన్తౌ సుశిక్షితౌ, 26
తయోరన్యతరేణాహం యోద్ధా స్యాం ససుహృద్గణః.

ప్ర. అ. మారీచశ్చ=మారీచుడును, సుబాహుశ్చ=సుబాహువును, వీర్యవన్తౌ=పరాక్రమవంతులు. సుశిక్షితౌ=బాగుగా అభ్యాసము చేసినవారు. అహమ్=నేను, ససుహృద్గణః=మిత్రగణముతో కూడినవాడనై, తయోః=వారిలో, అన్యతరేణ=ఒకనితో, యోద్ధా=యుద్ధముచేయువాడను, స్యామ్=అగుదును.

తా. మారీచసుబాహువులు పరాక్రమవంతులు మాత్రమే కాదు; మంచి నేర్పుకలవారు కూడ. స్నేహితులతో సహితుడనైన నేను వారిలో ఒకరితో మాత్రమే యుద్ధము చేయగలను. 26

మూ. ఇతి నరపతిజల్పనాద్ద్విజేన్ద్రం
కుశికసుతం సుమహాన్ వివేశ మన్యుః,
సుహుత ఇవ మఖేఽగ్నిరాజ్యసిక్తః
సమభవదుజ్జ్వలితో మహర్షివహ్నిః. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
వింశః సర్గః.

ప్ర. అ. ఇతి=ఈ విధముగా, నరపతిజల్పనాత్=దశరథుని అసంబద్ధ ప్రలాపమువలన, ద్విజేన్ద్రమ్=ద్విజశ్రేష్ఠుడైన, కుశికసుతమ్=విశ్వామిత్రుని, సుమహాన్=చాల గొప్పదైన, మన్యుః=కోపము, వివేశ=ఆవహించెను. మహర్షివహ్నిః=మహర్షి యనెడు అగ్ని, మఖే=యజ్ఞమునందు, సుహుతః = బాగుగా హోమము చేయబడిన, ఆజ్యసిక్తః=నేతిచే తడుపబడిన, అగ్నిరివ=అగ్ని వలె, ఉజ్జ్వలితః=ప్రజ్వలించినది, సమభవత్=ఆయెను.

తా. దశరథుని అసంబద్ధప్రలాపములు వినగనే ద్విజశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు మిక్కిలి క్రోధావిష్టుడయ్యెను. యజ్ఞమునందు బాగుగా హోమము చేసి, నేతిచే తడుపబడిన అగ్ని వలె, విశ్వామిత్రాగ్ని ప్రజ్వలించెను. 27

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో ఇరువదవ సర్గ సమాప్తము.

అథ ఏకవింశః సర్గః

మూ. తచ్ఛ్రుత్వా వచనం తస్య స్నేహపర్యాకులాక్షరమ్,
సమన్యుః కౌశికో వాక్యం ప్రత్యువాచ మహీపతిమ్. 1

ప్ర. అ. తస్య=ఆతనియొక్క, స్నేహపర్యాకులాక్షరమ్=పుత్రస్నేహముచే తడబడుచున్న అక్షరములు గల, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా=విని, కౌశికః=విశ్వామిత్రుడు, సమన్యుః=క్రోధముతో కూడినవాడై, మహీపతిమ్=రాజును గూర్చి, వాక్యమ్=వాక్యమును, ప్రత్యువాచ=తిరిగి పలికెను.

తా. పుత్రస్నేహముచే తడబడుచున్న అక్షరములు గల దశరథుని మాటలు విని, విశ్వామిత్రుడు కృద్ధుడై ఆతనితో ఇట్లనెను. 1

మూ. పూర్వమర్థం ప్రతిశ్రుత్య ప్రతిజ్ఞాం హాతుమిచ్ఛసి,
రాఘవాణామయుక్తోఽయం కులస్యాస్య విపర్యయః. 2

ప్ర. అ. పూర్వమ్=మొదట, అర్థమ్=వస్తువును, ప్రతిశ్రుత్య=ప్రతిజ్ఞ చేసి, ప్రతిజ్ఞామ్=ప్రతిజ్ఞను, హాతుమ్=విడచుటకు, ఇచ్ఛసి=కోరుచున్నావు. అయమ్=ఈ, విపర్యయః=ప్రతిజ్ఞాభంగము, రాఘవాణామ్=రఘువంశరాజుల, అస్య=ఈ, కులస్య=కులమునకు, అయుక్తః=తగినది కాదు.

తా. అడిగినది ఇచ్చెద నని మొదట ప్రతిజ్ఞ చేసి ఇప్పుడు ప్రతిజ్ఞను విడువవలె ననుకొనుచున్నావు. ఇది రఘువంశరాజులు చేయవలసినది కాదు. 2

మూ. యదీదం తే క్షమం రాజన్ గమిష్యామి యథాగతమ్,
మిథ్యాప్రతిజ్ఞః కాకుత్స్థ సుఖీ భవ సబాన్ధవః 3

ప్ర. అ. రాజన్=ఓ రాజా! ఇదమ్=ఇది, తే=నీకు, క్షమం యది=తగినదైతే, యథాగతమ్=వచ్చినట్లే, గమిష్యామి=వెళ్లెదను. కాకుత్స్థ=ఓ కకుత్స్థ

వంశమునందు జనించినవాడా! మిథ్యాప్రతిజ్ఞః=అసత్య మైన ప్రతిజ్ఞకల నీవు, సబాన్ధవః=బంధునమేతుడవై, సుఖీ=సుఖవంతుడవై, భవ=ఉండుము.

తా. ఓ రాజా! నీకు ఇదే యుక్త మని తోచినచో నేను వచ్చినట్లే తిరిగి వెళ్లెదను. ఓ కాకుత్స్థా! చేసిన ప్రతిజ్ఞను నిలుపుకొనజాలని నీవు, బంధుసహితు డవై సుఖముగా నుండుము. 3

మూ. తస్య రోషపరీతస్య విశ్వామిత్రస్య ధీమతః,
చచాల వసుధా కృత్స్నా వివేశ చ భయం సురాన్. 4

ప్ర. అ. ధీమతః=ధీమంతుడైన, తస్య=ఆ, విశ్వామిత్రస్య = విశ్వామిత్రుడు, రోషపరీతస్య=రోషముచే ఆవహింపబడి యుండగా, కృత్స్నా= సమస్త మైన, వసుధా=భూమి, చచాల=చలించెను, సురాన్=దేవతలను, భయమ్=భయము, వివేశ=ప్రవేశించెను.

తా. ధీమంతు డైన ఆ విశ్వామిత్రుడు క్రోధావిష్టుడు కాగానే, భూమి యంతయు కంపించెను. దేవతలు కూడ భయపడిరి. 4

మూ. త్రస్తరూపం తు విజ్ఞాయ జగత్సర్వం మహానృషిః,
నృపతిం సువ్రతో ధీరో వసిష్ఠో వాక్యమబ్రవీత్. 5

ప్ర. అ. సువ్రతః=మంచివ్రతము కలవాడును, ధీరః=ధీరుడును, మహాన్ ఋషిః = మహర్షియు అయిన, వసిష్ఠః = వసిష్ఠుడు, సర్వమ్ = సమస్త మైన, జగత్=జగత్తును, త్రస్తరూపమ్=మిక్కిలి భయపడినదానినిగా, విజ్ఞాయ=తెలిసికొని, నృపతిమ్=రాజును గూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. ఉత్తమవ్రతుడును, ధీరుడును అగు వసిష్ఠమహర్షి జగత్తు అంతయు మిక్కిలి భయపడిన దను విషయమును గ్రహించి రాజుతో ఇట్లు పలికెను. 5

మూ. ఇక్ష్వాకూణాం కులే జాతః సాక్షాద్ధర్మ ఇవాపరః,
ధృతిమాన్ సువ్రతః శ్రీమాన్న ధర్మం హాతుమర్హసి. 6

ప్ర. అ. ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశీయుల, కులే = వంశమునందు,

జాతః = పుట్టినవాడవును, సాక్షాత్ = సాక్షాత్తుగా, అపరః = రెండవ, ధర్మః ఇవ=ధర్మదేవతవంటివాడవును, ధృతిమాన్=ధైర్యవంతుడవును, సువ్రతః= ఉత్తమమైన వ్రతము కలవాడవును, శ్రీమాన్ = శ్రీమంతుడవును అగు నీవు, ధర్మమ్ = ధర్మమును, హాతుమ్=విడచుటకు, న అర్హసి=తగవు.

తా. రాజా! నీవు ఇక్ష్వాకువంశములో పుట్టినావు. సాక్షాత్తు, అపర ధర్మ దేవత వంటివాడవు, ధైర్యవంతుడవు. ఉత్తమవ్రతము కలవాడవు. శ్రీమంతుడవు. నీ విట్లు ధర్మమును విడచుట తగదు. 6

మూ. త్రిషు లోకేషు విఖ్యాతో ధర్మాత్మా ఇతి రాఘవ,
స్వధర్మం ప్రతిపద్యస్వ నాధర్మం వోఢుమర్హసి. 7

ప్ర. అ. రాఘవ=ఓ దశరథా! ధర్మాత్మా ఇతి = ధర్మాత్ముడవు అని, త్రిషు లోకేషు = మూడులోకములందును, విఖ్యాతః = ప్రసిద్ధిపొందినావు. స్వధర్మమ్ = స్వధర్మమును, ప్రతిపద్యస్వ=పొందుము. అధర్మమ్ = అధర్మ మును, వోఢుమ్=వహించుటకు, న అర్హసి=తగవు.

తా. దశరథా! ధర్మాత్ముడ వని మూడు లోకములందును ప్రసిద్ధి పొంది యున్నావు. స్వధర్మమును ఆచరింపుము. అధర్మము చేయకుము. 7

మూ. సంశ్రుత్యైవం కరిష్యామీత్యకుర్వాణస్య రాఘవ,
ఇష్టాపూర్తవధో భూయాత్తస్మాద్రామం విసర్జయ. 8

ప్ర. అ. రాఘవ=దశరథా! ఏవం కరిష్యామి=ఇట్లు చేసెదను, ఇతి=అని, సంశ్రుత్య = ప్రతిజ్ఞ చేసి, అకుర్వాణస్య = చేయనివానికి, ఇష్టాపూర్తవధః = యజ్ఞాదులయొక్కయు, వాపీకూపతటాకాదులయొక్కయు వినాశము, భూయాత్ = అగును. తస్మాత్=ఆ కారణమువలన, రామమ్=రాముని, విసర్జయ=పంపుము.

తా. దశరథా! ఇట్లు చేసెదను అని మొదట చెప్పి, పిమ్మట అట్లు చేయని వానికి ఇష్టాపూర్తములు చేసిన వచ్చు పుణ్యము నశించును. కావున విశ్వామిత్రు నితో రాముని పంపుము. 8

మూ. కృతాస్త్రమకృతాస్త్రం వా నైనం శక్ష్యన్తి రాక్షసాః,
గుప్తం కుశికపుత్రేణ జ్వలనేనామృతం యథా. 9

ప్ర. అ. కృతాస్త్రమ్=అస్త్రములు నేర్చినవాడైనను, అకృతాస్త్రం వా=అస్త్రములు నేర్వనివాడైనను, కుశికపుత్రేణ = విశ్వామిత్రునిచే, గుప్తమ్ = రక్షింపబడిన, ఏనమ్=ఈ రాముని, జ్వలనేన=అగ్నిచే రక్షింపబడిన, అమృతం యథా=అమృతమును వలె, రాక్షసాః=రాక్షసులు, న శక్ష్యన్తి=ఏమియు చేయజాలరు.

తా. రాముడు అస్త్రములు నేర్చినను, నేర్వకపోయినను, విశ్వామిత్రుని రక్షణములో నున్నంతవరకు, అగ్నిచే రక్షింపబడిన అమృతమును వలె రాక్షసులు ఇతనిని ఏమియు చేయజాలరు. 9

మూ. ఏష విగ్రహవాన్ ధర్మ ఏష వీర్యవతాం వరః,
ఏష బుద్ధ్యాఽధికో లోకే తపసశ్చ పరాయణమ్. 10

ప్ర. అ. ఏషః=ఇతడు, విగ్రహవాన్=శరీరము దాల్చిన, ధర్మః = ధర్మము. ఏషః=ఇతడు, వీర్యవతామ్=వీర్యవంతులలో, వరః=శ్రేష్ఠుడు. ఏషః=ఇతడు, బుద్ధ్యా=బుద్ధిచేత, లోకే=లోకమునందు, అధికః=అందరికంటెను గొప్పవాడు, తపసః=తపస్సుకు, పరాయణమ్=అత్యుత్తమస్థానము.

తా. ఈ విశ్వామిత్రుడు మూర్తీభవించిన ధర్మము. పరాక్రమవంతులలో శ్రేష్ఠుడు. ఇతడు బుద్ధిచే అందరికంటె గొప్పవాడు. తపస్సుకు గొప్ప నిధి. 10

మూ. ఏషోఽస్త్రాన్ వివిధాన్వేత్తి త్రైలోక్యే సచరాచరే,
నైవమన్యః పుమాన్వేత్తి న చ వేత్స్యన్తి కేచన. 11

ప్ర. అ. ఏషః=ఇతడు, వివిధాన్=అనేకవిధములైన, అస్త్రాన్=అస్త్రములను, వేత్తి = తెలిసికొనియున్నాడు. ఏవమ్=ఈవిధముగ, సచరాచరే=చరాచరములతో కూడిన, త్రైలోక్యే=లోకత్రయమునందు, అన్యః పుమాన్=ఇతర పురుషుడు, న వేత్తి = ఎరుగడు. కేచన=ఎవరును. న వేత్స్యన్తి చ=ఎరుగబోరు కూడ.

తా. ఈతడుఅనేకవిధము లైన అస్త్రములు తెలిసినవాడు; చరాచరాత్మకమైన మూడు లోకములందును ఈతనికి తెలిసిన విధమున మరి ఎవ్వరికిని తెలియవు. భవిష్యత్తులో కూడ ఎవ్వరును తెలియజాలరు. 11

మూ. న దేవా నర్షయః కే చిన్నాసురా న చ రాక్షసాః,
గన్ధర్వయక్షప్రవరాః సకిన్నరమహోరగాః. 12

ప్ర. అ. దేవాః=దేవతలు, న(వేత్స్యన్తి)=తెలిసికొనజాలరు. ఋషయః=ఋషులు, కేచిత్=ఎవరును, న=తెలియజాలరు. అసురాః=అసురులు, న=తెలియజాలరు. రాక్షసాః=రాక్షసులు, న=తెలియజాలరు. సకిన్నరమహోరగాః=కిన్నరులతోడను మహోరగులతోడను కూడిన, గన్ధర్వయక్షప్రవరాః=గంధర్వులును యక్షశ్రేష్ఠులును, (తెలియజాలరు).

తా. ఈ విశ్వామిత్రునకు తెలిసిన యస్త్రములు దేవతలకు గాని, ఋషులకు గాని, అసురులకు గాని, రాక్షసులకు గాని, గంధర్వయక్షకిన్నరమహోరగులకు గాని తెలియవు. 12

మూ. సర్వాస్త్రాణి భృశాశ్వస్య పుత్రాః పరమధార్మికాః,
కౌశికాయ పురా దత్తా యదా రాజ్యం ప్రశాసతి. 13

ప్ర. అ. భృశాశ్వస్య = భృశాశ్వునియొక్క, పరమధార్మికాః = పరమధార్మికులైన, పుత్రాః=పుత్రులైన, సర్వాస్త్రాణి=సకలాస్త్రములును, యదా=ఎప్పుడు, పురా=పూర్వము, రాజ్యమ్=రాజ్యమును, ప్రశాసతి=శాసించుచుండెనో, అపుడు, కౌశికాయ=విశ్వామిత్రునకు, దత్తాః=ఇవ్వబడినవి. 13

తా. పరమధార్మికులైన భృశాశ్వపుత్రులగు అస్త్రము లన్నియు, విశ్వామిత్రుడు పూర్వము రాజ్యము చేయుచున్నపుడు, అతనికి ఈయబడినవి. 13

మూ. తేఽపి పుత్రా భృశాశ్వస్య ప్రజాపతిసుతాసుతాః,
నైకరూపా మహావీర్యా దీప్తిమన్తో జయావహాః. 14

ప్ర. అ. ప్రజాపతిసుతాసుతాః=దక్షప్రజాపతి కుమార్తెల సుతులైన, భృశాశ్వస్య=భృశాశ్వుని, పుత్రాః=పుత్రులైన, తేఽపి=ఆ అస్త్రములు కూడ, నైకరూపాః=అనేకమైన రూపములు కలవి, మహావీర్యాః=గొప్ప వీర్యము కలవి, దీప్తిమన్తః=కాంతిగలవి. జయావహాః=జయమును ఇచ్చునవి.

తా. భృశాశ్వునకును, దక్షప్రజాపతియొక్క కుమార్తెలకును పుత్రులుగా ఉదయించిన ఆ అస్త్రములు, అనేకరూపములు కలవి; గొప్ప పరాక్రమము గలవి. కాంతి గలవి, జయమును చేకూర్చునవి. 14

మూ. జయా చ సుప్రభా చైవ దక్షకన్యే సుమధ్యమే,
తే సువాతేఽస్త్రశస్త్రాణి(ణాం)శతం పరమభాస్వరమ్. 15

ప్ర. అ. జయా చ = జయయు, సుప్రభా చ=సుప్రభయు అనెడు, సుమధ్యమే=(మంచినడుములుగల) స్త్రీలు, దక్షకన్యే=దక్షుని కన్యలు, తే= వారు, అస్త్రశస్త్రాణామ్=అస్త్రశస్త్రములయొక్క, పరమభాస్వరమ్=మిక్కిలి ప్రకాశించుచున్న, శతమ్=శతమును, సువాతే=కనిరి.

తా. జయ, సుప్రభ అనెడు ఇరువురు దక్షప్రజాపతియొక్క కుమార్తెలు. వారు చాల ప్రకాశించు నూరు అస్త్రములను కనిరి.

వి. శస్త్రమనగా హింసించునది. అస్త్ర మనగా ఇతరులపై విసరునది. అస్త్రశస్త్రము లనగా ఇచట శత్రువులను హింసించుటకై ఉపయుక్తము లగు అస్త్రము లని అర్థము. 15

మూ. పంచాశతం సుతాన్ లేభే జయా నామ వరాన్ పురా,
వధాయాసురసైన్యానామమేయాన్ కామరూపిణః. 16

ప్ర. అ. పురా=పూర్వము, జయా నామ=జయ అను నామె, అసుర సైన్యానామ్=అసురసైన్యములయొక్క, వధాయ=వధకొరకు, అమేయాన్= ఇంత అని చెప్పశక్యముకాని పరాక్రమముకల, కామరూపిణః = స్వేచ్ఛా రూపము గల, వరాన్=శ్రేష్ఠులైన, పఞ్చాశతమ్ = ఏబదిమంది, సుతాన్=పుత్రులను, లేభే=పొందెను.

తా. పూర్వము, జయ, అసురసైన్యములను సంహరించుటకై, ఏబది మంది పుత్రులను కనెను. వారు అప్రమేయ మైన పరాక్రమము కలవారు. శ్రేష్ఠులు. స్వేచ్ఛప్రకారము రూపములను ధరింప సమర్థులు. 16

మూ. సుప్రభాజనయచ్చాపి పుత్రాన్ పఞ్చాశతం పునః,
సంహారాన్నామ దుర్ధర్షాన్ దురాక్రామాన్ బలీయసః. 17

ప్ర. అ. సుప్రభాపి=సుప్రభ కూడ, దుర్ధర్షాన్=ఎదిరింపశక్యము కాని వారును,దురాక్రామాన్=ఆక్రమింప శక్యము కానివారును, బలీయసః=ఎక్కువ బలముకలవారును అగు, పునః=ఇంకను, పఞ్చాశతమ్=ఏబదిమంది, పుత్రాన్=పుత్రులను, అజనయత్=కనెను.

తా. సుప్రభకూడ, సంహారు లను పేరు గల మరి యేబదిమంది పుత్రులను కనెను. వారు చాల బలవంతులు. ఎదిరించి జయింప శక్యము కానివారు. 17

మూ. తాని చాస్త్రాణి వేత్త్యేష యథావత్ కుశికాత్మజః,
అపూర్వాణాం చ జననే శక్తో భూయః స ధర్మవిత్. 18

ప్ర. అ. ఏషః=ఈ, కుశికాత్మజః=విశ్వామిత్రుడు, తాని=ఆ, అస్త్రాణి=అస్త్రములను, యథావత్=చక్కగా, వేత్తి=ఎరుగును, ధర్మవిత్=ధర్మ వేత్తయైన, సః=ఆతడు, భూయః=ఇంకను, అపూర్వాణామ్=కొ్రత్త అస్త్రముల యొక్క, జననే చ=పుట్టించుటయందు గూడ, శక్తః=సమర్థుడు.

తా. ఆ అస్త్రము లన్నియు ఈ కుశికనందనునకు చక్కగ తెలియును. ధర్మవేత్త యగు ఈతడు క్రొత్త అస్త్రములను పుట్టించుటకు కూడ సమర్థుడు. 18

మూ. ఏవంవీర్యో మహాతేజా విశ్వామిత్రో మహాయశాః,
న రామగమనే రాజన్ సంశయం కర్తుమర్హసి. 19

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడును, మహాయశాః=గొప్ప కీర్తికలవాడును అగు, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, ఏవంవీర్యః=ఇట్టి వీర్యము కలవాడు. రాజన్=ఓ రాజా! రామగమనే=రాముని గమనము విషయమున, సంశయమ్=సంశయమును, కర్తుమ్=చేయుటకు, నార్హసి=తగవు.

తా. ఓ దశరథమహారాజా! గొప్పతేజస్సు, కీర్తియు గల విశ్వామిత్రు డింతటి ప్రభావశాలి. కావున రాముని పంపుట విషయమున సందేహింపకుము. 19

మూ. తేషాం నిగ్రహణే శక్తః స్వయం చ కుశికాత్మజః,
తవ పుత్రహితార్థాయ త్వాము పేత్యాభియాచతే. 20

ప్ర. అ. కుశికాత్మజః = విశ్వామిత్రుడు, స్వయం చ = స్వయముగనే, తేషామ్=వారియొక్క, నిగ్రహణే=నిగ్రహించుటయందు, శక్తః=సమర్థుడు. తవ=నీయొక్క, పుత్రహితార్థాయ=పుత్రుల హితముకొరకై, త్వామ్=నిన్ను, ఉపేత్య=పొంది, యాచతే=యాచించుచున్నాడు.

తా. విశ్వామిత్రుడు ఆ రాక్షసులను స్వయముగనే నిగ్రహింపగలిగినను, నీ కుమారునకు మేలు చేయుటకై నీవద్దకు వచ్చి యాచించుచున్నాడు. 20

మూ. ఇతి మునివచనాత్ప్రసన్నచిత్తో
రఘువృషభస్తు ముమోద భాస్వరాఙ్గః,
గమనమభిరురోచ రాఘవస్య
ప్రథితయశాః కుశికాత్మజాయ బుద్ధ్యా. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకవింశః సర్గః.

ప్ర. అ. రఘుపుఙ్గవః=దశరథుడు, ఇతి=ఈ విధముగా, మునివచనాత్=మునివాక్యమువలన, ప్రసన్నచిత్తః=ప్రసన్నమైన చిత్తము కలవాడై, భాస్వరాఙ్గః=ప్రకాశించుచున్న శరీరముకలవాడై, ముమోద = సంతసించెను. ప్రథితయశాః=ప్రసిద్ధమైన కీర్తి గల ఆ దశరథుడు, కుశికాత్మజాయ=విశ్వామిత్రునికొరకై, రాఘవస్య=రామునియొక్క, గమనమ్=గమనమును, బుద్ధ్యా=బుద్ధిచేత, అభిరురోచ=అంగీకరించెను.

తా. ప్రసిద్ధమైన కీర్తి గల దశరథుడు వసిష్ఠుని మాటలచే ప్రసన్నమైన చిత్తముకలవాడయ్యెను. సంతోషముతో ఆతని శరీర ముప్పొంగెను. రాముని విశ్వామిత్రునితో పంపుటకు అంగీకరించెను. 21

"బాలానన్దిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండములో
ఇరువదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్వావింశః సర్గః

మూ. తథా వసిష్ఠే బ్రువతి రాజా దశరథః స్వయమ్,
ప్రహృష్టవదనో రామమాజుహావ సలక్ష్మణమ్. 1

ప్ర. అ. వసిష్ఠే=వసిష్ఠుడు, తథా=ఆ విధముగా, బ్రువతి=చెప్పగా, రాజా దశరథః = దశరథమహారాజు, ప్రహృష్టవదనః = వికసించిన ముఖము కలవాడై, స్వయమ్=స్వయముగ, సలక్ష్మణమ్=లక్ష్మణసమేతు డైన, రామమ్=రాముని, ఆజుహావ=పిలిచెను.

తా. వసిష్ఠుడు అట్లు పలుకగా, దశరథుడు సంతసించి, లక్ష్మణసమేతు డైన శ్రీరాముని స్వయముగ పిలచుకొనివచ్చెను. 1

మూ. కృతస్వస్త్యయనం మాత్రా పిత్రా దశరథేన చ,
పురోధసా వసిష్ఠేన మఙ్గళై రభిమన్త్రితమ్. 2

స పుత్రం మూర్ధ్న్యుపాఘ్రాయ రాజా దశరథః ప్రియమ్,
దదౌ కుశికపుత్రాయ సుప్రీతేనాన్తరాత్మనా. 3

ప్ర. అ. సః=ఆ, దశరథః రాజా=దశరథమహారాజు, మాత్రా=తల్లి చేతను, పిత్రా=తండ్రియైన, దశరథేన చ=దశరథునిచేతను (తనచేతను), కృత స్వస్త్యయనమ్=చేయబడిన స్వస్త్యయనము కలిగినవాడును, పురోధసా=పురోహితు డైన, వసిష్ఠేన=వసిష్ఠునిచేత, మఙ్గళైః=మంగళకరము లగు మంత్రములచే, అభిమన్త్రితమ్ = అభిమంత్రింపబడినవాడును, ప్రియమ్ = ప్రియుడును అగు, పుత్రమ్=పుత్రుని, మూర్ధ్ని=శిరస్సుపై, ఉపాఘ్రాయ=వాసన చూచి, సుప్రీతేన=చాల సంతసించిన, అన్తరాత్మనా= హృదయముతో, కుశికపుత్రాయ= విశ్వామిత్రునకు, దదౌ=ఇచ్చెను.

తా. కౌసల్యయు దశరథుడును రామునకు స్వస్త్యయనము చేసిరి. వసిష్ఠుడు మంగళకరము లగు మంత్రోదకాదులతో రాముని అభిమంత్రించెను.

దశరథుడు ఆ ప్రియపుత్రుని శిరస్సుపై వాసన చూచి, (ముద్దిడికొని), చాల సంతసించిన అంతరాత్మతో విశ్వామిత్రున కిచ్చెను. 2, 3

మూ. తతో వాయుః సుఖస్పర్శో నీరజస్కో వవౌ తదా,
విశ్వామిత్రగతం దృష్ట్వా రామం రాజీవలోచనమ్. 4

ప్ర. అ. తతః=పిమ్మట, రాజీవలోచనమ్=పద్మముల వంటి నేత్రములు గల, రామమ్=రాముని, విశ్వామిత్రగతమ్=విశ్వామిత్రుని అనుసరించినవానినిగా, దృష్ట్వా=చూచి, తదా=అప్పుడు, వాయుః=వాయువు, సుఖస్పర్శః=సుఖకరమైన స్పర్శగలదై, నీరజస్కః=పరాగములేనిదై, వవౌ=వీచెను.

తా. కమలలోచను డగు రాముడు విశ్వామిత్రుని అనుసరింపగనే వాయువు పరాగము లేక, సుఖస్పర్శకరమై వీచెను. 4

మూ. పుష్పవృష్టిర్మహత్యాసీద్దేవదున్దుభినిస్వనైః,
శఙ్ఖదున్దుభినిర్ఘోషః ప్రయాతే తు మహాత్మని. 5

ప్ర. అ. మహాత్మని=మహాత్ముడైన విశ్వామిత్రుడు, ప్రయాతే తు=బయలుదేరగనే, మహతీ=గొప్ప, పుష్పవృష్టిః=పుష్పవృష్టియు, దేవదున్దుభినిస్వనైః=దేవదుందుభుల ధ్వనులతో కలిసిన, శఙ్ఖదున్దుభినిర్ఘోషః=శంఖములయొక్కయు దుందుభుల యొక్కయు ధ్వని, ఆసీత్=ఆయెను.

తా. మహాత్ముడైన విశ్వామిత్రుడు బయలుదేరగనే గొప్ప పుష్పవర్షము కురిసెను. దేవతలు దుందుభులు మ్రోయించిరి. దశరథుని ప్రాసాదములో కూడ శంఖదుందుభిధ్వనులు మిన్ను ముట్టెను. 5

మూ. విశ్వామిత్రో యయావగ్రే తతో రామో ధనుర్ధరః,
కాకపక్షధరో ధన్వీ తం చ సౌమిత్రిరన్వగాత్. 6

ప్ర. అ. విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, అగ్రే=ముందు, యయౌ=నడచెను. తతః=అతనివెనుక, ధనుర్ధరః=ధనుస్సును ధరించిన, రామః=రాముడు, (నడచెను). కాకపక్షధరః=జునపములను ధరించిన, ధన్వీ=ధనుస్సు గల, సౌమిత్రిః=లక్ష్మణుడు, తమ్=ఆ రాముని, అన్వగాత్=అనుసరించి నడచెను.

తా. విశ్వామిత్రుడు ముందు నడువగా, ఆతని వెనుక ధనుర్ధరు డైన రాముడును, ఆతని వెనుక కాకపక్షధారియు, ధనుర్ధరుడును అగు లక్ష్మణుడును వెళ్లిరి. 6

మూ. కలాపినౌ ధనుష్పాణీ శోభయానౌ దిశో దశ,
విశ్వామిత్రం మహాత్మానం త్రిశీర్షావివ పన్నగౌ, 7
అనుజగ్మతురక్షుద్రౌ పితామహమివాశ్వినౌ.

ప్ర. అ. కలాపినౌ = అంబులపొదులను ధరించినవారును, ధనుష్పాణీ = ధనుస్సులు హస్తములందు కలవారును, దశ = పది, దిశః = దిక్కులను, శోభయానౌ = ప్రకాశింపచేయుచున్నవారును, అక్షుద్రౌ = అనల్ప మైన రూపవీర్యాది ప్రభావము కలవారును, త్రిశీర్షౌ = మూడు శిరస్సులు గల, పన్నగౌ ఇవ = సర్పములు వలె ఉన్న రామలక్ష్మణులు, మహాత్మానమ్ = మహాత్మ డైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, అశ్వినౌ = అశ్వినీదేవతలు, పితామహమివ = బ్రహ్మదేవుని వలె, అనుజగ్మతుః = అనుసరించి వెళ్లిరి.

తా. రెండేసి అమ్ములపొదులను, ధనుస్సును ధరించిన ఆ రామలక్ష్మణులు మూడేసి తలలు గల సర్పముల వలె ఉండిరి. వారు నడచుచుండగా పది దిక్కులును ప్రకాశించినవి. అట్టి అనల్పరూపవీర్యాదిప్రభావు లగు రామలక్ష్మణులు విశ్వామిత్రుని అనుసరించి వెళ్లనపుడు ఇద్దరు అశ్వినీదేవతలు బ్రహ్మదేవుని వెనుక నడచిపోవుచున్నట్లుండెను. 7

మూ. తదా కుశికపుత్రం తు ధనుష్పాణీ స్వలంకృతౌ, 8
బద్ధగోధాఙ్గులిత్రాణౌ ఖడ్గవంతౌ మహాద్యుతీ.
కుమారౌ చారువపుషౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ, 9

అనుయాతౌ శ్రియా దీప్తౌ శోభయేతామనిన్దితౌ,
స్థాణుం దేవమివాచిన్త్యం కుమారావివ పావకీ. 10

ప్ర. అ. తదా = అప్పుడు, ధనుష్పాణీ = ధనస్సులు హస్తములందు కలవారును, స్వలఙ్కృతౌ = చక్కగా అలంకరించబడినవారును, బద్ధగోధా

బద్ధగోధాఙ్గుళిత్రాణౌ = కట్టబడిన ఉడుముతోలుతో చేసిన వ్రేళ్లతొడుగులు కలవారును, ఖడ్గవన్తౌ = ఖడ్గములు కలవారును, మహాద్యుతీ = గొప్పకాంతి కలవారును, కుమారౌ = బాలురును, చారువపుషౌ = అందమైన శరీరములు కలవారును, శ్రియా = శోభతో, దీప్తౌ = ప్రకాశించుచున్నవారును, అనిన్దితౌ = దోషములు లేనివారును అగు, భ్రాతరౌ = సోదరులైన, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులు, అనుయాతౌ = అనుసరించి వెళ్లుచున్నవారై, పావకీ = అగ్నివలన జనించిన, కుమారౌ = స్కంద-విశాఖులు, అచిన్త్యమ్ = ఊహింపరాని ప్రభావముగల, దేవమ్ = దేవుడైన, స్థాణుమ్ ఇవ = ఈశ్వరుని వలె, కుశికపుత్రమ్ = విశ్వామిత్రుని, శోభయేతామ్ = ప్రకాశింపచేసిరి.

తా. బాలురైన ఆ రామలక్ష్మణులు, ధనుస్సులు ధరించి యుండిరి. చక్కగ అలంకరింపబడిరి. వ్రేళ్లకు ఉడుముతోలుతో చేసిన తొడుగులను ధరించిరి. ఖడ్గములు ధరించి యుండిరి. గొప్ప కాంతితో ప్రకాశించుచుండిరి. చక్కని ఆకారముతో, అపూర్వసౌందర్యముతో ఒప్పారుచుండిరి. ఎట్టి దోషములును లేక యుండిరి. వారు అనుసరించి వెళ్లుచు, అగ్నినుండి జనించిన స్కందవిశాఖులు అచింత్యప్రభావు డగు ఈశ్వరుని అనుసరించి ఆతనిని ప్రకాశింపచేసి నట్లు, విశ్వామిత్రుని ప్రకాశింపచేసిరి. 8-10

వి. "తతోఽభవచ్చతుర్మూర్తిః క్షణేన భగవాన్ ప్రభుః, స్కన్దో విశాఖః శాకశ్చ నైగమేషశ్చ పృష్ఠతః" (అంత భగవంతు డగు కుమారస్వామి స్కందుడు, విశాఖుడు, శాకుడు, నైగమేషుడు అను నాలుగు రూపములు ధరించెను) అని భారతమున చెప్పబడినది. ఇచట రామలక్ష్మణులు స్కందవిశాఖులతో పోల్చబడినారు (గోవిందరాజులు).

మూ. అధ్యర్ధయోజనం గత్వా సరయ్వా దక్షిణే తటే,
రామేతి మధురాం వాణీం విశ్వామిత్రోఽభ్యభాషత.

ప్ర. అ. అధ్యర్ధయోజనమ్ = ఒకటిన్నర యోజనముల దూరము, గత్వా = వెళ్లి, సరయ్వాః = సరయూనదియొక్క, దక్షిణే తటే = దక్షిణమువైపున నున్న తీరమునందు, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, రామ ఇతి = 'ఓ రామా' అని, మధురామ్ = మధుర మైన, వాణీమ్ = వాక్కును, అభ్యభాషత = పలికెను.

తా. ఒకటిన్నర యోజనముల దూరము నడచి సరయూదక్షిణతీరము

చేరిన పిమ్మట విశ్వామిత్రుడు—"ఓ రామా!" అని మధురముగ పిలిచి ఇట్లనెను. 11

మూ. గృహాణ వత్స సలిలం మా భూత్కాలస్య పర్యయః,
మన్త్రగ్రామం గృహాణ త్వం బలామతిబలాం తథా. 12

వత్స=ఓ వత్సా! సలిలమ్=ఉదకమును, గృహాణ=గ్రహించుము. కాలస్య=కాలముయొక్క, పర్యయః=కడచిపోవుట, మాభూత్=కాకుండుగాక. త్వమ్=నీవు, మన్త్రగ్రామమ్=మంత్రముల సముదాయమును, తథా=మరియు, బలామ్=బలను, అతిబలామ్=అతిబలను, గృహాణ=గ్రహింపుము.

తా. వత్సా! ఆచమనము చేయుము. మంత్రముల సముదాయమును, బల, అతిబల అనెడు విద్యలను ఇచ్చెదను, తీసికొనుము. 12

మూ. న శ్రమో న జ్వరో వా తే న రూపస్య విపర్యయః,
న చ సుప్తం ప్రమత్తం వా ధర్షయిష్యన్తి నైరృతాః. 13

ప్ర. అ. తే = నీకు, శ్రమః = శ్రమ, న=కలుగదు. జ్వరో వా = జ్వరముకూడ, న=కలుగదు. రూపస్య=రూపముయొక్క, విపర్యయః=మార్పు, న=కలుగదు. సుప్తమ్=నిద్రపోవుచున్నవాడవైనా, ప్రమత్తం వా=ఏమరుపాటుతో ఉన్నవాడవైనా నిన్ను, నైరృతాః=రాక్షసులు, న ధర్షయిష్యన్తి=బాధింపజాలరు.

ఈ విద్యలు గ్రహించినచో, నీకు శ్రమ కాని, జ్వరము కాని, రూపములో మార్పు గాని కలుగదు. నీవు నిద్రపోవుచున్నను, ఏమరి యున్నను రాక్షసులు నిన్నేమియు చేయజాలరు. 13

మూ. న బాహ్వోః సదృశో వీర్యే పృథివ్యామస్తి కశ్చన,
త్రిషు లోకేషు వై రామ న భవేత్సదృశస్తవ. 14

ప్ర. అ. రామ=ఓ రామా! బాహ్వోః=బాహువులయొక్క, వీర్యే=వీర్యమునందు, సదృశః=నీతో సమానమైనవాడు, కశ్చన=ఎవ్వడును, పృథివ్యామ్=భూమియందు, నాస్తి=లేడు. త్రిషు=మూడు, లోకేషు=లోకములందు, తవ=నీకు, సదృశః=సమానుడు, న భవేత్=ఉండడు.

తా. రామా ! బాహువీర్యములో నీతో సమానుడు ఈ పృథివిలో ఎవ్వడును లేడు. నీతో సమానుడు మూడు లోకములలో కూడ ఉండబోడు. 14

మూ. స సౌభాగ్యే న దాక్షిణ్యే న జ్ఞానే బుద్ధినిశ్చయే,
నోత్తరే ప్రతివక్తవ్యే సమో లోకే తవానఘ. 15

ప్ర. అ. అనఘ = ఓ దోషరహితుడా ! సౌభాగ్యే = సౌందర్యమునందు, తవ = నీకు, సమః = సమానుడు, లోకే = లోకమునందు, న = ఉండడు. దాక్షిణ్యే = సామర్థ్యమునందు, న = ఉండడు. జ్ఞానే = జ్ఞానమునందు గాని, బుద్ధి నిశ్చయే = బుద్ధిచేత నిశ్చయింపవలసినపుడు గాని, న = ఉండడు. ఉత్తరే = ప్రత్యుత్తరము, ప్రతివక్తవ్యే = చెప్పవలసి వచ్చినపుడు, న = ఉండడు.

తా. దోషరహితుడ వగు ఓ రామా ! సౌందర్యమునందు గాని, సామర్థ్యమునందు గాని, జ్ఞానమునందు గాని, బుద్ధిచే నిశ్చయింపవలసినపుడు గాని, సమాధానము చెప్పవలసినప్పుడు గాని, నీకు సరివచ్చువాడు ఈ లోకములో ఉండడు. 15

మూ. ఏతద్విద్యాద్వయే లబ్ధే భవితా నాస్తి తే సమః,
బలా త్వతిబలా చైవ సర్వజ్ఞానస్య మాతరౌ. 16

ప్ర. అ. ఏతద్విద్యాద్వయే = ఈ విద్యాద్వయము, లబ్ధే సతి = పొందబడగా, తే = నీకు, సమః=సమానుడు, నాస్తి = లేడు. న భవితా = ఉండబోడు. బలా = బలయు, అతిబలా చైవ = అతిబలయు, సర్వజ్ఞానస్య = సమస్త జ్ఞానమునకును, మాతరౌ = తల్లులు.

తా. ఈ విద్యాద్వయము లభించిన పిమ్మట నీకు సముడు ఇపుడు లేడు. భవిష్యత్తులో కూడ ఉండడు. ఈ బలాతిబలలు సకలజ్ఞానమును కలుగ జేయును. 16

మూ. క్షుత్పిపాసే న తే రామ భవిష్యేతే నరోత్తమ,
బాలామతిబలాం చైవ పఠతః పథి రాఘవ. 17

ప్ర. అ. నరోత్తమ = నరులలో ఉత్తముడా, రాఘవ = రఘువంశోద్భవుడా ! రామ = ఓ రామా ! పథి = మార్గమునందు, బలామ్ = బలను, అతి-

బలాం చైవ = అతిబలను, పఠతః = జపించుచున్న, తే = నీకు, క్షుత్పిపాసే = ఆకలిదప్పులు, న భవిష్యేతే = కలుగవు.

తా. ఓ నరోత్తమా! రాఘవా! నీవు మార్గమునందు ఈ బలాతిబలలను జపించినచో నీకు ఆకలిదప్పికలు కలుగవు. 17

మూ. విద్యాద్వయమధీయానే యశశ్చాప్యతులం త్వయి,
పితామహసుతే హ్యేతే విద్యే తేజస్సమన్వితే. 18
ప్రదాతుం తవ కాకుత్స్థ సదృశస్త్వం హి ధార్మిక.

ప్ర. అ. విద్యాద్వయమ్=విద్యాద్వయమును, అధీయానే=జపించిన (అభ్యసించిన) త్వయి=నీయందు, అతులమ్=సాటిలేని, యశశ్చ=కీర్తికూడ, (కలుగును). కాకుత్స్థ = కకుత్స్థవంశమునందు పుట్టిన, ధార్మిక = ధార్మికుడవైన ఓ రామా! తేజస్సమన్వితే = తేజస్సుతోకూడిన, పితామహసుతే = పితామహుని కుమార్తెలైన, ఏతే విద్యే=ఈ విద్యలను, తవ = నీకు, ప్రదాతుమ్=ఇచ్చుటకు, త్వమ్=నీవే, సదృశః=తగినవాడవు.

తా. ఈ విద్యాద్వయమును జపించినచో నీకు సాటి లేని కీర్తి కూడ లభించును. ధార్మికుడ వైన ఓ రామా! తేజోవంతము లైన ఈ విద్యలు బ్రహ్మదేవుని పుత్రికలు. వీటిని ఇచ్చుటకు నీవే తగినవాడవు. 18

మూ. కామం బహుగుణాః సర్వే త్వయ్యేతే నాత్ర సంశయః, 19
తపసా సంభృతే చైతే బహురూపే భవిష్యతః.

ప్ర. అ. ఏతే=ఈ, బహుగుణాః=అనేకగుణములు, సర్వే=అన్నియు, కామమ్ = అధికముగా, త్వయి = నీయందున్నవి. అత్ర = ఈ విషయమున, సంశయః=సంశయము, న=లేదు. తపసా=తపస్సుచే, సంభృతే=పోషింపబడినవై, ఏతే=ఈవిద్యలు, బహురూపే = అనేకరూపములుకలవి, భవిష్యతః = కాగలవు.

తా. ఉత్తమగుణము లన్నియు నీయందు అధికముగా నున్నవి. సందేహము లేదు. ఈ విద్యలను తపస్సుచే పోషించినచో వివిధఫలములను ఇవ్వగలవు. 19

మూ. తతో రామో జలం స్పృష్ట్వా ప్రహృష్టవదనః శుచిః, 20
ప్రతిజగ్రాహ తే విద్యే మహర్షేర్భావితాత్మనః.

ప్ర. అ. తతః = పిమ్మట, రామః = రాముడు, జలమ్ = ఉదకమును, స్పృష్ట్వా=స్పృశించి, శుచిః=పవిత్రుడై, ప్రహృష్టవదనః=వికసించిన ముఖము కలవాడై, భావితాత్మనః=పరిశుద్ధమైన మనస్సుగల, మహర్షేః=మహర్షినుండి, తే=ఆ, విద్యే=విద్యలను, ప్రతిజగ్రాహ=స్వీకరించెను.

తా. రాముడు ఆచమనము చేసి, శుచియై, ఆనందముచే వికసించిన ముఖము కలవాడై, పరిశుద్ధమనస్కుడైన ఆ మహర్షినుండి ఆ రెండు విద్యలను స్వీకరించెను. 20

మూ. విద్యాసముదితో రామః శుశుభే భూరివిక్రమః, 21
సహస్రరశ్మిర్భగవాన్ శరదీవ దివాకరః.

గురుకార్యాణి సర్వాణి నియుజ్య కుశికాత్మజే, 22
ఊషుస్తాం రజనీం తత్ర సరయ్వాం సుసుఖం త్రయః.

ప్ర. అ. భూరివిక్రమః = గొప్ప పరాక్రమము గల, రామః = రాముడు, విద్యాసముదితః = విద్యలతో కూడినవాడై, కుశికాత్మజే = విశ్వామిత్రుని విషయమున, సర్వాణి = సమస్తమైన, గురుకార్యాణి = గురువు విషయమున చేయవలసిన కార్యములను, నియుజ్య = చేసి, శరది = శరత్కాలమునందు, సహస్రరశ్మిః = వేయి కిరణములు గల, భగవాన్ = భగవంతుడైన, దివాకరః ఇవ = సూర్యుడు వలె, శుశుభే = ప్రకాశించెను. త్రయః = వారు ముగ్గురును, తత్ర = అచట, సరయ్వామ్ = సరయూతీరమునందు, సుసుఖమ్ = చాల సుఖముగా, తాం రజనీమ్ = ఆ రాత్రి, ఊషుః = ఉండిరి.

తా. అధికపరాక్రమశాలి యగు రాముడు, విద్యలను గ్రహించిన పిమ్మట, విశ్వామిత్రుని విషయమున మంత్రాచార్యుని విషయమున ప్రవర్తించవలసిన విధముగ ప్రవర్తించుచు, శరత్కాలమునందు సూర్యుడు వలె ప్రకాశించెను. వారు ముగ్గురును ఆ రాత్రి సరయూతీరమున సుఖముగా నివాసము చేసిరి. 21, 22

మూ. దశరథ నృపసూనుసత్తమాభ్యాం
తృణశయనేఽనుచితే సహోషితాభ్యామ్,
కుశికసుతవచోఽనులాలితాభ్యాం
సుఖమివ సా విబభౌ విభావరీ చ. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ద్వావింశః సర్గః.

ప్ర. అ. అనుచితే = అలవాటు లేని, తృణశయనే = గడ్డిపక్క పైన, సహోషితాభ్యామ్ = కలిసి శయనించిన, కుశికసుతవచోనులాలితాభ్యామ్=విశ్వామిత్రుని వాక్కులచే లాలనచేయబడిన, దశరథసూనుసత్తమాభ్యామ్ = దశరథ పుత్రశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులకు, సా = ఆ, విభావరీ చ = రాత్రి కూడ, సుఖమివ = సుఖముగానే, విబభౌ = తోచినది.

తా. రామలక్ష్మణులు పూర్వమెన్నడును అలవాటు లేని తృణశయనము పై కలిసి శయనించిరి. విశ్వామిత్రుని బుజ్జగింపుమాటలచే వారికి ఆ రాత్రి కూడ సుఖముగనే ఉండెను. 23

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండములో ఇరువది రెండవ సర్గ సమాప్తము.

అథ త్రయోవింశః సర్గః

మూ. ప్రభాతాయాం తు శర్వర్యాం విశ్వామిత్రో మహామునిః,
అభ్యభాషత కాకుత్స్థౌ శయానౌ పర్ణసంస్తరే. 1

ప్ర. అ. శర్వర్యామ్ = రాత్రి, ప్రభాతాయామ్ = తెల్లవారగా, మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, పర్ణసంస్తరే = పర్ణశయనమునందు, శయానౌ = శయనించుచున్న, కాకుత్స్థౌ = రామలక్ష్మణులను గూర్చి, అభ్యభాషత = పలికెను.

తా. రాత్రి గడచి తెల్లవారుచున్నది. అపుడు విశ్వామిత్రమహర్షి పర్ణశయనముపై శయనించి యున్న రామలక్ష్మణులతో ఇట్లు పలికెను. 1

మూ. కౌసల్యా సుప్రజా రామ పూర్వా సన్ధ్యా ప్రవర్తతే,
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్. 2

ప్ర. అ. కౌసల్యాసుప్రజాః = కౌసల్యయొక్క ఉత్తమసంతానమైన, రామ=ఓరామా! పూర్వా సంధ్యా=పూర్వసంధ్య, ప్రవర్తతే=ప్రవర్తించుచున్నది. నరశార్దూల = ఓ నరశ్రేష్ఠుడా! ఉత్తిష్ఠ = లెమ్ము, దైవమ్=దేవతాసంబంధి యైన, ఆహ్నికమ్ = ప్రతిదినము చేయతగిన కర్మ, కర్తవ్యమ్ = చేయదగినది.

తా. కౌసల్యా సత్పుత్రుడ వైన ఓ రామా! ప్రాతఃకాలసంధ్య వచ్చినది. ఓ నరశ్రేష్ఠుడా! లెమ్ము. సంధ్యావన్దనాదినిత్యకర్మ చేయవలసి యున్నది. 2

మూ. తస్యర్షేః పరమోదారం వచః శ్రుత్వా నృపాత్మజౌ,
స్నాత్వా కృతోదకౌ వీరౌ జేపతుః పరమం జపమ్. 3

ప్ర. అ. వీరౌ=వీరులైన, నృపాత్మజౌ=రాజకుమారులు, తస్య ఋషేః= ఆ ఋషీశ్వరునియొక్క, పరమోదారమ్ = మిక్కిలి అంద మైన, వచః=వాక్కును, శ్రుత్వా = విని, స్నాత్వా = స్నానము చేసి, కృతోదకౌ = అర్ఘ్యప్రదానము చేసిన వారై, పరమమ్ = గొప్పదైన, జపమ్ = గాయత్రీజపమును, జేపతుః=జపించిరి.

తా. వీరులైన ఆ రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఆ మధురవాక్యము విని, లేచి, స్నానము చేసి, సూర్యునకు అర్ఘ్యప్రదానము చేసి, అత్యుత్తమమగు, గాయత్రీ మంత్రమును జపించిరి. 3

మూ. కృతాహ్నికౌ మహావీర్యౌ విశ్వామిత్రం తపోధనమ్,
అభివాద్యాభిసంహృష్టౌ గమనాయాభితస్థతుః. 4

ప్ర. అ. మహావీర్యౌ = గొప్ప పరాక్రమము గల ఆ రామలక్ష్మణులు, కృతాహ్నికౌ = చేయబడిన నిత్యకర్మలు కలవారై, అభిసంహృష్టౌ = ఉత్సాహవంతులై, తపోధనమ్ = తపస్సే ధనముగా గల, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని, అభివాద్య=నమస్కరించి, గమనాయ=ప్రయాణమునకు, అభితస్థతుః = సన్నద్ధులైరి.

తా. రామలక్ష్మణులు సంధ్యావందనాదినిత్యకర్మలను పూర్తి చేసికొని, విశ్వామిత్రమహర్షికి నమస్కరించి, ఉత్సాహముతో ప్రయాణోన్ముఖు లయిరి. 4

మూ. తౌ ప్రయాతౌ మహావీర్యౌ దివ్యాం త్రిపథగాం నదీమ్,
దదృశాతే తతస్తత్ర సరయ్వాః సఙ్గమే శుభే. 5

ప్ర. అ. తతః = పిమ్మట, మహావీర్యౌ = మహావీర్యవంతులగు ఆ రామలక్ష్మణులు, ప్రయాతౌ = కొంతదూరమువెళ్లినవారై, తత్ర = అచట, శుభే = పవిత్ర మైన, సరయ్వాః = సరయూనదియొక్క, సంగమే = సంగమమునందు, త్రిపథగామ్ = మూడు మార్గములలో ప్రవహించు, దివ్యామ్ = స్వర్గమునందు పుట్టిన, నదీమ్ = నదిని, దదృశాతే = చూచిరి.

తా. మహావీర్యు లగు రామలక్ష్మణులు కొంత దూరము ప్రయాణము చేసిన పిమ్మట పవిత్ర మగు సరయూనదీ సంగమస్థానమునందు గంగానదిని చూచిరి. 5

మూ. తత్రాశ్రమపదం పుణ్యమ్ ఋషీణాముగ్రతేజసామ్,
బహువర్షసహస్రాణి తప్యతాం పరమం తపః. 6

ప్ర. అ. తత్ర = అచట, బహువర్షసహస్రాణి = ఎన్నో వేలసంవత్సరములు, పరమమ్ = గొప్ప, తపః = తపస్సును, తప్యతామ్ = చేయుచున్న,

అగ్ర్యతేజసామ్ = గొప్ప తేజస్సు గల, ఋషీణామ్ = ఋషీశ్వరుల, పుణ్యమ్ = పవిత్రమైన, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును, (చూచిరి).

తా. అచట కొన్ని వేల సంవత్సరములనుండి గొప్ప తపస్సు చేయు చున్న, శ్రేష్ఠ మైన తేజస్సు గల ఋషుల ఆశ్రమమును చూచిరి. 6

మూ. తం దృష్ట్వా పరమప్రీతౌ రాఘవౌ పుణ్యమాశ్రమమ్,
ఊచతుస్తం మహాత్మానం విశ్వామిత్రమిదం వచః. 7

ప్ర. అ. తమ్ = ఆ, పుణ్యమ్ = పవిత్ర మైన, ఆశ్రమమ్=ఆశ్రమమును, దృష్ట్వా = చూచి, పరమప్రీతౌ = చాల సంతసించిన, రాఘవౌ = రామలక్ష్మణులు, మహాత్మానమ్ = మహాత్ము డైన, తం విశ్వామిత్రమ్ = ఆ విశ్వామిత్రుని గూర్చి, ఇదమ్ = ఈ, వచః = వాక్యమును, ఊచతుః = పలికిరి.

తా. ఆ పుణ్యాశ్రమమును చూడగనే సంతుష్టాంతరంగు లైన రామలక్ష్మ ణులు విశ్వామిత్రునితో ఇట్లు పలికిరి. 7

మూ. కస్యాయమాశ్రమః పుణ్యః కోన్వస్మిన్వసతే పుమాన్,
భగవన్ శ్రోతుమిచ్ఛావః పరం కౌతూహలం హి నౌ. 8

ప్ర. అ. భగవన్ = ఓ పూజ్యుడా! అయమ్ = ఈ, పుణ్యః=పవిత్ర మైన, ఆశ్రమః = ఆశ్రమము, కస్య = ఎవనిది? అస్మిన్ = దీనియందు, కః ను = ఏ, పుమాన్ = పురుషుడు, వసతే = నివసించుచున్నాడు? శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛావః = ఇచ్ఛయించుచున్నాము. నౌ = మాకు, పరమ్ = గొప్ప, కౌతూ హలం హి = వేడుక ఉన్నది కదా.

తా. ఓ పూజ్యుడా! పవిత్ర మైన ఈ ఆశ్రమము ఎవ్వనిది? దీనిలో ఎవ్వడు నివసించుచున్నాడు? మాకు విన వేడుకగా నున్నది. 8

మూ. తయోస్తద్వచనం శ్రుత్వా ప్రహస్య మునిపుఙ్గవః,
అబ్రవీచ్ఛ్రూయతాం రామ యస్యాయం పూర్వ ఆశ్రమః. 9

ప్ర. అ. మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడు, తయోః = వారియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, ప్రహస్య = నవ్వి, అబ్రవీత్ = పలి

కెను, పూర్వే = పూర్వకాలమునందు, అయమ్ ఆశ్రమః = ఈ ఆశ్రమము, యస్య = ఎవనిదో, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. వారి మాటలు విని, విశ్వామిత్రుడు నవ్వి, పూర్వము ఈ ఆశ్రమమెవ్వరిదో చెప్పెదను, వినుడు" అని పలికెను. 9

మూ. కన్దర్పో మూర్తిమానాసీత్ కామ ఇత్యుచ్యతే బుధైః,
తపస్యన్తమిహ స్థాణుం నియమేన సమాహితమ్. 10

కృతోద్వాహం తు దేవేశం గచ్ఛన్తం సమరుద్గణమ్,
ధర్షయామాస దుర్మేధా హుంకృతశ్చ మహాత్మనా. 11

ప్ర. అ. కన్దర్పః = మన్మథుడు, మూర్తిమాన్ = దేహముకలవాడై, ఆసీత్ = ఉండెను. బుధైః = పండితులచేత, కామః ఇతి=కాము డని, ఉచ్యతే= చెప్పబడుచున్నాడు. దుర్మేధాః = చెడ్డ బుద్ధి గల ఆ మన్మథుడు, ఇహ = ఇచట, తపస్యన్తమ్ = తపస్సుచేయుచున్నవాడును, నియమేన = నియమముచే, సమాహితమ్ = ఏకాగ్రచిత్తుడై ఉన్నవాడును, కృతోద్వాహమ్ = చేయబడిన వివాహము కలవాడై, సమరుద్గణమ్ = దేవతాసమూహసమేతముగా, గచ్ఛన్తమ్ = వెళ్లుచున్న వాడును, దేవేశమ్ = దేవతాప్రభువును అగు, స్థాణుమ్ = శివుని, ధర్షయామాస= ఎదిరించెను. మహాత్మనా = మహాత్ముడైన ఆ శివునిచేత, హుంకృతశ్చ=హుంకరించబడెను.

తా. మన్మథుడు మూర్తిమంతుడై ఉండెడివాడు. ఆతనికి కాముడని పేరు. నియమముచే సమాహితచిత్తుడై ఇచట తపస్సు చేయుచున్నవాడును, వివాహము చేసికొని దేవతాసమేతుడై వెళ్లుచున్నవాడును, సకలదేవతలకు ప్రభువును అగు శివుని, దుష్టబుద్ధి యగు ఆ మన్మథుడు ఎదిరించెను. అపుడు శివుడు హుంకరించి కోపముగా చూచెను. 10, 11

వి. మన్మథుడు శివుని తపస్సు చేయుచుండగా ఎదిరించినాడు కాని వివాహము చేసికొని దేవతలతో కలిసి వెళ్లుచున్నప్పుడు కాదు. అందుచేత "కృతోద్వాహమ్" ఇత్యాదిపాదమునకు "వివాహము చేసికొనబోవువాడును, దేవతాగణ

ముతో కలిసి వెళ్లబోవువాడును" అని కొందరు వ్యాఖ్యానము వ్రాసిరి. కాని ఇచట నున్న పదములకు ఆ అర్థము రాదు. మరికొందరు లేని పోని అర్థాలు కల్పించి "ప్రాణవాయువును నిగ్రహించి తపస్సు చేయుచున్నవాడు" అని మరొక అర్థము చెప్పి ఉన్నారు. అది అంతకంటె అసంగతము. ఇట్టి అర్థములు చెప్పుట వాల్మీకి హృదయమును గ్రహించుటకాదు. మన హృదయమును చూపుటమాత్రమే అగును. శివుడు హిమాచలముపై తపస్సు చేయుచుండగా మన్మథుడు తపో విఘ్నము చేయ నెంచినా డని పురాణాంతరప్రసిద్ధము. ఇచట అంగదేశములో శివుడు తపస్సు చేసినట్లు వర్ణింపబడినది. ఈ విరోధము ఉండనే ఉన్నది. దీనికి సమాధానముగా కల్పాంతరములో అట్లు జరిగే ఉండవచ్చును అని ఒక వ్యాఖ్యాత వ్రాసినాడు. వాస్తవమున అన్ని కల్పములందును రామాయణ భారతపురాణ కథలు అనేకపర్యాయములు జరిగిన వని చెప్పు వాదము అర్థరహితము. అప్పుడు శాస్త్ర పురుషకారములకు వైయర్థ్య మాపాదించినట్లగును. అన్ని కల్పాలలోను జగ త్సృష్టి ఒకే విధముగ జరుగు పక్షమున ఈ పాపపుణ్యాదిచింత ఎందులకు ? ఈ పురుషకారప్రబోధ మెందులకు ? ఒక సినెమాను అనేకపర్యాయములు చూపినట్లు ఈ జగత్ప్రవృత్తి అని కదా ఈ వాదములోని ఆశయము. కృత్వాచింతచే ఈ వాదమును అంగీకరించినను అన్ని కల్పాలలోను శివుడు ఒకే చోట తపస్సు చేయవలెను. అన్నియు ఒకే విధముగా జరుగవలెను. ఈ మార్పులు ఎట్లు వచ్చును ? అందుచేత ఈ శ్లోకమున అక్షరార్థ మెట్లు ఉన్నదో అట్లే చెప్పుకొన వలెను. రామాయణము ప్రకారము—శివుడు ఈ ప్రాంతములో తపస్సు చేసె ననియు, వివాహము చేసికొనిన పిమ్మట దేవతలతో కలిసి వెళ్లుచుండగా మన్మథుడు బహుశా తన ప్రభావముచేతనే శివుడు వివాహము చేసికొనె నని బీరములు పలుకగా ఆతనిని శివుడు భస్మము చేసె ననియు చెప్పవలెను. గ్రంథము ఎట్లున్నదో అట్లు వ్యాఖ్య వ్రాయుట ఉచితము. అతి ప్రాచీనములై, చాలకాలము శ్రుతాను శ్రవికముగ వచ్చు రామాయణాదిగ్రంథములలో పాఠకాదుల ప్రమాదముచే అనేక నూత్నశ్లోకపాదాదులు ప్రవేశించుటతో సమన్వయము కుదరకపోవచ్చును. పూర్వదేశరామాయణాదులలో సర్గసంఖ్యాకాండవిభాగాదులే మారిపోయినవి కదా ! అందుచే శ్రమపడి గ్రంథార్థమును మార్చుట అనావశ్యకము. ఆ సమన్వయ మేదైన ఉన్నచో అది గ్రంథమునకు బైట చెప్పుకొనవచ్చును. వాస్తవమున "కృతోద్వా హమ్" ఇత్యాదిపాదము ప్రక్షిప్తమని అంగీకరించినచో అర్థము చక్కగ కుదురును.

మూ. అవదగ్ధస్య రౌద్రేణ చక్షుషా రఘునన్దన,
వ్యశీర్యన్త శరీరాత్స్వాత్సర్వగాత్రాణి దుర్మతేః. 12

ప్ర. అ. రఘునన్దన = ఓ రామా ! రౌద్రేణ = రుద్రునికి సంబంధించిన, చక్షుషా = నేత్రముచే, అవదగ్ధస్య = కాల్చివేయబడిన, దుర్మతేః = దుర్మతి యైన మన్మథునియొక్క, స్వాత్ = తనయొక్క, శరీరాత్ = శరీరమునుండి, సర్వగాత్రాణి = అన్ని అవయవములును, వ్యశీర్యన్త = రాలిపోయినవి.

తా. శివుని నేత్రముచే కాల్చివేయబడిన ఆ దుర్మతి అవయవము లన్నియు ఆతని శరీరమునుండి జారిపోయినవి. 12

మూ. తస్య గాత్రం హతం తత్ర నిర్దగ్ధస్య మహాత్మనా,
అశరీరః కృతః కామః క్రోధాద్దేవేశ్వరేణ హి. 13

ప్ర. అ. మహాత్మనా = మహాత్ము డైన శివునిచేత, నిర్దగ్ధస్య=కాల్చివేయబడిన, తస్య = ఆతనియొక్క, గాత్రమ్ = శరీరము, తత్ర = అచట, హతమ్ = నశించిపోయినది. దేవేశ్వరేణ = ఆ దేవతాధీశునిచేత, క్రోధాత్ = కోపమువలన, కామః = మన్మథుడు, అశరీరః = శరీరము లేనివాడుగా, కృతః = చేయబడినాడు.

తా. శివునిచే కాల్చివేయబడిన మన్మథుని శరీరము నశించినది. ఈ విధముగ శివుడు కోపించి మన్మథుని శరీరము లేనివానినిగా చేసెను. 13

మూ. అనఙ్గ ఇతి విఖ్యాత స్తదాప్రభృతి రాఘవ,
స చాఙ్గవిషయః శ్రీమాన్ యత్రాఙ్గం ప్రముమోచ హ. 14

ప్ర. అ. రాఘవ = ఓ రామా ! తదాప్రభృతి = అది మొదలు, అనఙ్గః ఇతి = అనంగుడు (శరీరములేనివాడు) అని, విఖ్యాతః = ప్రసిద్ధ డయ్యెను. యత్ర = ఎచట, అఙ్గమ్ = శరీరమును, ప్రముమోచ హ = విడచెనో, సః చ = ఆ దేశము, శ్రీమాన్ = శ్రీయుత మైన, అఙ్గవిషయః = అంగదేశము అని, విఖ్యాతః = ప్రసిద్ధ మైనది.

తా. అది మొదలు మన్మథునికి అనంగు డని ప్రసిద్ధి వచ్చినది. ఆతడు దేహమును (అంగమును) విడచిన దేశమునకు అంగదేశ మని పేరు వచ్చినది. 14

మూ. తస్యాయమాశ్రమః పుణ్య స్తస్యేమే మునయః పురా,
శిష్యా ధర్మపరా నిత్యం తేషాం పాపం న విద్యతే. 15

ప్ర. అ. అయమ్ = ఇది, తస్య = ఆ శివునియొక్క, పుణ్యః = పుణ్యమైన, ఆశ్రమః = ఆశ్రమము. పురా = పూర్వము, తస్య = ఆ శివునియొక్క, శిష్యాః = శిష్యు లైన, ఇమే=ఈ, మునయః = మునులు, నిత్యమ్=ఎల్లప్పుడును, ధర్మపరాః = ధర్మపరాయణులు. తేషామ్ = వారికి, పాపమ్ = పాపము, న విద్యతే = లేదు.

తా. ఇది శివుడు తపస్సు చేసిన పుణ్య మైన ఆశ్రమము. ఈ మును లందరును పూర్వము. అనగా శివుడు ఇచట నున్నపుడు, ఆ శివుని శిష్యులుగా నుండెడివారు. నిత్యము ధర్మపరాయణులు. వీరికి పాపము అనునది లేదు. 15

వి. "తస్య కామస్య స్థాణోర్వా"— అనగా మన్మథునియొక్క లేదా స్థాణువుయొక్క ఆశ్రమము. "పురా పూర్వకాలమారభ్య"=పూర్వకాలమునుండియు, వీరు "సంతానపరమ్పరయా శిష్యాః"-- సంతానపరంపరాక్రమమున శిష్యులు. ప్రత్యక్షముగ శిష్యులు కారు. చాల కాలమునకు పూర్వము వీరి పూర్వపురుషులు ఆయనకు శిష్యులు. "అత ఏవ ధర్మపరాః" —అనగా వారి పూర్వపురుషులనుంచి వీరు ఇంత దూర మైనారు గాన ధర్మపరులు. "అత ఏవ పాపం తేషాం న విద్యతే. పూర్వం రుద్రశిష్యా అపి సంప్రతి తచ్ఛిష్యత్వకృతం పాపం న విద్యతే ఇత్యర్థః" —కావుననే వారిలో పాపము లేదు. అనగా పూర్వము వీరి ప్రాచీను లెవరో రుద్రునకు శిష్యు లైనను, ఇపుడు వీరికి రుద్రులకు శిష్యు లగుటవలన కలుగు పాపము లేదు అనియర్థము." ఇది గోవిందరాజులు విశదీకరించిన వాల్మీకి భావము : మన్మథుని ఆశ్రమము కావున ఇది పుణ్యాశ్రమము కావచ్చును కాని స్థాణువు ఆశ్రమమునకు పుణ్యత్వ మేమిటి అని మొదట 'తస్య' అనగా 'కామస్య' అని వ్యాఖ్యానించినారు. తప్పనిసరిమీద "స్థాణోర్వా" అన్నారు. 'పురా శిష్యాః' 'ధర్మపరాః' "తేషాం పాపం న విద్యతే" అను పదాలకు వారు చెప్పిన అర్థము స్పష్టమే. పురాణమిత్యేవ న సాధు సర్వమ్" అనే దృష్టితో ప్రాచీన మైనంత మాత్రాన ప్రమాణము లని

మనవారు భావించు వ్యాఖ్యానాలు ఎట్లున్నవో చూపుటకై అప్రస్తుతప్రసంగము చేయవలసివచ్చినది.

మూ. ఇహాద్య రజనీం రామ వసేమ శుభదర్శన,
పుణ్యయోః సరితోర్మధ్యే శ్వ స్తరిష్యామహే వయమ్. 16

ప్ర. అ. శుభదర్శన = శుభకరమైన దర్శనము గల, రామ=రాముడా! వయమ్ = మనము, అద్య = ఈనాడు, రజనీమ్ = రాత్రి, ఇహ = ఇచట, పుణ్యయోః = పుణ్యము లైన, సరితోః = నదులయొక్క, మధ్యే = మధ్యమందు, వసేమ = నివసించెదము. శ్వః = రేపు, తరిష్యామహే = దాటెదము.

తా. శుభకరదర్శనుడ వైన ఓ రామా! ఈ రాత్రి, పవిత్రములైన గంగా సరయూనదుల మధ్య, ఇచట ఉండి రేపు గంగానదిని దాటెదము. 16

మూ. అభిగచ్ఛామహే సర్వే శుచయః పుణ్యమాశ్రమమ్,
స్నాతాశ్చ కృతజప్యాశ్చ హుతహవ్యా నరోత్తమ. 17

ప్ర. అ. నరోత్తమ = ఓ నరశ్రేష్ఠుడా! సర్వే = మన మందరము, స్నాతాశ్చ=స్నానము చేసినవారమై, కృతజప్యాశ్చ=జపము చేసినవారమై, హుతహవ్యాః = హోమము చేయబడిన హవ్యము కలవారమై, శుచయః = పవిత్రులమై, పుణ్యమ్=పుణ్యమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును, అభిగచ్ఛామహే = ప్రవేశించెదము.

తా. ఓ నరోత్తమా! మన మందరము స్నానజపహోమాదులు చేసికొని, పరిశుద్ధులమై ఈ పుణ్యాశ్రమమును ప్రవేశింతము. 17

మూ. తేషాం సంవదతాం తత్ర తపోదీర్ఘేణ చక్షుషా,
విజ్ఞాయ పరమప్రీతా మునయో హర్షమాగమన్. 18

ప్ర. అ. తత్ర = అచట, తేషామ్ = వారు, సంవదతామ్=సంభాషించుకొనుచుండగా, మునయః=మునులు, తపోదీర్ఘేణ=తపస్సుచేత దీర్ఘమైన, చక్షుషా= నేత్రముచే, విజ్ఞాయ = తెలిసికొని, పరమప్రీతాః = మిక్కిలి సంతసించినవారై, హర్షమ్ = ఆనందమును, ఆగమన్ = పొందిరి.

తా. రామలక్ష్మణవిశ్వామిత్రులు మాటలాడుచుండగా, ఆ ఆశ్రమములోని మునులు తపస్సుచే ఎంత దూర మైనను ప్రసరించు దృష్టిచే (జ్ఞానముచే) తెలిసికొని, చాల సంతసించినవారై, ఆనందము పొందిరి. 18

మూ. అర్ఘ్యం పాద్యం తథాతిథ్యం నివేద్య కుశికాత్మజే,
రామలక్ష్మణయోః పశ్చాదకుర్వన్నతిథిక్రియామ్. 19

ప్ర. అ. అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, పాద్యమ్ = పాదోదకమును, తథా = మరియు, ఆతిథ్యమ్=అతిథిసత్కారమును, కుశికాత్మజే = విశ్వామిత్రునియందు, నివేద్య = సమర్పించి, పశ్చాత్ = పిమ్మట, రామలక్ష్మణయోః = రామలక్ష్మణులకు, అతిథిక్రియామ్ = అతిథిసత్కారమును, అకుర్వన్ = చేసిరి.

తా. వారు ముందుగా విశ్వామిత్రునకు అర్ఘ్యపాద్యములను, ఆతిథ్యమును సమర్పించి, పిమ్మట రామలక్ష్మణులకు అతిథిసత్కారము చేసిరి. 19

మూ. సత్కారం సమనుప్రాప్య కథాభిరభిరఞ్జయన్,
యథార్హమజపన్ సన్ధ్యామృషయస్తే సమాహితాః. 20

ప్ర. అ. సత్కారమ్=సత్కారమును, సమనుప్రాప్య=పొంది, కథాభిః= కథలచేత, అభిరఞ్జయన్ = ఆనందింపచేసిరి. తే ఋషయః = ఆ ఋషులు, సమాహితాః = సావధానచిత్తము కలవారై, యథార్హమ్ = తగు విధమున, సన్ధ్యామ్ = సంధ్యను, అజపన్ = జపించిరి.

తా. రామలక్ష్మణవిశ్వామిత్రులు వారినుండి సత్కారములు గైకొని కథలచే ఆనందింపచేసిరి. పిదప ఆ ఋషు లందరును ఏకాగ్రచిత్తులై, తగు విధమున సంధ్యోపానన చేసిరి. 20

మూ. తత్ర వాసిభిరానీతా మునిభిః సువ్రతైః సహ,
న్యవసన్ సుసుఖం తత్ర కామాశ్రమపదే తదా. 21

ప్ర. అ. తత్ర = అచట, వాసిభిః = నివసించు, సువ్రతైః = ఉత్తమ వ్రతముగల, మునిభిః = మునులచే, సహ = తమతో కూడ, ఆనీతాః = తీసికొని

వెళ్లబడినవారై, తదా = అప్పుడు, తత్ర = ఆ, కామాశ్రమపదే = కామాశ్రమము సందు, సుసుఖమ్ = చాలసుఖముగా, న్యవసన్ = నివసించిరి.

తా. ఆ ఆశ్రమములో నివసించు సువ్రతు లగు మునులు రామలక్ష్మణ విశ్వామిత్రులను తమతో ఆశ్రమములోనికి తీసికొనివెళ్లిరి. వారు అచట సుఖముగా నివసించిరి. 21

మూ. కథాభిరభిరామాభిరభిరామౌ నృపాత్మజౌ,
రమయామాస ధర్మాత్మా కౌశికో మునిపుఙ్గవః. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రయోవింశః సర్గః.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడును, మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడును అగు, కౌశికః = విశ్వామిత్రుడు, అభిరామౌ = మనోహరులైన, నృపాత్మజౌ = రాజకుమారులను, అభిరామాభిః = మనోహరములైన, కథాభిః = కథలచేత, రమయామాస = ఆనందింపచేసెను.

తా. విశ్వామిత్రమహాముని, మనోహరు లగు ఆ రాజకుమారులకు మనోహరము లగు కథలు చెప్పుచు ఆనందింపచేసెను. 22

"బాలానన్దిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో
ఇరువదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుర్వింశః సర్గః

మూ. తతః ప్రభాతే విమలే కృతాహ్నికమరిన్దమౌ,
విశ్వామిత్రం పురస్కృత్య నద్యాస్తీరముపాగతౌ. 1

ప్ర. అ. తతః = పిమ్మట, అరిన్దమౌ = శత్రుసంహారకు లైన, ఆ రామ లక్ష్మణులు, విమలే = పరిశుద్ధ మైన, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, కృతాహ్నికమ్ = చేయబడిన అహ్నికక్రియలు గల, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, పురస్కృత్య = ఎదుట ఉంచుకొని, నద్యాః=గంగానదియొక్క, తీరమ్=తీరమును, ఉపాగతౌ = చేరిరి.

తా. శత్రుమర్దను లగు ఆ రామలక్ష్మణులు, పవిత్ర మైన ప్రాతః కాలమునందు ప్రాతఃకాలకృత్యములు తీర్చుకొని ప్రయాణమునకు సిద్ధముగా ఉన్న విశ్వామిత్రుడు బయలుదేరి ముందు నడవగా గంగానదీతీరము చేరిరి. 1

మూ. తే చ సర్వే మహాత్మానో మునయః సంశితవ్రతాః,
ఉపస్థాప్య శుభాం నావం విశ్వామిత్రమథాబ్రువన్. 2

ప్ర. అ. మహాత్మానః=మహాత్ములును, సంశితవ్రతాః=తీవ్రమైన తపశ్చర్య కలవారును అగు, తే = ఆ, సర్వే = సమస్త మైన, మునయః = మునులు, శుభామ్ = శుభకర మైన, నావమ్ = నావను, ఉపస్థాప్య = తీసికొనివచ్చి, అథ = అటుపిమ్మట, విశ్వామిత్రమ్=విశ్వామిత్రునిగూర్చి, అబ్రువన్ = పలికిరి.

తా. తీవ్రతపశ్చర్య గల మహాత్ము లైన ఆ మును లందరును మంగళకర మైన నావనొకదానిని తీసికొని వచ్చి విశ్వామిత్రునితో ఇట్లనిరి. 2

మూ. ఆరోహతు భవాన్నావం రాజపుత్రపురస్కృతః,
అరిష్టం గచ్ఛ పన్థానం మా భూత్కాలవిపర్యయః. 3

ప్ర. అ. భవాన్ = నీవు, రాజపుత్రపురస్కృతః = రాజపుత్రులచే ముందు ఉంచుకొనబడినవాడవై, నావమ్ = నావను, ఆరోహతు = ఎక్కెదవు

గాక. అరిష్టమ్ = శుభము కలుగు నట్లుగా, పన్థానమ్ = మార్గమును, గచ్ఛ = పొందుము. కాలవిపర్యయః = కాలమునందు మార్పు, మా భూత్ = కాకపోవుగాక.

తా. రామలక్ష్మణులను వెంటబెట్టుకొని నీవు నావను అధిరోహింపుము. శుభముగా కాలవిలంబము జరుగకుండగా, ప్రయాణము చేయుము. 3

మూ. విశ్వామిత్ర స్తథేత్యుక్త్వా తానృషీనభిపూజ్య చ,
తతార సహితస్తాభ్యాం సరితం సాగరంగమామ్. 4

ప్ర. అ. విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, తథేతి="అటులనే" అని, ఉక్త్వా= పలికి, తాన్ = ఆ, ఋషీన్ = ఋషులను, అభిపూజ్య చ=పూజించి, తాభ్యామ్= రామలక్ష్మణులతో, సహితః = కూడినవాడై, సాగరంగమామ్=సముద్రములోనికి ప్రవహించు, సరితమ్ = నదిని, తతార = దాటెను.

తా. విశ్వామిత్రుడు 'అలాగే' అని చెప్పి, ఆ ఋషీశ్వరులను పూజించి, రామలక్ష్మణులతో గంగానదిని దాటెను. 4

మూ. తతః శుశ్రావ వై శబ్దమతిసంరమ్భవర్ధితమ్,
మధ్యమాగమ్య తోయస్య సహ రామః కనీయసా. 5

ప్ర. అ. తతః = పిమ్మట, రామః = రాముడు, తోయస్య=జలముయొక్క, మధ్యమ్ = మధ్యమును, ఆగమ్య = పొంది, అతిసంరమ్భవర్ధితమ్ = మిక్కిలి వేగముచే వృద్ధి పొందింపబడిన, శబ్దమ్=శబ్దమును, కనీయసా సహ=తమ్మునితో కూడ, శుశ్రావ = వినెను.

తా. నదీమధ్యమును చేరిన పిమ్మట రామలక్ష్మణులు, మిక్కిలి వేగముచే వృద్ధిపొందింపబడిన ఒక శబ్దమును వినిరి. 5

మూ. అథ రామః సరిన్మధ్యే పప్రచ్ఛ మునిపుఙ్గవమ్,
వారిణో భిద్యమానస్య కిమయం తుములో ధ్వనిః. 6

ప్ర. అ. అథ = పిమ్మట, రామః = రాముడు, సరిన్మధ్యే = నదీమధ్యమునందు, మునిపుఙ్గవమ్ = మునిశ్రేష్ఠుని, పప్రచ్ఛ = ప్రశ్నించెను. భిద్యమానస్య=

భేదింపబడుచున్న, వారిణః = ఉదకముయొక్క, అయమ్ = ఈ, తుములః = వ్యాకులమైన, ధ్వనిః = ధ్వని, కిమ్ = ఏమి?

తా. నదీమధ్యమున రాముడు "నీరు బ్రద్ద లగుచున్నట్లు గంభీర మైన ధ్వని వచ్చుచున్నది; ఇది ఏమి?" అని విశ్వామిత్రుని ప్రశ్నించెను. 6

మూ. రాఘవస్య వచః శ్రుత్వా కౌతూహలసమన్వితః (తమ్),
కథయామాస ధర్మాత్మా తస్య శబ్దస్య నిశ్చయమ్. 7

ప్ర. అ. కౌతూహలసమన్వితమ్=వేడుకతో కూడిన, రాఘవస్య=రాముని యొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, ధర్మాత్మా = ఆ ధర్మాత్ముడు, తస్య శబ్దస్య = ఆ శబ్దమునకు సంబంధించిన, నిశ్చయమ్ = తత్త్వమును, కథయామాస = చెప్పెను.

తా. వేడుకతో కూడిన రామవాక్యమును విని విశ్వామిత్రుడు ఆ శబ్దము యొక్క తత్త్వమును విశదీకరించెను. 7

మూ. కైలాసపర్వతే రామ మనసా నిర్మితం సరః,
బ్రహ్మణా నరశార్దూల తేనేదం మానసం సరః. 8

ప్ర. అ. నరశార్దూల = నరశ్రేష్ఠుడా! రామ = రాముడా, కైలాసపర్వతే= కైలాసపర్వతమునందు, బ్రహ్మణా = బ్రహ్మదేవునిచేత, సరః = సరస్సు, మనసా = మనస్సుచే, నిర్మితమ్ = నిర్మింపబడినది. తేన=ఆకారణముచేత, ఇదం సరః = ఈసరస్సు, మానసమ్ = మానస మనిచెప్పబడుచున్నది. 8

తా. రామా ! బ్రహ్మదేవుడు కైలాసపర్వతముపై, తన మనఃసంకల్ప మాత్రముచే ఒక సరస్సును నిర్మించెను. మనస్సుచే నిర్మింపబడుటచే దానికి మానస మని పేరు.

మూ. తస్మాత్సుస్రావ సరసః సాయోధ్యాముపగూహతే,
సరఃప్రవృత్తా సరయూః పుణ్యా బ్రహ్మసరశ్చ్యుతా. 9

ప్ర. అ. (యా = ఏ నది), తస్మాత్ = ఆ, సరసః = సరస్సునుండి, సుస్రావ=ప్రవహించినదో, సా = ఆ నది, అయోధ్యామ్=అయోధ్యాపట్టణమును,

ఉపగూహతే = చుట్టుకొనియున్నది. సరఃప్రవృత్తా = సరస్సునుండి ప్రవహించిన దగుటచే, సరయూః=సరయూనది అని చెప్పబడుచున్నది. బ్రహ్మసరశ్చ్యుతా= బ్రహ్మయొక్క సరస్సునుండి ప్రవహించుటచేత, పుణ్యా = పుణ్య మైన ఆ నది (ఉత్తరశ్లోకముతో అన్వయము).

తా. ఆ సరస్సునుండి పుట్టుటచే "సరయు" అను పేరు గల నది అయోధ్యను చుట్టి ఉన్నది. బ్రహ్మ సృజించిన మానససరస్సునుండి జనించిన దగుటచే చాల పవిత్ర మైన ఆ నది— 9

మూ. తస్యాయమతులః శబ్దో జాహ్నవీమభివర్తతే,
వారిసంక్షోభజో రామ ప్రణామం నియతః కురు. 10

ప్ర. అ. జాహ్నవీమ్ = గంగను, అభివర్తతే = ప్రవేశించుచున్నది. అయమ్ = ఈ, అతులః = గొప్ప, శబ్దః = శబ్దము, తస్యాః = ఆ నదియొక్క, వారిసంక్షోభజః = జలముయొక్క సంక్షోభమువలన కలిగినది. రామ = రామా! నియతః = భక్తికలవాడవై, ప్రణామమ్ = నమస్కారమును, కురు = చేయుము.

తా. గంగలో ప్రవేశించుచున్నది. ఈ గంభీరధ్వని జలసంక్షోభము వలన కలిగినది. రామా! శ్రద్ధాభక్తియుక్తుడవై ఈ నదీద్వయసంగమమునకు నమస్కారము చేయుము. 10

మూ. తాభ్యాం తు తావుభౌ కృత్వా ప్రణామమతిధార్మికౌ,
తీరం దక్షిణమాసాద్య జగ్మతుర్లఘువిక్రమౌ. 11

ప్ర. అ. అతిధార్మికౌ = మిక్కిలిధార్మికు లైన, తౌ ఉభౌ = వారిరువురును, తాభ్యామ్ = ఆ నదులకు, ప్రణామమ్ = నమస్కారము, కృత్వా = చేసి, దక్షిణం తీరమ్ = దక్షిణతీరమును, ఆసాద్య = పొంది, లఘువిక్రమౌ = శీఘ్రముగ నడచుచున్నవారై, జగ్మతుః = వెళ్లిరి.

తా. అతిధార్మికు లైన ఆ రామలక్ష్మణులు ఆ రెండు నదులకును నమస్కారము చేసిరి. గంగానది దక్షిణతీరమును చేరి శీఘ్రగమనముతో ప్రయాణము చేసిరి. 11

మూ. స వనం ఘోరసంకాశం దృష్ట్వా నృపవరాత్మజః,
అవిప్రహతమైక్ష్వాకః పప్రచ్ఛమునిపుఙ్గవమ్. 12

ప్ర. అ. ఐక్ష్వాకః = ఇక్ష్వాకువంశమునందు పుట్టిన, నృపవరాత్మజః = రాజశ్రేష్ఠుని కుమారుడైన, సః = ఆతడు, ఘోరసంకాశమ్ = భయంకరమైనదియు, అవిప్రహతమ్ = త్రొక్కబడనిదియు అగు, వనమ్ = అరణ్యమును, దృష్ట్వా = చూచి, మునిపుఙ్గవమ్ = మునిశ్రేష్ఠుని, పప్రచ్ఛ = అడిగెను.

తా. రాముడచట మానవ సంచారము లేని, భయంకరమైన ఒక అరణ్యమును చూచి విశ్వామిత్రుని ప్రశ్నించెను. 12

మూ. అహో వనమిదం దుర్గం ఝిల్లికాగణనాదితమ్,
భైరవైః శ్వాపదైః పూర్ణం శకునైర్దారుణారుతైః. 13

ప్ర. అ. ఝిల్లికాగణనాదితమ్ = ఈల పురుగుల సముదాయముచేత ధ్వనింపచేయబడినదియు, భైరవైః = భయంకరములైన, శ్వాపదైః = ఘాతుకమృగములతోను, దారుణారుతైః = భయంకరమైన కూతలు గల, శకునైః = భాసపక్షులతోను, పూర్ణమ్ = నిండి యున్న, ఇదమ్ = ఈ, వనమ్ = వనము, దుర్గమ్ = ప్రవేశింపశక్యము కాక ఉన్నది. అహో = ఏమి ఆశ్చర్యము.

తా. ఓహో ! ఈ వనము ప్రవేశింప శక్యము కాక ఉన్నది. ఈల పురుగుల రొజచే ధ్వనింపచేయబడినది. భయంకరములైన ఘాతుకమృగములతోను, భయమును కలిగించు నట్లు కూయుచున్న భాసపక్షులతోను నిండి యున్నది. 13

మూ. నానాప్రకారైః శకునైర్వాశ్యద్భిర్భైరవస్వనైః,
సింహవ్యాఘ్రవరాహైశ్చ వారణైశ్చోపశోభితమ్. 14

ప్ర. అ. వాశ్యద్భిః = కూయుచున్న, భైరవస్వనైః = భయంకరమైన ధ్వనులు గల, నానాప్రకారైః = అనేకవిధములైన, శకునైః = పక్షులచేతను, సింహవ్యాఘ్రవరాహైః చ = సింహ-వ్యాఘ్ర-వరాహములచేతను, వారణైః చ = గజములచేతను, ఉపశోభితమ్ = ప్రకాశింపచేయబడినది.

తా. ఈ వనమున అతిభయంకర మైన స్వరములతో కూయుచున్న అనేకవిధము లైన పక్షులు, సింహములు, పెద్దపులులు, అడవిపందులు, ఏనుగులు సంచరించుచున్నవి. 14

మూ. ధవాశ్వకర్ణకకుభై ర్బిల్వతిన్దుకపాటలైః,
సంకీర్ణం బదరీభిశ్చ కిం న్వేతద్దారుణం వనమ్. 15

ప్ర. అ. ధవాశ్వకర్ణకకుభైః = చండ్ర ఇనుమద్ది ఏరుమద్ది చెట్లచేతను, బిల్వతిన్దుకపాటలైః = మారేడు తుమ్మికి కలిగొట్టు చెట్లచేతను, బదరీభిశ్చ = రేగు చెట్లచేతను, సంకీర్ణమ్ = వ్యాకులమై యున్నది. ఏతత్ = ఈ, దారుణమ్ = భయంకర మైన, వనమ్ = వనము, కిం ను = ఏది ?

తా. ఈ వనము చండ్ర, ఇనుమద్ది, ఏరుమద్ది, మారేడు, తుమ్మికి, కలిగొట్టు, రేగుచెట్లతో దట్టముగ నున్నది. ఈ భయంకర మైన వనము ఏమి ? 15

మూ. తమువాచ మహాతేజా విశ్వామిత్రో మహామునిః,
శ్రూయతాం వత్స కాకుత్స్థ యస్యైతద్దారుణం వనమ్. 16

ప్ర. అ. మహాతేజాః = మహాతేజస్సు గల, మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామితు్రడు, తమ్ = ఆతనిని గూర్చి, ఉవాచ = పలికెను. వత్స = వత్సా, కాకుత్స్థ = రామా, ఏతత్ = ఈ, దారుణమ్ = భయంకర మైన, వనమ్ = వనము, యస్య = ఎవనిదో, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. మహాతేజశ్శాలి యైన విశ్వామిత్రమహాముని రామునితో — "వత్సా! రామా! భయంకర మైన ఈ వనము ఎవ్వరిదో చెప్పెదను; వినుము" అని పలికెను. 16

మూ. ఏతౌ జనపదౌ స్ఫీతౌ పూర్వమాస్తాం నరోత్తమ,
మలదాశ్చ కరూశాశ్చ దేవనిర్మాణనిర్మితౌ. 17

ప్ర. అ. నరోత్తమ = ఓ నరశ్రేష్ఠుడా ! పూర్వమ్ = పూర్వము, దేవనిర్మాణనిర్మితౌ = దేవతల నిర్మాణముచేత నిర్మితము లైన, మలదాః చ = మలదము,

కరూశాః చ = కరూశము అనెడు, స్ఫీతౌ = విశాలము లైన, ఏతౌ = ఈ, జన పదౌ = దేశములు, ఆస్తామ్ = ఉండెడివి.

తా. రామా ! పూర్వము దేవతలు నిర్మించిన మలదము, కరూశము అనెడు రెండు విశాలము లైన, సమృద్ధము లైన దేశములు ఈ ప్రాంతమునందు ఉండెడివి. 17

మూ. పురా వృత్రవధే రామ మలేన సమభిప్లుతమ్,
క్షుధా చైవ సహస్రాక్షం బ్రహ్మహత్యా సమావిశత్. 18

ప్ర. అ. రామ = ఓరామా! పురా = పూర్వము, వృత్రవధే = వృత్రాసురుని చంపినపుడు, మలేన=అశుచిత్వముచేతను, క్షుధా చైవ=ఆకలిచేతను, సమభిప్లుతమ్ = నిండిన, సహస్రాక్షమ్ = దేవేంద్రుని, బ్రహ్మహత్యా = బ్రహ్మహత్యా పాపము, సమావిశత్ = ప్రవేశించెను.

తా. రామా ! పూర్వము ఇంద్రుడు వృత్రాసురుని చంపుటచే ఆతనిని బ్రహ్మహత్యాపాపము ఆవహించెను. అపు డాతనిని అశుచిత్వము, ఆకలి పీడింప దొడగినవి. 18

మూ. తమిన్ద్రం స్నాపయన్ దేవా ఋషయశ్చ తపోధనాః,
కలశైః స్నాపయామాసుర్మలం చాస్య ప్రమోచయన్. 19

ప్ర. అ. తమ్ = ఆ, ఇన్ద్రమ్ = ఇంద్రుని, దేవాః = దేవతలు, స్నాప యన్ = స్నానము చేయించిరి. తపోధనాః = తపస్సే ధనముగా గల, ఋష యశ్చ = ఋషులును, కలశైః = కలశములచేత, స్నాపయామాసుః=స్నానము చేయించిరి. అస్య = ఇతనియొక్క, మలమ్ = అశుచిత్వమును, ప్రమోచయన్= తొలగింపచేసిరి.

తా. దేవతలును, తపశ్శాలు లగు మహర్షులును ఆ ఇంద్రుని తీర్థోదకముల చేతను, కలశములతో అభిమంత్రితము లైన ఉదకములచేతను, స్నానము చేయించి ఆతని అశుచిత్వమును తొలగించిరి. 19

మూ. ఇహ భూమ్యాం మలం దత్త్వా దత్త్వా కారూశమేవ చ
శరీరజం మహేన్ద్రస్య తతో హర్షం ప్రపేదిరే. 20

ప్ర. అ. మహేన్ద్రస్య = మహేంద్రునియొక్క, శరీరజమ్ = శరీరము నుండి పుట్టిన, మలమ్ = అశుచిత్వమును, ఇహ = ఈ, భూమ్యామ్ = భూమి యందు, దత్వా = ఇచ్చి, కారూశమేవ చ = ఆకలిని కూడ, దత్వా = ఇచ్చి, తతః = పిమ్మట, హర్షమ్ = ఆనందమును, ప్రపేదిరే = పొందిరి.

తా. మహేంద్రుని శరీరమున కున్న అశుచిత్వమును, ఆతని ఆకలిని ఈ ప్రదేశమునకు ఇచ్చివేసి సంతోషించిరి. 20

మూ. నిర్మలో నిష్కరూషశ్చ శుచిరిన్ద్రో యదాఽభవత్,
దదౌ దేశస్య సుప్రీతో వరం ప్రభురనుత్తమమ్. 21

ప్ర. అ. ఇన్ద్రః = ఇంద్రుడు, యదా = ఎపుడు, నిర్మలః = అశుచిత్వము తొలగిపోయినవాడై, నిష్కరూషశ్చ = ఆకలి తొలగిపోయినవాడై, శుచిః = పవిత్రుడు, అభవత్ = ఆయెనో, అప్పుడు, ప్రభుః = సర్వసమర్థుడైన ఆతడు, సుప్రీతః = చాల సంతోషించినవాడై, దేశస్య = ఈ దేశమునకు, అనుత్తమమ్ = చాల ఉత్తమమైన, వరమ్ = వరమును, దదౌ = ఇచ్చెను.

తా. అశుచిత్వము, ఆకలి, తొలగిపోయి శుచియైన పిమ్మట సర్వసమర్థుడగు ఇంద్రుడు ఈ దేశము విషయమున చాల సంతసించినవాడై ఒక వరమిచ్చెను. 21

మూ. ఇమౌ జనపదౌ స్ఫీతౌ ఖ్యాతిం లోకే గమిష్యతః,
మలదాశ్చ కరూశాశ్చ మమాఙ్గమలధారిణౌ. 22

ప్ర. అ. మమ = నా యొక్క, అఙ్గమలధారిణౌ = శరీరమలమును ధరించిన, ఇమౌ = ఈ, జనపదౌ = దేశములు, స్ఫీతౌ = సమృద్ధములైనవై, మలదాశ్చ = మలద మనియు, కరూశాశ్చ = కరూశ మనియు, లోకే = లోకము నందు, ఖ్యాతిమ్ = ప్రసిద్ధిని, గమిష్యతః = పొందగలవు.

తా. నా శరీరమునందలి అశుచిత్వమును ఆకలిని గైకొనిన ఈ దేశములు, సర్వసమృద్ధములై, మలదము, కరూశము అను నామధేయములతో లోకమునందు ఖ్యాతిని పొందగలవు. 22

మూ. సాధు సాధ్వితి తం దేవాః పాకశాసనమబ్రువన్,
దేశస్య పూజాం తాం దృష్ట్వా కృతాం శక్రేణ ధీమతా. 23

ప్ర. అ. ధీమతా=బుద్ధిమంతుడైన, శక్రేణ=దేవేంద్రునిచేత, కృతామ్=చేయబడిన, తామ్=ఆ, దేశస్య=దేశముయొక్క, పూజామ్=పూజను, దృష్ట్వా=చూచి, దేవాః = దేవతలు, సాధు సాధు ఇతి = బాగున్నది బాగున్నది అని, తం పాకశాసనమ్ = ఆ ఇంద్రుని గూర్చి, అబ్రువన్ = పలికిరి.

తా. ధీమంతుడగు దేవేంద్రుడు ఆ దేశమునకు చేసిన గౌరవమును చూచి దేవతలు "బాగున్నది, బాగున్నది" అని అనుచు దేవేంద్రుని మెచ్చుకొనిరి. 23

మూ. ఏతౌ జనపదౌ స్ఫీతౌ దీర్ఘకాలమరిన్దమ,
మలదాశ్చ కరూశాశ్చ ముదితౌ ధనధాన్యతః. 24

ప్ర. అ. అరిన్దమ = ఓ శత్రుసంహారకుడా! మలదాశ్చ = మలదము, కరూశాశ్చ = కరూశము అనెడు, స్ఫీతౌ = విశాలములైన, ఏతౌ = ఈ, జనపదౌ = దేశములు, దీర్ఘకాలం=చాలకాలము, ధనధాన్యతః = ధనధాన్యములతో, ముదితౌ = ఆనందముకలవై ఉండెడివి.

తా. రామా! విశాలములైన ఈ మలదకరూశదేశములు చాల కాలము ధనధాన్యసమృద్ధములై ఉండెడివి. 24

మూ. కస్య చిత్త్వథ కాలస్య యక్షీ వై కామరూపిణీ,
బలం నాగసహస్రస్య ధారయన్తీ తదా హ్యభూత్. 25

తాటకా నామ భద్రం తే భార్యా సున్దస్య ధీమతః,
మారీచో రాక్షసః పుత్రో యస్యాః శక్రపరాక్రమః. 26

ప్ర. అ. అథ = పిమ్మట, కస్య చిత్ కాలస్య = కొంత కాలమునకు, తదా=అపుడు, కామరూపిణీ=స్వేచ్ఛాధీన రూపము కలదియు, నాగసహస్రస్య=వేయి ఏనుగుల యొక్క, బలమ్ = బలమును, ధారయన్తీ=ధరించుచున్నదియు, ధీమతః = బుద్ధిమంతుడైన, సున్దస్య = సుందునియొక్క, భార్యా = భార్యయు, శక్రపరాక్రమః = దేవేంద్రులవంటి పరాక్రమము గల, మారీచః = మారీచుడనే

రాక్షసుడు, యస్యాః = ఎవ్వతె యొక్క, పుత్రః = పుత్రుడో, అట్టి, తాటకా నామ = తాటక యనెడు, యక్షీ = యక్షిణి, అభూత్ = ఉండెను, తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక.

తా. కొంత కాలమునకు స్వేచ్ఛారూపధారిణి యగు ఒక యక్షిణి ఆవిర్భ వించినది. ఆమెకు వేయి ఏనుగుల బల మున్నది. ఆమె ధీమంతు డైన సుందుని భార్య. ఇంద్రునితో సమాన మైన పరాక్రమము గల మారీచు డనే రాక్షసుడు ఆమె కుమారుడు. నీకు క్షేమ మగుగాక. 25, 26

మూ॥ వృత్తబాహుర్మహావీర్యో విపులాస్యతనుర్మహాన్,
రాక్షసో భైరవాకారో నిత్యం త్రాసయతే ప్రజాః. 27

ప్ర. అ. వృత్తబాహుః = వర్తులాకార మైన బాహువులు కలవాడును, మహావీర్యః = గొప్ప పరాక్రమము కలవాడును, విపులాస్యతనుః = విశాల మైన ముఖము శరీరము కలవాడును, మహాన్ = పెద్ద ప్రమాణము కలవాడును, భైరవాకారః = భయంకర మైన ఆకారము కలవాడును అగు, రాక్షసః = ఆ రాక్షసుడు, నిత్యమ్ = ఎల్లప్పుడును, ప్రజాః = ప్రజలను, త్రాసయతే = భయ పెట్టుచున్నాడు.

తా. ఆ మారీచుని బాహువులు బలిసి ఉన్నవి. అతడు గొప్ప పరాక్రమము కలవాడు. విశాల మైన ముఖము శరీరము కలవాడు. గొప్ప ప్రమాణము కల వాడు. భయంకరాకారుడు. అట్టి మారీచుడు ఎల్లప్పుడును ప్రజలను బాధించు చున్నాడు. 27

మూ. ఇమౌ జనపదౌ నిత్యం వినాశయతి రాఘవ,
మలదాంశ్చ కరూశాంశ్చ తాటకా దుష్టచారిణీ. 28

ప్ర. అ. రాఘవ = రామా! దుష్టచారిణీ = దుష్ట మైన ప్రవృత్తి గల, తాటకా = తాటక, మలదాంశ్చ = మలదము, కరూశాంశ్చ = కరూశము అనెడు, ఇమౌ = ఈ, జనపదౌ = దేశములను, నిత్యమ్ = ఎల్లప్పుడును, వినాశయతి = నశింపచేయుచున్నది.

తా. రామా! దుర్మార్గురా లగు తాటక, నిత్యము, ఈ మలదకరూశదేశము లను నశింపచేయుచున్నది.

మూ. సేయం పన్థానమావృత్య వసత్యధ్యర్ధయోజనే,
అత ఏవ న గన్తవ్యం తాటకాయా వనం యతః. 29

ప్ర. అ. సా = అట్టి, ఇయమ్ = ఈ తాటక, పన్థానమ్ = మార్గమును, ఆవృత్య=అడ్డగించి, అధ్యర్ధయోజనే=ఒకటిన్నర ఆమడల దూరమున, వసతి= నివసించుచున్నది. యతః = ఏ కారణమువలన, తాటకాయాః = తాటకయొక్క, వనమ్ = వనమో, అత ఏవ = ఆ కారణమువలననే, న గన్తవ్యమ్ = వెళ్ల దగినది కాదు.

తా. అట్టి ఈ తాటక మార్గమును అడ్డగించి, ఒకటిన్నర ఆమడల దూరములో నివసించుచున్నది. ఇది తాటకవనము గాన ఈ వనములోనికి ఎవ్వరును పోజాలరు. 29

మూ. స్వబాహుబలమాశ్రిత్య జహీమాం దుష్టచారిణీమ్,
మన్నియోగాదిమం దేశం కురు నిష్కణ్టకం పునః. 30

ప్ర. అ. స్వబాహుబలమ్ = నీ బాహుబలమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, దుష్టచారిణీమ్ = దుర్మార్గురా లైన, ఇమామ్=ఈమెను, జహి = చంపుము. మన్నియోగాత్ = నా యాజ్ఞవలన, ఇమమ్ = ఈ, దేశమ్ = దేశమును, పునః=మరల, నిష్కణ్టకమ్ = బాధలు లేనిదానినిగా, కురు = చేయుము.

తా. నీ బాహుబలముచేత ఈ దుర్మార్గురాలిని వధింపుము. నా ఆజ్ఞను పాలించి ఈ దేశమును, మరల, ఏ బాధలు లేనిదానినిగ చేయుము. 30

మూ. న వా కశ్చిదిమం దేశం శక్నోత్యాగన్తుమీదృశమ్,
యక్షిణ్యా ఘోరయా రామ ఉత్సాదితమసహ్యయా. 31

ప్ర. అ. రామ=ఓ రామా! ఘోరయా=భయంకరురా లైన,అసహ్యయా= ఎదిరింప శక్యము కాని, యక్షిణ్యా = తాటకచేత, ఉత్సాదితమ్ = నశింపచేయ

బడిన, ఈదృశమ్ = ఇట్టి, ఇమమ్=ఈ, దేశమ్=దేశమునుగూర్చి, ఆగన్తుమ్= వచ్చుటకు, కశ్చిత్ = ఎవ్వడును, న శక్నోతి = సమర్థుడు కాడు.

తా. రామా! ఎవ్వరును ఎదిరింపలేని క్రూరురాలైన తాటకచే ఈ వన మంతయు పాడు పడినట్లు చేయబడినది. ఎవ్వడును ఈ ప్రదేశమునకు రాజాలడు. 31

మూ. ఏతత్తే సర్వమాఖ్యాతం యథైతద్దారుణం వనమ్,
యక్ష్యా చోత్సాదితం సర్వమద్యాపి న నివర్తతే. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే
బాలకాణ్డే చతుర్వింశస్సర్గః.

ప్ర. అ. ఏతత్ = ఈ, వనమ్ = వనము, సర్వమ్ = అంతయు, దారుణమ్ = భయంకరముగా, యక్ష్యా = తాటకచేత, యథా = ఏ విధముగా, ఉత్సాదితమ్ = పాడుపడి పోవునట్లు చేయబడినదో, అద్యాపి = ఇప్పటికిని, యథా = ఏ విధముగా, న నివర్తతే = మరలిపోకున్నదో, ఏతత్ సర్వమ్ = ఇది అంతయు, తే = నీకు, ఆఖ్యాతమ్ = చెప్పబడినది.

తా. తాటక ఈ వనమును ఏ విధముగ పాడుబరచి భయంకర మగునట్లు చేసినదో, ఈ వనము నింకను ఎట్లు విడువకున్నదో అంతయు నీకు చెప్పినాను. 32

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలోని
ఇరువది నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చవింశః సర్గః.

మూ. అథ తస్యాప్రమేయస్య మునేర్వచనముత్తమమ్,
శ్రుత్వా పురుషశార్దూలః ప్రత్యువాచ శుభాం గిరమ్.

ప్ర. అ. అప్రమేయస్య = ఊహింప శక్యము కాని ప్రభావము గల, తస్య మునేః = ఆ మునియొక్క, ఉత్తమమ్ = ఉత్తమ మైన, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, పురుషశార్దూలః = పురుషశ్రేష్ఠుడైన రాముడు, శుభామ్ = శుభ మైన, గిరమ్ = వాక్కును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. అమేయప్రభావు డగు విశ్వామిత్రుని ఉత్తమము లగు మాటలు విని పురుషశ్రేష్ఠు డైన రాముడు శుభ మైన వాక్కు పలికెను. 1

మూ. అల్పవీర్యా యదా యక్షాః శ్రూయన్తే మునిపుఙ్గవ,
కథం నాగసహస్రస్య ధారయత్యబలా బలమ్. 2

ప్ర. అ. మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠుడా, యక్షాః=యక్షులు, అల్పవీర్యాః= అల్ప మైన పరాక్రమము కలవారుగా, యదా శ్రూయన్తే = వినబడుచుండగా, అబలా = ఆ స్త్రీ, నాగసహస్రస్య = వేయి ఏనుగులయొక్క, బలమ్ = బలమును, కథమ్ = ఎట్లు, ధారయతి = ధరించుచున్నది ?

తా. ఓ మునిపుంగవా! యక్షులు అల్పపరాక్రమవంతు లని వినుచుందుము కదా— ఈ అబలకు నాగసహస్రబలము ఎట్లు వచ్చినది ? 2

మూ. విశ్వామిత్రోఽబ్రవీద్వాక్యం శృణు యేన బలోత్తరా,
వరదానకృతం వీర్యం ధారయత్యబలా బలమ్. 3

ప్ర. అ. విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను, అబలా=ఆ అబల, యేన=ఏ కారణముచేత, బలోత్తరా= బలముచేత గొప్పదో, శృణు = వినుము, (ఆమె) వరదానకృతమ్ = వరదానము

వలన లభించిన, వీర్యమ్ = పరాక్రమమును, బలమ్ = బలమును, ధారయతి = ధరించుచున్నది.

తా. విశ్వామిత్రుడు ఇట్లు పలికెను— ఆ అబల ఏ కారణముచేత బలమునందు చాల గొప్పదో వినుము. ఆమె వరదానమువలన లభించిన వీర్యమును, బలమును ధరించుచున్నది. 3

మూ. పూర్వమాసీన్మహాయక్షః సుకేతుర్నామ వీర్యవాన్,
అనపత్యః శుభాచారః స చ తేపే మహత్తపః. 4

ప్ర. అ. పూర్వమ్=పూర్వము, సుకేతుర్నామ=సుకేతు వను పేరు గల, వీర్యవాన్ = పరాక్రమవంతు డైన, మహాయక్షః = గొప్ప యక్షుడు, ఆసీత్ = ఉండెను, అనపత్యః = సంతానము లేని, సః = అతడు, శుభాచారః = శుభ మైన ఆచారముకలవాడై, మహత్ = గొప్ప, తపః = తపస్సు, తేపే = చేసెను.

తా. పూర్వము సుకేతు వనే పరాక్రమవంతు డగు గొప్ప యక్షు డొక డుండెను. సంతానము లేకపోవుటచే, ఆతడు సదాచారవంతుడై గొప్ప తపస్సు చేసెను. 4

మూ. పితామహస్తు సుప్రీత స్తస్య యక్షపతే స్తదా,
కన్యారత్నం దదౌ రామ తాటకాం నామ నామతః. 5

ప్ర. అ. రామ = రామా, తదా = అపుడు, పితామహః = బ్రహ్మదేవుడు, సుప్రీతః = చాల సంతోషించినవాడై, తస్య = ఆ, యక్షపతేః = యక్షరాజునకు, నామతః = పేరుచే, తాటకాం నామ = తాటక అను ప్రసిద్ధి గల, కన్యారత్నమ్= శ్రేష్ఠ యైన కన్యను, దదౌ = ఇచ్చెను.

తా. రామా ! అపుడు బ్రహ్మదేవుడు ఆతని తపస్సునకు చాల సంతోషించి, ఆ యక్షాధిపతికి తాటక యను కన్యారత్నమును ప్రసాదించెను. 5

మూ. దదౌ నాగసహస్రస్య బలం చాస్యాః పితామహః,
న త్వేవ పుత్రం యక్షాయ దదౌ బ్రహ్మ మహాయశాః. 6

ప్ర. అ. పితామహః=బ్రహ్మదేవుడు, అస్యాః=ఈమెకు, నాగసహస్రస్య=వేయి ఏనుగులయొక్క, బలమ్ = బలమును, దదౌ = ఇచ్చెను, మహాయశాః = గొప్ప కీర్తి గల, బ్రహ్మ=ఆ బ్రహ్మదేవుడు, యక్షాయ=యక్షునకు, పుత్రం తు= పుత్రుని, న దదౌ = ఇవ్వలేదు.

తా. గొప్ప కీర్తి గల బ్రహ్మదేవుడు ఆ తాటకకు వేయి ఏనుగుల బలము ఇచ్చినాడు కాని, ఆ సుకేతునకు పుత్రుని మాత్రము ఇవ్వలేదు. 6

మూ. తాం తు జాతాం వివర్ధన్తీం రూపయౌవనశాలినీమ్,
ఝర్ఝపుత్రాయ సున్దాయ దదౌ భార్యాం యశస్వినీమ్. 7

ప్ర. అ. జాతామ్ = పుట్టినదై, వివర్ధన్తీమ్ = పెరుగుచున్న, రూపయౌవనశాలినీమ్ = రూపయౌవనములతో ప్రకాశించుచున్న, యశస్వినీమ్ = కీర్తిగల, తామ్ = ఆమెను, ఝర్ఝపుత్రాయ = ఝర్ఝునికుమారుడైన, సున్దాయ=సుందునకు, భార్యామ్ = భార్యనుగా, దదౌ = ఇచ్చెను.

తా. సహస్రనాగబలముతో జనించిన ఆ తాటక పెరిగి, రూపయౌవనములతో ప్రకాశించుచుండెను. సుకేతువు, కీర్తిమంతురాలగు ఆమెను ఝర్ఝుని పుత్రుడైన సుందున కిచ్చి వివాహము చేసెను. 7

మూ. కస్యచిత్త్వథ కాలస్య యక్షీ పుత్రమజాయత,
మారీచం నామ దుర్ధర్షం యశ్శాపాద్రాక్షసోఽభవత్. 8

ప్ర. అ. అథ = పిమ్మట, కస్యచిత్ కాలస్య=కొంత కాలమునకు, యక్షీ= తాటక, మారీచం నామ = మారీచు డను పేరు గల, దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యము కాని, పుత్రమ్ = కుమారుని, అజాయత = కనెను, యః = ఎవడు, శాపాత్ = శాపమువలన, రాక్షసః = రాక్షసుడుగా, అభవత్ = ఆయెనో.

తా. కొంతకాలమునకు ఆ తాటక మారీచు డనే మహాబలవంతు డగు కుమారుని కనెను. అతడు శాపవశముచేత రాక్షసు డయ్యెను. 8

మూ. సున్దే తు నిహతే రామ సాగస్త్యమృషిసత్తమమ్,
తాటకా సహ పుత్రేణ ప్రధర్షయితుమిచ్ఛతి. 9

ప్ర. అ. రామ = రామా ! సున్దే = సుందుడు, నిహతే = చంపబడినవా డగుచుండగా, సా తాటకా = ఆ తాటక, పుత్రేణ సహ = పుత్రునితో కూడి, ఋషిసత్తమమ్ = ఋషిశ్రేష్ఠు డైన, అగస్త్యమ్ = అగస్త్యుని, ప్రధర్షయితుమ్ = ఎదిరించుటకు, ఇచ్ఛతి = కోరెను.

తా. అగస్త్యుడు సుందుని శపించి చంపగా, తాటకయు మారీచుడును, ఆ ఋషిశ్రేష్ఠుని ఎదిరించుటకై ప్రయత్నించిరి. 9

మూ. భక్షార్థం జాతసంరంభా గర్జన్తీ సాభ్యధావత,
ఆపతన్తీం తు తాం దృష్ట్వా అగస్త్యో భగవాన్ ఋషిః, 10
రాక్షసత్వం భజస్వేతి మారీచం వ్యాజహార సః.

ప్ర. అ. సా = ఆమె, గర్జన్తీ = గర్జించుచున్నదై, జాతసంరంభా = పుట్టిన తొందరకలదై, భక్షార్థమ్ = భక్షించుటకై, అభ్యధావత = అగస్త్యునిమీదికి వెళ్లెను, భగవాన్ = పూజ్యుడైన, సః అగస్త్యః ఋషిః = ఆ అగస్త్య మహర్షి, ఆపతన్తీమ్ = మీదికి వచ్చుచున్న, తామ్ = ఆమెను. దృష్ట్వా = చూచి, రాక్షసత్వమ్ = రాక్షసత్వమును, భజస్వ = పొందుము, ఇతి = అని, మారీచమ్ = మారీచుని, వ్యాజహార = పలికెను.

తా. ఆమె గర్జించుచు, భక్షించుటకై తొందరగ అగస్త్యుని మీదికి వెళ్లెను. భగవంతుడైన అగస్త్యమహర్షి మీదికి వచ్చుచున్న ఆమెను చూచి, "రాక్షసుడ వగుదువు గాక" అని మారీచుని శపించెను. 10

మూ. అగస్త్యః పరమక్రుద్ధ స్తాటకామపి శప్తవాన్. 11
పురాషాదీ మహాయక్షీ విరూపా వికృతాననా,
ఇదం రూపం విహాయాథ దారుణం రూపమస్తు తే. 12

ప్ర. అ. పరమక్రుద్ధః = మిక్కిలి కోపించిన, అగస్త్యః = అగస్త్యుడు, తాటకామపి = తాటకను కూడ, శప్తవాన్ = శపించెను, ఇదమ్ = ఈ, రూపమ్ = రూపమును, విహాయ = విడచి, అథ = పిమ్మట, విరూపా = వికృతరూపముకల దానవై, వికృతాననా = వికృత మైన ముఖము కలదానవై, పురుషాదీ = మనుష్య

లను భక్షించు, మహాయక్షీ = మహాయక్షిణివిగ అగుదువు గాక, తే = నీకు, దారుణమ్ = భయంకరమైన, రూపమ్ = రూపము, అస్తు = అగుగాక.

తా. అగస్త్యుడు చాల కోపించి—నీవు ఈ రూపమును విడచి, వికృతమైన రూపము, భయంకర మైన ముఖము కలదానవై, మనుష్యులను భక్షించు మహాయక్షిణివి అగుదువు గాక. నీకు అతిభయంకర మగు ఆకారము కలుగు గాక" అని తాటకను కూడ శపించెను. 12

మూ. సైషా శాపకృతామర్షా తాటకా క్రోధమూర్ఛితా,
దేశముత్సాదయత్యేనమగస్త్యచరితం శుభమ్. 13

ప్ర. అ. శాపకృతామర్షా = శాపముచేత చేయబడిన కోపము గల, సా= అట్టి, ఏషా = ఈ, తాటకా = తాటక, క్రోధమూర్ఛితా = క్రోధముచేత వ్యాపింపబడినదై, అగస్త్యచరితమ్ = అగస్త్యునిచేత సంచరింపబడిన, శుభమ్=శుభ మైన, ఏనం దేశమ్ = ఈ దేశమును, ఉత్సాదయతి = నశింపచేయుచున్నది.

తా. ఈ శాపముచే తాటకకు కోపము కలిగినది. అత్యధిక మైన కోపముతో ఈమె పూర్వము అగస్త్యుడు సంచరించిన ఈ దేశమును నశింపచేయుచున్నది. 13

మూ. ఏనాం రాఘవ దుర్వృత్తాం యక్షీం పరమదారుణామ్,
గోబ్రాహ్మణహితార్థాయ జహి దుష్టపరాక్రమామ్. 14

ప్ర. అ. రామ = రామా! దుర్వృత్తామ్ = దుర్మార్గురాలైన, పరమదారుణామ్ = మిక్కిలి కూ్రిరురాలైన, దుష్టపరాక్రమామ్ = చెడ్డ పరాక్రమము గల, ఏనామ్ = ఈ, యక్షీమ్ = యక్షిణిని, గోబ్రాహ్మణహితార్థాయ=గోవులయొక్క బ్రాహ్మణులయొక్క హితముకొరకు, జహి=చంపుము.

తా. రామా! దుర్మార్గురాలు, క్రూరురాలు, దుష్టపరాక్రమవంతురాలు అగు ఈ యక్షిణిని గోబ్రాహ్మణుల హితముకొరకై సంహరించుము. 14

మూ. న హ్యేనాం శాపసంస్పృష్టాం కశ్చిదుత్సహతే పుమాన్,
నిహన్తుం త్రిషు లోకేషు త్వామృతే రఘునన్దన. 15

ప్ర. అ. రఘునన్దన = రామా ! శాపసంస్పృష్టామ్=శాపముచే స్పృశింప బడిన, ఏనామ్ = ఈమెను, నిహన్తుమ్ = చంపుటకు, త్వామ్ ఋతే = నీవు తప్ప, కశ్చిత్ పుమాన్ = ఏ పురుషుడును, త్రిషు లోకేషు = మూడు లోకములందు, న ఉత్సహతే హి = సమర్థుడు కాడు కదా.

తా. రామా ! నీవు తప్ప, మూడు లోకములలో మరెవ్వడును శపింప బడిన ఈమెను చంపుటకు సమర్థుడు కాడు. 15

మూ. న హి తే స్త్రీవధకృతే ఘృణా కార్యా నరోత్తమ,
చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా. 16

ప్ర. అ. నరోత్తమ = నరశ్రేష్ఠుడా ! స్త్రీవధకృతే = స్త్రీవధను గూర్చి, తే=నీకు, ఘృణా=జాలి, న కార్యా = చేయతగినది కాదు. రాజసూనునా = రాజకుమారునిచేత, చాతుర్వర్ణ్యహితార్థాయ=నాలుగు వర్ణముల హితము కొరకై, కర్తవ్యమ్=కార్యము చేయదగినది.

తా. ఓ నరశ్రేష్ఠుడా ! స్త్రీని వధించుటయా అని సంకోచింపకుము. రాజకుమారుడు చాతుర్వర్ణ్యము వారి హితముకొరకై ఏ పని యైనను చేయ వలయును. 16

మూ. నృశంసమనృశంసం వా ప్రజారక్షణకారణాత్,
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సతా. 17

ప్ర. అ. రక్షతా=రక్షించు, సతా=సత్పురుషుడైన రాజుచేత, ప్రజా రక్షణకారణాత్ = ప్రజారక్షణము కొరకై, నృశంసం వా = క్రూరమైనను, అనృశంసం వా = క్రూరము కాకపోయినను, పాతకం వా = పాపమైనను, సదోషం వా = దోషములతో కూడినదైనను, కార్యము, కర్తవ్యమ్ = చేయ దగినదే.

తా. ధర్మాత్ముడైన రాజు, ప్రజారక్షణముకొరకై ఉపయోగించు, కార్యము, క్రూర మైనను కాకపోయినను, పాపమైనను దోషములతో కూడిన దైనను చేయదగినదే. 17

మూ. రాజ్యభారనియుక్తానామేష ధర్మస్సనాతనః,
అధర్మ్యాం జహి కాకుత్స్థ ధర్మో హ్యస్యా న విద్యతే. 18

ప్ర. అ. రాజ్యభారనియుక్తానామ్=రాజ్యభారమునందు నియుక్తు లైనవారికి, ఏషః=ఇది, సనాతనః=అతిప్రాచీన మైన, ధర్మః=ధర్మము. కాకుత్స్థ=రామా! అధర్మ్యామ్ = అధర్మము గల తాటకను, జహి = చంపుము, అస్యాః=ఈమెకు, ధర్మః = ధర్మము, న విద్యతే హి=లేదు కదా.

తా. ఇది రాజ్యపాలనభారమును వహించువారు పాటించవలసిన అతిప్రాచీన మైన ధర్మము. రామా! ధర్మవిరుద్ధాచరణము గల ఈమెను సంహరించుము. ఈమెయందు ధర్మ మనునదియే లేదు కదా.

మూ. శ్రూయతే హి పురా శక్రో విరోచనసుతాం నృప,
పృథివీం హన్తుమిచ్ఛన్తీం మంథరామభ్యసూదయత్. 19

ప్ర. అ. నృప = రాజా! పురా = పూర్వము, పృథివీమ్ = భూమిని, హన్తుమ్ = చంపుటకు, ఇచ్ఛన్తీమ్ = కోరుచున్న, విరోచనసుతామ్ = విరోచనుని కుమార్తె యైన, మంథరామ్=మంథరను, శక్రః=దేవేంద్రుడు, అభ్యసూదయత్= సంహరించెను, అని, శ్రూయతే హి=వినబడుచున్నదికదా?

తా. పూర్వము విరోచనుని కుమార్తె యగు మంథర భూమిని చంపగోరినప్పుడు దేవేంద్రుడు ఆమెను చంపె నని వినుచున్నాము కదా? 19

మూ. విష్ణునాపి పురా రామ భృగుపత్నీ దృఢవ్రతా,
అనిన్ద్రం లోకమిచ్ఛన్తీ కావ్యమాతా నిషూదితా. 20

ప్ర. అ. రామ = రామా! పురా = పూర్వము, లోకమ్ = లోకమును, అనిన్ద్రమ్ = ఇంద్రుడు లేనిదానినిగా, ఇచ్ఛన్తీ=కోరుచున్న, దృఢవ్రతా=దృఢ మైన నియమమును అవలంబించిన, కావ్యమాతా=శుక్రుని తల్లి యైన, భృగుపత్నీ అపి=భృగుమహర్షియొక్క భార్య కూడ, విష్ణునా=విష్ణువుచేత, నిషూదితా=సంహరింపబడినది.

తా. పూర్వము విష్ణువు కూడ, లోకములో ఇంద్రుడు ఉండకూడ దను కోరికతో తీవ్రవ్రతము నాచరించుచున్న, శుక్రాచార్యజనని యైన భృగుమహర్షి భార్యను చంపెను. 20

మూ. ఏతైశ్చాన్యైశ్చ బహుభీ రాజపుత్ర మహాత్మభిః,
అధర్మసహితా నార్యో హతాః పురుషసత్తమైః. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పంచవింశః సర్గః.

ప్ర. అ. రాజపుత్ర=ఓ రాజకుమారా! మహాత్మభిః = మహాత్ము లైన, ఏతైశ్చ=వీరిచేతను, అన్యైః = ఇతరులైన, పురుషసత్తమైశ్చ = పురుషశ్రేష్ఠుల చేతను, బహుభిః=అనేకులచేత, అధర్మసహితాః=అధర్మవతు లగు, నార్యః= స్త్రీలు, హతాః=చంపబడినారు.

తా. ఓ రాజపుత్రా! మహాత్ములైన వీరును, ఇంకను ఎందరో పురుష శ్రేష్ఠులును ధర్మవిరుద్ధముగ ప్రవర్తించు స్త్రీలను చంపినారు. 21

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
ఇరువది ఐదవ సర్గ సమాప్తము.

అథ షడ్వింశః సర్గః

మూ. మునేర్వచనమక్లీబం శ్రుత్వా నరవరాత్మజః,
రాఘవః ప్రాఞ్జలిర్భూత్వా ప్రత్యువాచ దృఢవ్రతః. 1

ప్ర. అ. దృఢవ్రతః = దృఢమైన నియమములు గల, నరవరాత్మజః = రాజశ్రేష్ఠుని కుమారు డైన, రాఘవః = రాముడు, అక్లీబమ్ = దృఢనిశ్చయ పూర్వక మైన, మునేః = మునియొక్క, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. నిశ్చయపూర్వకముగ పలికిన విశ్వామిత్రుని మాటలు విని, దృఢ మైన నియమము కలవాడును, రాజశ్రేష్ఠుని కుమారుడును అగు రాముడు, అంజలి ఘటించి పలికెను. 1

మూ. పితుర్వచననిర్దేశాత్పితుర్వచనగౌరవాత్,
వచనం కౌశికస్యేతి కర్తవ్యమవిశఙ్కయా. 2

ప్ర. అ. పితుః = తండ్రిగారియొక్క, వచననిర్దేశాత్ = ఆజ్ఞావచనము వలనను, పితుః = తండ్రిగారియొక్క, వచనగౌరవాత్ = మాటయందు గౌరవము వలనను, కౌశికస్య = విశ్వామిత్రునియొక్క, వచనమ్ ఇతి = వాక్య మనెడు కారణమువలనను, అవిశఙ్కయా = సందేహము లేకుండగ, కర్తవ్యమ్ = చేయ దగినదే.

తా. మా తండ్రిగారి ఆజ్ఞవలనను, ఆయన వాక్యమునందు నా కున్న గౌరవమువలనను, నీ వాక్య మగుటవలనను ఈ కార్యము నిస్సందేహముగ చేయదగినది.

మూ. అనుశిష్టోఽస్మ్యయోధ్యాయాం గురుమధ్యే మహాత్మనా,
పిత్రా దశరథేనాహం నావజ్ఞేయం హి తద్వచః. 3

ప్ర. అ. అయోధ్యాయామ్ = అయోధ్యలో, గురుమధ్యే = పెద్దల మధ్య యందు, మహాత్మనా = మహాత్ముడైన, పిత్రా = తండ్రి యైన, దశరథేన = దశరథునిచేత, అహమ్ = నేను, అనుశిష్టః అస్మి = ఆజ్ఞాపింపబడితిని, తద్వచః = ఆయనవాక్యము, నావజ్ఞేయం హి = ఉల్లంఘింపదగినది కాదు కదా?

తా. అయోధ్యానగరములో, వసిష్ఠాదిగురుజనుల మధ్య, మహాత్ముడైన మా తండ్రి దశరథమహారాజు "విశ్వామిత్రుడు చెప్పినట్లు చేయుము" అని ఆజ్ఞాపించినాడు. ఆయన మాటను ఉల్లఘింపరాదు కదా? 3

మూ. సోఽహం పితుర్వచః శ్రుత్వా శాసనాద్బ్రహ్మవాదినః,
కరిష్యామి న సన్దేహ స్తాటకావధముత్తమమ్. 4

ప్ర. అ. సః అహమ్ = అట్టి నేను, పితుః = తండ్రియొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, బ్రహ్మవాదినః = వేదాధ్యయనసంపన్నుడ వైన నీయొక్క, శాసనాత్ = ఆజ్ఞవలన, ఉత్తమమ్ = ఉత్తమ మైన, తాటకావధమ్ = తాటకయొక్క వధను, కరిష్యామి = చేయగలను; సన్దేహః = సందేహము, న = లేదు.

తా. నేను తండ్రిగారి ఆజ్ఞప్రకారము, బ్రహ్మవాది వైన నీ మాట పాటించి తప్పక తాటకను సంహరించెదను. 4

గోబ్రాహ్మణహితార్థాయ దేశస్యాస్య సుఖాయ చ,
తవ చైవాప్రమేయస్య వచనం కర్తుముద్యతః. 5

ప్ర. అ. గోబ్రాహ్మణహితార్థాయ = గోబ్రాహ్మణుల హితముకొరకును, అస్య = ఈ, దేశస్య = దేశముయొక్క, సుఖాయ చ=సుఖముకొరకును, అప్రమేయస్య=అమేయమైన శక్తి గల, తవ=నీయొక్క, వచనమ్ = వాక్యమును, కర్తుమ్ = చేయుటకు, ఉద్యతః = సిద్ధముగ నున్నాను.

తా. గోబ్రాహ్మణుల సుఖము కొరకును, ఈ దేశముయొక్క సుఖము కొరకును, అప్రమేయప్రభావుడ వగు నీ ఆజ్ఞప్రకారము చేయుటకు సిద్ధముగా నున్నాను. 5

మూ. ఏవముక్త్వా ధనుర్మధ్యే బద్ధ్వా ముష్టిమరిన్దమః,
జ్యాశబ్దమకరోత్తీవ్రం దిశశ్శబ్దేన నాదయన్. 6

ప్ర. అ. అరిందమః = శత్రువులను నశింపచేయు రాముడు, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, ధనుర్మధ్యే = ధనుస్సుయొక్క మధ్యమునందు, ముష్టిమ్ = పిడికిలిని, బద్ధ్వా = బంధించి, శబ్దేన = శబ్దముచేత, దిశః = దిక్కులను, నాదయన్ = ధ్వనింపచేయుచు, తీవ్రమ్ = తీవ్రమైన, జ్యాశబ్దమ్ = నారియొక్క శబ్దమును, అకరోత్ = చేసెను.

తా. శత్రుసంహారకు డగు రాముడు ఈ విధముగ పలికి, పిడికిలితో ధనుర్మధ్యమునందు గట్టిగా పట్టి, దిక్కులు ప్రతిధ్వనించునట్లు తీవ్రమైన టంకార ధ్వనిని చేసెను. 6

మూ. తేన శబ్దేన విత్రస్తాస్తాటకావనవాసినః,
తాటకా చ సుసంక్రుద్ధా తేన శబ్దేన మోహితా. 7

ప్ర. అ. తాటకావనవాసినః = తాటకయొక్క అరణ్యములో నివసించు సర్వప్రాణులును, తేన శబ్దేన = ఆ ధ్వనిచేత, విత్రస్తాః = భయపడినవి, తాటకా చ = తాటక కూడ, తేన శబ్దేన = ఆ శబ్దముచేత, సుసంక్రుద్ధా = చాల కోపించినదై, మోహితా = మోహింపచేయబడినది.

తా. తాటకావనములో అన్ని ప్రాణులును ఆ ధ్వనికి భయపడినవి. తాటక కూడ ఆ శబ్దముచేత మిక్కిలి కోపించి దిగ్భ్రాంతి చెందెను. 7

మూ. తం శబ్దమభినిధ్యాయ రాక్షసీ క్రోధమూర్ఛితా,
శ్రుత్వా చాభ్యద్రవద్వేగాద్యతః శబ్దో వినిస్సృతః. 8

ప్ర. అ. రాక్షసీ = ఆ రాక్షసి, తం శబ్దమ్ = ఆ శబ్దమును, శ్రుత్వా = విని, క్రోధమూర్ఛితా = క్రోధావిష్టురాలై, అభినిధ్యాయ = ఆలోచించి, యతః = ఏ వైపు నుండి, శబ్దః = శబ్దము, వినిస్సృతః = బయలుదేరినదో, ఆ వైపునకు, వేగాత్ = వేగమువలన, అభ్యద్రవత్ = పరుగెత్తెను.

తా. ఆ శబ్దము వినగనే కోపావిష్టురాలైన తాటక, క్షణకాల మాలోచించి ఆ శబ్దమువచ్చిన వైపు శీఘ్రముగ పరుగెత్తెను. 8

మూ. తాం దృష్ట్వా రాఘవః క్రుద్ధాం వికృతాం వికృతాననామ్,
ప్రమాణేనాతివృద్ధాం చ లక్ష్మణం సోఽభ్యభాషత. 9

ప్ర. అ. సః రాఘవః = ఆ రాముడు, క్రుద్ధామ్ = కోపగించినదియు, వికృతామ్ = వికారముగా ఉన్నదియు, వికృతాననామ్ = వికృత మైన ముఖము కలదియు, ప్రమాణేన = ప్రమాణముచేత, అతివృద్ధాం చ = చాల పెద్దదియు అగు, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, లక్ష్మణం = లక్ష్మణునిగూర్చి, అభ్యభాషత = పలికెను.

తా. వికారముగా ఉన్నముఖముతో, పెద్ద దేహముతో నున్న కోపించిన ఆమెను చూచి రాముడు లక్ష్మణునితో ఇట్లనెను. 9

మూ. పశ్య లక్ష్మణ యక్షిణ్యా భైరవం దారుణం వపుః,
భిద్యేరన్ దర్శనాదస్యా భీరూణాం హృదయాని చ. 10

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! యక్షిణ్యాః = ఈ యక్షిణియొక్క, భైరవమ్ = భయంకర మైన, దారుణమ్ = క్రూర మైన, వపుః = శరీరమును, పశ్య = చూడుము, అస్యాః = ఈమెయొక్క, దర్శనాత్ = దర్శనమువలన, భీరూణామ్ = పిరికివారియొక్క, హృదయాని = హృదయములు, భిద్యేరన్ = పగిలిపోవును.

తా. లక్ష్మణా! ఈ యక్షిణి ఆకారము ఎంత భయంకరముగను క్రూరముగను ఉన్నదో చూడుము. ఈమెను చూడగనే పిరికివాళ్ల గుండెలు పగిలిపోవును. 10

మూ. ఏనాం పశ్య దురాధర్షాం మాయాబలసమన్వితామ్,
వినివృత్తాం కరోమ్యద్య హృతకర్ణాగ్రనాసికామ్. 11

ప్ర. అ. దురాధర్షామ్ = ఎదిరింప శక్యము కానిదియు, మాయాబలసమన్వితామ్ = మాయాబలముతో కూడినదియు అగు, ఏనామ్ = ఈమెను, హృతకర్ణాగ్రనాసికామ్ = హరింపబడిన చెవులు నాసికాగ్రము కలిగి, వినివృత్తామ్ = మరలిపోవుదానినిగా, అద్య = ఇప్పుడు, కరోమి = చేయుదును, పశ్య = చూడుము.

తా. మాయాబలముచే ఎదిరింప శక్యము కాక ఉన్న ఈమెను,

చెవులును నాసాగ్రమును ఖండించి వెనుకకు మరలిపోవు నట్లు చేసెదను చూడుము. 11

మూ. న హ్యేనాముత్సహే హన్తుం స్త్రీస్వభావేన రక్షితామ్,
వీర్యం చాస్యాం గతిం చాపి హనిష్యామీతి మే మతిః. 12

స్త్రీస్వభావేన = స్త్రీఅగుటచే, రక్షితామ్=రక్షింపబడిన, ఏనామ్=ఈమెను, హన్తుమ్=చంపుటకు, న ఉత్సహే=యత్నించను. అస్యామ్=ఈమెయందలి, వీర్యమ్=పరాక్రమమును, గతిం చాపి=గమనశక్తిని, హనిష్యామీతి = తొలగించెదను అని, మే=నాయొక్క, మతిః=అభిప్రాయము.

తా. ఆడు దగుటయే ఈమెను రక్షించుచున్నది. ఈమెను చంపుటకు యత్నింపక ఈమె పరాక్రమమును, గమనశక్తిని నశింపచేయ వలెనని అనుకొనుచున్నాను.

మూ. ఏవం బ్రువాణే రామే తు తాటకా క్రోధమూర్ఛితా,
ఉద్యమ్య బాహూ గర్జన్తీ రామమేవాభ్యధావత. 13

ప్ర. అ. రామే=రాముడు, ఏవమ్=ఈ విధముగా, బ్రువాణే=పలుకుచుండగనే, తాటకా = తాటక, క్రోధమూర్ఛితా = కోపముచే వ్యాపింపబడినదై, బాహూ=బాహువులను, ఉద్యమ్య=ఎత్తి, రామమేవ=రాముని గూర్చియే, అభ్యధావత=పరుగెత్తెను.

తా. రాముడు ఇట్లు పలుకుచుండగనే తాటక క్రోధావిష్టురాలై, చేతులు ఎత్తి, గర్జించుచు, రామునిమీదికే పరుగెత్తెను. 13

మూ. విశ్వామిత్రస్తు బ్రహ్మర్షిర్హుంకారేణాభిభర్త్స్య తామ్,
స్వస్తి రాఘవయోరస్తు జయం చైవాభ్యభాషత. 14

ప్ర. అ. బ్రహ్మర్షిః = బ్రహ్మర్షియైన, విశ్వామిత్రస్తు = విశ్వామిత్రుడైతే, తామ్ = ఆమెను, హుంకారేణ = హుంకారముచేత, అభిభర్త్స్య = భయపెట్టి, రాఘవయోః = రామలక్ష్మణులకు, స్వస్తి = క్షేమము, అస్తు=అగుగాక అనియు, జయం చైవ = విజయమును, అభ్యభాషత = పలికెను.

తా. బ్రహ్మర్షి యైన విశ్వామిత్రుడు హుంకారముచేత ఆమెను అదలించి, "రామలక్ష్మణులకు స్వస్తి అగుగాక" అని పలికి "జయము కలుగు గాక" అని కూడ పలికెను. 14

మూ. ఉద్ధూన్వానా రజో ఘోరం తాటకా రాఘవావుభౌ,
రజోమోహేన మహతా ముహూర్తం సా వ్యమోహయత్. 15

ప్ర. అ. సా తాటకా = ఆ తాటక, ఘోరమ్ = భయంకర మైన, రజః = పరాగమును, ఉద్ధూనానా = చిమ్ముచు, రాఘవౌ = రామలక్ష్మణులను, ఉభౌ = ఇద్దరిని, ముహూర్తమ్ = క్షణకాలము పాటు, మహతా = గొప్ప, రజోమోహేన = పరాగముచే కలిగిన మోహముచే, వ్యమోహయత్ = మోహింపచేసెను.

తా. ఆ తాటక భయంకర మైన పరాగమును చిమ్ముచు, ఆ రామలక్ష్మణులను, క్షణకాలము పాటు, ఆ పరాగములో ఏమియు తోచకుండ చేసెను. 15

మూ. తతో మాయాం సమాస్థాయ శిలావర్షేణ రాఘవౌ,
అవాకిరత్సుమహతా తతశ్చుక్రోధ రాఘవః. 16

ప్ర. అ. తతః = పిమ్మట, మాయామ్ = మాయను, సమాస్థాయ = అవలంబించి, సుమహతా = చాల గొప్పదైన, శిలావర్షేణ = రాళ్ల వర్షముచేత, రాఘవౌ = రామలక్ష్మణులను, అవాకిరత్ = వెదజల్లెను, తతః = అటు పిమ్మట, రాఘవః = రాముడు, చుక్రోధ = కోపించెను.

తా. పిమ్మట మాయాప్రభావముచే రామలక్ష్మణులపై గొప్ప శిలావర్షమును కురిపించెను. దానితో రామునకు కోపము వచ్చెను. 16

మూ. శిలావర్షం మహత్తస్యాః శరవర్షేణ రాఘవః,
ప్రతిహత్యోపధావన్త్యాః కరౌ చిచ్ఛేద పత్రిభిః. 17

ప్ర. అ. రాఘవః=రాముడు, తస్యాః=ఆమెయొక్క, మహత్ = గొప్పదైన, శిలావర్షమ్=శిలావర్షమును, శరవర్షేణ=బాణవర్షముచేత, ప్రతిహత్య=కొట్టి

వేసి, ఉపధావన్త్యాః = పరుగెత్తి మీదికి వచ్చుచున్న ఆమెయొక్క, కరౌ = హస్తములను, పత్రిభిః = బాణములచేత, చిచ్ఛేద = ఛేదించెను.

తా. రాముడు, ఆమె కురిపించిన శిలావర్షమును బాణవర్షముచేత వారించెను. ఆమె మీదికి వచ్చుచుండగా ఆమె హస్తములను బాణములచే ఛేదించెను. 17

మూ. తతశ్ఛిన్నభుజాం శ్రాన్తామభ్యాశే పరిగర్జతీమ్,
సౌమిత్రిరకరోత్క్రోధాద్ధృతకర్ణాగ్రనాసికామ్. 18

ప్ర. అ. తతః = పిమ్మట, ఛిన్నభుజామ్ = ఛేదింపబడిన భుజములు కలదియు, శ్రాన్తామ్ = అలసిపోయినదియు, అభ్యాశే = సమీపమునందు, పరిగర్జతీమ్ = గర్జించుచున్న ఆమెను, సౌమిత్రిః = లక్ష్మణుడు, క్రోధాత్ = క్రోధమువలన, హృతకర్ణాగ్రనాసికామ్ = ఛేదింపబడిన కర్ణములు, నాసికాగ్రము కలదానినిగా, అకరోత్ = చేసెను.

తా. చేతులు తెగి, అలసిపోయి, సమీపమునందు గర్జించుచున్న ఆ తాటక చెవులను, ముక్కును, లక్ష్మణుడు క్రోధముతో ఛేదించివేసెను. 18

మూ. కామరూపధరా సద్యః కృత్వా రూపాణ్యనేకశః,
అన్తర్ధానం గతా యక్షీ మోహయన్తీవ మాయయా, 19
అశ్మవర్షం విముఞ్చన్తీ భైరవం విచచార హ.

ప్ర. అ. కామరూపధరా = ఇచ్ఛానుసారముగ రూపములను ధరించు ఆ తాటక, సద్యః = వెంటనే, అనేకశః = అనేక విధములుగ, రూపాణి = రూపములను, కృత్వా = చేసి, అశ్మవర్షమ్ = శిలావర్షమును, విముఞ్చన్తీ = విడచుచు, భైరవమ్ = భయంకరముగా, విచచార హ = సంచరించెను.

తా. ఇష్టము ప్రకారము రూపములను ధరింపగల ఆ తాటక అనేక విధములైన రూపములను ధరించుచు, రాళ్లవాన కురిపించుచు, అతిభయంకరముగ సంచరించెను. 19

మూ. తతస్తావశ్మవర్షేణ కీర్యమాణౌ సమన్తతః,
దృష్ట్వా గాధిసుతః శ్రీమానిదం వచనమబ్రవీత్. 20

ప్ర. అ. తతః = పిమ్మట, సమన్తతః = అంతటను, అశ్మవర్షేణ = రాళ్ల వానచేత, కీర్యమాణౌ = కప్పబడుచున్న, తౌ = ఆ రామలక్ష్మణులను, దృష్ట్వా= చూచి, శ్రీమాన్ = కాంతి గల, గాధిసుతః=విశ్వామిత్రుడు, ఇదం వచనమ్ = ఈ వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. నలువైపులనుండి రాళ్లవానచే కొట్టబడుచున్న ఆ రామలక్ష్మణులను చూచి విశ్వామిత్రుడు ఇట్లు పలికెను. 20

మూ. అలం తే ఘృణయా రామ పాపైషా దుష్టచారిణీ, 21
యజ్ఞవిఘ్నకరీ యక్షీ పురావర్ధతి మాయయా.

ప్ర. అ. రామ = రామా ! తే = నీకు, ఘృణయా = జాలిచేత, అలమ్= చాలును, పాపా = పాపాత్మురాలును, దుష్టచారిణీ = దుర్మార్గురాలును, యజ్ఞ విఘ్నకరీ = యజ్ఞములకు విఘ్నము చేయునదియు అగు, ఏషా యక్షీ = ఈ యక్షిణి, మాయయా = మాయచేత, పురావర్ధతి = వృద్ధి పొందగలదు.

తా. "రామా ! ఈమెపై జాలి చూపకుము. యజ్ఞములకు విఘ్నము చేయు, పాపాత్మురాలు, దుర్మార్గురాలు అయిన ఈ యక్షిణి మాయాబలముచే వృద్ధి పొందగలదు. 21

మూ. వధ్యతాం తావదేవైషా పురా సన్ధ్యా ప్రవర్తతే. 22
రక్షాంసి సన్ధ్యాకాలేషు దుర్ధర్షాణి భవన్తి వై.

ప్ర. అ. సన్ధ్యా = సంధ్య, పురా ప్రవర్తతే = ప్రవర్తింప నున్నది, తావదేవ = అంతలోనే, ఏషా = ఈమె, వధ్యతామ్ = చంపబడుగాక, సన్ధ్యాకాలేషు= సంధ్యాకాలములయందు, రక్షాంసి=రాక్షసులు, దుర్ధర్షాణి = ఎదిరింప శక్యము కానివారు, భవన్తి వై = అగుదురు.

తా. సంధ్యాకాలము రాబోవుచున్నది. ఈ లోపుగనే ఈమెను చంపి వేయుము. సంధ్యాకాలమునందు రాక్షసులను ఎదిరింప శక్యము కాదు. 22

మూ. ఇత్యుక్తస్తు తదా యక్షీమశ్మవృష్ట్యాభివర్షతీమ్, 23
దర్శయన్ శబ్దవేధిత్వం తాం రురోధ స సాయకైః.

ప్ర. అ. ఇతి = ఈ విధముగ, ఉక్తః = పలుకబడిన, సః = ఆ రాముడు, తదా = అప్పుడు, శబ్దవేధిత్వమ్ = శబ్దవేధిత్వమును, దర్శయన్ = చూపుచున్న వాడై, అశ్మవృష్ట్యా = రాళ్ల వానచే, అభివర్షతీమ్ = వర్షించుచున్న, తామ్ = ఆ, యక్షీమ్ = తాటకను, సాయకైః = బాణములచే, రురోధ = అడ్డగించెను.

తా. విశ్వామిత్రు డిట్లు చెప్పగా రాముడు తన శబ్దవేధిత్వ సామర్థ్యమును చూపుచు, రాళ్లవాన కురిపించుచున్న ఆ తాటకను బాణములచే అడ్డు పెట్టెను. 23

వి. శబ్ద మెచటినుండి వచ్చుచున్నదో దానినిబట్టి ఆ శబ్దము చేయు వ్యక్తి కనబడకున్నను ఆతనిని కొట్టగల సామర్థ్యము శబ్దవేధిత్వము.

మూ. సా రుద్ధా శరజాలేన మాయాబలసమన్వితా, 24
అభిదుద్రావ కాకుత్స్థం లక్ష్మణం చ వినేదుషీ.

ప్ర. అ. శరజాలేన = బాణసముదాయముచేత, రుద్ధా = అడ్డుకొనబడిన, మాయాబలసమన్వితా = మాయాబలము గల, సా = ఆమె, వినేదుషీ = గర్జించుచు, కాకుత్స్థమ్ = రాముని, లక్ష్మణం చ = లక్ష్మణుని గూర్చి, అభిదుద్రావ = పరుగెత్తెను.

తా. మాయాబలము గల ఆ తాటక బాణజాలముచే అడ్డుకొనబడినదై, గర్జించుచు రామలక్ష్మణుల మీదికి పరుగెత్తికొని వచ్చెను. 24

మూ. తామాపతన్తీం వేగేన విక్రాన్తామశనీమివ, 25
శరేణోరసి వివ్యాధ సా పపాత మమార చ.

ప్ర. అ. విక్రాన్తామ్ = పరాక్రమము చూపుచు, అశనీమివ = పిడుగు వలె, వేగేన = వేగముతో, ఆపతన్తీమ్ = వచ్చి మీద పడుచున్న, తామ్ = ఆమెను, శరేణ = బాణముతో, ఉరసి = వక్షఃస్థలమునందు, వివ్యాధ = కొట్టెను, సా = ఆమె, పపాత = క్రిందపడిపోయెను, మమార చ = మరణించెను కూడ.

తా. పరాక్రమము చూపుచు పిడుగు వలె వేగముగ వచ్చి మీద పడుచున్న ఆమెను రాముడు, బాణముచే, వక్షఃస్థలమునందు కొట్టెను. ఆమె క్రింద పడి చనిపోయెను. 25

మూ. తాం హతాం భీమసఙ్కాశాం దృష్ట్వా సురపతిస్తదా, 26
సాధు సాధ్వితి కాకుత్థ్సం సురాశ్చ సమపూజయన్.

ప్ర. అ. తదా = అప్పుడు, సురపతిః = దేవేంద్రుడును, సురాశ్చ = దేవతలును, హతామ్ = చంపబడిన, భీమసఙ్కాశామ్ = భయంకరురాలుగా ఉన్న, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, సాధు సాధు, ఇతి = "బాగు బాగు" అని, కాకుత్థ్సమ్ = రాముని, సమపూజయన్ = పూజించిరి.

తా. భయంకరురాలైన ఆ తాటక మరణమును చూచి, దేవతలును, దేవేంద్రుడును, "బాగు బాగు" అని రాముని ప్రశంసించిరి. 26

మూ. ఉవాచ పరమప్రీతః సహస్రాక్షః పురన్దరః, 27
సురాశ్చ సర్వే సంహృష్టా విశ్వామిత్రమథాబ్రువన్.

ప్ర. అ. అథ = పిమ్మట, సహస్రాక్షః = వేయి నేత్రములు గల, పురన్దరః = దేవేంద్రుడు, పరమప్రీతః = చాల సంతోషించినవాడై, ఉవాచ = పలికెను, సర్వే = సమస్తమైన, సురాశ్చ = దేవతలును, సంహృష్టాః = సంతోషించినవారై, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, అబ్రువన్ = పలికిరి.

తా. సహస్రాక్షుడైన దేవేంద్రుడు దేవత లందరును కూడ సంతసించి విశ్వామిత్రునితో ఇట్లు పలికిరి. 27

మూ. మునే కౌశిక భద్రం తే సేన్ద్రాస్సర్వే మరుద్గణాః, 28
తోషితాః కర్మణానేన స్నేహం దర్శయ రాఘవే.

ప్ర. అ. కౌశికమునే = ఓ విశ్వామిత్రమహాముని, తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక, సేన్ద్రాః = ఇంద్రునితో కూడిన, సర్వే = సమస్తమైన, మరుద్గణాః = దేవతలు, అనేన = ఈ, కర్మణా = కర్మచేత, తోషితాః = సంతోషింప చేయబడినారు, రాఘవే = రాముని విషయమున, స్నేహమ్ = స్నేహమును, దర్శయ = చూపుము.

తా. విశ్వామిత్రమహర్షీ ! నీకు క్షేమ మగుగాక. ఈ పనిచేత సకల దేవతలును, ఇంద్రుడును చాల సంతోషింపచేయబడినారు. రామునియందు ప్రేమను చూపుము. 28

మూ. ప్రజాపతేర్భృశాశ్వస్య పుత్రాన్ సత్యపరాక్రమాన్,
తపోబలభృతాన్ బ్రహ్మన్ రాఘవాయ నివేదయ. 29

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రహ్మర్షీ ! ప్రజాపతేః = ప్రజాపతియైన, భృశాశ్వస్య = భృశాశ్వునియొక్క, పుత్రాన్ = పుత్రులును, సత్యపరాక్రమాన్ = సత్యమైన పరాక్రమము కలవియు, తపోబలభృతాన్ = తపోబలముచే పోషింపబడినవియు, అగు అస్త్రములను, రాఘవాయ = రామునకు, నివేదయ = ఇమ్ము.

తా. ఓ మహర్షీ ! ప్రజాపతి యైన భృశాశ్వుని పుత్రులును, సత్య మైన పరాక్రమము కలవియు, తపోబలముచే పోషింపబడినవియు అగు అస్త్రములను రామునకు ఉపదేశింపుము. 29

మూ. పాత్రభూతశ్చ తే బ్రహ్మం స్తవానుగమనే ధృతః, 30
కర్తవ్యం చ మహత్కర్మ సురాణాం రాజసూనునా.

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రహ్మర్షీ ! తవ = నీ యొక్క, అనుగమనే = అనుసరించి వెళ్లుటయందు, ధృతః=స్థిరు డైన ఈ రాముడు, తే = నీకు, పాత్రభూతః చ = సత్పాత్ర మైనవాడు, రాజసూనునా = ఈ రాజకుమారునిచే, సురాణామ్ = దేవతలయొక్క, మహత్ = గొప్ప, కర్మ = పని, కర్తవ్యం చ = చేయతగి యున్నది కూడ.

తా. ఓ విశ్వామిత్రా ! భక్తితో, స్థిరచిత్తముతో నిన్ను అనుసరించి వచ్చుచున్న ఈ రాముడు అస్త్రములను ఉపదేశించుటకు తగిన సత్పాత్రము. ఈ రాముడు గొప్ప దేవకార్యమును చేయవలసి యున్నది. 30

మూ. ఏవముక్త్వా సురాః సర్వే హృష్టా జగ్ముర్యథాగతమ్, 31
విశ్వామిత్రం పురస్కృత్య తతః సన్ధ్యా ప్రవర్తతే.

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, సురాః = దేవతలు, సర్వే = అందరును, హృష్టాః = సంతసించినవారై, విశ్వామిత్రం = విశ్వామిత్రుని, పురస్కృత్య = పూజించి, యథాగతమ్ = వచ్చినట్లు, జగ్ముః = వెళ్లిరి, తతః = పిమ్మట, సన్ధ్యా = సంధ్య, ప్రవర్తతే = ప్రవర్తించెను.

తా. ఈ విధముగ పలికి, దేవత లందరును సంతసించినవారై, విశ్వామిత్రుని పూజించి తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. పిమ్మట సంధ్యాసమయ మయ్యెను. 31

మూ. తతో మునివరః ప్రీత స్తాటకావధతోషితః, 32
మూర్ధ్ని రామముపాఘ్రాయ ఇదం వచనమబ్రవీత్.

ప్ర. అ. తతః = పిమ్మట, మునివరః = మునిశ్రేష్ఠుడు, ప్రీతః = ప్రీతి యుక్తుడై, తాటకావధతోషితః = తాటకయొక్క సంహారముచేత సంతోషింప చేయబడినవాడై, రామమ్ = రాముని, మూర్ధ్ని = శిరస్సుపై, ఉపాఘ్రాయ = వానన చూచి, ఇదం వచనమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట తాటకాసంహారముచే సంతోషించిన విశ్వామిత్రుడు రాముని శిరస్సుపై వానన చూచి ఇట్లు పలికెను. 32

మూ. ఇహాద్య రజనీం రామ వసేమ శుభదర్శన, 33
శ్వః ప్రభాతే గమిష్యామ స్తదాశ్రమపదం మమ.

ప్ర. అ. శుభదర్శన=శుభమైన దర్శనము గల, రామ=రామా, అద్య= ఈనాడు, రజనీమ్ = ఈ రాత్రి, ఇహ = ఇచట, వసేమ = నివసించెదము, శ్వః = రేపు, ప్రభాతే = ప్రాతఃకాలమున, మమ = నా యొక్క, తత్ = ఆ, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును గూర్చి, గమిష్యామః = వెళ్లెదము.

ప్ర. అ. దర్శనమాత్రమున శుభముల నిచ్చు ఓ రామా ! ఈ రాత్రి ఇచటనే నివసించి రేపు ప్రాతఃకాలమున నా ఆశ్రమమునకు వెళ్లెదము. 33

మూ. విశ్వామిత్రవచః శ్రుత్వా హృష్టో దశరథాత్మజః, 34
ఉవాస రజనీం తత్ర తాటకాయా వనే సుఖమ్.

ప్ర. అ. విశ్వామిత్రవచః = విశ్వామిత్రుని మాటలను, శ్రుత్వా = విని, దశరథాత్మజః = రాముడు, హృష్టః = సంతసించినవాడై, తత్ర = ఆ, తాటకాయాః వనే = తాటకయొక్క వనమునందు, సుఖమ్ = సుఖముగా, రజనీమ్ = ఆ రాత్రి, ఉవాస = నివసించెను.

తా. రాముడు విశ్వామిత్రుని మాటలు విని సంతోషించి, ఆ రాత్రి తాటకావనములో సుఖముగా నివసించెను. 34

మూ. ముక్తశాపం వనం తచ్చ తస్మిన్నేవ తదాహని, 35
రమణీయం విబభ్రాజ యథా చైత్రరథం వనమ్.

ప్ర. అ. తదా = అప్పుడు, తస్మిన్ = ఆ, అహని ఏవ = దినమునందే, తత్ = ఆ, వనం చ = వనము కూడ, ముక్తశాపమ్ = విడువబడిన శాపము కలదై, చైత్రరథమ్ = చైత్రరథ మనెడు, వనమ్ = వనము, యథా = ఎట్లో, అట్లే, రమణీయమ్ = సుందర మైనదై, విబభ్రాజ = ప్రకాశించెను.

తా. ఆ వనముకూడ, ఆ దినమునందే శాపమునుండి విముక్తమై కుబేరుని చైత్రరథోద్యానము వలె సుందరమై ప్రకాశించెను. 35

మూ. నిహత్య తాం యక్షసుతాం స రామః
ప్రశస్యమానః సురసిద్ధ సంఘైః,
ఉవాస తస్మిన్మునినా సహైవ,
ప్రభాతవేలాం ప్రతిబోధ్యమానః. 36

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షడ్వింశః సర్గః.

ప్ర. అ. సః రామః = ఆ రాముడు, తామ్ = ఆ, యక్షసుతామ్ = యక్షుని కుమార్తెను, నిహత్య = చంపి, సురసిద్ధసంఘైః = దేవతలయొక్కయు సిద్ధుల యొక్కయు సంఘములచేత, ప్రశస్యమానః = ప్రశంసింపబడు చున్నవాడై, మునినా సహ = విశ్వామిత్రునితో కూడ, తస్మిన్నేవ = ఆ వనమునందే, ప్రభాతవేళామ్ = ప్రాతఃకాలమున, ప్రతిబోధ్యమానః = మేల్కొలుపబడు చున్నవాడై, ఉవాస = నివసించెను.

తా. రాముడు తాటకను చంపి, దేవతలు సిద్ధులు మొదలగు వారిచే ప్రశంసింపబడుచు, విశ్వామిత్రునితో ఆ రాత్రి, ఆ వనమునందే వసించెను. ప్రభాతసమయమున విశ్వామిత్రుడు అతనిని మేల్కొలిపెను. 36

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యయందు బాలకాండలో
ఇరువది యారవ సర్గ సమాప్తము.

అథ సప్తవింశః సర్గః

మూ. అథ తాం రజనీముష్య విశ్వామిత్రో మహాయశాః,
ప్రహస్య రాఘవం వాక్యమువాచ మధురాక్షరమ్. 1

ప్ర. అ. అథ = పిమ్మట, మహాయశాః = గొప్ప కీర్తి గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, తాం రజనీమ్ = ఆ రాత్రి, ఉష్య = ఉండి, ప్రహస్య = నవ్వి, రాఘవమ్ = రాముని గూర్చి, మధురాక్షరమ్ = మధురమైన అక్షరములు కలిగిన, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. మహాయశస్సుగల విశ్వామిత్రుడు ఆ రాత్రి అచట నివసించి, మరునాడు, చిరునవ్వు నవ్వుచు, రామునితో, మధురముగ ఇట్లనెను.

పరితుష్టోఽస్మి భద్రం తే రాజపుత్ర మహాయశః,
ప్రీత్యా పరమయా యుక్తో దదామ్యస్త్రాణి సర్వశః. 2

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి గల, రాజపుత్ర = రామా, పరితుష్టః = సంతోషించినవాడను, అస్మి = అయినాను, తే = నీకు, భద్రమ్ = క్షేమము అగుగాక. పరమయా = గొప్ప, ప్రీత్యా = ప్రేమతో, యుక్తః = కూడినవాడనై, అస్త్రాణి = అస్త్రములను, సర్వశః = పూర్తిగా, దదామి = ఇచ్చెదను.

తా. గొప్ప కీర్తి గల రామా! నాకు చాల సంతోషము కలిగినది. నీకు క్షేమ మగుగాక. నీకు ప్రేమపూర్వకముగా అస్త్రములను పూర్తిగ ఇచ్చెదను. 2

మూ. దేవాసురగణాన్వాపి సగన్ధర్వోరగానపి,
యైరమిత్రాన్ ప్రసహ్యాజౌ వశీకృత్య జయిష్యసి, 3
తాని దివ్యాని భద్రం తే దదామ్యస్త్రాణి సర్వశః.

ప్ర. అ. యైః = ఏ అస్త్రములచేత, దేవాసురగణాన్వాపి = దేవాసురసముదాయము నైనను, సగన్ధర్వోరగానపి = గంధర్వులతో కూడిన ఉరగులనైనను, అమిత్రాన్ = శత్రువులను, ఆజౌ = యుద్ధమునందు, ప్రసహ్య = బలాత్కారముగ,

వశీకృత్య = వశము చేసికొని, జయిష్యసి = జయింపగలవో, తాని = అట్టి, దివ్యాని=దివ్యములైన, అస్త్రాణి=అస్త్రములను, సర్వశః = పూర్తిగా, దదామి = ఇచ్చెదను. తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక.

తా. దేవ-అసుర-గంధర్వ ఉరగాదులు ఎవ్వరు శత్రువులుగా వచ్చినను యుద్ధరంగమునందు, వేటి సాహాయ్యముచే, వారిని బలాత్కారముగ వశము చేసికొని జయింపగలవో, అట్టి, దివ్యాస్త్రములను పరిపూర్ణముగ నీకివ్వగలను. నీకు క్షేమ మగుగాక. 3

మూ. దణ్డచక్రం మహద్దివ్యం తవ దాస్యామి రాఘవ, 4
ధర్మచక్రం తతో వీర కాలచక్రం తథైవ చ,
విష్ణుచక్రం తథాత్యుగ్రమైన్ద్రమస్త్రం తథైవ చ. 5
వజ్రమస్త్రం నరశ్రేష్ఠ శైవం శూలవరం తథా,
అస్త్రం బ్రహ్మశిరశ్చైవ ఐషీకమపి రాఘవ. 6
దదామి తే మహాబాహో బ్రాహ్మమస్త్రమనుత్తమమ్.

ప్ర. అ. రాఘవ=రామా! మహత్=గొప్పదైన, దివ్యమ్=దివ్య మైన, దణ్డచక్రమ్=దండచక్రమును, తవ=నీకు, దాస్యామి=ఇవ్వగలను. నరశ్రేష్ఠ= నరులలో శ్రేష్ఠుడా, మహాబాహో=గొప్ప బాహువులు గలవాడా! వీర=ఓవీరుడా, రాఘవ = రామా ! తతః = పిమ్మట, ధర్మచక్రమ్ = ధర్మచక్రమును, తథైవ చ=మరియు, కాలచక్రమ్ = కాలచక్రమును, తథా = మరియు, విష్ణుచక్రమ్ = విష్ణుచక్రమును, తథైవ చ = మరియు, ఐన్ద్రమ్ అస్త్రమ్ = ఐంద్రాస్త్రమును, వజ్రమ్ అస్త్రమ్=వజ్రాస్త్రమును, తథా=మరియు, శైవమ్=శివుని సంబంధమైన, శూలవరమ్ = శ్రేష్ఠ మైన శూలమును, బ్రహ్మశిరః = బ్రహ్మశిరస్సు అనెడు, అస్త్రమ్=అస్త్రమును, ఐషీకమపి=ఐషీకాస్త్రమును, అనుత్తమమ్=అతిశ్రేష్ఠమైన, బ్రాహ్మమ్ అస్త్రమ్=బ్రహ్మాస్త్రమును, తే=నీకు, దదామి=ఇచ్చెదను.

తా. నరశ్రేష్ఠుడవు, మహాబాహుడవు అయిన ఓ రామా ! నీకు-ధర్మచక్ర-కాలచక్ర-విష్ణుచక్రములను, అత్యుగ్ర మైన ఇంద్రాస్త్రమును, వజ్రాస్త్రమును, శివుని శ్రేష్ఠ మైన శూలమును, బ్రహ్మశిరోస్త్రమును, ఐషీకాస్త్రమును, అత్యుత్తమ మైన బ్రహ్మాస్త్రమును ఇచ్చెదను.

మూ. గదే ద్వే చైవ కాకుత్స్థ మోదకీ శిఖరీ ఉభే,
ప్రదీప్తే నరశార్దూల ప్రయచ్ఛామి నృపాత్మజ. 7

ప్ర. అ. కాకుత్స్థ = కకుత్స్థవంశమునందు జన్మించిన నరశార్దూల = నరశ్రేష్ఠు డైన, నృపాత్మజ=రామా! ప్రదీప్తే=ప్రజ్వలించుచున్న, ద్వే=రెండు, మోదకీ శిఖరీ = మోదకి శిఖరి అనెడు, గదే = గదలను, ఉభే=రెండింటినీ, ప్రయచ్ఛామి=ఇచ్చెదను.

తా. నరశ్రేష్ఠుడ వైన రామా! మోదకి, శిఖరి అనెడు ప్రజ్వరిల్లు చున్న రెండు గదలను కూడ ఇచ్చెదను. 7

మూ. ధర్మపాశమహం రామ కాలపాశం తథైవ చ, 8
పాశం వారుణమస్త్రం చ దదామ్యహమనుత్తమమ్.

ప్ర. అ. రామ=రామా! అహమ్=నేను, ధర్మపాశమ్=ధర్మపాశమును, తథైవ చ = మరియు, కాలపాశమ్ = కాలపాశమును, వారుణమ్ = వరుణునికి సంబంధించిన, పాశమ్ = పాశమును, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, అస్త్రం చ=అస్త్రమును దదామి=ఇచ్చెదను.

తా. రామా! నేను ధర్మపాశమును, కాలపాశమును, వారుణపాశమును, గొప్ప దైన వారుణాస్త్రమును ఇచ్చెదను.

మూ. అశనీ ద్వే ప్రయచ్ఛామి శుష్కార్ద్రే రఘునన్దన,
దదామి చాస్త్రం పైనాకమస్త్రం నారాయణం తథా. 9

ప్ర. అ. రఘునన్దన = రామా, శుష్కార్ద్రే = శుష్కము (ఎండుది), ఆర్ద్రము (తడిది) అనెడు, ద్వే = రెండు, అశనీ = పిడుగులను, పైనాకమ్ అస్త్రమ్ = పైనాకాస్త్రమును, తథా = మరియు, నారాయణమ్ అస్త్రమ్= నారాయణాస్త్రమును, దదామి=ఇచ్చెదను.

తా. రామా! శుష్కము, ఆర్ద్రము అనెడు రెండు పిడుగులను, పైనాకాస్త్రమును, నారాయణాస్త్రమును ఇచ్చెదను. 9

మూ. ఆగ్నేయమస్త్రం దయితం శిఖరం నామ నామతః, 10
వాయవ్యం ప్రథనం నామ దదామి చ తవానఘ.

ప్ర. అ. అనఘ=దోషరహితుడా, నామతః=పేరుచేత, శిఖరం నామ=శిఖర మను పేరుగల, దయితమ్=అగ్నికి ఇష్టమైన, అగ్నేయమ్ అస్త్రమ్=అగ్నిదేవతాక మైన అస్త్రమును, ప్రథనం నామ=ప్రథన మను పేరు గల, వాయవ్యమ్=వాయవ్యాస్త్రమును, తవ=నీకు, దదామి=ఇచ్చెదను. 10

తా. దోషరహితుడ వైన రామా! శిఖర మను పేరు గలదియు, అగ్నికి చాల ఇష్ట మైనదియు అగు ఆగ్నేయాస్త్రమును, ప్రథన మను పేరు గల వాయవ్యాస్త్రమును ఇచ్చెదను.

మూ. అస్త్రం హయశిరో నామ క్రౌఞ్చమస్త్రం తథైవ చ. 11
శక్తిద్వయం చ కాకుత్స్థ దదామి తవ రాఘవ.

ప్ర. అ. కాకుత్స్థ=కకుత్స్థవంశోద్భవుడ వైన, రాఘవ = రామా, హయశిరో నామ=హయశిరస్సు అను పేరు గల, అస్త్రమ్=అస్త్రమును, తథైవ చ=మరియు, క్రౌఞ్చమ్ అస్త్రమ్ = క్రౌంచాస్త్రమును, శక్తిద్వయం చ=రెండు శక్తులను, తవ=నీకు, దదామి=ఇచ్చెదను.

తా. కకుత్స్థవంశోద్భవుడ వైన రామా! హయశిరస్సు అను అస్త్రమును, క్రౌంచాస్త్రమును, రెండు శక్తులను ఇచ్చెదను. 11

మూ. కఙ్కాళం ముసలం ఘోరం కాపాలమథ కఙ్కణమ్,
ధారయన్త్యసురా యాని దదామ్యేతాని సర్వశః. 12

ప్ర. అ. ఘోరమ్=భయంకర మైన, కఙ్కాళమ్=కంకాళ మనెడు, ముసలమ్=రోకలిని, కాపాలమ్=కాపాల మనెడు ముసలమును, అథ=మరియు, కఙ్కణమ్=కంకణ మనెడు ముసలమును, యాని=వేటిని, అసురాః=అసురులు, ధారయన్తి=ధరింతురో, ఏతాని=అట్టి, ఈ ముసలములను, సర్వశః=పూర్తిగా, దదామి=ఇచ్చెదను.

తా. అసురులు ధరించు కంకాళము, కాపాలము, కంకణము అను ముసలములను గూడ పూర్తిగ ఇచ్చెదను. 12

మూ. వైద్యాధరం మహాస్త్రం చ నన్దనం నామ నామతః,
అసిరత్నం మహాబాహో దదామి చ నృపాత్మజ. 13

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల, నృపాత్మజ = ఓరాజ కుమారా ! వైద్యాధరమ్=వైద్యాధరమనెడు, మహాస్త్రం చ=మహాస్త్రమును, నామతః=పేరుచేత, నన్దనం నామ=నందన మనెడు, అసిరత్నమ్=శ్రేష్ఠ మైన ఖడ్గమును, దదామి=ఇచ్చెదను.

తా. వైద్యాధర మనెడు మహాస్త్రమును నందన మనెడు శ్రేష్ఠమైన ఖడ్గమును ఇచ్చెదను. 13

మూ. గాన్ధర్వమస్త్రం దయితం మానవం నామ నామతః,
ప్రస్వాపన ప్రశమనే దద్మి సౌరం చ రాఘవ. 14

ప్ర. అ. రాఘవ = రామా ! గాన్ధర్వమ్=గాన్ధర్వ మనెడు, అస్త్రమ్ = అస్త్రమును, నామతః=పేరుచేత, మానవం నామ=మానవ మనెడు, దయితమ్= ఇష్టమైన అస్త్రమును, ప్రస్వాపన ప్రశమనే = నిద్రకలిగించునదియు నిద్ర తొలగించునదియు అగు రెండు (గాంధర్వమానవ) అస్త్రములను, సౌరం చ = సౌరాస్త్రమును, దద్మి=ఇచ్చెదను.

తా. రామా ! నిద్ర కలిగించునదియు, నిద్ర తొలగించునదియు అగు గాంధర్వమానవాస్త్రములను సౌరాస్త్రమును ఇచ్చెదను. 14

మూ. దర్పణం శోషణం చైవ సన్తాపనవిలాపనే, 15
మదనం చైవ దుర్ధర్షం కందర్పదయితం తథా,

పైశాచమస్త్రం దయితం మోహనం నామ నామతః, 16
ప్రతీచ్ఛ నరశార్దూల రాజపుత్ర మహాయశః.

ప్ర. అ. మహాయశః=గొప్ప యశస్సు కలవాడా, నరశార్దూల = నరశ్రేష్ఠుడా, రాజపుత్ర = రామా! దర్పణమ్ = గర్వింపచేయు దర్పణాస్త్రమును, శోషణం చైవ=ఎండింపచేయు శోషణాస్త్రమును, సంతాపన విలాపనే = తాప

మును కలిగించు సంతాపనాస్త్రమును విలపింపచేయు విలాపనాస్త్రమును, తథా= మరియు, దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యము కాని, కన్దర్పదయితమ్ = మన్మథునికి ఇష్టమైన, మదనం చ=మదనాస్త్రమును, నామతః= పేరుచేత, మోహనం నామ= మోహనమను ప్రసిద్ధి గల, దయితమ్ = పిశాచములకు ఇష్టమైన, పైశాచమ్ అస్త్రమ్=పిశాచములకు సంబంధించిన అస్త్రమును, ప్రతీచ్ఛ = తీసికొనుము.

తా. నరశ్రేష్ఠుడవును, కీర్తిమంతుడవును, అగు రామా ! దర్పణ-శోషణ-సంతాపన-విలాపనాస్త్రములను, మన్మథునకు ఇష్ట మైనదియు ఎదిరింప శక్యము కానిదియు అగు మదనాస్త్రమును, పిశాచములకు సంబంధించినదియు, వారికి ఇష్టమైనదియు అగు మోహనాస్త్రమును, గ్రహింపుము. 16

మూ. తామసం నరశార్దూల సౌమనం చ మహాబల, 17
సంవర్ధం చైవ దుర్ధర్షం మౌసలం చ నృపాత్మజ,
సత్యమస్త్రం మహాబాహో తథా మాయాధరం పరమ్, 18
ఘోరం తేజఃప్రభం నామ త్వష్టురస్త్రం సుదామనమ్,
దారుణం చ భగస్యాపి శితేషుమథ మానవమ్.

ప్ర. అ. నరశార్దూల = నరశ్రేష్ఠుడా, మహాబల=గొప్ప బలము కల వాడా, నృపాత్మజ=రామా, తామసమ్=తామసాస్త్రమును, సౌమనం చైవ = సౌమనాస్త్రమును, దుర్ధర్షమ్=ఎదిరింప శక్యము కాని, సంవర్ధం చైవ=సంవర్ధాస్త్రమును, మౌసలమ్=మౌసలాస్త్రమును, సత్యమ్ అస్త్రమ్=సత్యాస్త్రమును, పరమ్=శ్రేష్ఠ మైన, మాయాధరమ్=మాయాధరాస్త్రమును, పరతేజోప కర్షణమ్=పరుల తేజస్సును లాగివేయు, ఘోరమ్=భయంకర మైన, తేజః ప్రభం నామ = తేజః ప్రభ మనెడి అస్త్రమును, శిశిరం నామ=శిశిరమనెడి పేరు గల, సౌమ్యాస్త్రమ్=సోమదేవతాకమైన అస్త్రమును, సుదామనమ్= సుదామన మను పేరు గల, త్వష్టుః=త్వష్టయొక్క, అస్త్రమ్=అస్త్రమును, భగస్య = భగునియొక్క, దారుణమ్ = భయంకర మైన, శితేషుమ్=వాడి యైన బాణ రూపములో నున్న శితేష్వస్త్రమును, అథ=మరియు, మానవమ్= మానవాస్త్రమును, ప్రతీచ్ఛస్వ=గ్రహింపుము.

తా. ఓ నరశ్రేష్ఠుడా, మహాబలశాలీ! రామా! తామససౌమనాస్త్రములను, ఎదిరింప శక్యము కాని సంవర్ధాస్త్రమును, మౌసలాస్త్రమును, సత్యాస్త్రమును,

మాయాధరాస్త్రమును, ఇతరుల తేజస్సును ఆకర్షించు ఘోర మైన తేజః ప్రభాస్త్రమును, సోమదేవతాక మైన శిశిరాస్త్రమును, త్వష్టృదేవతాకమైన సుదామనాస్త్రమును, భగునియొక్క దారుణ మైన శితేషువు (బాణము)ను, మరియు మానవాస్త్రమును గ్రహింపుము.

మూ. ఏతాన్ రామ మహాబాహో కామరూపాన్ మహాబలాన్, 20
గృహాణ పరమోదారాన్ క్షిప్రమేవ నృపాత్మజ.

ప్ర. అ. మహాబాహో=గొప్పబాహువులు కలవాడా ! నృపాత్మజ= రాజకుమారా ! రామ=రామా ! కామరూపాన్=స్వేచ్ఛాధీన రూపములుగల, మహాబలాన్=గొప్పబలముగల, పరమోదారాన్=చాల గొప్ప వైన, ఏతాన్= ఈ అస్త్రములను, క్షిప్రమేవ=శీఘ్రముగ, గృహాణ=తీసికొనుము.

తా. మహాబాహూ ! రాజకుమారా ! రామా ! ఇష్టము వచ్చిన రూపములు ధరింపగలవియు, చాల గొప్పవియు, గొప్ప బలము కలవియు అగు ఈ అస్త్రములను వెంటనే గ్రహింపుము. 20

మూ. స్థితస్తు ప్రాఙ్ముఖో భూత్వా శుచిర్మునివరస్తదా, 21
దదౌ రామాయ సుప్రీతో మన్త్రగ్రామమనుత్తమమ్.

ప్ర. అ. తదా = అపుడు, మునివరః = మునిశ్రేష్ఠుడు, శుచిః = పరిశుద్ధుడై, ప్రాఙ్ముఖః=తూర్పువైపు ముఖము కలవాడుగా, స్థితః=ఉన్నవాడు, భూత్వా=అయి, సుప్రీతః=చాల ప్రసన్నుడై, రామాయ=రామునకు, అనుత్తమమ్=చాల ఉత్తమ మైన, మన్త్రగ్రామమ్=మంత్రసముదాయమును, దదౌ= ఇచ్చెను.

తా. అపుడు మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు శుచియై ప్రసన్నచిత్తుడై, పూర్వాభిముఖుడై అత్యుత్తమ మగు అస్త్రసముదాయమును రామున కిచ్చెను.

మూ. సర్వసంగ్రహణం తేషాం దైవతైరపి దుర్లభమ్, 22
తాన్యస్త్రాణి తదా విప్రో రాఘవాయ న్యవేదయత్.

ప్ర. అ. తేషామ్=ఏ అస్త్రముల యొక్క, సర్వసంగ్రహణమ్=పరిపూర్ణస్వీకారము, దైవతైరపి=దేవతలచేత కూడ, దుర్లభమ్=దుర్లభ మైనదో, తాని=అట్టి, అస్త్రాణి=అస్త్రములను, తదా=అప్పుడు, విప్రః=విశ్వామిత్రుడు, రాఘవాయ=రామునకు, న్యవేదయత్=తెలిపెను.

ప్ర. అ. ఏ అస్త్రములను సాంగోపాంగములుగ పరిపూర్ణముగ స్వీకరించుట అనునది దేవతలకు కూడ దుర్లభమో అట్టి అస్త్రములను విశ్వామిత్రుడు రామునకు ఇచ్చెను. 22

మూ. జపతస్తు మునేస్తస్య విశ్వామిత్రస్య ధీమతః, 23
ఉపతస్థుర్మహార్హాణి సర్వాణ్యస్త్రాణి రాఘవమ్.

ప్ర. అ. ధీమతః=బుద్ధిశాలి యైన, తస్య=ఆ, విశ్వామిత్రస్య మునేః=విశ్వామిత్రమహాముని, జపతః=జపము చేయుచుండగా, మహార్హాణి=పూజ్యములైన, అస్త్రాణి=అస్త్రములు, సర్వాణి=అన్నియు, రాఘవమ్=రాముని, ఉపతస్థుః=(చేరినవి) సేవించినవి.

తా. ధీమంతు డైన ఆ విశ్వామిత్రుడు జపించు చుండగా, పూజనీయములైన అస్త్రము లన్నియు రాముని సేవించినవి.

మూ. ఊచుశ్చ ముదితాః సర్వే రామం ప్రాఞ్జలయస్తదా, 24
ఇమే స్మః పరమోదారాః కింకరాస్తవ రాఘవ.

ప్ర. అ. పరమోదారాః=మిక్కిలి ఉదారు లైన, సర్వే=ఆ అస్త్రదేవతలందరును, తదా=అప్పుడు, ప్రాఞ్జలయః=దోసిలి కట్టినవారై, ఊచుశ్చ=పలికిరి కూడ. రాఘవ=రామా, ఇమే=ఈ మేము, తవ=నీయొక్క, కింకరాః=కింకరులముగా, స్మః=అయి ఉన్నాము.

తా. పరమోదారు లైన ఆ అస్త్రదేవత లందరును, అపుడు, నమస్కరించుచు, "రామా! మేమందరము నీ కింకరులము" అని పలికిరి.

మూ. ప్రతిగృహ్య చ కాకుత్స్థః సమాలభ్య చ పాణినా, 25
మానసా మే భవిష్యధ్వమితి తానభ్యచోదయత్.

ప్ర. అ. కాకుత్థ్సః=రాముడు, ప్రతిగృహ్యా=స్వీకరించి, పాణినా=హస్తముతో, సమాలభ్య=స్పృశించి, మే=నాయొక్క, మానసాః=మనస్సునందు సంచరించువారుగా, భవిష్యధ్వమ్=అగుదురుగాక, ఇతి=అని, తాన్=వారిని, అభ్యచోదయత్=ఆజ్ఞాపించెను.

తా. రాముడు ఆ అస్త్రములను స్వీకరించి, హస్తముచే ఆ అస్త్రదేవతలను స్పృశించి—"నా మనస్సులో సంచరించుచుందురు గాక" అని ఆ దేవతలను ఆజ్ఞాపించెను.

మూ. తతః ప్రీతమనా రామో విశ్వామిత్రం మహామునిమ్, 26
అభివాద్య మహాతేజాః గమనాయోపచక్రమే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
సప్తవింశః సర్గః.

ప్ర. అ. తతః = పిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రామః=రాముడు, ప్రీతమనాః = సంతోషించిన మనస్సు కలవాడై, విశ్వామిత్రం మహామునిమ్=విశ్వామిత్రమహర్షిని, అభివాద్య = నమస్కరించి, గమనాయ=ప్రయాణము చేయుటకు, ఉపచక్రమే=ప్రారంభించెను.

తా. అటుపిమ్మట మహాతేజఃశాలి యగు రాముడు సంతోషించి, విశ్వామిత్రమహర్షికి నమస్కరించి ప్రయాణ మయ్యెను.

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండలో
ఇరువదియేడవ సర్గ సమాప్తము.

అథ అష్టావింశః సర్గః

మూ. ప్రతిగృహ్య తతోఽస్త్రాణి ప్రహృష్టవదనః శుచిః,
గచ్ఛన్నేవ చ కాకుత్స్థో విశ్వామిత్రమథాబ్రవీత్. 1

ప్ర. అ. కాకుత్స్థః=రాముడు, శుచిః=పవిత్రుడై, అస్త్రాణి=అస్త్రములను, ప్రతిగృహ్య=స్వీకరించి, తతః=పిమ్మట, ప్రహృష్టవదనః=వికసించిన ముఖము కలవాడై, గచ్ఛన్నేవ=నడచి వెళ్లుచునే, అథ = అటుపిమ్మట, విశ్వామిత్రమ్= విశ్వామిత్రుని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. రాముడు పవిత్రుడై అస్త్రములను గ్రహించి, ఆనందించి, నడచి వెళ్లుచునే విశ్వామిత్రునితో ఇట్లనెను. 1

మూ. గృహీతాస్త్రోఽస్మి భగవన్ దురాధర్షః సురైరపి,
అస్త్రాణాం త్వహమిచ్ఛామి సంహారం మునిపుఙ్గవ. 2

ప్ర. అ. భగవన్=పూజ్యుడా, గృహీతాస్త్రః=గ్రహింపబడిన అస్త్రములు గల నేను, సురైరపి = దేవతలచేత కూడ, దురాధర్షః = ఎదిరింపశక్యముకాని వాడనుగా, అస్మి = అయిఉన్నాను. మునిపుఙ్గవ = ఓ మునిశ్రేష్ఠుడా! అహమ్= నేను, అస్త్రాణామ్ = అస్త్రములయొక్క, సంహారమ్ = ఉపసంహారమును కూడ, ఇచ్ఛామి=తెలుసుకొనగోరుచున్నాను.

తా. పూజ్యుడా, అస్త్రములను స్వీకరించి ఇపుడు నేను దేవతలచేత గూడ ఎదిరింప శక్యముకానివాడ నైతిని. మునిశ్రేష్ఠా! అస్త్రముల ఉపసంహారమును కూడ తెలిసికొనగోరుచున్నాను. 2

మూ. ఏవం బ్రువతి కాకుత్స్థే విశ్వామిత్రో మహామునిః,
సంహారం వ్యాజహారాథ ధృతిమాన్ సువ్రతః శుచిః. 3

ప్ర. అ. కాకుత్స్థే = రాముడు, ఏవమ్ = ఈ విధముగా, బ్రువతి=పలుకగా, అథ=పిమ్మట, ధృతిమాన్=ధైర్యవంతుడును, సువ్రతః=మంచి వ్రతము

కలవాడును, శుచిః=పరిశుద్ధుడును అగు, విశ్వామిత్రః మహామునిః=విశ్వామిత్ర మహర్షి, సంహారమ్=ఉపసంహారమును, వ్యాజహార=చెప్పెను.

తా. రాముని మాటలను అంగీకరించి విశ్వామిత్రమహర్షి అస్త్రముల ఉపసంహారమును కూడ ఉపదేశించెను. 3

మూ. సత్యవన్తం సత్యకీర్తిం ధృష్టం రభసమేవ చ,
ప్రతిహారతరం నామ పరాఙ్ముఖమవాఙ్ముఖమ్. 4

లక్షాక్షవిషమౌ చైవ దృఢనాభసునాభకౌ,
దశాక్షశతవక్త్రౌ చ దశశీర్షశతోదరౌ. 5

పద్మనాభమహానాభౌ దున్దునాభసునాభకౌ,
జ్యోతిషం కృశనం చైవ నైరాశ్యవిమలావుభౌ. 6

యోగన్ధరహరిద్రౌ చ దైత్యప్రశమనౌ తథా,
సార్చిర్మాలీ ధృతిర్మాలీ వృత్తిమాన్ రుచిరస్తథా. 7

పిత్ర్యసౌమనసం చైవ విధూతమకరావుభౌ,
కరవీరకరం చైవ ధనధాన్యౌ చ రాఘవ. 8

కామరూపం కామరుచిం మోహమావరణం తథా,
జృమ్భకం సర్వనాభం చ సన్తానవరణౌ తథా. 9

భృశాశ్వతనయాన్ రామ భాస్వరాన్కామరూపిణః,
ప్రతీచ్ఛ మమ భద్రం తే పాత్రభూతోఽసి రాఘవ. 10

ప్ర. అ. రాఘవ=రఘువంశమునందు పుట్టిన, రామ=రామా, సత్యవన్తమ్=సత్యవంతమును, సత్యకీర్తిమ్ = సత్యకీర్తిని, ధృష్టమ్=ధృష్టమును, రభసమ్=రభసమును, ప్రతిహారతరమ్=ప్రతిహారతరమును, పరాఙ్ముఖమ్ = పరాఙ్ముఖమును, అవాఙ్ముఖమ్=అవాఙ్ముఖమును, లక్షాక్షవిషమౌ=లక్షాక్షమును, విషమమును, దృఢనాభసునాభకౌ=ధృఢనాభమును, సునాభమును, దశాక్షశతవక్త్రౌ చ=దశాక్షమును, శతవక్త్రమును, దశశీర్షశతోదరౌ=దశశీర్ష-శతోదరములను,

పద్మనాభమహానాభౌ=పద్మనాభమును, మహానాభమును, దున్దునాభసునాభకౌ=దుందునాభమును, సునాభమును, జ్యోతిషమ్=జ్యోతిషమును, కృశనం చైవ=కృశనమును, ఉభౌ=రెండు, నైరాశ్యవిమలౌ=నైరాశ్యవిమలములను, యోగంధరహరిద్రౌ చ=యోగంధరమును హరిద్రమును, దైత్యప్రశమనౌ=దైత్యమును, ప్రశమనమును, సార్చిర్మాలీ=సార్చిర్మాలి యనుదానిని, ధృతిః=ధృతిని, మాలీ=మాలిని, వృత్తిమాన్=వృత్తిమంతమును, తథా=మరియు, రుచిరః=రుచిర మనుదానిని, పిత్ర్యసౌమనసం చైవ=పిత్ర్యసౌమనసమును, ఉభౌ=రెండు, విధూతమకరౌ=విధూతమకరములను, కరవీరకరం చైవ=కరవీరకరమును, ధనధాన్యౌ=ధనధాన్యములను, కామరూపమ్=కామరూపమును, కామరుచిమ్=కామరుచిని, మోహమ్=మోహమును, తథా=మరియు, ఆవరణమ్=ఆవరణమును, జృమ్భకమ్=జృంభకమును, సర్వనాభం చ=సర్వనాభమును, తథా=మరియు, సన్తానవరణౌ=సంతానవరణములను, భాస్వరాన్=ప్రకాశించునట్టియు, కామరూపిణః=కామరూపము గల, భృశాశ్వతనయాన్=భృశాశ్వని కుమారులైన అస్త్రములను, మమ=నానుండి, ప్రతీచ్ఛ=గ్రహించుము. తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక. పాత్రభూతః=సత్పాత్రవుగా, అసి=అయి ఉన్నావు.

తా. రామా! భృశాశ్వని కుమారులును, ప్రకాశించునవియు, కామరూపము కలవియు అగు—సత్యవంతము, సత్యకీర్తి, ధృష్టము, రభసము, ప్రతిహారతరము, పరాఙ్ముఖము, అవాఙ్ముఖము, లక్షాక్షము, విషమము, దృఢనాభము, సునాభము, దశాక్షము, శతవక్త్రము, దశశీర్షము, శతోదరము, పద్మనాభము, మహానాభము, దుందునాభము, సునాభము, జ్యోతిషము, కృశనము, నైరాశ్యము, విమలము, యోగంధరము, హరిద్రము, దైత్యము, ప్రశమనము, సార్చిర్మాలి, ధృతి, మాలి, వృత్తిమంతము, రుచిరము. పిత్ర్య సౌమనసము, విధూతము, మకరము, కరవీరకరము, ధనము, ధాన్యము, కామరూపము, కామరుచి, మోహము, ఆవరణము, జృంభకము, సర్వనాభము, సంతానము, వరణము, అను అస్త్రములను నా వద్ద నుండి స్వీకరించుము. నీకు క్షేమ మగునుగాక, నీవు సత్పాత్ర మైనవాడవు.

మూ. బాఢమిత్యేవ కాకుత్స్థః ప్రహృష్టేనాన్తరాత్మనా,
దివ్యభాస్వరదేహాశ్చ మూర్తిమన్తః సుఖప్రదాః. 11

మూ. కేచిదఙ్గారసదృశాః కేచిద్ధూమోపమా స్తథా,
చన్ద్రార్కసదృశాః కేచి త్ప్రహ్వాఞ్జలిపుటా స్తథా. 12

రామం ప్రాఞ్జలయో భూత్వాఽ బ్రువన్ మధురభాషిణః,
ఇమే స్మ నరశార్దూల శాధి కిం కరవామ తే. 13

ప్ర. అ. కాకుత్థ్సః = రాముడు, ప్రహృష్టేన = సంతసించిన, అన్త రాత్మనా = హృదయముతో, "బాఢమ్"=తప్పక (అట్లు చేసెదను)ఇత్యేవ = అని, పలికి, (ఆ అస్త్రములను గ్రహించెను). దివ్యభాస్వరదేహాః చ = దివ్యము లైన ప్రకాశించుచున్న దేహములు కలవారును, మూర్తిమన్తః = మూర్తిని ధరించిన వారును, సుఖప్రదాః = సుఖము నిచ్చువారును, కేచిత్ = కొందరు, అఙ్గార సదృశాః = బొగ్గు వలె నున్నవారును, తథా=మరియు, కేచిత్ = కొందరు, ధూమోపమాః = ధూమము వలె ఉన్నవారును, కేచిత్ = కొందరు, చన్ద్రార్క సదృశాః=చంద్రునితోడను సూర్యునితోడను సమానులును, తథా = మరియు, ప్రహ్వాఞ్జలిపుటాః=వంగిన దోసిళ్ల కలవారును అగు అస్త్రదేవతలు, ప్రాం జలయః భూత్వా = కట్టబడిన దోసిలికలవారయి, మధురభాషిణః=మధురముగా మాటలాడుచున్నవారై, రామమ్=రాముని గూర్చి, అబ్రువన్=పలికిరి. నర శార్దూల=ఓ నరశ్రేష్ఠుడా ! ఇమే స్మః=ఇదిగో, ఇచట నున్నాము. శాధి = ఆజ్ఞాపించుము. తే=నీకు, కిమ్ = ఏమి, కరవామ = చేయుదుము.

తా. రాముడు సంతసించిన హృదయముతో "అటులనే గ్రహించెదను" అని పలికి ఆ అస్త్రములను గ్రహించెను. ఆ అస్త్రదేవతలలో కొందరు ఎఱ్ఱగా కాలిన బొగ్గునిప్పుల వలె నుండిరి. కొందరు ధూమమువలెను, కొందరు చంద్ర సూర్యుల వలెను ఉండిరి. దివ్యము లైన ప్రకాశించుచున్న దేహములు దాల్చి సుఖమును కలిగించు ఆ అస్త్రదేవతలు, వినయముతో చేతులు కట్టి మధుర ముగా మాటలాడుచు రామునితో ఇట్లనిరి. "ఓ నరశ్రేష్ఠుడా ! ఇదిగో మే మిచట ఉన్నాము. ఏమి చేయవలెనో ఆజ్ఞాపింపుము"

మూ. మానసాః కార్యకాలేషు సాహాయ్యం మే కరిష్యథ,
గమ్యతామితి తానాహ యథేష్టం రఘునన్దనః. 14

ప్ర. అ. మానసాః = నా మనస్సులో నున్నవారలై, కార్యకాలేషు = కార్యసమయములయందు, మే=నాకు, సాహాయ్యమ్=సాహాయ్యమును, కరిష్యథ=చేయగలరు. యథేష్టమ్ = ఇష్టము వచ్చినట్లుగా, గమ్యతామ్=వెళ్లుడు, ఇతి = అని, రఘునన్దనః = రాముడు, తాన్ = ఆ అస్త్రదేవతలను గూర్చి, ఆహ= పలికెను.

తా. "మీరు నా మనస్సులో మెదలుచు పనిపడునప్పుడు నాకు సాహాయ్యము చేయుడు. యథేష్టముగ వెళ్లుడు" అని రాముడు ఆ అస్త్రములతో పలికెను.

మూ. అథ తే రామమామన్త్ర్య కృత్వా చాపి ప్రదక్షిణమ్,
ఏవమస్త్వితి కాకుత్థ్సముక్త్వా జగ్ముర్యథాగతమ్. 15

ప్ర. అ. అథ = పిమ్మట, తే = ఆ దేవతలు, ఏవమ్ అస్తు=అటులనే అగుగాక, ఇతి=అని, కాకుత్థ్సమ్=రాముని గూర్చి, ఉక్త్వా=పలికి, ప్రదక్షిణమ్=ప్రదక్షిణ నమస్కారమును, కృత్వా = చేసి, రామమ్ = రాముని, ఆమన్త్ర్య = అడిగి, యథాగతమ్=వచ్చినట్లుగనే, జగ్ముః=వెళ్లిరి.

తా. ఆ దేవతలు—"అటులనే చేసెదము" అని పలికి, రామునికి ప్రదక్షిణనమస్కారము చేసి, సెలవు గైకొని, వచ్చినట్లుగనే వెళ్లిపోయిరి. 15

మూ. స చ తాన్ రాఘవో జ్ఞాత్వా విశ్వామిత్రం మహామునిమ్,
గచ్ఛన్నేవాథ మధురం శ్లక్ష్ణం వచనమబ్రవీత్. 16

ప్ర. అ. సః రాఘవః=ఆ రాముడు, తాన్=ఆ ఉపసంహారమంత్రములను, జ్ఞాత్వా=తెలిసికొని, అథ=పిమ్మట, గచ్ఛన్నేవ=నడచుచునే, విశ్వామిత్రం మహామునిమ్ = విశ్వామిత్రమహర్షిని గూర్చి, మధురమ్ = మధురము, శ్లక్ష్ణమ్=మృదువు అయిన, వచనమ్=వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు ఉపసంహారమంత్రములను తెలిసికొని, నడచుచునే, విశ్వామిత్రమహర్షితో మధురము, మృదువు అయిన వచనమును పలికెను. 16

మూ. కిం న్వేతన్మేఘసంకాశం పర్వతస్యావిదూరతః,
వృక్షషణ్డమితో భాతి పరం కౌతూహలం హి మే. 17

దర్శనీయం మృగాకీర్ణం మనో రమయతీవ చ,
నానాప్రకారైః శకునైర్వల్గునాదైరలఙ్కృతమ్. 18

ప్ర. అ. ఇతః=ఇటువైపు, పర్వతస్య = పర్వతమునకు, అవిదూరతః = సమీపమున,- మేఘసఙ్కాశమ్=మేఘముతో సమానమైనదియు, దర్శనీయమ్= అందమైనదియు, మృగాకీర్ణమ్=మృగములచే వ్యాప్తమైనదియు, అతీవ= మిక్కిలి, మనోరమమ్ = మనస్సుకు ఆనందము కలిగించునదియు, వల్గునాదైః=మనోహరమైన ధ్వని గల, నానాప్రకారైః = అనేక విధములైన, శకునైః=పక్షులచేత, అలఙ్కృతమ్ = అలంకరించబడినదియు అగు, వృక్షషణ్డమ్=వృక్షసముదాయము, భాతి=ప్రకాశించుచున్నది. ఏతత్=ఇది, కింను=ఏమి ? మే=నాకు, పరమ్=గొప్ప, కౌతూహలం హి=వేడుక ఉన్నది కదా ?

తా. ఇటు వైపు, పర్వతమునకు కొంచెము దూరమున ఒక వృక్షముల గుంపు మేఘమువలె చూడ ముచ్చటగా నున్నది. ఇది మృగములతో నిండి యున్నది. చాల మనోరంజకముగ నున్నది. మధురనాదములు గల నానా విధపక్షులు ఇందు సంచరించుచున్నవి. ఇది ఏమి ? నాకు వినుటకు చాల కుతూహలముగ నున్నది. 17, 18

మూ. నిస్సృతాః స్మ మునిశ్రేష్ఠ కాన్తారాద్రోమహర్షణాత్,
అనయా త్వవగచ్ఛామి దేశస్య సుఖవత్తయా, 19
సర్వం మే శంస భగవన్ కస్యాశ్రమపదం త్విదమ్.

ప్ర. అ. మునిశ్రేష్ఠ = ఓ మునిశ్రేష్ఠుడా, అనయా = ఈ, దేశస్య = దేశముయొక్క, సుఖవత్తయా=సుఖవంతముగా ఉండుటచేత, రోమహర్షణాత్= గగుర్పాటు కలిగించు, కాన్తారాత్ = అడవినుండి, నిస్సృతాః=బైటకు వచ్చినాము అని, అవగచ్ఛామి=తెలిసికొనుచున్నాను. ఇదమ్=ఇది, కస్య=ఎవనియొక్క, ఆశ్రమపదమ్=ఆశ్రమము ? భగవన్=పూజ్యుడా, సర్వమ్=సమస్తమును, మే= నాకు, శంస=చెప్పుము.

తా. ఓ మునిసత్తమా ! ఈ ప్రదేశము సుఖకరముగా నుండుటచే

భయంకర మైన ఆ అరణ్యమునుండి బైటకు వచ్చినా మని అనుకొనుచున్నాను. ఈ ఆశ్రమ మెవరిది ? ఓ పూజ్యుడా ! అంతయు నాకు తెలుపుము.

మూ. సంప్రాప్తా యత్ర తే పాపా బ్రహ్మఘ్నా దుష్టచారిణః, 20
తవ యజ్ఞస్య విఘ్నాయ దురాత్మానో మహామునే.
భగవన్ తస్య కో దేశః సా యత్ర తవ యాజ్ఞికీ, 21
రక్షితవ్యా క్రియా బ్రహ్మన్మయా వధ్యాశ్చ రాక్షసాః,
ఏతత్సర్వం మునిశ్రేష్ఠ శ్రోతుమిచ్ఛామ్యహం ప్రభో. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
అష్టావింశః సర్గః.

ప్ర. అ. మహామునే=ఓ మహామునీ, భగవన్=ఓ పూజ్యుడా ! బ్రహ్మన్=ఓ బ్రాహ్మణోత్తమా ! బ్రహ్మఘ్నాః=బ్రహ్మహత్య చేయువారును, దుష్టచారిణః=దుర్మార్గులును, దురాత్మానః=దుష్టస్వభావులును అగు, తే పాపాః= ఆ పాపాత్ములు, యత్ర=ఎచటికి, తవ=నీయొక్క, యజ్ఞస్య=యజ్ఞము యొక్క, విఘ్నాయ=విఘ్నముకొరకు, సంప్రాప్తాః=వచ్చినారో, తవ=నీ యొక్క, యాజ్ఞికీ=యజ్ఞసంబంధ మైన, క్రియా = క్రియ, మయా = నాచేత, రక్షితవ్యా=రక్షింపదగియున్నదో, రాక్షసాః చ = రాక్షసులు కూడ, వధ్యాః = చంపదగి యున్నారో, తస్య దేశః = ఆ యజ్ఞముయొక్క ప్రదేశము, కః=ఏది? మునిశ్రేష్ఠ = ఓ మునిశ్రేష్ఠుడా ! ప్రభో = ఓ సర్వసమర్థుడా ! అహమ్ = నేను, ఏతత్సర్వమ్ = ఇది అంతయు, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి=కోరు చున్నాను.

తా. పూజ్యుడ వైన ఓ మహామునీ ! బ్రహ్మహత్య చేయువారును, దుర్మార్గులును, దుష్టస్వభావులును అగు ఆ పాపాత్ములు ఎక్కడకు వచ్చి నీ యజ్ఞమునకు విఘ్నము చేయుచుందురు ? నేను నీ యాగమును సంరక్షింప వలసిన ప్రదేశ మేది ? నేను రాక్షసుల నెక్కడ చంపవలసి యున్నది ? సర్వసమర్థుడ వగు ఓ మునిశ్రేష్ఠా ! ఇది యంతయు వినవలె నని కోరుచున్నాను. 20, 21, 22

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
ఇరువదియెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనత్రింశః సర్గః

మూ. అథ తస్యాప్రమేయస్య తద్వనం పరిపృచ్ఛతః,
విశ్వామిత్రో మహాతేజా వ్యాఖ్యాతుముపచక్రమే. 1

ప్ర. అ. అథ = పిమ్మట, తత్ = ఆ, వనమ్ = వనమును గూర్చి, పరిపృచ్ఛతః=ప్రశ్నించుచున్న, అప్రమేయస్య = అప్రమేయ ప్రభావుడైన, తస్య= ఆ రామునకు, మహాతేజాః = గొప్పతేజస్సుగల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వ్యాఖ్యాతుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. ఆ వనమును గూర్చి, అప్రమేయప్రభావు డగు రాముడు ప్రశ్నింపగా, మహాతేజఃశాలి యగు విశ్వామిత్రుడు చెప్పుట కుపక్రమించెను. 1

మూ. ఇహ రామ మహాబాహో విష్ణుర్దేవవరః ప్రభుః,
వర్షాణి సుబహూనీహ తథా యుగశతాని చ, 2
తపశ్చరణయోగార్థమువాస సుమహాతపాః.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల, రామ = ఓ రామా, ఇహ = ఇచట, దేవవరః = దేవతలలో శ్రేష్ఠుడును, ప్రభుః = సర్వసమర్థుడును, సుమహాతపాః = గొప్ప తపస్సు గలవాడును అగు, విష్ణుః = విష్ణువు, సుబహూని = అనేకమైన, వర్షాణి = సంవత్సరములను, యుగశతాని చ = వందలకొలది యుగములను, తపశ్చరణయోగార్థమ్ = తపస్సు చేయుటకై, ఉవాస = నివసించెను.

తా. మహాబాహువులు గల ఓరామాః దేవతాశ్రేష్ఠుడును, సర్వశక్తుడును అగు విష్ణువు, చాల సంవత్సరముల పాటు, వందలకొలది యుగముల పాటు, మహాతపస్సు చేయుచు ఈ వనములో నివసించెను. 2

మూ. ఏష పూర్వాశ్రమో రామ వామనస్య మహాత్మనః, 3
సిద్ధాశ్రమ ఇతి ఖ్యాతః సిద్ధో హ్యత్ర మహాతపాః.

ప్ర. అ. రామ = రామా, ఏషః = ఇది, మహాత్మనః = మహాత్ముడైన, వామనస్య = వామనునియొక్క, పూర్వాశ్రమః = పూర్వాశ్రమము, సిద్ధాశ్రమః ఇతి=సిద్ధాశ్రమము అని, ఖ్యాతః=ప్రసిద్ధ మైనది. హి=ఏలననగా, మహాతపాః= గొప్ప తపస్సు గల కాశ్యపుడు, అత్ర=ఇచట, సిద్ధః = తపస్సిద్ధిని పొందెను.

తా. రామా! ఇది వామనావతారమునకు పూర్వము వామనుడు (విష్ణువు) నివసించిన ఆశ్రమము. ఇచట కాశ్యపుడు తపస్సిద్ధి పొందుటచే దీనికి సిద్ధాశ్రమ మని పేరు.

మూ. ఏతస్మిన్నేవ కాలే తు రాజా వైరోచనిర్బలిః, 4
నిర్జిత్య దైవతగణాన్ సేన్ద్రాంశ్చ సమరుద్గణాన్,
కారయామాస తద్రాజ్యం త్రిషు లోకేషు విశ్రుతః. 5

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, కాలే ఏవ = కాలమునందే, వైరోచనిః=విరోచనునికుమారుడైన, రాజా = రాజైన, బలిః = బలి, సేన్ద్రాన్=ఇంద్రునితో కూడిన, సమరుద్గణాన్=మరుత్తుల గణములతో కూడిన, దైవతగణాన్=దేవతా సముదాయములను, నిర్జిత్య = జయించి, త్రిషు = మూడు, లోకేషు=లోకముల యందు, విశ్రుతః=ప్రసిద్ధుడై, తత్=ఆ, రాజ్యమ్=రాజ్యమును, కారయామాస= చేసెను.

తా. విష్ణువు ఈ ఆశ్రమములో తపస్సు చేయుచున్న కాలమున, విరోచనుని కుమారుడైన బలిచక్రవర్తి ఇంద్ర-మరుద్గణాదిసహితముగా దేవతలను జయించి, మూడు లోకములలో ప్రసిద్ధుడై, రాజ్య మేలెను. 4, 5

మూ. బలేస్తు యజమానస్య దేవాః సాగ్నిపురోగమాః,
సమాగమ్య స్వయం చైవ విష్ణుమూచురిహాశ్రమే. 6

ప్ర. అ. బలేః=బలిచక్రవర్తి, యజమానస్య=యాగము చేయుచుండగా, సాగ్నిపురోగమాః = అగ్నిదేవుడు ముందు గల, దేవాః=దేవతలు, ఇహ=ఈ, ఆశ్రమే = ఆశ్రమమునందు, విష్ణుమ్=విష్ణువును, స్వయమ్=స్వయముగ, సమాగమ్య=సమీపించి, ఊచుః=పలికిరి.

తా. బలిచక్రవర్తి యాగము చేయుచుండగా అగ్ని మొదలైన దేవతలు ఈ ఆశ్రమములో నున్న విష్ణువును సమీపించి ఇట్లు పలికిరి. 6

మూ. బలిర్వైరోచనిర్విష్ణో యజతే యజ్ఞముత్తమమ్,
అసమాప్తే క్రతౌ తస్మిన్స్వకార్యమభిపద్యతామ్. 7

ప్ర. అ. విష్ణో=ఓ విష్ణూ, వైరోచనిః = విరోచని కుమారు డైన, బలిః = బలిచక్రవర్తి, ఉత్తమమ్ = గొప్ప, యజ్ఞమ్ = యజ్ఞమును, యజతే = చేయుచున్నాడు. తస్మిన్ = ఆ, క్రతౌ = యజ్ఞము, అసమాప్తే = సమాప్తము కాకుండగనే, స్వకార్యమ్=స్వకార్యము, అభిపద్యతామ్ = సంపాదింపబడుగాక.

తా. ఓవిష్ణూ, విరోచనుని పుత్రు డైన బలి గొప్ప యజ్ఞము చేయుచున్నాడు. ఆ యజ్ఞము పూర్తి కాక మునుపే స్వకార్యమును, అనగా నీవార మగు మా కార్యమును, సంపాదింపుము. 7

మూ. యే చైనమభివాఞ్ఛన్తి యాచితార ఇతస్తతః,
యచ్చ యత్ర యథావచ్చ సర్వం తేభ్యః ప్రయచ్ఛతి. 8

ప్ర. అ. యే = ఏ, యాచితారః = యాచకులు, ఇతస్తతః=ఇటునుంచి అటునుంచి, ఏనమ్ = ఈతనిని, అభివాఞ్ఛన్తి = కోరుచున్నారో, యచ్చ = ఏది, యత్ర = ఎచట, యథావచ్చ=ఏ విధముగ ఉన్నదో, సర్వమ్=దాని నంతను, తేభ్యః = వారలకు, ప్రయచ్ఛతి = ఇచ్చుచున్నాడు.

తా. నలుమూలలనుండి వచ్చిన యాచకులు, ఇతనిని యాచించినచో, ఏది ఎచట, ఏ విధముగ నున్నదో దాని నంతను అచట ఆ విధముగనే ఇచ్చివేయుచున్నాడు. 8

మూ. స త్వం సురహితార్థాయ మాయాయోగముపాగతః,
వామనత్వం గతో విష్ణో కురు కల్యాణముత్తమమ్. 9

ప్ర. అ. విష్ణో = ఓ విష్ణూ, సః త్వమ్ = అట్టి నీవు, సురహితార్థాయ= దేవతల హితముకొరకై, మాయాయోగమ్=మాయాసంబంధమును, ఉపాగతః=

పొందినవాడవై, వామనత్వమ్=వామనత్వమును, గతః=పొందినవాడవై, ఉత్తమమ్ = ఉత్తమ మైన, కల్యాణమ్=కల్యాణమును, కురు = చేయుము.

తా. ఓ విష్ణూ! నీవు దేవతల హితముకొరకై మాయచే వామనరూపము దాల్చి, ఉత్తమ మైన కల్యాణకరకార్యమును చేయుము. 9

మూ. ఏతస్మిన్నన్తరే రామ కాశ్యపోఽగ్నిసమప్రభః,
అదిత్యా సహితో రామ దీప్యమాన ఇవౌజసా. 10

దేవీసహాయో భగవాన్ దివ్యం వర్షసహస్రకమ్,
వ్రతం సమాప్య వరదం తుష్టావ మధుసూదనమ్. 11

ప్ర. అ. రామ=రామా! ఏతస్మిన్ అన్తరే=ఈ మధ్య, అగ్నిసమప్రభః=అగ్నితో సమాన మైన కాంతి గలవాడును, అదిత్యా=అదితితో, సహితః=కూడినవాడును, ఓజసా=కాంతిచేత, దీప్యమానః ఇవ = మండుచున్నవాడువలె ఉన్నవాడును, భగవాన్ = భగవంతుడును అగు, కాశ్యపః = కాశ్యపుడు, అదిత్యా=అదితితో, సహితః=కూడినవాడై, దివ్యం వర్షసహస్రకమ్ = వేయి దేవతా సంవత్సరములు, వ్రతమ్ = వ్రతమును, సమాప్య = పూర్తిచేసికొని, వరదమ్ = వరములనిచ్చు, మధుసూదనమ్=విష్ణువును, తుష్టావ=స్తుతించెను.

తా. రామా! ఇంతలో, అగ్నితో సమాన మైన కాంతికలవాడు, అదితితో కూడినవాడు, తేజస్సుతో దేదీప్యమానుడు, మాహాత్మ్యము కలవాడును అయిన కాశ్యపుడు వేయి దివ్యవర్షములు చేసిన వ్రతమును భార్యాసాహాయ్యముతో పూర్తి చేసికొని, వరదు డైన మహావిష్ణువును స్తుతించెను. 10, 11

మూ. తపోమయం తపోరాశిం తపోమూర్తిం తపాత్మకమ్,
తపసా త్వాం సుతప్తేన పశ్యామి పురుషోత్తమమ్. 12

ప్ర. అ. తపోమయమ్ = అత్యధిక మగు తపస్సు కలవాడవు, తపోరాశిమ్=తపస్సుయొక్క రాశివి, తపోమూర్తిమ్ = తపస్సే మూర్తిగా కలవాడవు, తపాత్మకమ్ = తపఃస్వరూపుడవు, పురుషోత్తమమ్ = పురుషశ్రేష్ఠుడవు అయిన, త్వామ్ = నిన్ను, సుతప్తేన = బాగుగా చేయబడిన, తపసా = తపస్సుచేత, పశ్యామి=చూచుచున్నాను.

తా. ఓ పురుషోత్తమా! నీవు తపోమయుడవు. తపస్సుయొక్క రాశివి. తపస్సు నీ మూర్తి. నీవు తపః స్వరూపుడవు. అట్టి నిన్ను బాగుగ తపస్సు చేసి నేడు నేను చూడగలుగుచున్నాను. 12

వి. 'తపః' శబ్దమునకు జ్ఞాన మని అర్థము గ్రహించి విష్ణువు జ్ఞానమయుడు, జ్ఞానరాశి, జ్ఞానమూర్తి, జ్ఞానస్వరూపుడు అని కొందరు అర్థము చెప్పిరి.

మూ. శరీరే తవ పశ్యామి జగత్సర్వమిదం ప్రభో,
త్వమనాదిరనిర్దేశ్యస్త్వామహం శరణం గతః. 13

ప్ర. అ. ప్రభో=ఓ ప్రభూ! తవ = నీయొక్క, శరీరే = శరీరమునందు, ఇదమ్ = ఈ, సర్వం జగత్ = సకలజగత్తును, పశ్యామి = చూచుచున్నాను. త్వమ్ = నీవు, అనాదిః = ఆదిలేనివాడవు; అనిర్దేశ్యః = వర్ణింపశక్యముకానివాడవు. అహమ్ = నేను, త్వామ్ = నిన్ను, శరణం గతః = శరణు పొందినాను.

తా. ఓ ప్రభూ, ఈ ప్రపంచము నంతను నీ శరీరములో చూచుచున్నాను. నీకు ఆది లేదు. నీ విట్టివాడ వని వర్ణింప శక్యము కాదు. నిన్ను నేను శరణు జొచ్చుచున్నాను. 13

మూ. తమువాచ హరిః ప్రీతః కాశ్యపం ధూతకల్మషమ్,
వరం వరయ భద్రం తే వరార్హోఽసి మతో మమ. 14

ప్ర. అ. హరిః = విష్ణువు, ప్రీతః=సంతసించినవాడై, ధూతకల్మషమ్= తొలగింపబడిన పాపములు గల, తమ్ = ఆ, కాశ్యపమ్ = కాశ్యపుని గూర్చి, ఉవాచ = పలికెను. వరమ్ = వరమును, వరయ = కోరుము, తే = నీకు, భద్రమ్ = క్షేమము అగుగాక. వరార్హః = వరమునకు తగినవాడవుగా, మమ = నాకు, మతః = ఇష్టుడవు, అసి = అయి ఉన్నావు.

తా. విష్ణువు సంతోషించి ఎట్టి పాపములును లేని ఆ కాశ్యపునితో ఇట్లనెను. వరమును కోరుకొనుము. నీకు క్షేమ మగుగాక. నీవు వరము నీయదగిన వాడవని నేను నమ్ముచున్నాను. 14

మూ. తచ్ఛ్రుత్వా వచనం తస్య మారీచః కాశ్యపోఽబ్రవీత్,
అదిత్యా దేవతానాం చ మమ చైవానుయాచతః, 15
వరం వరద సుప్రీతో దాతుమర్హసి సువ్రత.

ప్ర. అ. తస్య = విష్ణువుయొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, మారీచః = మరీచుని కుమారుడైన, కాశ్యపః = కాశ్యపుడు, అబ్రవీత్=పలికెను. వరద=వరములనిచ్చువాడా, సువ్రత = మంచి వ్రతము కలవాడా, అదిత్యాః = అదితికిని, దేవతానాం చ = దేవతలకును, అనుయాచతః = వారందరిని అనుసరించి యాచించుచున్న, మమ చ = నాకును, సుప్రీతః = బాగుగ అనుగ్రహించినవాడవై, వరమ్ = వరమును, దాతుమ్= ఇచ్చుటకు, అర్హసి=తగియున్నావు.

తా. మరీచుని కుమారుడైన కాశ్యపుడు విష్ణువు మాటలు విని ఇట్లు పలికెను. ఓ వరదుడా, మంచి వ్రతము కలవాడా, నీవు అనుగ్రహించి, అదితికిని, దేవతలకును, వారితో పాటు నిన్ను ప్రార్థించుచున్న నాకును వరము నిమ్ము. 15

మూ. పుత్రత్వం గచ్ఛ భగవన్నదిత్యా మమ చానఘ. 16
భ్రాతా భవ యవీయాంస్త్వం శక్రస్యాసురసూదన,
శోకార్తానాం తు దేవానాం సాహాయ్యం కర్తుమర్హసి. 17

ప్ర. అ. భగవన్=భగవంతుడా, అనఘ = దోషములు లేనివాడా, అదిత్యాః = అదితికిని, మమ చ=నాకును, పుత్రత్వమ్ = పుత్రత్వమును, గచ్ఛ= పొందుము. అసురసూదన=అసురసంహారము చేయువాడా, త్వమ్ = నీవు, శక్రస్య=దేవేంద్రునకు, యవీయాన్=చిన్నవాడైన, భ్రాతా=సోదరుడవుగా, భవ=అగుము. శోకార్తానామ్ = శోకముచే ఆర్తులైన, దేవానామ్=దేవతలకు, సాహాయ్యమ్=సాహాయ్యమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగి యున్నావు.

తా. ఓ భగవంతుడా, దోషరహితుడా, అదితికిని, నాకును పుత్రుడవగుము. ఓ శత్రుసూదనా, దేవేంద్రునకు తమ్ముడవగుము. శోకపీడితులైన దేవతలకు సాహాయ్యము చేయుము. 16, 17

మూ. అయం సిద్ధాశ్రమో నామ ప్రసాదాత్తే భవిష్యతి,
సిద్ధే కర్మణి దేవేశ ఉత్తిష్ఠ భగవన్నితః. 18

ప్ర. అ. దేవేశ=ఓదేవతాప్రభూ, కర్మణి = నా తపస్సు, సిద్ధే = సఫలమైన దగుచుండగా, అయమ్ = ఇది, తే = నీయొక్క, ప్రసాదాత్=అనుగ్రహమువలన, సిద్ధాశ్రమో నామ=సిద్ధాశ్రమ మను పేరు గలది, భవిష్యతి= కాగలదు. భగవన్=ఓ భగవంతుడా, ఇతః = ఇచటినుండి, ఉత్తిష్ఠ=లెమ్ము.

తా. నీవు నాకు పుత్రుడవుగ జనించుటచే నా తపస్సు సఫలము కాగానే ఇది నీ అనుగ్రహమువలన సిద్ధాశ్రమ మను పేరు గలది కాగలదు. భగవంతుడా! ఇచటినుండి లెమ్ము. నా పుత్రుడవు అగుము. 18

మూ. అథ విష్ణుర్మహాతేజా అదిత్యాం సమజాయత,
వామనం రూపమాస్థాయ వైరోచనిముపాగమత్. 19

ప్ర. అ. అథ = పిమ్మట, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, విష్ణుః= విష్ణువు, అదిత్యామ్ = అదితియందు, సమజాయత = పుట్టెను. వామనం రూపమ్=వామనరూపమును, ఆస్థాయ=ధరించి, వైరోచనిమ్=బలిచక్రవర్తిని, ఉపాగమత్=సమీపించెను.

తా. అంత విష్ణువు అదితిపుత్రుడుగ జనించి, వామనరూపము ధరించి, బలిచక్రవర్తివద్దకు వెళ్లెను. 19

మూ. త్రీన్ క్రమానథ భిక్షిత్వా ప్రతిగృహ్య చ మానదః,
ఆక్రమ్య లోకాన్ లోకాత్మా సర్వభూతహితే రతః. 20

మహేన్ద్రాయ పునః ప్రాదాన్నియమ్య బలిమోజసా,
త్రైలోక్యం స మహాతేజాశ్చక్రే శక్రవశం పునః. 21

ప్ర. అ. అథ = పిమ్మట, మానదః=మానమును ఇచ్చువాడును, లేదా అభిమానమును తొలగించువాడును, లోకాత్మా = లోకస్వరూపుడును, సర్వభూతహితే=సమస్తభూతముల హితమునందు, రతః = ఆసక్తి కలవాడును

అగు విష్ణువు, త్రీన్=మూడు, క్రమాన్=అడుగులను, భిక్షిత్వా=యాచించి, ప్రతిగృహ్య చ=స్వీకరించి, లోకాన్ = లోకములను, ఆక్రమ్య = ఆక్రమించి, బలిమ్ = బలిని, ఓజసా = తేజస్సుచేత, నియమ్య = బంధించి, మహేన్ద్రాయ= మహేంద్రునకు, పునః=మరల, ప్రాదాత్ = ఇచ్చెను. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః=ఆ విష్ణువు, త్రైలోక్యమ్ = మూడు లోకములను, పునః= మరల, శక్రవశమ్ = ఇంద్రునికి వశ మైనదానినిగా, చక్రే = చేసెను.

తా. గౌరవమును ఇచ్చువాడును, లేదా అభిమానమును తొలగించు వాడును, సర్వలోకస్వరూపుడును, సర్వభూతములకును హితమును చేయుట యందు ఆసక్తి కలవాడును అగు ఆ విష్ణువు, మూడు అడుగులు యాచించి, వాటిని ప్రతిగ్రహించి, మూడు లోకములను ఆక్రమించి, పరాక్రమముచే బలిని బంధించి, మరల మహేంద్రునకు ఇచ్చెను. ఈ విధముగ మహాతేజఃశాలి యగు ఆ విష్ణువు, త్రైలోక్యమును మరల దేవేంద్రుని వశ మగు నట్లు చేసెను. 20, 21

మూ. తేనైష పూర్వమాక్రాన్త ఆశ్రమః శ్రమనాశనః,
మయాపి భక్త్యా తస్యైష వామనస్యోపభుజ్యతే. 22

ప్ర. అ. శ్రమనాశనః=శ్రమను తొలగించు, ఏషః = ఈ, ఆశ్రమః = ఆశ్రమము, తేన = ఆ వామనునిచేత, పూర్వమ్ = పూర్వము, ఆక్రాన్తః = అధిష్ఠింప బడినది. తస్య = ఆ, వామనస్య = వామనుని యొక్క, భక్త్యా = భక్తి చేత, మయాపి = నాచేత కూడ, ఏషః = ఈ ఆశ్రమము, ఉపభుజ్యతే = అనుభవింపబడు చున్నది.

తా. పూర్వము వామనుడు శ్రమను తొలగించు ఈ ఆశ్రమములో ఉండెడి వాడు. వామనునిపై నున్న భక్తిచేత నేను కూడ ఈ ఆశ్రమములో నివసించు చున్నాను. 22

మూ. ఏతమాశ్రమమాయాన్తి రాక్షసా విఘ్నకారిణః,
అత్రైవ పురుషవ్యాఘ్ర హన్తవ్యా దుష్టచారిణః. 23

ప్ర. అ. పురుషవ్యాఘ్ర=ఓపురుషశ్రేష్ఠుడా, విఘ్నకారిణః=విఘ్నములు చేయు, రాక్షసాః = రాక్షసులు, ఏతమ్=ఈ, ఆశ్రమమ్=ఆశ్రమమును గూర్చి,

ఆయాన్తి=వచ్చుచున్నారు. దుష్టచారిణః = ఆ దుర్మార్గులు, అత్రైవ=ఇచటనే, హన్తవ్యాః=చంపవగినవారు.

తా. ఓ పురుషశ్రేష్ఠుడా ! యజ్ఞమునకు విఘ్నము చేయు రాక్షసులు ఈ ఆశ్రమమునకే వచ్చుచున్నారు. వారిని ఇక్కడనే చంపవలసి యున్నది.

మూ. అద్య గచ్ఛామహే రామ సిద్ధాశ్రమమనుత్తమమ్,
తదాశ్రమపదం తాత తవాప్యేతద్యథా మమ. 24

ప్ర. అ. రామ=రామా ! అద్య = ఇపుడు, అనుత్తమమ్ = అత్యుత్తమ మైన, సిద్ధాశ్రమమ్=సిద్ధాశ్రమమును గూర్చి, గచ్ఛామహే = వెళ్లదము. తాత= నాయనా ! తత్ = ఆ, ఏతత్ = ఈ, ఆశ్రమపదమ్ = ఆశ్రమము, మమ = నాకు, యథా = ఎట్లో, తవాపి = నీకును, తథా = అట్లే.

తా. రామా ! ఇపుడు ఆ అత్యుత్తమ మైన సిద్ధాశ్రమములో ప్రవేశించెదము. నాయనా ! ఈ ఆశ్రమము నాకెట్లో నీకును అట్లే.

వి. ఇపుడు నేనిచట నుండి తపస్సు చేయుటచే ఇది నాకు సొంత మైనది. వామనావతారమునకు పూర్వము నీవు కూడ తపస్సు చేసిన ఆశ్రమమే కాన ఇది నీకును సొంతమే అని భావము (తిలకవ్యాఖ్య). 24

మూ. ప్రవిశన్నాశ్రమపదం వ్యరోచత మహామునిః,
శశీవ గతనీహారః పునర్వసుసమన్వితః. 25

ప్ర. అ. ఆశ్రమపదమ్ = ఆశ్రమమును, ప్రవిశన్ = ప్రవేశించుచున్న, మహామునిః = మహాముని, గతనీహారః=మంచు తొలగిపోయిన, పునర్వసు సమన్వితః = పునర్వసునక్షత్రములతో కూడిన, శశీవ = చంద్రుడు వలె, వ్యరోచత = ప్రకాశించెను.

తా. రామలక్ష్మణులతో ఆశ్రమములోనికి ప్రవేశించుచున్న విశ్వామిత్ర మహాముని, మంచు తొలగి పునర్వసు నక్షత్రములతో కూడిన చంద్రుడు వలె ప్రకాశించెను. 25

మూ. తం దృష్ట్వా మునయః సర్వే సిద్ధాశ్రమనివాసినః,
ఉత్పత్యోత్పత్య సహసా విశ్వామిత్రమపూజయన్. 26

ప్ర. అ. సిద్ధాశ్రమనివాసినః = సిద్ధాశ్రమమునందు నివసించుచున్న, మునయః=మునులు, సర్వే = అందరును, తమ్=ఆతనిని, దృష్ట్వా = చూచి, ఉత్పత్య ఉత్పత్య=ఎగిరి ఎగిరి, సహసా = శీఘ్రముగా, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని, అపూజయన్=పూజించిరి.

తా. సిద్ధాశ్రమములో నివసించు ముని లందరును విశ్వామిత్రుని చూచి, తొందరగా పరుగెత్తి వెళ్లి ఆతనిని పూజించిరి. 26

మూ. యథార్హం చక్రిరే పూజాం విశ్వామిత్రాయ ధీమతే,
తథైవ రాజపుత్రాభ్యామకుర్వన్నతిథిక్రియామ్. 27

ప్ర. అ. ధీమతే = బుద్ధిమంతుడైన, విశ్వామిత్రాయ = విశ్వామిత్రునకు, యథార్హమ్ = తగు విధముగా, పూజామ్ = పూజను, చక్రిరే=చేసిరి. తథైవ= అట్లే, రాజపుత్రాభ్యామ్=రాజపుత్రులకు, అతిథిక్రియామ్=అతిథిసత్కారమును, అకుర్వన్=చేసిరి.

తా. ధీమంతు డగు విశ్వామిత్రునకు తగు విధముగ పూజ చేసిరి. అట్లే రాజపుత్రులకు కూడ అతిథిపూజ చేసిరి. 27

మూ. ముహూర్తమథ విశ్రాన్తౌ రాజపుత్రావరిన్దమౌ,
ప్రాఞ్జలీ మునిశార్దూలమూచతూ రఘునన్దనౌ. 28

ప్ర. అ. అథ = పిమ్మట, అరిన్దమౌ = శత్రువులను పీడించువారును, రాజపుత్రౌ = దశరథమహారాజపుత్రులును అగు, రఘునన్దనౌ = రామలక్ష్మణులు, ముహూర్తమ్=క్షణకాలముపాటు, విశ్రాన్తౌ=విశ్రమించినవారై, ప్రాఞ్జలీ = కట్టబడిన దోసిళ్లు కలవారై, మునిశార్దూలమ్=మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రునిగూర్చి, ఊచతుః=పలికిరి.

తా. పిమ్మట, శత్రుసంహారకులైన రామలక్ష్మణులు క్షణకాలము విశ్రాంతి తీసికొని విశ్వామిత్రునకు నమస్కరించి ఇట్లు పలికిరి. 28

మూ. అద్యైవ దీక్షాం ప్రవిశ భద్రం తే మునిపుఙ్గవ,
సిద్ధాశ్రమోఽయం సిద్ధః స్యాత్సత్యమస్తు వచస్తవ. 29

ప్ర. అ. మునిపుఙ్గవ = ఓ మునిశ్రేష్ఠా, అద్యైవ=ఈ నాడే, దీక్షామ్= దీక్షను, ప్రవిశ=ప్రవేశించుము. తే=నీకు, భద్రమ్ = క్షేమమగుగాక. అయమ్= ఈ, సిద్ధాశ్రమః=సిద్ధాశ్రమము, సిద్ధః = సిద్ధికలది, స్యాత్=అగుగాక. తవ = నీయొక్క, వచః = వాక్యము, సత్యమ్ అస్తు = సత్య మగుగాక.

తా. ఓః మునిశ్రేష్ఠాః ఈ రోజుననే యజ్ఞదీక్షలో ప్రవేశింపుము. నీకు క్షేమ మగుగాక. ఈ సిద్ధాశ్రమము సిద్ధిప్రదమై సార్థకనామధేయ మగుగాక. నీ వచనము సత్య మగుగాక. 29

మూ. ఏవముక్తో మహాతేజా విశ్వామిత్రో మహాన్ ఋషిః,
ప్రవివేశ తదా దీక్షాం నియతో నియతేన్ద్రియః. 30

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః = పలకబడిన, మహాతేజాః = గొప్పతేజస్సుగల. విశ్వామిత్రః మహాన్ ఋషిః = విశ్వామిత్రమహర్షి, తదా = అప్పుడు, నియతః = నియమము అవలంబించినవాడై, నియతేన్ద్రియః = నిగ్రహింపబడిన ఇంద్రియములు కలవాడై, దీక్షామ్ = దీక్షను, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. మహాతేజఃశాలి యైన విశ్వామిత్రమహర్షి వారి వాక్యము విని, నియమము నవలంబించి, ఇంద్రియములను నిగ్రహించి యజ్ఞదీక్షలో ప్రవేశించెను. 30

మూ. కుమారావపి తాం రాత్రిముషిత్వా సుసమాహితౌ,
ప్రభాతకాలే చోత్థాయ పూర్వాం సన్ధ్యాముపాస్య చ, . 31
స్పృష్టోదకౌ శుచీ జప్యం సమాప్య నియమేన చ.
హుతాగ్నిహోత్ర మాసీనం విశ్వామిత్ర మవన్దతామ్. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే,
ఏకోనత్రింశః సర్గః.

ప్ర. అ. కుమారౌ అపి=రామలక్ష్మణులు కూడ, తామ్ = ఆ, రాత్రిమ్ = రాత్రి, సుసమాహితౌ=చాల సావధానచిత్తులుగ, ఉషిత్వా = ఉండి, ప్రభాతకాలే= ప్రాతఃకాలమునందు, ఉత్థాయ=లేచి, స్పృష్టోదకౌ=స్పృశింపబడిన ఉదకము కలవారై, శుచీ=పవిత్రులై, పూర్వాం సన్ధ్యామ్=ప్రాతఃకాలసంధ్యను, ఉపాస్య= ఉపాసించి, నియమేన = నియమపూర్వకముగ, జప్యమ్ = మంత్రజపమును, సమాప్య=పూర్తిచేసి, హుతాగ్నిహోత్రమ్ = అగ్నిహోత్రమును చేసిన, ఆసీనమ్= కూర్చున్న, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, అవన్దతామ్ = నమస్కరించిరి.

తా. రామలక్ష్మణులు ఆ రాత్రి యంతయు సావధానచిత్తులై ఉండి, ప్రాతఃకాలమున లేచి, ఆచమనము చేసి, ప్రాతఃకాలసంధ్య నుపాసించి, నియమ పూర్వకముగ గాయత్ర్యాదిమంత్రముల జపము చేసి, అగ్నిహోత్రము చేసికొని ఉపవిష్టుడై యున్న విశ్వామిత్రుని సమీపించి నమస్కరించిరి. 31, 32

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో ఇరువదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ త్రింశః సర్గః

మూ. అథ తౌ దేశకాలజ్ఞౌ రాజపుత్రావరిన్దమౌ,
దేశే కాలే చ వాక్యజ్ఞావబ్రూతాం కౌశికం వచః. 1

ప్ర. అ. అథ = పిమ్మట, దేశకాలజ్ఞౌ=దేశకాలములను ఎరిగినవారును, అరిన్దమౌ = శత్రుసంహారకులును, దేశే = దేశమునందును, కాలే చ = కాలమునందును, వాక్యజ్ఞౌ=వాక్యములను ఎరిగినవారును అగు, తౌ = ఆ, రాజపుత్రౌ= రామలక్ష్మణులు, కౌశికమ్ = విశ్వామిత్రునిగూర్చి, వచః = వాక్యమును, అబ్రూతామ్ = పలికిరి.

తా. పిమ్మట, ఏ దేశమునందు ఏ కాలమునందు ఎట్లు మసలుకొనవలెనో తెలిసినవారును, శత్రుసంహారసమర్థులును, ఏ దేశమునందు, ఏ కాలమునందు ఎట్లు మాటలాడవలెనో తెలిసినవారును అగు రామలక్ష్మణులు విశ్వామిత్రునితో ఇట్లు పలికిరి. 1

మూ. భగవన్ శ్రోతుమిచ్ఛావో యస్మిన్ కాలే నిశాచరౌ,
సంరక్షణీయౌ తౌ బ్రహ్మన్ నాతివర్తేత తత్ క్షణమ్. 2

ప్ర. అ. భగవన్ = మాహాత్మ్యముగల, బ్రహ్మన్=ఓ బ్రహ్మర్షీ, తౌ=ఆ, నిశాచరౌ=రాక్షసులు, యస్మిన్ కాలే=ఏకాలమునందు, సంరక్షణీయౌ=రక్షింపదగినవారో, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛావః = ఇచ్ఛయించుచున్నాము. తత్ = ఆ, క్షణమ్=క్షణము, నాతివర్తేత = దాటిపోగూడదు.

తా. మహామహిమ గల ఓ బ్రహ్మర్షీ! ఆ రాక్షసులనుండి ఎపుడు రక్షింపవలెనో వినగోరుచున్నాము. ఆ కాలము దాటిపోగూడదు కదా ?

వి. "సంరక్షణీయౌ" అను పదమునకు రక్షింపదగినవారు అని అర్థము. రాక్షసులు సంరక్షణీయులు కాదు. అందుచేత కొందరు వ్యాఖ్యాతలు విపరీత లక్షణచేత "చంపదగినవారు" అని గాని, రక్షణ మనగా ఇష్టప్రాప్తి అనిష్టనివృత్తి గాన ఇచట అనిష్టనివృత్తి అను అర్థమును గాని గ్రహింపవలె నని చెప్పినారు

(గోవిందరాజులు). తిలకవ్యాఖ్యలో "యజ్ఞరక్షణమునకై నివారింపదగినవారు" అను అర్థము చెప్పబడినది. కాని "కృత్యల్యుటో బహులమ్" అను సూత్రముచే "స్నాన్త్యనేనేతి స్నానీయం చూర్ణమ్" "దీయతే అస్మై దానీయః విప్రః" ఇత్యాదులలో కరణసంప్రదానార్థాలలో "అనీయర్" ప్రత్యయము వచ్చినట్లు, "రక్షన్తి అభ్యామితి రక్షణీయౌ" అనగా "ఎవరినుండి రక్షింతురో వారు" అను అపాదానార్థములో అనీయర్ ప్రత్యయము వచ్చిన దని సమర్థింపవచ్చును. 2

మూ. ఏవం బ్రువాణౌ కాకుత్స్థౌ త్వరమాణౌ యుయుత్సయా,
సర్వే తే మునయః ప్రీతాః ప్రశశంసుర్నృపాత్మజౌ. 3

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, బ్రువాణౌ = పలుకుచున్న, యుయుత్సయా = యుద్ధముచేయవలె ననెడు ఇచ్ఛచేత, త్వరమాణౌ = తొందరపడుచున్న, నృపాత్మజౌ = రాజకుమారులను, తే = ఆ, మునయః = మునులు, సర్వే = అందరును, ప్రీతాః = సంతసించినవారై, ప్రశశంసుః = ప్రశంసించిరి.

తా. ఈ విధముగ పలుకుచు, యుద్ధము చేయుటకై తొందరపడుచున్న ఆ రామలక్ష్మణులను ఆ మును లందరును సంతసించిన వారై ప్రశంసించిరి. 3

మూ. అద్యప్రభృతి షడ్రాత్రం రక్షతం రాఘవౌ యువామ్,
దీక్షాం గతో హ్యేష ముని ర్మౌనిత్వం చ గమిష్యతి. 4

ప్ర. అ. రాఘవౌ = రామలక్ష్మణులారా! యువామ్ = మీరు, అద్యప్రభృతి = నేడు మొదలు, షడ్రాత్రమ్ = ఆరు రాత్రులు, రక్షతమ్ = రక్షించుడు. ఏషః = ఈ, మునిః = ముని, దీక్షామ్ = దీక్షను, గతః = పొందినాడు. మౌనిత్వం చ = మౌనమును కూడ, గమిష్యతి = పొందగలడు.

తా. రామలక్ష్మణులారా! నేడు మొదలు ఆరు రాత్రులు మీరు యాగరక్షణము చేయుడు. విశ్వామిత్రమహర్షి దీక్ష వహించినాడు గాన మౌనమును పాటించును. 4

మూ. తౌ తు తద్వచనం శ్రుత్వా రాజపుత్రౌ యశస్వినౌ,
అనిద్రౌ షడహోరాత్రం తపోవనమరక్షతామ్. 5

ప్ర. అ. యశస్వినౌ=కీర్తిగల, తౌ = ఆ, రాజపుత్రౌ=రాజకుమారులు, తత్=ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, షడహోరాత్రమ్ = ఆరు రేయింబవళ్లు, అనిద్రౌ = నిద్ర లేనివారై, తపోవనమ్=తపోవనమును, అరక్షతామ్=రక్షించిరి.

తా. కీర్తిమంతులైన రామలక్ష్మణులు వారి వాక్యము విని, ఆరు రేయింబవళ్లు, నిద్ర లేని వారై, ఆ తపోవనమును రక్షించిరి. 5

మూ. ఉపాసాఞ్చక్రతుర్వీరౌ యత్తౌ పరమధన్వినౌ,
రరక్షతుర్మునివరం విశ్వామిత్రమరిన్దమౌ. 6

ప్ర. అ. పరమధన్వినౌ = గొప్ప ధనుర్ధరులైన, వీరౌ=ఆ వీరులు, యత్తౌ=సన్నద్ధులై ఉపాసాఞ్చక్రతుః = సమీపముననే ఉండిరి. అరిన్దమౌ = శత్రుసంహారకులైన వారు, విశ్వామిత్రం మునివరమ్ = విశ్వామిత్రమహర్షిని, రరక్షతుః=రక్షించిరి.

తా. ధనుర్ధరులైన ఆ వీరులు సన్నద్ధులై ఆ విశ్వామిత్రుని సమీపముననే ఉండి ఆ మునిశ్రేష్ఠుని రక్షించిరి. 6

మూ. అథ కాలే గతే తస్మిన్ షష్ఠేఽహని సమాగతే,
సౌమిత్రిమబ్రవీద్రామో యత్తో భవ సమాహితః. 7

ప్ర. అ. అథ = పిమ్మట, తస్మిన్=ఆ, కాలే=కాలము, గతే = కడచిన దగుచుండగా, షష్ఠే=ఆరవ, అహని=దివసము, సమాగతే=వచ్చిన దగుచుండగా, రామః = రాముడు, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, యత్తః = సన్నద్ధుడవై, సమాహితః=ఏమరిపాటు లేనివాడవై, భవ = ఉండుము, అని, ఉవాచ=పలికెను.

తా. అయిదు దివసములు కడచి ఆరవ దివసము వచ్చినది. అపుడు రాముడు లక్ష్మణునితో —"సన్నద్ధుడవై, అప్రమత్తుడవై ఉండుము" అని పలికెను. 7

మూ. రామస్యైవం బ్రువాణస్య త్వరితస్య యుయుత్సయా,
ప్రజజ్వాల తతో వేదిః సోపాధ్యాయపురోహితా. 8

ప్ర. అ. యియుత్సయా = యుద్ధము చేయవలె నను అభిలాషచే, త్వరితస్య = తొందరపడుచున్న, రామస్య=రాముడు, ఏవమ్ = ఈ విధముగా, బ్రువాణస్య=పలుకుచుండగా, తతః = పిమ్మట, సోపాధ్యాయ పురోహితా= ఋత్విక్కులతోను పురోహితునితోను కూడిన, వేదిః = వేది, ప్రజజ్వాల = ప్రజ్వలించెను.

తా. రాముడు యుద్ధాభిలాషతో తొందరపడుచు ఈ విధముగా పలుకుచుండగనే, ఋత్విక్కులతోను, పురోహితునితోను కూడిన యజ్ఞవేదిక భగ్గున మండెను. 8

మూ. సదర్భచమసస్రుక్కా ససమిత్కుసుమోచ్చయా,
విశ్వామిత్రేణ సహితా వేదిర్జజ్వాల సర్త్విజా. 9

ప్ర. అ. సదర్భచమసస్రుక్కా = దర్భలతోను, చమసములతోను (పానపాత్రలు) స్రుక్కులతోను (హోమము చేయు గరిటెలు) కూడినదియు, ససమిత్కుసుమోచ్చయా=సమిధలతోను పుష్పసముదాయముతోను కూడినదియు, విశ్వామిత్రేణ = విశ్వామిత్రునితో, సహితా = కూడినదియు, సర్త్విజా = ఋత్విక్కులతో కూడినదియు అగు, వేదిః = వేది, జజ్వాల = ప్రజ్వలించెను.

తా. దర్భలతో, చమసములతో, స్రుక్కులతో, సమిధలతో, పుష్పసముదాయముతో, విశ్వామిత్రునితో, ఋత్విక్కులతో కూడిన వేది—జ్వలించినది.

వి. యాగవేది హటాత్తుగా జ్వలించుట ఉత్పాతము. అనగా రాబోవు ఆపదను సూచించునది. 9

మూ. మన్త్రవచ్చ యథాన్యాయం యజ్ఞోఽసౌ సంప్రవర్తతే,
ఆకాశే చ మహాన్ శబ్దః ప్రాదురాసీద్భయావహః. 10

ప్ర. అ. అసౌ=ఈ, యజ్ఞః=యజ్ఞము, మన్త్రవత్=మంత్రపూర్వకముగాను, యథాన్యాయమ్=శాస్త్రానుసారముగాను, సంప్రవర్తతే=జరుగుచుండెను. ఆకాశే= ఆకాశమునందు, భయావహః = భయమును కలిగించు, మహాన్ శబ్దః = గొప్ప ధ్వని, ప్రాదురాసీత్ = పుట్టెను.

తా. ఆ యజ్ఞము మంత్రపూర్వకముగాను, శాస్త్రానుసారముగాను జరుగుచుండెను. ఇంతలో, ఆకాశమునందు, భయంకర మైన ఒక శబ్దము వినబడెను. 10

మూ. ఆవార్య గగనం మేఘో యథా ప్రావృషి నిర్గతః,
తథా మాయాం వికుర్వాణౌ రాక్షసావభ్యధావతామ్. 11

ప్ర. అ. ప్రావృషి=వర్షాకాలమునందు, నిర్గతః=బయలుదేరిన, మేఘః=మేఘము, యథా=ఎట్లో, తథా=అట్లు, గగనమ్=ఆకాశమును, ఆవార్య=కప్పివేసి, రాక్షసౌ=రాక్షసులు, మాయామ్=మాయను, వికుర్వాణౌ=చేయుచు, అభ్యధావతామ్=పరుగెత్తివచ్చిరి.

తా. వర్షాకాలమున బయలుదేరిన మేఘము వలె ఆకాశమును ఆవరించి, మారీచసుబాహువులు, మాయావికారములను చూపుచు పరుగెత్తి వచ్చిరి. 11

మూ. మారీచశ్చ సుబాహుశ్చ తయోరనుచరాశ్చ యే,
ఆగమ్య భీమసఙ్కాశౌ రుధిరౌఘమవాసృజన్. 12

ప్ర. అ. భీమసఙ్కాశౌ=భయంకరులైన, మారీచశ్చ=మారీచుడును, సుబాహుశ్చ=సుబాహువు, తయోః=వారిద్దరియొక్క, యే=ఏ, అనుచరాః=అనుచరులుగలరో వారును, ఆగమ్య=వచ్చి, రుధిరౌఘమ్=రక్తప్రవాహమును, అవాసృజన్=వర్షించిరి.

తా. భయంకరులైన మారీచసుబాహువులును, వారి అనుచరులును వచ్చి రక్తప్రవాహమును వర్షించిరి. 12

మూ. సా తేన రుధిరౌఘేణ వేదిర్జజ్వాల మణ్డితా,
సహసాభిద్రుతో రామస్తావపశ్యత్తతో దివి. 13

ప్ర. అ. తేన=ఆ, రుధిరౌఘేణ=రక్తప్రవాహముచేత, మణ్డితా=నింపబడిన, సా=ఆ, వేదిః=వేది, జజ్వాల=ప్రజ్వలించెను. తతః=పిమ్మట, సహసా=శీఘ్రముగా, అభిద్రుతః=ఎదురుగా పరుగెత్తి వచ్చిన, రామః=రాముడు, దివి=ఆకాశమునందు, తాన్=వారిని, అపశ్యత్=చూచెను.

తా. రక్తప్రవాహముచే నింపబడిన ఆ వేది ప్రజ్వరిల్లెను. అంతలో, శీఘ్రముగ పరుగెత్తి వచ్చిన రాముడు ఆకాశమునందు ఆ రాక్షసులను చూచెను.

మూ. తావాపతన్తౌ సహసా దృష్ట్వా రాజీవలోచనః,
లక్ష్మణం త్వభిసంప్రేక్ష్య రామో వచనమబ్రవీత్. 14

ప్ర. అ. రాజీవలోచనః = పద్మములవంటి నేత్రములు గల, రామః = రాముడు, సహసా = శీఘ్రముగా, ఆపతన్తౌ = వచ్చిపడుచున్న, తౌ = వారిని, దృష్ట్వా = చూచి, లక్ష్మణమ్ = లక్ష్మణుని, అభిసంప్రేక్ష్య = చూచి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. కమలలోచనుడైన రాముడు శీఘ్రముగ వచ్చి పడుచున్న ఆ మారీచ సుబాహువులను చూచి, లక్ష్మణునితో ఇట్లనెను. 14

మూ. పశ్య లక్ష్మణ దుర్వృత్తాన్ రాక్షసాన్ పిశితాశనాన్,
మానవాస్త్రసమాధూతాననిలేన యథా ఘనాన్. 15

ప్ర. అ. లక్ష్మణ = ఓ లక్ష్మణా! దుర్వృత్తాన్ = చెడ్డ నడవడిక కలవారను, పిశితాశనాన్ = మాంసమే ఆహారముగా కలవారును అగు, రాక్షసాన్ = రాక్షసులను, అనిలేన = వాయువుచేత, ఘనాన్ యథా = మేఘములను వలె, మానవాస్త్ర సమాధూతాన్ = మానవాస్త్రముచే ఎగురగొట్టబడుచుండగా, పశ్య = చూడుము.

తా. లక్ష్మణా! దుర్మార్గులును, మాంస భక్షకులును అగు ఈ రాక్షసులను, వాయువు మేఘములను ఎగురగొట్టినట్లు, మానవాస్త్రముచే ఎగురగొట్టి వేయుచున్నాను; చూడుము. 15

మూ. మానవం పరమోదారమస్త్రం పరమభాస్వరమ్,
చిక్షేప పరమక్రుద్ధో మారీచోరసి రాఘవః. 16

ప్ర. అ. రాఘవః = రాముడు, పరమోదారమ్ = చాల గొప్పదియు, పరమ భాస్వరమ్=ఎక్కువ ప్రకాశించుచున్నదియు అగు, మానవమ్ అస్త్రమ్=

మానవాస్త్రమును, పరమక్రుద్ధః=చాల కోపగించినవాడై, మారీచోరసి=మారీచుని వక్షఃస్థలముపై, చిక్షేప = విసరెను.

తా. రాముడు చాల కోపించి, మంచి సామర్థ్యము కలదియు, మిక్కిలి ప్రకాశించుచున్నదియు అగు మానవాస్త్రమును మారీచుని వక్షఃస్థలముపై ప్రయోగించెను. 16

మూ. స తేన పరమాస్త్రేణ మానవేన సమాహతః,
సంపూర్ణం యోజనశతం క్షిప్తః సాగరసంప్లవే. 17

ప్ర. అ. తేన = ఆ, మానవేన = మానవ మనెడు, పరమాస్త్రేణ = గొప్ప అస్త్రముచేత, సమాహతః = కొట్టబడిన, సః = ఆ మారీచుడు, సంపూర్ణం = పూర్తిగా, యోజనశతమ్ = నూరు యోజనముల దూరము, సాగరసంప్లవే = పొర్లుచున్న సముద్రజలమునందు, క్షిప్తః = విసిరివేయబడెను.

తా. గొప్పదైన ఆ మానవాస్త్రముచేత కొట్టబడినవాడై ఆ మారీచుడు పూర్తిగ నూరు యోజనముల దూరములో సముద్రజలపూరమునందు పడవేయబడెను.

వి. "స తేన" అను చోట 'స' అనునది గాయత్రీమంత్ర ద్వితీయాక్షరము. వెయ్యి శ్లోకములు పూర్తియైన తరువాత ద్వితీయ సహస్ర ప్రారంభ శ్లోకమున నిక్షిప్తమైనది. 17

మూ. విచేతనం విఘూర్ణన్తం శీతేషుబలతాడితమ్,
నిరస్తం దృశ్య మారీచం రామో లక్ష్మణమబ్రవీత్. 18

ప్ర. అ. శీతేషుబలతాడితమ్ = ఆ చల్లని అస్త్రముచే కొట్టబడినవాడును, విచేతనమ్ = చైతన్యము కోల్పోయినవాడును, విఘూర్ణన్తమ్ = తిరిగి పోవుచున్నవాడును, నిరస్తమ్ = దూరమున పడవేయబడినవాడును అగు, మారీచమ్ = మారీచుని, దృశ్య = చూచి, రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణునిగూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ చల్లని బాణముచేత కొట్టబడి, చైతన్యము కోల్పోయి, గిఱ్ఱున

తిరిగిపోవుచు దూరముగా పడవేయబడిన ఆ మారీచుని చూచి, రాముడు లక్ష్మణునితో ఇట్లనెను.

వి. మానవాస్త్రము సంధించిన బాణము శత్రువును చంపక, చైతన్య రహితుని చేయుటచే అది శీతేషు వని చెప్పబడినది. 18

మూ. పశ్య లక్ష్మణ శీతేషుం మానవం ధర్మసంహితమ్,
మోహయిత్వా నయత్యేనం న చ ప్రాణైర్వ్యయుజ్యత. 19

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! ధర్మసంహితమ్ = ధర్మముతోకూడిన, మానవం శీతేషుమ్=మానవాస్త్రము సంధించిన శీతబాణమును, పశ్య=చూడుము. ఏనమ్ = ఈతనిని, మోహయిత్వా = మోహముకలవానినిగా చేసి, నయతి = తీసికొనిపోవుచున్నది. ప్రాణైః = ప్రాణములతో, న వ్యయుజ్యత = వియుక్తుడు కాలేదు.

తా. లక్ష్మణా! ధర్మము ననుసరించి యున్న ఈ మానవాస్త్రము సంధించిన చల్లని బాణమును చూడుము. ఇది వీనికి మోహము కలుగజేసి తీసికొని పోవుచున్నది. కాని ఇతని ప్రాణములు తీయలేదు. 19

మూ. ఇమానపి వధిష్యామి నిర్ఘృణాన్ దుష్టచారిణః,
రాక్షసాన్ పాపకర్మస్థాన్ యజ్ఞఘ్నాన్ రుధిరాశనాన్. 20

ప్ర. అ. నిర్ఘృణాన్ = జాలిలేనివారును, దుష్టచారిణః = దుష్టముగా ప్రవర్తించువారును, పాపకర్మస్థాన్ = పాపకర్మ చేయువారును, యజ్ఞఘ్నాన్ = యజ్ఞములను నశింపచేయువారును, రుధిరాశనాన్ = రక్తమును భుజించువారును అగు, ఇమాన్=ఈ, రాక్షసానపి=రాక్షసులను కూడ, వధిష్యామి=వధించెదను.

తా. జాలి లేనివారు, దుర్మార్గులు, పాపములు చేయువారు, యజ్ఞములను చెరచువారు, రక్తమును త్రాగువారు అయిన ఈ రాక్షసులను కూడ చంపెదను. 20

మూ. సంగృహ్యాస్త్రం తతో రామో దివ్యమాగ్నేయమద్భుతమ్
సుబాహూరసి చిక్షేప స విద్ధః ప్రాపతద్భువి. 21

ప్ర. అ. తతః = పిమ్మట, రామః = రాముడు, దివ్యమ్ = దివ్య మైన దియు, అద్భుతమ్ = ఆశ్చర్యకర మగునదియు అగు, ఆగ్నేయమ్ అస్త్రమ్ = ఆగ్నేయాస్త్రమును, సంగృహ్య=గ్రహించి, సుబాహూరసి=సుబాహువు యొక్క వక్షఃస్థలమునందు, చిక్షేప = విసరెను. సః = అతడు, విద్ధః = కొట్టబడినవాడై, భువి = భూమిపై, ప్రాపతత్ = పడెను.

తా. పిమ్మట రాముడు దివ్యము, ఆశ్చర్యకరము అయిన ఆగ్నేయాస్త్ర మును గ్రహించి, సుబాహువు వక్షస్థలముపై ప్రయోగించెను. అతడు దాని దెబ్బ తిని నేలపై కూలెను. 21

మూ. శేషాన్ వాయవ్యమాదాయ నిజఘాన మహాయశాః
రాఘవః పరమోదారో మునీనాం ముదమావహన్. 22

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తికలవాడును, పరమోదారః=మిక్కిలి ఉదారుడును అయిన, రాఘవః=రాముడు, మునీనామ్=మునులకు, ముదమ్ = ఆనందమును, ఆవహన్ = కలిగించుచు, వాయవ్యమ్ = వాయవ్యాస్త్రమును, ఆదాయ=గ్రహించి, శేషాన్=మిగిలిన రాక్షసులను, నిజఘాన=చంపెను.

తా. గొప్ప కీర్తిగల, పరమోదారుడైన రాముడు, మునులకు ఆనందము కలిగించుచు, మిగిలిన రాక్షసులను, వాయవ్యాస్త్రము ప్రయోగించి చంపెను. 22

మూ. స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునన్దనః,
ఋషిభిః పూజితస్తత్ర యథేన్ద్రో విజయే పురా. 23

ప్ర. అ. సః రఘునన్దనః=ఆ రాముడు, యజ్ఞఘ్నాన్=యజ్ఞములను చెరచు, రాక్షసాన్=రాక్షసులను, సర్వాన్=అందరిని, హత్వా=చంపి, పురా=పూర్వము, విజయే = విజయము కలిగినప్పుడు, ఇన్ద్రః యథా = ఇంద్రుడు వలె, తత్ర= అచట, ఋషిభిః=ఋషులచేత, పూజితః=పూజింపబడెను.

తా. యజ్ఞవిఘ్నకరులగు ఆ రాక్షసుల నందరిని సంహరించిన రాముని, పూర్వము విజయము కలిగి నపుడు దేవేంద్రుని పూజించి నట్లు ఋషు లందరును ప్రశంసించిరి. 23

మూ. అథ యజ్ఞే సమాప్తే తు విశ్వామిత్రో మహామునిః,
నిరీతికా దిశో దృష్ట్వా కాకుత్స్థ మిదమబ్రవీత్. 24

ప్ర. అ. అథ=పిమ్మట, యజ్ఞే=యజ్ఞము, సమాప్తే = సమాప్తమైనదగు చుండగా, విశ్వామిత్రః మహామునిః=విశ్వామిత్రమహర్షి, నిరీతికాః=ఈతిబాధలు లేని, దిశః=దిక్కులను, దృష్ట్వా=చూచి, కాకుత్స్థమ్=రాముని గూర్చి, ఇదమ్= ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. యజ్ఞము సమాప్త మైన పిమ్మట విశ్వామిత్రమహాముని ఈతిబాధ లన్నియు తొలగిపోయిన దిక్కులను చూచి, రామునితో ఇట్లనెను. 24

మూ. కృతార్థోఽస్మి మహాబాహో కృతం గురువచ స్త్వయా
సిద్ధాశ్రమమిదం సత్యం కృతం రామ మహాయశః. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రింశః సర్గః.

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా, కృతార్థః=నెరవేరిన కార్యము కలవాడను, అస్మి=అయితిని. త్వయా=నీచేత, గురువచః=తండ్రి వాక్యము, కృతమ్=చేయబడినది, మహాయశః=గొప్ప కీర్తి గల, రామ=రామా, ఇదమ్=ఈ, సిద్ధాశ్రమమ్=సిద్ధాశ్రమము. సత్యమ్=సత్య మైనదిగా, కృతమ్= చేయబడినది.

తా. ఓ మహాబాహూ! నేను తలపెట్టిన పని పూర్తి యైనది. నీవు తండ్రి గారి ఆజ్ఞను నిర్వహించితివి. గొప్ప కీర్తిగల రామా ! ఈ సిద్ధాశ్రమమును సత్య మైన పేరు గల దానినిగా చేసితివి. 25

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో ముప్పదవసర్గ సమాప్తము.

అథ ఏకత్రింశః సర్గః

మూ. అథ తాం రజనీం తత్ర కృతార్థౌ రామలక్ష్మణౌ,
ఊషతుర్ముదితౌ వీరౌ ప్రహృష్టేనాన్తరాత్మనా. 1

ప్ర. అ. అథ = పిమ్మట, కృతార్థౌ = చేయబడిన కార్యము కలవారును, ముదితౌ=సంతసించినవారును, వీరౌ=వీరులును అగు, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులు, తామ్=ఆ, రజనీమ్=రాత్రి, ప్రహృష్టేన = మిక్కిలి సంతోషించిన, అన్తరాత్మనా = మనస్సుతో, తత్ర = అచట, ఊషతుః = నివసించిరి.

తా. తమ కార్యమును పూర్తిచేసి ఆనందముతో కూడిన వీరులైన రామలక్ష్మణులు, ఆ రాత్రి, ఆనందముతో నిండిన మనస్సుతో, ఆ ఆశ్రమమునందు నివసించిరి. 1

మూ. ప్రభాతాయాం తు శర్వర్యాం కృతపౌర్వాహ్ణికక్రియౌ,
విశ్వామిత్రమృషీంశ్చాన్యాన్ సహితావభిజగ్మతుః. 2

ప్ర. అ. శర్వర్యామ్ = రాత్రి, ప్రభాతాయామ్ = తెల్లవారగనే, కృతపౌర్వాహ్ణికక్రియౌ = పూర్వాహ్ణమునకు సంబంధించిన క్రియలను చేసికొన్నవారై, సహితౌ = కలిసినవారై, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని, అన్యాన్ = ఇతరులైన, ఋషీంశ్చ = ఋషులను గూర్చి, అభిజగ్మతుః=వెళ్లిరి.

తా. రాత్రి తెల్లవారగవే ప్రాతఃకాలము చేయదగిన సంధ్యావందనాదులు పూర్తిచేసికొని, ఇద్దరును కలిసి, విశ్వామిత్రుని వద్దకును, ఇతరఋషులవద్దకును వెళ్లిరి.

మూ. అభివాద్య మునిశ్రేష్ఠం జ్వలన్తమివ పావకమ్,
ఊచతుర్మధురోదారం వాక్యం మధురభాషిణౌ. 3

ప్ర. అ. మధురభాషిణౌ = మధురముగా మాటలాడు ఆ రామలక్ష్మణులు, జ్వలన్తమ్ = ప్రజ్వలించుచున్న, పావకమ్ ఇవ = అగ్ని వలె ఉన్న, ముని

శ్రేష్ఠమ్ = విశ్వామిత్రుని, అభివాద్య = నమస్కరించి, మధురోదారమ్ = మధురము ఉదారము అయిన, వాక్యమ్ = వాక్యమును, ఊచతుః = పలికిరి.

తా. మధురముగా మాటలాడు స్వభావముగల ఆ రామలక్ష్మణులు, ప్రజ్వలించు చున్న అగ్ని వలె ఉన్న విశ్వామిత్రునకు నమస్కరించి, మధురమును, ఉదారమును అగు వాక్యమును పలికిరి. 3

మూ. ఇమౌ స్మ మునిశార్దూల కిఙ్కరౌ సముపస్థితౌ,
ఆజ్ఞాపయ యథేష్టం వై శాసనం కరవామ కిమ్. 4

ప్ర. అ. మునిశార్దూల = మునిశ్రేష్ఠుడా, కిఙ్కరౌ = కింకరుల మైన, ఇమౌ = ఈ మేము, సముపస్థితౌ స్మ = వచ్చి ఉన్నాము. యథేష్టమ్ = నీకు ఇష్టము వచ్చిన విధముగ, ఆజ్ఞాపయ = ఆజ్ఞాపించుము. కిమ్ = ఏ, శాసనమ్ = శాసనమును, కరవామ = చేయుదుము.

తా. ఓ మునిశ్రేష్ఠా ! ఇదిగో కింకరులము వచ్చినాము. నీకు ఏది ఇష్టమో ఆజ్ఞాపింపుము. ఏ ఆజ్ఞను చేయవలెను ? 4

మూ. ఏవముక్తాస్తతస్తాభ్యాం సర్వ ఏవ మహర్షయః,
విశ్వామిత్రం పురస్కృత్య రామం వచనమబ్రువన్. 5

ప్ర. అ. తాభ్యామ్ = వారిరువురిచేత, ఏవమ్ = ఈ విధముగనే, ఉక్తాః = పలకబడిన, మహర్షయః = మహర్షులు, సర్వే ఏవ = అందరును, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, పురస్కృత్య = పురస్కరించుకొని, రామమ్ = రాముని గూర్చి, వచనమ్ = వాక్యమును, అబ్రువన్ = పలికిరి.

తా. రామలక్ష్మణులు తమతో కూడ ఇట్లు పలుకగా ఆ మహర్షు లందరును, విశ్వామిత్రుని అనుజ్ఞను పొంది రామునితో ఇట్లనిరి. 5

మూ. మైథిలస్య నరశ్రేష్ఠ జనకస్య భవిష్యతి,
యజ్ఞః పరమధర్మిష్ఠస్తస్య యాస్యామహే వయమ్. 6

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! మైథిలస్య = మిథిలారాజైన, జనకస్య = జనకునియొక్క, పరమధర్మిష్ఠః = మిక్కిలి ధర్మముతోకూడిన, యజ్ఞః =

యజ్ఞము, భవిష్యతి=కాగలదు, వయమ్ = మేము, తస్య = ఆ యజ్ఞమునకు, యాస్యామహే=వెళ్లగలము.

తా. రామా! మిథిలాధిపతి యైన జనకుడు మిక్కిలి ధర్మ సంమత మైన యజ్ఞము చేయనున్నాడు. మేము ఆ యజ్ఞమునకు వెళ్ళెదము. 6

మూ. త్వం చైవ నరశార్దూలస్సహాస్మాభిర్గమిష్యసి,
అద్భుతం ధనురత్నం చ తత్ర తద్ద్రష్టుమర్హసి. 7

ప్ర. అ. నరశార్దూలః=నరశ్రేష్ఠుడ వైన, త్వం చ=నీవు కూడ, అస్మాభిః సహ=మాతోకూడ, గమిష్యసి=రాగలవు. తత్ర=అచట, అద్భుతమ్=ఆశ్చర్యకరమైన, తత్=ఆ, ధనురత్నం చ = శ్రేష్ఠ మైన ధనస్సును, ద్రష్టుమ్ = చూచుటకు, అర్హసి=తగియున్నావు.

తా. నరశ్రేష్ఠుడ వైన నీవు కూడ మాతో అచటికి వచ్చినచో అచట, ఆశ్చర్యకర మైన శ్రేష్ఠ మైన ధనస్సును చూడగలవు. 7

మూ. తద్ధి పూర్వం నరశ్రేష్ఠ దత్తం సదసి దైవతైః,
అప్రమేయబలం ఘోరం మఖే పరమభాస్వరమ్. 8

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడ వైన రామా, అప్రమేయబలమ్=లెక్కింప రాని బలము గలదియు, ఘోరమ్=భయంకర మైనదియు, పరమభాస్వరమ్=మిక్కిలి ప్రకాశించునదియు అగు, తత్=ఆ ధనస్సు, పూర్వమ్=పూర్వము, దైవతైః=దేవతలచేత, మఖే = యుద్ధమునందు, సదసి = సభలో, దత్తమ్=ఇవ్వబడినది.

తా. రామా! అప్రమేయ మైన బలముగల, భయంకర మైన, గొప్ప ప్రకాశముగల ఆ ధనస్సును పూర్వము దేవతలు యజ్ఞసదస్సులో ఇచ్చిరి. 8

మూ. నాస్య దేవా న గన్ధర్వా నాసురా న చ రాక్షసాః,
కర్తుమారోపణం శక్తా న కథం చన మానుషాః. 9

ప్ర. అ. అస్య=ధనస్సుయొక్క, ఆరోపణమ్ = ఆరోపణమును (నారి కట్టుటను) కర్తుమ్=చేయుటకు, దేవాః=దేవతలు, న శక్తాః = సమర్థులు కారు. గన్ధర్వాః=గంధర్వులు, న=సమర్థులు కారు. అసురాః = అసురులు, న=సమర్థులు కారు. రాక్షసాః చ = రాక్షసులును, న = సమర్థులు కారు. మానుషాః= మనుష్యులు, కథంచన=ఏ విధముగను, న=సమర్థులు కారు.

తా. దేవతలు గాని, గంధర్వులు గాని, అసురులు గాని, రాక్షసులు గాని ఆ ధనస్సును వంచి నారి కట్టజాలరు. మనుష్యుల మాట చెప్పవనియే లేదు. 9

మూ. ధనుషస్తస్య వీర్యం తు జిజ్ఞాసన్తో మహీక్షితః,
న శేకురారోపయితుం రాజపుత్రా మహాబలాః. 10

ప్ర. అ. రాజపుత్రాః = రాజవంశములందు జనించిన, మహాబలాః = మహాబలవంతులైన, మహీక్షితః=రాజులు, తస్య ధనుషః=ఆ ధనస్సు యొక్క, వీర్యమ్ = శక్తిని, జిజ్ఞాసన్తః = తెలియదలచినవారై, ఆరోపయితుమ్ = ఎక్కుపెట్టుటకు, న శేకుః = సమర్థులు కాలేదు.

తా. రాజవంశములందు పుట్టిన, మహాబలశాలు లగు ఎందరో రాజులు ఆ ధనస్సు శక్తిని పరీక్షింప గోరి, ప్రయత్నించి, ఎక్కుపెట్టలేక పోయిరి. 10

మూ. తద్ధనుర్నరశార్దూల మైథిలస్య మహాత్మనః,
తత్ర ద్రక్ష్యసి కాకుత్స్థ యజ్ఞం చాద్భుతదర్శనమ్. 11

ప్ర. అ. నరశార్దూల = నరశ్రేష్ఠుడా, కాకుత్స్థ = రామా, మహాత్మనః= మహాత్ముడైన, మైథిలస్య = జనకునియొక్క, తత్ ధనుః = ఆ ధనస్సును, అద్భుతదర్శనమ్ = ఆశ్చర్యకర మైన దర్శనము గల, యజ్ఞం చ=యజ్ఞమును, తత్ర = అచట, ద్రక్ష్యసి= చూడగలవు.

తా. నరశ్రేష్ఠుడ వైన రామా! అచటికి వెళ్లి, మహాత్ము డైన దశరథుని ధనస్సును, ఆశ్చర్యకర మైన యజ్ఞమును చూడగలవు. 11

మూ. తద్ధి యజ్ఞఫలం తేన మైథిలేనోత్తమం ధనుః,
యాచితం నరశార్దూల సునాభం సర్వదైవతైః. 12

ప్ర. అ. నరశార్దూల = నరశ్రేష్ఠుడా, సునాభమ్ = దృఢమైన మధ్య ప్రదేశము గల, తత్ = ఆ, ఉత్తమం ధనుః=ఉత్తమ మైన ధనస్సు, తేన = ఆ, మైథిలేన = మిథిలాధిపతి యైన దేవరాతునిచేత, సర్వదైవతైః = సకలదేవతల నుండి, యజ్ఞఫలమ్ = యజ్ఞఫలముగా, యాచితం హి = యాచింపబడినది కదా.

తా. రామా ! మిథిలాధిపతి యైన దేవరాతుడు, దృఢ మైన మధ్యభాగము గల ఆ ధనస్సును, దేవతలనుండి, యజ్ఞమునకు ఫలమునుగా యాచించి గ్రహించెను. 12

మూ. ఆయాగభూతం నృపతేస్తస్య వేశ్మని రాఘవ,
అర్చితం వివిధైర్గన్ధైర్ధూపైశ్చాగురుగన్ధిభిః. 13

ప్ర. అ. రాఘవ = రామా ! తస్య = ఆ, నృపతేః = రాజుయొక్క, వేశ్మని=గృహమునందు, ఆయాగభూతమ్ = ధనురుత్సవములలో ప్రధానముగ పూజింపదగిన ధనస్సుగా అయిన ఆ ధనస్సు, వివిధైః = అనేక విధములైన, గన్ధైః = గంధములచేతను, అగురుగన్ధిభిః = అగురుగంధములతో గూడిన, ధూపైశ్చ = ధూపములచేతను, అర్చితమ్ = పూజింపబడినది.

తా. రామా ! ఆ ధనస్సు మిథిలాధిపతి గృహములో ప్రధానపూజ్య మగు ధనస్సుగా ఉండి, వివిధము లైన గంధములచేతను, అగరుధూపములచేతను పూజింపబడుచున్నది. 13

మూ. ఏవముక్త్వా మునివరః ప్రస్థానమకరోత్తదా,
సర్షిసంఘః సకాకుత్థ్స ఆమన్త్ర్య వనదేవతాః. 14

ప్ర. అ. మునివరః = మునిశ్రేష్ఠుడు, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా= పలికి, సర్షిసంఘః=ఋషిసంఘముతో కూడినవాడై, సకాకుత్థ్సః = రామలక్ష్మణు లతో కూడినవాడై, వనదేవతాః = వనదేవతలను, ఆమన్త్ర్య = పలకరించి, తదా = అప్పుడు, ప్రస్థానమ్ = ప్రయాణమును, అకరోత్ = చేసెను.

తా. విశ్వామిత్రుడు ఈ విధముగ పలికి, ఋషిసంఘముతోను, రామ లక్ష్మణులతోను కూడినవాడై, వనదేవతల సెలవు గైకొని బయలుదేరెను. 14

మూ. స్వస్తి వోఽస్తు గమిష్యామి సిద్ధః సిద్ధాశ్రమాదహమ్,
ఉత్తరే జాహ్నవీతీరే హిమవన్తం శిలోచ్చయమ్. 15

ప్ర. అ. (ఓ వనదేవతలారా), వః=మీకు, స్వస్తి=క్షేమము, అగుగాక. సిద్ధః=సిద్ధించిన కార్యముగల, అహమ్=నేను, సిద్ధాశ్రమాత్ = సిద్ధాశ్రమము నుండి, ఉత్తరే జాహ్నవీతీరే = గంగానదియొక్క ఉత్తరతీరమునందు, హిమవన్తమ్=హిమవంతు డనెడు, శిలోచ్చయమ్=పర్వతమును గూర్చి, గమిష్యామి= వెళ్లెదను.

తా. ఓ వనదేవతలారా! ఈ సిద్ధాశ్రమములో నాకు సంకల్పసిద్ధి కలిగినది. ఇచటి నుండి గంగానదికి ఉత్తరతీరమునం దున్న హిమవత్పర్వతమునకు వెళ్లెదను. మీకు క్షేమ మగుగాక. 15

మూ. ప్రదక్షిణం తతః కృత్వా సిద్ధాశ్రమమనుత్తమమ్,
ఉత్తరాం దిశముద్దిశ్య ప్రస్థాతుముపచక్రమే. 16

ప్ర. అ. తతః=పిమ్మట, అనుత్తమమ్ = మిక్కిలిశ్రేష్ఠ మైన, సిద్ధాశ్రమమ్ =సిద్ధాశ్రమమును, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణము చేసి, ఉత్తరాం దిశముద్దిశ్య = ఉత్తరదిక్కును గూర్చి, ప్రస్థాతుమ్ = ప్రయాణము చేయుటకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. పిమ్మట అత్యుత్తమ మైన ఆ సిద్ధాశ్రమమునకు ప్రదక్షిణముచేసి, ఉత్తరము వైపు ప్రయాణమై వెళ్లెను. 16

మూ. తం ప్రయాన్తం మునివరమన్వయాదనుసారిణామ్,
శకటీశతమాత్రం తు ప్రాయేణ బ్రహ్మవాదినామ్. 17

ప్ర. అ. ప్రయాన్తమ్ = వెళ్లుచున్న, తమ్=ఆ, మునివరమ్ = మునిశ్రేష్ఠుని, అనుసారిణామ్ = అనుసరించుచున్న, బ్రహ్మవాదినామ్ = వేదవిద్వాంసులయొక్క, ప్రాయేణ = దాదాపు, శకటీశతమాత్రమ్ = నూరుబండ్లు, అన్వయాత్ = అనుసరించి వెళ్లెను.

తా. విశ్వామిత్రుడు ప్రయాణమై వెళ్లుచుండగా, ఆతనిని అనుసరించు బ్రహ్మవాదుల దాదాపు నూరు శకటములు ఆతనిని వెంబడించినవి. 17

మూ. మృగపక్షిగణాశ్చైవ సిద్ధాశ్రమనివాసినః,
అనుజగ్ముర్మహాత్మానం విశ్వామిత్రం మహామునిమ్. 18
నివర్తయామాస తతః పక్షిసంఘాన్ మృగానపి.

ప్ర. అ. సిద్ధాశ్రమనివాసినః = సిద్ధాశ్రమములో నివసించు, మృగపక్షిగణాశ్చైవ = మృగపక్షిగణములు, మహాత్మానమ్ = మహాత్ముడైన, విశ్వామిత్రం మహామునిమ్ = విశ్వామిత్ర మహర్షిని, అనుజగ్ముః = అనుసరించి వెళ్లినవి. పక్షిసంఘాన్ = పక్షుల సముదాయములను, మృగానపి = మృగములను కూడ నివర్తయామాస = మరలిపోవునట్లు చేసెను.

తా. సిద్ధాశ్రమములో నున్న మృగపక్షులు కూడ మహాత్ముడగు ఆ విశ్వామిత్ర మహామునిని అనుసరించి వెళ్లినవి. విశ్వామిత్రుడు ఆ పక్షులను, మృగములను కూడ వెనుకకు పంపివేసెను. 18

మూ. తే గత్వా దూరమధ్వానం లమ్బమానే దివాకరే,
వాసం చక్రు ర్మునిగణాః శోణాకూలే సమాహితాః. 19

ప్ర. అ. తే = ఆ, మునిగణాః = మునిగణములు, దూరమ్ అధ్వానమ్ = దూరమార్గమును, గత్వా = వెళ్లి, దివాకరే = సూర్యుడు, లమ్బమానే = వ్రేలాడుచుండగా, సమాహితాః = అందరును కలిసి, శోణాకూలే = శోణమనెడు నదము యొక్క తీరమునందు, వాసమ్ = నివాసమును, చక్రుః = చేసిరి.

తా. ఆ మునులు చాల దూరము ప్రయాణము చేసి, సాయంకాలమున, శోణనదతీరమున అందరును కలిసి నివాసము చేసిరి. 19

మూ. తేఽస్తంగతే దినకరే స్నాత్వా హుతహుతాశనాః, 20
విశ్వామిత్రం పురస్కృత్య నిషేదురమితౌజసః.

ప్ర. అ. అమితౌజసః = గొప్ప తేజస్సు గల, తే = వారు, దినకరే = సూర్యుడు, అస్తం గతే = అస్తమించినవాడగుచుండగా, స్నాత్వా = స్నానము చేసి, హుతహుతాశనాః = హోమము చేయబడిన అగ్నులు కలవారై, విశ్వా

మిత్రమ్ = విశ్వామిత్రుని, పురస్కృత్య = పురస్కరించుకొని, నిషేదుః = కూర్చుండిరి.

తా. గొప్ప తేజస్సు గల ఆ ఋషు లందరును, సూర్యాస్తమయానంతరము అగ్నిహోమములు చేసికొని, విశ్వామిత్రుని పురస్కరించుకొని కూర్చుండిరి. 20

మూ. రామోఽపి సహసౌమిత్రిర్మునీంస్తానభిపూజ్య చ,
అగ్రతో నిషసాదాథ విశ్వామిత్రస్య ధీమతః. 21

ప్ర. అ. సహసౌమిత్రిః=లక్ష్మణసమేతుడైన, రామః అపి = రాముడు కూడ, తాన్=ఆ, మునీన్=మునులను, అభిపూజ్య=పూజించి, అథ = పిమ్మట, ధీమతః = ధీమంతుడైన, విశ్వామిత్రస్య = విశ్వామిత్రునియొక్క, అగ్రతః = ఎదుట, నిషసాద=కూర్చుండెను.

తా. లక్ష్మణసమేతు డైన రాముడు ఆ మునులను పూజించి, పిమ్మట, విశ్వామిత్రుని ఎదుట కూర్చుండెను. 21

మూ. అథ రామో మహాతేజాః విశ్వామిత్రం మహామునిమ్, 22
పప్రచ్ఛ నరశార్దూలః కౌతూహలసమన్వితః.

ప్ర. అ. అథ=పిమ్మట, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, నరశార్దూలః=నరశ్రేష్ఠు డైన, రామః = రాముడు, కౌతూహలసమన్వితః = వేడుకతో కూడినవాడై, మహామునిమ్=మహాముని యైన, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని, పప్రచ్ఛ= అడిగెను.

తా. పిమ్మట, మహాతేజఃశాలి యైన రాముడు, వినవేడుకతో, విశ్వామిత్ర మహామునిని ఇట్లు ప్రశ్నించెను. 22

మూ. భగవన్ కోన్వయం దేశః సమృద్ధవనశోభితః,
శ్రోతుమిచ్ఛామి భద్రం తే వక్తుమర్హసి తత్త్వతః. 23

ప్ర. అ. భగవన్ = ఓ పూజ్యుడా, సమృద్ధవనశోభితః=సమృద్ధము లైన వనములతో శోభింపచేయబడిన, అయమ్=ఈ, దేశః=దేశము, కః ను=ఏది ?

శ్రోతుమ్=వినుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను. తే=నీకు, భద్రమ్=క్షేమ మగు గాక. తత్త్వతః=యథార్థముగ, వక్తుమ్=చెప్పుటకు, అర్హసి=తగియున్నావు.

తా. ఓ పూజ్యుడా, ఫలపుష్పాదులతో సమృద్ధ మైన వనముచే శోభించు చున్న ఈ ప్రదేశము పేరేమి? నేను విన గోరుచున్నాను, దీనిగూర్చి చెప్పుము. 24

మూ. చోదితో రామవాక్యేన కథయామాస సువ్రతః, 24
తస్య దేశస్య నిఖిలమృషిమధ్యే మహాతపాః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకత్రింశః సర్గః.

ప్ర. అ. సువ్రతః=ఉత్తమ మైన వ్రతము గల, మహాతపాః=గొప్ప తపస్సు గల విశ్వామిత్రుడు, రామవాక్యేన=రాముని వాక్యముచేత, చోదితః=ప్రేరేపింపబడినవాడై, ఋషిమధ్యే=ఋషుల మధ్యయందు, తస్య=ఆ, దేశస్య=దేశముయొక్క, నిఖిలమ్=సకలవృత్తాంతమును, కథయామాస=చెప్పెను.

తా. ఉత్తమవ్రతుడును, మహాతపఃశాలియు అగు ఆ విశ్వామిత్రుడు, రాముని వాక్యముచే ప్రేరేపింపబడి, ఆ దేశమునకు సంబంధించిన సకలవృత్తాంత మును ఋషుల మధ్య ఇట్లు చెప్పదొడగెను. 24

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు, బాలకాండలో ముప్పదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్వాత్రింశః సర్గః

మూ. బ్రహ్మయోనిర్మహానాసీత్కుశో నామ మహాతపాః,
అక్లిష్టవ్రతధర్మజ్ఞః సజ్జనప్రతిపూజకః. 1

ప్ర. అ. బ్రహ్మయోనిః=బ్రహ్మ కారణముగా కలవాడును, మహాతపాః=గొప్ప తపస్సు కలవాడును, అక్లిష్టవ్రతధర్మజ్ఞః = బాధింపబడని వ్రతములు కలవాడును ధర్మములను ఎరిగినవాడును, సజ్జనప్రతిపూజకః = సజ్జనులను పూజించువాడును, మహాన్=గొప్పవాడును అగు, కుశో నామ=కుశు డను పేరు గల రాజు, ఆసీత్=ఉండెను.

తా. బ్రహ్మకుమారు డైన కుశు డను ఒక మహాపురుషుడు ఉండెను. అతడు గొప్ప తపస్సు కలవాడు, ఎన్నడును నియమములకు భంగము కలిగించని వాడు. ధర్మములను ఎరిగినవాడు. సజ్జనులను పూజించువాడు. 1

మూ. స మహాత్మా కులీనాయాం యుక్తాయాం సుగుణోల్బణాన్,
వైదర్భ్యాం జనయామాస చతురః సదృశాన్ సుతాన్. 2
కుశామ్బం కుశనాభం చ అధూర్తరజసం వసుమ్.

ప్ర. అ. సః మహాత్మా = ఆ మహాత్ముడు, కులీనాయామ్ = సత్కులము నందు పుట్టినదియు, యుక్తాయామ్ = తనకు తగినదియు అగు, వైదర్భ్యామ్ = విదర్భరాజకుమారి యందు, కుశామ్బమ్=కుశాంబుని, కుశనాభం చ = కుశనాభుని, అధూర్తరజసమ్ = అధూర్తరజసుని, వసుమ్ = వసువును, సుగుణోల్బణాన్=సుగుణములతో నిండిన, సదృశాన్=తనకు తగిన, చతురః=నలుగురు, సుతాన్=కుమారులను, జనయామాస=పుట్టించెను.

తా. ఆ మహాత్మునకు సత్కులసంజాతురాలును, తనకు తగినదియు అగు విదర్భరాజకుమారియందు కుశాంబుడు, కుశనాభుడు, అధూర్తరజసుడు, వసువు అనెడు సుగుణవంతు లైన, తనతో సమాను లైన, నలుగురు కుమారులు జనించిరి. 2

మూ. దీప్తియుక్తాన్ మహోత్సాహాన్ క్షత్రధర్మచికీర్షయా,
తానువాచ కుశః పుత్రాన్ ధర్మిష్ఠాన్ సత్యవాదినః. 3

ప్ర. కుశః = కుశుడు, దీప్తియుక్తాన్=కాంతితో కూడినవారును, మహోత్సాహాన్=గొప్ప ఉత్సాహము కలవారును, ధర్మిష్ఠాన్ = ధర్మనిరతులును, సత్యవాదినః=సత్యము పలుకువారును అగు, తాన్=ఆ, పుత్రాన్=పుత్రులను గూర్చి, క్షత్రధర్మచికీర్షయా = క్షత్రియధర్మమును ఆచరింపవలె ననెడు అభిలాషచే, ఉవాచ=పలికెను.

తా. కుశమహారాజు, రాజధర్మమును అనుష్ఠింప వలె ననెడు అభిలాషచే, ప్రకాశవంతులును, గొప్ప ఉత్సాహము కలవారును, ధర్మనిరతులును, సత్యమునే పలుకువారును అగు ఆ పుత్రులతో ఇట్లు పలికెను. 3

మూ. క్రియతాం పాలనం పుత్రా ధర్మం ప్రాప్స్యథ పుష్కలమ్. 4
ఋషేస్తు వచనం శ్రుత్వా చత్వారో లోకసంమతాః,
నివేశం చక్రిరే సర్వే పురాణాం నృవరాస్తదా. 5

ప్ర. అ. పుత్రాః=పుత్రులారా, పాలనమ్=పాలనము, క్రియతామ్=చేయబడుగాక. పుష్కలమ్=అధికమైన, ధర్మం=ధర్మమును, ప్రాప్స్యథ=పొందగలరు. తదా=అప్పుడు, ఋషేః = ఆ ఋషియొక్క, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా=విని, లోకసంమతాః=లోకమునందు పూజ్యులైన, చత్వారః=నలుగురు, నృవరాః=నరశ్రేష్ఠులు, సర్వే = అందరును, పురాణామ్ = పట్టణములయొక్క, నివేశమ్=ఏర్పాటును, చక్రిరే=చేసిరి.

తా. "పుత్రులారా! పాలనము చేయుడు. అత్యధికమైన ధర్మమును పొందెదరు." ఆ ఋషి మాటలు విని, లోకముచే పూజింపబడిన ఆ నరశ్రేష్ఠులు నలుగురును పటణముల నిర్మాణము చేసిరి. 4, 5

మూ. కుశామ్బస్తు మహాతేజాః కౌశామ్బీమకరోత్పురీమ్,
కుశనాభస్తు ధర్మాత్మా పురం చక్రే మహోదయమ్. 6

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, కుశామ్బస్తు=కుశాంబుడైతే, కౌశామ్బీమ్=కౌశాంబి యనెడు, పురీమ్=పట్టణమును, అకరోత్ = నిర్మించెను.

ధర్మాత్మా = ధర్మాత్ముడైన, కుశనాభస్తు = కుశనాభుడైతే, మహోదయమ్= మహోదయ మనే పేరు గల, పురమ్=పట్టణమును, చక్రే=నిర్మించెను.

తా. మహాతేజశ్శాలి యగు కుశాంబుడు కౌంశాంబీనగరమును, ధర్మాత్ము డైన కుశనాభుడు మహోదయపురమును నిర్మించిరి. 6

మూ. అధూర్తరజసో రామ ధర్మారణ్యం మహీపతిః,
చక్రే పురవరం రాజా వసుశ్చక్రే మహోదయమ్. 7

ప్ర. అ. రామ=రామా, అధూర్తరజసః = అధూర్తరజసుడనే పేరుగల, మహీపతిః=రాజు, ధర్మారణ్యమ్=ధర్మారణ్య మనెడు, పురవరమ్=శ్రేష్ఠ మైన పురమును, చక్రే=నిర్మించెను. రాజా=రాజైన, వసుః=వసువు, మహోదయమ్= మహోదయ మనెడు పురమును, చక్రే=నిర్మించెను.

తా. రామా! అధూర్తరజసుడు ధర్మారణ్య మనెడు నగరశ్రేష్ఠమును, వసురాజు మహోదయపురమును నిర్మించిరి. 7

మూ. ఏషా వసుమతీ రామ వసోస్తస్య మహాత్మనః,
ఏతే శైలవరాః పఞ్చ ప్రకాశన్తే సమన్తతః. 8

ప్ర. అ. రామ = రామా, ఏషా = ఇది, మహాత్మనః = మహాత్ముడైన, తస్య వసోః=ఆ వసువుయొక్క, వసుమతీ=భూమి. సమన్తతః = దీనిచుట్టును, పఞ్చ=ఐదు, శైలవరాః = శ్రేష్ఠ మైన పర్వతములు, ప్రకాశన్తే = ప్రకాశించు చున్నవి.

తా. రామా! ఇది ఆ మహాత్ముడైన వసువు భూమి. దీని చుట్టును ఐదు ఉత్తమ పర్వతములు ప్రకాశించుచున్నవి. 8

మూ. సుమాగధీ నదీ రమ్యా మగధాన్ విశ్రుతా యయౌ,
పఞ్చానాం శైలముఖ్యానాం మధ్యే మాలేవ శోభతే. 9

ప్ర. అ. రమ్యా=సుందరమైన, విశ్రుతా=ప్రసిద్ధమైన, సుమాగధీ నదీ= మగధదేశమునందు పుట్టిన శోణనది, మగధాన్=మగధదేశమును, ఆయయౌ=

పొందినది. పఞ్చానామ్=ఐదు, శైలముఖ్యానామ్=ముఖ్యమైన శైలములయొక్క, మధ్యే=మధ్యయందు, మాలేవ=మాల వలె, రాజతే=ప్రకాశించుచున్నది.

తా. మగధదేశమునందు పుట్టిన, రమ్య మైన, ప్రసిద్ధ మైన శోణనది మగధదేశమును పొందినది. ఇది ఐదు శైలముల మధ్య పుష్పమాల వలె ప్రకాశించుచున్నది. 9

మూ. సైషా హి మాగధీ రామ వసో స్తస్య మహాత్మనః,
పూర్వాభిచరితా రామ సుక్షేత్రా సస్యమాలినీ. 10

ప్ర. అ. రామ=రామ, సా = ఆ, ఏషా = ఈ, మాగధీ = శోణనది, మహాత్మనః=మహాత్ము డైన, తస్య=ఆ, వసోః = వసువునకు సంబంధించినది. పూర్వాభిచరితా = తూర్పునుండి ప్రవహించుచున్నది. సుక్షేత్రా = మంచి క్షేత్రములు కలది. సస్యమాలినీ=సస్యపంక్తులు కలది.

తా. రామా! ఈ శోణనది ఆ వసువునకు సంబంధించినది. తూర్పునుండి పశ్చిమము వైపు ప్రవహించుచున్నది. దీని తీరప్రాంతములందు మంచి సస్యములతో నిండిన పొలము లున్నవి. 10

మూ. కుశనాభసు రాజర్షిః కన్యాశతమనుత్తమమ్,
జనయామాస ధర్మాత్మా ఘృతాచ్యాం రఘునన్దన. 11

ప్ర. అ. రఘునన్దన = రామా, ధర్మాత్మా = ధర్మాత్ముడును, రాజర్షిః= రాజర్షియు అయిన, కుశనాభస్తు=కుశనాభుడైతే, ఘృతాచ్యామ్=ఘృతాచియందు, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, కన్యాశతమ్ = కన్యాశతమును, జనయామాస= పుట్టించెను.

తా. రామా! ధర్మాత్ముడును, రాజర్షియు అగు కుశనాభుడు, ఘృతాచి యను అప్సరఃస్త్రీయందు అత్యుత్తమ లైన నూరుగురు కన్యలను కనెను. 11

మూ. తాస్తు యౌవనశాలిన్యో రూపవత్యః స్వలఙ్కృతాః,
ఉద్యానభూమిమాగమ్య ప్రావృషీవ శతహ్రదాః. 12

గాయన్త్యో నృత్యమానాశ్చ వాదయన్త్యశ్చ సర్వశః,
ఆమోదం పరమం జగ్ముర్వరాభరణభూషితాః. 13

ప్ర. అ. యౌవనశాలిన్యః = యౌవనముతో ప్రకాశించుచున్న, రూపవత్యః=సౌందర్యవతు లైన, తాః=ఆ కన్యకలు, స్వలఙ్కృతాః = బాగుగా అలంకరించుకున్నవారై, ఉద్యానభూమిమ్=ఉద్యానప్రదేశమును, ఆగమ్య=చేరి, ప్రావృషి=వర్షాకాలమునందు, శతహ్రదాః ఇవ=మెరుపుల వలె ప్రకాశించుచు, గాయన్త్యః=గానము చేయుచున్నవారై, నృత్యమానాశ్చ=నాట్యము చేయుచున్న వారై, వాదయన్త్యః=వీణాదులను ప్రయోగించుచున్నవారై, సర్వాభరణభూషితాః=సమస్తము లైన అలంకారములచే అలంకరింపబడినవారై, సర్వశః = అన్ని వైపుల తిరుగుచు, పరమమ్=గొప్ప, ఆమోదమ్ = ఆనందమును, జగ్ముః= పొందిరి.

తా. యౌవనముతో ప్రకాశించుచున్న, రూపవతు లగు ఆ కన్యలు సకలాభరణములతో చక్కగ అలంకరించుకొని, వర్షాకాలమునందు మెరుపు తీగలవలె ప్రకాశించుచు, ఉద్యానములో నలుమూలల విహరించుచు, గానము చేయుచు, నాట్య మాడుచు, వాద్యములను ప్రయోగించుచు గొప్ప ఆనందమును పొందిరి. 12, 13

మూ. అథ తాశ్చారుసర్వాఙ్గ్యో రూపేణాప్రతిమా భువి,
ఉద్యానభూమిమాగమ్య తారా ఇవ ఘనాన్తరే. 14

ప్ర. అ. అథ=పిమ్మట, చారుసర్వాఙ్గ్యః=సుందరమైన సకలావయవములు కల, రూపేణ=సౌందర్యముచేత, భువి=భూమియందు, అప్రతిమాః=సాటిలేని, తాః=ఆ కన్యలు, ఉద్యానభూమిమ్ = ఉద్యానప్రదేశమును, ఆగమ్య = పొంది, ఘనాన్తరే=మేఘముల మధ్య, తారాః ఇవ=నక్షత్రములవలె, (ప్రకాశించిరి).

తా. అందమైన సకలావయవములు కలిగి భూలోకమునందు సాటి లేని రూపము గల ఆ కన్యకలు, ఉద్యానమును చేరి, మేఘమధ్యమునందు, నక్షత్రముల వలె ప్రకాశించిరి. 14

మూ. తాః సర్వగుణసంపన్నా రూపయౌవనసంయుతాః,
దృష్ట్వా సర్వాత్మకో వాయురిదం వచనమబ్రవీత్. 15

ప్ర. అ. సర్వాత్మకః=అంతటను సంచరించు, వాయుః=వాయుదేవుడు, సర్వగుణసంపన్నాః = అన్ని సద్గుణములతో కూడినవారును, రూపయౌవన సంయుతాః = రూపముతోడను యౌవనముతోడను కూడినవారును అగు, తాః= వారిని, దృష్ట్వా=చూచి, ఇదమ్ = ఈ, వచనమ్ = వాక్యమును, అబ్రవీత్= పలికెను.

తా. అంతటను సంచరించు వాయుదేవుడు, సర్వగుణసంపన్నలై, రూప యౌవనములతో ప్రకాశించుచున్న ఆ కన్యలను చూచి ఇట్లు పలికెను. 15

మూ. అహం వః కామయే సర్వా భార్యా మమ భవిష్యథ,
మానుషస్త్యజ్యతాం భావో దీర్ఘమాయురవాప్స్యథ. 16

ప్ర. అ. అహమ్=నేను, వః=మిమ్ములను, సర్వాః=అందరిని, కామయే= కోరుచున్నాను. మమ=నా యొక్క, భార్యాః=భార్యలుగా, భవిష్యథ=కాగలరు. మానుషః=మనుష్యసంబంధ మైన, భావః=స్వభావము, త్యజ్యతామ్ = విడువ బడు గాక. దీర్ఘమ్=దీర్ఘ మైన, ఆయుః = ఆయుర్దాయమును, అవాప్స్యథ= పొందుదు.

తా. నేను మిమ్ముల నందరిని కోరుచున్నాను. నా భార్యలు కండు. నన్ను వివాహము చేసికొనినచో మనుష్యత్వము పోయి మీకు దీర్ఘాయువు లభించును. 16

మూ. చలం హి యౌవనం నిత్యం మానుషేషు విశేషతః,
అక్షయ్యం యౌవనం ప్రాప్తా అమర్యశ్చ భవిష్యథ. 17

ప్ర. అ. నిత్యమ్=ఎల్లపుడును, యౌవనమ్=యౌవనము, చలం హి= అస్థిర మైనది. మానుషేషు=మనుష్యులలో, విశేషతః = అధికముగ అస్థిరము. అక్షయ్యమ్=అంతు లేని, యౌవనమ్ = యౌవనమును, ప్రాప్తాః=పొందినవారై, అమర్యః చ=దేవతాస్త్రీలుగాకూడ, భవిష్యథ=కాగలరు.

తా. యౌవన మనునది అస్థిరము. మనుష్యులలో ఇంకను అస్థిరము. నన్ను పెండ్లాడినచో శాశ్వత మైన యౌవనముతో దేవతాస్త్రీలుగా కాగలరు. 17

మూ. తస్య తద్వచనం శ్రుత్వా వాయోరక్లిష్టకర్మణః,
అపహాస్య తతో వాక్యం కన్యాశతమథాబ్రవీత్. 18

ప్ర. అ. తతః=పిమ్మట, అక్లిష్టకర్మణః = అడ్డు పెట్టబడని కర్మగల, తస్య వాయోః=ఆ వాయుదేవునియొక్క, తత్ = ఆ, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా=విని, అపహాస్య=పరిహసించి, కన్యాశతమ్=కన్యకల శతము, అథ= అటుపిమ్మట, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. ఏ పనిచేయుటకైనను అడ్డు లేని ఆ వాయువు మాటలు విని, ఆ నూర్గురు కన్యలు పరిహాసపూర్వకముగా ఇట్లనిరి. 18

మూ. అన్తశ్చరసి భూతానాం సర్వేషాం త్వం సురోత్తమ,
ప్రభావజ్ఞాః స్మ తే సర్వాః కిమస్మానవమన్యసే. 19

ప్ర. అ. సురోత్తమ=ఓ దేవతాశ్రేష్ఠుడా, త్వమ్ = నీవు, సర్వేషామ్= సమస్త మైన, భూతానామ్=భూతములయొక్క, అన్తః=లోపల, చరసి=సంచరించుచున్నావు. సర్వాః=మేమందరము, తే=నీయొక్క, ప్రభావజ్ఞాః=ప్రభావమును ఎరిగిన వారముగా, స్మ = అయి ఉన్నాము. అస్మాన్ = మమ్ములను, కిమ్ అవమన్యసే=ఎందుకు అవమానము చేయుచున్నావు ?

తా. ఓ సురోత్తమా! నీవు సర్వప్రాణులలోపల సంచరించువాడవు. నీ ప్రభావము మాకందరకును తెలియును. మమ్ములను ఎందుకు ఇట్లు అవమానించు చున్నావు ? 19

మూ. కుశనాభసుతాః సర్వాస్సమర్థాస్త్వాం సురోత్తమ,
స్థానాచ్చ్యావయితుం దేవం రక్షామస్తు తపో వయమ్. 20

ప్ర. అ. సురోత్తమ=ఓ దేవతాశ్రేష్ఠుడా, సర్వాః వయం=మేమందరము, కుశనాభసుతాః = కుశనాభుని కుమార్తెలము. దేవమ్ = దేవత వైన, త్వామ్= నిన్ను, స్థానాత్ = నీఅధికారమునుండి, చ్యావయితుమ్ = తొలగించుటకు,

సమర్థాః=సామర్థ్యము కలవారము. తు=కాని, తపః = తపస్సును, రక్షామః= రక్షించుకొనుచున్నాము.

తా. ఓ సురోత్తమా! మేము మందరమును కుశనాభుని కుమార్తెలము. నీవు దేవతవే యైనను నిన్ను నీ అధికారమునుండి తొలగించు సామర్థ్యము మాకున్నది గాని తపస్సును రక్షించుకొనుటకై అట్లు చేయుటలేదు. 20

మూ. మా భూత్స కాలో దుర్మేధః పితరం సత్యవాదినమ్,
అవమన్య స్వధర్మేణ స్వయం వరముపాస్మహే. 21

ప్ర. అ. దుర్మేధః=దుష్టబుద్ధి కలవాడా! సత్యవాదినమ్ = సత్యమునే పలికెడు, పితరమ్=తండ్రిని, అమమన్య=అవమానించి, స్వధర్మేణ=స్వేచ్ఛచేత, స్వయమ్=స్వయముగనే, వరమ్=వరుని, ఉపాస్మహే/= ఎపుడు సేవింతుమో, సః=ఆ, కాలః=కాలము, మాభూత్=రాక పోవుగాక.

తా. ఓ దుర్బుద్ధీ! సత్యవాది యైన తండ్రిని కాదని స్వేచ్ఛానుసారముగా, మేమే స్వయముగ వరుని పొందెడు కాలము ఎన్నటికిని రాకుండు గాక. 21

మూ. పితా హి ప్రభురస్మాకం పరమం దైవతం హి సః,
యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి. 22

ప్ర. అ. అస్మాకమ్=మాకు, పితా=తండ్రియే, ప్రభుః హి = ప్రభువు కదా. సః=అతడే, పరమమ్=గొప్ప, దైవతమ్=దేవత. పితా = మా తండ్రి, నః=మమ్ములను, యస్య=ఎవనికి, దాస్యతి=ఇవ్వగలడో, సః=అతడే, నః= మాకు, భర్తా=భర్తగా, భవిష్యతి=కాగలడు.

తా. మాకు తండ్రియే ప్రభువు; తండ్రియే దేవత; మా తండ్రి మమ్ములను ఎవరి కిచ్చునో ఆతడే మా భర్త కాగలడు. 22

మూ. తాసాం తద్వచనం శ్రుత్వా వాయుః పరమకోపనః,
ప్రవిశ్య సర్వగాత్రాణి బభఞ్జ భగవాన్ ప్రభుః. 23

ప్ర. అ. తాసామ్=ఆ కన్యలయొక్క, తత్ వచనమ్=ఆ వాక్యమును, శ్రుత్వా=విని, ప్రభుః = సమర్థుడైన, భగవాన్=మాహాత్మ్యముగల, వాయుః=

వాయువు, పరమకోపనః=మిక్కిలి కోపము కలవాడై, సర్వగాత్రాణి = అన్ని అవయములను, ప్రవిశ్య=ప్రవేశించి, బభఞ్జ=భగ్నము చేసెను.

తా. ఆ కన్యకల వాక్యము విని, సామర్థ్యవంతు డగు వాయువు చాల కోపించి, అవయవము లన్నింటిలోనికి ప్రవేశించి వాటిని దుర్బలములుగ చేసెను. 23

మూ. తాః కన్యా వాయునా భగ్నా వివిశుర్నృపతేర్గృహమ్,
ప్రాపతన్ భువి సంభ్రాన్తాః సలజ్జాః సాస్రలోచనాః. 24

ప్ర. అ. వాయునా = వాయువుచేత, భగ్నాః = బలవిహీనలుగా చేయబడిన, తాః కన్యాః=ఆ కన్యలు, నృపతేః=రాజుయొక్క, గృహమ్ = గృహమును, వివిశుః=ప్రవేశించిరి. సంభ్రాన్తాః = తొట్రుపడుచున్నవారై, సలజ్జాః= లజ్జతో కూడినవారై, సాస్రలోచనాః = కన్నీళ్లతో కూడిన నేత్రములు కలవారై, భువి=భూమిపై, ప్రాపతన్=పడిరి.

తా. వాయువుచేత ఆ విధముగ పీడింపబడిన ఆ కన్యకలు రాజగృహములోనికి ప్రవేశించి, తొట్రుపడుచు, కన్నీళ్లు కార్చుచు, సిగ్గుపడుచు నేలమీద పడిరి. 24

మూ. స చ తా దయితా దీనాః కన్యాః పరమశోభనాః,
దృష్ట్వా భగ్నాస్తదా రాజా సంభ్రాన్త ఇదమబ్రవీత్. 25

ప్ర. అ. సః రాజా=ఆ రాజు, తదా = అప్పుడు, దయితాః = ఇష్టమైనవారును, దీనాః=దీనలును, పరమశోభనాః = మిక్కిలి అందమైనవారును అగు, తాః కన్యాః=ఆ కన్యలను, భగ్నాః = ఆ విధముగ దుర్బలలుగ చేయబడినవారినిగా, దృష్ట్వా=చూచి, సంభ్రాన్తః=కలతచెందినవాడై, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. అప్పుడా కుశనాభుడు మిక్కిలి ప్రకాశించు తన ప్రియపుత్రికలు భగ్నలై, దైన్యముతో నుండుట చూచి ఇట్లు పలికెను. 25

మూ. కిమిదం కథ్యతాం పుత్ర్యః కో ధర్మమవమన్యతే,
కుబ్జాః కేన కృతాః సర్వా వేష్టన్త్యో నాభిభాషథ. 26
ఏవం రాజా వినిశ్వస్య సమాధిం సందధే తతః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ద్వాత్రింశః సర్గః.

ప్ర. అ. పుత్ర్యః = పుత్రికలారా! ఇదమ్ = ఇది, కిమ్=ఏమి ? కః= ఎవడు, ధర్మమ్ = ధర్మమును, అవమన్యతే = అవమానముచేయుచున్నాడు ? కథ్యతామ్=చెప్పబడుగాక. సర్వాః=మీరందరును, కుబ్జాః=గూనివారుగా, కేన= ఎవనిచే, కృతాః=చేయబడినారు? వేష్టన్త్యః=దొర్లుచు, నాభిభాషథ=మాటలాడ రేమి ? రాజా=రాజు, ఏవమ్ = ఈ విధముగా పలికి, వినిశ్వస్య=నిట్టూర్చి, తతః = పిమ్మట, సమాధిమ్ = సావధానత్వమును, సందధే = కూర్చుకొనెను.

తా. "పుత్రికలారా! ఇది యేమి! ఈ విధముగ ధర్మమును అవమానించు చున్నవాడు ఎవడు ? చెప్పుడు. మిమ్ముల నందరిని గూనివాళ్లనుగా చేసినది ఎవడు ? నేలపై దొర్లుచు మాటలాడకున్నా రేమి ?" రాజు ఈ విధముగ పలికి, నిట్టూర్చి, ఏమి చెప్పెదరో అని వినుటకై సావధానచిత్తుడై ఉండెను. 26

"బాలానన్దిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండములో ముప్పది రెండవ సర్గ సమాప్తము.

అథ త్రయస్త్రింశః సర్గః

మూ. తస్య తద్వచనం శ్రుత్వా కుశనాభస్య ధీమతః
శిరోభిశ్చరణౌ స్పృష్ట్వా కన్యాశతమభాషత. 1

ప్ర. అ. ధీమతః = బుద్ధిమంతు డైన, తస్య కుశనాభస్య = ఆ కుశ నాభునియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, కన్యాశతమ్= కన్యకలశతము, శిరోభిః = శిరస్సులచేత, చరణౌ = తండ్రిపాదములను, స్పృష్ట్వా = స్పృశించి, అభాషత = పలికెను.

తా. బుద్ధిమంతు డైన ఆ కుశనాభుని మాటలు విని, ఆ నూర్గురు కన్యలును తండ్రి పాదములకు నమస్కరించి ఇట్లు పలికిరి. 1

మూ. వాయుః సర్వాత్మకో రాజన్ ప్రధర్షయితుమిచ్ఛతి,
అశుభం మార్గమాస్థాయ న ధర్మం ప్రత్యవేక్షతే. 2

ప్ర. అ. రాజన్ = రాజా! సర్వాత్మకః = సర్వవ్యాపియైన, వాయుః = వాయువు, అశుభమ్ = అశుభమైన, మార్గమ్ = మార్గమును, ఆస్థాయ = అనుసరించి, ప్రధర్షయితుమ్ = తిరస్కరించుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు. ధర్మమ్ = ధర్మమును, న ప్రత్యవేక్షతే = చూచుటలేదు.

తా. తండ్రీ! సర్వవ్యాపి యైన వాయువు చెడు మార్గము నవలంబించి మమ్ములను తిరస్కరించుటకు ప్రయత్నించుచున్నాడు. ధర్మమును లెక్కచేయుటలేదు. 2

మూ. పితృమత్యః స్మ భద్రం తే స్వచ్ఛన్దే న వయం స్థితాః,
పితరం నో వృణీష్వ త్వం యది నో దాస్యతే తవ. 3

ప్ర. అ. వయమ్ = మేము, పితృమత్యః = తండ్రికలవారముగా, స్మ = ఉన్నాము. తే = నీకు, భద్రమ్ = మంగళమగుకాక, స్వచ్ఛన్దే = స్వాతంత్ర్యమునందు, న స్థితాః = లేము. నః = మమ్ములను, తవ = నీకు, దాస్యతే యది =

ఇచ్చునేమో; త్వమ్ = నీవు, నః=మాయొక్క, పితరమ్=తండ్రిని, వృణీష్వ= కోరుము.

తా. "మా తండ్రిగా రున్నారు. నీకు భద్ర మగుగాక. మేము స్వతంత్రలము కాము. మా తండ్రి మమ్ములను నీ కిచ్చు నేమో ఆయనను కోరుము." 3

మూ. తేన పాపానుబన్ధేన వచనం న ప్రతీచ్ఛతా,
ఏవం బ్రువన్త్యః సర్వాః స్మ వాయునా నిహతా భృశమ్. 4

ప్ర. అ. ఏవమ్ = ఈవిధముగా, బ్రువన్త్యః = పలుకుచున్న, సర్వాః = మేమందరము, పాపానుబన్ధేన = పాపసంబంధము గలవాడును, వచనమ్ = మా మాటను, న ప్రతీచ్ఛతా = అంగీకరించని, తేన వాయునా = ఆ వాయువుచేత, భృశమ్ = మిక్కిలి, నిహతాః = కొట్టబడితిమి.

తా. పాపాశయు డైన ఆ వాయువు మేమిట్లు చెప్పగా మా మాటల నంగీకరింపక మమ్ములను ఈ విధముగ పీడించినాడు. 4

మూ. తాసాం తద్వచనం శ్రుత్వా రాజా పరమధార్మికః,
ప్రత్యువాచ మహాతేజాః కన్యాశతమనుత్తమమ్. 5

ప్ర. అ. పరమధార్మికః = పరమధార్మికుడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును అగు, రాజా = రాజు, తాసామ్ = వారియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా=విని, అనుత్తమమ్ = అత్యుత్తమ మైన, కన్యాశతమ్ = కన్యాశతమును గూర్చి, ప్రత్యువాచ = తిరిగిపలికెను.

తా. పరమధార్మికుడును, మహాతేజఃశాలియు అగు కుశనాభుడు వారి మాటలు విని వారితో ఇట్లనెను. 5

మూ. క్షాన్తం క్షమావతాం పుత్ర్యః కర్తవ్యం సుమహత్కృతమ్,
ఐకమత్యముపాగమ్య కులం చావేక్షితం మమ. 6

ప్ర. అ. పుత్ర్యః = పుత్రికలారా! క్షమావతామ్ = ఓర్పుకలవారియొక్క, కర్తవ్యమ్ = కర్తవ్యమైన, క్షాన్తమ్ = క్షమించుట, కృతమ్ = చేయబడినది.

సుమహత్ = ఇది గొప్పకార్యము. ఐకమత్యమ్=ఐకమత్యమును, ఉపాశ్రిత్య = ఆశ్రయించి, మమ = నాయొక్క, కులం చ = కులము కూడ, అవేక్షితమ్ = చూడబడినది.

తా. పుత్రికలారా! ఓర్పు కలవారు. చేయతగిన క్షమించుట అను గొప్ప పని చేసినారు. ఇది చాల ప్రశంసనీయము. మీరందరును ఒకే విధమగు ఆలోచనతో నావంశగౌరవమును కాపాడినారు. 6

మూ. అలఙ్కారో హి నారీణాం క్షమా తు పురుషస్య వా,
దుష్కరం తచ్చ యత్ క్షాన్తం త్రిదశేషు విశేషతః. 7
యాదృశీ వః క్షమా పుత్ర్యః సర్వాసామవిశేషతః.

ప్ర. అ. నారీణామ్ = స్త్రీలకు గాని, పురుషస్య వా = పురుషునకు గాని, క్షమా = ఓర్పు, అలఙ్కారో హి = అలంకారము కదా. క్షాన్తమ్ ఇతి యత్ = క్షమించుట అనునది ఏది కలదో, తత్ = అది, దుష్కరమ్ = చేయ శక్యము కానిది. త్రిదశేషు = దేవతలయందు, అనగా - దేవాంశసంభూతులయందు, విశేషతః = విశేషముగ దుష్కరము. పుత్ర్యః = పుత్రికలారా, వః = మీకు, సర్వాసామ్ = అందరికిని, అవిశేషతః = భేదము లేకుండగ, యాదృశీ = ఎట్టి, క్షమా = ఓర్పు ఉన్నదో, అది ఇంకను దుష్కర మైనది.

తా. స్త్రీల కైనను, పురుషుల కైనను ఓర్పు అనునది అలంకారము కదా? క్షమించుట అనునది చేయశక్యము కాని పని. రూపయౌవనాదులు గల దేవతలకు ఓర్పు ఉండుట ఇంకను కష్టము. మీరందరును ఒకే విధమున ఓర్పు చూపుట ఇంకను మెచ్చుకొనవలసిన విషయము. (తన కుమార్తెలు దేవతాస్త్రీల వంటివారు గాన దేవత లని చెప్పినాడు. వారి తల్లి ఘృతాచి అప్సరస కదా). 7

మూ. క్షమా దానం క్షమా యజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః, 8
క్షమా యశః క్షమా ధర్మః క్షమయా విష్ఠితం జగత్.

ప్ర. అ. క్షమా = ఓర్పు, దానమ్ = దానము. క్షమా = ఓర్పే, యజ్ఞః = యజ్ఞము. పుత్రికాః = పుత్రికలారా! క్షమా = ఓర్పే, సత్యం హి = సత్యము

కదా ? క్షమా = ఓర్పే, యశః = కీర్తి. క్షమా = ఓర్పే, ధర్మః = ధర్మము. జగత్ = జగత్తు, క్షమయా = ఓర్పుచేత, విష్ఠితమ్ = నిలచి ఉన్నది.

తా. పుత్రికలారా ! ఓర్పే దానము; ఓర్పే యజ్ఞము; ఓర్పే సత్యము; ఓర్పే కీర్తి; ఓర్పే ధర్మము. ఓర్పుమీదనే ఈ జగత్తు నిలచి ఉన్నది. 8

మూ. విసృజ్య కన్యాః కాకుత్స్థ రాజా త్రిదశవిక్రమః. 9
మన్త్రజ్ఞో మన్త్రయామాస ప్రదానం సహ మన్త్రిభిః,
దేశకాలౌ ప్రదానస్య సదృశే ప్రతిపాదనమ్. 10

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! త్రిదశవిక్రమః = దేవతల వంటి పరాక్రమము గల, మన్త్రజ్ఞః = ఆలోచనను ఎరిగిన, రాజా = రాజు, కన్యాః = కన్యకలను, విసృజ్య = విడచి, మన్త్రిభిః సహ=మంత్రులతో కూడ, ప్రదానమ్=(కన్యకల) దానమును గూర్చి, మన్త్రయామాస=ఆలోచించెను. ప్రదానస్య=కన్యాదానమునకు, దేశకాలౌ=తగినదేశకాలములను, సదృశే=తగినవానికి, ప్రతిపాదనమ్= ఇచ్చుటనుగూర్చి (ఆలోచించెను).

తా. రామా ! దేవతలవంటి పరాక్రమము కలవాడును, ఆలోచన చేయుటలో సమర్థుడును అగు ఆ కుశధ్వజుడు, కన్యకలను లోనికి పంపివేసి, వారి వివాహమును గూర్చి మంత్రులతో ఆలోచన చేసెను. కన్యాదానము చేయుటకు తగిన దేశకాలములను గూర్చియు, తగిన వరునకు ఇచ్చుట మొదలగు విషయములను గూర్చియు కూడ ఆలోచించెను. 9, 10

మూ. ఏతస్మిన్నేవ కాలే తు చూళీ నామ మహాతపాః,
ఊర్ధ్వరేతాః శుభాచారో బ్రాహ్మం తప ఉపాగమత్. 11

ప్ర. అ. ఏతస్మిన్=ఈ, కాలే ఏవ=కాలమునందే, మహాతపాః=గొప్ప తపస్సుకలవాడును, ఊర్ధ్వరేతాః=పైకి ప్రసరించు రేతస్సు కలవాడును, అనగా రేతస్స్ఖలనము లేనివాడును, శుభాచారః=శుభ మైన ఆచారము కలవాడును అగు, చూళీ నామ=చూళి అను మహర్షి, బ్రాహ్మమ్=వేదోక్త మైన, తపః=తపస్సును, ఉపాగమత్=పొందెను.

తా. ఆ కాలమునందే, మహాతపశ్శాలియు, ఊర్ధ్వరేతస్కుడును, శుభమైన ఆచారము కలవాడును అగు చూళి అను మహర్షి వేదోక్తరీతిని తపస్సు చేసెను. 11

మూ. తప్యన్తం తమృషిం తత్ర గన్ధర్వీ పర్యుపాసతే,
సోమదా నామ భద్రం తే ఊర్మిళాతనయా తదా. 12

ప్ర. అ. తదా=అప్పుడు, తత్ర=అచట, తప్యన్తమ్=తపస్సు చేయుచున్న, తమ్ ఋషిమ్=ఆ ఋషిని, ఊర్మిళాతనయా=ఊర్మిళయొక్క కుమార్తెయైన, సోమదా నామ=సోమద అను, గన్ధర్వీ = గంధర్వస్త్రీ, పర్యుపాసతే=సేవించెడిది. తే=నీకు, భద్రమ్=మంగళ మగుగాక.

తా. అక్కడ ఆతడు తపస్సు చేయుచుండగా ఊర్మిళ కుమార్తె యైన సోమద అనెడు గంధర్వస్త్రీ ఆతనికి ఉపచారములు చేయుచుండెను. రామా! ఈ పుణ్యకథను వినుటచే నీకు మంగళ మగుగాక. 12

మూ. సా చ తం ప్రణతా భూత్వా శుశ్రూషణపరాయణా,
ఉవాస కాలే ధర్మిష్ఠా తస్యాస్తుష్టోఽభవద్గురుః. 13

ప్ర. అ. సా చ=ఆమె, తమ్=ఆతని విషయమున, ప్రణతా=వినయవంతురాలై, శుశ్రూషణపరాయణా = శుశ్రూషచేయుటయందు శ్రద్ధావంతురాలై, ధర్మిష్ఠా=ధర్మమునాచరించునదై, ఉవాస=వసించెను. కాలే=కొంతకాలమునకు, గురుః=గురువు, తస్యాః = ఆమె విషయమున, తుష్టః = సంతసించినవాడు, అభవత్=ఆయెను.

తా. సోమద ఆ ఋషివిషయమున వినయవంతురాలై, శ్రద్ధాపూర్వకముగ శుశ్రూష చేయుచు, ధర్మమార్గము ననుసరించి అచట నివసించెను. కొంత కాలమునకు చూళికి ఆమెపై అనుగ్రహము కలిగెను. 13

మూ. స చ తాం కాలయోగేన ప్రోవాచ రఘునన్దన,
పరితుష్టోఽస్మి భద్రం తే కిం కరోమి తవ ప్రియమ్. 14

ప్ర. అ. సః చ=ఆ చూళిమహర్షి, కాలయోగేన = ఆమె చేసిన శుశ్రూష ఫలించు కాలము వచ్చుటచే, తామ్ = ఆమెను గూర్చి, ప్రోవాచ = పలికెను. పరితుష్టః=సంతసించినవాడను, అస్మి = అయినాను. తే = నీకు, భద్రమ్= మంగళము అగుగాక. తవ = నీకు, కిమ్ = ఏమి, ప్రియమ్ = ప్రియమును, కరోమి=చేయుదును ?

తా: రామా ! ఆమె చేసిన శుశ్రూష ఫలించు కాలము వచ్చినది. ఆ ఋషి సోమదతో- "నీ విషయమున సంతోషించితిని. నీకు క్షేమ మగుగాక, నీకు ఏమి ప్రియము చేయవలెను ?" అని పలికెను. 14

మూ. పరితుష్టం మునిం జ్ఞాత్వా గంధర్వీ మధురస్వరా,
ఉవాచ పరమప్రీతా వాక్యజ్ఞా వాక్యకోవిదమ్. 15

ప్ర. అ. మునిమ్ = మునిని, పరితుష్టమ్ = సంతోషించినవానినిగా, జ్ఞాత్వా=తెలిసికొని, మధురస్వరా=మధుర మైన స్వరముకలదియు, వాక్యజ్ఞా= వాక్యములను ఎరిగినదియు అగు; గంధర్వీ=ఆ గంధర్వాంగన, పరమప్రీతా= చాల సంతసించినదై, వాక్యకోవిదమ్=వాక్యములను ఎరిగిన ఆ మునిని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. మధుర మైన స్వరము కలదియు, మాటలాడుటలో నేర్పు కలదియు అగు ఆ గంధర్వస్త్రీ ముని అనుగ్రహించినా డని తెలిసి చాల సంతోషించినదై, మాటలలో నేర్పు గల ఆ మునితో ఇట్లనెను. 15

మూ. లక్ష్మ్యా సముదితో బ్రాహ్మ్యా బ్రహ్మభూతో మహాతపాః,
బ్రాహ్మేణ తపసా యుక్తం పుత్రమిచ్ఛామి ధార్మిక. 16

ప్ర. అ. మహాతపాః=గొప్ప తపస్సుగల నీవు, బ్రాహ్మ్యా = బ్రాహ్మణ సంబంధి యైన, లక్ష్మ్యా=శోభతో, సముదితః=కూడినవాడవై, బ్రహ్మభూతః= బ్రహ్మవంటివాడవై యున్నావు. ధార్మిక = ఓ ధార్మికుడా, బ్రాహ్మేణ = బ్రాహ్మణ సంబంధ మైన, తపసా=తపస్సుతో, యుక్తమ్=కూడిన, పుత్రమ్= పుత్రుని, ఇచ్ఛామి=కోరుచున్నాను.

తా. మహాతపః శాలి వైన నీవు, బ్రాహ్మతేజస్సుచే బ్రహ్మదేవుని వంటి వాడవై ఉన్నావు. ఓ ధార్మికుడా! బ్రాహ్మమగు తపస్సుతో కూడిన పుత్రుని కోరుచున్నాను. 16.

మూ. అపతిశ్చాస్మి భద్రం తే భార్యా చాస్మి న కస్య చిత్,
బ్రాహ్మేణోపగతాయాశ్చ దాతుమర్హసి మే సుతమ్. 17

ప్ర. అ. అపతిః చ=భర్త లేనిదాననై, అస్మి = ఉన్నాను. తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక. కస్య చిత్=ఎవ్వనికిని, భార్యా=భార్యగా, నాస్మి= లేను. ఉపగతాయాః=నిన్ను ఆశ్రయించి ఉన్న, మే = నాకు, బ్రాహ్మేణ= తపస్సుచేత (తపోమహిమచేత), సుతమ్=కుమారుని, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి=తగియున్నావు.

తా. నాకు భర్త లేదు. నీకు క్షేమ మగుగాక. నే నెవ్వరికిని భార్యను కాను. నిన్ను ఆశ్రయించి ఉన్న నాకు నీ తపోబలముచే కుమారుని ఇమ్ము. 17

మూ. తస్యాః ప్రసన్నో బ్రహ్మర్షిర్దదౌ పుత్రమనుత్తమమ్,
బ్రహ్మదత్త ఇతి ఖ్యాతం మానసం చూళిన స్సుతమ్. 18

ప్ర. అ. తస్యాః=ఆమెకు, ప్రసన్నః = అనుగ్రహించిన, బ్రహ్మర్షిః= బ్రహ్మర్షి, చూళినః = చూళియొక్క, మానసమ్ = మనస్సంకల్పమువల్లపుట్టిన, సుతమ్=కుమారుడు గాను, బ్రహ్మదత్త ఇతి=బ్రహ్మదత్తు డనియు, ఖ్యాతమ్= ప్రసిద్ధు డైన, అనుత్తమమ్=అత్యుత్తము డైన, పుత్రమ్ = పుత్రుని, దదౌ= ఇచ్చెను.

తా. ప్రసన్ను డైన ఆ బ్రహ్మర్షి ఆమె కొక అత్యుత్తము డైన పుత్రుని ఇచ్చెను. ఆతడు బ్రహ్మదత్తు డనియు, చూళి మానసపుత్రు డనియు ప్రసిద్ధి పొందెను. 18

మూ. స రాజా సౌమదేయస్తు పురీమధ్యవసత్తదా,
కామ్పిల్యాం పరయా లక్ష్మ్యా దేవరాజో యథా దివమ్. 19

ప్ర. అ. సౌమదేయః=సోమద కుమారు డైన, సః=ఆ, రాజా=రాజు, తదా=అప్పుడు, దేవరాజః = దేవేంద్రుడు, దివం యథా = స్వర్గమును వలె,

కామ్పిల్యామ్=కాంపిల్య అను పేరు గల, పురీమ్ = పట్టణమును, పరయా=గొప్ప, లక్ష్మ్యా=ఐశ్వర్యముతో, అధ్యవసత్=అధిష్ఠించి ఉండెను.

తా. అపుడు, సోమదకుమారు డైన ఆ రాజు, దేవరాజు స్వర్గమునందు వలె, కాంపిల్యానగరమునందు అత్యధికైశ్వర్యముతో నివసించెను. 19

మూ. స బుద్ధిం కృతవాన్ రాజా కుశనాభః సుధార్మికః,

బ్రహ్మదత్తాయ కాకుత్స్థ దాతుం కన్యాశతం తదా. 20

ప్ర. అ. కాకుత్స్థ=రామా ! తదా=అప్పుడు, సుధార్మికః=మంచిధార్మికు డైన, రాజా = రాజైన, సః = ఆ, కుశనాభః = కుశనాభుడు, కన్యాశతమ్=కన్యాశతమును, బ్రహ్మదత్తాయ = బ్రహ్మదత్తునకు, దాతుమ్ = ఇచ్చుటకు, బుద్ధిమ్=ఆలోచనను, కృతవాన్=చేసినాడు.

తా. రామా ! సుధార్మికు డైన ఆ కుశనాభమహారాజు తన నూర్గురు కన్యలను బ్రహ్మదత్తున కీయవలె నని నిశ్చయించెను. 20

మూ. తమాహూయ మహాతేజా బ్రహ్మదత్తం మహీపతిః,

దదౌ కన్యాశతం రాజా సుప్రీతేనాన్తరాత్మనా. 21

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, మహీపతిః = భూమికి ప్రభు వైన, రాజా = ఆ రాజు, తమ్=ఆ, బ్రహ్మదత్తమ్=బ్రహ్మదత్తుని, ఆహూయ=పిలచి, సుప్రీతేన=చాల సంతసించిన, అన్తరాత్మనా = హృదయముతో, కన్యాశతమ్ = కన్యాశతమును, దదౌ = ఇచ్చెను.

తా. మహాతేజఃశాలి యగు ఆ కుశనాభ మహారాజు, బ్రహ్మదత్తుని ఆహ్వానించి, ఆనందభరిత మైన హృదయముతో నూర్గురు కూతుళ్లను ఆతని కిచ్చి వివాహము చేసెను. 21

మూ. యథాక్రమం తతః పాణీన్ జగ్రాహ రఘునన్దన,

బ్రహ్మదత్తో మహీపాలస్తాసాం దేవపతిర్యథా. 22

ప్ర. అ. రఘునన్దన = రామా ! దేవపతిర్యథా=దేవేంద్రుని వంటివాడైన, బ్రహ్మదత్తః మహీపాలః = ఆ బ్రహ్మదత్తమహారాజు, తతః = పిమ్మట, యథాక్రమమ్ = క్రమానుసారముగా, తాసామ్ = ఆ కన్యలయొక్క, పాణీన్= హస్తములను, జగ్రాహ = పట్టుకొనెను.

తా. రామా ! దేవేంద్రునితో సమానుడైన బ్రహ్మదత్తమహారాజు, క్రమానుసారముగా ఆ కన్యల హస్తములను గ్రహించెను. 22

మూ. స్పృష్టమాత్రే తతః పాణౌ వికుబ్జా విగతజ్వరాః,
యుక్తాః పరమయా లక్ష్మ్యా బభుః కన్యాశతం తదా. 23

ప్ర. అ. తతః = పిమ్మట, పాణౌ = హస్తము, స్పృష్టమాత్రే = స్పృశింపబడినంతనే, తదా = అప్పుడు, కన్యాశతమ్ = నూరుగురు కన్యలును, వికుబ్జాః = పోయిన గూని కలవారై, విగతజ్వరాః = పోయిన జ్వరము కలవారై, పరమయా = గొప్పదైన, లక్ష్మ్యా = శోభతో, యుక్తాః = కూడినవారై, బభుః = ప్రకాశించిరి.

తా. ఆతడు హస్తములు స్పృశింపగనే, ఆ నూర్గురు కన్యలును, గూనుతొలగి, జ్వరము శాంతించి, గొప్ప శోభతో ప్రకాశించిరి. 23

మూ. స దృష్ట్వా వాయునా ముక్తాః కుశనాభో మహీపతిః,
బభూవ పరమప్రీతో హర్షం లేభే పునః పునః. 24

ప్ర. అ. మహీపతిః = రాజైన, సః = ఆ, కుశనాభః = కుశనాభుడు, వాయునా = వాయువుచేత, ముక్తాః = విడవబడిన కుమార్తెలను, దృష్ట్వా = చూచి, పరమప్రీతః = చాల సంతోషించినవాడు, బభూవ = ఆయెను. పునః పునః = మాటిమాటికిని, హర్షమ్ = ఆనందమును, లేభే = పొందెను.

తా. ఆ కుశనాభమహారాజు వాయుదోషము తొలగిపోయిన కుమార్తెలను చూచి చాలా సంతోషించెను. మాటిమాటికిని ఆనందము పొందెను. 24

మూ. కృతోద్వాహం తు రాజానం బ్రహ్మదత్తం మహీపతిః,
సదారం ప్రేషయామాస సోపాధ్యాయగణం తదా. 25

ప్ర. అ. తదా = అప్పుడు, మహీపతిః = రాజు, కృతోద్వాహమ్ = చేసికొనబడిన వివాహము కలవాడును, సదారమ్ = భార్యలతో కూడినవాడును, సోపాధ్యాయగణమ్ = ఋత్విక్కుల సముదాయముతో కూడిన వాడును అగు, రాజానమ్ = రాజైన, బ్రహ్మదత్తమ్ = బ్రహ్మదత్తుని, ప్రేషయామాస = తన రాజ్యమునకు పంపెను.

తా. కుశనాభుడు వివాహము చేసికొనిన బ్రహ్మదత్తమహారాజును, భార్యా ఋత్విగాదిసమేతముగా అతని రాజ్యమునకు పంపెను. 25

మూ. సోమదా చ సుసంహృష్టా పుత్రస్య సదృశీం క్రియామ్,
యథాన్యాయం చ గన్ధర్వీ స్నుషాస్తాః ప్రత్యనన్దత. 26
స్పృష్ట్వా స్పృష్ట్వా చ తాః కన్యాః కుశనాభం ప్రశస్య చ.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రయస్త్రింశః సర్గః.

ప్ర. అ. గన్ధర్వీ=గంధర్వస్త్రీ యైన, సోమదాపి=సోమద కూడ, తాః= ఆ, కన్యాః=కన్యలను, స్పృష్ట్వా స్పృష్ట్వా=మాటిమాటికి స్పృశించి, కుశనాభమ్= కుశనాభుని, ప్రశస్య చ=ప్రశంసించి, పుత్రస్య=పుత్రుని యొక్క, సదృశీమ్= యుక్తమైన, క్రియామ్=క్రియను, తాః=ఆ, స్నుషాః=కోడళ్లను, ప్రత్యనన్దత= అభినందించెను.

తా. సోమద ఆ కన్యకలను మాటిమాటికి ఒక్కరొక్కరుగ స్పృశించి, వారి తండ్రి యైన కుశనాభుని ప్రశంసించి, పుత్రుడు చేసిన ఆ యుక్త మైన కార్యమును (ఆ కన్యల వైరూప్యమును తొలగించుటను, లేదా వివాహక్రియను) ఆ కోడళ్లను అభినందించెను. 26

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండములో ముప్పది మూడవ సర్గ సమాప్తము.

అథ చతుస్త్రింశః సర్గః

మూ. కృతోద్వాహే గతే తస్మిన్ బ్రహ్మదత్తే చ రాఘవ,
అపుత్రః పుత్రలాభాయ పౌత్రీమిష్టిమకల్పయత్. 1

ప్ర. అ. రాఘవ=రామా! తస్మిన్ = ఆ, బ్రహ్మదత్తే = బ్రహ్మదత్తుడు, కృతోద్వాహే = చేయబడిన వివాహము కలవాడై, గతే = వెళ్లినవాడగుచుండగా, అపుత్రః = పుత్రులు లేని ఆ రాజు, పుత్రలాభాయ = పుత్రులను పొందుట కొరకు, పౌత్రీమ్ ఇష్టిమ్ = పుత్రకామేష్టిని, అకల్పయత్ = చేసెను.

తా. రామా! బ్రహ్మదత్తుడు వివాహము చేసికొని వెళ్లిన పిమ్మట, పుత్రులు లేని కుశనాభుడు, పుత్రుల కొరకై పుత్రకామేష్టిని చేసెను. 1

మూ. ఇష్ట్యాం తు వర్తమానాయాం కుశనాభం మహీపతిమ్,
ఉవాచ పరమోదారః కుశో బ్రహ్మసుతస్తదా. 2

ప్ర. అ. తదా = అప్పుడు, ఇష్ట్యామ్=పుత్రకామేష్టి, వర్తమానాయామ్= జరుగుచుండగా, పరమోదారః = మిక్కిలి ఉదారుడైన, బ్రహ్మసుతః = బ్రహ్మ పుత్రుడైన, కుశః = కుశుడు, కుశనాభమహీపతిమ్ = కుశనాభమహారాజును గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పుత్రకామేష్టి జరుగుచున్న సమయమున మిక్కిలి ఉదారుడును, బ్రహ్మ పుత్రుడును అగు కుశుడు కుశనాభునితో ఇట్లనెను. 2

మూ. పుత్రస్తే సదృశః పుత్ర భవిష్యతి సుధార్మికః,
గాధిం ప్రాప్స్యసి తేన త్వం కీర్తిం లోకే చ శాశ్వతామ్. 3

ప్ర. అ. పుత్ర = కుమారుడా! తే = నీకు, సదృశః = తగినవాడును, సుధార్మికః = మిక్కిలి ధార్మికుడును అగు, పుత్రః = కుమారుడు, భవిష్యతి = పుట్టగలడు. గాధిమ్ = గాధి అనే కుమారుని, ప్రాప్స్యసి = పొందగలవు,

తేన = ఆతనిచే, త్వమ్ = నీవు, లోకే = లోకమునందు, శాశ్వతామ్ = శాశ్వత మైన, కీర్తిం చ = కీర్తిని కూడ, (పొందగలవు).

తా. కుమారా ! నీకు తగిన వాడును, మంచి ధార్మికుడును అగు కుమారుడు జనించగలడు. గాధి యను పేరు గల ఆ కుమారుని ద్వారా నీకు లోకమున శాశ్వత మగు కీర్తి లభింపగలదు. 3

మూ. ఏవముక్త్వా కుశో రామ కుశనాభం మహీపతిమ్,
జగామాకాశమావిశ్య బ్రహ్మలోకం సనాతనమ్. 4

ప్ర. అ. రామ = రామా, కుశః = కుశుడు, మహీపతిమ్ = రాజైన, కుశనాభమ్ = కుశనాభుని గూర్చి, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, ఆకాశమ్ = ఆకాశమును, ఆవిశ్య = ప్రవేశించి, సనాతనమ్ = శాశ్వత మైన, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. రామా ! కుశుడు కుశనాభునితో ఈ విధముగ చెప్పి, ఆకాశమార్గమున శాశ్వత మగు బ్రహ్మలోకమును చేరెను. 4

మూ. కస్యచిత్త్వథ కాలస్య కుశనాభస్య ధీమతః,
జజ్ఞే పరమధర్మిష్ఠో గాధిరిత్యేవ నామతః. 5

ప్ర. అ. అథ = పిమ్మట, కస్యచిత్ కాలస్య = కొంతకాలమునకు, ధీమతః = బుద్ధిమంతు డైన, కుశనాభస్య = కుశనాభునకు, పరమధర్మిష్ఠః = మిక్కిలి ధార్మికుడును, నామతః = పేరుచే, గాధిః ఇత్యేవ = గాధియను, కుమారుడు, జజ్ఞే = పుట్టెను.

తా. కొంత కాలమునకు, ధీమంతు డైన ఆ కుశనాభునకు, గాధి యను పేరు గల పరమధార్మికు డైన కుమారుడు జనించెను. 5

మూ. స పితా మమ కాకుత్స్థ గాధిః పరమధార్మికః,
కుశవంశప్రసూతోఽస్మి కౌశికో రఘునన్దన. 6

ప్ర. అ. కాకుత్స్థ = రామా! పరమధార్మికః = మిక్కిలిధార్మికు డైన సః = ఆ, గాధిః = గాధి, మమ = నా యొక్క, పితా = తండ్రి. రఘునన్దన = ఓ రామా! కుశవంశప్రసూతః = కుశుని వంశమునందు పుట్టిన నేను, కౌశికః = కౌశికు డను పేరు గలవాడనుగా, అస్మి = అయి ఉన్నాను.

తా. రామా! పరమధార్మికు డగు ఆ గాధి నా తండ్రి. కుశుని వంశమునందు పుట్టుటచే నాకు కౌశికు డను పేరు వచ్చినది. 6

మూ. పూర్వజా భగినీ చాపి మమ రాఘవ సువ్రతా,
నామ్నా సత్యవతీ నామ ఋచకే ప్రతిపాదితా. 7

ప్ర. అ. రాఘవ = రామా, సువ్రతా = మంచి నియమములు కలదియు, నామ్నా = పేరుచేత, సత్యవతీ నామ = సత్యవతి యని ప్రసిద్ధురాలును అగు, మమ = నా యొక్క, పూర్వజా భగినీ = జ్యేష్ఠసోదరి, ఋచకే = ఋచకునికి, ప్రతిపాదితా = ఇవ్వబడినది.

తా. రామా! సత్యవతి యను పేరు గల, ఉత్తమవ్రత యగు నా అక్కగారిని ఋచకున కిచ్చి వివాహము చేసిరి. 7

మూ. సశరీరా గతా స్వర్గం భర్తారమనువర్తినీ,
కౌశికీ పరమోదారా ప్రవృత్తా చ మహానదీ. 8

ప్ర. అ. (ఆమె) భర్తారమ్ = భర్తను, అనువర్తినీ = అనుసరించుచున్నదై, సశరీరా = సశరీరురాలుగ, స్వర్గమ్ = స్వర్గమును గూర్చి, గతా = వెళ్లినది. పరమోదారా = మిక్కిలి ఉదార మైన, కౌశికీ = కౌశికి అనెడు, మహానదీ = మహానదిగ, ప్రవృత్తా చ = ఏర్పడినది.

తా. ఆమె భర్తను అనుసరించి సశరీరముగ స్వర్గమునకు వెళ్లినది. అతిశ్రేష్ఠ యగు కౌశికీమహానదిగా కూడ ప్రవహించినది. 8

మూ. దివ్యా పుణ్యోదకా రమ్యా హిమవన్తముపాశ్రితా,
లోకస్య హితకామార్థం ప్రవృత్తా భగినీ మమ. 9

ప్ర. అ. లోకస్య = లోకముయొక్క, హితకామార్థమ్ = పారలౌకిక హితముకొరకును ఐహిక సుఖముకొరకును, ప్రవృత్తా = ప్రవహించిన, దివ్యా = దివ్యమైన, పుణ్యోదకా = పుణ్య మైన ఉదకములు గల, రమ్యా = రమ్యమైన, మమ భగినీ = నా సోదరి యైన కౌశికీనది, హిమవన్తమ్ = హిమవత్పర్వతమును, ఉపాశ్రితా = ఆశ్రయించినది.

తా. లోకమునకు ఐహికాముష్మిక సుఖములను ప్రసాదించుటకై ప్రవహించుచున్నదియు, దేవతాశక్తి కలదియు, పుణ్యోదకము కలదియు, సుందరమైనదియు, నా సోదరియు అగు ఈ కౌశికీనది హిమవత్పర్వతముమీద ప్రవహించుచున్నది. 9

మూ. తతోఽహం హిమవత్పార్శ్వే వసామి నిరతః సుఖమ్,
భగిన్యాం స్నేహసంయుక్తః కౌశిక్యాం రఘునన్దన. 10

ప్ర. అ. రఘునన్దన = రామా, తతః = ఆకారణమువలన, భగిన్యామ్ = సోదరియగు, కౌశిక్యామ్ = కౌశికియందు, స్నేహసంయుక్తః = స్నేహముతో కూడిన, అహమ్ = నేను, నిరతః = ఆసక్తికలవాడనై, హిమవత్పార్శ్వే = హిమవత్పర్వతము యొక్క పార్శ్వమునందు, సుఖమ్ = సుఖముగా, వసామి = నివసించుచున్నాను.

తా. రామా ! ఆకారణముచే, సోదరి యగు కౌశికియందలి స్నేహముచే నేను హిమవత్ప్రాంతమునందు, ఎక్కువ ఆసక్తితో, సుఖముగా నివసించుచున్నాను. 10

మూ. సా తు సత్యవతీ పుణ్యా సత్యే ధర్మే ప్రతిష్ఠితా,
పతివ్రతా మహాభాగా కౌశికీ సరితాం వరా. 11

ప్ర. అ. సా = ఆ, సత్యవతీ = సత్యవతి, పుణ్యా = పుణ్యాత్మురాలు. సత్యే = సత్యమునందు, ధర్మే = ధర్మమునందును, ప్రతిష్ఠితా = స్థిరముగ నిలచినది. పతివ్రతా = పతివ్రత, మహాభాగా = పూజ్యురాలు. సరితాం వరా = నదులలో శ్రేష్ఠమైన, కౌశికీ = కౌశికిగా, (ఉన్నది).

తా. కౌశికి యను మహానదిగా ఏర్పడిన, ఆ సత్యవతి పుణ్యయైనది.

సత్యమునందును ధర్మమునందును స్థైర్యము కలది. పతివ్రత, గొప్ప భాగ్యము కలది. 11

మూ. అహం హి నియమాద్రామ హిత్వా తాం సముపాగతః,
సిద్ధాశ్రమమనుప్రాప్య సిద్ధోఽస్మి తవ తేజసా. 12

ప్ర. అ. రామ = రామా ! అహమ్ = నేను, నియమాత్ = నియమము వలన, తామ్ = ఆమెను, హిత్వా = విడచి, సముపాగతః = వచ్చినాను. సిద్ధాశ్రమమ్ = సిద్ధాశ్రమమును, అనుప్రాప్య = పొంది, తవ = నీ యొక్క, తేజసా= తేజస్సు చేత, సిద్ధః = కార్యసిద్ధిని పొందినవాడను, అస్మి = అయిఉన్నాను.

తా. రామా ! యాగనియమము పూర్తి చేసుకొనుటకై నేనామెను విడచి సిద్ధాశ్రమమునకు వచ్చితిని. నీ తేజస్సుచే కార్యసిద్ధి పొందితిని. 12

మూ. ఏషా రామ మమోత్పత్తిః స్వస్య వంశస్య కీర్తితా,
దేశస్య చ మహాబాహో యన్మాం త్వం పరిపృచ్ఛసి. 13

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా, రామ = రామా, ఏషా = ఈ, మమ=నా యొక్కయు, స్వస్య వంశస్య=నా వంశము యొక్కయు, దేశస్య చ = దేశముయొక్కయు, ఉత్పత్తిః = పుట్టుక, కీర్తితా = చెప్పబడినది. యత్ = దేనినిగూర్చి, త్వమ్ = నీవు, మామ్ = నన్ను, పరిపృచ్ఛసి = అడుగుచున్నావో.

తా. ఓ మహాబాహూ ! రామా ! నీవు చెప్పమని నన్ను అడిగితివి కదా; నేను ఎట్లు పుట్టితినో ! చెప్పినాను. 13

మూ. గతోర్ధరాత్రః కాకుత్స్థ కథాః కథయతో మమ,
నిద్రామభ్యేహి భద్రం తే మా భూద్విఘ్నోఽధ్వనీహ నః. 14

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! మమ = నేను, కథాః = కథలను, కథయతః = చెప్పుచుండగా, అర్ధరాత్రః = అర్ధరాత్రి, గతః=కడచినది. నిద్రామ్= నిద్రను, అభ్యేహి = పొందుము, తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక, ఇహ =

ఇచట, నః = మనకు, అధ్వని = మార్గమునందు, విఘ్నః = విఘ్నము, మా భూత్ = కాకుండుగాక.

తా. రామా ! నేను ఈ కథలు చెప్పుటలో అర్ధరాత్రి గడచిపోయినది. ఇక నిద్రపొమ్ము. నీకు మంగళ మగుగాక. మనకు ఈ మార్గమధ్యమున ప్రయాణ విఘ్నము కాకుండుగాక. 14

మూ. నిష్పన్దా స్తరవః సర్వే నిలీనా మృగపక్షిణః,
నైశేన తమసా వ్యాప్తా దిశశ్చ రఘునన్దన. 15

ప్ర. అ. రఘునన్దన = రామా ! తరవః = వృక్షములు, నిష్పన్దాః = నిశ్చలముగా నున్నవి. మృగపక్షిణః = మృగములును పక్షులును, సర్వే = అన్నియు, నిలీనాః = అణగి యున్నవి. దిశశ్చ = దిక్కులు కూడ, నైశేన = రాత్రికి సంబంధించిన, తమసా = చీకటిచే, వ్యాప్తాః = వ్యాపింపబడినవి.

తా. రామా ! వృక్షములు నిశ్చలముగ ఉన్నవి. మృగపక్ష్యాదులు తమ తమ స్థానములలో కదలకుండ అణగి యున్నవి. రాత్రి చీకటి అన్ని దిక్కులందును వ్యాపించినది. 15

మూ. శనైర్వియుజ్యతే సన్ధ్యా నభో నేత్రైరివావృతమ్,
నక్షత్రతారాగహనం జ్యోతిర్భిరవభాసతే. 16

ప్ర. అ. సన్ధ్యా = సంధ్యాకాలము, శనైః = మెల్ల మెల్లగా, వియుజ్యతే = తొలగిపోయినది. నక్షత్రతారాగహనమ్ = నక్షత్రములతోడను తారలతోడను నిండిన, నభః = ఆకాశము, జ్యోతిర్భిః = ఈ నక్షత్రములతో, నేత్రైః = నేత్రములచే, ఆవృతమ్ ఇవ = కప్పబడినది వలె, భాసతే = ప్రకాశించుచున్నది.

తా. మెల్ల మెల్లగా సంధ్య తొలగిపోయినది. నక్షత్రములతోడను, అశ్విన్యాదితారాగణముతోడను నిండిన ఆకాశము, జ్యోతీరూపములైన వాటిచేత వ్యాప్తమై, నేత్రములతో నిండినట్లు ఉన్నది. 16

మూ. ఉత్తిష్ఠతి చ శీతాంశుః శశీ లోకతమోనుదః,
హ్లాదయన్ ప్రాణినాం లోకే మనాంసి ప్రభయా విభో. 17

ప్ర. అ. విభో = రామప్రభూ ! శీతాంశుః = చల్లని కిరణములు గల, శశీ = చంద్రుడు, లోకతమోనుదః = లోకము యొక్క చీకటిని తొలగించుచు, ప్రభయా = కాంతిచేత, లోకే = లోకమునందలి, ప్రాణినామ్ = ప్రాణులయొక్క, మనాంసి = మనస్సులను, హ్లాదయన్ = సంతోషపెట్టుచు, ఉత్తిష్ఠతి = పైకి వచ్చుచున్నాడు.

తా. చల్లని కిరణములు గల చంద్రుడు లోకమునందలి చీకటిని తొలగించుచు, కాంతిచేత ప్రాణుల మనస్సులను ఆనందింపచేయుచు పైకి వచ్చుచున్నాడు. 17

మూ. నైశాని సర్వభూతాని ప్రచరన్తి తతస్తతః,
యక్షరాక్షససంఘాశ్చ రౌద్రాశ్చ పిశితాశనాః. 18

ప్ర. అ. నైశాని = రాత్రి సంచరించు, సర్వభూతాని = సకలప్రాణులును, యక్షరాక్షససంఘాశ్చ = యక్షరాక్షస సంఘములును, రౌద్రాః = భయంకరులైన, పిశితాశనాశ్చ = మనుష్యమాంస భక్షకులును, తతస్తతః = అక్కడక్కడ, ప్రచరన్తి = సంచరించుచున్నారు.

తా. రాత్రి సంచరించు సకలప్రాణులును, యక్షులు, రాక్షసులు, భయంకరులైన మనుష్యాశనులును అక్కడక్కడ తిరుగుచున్నారు. 18

మూ. ఏవముక్త్వా మహాతేజా విరరామ మహామునిః,
సాధు సాధ్వితి తం సర్వే మునయో హ్యభ్యపూజయన్. 19

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహామునిః = విశ్వామిత్రుడు, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, విరరామ = విరమించెను. సర్వే = సమస్తమైన, మునయః = మునులు, సాధు సాధు ఇతి = బాగున్నది బాగున్నది అని, తమ్ = ఆతనిని, అభ్యపూజయన్ = పూజించిరి.

తా. మహాతేజఃశాలి యగు విశ్వామిత్రుడు ఈ విధముగ పలికి విర మించెను. "బాగున్నది బాగున్నది" అని అనుచు మును లందరును ఆయనను ఈ విధముగ మెచ్చుకొనిరి. 19

మూ. కుశికానామయం వంశో మహాన్ ధర్మపరస్సదా,
బ్రహ్మోపమా మహాత్మానః కుశవంశ్యా నరోత్తమాః. 20

ప్ర. అ. కుశికానామ్ = కుశునిసంతానమునకు చెందిన వారియొక్క, అయమ్ = ఈ, వంశః = వంశము, మహాన్ = పూజ్య మైనది. సదా = ఎల్లప్పుడును, ధర్మపరః = ధర్మమునం దాసక్తి కలది. కుశవంశ్యాః = కుశుని వంశమునకు చెందిన, నరోత్తమాః = నరోత్తములు, మహాత్మానః = పూజ్యమైన స్వభావము కలవారు. బ్రహ్మోపమాః = బ్రహ్మదేవునితో సమానులు.

తా. "ఈ కుశవంశము పూజ్య మైనది. సర్వదా ధర్మమునం దాసక్తి కలది. కుశవంశమునందు పుట్టిన మానవోత్తములు పూజింపదగిన స్వభావము కలవారు. బ్రహ్మదేవునితో సమానులు." 20

మూ. విశేషేణ భవానేవ విశ్వామిత్ర మహాయశః,
కౌశికీ సరితాం శ్రేష్ఠా కులోద్ద్యోతకరీ తవ. 21

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి గల, విశ్వామిత్ర = విశ్వామిత్రుడా! భవానేవ = నీవే, విశేషేణ=విశేషముగా, (మహాత్ముడవు, బ్రహ్మసదృశుడవు). సరితామ్ = నదులలో, శ్రేష్ఠా = శ్రేష్ఠ యైన, కౌశికీ = కౌశికి, తవ = నీయొక్క, కులోద్ద్యోతకరీ = కులమును ప్రకాశింపచేయునది.

తా. "మహాయశఃశాలి వైన ఓ విశ్వామిత్రమహాముని! కుశవంశము లోని వారందరిలోను విశేషించి నీవు మహాత్ముడవు, బ్రహ్మతుల్యుడవు. నదులలో శ్రేష్ఠ యైన కౌశికి నీ వంశమునకు వన్నె తెచ్చి పెట్టినది." 21

మూ. ఇతి తైర్మునిశార్దూలైః ప్రశస్తః కుశికాత్మజః,
నిద్రాముపాగమచ్ఛ్రీమాన్ శ్రీమానస్తమివాంశుమాన్. 22

ప్ర. అ. ఇతి = ఈ విధముగ, తైః = ఆ, మునిశార్దూలైః = ముని శ్రేష్ఠులచేత, ప్రశస్తః = ప్రశంసింపబడిన, శ్రీమాన్ = తేజస్సు గల, కుశి

కాత్మజః = విశ్వామిత్రుడు, శ్రీమాన్ = కాంతిగల, అంశుమాన్ = సూర్యుడు, అస్తమివ = అస్త్రాద్రిని వలె, నిద్రామ్ = నిద్రను, ఉపాగమత్ = పొందెను.

తా. బ్రహ్మవర్చస్వి యగు విశ్వామిత్రుని ఆ మునిశ్రేష్ఠులు ఈ విధముగ ప్రశంసించిరి. పిమ్మట విశ్వామిత్రుడు, సూర్యుడు అస్త్రాద్రిని చేరినట్లు నిద్రను పొందెను. 22

మూ. రామోఽపి సహసౌమిత్రిః కించిదాగతవిస్మయః,
ప్రశస్య మునిశార్దూలం నిద్రాం సముపసేవతే. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
చతుస్త్రింశః సర్గః.

ప్ర. అ. సహసౌమిత్రిః = లక్ష్మణునితో కూడిన, రామోఽపి = రాముడు కూడ, కించిత్ = కొంచెము, ఆగతవిస్మయః = పొందబడిన ఆశ్చర్యము కలవాడై, మునిశార్దూలమ్ = మునిశ్రేష్ఠుని, ప్రశస్య = ప్రశంసించి, నిద్రామ్ = నిద్రను, సముపసేవతే = సేవించెను.

తా. లక్ష్మణసమేతు డగు రాముడు కూడ విశ్వామిత్రుడు చెప్పిన కథ వినుటచే కొంచెము ఆశ్చర్యము నొంది, ఆయనను ప్రశంసించి, నిద్రించెను. 23

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో ముప్పది నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చత్రింశః సర్గః

మూ. ఉపాస్య రాత్రిశేషం తు శోణాకూలే మహర్షిభిః,
నిశాయాం సుప్రభాతాయాం విశ్వామిత్రోఽభ్యభాషత. 1

ప్ర. అ. విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, రాత్రిశేషం = మిగిలిన రాత్రి, మహర్షిభిః = మహర్షులతో కూడ, శోణాకూలే = శోణానదీతీరమున, ఉపాస్య = ఉండి, నిశాయామ్ = రాత్రి, సుప్రభాతాయామ్ = బాగుగా తెల్ల వారగా, అభ్యభాషత = పలికెను.

తా. ఆ రాత్రి అంతయు మహర్షులతో శోణానదీతీరమున కడపి, విశ్వామిత్రుడు, తెల్లవారగనే, ఇట్లు పలికెను. 1

మూ. సుప్రభాతా నిశా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే,
ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే గమనాయాభిరోచయ. 2

ప్ర. అ. రామ = రామా, నిశా = రాత్రి, సుప్రభాతా = బాగా తెల్లవారినది. పూర్వా సన్ధ్యా = ప్రాతఃకాలసంధ్య, ప్రవర్తతే = వచ్చుచున్నది. ఉత్తిష్ఠ ఉత్తిష్ఠ = లెమ్ము లెమ్ము. తే = నీకు, భద్రమ్ = శుభ మగుగాక. గమనాయ = ప్రయాణమునకు, అభిరోచయ = ఆసక్తి కలవాడవు అగుము.

తా. రామా! రాత్రి బాగుగా తెల్లవారినది. ప్రాతఃకాలసంధ్య ప్రారంభమైనది. లెమ్ము లెమ్ము. నీకు మంగళ మగుగాక. ప్రయాణమునకు సన్నద్ధుడవు అగుము. 2

మూ. తచ్ఛ్రుత్వా వచనం తస్య కృత్వా పౌర్వాహ్ణికీం క్రియామ్,
గమనం రోచయామాస వాక్యం చేదమువాచ హ. 3

ప్ర. అ. తస్య = ఆతనియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, పౌర్వాహ్ణికీమ్ = పూర్వాహ్ణమునకు సంబంధించిన, క్రియామ్ = క్రియను, కృత్వా = చేసి, గమనమ్ = ప్రయాణము చేయుటకు, రోచయా

మాస = ఇష్టపడెను. ఇదమ్ = ఈ, వాక్యం చ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. విశ్వామిత్రుని మాట విని రాముడు, పూర్వాహ్ణమునందు చేయవలసిన సంధ్యావందనాదులను పూర్తి చేసికొని, ప్రయాణమునకు సిద్ధుడై, ఇట్లు పలికెను. 3

మూ. అయం శోణః శుభజలో గాధః పులినమణ్డితః,
కతరేణ పథా బ్రహ్మన్ సంతరిష్యామహే వయమ్. 4

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణోత్తమా! శుభజలః = శుభమైన ఉదకము గలదియు, పులినమణ్డితః = ఇసుకతిన్నెలచే అలంకరించబడిన, అయమ్ = ఈ, శోణః = శోణనదము, గాధః = లోతులేనిది. వయమ్ = మనము, కేన = ఏ, పథా = మార్గముచేత, సంతరిష్యామహే = దాటుదము.

తా. మునీంద్రా! శుభమైన జలము గల ఈ శోణనదము ఇసుకతిన్నెలతో ప్రకాశించుచు, లోతు తక్కువగ ఉన్నది. మనము దీనిని ఏ మార్గమున దాటవలెను? 4

మూ. ఏవముక్తస్తు రామేణ విశ్వామిత్రోఽబ్రవీదిదమ్,
ఏష పన్థా మయోద్దిష్టో యేన యాన్తి మహర్షయః. 5

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః = పలకబడిన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మహర్షయః = మహర్షులు, యేన = ఏ మార్గముచేత, యాన్తి = వెళ్లుచున్నారో, ఏషః = ఈ, పన్థాః = మార్గము, మయా = నా చేత, ఉద్దిష్టః = నిశ్చయింపబడినది.

తా. రాముని మాటలు విని విశ్వామిత్రుడు ఇట్లు పలికెను. "మహర్షులు ఏ మార్గమున వెళ్లుచున్నారో ఆ మార్గముననే పోవుదము." 5

మూ. ఏవముక్త్వా మహర్షయో విశ్వామిత్రేణ ధీమతా,
పశ్యన్తస్తే ప్రయాతా వై వనాని వివిధాని చ. 6

ప్ర. అ. ధీమతా = బుద్ధిమంతుడైన, విశ్వామిత్రేణ = విశ్వామిత్రునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తాః = పలకబడిన, తే మహర్షయః = ఆ మహర్షులు, వివిధాని = అనేకవిధము లైన, వనాని = వనములను, పశ్యన్తః = చూచుచున్న వారై, ప్రయాతాః = వెళ్లినారు.

తా. విశ్వామిత్రుని మాటలు విన్న మహర్షులు వివిధము లైన వనములను చూచుచు, ప్రయాణము చేసిరి. 6

మూ. తే గత్వా దూరమధ్వానం గతేఽర్ధదివసే తదా,
జాహ్నవీం సరితాం శ్రేష్ఠాం దదృశుర్మునిసేవితామ్. 7

ప్ర. అ. తే = వారు, దూరమ్ = దూరమైన, అధ్వానమ్ = మార్గమును, గత్వా = వెళ్లి, తదా = అప్పుడు, అర్ధదివసే = దివసము యొక్క సగము భాగము, గతే = కడచినదగుచుండగా, మునిసేవితామ్ = మునులచే సేవింపబడి నదియు, సరితామ్ = నదులలో, శ్రేష్ఠామ్ = శ్రేష్ఠ మైనదియు అగు, జాహ్నవీమ్ = గంగను, దదృశుః = చూచిరి.

తా. వారు చాల దూరము ప్రయాణము చేసి, మధ్యాహ్న సమయమునందు, నదులలో శ్రేష్ఠ మైనదియు, మునులచే సేవింపబడినదియు అగు గంగను చూచిరి. 7

మూ. తాం దృష్ట్వా పుణ్యసలిలాం హంససారససేవితామ్,
బభూవుర్ముదితాః సర్వే మునయః సహరాఘవాః. 8

ప్ర. అ. పుణ్యసలిలామ్ = పుణ్య మైన ఉదకము కలదియు, హంససారససేవితామ్ = హంసలచేతను సారసపక్షులచేతను సేవింపబడిన, తామ్ = ఆ గంగానదిని, దృష్ట్వా = చూచి, సహరాఘవాః = రామునితో కూడిన, సర్వే మునయః = మునులందరును, ముదితాః = సంతసించినవారు, బభూవుః = అయిరి.

తా. పుణ్యమైన ఉదకము కలదియు, హంససారసపక్షులతో కూడినదియు అగు ఆ గంగను చూచి, రామలక్ష్మణులును, ఆ మునులును సంతోషించిరి. 8

మూ. తస్యాస్తీరే తతశ్చక్రు స్త ఆవాసపరిగ్రహమ్,
తతః స్నాత్వా యథాన్యాయం సంతర్ప్య పితృదేవతాః. 9

హుత్వా చైవాగ్నిహోత్రాణి ప్రాశ్య చామృతవద్ధవిః,
వివిశుర్జాహ్నవీతీరే శుచౌ ముదితమానసాః, 10
విశ్వామిత్రం మహాత్మానం పరివార్య సమన్తతః.

ప్ర. అ. తతః = పిమ్మట, తే = వారు, తస్యాః = ఆ గంగానదియొక్క, తీరే = తీరమునందు, ఆవాసపరిగ్రహమ్ = నివాసస్వీకారమును, చక్రుః = చేసిరి. తతః = పిమ్మట, స్నాత్వా = స్నానము చేసి, యథాన్యాయమ్ = యథా శాస్త్రముగా, పితృదేవతాః = పితృదేవతలను, సంతర్ప్య = తృప్తిపరచి, అగ్నిహోత్రాణి హుత్వా = అగ్నిహోత్రములు చేసి, అమృతవత్ = అమృతము వంటి, హవిః = హవిస్సును, ప్రాశ్య = భుజించి, ముదితమానసాః = ప్రశాంత మైన చిత్తములు కలవారై, మహాత్మానమ్ = మహాత్ము డైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, సమన్తతః = నలుప్రక్కల, పరివార్య = చుట్టి, శుచౌ = పవిత్ర మైన, జాహ్నవీతీరే = గంగానదీతీరమునందు, వివిశుః = కూర్చుండిరి.

తా. వారందరును గంగాతీరమున నివసించిరి. స్నానములు చేసి యథా శాస్త్రముగ పితృతర్పణములు చేసిరి. అగ్నిహోత్రములు చేసికొని అమృతతుల్య మగు హవిస్సును భుజించిరి. ప్రశాంతచిత్తులై, పవిత్ర మగు ఆ గంగాతీరమున మహాత్ము డైన విశ్వామిత్రుని పరివేష్టించి కూర్చుండిరి. 9-10

మూ. అథ తత్ర తదా రామో విశ్వామిత్రమథాబ్రవీత్. 11
భగవన్ శ్రోతుమిచ్ఛామి గఙ్గాం త్రిపథగాం నదీమ్,
త్రైలోక్యం కథమాక్రమ్య గతా నదనదీపతిమ్. 12

ప్ర. అ. అథ = పిమ్మట, రామః = రాముడు, తదా = అప్పుడు, తత్ర = అచట, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. భగవన్ = పూజ్యుడా, త్రిపథగామ్ = మూడు మార్గములలో ప్రవహించు, గఙ్గాం నదీమ్ = గంగానదిని గూర్చి, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

త్రైలోక్యమ్ = మూడు లోకములను, ఆక్రమ్య = ఆక్రమించి, నదనదీపతిమ్ = సముద్రుని గూర్చి, కథమ్ = ఎట్లు, గతా = వెళ్లినది ?

తా. అంతట రాముడు అచట సుఖాసీనుడై యున్న విశ్వామిత్రునితో ఇట్లనెను. "పూజ్యుడా! మూడు మార్గములందు ప్రవహించు గంగను గూర్చి తెలిసికొనదలచుచున్నాను. ఈ నది మూడు లోకములను ఎట్లు ఆక్రమించినది; ఎట్లు సముద్రములోనికి ప్రవేశించినది".

వి. తూర్పుగా ప్రవహించి తూర్పుసముద్రములో ప్రవేశించునవి నదులు. పశ్చిమముగా ప్రవహించి పశ్చిమసముద్రములో ప్రవేశించునవి నదములు. నదులకును నదములకును పతి సముద్రుడు. 12

మూ. చోదితో రామవాక్యేన విశ్వామిత్రో మహామునిః,
వృద్ధిం జన్మ చ గఙ్గాయా వక్తుమేవోపచక్రమే. 13

ప్ర. అ. రామవాక్యేన = రాముని వాక్యముచేత, చోదితః = ప్రేరేపింపబడిన, విశ్వామిత్రః మహామునిః = విశ్వామిత్రమహర్షి, గఙ్గాయాః = గంగయొక్క, జన్మ = పుట్టుకను, వృద్ధిం చ = వృద్ధిని, వక్తుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. రాము డిట్లు ప్రశ్నింపగా విశ్వామిత్రమహాముని గంగానది ఉత్పత్తి, వృద్ధి మొదలైన విషయములను చెప్ప మొదలిడెను. 13

మూ. శైలేన్ద్రో హిమవాన్నామ ధాతూనామాకరో మహాన్,
తస్య కన్యాద్వయం రామ రూపేణాప్రతిమం భువి. 14

ప్ర. అ. రామ = రామా ! ధాతూనామ్ = ధాతువులయొక్క, మహాన్ = గొప్ప, ఆకరః = గని యైన, హిమవాన్నామ = హిమవంతుడనెడు, శైలేన్ద్రః = పర్వతరాజు ఉన్నాడు. తస్య = ఆతనికి, రూపేణ = రూపముచేత, భువి = భూలోకమునందు, అప్రతిమమ్ = సాటిలేని, కన్యాద్వయమ్ = కన్యాద్వయము ఉన్నది.

తా. రామా ! హిమవంతు డనెడు పర్వతరాజు ఉన్నాడు. ఆతడు అనేక

విధము లగు ధాతువులకు గొప్ప నిధి. ఆతనికి ప్రపంచమునందు సాటిలేని సౌందర్యము గల ఇద్దరు కన్యకలు ఉన్నారు. 14

మూ. యా మేరుదుహితా రామ తయోర్మాతా సుమధ్యమా,
నామ్నా మనోరమా నామ పత్నీ హిమవతః ప్రియా. 15

ప్ర. అ. రామ = రామా ! నామ్నా = పేరుచేత, మనోరమా నామ = మనోరమ అను ప్రసిద్ధి గల, యా = ఏ, మేరుదుహితా = మేరుపర్వతము యొక్క కుమార్తె ఉన్నదో, సుమధ్యమా = అందమైన నడుము గల ఆమె, హిమవతః = హిమవంతుని యొక్క, ప్రియా = భార్య. తయోః = ఆ కన్యకల యొక్క, మాతా = తల్లి.

తా. మేరుపర్వతము కుమార్తె యైన మనోరమ ఆ హిమవంతుని భార్య. ఆ కన్యకల తల్లి. 15

మూ. తస్యాం గఙ్గేయమభవజ్జ్యేష్ఠా హిమవతః సుతా,
ఉమా నామ ద్వితీయాభూన్నామ్నా తస్యైవ రాఘవ. 16

ప్ర. అ. రామ = రామా, ఇయమ్ = ఈ, గఙ్గా = గంగ, హిమవతః = హిమవంతునియొక్క, జ్యేష్ఠా = పెద్దదైన, సుతా = కుమార్తెగా, తస్యామ్ = మనోరమయందు, అభవత్ = జనించెను, తస్యైవ = ఆతనికే, నామ్నా = పేరు చేత, ఉమా నామ = ఉమ అను ప్రసిద్ధి గల, ద్వితీయా = రెండవ కుమార్తె, అభూత్ = జనించెను.

తా. రామా ! ఈ గంగ హిమవంతునకు, మనోరమయందు పెద్ద కుమార్తెగా జనించినది. ఆతనికే ఉమ రెండవ కుమార్తెగా జనించినది. 16

మూ. అథ జ్యేష్ఠాం సురాః సర్వే దేవతార్థచికీర్షయా,
శైలేన్ద్రం వరయామాసుర్గఙ్గాం త్రిపథగాం నదీమ్. 17

ప్ర. అ. అథ = పిమ్మట, సర్వే సురాః = దేవత లందరును, దేవతార్థ చికీర్షయా = దేవతల ప్రయోజనమును చేయు నిచ్ఛతో, త్రిపథగామ్ = మూడు మార్గములలో ప్రవహించు, నదీమ్ = నదియైన, జ్యేష్ఠామ్ = పెద్ద కుమార్తె యైన, గఙ్గామ్ = గంగను, శైలేన్ద్రమ్ = పర్వతరాజును, వరయామాసుః = యాచించిరి.

తా. దేవత లందరును తమ ప్రయోజనమును సాధించుకొనుటకై, జ్యేష్ఠ పుత్రికయు, మూడు మార్గములలో ప్రవహించునదియు అగు గంగను తమ కిమ్మని హిమవంతుని కోరిరి. 17

మూ. దదౌ ధర్మేణ హిమవాన్ తనయాం లోకపావనీమ్,
స్వచ్ఛందపథగాం గఙ్గాం త్రైలోక్యహితకామ్యయా. 18

ప్ర. అ. హిమవాన్ = హిమవంతుడు, ధర్మేణ = ధర్మబుద్ధితో, త్రైలోక్యహితకామ్యయా = మూడు లోకములకు హితము చేయవలె ననెడు అభిలాషతో, లోకపావనీమ్ = లోకములను పవిత్రింపచేయునదియు, స్వచ్ఛన్దపథగామ్ = తన కిష్ట మైన మార్గమున ప్రవహించునదియు అగు, తనయామ్ = కుమార్తె యైన, గఙ్గామ్ = గంగను, దదౌ = ఇచ్చెను.

తా. హిమవంతుడు ధర్మమును పాటించి, మూడులోకములకును హితము కలుగవలె ననెడు కోరికతో, లోకములను పవిత్రింపచేయునదియు, స్వేచ్ఛాను సారముగా ప్రవహింప సమర్థురాలును అగు తన జ్యేష్ఠపుత్రి యైన గంగను వారి కిచ్చెను. 18

మూ. ప్రతిగృహ్య తతో దేవాస్త్రిలోకహితకారిణః,
గఙ్గామాదాయ తేఽగచ్ఛన్ కృతార్థేనాన్తరాత్మనా. 19

ప్ర. అ. తతః = పిమ్మట, తే దేవాః = ఆ దేవతలు, త్రైలోక్యహిత కారిణః = మూడు లోకములకును హితము చేయబోవువారై, గఙ్గామ్ = గంగను, ప్రతిగృహ్య = స్వీకరించి, ఆదాయ = తీసికొని, కృతార్థేన = చరితార్థమైన, అన్తరాత్మనా = మనస్సుతో, అగచ్ఛన్ = వెళ్లిరి.

తా. దేవతలు గంగను హిమవంతుని నుండి ప్రతిగ్రహించి, సఫలమైన కోరిక గల మనస్సుతో, ఆమెను, మూడు లోకములకును హితము చేయబోవు వారై, తీసుకొని వెళ్ళిరి. 19

మూ. యా చాన్యా శైలదుహితా కన్యాసీద్రఘునన్దన,
ఉగ్రం సా వ్రతమాస్థాయ తపస్తేపే తపోధనా. 20

ప్ర. అ. రఘునన్దన = రామా ! అన్యా = మరియొక, శైలదుహితా = హిమవంతుని పుత్రి యైన, యా = ఏ, కన్యా = కన్య, ఆసీత్ = ఉండెనో, సా = ఆమె, తపోధనా = తపోధనురాలై, ఉగ్రమ్ = ఉగ్రమైన, వ్రతమ్ = వ్రతమును, ఆస్థాయ = అవలంబించి, తపః = తపస్సు, తేపే = చేసెను.

తా. రామా ! హిమవంతుని రెండవ కుమార్తె యైన ఉమ, తపోధనురాలై, ఉగ్ర మైన వ్రతమును అవలంబించి తపస్సు ఆచరించెను. 20

మూ. ఉగ్రేణ తపసా యుక్తాం దదౌ శైలవరః సుతామ్,
రుద్రాయాప్రతిరూపాయ ఉమాం లోకనమస్కృతామ్. 21

ప్ర. అ. శైలవరః = హిమవంతుడు, ఉగ్రేణ = ఉగ్రమైన, తపసా = తపస్సుతో, యుక్తామ్ = కూడినదియు, లోకనమస్కృతామ్ = లోకములచే నమస్కరింపబడినదియు అగు, సుతామ్ = కుమార్తె యైన, ఉమామ్ = ఉమను, అప్రతిరూపాయ = సాటిలేని, రుద్రాయ = రుద్రునకు, దదౌ = ఇచ్చెను.

తా. హిమవంతుడు ఉగ్ర మైన తపస్సు చేసిన, సర్వలోకనమస్కృత యైన కుమార్తె యగు ఉమను సాటి లేని రుద్రున కిచ్చి వివాహము చేసెను. 21

మూ. ఏతే తే శైలరాజస్య సుతే లోకనమస్కృతే,
గఙ్గా చ సరితాం శ్రేష్ఠా ఉమాదేవీ చ రాఘవ. 22

ప్ర. అ. రాఘవ = రామా, సరితామ్ = నదులలో, శ్రేష్ఠా = శ్రేష్ఠ మైన, గఙ్గా చ = గంగయు, ఉమాదేవీ చ = ఉమాదేవియు, ఏతే = వీరిద్దరును, శైల రాజస్య = శైలరాజుయొక్క, లోకనమస్కృతే = లోకములచే నమస్కరింప బడిన, తే = ప్రసిద్ధ లైన, సుతే = కుమార్తెలు.

తా. రామా ! నదులలో శ్రేష్ఠురాలైన గంగ, ఉమాదేవి, వీరిరువురును హిమ వంతుని పుత్రికలు, లోకములచే పూజింపబడిన వారు. 22

మూ. ఏతత్తే సర్వమాఖ్యాతం యథా త్రిపథగా నదీ,
ఖం గతా ప్రథమం తాత గతిం గతిమతాం వర. 23

ప్ర. అ. గతిమతామ్ = అందమైన నడకకలవారిలో, వర = శ్రేష్ఠుడా, తాత = నాయనా, రామా ! త్రిపథగా నదీ = మూడు మార్గము లందు సంచరించు గంగానది, ప్రథమమ్ = ముందుగా, యథా = ఏ విధముగా, ఖమ్ = ఆకాశమును, గతా = పొందినదో, ఏతత్ = ఇది, సర్వమ్ = అంతయు, ఆఖ్యాతమ్ = చెప్పబడినది.

తా. అందమైన నడకగలవారిలో శ్రేష్ఠుడా ! రామా ! గంగానది మొదట ఆకాశమునకు ఎట్లు వెళ్ళినదో ఈ విషయ మంతయు చెప్పినాను. 23

మూ. సైషా సురనదీ రమ్యా శైలేంద్రస్య సుతా తదా,
సురలోకం సమారూఢా విపాపా జలవాహినీ. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పఞ్చత్రింశః సర్గః

ప్ర. అ. రమ్యా = సుందరమైనదియు, విపాపా = పాపములు లేనిదియు, జలవాహినీ = జలరూపమున ప్రవహించునదియు అగు, సా ఏషా = అట్టి ఈ, శైలేన్ద్రస్య = హిమవంతుని యొక్క, సుతా = కుమార్తె, తదా = అప్పుడు, సురనదీ = సురనదిగా అయి, సురలోకమ్ = స్వర్గలోకమును, సమారూఢా = ఎక్కినది.

తా. రమ్యమైనదియు, పాపరహితయు అగు ఆ హిమవత్పుత్రిక జలరూపమున ప్రవహించుచు, అపుడు స్వర్గమును అధిరోహించి సురనది యైనది. 24

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో ముప్పదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్త్రింశః సర్గః

మూ. ఉక్తవాక్యే మునౌ తస్మిన్నుభౌ రాఘవలక్ష్మణౌ,
ప్రతినన్ద్య కథాం వీరావూచతుర్మునిపుఙ్గవమ్. 1

ప్ర. అ. తస్మిన్ = ఆ, మునౌ = ముని, ఉక్తవాక్యే=చెప్పబడిన వాక్యము కలవా డగుచుండగా, వీరౌ = వీరులైన, రాఘవలక్ష్మణౌ = రామలక్ష్మణులు, ఉభౌ = ఇరువురును, కథామ్ = కథను, ప్రతినన్ద్య = అభినందించి, మునిపుఙ్గవమ్ = ఆ మునిశ్రేష్ఠుని గూర్చి, ఊచతుః = పలికిరి.

తా. విశ్వామిత్రుని వాక్యము విని రామలక్ష్మణులు ఆ కథను మెచ్చుకొని, ఆ మునిపుంగవునితో ఇట్లు పలికిరి. 1

మూ. ధర్మయుక్తమిదం బ్రహ్మన్ కథితం పరమం త్వయా,
దుహితుః శైలరాజస్య జ్యేష్ఠాయా వక్తుమర్హసి. 2
విస్తరం విస్తరజ్ఞోఽసి దివ్యమానుషసంభవమ్.

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రహ్మర్షీ! ధర్మయుక్తమ్ = ధర్మముతో కూడిన, పరమమ్ = ఉత్తమ మైన, ఇదమ్ = ఇది, త్వయా = నీచేత, కథితమ్ = చెప్పబడినది. శైలరాజస్య = హిమవంతునియొక్క, జ్యేష్ఠాయాః దుహితుః = పెద్ద కుమార్తెయొక్క, దివ్యమానుషసంభవమ్ = దేవలోకమునందును, మనుష్యలోకమునందును జరిగిన, విస్తరమ్=కథా, విస్తరమును వక్తుమ్ = చెప్పుటకు, అర్హసి=తగిఉన్నావు. విస్తరజ్ఞః=కథా విస్తరములు తెలిసినవాడవుగా, అసి= అయిఉన్నావు.

తా. మునీంద్రా! ధర్మయుక్త మైన ఈ ఉత్తమకథను చెప్పినావు. హిమవంతుని పెద్ద కుమార్తెకు సంబంధించిన, దేవలోకమనుష్యలోకములలో జరిగిన కథను సవిస్తరముగ చెప్పుము. నీవు కథావిస్తరములు తెలిసినవాడవు కదా. 2

మూ. త్రీన్ పథో హేతునా కేన ప్లావయేల్లోకపావనీ. 3
కథం గఙ్గా త్రిపథగా విశ్రుతా సరిదుత్తమా,
త్రిషు లోకేషు ధర్మజ్ఞ కర్మభిః కైః సమన్వితా. 4

ప్ర. అ. లోకపావనీ = లోకములను పవిత్రింపచేయు గంగ, కేన హేతునా = ఏ కారణముచేత, త్రీన్ = మూడు, పథః = మార్గములను, ప్లావయేత్ = ఉదకముచే నింపినది ? ధర్మజ్ఞ = ధర్మములను ఎరిగినవాడా ! త్రిపథగా = మూడు మార్గములందు ప్రవహించు, గఙ్గా = గంగ, కైః = ఏ, కర్మభిః = కర్మలతో, అన్వితా = కూడినదై, త్రిషు లోకేషు = మూడు లోకములలో, సరిదుత్తమా = నదులలో ఉత్తమ మైనదిగా, విశ్రుతా = ప్రసిద్ధ మైనది ?

తా. లోకపావని యైన గంగ ఏ కారణముచేత మూడు మార్గములలో ప్రవహించుచున్నది ? ఓ ధర్మజ్ఞుడా ! త్రిపథగ యైన ఈ గంగ, ఏ కర్మలను పట్టి, మూడు లోకములలో ఉత్తమనది యని ప్రసిద్ధి పొందినది ? 4

మూ. తథా బ్రువతి కాకుత్స్థే విశ్వామిత్ర స్తపోధనః,
నిఖిలేన కథాం సర్వా మృషిమధ్యే న్యవేదయత్. 5

ప్ర. అ. కాకుత్స్థే = రాముడు, తథా = ఆ విధముగా, బ్రువతి = పలుకుచుండగా, తపోధనః = తపస్సే ధనముగా గల, విశ్వామిత్రుడు, సర్వామ్ = సమస్త మైన, కథామ్ = కథను, నిఖిలేన = పూర్తిగా, ఋషిమధ్యే = ఋషుల మధ్యయందు, న్యవేదయత్ = తెలిపెను.

తా. రాముని మాటలు విని విశ్వామిత్రమహర్షి ఆ కథ నంతను సంపూర్ణముగా, ఋషులమధ్యయందు చెప్పెను. 5

మూ. పురా రామ కృతోద్వాహో నీలకణ్ఠో మహాతపాః,
దృష్ట్వా చ స్పృహయా దేవీం మైథునాయోపచక్రమే. 6

ప్ర. అ. రామ = రామా ! పురా = పూర్వము, కృతోద్వాహః = చేసికొనబడిన వివాహము గల, మహాతపాః = మహాతపఃశాలి యైన, నీలకణ్ఠః = శివుడు, దేవీమ్ = దేవిని, దృష్ట్వా = చూచి, స్పృహయా = ఆసక్తితో, మైథునాయ = మైథునమునకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. రామా ! మహాతపఃశాలి యగు ఈశ్వరుడు పూర్వము వివాహము చేసికొని, దేవిని చూచి, అత్యాసక్తితో మైథునమునకు ఉపక్రమించెను. 6

మూ. శితికణ్ఠస్య దేవస్య దివ్యం వర్షశతం గతమ్,
న చాపి తనయో రామ తస్యామాసీత్పరంతప. 7

ప్ర. అ. పరంతప = శత్రువును పీడించు, రామ = రామా! దేవస్య=దేవుడైన, శితికంఠస్య = ఈశ్వరునకు, దివ్యమ్ = దివ్యమైన, వర్షశతమ్ = సంవత్సరముల శతము, గతమ్ = కడచినది. అపిచ=అయినను, తస్యామ్ = ఆమెయందు, తనయః = కుమారుడు, న ఆసీత్ = పుట్టలేదు.

తా. ఈశ్వరు డీ విధముగ క్రీడించుచుండగా నూరు దివ్య వర్షములు కడచిపోయినవి. కాని ఆ దేవియందు కుమారుడు జనించలేదు. 7

మూ. తతో దేవాః సముద్విగ్నాః పితామహపురోగమాః,
యదిహోత్పద్యతే భూతం క స్తత్ప్రతిసహిష్యతే. 8

ప్ర. అ. తతః = పిమ్మట, పితామహపురోగమాః = బ్రహ్మ మొదలైన, దేవాః = దేవతలు, ఇహ = ఈ దేవియందు, యత్ = ఏ, భూతమ్ = ప్రాణి, ఉత్పద్యతే = పుట్టునో, తత్ = దానిని, కః = ఎవడు, ప్రతిసహిష్యతే = సహింపగలడు అని, సముద్విగ్నాః = కలత చెందిరి.

తా. "ఈ దేవియందు పుట్టబోవు భూతమును ఎవ్వడైన సహింపగలడా?" అని బ్రహ్మదేవుడు మొదలైన దేవత లందరును కలత చెందిరి. 8

మూ. అభిగమ్య సురాస్సర్వే ప్రణిపత్యేదమబ్రువన్,
దేవదేవ మహాదేవ లోకస్యాస్య హితే రత. 9
సురాణాం ప్రణిపాతేన ప్రసాదం కర్తుమర్హసి,

ప్ర. అ. సురాః = దేవతలు, సర్వే = అందరును, అభిగమ్య = ఈశ్వరుని వద్దకు వెళ్లి, ప్రణిపత్య = నమస్కరించి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రువన్ = పలికిరి. దేవదేవ = దేవతలకు దేవుడా, అస్య = ఈ, లోకస్య = లోకముయొక్క, హితే = హితమునందు, రత = ఆసక్తుడా! మహాదేవ = మహాదేవుడా! సురాణామ్ = దేవతల మైన మా యొక్క, ప్రణిపాతేన = నమస్కారముచేత, ప్రసాదమ్ = అనుగ్రహమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఈ లోకమునకు హితము చేయుటయందు ఆసక్తి గల, దేవాధిదేవుడవైన మహాదేవా! దేవతలము మేము నమస్కరించుచున్నాము; అనుగ్రహింపుము. 9

మూ. న లోకా ధారయిష్యన్తి తవ తేజః సురోత్తమ. 10
బ్రాహ్మేణ తపసా యుక్తో దేవ్యా సహ తపశ్చర,
త్రైలోక్యహితకామార్థం తేజస్తేజసి ధారయ. 11

ప్ర. అ. సురోత్తమ = ఓ దేవతాశ్రేష్ఠుడా, తవ = నీయొక్క, తేజః = తేజస్సును, లోకాః = లోకములు, న ధారయిష్యన్తి = ధరింపజాలవు. బ్రాహ్మేణ = వేదోక్తమైన, తపసా = తపస్సుతో, యుక్తః = కూడినవాడవై, దేవ్యా సహ = పార్వతితో గూడ, తపః = తపస్సును, చర = చేయుము. త్రైలోక్యహితకామార్థమ్ = త్రైలోక్యము యొక్క, హితమునందు కోరికతో, తేజః = తేజస్సును, తేజసి = తేజస్సునందు, ధారయ = నిలుపుము.

తా. ఓ సురోత్తమా! నీ తేజస్సును లోకములు ధరింపజాలవు. దేవితో కూడ వేదోక్తప్రకారమున తపస్సు చేయుము. తేజస్సును నీ తేజస్సునందే ధరించి మూడు లోకములకును హితము చేకూర్చుము. 10, 11

మూ. దేవతానాం వచః శ్రుత్వా సర్వలోకమహేశ్వరః,
బాఢమిత్యబ్రవీత్సర్వాన్ పునశ్చేదమువాచ హ. 12

ప్ర. అ. సర్వలోకమహేశ్వరః = ఆ సర్వలోక ప్రభువు, దేవతానామ్ = దేవతలయొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, బాఢమ్ = తప్పక అట్లే అగుగాక, ఇతి = అని, అబ్రవీత్ = పలికెను. పునశ్చ = మరల, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. ఆ సర్వలోకమహేశ్వరుడు దేవతల వాక్యము విని తప్పక అటులనే అగుగాక అని పలికి మరల ఇట్లనెను. 12

మూ. ధారయిష్యామ్యహం తేజస్తేజస్యేవ సహోమయా,
త్రిదశాః పృథివీ చైవ నిర్వాణమధిగచ్ఛతు. 13

ప్ర. అ. ఉమయా సహ = ఉమాదేవితో గూడ, అహమ్ = నేను, తేజః = తేజస్సును, తేజస్యేవ = తేజస్సునందే, ధారయిష్యామి = ధరించగలను. త్రిదశాః = దేవతలును, పృథివీ చైవ = భూమియు, నిర్వాణమ్ = సుఖమును, అధిగచ్ఛతు = పొందుగాక.

తా. ఉమాసహితుడ నైన నేను నా తేజస్సును (రేతస్సును) తేజస్సునందే (నా శరీరమునందే) ధరించెదను. దేవతలును, పృథివియు భయపడకుందురు గాక. 13

మూ. యదిదం క్షుభితం స్థానాన్మమ తేజో హ్యనుత్తమమ్,
ధారయిష్యతి కస్తన్మే బ్రువన్తు సురసత్తమాః. 14

ప్ర. అ. మమ = నా యొక్క, అనుత్తమమ్ = శ్రేష్ఠ మైన, యత్ = ఏ, ఇదమ్ = ఈ, తేజః = తేజస్సు, స్థానాత్ = స్వస్థానము నుండి, క్షుభితమ్ = క్షోభింపచేయబడినదో, తత్ = దానిని, కః = ఎవడు, ధారయిష్యతి = ధరించగలడు ? సురసత్తమాః = దేవతాశ్రేష్ఠులారా, మే = నాకు, బ్రువన్తు = చెప్పుదురు గాక.

తా. దేవతలారా ! స్వస్థానమునుండి చలించిన నా యీ శ్రేష్ఠ మైన తేజస్సును ఎవరు ధరింతురో చెప్పుడు. 14

మూ. ఏవముక్తాః సురాస్సర్వే ప్రత్యూచుర్వృషభధ్వజమ్,
యత్తేజః క్షుభితం హ్యేతత్తద్ధరా ధారయిష్యతి. 15

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, ఉక్తాః = పలకబడిన, సురాః = దేవతలు, సర్వే = అందరును, వృషభధ్వజమ్ = వృషభము ధ్వజమునందు గల ఈశ్వరుని గూర్చి, ప్రత్యూచుః = తిరిగి పలికిరి. యత్ = ఏ, తేజః = తేజస్సు, క్షుభితమ్ = చలించినదో, తత్ = దానిని, ధరా = భూమి, ధారయిష్యతి = ధరించగలదు.

తా. ఆ మాటలు విని దేవతలు ఈశ్వరునితో ఇట్లు అనిరి — "చలించిన తేజస్సును భూమి ధరించగలదు." 15

మూ. ఏవముక్తః సురపతిః ప్రముమోచ మహీతలే,
తేజసా పృథివీ యేన వ్యాప్తా సగిరికాననా. 16

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగ, ఉక్తః = పలకబడిన, సురపతిః = మహేశ్వరుడు, యేన = ఏ, తేజసా = తేజస్సుచేత, సగిరికాననా = పర్వతములతోడను అడవులతోడను గూడిన, పృథివీ = భూమి, వ్యాప్తా = వ్యాపింపబడినదో, అట్టి తేజస్సును, మహీతలే = భూమియందు, ప్రముమోచ = విడచెను.

తా. దేవతలు చెప్పిన విధముగ మహేశ్వరుడు తేజస్సును భూమిపై విడువగా అది పర్వతారణ్యాదులతో సహా భూమిపై అంతటను వ్యాపించెను. 16

మూ. తతో దేవాః పునరిదమూచుశ్చాథ హుతాశనమ్,
ప్రవిశ త్వం మహాతేజో రౌద్రం వాయుసమన్వితః. 17

ప్ర. అ. తతః = ఆ కారణమువలన, అథ = పిమ్మట, దేవాః = దేవతలు, పునః = మరల, హుతాశమ్ = అగ్నిని, ఇదమ్ = ఈ వాక్యమును, ఊచుః = పలికిరి. త్వమ్ = నీవు, వాయుసమన్వితః = వాయువుతో కూడినవాడవై, రౌద్రమ్ = రుద్రుని సంబంధమైన, మహాతేజః = గొప్ప తేజస్సును, ప్రవిశ = ప్రవేశించుము.

తా. అది చూచి దేవతలు "వాయువుతో కూడినవాడవై ఈ ఈశ్వర తేజస్సులో ప్రవేశించుము" అని అగ్నిని ఆదేశించిరి. 17

మూ. తదగ్నినా పునర్వ్యాప్తం సంజాతః శ్వేతపర్వతః,
దివ్యం శరవణం చైవ పావకాదిత్యసంనిభమ్. 18
యత్ర జాతో మహాతేజాః కార్తికేయోఽగ్నిసంభవః.

ప్ర. అ. అగ్నినా = అగ్నిచేత, వ్యాప్తమ్ = వ్యాప్తమైన, తత్ = ఆ తేజస్సు, పునః = మరల, శ్వేతపర్వతః = తెల్లని పర్వతముగా, సంజాతః = అయినది. పావకాదిత్యసంనిభమ్ = అగ్నితోడను ఆదిత్యునితోడను సమానమైన, దివ్యమ్ = దివ్యమైన, శరవణం చైవ = తెల్లుగడ్డి వనము గాను, అయినది. యత్ర = దేనియందు, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, అగ్ని

సంభవః = అగ్నినుండి పుట్టినవాడును అగు, కార్తికేయః = కృత్తికాకుమారు డైన కుమారస్వామి, జాతః = పుట్టెనో.

తా. ఆ తేజస్సు అగ్నిచేత వ్యాప్తమై శ్వేతపర్వతముగ అయినది. అచ టనే అగ్న్యాదిత్యులతో సమాన మైన, దివ్య మైన, శరవణము కూడ బయలు దేరినది. దానియందే మహాతేజఃశాలియు, అగ్నినుండి పుట్టిన వాడును, కృత్తికల కుమారుడును అగు కుమారస్వామి జనించెను.

వి. కుమారస్వామి అగ్నిచే ధరింపబడిన మహేశ్వరతేజస్సు నుండి పుట్టు టచే 'అగ్నిసంభవః' అనియు, కృత్తికలు పెంచుటచే 'కార్తికేయః' అనియు చెప్పబడినాడు. 18

మూ. అథోమాం చ శివం చైవ దేవాః సర్షిగణాస్తదా,
పూజయామాసురత్యర్థం సుప్రీతమనస స్తతః. 19

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సర్షిగణాః = ఋషులగణములతో కూడిన, దేవాః = దేవతలు, తతః = అట్లు జరుగుటవలన, సుప్రీతమనసః = చాల సంతో షించిన మనస్సులు కలవారై, తదా = అప్పుడు, ఉమాం చ = ఉమాదేవిని, శివం చైవ = శివుని, అత్యర్థమ్ = మిక్కిలి, పూజయామాసుః = పూజించిరి.

తా. పిమ్మట దేవతలును, మహర్షులును చాల సంతసించినవారై ఉమా దేవిని, పరమేశ్వరుని ఎక్కువగా పూజించిరి. 19

మూ. అథ శైలసుతా రామ త్రిదశానిదమబ్రవీత్,
సమన్యురశపత్సర్వాన్ క్రోధసంరక్తలోచనా. 20

ప్ర. అ. రామ = రామా! అథ = పిమ్మట, శైలసుతా = ఉమాదేవి, సమన్యుః = కోపముతో కూడినదై, త్రిదశాన్ = దేవతలను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. క్రోధసంరక్తలోచనా = క్రోధము చేత ఎఱ్ఱ నైన నేత్రములు కలదై, సర్వాన్ = అందరిని, అశపత్ = శపించెను.

తా. రామా! ఉమాదేవి కోపించినదై, ఎఱ్ఱబడిన నేత్రములతో, దేవతల నందరిని శపించుచు ఇట్లు పలికెను. 20

మూ. యస్మాన్నివారితా చైవ సంగతిః పుత్రకామ్యయా,
అపత్యం స్వేషు దారేషు తస్మాన్నోత్పాదయిష్యథ. 21

ప్ర. అ. యస్మాత్ = ఎందువలన, పుత్రకామ్యయా = పుత్రుడు కావలె నను కోరికతో, సంగతిః = మేము చేయుచున్న సంగమము, నివారితా = నివారింపబడినదో, తస్మాత్ = ఆ కారణమువలన, స్వేషు = తమ, దారేషు = భార్యల యందు, అపత్యమ్ = సంతానమును, నోత్పాదయిష్యథ = పుట్టింపకుందురుగాక.

తా. "పుత్రుడు కావలె నను కోరికచే మేమిరువురము చేయుచున్న సంభోగమునకు అడ్డు తగిలినారు గాన మీకు మీ భార్యలయందు సంతానము కలుగకుండుగాక." 21

మూ. అద్యప్రభృతి యుష్మాకమప్రజాః సన్తు పత్నయః, 22
ఏవముక్త్వా సురాన్ సర్వాన్ శశాప పృథివీమపి.

ప్ర. అ. అద్యప్రభృతి = నేడు మొదలు, యుష్మాకమ్ = మీయొక్క, పత్నయః = భార్యలు, అప్రజాః = సంతానము లేనివారుగా, సన్తు = అగుదురుగాక. సర్వాన్ సురాన్ = అందరు దేవతలను, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, పృథివీమపి = భూమిని కూడ, శశాప = శపించెను.

తా. "నేడు మొదలు మీ భార్యలకు సంతానము కలుగకుండుగాక" దేవతల నందరిని ఈ విధముగ శపించి, ఉమాదేవి పృథివిని గూడ ఇట్లు శపించెను. 22

మూ. అవనే నైకరూపా త్వం బహుభార్యా భవిష్యసి. 23
న చ పుత్రకృతాం ప్రీతిం మత్క్రోధకలుషీకృతా,
ప్రాప్స్యసి త్వం సుదుర్మేధే మమ పుత్రమనిచ్ఛతీ. 24

ప్ర. అ. అవనే = ఓ భూమీ! త్వమ్ = నీవు, నైకరూపా = అనేక రూపములు గలదానవై, బహుభార్యా = చాలామందికి భార్యవు, భవిష్యసి = కాగలవు. సుదుర్మేధే = చాల చెడ్డబుద్ధి కలదానా! మమ = నాకు, పుత్రమ్ = పుత్రుడు కలుగుటకు, అనిచ్ఛతీ = ఇష్టపడని, త్వమ్ = నీవు, మత్క్రోధకలుషీ

కృతా = నా యొక్క క్రోధముచేత పీడితురాలవై, పుత్రకృతామ్ = పుత్రులవలన కలుగు, ప్రీతిం చ = ఆనందమును గూడ, న ప్రాప్స్యసి = పొందవు.

తా. "ఓ భూమీ ! నీవు అనేక రూపములు కలదానవు గాను, అనేకులకు భార్యవుగాను అగుదువుగాక. చాల చెడ్డబుద్ధి గలదానా ! నాకు పుత్రుడు జనించుటకు ఇష్టపడని నీవు నా కోపమునకు ఫలితముగా, పుత్రానందమును పొందకుందువుగాక." 24

మూ. తాన్ సర్వాన్ వ్రీశితాన్ దృష్ట్వా సురాన్ సురపతిస్తదా,
గమనాయోపచక్రామ దిశం వరుణపాలితామ్. 25

ప్ర. అ. సురపతిః = మహేశ్వరుడు, తదా = అప్పుడు, వ్రీడితాన్ = సిగ్గుచెందిన, తాన్ = ఆ, సర్వాన్ = సమస్తమైన, సురాన్ = దేవతలను, దృష్ట్వా = చూచి, వరుణపాలితామ్ = వరుణునిచే పాలింపబడిన, దిశమ్ = దిక్కును గూర్చి, గమనాయ = వెళ్లుటకు, ఉపచక్రామ = ఉపక్రమించెను.

తా. అపుడు మహేశ్వరుడు సిగ్గుచెందిన సురుల నందరిని చూచి, అచటి నుండి పశ్చిమదిక్కు వైపు వెళ్లుటకు బయలుదేరెను. 25

మూ. స గత్వా తప ఆతిష్ఠత్పార్శ్వే తస్యోత్తరే గిరేః,
హిమవత్ప్రభవే శృఙ్గే దేవ్యా సహ మహేశ్వరః. 26

ప్ర. అ. సః = ఆ, మహేశ్వరః = మహేశ్వరుడు, గత్వా = పశ్చిమము వైపు వెళ్లి, తస్య = ఆ, గిరేః = హిమవత్పర్వతముయొక్క, ఉత్తరే = ఉత్తరమునందున్న, పార్శ్వే = పార్శ్వమునందు, హిమవత్ప్రభవే = హిమవత్పర్వతమునందు పుట్టిన, శృఙ్గే = శిఖరమునందు, దేవ్యా సహ = ఉమాదేవితో గూడ, తపః = తపస్సును, ఆతిష్ఠత్ = చేసెను.

తా. మహేశ్వరుడు హిమవత్పర్వతమునందే పశ్చిమదిక్కుగా వెళ్లి, ఆ హిమవత్పర్వతము ఉత్తరపార్శ్వమునం దున్న శిఖరముపై, ఉమాసమేతుడై తపస్సు చేసెను. 26

మూ. ఏష తే విస్తరో రామ శైలపుత్ర్యా నివేదితః,
గఙ్గాయాః ప్రభవం చైవ శృణు మే సహ లక్ష్మణః. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షట్త్రింశః సర్గః.

ప్ర. అ. రామ = రామా! శైలపుత్ర్యాః = ఉమాదేవికి సంబంధించిన ఏషః = ఈ, విస్తరః = కథావిస్తరము, తే = నీకు, కథితః = చెప్పబడినది. గఙ్గాయాః = గంగయొక్క, ప్రభవం చైవ = ప్రభావమును కూడ, సహలక్ష్మణః = లక్ష్మణసహితుడ వైన నీవు, మే = నానుండి, శృణు = వినుము.

తా. రామా ! ఉమాదేవికి సంబంధించిన కథ చెప్పితిని. ఇపుడు నీవును, లక్ష్మణుడును, గంగాప్రభావమును వినుడు. 27

"బాలానన్దిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో ముప్పదిమూడవ సర్గ సమాప్తము.

అథ సప్తత్రింశః సర్గః

మూ. తప్యమానే తపో దేవే దేవాః సర్షిగణాః పురా,
సేనాపతిమభీప్సన్తః పితామహముపాగమన్. 1

ప్ర. అ. పురా = పూర్వము, దేవే=పరమేశ్వరుడు, తపః తప్యమానే= తపస్సు చేయుచుండగా, సర్షిగణాః=ఋషిగణములతో కూడిన, దేవాః=దేవతలు, సేనాపతిమ్ = సేనాపతిని, అభీప్సన్తః=కోరుచున్నవారై, పితామహమ్=బ్రహ్మదేవుని, ఉపాగమన్ = సమీపించిరి.

తా. పూర్వము ఈ విధముగ పరమేశ్వరుడు తపస్సు చేయుచుండగా, దేవతలును, ఋషులును, సేనానాయకుడు కావలె నని కోరుచు బ్రహ్మదేవుని వద్దకు వెళ్లిరి. 1

మూ. తతోఽబ్రువన్ సురాః సర్వే భగవన్తం పితామహమ్,
ప్రణిపత్య సురాః సర్వే సేన్ద్రాః సాగ్నిపురోగమాః. 2

ప్ర. అ. తతః=పిమ్మట, సేన్ద్రాః=ఇంద్రునితో కూడినవారును, అగ్నిపురోగమాః=అగ్ని ఎదుట కలవారును అగు, సురాః=దేవతలు, సర్వే=అందరును, భగవన్తమ్ = భగవంతుడైన, పితామహమ్ = బ్రహ్మదేవుని, ప్రణిపత్య = నమస్కరించి, అబ్రువన్ = పలికిరి.

తా. అగ్నిని ముందు ఉంచుకొని వెళ్లిన ఆ ఇంద్రాదిదేవత లందరును బ్రహ్మదేవునకు నమస్కరించి ఇట్లు పలికిరి. 2

మూ. యో నః సేనాపతిర్దేవ దత్తో భగవతా పురా,
తపః పరమమాస్థాయ తప్యతే స్మ సహోమయా. 3

ప్ర. అ. దేవ = దేవా! భగవతా = భగవంతుడ వైన నీచేత, పురా= పూర్వము, నః=మాకు, యః=ఏ, సేనాపతిః=సేనాపతి, దత్తః=ఇవ్వబడినాడో, అతడు. ఉమయా సహ = ఉమాదేవితో కూడ, పరమమ్ = గొప్ప, తపః =

తపస్సును (నియమమును), ఆస్థాయ = అవలంబించి, తప్యతే = తపస్సు చేయుచున్నాడు.

తా. పూర్వము నీవు మాకు సేనాపతిగా ఇచ్చిన మహేశ్వరుడు ఉమాదేవితో కూడ గొప్పనియమము నవలంబించి తపస్సు చేయుచున్నాడు. 3

మూ. యదత్రానన్తరం కార్యం లోకానాం హితకామ్యయా,
సంవిధత్స్వ విధానజ్ఞ త్వం హి నః పరమా గతిః. 4

ప్ర. అ. విధానజ్ఞ = ఉపాయములు తెలిసిన ఓ పితామహా! లోకానామ్= లోకములయొక్క, హితకామ్యయా = హితమునందు కోరికచే, అత్ర = ఈ విషయమున, అనన్తరమ్ = దీని తరువాత, యత్ = ఏది, కార్యమ్ = చేయదగినదో, దానిని, సంవిధత్స్వ = చేయుము. త్వమ్ = నీవు, నః = మాకు, పరమా = గొప్పదైన, గతిః హి = గతి కదా.

తా. ఈ విషయమున లోకక్షేమముకొరకై ఇపు డేమి చేయవలెనో అది చేయుము. తగు ఉపాయములు నీకే తెలియును. మాకు శరణము నీవే గదా? 4

మూ. దేవతానాం వచః శ్రుత్వా సర్వలోకపితామహః,
సాన్త్వయన్మధురైర్వాక్యైస్త్రిదశానిదమబ్రవీత్. 5

ప్ర. అ. సర్వలోకపితామహః = సమస్తలోకములకును పితామహుడైన బ్రహ్మదేవుడు, దేవతానామ్ = దేవతలయొక్క, వచః=వాక్యమును, శ్రుత్వా= విని, మధురైః = మధురములైన, వాక్యైః = వాక్యములచేత, త్రిదశాన్ = ఆ దేవతలను, సాన్త్వయన్=ఓదార్చుచు, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్= పలికెను.

తా. దేవతల వాక్యము విని పితామహుడు, వారిని మధురములైన మాటలచే ఓదార్చుచు ఇట్లు పలికెను. 5

మూ. శైలపుత్ర్యా యదుక్తం తన్న ప్రజాస్యథ పత్నిషు,
తస్యా వచనమక్లిష్టం సత్యమేతన్న సంశయః. 6

ప్ర. అ. యత్ = ఎందువలన, శైలపుత్ర్యా = ఉమాదేవిచేత, ఉక్తమ్= చెప్పబడినదో, తత్ = ఆ కారణమువలన, పత్నీషు = భార్యలయందు, న ప్రజాస్యథ = సంతానమును కనజాలరు. తస్యాః = ఆమెయొక్క, వచనమ్= వాక్యము, అక్లిష్టమ్ = బాధింపబడనిది. ఏతత్ = ఇది, సత్యమ్ = సత్యము. సంశయః = సంశయము, న = లేదు.

తా. ఉమాదేవి చెప్పిన విధముగ మీకు మీ భార్యలయందు పుత్రులు పుట్టరు. ఆమె మాటకు అడ్డు లేదు. ఇది సత్యము. సందేహము లేదు. 6

మూ. ఇయమాకాశగా గఙ్గా యస్యాం పుత్రం హుతాశనః,
జనయిష్యతి దేవానాం సేనాపతిమరిన్దమమ్. 7

ప్ర. అ. యస్యామ్ = ఏ గంగయందు, హుతాశనః = అగ్ని, అరిందమమ్ = శత్రువును నశింపచేయు, దేవానామ్ = దేవతలయొక్క, సేనాపతిమ్= సేనాపతియైన, పుత్రమ్ = పుత్రుని, జనయిష్యతి = పుట్టింపగలడో, ఇయమ్= అట్టి, ఆకాశగా = ఆకాశమునందు ప్రవహించు చున్న, గఙ్గా = గంగ ఉన్నది.

తా. ఆకాశమునందు ప్రవహించు ఈ గంగ ఉన్నది కదా. ఈమె యందు అగ్నిదేవుడు, దేవతలకు సేనాపతియై శత్రుసంహారము చేయు పుత్రుని పుట్టించును.

మూ. జ్యేష్ఠా శైలేన్ద్రతనయా మానయిష్యతి తత్సుతమ్,
ఉమాయాస్తద్బహుమతం భవిష్యతి న సంశయః. 8

ప్ర. అ. జ్యేష్ఠా = పెద్దదైన, శైలేంద్రతనయా = శైలరాజదుహిత, తత్సుతమ్ = ఆ అగ్నియొక్క కుమారుని, మానయిష్యతి=అంగీకరింపగలదు. తత్ = అది, ఉమాయాః = ఉమకు, బహుమతమ్=చాల ఇష్టమైనది, భవిష్యతి= కాగలదు. సంశయః = సంశయము, న = లేదు.

తా. హిమవంతుని జ్యేష్ఠపుత్రి యైన గంగ అగ్నిదేవునినుండి ఆ గర్భమును స్వీకరించును. ఇది యంతయు ఉమకు కూడ అంగీకారయోగ్య మగును. సందేహము లేదు. 8

మూ. తచ్ఛ్రుత్వా వచనం తస్య కృతార్థా రఘునన్దన,
ప్రణిపత్య సురాః సర్వే పితామహమపూజయన్. 9

ప్ర. అ. రఘునన్దన = రామా ! సురాః = దేవతలు, సర్వే = అందరును, తస్య = ఆతనియొక్క, తత్ = ఆ, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, కృతార్థాః = కృతార్థులై, పితామహమ్ = బ్రహ్మదేవుని, ప్రణిపత్య = నమస్కరించి, అపూజయన్ = పూజించిరి.

తా. రామా ! ఆ దేవత లందరును బ్రహ్మదేవుని వాక్యము విని, సఫలీకృతమనోరథులై, ఆయనకు నమస్కరించి పూజించిరి. 9

మూ. తే గత్వా పర్వతం రామ కైలాసం ధాతుమణ్డితమ్,
అగ్నిం నియోజయామాసుః పుత్రార్థం సర్వదేవతాః. 10

ప్ర. అ. తే = ఆ, సర్వదేవతాః = దేవతలందరును, ధాతుమణ్డితమ్ = ధాతువులచే అలకరింపబడిన, కైలాసం పర్వతమ్ = కైలాసపర్వతమును గూర్చి, గత్వా = వెళ్లి, పుత్రార్థమ్ = పుత్రునికొరకై, అగ్నిమ్ = అగ్నిదేవుని, నియోజయామాసుః = ఆజ్ఞాపించిరి.

తా. దేవతలందరును ధాతువులచే అలంకృత మగు కైలాసపర్వతమునకు పోయి, "పుత్రుని కనుము" అని అగ్నిదేవుని ఆజ్ఞాపించిరి. 10

మూ. దేవకార్యమిదం దేవ సంవిధత్స్వ హుతాశన,
శైలపుత్ర్యాం మహాతేజో గఙ్గాయాం తేజ ఉత్సృజ. 11

ప్ర. అ. దేవ = ప్రకాశమానుడ వగు, హుతాశన = అగ్నీ ! ఇదమ్ = ఈ, దేవకార్యమ్ = దేవతాకార్యమును, సంవిధత్స్వ = చేయుము. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా, తేజః = మహేశ్వరుని తేజస్సును. శైలపుత్ర్యామ్ = హిమవత్పుత్రి యగు, గఙ్గాయామ్ = గంగయందు, ఉత్సృజ = విడువుము.

తా. ఓ అగ్నిదేవా ! ఈ దేవతాకార్యమును చేయుము. నీయందున్న మహేశ్వరుని తేజస్సును హిమవంతుని పుత్రి యగు గంగయం దుంచుము. 11

మూ. దేవతానాం ప్రతిజ్ఞాయ గఙ్గామభ్యేత్య పావకః,
గర్భం ధారయ వై దేవి దేవతానామిదం ప్రియమ్. 12

ప్ర. అ. పావకః = అగ్నిదేవుడు, దేవతానామ్ = దేవతలకు, ప్రతిజ్ఞాయ = మాట యిచ్చి, గఙ్గామ్ = గంగను, అభ్యేత్య = సమీపించి, దేవి = ఓ దేవీ ! గర్భమ్ = గర్భమును, ధారయ వై = ధరింపుము. ఇదమ్ = ఈ కార్యము, దేవతానామ్ = దేవతలకు, ప్రియమ్ = ఇష్టమైనది (అని పలికెను).

తా. అగ్నిదేవుడు "అటులనే" అని దేవతలకు మాట యిచ్చి, గంగను సమీపించి-దేవీ ! గర్భమును ధరింపుము. ఈ కార్యము దేవతలకు ప్రియ మైనది అని పలికెను. 12

మూ. తస్య తద్వచనం శ్రుత్వా దివ్యం రూపమధారయత్,
దృష్ట్వా తన్మహిమానం స సమన్తాదవకీర్యత. 13

ప్ర. అ. తస్య = అగ్నియొక్క, తద్ వచనమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, దివ్యమ్ = దివ్యమైన, రూపమ్ = రూపమును, అధారయత్ = ధరించెను. సః = ఆ అగ్ని, తన్మహిమానమ్ = ఆ గంగయొక్క మహిమను, దృష్ట్వా = చూచి, సమన్తాత్ = అంతటను, అవకీర్యత = వ్యాపించెను.

తా. అగ్నిదేవుని మాట విని గంగ దివ్య మైన రూపమును ధరించెను. ఆమె మహిమను చూచి అగ్నిదేవుడు తన దేహము ఆమెపై అంతటను వ్యాపించు నటు చేసెను. 13

మూ. సమన్తతస్తతో దేవీమభ్యషిఞ్చత పావకః,
సర్వస్రోతాంసి పూర్ణాని గఙ్గాయా రఘునన్దన. 14

ప్ర. అ. రఘునన్దన = రామా ! తతః = పిమ్మట, పావకః = అగ్ని దేవుడు, దేవీమ్ = గంగాదేవిని, సమన్తతః = అంతటను, అభ్యషిఞ్చత = తనలో నున్న పరమేశ్వరుని వీర్యముచే తడిపెను. గఙ్గాయాః = గంగయొక్క, సర్వస్రోతాంసి = అవయవము లన్నియు, పూర్ణాని = నిండిపోయినవి.

తా. రామా ! పిమ్మట ఆ అగ్నిదేవుడు తనలో నున్న పరమేశ్వరవీర్యము ఆమెయందు అంతటను వ్యాపించు నట్లు విడచెను. దానితో గంగ అవయవము లన్నియు నిండిపోయినవి. 14

మూ. తమువాచ తతో గఙ్గా సర్వదేవపురోహితమ్,
అశక్తా ధారణే దేవ తవ తేజస్సముద్ధతమ్. 15
దహ్యమానాగ్నినా తేన సంప్రవ్యథితచేతనా.

ప్ర. అ. తతః = పిమ్మట, గఙ్గా = గంగ, సర్వదేవపురోహితమ్ = సమస్తదేవతలకును అగ్రమునందు నిలుపబడు, తమ్ = ఆ, అగ్నిదేవుని గూర్చి, ఉవాచ = పలికెను. దేవ = ఓ అగ్నిదేవుడా! సముద్ధతమ్ = విజృంభించిన, తవ = నీ యొక్క, తేజః = తేజస్సును, ధారణే = దరించుటయందు, అశక్తా = అసమర్థురాలను. తేన = ఆ, అగ్నినా = అగ్నిచేత, (రేతస్సుచేత), దహ్యమానా = కాల్చివేయబడుచున్న నేను, సంప్రవ్యథిచేతనా = మిక్కిలి క్షోభపెట్టబడిన చైతన్యము కలదానను.

తా. పిమ్మట ఆ గంగ సర్వదేవతలకును ముందుండెడు ఆ అగ్నిదేవునితో ఇట్లు పలికినది. "అగ్నిదేవా! విజృంభించిన నీ యొక్క ఈ తేజస్సును ధరింప జాలను. ఈ తేజస్సు నన్ను దహింపచేయుచున్నది. నాకు స్పృహతప్పిపోవు చున్నది." 15

మూ. అథాబ్రవీదిదం గఙ్గాం సర్వదేవహుతాశనః, 16
ఇహ హైమవతే పాదే గర్భోఽయం సంనివేశ్యతామ్.

ప్ర. అ. అథ = పిమ్మట, సర్వదేవహుతాశనః = దేవత లందరికొరకును హోమము చేయబడిన హోమద్రవ్యములను భుజించు అగ్నిదేవుడు, గఙ్గామ్ = గంగను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. అయమ్ = ఈ, గర్భః = గర్భము, ఇహ = ఇచట, హైమవతే = హిమవత్పర్వతమునకు సంబంధించిన, పాదే = సమీపపర్వతమునందు, సంనివేశ్యతామ్ = ఉంచబడు గాక.

తా. అగ్నిదేవుడు గంగతో— "ఈ గర్భమును ఇచట, హిమవత్పర్వత సమీపమునం దున్న చిన్న పర్వతముపై విడువుము" అని చెప్పెను. 16

మూ. శ్రుత్వా త్వగ్నివచో గఙ్గా తం గర్భమతిభాస్వరమ్,
ఉత్ససర్జ మహాతేజః స్రోతోభ్యో హి తదానఘ. 17

ప్ర. అ. మహాతేజః = గొప్పతేజస్సు గలవాడా, అనఘ = పాపరహితుడ వగు రామా! అగ్నివచః = అగ్నియొక్క వాక్యమును, శ్రుత్వా = విని, గఙ్గా = గంగ, తదా = అప్పుడు, అతిభాస్వరమ్ = మిక్కిలి ప్రకాశించుచున్న, తం గర్భమ్ = ఆగర్భమును, స్రోతోభ్యః = అవయవముల నుండి, ఉత్ససర్జ = విడచెను.

తా. దోషరహితుడవు, తేజఃశాలివి అగు రామా! అపుడా గంగ అగ్నిదేవుడు చెప్పిన విధమున, మిక్కిలి ప్రకాశించుచున్న ఆ గర్భమును, తన అవయవములనుండి అచట విడచెను. 17

మూ. యదస్యా నిర్గతం తస్మాత్ తప్తజామ్బూనదప్రభమ్,
కాఞ్చనం ధరణీం ప్రాప్తం హిరణ్యమమలం శుభమ్. 18

ప్ర. అ. అస్యాః = ఈ గంగానదినుండి, తప్తజామ్బూనదప్రభమ్ = కరిగిన బంగారమువంటి కాంతి గల, యత్ = ఏతేజస్సు, నిర్గతమ్ = బయలుదేరినదై, ధరణీమ్ = భూమిని, ప్రాప్తమ్ = పొందినదో, తస్మాత్ = దానినుండి, శుభమ్ = శుభమైన, కాఞ్చనమ్ = బంగారము, అమలమ్ = తెల్లని, హిరణ్యమ్ = వెండియు, (అభవత్ = పుట్టెను).

తా. ఆ గంగ విడిలిపెట్టగా బయటకు వచ్చి భూమిపై పడిన, కరిగిన బంగారముతో సమానమైన కాంతి గల, తేజస్సు నుండి, మంగళకరమైన బంగారము, పరిశుద్ధమైన వెండియు పుట్టెను. 18

మూ. తామ్రం కార్ష్ణాయసం చైవ తైక్ష్ణ్యాదేవాభ్యజాయత, 19
మలం తస్యాభవత్తత్ర త్రపు సీసకమేవ చ.
తదేతద్ధరణీం ప్రాప్య నానాధాతురవర్ధత. 20

ప్ర. అ. తత్ర = అచట, తైక్ష్ణ్యాత్ = తీక్ష్ణత్వమునుండి (క్షారము నుండి), తామ్రమ్ = రాగియు, కార్ష్ణాయసం చైవ = ఇనుము, అభ్యజాయత = పుట్టెను. తస్య = ఆరేతస్సు యొక్క, మలమ్ = మలము, త్రపు = తగరము, సీసకమేవ చ = సీసము, అభవత్ = ఆయెను. తత్ ఏతత్ = ఆ

ధరణీమ్ = భూమిని, ప్రాప్య = పొంది, నానాధాతుః = అనేకవిధములైన ధాతువుగా, అవర్ధత = వృద్ధిచెందెను.

తా. అచట, రేతస్సులో నున్న క్షారము నుండి రాగి, ఇనుము పుట్టినవి. ఆ రేతస్సులోని మలము తగరముగాను, సీసము గాను అయినది. ఈ విధముగ ఆ వీర్యము నేలపై బడి అనేకధాతువుల రూపములలో వృద్ధి పొందినది. 19, 20

మూ. నిక్షిప్తమాత్రే గర్భే తు తేజోభిరభిరఞ్జితమ్,
సర్వం పర్వతసన్నద్ధం సౌవర్ణమభవద్వనమ్. 21

ప్ర. అ. గర్భే = గర్భము, నిక్షిప్తమాత్రే=ఉంచబడగానే, సర్వమ్ = సమస్తమైన, పర్వతసన్నద్ధమ్ = పర్వతమునందు మొలిచిన, వనమ్ = శర వణము, తేజోభిః = తేజస్సులచేత, అభిరఞ్జితమ్ = రంజింపచేయబడినదై, సౌవర్ణమ్ = సువర్ణమయముగా, అభవత్ = ఆయెను.

తా. ఆ గర్భమును అచట విడువగనే పర్వతముపై మొలిచిన శరవణ మంతయు కాంతులచే రంజింపబడినదై, సువర్ణమయ మైపోయినది. 21

మూ. జాతరూపమితి ఖ్యాతం తదా ప్రభృతి రాఘవ,
సువర్ణం పురుషవ్యాఘ్ర హుతాశనసమప్రభమ్. 22
తృణవృక్షలతాగుల్మం సర్వం భవతి కాఞ్చనమ్.

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషులలో శ్రేష్ఠుడా ! రాఘవ = రామా ! తదాప్రభృతి = అది మొదలు, హుతాశనసమప్రభమ్ = అగ్నితో సమాన మైన కాంతి గల, సువర్ణమ్ = బంగారము, జాతరూపమ్ ఇతి = పుట్టిన రూపము గలది అని, ఖ్యాతమ్ = ప్రసిద్ధ మైనది. సర్వమ్ = సమస్త మైన, తృణ వృక్షలతాగుల్మమ్ = తృణవృక్షలతాగుల్మాదికము, కాఞ్చనమ్ = బంగారముగా, భవతి = అయినది.

తా. పురుషశ్రేష్ఠుడా ! రామా ! అది మొదలు అగ్నితో సమాన మైన కాంతి గల బంగారము జాతరూపము (పుట్టిన రూపము కలది) అని ప్రసిద్ధి చెందినది. తృణము, వృక్షములు, లతలు, పొదలు, అన్నియు బంగారముగా మారిపోయినవి. 22

మూ. తం కుమారం తతో జాతం సేన్ద్రాః సహ మరుద్గణాః, 23
క్షీరసంభావనార్థాయ కృత్తికాః సమయోజయన్.

ప్ర. అ. తతః=పిమ్మట, జాతమ్ = పుట్టిన, తమ్ = ఆ, కుమారమ్ = కుమారుని, సేన్ద్రాః = ఇంద్రునితో కూడిన, మరుద్గణాః = దేవతాగణములు, సహ = ఒకేకాలమునందు, క్షీరసంభావనాయ = క్షీరమునిచ్చి ఆదరించుటకై, కృత్తికాః = కృత్తికలను, సమయోజయన్ = ఏర్పరచిరి.

తా. అంతట కుమారుడు పుట్టెను. అతనికి కృత్తికలు అందరును కలిసి ఒకే కాలమునందు పాలు ఇచ్చి ఆదరించవలె నని, ఇంద్రసమేతులగు దేవతలు ఏర్పాటుచేసిరి. 23

మూ. తాః క్షీరం జాతమాత్రస్య కృత్వా సమయముత్తమమ్, 24
దదుః పుత్రోఽయమస్మాకం సర్వాసామితి నిశ్చితాః.

ప్ర. అ. తాః = ఆ కృత్తికలు, నిశ్చితాః = తమలో తాము నిశ్చయించుకొనినవారై, అయమ్ = ఇతడు, అస్మాకమ్ = మాకు, సర్వాసామ్ = అందరికిని, పుత్రః = పుత్రుడు, అగుగాక అని, ఉత్తమమ్ = గొప్పదైన, సమయమ్=కట్టుబాటును, కృత్వా=చేసి, జాతమాత్రస్య=అపుడే పుట్టిన ఆ పిల్లవానికి, క్షీరమ్= చనుబాలను, దదుః = ఇచ్చిరి.

తా. ఆ కృత్తికలు తమలో తాము నిర్ణయము చేసుకొని, "ఈ పిల్లవాడు మా కందరకును పుత్రుడు కావలెను" అని దేవతలతో ఒక ఉత్తమ మైన ఒప్పంద మేర్పరచుకొని, అపుడే పుట్టిన ఆ పిల్లవానికి చనుబాలు ఇచ్చిరి. 24

మూ. తతస్తు దేవతాః సర్వాః కార్తికేయ ఇతి బ్రువన్, 25
పుత్రస్త్రైలోక్యవిఖ్యాతో భవిష్యతి న సంశయః.

ప్ర. అ. తతః = పిమ్మట, సర్వాః = సమస్త మైన, దేవతాః=దేవతలు, పుత్రః = ఈ పుత్రుడు, కార్తికేయః ఇతి = కృత్తికల పుత్రుడు అని, త్రైలోక్య విఖ్యాతః=మూడు లోకములలో విఖ్యాతుడు, భవిష్యతి=కాగలడు, సంశయః= సంశయము, న = లేదు, ఇతి = అని, బ్రువన్ = పలికిరి.

తా. ఈ పుత్రుడు కార్తికేయుడు (కృత్తికల కుమారుడు) అని మూడు లోకములలో ప్రసిద్ధి పొందును; సందేహము లేదు" అని దేవత లందరును పలికిరి.

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా స్కన్నం గర్భపరిస్రవే, 26
స్నాపయన్ పరయా లక్ష్మ్యా దీప్యమానం యథానలమ్.

ప్ర. అ. తేషామ్ = ఆ దేవతలయొక్క, తత్ = ఆ, వచనమ్= వచనమును, శ్రుత్వా = విని, గర్భపరిస్రవే = గర్భస్రావమునందు, స్కన్నమ్ = జారిపడిన వాడును, అనలం యథా=అగ్ని వలె, పరయా=గొప్పదైన, లక్ష్మ్యా= సౌందర్యముతో, దీప్యమానమ్ = ప్రకాశించుచున్నవాడును అగు, ఆ పిల్లవానిని, స్నాపయన్ = స్నానము చేయించిరి.

తా. దేవత లిట్లు చెప్పగా, గర్భస్రావమునందు జారిపడి, అగ్ని వలె శోభతో ప్రకాశించుచున్న ఆ పిల్లవానికి కృత్తికలు స్నానము చేయించిరి. 26

మూ. స్కన్ద ఇత్యబ్రువన్ దేవాః స్కన్నం గర్భపరిస్రవాత్, 27
కార్తికేయం మహాభాగం కాకుత్స్థ జ్వలనోపమమ్.

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! జ్వలనోపమమ్ = అగ్నితో సమానుడును, మహాభాగమ్ = గొప్ప భాగ్యము కలవాడును అగు, గర్భపరిస్రవాత్ = గర్భస్రావము వలన, స్కన్నమ్ = జారి పడిన, కార్తికేయమ్ = కార్తికేయుని, స్కన్దః ఇతి = స్కందుడు అని, అబ్రువన్ = పలికిరి.

తా. రామా ! మహాభాగ్యవంతుడును, అగ్నితుల్యుడును, గర్భస్రావము వలన జారి పడినవాడును అగు ఆ కార్తికేయునకు "స్కందుడు" (జారిపడినవాడు) అని కూడ పేరు పెట్టిరి. 27

మూ. ప్రాదుర్భూతం తతః క్షీరం కృత్తికానామనుత్తమమ్, 28
షణ్ణాం షడాననో భూత్వా జగ్రాహ స్తనజం పయః.

ప్ర. అ. తతః = పిమ్మట, కృత్తికానామ్=కృత్తికలకు, అనుత్తమమ్= అత్యుత్తమ మైన, క్షీరమ్ = క్షీరము, ప్రాదుర్భూతమ్ = పుట్టినది. షణ్ణామ్ =

ఆరుగురియొక్క, స్తనజమ్ = స్తనములందు పుట్టిన, పయః = పాలను, షడాననః=ఆరుముఖములుగలవాడు, భూత్వా=అయి, జగ్రాహ=గ్రహించెను.

తా. అంత ఆ కృత్తికల స్తనములలో అత్యుత్తమ మైన క్షీరము పుట్టినది. ఆ శిశువు ఆరు ముఖములు కలవాడై, ఆ ఆరుగురి స్తనములలో పుట్టిన క్షీరమును ఒక్క సమయముననే త్రాగెను. 28

మూ. గృహీత్వా క్షీరమేకాహ్నా సుకుమారవపుస్తదా, 29
అజయత్స్వేన వీర్యేణ దైత్యసేనాగణాన్విభుః.

ప్ర. అ. విభుః = సమర్థు డైన ఆ కుమారుడు, ఏకాహ్నా = ఒక దినము మాత్రమే, క్షీరమ్ = క్షీరమును, గృహీత్వా = గ్రహించి, తదా = అప్పుడు, సుకుమారవపుః = సుకుమార మైన శరీరముకలవా డైనను, స్వేన = తన సంబంధమైన, వీర్యేణ = పరాక్రమముచేత, దైత్యసేనాగణాన్ = దైత్యసేనా సముదాయములను, అజయత్ = జయించెను.

తా. సామర్థ్యశాలి యగు ఆ కుమారుడు ఒక్క దినమునందు మాత్రమే పాలు త్రాగి, సుకుమారశరీరవంతు డైనను, తన పరాక్రమముచే దైత్యసేనలను జయించెను. 29

మూ. సురసేనాగణపతిం తతస్తమతులద్యుతిమ్, 30
అభ్యషిఞ్చన్ సురగణాః సమేత్యాగ్నిపురోగమాః.

ప్ర. అ. తతః = పిమ్మట, అగ్నిపురోగమాః = అగ్ని మొదలైన, సురగణాః = దేవతాగణములు, సమేత్య = కలిసి, అతులద్యుతిమ్ = సాటి లేని కాంతి గల, తమ్ = ఆతనిని, సురసేనాగణపతిమ్ = దేవసేనాగణమునకు నాయకునిగా, అభ్యషిఞ్చన్ = అభిషేకించిరి.

తా. అగ్ని మొదలగు దేవత లందరును కలిసి సాటి లేని కాంతి గల ఆతనిని దేవసేనానాయకునిగా అభిషేకించిరి. 30

మూ. ఏష తే రామ గఙ్గాయా విస్తరోఽభిహితో మయా, 31
కుమారసంభవశ్చైవ ధన్యః పుణ్యస్తథైవ చ.

ప్ర. అ. రామ = రామా ! మయా = నాచేత, తే = నీకు, గఙ్గాయాః = గంగయొక్క, ఏషః = ఈ, విస్తరః = కథావిస్తరము, తథైవ = మరియు, ధన్యః = ధన్యత్వమును కలిగించునదియు, పుణ్యః = పవిత్ర మైనదియు అగు, కుమారసంభవశ్చైవ = కుమారస్వామియొక్క పుట్టుకయు, అభిహితః = చెప్పబడినది.

తా. రామా ! గంగకు సంబంధించిన విస్తృతకథను, ధన్యత్వమును కలిగించునదియు, పుణ్యమును అయిన కుమారసంభవ వృత్తాంతమును చెప్పితిని. 31

మూ. భక్తశ్చ యః కార్తికేయే కాకుత్స్థ భువి మానవః, 32
ఆయుష్మాన్ పుత్రపౌత్రైశ్చ స్కన్దసాలోక్యతాం ప్రవజేత్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే
బాలకాణ్డే సప్తత్రింశః సర్గః.

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! భువి = భూలోకమునందు, యః = ఏ, మానవః = మానవుడు, కార్తికేయే = కుమారస్వామియందు, భక్తః చ = భక్తుడో, అతడు, ఆయుష్మాన్ = ఆయుర్దాయవంతుడై, పుత్రపౌత్రైః = పుత్రపౌత్రాదులతో కూడినవాడై, స్కన్దసాలోక్యతామ్ = స్కందునితో సాలోక్యమును, ప్రవజేత్ = పొందును.

తా. రామా ! భూలోకమున, కుమారస్వామియందు భక్తి గల మానవుడు దీర్ఘాయుర్దాయవంతుడై, పుత్రపౌత్రాది సౌఖ్యము లనుభవించి మరణానంతరము స్కందునిలోకము చేరును. 32

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యయందు బాలకాండలో
ముప్పది యేడవ సర్గ సమాప్తము.

అథ అష్టత్రింశః సర్గః

మూ. తాం కథాం కౌశికో రామే నివేద్య కుశికాత్మజః,
పునరేవాపరం వాక్యం కాకుత్స్థమిదమబ్రవీత్. 1

ప్ర. అ. కుశికాత్మజః=కుశవంశీయుడైన గాధి కుమారుడైన, కౌశికః=విశ్వామిత్రుడు, తాం కథామ్ = ఆ కథను, రామే = రామునియందు (నకు), నివేద్య = తెలిపి, పునరేవ = మరల, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, కాకుత్స్థమ్ = రాముని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. విశ్వామిత్రుడు రామునకీ కథ చెప్పి మరల అతనితో ఇట్లనెను. 1

మూ. అయోధ్యాధిపతిః శూరః పూర్వమాసీన్నరాధిపః,
సగరో నామ ధర్మాత్మా ప్రజాకామస్స చాప్రజః. 2

ప్ర. అ. పూర్వమ్ = పూర్వము, అయోధ్యాధిపతిః = అయోధ్యకు అధిపతియు, శూరః=శూరుడును, ధర్మాత్మా=ధర్మాత్ముడును అగు, సగరో నామ=సగరుడను పేరు గల, నరాధిపః = రాజు, ఆసీత్ = ఉండెను. సః = అతడు, అప్రజః = సంతానము లేనివాడై, ప్రజాకామః=సంతానమునందు కోరిక గలవాడై ఉండెను.

తా. పూర్వము అయోధ్యాధిపతియు, శూరుడును, ధర్మాత్ముడును అగు సగరుడను రాజు ఉండెను. సంతానము కలుగకపోవుటచే ఆతడు సంతానమును కోరుచుండెను. 2

మూ. వైదర్భదుహితా రామ కేశినీ నామ నామతః,
జ్యేష్ఠా సగరపత్నీ సా ధర్మిష్ఠా సత్యవాదినీ. 3

ప్ర. అ. రామ = రామా! వైదర్భదుహితా = విదర్భదేశరాజుయొక్క కుమార్తెయు, నామతః=పేరువలన, కేశినీ నామ=కేశిని యను ప్రసిద్ధి కలదియు

అగు ఒక ఉత్తమురాలు, జ్యేష్ఠా=పెద్ద దైన, సగరపత్నిగా ఉండెను. సా=ఆమె, ధర్మిష్ఠా = చాల ధార్మికురాలు, సత్యవాదినీ = సత్యమే పలుకునది.

తా. రామా! విదర్భాధీశుని కూతు రగు కేశిని సగరుని పెద్ద భార్య. ఆమె మిక్కిలి ధార్మికురాలు. సత్యమునే పలికెడిది. 3

మూ. అరిష్టనేమేర్దుహితా రూపేణాప్రతిమా భువి,
ద్వితీయా సగరస్యాసీత్పత్నీ సుమతిసంజ్ఞికా. 4

ప్ర. అ. అరిష్టనేమేః = అరిష్టనేమియొక్క, దుహితా = కుమార్తెయు, రూపేణ=రూపముచేత, భువి=భూలోకమునందు, అప్రతిమా=సాటి లేనిదియు, అగు, సుమతిసంజ్ఞికా = సుమతి యను పేరు గలది, సగరస్య = సగరుని యొక్క, ద్వితీయా = రెండవ, పత్నీ = భార్యగా, ఆసీత్ = ఆయెను.

తా. అరిష్టనేమి కుమార్తెయు, రూపముచే భూలోకమునందు సాటి లేనిదియు అగు సుమతి సగరుని రెండవ భార్య. 4

మూ. తాభ్యాం స హి తదా రాజా పత్నీభ్యాం తప్తవాంస్తపః,
హిమవన్తం సమాసాద్య భృగుప్రస్రవణే గిరౌ. 5

ప్ర. అ. తదా = అప్పుడు, సః = ఆ, రాజా = రాజు, తాభ్యామ్ = ఆ, పత్నీభ్యామ్ = భార్యలతో, సహితః = కూడినవాడై, హిమవన్తమ్ = హిమవత్పర్వతమును, సమాసాద్య = చేరి, భృగుప్రస్రవణే = భృగుప్రస్రవణ మనెడు, గిరౌ = పర్వతమునందు, తపః తప్తవాన్ = తపస్సు చేసినాడు.

తా. అప్పు డా రాజు ఆ భార్య లిద్దరితో కలిసి, హిమవత్పర్వతమునకు పోయి, భృగుప్రస్రవణ మనెడు పర్వతమునందు తపస్సు చేసెను. 5

మూ. అథ వర్షశతే పూర్ణే తపసారాధితో మునిః,
సగరాయ వరం ప్రాదాద్భృగుః సత్యవతాం వరః. 6

ప్ర అ. అథ = అటుపిమ్మట, వర్షశతే = నూరు సంవత్సరముల కాలము, పూర్ణే = నిండిన దగుచుండగా, తపసా = తపస్సుచే, ఆరాధితః = సంతోషపెట్ట

బడిన, సత్యవతాం వరః = సత్యవంతులలో శ్రేష్ఠుడైన, భృగుః మునిః = భృగుమహర్షి, సగరాయ=సగరునకు, వరమ్=వరమును, ప్రాదాత్=ఇచ్చెను.

తా. ఇట్లు నూరు సంవత్సరములు గడచినవి. సత్యవంతులలో శ్రేష్ఠుడైన భృగుమహర్షి సగరుని తపస్సునకు సంతోషించి అతనికి వర మిచ్చెను. 6

మూ. అపత్యలాభః సుమహాన్ భవిష్యతి తవానఘ,
కీర్తిం చాప్రతిమాం లోకే ప్రాప్స్యసే పురుషర్షభ. 7

ప్ర. అ. అనఘ = దోషములు లేనివాడా! తవ = నీకు, సుమహాన్ = చాల గొప్పదైన, అపత్యలాభః = సంతానప్రాప్తి, భవిష్యతి = కాగలదు. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! లోకే = లోకమునందు, అప్రతిమామ్ = సాటి లేని, కీర్తిం చ=కీర్తిని కూడ, ప్రాప్స్యసి = పొందగలవు.

తా. ఓ పుణ్యాత్మా! నీకు అత్యధికసంతానప్రాప్తి కలుగును. లోకములో సాటి లేని కీర్తి కూడ లభించును. 7

మూ. ఏకా జనయితా తాత పుత్రం వంశకరం తవ,
షష్టిం పుత్రసహస్రాణి అపరా జనయిష్యతి. 8

ప్ర. అ. తాత = నాయనా! ఏకా = ఒక భార్య, తవ = నీయొక్క, వంశకరమ్=వంశమును నిలుపు, పుత్రమ్=పుత్రుని, జనయిష్యతి=కనగలదు, అపరా = మరియొకభార్య, షష్టిమ్ = అరువది, పుత్రసహస్రాణి=పుత్రసహస్రములను, జనయిష్యతి = కనగలదు.

తా. నాయనా! ఒక భార్య నీ వంశమును నిలుపు ఒక కుమారుని కనగలదు. మరియొక భార్య అరువదివేలమంది కుమారులను కనగలదు. 8

మూ. భాషమాణం మహాత్మానం రాజపుత్ర్యౌ ప్రసాద్య తమ్,
ఊచతుః పరమప్రీతే కృతాఞ్జలిపుటే తదా. 9

ప్ర. అ. తదా=అప్పుడు, పరమప్రీతే=చాల సంతసించిన, రాజపుత్ర్యౌ= రాజపుత్రికలు, కృతాఞ్జలిపుటే = కట్టబడిన దోసిలి కలవారై, భాషమాణమ్ =

ఆ విధముగ మాటలాడు చున్న, మహాత్మానమ్ = ఆ మహాత్ముని, ప్రసాద్య = అనుగ్రహింపచేసికొని, తమ్ = అతనిని గూర్చి, ఊచతుః = పలికిరి.

తా. అపుడా రాజపుత్రికలు చాల సంతసించి, చేతులు జోడించి, ఆ విధముగ పలికిన ఆ మహాత్ముని అనుగ్రహింపచేసికొని ఇట్లు పలికిరి. 9

మూ. ఏకః కస్యాః సుతో బ్రహ్మన్ కా బహూన్ జనయిష్యతి,
శ్రోతుమిచ్ఛామహే బ్రహ్మన్ సత్యమస్తు వచ స్తవ. 10

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రహ్మర్షీ! కస్యాః=ఎవతెకు, ఏకః=ఒక్క, సుతః= కుమారుడు పుట్టును ? కా = ఎవతె, బహూన్ = చాల మందిని, జనయిష్యతి = కనును ? బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణోత్తమా ! శ్రోతుమ్=వినుటకు, ఇచ్ఛామహే= కోరుచున్నాము, తవ = నీ యొక్క, వచః = వాక్యము, సత్యమ్ అస్తు = సత్యమగుగాక.

తా. బ్రహ్మర్షీ ! మా ఇద్దరిలో ఒక్క కుమారుడు ఎవతెకు కలుగును, చాలమంది ఎవతెకు కలుగుదురు. వినవలె నని కోరుచున్నాము. నీ వాక్యము సత్య మగు గాక. 10

మూ. తయో స్తద్వచనం శ్రుత్వా భృగుః పరమధార్మికః,
ఉవాచ పరమాం వాణీం స్వచ్ఛన్దోఽత్ర విధీయతామ్. 11

ప్ర. అ. పరమధార్మికః = మిక్కిలి ధార్మికు డైన, భృగుః = భృగువు, తయోః = వారియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, పరమామ్ = ఉత్తమ మైన, వాణీమ్ = వాక్కును, ఉవాచ = పలికెను. అత్ర= ఈ విషయమున, స్వచ్ఛన్దః = స్వేచ్ఛ, విధీయతామ్ = చేయబడుగాక.

తా. వారి మాటలు విని పరమధార్మికు డైన ఆ భృగుమహర్షి ఇట్లు పలికెను— "ఈ విషయమున మీరు కోరుకొనుడు". 11

మూ. ఏకో వంశకరో వాస్తు బహవో వా మహాబలాః,
కీర్తిమన్తో మహోత్సాహాః కా వా కం వరమిచ్ఛతి. 12

ప్ర. అ. వంశకరః = వంశమును నిలుపు, ఏకః = ఒక్క పుత్రుడు, అస్తు వా = కలుగవలెనా ? మహాబలాః = గొప్ప బలము కలవారును, కీర్తి మన్తః = కీర్తి కలవారును, మహోత్సాహాః = గొప్ప ఉత్సాహము కలవారును అగు, బహవో వా = చాలమంది కావలెనా ? కా వా = మీలో ఎవరు, కమ్ = ఏ, వరమ్ = వరమును, ఇచ్ఛతి = కోరుచున్నది ?

తా. వంశకరు డైన ఒక్క కుమారుడు కావలెనా, మహాబలవంతులును, కీర్తిమంతులును, మహోత్సాహవంతులును అగు చాలమంది పుత్రులు కావలెనా ? మీలో ఎవరికి ఏ వరము కావలెను ? 12

మూ. మునేస్తు వచనం శ్రుత్వా కేశినీ రఘునన్దన,
పుత్రం వంశకరం రామ జగ్రాహ నృపసన్నిధౌ. 13

ప్ర. అ. రఘునన్దన = రఘువంశీయులను ఆనందింపచేయువాడా, రామ = రామా ! మునేః = మునియొక్క, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, కేశినీ = కేశిని, వంశకరమ్ = వంశమును నిలబెట్టువాడైన, పుత్రమ్ = పుత్రుని, నృప సన్నిధౌ = రాజుయొక్క సంనిధియందు, జగ్రాహ = గ్రహించెను.

తా. ఓ రఘునందనా ! రామా ! కేశిని, ముని వాక్యమును విని, రాజు సన్నిధిలో, "నాకు వంశకరు డగు పుత్రుడు కావలెను" అని కోరుకొనెను. 13

మూ షష్టిం పుత్రసహస్రాణి సుపర్ణభగినీ తదా,
మహోత్సాహాన్ కీర్తిమతో జగ్రాహ సుమతిః సుతాన్. 14

ప్ర. అ. తదా = అప్పుడు, సుపర్ణభగినీ = గరుత్మంతుని సోదరి యైన, సుమతిః = సుమతి, మహోత్సాహాన్ = గొప్ప ఉత్సాహము కలవారును, కీర్తి మతః = కీర్తి కలవారును అగు, షష్టిమ్ = అరువది, పుత్రసహస్రాణి = పుత్రుల సహస్రములను, సుతాన్ = తన కుమారులనుగా, జగ్రాహ = గ్రహించెను.

తా. అపుడు, గరుత్మంతుని సోదరి యగు సుమతి మహోత్సాహవంతులును, కీర్తిమంతులును అగు అరువది వేలమంది పుత్రులను కోరెను. 14

మూ. ప్రదక్షిణమృషిం కృత్వా శిరసాభిప్రణమ్య చ,
జగామ స్వపురం రాజా సభార్యో రఘునన్దన. 15

ప్ర. అ. రఘునన్దన = రామా ! సభార్యః=భార్యాసహితు డగు, రాజా= రాజు, ఋషిమ్ = ఋషిని, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణము చేసి, శిరసా = శిరస్సుచేత, అభిప్రణమ్య = నమస్కరించి, స్వపురమ్ = తన పురమునుగూర్చి, జగామ = వెళ్లెను.

తా. రామా ! భార్యాసమేతు డైన సగరచక్రవర్తి, ఋషికి ప్రదక్షిణనమస్కారములు చేసి తన పురమునకు వెళ్లెను. 15

మూ. అథ కాలే గతే తస్మిన్ జ్యేష్ఠా పుత్రం వ్యజాయత,
అసమంజ ఇతి ఖ్యాతం కేశినీ సగరాత్మజమ్. 16

ప్ర. అ. అథ = పిమ్మట, తస్మిన్ కాలే గతే = కొంత కాలము గడచిన పిమ్మట, జ్యేష్ఠా = జ్యేష్ఠ భార్య యైన, కేశినీ = కేశిని, సగరాత్మజమ్ = సగరుని కుమారు డైన, అసమంజ ఇతి = అసమంజుడు అని, ఖ్యాతమ్ = ప్రసిద్ధు డైన, పుత్రమ్ = పుత్రుని, వ్యజాయత = కనెను.

తా. కొంతకాలము గడచిన పిమ్మట, జ్యేష్ఠభార్య యైన కేశిని యందు, సగరచక్రవర్తికి అసమంజు డను పేరు గల పుత్రుడు కలిగెను. 16

మూ. సుమతిస్తు నరవ్యాఘ్ర గర్భతుమ్బం వ్యజాయత,
షష్టిః పుత్రసహస్రాణి తుమ్బభేదాద్వినిఃసృతాః. 17

ప్ర. అ. నరవ్యాఘ్ర = ఓ నరశ్రేష్ఠా ! సుమతిస్తు = సుమతియైతే, గర్భతుమ్బమ్ = సొరకాయ వంటి గర్భపిండమును, వ్యజాయత = కనెను. తుమ్బభేదాత్ = ఆ సొరకాయ వంటి గర్భపిండము పగులుటవలన, షష్టిః = అరువది, పుత్రసహస్రాణి = పుత్రసహస్రములు, వినిస్సృతాః = బైటకువచ్చినవి.

తా. రామా ! సుమతి సొరకాయ వంటి గర్భపిండమును కనెను. ఆ గర్భపిండము పగులగా అరువది వేలమంది పుత్రులు బైటకు వచ్చిరి. 17

మూ. ఘృతపూర్ణేషు కుమ్భేషు ధాత్ర్యస్తాన్సమవర్ధయన్,
కాలేన మహతా సర్వే యౌవనం ప్రతిపేదిరే. 18

ప్ర. అ. ధాత్ర్యః = పెంపుడు తల్లులు, తాన్ = వారిని, ఘృతపూర్ణేషు= నేతితో నిండిన, పాత్రేషు = పాత్రలయందు, సమవర్ధయన్ = వృద్ధి పొందించిరి. సర్వే = వారందరును, మహతా కాలేన = చాల కాలమునకు, యౌవనమ్ = యౌవనమును, ప్రతిపేదిరే = పొందిరి.

తా. పెంపుడు తల్లులు వారిని నేతితో నింపిన పాత్రలలో ఉంచి పెంచిరి. చాల కాలమునకు వారు యౌవనవంతు లయిరి. 18

మూ. అథ దీర్ఘేణ కాలేన రూపయౌవనశాలినః,
షష్టిః పుత్రసహస్రాణి సగరస్యాభవం స్తదా. 19

ప్ర. అ. అథ = పిమ్మట, దీర్ఘేణ కాలేన = చాలకాలముచేత, సగరస్య= సగరునియొక్క, షష్టిః పుత్రసహస్రాణి=అరువది వేలమంది పుత్రులును, తదా= అప్పుడు, రూపయౌవనశాలినః=రూపయౌవనములతో ప్రకాశించుచున్న వారుగా, అభవన్=అయిరి.

తా. సగరుని అరువది వేలమంది కుమారులును దీర్ఘకాలమునకు రూప యౌవనములతో ప్రకాశించుచు పెరిగిరి. 19

మూ. స చ జ్యేష్ఠో నరశ్రేష్ఠ సగరస్యాత్మసంభవః,
బాలాన్ గృహీత్వా తు జలే సరయ్వా రఘునన్దన, 20
ప్రక్షిప్య ప్రహసన్నిత్యం మజ్జతస్తాన్ సమీక్ష్య వై.

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడా ! రఘునన్దన=రామా ! జ్యేష్ఠః= పెద్దవాడైన, సః=ఆ, సగరస్య ఆత్మసంభవః=సగరుని కుమారుడు, నిత్యమ్= ప్రతిదినము, బాలాన్ = చిన్న పిల్లలను, గృహీత్వా = పట్టుకొని, సరయ్వాః = సరయూనదియొక్క, జలే = జలమునందు, ప్రక్షిప్య = పడవేసి, నిమజ్జతః = మునిగిపోవుచున్న, తాన్ = వాళ్లను, సమీక్ష్య = చూచి, ప్రహసన్ = నవ్వుచు, (ఆనందించుచుండెడివాడు).

తా. నరశ్రేష్ఠా ! రామా ! సగరుని జ్యేష్ఠకుమారుడు ప్రతిదినము, చిన్నపిల్లలను పట్టుకొని, సరయూనదీ జలములోనికి విసరివేసి, వాళ్ల మునకలు కొట్టుచుండగా చూచి ఆనందించుచుండెడి వాడు. 20

మూ. ఏవం పాపసమాచారః సజ్జనప్రతిబాధకః, 21
పౌరాణామహితే యుక్తః పుత్రో నిర్వాసితః పురాత్.

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, పాపసమాచారః = పాపప్రవృత్తి కల వాడును, సజ్జనప్రతిబాధకః = సజ్జనులను బాధించువాడును, పౌరాణామ్ = పౌరులయొక్క, అహితే = హితముకాని కార్యమునందు, రతః = ఆసక్తి గల, పుత్రః = పుత్రుడు, పురాత్ = పురమునుండి, నిర్వాసితః = వెడలగొట్టబడెను.

తా. ఈ విధముగ పాపకార్యములు చేయుచు, సజ్జనులను బాధించుచు, పౌరులకు అహితము చేయుటలో ఆసక్తు డైన ఆ పుత్రుని, సగరుడు పట్టణము నుండి వెడలగొట్టెను. 21

మూ. తస్య పుత్రోంఽశుమాన్నామ అసమంజస్య వీర్యవాన్, 22
సంమతః సర్వలోకస్య సర్వస్యాపి ప్రియంవదః.

ప్ర. అ. తస్య = ఆ, అసమంజస్య = అసమంజుని యొక్క, పుత్రః = పుత్రుడును, వీర్యవాన్ = పరాక్రమవంతుడును అగు, అంశుమాన్ నామ = అంశుమంతుడు అనునతడు, సర్వలోకస్య = సమస్తలోకమునకును, సంమతః = ఇష్టుడు. సర్వస్యాపి = అందరికిని, ప్రియంవదః = ప్రియము మాటలాడువాడు.

తా. ఆ అసమంజుని కుమారుడు అంశుమంతుడు. అతడు పరాక్రమము కలవాడు. సకలలోకమునకును ఇష్టుడు. అందరితోను ప్రియముగా మాటలాడు వాడు. 22

మూ. తతః కాలేన మహతా మతిః సమభిజాయత, 23
సగరస్య నరశ్రేష్ఠ యజేయమితి నిశ్చితా.

ప్ర. అ. నరశ్రేష్ఠ = ఓ రామా ! తతః = పిమ్మట, మహతా కాలేన = చాల కాలము చేత, సగరస్య = సగరునకు, యజేయమ్ ఇతి = యాగము చేయుదును అని, నిశ్చితా = నిశ్చితమైన, మతిః = బుద్ధి, సమభిజాయత = పుట్టినది.

తా. పురుషశ్రేష్ఠా ! పిమ్మట చాలకాలమునకు, సగరునకు యజ్ఞము చేయ వలె నని ఆలోచన కలిగెను. 23

మూ. స కృత్వా నిశ్చయం రామ సోపాధ్యాయగణస్తదా, 24
యజ్ఞకర్మణి వేదజ్ఞో యష్టుం సముపచక్రమే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
అష్టత్రింశః సర్గః.

ప్ర. అ. రామ = రామా ! తదా = అపుడు, వేదజ్ఞః = వేదముల నెరిగిన, సః = ఆతడు, సోపాధ్యాయగణః = ఉపాధ్యాయసహితుడై, యజ్ఞకర్మణి = యజ్ఞానుష్ఠానము విషయమున, నిశ్చయమ్ = నిశ్చయమును, కృత్వా = చేసి, యష్టుమ్ = యాగము చేయుటకు, సముపచక్రమే = ఉపక్రమించెను.

తా. రామా ! అపుడు వేదజ్ఞుడైన ఆ సగరుడు ఉపాధ్యాయులతో కూడ యజ్ఞానుష్ఠానము విషయమున నిశ్చయించుకొని యాగము చేయ ప్రారంభించెను. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో
ముప్పది యెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనచత్వారింశః సర్గః

మూ. విశ్వామిత్రవచః శ్రుత్వా కథాన్తే రఘునన్దనః,
ఉవాచ పరమప్రీతో మునిం దీప్తమివానలమ్. 1

ప్ర. అ. రఘునన్దనః = రాముడు, విశ్వామిత్రవచః = విశ్వామిత్రుని వాక్యమును, శ్రుత్వా = విని, పరమప్రీతః = చాల సంతసించినవాడై, కథాన్తే= కథయొక్క అంతమునందు, దీప్తమ్ = ప్రజ్వలించుచున్న, అనలమివ = అగ్ని వలె ఉన్న, మునిమ్ = విశ్వామిత్రుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. రాముడు విశ్వామిత్రుని వచనమును విని, చాల సంతసించి, కథాంతమున, ప్రజ్వలించుచున్న అగ్ని వలె ఉన్న అతనితో ఇట్లనెను. 1

మూ. శ్రోతుమిచ్ఛామి భద్రం తే విస్తరేణ కథామిమామ్,
పూర్వకో మే కథం బ్రహ్మన్ యజ్ఞం వై సముపాహరత్. 2

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! ఇమామ్ = ఈ, కథామ్ = కథను, విస్తరేణ = సవిస్తరముగ, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక. మే = నా యొక్క, పూర్వకః = పూర్వీకుడు, యజ్ఞమ్ = యజ్ఞమును, కథమ్ = ఎట్లు, సముపాహరత్ = చేసెను ?

తా. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! మా పూర్వపురుషుడైన సగరచక్రవర్తి యజ్ఞము ఎట్లు చేసెనో సవిస్తరముగా విన గోరుచున్నాను. 2

మూ. విశ్వామిత్రస్తు కాకుత్స్థముపాచ ప్రహసన్నివ,
శ్రూయతాం విస్తరో రామ సగరస్య మహాత్మనః. 3

ప్ర. అ. విశ్వామిత్రస్తు = విశ్వామిత్రుడు, ప్రహసన్నివ = నవ్వుచు, కాకుత్స్థమ్ = రామునిగూర్చి, ఉవాచ = పలికెను, మహాత్మనః = మహాత్ముడైన,

నగరస్య = నగరునియొక్క, విస్తరః = కథావిస్తరము, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వి రామునితో ఇట్లు పలికెను. రామా! మహాత్ముడైన నగరుని కథావిస్తరమును చెప్పెదను, వినుము.

మూ. శఙ్కరశ్వశురో నామ హిమవానచలోత్తమః,
విన్ధ్యపర్వతమాసాద్య నిరీక్షేతే పరస్పరమ్. 4

ప్ర. అ. శంకరశ్వశురః = శివుని మామగారైన, హిమవాన్నామ = హిమవంతు డను పేరుగల, అచలోత్తమః = పర్వతశ్రేష్ఠము, విన్ధ్యపర్వతమ్ = వింధ్యపర్వతమును, ఆసాద్య = పొంది ఉన్నది. ఆ రెండు పర్వతములును, పరస్పరమ్ = పరస్పరము, నిరీక్షేతే = చూచుకొనుచున్నవి.

తా. మహేశ్వరుని మామగా రైన హిమవత్పర్వత మను పర్వతశ్రేష్ఠము వింధ్యపర్వతమును చూపుల ద్వారా పొంది ఉన్నది. అట్లే వింధ్యము దానిని పొంది యున్నది. ఆ రెండు పర్వతములును, పరస్పరము చూచుకొనుచుండును.

వి. హిమవద్వింధ్యపర్వతముల నడుమ మరే పర్వతమును అడ్డు లేక పోవుటచేతను, ఆ రెండును చాల ఎత్తైన వగుటచేతను హిమవత్పర్వతము వింధ్య పర్వతమును పొంది, వింధ్యము హిమవత్పర్వతమును పొంది ఉన్న దనియు, ఆ రెండును ఒకదాని నొకటి చూచుచు నిలబడి ఉన్న వనియు చెప్పబడిన దని వ్యాఖ్యాతలు. 4

మూ. తయోర్మధ్యే ప్రవృత్తోఽభూద్యజ్ఞ స్స పురుషోత్తమ,
స హి దేశో నరవ్యాఘ్ర ప్రశస్తో యజ్ఞకర్మణి. 5

ప్ర. అ. పురుషోత్తమ = ఓ పురుషశ్రేష్ఠుడా! సః = ఆ, యజ్ఞః = యజ్ఞము, తయోః = ఆ హిమవద్వింధ్యముల, మధ్యే = మధ్యయందు, ప్రవృత్తః = జరిగినది. నరవ్యాఘ్ర = నరశ్రేష్ఠుడా! సః = ఆ, దేశః = దేశము, యజ్ఞకర్మణి = యజ్ఞకర్మయందు, ప్రశస్తః హి = ప్రశస్త మైనది కదా?

తా. రామా! ఆ యజ్ఞము ఆ రెండు పర్వతముల మధ్య నున్న దేశము

నందు జరిగినది. ఏల నన, యజ్ఞము చేయుటకు ఆ దేశము చాల ప్రశస్త మైనది. 5

మూ. తస్యాశ్వచర్యాం కాకుత్స్థ దృఢధన్వా మహారథః,
అంశుమానకరోత్తాత సగరస్య మతే స్థితః. 6

ప్ర. అ. తాత = తండ్రీ ! కాకుత్స్థ = రామా ! దృఢధన్వా = దృఢ మైన ధనస్సు కలవాడును, మహారథః = మహారథుడును అగు, అంశుమాన్ = అంశుమంతుడు, సగరస్య = సగరునియొక్క, మతే = మతమునందు, స్థితః = ఉన్నవాడై, తస్య = ఆ యజ్ఞముయొక్క, అశ్వచర్యామ్ = అశ్వముయొక్క అనుసరణమును, అకరోత్ = చేసెను.

తా. రామా ! దృఢ మైన ధనస్సు కలవాడును, మహారథుడును అగు అంశుమంతుడు, సగరుని ఆజ్ఞ ప్రకారము యజ్ఞాశ్వమును రక్షించుచు దాని ననుసరించెను. 6

మూ. తస్య పర్వణి తం యజ్ఞం యజమానస్య వాసవః,
రాక్షసీం తనుమాస్థాయ యజ్ఞీయాశ్వమపాహరత్. 7

ప్ర. అ. వాసవః = ఇంద్రుడు, రాక్షసీమ్ = రాక్షససంబంధ మైన, తనుమ్ = శరీరమును, ఆస్థాయ = గ్రహించి, పర్వణి = ఉక్థ్యదివసమునందు, యజ్ఞం యజమానస్య = యజ్ఞము చేయుచున్న, తస్య = సగరునియొక్క, యజ్ఞీయాశ్వమ్ = యజ్ఞమునకు సంబంధించిన అశ్వమును, అపాహరత్ = అపహరించెను.

తా. దేవేంద్రుడు రాక్షసరూపమును ధరించి, ఉక్థ్యదివస మనుపర్వము నందు, సగరుని యజ్ఞాశ్వమును అపహరించెను. 7

మూ. హ్రియమాణే తు కాకుత్స్థ తస్మిన్నశ్వే మహాత్మనః,
ఉపాధ్యాయగణాః సర్వే యజమానమథాబ్రువన్. 8

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! మహాత్మనః = మహాత్ము డైన ఆ సగరుని యొక్క, తస్మిన్ అశ్వే = ఆ అశ్వము, హ్రియమాణే = హరింపబడుచుండగా,

అథ = పిమ్మట, సర్వే = సమస్తమైన, ఉపాధ్యాయగణాః = ఋత్విక్కులు, యజమానమ్ = యజమానుని గూర్చి, అబ్రువన్ = పలికిరి.

తా. రామా ! మహాత్ముడైన సగరుని యజ్ఞీయాశ్వము అపహరింపబడుచుండగా ఋత్విక్కు లందరును యజమానునితో ఇట్లనిరి.

మూ. అయం పర్వణి వేగేన యజ్ఞీయాశ్వోఽపనీయతే,
హర్తారం జహి కాకుత్స్థ హయశ్చైవోపనీయతామ్. 9

ప్ర. అ. కాకుత్స్థ=ఓ సగరచక్రవర్తీ ! పర్వణి=ఉక్థ్యాహపర్వమునందు, అయమ్ = ఈ, యజ్ఞీయాశ్వః = యజ్ఞాశ్వము, వేగేన = వేగముచేత, అపనీయతే = తీసికొనిపోబడుచున్నది. హర్తారమ్ = అపహరించువానిని, జహి=చంపుము. హయశ్చ=అశ్వము, ఉపనీయతామ్=తీసికొనిరాబడుగాక.

తా. సగరచక్రవర్తీ ! పర్వమునందు ఈ యజ్ఞాశ్వమును ఎవ్వరో వేగముగ అపహరించి తీసికొనిపోవుచున్నారు. అపహరించువానిని సంహరించి యజ్ఞాశ్వమును తీసికొనిరమ్ము. 9

మూ. యజ్ఞచ్ఛిద్రం భవత్యేతత్సర్వేషామశివాయ నః,
తత్తథా క్రియతాం రాజన్ యథాఽచ్ఛిద్రః క్రతుర్భవేత్. 10

ప్ర. అ. ఏతత్ = ఈ, యజ్ఞచ్ఛిద్రమ్ = యజ్ఞాపరాధము, నః = మనకు, సర్వేషామ్ = అందరికిని, అశివాయ = అమంగళకరము, భవేత్ = అగును. తత్ = ఆకారణమువలన, రాజన్ = రాజా ! క్రతుః = ఈక్రతువు, అచ్ఛిద్రః= అపరాధరహితమై, యథా = ఎట్లు, భవేత్ = అగునో, తథా = ఆప్రకారము, క్రియతామ్ = చేయబడుగాక.

తా. రాజా ! ఈ యజ్ఞాపరాధము మన అందరికిని అమంగళకరము. అందువలన యజ్ఞములో అపచారము కలుగకుండునట్లు చేయుము. 10

మూ. ఉపాధ్యాయవచః శ్రుత్వా తస్మిన్ సదసి పార్థివః,
షష్టిం పుత్రసహస్రాణి వాక్యమేతదువాచ హ. 11

ప్ర. అ. పార్థివః=ఆ రాజు, ఉపాధ్యాయవచః=ఋత్విక్కుల వాక్యమును, శ్రుత్వా=విని, తస్మిన్ సదసి = ఆ యజ్ఞసదస్సునందు, షష్టిం = అరువది, పుత్రసహస్రాణి = పుత్రుల సహస్రములను, ఏతత్ వాక్యమ్ = ఈ వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. సగరుడు ఋత్విక్కుల వాక్యములు విని, ఆ యజ్ఞసదస్సులో, అరువదివేలమంది కుమారులతో ఇట్లనెను. 11

మూ. గతిం పుత్రా న పశ్యామి రక్షసాం పురుషర్షభాః,
మన్త్రపూతైర్మహాభాగై రాస్థితో హి మహాక్రతుః. 12

ప్ర.అ. పురుషర్షభాః = పురుషశ్రేష్ఠులైన, పుత్రాః = పుత్రులారా, రక్షసామ్ = రాక్షసులకు, గతిమ్ = ఇచట ప్రవేశమును, న పశ్యామి=చూడను. హి = ఏలననగా, మహాక్రతుః=ఈ మహాయజ్ఞము, మన్త్రపూతైః=మంత్రములచే పవిత్రులైన, మహాభాగైః = మహాత్ములచేత, ఆస్థితః=అధిష్ఠింపబడినది.

తా. పురుషశ్రేష్ఠులైన పుత్రులారా! ఇచటకు రాక్షసులు రాజాల రని నా విశ్వాసము. ఏలననగా ఈ క్రతువును జరిపించువారు మంత్రములచే పవిత్రులైన మహానుభావులు. 12

మూ. తద్గచ్ఛత విచిన్వధ్వం పుత్రకా భద్రమస్తు వః,
సముద్రమాలినీం సర్వాం పృథివీమనుగచ్ఛత. 13

ప్ర. అ. పుత్రకాః=కుమారులారా, తత్=ఆకారణము వలన, గచ్ఛత= వెళ్ళుడు. వః = మీకు, భద్రమ్ = మంగళము, అస్తు = అగుగాక. సముద్రమాలినీమ్=సముద్రము లనెడు మాల గల, సర్వామ్=సమస్తమైన, పృథివీమ్= భూమిని, అనుగచ్ఛత = వెదకుడు.

తా. పుత్రులారా! మీకు మంగళ మగుగాక. మీరందరును బయలు దేరుడు. సముద్రములచే చుట్టబడి యున్న భూమి నంతను వెదకుడు. 13

మూ. ఏకైకయోజనం పుత్రా విస్తారమధిగచ్ఛత,
యావత్తురగసన్దర్శస్తావత్ఖనత మేదినీమ్. 14
తం చైవ హయహర్తారం మార్గమాణా మమాజ్ఞయా.

ప్ర. అ. పుత్రాః = పుత్రులారా ! ఏకైకయోజనమ్ = ఒక్కొక్క యోజనము చొప్పున, విస్తారమ్=భూవైశాల్యమును, అధిగచ్ఛత=తీసికొనుడు. మమ = నాయొక్క, ఆజ్ఞయా = ఆజ్ఞచేత, తమ్ = ఆ, హయహర్తారమ్ = అశ్వమును హరించినవానిని, మార్గమాణాః = అన్వేషించుచున్నవారై, తురగ సందర్శః = అశ్వముయొక్క దర్శనము, యావత్ = ఎప్పటికి అగునో, తావత్ = అంతవరకును, మేదినీమ్ = భూమిని, ఖనత = త్రవ్వుడు.

తా. పుత్రులారా ! మీరు ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనము చొప్పున భూమియొక్క విస్తారమును పంచుకొని, అశ్వమును హరించినవానిని వెదకుచు, గుఱ్ఱము కనబడు నంతవరకును భూమిని త్రవ్వుడు. ఇది నా యాజ్ఞ. 14

మూ. దీక్షితః పౌత్రసహితః సోపాధ్యాయగణో హ్యహమ్, 15
ఇహ స్థాస్యామి భద్రం వో యావత్తురగదర్శనమ్.

ప్ర. అ. దీక్షితః = దీక్ష వహించిన, అహమ్ = నేను, పౌత్రసహితః= పౌత్రునితో కూడినవాడనై, సోపాధ్యాయగణః=ఋత్విగ్గణముతో కూడినవాడనై, యావత్తురగదర్శనమ్ = గుఱ్ఱము కనబడు నంతవరకును, ఇహ = ఇచ్చటనే, స్థాస్యామి = ఉండగలను. వః = మీకు, భద్రమ్ = క్షేమ మగుగాక.

తా. గుఱ్ఱము కనబడువరకును, దీక్ష వహించిన నేను, ఋత్విక్కులును, పౌత్రుడును ఇచటనే ఉండగలము. 15

మూ. ఇత్యుక్తా హృష్టమనసో రాజపుత్రా మహాబలాః, 16
జగ్ముర్మహీతలం రామ పితుర్వచనయన్త్రితాః.

ప్ర. అ. రామ = రామా ! ఇతి = ఈ విధముగా, ఉక్తాః = పలకబడిన, మహాబలాః = మహాబలవంతులైన, రాజపుత్రాః = రాజపుత్రులు, హృష్ట

మనసః = సంతసించిన మనస్సు కలవారై, పితుః = తండ్రియొక్క, వచనయన్త్రితాః=వాక్కుచే నియమితులై, మహీతలమ్=భూతలమును గూర్చి, జగ్ముః = వెళ్లిరి.

తా. సగరుడు ఇట్లు పలుకగనే మహాబలశాలు లగు ఆ రాజపుత్రులు ఉత్సాహవంతులై, తండ్రి ఆజ్ఞ ప్రకారము భూమి నంతను వెదకుటకు వెళ్లిరి. 16

మూ. యోజనాయామవిస్తారమేకైకో ధరణీతలమ్, 17
బిభిదుః పురుషవ్యాఘ్ర వజ్రస్పర్శసమైర్నఖైః.

ప్ర. అ. పురుషవ్యాఘ్ర=ఓ పురుషశ్రేష్ఠుడా ! ఏకైకః = ఒక్కొక్కడు, యోజనాయామవిస్తారమ్ = ఒక యోజనము పొడవు ఒక యోజనము వెడల్పు గల, ధరణీతలమ్ = భూప్రదేశమును, వజ్రస్పర్శసమైః = వజ్రముయొక్క స్పర్శతో సమానమైన, నఖైః = గోళ్లతో, బిభిదుః = బ్రద్దలు కొట్టిరి.

తా. రామా ! ఒక్కొక్కడు ఒక నలుచదురపు యోజనము చొప్పన భూప్రదేశమును వజ్రము వంటి సారము గల నఖములతో బ్రద్దలుగొట్టిరి. 17

మూ. శూలైరశనికల్పైశ్చ హలైశ్చాపి సుదారుణైః, 18
భిద్యమానా వసుమతీ ననాద రఘునన్దన.

ప్ర. అ. రఘునన్దన = రామా ! అశనికల్పైః=వజ్రాయుధముతో సమానమైన, శూలైః = శూలములతోడను, సుదారుణైః = చాల భయంకర మైన, హలైశ్చ = నాగళ్లతోడను, భిద్యమానా = భేదింపబడుచున్న, వసుమతీ = భూమి, ననాద = ధ్వనిచేసెను.

తా. వా రీవిధముగ వజ్రముల వంటి శూలములచేతను, భయంకర మైన నాగళ్ల చేతను భూమిని భేదించుచుండగా గొప్ప ధ్వని బయలుదేరెను. 18

మూ. నాగానాం మథ్యమానానామసురాణాం చ రాఘవ, 19
రాక్షసానాం చ దుర్ధర్షః సత్త్వానాం నినదోఽభవత్.

ప్ర. అ. రాఘవ = రామా ! మథ్యమానానామ్ = నలగగొట్టబడుచున్న, నాగానామ్ = సర్పములయొక్క, అసురాణాం చ = అసురులయొక్కయు, రాక్ష

సానాం చ=రాక్షసులయొక్కయు, సత్త్వానామ్ = ఇతరజంతువుల యొక్కయు, దుర్ధర్షః = సహింపరాని, నినదః = ధ్వని, అభవత్ = ఆయెను.

తా. రామా! వారు భూమిని త్రవ్వుచుండగా ఎన్నియో సర్పములు, అసురులు, రాక్షసులు, ఇతరజంతువులు నలిగిపోవుటచే సహింపరాని ఆర్తధ్వని బయలుదేరినది. 19

మూ. యోజనానాం సహస్రాణి షష్టిం తు రఘునన్దన, 20
బిభిదుర్ధరణీం వీరా రసాతలమనుత్తమమ్.

ప్ర. అ. రఘునన్దన = రామా! వీరాః = ఆ వీరులు, యోజనానామ్ = యోజనములయొక్క, షష్టిం సహస్రాణి = అరువది వేలు, ధరణీమ్ = భూమిని, అనుత్తమమ్ = గొప్పదైన, రసాతలమ్ = రసాతలమునుగా, బిభిదుః = త్రవ్విరి.

తా. రామా! ఆ వీరులు అరవైవేల యోజనముల భూమి పాతాళమై పోవునట్లుగా త్రవ్విరి. 20

మూ. ఏవం పర్వతసంబాధం జమ్బూద్వీపం నృపాత్మజాః, 21
ఖనన్తో నృపశార్దూల సర్వతః పరిచక్రముః.

ప్ర. అ. నృపశార్దూల = రాజశ్రేష్ఠుడా! నృపాత్మజాః = సగరుని కుమారులు, పర్వతసంబాధమ్ = పర్వతములచేత ఇరుకైన, జమ్బూద్వీపమ్ = జంబూద్వీపమును, ఏవమ్ = ఈ విధముగ, ఖనన్తః = త్రవ్వుచున్నవారై, సర్వతః = అంతటను, పరిచక్రముః = సంచరించిరి.

తా. రామా! సగరుని కుమారులు పర్వతములతో ఇరుకుగా ఉన్న జంబూద్వీపమును ఈ విధముగ త్రవ్వుచు అంతటను సంచరించిరి. 21

మూ. తతో దేవాః సగన్ధర్వాః సాసురాః సహపన్నగాః, 22
సంభ్రాన్తమనసః సర్వే పితామహముపాగమన్.

ప్ర. అ. తతః = పిమ్మట, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, సాసురాః=అసురులతో కూడిన, సహ పన్నగాః=సర్పములతో కూడిన, దేవాః=

దేవతలు, సర్వే = అందరును, సంభ్రాన్తమనసః = కలతచెందిన మనస్సు కలవారై, పితామహమ్=బ్రహ్మదేవుని, ఉపాగమన్ = చేరిరి.

తా. పిమ్మట దేవతలు, గంధర్వులు, అసురులు, పన్నగులు అందరును కలతచెంది బ్రహ్మదేవుని వద్దకు వెళ్లిరి. 22

మూ. తే ప్రసాద్య మహాత్మానం విషణ్ణవదనా స్తదా, 23
ఊచుః పరమసంత్రస్తాః పితామహమిదం వచః.

ప్ర. అ. పరమసంత్రస్తాః = మిక్కిలి భయపడిన వారును, విషణ్ణవదనాః=దిగులు చెందిన ముఖము కలవారును అగు, తే=వారు, మహాత్మానమ్= మహాత్ముడైన, పితామహమ్ = బ్రహ్మదేవుని, ప్రసాద్య = అనుగ్రహింపచేసికొని, ఇదం వచః = ఈ వాక్యమును, ఊచుః = పలికిరి.

తా. మిక్కిలి భయముతో దిగులుచెందిన ముఖములు గల వారందరును మహాత్ముడైన బ్రహ్మదేవుని అనుగ్రహింపచేసికొని ఇట్లు పలికిరి. 23

మూ. భగవన్ పృథివీ సర్వా ఖన్యతే సగరాత్మజైః, 24
బహవశ్చ మహాత్మానో హన్యన్తే తలవాసినః.

ప్ర. అ. భగవన్ = ఓ భగవంతుడా! సర్వా=సమస్తమైన, పృథివీ= భూమి, సగరాత్మజైః = సగరుని కుమారులచేత, ఖన్యతే = త్రవ్వబడుచున్నది. తలవాసినః = పాతాలములో నివసించు, బహవః = చాలమంది, మహాత్మానః= మహాత్ములు, హన్యన్తే=చంపబడుచున్నారు.

తా. భగవంతుడా! సగరకుమారులు భూమి నంతను త్రవ్వివేయుచున్నారు. పాతాలములో నివసించు ఎందరో మహాత్ములను చంపివేయుచున్నారు. 24

మూ. అయం యజ్ఞహనోఽస్మాకమనేనాశ్వోఽపనీయతే, 25
ఇతి తే సర్వభూతాని నిఘ్నన్తి సగరాత్మజాః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకోనచత్వారింశః సర్గః.

ప్ర. అ. అయమ్=వీడు, నః=మనయొక్క, యజ్ఞహనః = యజ్ఞమును పాడుచేసినవాడు. అనేన=వీనిచేత, అశ్వః=అశ్వము, అపనీయతే=అపహరింపబడుచున్నది. ఇతి=అని అనుచు, తే సగరాత్మజాః=ఆ సగరకుమారులు, సర్వభూతాని=సమస్త భూతములను, నిఘ్నన్తి=చంపుచున్నారు.

తా. "వీడే మన అశ్వమును అపహరించుచున్నాడు. మన యజ్ఞమును చెరచినవాడు వీడే" అని అనుచు ఆ సగరకుమారులు కనబడిన ప్రతి ఒక్క ప్రాణిని చంపుచున్నారు. 25

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలోని ముప్పది తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ చత్వారింశః సర్గః

మూ. దేవతానాం వచః శ్రుత్వా భగవాన్వై పితామహః,
ప్రత్యువాచ సుసంతప్తాన్ కృతాన్తబలమోహితాన్. 1

ప్ర. అ. భగవాన్=పూజ్యుడైన, పితామహః = బ్రహ్మదేవుడు, దేవతానామ్=దేవతలయొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, కృతాన్తబలమోహితాన్=దైవముయొక్క బలముచే మోహితులును, సుసంత్రస్తాన్ = చాల భయము చెందినవారును అగు వారిని గూర్చి, ప్రత్యువాచ=తిరిగి పలికెను.

తా. దేవతల వాక్యము విని బ్రహ్మదేవుడు, దైవబలముచేత మోహము చెంది, మిక్కిలి భయపడిన వారితో ఇట్లనెను. 1

మూ. యస్యేయం వసుధా కృత్స్నా వాసుదేవస్య ధీమతః,
కాపిలం రూపమాస్థాయ ధారయత్యనిశం ధరామ్. 2
తస్య కోపాగ్నినా దగ్ధా భవిష్యన్తి నృపాత్మజాః.

ప్ర. అ. కృత్స్నా=సమస్తమైన, ఇయం వసుధా=ఈ భూమి, యస్య=ఏ, ధీమతః=ధీమంతుడైన, వాసుదేవస్య = వాసుదేవునకు సంబంధించినదో, ఆ వాసుదేవుడు, కాపిలం రూపమ్=కపిలు డను రూపమును, ఆస్థాయ = ధరించి, అనిశమ్=ఎల్లప్పుడును, ధరామ్ = భూమిని, ధారయతి = ధరించుచున్నాడు. నృపాత్మజాః=నగరుని కుమారులు, తస్య = అతని యొక్క, కోపాగ్నినా = కోపాగ్నిచేత, దగ్ధాః=కాల్చబడినవారు, భవిష్యన్తి=కాగలరు.

తా. ఈ సమస్తభూమియు ఏ వాసుదేవునకు చెందినదో అట్టి వాసుదేవుడు, కపిలావతారము నెత్తి సర్వదా ఈ భూమిని ధరించుచున్నాడు. ఈ నగరకుమారులు ఆ కపిలుని కోపాగ్నిచే భస్మము కాగలరు. 2

మూ. పృథివ్యాశ్చాపి నిర్భేదో దృష్ట ఏవ సనాతనః, 3
సగరస్య చ పుత్రాణాం వినాశోఽదీర్ఘజీవినామ్.

ప్ర. అ. పృథివ్యాః=భూమియొక్క, నిర్భేదః=భేదనము, అదీర్ఘజీవినామ్=అల్పాయుర్దాయవంతులైన, సగరస్య పుత్రాణామ్ = సగరపుత్రుల, వినాశశ్చ=వినాశము, సనాతనః=పురాతనముగా, దృష్ట ఏవ=చూడబడినదే.

తా. ఈ విధముగా భూమి త్రవ్వబడు ననియు, అల్పాయుర్దాయవంతులైన సగరకుమారులు నశించెద రనియు ఏ నాడో నిర్ణయింపబడినది. 3

మూ. పితామహవచః శ్రుత్వా త్రయస్త్రింశదరిందమ, 4
దేవాః పరమసంహృష్టాః పునర్జగ్ముర్యథాగతమ్.

ప్ర. అ. అరిందమ = శత్రువులను సంహరించువాడా ! పితామహవచః= బ్రహ్మదేవుని వాక్యమును, శ్రుత్వా = విని, త్రయస్త్రింశత్ దేవాః = ముప్పదిముగ్గురు దేవతలు, పరమసంహృష్టాః = మిక్కిలి సంతసించినవారై, యథాగతమ్ = వచ్చిన విధముగనే, పునః = మరల, జగ్ముః = వెళ్లిరి.

తా. రామా ! ముప్పదిముగ్గురు దేవతలును, ఇతరులును, బ్రహ్మదేవుని మాటలు విని, చాల సంతోషించి, తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. 4

వి. ఎనమండుగురు వసువులు, పదకొండుగురు రుద్రులు, పండ్రెండుగురు ఆదిత్యులు, ఇద్దరు అశ్వినులు కలిసి ముప్పదిముగ్గురు దేవతలు.

మూ. సగరస్య చ పుత్రాణాం ప్రాదురాసీన్మహాత్మనామ్, 5
పృథివ్యాం భిద్యమానాయాం నిర్ఘాతసమనిస్వనః.

ప్ర. అ. మహాత్మనామ్=మహాత్ములైన, సగరస్య పుత్రాణామ్=సగరుని కుమారులకు, పృథివ్యామ్ = భూమి, భిద్యమానాయామ్ = బ్రద్దలుకొట్టబడుచుండగా, నిర్ఘాతసమనిస్వనః = పిడుగు వంటి ధ్వని, ప్రాదురాసీత్ = పుట్టెను (వినబడెను).

తా. ఈ విధముగ భూమిని బ్రద్దలుకొట్టుచున్నప్పుడు నగరకుమారులకు పిడుగు వంటి ధ్వని, వారి వినాశమును సూచించుచు, వినబడెను.

మూ. తతో భిత్త్వా మహీం సర్వే కృత్వా చాభిప్రదక్షిణమ్, 6
సహితాః సగరాః సర్వే పితరం వాక్యమబ్రువన్.

ప్ర. అ. తతః = పిమ్మట, సర్వే = అందరును, మహీమ్ = భూమిని, భిత్త్వా = భేదించి, అభిప్రదక్షిణమ్ = ప్రదక్షిణము, కృత్వా = చేసి, సర్వే సగరాః = ఆ సగరకుమారు లందరును, సహితాః = కలసినవారై, పితరమ్= తండ్రిని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రువన్ = పలికిరి.

తా. ఆ సగరకుమారు లందరును భూమిని భేదించి ఒక చుట్టు తిరిగి వచ్చిరి. అశ్వము కనబడలేదు. అంత వారందరును కలిసి తండ్రి వద్దకు పోయి ఇట్లు చెప్పిరి. 6

మూ. పరిక్రాంతా మహీ సర్వా సత్త్వవన్తశ్చ సూదితాః, 7
దేవదానవరక్షాంసి పిశాచోరగకిన్నరాః,
న చ పశ్యామహేఽశ్వం తమశ్వహర్తారమేవ చ, 8
కిం కరిష్యామ భద్రం తే బుద్ధిరత్ర విచార్యతామ్.

ప్ర. అ. సర్వా = సమస్తమైన, మహీ=భూమి, పరిక్రాన్తా=సంచరింపబడినది, సత్త్వవన్తః చ = బలవంతులైన, దేవదానవరక్షాంసి=దేవతలు, దానవులు రాక్షసులు, పిశాచోరగకిన్నరాః = పిశాచములు, ఉరగులు, కిన్నరులు, సూదితాః = చంపబడినారు. అశ్వమ్ = అశ్వమును, అశ్వహర్తారమేవ చ= అశ్వమును అపహరించినవానిని, న పశ్యామహే చ = చూడజాలమైతిమి. కిమ్ = ఏమి, కరిష్యామ = చేయుదుము ? తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక. అత్ర = ఈ విషయమున, బుద్ధిః=బుద్ధి, విచార్యతామ్=ఆలోచింపబడుగాక.

తా. భూమండల మంతయు తిరిగితిమి. బలవంతులైన ఎందరో దేవదానవరాక్షసపిశాచోరగకిన్నరులను పరిమార్చితిమి. ఆ గుఱ్ఱముగాని, దాని నపహరించినవాడు గాని కనబడలేదు. ఇపు డేమి చేయవలెనో ఆలోచించి చెప్పుము. నీకు భద్ర మగుగాక. 7, 8

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా పుత్రాణాం రాజసత్తమః, 9
సమన్యురబ్రవీద్వాక్యం సగరో రఘునన్దన.

ప్ర. అ. రఘునన్దన = రామా ! తేషామ్ = ఆ, పుత్రాణామ్ = పుత్రుల యొక్క, తద్వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, రాజసత్తమః = ఆ

రాజశ్రేష్ఠుడైన, సగరః = సగరుడు, సమన్యుః = కోపముతో కూడినవాడై, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రామా! పుత్రుల మాటలు విని, రాజశ్రేష్ఠుడైన సగరుడు కోపముతో కూడినవాడై ఇట్లు పలికెను. 9

మూ. భూయః ఖనత భద్రం వో నిర్భిద్య వసుధాతలమ్, 10
అశ్వహర్తారమాసాద్య కృతార్థాశ్చ నివర్తథ.

ప్ర. అ. వసుధాతలమ్=భూమిని, నిర్భిద్య=భేదించి, భూయః=మరల, ఖనత = త్రవ్వుడు. అశ్వహర్తారమ్ = అశ్వమును హరించినవానిని, ఆసాద్య = పొంది, కృతార్థాః = చరితార్థులై, నివర్తథ = మరలి రండు. వః = మీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. మరల త్రవ్వి భూతలమును భేదింపుడు. అశ్వమును హరించినవానిని పట్టుకొని, కార్యము పూర్తియైన పిమ్మటనే తిరిగి రండు. 10

మూ. పితుర్వచనమాసాద్య సగరస్య మహాత్మనః, 11
షష్టిః పుత్రసహస్రాణి రసాతలమభిద్రవన్.

ప్ర. అ. పితుః=తండ్రి యైన, మహాత్మనః=మహాత్ము డైన, సగరస్య=సగరునియొక్క, వచనమ్=వచనమును, ఆసాద్య=పొంది, షష్టిః=అరువది, పుత్రసహస్రాణి = పుత్రుల సహస్రములు, రసాతలమ్ = పాతాలమును గూర్చి, అభిద్రవన్ = శీఘ్రముగ పోయిరి.

తా. తండ్రియైన సగరుని ఆజ్ఞ ననుసరించి ఆ అరువదివేల మంది కుమారులును పాతాళలోకమునకు శీఘ్రముగ పోయిరి. 11

మూ. ఖన్యమానే తతస్తస్మిన్ దదృశుః పర్వతోపమమ్, 12
దిశాగజం విరూపాక్షం ధారయన్తం మహీతలమ్.

ప్ర. అ. తతః = పిమ్మట, తస్మిన్=ఆ ప్రదేశము, ఖన్యమానే=త్రవ్వబడుచుండగా, పర్వతోపమమ్=పర్వతముతో సమాన మైనదియు, మహీతలమ్=

భూతలమును, ధారయన్తమ్ = ధరించుచున్నదియు నగు, విరూపాక్షమ్ = విరూపాక్ష మను పేరు గల, దిశాగజమ్ = దిగ్గజమును, దదృశుః = చూచిరి.

తా. ఆ ప్రదేశమును త్రవ్వుచున్నపుడు వారికి అచట పర్వతమువంటి ప్రమాణము గల విరూపాక్ష మను దిగ్గజము కనబడెను. అది భూతలమును మోయుచుండెను.

మూ. సపర్వతవనాం కృత్స్నాం పృథివీం రఘునన్దన, 13
శిరసా ధారయామాస విరూపాక్షో మహాగజః.

ప్ర. అ. రఘునన్దన = రామా ! విరూపాక్షః=విరూపాక్ష మను పేరు గల, మహాగజః = ఆ మహాగజము, సపర్వతవనామ్ = పర్వతములతోడను వనములతోడను కూడిన, కృత్స్నామ్ = సమస్తమైన, మహీమ్ = భూమిని, శిరసా = శిరస్సుచేత, ధారయామాస = ధరించెను.

తా. రామా ! విరూపాక్ష మనెడు ఆ దిగ్గజము పర్వతవనాదిసహితముగా ఈ భూమి నంతను తన శిరస్సుపై మోయుచుండును. 13

మూ. యదా పర్వణి కాకుత్స్థ విశ్రమార్థం మహాగజః, 14
ఖేదాచ్చాలయతే శీర్షం భూమికంపస్తదా భవేత్.

ప్ర. అ. కాకుత్స్థ = రామా, మహాగజః = ఆ మహాగజము, పర్వణి= పర్వకాలమునందు, యదా = ఎప్పుడు, విశ్రమార్థమ్ = విశ్రాంతికొరకై, ఖేదాత్ = అలసటవలన, శీర్షమ్ = శిరస్సును, చాలయతే=కదల్చునో, తదా= అప్పుడు, భూమికమ్పః = భూకంపము, భవేత్ = అగును.

తా. రామా : ఆ మహాగజము అలసట కలిగినపుడు అప్పుడప్పుడు, విశ్రాంతికొరకై శిరస్సును కదల్చుచుండును. అపుడు భూకంపము కలుగుచుండును. 14

మూ. తం తే ప్రదక్షిణం కృత్వా దిశాపాలం మహాగజమ్, 15
మానయన్తో హి తే రామ జగ్ముర్భిత్త్వా రసాతలమ్.

ప్ర. అ. రామ = రామా ! తే = వారు, తమ్ = ఆ, దిశాపాలం మహాగజమ్=దిగ్గజమును, ప్రదక్షిణం కృత్వా=ప్రదక్షిణము చేసి, మానయన్తః= పూజించుచున్నవారై, భిత్వా = భూమిని భేదించుకొని, రసాతలమ్ = పాతాలమును గూర్చి, జగ్ముః = వెళ్ళిరి.

తా. రామా ! వారు ఆ దిగ్గజమునకు ప్రదక్షిణము చేసి, పూజించి, భూమిని భేదించుకొనుచు పాతాళమునకు పోయిరి. 15

మూ. తతః పూర్వాం దిశం భిత్వా దక్షిణాం బిభిదుః పునః. 16
దక్షిణస్యామపి దిశి దదృశుస్తే మహాగజమ్,
మహాపద్మం మహాత్మానం సుమహత్పర్వతోపమమ్, 17
శిరసా ధారయన్తం తే విస్మయం జగ్మురుత్తమమ్,

ప్ర. అ. తతః = పిమ్మట, పూర్వామ్ = తూర్పుదైన, దిశమ్=దిక్కును, భిత్వా = త్రవ్వి, పునః = మరల (పిమ్మట). దక్షిణామ్ = దక్షిణదిక్కును, బిభిదుః = భేదించిరి. తే=వారు, దక్షిణస్యాం దిశ్యపి=దక్షిణదిక్కునందు కూడ, సుమహత్పర్వతోపమమ్=గొప్పపర్వతముతో సమాన మైనదియు, శిరసా=శిరస్సు చేత, ధారయన్తమ్ = భూమిని ధరించుచున్నదియు, మహాత్మానమ్ = పూజ్య మైన స్వభావముకలదియు అగు, మహాపద్మమ్=మహాపద్మ మనే, మహాగజమ్= గొప్ప ఏనుగును, దదృశుః = చూచిరి. తే = వారు, ఉత్తమమ్ = గొప్ప, విస్మయమ్=ఆశ్చర్యమును, జగ్ముః = పొందిరి.

తా. పిమ్మట తూర్పుదిక్కును తరువాత దక్షిణ దిక్కును భేదించిరి. దక్షిణ దిక్కునందు కూడ వారు గొప్ప పర్వతముతో సమాన మైన మహాపద్మ మనెడు మహాగజమును చూచిరి. అది కూడ శిరస్సుపై భూమిని మోయుచుండెను. దానిని జూచి వారు చాల ఆశ్చర్యము చెందిరి. 16, 17

మూ. తతః ప్రదక్షిణం కృత్వా సగరస్య మహాత్మనః, 18
షష్టిః పుత్రసహస్రాణి పశ్చిమాం బిభిదుర్దిశమ్.

ప్ర. అ. తతః = పిమ్మట, మహాత్మనః = మహాత్ముడైన, సగరస్య= సగరుని యొక్క, షష్టిః పుత్రసహస్రాణి = అరవైవేలమంది పుత్రులు, ప్రదక్షిణం

కృత్వా = ప్రదక్షిణము చేసి, పశ్చిమాం దిశమ్ = పశ్చిమదిక్కును, బిభిదుః = భేదించిరి.

తా. పిమ్మట మహాత్ముడైన సగరుని అరువదివేలమంది కుమారులు, ఆ దిగ్గజమునకు ప్రదక్షిణము చేసి, పశ్చిమదిక్కునందు త్రవ్విరి. 18

మూ. పశ్చిమాయామపి దిశి మహాన్తమచలోపమమ్, 19
దిశాగజం సౌమనసం దదృశుస్తే మహాబలాః.

ప్ర. అ. మహాబలాః = గొప్ప బలముగల, తే = వారు, పశ్చిమాయాం దిశ్యపి = పశ్చిమదిక్కునందు గూడ, మహాన్తమ్ = గొప్పదియు, అచలోపమమ్ = పర్వతముతో సమాన మైనదియు అగు, సౌమనసమ్ = సౌమనస మను పేరు గల, దిశాగజమ్ = దిగ్గజమును, దదృశుః = చూచిరి.

తా. మహాబలవంతులైన ఆ సగరపుత్రులు పశ్చిమదిక్కునందు కూడ పర్వతసమాన మైన సౌమనసమనెడు దిగ్గజమును చూచిరి. 19

మూ. తం తే ప్రదక్షిణం కృత్వా పృష్ట్వా చాపి నిరామయమ్, 20
ఖనన్తః సముపక్రాన్తా దిశం హైమవతీం తతః.

ప్ర. అ. తే = వారు, తమ్ = దానిని, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణము చేసి, నిరామయమ్ = ఆరోగ్యమును, పృష్ట్వా = అడిగి, ఖనన్తః = త్రవ్వుచున్నవారై, తతః = అక్కడినుండి, హైమవతీం దిశమ్ = ఉత్తరదిక్కును గూర్చి సముపక్రాన్తాః = వెళ్లిరి.

తా. వారు ఆ దిగ్గజమునకు ప్రదక్షిణనమస్కారములు చేసి, కుశలప్రశ్న వేసి, అచటినుండి, భూమిని త్రవ్వుకొనుచు ఉత్తరము వైపు వెళ్లిరి.

మూ. ఉత్తరస్యాం రఘుశ్రేష్ఠ దదృశుర్హిమపాణ్డరమ్, 21
భద్రం భద్రేణ వపుషా ధారయన్తం మహీమిమామ్.

ప్ర. అ. రఘుశ్రేష్ఠ = రామా ! ఉత్తరస్యామ్ = ఉత్తరదిక్కునందు, హిమపాణ్డరమ్ = మంచు వలె తెల్లగా నున్నదియు, భద్రేణ వపుషా = మంగళకర

మైన శరీరముతో, ఇమామ్ = ఈ, మహీమ్ = భూమిని, ధారయన్తమ్ = ధరించుచున్నదియు అగు, భద్రమ్ = భద్రమనెడు దిగ్గజమును, దదృశుః = చూచిరి.

తా. రామా! ఉత్తరదిక్కునందు, వారు, మంగళకర మైన శరీరముతో ఈ భూమిని మోయుచున్న, మంచువలె తెల్లగా ఉన్న భద్రమనెడు దిగ్గజమును చూచిరి. 21

మూ. సమాలభ్య తతః సర్వే కృత్వా చైనం ప్రదక్షిణమ్, 22
షష్టిః పుత్రసహస్రాణి బిభిదుర్వసుధాతలమ్.

ప్ర. అ. తతః=పిమ్మట, సర్వే=సమస్త మైన, షష్టిః పుత్రసహస్రాణి= సగరుని అరువదివేలమంది పుత్రులు, ఏనమ్ = దీనిని, సమాలభ్య=స్పృశించి, ప్రదక్షిణం చ=ప్రదక్షిణము కూడ, కృత్వా=చేసి, వసుధాతలమ్=భూమిని, బిభిదుః = భేదించిరి.

తా. పిమ్మట ఆ సగరుని అరువదివేలమంది కుమారులును ఆ దిగ్గజమును స్పృశించి, ప్రదక్షిణనమస్కారములు చేసి భూమిని త్రవ్విరి. 22

మూ. తతః ప్రాగుత్తరాం గత్వా సాగరాః ప్రథితాం దిశమ్, 23
రోషాదభ్యఖనన్ సర్వే పృథివీం సగరాత్మజాః.

ప్ర. అ. తతః = పిమ్మట, సాగరాః = సగరకుమారులు, ప్రథితామ్ = ప్రసిద్ధ మైన, ప్రాగుత్తరాం దిశమ్ = ఈశాన్యదిక్కును గూర్చి, గత్వా = వెళ్లి, సర్వే = సమస్త మైన, సగరాత్మజాః=సగరుని కుమారులు, రోషాత్=కోపము వలన, పృథివీమ్ = భూమిని, అభ్యఖనన్ = త్రవ్విరి.

తా. పిమ్మట ఆ సగరకుమారు లందరును ప్రసిద్ధ మైన ఈశాన్యదిక్కునకు వెళ్లి, రోషముతో భూమిని త్రవ్విరి. 23

మూ. తే తు సర్వే మహాత్మానో భీమవేగా మహాబలాః, 24
దదృశుః కపిలం తత్ర వాసుదేవం సనాతనమ్.

హయం చ తస్య దేవస్య చరన్తమవిదూరతః, 25
ప్రహర్షమతులం ప్రాప్తాః సర్వే తే రఘునన్దన.

ప్ర. అ. మహాత్మానః = గొప్ప బుద్ధి గలవారును, భీమవేగాః = భయంకరమైన వేగము గలవారును, మహాబలాః = గొప్ప బలము కలవారునుఅగు, తే సర్వే=వారందరును, తత్ర=అచట, కపిలమ్ = కపిలావతారములో నున్న, సనాతనమ్=పురాణపురుషుడైన, వాసుదేవమ్ = వాసుదేవుని, తస్య దేవస్య = ఆ దేవునకు, అవిదూరతః = సమీపమున, చరన్తమ్ = మేయుచున్న, హయం చ=గుఱ్ఱమును, దదృశుః=చూచిరి. రఘునన్దన=రామా! తే సర్వే=వారందరును, అతులమ్=సాటి లేని, ప్రహర్షమ్ = సంతోషమును, ప్రాప్తాః = పొందినారు.

తా. రామా! భయంకరమైన వేగము గొప్ప బలము గల ఆ మహాత్ములు అందరును అచట కపిలరూపములో నున్న సనాతనపురుషుడైన శ్రీమహావిష్ణువును, అతని సమీపమున గడ్డి మేయుచు తిరుగుచున్న అశ్వమును చూచిరి. ఆ అశ్వము కనబడగనే చాల సంతసించిరి. 24, 25

మూ. తే తం హయవరం జ్ఞాత్వా క్రోధపర్యాకులేక్షణాః, 26
ఖనిత్రలాంగలధరా నానావృక్షశిలాధరాః,
అభ్యధావన్త సంక్రుద్ధాస్తిష్ఠ తిష్ఠేతి చాబ్రువన్. 27

ప్ర. అ. తే=వారు, తమ్=ఆ, హయవరమ్=అశ్వశ్రేష్ఠమును, జ్ఞాత్వా=గుర్తించి, క్రోధపర్యాకులేక్షణాః=క్రోధముచే వ్యాకులమైన నేత్రములు కలవారై, ఖనిత్రలాంగలధరాః = గునపములను నాగళ్లను ధరించినవారై, నానావృక్ష శిలాధరాః=అనేకవిధములైన వృక్షములను శిలలను ధరించినవారై, సంక్రుద్ధాః=కోపించినవారై, అభ్యధావన్త = అతని మీదికి పరుగెత్తిరి. తిష్ఠ తిష్ఠ = ఆగుము ఆగుము, ఇతి = అని, అబ్రువన్ చ = పలికిరి కూడ.

తా. వారు ఆ గుఱ్ఱమును గుర్తించిరి. వారి కళ్లు కోపముచే ఎఱ్ఱబారినవి. గునపములను, నాగళ్లను, వృక్షములను, శిలలను ధరించి ఆగు మాగుము అని పలుకుచు ఆ కపిలునిమీదికి పరుగెత్తి వెళ్లిరి. 26, 27

మూ. అస్మాకం త్వం హి తురగం యజ్ఞీయం హృతవానసి,
దుర్మేధస్త్వం హి సంప్రాప్తాన్ విద్ధి నః సగరాత్మజాన్. 28

ప్ర. అ. దుర్మేధః = ఓ దుర్బుద్ధీ, త్వమ్ = నీవు, అస్మాకమ్ = మా యొక్క, యజ్ఞియమ్=యజ్ఞమునకు సంబంధించిన, తురగమ్=తురంగమును, హృతవాన్ అసి=హరించినావు. సంప్రాప్తాన్=ఇచటికి వచ్చిన, నః=మమ్ములను, నగరాత్మజాన్ = నగరుని కుమారులనుగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. దుర్బుద్ధీ! నీవు మా యజ్ఞాశ్వమును హరించినావు. మేము ఎవరను కొంటివి? నగరచక్రవర్తి కుమారులము. 28

మూ. శ్రుత్వా తు వచనం తేషాం కపిలో రఘునన్దన,
రోషేణ మహతావిష్టో హుంకారమకరోత్తదా. 29

ప్ర. అ. రఘునన్దన = రామా! కపిలః = కపిలుడు, తేషామ్ = వారి యొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, తదా = అప్పుడు, మహతా= గొప్ప, రోషేణ=రోషముతో, ఆవిష్టః=కూడినవాడై, హుంకారమ్ = హుంకారమును, అకరోత్=చేసెను.

తా. రామా! కపిలుడు వారి మాటలు విని కోపావిష్టుడై హుంకారము చేసెను. 29

మూ. తతస్తేనాప్రమేయేన కపిలేన మహాత్మనా,
భస్మరాశీకృతాః సర్వే కాకుత్స్థ సగరాత్మజాః. 30

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
చత్వారింశః సర్గః.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! తతః = పిమ్మట, అప్రమేయేన=ఊహింపరాని ప్రభావము కల, మహాత్మనా=మహాత్ముడైన, తేన కపిలేన = ఆ కపిలుని చేత, సర్వే=సమస్తమైన, సగరాత్మజాః=సగరపుత్రులు, భస్మరాశీకృతాః = భస్మరాశిగా చేయబడినారు.

తా. రామా! అప్రమేయప్రభావశాలి యైన, మహాత్ముడైన ఆ కపిలుడు హుంకరించగనే ఆ సగరపుత్రు లందరును భస్మమై పోయిరి. 30

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
నలుబదియవ సర్గ సమాప్తము.

అథ ఏకచత్వారింశః సర్గః

మూ. పుత్రాంశ్చిరగతాన్ జ్ఞాత్వా సగరో రఘునన్దన,
నప్తారమబ్రవీద్రాజా దీప్యమానం స్వతేజసా. 1

ప్ర. అ. రఘునన్దన = రామా ! సగరః రాజా = సగరచక్రవర్తి, పుత్రాన్ = పుత్రులను, చిరగతాన్ = చిరకాలము క్రితము వెళ్లినవారినిగా, జ్ఞాత్వా = తెలుసుకొని, స్వతేజసా = సహజ మైన తేజస్సుతో, దీప్యమానమ్ = ప్రజ్వరిల్లు చున్న, నప్తారమ్ = పౌత్రుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. రఘునందనా ! తన కుమారులు వెళ్లి చాలకాల మైనదని గుర్తించిన సగరచక్రవర్తి సహజతేజస్సుతో ప్రకాశించుచున్న మనుమ డైన అంశుమంతునితో ఇట్లనెను. 1

మూ. శూరశ్చ కృతవిద్యశ్చ పూర్వైస్తుల్యోఽసి తేజసా,
పితౄణాం గతిమన్విచ్ఛ యేన చాశ్వోఽపహారితః. 2

ప్ర. అ. శూరశ్చ = శూరుడవును, కృతవిద్యశ్చ = నేర్వబడిన విద్యలు కలవాడవును అగు నీవు, తేజసా = తేజస్సుచేత, పూర్వైః = పూర్వపురుషులతో, తుల్యః = సమానుడవుగా, అసి = అయి ఉన్నావు. పితౄణామ్ = నీ తండ్రుల యొక్క, గతిమ్ = మార్గమును, అన్విచ్ఛ = వెదకుము. అశ్వః = అశ్వము, యేన = ఎవనిచేత, అపహారితః = అపహరింపబడినదో, (వాని మార్గమును గూడ వెదకుము).

తా. నీవు శూరుడవు. విద్య లన్నియు నేర్చినవాడవు. తేజస్సుచే పూర్వపురుషులతో సమానుడవు. నీవు వెళ్లి నీ పినతండ్రుల జాడను, అశ్వమును అపహరించినవాని జాడను తెలిసికొని రమ్ము. 2

మూ. అన్తర్భౌమాని సత్త్వాని వీర్యవన్తి మహాన్తి చ,
తేషాం త్వం ప్రతిఘాతార్థం సాస్త్రం గృహ్ణీష్వ కార్ముకమ్. 3

ప్ర. అ. అన్తర్భౌమాని = భూమిలోపలనుండు, సత్త్వాని = ప్రాణులు, వీర్యవన్తి = పరాక్రమముగలవి, మహాన్తి చ = చాల గొప్పవి కూడ. త్వమ్ = నీవు, తేషామ్=వాటియొక్క, ప్రతిఘాతార్థమ్=సంహారముకొరకు, సాస్త్రమ్= అస్త్రములతో కూడిన, కార్ముకమ్ = ధనస్సును, గృహ్ణీష్వ = గ్రహింపుము.

తా. భూమిలోపల నుండు ప్రాణులు పరాక్రమము, మహాప్రమాణము కలవై ఉండును. వాటిని చంపుటకై ధనస్సును, అస్త్రములను తీసికొని వెళ్లుము. 3

మూ. అభివాద్యాభివాద్యాంస్త్వం హత్వా విఘ్నకరానపి,
సిద్ధార్థః సంనివర్తస్వ మమ యజ్ఞస్య పారగః. 4

ప్ర. అ. త్వమ్ = నీవు, అభివాద్యాన్ = నమస్కరింపతగినవారిని, అభివాద్య=నమస్కరించి, విఘ్నకరాన్=విఘ్నము చేయువారిని, హత్వా అపి = చంపి, సిద్ధార్థః సన్=సిద్ధమైన కార్యము కలవాడవై, మమ=నాయొక్క, యజ్ఞస్య= యజ్ఞముయొక్క, పారగః=పారమును పొందిచువాడవై, నివర్తస్వ=తిరిగి రమ్ము.

తా. నీవు నమస్కరింపదగినవారికి నమస్కారము చేయుచు, విఘ్నమును చేసినవారిని చంపుచు, కార్యమును పూర్తిచేసికొని తిరిగి వచ్చి, నా యజ్ఞమును తుదముట్టింపుము. 4

మూ. ఏవముక్తోఽంశుమాన్ సమ్యక్సగరేణ మహాత్మనా,
ధనురాదాయ ఖడ్గం చ జగామ లఘువిక్రమః. 5

ప్ర. అ. అంశుమాన్ = అంశుమంతుడు, మహాత్మనా = మహాత్ముడైన, సగరేణ=సగరునిచేత, ఏవమ్=ఈ విధముగా, సమ్యక్=బాగుగా, ఉక్తః= పలకబడినవాడై, ధనుః=ధనస్సును, ఖడ్గం చ=ఖడ్గమును, ఆదాయ=గ్రహించి, లఘువిక్రమః = శీఘ్రగమనముకలవాడై, జగామ = వెళ్లెను.

తా. మహాత్ముడైన సగరచక్రవర్తి ఈ విధముగ చక్కగా బోధింపగా, అంశుమంతుడు ధనస్సును ఖడ్గమును గ్రహించి శీఘ్రముగ వెళ్లెను. 5

మూ. స ఖాతం పితృభిర్మార్గమన్తర్భౌమం మహాత్మభిః,
ప్రాపద్యత నరశ్రేష్ఠ తేన రాజ్ఞాభిచోదితః. 6

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా ! సః=అతడు, రాజ్ఞా=రాజు చేత, అభిచోదితః = ప్రేరేపింపబడినవాడై, మహాత్మభిః = మహాత్ములైన, పితృభిః = తండ్రులచేత, అన్తర్భూమమ్ = భూ మిలోపల, ఖాతమ్=త్రవ్వబడిన, మార్గమ్ = మార్గమును, ప్రాపద్యత=పొందెను.

తా. ఓ నరోత్తమా ! నగరునిచే ఆజ్ఞప్తుడై ఆ అంశుమంతుడు భూమిలోపల తన పినతండ్రులు త్రవ్విన మార్గమును అనుసరించి వెళ్లెను. 6

మూ. దైత్యదానవరక్షోభిః పిశాచపతగోరగైః,
పూజ్యమానం మహాతేజా దిశాగజమపశ్యత. 7

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల అతడు, దైత్యదానవరక్షోభిః= దైత్యులచేత, దానవులచేత, రాక్షసులచేత, పిశాచపతగోరగైః=పిశాచమములచేత, పక్షులచేత సర్పములచేత, పూజ్యమానమ్ = పూజింపబడుచున్న, దిశాగజమ్ = దిగ్గజమును, అపశ్యత = చూచెను.

తా. మహాతేజఃశాలి యగు అంశుమంతుడు దారిలో దిగ్గజమును చూచెను. దైత్యదానవరక్షఃపిశాచపతగోరగులు దానిని పూజించుచుండిరి. 7

మూ. స తం ప్రదక్షిణం కృత్వా పృష్ట్వా చాపి నిరామయమ్,
పితౄన్ స పరిపప్రచ్ఛ వాజిహర్తారమేవ చ. 8

ప్ర. అ సః=అతడు, తమ్=దానిని, ప్రదక్షిణం కృత్వా=ప్రదక్షిణము చేసి, నిరామయమ్ = ఆరోగ్యమును, పృష్ట్వా చాపి = అడిగి, సః = అతడు, పితౄన్=తండ్రులను గూర్చియు, వాజిహర్తారమేవ చ=అశ్వమును అపహరించిన వానిని గూర్చియు, పరిపప్రచ్ఛ = ప్రశ్నించెను.

తా. అతడు ఆ దిగ్గజమునకు ప్రదక్షిణనమస్కారములు చేసి, కుశల ప్రశ్న కూడ వేసి, తన పినతండ్రులను గూర్చియు, అశ్వమును అపహరించిన వానిని గూర్చియు అడిగెను. 8

మూ. దిశాగజస్తు తచ్ఛ్రుత్వా ప్రత్యాహాంశుమతో వచః,
అసమంజ కృతార్థస్త్వం సహాశ్వః శీఘ్రమేష్యసి. 9

ప్ర. అ. దిశాగజస్తు = ఆ దిగ్గజ మైతే, అంశుమతః = అంశుమంతుని యొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, ప్రత్యాహ= తిరిగి పలికెను. అసమంజ=అసమంజుని పుత్రుడా ! త్వమ్=నీవు, కృతార్థః= కృతార్థుడవై, సహాశ్వః = అశ్వముతో కూడినవాడవై, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఏష్యసి = రాగలవు.

తా. అంశుమంతుని వచనము విని దిగ్గజము— "ఓ అంశుమంతా ! నీవు కృతార్థుడవై, అశ్వముతో శీఘ్రముగ తిరిగి రాగలవు" అని చెప్పెను. 9

మూ. తస్య తద్వచనం శ్రుత్వా సర్వానేవ దిశాగజాన్,
యథాక్రమం యథాన్యాయం ప్రష్టుం సముపచక్రమే. 10

ప్ర. అ. తస్య = దానియొక్క, తత్ వచనమ్=ఆవాక్యమును, శ్రుత్వా= విని, సర్వానేవ = సమస్త మైన, దిశాగజాన్ = దిగ్గజములను, యథాక్రమమ్= క్రమానుసారముగా, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, ప్రష్టుమ్ = అడుగుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. అంశుమంతుడు ఆ దిగ్గజము మాట విని, మిగిలిన దిగ్గజములను కూడ ఒకదాని తరువాత ఒకదానిని, న్యాయానుసారముగ ప్రశ్నించుటకు ప్రారంభించెను. 10

మూ. తైశ్చ సర్వైర్దిశాపాలైర్వాక్యజ్ఞైర్వాక్యకోవిదైః,
పూజితస్సహయశ్చైవ గన్తాసీత్యభిచోదితః. 11

ప్ర. అ. వాక్యజ్ఞైః = వాక్యములను ఎరిగిన, వాక్యకోవిదైః = వాక్యము లందు సమర్థములైన, సర్వైః = సమస్త మైన, తైః దిశాపాలైః = ఆ దిగ్గజముల చేత, పూజితః = పూజింపబడినవాడై, సహయః = అశ్వముతోకూడినవాడవై, గన్తాసి = వెళ్లగలవు, ఇతి = అని, అభిచోదితః = ప్రేరేపింపబడెను.

తా. ఆ దిగ్గజము లన్నియు మాటలలో సారమును గ్రహింపగల్గినవి. ఎట్లు మాటలాడవలెనో బాగుగ తెలిసినవి. అట్టి ఆ దిగ్గజములు అతనిని ఆదరించి, "అశ్వముతో తిరిగి వెళ్లెదవు" అని పలికి ప్రోత్సహించినవి. 11

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా జగామ లఘువిక్రమః,
భస్మరాశీకృతా యత్ర పితరస్తస్య సాగరాః. 12

ప్ర. అ. తేషామ్=వాటియొక్క, తద్వచనమ్=ఆ మాటను, శ్రుత్వా=విని, లఘువిక్రమః=శీఘ్రమైన గమనము కలవాడై, తస్య=అతనియొక్క, పితరః=తండ్రులైన, సాగరాః=సగరకుమారులు, యత్ర=ఎచట, భస్మరాశీకృతాః=భస్మరాశిగా చేయబడినారో, అచటికి, జగామ=వెళ్లెను.

తా. ఆ దిగ్గజముల మాటలు విని, సగరకుమారులైన తన పినతండ్రులు భస్మరాశిగా పడి ఉన్న చోటికి శీఘ్రముగా వెళ్లెను. 12

మూ. స దుఃఖవశమాపన్నస్త్వసమంజసుతస్తదా,
చుక్రోశ పరమార్తస్తు వధాత్తేషాం సుదుఃఖితః. 13

ప్ర. అ. తదా=అప్పుడు, సః=ఆ, అసమఞ్జసుతః=అసమంజుని కుమారుడు, దుఃఖవశమ్=దుఃఖమునకు వశత్వమును, ఆపన్నః=పొందినవాడై, పరమార్తః=మిక్కిలి పీడితుడై, తేషామ్=వారియొక్క, వధాత్=వధవలన, సుదుఃఖితః=చాల దుఃఖితుడై, చుక్రోశ=ఏడ్చెను.

తా. అప్పు డా అంశుమంతుడు దుఃఖపరవశుడై, వారు మరణించి నందులకు చాల బాధపడుచు ఏడ్చెను. 13

మూ. యజ్ఞీయం చ హయం తత్ర చరన్తమవిదూరతః,
దదర్శ పురుషవ్యాఘ్రో దుఃఖశోకసమన్వితః. 14

ప్ర. అ. దుఃఖశోకసమన్వితః=దుఃఖశోకములతో కూడిన, పురుషవ్యాఘ్రః=ఆ పురుషశ్రేష్ఠుడు, అవిదూరతః=సమీపమునందు, చరన్తమ్=మేయుచున్న, యజ్ఞీయం హయమ్=యజ్ఞాశ్వమును, దదర్శ=చూచెను.

తా. దుఃఖముతో ఏడ్చుచున్న ఆ అంశుమంతుడు అచట దగ్గరనే మేయుచు తిరుగు చున్న యజ్ఞాశ్వమును చూచెను. 14

మూ. స తేషాం రాజపుత్రాణాం కర్తుకామో జలక్రియామ్,
సలిలార్థీ మహాతేజా న చాపశ్యజ్జలాశయమ్. 15

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః = ఆతడు, తేషామ్= ఆ, రాజపుత్రాణామ్ = రాజపుత్రులకు, జలక్రియామ్ = జలతర్పణములను, కర్తుకామః = చేయ కోరిక గలవాడై, సలిలార్థీ = ఉదకమును కోరుచు, జలాశయమ్ = జలస్థానమును, న చ అపశ్యత్ = చూడలేదు.

తా. ఆ అంశుమంతుడు సగరపుత్రులకు జలతర్పణము లివ్వవలె నని తలచెను. ఉదకమునకై అన్వేషింపగా అచట జలాశయ మేదియు కనబడలేదు. 15

మూ. విసార్య నిపుణాం దృష్టిం తతోఽపశ్యత్ఖగాధిపమ్,
పితౄణాం మాతులం రామ సుపర్ణమనిలోపమమ్. 16

ప్ర. అ. రామ = రామా ! తతః = పిమ్మట, నిపుణామ్ = సమర్థ మైన, దృష్టిమ్ = దృష్టిని, విసార్య = ప్రసరింపచేసి, పితౄణామ్ = పినతండ్రుల యొక్క, మాతులం = మేనమామయు, ఖగాధిపమ్=పక్షిరాజును, అనిలోపమమ్=వాయుసమానుడును అగు, సుపర్ణమ్ = గరుత్మంతుని, అపశ్యత్ = చూచెను.

తా. పిమ్మట అతడు ప్రయత్నపూర్వకముగ దృష్టిని ప్రసరింపచేసి చూడగా, అచట పక్షిరాజు, వాయుసమానుడు, పినతండ్రుల మేనమామయు అయిన గరుత్మంతుడు కనబడెను. 16

మూ. స చైనమబ్రవీద్వాక్యం వైనతేయో మహాబలః,
మా శుచః పురుషవ్యాఘ్ర వధోఽయం లోకసంమతః. 17

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, సః = ఆ, వైనతేయః = గరుత్మంతుడు, ఏనమ్=ఈతనిని గూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్= పలికెను. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా ! మా శుచః = దుఃఖింపకుము. అయం వధః = ఈ వధ, లోకసంమతః = లోకమునకు ఇష్టమైనదే.

తా. మహాబలశాలి యగు వైనతేయుడు ఇట్లు పలికెను. ఓ అంశుమంతుడా! దుఃఖింపకుము. మీ పినతండ్రుల మరణమునకు లోకు లందరును హర్షించు చున్నారు. 17

మూ. కపిలేనాప్రమేయేన దగ్ధా హీమే మహాబలాః,
సలిలం నార్హసి ప్రాజ్ఞ దాతుమేషాం హి లౌకికమ్. 18

ప్ర. అ. మహాబలాః=గొప్ప బలము గల, ఇమే=వీరు, అప్రమేయేన= అమేయ మైన ప్రభావము గల, కపిలేన = కపిలునిచేత, దగ్ధాః హి = కాల్చ బడినారుకదా. ప్రాజ్ఞ = ఓ బుద్ధిమంతుడా! లౌకికమ్ = లౌకిక మైన, సలిలమ్ = ఉదకమును, దాతుమ్ = ఇచ్చుటకు, నార్హసి = తగవు.

తా. మహాబలవంతు లైన నీ పినతండ్రులను అప్రమేయ మైన ప్రభావము గల కపిలుడు కాల్చి వేసినాడుకదా. ఓ బుద్ధిమంతుడా! వీరికి లౌకిక మైన ఉదకమును ఇచ్చుట యుక్తము కాదు.

వి. "చణ్డాలాదుదకాత్సర్పాద్వైద్యుతాద్బ్రాహ్మణాదపి,
దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ మరణం పాపకర్మణామ్,
ఉదకం పిణదానం చ ఏతేభ్యో యద్విధీయతే,
నోపతిష్ఠతి తత్సర్వమన్తరిక్షే వినశ్యతి."

(పాపాత్ములకు చండాలుడు, ఉదకము, పిడుగు, బ్రాహ్మణుడు, కోరలుగల జంతువులు, పశువులు, వీటివలన మరణము కలుగును. వారికి చేసిన జలతర్పణ పిండదానాదులు వారికి చెందక ఆకాశమునందే నశించును అని ధర్మశాస్త్రములలో చెప్పిన విధమున వీరు బ్రాహ్మణుని వలన మరణించినవా రగుటచే సాధారణజల తర్పణములు వీరికి ముట్ట వని భావము (గోవిందరాజులు). 18

మూ. గఙ్గా హిమవతో జ్యేష్ఠా దుహితా పురుషర్షభ,
తస్యాం కురు మహాబాహో పితౄణాం తు జలక్రియామ్. 19

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా, హిమవతః = హిమవంతుని యొక్క, జ్యేష్ఠా = పెద్ద కుమార్తె యైన, గఙ్గా = గంగ ఉన్నది. మహాబాహో= గొప్ప బాహువులు కలవాడా! పితౄణామ్ = పినతండ్రులకు, జలక్రియామ్ = జలతర్పణమును, తస్యామ్ = ఆ గంగయందు, కురు = చేయుము.

తా. ఓ పురుషశ్రేష్ఠా! హిమవంతుని జ్యేష్ఠపుత్రిక యగు గంగానదిలో నీ పినతండ్రులకు జలతర్పణము లిమ్ము. 19

మూ. భస్మరాశీకృతానేతాన్పావయేల్లోకపావనీ,
తయా క్లిన్నమిదం భస్మ గఙ్గయా లోకకాన్తయా, 20
షష్టిం పుత్రసహస్రాణి స్వర్గలోకం నయిష్యతి,

ప్ర. అ. లోకపావనీ = లోకములను పవిత్రము చేయు ఆ గంగ, రాశీకృతాన్=భస్మరాశిగా చేయబడిన, ఏతాన్ = వీరిని, పావయేత్=పవిత్రింప చేయును. లోకకాన్తయా=లోకమునకు ఇష్టురాలైన, తయా=ఆ, గఙ్గయా=గంగ చేత, క్లిన్నమ్ = తడపబడిన, ఇదం భస్మ=ఈ భస్మ, షష్టిం పుత్రసహస్రాణి = అరవైవేలమంది పుత్రులను, స్వర్గలోకం = స్వర్గలోకమును, నయిష్యతి = పొందించగలదు.

తా. ఆ లోకపావని భస్మరాశులుగా చేయబడిన వీరి నందరిని పవిత్రింప చేయును. లోకమునకు ఇష్టురాలైన ఆ గంగచే తడపబడిన ఈ భస్మము సగరుని అరువదివేలమంది కుమారులను స్వర్గలోకము చేర్చును. 20

మూ. గచ్ఛ చాశ్వం మహాభాగ తం గృహ్య పురుషర్షభ, 21
యజ్ఞం పైతామహం వీర సంవర్తయితుమర్హసి.

ప్ర. అ. మహాభాగ = గొప్ప భాగ్యము కలవాడా! పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! తమ్ = ఆ, అశ్వమ్ = అశ్వమును, గృహ్య = గ్రహించి, గచ్ఛ=వెళ్లుము. వీర=వీరుడా! పైతామహమ్=నీ పితామహుని సంబంధమైన, యజ్ఞమ్=యజ్ఞమును, సంవర్తయితుమ్=జరిగించుటకు, అర్హసి=తగిఉన్నావు.

తా. మహాభాగ్యశాలివైన ఓ పురుషశ్రేష్ఠుడా! ఈ గుఱ్ఱమును తీసికొని వెళ్లి నీ పితామహుడు ప్రారంభించిన యజ్ఞము జరిపింపుము. 21

మూ. సుపర్ణవచనం శ్రుత్వా సోఽంశుమానతివీర్యవాన్, 22
త్వరితం హయమాదాయ పునరాయాన్మహాయశాః.

ప్ర. అ. అతివీర్యవాన్ = మిక్కిలి పరాక్రమముగల, మహాయశాః = గొప్ప కీర్తిగల, సః=ఆ, అంశుమాన్ = అంశుమంతుడు, సుపర్ణవచనమ్ = గరుత్మంతుని వాక్యము, శ్రుత్వా=విని, త్వరితమ్ = శీఘ్రముగా, హయమ్ = గుఱ్ఱమును, ఆదాయ=గ్రహించి, పునః=తిరిగి, ఆయాత్=వచ్చెను.

తా. వీర్యవంతుడును, మహాయశశ్శాలియు అగు ఆ అంశుమంతుడు గరుత్మంతుడు చెప్పిన విధమున గుఱ్ఱమును తీసికొని తన పురము చేరెను. 22

మూ. తతో రాజానమాసాద్య దీక్షితం రఘునన్దన, 23
న్యవేదయద్యథావృత్తం సుపర్ణవచనం తథా.

ప్ర. అ. రఘునన్దన=రామా! తతః=పిమ్మట, దీక్షితమ్=దీక్షవహించి ఉన్న, రాజానమ్=రాజును, ఆసాద్య=పొంది, యథావృత్తమ్=ఎట్లు జరిగినదో అట్లు, తథా = మరియు, సుపర్ణవచనమ్ = గరుత్మంతుని వాక్యమును, న్యవేదయత్ = తెలిపెను.

తా. రామా! అంశుమంతుడు, యజ్ఞదీక్షితుడైన సగరచక్రవర్తి వద్దకు వెళ్లి జరిగిన విషయమును, గరుత్మంతుని మాటలను ఆతనికి తెలిపెను. 23

మూ. తచ్ఛ్రుత్వా ఘోరసంకాశం వాక్యమంశుమతో నృపః, 24
యజ్ఞం నిర్వర్తయామాస యథాకల్పం యథావిధి.

ప్ర. అ. నృపః=రాజు, అంశుమతః = అంశుమంతునియొక్క, ఘోరసఙ్కాశమ్ = ఘోరమైన, వాక్యమ్ = వాక్యము, శ్రుత్వా = విని, యథాకల్పమ్ = పద్ధతిప్రకారము, యథావిధి = శాస్త్రప్రకారము, యజ్ఞమ్ = యజ్ఞమును, నిర్వర్తయామాస=జరిపించెను.

తా. సగరచక్రవర్తి అంశుమంతుని నుండి ఆ ఘోరమైన వార్త విని చాల విచారించెను. యజ్ఞమును శాస్త్రోక్తప్రకారము, చేయవలసిన పద్ధతిలో పూర్తి చేసెను. 24

మూ. స్వపురం చాగమచ్ఛ్రీమానిష్టయజ్ఞో మహీపతిః, 25
గఙ్గాయాశ్చాగమే రాజా నిశ్చయం నాధ్యగచ్ఛత.

ప్ర. అ. శ్రీమాన్=శ్రీమంతుడైన, మహీపతిః = రాజు, ఇష్టయజ్ఞః= యజింపడిన యాగము కలవాడై, స్వపురమ్ = తన పురమును, అగమత్ = చేరెను. రాజా=రాజు, గఙ్గాయాః=గంగయొక్క, ఆగమే=రాకవిషయమున, నిశ్చయమ్=నిశ్చయమును, నాధ్యగచ్ఛత=పొందలేదు.

తా. సగరచక్రవర్తి యజ్ఞము పూర్తి చేసికొని నగరములో ప్రవేశించెను. గంగను తీసికొనివచ్చుటకు ఉపాయ మేదియు అతడు కానజాలకపోయెను.

మూ. అకృత్వా నిశ్చయం రాజా కాలేన మహతా మహాన్, 26
త్రింశద్వర్షసహస్రాణి రాజ్యం కృత్వా దివం గతః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకచత్వారింశః సర్గః.

ప్ర. అ. మహాన్ = గొప్పవాడైన, రాజా = ఆ రాజు, మహతా కాలేన = చాలకాలముచేత కూడ, నిశ్చయమ్ = నిర్ణయమును, అకృత్వా = చేయకయే, త్రింశద్వర్షసహస్రాణి = ముప్పది వేల సంవత్సరములు, రాజ్యమ్ = రాజ్యము, కృత్వా = చేసి, దివమ్ = స్వర్గమునుగూర్చి, గతః = వెళ్లెను.

తా. గొప్పవాడైన ఆ సగరచక్రవర్తి చాలకాలమునకు గూడ గంగను తీసికొని వచ్చు ఉపాయము కానజాలక, ముప్పదివేల సంవత్సరములు రాజ్యము చేసి స్వర్గమునకు వెళ్లెను. 26

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండలో
ఇరువదియేడవ సర్గ సమాప్తము.

అథ ద్విచత్వారింశః సర్గః

మూ. కాలధర్మం గతే రామ సగరే ప్రకృతీజనాః,
రాజానం రోచయామాసురంశుమన్తం సుధార్మికమ్. 1

ప్ర. అ. రామ = రామా ! సగరే = సగరచక్రవర్తి, కాలధర్మమ్ = మరణమును, గతే = పొందినవాడగుచుండగా, ప్రకృతీజనాః = మంత్రులును ప్రజలును, సుధార్మికమ్ = మిక్కిలి ధార్మికుడైన, అంశుమన్తమ్ = అంశుమంతుని, రాజానమ్ = రాజునుగా, రోచయామాసుః = అంగీకరించిరి.

తా. రామా ! సగరచక్రవర్తి మరణించిన పిమ్మట, మంత్రులును ప్రజలును, ధార్మికుడైన అంశుమంతుని రాజుగా చేసిరి. 1

మూ. స రాజా సుమహానాసీదంశుమాన్రఘునన్దన,
తస్య పుత్రో మహానాసీద్దిలీప ఇతి విశ్రుతః. 2

ప్ర. అ. రఘునన్దన = రామా ! సః = ఆ, అంశుమాన్ = అంశుమంతుడు, సుమహాన్ = చాల గొప్ప, రాజా = రాజుగా, ఆసీత్ = ఆయెను. తస్య = అతనికి, దిలీపః ఇతి = దిలీపుడని, విశ్రుతః = ప్రసిద్ధుడైన, మహాన్ = పూజ్యుడైన, పుత్రః = పుత్రుడు, ఆసీత్ = కలిగెను.

తా. రామా ! ఆ అంశుమంతుడు గొప్ప రాజుగా ఉండి రాజ్యము చేసెను. అతనికి దిలీపుడను పూజ్యుడైన కుమారుడు కలిగెను. 2

మూ. తస్మిన్ రాజ్యం సమావేశ్య దిలీపే రఘునన్దన,
హిమవచ్ఛిఖరే పుణ్యే తపస్తేపే సుదారుణమ్. 3

ప్ర. అ. రఘునన్దన = రామా ! తస్మిన్ = ఆ, దిలీపే = దిలీపునిమీద, రాజ్యమ్ = రాజ్యమును, సమావేశ్య = నిలిపి, పుణ్యే = పవిత్రమైన, హిమవచ్ఛిఖరే = హిమవత్పర్వతముయొక్క శిఖరమునందు, సుదారుణమ్ = మిక్కిలి తీవ్రమైన, తపః = తపస్సును, తేపే = చేసెను.

తా. రామా! అంశుమంతుడు రాజ్యభారమును దిలీపునకు అప్పచెప్పి, పుణ్య మైన హిమవత్పర్వతశిఖరముపై తీవ్ర మైన తపస్సు చేసెను. 3

మూ. ద్వాత్రింశచ్చ సహస్రాణి వర్షాణి సుమహాయశాః,
తపోవనం గతో రామ స్వర్గం లేభే తపోధనః. 4

ప్ర. అ. రామ = రామా! సుమహాయశాః = గొప్ప కీర్తి గల ఆ అంశుమంతుడు, ద్వాత్రింశత్ సహస్రాణి = ముప్పదిరెండువేల, వర్షాణి = సంవత్సరములు, తపోవనమ్ = తపోవనమును, గతః = పొందినవాడై, తపోధనః = తపస్సే ధనముగా కలవాడై, స్వర్గమ్ = స్వర్గమును, లేభే = పొందెను.

తా. రామా! గొప్ప తపస్సు గల ఆ అంశుమంతుడు ముప్పదిరెండువేల సంవత్సరములు తపోవనములో నివసించి, తపస్సు అనెడు ధనము నార్జించి, స్వర్గమును పొందెను. 4

మూ. దిలీపస్తు మహాతేజాః శ్రుత్వా పైతామహం వధమ్,
దుఃఖోపహతయా బుద్ధ్యా నిశ్చయం నాధ్యగచ్ఛత. 5

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కల, దిలీపస్తు = దిలీపుడైతే, పైతామహమ్ = పితామహుల సంబంధ మైన, వధమ్ = వధను, శ్రుత్వా=విని, దుఃఖోపహతయా = దుఃఖముచే పీడింపబడిన, బుద్ధ్యా = బుద్ధిలో, నిశ్చయమ్= నిర్ణయమును, నాధ్యగచ్ఛత=పొందలేదు.

తా. మహాతేజఃశాలి యగు దిలీపుడు తన పితామహుల వధవృత్తాంతమును విని, చాల విచారించి, గంగను తీసికొనివచ్చుటకు ఉపాయమును నిర్ణయింపజాలకపోయెను. 5

మూ. కథం గఙ్గావతరణం కథం తేషాం జలక్రియా,
తారయేయం కథం చైనానితి చిన్తాపరోఽభవత్. 6

ప్ర. అ. గఙ్గావతరణమ్ = గంగయొక్క అవతరణము, కథమ్=ఎట్లు చేయవలెను? తేషామ్=వారికి, జలక్రియా=జలతర్పణము, కథమ్ = ఎట్లు? ఏనాన్=వీరిని, కథమ్=ఎట్లు, తారయేయమ్=తరింపచేయుదును? ఇతి = ఇట్లు, చిన్తాపరః=విచారముతో నిండినవాడు, అభవత్=ఆయెను.

తా. గంగను ఎట్లు తేవలెను ? వీరికి జలతర్పణము లెట్లు ఈయవలెను ? వీరిని ఎట్లు తరింపచేయవలెను ? అను ఆలోచనలతో బాధపడెను. 6

మూ. తస్య చిన్తయతో నిత్యం ధర్మేణ విదితాత్మనః,
పుత్రో భగీరథో నామ జజ్ఞే పరమధార్మికః. 7

ప్ర. అ. విదితాత్మనః = ప్రసిద్ధ మైన బుద్ధి కలవాడును, ధర్మేణ = ధర్మముచేత, నిత్యమ్ = నిత్యము, చిన్తయతః = గంగానయనమును గూర్చి ఆలోచించుచున్న, తస్య=అతనికి, భగీరథో నామ=భగీరథు డను పేరు గల, పరమధార్మికః=మిక్కిలి ధార్మికు డైన, పుత్రః=పుత్రుడు, జజ్ఞే=పుట్టెను.

తా. ధర్మమార్గమున గంగానయనమును గూర్చి నిత్యము ఆలోచించు చున్న, ప్రసిద్ధ మైన బుద్ధి గల ఆ దిలీపునకు, పరమధార్మికు డైన, భగీరథు డనెడు కుమారుడు జనించెను. 7

మూ. దిలీపస్తు మహాతేజా యజ్ఞైర్బహుభిరిష్టవాన్,
త్రింశద్వర్షసహస్రాణి రాజా రాజ్యమశాసయత్. 8

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, దిలీపస్తు = దిలీపుడు, బహుభిః=అనేక మైన, యజ్ఞైః = యజ్ఞములచేత, ఇష్టవాన్ = యజించినాడు. రాజా = ఆ రాజు, త్రింశద్వర్షసహస్రాణి = ముప్పదివేల సంవత్సరములు, రాజ్యమ్=రాజ్యమును, అశాసయత్=శాసించెను.

తా. మహాతేజఃశాలి యగు ఆ దిలీపుడు అనేకయజ్ఞములు చేసి, ముప్పది వేల సంవత్సరములు రాజ్యము పాలించెను. 8

మూ. అగత్వా నిశ్చయం రాజా తేషాముద్ధరణం ప్రతి,
వ్యాధినా నరశార్దూల కాలధర్మము పేయివాన్. 9

ప్ర. అ. నరశార్దూల=నరశ్రేష్ఠుడా! రాజా=దిలీపమహారాజు, తేషామ్= వారియొక్క, ఉద్ధరణం ప్రతి = ఉద్ధరణమును గూర్చి, నిశ్చయమ్ = నిశ్చయమును, అగత్వా = పొందజాలక, వ్యాధినా = మనోవ్యథతో, కాల ధర్మమ్=మరణమును, ఉపేయివాన్=పొందినాడు.

తా. రామా ! ఆ దిలీపుడు సగరపుత్రులను ఉద్ధరించు మార్గము తెలియక ఆ మనోవ్యథతోడనే మరణించెను. 9

మూ. ఇన్ద్రలోకం గతో రాజా స్వార్జితేనైవ కర్మణా,
రాజ్యే భగీరథం పుత్రమభిషిచ్య నరర్షభః. 10

ప్ర. అ. నరర్షభః = నరశ్రేష్ఠుడైన, రాజా = ఆ రాజు, పుత్రమ్ = పుత్రుడైన, భగీరథమ్=భగీరథుని, రాజ్యే = రాజ్యమునందు, అభిషిచ్య = అభిషేకించి, స్వార్జితేనైవ = తనచేతనే ఆర్జింపబడిన, కర్మణా = కర్మచేత, ఇన్ద్రలోకమ్=ఇంద్రలోకమును గూర్చి, గతః=వెళ్లినాడు.

తా. దిలీపమహారాజు పుత్రుడైన భగీరథుని రాజ్యమునందు అభిషిక్తుని చేసి, స్వయముగ సంపాదించిన పుణ్యకర్మలచే స్వర్గము చేరెను. 10

మూ. భగీరథస్తు రాజర్షిర్ధార్మికో రఘునన్దన,
అనపత్యో మహాతేజాః ప్రజాకామః స చాప్రజః. 11

ప్ర. అ. రఘునన్దన=రామా, ధార్మికః=ధార్మికుడును, మహాతేజాః = గొప్పతేజస్సు కలవాడును, రాజర్షిః=రాజును ఋషియును అయిన, భగీరథస్తు= భగీరథుడైతే, అనపత్యః=సంతానములేనివాడు. సః=అతడు, ప్రజాకామః= సంతానమునందు కోరిక కలవాడైనను, అప్రజః = సంతానము లేనివాడుగనే ఉండెను.

తా. రామా ! ధార్మికుడును, మహాతేజఃశాలియు, రాజర్షియు అగు భగీరథునకైతే సంతానము లేదు. అతనికి సంతానము కావలెనని కోరిక యుండెడిది గాని సంతానము మాత్రము కలుగలేదు. 11

మూ. మన్త్రిష్వాధాయ తద్రాజ్యం గఙ్గావతరణే రతః,
స తపో దీర్ఘమాతిష్ఠద్గోకర్ణే రఘునన్దన, 12
ఊర్ధ్వబాహుః పఞ్చతపా మాసాహారో జితేన్ద్రియః.

ప్ర. అ. రఘునన్దన=రామా ! సః=అతడు, గఙ్గావతరణే = గంగను దింపుటయందు, రతః = ఆసక్తి కలవాడై, తద్రాజ్యమ్ = ఆ రాజ్యమును,

మన్త్రిషు=మంత్రులయందు, ఆధాయ=ఉంచి, ఊర్ధ్వబాహుః = పైకి ఎత్తబడిన బాహువులు కలవాడై, పఞ్చతపాః = పంచాగ్నిమధ్య తపస్సు చేయుచున్నవాడై, మాసాహారః = మాసమున కొకసారి ఆహారము కలవాడై, జితేన్ద్రియః = జయింపబడిన ఇంద్రియములు గలవాడై, గోకర్ణే = గోకర్ణ క్షేత్రమునందు, దీర్ఘమ్ = దీర్ఘమైన, తపః=తపస్సును, అతిష్ఠత్=చేసెను.

తా. రామా ! ఆ భగీరథుడు గంగను స్వర్గమునుండి భూలోకమునకు తేవలెనను నిర్ణయముతో రాజ్యభారమును మంత్రులకు అప్పగించి గోకర్ణ క్షేత్రమునకు పోయెను. అచట చేతులను పైకెత్తి, జితేంద్రియుడై, మాసమున కొకసారి మాత్రమే ఆహారము భుజించుచు, గ్రీష్మమునందు పంచాగ్నిమధ్య చాలకాలము తపస్సు చేసెను.

వి. గ్రీష్మమునందు నాల్గు దిక్కులందు నాలుగు అగ్నులు ఉంచుకొని ఆకాశమున నున్న సూర్యుని వైపు చూచుచు చేయు తపస్సు పంచాగ్ని తపస్సు.

మూ. తస్య వర్షసహస్రాణి ఘోరే తపసి తిష్ఠతః, 13
అతీతాని మహాబాహో తస్య రాజ్ఞో మహాత్మనః,
సుప్రీతో భగవాన్ బ్రహ్మ ప్రజానాం పతిరీశ్వరః. 14

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల రామా ! తస్య=అతడు, ఘోరే తపసి= ఘోరమైన తపస్సులో, తిష్ఠతః=ఉండగా, వర్షసహస్రాణి = వేలకొలది సంవత్సరములు, అతీతాని = కడచిపోయినవి. ప్రజానామ్ = ప్రజలకు, పతిః = ప్రభువును, ఈశ్వరః = సమర్థుడును అగు, భగవాన్ బ్రహ్మ=భగవంతుడైన బ్రహ్మదేవుడు, తస్య = ఆ, మహాత్మనః = మహాత్ముడైన, రాజ్ఞః = రాజునకు, సుప్రీతః = చాల సంతసించినవాడు అయ్యెను.

తా. రామా ! భగీరథుడు ఘోర మైన తపస్సు చేయుచుండగా, వేలకొలది సంవత్సరములు కడచిపోయినవి. ప్రజలకు పతియు, సమర్థుడును అగు భగవంతుడైన బ్రహ్మదేవుడు మహాత్ముడైన ఆ రాజు విషయమున సంతోషించెను. 13, 14

మూ. తతః సురగణైః సార్ధముపాగమ్య పితామహః,
భగీరథం మహాత్మానం తప్యమానమథాబ్రవీత్. 15

ప్ర. అ. తతః = పిమ్మట, పితామహః = బ్రహ్మదేవుడు, సురగణైః = దేవతాగణములతో కూడ, ఉపాగమ్య=వచ్చి, అథ = పిమ్మట, తప్యమానమ్ = తపస్సు చేయుచున్న, మహాత్మానమ్ = మహాత్ముడైన, భగీరథమ్ = భగీరథుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. బ్రహ్మదేవుడు దేవతాగణములతో కలిసి వచ్చి తపస్సు చేయుచున్న మహాత్ముడైన ఆ భగీరథునితో ఇట్లు పలికెను. 15

మూ. భగీరథ మహాభాగ ప్రీతస్తేఽహం జనేశ్వర,
తపసా చ సుతప్తేన వరం వరయ సువ్రత. 16

ప్ర. అ. మహాభాగ = మహాభాగ్యవంతుడవైన, జనేశ్వర=మహారాజా ! భగీరథ = భగీరథుడా ! తే = నీయొక్క, సుతప్తేన = బాగుగా చేయబడిన, తపసా = తపస్సుచేత, అహమ్ = నేను, ప్రీతః = సంతసించినాను. సువ్రత = మంచి నియమము కలవాడా ! వరమ్ = వరమును, వరయ = కోరుకొనుము.

తా. మహాభాగ్యవంతుడవగు ఓ భగీరథ మహారాజా ! నీవు చేసిన గొప్ప తపస్సుకు సంతసించినాను. ఓ సువ్రతుడా ! వరమును కోరుకొనుము. 16

మూ. తమువాచ మహాతేజాః సర్వలోకపితామహమ్,
భగీరథో మహాభాగః కృతాఞ్జలిరుపస్థితః. 17

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సుగల, మహాభాగః=గొప్ప భాగ్యము గల, భగీరథః = భగీరథుడు, కృతాఞ్జలిః = దోసిలికట్టినవాడై, ఉపస్థితః = సమీపించిన వాడై, తమ్ = ఆ, సర్వలోకపితామహమ్ = సమస్తలోకములకును పితామహుడైన బ్రహ్మదేవుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. మహాతేజఃశాలియు, మహాభాగ్యవంతుడును అగు భగీరథుడు, బ్రహ్మదేవుని సమీపించి, చేతులు జోడించి, ఆతనితో ఇట్లనెను. 17

మూ. యది మే భగవన్ ప్రీతో యద్యస్తి తపసః ఫలమ్,
సగరస్యాత్మజాః సర్వే మత్తస్సలిలమాప్నుయుః. 18

ప్ర. అ. భగవన్ = భగవంతుడా ! మే = నా విషయమున, ప్రీతః యది = సంతసించినట్లైతే, తపసః = తపస్సునకు, ఫలమ్ = ఫలము, అస్తి యది = ఉన్నట్లైతే, సగరస్య = సగరునియొక్క, ఆత్మజాః = కుమారులు, సర్వే = అందరును, మత్తః = నా నుండి, సలిలమ్ = ఉదకమును, ఆప్నుయుః = పొందుదురుగాక.

తా. భగవంతుడా ! నీకు నాపై అనుగ్రహము కలిగినచో, తపస్సుకు ఫల మున్నచో, సగరుని కుమారు లందరికిని నేను జలతర్పణములు చేయగల్గుదును గాక. 18

మూ. గఙ్గాయాః సలిలక్లిన్నే భస్మన్యేషాం మహాత్మనామ్,
స్వర్గం గచ్ఛేయురత్యన్తం సర్వే మే ప్రపితామహాః. 19

ప్ర. అ. ఏషామ్ = ఈ, మహాత్మనామ్ = మహాత్ములయొక్క, భస్మని = భస్మము, గఙ్గాయాః = గంగయొక్క, సలిలక్లిన్నే = ఉదకముచేత తడుపబడిన దగుచుండగా, మే = నా యొక్క, సర్వే = సమస్తమైన, ప్రపితామహాః = ప్రపితామహులు, అత్యన్తమ్ = శాశ్వతముగా, స్వర్గమ్ = స్వర్గమునుగూర్చి, గచ్ఛేయుః = వెళ్లుదురుగాక.

తా. మహాత్ములైన మా ప్రపితామహు లందరును, వారి భస్మము గంగా జలముచే తడుపబడి నంతనే శాశ్వతముగ స్వర్గమును చేరుదురు గాక. 19

మూ. దేయా చ సన్తతిర్దేవ నావసీదేత్కులం చ నః,
ఇక్ష్వాకూణాం కులే దేవ ఏష మేఽస్తు వరః పరః. 20

ప్ర. అ. దేవ = దేవా ! ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశీయులయొక్క, కులే = కులమునందు, సన్తతిః = సంతానము, దేయా = ఇవ్వదగినది. నః = మాయొక్క, కులమ్ = కులము, నావసీదేత్ = నశింపకుండుగాక. ఏషః = ఇది, మే = నాయొక్క, పరః = మరియొక, వరః = వరము, అస్తు = అగు గాక.

తా. దేవా! నా రెండవ వర మేమనగా— ఇక్ష్వాకు వంశీయుల మైన మా కులమునందు సంతానము కలుగవలెను. మా వంశ మెన్నటికిని నశించ కూడదు. 20

మూ. ఉక్తవాక్యం తు రాజానం సర్వలోకపితామహః,
ప్రత్యువాచ శుభాం వాణీం మధురాం మధురాక్షరామ్. 21

ప్ర. అ. సర్వలోకపితామహః = సమస్త లోకములకును పితామహు డైన బ్రహ్మదేవుడు, ఉక్తవాక్యమ్ = ఈ విధముగా పలకబడిన వాక్యము గల, రాజానమ్ = రాజును గూర్చి, శుభామ్ = శుభ మైన, మధురామ్ = మధురమైన, మధురాక్షరామ్ = మధురమైన అక్షరములు గల, వాణీమ్ = వాక్కును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. భగీరథుడు ఇట్లు పలుకగా విని, బ్రహ్మదేవుడు, భగీరథునితో, మంగళకరమైన, మధురాక్షర మైన, మధురమైన ఈ వచనము పలికెను. 21

మూ. మనోరథో మహానేష భగీరథ మహారథ,
ఏవం భవతు భద్రం తే ఇక్ష్వాకుకులవర్ధన. 22

ప్ర. అ. మహారథ=మహారథుడ వైన, భగీరథ=భగీరథుడా! ఏషః= ఈ, మనోరథః = కోరిక, మహాన్=చాల గొప్పది. ఇక్ష్వాకుకుల వర్ధన=ఇక్ష్వాకు కులమును వృద్ధి పొందించినవాడా! ఏవమ్ = ఇట్లు, భవతు = అగుగాక. తే= నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. మహారథుడ వైన భగీరథుడా, ఈ కోరిక చాల గొప్పది. దుర్లభ మైనది. ఓ! ఇక్ష్వాకుకులవర్ధనా! ఇట్లే అగుగాక. నీకు క్షేమ మగుగాక. 22

మూ. ఇయం హైమవతీ గఙ్గా జ్యేష్ఠా హిమవతః సుతా,
తాం వై ధారయితుం శక్తో హరస్తత్ర నియుజ్యతామ్. 23

ప్ర. అ. హైమవతీ = హిమవంతునినుండి పుట్టిన, ఇయమ్ = ఈ, గఙ్గా= గంగ, హిమవతః=హిమవంతునియొక్క, జ్యేష్ఠా సుతా= పెద్ద కూతురు. తామ్= ఆమెను, ధారయితుమ్ = ధరించుటకు, శక్తః = సమర్థు డైన, హరః = శివుడు, తత్ర = ఆ కార్యమునందు, నియుజ్యతామ్ = నియమింపబడు గాక.

తా. హిమవంతుని పెద్దకూతు రైన గంగను వహింప సమర్థుడు శివు డొక్కడే. అందుచే ఆతనిని ఆ కార్యమునందు నియోగింపవలెను. 23

మూ. గఙ్గాయాః పతనం రాజన్ పృథివీ న సహిష్యతి,
తాం వై ధారయితుం వీర నాన్యం పశ్యామి శూలినః. 24

ప్ర. అ. రాజన్ = రాజా ! గఙ్గాయాః = గంగ యొక్క, పతనమ్ = పతనమును, పృథివీ = భూమి, న సహిష్యతి = సహింపజాలదు. వీర = ఓ వీరుడా ! తామ్ = ఆమెను, ధారయితుమ్ = ధరించుటకు, శూలినః = ఈశ్వరుని కంటె, అన్యమ్ = అన్యుని, న పశ్యామి = చూడను.

తా. రాజా ! గంగ క్రిందికి పడుచున్నపుడు ఆ పడుటను భూమి సహింప జాలదు. ఓ వీరుడా ! ఆ గంగను ధరించుటకు ఈశ్వరుడు తప్ప మరెవ్వరును నాకు కనబడుటలేదు. 24

మూ. తమేవముక్త్వా రాజానం గఙ్గాం చాభాష్య లోకకృత్,
జగామ త్రిదివం దేవః సహ దేవైర్మరుద్గణైః. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ద్విచత్వారింశః సర్గః.

ప్ర. అ. లోకకృత్ = బ్రహ్మదేవుడు, తమ్ = ఆ, రాజానమ్ = రాజును గూర్చి, ఏవమ్ = ఈవిధముగా, ఉక్త్వా = పలికి, గఙ్గాం చ = గంగను కూడ, ఆభాష్య = మాటలాడి, సహ దేవైః = దేవతలతో గూడిన, మరుద్గణైః = మరుద్గణములతో కూడ, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. బ్రహ్మదేవుడు భగీరథునితో ఇట్లు చెప్పి, గంగతో కూడ మాట లాడి, దేవతలతోడను, మరుద్గణములతోడను స్వర్గమునకు వెళ్లెను. 25

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో నలుబదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిచత్వారింశః సర్గః

మూ. దేవదేవే గతే తస్మిన్ సోఽంగుష్ఠాగ్రనిపీడితామ్,
కృత్వా వసుమతీం రామ సంవత్సరముపాసత. 1

ప్ర. అ. రామ = రామా ! తస్మిన్=ఆ, దేవదేవే = దేవతలకు దేవత యైన బ్రహ్మదేవుడు, గతే = వెళ్లినవాడగుచుండగా, సః = అతడు, వసుమతీమ్ = భూమిని, అఙ్గుష్ఠాగ్రనిపీడితామ్ = కాలి బొటనవ్రేలుచేత పీడింపబడిన దానినిగా, కృత్వా=చేసి, సంవత్సరమ్=సంవత్సరము కాలము, ఉపాసత= ఉపాసించెను.

తా. రామా ! బ్రహ్మదేవుడు వెళ్లిన పిదప, ఆ భగీరథుడు సంవత్సర కాలము భూమిపై కాలి బొటనవ్రేలుతో నిలచి తపస్సు చేసెను. 1

మూ. అథ సంవత్సరే పూర్ణే సర్వలోకనమస్కృతః,
ఉమాపతిః పశుపతీ రాజానమిదమబ్రవీత్. 2

ప్ర. అ. అథ=పిమ్మట, సంవత్సరే = ఒక సంవత్సరము, పూర్ణే = నిండగా, సర్వలోకనమస్కృతః = సమస్తలోకములచేతను నమస్కరింపబడిన వాడును, ఉమాపతిః = ఉమయొక్క భర్తయు అగు, పశుపతిః = ఈశ్వరుడు, రాజానమ్=రాజును గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. సంవత్సరకాలము పూర్తి యైన పిమ్మట, సర్వలోకములకును పూజనీయు డగు ఉమాపతియైన, మహేశ్వరుడు రాజుతో ఇట్లు పలికెను. 2

మూ. ప్రీతస్తేఽహం నరశ్రేష్ఠ కరిష్యామి తవ ప్రియమ్,
శిరసా ధారయిష్యామి శైలరాజసుతామహమ్. 3

ప్ర. అ. నరశ్రేష్ఠ = ఓ నరశ్రేష్ఠుడా ! అహమ్ = నేను, తే = నీకు, ప్రీతః = సంతసించినాను. తవ = నీకు, ప్రియమ్ = ప్రియమైన కార్యమును,

కరిష్యామి=చేయగలను. అహమ్ = నేను, శైలరాజసుతామ్ = హిమవంతుని కుమార్తె యైన గంగను, శిరసా=శిరస్సుచేత, ధారయిష్యామి=ధరించెదను.

తా. ఓ నరశ్రేష్ఠా ! నీ తపస్సునకు సంతసించినాను. గంగను శిరస్సుచే వహించి నీకు ప్రియము చేకూర్చెదను. 3

మూ. తతో హైమవతీ గఙ్గా సర్వలోకనమస్కృతా,
తదా సాతిమహద్రూపం కృత్వా వేగం చ దుస్సహమ్, 4
ఆకాశాదపతద్రామ శివే శివశిరస్యుత.

ప్ర. అ. రామ=రామా ! తతః=పిమ్మట, హైమవతీ = హిమవంతుని కుమార్తె యగు, సర్వలోకనమస్కృతా=సమస్తలోకములచేతను నమస్కరింపబడిన, గఙ్గా=గంగ, తదా=అప్పుడు, అతిమహత్=చాల గొప్ప దైన, రూపమ్=రూపమును, దుస్సహమ్ = సహింపశక్యము కాని, వేగం చ = వేగమును, కృత్వా=చేసి, ఆకాశాత్ = ఆకాశమునుండి, శివే=పవిత్రమైన, శివశిరసి=శివుని శిరస్సుపైన, అపతత్ ఉత = పడెను.

తా. రామా ! పిమ్మట ఆ హిమవత్పుత్రియు, సర్వలోకములచే నమస్కరింపబడినదియు అగు గంగ, గొప్ప ఆకారమును, సహింప శక్యముకాని వేగమును వహించి ఆకాశమునుండి, పవిత్ర మైన శివుని శిరస్సుపై పడెను. 4

మూ. అచిన్తయచ్చ సా దేవీ గఙ్గా పరమదుర్ధరా, 5
విశామ్యహం హి పాతాలం స్రోతసా గృహ్య శఙ్కరమ్.

ప్ర. అ. పరమదుర్ధరా = ధరించుటకు చాల కష్ట మైన, సా = ఆ, దేవీ=దేవియైన, గఙ్గా=గంగ, అచిన్తయచ్చ=ఆలోచించెను కూడ. అహమ్=నేను, స్రోతసా = నాప్రవాహముచేత, శఙ్కరమ్ = శంకరుని, గృహ్య = గ్రహించి, పాతాలమ్ = పాతాలమును, విశామి = ప్రవేశింతును.

తా. ధరించుటకు చాలకష్ట మైన ఆ గంగాదేవి– "నా ప్రవాహమునందు శివుని గ్రహించి ఆతనితో సహా పాతాళమును ప్రవేశించెదను" అని తలచెను. 5

మూ. తస్యావలేపనం జ్ఞాత్వా క్రుద్ధస్తు భగవాన్ హరః, 6
తిరోభావయితుం బుద్ధిం చక్రే త్రిణయనస్తదా.

ప్ర. అ. త్రిణయనః=మూడు నేత్రములు గల, భగవాన్ = భగవంతుడైన, హరః=ఈశ్వరుడు, తస్యాః=ఆ గంగయొక్క, వలేపనమ్=గర్వమును, జ్ఞాత్వా = తెలుసుకొని, తదా = అప్పుడు, తిరోభావయితుమ్ = కనబడకుండ చేయుటకు, బుద్ధిమ్ = బుద్ధిని, చక్రే = చేసెను.

తా. అప్పుడు, మూడు నేత్రములు గల భగవంతుడైన ఈశ్వరుడు ఆమె గర్వమును తెలిసికొని, ఆమె కనబడకుండ చేయవలె నని నిశ్చయించుకొనెను. 6

మూ. సా తస్మిన్ పతితా పుణ్యా పుణ్యే రుద్రస్య మూర్ధని, 7
హిమవత్ప్రతిమే రామ జటామణ్డలగహ్వరే.

ప్ర. అ. రామ=రామా! సా = ఆ, పుణ్యా = పుణ్యనది యైన గంగ, హిమవత్ప్రతిమే = హిమవత్పర్వతముతో సమాన మైన, జటామణ్డలగహ్వరే = జటామండలముచే గుహ వలె నున్న, తస్మిన్=ఆ, రుద్రస్య = శివునియొక్క, పుణ్యే = పవిత్రమైన, మూర్ధని = శిరస్సుపై, పతితా = పడినది.

తా. రామా! పవిత్రమైన ఆ గంగ, హిమవత్పర్వతముతో సమానమైనదియు, జటామండల మనెడు గుహలు కలదియు అగు, శివుని పవిత్రమగు శిరస్సుపై పడినది. 7

మూ. సా కథంచిన్మహీం గన్తుం నాశక్నోద్యత్నమాస్థితా, 8
నైవ నిర్గమనం లేభే జటామణ్డలమోహితా.

ప్ర. అ. సా = ఆ గంగ, యత్నమ్ = ప్రయత్నమును, ఆస్థితా = అవలంబించినను, కథంచిత్ = ఏ విధముగను, మహీమ్ = భూమిని, గన్తుమ్= పొందుటకు, న అశక్నోత్ = సమర్థురాలు కాలేదు. జటామణ్డలమోహితా = జటామండలముచే మోహితురాలై, నిర్గమనమ్= బైటపడుటను, న లేభే=పొందలేదు.

తా. ఆ గంగ ఎంత ప్రయత్నించినను భూమిమీద పడలేకపోయెను. ఆ జటామండలములో చిక్కుకొని బైటకు రాజాలకపోయెను. 8

మూ. తత్రైవాబభ్రమద్దేవీ సంవత్సరగణాన్ బహూన్, 9
తామపశ్యన్ పునస్తత్ర తపః పరమమాస్థితః.

ప్ర. అ. దేవీ=ఆగంగ, బహూన్=అనేకములైన, సంవత్సరగణాన్=సంవత్సరసముదాయములను, తత్రైవ = అచటనే, అబంభ్రమత్ = తిరిగెను. తామ్ = ఆ గంగను, అపశ్యన్ = చూడనివాడై, (భగీరథుడు), పునః=మరల, తత్ర = అచట, పరమమ్ = గొప్ప, తపః = తపస్సును, ఆస్థితః = అవలంబించెను.

తా. ఆ గంగ ఎన్నో సంవత్సరములు ఆ జటాజూటమునందే తిరిగెను. ఆమె కనబడకపోవుటచే భగీరథుడు మరల తీవ్రతపస్సు చేసెను. 9

మూ. అనేన తోషితశ్చాసీదత్యర్థం రఘునన్దన, 10
విససర్జ తతో గఙ్గాం హరో బిన్దుసరః ప్రతి.

ప్ర. అ. రఘునన్దన = రామా! అనేన = ఈ తపస్సుచేత, హరః = శివుడు, అత్యర్థమ్ = మిక్కిలి, తోషితః చ = సంతోషపెట్టబడినవాడు, అభూత్ = ఆయెను. తతః = పిమ్మట, గఙ్గామ్ = గంగను, బిన్దుసరః ప్రతి= బిందుసరస్సును గూర్చి, విససర్జ = విడచెను.

తా. రామా! దీనిచేత శివుడు చాల సంతసించినవాడై, బిందుసరః ప్రాంతమునందు గంగను విడచెను. 10

మూ. తస్యాం విసృజ్యమానాయాం సప్త స్రోతాంసి జజ్ఞిరే, 11
హ్లాదినీ పావనీ చైవ నళినీ చ తథాపరా,
తిస్రః ప్రాచీం దిశం జగ్ముర్గఙ్గాః శివజలాః శుభాః. 12

ప్ర. అ. తస్యామ్=ఆ గంగ, విసృజ్యమానాయామ్=విడవబడుచుండగా, సప్త=ఏడు, స్రోతాంసి=ప్రవాహములు, జజ్ఞిరే = పుట్టినవి, హ్లాదినీ=హ్లాదినియు,

పావనీ చైవ = పావనియు, తథా = మరియు, అపరా = మరియొక, నళినీ చ = నళినియు అను, శివజలాః = మంగళప్రద మైన జలము గల, తిస్రః = మూడు, శుభాః = శుభమైన, గఙ్గాః = గంగలు, ప్రాచీమ్ = తూర్పుదిక్కును గూర్చి, జగ్ముః = వెళ్లినవి.

తా. శివుడు గంగను విడచి నప్పుడు ఏడు ప్రవాహములు పుట్టినవి. వాటిలో హ్లాదిని, పావని, నళిని అను పవిత్రజలము గల శుభము లైన మూడు గంగలు తూర్పు వైపు ప్రవహించినవి. 11, 12

మూ. సుచక్షుశ్చైవ సీతా చ సిన్ధుశ్చైవ మహానదీ,
తిస్రస్త్వేతా దిశం జగ్ముః ప్రతీచీం తు శుభోదకాః. 13

ప్ర. అ. సుచక్షుః = సుచక్షువు, సీతా చ = సీతయు, సిన్ధుః = సింధు వనెడు, మహానదీ చ = మహానదియు, శుభోదకాః = శుభ మైన ఉదకము గల, ఏతాః = ఈ, తిస్రః = మూడును, ప్రతీచీం దిశమ్ = పశ్చిమదిక్కును గూర్చి, జగ్ముః = వెళ్లినవి.

తా. సుచక్షువు, సీత, సింధునది అనెడు శుభోదకములు గల మూడు నదులును పశ్చిమదిక్కునకు ప్రవహించినవి. 13

మూ. సప్తమీ చాన్వగా త్తాసాం భగీరథమథో నృపమ్,
భగీరథోఽపి రాజర్షిర్దివ్యం స్యన్దనమాస్థితః, 14
ప్రాయాదగ్రే మహాతేజా గఙ్గా తం చాప్యనువ్రజత్.

ప్ర. అ. అథో = మరియు, తాసామ్ = వాటిలో, సప్తమీ = ఏడవది, భగీరథం నృపమ్ = భగీరథమహారాజును, అన్వగాత్ = అనుసరించి వెళ్లెను. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రాజర్షిః = రాజర్షి యైన, భగీరథోఽపి = భగీరథుడుకూడ, దివ్యమ్ = దివ్యమైన, స్యన్దనమ్ = రథమును, ఆస్థితః = అధిష్ఠించినవాడై, అగ్రే = ఎదుట, ప్రాయాత్ = వెళ్లెను. గఙ్గా చ = గంగయు, తమ్ = ఆతనిని, అనువ్రజత్ = అనుసరించి వెళ్లెను.

తా. వాటిలో ఏడవ ప్రవాహము భగీరథుని అనుసరించెను. మహాతేజః

శాలియు, రాజర్షియు అగు భగీరథుడు దివ్య మైన రథము నెక్కి ముందు వెళ్లగా గంగ అతని వెనుక వెళ్లెను. 14

మూ. గగనాచ్ఛంకరశిర స్తతో ధరణిమాశ్రితా, 15
వ్యసర్పత జలం తత్ర తీవ్రశబ్దపురస్కృతమ్.

ప్ర. అ. గగనాత్ = ఆకాశమునుండి, శంకరశిరః = శంకరుని శిరస్సును, తతః = అచటనుండి, ధరణిమ్ = భూమిని, ఆశ్రితా = ఆశ్రయించినది. తత్ర = అచట, జలమ్ = జలము, తీవ్రశబ్దపురస్కృతమ్=తీవ్ర మైన శబ్దముతో కూడినదై, వ్యసర్పత = వ్యాపించెను.

తా. గంగ ఆకాశమునుండి శివుని శిరస్సును, అచటనుండి భూమిని చేరినది. అచట జలము తీవ్రశబ్దముతో ప్రవహించెను. 15

మూ. మత్స్యకచ్ఛపసంఘైశ్చ శింశుమారగణై స్తదా, 16
పతద్భిః పతితైశ్చాన్యై ర్వ్యరోచత వసున్ధరా.

ప్ర. అ. తదా=అప్పుడు, వసుంధరా=భూమి, పతితైః=పడినవియు, పతద్భిశ్చ = పడుచున్నవియు అగు, మత్స్యకచ్ఛపసంఘైశ్చ = మత్స్యముల యొక్క తాబేళ్లయొక్క సముదాయములచేతను, శింశుమారగణైశ్చ = మొసళ్ల సముదాయములచేతను, అన్యైః = ఇతరమైన జల జంతువులచేతను, వ్యరోచత = ప్రకాశించెను.

తా. అపుడు భూమిపై కొన్ని మత్స్యములు, తాబేళ్లు, మొసళ్లు మొదలైనవి పడినవి, కొన్ని పడుచున్నవి. వాటితో భూమి ప్రకాశించెను. 16

మూ. తతో దేవర్షిగన్ధర్వా యక్షసిద్ధగణా స్తదా, 17
వ్యలోకయన తే తత్ర గగనాద్గాం గతాం తథా.

ప్ర. అ. తతః = పిమ్మట, దేవర్షిగన్ధర్వాః = దేవతలు, ఋషులు, గంధర్వులు, యక్షాః = యక్షులు, తే = ఆ, సిద్ధగణాః = సిద్ధుల గణములు, తదా=అప్పుడు, తథా = ఆవిధముగా, గగనాత్ = ఆకాశమునుండి, గామ్= భూమిని, గతామ్ = పొందిన గంగను, వ్యలోకయన్త = చూచిరి.

తా. అపు డా గంగ ఆకాశమునుండి భూమిపై పడుచుండగా, దేవ-ఋషి-గంధర్వ-యక్ష-సిద్ధాదులు ఆశ్చర్యముతో చూచిరి. 17

మూ. విమానైర్నగరాకారైర్హయైర్గజవరైస్తదా, 18
పారిప్లవగతైశ్చాపి దేవతాస్తత్ర విష్ఠితాః.

ప్ర. అ. తదా = అప్పుడు, దేవతాః = దేవతలు, నగరాకారైః = నగరములవంటి, విమానైః=విమానములతోడను, పారిప్లవగతైః = వేగిరపాటు చెందిన, హయైః = గుఱ్ఱములతోడను, గజవరైః = శ్రేష్ఠము లైన ఏనుగుల తోడను, తత్ర=అచట, విష్ఠితాః=నిలచిరి.

తా. నగరములవంటి విమానములపైనను, తొందరగా నున్న గుఱ్ఱముల మీదను, ఏనుగులమీదను ఎక్కి వచ్చిన దేవతలు అచట నిలచి ఉండిరి. 18

మూ. తదద్భుతతమం లోకే గఙ్గాపతనముత్తమమ్, 19
దిదృక్షవో దేవగణాః సమీయురమితౌజసః.

ప్ర. అ. లోకే = లోకమునందు, అద్భుతతమమ్=అత్యాశ్చర్యకర మైన, ఉత్తమమ్ = ఉత్తమ మైన, గఙ్గాపతనమ్=గంగావతరణమును, దిదృక్షవః= చూడ అభిలాష కలవారై, అమితౌజసః = గొప్ప తేజస్సు గల, దేవగణాః = దేవగణములు, సమీయుః = వచ్చిరి.

తా. లోకములో అత్యాశ్చర్యకర మైన ఉత్తమ మైన ఆ గంగావతరణ మును చూచుటకై గొప్ప తేజస్సు గల దేవత లందరును వచ్చిరి. 19

మూ. సంపతద్భిః సురగణైస్తేషాం చాభరణౌజసా, 20
శతాదిత్యమివాభాతి గగనం గతతోయదమ్.

ప్ర. అ. గతతోయదమ్ = తొలగిన మేఘములు గల, గగనమ్ = ఆకాశము, సంపతద్భిః = వేగముగా వచ్చుచున్న, సురగణైః=దేవతాగణముల చేతను, తేషామ్ = వారియొక్క, ఆభరణౌజసా = ఆభరణముల కాంతిచేతను, శతాదిత్యమివ = నూర్గురు సూర్యులు కలది వలె, ఆభాతి = ప్రకాశించుచున్నది.

తా. మేఘములు లేని ఆకాశముమీద సురగణములు వచ్చి చేరగా వారి అలంకారముల కాంతిచేత నూర్గురు సూర్యు లున్నంత కాంతి కలిగెను. 20

మూ. శింశుమారోరగగణైర్మీనైరపి చ చఞ్చలైః, 21
విద్యుద్భిరివ విక్షిప్తమాకాశమభవత్తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, శింశుమారోరగగణైః = మొసళ్లయొక్కయు, సర్పములయొక్కయు సముదాయములచేతను, చఞ్చలైః = చంచలము లైన, మీనైరపి చ = మీనములచేతను, ఆకాశమ్ = ఆకాశము, విద్యుద్భిః = మెరపుల చేత, విక్షిప్తమివ = వ్యాప్త మైనది వలె, అభవత్ = ఆయెను.

తా. అపుడు మొసళ్లు, సర్పములు. మీనములు కదలుచు పడుచుండగా ఆకాశము మెరపులచే వ్యాప్తమైన ట్లుండెను. 21

మూ. పాణ్డరైః సలిలోత్పీడైః కీర్యమాణైః సహస్రధా, 22
శారదాభ్రైరివాకీర్ణం గగనం హంససంప్లవైః.

ప్ర. అ. సహస్రధా = వేయివిధములుగా, కీర్యమాణైః = చిమ్మబడుచున్న, పాణ్డరైః = తెల్లని, సలిలోత్పీడైః = నీటినురుగులతో, గగనమ్ = ఆకాశము, హంససంప్లవైః = హంసలయొక్క గుంపులచేతను, శారదాభ్రైః = శరత్కాల మేఘములచేతను, ఆకీర్ణమివ = వ్యాప్త మైనది వలె ఉండెను.

తా. వేయి విధములుగా చిమ్మబడుచున్న నీటి నురుగులతో ఆకాశము, హంసల సముదాయములచేతను, శరత్కాలమేఘములచేతను వ్యాప్త మైనది వలె ఉండెను. 22

మూ. క్వచిద్ద్రుతతరం యాతి కుటిలం క్వచిదాయతమ్, 23
వినతం క్వచిదుద్ధూతం క్వచిద్యాతి శనైః శనైః.

ప్ర. అ. క్వచిత్ = కొన్ని చోట్ల, ద్రుతతరమ్ = అతి శీఘ్రముగా, యాతి = ప్రవహించుచున్నది. క్వచిత్ = కొన్ని చోట్ల, కుటిలం యాతి = వంకరగా ప్రవహించుచున్నది. క్వచిత్ = కొన్నిచోట్ల, ఆయతమ్ = పొడవుగా, ప్రవహించుచున్నది. క్వచిత్ = కొన్నిచోట్ల, వినతమ్ = వంగి ప్రవహించు

చున్నది. క్వచిత్ = కొన్ని చోట్ల, ఉద్ధూతమ్=పైకి లేచుచు ప్రవహించుచున్నది. క్వచిత్ = కొన్ని చోట్ల, శనైః శనైః = మెల్లిమెల్లిగా, యాతి = వెళ్లుచున్నది.

తా. ఆ గంగ కొన్ని చోట్ల శీఘ్రముగను, కొన్ని చోట్ల మెల్లగను, కొన్ని చోట్ల వంకరగను, కొన్ని చోట్ల పొడవుగను, కొన్ని చోట్ల క్రిందికిని, కొన్ని చోట్ల పైకిని ప్రవహించుచున్నది. 23

మూ. సలిలేనైవ సలిలం క్వచిదభ్యాహతం పునః, 24
ముహురూర్ధ్వముఖం గత్వా పపాత వసుధాతలమ్.

ప్ర. అ. క్వచిత్ = కొన్ని చోట్ల, సలిలమ్ = నీరు, సలిలేనైవ = నీటి చేతనే, అభ్యాహతమ్ = కొట్టబడినదై, ముహుః = మాటి మాటికిని, ఊర్ధ్వముఖమ్=ఊర్ధ్వముఖముగా, గత్వా = వెళ్లి, పునః = మరల, వసుధాతలమ్ = భూమిని గూర్చి, పపాత = పడెను.

తా. కొన్ని చోట్ల నీటితో నీరు డీకొని, పైకెగసి, మరల భూమిపై పడుచుండెను. 24

మూ. తచ్ఛఙ్కరశిరోభ్రష్టం భ్రష్టం భూమితలే పునః, 25
వ్యరోచత తదా తోయం నిర్మలం గతకల్మషమ్.

ప్ర. అ. శఙ్కరశిరోభ్రష్టమ్=శంకరుని శిరస్సుపై పడినదియు, పునః= మరల, భూమితలే=భూమిపై, భ్రష్టమ్=పడిన, గతకల్మషమ్ = కాలుష్యము లేని, నిర్మలమ్= నిర్మల మైన, తత్=ఆ, తోయమ్ = ఉదకము, తదా = అప్పుడు, వ్యరోచత = ప్రకాశించెను.

తా. ఆకాశమునుండి శంకరుని శిరస్సుపై బడి, పిమ్మట భూమిపై బడిన ఆ కల్మషము లేని ఉదకము నిర్మలముగా ప్రకాశించెను. 25

మూ. తత్ర దేవర్షిగన్ధర్వా వసుధాతలవాసినః, 26
భవాఙ్గపతితం తోయం పవిత్రమితి పస్పృశుః.

ప్ర. అ. తత్ర = అచట, దేవర్షిగన్ధర్వాః = దేవతలు, ఋషులు, గంధర్వులు, వసుధాతలవాసినః=భూమిపై నివసించువారును, భవాఙ్గపతితమ్=

ఈశ్వరుని శరీరమునుండి జారిన, తోయమ్ = ఆ ఉదకము, పవిత్రమ్ ఇతి = పవిత్ర మైనది అని, పస్పృశుః=స్పృశించిరి.

తా. శివుని శరీరమునుండి పడిన దగుటచే ఆజలము పవిత్ర మైన దను అభిప్రాయముతో, అచట దేవఋషిగంధర్వులును, భూమిపై నివసించువారును దానిని స్పృశించిరి. 26

మూ. శాపాత్ప్రపతితా యే చ గగనాద్వసుధాతలమ్, 27
కృత్వా తత్రాభిషేకం తే బభూవుర్గతకల్మషాః.

ప్ర. అ. యే చ=ఎవరు, శాపాత్=శాపమువలన, గగనాత్=ఆకాశమునుండి, వసుధాతలమ్ = భూతలమునుగూర్చి, ప్రపతితాః = పడినారో, తే = వారు, తత్ర = దానియందు, అభిషేకమ్ = స్నానమును, కృత్వా = చేసి, గతకల్మషాః=తొలగిన కల్మషములు కలవారు, బభూవుః = అయిరి.

తా. శాపవశముచేత స్వర్గమునుండి భూలోకములో పడినవారు గంగలో స్నానము చేసి, పాపరహితు లైరి. 27

మూ. ధూతపాపాః పునస్తేన తోయేనాథ సుభాస్వతా, 28
పునరాకాశమావిశ్య స్వాన్ లోకాన్ ప్రతిపేదిరే.

ప్ర. అ. తేన=ఆ, సుభాస్వతా = బాగుగా ప్రకాశించుచున్న, తోయేన= జలముచేత, ధూతపాపాః = కడిగి వేయబడిన పాపములు కలవారై, పునః = మరల, ఆకాశమ్ = ఆకాశమును, ఆవిశ్య = ప్రవేశించి, అథ = పిమ్మట, పునః = మరల, స్వాన్ = తమ, లోకాన్ = లోకములను, ప్రతిపేదిరే = పొందిరి.

తా. ప్రకాశించుచున్న ఆ జలము పాపము లన్నింటిని కడిగివేయగా, వారు ఆకాశములోనికి ఎగిరి తమ లోకములు చేరిరి. 28

మూ. ముముదే ముదితో లోకస్తేన తోయేన భాస్వతా, 29
కృతాభిషేకో గఙ్గాయాం బభూవ విగతక్లమః.

ప్ర. అ. లోకః = జనము, భాస్వతా = ప్రకాశించుచున్న, తేన = ఆ, తోయేన=ఉదకముచేత, ముముదే = సంతసించెను, ముదితః = సంతసించినదై, గఙ్గాయామ్ = గంగయందు, కృతాభిషేకః = చేయబడిన స్నానము గలదై, విగతక్లమః = తొలగిన శ్రమ కలదై, బభూవ=ఆయెను.

తా. ప్రకాశించు చున్న ఆ జలమును చూచి జను లందరును చాల సంతసించి, ఆ గంగలో స్నానము చేసి శ్రమమును పోగొట్టుకొనిరి. 29

మూ. భగీరథోఽపి రాజర్షిర్దివ్యం స్యన్దనమాస్థితః, 30
ప్రాయాదగ్రే మహాతేజా గఙ్గా తం పృష్ఠతోఽన్వగాత్.

ప్ర. అ. తా. చూ. శ్లో. 14. గఙ్గా=గంగ, తమ్=వానిని, పృష్ఠతః= వెనుక, అన్వగాత్=అనుసరించెను. 30

మూ. దేవాః సర్షిగణాః సర్వే దైత్యదానవరాక్షసాః, 31
గన్ధర్వ యక్షప్రవరాః సకిన్నరమహోరగాః,
సర్వాశ్చాప్సరసో రామ భగీరథరథానుగామ్, 32
గఙ్గామన్వగమన్ ప్రీతాః సర్వే జలచరాశ్చ యే.

ప్ర. అ. రామ=రామా ! సర్షిగణాః=ఋషిగణములతో కూడిన, దేవాః= దేవతలును, సర్వే = సమస్త మైన, దైత్యదానవరాక్షసాః = దైత్యదానవ రాక్షసులును, సకిన్నరమహోరగాః = కిన్నరులతోడను, మహోరగులతోడను కూడిన, గన్ధర్వయక్షప్రవరాః = గంధర్వులును శ్రేష్ఠులైన యక్షులును, సర్వాః=సమస్త మైన, అప్సరసః=అప్సరసలును, ప్రీతాః=సంతోషించినవారై, భగీరథరథానుగామ్=భగీరథుని రథమును అనుసరించి పోవుచున్న, గఙ్గామ్ = గంగను, అన్వగమన్ = అనుసరించిరి. యే=ఏ, జలచరాశ్చ = జలచరము లున్నవో, సర్వే=అవి అన్నియు, అనుసరించినవి.

తా. రామా ! భగీరథుని అనుసరించి గంగ వెళ్లుచుండగా, జలచరములే కాక, దేవ-ఋషి-దైత్య-దానవ-రాక్షస-గంధర్వ-యక్ష-కిన్నర-మహోరగ- అప్సరసలు గూడ ఆ గంగ వెంట వెళ్లిరి. 31, 32

మూ. యతో భగీరథో రాజా తతో గఙ్గా యశస్వినీ, 33
జగామ సరితాం శ్రేష్ఠా సర్వపాపప్రణాశినీ.

ప్ర. అ. రాజా=రాజైన, భగీరథః=భగీరథుడు, యతః=ఎటు వైపు వెళ్లెనో, యశస్వినీ=యశఃశాలినియు, సరితాం శ్రేష్ఠా=నదులలో శ్రేష్ఠురాలును, సర్వపాపప్రణాశినీ = సమస్తపాపములను నశింపచేయునదియు అగు, గఙ్గా = గంగ, తతః=అటువైపునకే, జగామ=వెళ్లెను.

తా. భగీరథుడు ఎటు వైపు వెళ్లెనో, యశస్వినియు, నదీశ్రేష్ఠయు, సర్వపాపవినాశినియు అగు గంగ కూడ అటు వైపునకే ప్రవహించుచు వెళ్లెను. 33

మూ. తతో హి యజమానస్య జహ్నోరద్భుతకర్మణః, 34
గఙ్గా సంప్లావయామాస యజ్ఞవాటం మహాత్మనః.

ప్ర. అ. తతః = పిమ్మట, గఙ్గా = గంగ, యజమానస్య = యజ్ఞము చేయుచున్న, అద్భుతకర్మణః = అద్భుతమైన కర్మ గల, మహాత్మనః = మహాత్ముడైన, జహ్నోః = జహ్నుమహర్షియొక్క, యజ్ఞవాటమ్ = యజ్ఞశాలను, సంప్లావయామాస = నీటిలో ముంచె తివేసెను.

తా. ఆ విధముగ ప్రవహించుచు వెళ్లుచున్న గంగ మార్గమధ్యమున అద్భుత మైన కర్మ కలవాడును, మహాత్ముడును అగు జహ్నుమహర్షి యజ్ఞము చేయుచుండగా ఆ యజ్ఞవాటమును ముంచివేసెను. 34

మూ. తస్యావలేపనం జ్ఞాత్వా క్రుద్ధో యజ్వా తు రాఘవ, 35
అపిబచ్ఛ జలం సర్వం గఙ్గాయాః పరమాద్భుతమ్.

ప్ర. అ. రాఘవ = రామా ! యజ్వా = యాగముచేయుచున్న ఆ జహ్ను మహర్షి, తస్యాః = ఆమెయొక్క, వలేపనమ్ = గర్వమును, జ్ఞాత్వా = తెలుసుకొని, క్రుద్ధః = కోపగించినవాడై, గఙ్గాయాః=గంగయొక్క, సర్వమ్ = సమస్తమైన, జలమ్ = జలమును, పరమాద్భుతమ్ = చాల ఆశ్చర్యకర మగునట్లుగా, అపిబత్ = త్రాగివేసెను.

తా. రామా ! యజ్ఞముచేయుచున్న ఆ జహ్నుమహర్షి గంగ గర్వమును చూచి, కోపించి ఆ గంగాజలము నంతను త్రాగివేసెను. అది చాల ఆశ్చర్యకరముగ నుండెను. 35

మూ. తతో దేవాః సగన్ధర్వా ఋషయశ్చ సువిస్మితాః, 36
పూజయన్తి మహాత్మానం జహ్నుం పురుషసత్తమమ్,
గఙ్గాం చాపి నయన్తి స్మ దుహితృత్వే మహాత్మనః. 37

ప్ర. అ. తతః = పిమ్మట, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలును, ఋషయశ్చ = ఋషులును, సువిస్మితాః = చాల ఆశ్చర్యపడినవారై, పురుషసత్తమమ్ = పురుషశ్రేష్ఠుడైన, మహాత్మానమ్ = మహాత్ముడైన, జహ్నుమ్ = జహ్నుమహర్షిని, పూజయన్తి = పూజించుచున్నారు. గఙ్గాం చ = గంగను కూడ, మహాత్మనః = మహాత్ముడైన జహ్నుమహర్షియొక్క, దుహితృత్వే = దుహితగా అగుటను, నయన్తి = పొందించుచున్నారు.

తా. పిమ్మట, దేవతలును, గంధర్వులును, ఋషులును చాల ఆశ్చర్యము చెందినవారై, పురుషశ్రేష్ఠుడైన, మహాత్ముడైన, జహ్నుమహర్షిని పూజించిరి. గంగను ఆ మహాత్ముని కుమార్తెనుగా చేయ నిర్ణయించిరి. 36, 37

మూ. తతస్తుష్టో మహాతేజాః శ్రోత్రాభ్యామసృజత్పునః,
తస్మాజ్జహ్నుసుతా గఙ్గా ప్రోచ్యతే జాహ్నవీతి చ. 38

ప్ర. అ. తతః = పిమ్మట, తుష్టః = సంతసించిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల ఆ జహ్నుమహర్షి, పునః = మరల, శ్రోత్రాభ్యామ్ = చెవులనుండి, అసృజత్ = సృజించెను, తస్మాత్ = ఆ కారణమువలన, గఙ్గా = గంగ, జహ్నుసుతా = "జహ్నుసుత" అనియు, జాహ్నవీతి చ = "జాహ్నవి" యనియు, ప్రోచ్యతే = చెప్పబడుచున్నది.

తా. పిమ్మట మహాతేజస్సు గల ఆ జహ్నుమహర్షి సంతసించినవాడై, మరల చెవులనుండి గంగను విడచెను. అందుచే గంగకు "జహ్నుసుత" అనియు, "జాహ్నవి" అనియు పేర్లు వచ్చినవి. 38

మూ. జగామ చ పునర్గఙ్గా భగీరథపథానుగా,
సాగరం చాపి సంప్రాప్తా సా సరిత్ప్రవరా తదా, 39
రసాతలముపాగచ్ఛత్సిద్ధ్యర్థం తస్య కర్మణః.

ప్ర. అ. గఙ్గా=గంగ, పునః = మరల, భగీరథపథానుగా=భగీరథుని మార్గమును అనుసరించినదై, జగామ = వెళ్లెను. తదా = అప్పుడు, సా = ఆ, సరిత్ప్రవరా=నదులలో శ్రేష్ఠ మైన గంగ, సాగరం = సముద్రమును, సంప్రాప్తాపి = పొందిన దైనను, తస్య=ఆ, కర్మణః = పనియొక్క, సిద్ధ్యర్థమ్ = సిద్ధి కొరకు, రసాతలమ్ = పాతాళమును, ఉపాగచ్ఛత్ = పొందెను.

తా. నదులలో శ్రేష్ఠ యైన ఆ గంగ మరల భగీరథుని అనుసరించి, వెళ్లి సముద్రములో ప్రవేశించి, సగరపుత్రులను తరింప చేయుట అను పని పూర్తి చేయుటకు పాతాళమునకు వెళ్లెను. 39

మూ. భగీరథోఽపి రాజర్షిర్గఙ్గామాదాయ యత్నతః, 40
పితామహాన్ భస్మకృతానపశ్యద్దీనచేతనః.

ప్ర. అ. రాజర్షిః = రాజర్షి యైన, భగీరథోఽపి = భగీరథుడు కూడ, యత్నతః=ప్రయత్నమువలన, గఙ్గామ్ = గంగను, ఆదాయ = తీసికొని వెళ్లి, దీనచేతనః = దీన మైన మనస్సు కలవాడై, భస్మకృతాన్ = భస్మముగా చేయబడిన, పితామహాన్ = తాతలను, అపశ్యత్ = చూచెను.

తా. రాజర్షి యైన భగీరథుడు ఇంత ప్రయత్నము చేసి, గంగను తీసికొని వెళ్లెను. అచట భస్మమై పడి యున్న పితామహులను చూచి, దుఃఖితుడయ్యెను. 40

మూ. అథ తద్భస్మనాం రాశిం గఙ్గాసలిలముత్తమమ్, 41
ప్లావయద్ధూతపాప్మానః స్వర్గం ప్రాప్తా రఘూత్తమ.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రిచత్వారింశః సర్గః.

ప్ర. అ. రఘూత్తమ = రామా, అథ = పిమ్మట, ఉత్తమమ్ = ఉత్తమ మైన, గఙ్గానలిలమ్ = గంగాజలము, తత్ = ఆ, భస్మనామ్ = భస్మలయొక్క, రాశిమ్ = రాశిని, ప్లావయత్ = ముంచెను. ధూతపాపాః = కడిగి వేయబడిన పాపములు కలవారై, స్వర్గమ్ = స్వర్గమును, ప్రాప్తాః = చేరినారు.

తా. రామా! ఉత్తమ మైన ఆ గంగోదకము ఆ భస్మరాశిని తడపగా సగరకుమారు లందరును, పాపములు నశించి, స్వర్గము చేరిరి. 41

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో నలుబదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుశ్చత్వారింశః సర్గః

మూ. స గత్వా సాగరం రాజా గఙ్గయానుగతస్తదా,
ప్రవివేశ తలం భూమేర్యత్ర తే భస్మసాత్కృతాః. 1

ప్ర. అ. సః = ఆ, రాజా = రాజు, తదా = అప్పుడు, గఙ్గయా = గంగ చేత, అనుగతః = అనుసరింపబడినవాడై, సాగరమ్ = సముద్రమును గూర్చి, గత్వా = వెళ్లి, యత్ర = ఎచట, తే = ఆ సగరకుమారులు, భస్మసాత్ = భస్మముగా, కృతాః = చేయబడినారో అక్కడ, భూమేః = భూమియొక్క, తలమ్ = అడుగు భాగమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. అపుడు, గంగానది తన వెనుకనే వచ్చుచుండగా, భగీరథుడు సముద్రమునకు వెళ్లి, అచటినుండి, సగరకుమారులు భస్మమై పడి ఉన్న పాతాళలోకములో ప్రవేశించెను. 1

మూ. భస్మన్యథాప్లుతే రామ గఙ్గాయాః సలిలేన వై,
సర్వలోకప్రభుర్బ్రహ్మా రాజానమిదమబ్రవీత్. 2

ప్ర. అ. అథ = పిమ్మట, భస్మని = భస్మము, గఙ్గాయాః = గంగ యొక్క, సలిలేన = నీటిచేత, ఆప్లుతే = ముంచబడగా, సర్వలోకప్రభుః = సమస్తలోకములకును ప్రభువైన, బ్రహ్మా = బ్రహ్మ, రాజానమ్ = రాజును గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. గంగాజలము భస్మమును ముంచెత్తిన పిమ్మట, సకలలోక ప్రభువైన బ్రహ్మదేవుడు భగీరథునితో ఇట్లు పలికెను. 2

మూ. తారితా నరశార్దూల దివం యాతాశ్చ దేవవత్,
షష్టిః పుత్రసహస్రాణి సగరస్య మహాత్మనః. 3

ప్ర. అ. నరశార్దూల = నరశ్రేష్ఠుడా! మహాత్మనః = మహాత్ముడైన, సగరస్య = సగరునియొక్క, షష్టిః పుత్రసహస్రాణి = అరవై వేలమంది

కుమారులు, తారితాః = తరింప చేయబడినారు. దేవవత్=దేవతలవలె, దివమ్= స్వర్గమును గూర్చి, యాతాః=వెళ్లినారు.

తా. మహాత్ముడైన సగరుని అరువదివేలమంది కుమారులును తరింప బడినవారై, దేవతల వలె స్వర్గమునకు వెళ్లినారు. 3

మూ. సాగరస్య జలం లోకే యావత్ స్థాస్యతి పార్థివ,
సగరస్యాత్మజాస్తావత్స్వర్గే స్థాస్యన్తి దేవవత్. 4

ప్ర. అ. పార్థివ=రాజా! సాగరస్య = సముద్రముయొక్క, జలమ్ = జలము, లోకే=లోకమునందు, యావత్=ఎంతవరకు, స్థాస్యతి=ఉండగలదో, తావత్=అంతవరకును, సగరస్య ఆత్మజాః=సగరుని కుమారులు, దేవవత్= దేవతల వలె, స్వర్గే=స్వర్గమునందు, స్థాస్యన్తి=ఉండగలరు.

తా. రాజా! లోకములో సాగరజల మున్నంతవరకును, సగరకుమారులు దేవతల వలె స్వర్గములో ఉండగలరు. 4

మూ. ఇయం చ దుహితా జ్యేష్ఠా తవ గఙ్గా భవిష్యతి,
త్వత్కృతేన చ నామ్నాథ లోకే స్థాస్యతి విశ్రుతా. 5

ప్ర. అ. ఇయమ్=ఈ, గఙ్గా=గంగ, తవ=నీ యొక్క, జ్యేష్ఠా=పెద్ద, దుహితా=కుమార్తెగా, భవిష్యతి=కాగలదు, అథ = ఇటు పిమ్మట, త్వత్కృ తేన=నీచే ఏర్పడిన, నామ్నా=పేరుతో, లోకే = లోకమునందు, విశ్రుతా = ప్రసిద్ధురాలై, స్థాస్యతి=ఉండగలదు.

తా. ఈ గంగ నీకు పెద్దకుమార్తె కాగలదు. నీ పేరుతో సంబంధించిన "భాగీరథి" అను పేరుతో లోకమునందు ప్రసిద్ధి పొందగలదు. 5

మూ. గఙ్గా త్రిపథగా రాజన్ దివ్యా భాగీరథీతి చ,
త్రీన్ పథో భావయన్తీతి తతస్త్రిపథగా స్మృతా. 6

ప్ర. అ. రాజన్=రాజా, దివ్యా=స్వర్గలోకమునకు సంబంధించిన, గఙ్గా= గంగ, త్రిపథగా = త్రిపథగ యనియు, భాగీరథీతి చ = భాగీరథి అనియు,

ప్రసిద్ధి చెందును. త్రీన్ = మూడు, పథః = మార్గములను, భావయన్తీ = పవిత్రము చేయుచు ప్రవహించుచున్నది, ఇతి=అని, తతః=ఆ కారణమువలన, త్రిపథగా='త్రిపథగ' అని, స్మృతా=చెప్పబడినది.

తా. రాజా! గంగ త్రిపథగ అనియు, భాగీరథి యనియు ప్రసిద్ధి పొందును. మూడు మార్గములను, అనగా, స్వర్గలోక-భూలోక-పాతాళలోక మార్గములను తన ప్రవాహముచే పవిత్రింపచేయుచున్నది గాన త్రిపథగ అని చెప్పబడుచున్నది. 6

మూ. పితామహానాం సర్వేషాం త్వమత్ర మనుజేశ్వర,
కురుష్వ సలిలం రాజన్ ప్రతిజ్ఞామపవర్జయ. 7

ప్ర. అ. మనుజేశ్వర=మనుజులకు ప్రభులైన, రాజన్=రాజా! త్వమ్=నీవు, ఈ గంగయందు, సర్వేషామ్ = సమస్తమైన, పితామహానామ్ = పితామహులకు, సలిలం కురుష్వ=జలతర్పణము లిమ్ము. ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, అపవర్జయ=పూర్తిచేసికొనుము.

తా భగీరథా, ఈ గంగాజలముతో నీ పితామహు లందరికిని తర్పణములు చేసి నీ ప్రతిజ్ఞను నిలుపుకొనుము. 7

మూ. పూర్వకేణ హి తే రాజంస్తేనాతియశసా తదా,
ధర్మిణాం ప్రవరేణాపి నైష ప్రాప్తో మనోరథః. 8

ప్ర. అ. రాజన్ = రాజా, తే = నీయొక్క, పూర్వకేణ = పూర్వపురుషుడును, అతియశసా = గొప్ప కీర్తి కలవాడును, ధర్మిణామ్ = ధర్మవంతులలో, ప్రవరేణ = శ్రేష్ఠుడును అగు, తేనాపి = ఆ సగరచక్రవర్తిచేత కూడ, తదా = అప్పుడు, ఏషః = ఈ, మనోరథః = మనోరథము, న ప్రాప్తః=పొందబడలేదు.

తా. రాజా! గొప్ప కీర్తి గలవాడును, ధార్మికులలో శ్రేష్ఠుడును అయిన నీ పూర్వపురుషుడు సగరచక్రవర్తి కూడ ఆనాడు, ఈ కోరికను తీర్చుకొనజాలక పోయెను. 8

మూ. తథైవాంశుమతా తాత లోకేఽప్రతిమతేజసా,
గఙ్గాం ప్రార్థయతా నేతుం ప్రతిజ్ఞా నాపవర్జితా. 9

ప్ర. అ. తాత = నాయనా! తథైవ = అట్లే, లోకే = లోకమునందు, అప్రతిమతేజసా=సాటి లేని తేజస్సు కలవాడును, గఙ్గామ్=గంగను, ఆనేతుమ్= తీసికొనివచ్చుటకు, ప్రార్థయతా = కోరుచున్నవాడును అగు, అంశుమతా = అంశుమంతునిచేత కూడ, ప్రతిజ్ఞా=ప్రతిజ్ఞ, నాపవర్జితా=పూర్తిచేయబడలేదు.

తా. లోకములో సాటి లేని తేజస్సు గల అంశుమంతుడు గూడ గంగను తీసుకొని రావలె ననెడు ప్రతిజ్ఞను పూర్తిచేసికొనలేకపోయెను. 9

మూ. రాజర్షిణా గుణవతా మహర్షిసమతేజసా,
మత్తుల్యతపసా చైవ క్షత్రధర్మస్థితేన చ,
దిలీపేన మహాభాగా తవ పిత్రాతితేజసా,
పునర్న శకితాఽనేతుం గఙ్గాం ప్రార్థయతోఽనఘ. 11

ప్ర. అ. అనఘ = దోషములు లేనివాడా! రాజర్షిణా = రాజర్షియు, గుణవతా=గుణవంతుడును, మహర్షిసమతేజసా=మహర్షితో సమాన మైన తేజస్సు కలవాడును, మత్తుల్యతపసా = నాతో సమాన మైన తపస్సు కలవాడును, క్షత్రధర్మస్థితేన=క్షత్రియధర్మమునందున్నవాడును, అతితేజసా=గొప్ప తేజస్సు కలవాడును, గఙ్గామ్ = గంగను, ప్రార్థయతా = ప్రార్థించినవాడును అగు, తవ పిత్రా = నీ తండ్రియైన, దిలీపేన = దిలీపునిచేత, ఆనేతుం పునః= తీసికొనివచ్చుటకైతే, న శకితా = శక్యము కాలేదు.

తా. ఓ పుణ్యాత్ముడా! రాజర్షియు, గుణవంతుడును, మహర్షులతో సమాన మైన తేజస్సు కలవాడును, నా వంటి తపస్సు కలవాడును, క్షత్రియ ధర్మమును అవలంబించినవాడును, మంచి తేజస్సు కలవాడును, అగు నీ తండ్రి దిలీపుడు గంగను తీసుకొని రావలె నని కోరెను గాని తీసికొనిరాలేక పోయెను. 10, 11

మూ. సా త్వయా సమతిక్రాన్తా ప్రతిజ్ఞా పురుషర్షభ,
ప్రాప్తోఽసి పరమం లోకే యశః పరమసంమతమ్. 12

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! సా = ఆ, ప్రతిజ్ఞా = ప్రతిజ్ఞ, త్వయా = నీచేత, సమతిక్రాన్తా = దాటబడినది, లోకే=లోకమునందు, పరమ

సంమతమ్ = మిక్కిలి పూజ్య మైన, పరమమ్ = గొప్ప, యశః = కీర్తిని, ప్రాప్తః అసి = పొందినావు.

తా. పురుషశ్రేష్ఠుడా ! ఆ ప్రతిజ్ఞను నీవు దాట గలిగినావు. లోకములో చాల మెచ్చుకొన దగిన గొప్ప కీర్తిని సంపాదించుకొనినావు. 12

మూ. యచ్చ గఙ్గావతరణం త్వయా కృతమరిన్దమ,
అనేన చ భవాన్ ప్రాప్తో ధర్మస్యాయతనం మహత్. 13

ప్ర. అ. అరిన్దమ = ఓ శత్రువినాశకుడా, త్వయా = నీచేత, యత్ = ఏ, గఙ్గావతరణమ్ = గంగను దింపుట చేయబడినదో, అనేన = దీనిచేత, భవాన్ = నీవు, ధర్మస్య = ధర్మముయొక్క, మహత్ = గొప్ప, ఆయతనమ్ = ప్రతిష్ఠను, ప్రాప్తః = పొందినావు.

తా. భగీరథా ! నీవు గంగను క్రిందికి దింపుటవలన గొప్ప ధర్మప్రతిష్ఠను చేసినవాడ వైనావు. 13

మూ. ప్లావయస్వ త్వమాత్మానం నరోత్తమ సదోచితే,
సలిలే పురుషవ్యాఘ్ర శుచిః పుణ్యఫలో భవ. 14

ప్ర. అ. నరోత్తమ = నరులలో ఉత్తముడా ! పురుషవ్యాఘ్ర = పురుష శ్రేష్ఠుడా ! ఉచితే = తగిన, సలిలే = గంగాజలమునందు, సదా = ఎల్లప్పుడును, త్వమ్ = నీవు, ఆత్మానమ్ = నిన్ను, ప్లావయస్వ = ముంచుకొనుము. శుచిః = పవిత్రుడవై, పుణ్యఫలః = పుణ్య మైన ఫలముకలవాడవు, భవ = అగుము.

తా. నరోత్తముడవైన భగీరథా ! స్నానోచిత మైన ఈ గంగాజలము నందు నిత్యము స్నానము చేసి పవిత్రుడవై, పుణ్యాత్ముడవు అగుము. 14

మూ. పితామహానాం సర్వేషాం కురుష్వ సలిలక్రియామ్,
స్వస్తి తేఽస్తు గమిష్యామి స్వం లోకం గమ్యతాం నృప. 15

ప్ర. అ. సర్వేషామ్ = సమస్త మైన, పితామహానామ్ = పితామహులకు, సలిలక్రియామ్ = జలతర్పణమును, కురుష్వ = చేయుము. తే = నీకు, స్వస్తి =

క్షేమ మగుగాక. గమిష్యామి = నేను వెళ్లెదను, నృప = రాజా ! స్వం లోకమ్ = నీ లోకమును గూర్చి, గమ్యతామ్=వెళ్లెదవుగాక.

తా. రాజా ! నీ పితామహు లందరికిని జలతర్పణము చేయుము. నీకు క్షేమ మగుగాక. నేను వెళ్లెదను. నీవు కూడ నీ లోకమునకు వెళ్లుము. 15

మూ. ఇత్యేవముక్త్వా దేవేశః సర్వలోకపితామహః,
యథాగతం తథాగచ్ఛద్దేవలోకం మహాయశాః. 16

ప్ర. అ. సర్వలోకపితామహః = సమస్తలోకములకును పితామహుడును, మహాయశాః = గొప్ప కీర్తికలవాడును అగు, దేవేశః = దేవతలకు ప్రభు వైన బ్రహ్మదేవుడు, ఇత్యేవమ్=ఈ విధముగా, ఉక్త్వా = పలికి, యథాగతం తథా = వచ్చిన విధముననే, దేవలోకమ్=దేవలోకమును గూర్చి, అగచ్ఛత్=వెళ్లెను.

తా. సమస్తలోకములకును పితామహు డైన ఆ బ్రహ్మదేవుడు ఈ విధముగ పలికి స్వర్గలోకమునకు మరలి వెళ్లెను. 16

మూ. భగీరథోఽపి రాజర్షిః కృత్వా సలిలముత్తమమ్,
యథాక్రమం యథాన్యాయం సాగరాణాం మహాయశాః. 17

కృతోదకః శుచీ రాజా స్వపురం ప్రవివేశ హ,
సమృద్ధార్థో రఘుశ్రేష్ఠ స్వరాజ్యం ప్రశశాస హ. 18

ప్ర. అ. రాజర్షిః=రాజర్షియు, మహాయశాః = గొప్ప కీర్తి కలవాడును, రాజా=రాజును అగు, భగీరథోఽపి=భగీరథుడు కూడ, యథాక్రమమ్=క్రమానుసారముగాను, యథాన్యాయమ్=న్యాయానుసారముగాను, సాగరాణామ్ = సగర పుత్రులకు, ఉత్తమమ్ = ఉత్తమ మైన, సలిలమ్ = ఉదకమును, కృత్వా = చేసి, కృతోదకః=పూర్తి చేయబడిన ఉదకక్రియ కలవాడై, శుచిః = పవిత్రుడై, స్వపురమ్=తనపట్టణమును, ప్రవివేశ హ = ప్రవేశించెను. రఘుశ్రేష్ఠ=రామా ! సమృద్ధార్థః=తీరిన కోరికగలవాడై, స్వరాజ్యమ్ = తన రాజ్యమును, ప్రశశాస హ = పరిపాలించెను.

తా. రామా ! గొప్ప కీర్తి గల భగీరథుడు సగరకుమారు లందరికిని క్రమానుసారముగా శాస్త్రము ననుసరించి జలతర్పణములు చేసి, పవిత్రుడై తన

పురమును ప్రవేశించెను. ఈ విధముగ చరితార్థుడై తన రాజ్యమును పరిపాలించెను. 17, 18

మూ. ప్రముమోద హ లోకస్తం నృపమాసాద్య రాఘవ,
నష్టశోకః సమృద్ధార్థో బభూవ విగతజ్వరః. 19

ప్ర. అ. రాఘవ=రామా ! తమ్ = ఆతనిని, నృపమ్ = రాజునుగా, ఆసాద్య=పొంది, లోకః = లోకము, ప్రముమోద = సంతోషించెను. (అతడు) సమృద్ధార్థః=తీరిన కోరికగలవాడై, విగతజ్వరః=పోయిన మనస్తాపము గలవాడై, నష్టశోకః = నశించిన శోకముకలవాడు, బభూవ=ఆయెను.

తా. రామా ! భగీరథుడు రాజుగా ఉండుటచే లోక మంతయు సంతోషించెను. భగీరథుడు కూడ కోరిక తీరుటచే శోకము, మనస్తాపము తొలగి సుఖముగా నుండెను. 19

మూ. ఏష తే రామ గఙ్గాయా విసరోఽభిహితో మయా,
స్వస్తి ప్రాప్నుహి భద్రం తే సన్ధ్యాకాలోఽతివర్తతే. 20

ప్ర. అ. రామ=రామా ! గఙ్గాయాః = గంగయొక్క, ఏషః = ఈ, విస్తరః = కథావిస్తరము, మయా = నాచేత, తే = నీకు, అభిహితః = చెప్పబడినది. స్వస్తి=మంగళమును, ప్రాప్నుహి = పొందుము, తే = నీకు, భద్రమ్ = క్షేమమగుగాక. సన్ధ్యాకాలః = సంధ్యా సమయము, అతివర్తతే = దాటి పోవుచున్నది.

తా. రామా ! గంగను గూర్చి విస్తృత మైన కథను చెప్పినాను. దీనిని వినుటచే మంగళమును పొందుము. నీకు క్షేమ మగుగాక. సంధ్యాకాలము దాటి పోవుచున్నది. ఇక సంధ్యావందనాదికము చేసికొందము. 20

మూ. ధన్యం యశస్యమాయుష్యం పుత్ర్యం స్వర్గ్యమతీవ చ,
యః శ్రావయతి విప్రేషు క్షత్రియేష్వితరేషు చ, 21
ప్రీయన్తే పితరస్తస్య ప్రీయన్తే దైవతాని చ.

ప్ర. అ. ధన్యమ్ = ధనము నిచ్చునదియు, యశస్యమ్ = యశస్సును కలిగించునదియు, ఆయుష్యమ్=ఆయుస్సును పెంచునదియు, పుత్ర్యమ్=పుత్రులను ఇచ్చునదియు, అతీవ = మిక్కిలి, స్వర్గ్యమ్ = స్వర్గమును చేర్చునదియు అగు ఈ ఉపాఖ్యానమును, యః=ఎవడు, విప్రేషు = బ్రాహ్మణులకును, క్షత్రియేషు=క్షత్రియులకును, ఇతరేషు చ = ఇతరులకును, శ్రావయతి=వినిపించునో, తస్య=వానియొక్క, పితరః=పితృదేవతలు, ప్రీయన్తే = సంతోషింతురు, దైవతాని చ=దేవతలు కూడ, ప్రీయన్తే=సంతోషింతురు.

తా. ఈ గంగావతరణవృత్తాంతము ఐశ్వర్యమును, యశస్సును, ఆయుర్దాయమును, పుత్రులను, స్వర్గమును ఇచ్చును. దీనిని బ్రాహ్మణులకును, క్షత్రియులకును, ఇతరులకును వినిపించువాని విషయమున ఆతని పితృదేవతలును, దేవతలును సంతోషింతురు. 21

మూ. ఇదమాఖ్యానమవ్యగ్రో గఙ్గావతరణం శుభమ్, 22
యః శృణోతి చ కాకుత్స్థ సర్వాన్ కామానవాప్నుయాత్,
సర్వే పాపాః ప్రణశ్యన్తి ఆయుః కీర్తిశ్చ వర్ధతే. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
చతుశ్చత్వారింశః సర్గః.

ప్ర. అ. కాకుత్స్థ=రామా ! ఇదమ్=ఈ. శుభమ్ = శుభమైన, గఙ్గావతరణమ్=గంగావతరణ మనెడు, ఆఖ్యానమ్=ఆఖ్యానమును, యః = ఎవడు, అవ్యగ్రః=ఏకాగ్రచిత్తుడై, శృణోతి=వినునో, అతడు, సర్వాన్=సమస్తమైన, కామాన్=కామములను, అవాప్నుయాత్ = పొందును. సర్వే = సమస్తమైన, పాపాః = పాపములు, ప్రణశ్యన్తి = నశించును. ఆయుః = ఆయుర్దాయము, కీర్తిశ్చ=కీర్తియు, వర్ధతే=వృద్ధి పొందును.

తా. రామా ! పవిత్రమైన ఈ గంగావతరణ కథను వినువాడు సమస్త కామములను పొందగలడు. ఆతని పాపము లన్నియు నశించును. ఆయుర్దాయము, కీర్తి వృద్ధి పొందును. 22, 23

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు, బాలకాండలో
నలుబదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చచత్వారింశః సర్గః

మూ. విశ్వామిత్రవచః శ్రుత్వా రాఘవః సహ లక్ష్మణః,
విస్మయం పరమం గత్వా విశ్వామిత్రమథాబ్రవీత్. 1

ప్ర. అ. సహలక్ష్మణః = లక్ష్మణునితో కూడిన, రాఘవః = రాముడు, విశ్వామిత్రవచః=విశ్వామిత్రుని యొక్క వాక్యమును, శ్రుత్వా=విని, పరమమ్= గొప్ప, విస్మయమ్=ఆశ్చర్యమును, గత్వా = పొంది, అథ = పిమ్మట, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. లక్ష్మణసమేతుడైన రాముడు, విశ్వామిత్రుని మాటలను విని, చాల ఆశ్చర్యము చెంది అతనితో ఇట్లనెను. 1

మూ. అత్యద్భుతమిదం బ్రహ్మన్ కథితం పరమం త్వయా,
గఙ్గావతరణం పుణ్యం సాగరస్యాపి పూరణమ్. 2

ప్ర. అ. బ్రహ్మన్=బ్రాహ్మణశ్రేష్ఠుడా ! త్వయా = నీచేత, కథితమ్= చెప్పబడిన, పరమమ్=గొప్పదైన, ఇదమ్=ఈ, గఙ్గావతరణమ్=గంగయొక్క అవతరణము, పుణ్యమ్ = పుణ్యమైన, సాగరస్య = సముద్రము యొక్క, పూరణమ్=నింపుటయు, అత్యద్భుతమ్=చాల ఆశ్చర్యకరమైనది.

తా. ఓ బ్రహ్మర్షి, నీవు నీవు చెప్పిన ఈ గొప్పదైన గంగావతరణము, సాగరమును నింపుటయు చాల ఆశ్చర్యకరములు. 2

మూ. తస్య సా శర్వరీ సర్వా సహ సౌమిత్రిణా తదా,
జగామ చిన్తయానస్య విశ్వామిత్రకథాం శుభామ్. 3

ప్ర. అ. తదా= అప్పుడు, తస్య = ఆరాముడు, సౌమిత్రిణా సహ= లక్ష్మణునితో, శుభామ్=శుభమైన, విశ్వామిత్రకథామ్ = విశ్వామిత్రుడు చెప్పిన కథను గూర్చి, చిన్తయానస్య=ముచ్చటించుచుండగా, సా=ఆ, సర్వా=సమస్తమైన, శర్వరీ=రాత్రి, గతా = కడచినది.

తా. విశ్వామిత్రుడు చెప్పిన కథను గూర్చి రామలక్ష్మణు లిరువురును ముచ్చటించుకొనుచుండగనే రాత్రి కడచిపోయినది. 3

మూ. తతః ప్రభాతే విమలే విశ్వామిత్రం మహామునిమ్,
ఉవాచ రాఘవో వాక్యం కృతాహ్నికమరిన్దమః. 4

ప్ర. అ. తతః = పిమ్మట, అరిన్దమః = శత్రువులను నశింపచేయు, రాఘవః=రాముడు, విమలే=స్వచ్ఛ మైన, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, కృతాహ్నికమ్ = చేయబడిన ఆహ్నికకృత్యములు గల, మహామునిమ్ = మహాముని యైన, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని గూర్చి, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. అంతట, శత్రుసంహారదక్షు డగు రాముడు, ప్రశాంత మైన ప్రాతఃకాలమునందు, ఆహ్నికకృత్యము లన్నియు పూర్తి చేసికొని కూర్చున్న విశ్వామిత్రునితో ఇట్లనెను. 4

మూ. గతా భగవతీ రాత్రిః శ్రోతవ్యం పరమం శ్రుతమ్,
క్షణభూతేవ నౌ రాత్రిః సంవృత్తేయం మహాతపః. 5
ఇమాం చిన్తయతోః సర్వాం నిఖిలేన కథాం తవ.

ప్ర. అ. మహాతపః=గొప్ప తపస్సు కలవాడా ! పరమమ్=గొప్పదైన, శ్రోతవ్యమ్=వినదగినది, శ్రుతమ్ = వినబడినది. భగవతీ = పూజ్యురాలైన, రాత్రిః=రాత్రి, గతా=కడచినది. తవ=నీయొక్క, ఇమామ్=ఈ, సర్వామ్=సమస్త మైన, కథామ్=కథనుగూర్చి, చిన్తయతోః=ఆలోచించుచున్న, నౌ = మాఇద్దరికిని, ఇయమ్ = ఈ, రాత్రిః = రాత్రి, క్షణభూతేవ = ఒక్క క్షణ మాత్రము వలె, సంవృత్తా=కడచిపోయినది.

తా. ఓ మహాతపఃశాలీ ! వినదగిన గొప్ప ఉపాఖ్యానమును వింటిమి. పూజ్యురా లైన రాత్రి కడచినది. నీవు చెప్పిన ఈ కథ నంతను ఆలోచించు చుండగా, మా ఇద్దరికిని ఈ రాత్రి ఒక్క క్షణము వలె కడచిపోయినది. 5

మూ. తరామ సరితాం శ్రేష్ఠాం పుణ్యాం త్రిపథగాం నదీమ్, 6
నౌరేషా హి సుఖాస్తీర్ణా ఋషీణాం పుణ్యకర్మణామ్,
భగవన్తమిహ ప్రాప్తం జ్ఞాత్వా త్వరితమాగతా. 7

ప్ర. అ. సరితామ్ = నదులలో, శ్రేష్ఠామ్ = శ్రేష్ఠ మైన, పుణ్యామ్ = పుణ్యమైన, త్రిపథగామ్=మూడు మార్గములలో ప్రవహించు, నదీమ్=గంగా నదిని, తరామ=దాటుదము. సుఖాస్తీర్ణా=సుఖముగా కప్పబడిన, పుణ్యకర్మ ణామ్=పుణ్యకర్మ గల, ఋషీణామ్=ఋషులయొక్క, ఏషా=ఈ, నౌః=నావ, భగవన్తమ్ = పూజ్యుడ వైన నిన్ను, ఇహ = ఇచటికి, ప్రాప్తమ్ = వచ్చిన వానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, త్వరితమ్=శీఘ్రముగా, ఆగతా హి = వచ్చి యున్నది కదా.

తా. నదులలో శ్రేష్ఠ మైన, పుణ్య మైన, ఈ గంగానదిని దాటుదము. నీవు ఇచటికి వచ్చినట్లు తెలియగనే, ఈ పుణ్యాత్ము లైన ఋషీశ్వరుల నావను, చక్కగ మెత్తని చాప మొదలైనవాటిచే కప్పి తీసికొని వచ్చినారు. 6, 7

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రాఘవస్య మహాత్మనః,
సంతారం కారయామాస సర్షిసంఘః సరాఘవః. 8

ప్ర. అ. తస్య=ఆ, మహాత్మనః=మహాత్ముడైన, రాఘవస్య=రాముని యొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా=విని, సర్షిసంఘః = ఋషిసంఘముతో కూడినవాడై, సరాఘవః = రామలక్ష్మణులతో కూడినవాడై, సంతారం=దాటుటను, కారయామాస=చేయించెను.

తా. విశ్వామిత్రుడు మహాత్ము డైన రాముని మాటలు విని ఋషులతోను, రామలక్ష్మణులతోను తాను నదిని దాటుటకు ఏర్పాటు చేయించెను. 8

మూ. ఉత్తరం తీరమాసాద్య సంపూజ్యర్షిగణం తదా,
గఙ్గాకూలే నివిష్టాస్తే విశాలాం దదృశుః పురీమ్. 9

ప్ర. అ. ఉత్తరం తీరమ్=ఉత్తరమున నున్న ఒడ్డును, ఆసాద్య=పొంది, తదా=అప్పుడు, ఋషిగణమ్ = ఋషిసముదాయమును, సంపూజ్య=పూజించి, గఙ్గాకూలే = గంగాతీరమునందు, నివిష్టాః = విడిదిచేసియున్న, తే = వారు, విశాలాం పురీమ్=విశాల అను పురమును, దదృశుః=చూచిరి.

తా. ఉత్తరతీరమును చేరి, నావచే తమను దాటించిన ఋషులను పూజించి గంగాకూలమున విడిసి యున్న వారు విశాలానగరమును చూచిరి. 9

మూ. తతో మునివరస్తూర్ణం జగామ సహ రాఘవః,
విశాలాం నగరీం రమ్యాం దివ్యాం స్వర్గోపమాం తదా. 10

ప్ర. అ. తతః=పిమ్మట, మునివరః=మహాముని, సహ రాఘవః = రామలక్ష్మణులతో కూడినవాడై, తదా=అప్పుడు, రమ్యామ్ = సుందర మైనదియు, దివ్యామ్=ప్రకాశించుచున్నదియు, స్వర్గోపమామ్ = స్వర్గముతో సమాన మైనదియు అగు, విశాలానగరీమ్ = విశాల యనెడు నగరమును గూర్చి, తూర్ణమ్ = శీఘ్రముగా, జగామ=వెళ్లెను.

తా. పిమ్మట, విశ్వామిత్రుడు, రామలక్ష్మణసమేతుడై, రమ్యము, దివ్యము, స్వర్గతుల్యము అగు విశాలానగరమునకు శీఘ్రముగ వెళ్లెను. 10

మూ. అథ రామో మహాప్రాజ్ఞో విశ్వామిత్రం మహామునిమ్,
పప్రచ్ఛ ప్రాఞ్జలిర్భూత్వా విశాలాముత్తమాం పురీమ్. 11

ప్ర. అ. అథ = పిమ్మట, మహాప్రాజ్ఞః = గొప్ప బుద్ధిమంతు డైన, రామః = రాముడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలికలవాడు, భూత్వా = అయి, మహామునిమ్=మహాముని యైన, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని, ఉత్తమామ్ = ఉత్తమ మైన, విశాలాం పురీమ్=విశాలానగరమునుగూర్చి, పప్రచ్ఛ=అడిగెను.

తా. మహాబుద్ధిశాలి యగు రాముడు విశాలానగరమును గూర్చి విశ్వామిత్రుని సవినయముగ ప్రశ్నించెను. 11

మూ. కతరో రాజవంశోఽయం విశాలాయాం మహామునే,
శ్రోతుమిచ్ఛామి భద్రం తే పరం కౌతూహలం హి మే. 12

ప్ర. అ. మహామునే=ఓమహామునీ! విశాలాయామ్ = ఈవిశాలానగరమునందు, అయమ్=ఈ, రాజవంశః=రాజవంశము, కతరః=ఏది? శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = ఇచ్ఛయించుచున్నాను, తే = నీకు, భద్రమ్ = మంగళమగుగాక. మే=నాకు, పరమ్ = గొప్ప, కౌతూహలం హి=ఆసక్తి ఉన్నది కదా.

తా. మహామునీ! ఇపుడు ఈ విశాలానగరమును ఏ రాజవంశమునకు చెందిన వారు పాలించుచున్నారో వినగోరుచున్నాను. నాకు చాల వినవేడుకగా ఉన్నది. నీకు మంగళ మగుగాక. 12

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రామస్య మునిపుఙ్గవః,
ఆఖ్యాతుం తత్సమారేభే విశాలస్య పురాతనమ్. 13

ప్ర. అ. మునిపుఙ్గవః=మునిశ్రేష్ఠుడు, తస్య = ఆ, రామస్య = రాముని యొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా=విని, విశాలస్య = విశాలనగరముయొక్క, పురాతనమ్ = ప్రాచీన మైన, తత్ = ఆ ఆఖ్యానమును, ఆఖ్యాతుమ్=చెప్పుటకు, సమారేభే=ప్రారంభించెను.

తా. విశ్వామిత్రుడు రాముని వచనము విని ప్రాచీన మైన విశాలాపుర వృత్తాంతమును చెప్పుటకు ప్రారంభించెను. 13

మూ. శ్రూయతాం రామ శక్రస్య కథాం కథయతః శుభామ్,
అస్మిన్ దేశే తు యద్వృత్తం తదపి శృణు రాఘవ. 14

ప్ర. అ. రాఘవ=రామా! శక్రస్య=దేవేంద్రునియొక్క, శుభామ్ = శుభ మైన, కథామ్ = కథను, కథయతః = చెప్పుచున్న నానుండి, శ్రూయతామ్=విన బడుగాక, అస్మిన్ దేశే=ఈ దేశమునందు, యత్=ఏది, వృత్తమ్=జరిగినదో, తదపి = దానిని కూడ, శృణు = వినుము.

తా. రామా ! శుభ మైన దేవేంద్రుని కథ చెప్పెదను, వినుము. ఈ ప్రదేశములో ఏమి జరిగినదో వినుము. 14

మూ. పూర్వం కృతయుగే రామ దితేః పుత్రా మహాబలాః,
అదితేశ్చ మహాభాగ వీర్యవన్తః సుధార్మికాః. 15

ప్ర. అ. మహాభాగ=మహాభాగ్యవంతుడా ! రామ=రామా ! పూర్వమ్= పూర్వము, కృతయుగే=కృతయుగమునందు, దితేః=దితియొక్క, పుత్రాః= పుత్రులును, అదితేశ్చ = అదితియొక్క పుత్రులును, మహాబలాః = గొప్ప బలము కలవారుగను, వీర్యవన్తః = వీర్యవంతులుగను, సుధార్మికాః = చాల ధార్మికులుగను, ఉండెడివారు.

తా. మహాభాగ్యశాలి వగు రామా ! పూర్వము కృతయుగమునందు దితిపుత్రులును, అదితిపుత్రులును మహాబలవంతులై, వీర్యవంతులై, పరమ ధార్మికులై ఉండెడి వారు. 15

మూ. తతస్తేషాం నరశ్రేష్ఠ బుద్ధిరాసీన్మహాత్మనామ్,
అమరా అజరాశ్చైవ కథం స్యామ నిరామయాః. 16

ప్ర. అ. తతః=పిమ్మట, నరశ్రేష్ఠ=ఓ నరశ్రేష్ఠుడా, మహాత్మనామ్=మహాత్ములైన, తేషామ్=వారికి, అజరాః = ముసలితనము లేనివారమై, అమరాశ్చైవ=మరణము లేనివారమై, నిరామయాః=రోగములు లేనివారము, కథమ్=ఎట్లు, స్యామ=అగుదుము అని, బుద్ధిః=బుద్ధి, ఆసీత్=ఆయెను.

తా. నరశ్రేష్ఠుడవైన రామా! "మనకు ముసలితనము, మరణము, రోగములు లేకుండ ఉండవలెను. ఇందుకు ఉపాయ మేమి" అని ఆ మహాత్ములు ఆలోచింపసాగిరి. 16

మూ. తేషాం చిన్తయతాం రామ బుద్ధిరాసీన్మహాత్మనామ్,
క్షీరోదమథనం కృత్వా రసం ప్రాప్స్యామ తత్ర వై. 17

ప్ర. అ. రామ=రామా! చిన్తయతామ్=ఈ విధముగా ఆలోచించుచున్న, తేషామ్=ఆ, మహాత్మనామ్=మహాత్ములకు, బుద్ధిః=బుద్ధి, ఆసీత్ = కలిగెను. క్షీరోదమథనమ్=క్షీరసముద్రమథనమును, కృత్వా=చేసి, తత్ర=దానియందు, రసమ్=అమృతమును, ప్రాప్స్యామ=పొందెదము.

తా. ఈ విధముగ ఆలోచించగా ఆలోచించగా, వారికి, మనము క్షీర సముద్రమును మథించి, అచట అమృతమును పొందెదము" అను అభిప్రాయము కలిగినది. 17

మూ. తతో నిశ్చిత్య మథనం యోక్త్రం కృత్వా చ వాసుకిమ్,
మన్థానం మన్దరం కృత్వా మమన్థురమితౌజసః. 18

ప్ర. అ. తతః=పిమ్మట, అమితౌజసః=గొప్ప తేజస్సు గల ఆ దైత్యాదిత్యులు, మథనమ్=మథించుటను, నిశ్చిత్య=నిశ్చయించి, వాసుకిమ్=వాసుకిని, యోక్త్రమ్=త్రాడునుగా, కృత్వా = చేసి, మన్దరమ్=మందర పర్వతమును, మన్థానమ్=కవ్వమునుగా, కృత్వా=చేసి, మమన్థుః=మథించిరి.

తా. పిమ్మట, అమిత మైన తేజస్సు గల వారందరును మథనము చేయ వలె నని నిశ్చయించి, వాసుకిని త్రాడుగా చేసి, మందరపర్వతమును కవ్వముగా చేసి మథింపసాగిరి. 18

మూ. అథ వర్షసహస్రేణ యోక్త్రసర్పశిరాంసి చ,
వమన్త్యతివిషం తత్ర దదంశుర్దశనైః శిలాః. 19

ప్ర. అ. అథ = పిమ్మట, వర్షసహస్రేణ = వేయి సంవత్సరములకు, యోక్త్రసర్పశిరాంసి = త్రాడుగా ఉన్న సర్పముయొక్క శిరస్సులు, తత్ర= అచట, అతివిషమ్=అధిక మైన విషమును, వమన్తి=కక్కుచున్నవి. శిలాః= శిలలను, దశనైః=దంతముల చేత, దదంశుః=కరచినవి.

తా. పిమ్మట వేయి సంవత్సరములు గడచినవి. అపుడు త్రాడుగా ఉన్న వాసుకి శిరస్సులు విషమును కక్కుచు దంతములచే శిలలను కరవ ప్రారంభించినవి. 19

మూ. ఉత్పపాతాగ్నిసంకాశం హాలాహలమహావిషమ్,
తేన దగ్ధం జగత్సర్వం సదేవాసురమానుషమ్. 20

ప్ర. అ. అగ్నిసంకాశమ్ = అగ్నితో సమానమైన, హాలాహలమహావిషమ్=హాలాహల మనెడు మహావిషము, ఉత్పపాత=బయలుదేరెను. తేన= దానిచేత, సదేవాసురమానుషమ్=దేవాసురమనుష్యసహిత మైన, సర్వం జగత్= జగత్తు అంతయు, దగ్ధమ్=కాల్చబడినది.

తా. అగ్నితో సమాన మైన హాలాహలమహావిషము బయలుదేరి దేవాసురమనుష్యసహితముగా జగత్తు నంతను కాల్చివేయ మొదలిడినది. 20

మూ. అథ దేవా మహాదేవం శఙ్కరం శరణార్థినః,
జగ్ముః పశుపతిం రుద్రం త్రాహి త్రాహీతి తుష్టువుః. 21

ప్ర. అ. అథ=పిమ్మట, దేవాః = దేవతలు, శరణార్థినః = శరణము కోరుచు, మహాదేవమ్=గొప్ప దేవుడును, శంకరమ్ = సుఖమును కలిగించు

వాడును, పశుపతిమ్=సమస్తజీవులకు ప్రభువైనవాడును అగు, రుద్రమ్=రుద్రుని గూర్చి, జగ్ముః=వెళ్లిరి. త్రాహి త్రాహి=రక్షింపుము రక్షింపుము, ఇతి = అని, తుష్టువుః=స్తుతించిరి.

తా. అంత దేవత లందరును శరణువేడుచు మహాదేవుడును, సర్వజీవులకును పతియు అగు శంకరుని దగ్గరకు వెళ్లి "రక్షింపుము రక్షింపుము" అని పల్కుచు స్తుతించిరి. 21

మూ. ఏవముక్తస్తతో దేవైర్దేవదేవేశ్వరః ప్రభుః,
ప్రాదురాసీత్తతోఽత్రైవ శంఖచక్రధరో హరిః. 22

ప్ర. అ. తతః=పిమ్మట, ప్రభుః = ప్రభువైన, దేవదేవేశ్వరః = దేవదేవేశ్వరుడు, దేవైః=దేవతలచేత, ఏనమ్=ఈ విధముగ, ఉక్తః=పలకబడెను. తతః=పిమ్మట, శంఖచక్రధరః=శంఖచక్రములను ధరించిన, హరిః=విష్ణువు, అత్రైవ=ఇచటనే, ప్రాదురాసీత్=ప్రత్యక్ష మాయెను.

తా. దేవత లందరును సర్వరక్షణసమర్థు డగు ఆ దేవదేవేశ్వరునితో ఈ విధముగ పలికిరి. ఇంతలో శంఖచక్రధారి యైన హరి అచటనే ప్రత్యక్ష మాయెను. 22

మూ. ఉవాచైనం స్మితం కృత్వా రుద్రం శూలభృతం హరిః,
దైవతైర్మథ్యమానే తు యత్పూర్వం సముపస్థితమ్. 23

త్వదీయం హి సురశ్రేష్ఠ సురాణామగ్రజోఽసి యత్,
అగ్రపూజామిమాం మత్వా గృహాణేదం విషం ప్రభో. 24

ప్ర. అ. హరిః=విష్ణుమూర్తి, స్మితం కృత్వా = చిరునవ్వు నవ్వి, శూలభృతమ్=శూలమును ధరించిన, ఏనమ్=ఈ, రుద్రమ్ = రుద్రుని గూర్చి, ఉవాచ=పలికెను. సురశ్రేష్ఠ=దేవతలలో శ్రేష్ఠుడా! దైవతైః = దేవతలచేత, మథ్యమానే=మథనము చేయబడుచుండగా, యత్=ఏది, పూర్వమ్=ముందుగా, సముపస్థితమ్=వచ్చినదో, అది, త్వదీయం హి=నీది కదా. యత్=ఏ కారణము వలన, సురాణామ్=దేవతలలో, అగ్రజః= ముందు పుట్టినవాడవుగా, అసి=అయి

ఉన్నావో. ప్రభో=ఓ సమర్థుడా, ఇమామ్ = దీనిని, అగ్రపూజామ్ = అగ్ర పూజనుగా, మత్వా=తలచి, ఇదమ్ = ఈ, విషమ్ = విషమును, గృహాణ = గ్రహించుము.

తా. హరి చిరునవ్వు నవ్వుచు, శూలపాణి యైన శివునితో ఇట్లనెను. "ఓ సురశ్రేష్ఠుడా ! నీవు దేవత లందరికన్నను ముందు పుట్టినవాడవు. అందుచేత దేవతలు మథించుచున్నపుడు ముందుగ పుట్టినది నీకే చెందవలెను. కావున, ఓ సమర్థుడా ! దీనిని అగ్రపూజగా ఎంచి ఈ విషమును గ్రహింపుము." 23, 24

మూ. ఇత్యుక్త్వా చ సురశ్రేష్ఠస్తత్రైవాన్తరధీయత,
దేవతానాం భయం దృష్ట్వా శ్రుత్వా వాక్యం తు శార్ఙ్గిణః,
హాలాహలవిషం ఘోరం స జగ్రాహామృతోపమమ్. 25

ప్ర. అ. సురశ్రేష్ఠః = దేవతాశ్రేష్ఠుడైన విష్ణువు, ఇతి = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, తత్రైవ = అచటనే, అన్తరధీయత = అంతర్ధానము చెందెను. సః = ఆ శివుడు, దేవతానామ్ = దేవతలయొక్క, భయమ్ = భయమును, దృష్ట్వా = చూచి, శార్ఙ్గిణః = విష్ణువుయొక్క, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా= విని, ఘోరమ్ = భయంకర మైన, హాలాహలవిషమ్ = హాలాహలవిషమును, అమృతోపమమ్ = అమృతతుల్యమునుగా, జగ్రాహ = గ్రహించెను.

తా. విష్ణువు ఈ విధముగా పలికి అచటనే అంతర్ధానము చెందెను. శివుడు దేవతలకు కలిగిన భయమును చూచి, విష్ణువు చెప్పిన ప్రకారము, ఘోర మైన ఆ హాలాహలమును అమృతమును వలె గ్రహించెను. 25

మూ. దేవాన్విసృజ్య దేవేశో జగామ భగవాన్ హరః,
తతో దేవాసురాస్సర్వే మమన్థూ రఘునన్దన. 26

ప్ర. అ. దేవేశః = దేవతాప్రభు వైన, భగవాన్ = భగవంతు డైన, హరః=శివుడు, దేవాన్=దేవతలను, విసృజ్య=విడచి, జగామ=వెళ్లెను. రఘు నన్దన = రామా ! తతః = పిమ్మట, సర్వే = సమస్త మైన, దేవాసురాః=దేవత లును అసురులును, మమన్థుః = మథించిరి.

తా. రామా ! దేవాధిపతియు, భగవంతుడును అయిన శివుడు, దేవతలను వీడ్కొని వెళ్లిపోగా దేవాసురు లందరును మరల మథింపమొదలిడిరి. 26

మూ. ప్రవివేశాథ పాతాళం మన్థానః పర్వతోనఘ,
తతో దేవాః సగన్ధర్వాస్తుష్టువుర్మధుసూదనమ్. 27

ప్ర. అ. అనఘ = దోషములు లేనివాడా, అథ = పిమ్మట, మన్థానః పర్వతః = కవ్వముగా ఉన్న పర్వతము, పాతాళమ్ = పాతాళమును, ప్రవివేశ = ప్రవేశించెను. తతః = పిమ్మట, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలు, మధుసూదనమ్ = విష్ణువును, తుష్టువుః = స్తుతించిరి.

తా. ఎట్టి దోషములును లేని ఓ రామా ! కవ్వముగా ఉన్న ఆ పర్వతము పాతాళమును ప్రవేశించెను. పిమ్మట దేవతలును గంధర్వులును విష్ణువును స్తుతించిరి. 27

మూ. త్వం గతిః సర్వభూతానాం విశేషేణ దివౌకసామ్,
పాలయాస్మాన్మహాబాహో గిరిముద్ధర్తుమర్హసి. 28

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా ! త్వమ్ = నీవు, సర్వభూతానామ్ = అన్ని భూతములకును, గతిః = గతివి. విశేషేణ = ప్రధానముగా, దివౌకసామ్ = దేవతలకు గతివి. అస్మాన్ = మమ్ములను, పాలయ = పాలించుము. గిరిమ్ = పర్వతమును, ఉద్ధర్తుమ్ = ఎత్తుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ మహాబాహూ ! నీవే సర్వభూతములకును గతి యైనవాడవు. ప్రధానముగ దేవతలకు నీవే గతి. పర్వతము నెత్తి మమ్ము రక్షింపుము. 28

మూ. ఇతి శ్రుత్వా హృషీకేశః కామఠం రూపమాస్థితః,
పర్వతం పృష్ఠతః కృత్వా శిశ్యే తత్రోదధౌ హరిః. 29

ప్ర. అ. హృషీకేశః = ఇంద్రియములకు అధిపతి యైన (ప్రవర్తకు డైన), హరిః = విష్ణువు, ఇతి = ఈ వాక్యమును, శ్రుత్వా = విని, కామఠం రూపమ్ = తాబేలు రూపమును, ఆస్థితః = ధరించినవాడై, పర్వతమ్ = పర్వతమును,

పృష్ఠతః = వీపుపై, కృత్వా = ఉంచి, తత్ర = అచట, ఉదధౌ = సముద్రము నందు, శిశ్యే = శయనించెను.

తా. ఇంద్రియములకు శక్తిని కూర్చువాడగు హరి ఈ వాక్యమును విని, కూర్మరూపమును ధరించి, ఆ పర్వతమును వీపుపై మోయుచు సముద్రములో శయనించెను. 29

మూ. పర్వతాగ్రే తు లోకాత్మా హస్తేనాక్రమ్య కేశవః,
దేవానాం మధ్యతః స్థిత్వా మమన్థ పురుషోత్తమః. 30

ప్ర. అ. లోకాత్మా = సకలలోకస్వరూపుడైన; పురుషోత్తమః = పురుషులలో ఉత్తముడైన, కేశవః=విష్ణువు, దేవానామ్=దేవతలయొక్క, మధ్యతః= మధ్యయందు, స్థిత్వా = ఉండి, పర్వతాగ్రే = పర్వతముయొక్క అగ్రమునందు, హస్తేన = హస్తముచేత, ఆక్రమ్య = ఆక్రమించి, మమన్థ = మథించెను.

తా. సకలలోకాత్ముడును, పురుషోత్తముడును అగు ఆ కేశవుడు, తాను దేవతల మధ్య కూడ నిలచి, పర్వతాగ్రమును ఆన్చి పట్టుకొని మథించెను. 30

మూ. అథ వర్షసహస్రేణ సదణ్డః సకమణ్డలుః,
పూర్వం ధన్వన్తరిర్నామ అప్సరాశ్చ సువర్చసః. 31

ప్ర. అ. అథ = పిమ్మట, వర్షసహస్రేణ = వేయి సంవత్సరముల తరువాత, సదణ్డః = దండముతో కూడినవాడును, సకమణ్డలుః = కమండలముతో కూడినవాడును అగు, ధన్వన్తరిర్నామ = ధన్వంతరి అను నతడును, సువర్చసః = మంచి తేజస్సు గల, అప్సరాశ్చ = అప్సరలును, పూర్వమ్ = ముందుగా, (బైటకు వచ్చిరి).

తా. ఈ విధముగా వేయి సంవత్సరములు కడచినవి. అంతట ముందుగా, దండకమండలువులతో కూడిన ధన్వంతరియు, మంచి కాంతి గల అప్సరః స్త్రీలును బైటకు వచ్చిరి. 31

మూ. అప్సు నిర్మథనాదేవ రసాత్తస్మాద్వరస్త్రియః,
ఉత్పేతుర్మనుజశ్రేష్ఠ తస్మాదప్సరసోఽభవన్. 32

ప్ర. అ. మనుజశ్రేష్ఠ = మనుష్యులలో శ్రేష్ఠుడ వైన రామా, అప్సు = ఉదకమునందు, నిర్మథనాత్ = మథించుటవలన, తస్మాత్ = ఆ, రసాత్ = రసమునుండి, వరస్త్రియః = ఉత్తమ మైన స్త్రీలు, ఉత్పేతుః = బయలువెడలిరి. తస్మాత్ = ఆ కారణమువలన, అప్సరసః = అప్సరసలుగా, అభవన్ = అయిరి.

తా. మనుజశ్రేష్ఠుడ వైన రామా! జలమును మథించగా ఆ రసమునుండి ఆవిర్భవించుటచే ఆస్త్రీలకు అప్సరసలను పేరు వచ్చినది. 32

మూ. షష్టిః కోట్యోఽభవంస్తాసామప్సరాణాం సువర్చసామ్,
అసంఖ్యేయాస్తు కాకుత్స్థ యాస్తాసాం పరిచారికాః. 33.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! సువర్చసామ్=మంచి కాంతిగల, తాసామ్= ఆ, అప్సరాణామ్ = అప్సరస్త్రీల, షష్టిః కోట్యః = అరువది కోట్లు, అభవన్ = అయిరి. తాసామ్ = వారియొక్క, యాః = ఏ, పరిచారికాః = పరిచారికలు గలరో వారు, అసంఖ్యేయాః = లెక్కింపశక్యము కానివారు.

తా. రామా! మంచి కాంతి గల అరువది కోట్లమంది అప్సరస్త్రీలు పుట్టిరి. వారికి లెక్కింపశక్యము కాని పరిచారిక లుండిరి. 33

మూ. న తాః స్మ పరిగృహ్ణన్తి సర్వే తే దేవదానవాః,
అప్రతిగ్రహణాత్తాశ్చ సర్వాః సాధారణాః స్మృతాః. 34

ప్ర. అ. సర్వే = సమస్త మైన, తే = ఆ, దేవదానవాః = దేవదానవులు, తాః = ఆ స్త్రీలను, న పరిగృహ్ణన్తి స్మ = వివాహమాడ రైరి. అప్రతిగ్రహణాత్= వివాహమాడక పోవుటవలన, తాః = ఆ, సర్వాః = అందరును, సాధారణాః = సాధారణస్త్రీలుగా, స్మృతాః = చెప్పబడిరి.

తా. దేవదానవులలో ఎవ్వరును ఆ అప్సరసలను వివాహమాడ లేదు. అందుచే ఆ అప్సరసలు అందరికి సాధారణలు (వేశ్యలు) అని చెప్పబడుచున్నారు. 34

మూ. వరుణస్య తతః కన్యా వారుణీ రఘునన్దన,
ఉత్పపాత మహాభాగా మార్గమాణా పరిగ్రహమ్. 35.

ప్ర. అ. రఘునన్దన = రామా ! తతః = పిమ్మట, వరుణస్య = వరుణుని యొక్క, కన్యా = కన్యఅయిన, మహాభాగా = గొప్పభాగ్యము గల, వారుణీ= వారుణి (మదిర), పరిగ్రహమ్ = స్వీకారమును, మార్గమాణా = అన్వేషించుచు, ఉత్పపాత = బైటకువచ్చెను.

తా. రామా ! పిమ్మట వరుణుని కూతురును, మహాభాగ్యవతియు అగు వారుణి (మద్యదేవత) తనను ఎవరు స్వీకరించెదరా అని వెదకుకొనుచు బైటకు వచ్చెను. 35

మూ. దితేః పుత్రా న తాం రామ జగృహుర్వరుణాత్మజామ్,
అదితేస్తు సుతా వీర జగృహుస్తామనిన్దితామ్. 36

ప్ర. అ. రామ = రామా ! తామ్ = ఆ, వరుణాత్మజామ్ = వారుణిని, దితేః = దితియొక్క, పుత్రాః = పుత్రులు, న జగృహుః = స్వీకరించలేదు. వీర = ఓ వీరుడా ! అనిన్దితామ్ = దోషరహిత యైన, తామ్ = ఆమెను, అదితేః = అదితియొక్క, సుతాః తు = కుమారులైతే, జగృహుః = గ్రహించిరి.

తా. వీరుడ వైన రామా ! ఆ వారుణిని దైత్యులు స్వీకరించలేదు. కాని అనిందిత యగు ఆమెను అదితిపుత్రులు స్వీకరించిరి. 36

మూ. అసురాస్తేన దైతేయాః సురాస్తేనాదితేః సుతాః,
హృష్టాః ప్రముదితాశ్చాసన్ వారుణీగ్రహణాత్ సురాః. 37

ప్ర. అ. తేన=ఆ కారణముచేత, దైతేయాః=దితికుమారులు, అసురాః= అసురులు (సుర=మద్యము, లేనివారు) అయినారు. అదితేః = అదితియొక్క, సుతాః = కుమారులు, సురాః = సురులైనారు. సురాః = దేవతలు, వారుణీగ్రహణాత్ = వారుణిని స్వీకరించుటవలన, హృష్టాః = సంతసించినవారుగను, ఆసన్ = అయిరి.

తా. సురను గ్రహింపకపోవుటచే దైత్యులు అసురులైనారు; గ్రహించుటచే దేవతలు సురులైనారు. వారుణిని గ్రహించి సురులు సంతసించిరి; చాల ఆనందించిరి. 37

మూ. ఉచ్చైఃశ్రవా హయశ్రేష్ఠో మణిరత్నం చ కౌస్తుభమ్,
ఉదతిష్ఠన్నరశ్రేష్ఠ తథైవామృతముత్తమమ్. 38

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా, ఉచ్చైఃశ్రవాః = ఉచ్చైః శ్రవమను, హయశ్రేష్ఠః = శ్రేష్ఠ మైన అశ్వము, కౌస్తుభమ్ = కౌస్తుభమనెడు, మణిరత్నం చ = శ్రేష్ఠ మైన మాణిక్యము, తథైవ = మరియు, ఉత్తమమ్ = ఉత్తమ మైన, అమృతమ్=అమృతము, ఉదతిష్ఠన్ = బైటకు వచ్చినవి.

తా. రామా ! ఉచ్చైఃశ్రవ మనెడు శ్రేష్ఠ మైన అశ్వము, కౌస్తుభ మనెడు శ్రేష్ఠ మైన మాణిక్యము, ఉత్తమ మైన అమృతము కూడ బైటకు వచ్చినవి. 38

మూ. అథ తస్య కృతే రామ మహానాసీత్కులక్షయః,
అదితేస్తు తతః పుత్రా దితేః పుత్రానసూదయన్. 39

ప్ర. అ. రామ = రామా ! అథ = పిమ్మట, తస్య కృతే=ఆ అమృతము కొరకై, మహాన్ = గొప్ప, కులక్షయః=కులక్షయము, ఆసీత్=ఆయెను. తతః= పిమ్మట, అదితేః పుత్రాః=దేవతలు, దితేః పుత్రాన్=దైత్యులను, అసూదయన్= నశింపచేసిరి.

తా. రామా ! ఆ అమృతముకొరకై గొప్ప కులక్షయము జరిగినది. దేవతలు దైత్యులను చంపివేసిరి. 39

మూ. ఏకతోఽభ్యాగమన్ సర్వే హ్యసురా రాక్షసైః సహ,
యుద్ధమాసీన్మహాఘోరం వీర త్రైలోక్యమోహనమ్. 40

ప్ర. అ. వీర = ఓ వీరుడా ! సర్వే=సమస్త మైన, అసురాః=దైత్యులు, రాక్షసైః సహ = రాక్షసులతో కూడ, ఏకతః=ఒకవైపు, అభ్యాగమన్ = చేరిరి. త్రైలోక్యమోహనమ్ = మూడు లోకములను మోహపెట్టు, మహాఘోరమ్ = చాల భయంకర మైన, యుద్ధమ్ = యుద్ధము, ఆసీత్ = ఆయెను.

తా. దైత్యు లందరును, రాక్షసులును ఒక పక్షముగా చేరిరి. మూడు లోకములకు విభ్రాంతి కలిగించు అతిఘోర మైన యుద్ధము జరిగెను. 40

మూ. యదా క్షయం గతం సర్వం తదా విష్ణుర్మహాబలః,
అమృతం సోఽహరత్తూర్ణం మాయామాస్థాయ మోహినీమ్. 41

ప్ర. అ. యదా=ఎప్పుడు, సర్వమ్ = అంతయును, క్షయం గతమ్=క్షయమును పొందినదో, తదా=అప్పుడు, మహాబలః=గొప్ప బలము గల, సః విష్ణుః=ఆ విష్ణువు, మోహినీమ్=మోహినీరూప మగు, మాయామ్ = మాయను, ఆస్థాయ=అవలంబించి. తూర్ణమ్=శీఘ్రముగా, అమృతమ్ = అమృతమును, అహరత్=హరించెను.

తా. అంతయు క్షయ మైన తరువాత మహాబలు డైన విష్ణువు మాయా మోహినీరూపము ధరించి, శీఘ్రముగా అమృతమును హరించెను. 41

మూ. యే గతాభిముఖం విష్ణుమక్షయం పురుషోత్తమమ్,
సంపిష్టాస్తే తదా యుద్ధే విష్ణునా ప్రభవిష్ణునా. 42

ప్ర. అ. అక్షయమ్=నాశరహితుడును, పురుషోత్తమమ్=పురుషశ్రేష్ఠుడును అయిన, విష్ణుమ్=విష్ణువునుగూర్చి, యే=ఏ దైత్యులు, యుద్ధే=యుద్ధమునందు, అభిముఖమ్=ఎదురుగా, గతాః=వెళ్లినారో, తే = వారు, ప్రభవిష్ణునా = సమర్థు డైన, విష్ణునా=విష్ణువుచేత, సంపిష్టాః=నలిపివేయబడిరి.

తా. కొందరు దైత్యులు నాశరహితుడును, పురుషోత్తముడును అయిన విష్ణువును యుద్ధములో ఎదిరించగా వారి నందరిని సమర్థు డైన విష్ణువు సంహరించెను. 42

మూ. అదితేరాత్మజా వీరా దితేః పుత్రాన్నిజఘ్నిరే,
తస్మిన్ ఘోరే మహాయుద్ధే దైతేయాదిత్యయోర్భృశమ్. 43.

ప్ర. అ. దైతేయాదిత్యయోః = దైత్యులయొక్క దేవతలయొక్క, తస్మిన్=ఆ, ఘోరే=భయంకర మైన, మహాయుద్ధే = మహాయుద్ధమునందు, వీరాః=వీరు లైన, అదితేః ఆత్మజాః=అదితికుమారు లైన దేవతలు, దితేః పుత్రాన్=దితికుమారులను, నిజఘ్నిరే=చంపిరి.

తా. దైత్యులకును దేవతలకు జరిగిన ఆ ఘోరసంగ్రామమునందు వీరు లైన దేవతలు దైత్యులను చంపిరి. 43.

మూ. నిహత్య దితిపుత్రాంశ్చ రాజ్యం ప్రాప్య పురందరః,
శశాస ముదితో లోకాన్ సర్షిసంఘాన్ సచారణాన్. 44

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పంచచత్వారింశః సర్గః.

ప్ర. అ. పురందరః=దేవేంద్రుడు, దితిపుత్రాన్=దైత్యులను, నిహత్య=చంపి, రాజ్యమ్=రాజ్యమును, ప్రాప్య=పొంది, ముదితః=సంతోషించిన వాడై, సర్షిసంఘాన్=ఋషి సంఘములతో కూడిన, సచారణాన్=చారణులతో కూడిన, లోకాన్=లోకములను, శశాస=పరిపాలించెను.

తా. దేవేంద్రుడు దైత్యులను సంహరించి, రాజ్యమును పొంది, సంతోషించినవాడై, ఋషులు, చారణులు మొదలైన వారితో కూడిన లోకాలను పరిపాలించెను. 44

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో నలభైయైదవ సర్గ సమాప్తము.

అథ షట్చత్వారింశః సర్గః

మూ. హతేషు తేషు పుత్రేషు దితిః పరమదుఃఖితా,
మారీచం కాశ్యపం రామ భర్తారమిదమబ్రవీత్. 1

ప్ర. అ. రామ = రామా ! తేషు = ఆ, పుత్రేషు = పుత్రులు, హతేషు = చంపబడినవారగుచుండగా, దితిః = దితి, పరమదుఃఖితా = మిక్కిలి దుఃఖించినదై, భర్తారమ్ = భర్త యైన, మారీచమ్ = మరీచిపుత్రు డైన, కాశ్యపమ్ = కాశ్యపుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రామా ! ఈ విధముగ కుమారు లందరును చంపబడుట చూచి దితి చాల దుఃఖించుచు, మరీచి కుమారుడును, తన భర్తయు అగు కాశ్యపునితో ఇటనెను. 1

మూ. హతపుత్రాస్మి భగవంస్తవ పుత్రైర్మహాబలైః,
శక్రహన్తారమిచ్ఛామి పుత్రం దీర్ఘతపోర్జితమ్. 2

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! మహాబలైః = మహాబలు లైన, పుత్రైః = నీకుమారు లైన దేవతలచేత, హతపుత్రా = చంపబడిన పుత్రులు కలదానను, అస్మి = అయితిని. శక్రహన్తారమ్ = దేవేంద్రుని చంపగల, దీర్ఘతపోర్జితమ్ = దీర్ఘతపస్సుచేత బలము గల, పుత్రమ్ = పుత్రుని, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. భగవంతుడా ! మహాబలు లైన నీ కుమారు లైన దేవతలు నా పుత్రులను చంపివేసినారు. నాకు దీర్ఘతపస్సుచే బలము గలవాడును దేవేంద్రుని చంపగలవాడును అగు కుమారుడు కావలెను. 2

మూ. సాహం తపశ్చరిష్యామి గర్భం మే దాతుమర్హసి,
ఈశ్వరం శక్రహన్తారం త్వమనుజ్ఞాతుమర్హసి. 3

ప్ర. అ. సా అహమ్ = అట్టి నేను, తపః = తపస్సును, చరిష్యామి = ఆచరించెదను. త్వమ్ = నీవు, ఈశ్వరమ్ = లోకనాయకుడును, శక్రహ

స్తారమ్ = దేవేంద్రుని చంపువాడును అగు, గర్భమ్ = గర్భమును (పుత్రుని), మే = నాకు, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి = తగియున్నావు. అనుజ్ఞాతుమ్ = తపస్సుకై అనుజ్ఞ ఇచ్చుటకు, అర్హసి = తగి యున్నావు.

తా. నాకు లోకములకు నాయకుడును, ఇంద్రుని చంపువాడును అగు కుమారుని ఇమ్ము. నేను తపస్సు చేసెదను. అనుజ్ఞ ఇమ్ము. 3

మూ. తస్యా స్తద్వచనం శ్రుత్వా మారీచః కాశ్యప స్తదా,
ప్రత్యువాచ మహాతేజా దితిం పరమదుఃఖితామ్. 4

ప్ర. అ. తదా = అప్పుడు, మారీచః = మరీచియొక్క కుమారుడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును అగు, కాశ్యపః = కాశ్యపుడు, తస్యాః = ఆమెయొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, పరమదుఃఖితామ్ = మిక్కిలి దుఃఖించిన, దితిమ్ = దితిని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. మహాతేజశ్శాలి, మరీచికుమారుడును అయిన కాశ్యపుడు ఆమె వచనమును విని, అతిదుఃఖితురాలగు ఆమెతో ఇట్లనెను. 4

మూ. ఏవం భవతు భద్రం తే శుచిర్భవ తపోధనే,
జనయిష్యసి పుత్రం త్వం శక్రహన్తారమాహవే. 5

ప్ర. అ. తపోధనే = ఓ తపోధనురాలా ! ఏవమ్ = ఇట్లే, భవతు = అగుగాక. తే = నీకు, భద్రమ్ = క్షేమము (అగుగాక). శుచిః = పవిత్రురాలవు, భవ = అగుము. త్వమ్ = నీవు, ఆహవే = యుద్ధమునందు, శక్రహన్తారమ్ = దేవేంద్రుని చంప గల, పుత్రమ్ = పుత్రుని, జనయిష్యసి = కనగలవు.

తా. తపోధనురాలా ! అట్లే అగుగాక. నీకు క్షేమ మగు గాక. యుద్ధములో దేవేంద్రుని చంపగల కుమారుని కనగలవు. 5

మూ. పూర్ణే వర్షసహస్రే తు శుచిర్యది భవిష్యసి,
పుత్రం త్రైలోక్యభర్తారం మత్త స్త్వం జనయిష్యసి. 6

ప్ర. అ. త్వమ్ = నీవు, శుచిః = పవిత్రురాలవుగా, భవిష్యసి యది = ఉన్నట్లయితే, వర్షసహస్రే = వేయి సంవత్సరముల కాలము, పూర్ణే = నిండిన దగుచుండగా, మత్తః = నావలన, త్రైలోక్యభర్తారమ్ = మూడు లోకములకును ప్రభువైన, పుత్రమ్ = పుత్రుని, జనయిష్యసి = కనగలవు.

తా. నీవు పవిత్రముగా ఉన్నచో, వేయి వర్షములు నిండగనే, మూడు లోకములకును ప్రభు వైన కుమారుని నావలన కనగలవు. 6

మూ. ఏవముక్త్వా మహాతేజాః పాణినా స మమార్జ తామ్,
సమాలభ్య తతః స్వస్తీత్యుక్త్వా స తపసే యయౌ. 7

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః = ఆ కాశ్యపుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తామ్ = ఆమెను, పాణినా = హస్తముతో, మమార్జ = తుడిచెను. సమాలభ్య = స్పృశించి, తతః = పిమ్మట, స్వస్తి ఇతి = క్షేమ మగుగాక అని, ఉక్త్వా = పలికి, సః = అతడు, తపసే = తపస్సుకొరకు, యయౌ = వెళ్లెను.

తా. ఆ మహాతేజఃశాలి, ఈ విధముగా పలికి అదితిని హస్తముతో స్పృశించి, శరీర మంతయు తడవి క్షేమ మగుగాక అని పలికి తపస్సు చేసుకొనుటకై వెడలిపోయెను. 7

మూ. గతే తస్మిన్నరశ్రేష్ఠ దితిః పరమహర్షితా,
కుశప్లవనమాసాద్య తపస్తేపే సుదారుణమ్. 8

ప్ర. అ. నరశ్రేష్ఠ = ఓ నరశ్రేష్ఠుడా ! తస్మిన్ = ఆ కాశ్యపుడు, గతే సతి = వెళ్లగా, దితిః = దితి, పరమహర్షితా = చాల సంతోషించినదై, కుశప్లవనమ్ = కుశప్లవన మను క్షేత్రమును, ఆసాద్య = పొంది, సుదారుణమ్ = చాల తీవ్ర మైన, తపః = తపస్సును, తేపే = చేసెను.

తా. రామా ! ఆ మహర్షి వెళ్లిన తరువాత, దితి చాల సంతసించి, కుశప్లవన మనెడు క్షేత్రము చేరి అతితీవ్ర మైన తపస్సు చేసెను. 8

మూ. తపస్తస్యాం హి కుర్వన్త్యాం పరిచర్యాం చకార హ,
సహస్రాక్షో నరశ్రేష్ఠ పరయా గుణసంపదా. 9

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా ! తస్యామ్ = ఆమె, తపః చరన్త్యామ్ = తపస్సు చేయుచుండగా, సహస్రాక్షః = దేవేంద్రుడు, పరయా = గొప్ప, గుణసంపదా = గుణసంపదతో, పరిచర్యామ్ = సేవను, చకార హ = చేసెను.

తా. రామా ! ఆమె తపస్సు చేయుచున్నప్పుడు దేవేంద్రుడు ఉత్తమమైన గుణసంపదతో సేవ చేసెను. 9

మూ. అగ్నిం కుశాన్ కాష్ఠమపః ఫలం మూలం తథైవ చ,
న్యవేదయత్సహస్రాక్షో యచ్చాన్యదపి కాంక్షితమ్. 10

ప్ర. అ. సహస్రాక్షః = దేవేంద్రుడు, అగ్నిమ్ = అగ్నిని, కుశాన్ = కుశలను, కాష్ఠమ్ = కట్టెలను, అపః = ఉదకమును, ఫలమ్ = ఫలమును, తథైవ చ = మరియు, మూలమ్ = దుంపలను, కాఙ్క్షితమ్ = కోరబడిన, అన్యత్ = ఇతర మైనది, యచ్చ = ఏది యుండునో, దానిని, న్యవేదయత్ = ఆమెకు సమకూర్చెను.

తా. దేవేంద్రుడు అగ్ని, కుశములు, సమిధలు, ఉదకము, ఫలములు, మూలములు, మొదలైన కావలసిన పదార్థముల నన్నింటిని ఆమెకు సమకూర్చుచు సేవ చేయుచుండెను. 10

మూ. గాత్రసంవహనైశ్చైవ శ్రమాపనయనైస్తథా,
శక్రః సర్వేషు కాలేషు దితిం పరిచచార హ. 11

ప్ర. అ. శక్రః = దేవేంద్రుడు, గాత్రసంవహనైః చ ఏవ = ఒళ్లు పట్టుట చేతను, తథా = మరియు, శ్రమాపనయనైః = శ్రమను తొలగించుటచేతను, సర్వేషు కాలేషు = సమస్తకాలములందును, దితిమ్ = దితిని, పరిచచార హ = ఉపచరించెను.

తా. ఒడలు పట్టుట, శ్రమ దీర్చుట మొదలగు పనులు చేయుచు దేవేంద్రుడు అన్ని కాలములందును దితికి ఉపచారములు చేసెను. 11

మూ. అథ వర్షసహస్రే తు దశోనే రఘునన్దన,
దితిః పరమసంప్రీతా సహస్రాక్షమథాబ్రవీత్. 12

ప్ర. అ. రఘునన్దన = రామా ! అథ = పిమ్మట, వర్షసహస్రే=వేయి సంవత్సరముల కాలము, దశోనే=పది తక్కువగా ఉండగా, దితిః=దితి, పరమ సంప్రీతా=చాల సంతసించినదై, సహస్రాక్షమ్=దేవేంద్రుని గూర్చి, అబ్రవీత్= పలికెను.

తా. రామా ! ఈ విధముగ తొమ్మిదివందలతొంభై సంవత్సరములు గడ చినవి. అపుడు దితి చాల సంతసించినదై దేవేంద్రునితో ఇట్లు పలికెను. 12

మూ. యాచితేన సురశ్రేష్ఠ తవ పిత్రా మహాత్మనా,
వరో వర్షసహస్రాన్తే దత్తో మమ సుతం ప్రతి. 13

ప్ర. అ. సురశ్రేష్ఠ = ఓ దేవతాశ్రేష్ఠుడా ! యాచితేన = కోరబడిన, మహాత్మనా = మహాత్ముడైన, తవ = నీయొక్క, పిత్రా = తండ్రిచేత, వర్ష సహస్రాన్తే=వేయిసంవత్సరముల అంతమున, సుతం ప్రతి = కుమారుని గూర్చి, మమ = నాకు, వరః=వరము, దత్తః = ఇవ్వబడినది.

తా. దేవతలలో శ్రేష్ఠుడవైన ఓ ఇంద్రుడా ! నేను కోరగా, నీ తండ్రి, వేయి సంవత్సరముల తరువాత కుమారుడు కలుగగలడని నాకొక వరము నిచ్చెను. 13

మూ. తపశ్చరన్త్యా వర్షాణి దశ వీర్యవతాం వర
అవశిష్టాని భద్రం తే భ్రాతరం ద్రక్ష్యసే తతః. 14

ప్ర. అ. వీర్యవతామ్ = పరాక్రమవంతులలో, వర=శ్రేష్ఠుడవైన ఓ ఇంద్రా ! తపః=తపస్సు, చరన్త్యాః = ఆచరించుచున్న నాకు, దశ = పది, వర్షాణి = సంవత్సరములు, అవశిష్టాని = మిగిలినవి. తతః = అటుపిమ్మట, భ్రాతరమ్=సోదరుని, ద్రక్ష్యసే=చూడగలవు. తే=నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. వీర్యవంతులలో శ్రేష్ఠుడవైన ఓ దేవేంద్రా ! నేను తపస్సు చేయ ప్రారంభించిన తరువాత వేయి సంవత్సరములు పూర్తి అగుటకు ఇంకను పది సంవత్సరములు ఉన్నవి. పది సంవత్సరముల తరువాత సోదరుని చూడగలవు. నీకు శుభమగుగాక. 14

మూ. తమహం త్వత్కృతే పుత్ర సమాధాస్యే జయోత్సుకమ్,
త్రైలోక్యవిజయం పుత్ర సహ భోక్ష్యసి విజ్వరః. 15

ప్ర. అ. పుత్ర=కుమారా! తమ్=అతనిని, త్వత్కృతే = నీకొరకై, జయోత్సుకమ్ = జయమునందు వేడుక కలవానినిగా, సమాధాస్యే = చేయ గలను. పుత్ర = కుమారా! విజ్వరః = దుఃఖము లేని వాడవై, త్రైలోక్య విజయమ్ = మూడు లోకముల విజయమును, సహ భోక్ష్యసి = కలిసి అనుభవింపగలవు.

తా. కుమారా! నీకొరకై అతని యందు జయాభిలాషను కలిగించెదను. నీవు అతనితో కలిసి, ఎట్టి బాధలును లేక, మూడు లోకములను జయించి ఆ విజయానందమును అనుభవింపగలవు. 15

మూ. ఏవముక్త్వా దితిః శక్రం ప్రాప్తే మధ్యం దివాకరే,
నిద్రయాపహృతా దేవీ పాదౌ కృత్వాథ శీర్షతః. 16

ప్ర. అ. దితిః దేవీ=దితిదేవి, శక్రమ్=దేవేంద్రుని గూర్చి, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, దివాకరే = సూర్యుడు, మధ్యమ్ = ఆకాశ మధ్యమును, ప్రాప్తే = పొందినవాడగుచుండగా, అథ = పిమ్మట, పాదౌ = పాదములను, శీర్షతః = శిరస్సు వైపు, కృత్వా = చేసి, (ఉంచి), నిద్రయా= నిద్రచేత, అవహృతా = అపహరింపబడినది.

తా. దితిదేవి దేవేంద్రునితో ఇట్లు పలికి మధ్యాహ్నసమయమునందు, తల వైపు పాదము లుంచుకొని నిద్రాపరవశ ఆయెను.

వి. ఎక్కువ నిద్ర రాగా ముందుకు వంగుటచే శిరస్సు పాదములకు తగిలి అపరిశుద్ధురాలయ్యె నని కొందరు వ్యాఖ్యాతలును, శయ్యపై తలవైపు కాళ్లు పెట్టుకొని నిద్రించుటచే అట్లయ్యె నని కొందరును, మధ్యాహ్నసమయమున వ్రతమును మరచి నిద్రించుటచే అట్లయ్యె నని కొందరును వ్యాఖ్యానించిరి. 16

మూ. దృష్ట్వా తామశుచిం శక్రః పాదతః కృతమూర్ధజామ్,
శిరఃస్థానే కృతౌ పాదౌ జహాస చ ముమోద చ. 17

ప్ర. అ. శక్రః = దేవేంద్రుడు, పాదతః = పాదముల వైపు, కృతమూర్ధజామ్ = ఉంచబడిన కేశములు గల, అశుచిమ్ = అపవిత్రురాలైన, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, శిరఃస్థానే = శిరస్సు ఉంచు స్థానమునందు, కృతౌ = ఉంచబడిన, పాదౌ = పాదములను, (చూచి), జహాస = నవ్వెను. ముమోద చ = ఆనందించెను కూడ.

తా. శిరఃస్థానమునందు పాదము లుంచి, పాదములపై కేశములు పడునట్లు వంగి నిద్రించుచున్న అపరిశుద్ధురాలగు ఆమెను చూచి, దేవేంద్రుడు ఆనందముతో నవ్వుకొనెను. 17

మూ. తస్యాః శరీరవివరం వివేశ చ పురందరః,
గర్భం చ సప్తధా రామ బిభేద పరమాత్మవాన్. 18

ప్ర. అ. రామ = రామా ! పురన్దరః = ఇంద్రుడు, తస్యాః = ఆమెయొక్క, శరీరవివరమ్ = శరీరరంధ్రమును, వివేశ చ = ప్రవేశించెను. పరమ్ = మిక్కిలి, ఆత్మవాన్ = బుద్ధిగల (ధైర్యముగల) ఆతడు, గర్భమ్ = గర్భమును, సప్తధా = ఏడు విధములుగా, బిభేద = భేదించెను.

తా. రామా ! మిక్కిలి ధైర్యము గల ఆ ఇంద్రుడు ఆమె శరీరవివరమును ప్రవేశించి, గర్భమును ఏడు ముక్కలుగ ఖండించెను. 18

మూ. భిద్యమానస్తతో గర్భో వజ్రేణ శతపర్వణా,
రురోద సుస్వరం రామ తతో దితిరబుధ్యత. 19

ప్ర. అ. రామ = రామా ! తతః = పిమ్మట, శతపర్వణా = నూరు అంచులు గల, వజ్రేణ = వజ్రముచేత, భిద్యమానః = ఖండింపబడుచున్న, గర్భః = గర్భము, సుస్వరమ్ = అధికమైన స్వరము కలుగునట్లుగా, రురోద = ఏడ్చెను. తతః = పిమ్మట, దితిః = దితి, అబుధ్యత = లేచెను.

తా. రామా ! నూరంచులు గల వజ్రముచే ఖండింపబడిన ఆ గర్భము బిగ్గరగా ఏడ్చెను. దితి మేల్కొనెను. 19

మూ. మా రుదో మా రుదశ్చేతి గర్భం శక్రోఽభ్యభాషత,
బిభేద చ మహాతేజా రుదన్తమపి వాసవః. 20

ప్ర. అ. మా రుదః=ఏడవకుము, మా రుదః=ఏడవకుము, ఇతి=అని, శక్రః = దేవేంద్రుడు, గర్భమ్ = గర్భమును, అభ్యభాషత = పలికెను. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, వాసవః = దేవేంద్రుడు, రుదన్తమపి = ఏడ్చుచున్నను, బిభేద చ = భేదించెను కూడ.

తా. మహాతేజస్సు గల ఆ దేవేంద్రుడు ఏడ్చుచున్న ఆ గర్భమును "ఏడవకుము, ఏడవకుము" అని అనుచునే భేదించెను. 20

మూ. న హన్తవ్యో న హన్తవ్య ఇత్యేవం దితిరబ్రవీత్,
నిష్పపాత తతః శక్రో మాతుర్వచనగౌరవాత్. 21

ప్ర. అ. దితిః = దితి, న హన్తవ్యః న హన్తవ్యః = చంపదగదు చంపదగదు, ఇత్యేవమ్=అని, అబ్రవీత్=పలికెను. తతః = పిమ్మట, శక్రః = దేవేంద్రుడు, మాతుః వచనగౌరవాత్ = తల్లియొక్క వచనమునందు గౌరవము వలన, నిష్పపాత=బైటకు వచ్చెను.

తా. ''చంపవదు చంపవదు'' అని దితి పలుకగా, తల్లి మాటపై గౌరవముచే దేవేంద్రుడు బైటకు వచ్చెను. 21

మూ. ప్రాంజలిర్వజ్రసహితో దితిం శక్రోఽభ్యభాషత,
అశుచిర్దేవి సుప్తాసి పాదయోః కృతమూర్ధజా. 22

ప్ర. అ. వజ్రసహితః = వజ్రసహితుడైన, శక్రః=ఇంద్రుడు, ప్రాంజలిః = దోసిలి ఒగ్గినవాడై, దితిమ్ = దితిని గూర్చి, అభ్యభాషత = పలికెను. దేవి=ఓ దేవీ ! పాదయోః=పాదములపై, కృతమూర్ధజా=ఉంచబడిన కేశములు కలదానవై, అశుచిః=అపవిత్రురాలవై, సుప్తా అసి=నిద్ర పోతివి.

తా. వజ్రమును ధరించిన ఇంద్రుడు దితితో ఇట్లు పలికెను. "ఓ దేవీ ! నీవు కేశములు పాదములకు తగులునట్లుగా పరుండి నిద్రించితివి. 22

మూ. తదన్తరమహం లబ్ధ్వా శక్రహన్తారమాహవే,
అభిదం సప్తధా దేవి తన్మే త్వం క్షన్తుమర్హసి. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షట్చత్వారింశః సర్గః.

ప్ర. అ. అహమ్ = నేను, తత్ = ఆ, అన్తరమ్ = అవకాశమును, లబ్ధ్వా=పొంది, ఆహవే=యుద్ధమునందు, శక్రహన్తారమ్=ఇంద్రుని చంపనున్న వానిని, సప్తధా=ఏడు ఖండములుగా, అభిదమ్=భేదించితిని. దేవి=ఓ దేవీ! మే=నాయొక్క, తత్=ఆ కార్యమును, త్వమ్=నీవు, క్షన్తుమ్=క్షమించుటకు, అర్హసి=తగియున్నావు.

తా. ఆ అవకాశమును చూచుకొని నేను, యుద్ధములో నన్ను సంహరింప నున్న ఆ పిల్లవానిని ఏడు ముక్కలుగా ఖండించితిని. ఇందులకు నన్ను క్షమింపుము. 23

"బాలానన్దిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండములో
నలభైఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తచత్వారింశః సర్గః

మూ. సప్తధా తు కృతే గర్భే దితిః పరమదుఃఖితా,
సహస్రాక్షం దురాధర్షం వాక్యం సానునయాఽబ్రవీత్. 1

ప్ర. అ. గర్భే=గర్భము, సప్తధా=ఏడు ముక్కలుగా, కృతే=చేయబడిన దగుచుండగా, దితిః = దితి, పరమదుఃఖితా = మిక్కిలి దుఃఖించినదై, దురాధర్షమ్ = ఎదిరింప శక్యముకాని, సహస్రాక్షమ్ = దేవేంద్రుని గూర్చి, సానునయా = అనునయముతో కూడినదై, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఈ విధముగ గర్భము ఏడు ముక్కలుగ ఖండింపబడినందులకు దుఃఖించుచు దితి, ఎదిరింప శక్యము కానివాడైన దేవేంద్రునితో అనునయపూర్వకముగా ఇట్లు పలికెను. 1

మూ. మమాపరాధాద్గర్భోఽయం సప్తధా విఫలీకృతః,
నాపరాధోఽస్తి దేవేశ తవాత్ర బలసూదన. 2

ప్ర. అ. బలసూదన = బలాసురుని సంహరించిన, దేవేశ = దేవేంద్రా! మమ = నాయొక్క, అపరాధాత్ = అపరాధమువలన, అయమ్ = ఈ, గర్భః = గర్భము, సప్తధా = ఏడు భాగములుగా, విఫలీకృతః = వ్యర్థము చేయబడినది. అత్ర = ఈ విషయమున, తవ = నీయొక్క, అపరాధః = అపరాధము, నాస్తి = లేదు.

తా. బలాసురుని సంహరించిన ఓ దేవేంద్రా! నా అపరాధముచేతనే నా గర్భము ఏడు ముక్కలు చేయబడి వ్యర్థమైనది. ఇందులో నీ అపరాధము లేదు. 2

మూ. ప్రియం తు కర్తుమిచ్ఛామి మమ గర్భవిపర్యయే,
మరుతాం సప్త సప్తానాం స్థానపాలా భవన్త్విమే. 3

ప్ర. అ. గర్భవిపర్యయే=గర్భమునకు కలిగిన ఈ ఆపద విషయమున, మమ = నాకు, ప్రియమ్=ప్రియము, కర్తుమ్ = చేయుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. ఇమే = ఈ, సప్త=ఏడు ఖండములు, సప్తానామ్ = ఏడుగురైన, మరుతామ్=మరుత్తుల, స్థానపాలాః=స్థానపాలకులుగా, భవన్తు=అగుగాక.

తా. గర్భము విషయమున అనుకున్న దానికి వ్యతిరేకముగ జరిగినది. అందుచే నీవు నాకొక ప్రియమును చేయవలె నని కోరుచున్నాను. ఈ గర్భ ఖండములు ఏడును ఏడు మారుతస్థానములకు పాలకు లగు గాక.

వి. అంతరిక్షమునందు ఆవహ—ప్రవహ—సంవహ — ఉద్వహ—వివహ—పరివహ—పరావహము లనే ఏడు వాతస్కంధములున్న వనియు అవి నక్షత్ర మండలాదులకు ఆధారములై ఉన్న వనియు పౌరాణిక సంప్రదాయము. 3

మూ. వాతస్కంధా ఇమే సప్త చరన్తు దివి పుత్రక,
మారుతా ఇతి విఖ్యాతా దివ్యరూపా మమాత్మజాః. 4

ప్ర. అ. పుత్రక=కుమారుడా! సప్త=ఏడుగురైన, ఇమే=ఈ, మమ=నాయొక్క, ఆత్మజాః=కుమారులు, దివ్యరూపాః = దివ్య రూపములు కలవారై, వాతస్కంధాః = వాతస్కంధములకు అధిష్ఠానదేవతలై, మారుతాః ఇతి = మారుతులు అని, విఖ్యాతాః=ప్రసిద్ధులై, దివి = అంతరిక్షమునందు, చరన్తు = సంచరింతురుగాక.

తా. కుమారా! నా ఏడుగురు కుమారులును దివ్యరూపములు ధరించి, వాతస్కంధములకు అధిష్ఠానదేవతలై, మారుతు లను పేరుతో అంతరిక్షము నందు సంచరించెదరు గాక. 4

మూ. బ్రహ్మలోకం చరత్వేక ఇన్ద్రలోకం తథాపరః,
దివి వాయురితి ఖ్యాత స్తృతీయోఽపి మహాయశాః. 5

ప్ర. అ. ఏకః=ఒకడు, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును (నందు), చరతు=సంచరించుగాక. తథా=అట్లే, అపరః=మరియొకడు, ఇన్ద్రలోకమ్=ఇంద్రలోకమునందును, మహాయశాః=గొప్పకీర్తిగల, తృతీయోఽపి=మూడవ

వాడు కూడ, వాయురితి=వాయువు అని, ఖ్యాతః=ప్రసిద్ధుడై, దివి=అంతరిక్షము నందు, తిరుగుగాక.

తా. వీరిలో ఒకడు బ్రహ్మలోకమునందును, ఒకడు ఇంద్రలోకము నందును, మహాకీర్తిశాలి యగు మూడవవాడు వాయు వను పేరుతో అంతరిక్షము నందును సంచరించుగాక. 5

మూ. చత్వారస్తు సురశ్రేష్ఠ దిశో వై తవ శాసనాత్,
సంచరిష్యన్తి భద్రం తే దేవభూతా మమాత్మజాః. 6

ప్ర. అ. సురశ్రేష్ఠ=దేవతలలో శ్రేష్ఠుడ వైన ఇంద్రా ! చత్వారః= నలుగురు, మమ ఆత్మజాః=నా కుమారులు, తవ=నీయొక్క, శాసనాత్ = ఆజ్ఞవలన, దేవభూతాః=దేవతలుగా అయి, దిశః=దిక్కులను, సంచరిష్యన్తి= సంచరింపగలరు.

తా. ఓ దేవేంద్రా ! మిగిలిన నా నలుగురు కుమారులు నీ ఆజ్ఞ ప్రకారము దేవతలై, నాలుగు దిక్కులందును సంచరింతురు గాక. 6

మూ. త్వత్కృతేనైవ నామ్నా చ మారుతా ఇతి విశ్రుతాః.

ప్ర. అ. త్వత్కృతేనైవ=నీచేతనే చేయబడిన, నామ్నా = పేరుతో, మారుతాః ఇతి = మారుతులు అని, విశ్రుతాః = ప్రసిద్ధి పొందినవా రగుదురు గాక.

తా. నీవు ఖండించుచున్నప్పుడు వీళ్లు ఏడ్చుచుండగా 'మా రుదః' (ఏడ్వకుము) అని నీవు అని ఉంటివి. అందుచే అదే పేరుతో వీరు 'మారుత' అని ప్రసిద్ధి చెందగలరు.

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా సహస్రాక్షః పురన్దరః,
ఉవాచ ప్రాంజలిర్వాక్యం దితిం బలనిషూదనః. 7

ప్ర. అ. సహస్రాక్షః=వేయి నేత్రములు గలవాడును, బలనిషూదనః= బలాసురుని సంహరించినవాడును అగు, పురన్దరః=దేవేంద్రుడు, తస్యాః=ఆమె

యొక్క, తత్=ఆ, వచనమ్=వాక్యమును, శ్రుత్వా = విని, ప్రాఞ్జలిః=కట్ట బడిన దోసిలి కలవాడై, దితిమ్=దితిదేవిని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. బలాసురసంహారియు, సహస్రాక్షుడును అగు దేవేంద్రుడు ఆ దితి వాక్యములు విని, దోసిలి ఒగ్గి నమస్కరించుచు ఇట్లనెను. 7

మూ. సర్వమేతద్యథోక్తం తే భవిష్యతి న సంశయః, 8
విచరిష్యన్తి భద్రం తే దేవభూతా స్తవాత్మజాః.

ప్ర. అ. తే=నీకు (నీచేత), యథా=ఏ విధముగా, ఉక్తమ్=చెప్ప బడినదో, ఏతత్=ఇది, సర్వమ్=అంతయు, భవిష్యతి=కాగలదు. సంశయః= సంశయము, న=లేదు. తవ=నీయొక్క, ఆత్మజాః = కుమారులు, దేవ భూతాః=దేవతలై, విచరిష్యన్తి=సంచరించగలరు. తే=నీకు, భద్రమ్= మంగళము అగు గాక.

తా. అంతయు నీవు చెప్పిన విధముననే జరుగగలదు. సంశయము లేదు. నీ కుమారులు దేవతలై సంచరించగలరు. నీకు క్షేమ మగుగాక. 8

మూ. ఏవం తౌ నిశ్చయం కృత్వా మాతాపుత్రౌ తపోవనే, 9
జగ్మతుస్త్రిదివం రామ కృతార్థావితి నః శ్రుతమ్.

ప్ర. అ. రామ = శ్రీరామా! తౌ = ఆ, మాతాపుత్రౌ = తల్లియు కుమారుడును, తపోవనే = తపోవనమునందు, ఏవమ్=ఈ విధముగా, నిశ్చ యమ్=నిశ్చయమును, కృత్వా=చేసి, కృతార్థౌ=కృతార్థులై, దివమ్= స్వర్గమును గూర్చి, జగ్మతుః=వెళ్లిరి. ఇతి=ఈ విధముగ, నః=మాకు (మాచేత) శ్రుతమ్=వినబడినది.

తా. శ్రీరామా! ఆ తల్లియు కుమారుడును, తపోవనమునందు ఈ విధముగ నిశ్చయము చేసి, కృతార్థులై, స్వర్గమునకు వెళ్లి రని విని యున్నాము. 9

మూ. ఏష దేశస్స కాకుత్స్థ మహేంద్రాధ్యుషితః పురా, 10
దితిం యత్ర తపఃసిద్ధామేవం పరిచచార సః.

ప్ర. అ. కాకుత్స్థ = శ్రీరామా ! ఏషః = ఇది, పురా = పూర్వము, మహేన్ద్రాధ్యుషితః = మహేంద్రునిచే అధిష్ఠింపబడిన (మహేంద్రుడు నివసించిన), సః = ఆ, దేశః = దేశము. యత్ర = ఎచట, సః = ఆతడు, తపఃసిద్ధామ్ = తపస్సునందు ప్రసిద్ధురా లగు, దితిమ్ = దితిని, ఏవమ్ = ఈ విధముగా, ఉప చచార = ఉపచరించెనో.

తా. రామా ! పూర్వము మహేంద్రుడు నివసించిన ఆ దేశ మిదియే. ఇచటనే దితి తపస్సు చేయుచుండగా ఆతడు ఆమెకు ఉపచారములు చేసెను. 10

మూ. ఇక్ష్వాకోస్తు నరవ్యాఘ్ర పుత్రః పరమధార్మికః, 11
అలంబుసాయాముత్పన్నో విశాల ఇతి విశ్రుతః,
తేన చాసీదిహ స్థానే విశాలేతి పురీ కృతా. 12

ప్ర. అ. నరవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడ వైన శ్రీరామా ! ఇక్ష్వాకోః = ఇక్ష్వాకువునకు, అలంబుసాయామ్ = అలంబుసయందు, పరమధార్మికః = ఎక్కువ ధార్మికుడును, విశాల ఇతి = విశాలు డని, విశ్రుతః = ప్రసిద్ధి పొందిన వాడును అగు, పుత్రః = పుత్రుడు, ఉత్పన్నః = పుట్టినాడు. తేన = ఆతనిచేత, ఇహ = ఈ, స్థానే = స్థానమునందు, విశాలేతి = విశాల అను, పురీ = పట్టణము, కృతా = చేయబడినది, ఆసీత్ = ఆయెను.

తా. రామా ! ఇక్ష్వాకునకు అలంబుసయందు జనించిన విశాలు డనే పరమధార్మికు డైన కుమారుడు, ఈ ప్రదేశమునందు విశాల అను పురిని నిర్మించెను. 11, 12

మూ. విశాలస్య సుతో రామ హేమచన్ద్రో మహాబలః,
సుచంద్ర ఇతి విఖ్యాతః హేమచంద్రాదనన్తరః. 13

ప్ర. అ. రామ = రామా, మహాబలః = మహాబలశాలి యగు, హేమచన్ద్రః = హేమచంద్రుడు, విశాలస్య = విశాలునియొక్క, సుతః = కుమారుడు. హేమచన్ద్రాత్ = హేమచంద్రునికంటె, అనన్తరః = తరువాతివాడు, సుచన్ద్ర ఇతి = సుచంద్రు డని, విఖ్యాతః = ప్రసిద్ధుడు.

తా. రామా ! మహాబలశాలి యగు హేమచంద్రుడు విశాలుని కుమారుడు. హేమచంద్రుని తరవాత (అతని కుమారుడు), సుచంద్రు డని ప్రసిద్ధి చెందెను. 13

మూ. సుచంద్రతనయో రామ ధూమ్రాశ్వ ఇతి విశ్రుతః,
ధూమ్రాశ్వతనయశ్చాపి సృంజయః సమపద్యత. 14

ప్ర. అ. రామ = రామా, సుచన్ద్రతనయః = సుచంద్రుని కుమారుడు, ధూమ్రాశ్వ ఇతి = ధూమ్రాశ్వు డని, విశ్రుతః=ప్రసిద్ధి పొందెను. సృఞ్జయః= సృంజయు డనెడు వాడు, ధూమ్రాశ్వతనయః = ధూమ్రాశ్వుని కుమారుడుగా, సమపద్యత = జనించెను.

తా. రామా ! సుచంద్రుని కుమారుడు ధూమ్రాశ్వుడు. ఆతని కుమారుడు సృంజయుడు. 14

మూ. సృఞ్జయస్య సుతః శ్రీమాన్ సహదేవః ప్రతాపవాన్,
కుశాశ్వః సహదేవస్య పుత్రః పరమధార్మికః. 15

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడును, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడును అగు, సహదేవః = సహదేవుడు, సృఞ్జయస్య = సృంజయునియొక్క, సుతః= కుమారుడు. పరమధార్మికః = గొప్ప ధర్మాత్ము డైన, కుశాశ్వః=కుశాశ్వుడు, సహదేవస్య = సహదేవునియొక్క, పుత్రః = కుమారుడు.

తా. శ్రీమంతుడు, ప్రతాపవంతుడు అయిన సహదేవుడు సృంజయుని కుమారుడు, పరమధార్మికు డైన కుశాశ్వుడు సహదేవుని కుమారుడు. 15

మూ. కుశాశ్వస్య మహాతేజా సోమదత్తః ప్రతాపవాన్,
సోమదత్తస్య పుత్రస్తు కాకుత్స్థ ఇతి విశ్రుతః. 16

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సుకలవాడును, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడును అగు, సోమదత్తః = సోమదత్తుడు, కుశాశ్వస్య=కుశాశ్వుని యొక్క, (కుమారుడు). సోమదత్తస్య=సోమదత్తునియొక్క, పుత్రః=పుత్రుడు, కాకుత్స్థః ఇతి = కాకుత్స్థు డని, విశ్రుతః = ప్రసిద్ధుడు.

తా. కుశాశ్వునకు, మహాతేజఃశాలియు, ప్రతాపవంతుడును అగు. సోమదత్తుడును, సోమదత్తునకు కాకుత్థ్సుడును పుత్రులుగా జనించిరి. 16

మూ. తస్య పుత్రో మహాతేజాః స్రమ్ప్రత్యేష పురీమిమామ్,
ఆవసత్యమరప్రఖ్యః సుమతిర్నామ దుర్జయః. 17

ప్ర. అ. సంప్రతి = ఇపుడు, ఇమామ్ = ఈ, పురీమ్ = పట్టణమును, (నందు), తస్య = ఆ ఇక్ష్వాకువుయొక్క, పుత్రః = పుత్రుడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, అమరప్రఖ్యః = దేవతలతో సమానుడును, దుర్జయః = జయింప శక్యము కానివాడును అగు, సుమతిర్నామ = సుమతి అనునతడు, ఆవసతి = నివసించుచున్నాడు.

తా. గొప్ప తేజస్సు కలవాడును, దేవతాసమానుడును, జయింప శక్యము కానివాడును అగు, ఇక్ష్వాకుకుమారు డగు సుమతి, ఇపుడు ఈ నగరమును పాలించుచున్నాడు. 17

మూ. ఇక్ష్వాకోస్తు ప్రసాదేన సర్వే వైశాలికా నృపాః,
దీర్ఘాయుషో మహాత్మానో వీర్యవన్తస్సుధార్మికాః. 18

ప్ర. అ. ఇక్ష్వాకోః = ఇక్ష్వాకువుయొక్క, ప్రసాదేన = అనుగ్రహముచేత, వైశాలికాః = విశాలానగరమునకు సంబంధించిన, నృపాః = రాజులు, సర్వే = అందరును, దీర్ఘాయుషః = దీర్ఘాయుర్దాయము కలవారు, మహాత్మానః = మహాత్ములు, వీర్యవన్తః = పరాక్రమము కలవారు, సుధార్మికాః = బాగుగా

తా. విశాలానగరరాజు లందరును, ఇక్ష్వాకుప్రభావముచేత, దీర్ఘాయుర్దాయవంతులై, మహాత్ములై, వీర్యవంతులై, ధార్మికులై ఒప్పుచుందురు. 18

మూ. ఇహాద్య రజనీం రామ సుఖం వత్స్యామహే వయమ్,
శ్వః ప్రభాతే నరశ్రేష్ఠ జనకం ద్రష్టుమర్హసి. 19

ప్ర. అ. రామ = రామా, అద్య = నేడు, రజనీమ్ = రాత్రి, వయమ్ = మనము, ఇహ = ఇచటనే, సుఖమ్ = సుఖముగా, వత్స్యామహే = నివసించెదము.

నరశ్రేష్ఠ=ఓ నరశ్రేష్ఠుడా, శ్వః=రేపు, ప్రభాతే=ప్రాతఃకాలమున, జనకమ్=జనకుని, ద్రష్టుమ్ = చూచుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. రామా! ఈ రాత్రి మనము ఇచటనే సుఖముగ నివసించెదము. రేపు ఉదయమున జనకమహారాజును చూచెదము. 19

మూ. సుమతిస్తు మహాతేజా విశ్వామిత్రముపాగతమ్,
శ్రుత్వా నరవరశ్రేష్ఠః ప్రత్యుద్గచ్ఛన్మహాయశాః. 20

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడును, మహాయశాః=గొప్ప యశస్సు కలవాడును, నరవరశ్రేష్ఠః=నరవరులలో శ్రేష్ఠుడును అగు, సుమతిస్తు=సుమతి యైతే, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, ఉపాగతమ్ = వచ్చినవానినిగా, శ్రుత్వా = విని, ప్రత్యుద్గచ్ఛత్ = ఎదురుగా వెళ్లెను.

తా. మహాతేజుడు, మహాయశుడు, నరవరశ్రేష్ఠుడు అగు సుమతి విశ్వామిత్రుడు వచ్చిన వార్త విని, స్వాగతము చెప్పుటకై ఎదురుగా వెళ్లెను. 20

మూ. పూజాం చ పరమాం కృత్వా సోపాధ్యాయః సబాన్ధవః,
ప్రాఞ్జలిః కుశలం పృష్ట్వా విశ్వామిత్రమథాబ్రవీత్. 21

ప్ర. అ. సోపాధ్యాయః = పురోహితునితో కూడినవాడును, సబాన్ధవః = బంధుసమేతుడును అగు ఆ సుమతి, పరమామ్ = గొప్ప, పూజామ్ = పూజను, కృత్వా = చేసి, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, కుశలమ్=కుశలమును, పృష్ట్వా = అడిగి, అథ = పిమ్మట, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. బంధుపురోహితాది సమేతుడైన ఆ సుమతి విశ్వామిత్రుని అధికముగ పూజించి, అంజలి ఘటించి, కుశలప్రశ్నపూర్వకముగ ఇట్లు పలికెను. 21

మూ. ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే విషయం మునిః,
సంప్రాప్తో దర్శనం చైవ నాస్తి ధన్యతరో మమ. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
సప్తచత్వారింశః సర్గః.

ప్ర. అ. యస్య = ఏ, మే = నాయొక్క, విషయమ్ = దేశమును, మునిః = ముని (నీవు), సంప్రాప్తః = వచ్చినావో, దర్శనం చైవ = దర్శనము కూడ (ఇచ్చినావో), అట్టి నేను, ధన్యః = ధన్యుడను, అస్మి = అయి ఉన్నాను. అనుగృహీతః = అనుగ్రహింపబడిన వాడను, అస్మి = అయి ఉన్నాను. మమ = నాకంటె, ధన్యతరః = ఎక్కువ ధన్యుడు, నాస్తి = లేడు.

తా. నీవు మా దేశమునకు వచ్చి దర్శనమిచ్చినందులకు నేను చాల ధన్యుడ నైతిని. అనుగ్రహింపబడినవాడ నైతిని. నన్ను మించిన ధన్యాత్ము డెవ్వడును లేడు. 22

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండలో నలభైఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టచత్వారింశః సర్గః

మూ. పృష్ట్వా తు కుశలం తత్ర పరస్పరసమాగమే,
కథాన్తే సుమతిర్వాక్యం వ్యాజహార మహామునిమ్. 1

ప్ర. అ. తత్ర = అచట, పరస్పరసమాగమే = పరస్పరముతో (ఒండొరులతో) సమాగమమునందు, సుమతిః = సుమతి, కుశలమ్ = క్షేమమును, పృష్ట్వా = అడిగి, కథాన్తే = కథాంతమునందు, మహామునిమ్ = మహామునిని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, వ్యాజహార = పలికెను.

తా. అచట వారు పరస్పరము కలిసినపుడు సుమతి క్షేమసమాచారములను అడిగి, కొంత సంభాషణము జరిగిన పిమ్మట మహామునితో ఇట్లు పలికెను. 1

మూ. ఇమౌ కుమారౌ భద్రం తే దేవతుల్యపరాక్రమౌ,
గజసింహగతీ వీరౌ శార్దూలవృషభోపమౌ. 2

పద్మపత్రవిశాలాక్షౌ ఖడ్గతూణీధనుర్ధరౌ,
అశ్వినావివ రూపేణ సముపస్థితయౌవనౌ. 3

యదృచ్ఛయైవ గాం ప్రాప్తౌ దేవలోకాదివామరౌ,
కథం పద్భ్యామిహ ప్రాప్తౌ కిమర్థం కస్య వా మునే. 4

ప్ర. అ. మునే=విశ్వామిత్రమహామునీ ! తే=నీకు, భద్రమ్=మంగళము అగు గాక. దేవతుల్య పరాక్రమౌ = దేవతలతో సమాన మైన పరాక్రమము కల వారును, గజసింహగతీ = గజసింహములవంటి గమనము కలవారును, వీరౌ= వీరులును, శార్దూలవృషభోపమౌ = శార్దూలవృషభముల వలె ఉన్నవారును, పద్మపత్రవిశాలాక్షౌ = తామరపూవుల రేకుల వలె విశాల మైన నేత్రములు కల వారును, ఖడ్గతూణీధనుర్ధరౌ = ఖడ్గములను, అంబులపొదులను, ధనస్సులను ధరించినవారును, రూపేణ = రూపముచేత, అశ్వినావివ = అశ్వినీదేవతల వలె ఉన్నవారును, సముపస్థితయౌవనౌ = సమీపించిన యౌవనము కలవారును,

దేవలోకాత్ = దేవలోకమునుండి, యదృచ్ఛయైవ = ఇచ్ఛాను సారముగనే, గామ్ = భూమిని, ప్రాప్తౌ = పొందిన, అమరావివ = దేవతల వలె ఉన్న, ఇమౌ = ఈ, కుమారౌ = కుమారులు, ఇహ = ఇచటికి, పద్భ్యామ్ = పాదముల చేతనే (నడచి), కథమ్ = ఎట్లు, కిమర్థమ్ = ఎందుకు, అనుప్రాప్తౌ = వచ్చి నారు ? కస్య వా = ఎవనికి సంబంధించినవారు ?

తా. ఓ మునీ! నీకు క్షేమ మగు గాక. ఈ కుమారు లిరువురును, దేవతలతో సమాన మైన పరాక్రమము కలవారుగా కనపడుచున్నారు. ఏనుగ వలె, సింహము వలె నడచుచున్నారు. వీరులు. శార్దూలము వలెను, వృషభము వలెను ఉన్నారు. వీరి నేత్రములు పద్మపత్రముల వలె విశాలముగ నున్నవి. ఖడ్గములను, అంబులపొదులను, ధనస్సులను ధరించి ఉన్నారు. యౌవనము ప్రారంభ మగుచున్నది. సౌందర్యమున అశ్వినీదేవతలను పోలి యున్నారు. స్వేచ్ఛగా దేవలోకమునుండి భూలోకమునకు దిగి వచ్చిన అశ్వినీదేవతల వలె ఉన్నారు. వీరు ఎవరి కుమారులు ? కాలి నడకతో ఇచటకు ఎట్లు వచ్చినారు ? ఎందుకు వచ్చినారు ? 2-4

మూ. భూషయన్తావిమం దేశం చన్ద్రసూర్యావివామ్బరమ్,
పరస్పరస్య సదృశౌ ప్రమాణేఙ్గితచేష్టితైః. 5

కిమర్థం చ మునిశ్రేష్ఠ సంప్రాప్తౌ దుర్గమే పథి,
వరాయుధధరౌ వీరౌ శ్రోతుమిచ్ఛామి తత్త్వతః. 6

ప్ర. అ. మునిశ్రేష్ఠ = ఓ మునిశ్రేష్ఠుడా! ప్రమాణేఙ్గితచేష్టితైః = ప్రమాణము చేతను, భావములచేతను, చేష్టలచేతను, పరస్పరస్య = ఒండొరులకు, సదృశౌ = సమానులును, చన్ద్రసూర్యౌ = చంద్రసూర్యులు, అమ్బరమివ = ఆకాశమును వలె, ఇమామ్ = ఈ, దేశమ్ = దేశమును, భూషయన్తౌ = అలంకరించు చున్నవారును, వరాయుధధరౌ = శ్రేష్ఠము లైన ఆయుధములను ధరించిన వారును అగు, వీరౌ = ఈ వీరులు, దుర్గమే = నడవ శక్యము కాని, పథి = మార్గమునందు, కిమర్థమ్ = ఎందునిమిత్తమై, సంప్రాప్తౌ = వచ్చినారు ? తత్త్వతః = యథార్థముగా, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. మునిశ్రేష్ఠా! వీరి ప్రమాణములు, భావములు, చేష్టలు ఒకే విధముగ నున్నవి. చంద్రసూర్యులు ఆకాశమును అలంకరించి నట్లు ఈ ప్రదేశమును అలంకరించుచున్నారు. శ్రేష్ఠము లైన ఆయుధములు ధరించిన ఈ వీరులు, దుర్గమ మైన మార్గమునందు ప్రయాణము చేసి ఎందుకు వచ్చినారు? పూర్తిగ విన గోరుచున్నాను. 5, 6

మూ. తస్య తద్వచనం శ్రుత్వా యథావృత్తం న్యవేదయత్,
సిద్ధాశ్రమనివాసం చ రాక్షసానాం వధం తథా. 7

ప్ర. అ. తస్య=ఆతనియొక్క, తత్ వచనమ్=ఆ వాక్యమును, శ్రుత్వా= విని, సిద్ధాశ్రమనివాసం చ = సిద్ధాశ్రమమునందు నివాసమును, తథా=మరియు, రాక్షసానామ్=రాక్షసులయొక్క, వధమ్=వధను, యథావృత్తమ్ = జరిగినది జరిగినట్లుగా, న్యవేదయత్ = తెలిపెను.

తా. విశ్వామిత్రుడు ఆతని మాటలు విని, సిద్ధాశ్రమనివాసము, రాక్షస వధము మొదలైన వృత్తాంతమును జరిగినది జరిగినట్లుగా తెలిపెను. 7

మూ. విశ్వామిత్రవచః శ్రుత్వా రాజా పరమహర్షితః,
అతిథీ పరమౌ ప్రాప్తౌ పుత్రౌ దశరథస్య తౌ, 8
పూజయామాస విధివత్సత్కారార్హౌ మహాబలౌ.

ప్ర. అ. రాజా = రాజైన సుమతి, విశ్వామిత్రవచః = విశ్వామిత్రుని వాక్యమును, శ్రుత్వా = విని, పరమహర్షితః = మిక్కిలి సంతసించినవాడై, పరమౌ = శ్రేష్ఠ లైన, అతిథీ = అతిథులుగా, ప్రాప్తౌ = వచ్చినవారును, సత్కారార్హౌ = సత్కారమునకు తగినవారును, మహాబలౌ = గొప్ప బలము కల వారును అగు, తౌ = ఆ, దశరథస్య పుత్రౌ = దశరథసుతులను, విధివత్ = యథాశాస్త్రముగా, పూజయామాస = పూజించెను.

తా. సుమతి విశ్వామిత్రుని మాటలు విని చాల సంతోషించి, గొప్ప బలముకలవారును, సత్కారము చేయదగినవారును, ఉత్తమాతిథులుగా వచ్చిన వారును అగు ఆ దశరథకుమారులను యథావిధిగా పూజించెను. 8

మూ. తతః పరమసత్కారం సుమతేః ప్రాప్య రాఘవౌ, 9
ఉష్య తత్ర నిశామేకాం జగ్మతుర్మిథిలాం తతః.

ప్ర. అ. రాఘవౌ = రామలక్ష్మణులు, తతః = ఆ, సుమతేః = సుమతి నుండి, పరమసత్కారమ్ = గొప్ప సత్కారమును, ప్రాప్య = పొంది, తత్ర = అచట, ఏకామ్ = ఒక, నిశామ్ = రాత్రి, ఉష్య = ఉండి, తతః = పిమ్మట, మిథిలామ్ = మిథిలను గూర్చి, జగ్మతుః = వెళ్లిరి.

తా. రామలక్ష్మణులు ఆ సుమతి చేసిన సత్కారము లందికొని, ఒక రాత్రి అచట నివసించి, పిమ్మట మిథిలకు వెళ్లిరి. 9

మూ. తాం దృష్ట్వా మునయః సర్వే జనకస్య పురీం శుభామ్, 10
సాధు సాధ్వితి శంసన్తో మిథిలాం సమపూజయన్.

ప్ర. అ. సర్వే = సమస్త మైన, మునయః = మునులు, జనకస్య = జనక మహారాజు యొక్క, తామ్ = ఆ, శుభామ్ = శుభ మైన, పురీమ్ = పట్టణమును దృష్ట్వా = చూచి, సాధు సాధు ఇతి = బాగున్నది బాగున్నది అని, శంసన్తః = ప్రశంసించుచు, మిథిలామ్ = ఆ మిథిలను, సమపూజయన్ = పూజించిరి.

తా. విశ్వామిత్రాదిమును లందరును శుభ మైన ఆ జనకరాజపురిని చూచి బాగున్నది, బాగున్నది అని మెచ్చుకొనుచు ఆ మిథిలను పూజించిరి. 10

మూ. మిథిలోపవనే శూన్యమాశ్రమం దృశ్య రాఘవః, 11
పురాణం నిర్జనం రమ్యం పప్రచ్ఛ మునిపుఙ్గవమ్.

ప్ర. అ. రాఘవః = రాముడు, మిథిలోపవనే = మిథిలాసమీపమున నున్న వనమునందు, పురాణమ్=ప్రాచీన మైనదియు, నిర్జనమ్=జనులు లేనిదియు, రమ్యమ్ = సుందర మైనదియు, శూన్యమ్ = శూన్యమును అగు, ఆశ్రమమ్ = ఆశ్రమమును, దృశ్య = చూచి, మునిపుఙ్గవమ్ = మునిశ్రేష్ఠ డైన విశ్వామిత్రుని, పప్రచ్ఛ = అడిగెను.

తా. రాముడు, మిథిలాసమీపమునం దున్న వనమునందు, ప్రాచీనము, నిర్జనము, సుందరము, శూన్యము అయిన ఆశ్రమమును చూచి మునిశ్రేష్ఠ డైన విశ్వామిత్రుని ప్రశ్నించెను. 11

మూ. శ్రీమదాశ్రమసంకాశం కిం న్విదం మునివర్జితమ్, 12
శ్రోతుమిచ్ఛామి భగవన్ కస్యాయం పూర్వ ఆశ్రమః.

ప్ర. అ. భగవన్ = ఓ పూజ్యుడా ! శ్రీమత్ = శోభాయుక్త మైనదియు, ఆశ్రమసంకాశమ్ = ఆశ్రమముతో సమాన మైనదియు, మునివర్జితమ్ = మునులతో శూన్య మైనదియు అగు, ఇదమ్ = ఇది, కిం ను = ఏమి ? పూర్వః = ప్రాచీన మైన, అయమ్ = ఈ, ఆశ్రమః = ఆశ్రమము, కస్య = ఎవరిది ? శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. ఓ పూజ్యుడా ! ఇది ఆశ్రమమువలె కనబడుచున్నది. ఇందు మును లెవ్వరును లేరు. ఇది ఏమి ? ప్రాచీన మైన ఈ ఆశ్రమము ఎవరిది ? వినగోరు చున్నాను. 12

మూ. తచ్ఛ్రుత్వా రాఘవేణోక్తం వాక్యం వాక్యవిశారదః, 13
ప్రత్యువాచ మహాతేజా విశ్వామిత్రో మహామునిః.

ప్ర అ. వాక్యవిశారదః = వాక్యములందు నేర్పు గలవాడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును అగు, విశ్వామిత్రః మహామునిః = విశ్వామిత్రమహాముని, రాఘవేణ = రాముని చేత, ఉక్తమ్ = పలకబడిన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. మాటలలో నేర్పు గల మహాతేజఃశాలి యగు విశ్వామిత్ర మహాముని రాముని మాటలు విని ఇట్లు పలికెను. 13

మూ. హన్త తే కథయిష్యామి శృణు తత్త్వేన రాఘవ, 14
యస్యేదమాశ్రమపదం శప్తం కోపాన్మహాత్మనా.

ప్ర. అ. రాఘవ = రామా ! మహాత్మనా = మహాత్ముడైన, (ఎవనిచేత) కోపాత్ = కోపమువలన, శప్తమ్ = శపింపబడిన, ఇదమ్ = ఈ, ఆశ్రమపదమ్= ఆశ్రమము, యస్య = ఎవనిదో, తత్త్వేన = యథార్థముగా, తే = నీకు, కథయిష్యామి = చెప్పగలను. శృణు = వినుము, హన్త = ఎంత ఆనందము.

తా. రామా! చాలా సంతోషము! ఈ ఆశ్రమము ఎవ్వరిదో, ఏ మహాత్ముడు కోపముచే దీనిని శపించెనో యథార్థముగా, చెప్పెదను, వినుము. 14

మూ. గౌతమస్య నరశ్రేష్ఠ పూర్వమాసీన్మహాత్మనః 15
ఆశ్రమో దివ్యసంకాశః సురైరపి సుపూజితః.

ప్ర. అ. నరశ్రేష్ఠ = ఓ నరశ్రేష్ఠా! దివ్యసంకాశః = దేవలోకాశ్రమముతో సమాన మైన, సురైరపి = దేవతలచేత గూడ, సుపూజితః = బాగుగా పూజింపబడిన, ఆశ్రమః = ఈ ఆశ్రమము, పూర్వమ్ = పూర్వము, మహాత్మనః = మహాత్ము డైన, గౌతమస్య = గౌతమునిదిగా, ఆసీత్ = ఉండెను.

తా. రామా! దేవతలు కూడా పూజించు దివ్య మైన ఈ ఆశ్రమము పూర్వము మహాత్ము డైన గౌతమునిదై యుండెను. 15

మూ. స చేహ తప ఆతిష్ఠదహల్యాసహితః పురా, 16
వర్షపూగాననేకాంశ్చ రాజపుత్ర మహాయశః.

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి గల, రాజపుత్ర = రాజకుమారా! పురా = పూర్వము, సః = అతడు, అహల్యాసహితః = అహల్యాసమేతుడై, అనేకాన్ = అనేకము లైన, వర్షపూగాన్ = సంవత్సర సముదాయములను, ఇహ = ఇచట, తపః = తపస్సు, ఆతిష్ఠత్ = ఆచరించెను.

తా. గొప్ప కీర్తి గల ఓ రాజకుమారా! పూర్వ మాతడు అహల్యాసమేతుడై, ఇచట, అనేక సంవత్సరముల పాటు తపస్సు చేసెను. 16

మూ. తస్యాన్తరం విదిత్వా తు సహస్రాక్షః శచీపతిః, 17
మునివేషధరోఽహల్యామిదం వచనమబ్రవీత్.

ప్ర. అ. శచీపతిః = శచీదేవికి భర్త యైన, సహస్రాక్షః = దేవేంద్రుడు, తస్య = అతనియొక్క, అంతరమ్ = అవకాశమును, విదిత్వా = తెలిసికొని, మునివేషధరః = ఆ గౌతమమునియొక్క వేషమును ధరించినవాడై, అహల్యామ్ = అహల్యను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. శచీపతి యైన దేవేంద్రుడు ఆ ముని లేని సమయము చూచి, ఆతని వేషము ధరించి అహల్యతో ఇట్లు పలికెను. 17

మూ. ఋతుకాలం ప్రతీక్షన్తే నార్థినః సుసమాహితే, 18
సంగమం త్వహమిచ్ఛామి త్వయా సహ సుమధ్యమే.

ప్ర. అ. సుసమాహితే=చక్కగా సృష్టింపబడినదానా! అర్థినః=భోగమును కోరువారు, ఋతుకాలమ్ = ఋతుకాలమును, న ప్రతీక్షన్తే = ఎదురుచూడరు. సుమధ్యమే = మంచి నడుము కలదానా! అహమ్=నేను, త్వయా సహ = నీతో కూడ, సంగమమ్ = సంగమమును, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. సుందరీ! కాముకులు ఋతుకాలమునకై వేచి యుండరు. మంచి నడుము కలదానా! నీ సంగమమును కోరుచున్నాను. 18

మూ. మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునన్దన, 19
మతిం చకార దుర్మేధా దేవరాజకుతూహలాత్.

ప్ర. అ. రఘునన్దన = రామా! దుర్మేధాః = దుర్బుద్ధి గల ఆమె, మునివేషమ్ = మునివేషధారి యగు వానిని, సహస్రాక్షమ్ = దేవేంద్రునిగా, విజ్ఞాయ= తెలుసుకొని, దేవరాజకుతూహలాత్ = దేవతాప్రభు వైన ఆ యింద్రునియందు ఆసక్తివలన, మతిం చకార = అంగీకరించెను.

తా. మునివేషధారి యగు ఆతడు దేవేంద్రు డని తెలిసి కూడ, దుర్బుద్ధి యైన ఆమె దేవరాజు కదా అను మక్కువచే సమ్మతించెను. 19

మూ. అథాబ్రవీన్నరశ్రేష్ఠ కృతార్థేనాన్తరాత్మనా, 20
కృతార్థాస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్రమితః ప్రభో,
ఆత్మానం మాం చ దేవేశ సర్వథా రక్ష గౌతమాత్. 21

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! అథ = పిమ్మట, ఆమె, కృతార్థేన = నెరవేరిన పని గల, అన్తరాత్మనా = అంతఃకరణముతో, అబ్రవీత్ = పలికెను. సురశ్రేష్ఠ = ఓ దేవతాశ్రేష్ఠుడా! కృతార్థా = కృతార్థురాలను, అస్మి =

అయితిని, ప్రభో = ఓ ప్రభూ ! ఇతః = ఇచటినుండి, శీఘ్రమ్ = శీఘ్రముగా, గచ్ఛ = వెళ్లుము. దేవేశ = దేవరాజా ! ఆత్మానం చ = తనను, మాం చ = నన్నును, సర్వథా = అన్ని విధముల, గౌతమాత్ = గౌతమునినుండి, రక్ష = రక్షింపుము.

తా. రామా ! పిమ్మట, అహల్య, కృతార్థ మైన అంతఃకరణముతో ఇట్లు పలికెను. దేవతలలో శ్రేష్ఠుడా ! కృతార్థురాల నైతిని. ఓ ప్రభూ ! ఇచటినుండి శీఘ్రముగా వెళ్లిపొమ్ము. ఓ దేవరాజా ! నిన్ను, నన్ను కూడ గౌతమునినుండి అన్ని విధముల రక్షించుము. 20, 21

మూ. ఇన్ద్రస్తు ప్రహసన్ వాక్యమహల్యామిదమబ్రవీత్,
సుశ్రోణి పరితుష్టోఽస్మి గమిష్యామి యథాగతమ్. 22

ప్ర. అ. ఇన్ద్రస్తు = ఇంద్రుడైతే, ప్రహసన్ = నవ్వుచు, అహల్యామ్ = అహల్యను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. సుశ్రోణి = అంద మైన పిరుదులు గలదానా, పరితుష్టః అస్మి = సంతసించినాను, యథాగతమ్ = వచ్చినట్లుగానే, గమిష్యామి = వెళ్లగలను.

తా. ఇంద్రుడు నవ్వుచు, అహల్యతో— "ఓ సుందరీ ! సంతోషించితిని, వచ్చినట్లే వెళ్లెదను" అని పలికెను. 22

మూ. ఏవం సంగమ్య తు తయా నిశ్చక్రామోటజాత్తతః,
స సంభ్రమాత్త్వరన్ రామ శఙ్కితో గౌతమం ప్రతి. 23

ప్ర. అ. రామ = రామా ! ఏవమ్ = ఈ విధముగా, తయా = ఆమెతో, సంగమ్య = సంగమము చేసి, సః = ఆతడు, సంభ్రమాత్ = భయమువలన, త్వరన్ = తొందరపడుచు, గౌతమం ప్రతి = గౌతముని గూర్చి, శఙ్కితః = శంకించుచున్నవాడై, ఉటజాత్ = పర్ణశాలనుండి, నిశ్చక్రామ = బయలుదేరెను.

తా. రామా ! ఆతడీ విధముగ అహల్యాసంగమము చేసి, గౌతము డెక్కడ వచ్చునో యని శంకించుచు, భయమువలన తొందరపడుచు, పర్ణశాల నుండి బైటకు వచ్చెను. 23

మూ. గౌతమం సందదర్శాథ ప్రవిశన్తం మహామునిమ్,
దేవదానవదుర్ధర్షం తపోబలసమన్వితమ్, 24
తీర్థోదకపరిక్లిన్నం దీప్యమానమివానలమ్,
గృహీతసమిధం తత్ర సకుశం మునిపుఙ్గవమ్. 25

ప్ర. అ. అథ = పిమ్మట, దేవదానవదుర్ధర్షమ్ = దేవతలచేత గాని దానవులచేత గాని ఎదిరింపశక్యము కానివాడును, తపోబలసమన్వితమ్ = తపోబలముతో కూడినవాడును, తీర్థోదకపరిక్లిన్నమ్ = తీర్థోదకముచేత తడిసినవాడును, దీప్యమానమ్ = ప్రజ్వలించుచున్న, అనలమివ = అగ్నివలె నున్నవాడును, గృహీతసమిధమ్ = గ్రహింపబడిన సమిధలు కలవాడును, సకుశమ్ = కుశలతో కూడినవాడును, మునిపుఙ్గవమ్ = మునులలో శ్రేష్ఠుడును అగు, గౌతమం మహామునిమ్ = గౌతమమహామునిని, తత్ర = అచట, ప్రవిశన్తమ్ = ప్రవేశించుచుండగా, సందదర్శ = చూచెను.

తా. అంతట, దేవదానవులచే ఎదిరింప శక్యముకాని వాడును, తపోబలవంతుడును, తీర్థోదకముచే తడిసి ఉన్నవాడును, అగ్నివలె ప్రకాశించుచున్నవాడును మునులలో శ్రేష్ఠుడును అగు గౌతమ మహాముని సమిధలను కుశలను గ్రహించి ఉటజమునందు ప్రవేశించుచుండగా చూచెను. 24, 25

మూ. దృష్ట్వా సురపతిస్త్రస్తో వివర్ణవదనోఽభవత్,
అథ దృష్ట్వా సహస్రాక్షం మునివేషధరం మునిః. 26
దుర్వృత్తం వృత్తసంపన్నో రోషాద్వచనమబ్రవీత్.

ప్ర. అ. సురపతిః = దేవేంద్రుడు, దృష్ట్వా = చూచి, త్రస్తః = భయపడినవాడై, వివర్ణవదనః = రంగుమారిన ముఖము కలవాడు, అభవత్ = ఆయెను. అథ = పిమ్మట, వృత్తసంపన్నః = మంచి నడవడిక గల, మునిః = ముని, మునివేషధరమ్ = మునివేషమును ధరించినవాడును, దుర్వృత్తమ్ = చెడు నడవడిక కలవాడును అగు, సహస్రాక్షమ్ = దేవేంద్రుని, దృష్ట్వా = చూచి, రోషాత్ = కోపమువలన, వచనమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ మునిని చూడగనే దేవేంద్రుని ముఖము వెలవెలబారెను. ఉత్తమ చరిత్రశాలి యగు ఆ ముని, మునివేషములో ఉన్న దుష్టచరిత్రుడగు ఆ ఇంద్రుని చూచి కోపముతో ఇట్లు పలికెను. 26

మూ. మమ రూపం సమాస్థాయ కృతవానసి దుర్మతే, 27
అకర్తవ్యమిదం తస్మాద్విఫలస్త్వం భవిష్యసి.

ప్ర. అ. దుర్మతే=ఓ దుర్బుద్ధీ, మమ=నాయొక్క, రూపమ్=రూపమును, సమాస్థాయ = గ్రహించి, ఇదమ్ = ఈ, అకర్తవ్యమ్ = చేయరానిపని, కృతవాన్ అసి = చేసినావు. తస్మాత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, విఫలః = వృషణములు లేనివాడవు, భవిష్యసి = కాగలవు.

తా. ఓ దుర్మతీ! నా రూపమును ధరించి ఈ విధమైన దుష్టకార్యము నాచరించినందులకు నీ వృషణములు పడిపోవుగాక. 27

మూ. గౌతమేనైవముక్తస్య సరోషేణ మహాత్మనా, 28
పేతతుర్వృషణౌ భూమౌ సహస్రాక్షస్య తత్క్షణాత్.

ప్ర. అ. సరోషేణ = కోపముతో కూడిన, మహాత్మనా = మహాత్ముడైన, గౌతమేన = గౌతమునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తస్య = పలకబడిన, సహస్రాక్షస్య = దేవేంద్రునియొక్క, వృషణౌ = వృషణములు, తత్క్షణాత్ = వెంటనే, భూమౌ = భూమిపై, పేతతుః = పడినవి.

తా. గౌతముడు కోపముతో ఇట్లు పలుకగనే ఇంద్రుని వృషణములు వెంటనే నేలపై పడినవి. 28

మూ. తథా శప్త్వా స వై శక్రమహల్యామపి శప్తవాన్. 29
ఇహ వర్షసహస్రాణి బహూని త్వం వసిష్యసి,
వాయుభక్షా నిరాహారా తప్యన్తీ భస్మశాయినీ, 30
అదృశ్యా సర్వభూతానా మాశ్రమేస్మిన్నివత్స్యసి.

ప్ర. అ. సః = అతడు, శక్రమ్ = దేవేంద్రుని, తథా = ఆ విధముగా, శప్త్వా = శపించి, అహల్యామపి = అహల్యను కూడ, శప్తవాన్ = శపించినాడు.

త్వమ్ = నీవు, ఇహ = ఇచట, బహూని = అనేక మైన, వర్షసహస్రాణి=వేల కొలది సంవత్సరములను, వసిష్యసి=నివసించగలవు. వాయుభక్షా=వాయువునే భక్షించు చున్నదానవై, నిరాహారా = ఆహారము లేనిదానవై, భస్మశాయినీ = భస్మమునందు శయనించుచున్నదానవై, తప్యన్తీ = తపస్సు చేయుచు, సర్వ భూతానామ్ = సకలభూతములకును, అదృశ్యా = అదృశ్యురాలవై, అస్మిన్ = ఈ, ఆశ్రమే = ఆశ్రమమునందు, నివత్స్యసి = నివసించగలవు.

తా. గౌతముడు ఇంద్రుని ఆ విధముగ శపించి అహల్యను కూడ ఈ విధముగా శపించెను. "చాల వేలసంవత్సరముల పాటు ఇచటనే నివసించెదవు. ఎవ్వరికిని కనబడకుండగ భస్మములో పడి యుండి, ఆహార మేమియు లేక, వాయువును మాత్రమే భక్షించుచు, తపస్సు చేయుచు ఈ ఆశ్రమమునందు నివసించెదవు." 29, 30.

మూ. యదా చైతద్వనం ఘోరం రామో దశరథాత్మజః, 31
ఆగమిష్యతి దుర్ధర్షస్తదా పూతా భవిష్యసి.

ప్ర. అ. దశరథాత్మజః=దశరథుని కుమారుడును, దుర్ధర్షః=ఎదిరింప శక్యము కానివాడును అగు, రామః=రాముడు, యదా=ఎప్పుడు, ఘోరమ్ = భయంకర మైన, ఏతత్ వనమ్ = ఈ వనమును గూర్చి, ఆగమిష్యతి = రాగలడో, తదా = అప్పుడు, పూతా = పవిత్రురాలవు, భవిష్యసి=కాగలవు.

తా. దశరథకుమారు డైన రాముడు భయంకర మైన ఈ వనములో ప్రవేశించగనే నీవు శుద్ధురాలవు కాగలవు. 31

మూ. తస్యాతిథ్యేన దుర్వృత్తే లోభమోహవివర్జితా, 32
మత్సకాశే ముదా యుక్తా స్వం వపుర్ధారయిష్యసి.

ప్ర. అ. దుర్వృత్తే = చెడ్డ నడవడిక కలదానా! తస్య = ఆ రామునకు, ఆతిథ్యేన = ఆతిథ్యముచేయుటచేత, లోభమోహవివర్జితా = లోభమోహములు తొలగి పోయినదానవై, ముదా = సంతోషముతో, యుక్తా = కూడినదానవై, మత్సకాశే=నా సమీపమునందు, స్వమ్=నీసంబంధమైన, వపుః=శరీరమును, ధారయిష్యసి = ధరింపగలవు.

తా. ఓ దుశ్చరితురాలా! నీవు ఆ రామునకు అతిథిసత్కారములు చేసిన తరువాత లోభమోహములు తొలగి, సంతోషవంతురాలవై, స్వస్వరూపము ధరించి నాతో నివసింపగలవు. 32

మూ. ఏవముక్త్వా మహాతేజా గౌతమో దుష్టచారిణీమ్, 33
ఇమమాశ్రమముత్సృజ్య సిద్ధచారణసేవితే,
హిమవచ్ఛిఖరే పుణ్యే తపస్తేపే మహాతపాః. 34

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
అష్టచత్వారింశః సర్గః.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, మహాతపాః = గొప్పతపస్సు కలవాడును అగు, గౌతమః = గౌతముడు, దుష్టచారిణీమ్ = చెడు ప్రవర్తన గల ఆమెను గూర్చి, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, ఇమమ్ = ఈ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ఉత్సృజ్య = విడచి, సిద్ధచారణసేవితే = సిద్ధులచేతను చారణులచేతను సేవింపబడిన, పుణ్యే = పుణ్యమైన, హిమవచ్ఛిఖరే = హిమవత్పర్వత శిఖరమునందు, తపః = తపస్సును, తేపే = చేసెను.

తా. మహాతేజఃశాలియు, మహాతపః సంపన్నుడును అగు ఆ గౌతముడు చెడ్డగా ప్రవర్తించిన ఆ అహల్యతో ఈ విధముగ పలికి, ఈ అరణ్యమును విడచి, సిద్ధులును చారణులును నివసించు హిమవత్పర్వత శిఖరమునకు పోయి, అచట తపస్సు చేసెను. 33, 34

"బాలానన్దిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో
నలభైఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనపఞ్చాశః సర్గః

మూ. అఫలస్తు తతః శక్రో దేవానగ్నిపురోగమాన్,
అబ్రవీత్త్రస్తవదనః సర్షిసఙ్ఘాన్ సచారణాన్. 1

ప్ర. అ. తతః = పిమ్మట, అఫలః = వృషణములు లేని, శక్రః = దేవేంద్రుడు, త్రస్తవదనః = భయపడిన ముఖము కలవాడై, సర్షిసఙ్ఘాన్ = ఋషి సంఘములతో కూడిన వారును, సచారణాన్ = చారణులతో కూడిన వారును అగు, అగ్నిపురోగమాన్ = అగ్ని మొదలైన, దేవాన్ = దేవతలను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. వృషణములు పడిపోవుటచే దిగులు చెందిన దేవేంద్రుడు, అగ్ని మొదలగు దేవతలతోను ఋషిసంఘములతోను, చారణులతోను ఇట్లు పలికెను. 1

మూ. కుర్వతా తపసో విఘ్నం గౌతమస్య మహాత్మనః,
క్రోధముత్పాద్య హి మయా సురకార్యమిదం కృతమ్. 2

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, గౌతమస్య = గౌతమునకు, క్రోధమ్ = కోపమును, ఉత్పాద్య = పుట్టించి, తపసః = తపస్సునకు, విఘ్నమ్ = విఘ్నమును, కుర్వతా = చేసిన, మయా = నాచేత, ఇదమ్ = ఈ, సురకార్యమ్ = దేవతలకార్యము, కృతమ్ = చేయబడినది.

తా. మహాత్ముడైన గౌతమునకు కోపము కలిగించి ఆతని తపస్సునకు విఘ్నము చేయుట ద్వారా నేను దేవతాకార్యమును సాధించితిని. 2

మూ. అఫలోఽస్మి కృతస్తేన క్రోధాత్సా చ నిరాకృతా,
శాపమోక్షేణ మహతా తపోఽస్యాపహృతం మయా. 3

ప్ర. అ. తేన = ఆతనిచేత, క్రోధాత్ = కోపమువలన, అఫలః = వృషణములు లేనివాడను, కృతః అస్మి = చేయబడితిని. సా చ = ఆ అహల్య కూడ, నిరాకృతా = నిరాకరింపబడినది. మహతా = గొప్పదైన, శాపమోక్షేణ =

శాపము నిచ్చుటచేత, అస్య = ఈతనియొక్క, తపః = తపస్సు, మయా = నా చేత, అపహృతమ్ = అపహరింపబడినది.

తా. కోపముతో నన్నాతడు వృషణములు లేనివానినిగా చేసి, ఆ అహల్యనుకూడ పరిత్యజించినాడు. ఈ విధముగ ఆతడు గొప్ప శాపము నిచ్చునట్లు చేసి నే నాతని తపస్సును హరించితిని. 3

మూ. తస్మాత్సురవరాః సర్వే సర్షిసంఘాః సచారణాః,
సురసాహ్యకరం సర్వే సఫలం కర్తుమర్హథ. 4

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, సర్షిసంఘాః = ఋషిసంఘములతో కూడిన, సచారణాః = చారణులతో కూడిన, సర్వే = సమస్తమైన, సురవరాః = దేవతాశ్రేష్ఠులారా ! సురసాహ్యకరమ్ = దేవతలకు సహాయము చేసిన నన్ను, సఫలమ్ = వృషణములు కలవానినిగా, కర్తుమ్ = చేయుటకు, అర్హథ = తగి యున్నారు.

తా. అందుచేత, ఓ దేవతాశ్రేష్ఠులారా, ఋషులారా, చారణులారా, మీరందరును, దేవకార్యము చేసిన నాకు మరల వృషణములు వచ్చు నట్లు చేయుడు. 4

మూ. శతక్రతోర్వచః శ్రుత్వా దేవాః సాగ్నిపురోగమాః,
పితృదేవానుపేత్యాహుస్సహ సర్వైర్మరుద్గణైః. ౫

ప్ర. అ. సాగ్నిపురోగమాః = అగ్ని మొదలైన, దేవాః = దేవతలు, శతక్రతోః = దేవేంద్రునియొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా=విని, సర్వైః= సమస్తమైన, మరుద్గణైః సహ = దేవగణములతో కూడ, పితృదేవాన్ = పితృదేవతలను, ఉపేత్య = సమీపించి, ఆహుః = పలికిరి.

తా. అగ్నిమొదలైన దేవతలు ఇంద్రుని మాటలు విని, మరుద్గణములతో కలిసి పితృదేవతల దగ్గరకు వెళ్లి ఈ విధముగ పలికిరి. 5

మూ. అయం మేషః సవృషణః శక్రో హ్యవృషణః కృతః,
మేషస్య వృషణౌ గృహ్య శక్రాయాశు ప్రయచ్ఛత. 6

ప్ర. అ. అయమ్ = ఈ, మేషః = మేషము, (గొఱ్ఱె), సవృషణః = వృషణములతో కూడినది. శక్రః = దేవేంద్రుడు, అవృషణః=వృషణములు లేనివాడుగా, కృతః హి = చేయబడినాడు కదా. మేషస్య = మేషముయొక్క, వృషణౌ = వృషణములను, గృహ్య = స్వీకరించి, ఆశు = వెంటనే, శక్రాయ= దేవేంద్రునకు, ప్రయచ్ఛత = ఇవ్వండి.

తా. యజ్ఞములో మీ భాగముగా లభించు మేషమున కున్న వృషణములను తీసి వృషణములు లేని దేవేంద్రునకు ఇవ్వండి. 6

మూ. అఫలస్తు కృతో మేషః పరాం తుష్టిం ప్రదాస్యతి,
భవతాం హర్షణార్థాయ యే చ దాస్యన్తి మానవాః. 7

ప్ర. అ. అఫలః = వృషణములు లేనిదిగా, కృతః = చేయబడినను, మేషః = మేషము, భవతామ్ = మీకు, పరామ్=గొప్ప, తుష్టిమ్=ఆనందమును, ప్రదాస్యతి = ఇవ్వగలదు. యే మానవాః = ఏ మానవులు, దాస్యన్తి = ఇచ్చెదరో, (వారికి), హర్షణార్థాయ = సంతోషపెట్టుటకు, (సమర్థము కాగలదు).

తా. మేషము వృషణములు తీసివేసినను అది మీకు చాల సంతోషమును ఇవ్వగలదు. మీకు అట్టి మేషమును సమర్పించు మానవులకు కూడ సంతోషప్రదము కాగలదు. అనగా అట్టి మేషమును మీకు సమర్పించి మానవులు ఇష్టఫలమును పొందగలరు. 7

మూ. అగ్నేస్తు వచనం శ్రుత్వా పితృదేవాః సమాగతాః,
ఉత్పాట్య మేషవృషణౌ సహస్రాక్షే న్యవేశయన్. 8

ప్ర. అ. సమాగతాః = వచ్చిన, పితృదేవాః = పితృదేవతలు, అగ్నేః= అగ్నియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, మేషవృషణౌ=మేషముయొక్క వృషణములను, ఉత్పాట్య = పెకలించి, సహస్రాక్షే = దేవేంద్రునియందు, న్యవేశయన్ = ఉంచిరి.

తా. అగ్ని మాటలు విన్న పితృదేవత లందరును కలిసి, మేషవృషణములు తీసి సహస్రాక్షునకు అతికించిరి. 8

మూ. తదా ప్రభృతి కాకుత్స్థ పితృదేవాః సమాగతాః,
అఫలాన్ భుఞ్జతే మేషాన్ ఫలై స్తేషామయోజయన్. 9

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! సమాగతాః = కలిసిన, పితృదేవాః = పితృదేవతలు, తదాప్రభృతి = అది మొదలు, అఫలాన్ = వృషణములు లేని, మేషాన్ = మేషములను, భుఞ్జతే = భుజించుచున్నారు. తేషామ్ = ఆ మేషముల యొక్క, ఫలైః = వృషణములతో, అయోజయన్ = (దేవేంద్రుని) కూర్చిరి.

తా. రామా ! పితృదేవత లందరును మేషముల వృషణములను ఇంద్రునకు అతికించినారు గాన, అది మొదలు వృషణములు లేని మేషములనే భుజించుచున్నారు. 9

మూ. ఇన్ద్రస్తు మేషవృషణ స్తదాప్రభృతి రాఘవ,
గౌతమస్య ప్రభావేణ తపసశ్చ మహాత్మనః. 10

ప్ర. అ. రాఘవ = రామా ! మహాత్మనః = మహాత్ము డైన, గౌతమస్య = గౌతమునియొక్క, తపసః = తపస్సుయొక్క, ప్రభావేణ = ప్రభావముచేత, ఇన్ద్రః తు = ఇంద్రుడైతే, తదాప్రభృతి = అదిమొదలు, మేషవృషణః = మేషవృషణములు కలవా డైనాడు.

తా. రామా ! మహాత్ము డైన గౌతముని తపఃప్రభావముచే, అదిమొదలు ఇంద్రుడు మేషవృషణు డైనాడు. 10

మూ. తదాగచ్ఛ మహాతేజ ఆశ్రమం పుణ్యకర్మణః,
తారయైనాం మహాభాగామహల్యాం దేవరూపిణీమ్. 11

ప్ర. అ. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా ! తత్ = ఆకారణము వలన, పుణ్యకర్మణః = పుణ్యకర్మ గల గౌతమునియొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, ఆగచ్ఛ = రమ్ము. మహాభాగామ్ = గొప్ప భాగ్యము కలదియు, దేవరూపిణీమ్ = దేవతల వంటి రూపము కలదియు అగు, ఏనామ్ = ఈ, అహల్యామ్ = అహల్యను, తారయ = తరింపచేయుము.

తా. మహాతేజఃశాలి వైన రామా! పుణ్యాత్ము డైన గౌతముని ఆశ్రమము ప్రవేశించి, మహాభాగ్యవంతురాలును, దేవతల వంటి రూపము కలదియు అగు ఈ అహల్యను తరింపచేయుము. 11

మూ. విశ్వామిత్రవచః శ్రుత్వా రాఘవః సహలక్ష్మణః,
విశ్వామిత్రం పురస్కృత్య తమాశ్రమమథావిశత్. 12

ప్ర. అ. సహలక్ష్మణః = లక్ష్మణునితో కూడిన, రాఘవః = రాముడు, విశ్వామిత్రవచః = విశ్వామిత్రుని వాక్యమును, శ్రుత్వా = విని, అథ = పిమ్మట, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, పురస్కృత్య = ముందిడుకొని, తమ్ = ఆ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, అవిశత్ = ప్రవేశించెను.

తా. లక్ష్మణసమేతు డైన రాముడు, విశ్వామిత్రుని మాటలు విని అతని వెనుక నడచుచు ఆ ఆశ్రమములో ప్రవేశించెను. 12

మూ. దదర్శ చ మహాభాగాం తపసా ద్యోతితప్రభామ్,
లోకైరపి సమాగమ్య దుర్నిరీక్ష్యాం సురాసురైః, 13
ప్రయత్నాన్నిర్మితాం ధాత్రా దివ్యాం మాయామయీమివ,
సతుషారావృతాం సాభ్రాం పూర్ణచన్ద్రప్రభామివ. 14
మధ్యేంభసో దురాధర్షాం దీప్తాం సూర్యప్రభామివ,

ప్ర. అ. మహాభాగామ్ = గొప్ప భాగ్యము కలదియు, తపసా = తపస్సు చేత, ద్యోతితప్రభామ్ = ప్రకాశింపచేయబడిన కాంతి కలదియు, లోకైరపి = జనులచేతను, సురాసురైః = దేవతలచేతను అసురులచేతను, సమాగమ్య = సమీపించి, దుర్నిరీక్ష్యామ్ = చూడ శక్యము కానిదియు, ధాత్రా = బ్రహ్మచేత, ప్రయత్నాత్ = ప్రయత్నమువలన, నిర్మితామ్ = సృజింపబడినదియు, దివ్యామ్ = దివ్యమైనదియు, మాయామయీమివ = మాయారూపమైనది వలె ఉన్నదియు, తుషారావృతామ్ = మంచుచేత కప్పబడినదియు, సాభ్రామ్ = మేఘములతో కూడినదియు అగు, పూర్ణచన్ద్రప్రభామివ = పూర్ణచంద్రకాంతి వలె ఉన్నదియు, అమ్భసః = నీటియొక్క, మధ్యే = మధ్యయందు, దురాధర్షామ్ = ఎదిరింపరాని,

దీప్తామ్ = ప్రకాశించుచున్న, సూర్యప్రభామివ = సూర్యకాంతి వలె ఉన్నదియు అగు ఆ అహల్యను, సః = ఆ రాముడు, దదర్శ చ = చూచెను.

తా. రాముడు, తపస్సుచేత వృద్ధిపొందిన తేజస్సు గల, మహాభాగ్యవతి యగు ఆ అహల్యను చూచెను. ఆమె మానవులు కాని, దేవతలు గాని అసురులు గాని సమీపించి చూడజాలని విధముగనుండెను. బ్రహ్మ ఆమెను ప్రయత్నపూర్వకముగ సృజించెనా అన్నట్లు దివ్యరూపవంతురాలై ఉండెను. మాయాస్వరూపిణి వలె ఉండెను. మంచు, మేఘములు కప్పిన పూర్ణచంద్రకాంతి వలెను, జలమధ్యమునందు ప్రతిబింబించిన సూర్యకాంతివలెను పైకి స్పష్టముగ కనబడ కున్నను ఎదిరింపరాని తేజస్సుతో ప్రకాశించుచుండెను. 13, 14

మూ· సా హి గౌతమవాక్యేన దుర్నిరీక్ష్యా బభూవ హ, 15
త్రయాణామపి లోకానాం యావద్రామస్య దర్శనమ్.

ప్ర. అ. సా=ఆమె, గౌతమవాక్యేన = గౌతమునియొక్క వాక్యముచేత, రామస్య = రామునియొక్క, దర్శనం యావత్ = దర్శన మగునంతవరకు, త్రయాణామపి లోకానామ్ = మూడు లోకములకును, దుర్నిరీక్ష్యా = చూడ శక్యము కానిది, బభూవ హ = అయినది.

తా. గౌతమవాక్యముచే ఆమె, రామదర్శన మగునంత వరకును, మూడు లోకములలో నివసించువారి కెవ్వరికిని కూడ చూడ శక్యము కాకుండెను. 15

మూ. శాపస్యాన్తముపాగమ్య తేషాం దర్శనమాగతా, 16
రాఘవౌ తు తతస్తస్యాః పాదౌ జగృహతుస్తదా.

ప్ర. అ. శాపస్య=శాపముయొక్క, అన్తమ్=అంతమును, ఉపాగమ్య = పొంది, తేషామ్ = వారియొక్క, దర్శనమ్ = దర్శనమును, ఆగతా = పొందినది. తతః=పిమ్మట, రాఘవౌ=రామలక్ష్మణులు, తదా=అప్పుడు, తస్యాః= ఆమెయొక్క, పాదౌ = పాదములను, జగృహతుః = గ్రహించిరి.

తా. ఆ శాపము అంత మగుటచే ఆమె వారికి కనబడెను. పిమ్మట రామలక్ష్మణులు ఆమె పాదములు స్పృశించి నమస్కరించిరి. 16

మూ. స్మరన్తీ గౌతమవచః ప్రతిజగ్రాహ సా చ తౌ, 17
పాద్యమర్ఘ్యం తథాతిథ్యం చకార సుసమాహితా,
ప్రతిజగ్రాహ కాకుత్స్థో విధిదృష్టేన కర్మణా. 18

ప్ర. అ. సా చ = ఆమె కూడ, గౌతమవచః = గౌతముని వాక్యమును, స్మరన్తీ = స్మరించుచున్నదై, తౌ = వారిని, ప్రతిజగ్రాహ = సగౌరవముగా ఆహ్వానించెను. సుసమాహితా = సావధానచిత్తురాలై, పాద్యమ్ = పాద్యమును, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, తథా = మరియు, ఆతిథ్యమ్ = ఆతిథ్యమును. విధి దృష్టేన = శాస్త్రదృష్ట మైన, కర్మణా = విధానముచే, చకార = చేసెను. కాకుత్స్థః = రాముడు, ప్రతిజగ్రాహ = స్వీకరించెను.

తా. అహల్య గౌతముని మాటలు స్మరించి, వారిని సగౌరవముగా ఆదరించుచు, శాస్త్రోక్తప్రకారమున, సావధాన మైన మనస్సుతో అర్ఘ్యపాద్యాదులు సమర్పించి అతిథిపూజ చేసెను. రాముడు ఆ సత్కారముల నన్నింటిని స్వీకరించెను. 17, 18

మూ. పుష్పవృష్టిర్మహత్యాసీద్దేవదున్దుభినిస్స్వనైః,
గన్ధర్వాప్సరసాం చైవ మహానాసీత్సమాగమః. 19

ప్ర. అ. దేవదున్దుభినిస్స్వనైః = దేవతల దుందుభిధ్వనులతో కూడ, మహతీ = గొప్ప, పుష్పవృష్టిః = పుష్పవర్షము, ఆసీత్ = ఆయెను. గన్ధర్వాప్సరసాం చైవ = గంధర్వులయొక్కయు అప్సరసలయొక్కయు, మహాన్ = గొప్ప, సమాగమః = సమాగమము, ఆసీత్ = ఆయెను.

తా. దేవతలు దుందుభులు మ్రోగించి పుష్పవృష్టి కురిపించిరి. గంధర్వులు పాటలు పాడగా అప్సరసలు నాట్యము చేసిరి. 19

మూ. సాధు సాధ్వీతి దేవాస్తామహల్యాం సమపూజయన్,
తపోబలవిశుద్ధాఙ్గీం గౌతమస్య వశానుగామ్. 20

ప్ర. అ. గౌతమస్య = గౌతమునియొక్క, వశానుగామ్ = వశములో ఉన్నదియు, తపోబలవిశుద్ధాఙ్గీమ్ = తపోబలముచే విశుద్ధ మైన శరీరముగలదియు

అగు, తామ్ = ఆ, అహల్యామ్ = అహల్యను, దేవాః = దేవతలు, సాధు సాధు ఇతి = బాగు బాగు అని, సమపూజయన్ = పూజించిరి.

తా. గౌతముని ఆదేశము ప్రకారము ఘోరతపస్సు చేయుటచే పరిశుద్ధమైన శరీరము గల ఆ అహల్యను దేవత లందరును బాగు బాగు అని మెచ్చుకొనిరి. 20

మూ. గౌతమోఽపి మహాతేజా అహల్యాసహితః సుఖీ,
రామం సంపూజ్య విధివత్తపస్తేపే మహాతపాః. 21

ప్ర. అ. మహాతపాః = గొప్ప తపస్సు గల, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, గౌతమోఽపి = గౌతముడు కూడా, అహల్యాసహితః=అహల్యతో కూడినవాడై, సుఖీ = సుఖవంతుడై, రామమ్ = రాముని, విధివత్ = యథాశాస్త్రముగా, సంపూజ్య=పూజించి, తపః తేపే = తపస్సు చేసెను.

తా. గొప్ప తపస్తేజస్సులు గల గౌతముడు కూడ అహల్యను స్వీకరించి, సంతోషించినవాడై, రాముని యథావిధిగా పూజించి తపస్సు చేసికొనుచుండెను. 21

మూ. రామోపి పరమాం పూజాం గౌతమస్య మహామునేః,
సకాశాద్విధివత్ప్రాప్య జగామ మిథిలాం తతః. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకోనపంచాశః సర్గః.

ప్ర. అ. రామోఽపి = రాముడు కూడ, గౌతమస్య మహామునేః=గౌతమ మహామునియొక్క, సకాశాత్ = సమీపమునుండి, పరమామ్ = గొప్ప, పూజామ్ = పూజను, విధివత్ = యథాశాస్త్రముగ, ప్రాప్య = పొంది, తతః = అచటినుండి, మిథిలామ్ = మిథిలను గూర్చి, జగామ = వెళ్లెను.

తా. రాముడు ఆ గౌతమమహాముని యథావిధిగా చేసిన పూజను అందుకొని మిథిలకు వెళ్లెను. 22

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
నలభైతొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ పఞ్చాశః సర్గః

మూ. తతః ప్రాగుత్తరాం గత్వా రామః సౌమిత్రిణా సహ,
విశ్వామిత్రం పురస్కృత్య యజ్ఞవాటముపాగమత్. 1

ప్ర. అ. తతః = పిమ్మట, రామః = రాముడు, సౌమిత్రిణా సహ= లక్ష్మణునితో కూడ, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, పురస్కృత్య = పురస్కరించుకొని, ప్రాగుత్తరామ్ = ఈశాన్యదిక్కునుగూర్చి, గత్వా = వెళ్లి, యజ్ఞవాటమ్=యజ్ఞవాటికను, ఉపాగమత్ = పొందెను.

తా. పిమ్మట, లక్ష్మణసమేతుడైన రాముడు విశ్వామిత్రుని వెంట నడచుచు ఈశాన్యదిక్కు వైపు ప్రయాణము చేసి, (జనకుని) యజ్ఞవాటమును చేరెను. 1

మూ. రామస్తు మునిశార్దూలమువాచ సహ లక్ష్మణః,
సాధ్వీ యజ్ఞసమృద్ధిర్హి జనకస్య మహాత్మనః. 2

ప్ర. అ. సహ లక్ష్మణః = లక్ష్మణసమేతుడైన, రామస్తు = రాముడైతే, మునిశార్దూలమ్ = మునిశ్రేష్ఠుని గూర్చి, ఉవాచ = పలికెను. మహాత్మనః = మహాత్ముడైన, జనకస్య = జనకునియొక్క, యజ్ఞసమృద్ధిః=యజ్ఞముయొక్క సంభారముల సంపద, సాధ్వీ = మంచిది కదా ?

తా. లక్ష్మణసహితుడైన రాముడు విశ్వామిత్రునితో ఇట్లు పలికెను. మహాత్ముడైన జనకుని యజ్ఞ, సంభారాదులు చాల ఉత్తమముగా ఉన్నవి. 2

మూ. బహూనీహ సహస్రాణి నానాదేశనివాసినామ్,
బ్రాహ్మణానాం మహాభాగ వేదాధ్యయనశాలినామ్. 3
ఋషివాటాశ్చ దృశ్యన్తే శకటీశతసంకులాః,
దేశో విధీయతాం బ్రహ్మన్ యత్ర వత్స్యామహే వయమ్. 4

ప్ర. అ. మహాభాగ=పూజ్యుడా ! ఇహ=ఇచట, నానాదేశనివాసినామ్ = నానాదేశములందు నివసించువారును, వేదాధ్యయనశాలినామ్=వేదాధ్యయనముతో ప్రకాశించువారును అగు, బ్రాహ్మణానామ్ = బ్రాహ్మణులయొక్క, సహస్రాణి= సహస్రములును, శకటీశతసంకులాః = వందలకొలది బండ్లతో ఇరుకైన, ఋషివాటాశ్చ = ఋషుల నివాసప్రదేశములు, దృశ్యన్తే = చూడబడుచున్నవి. బ్రహ్మన్=ఓ మహామునీ ! వయమ్=మనము, యత్ర=ఎచట, వత్స్యామహే= నివసించగలమో, అట్టి, దేశః = ప్రదేశము, విధీయతామ్=నిర్ణయింపబడుగాక.

తా. మహామునీ ! ఇచట, నానాదేశములనుండి వచ్చిన, అధ్యయన సంపన్నులైన బ్రాహ్మణులు వేలకొలది ఉన్నారు. వందల కొలది శకటము లతో ఇరుకుగా ఉన్న ఋషివాటికలు కనబడుచున్నవి. ఇచట మనము నివసించు టకు అను వగు ప్రదేశమును నిర్ణయింపుము. 3, 4

మూ. రామస్య వచనం శ్రుత్వా విశ్వామిత్రో మహామునిః,
నివేశమకరోద్దేశే వివిక్తే సలిలాన్వితే. 5

ప్ర. అ. మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, రామస్య=రామునియొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, సలిలాన్వితే= నీటితో కూడినదియు, వివిక్తే= జనసంమర్ద రహితమును అగు, దేశే = ప్రదేశము నందు, నివేశమ్ = విడిదిని, అకరోత్ = చేసెను.

తా. విశ్వామిత్రుడు రాముని మాటలు విని, జలసమృద్ధమై, జనసంమర్దము లేని ప్రదేశమునందు విడిది చేసెను. 5

మూ. విశ్వామిత్రమనుప్రాప్తం శ్రుత్వా స నృపతిస్తదా,
శతానన్దం పురస్కృత్య పురోహితమనిన్దితమ్. 6
ప్రత్యుజ్జగామ సహసా వినయేన సమన్వితః.

ప్ర. అ. సః=ఆ, నృపతిః=రాజు, తదా=అప్పుడు, విశ్వామిత్రమ్=విశ్వా మిత్రుని, అనుప్రాప్తమ్=వచ్చినవానినిగా, శ్రుత్వా=విని, అనిన్దితమ్ = దోష రహితుడును, పురోహితమ్=పురోహితుడును అగు, శతానన్దమ్ = శతానందుని,

పురస్కృత్య = ఎదుట ఉంచుకొని, వినయేన = వినయముతో, సమన్వితః = కూడినవాడై, సహసా = వెంటనే, ప్రత్యుజ్జగామ = ఎదురు వెళ్లెను.

తా. జనకమహారాజు విశ్వామిత్రుడు వచ్చినట్లు విని, పుణ్యాత్ముడును, పురోహితుడును అయిన శతానందుని ముందిడికొని, సవినయముగా ఎదురేగెను. 6

మూ. ఋత్విజోఽపి మహాత్మానస్త్వర్ఘ్యమాదాయ సత్వరమ్, 7
విశ్వామిత్రాయ ధర్మేణ దదుర్మన్త్రపురస్కృతమ్.

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, ఋత్విజోఽపి = ఋత్విక్కులు కూడ, సత్వరమ్ = శీఘ్రముగా, అర్ఘ్యమ్ = పూజాద్రవ్యమును, ఆదాయ = గ్రహించి, మంత్రపురస్కృతమ్ = మంత్రపూర్వకముగా, ధర్మేణ = ధర్మము చేత, విశ్వామిత్రాయ = విశ్వామిత్రునకు, దదుః = ఇచ్చిరి.

తా. మహాత్ములైన ఋత్విక్కులు శీఘ్రముగా పూజాద్రవ్యములు తీసికొని వచ్చి మంత్రపూర్వకముగా, ధర్మానుసారముగా విశ్వామిత్రునకు సమర్పించిరి. 7

మూ. ప్రతిగృహ్య చ తాం పూజాం జనకస్య మహాత్మనః, 8
పప్రచ్ఛ కుశలం రాజ్ఞో యజ్ఞస్య చ నిరామయమ్.

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, జనకస్య = జనకునియొక్క, తామ్ = ఆ, పూజామ్ = పూజను, ప్రతిగృహ్య = స్వీకరించి, రాజ్ఞః = రాజుయొక్క, కుశలమ్ = కుశలమును, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, నిరామయం చ = ఎట్టి బాధలు లేకుండుటను, పప్రచ్ఛ = అడిగెను.

తా. విశ్వామిత్రుడు, మహాత్ముడైన ఆ జనకుడు చేసిన పూజలను అందికొని, "నీవు కుశలముగా నున్నావా ? యజ్ఞము ఎట్టి లోపములును లేక జరుగుచున్నదా ?" అని ప్రశ్నించెను. 8

మూ. స తాంశ్చాపి మునీన్ పృష్ట్వా సోపాధ్యాయపురోధసః, 9
యథాన్యాయం తతః సర్వైః సమాగచ్ఛత్ ప్రహృష్టవత్.

ప్ర. అ. సః = విశ్వామిత్రుడు, సోపాధ్యాయపురోధసః = ఉపాధ్యాయులతోను పురోహితులతోను కూడిన, మునీన్ = మునులను, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, పృష్ట్వా = కుశలాదికమును అడిగి, తతః = పిమ్మట, ప్రహృష్టవత్ = సంతోషించినవాడై, సర్వైః = వారి అందరితోటిని, సమాగచ్ఛత్ = కలిసి ఉండెను.

తా. విశ్వామిత్రుడు ఉపాధ్యాయులను, పురోహితుని, మునులను న్యాయానుసారముగ కుశలప్రశ్నము చేసి వారందరితో కలిసి ఆనందముతో నుండెను. 9

మూ. అథ రాజా మునిశ్రేష్ఠం కృతాఞ్జలిరభాషత, 10
ఆసనే భగవానాస్తాం సహైభిర్మునిపుఙ్గవైః.

ప్ర. అ. అథ = పిమ్మట, రాజా = రాజు, కృతాంజలిః = దోసిలి కట్టినవాడై, మునిశ్రేష్ఠమ్ = మునిశ్రేష్ఠుని గూర్చి, అభాషత = పలికెను. భగవాన్ = పూజ్యుడవైన నీవు, ఏభిః = ఈ, మునిపుఙ్గవైః సహ = మునిశ్రేష్ఠులతో కూడ, ఆసనే = ఆసనమునందు, ఆస్తామ్ = కూర్చుందువుగాక.

తా. పిమ్మట జనకుడు అంజలి ఘటించి విశ్వామిత్రునితో ఇట్లు పలికెను— "ఓ పూజ్యుడా! మునులతో గూడ నీవు ఆసనముపై కూర్చుండుము." 10

మూ. జనకస్య వచః శ్రుత్వా నిషసాద మహామునిః, 11
పురోధా ఋత్విజశ్చైవ రాజా చ సహ మన్త్రిభిః.

ప్ర. అ. జనకస్య = జనకునియొక్క, వచః = వాక్కును, శ్రుత్వా = విని, మహామునిః = మహాముని, నిషసాద = కూర్చుండెను. పురోధాః = పురోహితుడును, ఋత్విజశ్చైవ = ఋత్విక్కులును, మన్త్రిభిః సహ = మంత్రులతో కూడ, రాజా చ = రాజును, (కూర్చుండిరి).

తా. జనకుని వాక్యము విని విశ్వామిత్రుడు కూర్చుండెను. పిమ్మట, పురోహితుడైన శతానందుడును, ఋత్విక్కులును, రాజును, మంత్రులును కూర్చుండిరి. 11

మూ. ఆసనేషు యథాన్యాయముపవిష్టాన్ సమన్తతః, 12
దృష్ట్వా స నృపతిస్తత్ర విశ్వామిత్రమథాబ్రవీత్.

ప్ర. అ. అథ = పిమ్మట, సః = ఆ, నృపతిః = రాజు, తత్ర = అచట, సమన్తతః = నలు వైపుల, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, ఆసనేషు = ఆసనములయందు, ఉపవిష్టాన్ = కూర్చున్న వారినందరిని, దృష్ట్వా = చూచి, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. వారందరును న్యాయానుసారముగ ఉచితాసనములపై కూర్చున్న పిమ్మట జనకుడు విశ్వామిత్రునితో ఇట్లు పలికెను. 12

మూ. అద్య యజ్ఞసమృద్ధిర్మే సఫలా దైవతైః కృతా, 13
అద్య యజ్ఞఫలం ప్రాప్తం భగవద్దర్శనాన్మయా.

ప్ర. అ. అద్య = ఈనాడు, మే = నాయొక్క, యజ్ఞసమృద్ధిః = యజ్ఞ సంపద, సఫలా = ఫలము కలదిగా, దైవతైః = దేవతలచేత, కృతా = చేయ బడినది. అద్య = ఈనాడు, భగవద్దర్శనాత్ = పూజ్యుడ వైన నీయొక్క దర్శనమువలన, మయా = నాచేత, యజ్ఞఫలమ్ = యజ్ఞముయొక్క ఫలము, ప్రాప్తమ్ = పొందబడినది.

తా. ఈనాడు దేవతలు సర్వాంగసంపన్న మైన నా యజ్ఞమును సఫలము చేసినారు. పూజ్యుడ వైన నీ దర్శనము లభించినది గాన ఈనాడు నా యజ్ఞము సఫల మైనది. 13

మూ. ధన్యోస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే మునిపుఙ్గవ, 14
యజ్ఞోపసదనం బ్రహ్మన్ ప్రాప్తోఽసి మునిభిః సహ.

ప్ర. అ. మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠుడ వైన, బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణోత్తమా! మునిభిః సహ = మునులతో కూడ, యస్య = ఏ, మే = నాయొక్క, యజ్ఞోప సదనమ్ = యజ్ఞస్థానమును గూర్చి, ప్రాప్తః అసి = వచ్చినావో, అట్టి నేను, ధన్యః అస్మి = ధన్యుడ నైతిని. అనుగృహీతః అస్మి = అనుగ్రహింపబడినవాడ నైతిని.

తా. మునిశ్రేష్ఠుడ వగు విశ్వామిత్రా! మునులతో కలిసి నీవు నా యజ్ఞ వాటమునకు వచ్చుటచే నేను ధన్యుడ నైతిని, అనుగ్రహపాత్ర మైతిని. 14

మూ. ద్వాదశాహం తు బ్రహ్మర్షే శేషమాహుర్మనీషిణః, 15
తతో భాగార్థినో దేవాన్ ద్రష్టుమర్హసి కౌశిక.

ప్ర. అ. బ్రహ్మర్షే=ఓ బ్రహ్మర్షీ! మనీషిణః=విద్వాంసులు, ద్వాదశాహం తు = పండ్రెండు రోజులు మాత్రమే, శేషమ్ = శేషించినదానినిగా, ఆహుః = చెప్పుచున్నారు. కౌశిక = విశ్వామిత్రా! తతః = అటుపిమ్మట, భాగార్థినః = భాగములను కోరుచున్న, దేవాన్=దేవతలను, ద్రష్టుమ్=చూచుటకు, అర్హసి= తగియున్నావు.

తా. బ్రహ్మర్షి వైన విశ్వామిత్రా! ఈ యజ్ఞము పూర్తి యగుటకు ఇంక పండ్రెండు దినములే ఉన్న వని పండితులు చెప్పుచున్నారు. పిమ్మట యజ్ఞ భాగములకొరకు వచ్చు దేవతలను చూడగలవు. 15

మూ. ఇత్యుక్త్వా మునిశార్దూలం ప్రహృష్టవదన స్తదా, 16
పున స్తం పరిపప్రచ్ఛ ప్రాఞ్జలిః ప్రణతో నృపః.

ప్ర. అ. నృపః = రాజు, మునిశార్దూలమ్=మునిశ్రేష్ఠుని గూర్చి, ఇతి= ఈ విధముగా, ఉక్త్వా = పలికి, తదా = అప్పుడు, ప్రహృష్టవదనః = సంతసించిన ముఖము కలవాడై, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, ప్రణతః= నమస్కరించుచు, పునః=మరల, తమ్=ఆతనిని. పరిపప్రచ్ఛ=అడిగెను.

తా. జనకమహారాజు విశ్వామిత్రునితో ఈ విధముగా పలికి, సంతోషముతో వికసించిన ముఖము కలవాడై, దోసిలి యొగ్గి నమస్కరించుచు, మరల విశ్వామిత్రుని ఈ విధముగ ప్రశ్నించెను. 16

మూ. ఇమౌ కుమారౌ భద్రం తే దేవతుల్యపరాక్రమౌ, 17
గజసింహగతీ వీరౌ శార్దూలవృషభోపమౌ,
పద్మపత్రవిశాలాక్షౌ ఖడ్గతూణీధనుర్ధరౌ. 18
అశ్వినావివ రూపేణ సముపస్థితయౌవనౌ,
యదృచ్ఛయైవ గాం ప్రాప్తౌ దేవలోకాదివామరౌ. 19
కథం పద్భ్యామిహ ప్రాప్తౌ కిమర్థం కస్య వా మునే.

ప్ర. అ. మునే = విశ్వామిత్రా ! తే = నీకు, భద్రమ్ = మంగళ మగు గాక. దేవతుల్యపరాక్రమౌ = దేవతలతో సమాన మైన పరాక్రమము కలవారును, గజసింహగతీ = గజసింహముల గమనమువంటి గమనము కలవారును, వీరౌ = వీరులును, శార్దూలవృషభోపమౌ = శార్దూలముతోడను, వృషభముతోడను సమానులును, పద్మపత్రవిశాలాక్షౌ = తామరపూవుల రేకుల వలె విశాల మైన నేత్రములు కలవారును, ఖడ్గతూణీధనుర్ధరౌ = ఖడ్గములను, అంబులపొదులను, ధనస్సులను ధరించినవారును, రూపేణ = రూపముచేత, అశ్వినావివ = అశ్వినీ దేవతల వలె ఉన్నవారును, సముపస్థితయౌవనౌ = సమీపించిన యౌవనము కలవారును, దేవలోకాత్ = దేవలోకమునుండి, యదృచ్ఛయా = స్వేచ్ఛాను సారముగా, గామ్ = భూమిని, ప్రాప్తౌ = చేరిన, అమరౌ ఇవ = దేవతల వలె ఉన్నవారును అగు, ఇమౌ = ఈ, కుమారౌ = బాలులు, ఇహ = ఇచటికి, కథమ్ = ఎట్లు, కిమర్థమ్ = ఎందుకు, పద్భ్యామ్ = పాదములచేత, ప్రాప్తౌ = వచ్చినారు ? కస్య వా = ఎవరికి సంబంధించినవారు ?

తా. విశ్వామిత్రా ! (నీకు క్షేమ మగు గాక.) దేవతలతో సమాస మైన పరాక్రమము కలవారును, గజసింహముల నడక వంటి నడక కలవారును, వీరులును, శార్దూలవృషభములతో తుల్యులును, పద్మపత్రముల వలె విశాల మైన నేత్రములు కలవారును, ఖడ్గములను అంబులపొదులను ధనస్సులను ధరించినవారును, అశ్వినీదేవతల వంటి సౌందర్యము కలవారును, యౌవనము సమీపించుచున్నవారును, దేవలోకమునుండి భూలోకమునకు దిగి వచ్చిన దేవతల వలె ఉన్నవారును, అగు ఈ బాలురు ఎవరివారు ? ఇచటికి కాలి నడకనే వచ్చినా రేమి ? ఎందుకు వచ్చినారు? 17-19

మూ. వరాయుధధరౌ వీరౌ కస్య పుత్రౌ మహామునే, 20
భూషయన్తావిమం దేశం చన్ద్రసూర్యావివామ్బరమ్,
పరస్పరస్య సదృశౌ ప్రమాణేఙ్గితచేష్టితైః, 21
కాకపక్షధరౌ వీరౌ శ్రోతుమిచ్ఛామి తత్త్వతః.

ప్ర. అ. మహామునే = ఓ మహామునీ ! వరాయుధధరౌ = శ్రేష్ఠ మైన ఆయుధములను ధరించిన, వీరౌ = ఈ వీరులు, కస్య = ఎవనియొక్క, పుత్రౌ =

పుత్రులు. చన్ద్రసూర్యౌ = చంద్రసూర్యులు, అమ్బరమివ = ఆకాశమును వలె, ఇమమ్ = ఈ, దేశమ్ = ప్రదేశమును, భూషయన్తౌ = అలంకరించుచున్న వారును, ప్రమాణేఙ్గితచేష్టితైః = ప్రమాణముచేతను, అభిప్రాయసూచనలచేతను, చేష్టలచేతను, పరస్పరస్య = ఒకరికొకరు, సదృశౌ = పోలికగలవారును, కాకపక్షధరౌ = జునపములను ధరించినవారును అగు, వీరౌ = ఈ వీరులను గూర్చి, తత్త్వతః = యథార్థముగా, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = ఇచ్ఛయించు చున్నాను.

తా. మహామునీ ! శ్రేష్ఠ మైన ఆయుధములను ధరించిన ఈ వీరులు ఎవని కుమారులు ? జునపములను ధరించిన ఈ వీరులు ప్రమాణమునందును, ఇంగితములందును, చేష్టలందును ఒకరి నొకరు పోలియున్నారు. చంద్రసూర్యులు ఆకాశమును ప్రకాశింపచేసి నట్లు ఈ ప్రదేశమును ప్రకాశింప చేయుచున్నారు. ఈ వీరులను గూర్చి తెలిసికొన దలచుచున్నాను. 20, 21

మూ. తస్య తద్వచనం శ్రుత్వా జనకస్య మహాత్మనః, 22
న్యవేదయన్మహాత్మానౌ పుత్రౌ దశరథస్య తౌ.

ప్ర. అ. మహాత్మనః = మహాత్ము డైన, తస్య = ఆ, జనకస్య = జనకుని యొక్క, తత్ = ఆ, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, తౌ = ఆ, మహాత్మానౌ = మహాత్ములగు, దశరథస్య = దశరథునియొక్క, పుత్రౌ = పుత్రులనుగా, న్యవేదయత్ = తెలిపెను.

తా. విశ్వామిత్రుడు మహాత్ము డైన జనకుని మాటలు విని, ఆ మహాత్ము లిరువురును దశరథకుమారు లని తెలిపెను. 22

మూ. సిద్ధాశ్రమనివాసం చ రాక్షసానాం వధం తథా. 23
తచ్చాగమనమవ్యగ్రం విశాలాయాశ్చ దర్శనమ్,
అహల్యాదర్శనం చైవ గౌతమేన సమాగమమ్. 24
మహాధనుషి జిజ్ఞాసాం కర్తుమాగమనం తథా,
ఏతత్సర్వం మహాతేజా జనకాయ మహాత్మనే, 25
నివేద్య విరరామాథ విశ్వామిత్రో మహామునిః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పఞ్చాశః సర్గః.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, సిద్ధాశ్రమనివాసం చ = సిద్ధాశ్రమమునందు నివాసమును, తథా = మరియు, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, వధమ్ = వధను, అవ్యగ్రమ్ = నిర్భయముగా, తత్ = ఆ, ఆగమనమ్ = వచ్చుటను, విశాలాయాః = విశాలానగరముయొక్క, దర్శనమ్ = దర్శనమును, అహల్యా దర్శనం చైవ = అహల్యాదర్శనమును, గౌతమేన = గౌతమునితో, సమాగమమ్ = సమాగమమును, తథా = మరియు, మహాధనుషి = గొప్ప దైన శివధనస్సునందు, జిజ్ఞాసామ్ = పరీక్షను, కర్తుమ్ = చేయుటకొరకు, ఆగమనమ్ = వచ్చుటను, ఏతత్సర్వమ్ = దీని నంతను, మహాత్మనే = మహాత్ము డైన, జనకాయ = జనకునకు, నివేద్య = తెలిపి, అథ = పిమ్మట, విరరామ = విరమించెను.

తా. మహాతేజఃశాలి యగు విశ్వామిత్రమహాముని, రామలక్ష్మణులు నిర్భయముగ సిద్ధాశ్రమమునకు వచ్చి, అచట నివసించి రాక్షసులను సంహరించుట, విశాలానగరమును చూచుట, అహల్యాసందర్శనము, గౌతమునితో సమాగమము, శివధనస్సును పరీక్షించుటకై మిథిలకు వచ్చుట మొదలగు విషయము లన్నియు జనకమహారాజునకు తెలిపెను. 23-25

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
ఏబదవ సర్గ సమాప్తము.

అథ ఏకపఞ్చాశః సర్గః

మూ. తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రస్య ధీమతః,
హృష్టరోమా మహాతేజాః శతానన్దో మహాతపాః. 1

గౌతమస్య సుతో జ్యేష్ఠస్తపసా ద్యోతితప్రభః,
రామసందర్శనాదేవ పరం విస్మయమాగతః. 2

ప్ర. అ. ధీమతః = బుద్ధిమంతు డైన, తస్య = ఆ, విశ్వామిత్రస్య = విశ్వామిత్రునియొక్క, తద్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, మహాతపాః = గొప్ప తపస్సు కల వాడును, గౌతమస్య = గౌతమునియొక్క, జ్యేష్ఠః సుతః = పెద్దకుమారుడును, తపసా = తపస్సుచేత, ద్యోతితప్రభః = ప్రకాశించుచున్న కాంతి కలవాడును అగు, శతానన్దః = శతానందుడు, హృష్టరోమాః = గగుర్పాటు చెందినవాడై, రామ సందర్శనాదేవ = రాముని చూడగనే, పరమ్ = గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును, ఆగతః = పొందినాడు.

తా. మహాతేజశ్శాలియు, మహాతపస్వియు, తపస్సుతో ప్రకాశించుచున్న వాడును అగు గౌతమజ్యేష్ఠపుత్రు డైన శతానందుడు, బుద్ధిమంతు డగు విశ్వామిత్రుని మాటలు విని, గగుర్పాటు చెందిన శరీరముతో, రాముని చూడగనే అత్యాశ్చర్యవంతు డయ్యెను. 1, 2

మూ. స తౌ నిషణ్ణౌ సంప్రేక్ష్య సుఖాసీనౌ నృపాత్మజౌ,
శతానన్దో మునిశ్రేష్ఠం విశ్వామిత్రమథాబ్రవీత్. 3

ప్ర. అ. అథ = పిమ్మట, సః = ఆ, శతానన్దః = శతానందుడు, నిషణ్ణౌ = సమీపమునం దున్నవారును, సుఖాసీనౌ = సుఖముగా కూర్చున్నవారును అగు, తౌ = ఆ, నృపాత్మజౌ = రాజకుమారులను, సంప్రేక్ష్య = చూచి, మునిశ్రేష్ఠమ్ = మునులలో శ్రేష్ఠ డైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. శతానందుడు సమీపమునందే సుఖముగా కూర్చున్న ఆ రాజకుమారులను చూచి మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రునితో ఇట్లు పలికెను. 3

మూ. అపి తే మునిశార్దూల మమ మాతా యశస్వినీ,
దర్శితా రాజపుత్రాయ తపో దీర్ఘముపాగతా. 4

ప్ర. అ. మునిశార్దూల = మునిశ్రేష్ఠుడా! దీర్ఘమ్ = దీర్ఘమైన, తపః = తపస్సును, ఉపాగతా = పొందినదియు, యశస్వినీ = యశస్సుకలదియు అగు, మమ = నాయొక్క, మాతా = తల్లి, తే = నీచేత, రాజపుత్రాయ = రాజకుమారునకు, అపి దర్శితా = చూపబడినదా?

తా. ఓ మునిశ్రేష్ఠా! తీవ్రతపస్సు చేయుచున్న, యశస్విని యగు మా తల్లిని రామునకు చూపితివా? 4

మూ. అపి రామే మహాతేజా మమ మాతా యశస్వినీ,
వన్యైరుపాహరత్పూజాం పూజార్హే సర్వదేహినామ్. 5

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కలదియు, యశస్వినీ = కీర్తి కలదియు అగు, మమ మాతా = నా తల్లి, సర్వదేహినామ్ = సకలప్రాణులకును, పూజార్హే = పూజించుటకు తగిన, రామే = రామునియందు, వన్యైః = వనమునందు లభ్యము లగు వస్తువులచే, పూజామ్ = పూజను, అపి ఉపాహరత్ = చేసినదా?

తా. గొప్ప తేజస్సు, యశస్సు గల మా తల్లి సర్వప్రాణులచేతను పూజింపదగిన రాముని ఫలమూలాదు లర్పించి పూజించినదా? 5

మూ. అపి రామాయ కథితం యథావృత్తం పురాతనమ్,
మమ మాతుర్మహాతేజో దైవేన దురనుష్ఠితమ్. 6

ప్ర. అ. మహాతేజః = గొప్ప తేజస్సుకలవాడా! మమ = నాయొక్క, మాతుః = తల్లివిషయమున, దైవేన = దైవముచేత, దురనుష్ఠితమ్ = చెడ్డగా చేయబడిన, పురాతనమ్ = పూర్వము జరిగిన విషయము, యథావృత్తమ్ = జరిగినది జరిగినట్లుగా, రామాయ = రామునకు, అపి కథితమ్ = చెప్పబడినదా?

తా. మహాతేజశ్శాలి వైన విశ్వామిత్రా! విధిబలముచే మా తల్లి విషయమున జరిగిన వృత్తాంతము నంతను రామునకు యథాతథముగ చెప్పినావా? 6

మూ. అపి కౌశిక భద్రం తే గురుణా మమ సంగతా,
మమ మాతా మునిశ్రేష్ఠ రామసందర్శనాదితః. 7

ప్ర. అ. కౌశిక = విశ్వామిత్రుడా! తే = నీకు, భద్రమ్ = మంగళమగుగాక. మునిశ్రేష్ఠ = మునిశ్రేష్ఠుడా! మమ మాతా = నా తల్లి, రామసందర్శనాదితః = రామునియొక్క దర్శనాదికమువలన, మమ గురుణా = నా తండ్రితో, అపి సంగతా = కలిసినదా?

తా. మునిశ్రేష్ఠుడ వైన విశ్వామిత్రా! రాముని చూచి ఆతిథ్యాదు లిచ్చుటచే పవిత్రురా లైన మా తల్లి మా తండ్రిగారిని చేరినదా? 7

మూ. అపి మే గురుణా రామః పూజితః కుశికాత్మజ,
ఇహాగతో మహాతేజాః పూజాం ప్రాప్తో మహాత్మనః. 8

ప్ర. అ. కుశికాత్మజ = విశ్వామిత్రా! రామః = రాముడు, మే గురుణా = నా తండ్రిచేత, అపి పూజితః = పూజింపబడినాడా? ఇహ = ఇచటికి, ఆగతః = వచ్చిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల నా తండ్రి, మహాత్మనః = మహాత్ముడైన రామునినుండి, పూజామ్ = పూజను, అపి ప్రాప్తః = పొందినాడా?

తా. కుశికనందనా! నా తండ్రి రాముని పూజించినాడా? అచటికి వచ్చిన నా తండ్రిని ఈ మహాత్ముడు గౌరవించినాడా? 8

మూ. అపి శాన్తేన మనసా గురుర్మే కుశికాత్మజ,
ఇహాగతేన రామేణ ప్రయతేనాభివాదితః. 9

ప్ర. అ. కుశికాత్మజ = విశ్వామిత్రా! ఇహ = ఇచటికి, ఆగతేన = వచ్చిన, ప్రయతేన = పరిశుద్ధు డైన, రామేణ = రామునిచేత, మే గురుః = నా తండ్రి, శాన్తేన = శాంత మైన, మనసా = మనస్సుతో, అపి అభివాదితః = నమస్కరింప బడినాడా?

తా. విశ్వామిత్రా ! ఆ ఆశ్రమమును చేరిన పరిశుద్ధ దగు రాముడు శాంతమైన మనస్సుతో నా తండ్రిని పూజించినాడా ? 9

మూ. తచ్ఛ్రుత్వా వచనం తస్య విశ్వామిత్రో మహామునిః,
ప్రత్యువాచ శతానన్దం వాక్యజ్ఞో వాక్యకోవిదమ్. 10

ప్ర. అ. మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, తస్య = ఆతనియొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, వాక్యజ్ఞః = వాక్యజ్ఞానము కల ఆతడు, వాక్యకోవిదమ్ = వాక్యము నెరిగిన, శతానన్దమ్ = శతానందుని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. మాట లాడుటలో నేర్పు గల విశ్వామిత్రమహాముని ఆ మాటలు విని, మాటలలో నేర్పు గల ఆ శతానందునితో ఇట్లు పలికెను. 10

మూ. నాతిక్రాన్తం మునిశ్రేష్ఠ యత్కర్తవ్యం కృతం మయా
సంగతా మునినా పత్నీ భార్గవేణేవ రేణుకా. 11

ప్ర. అ. మునిశ్రేష్ఠ = మునిశ్రేష్ఠుడా ! న అతిక్రాన్తమ్ = (ఏ పనియు) విడువబడలేదు. మయా = నాచేత, యత్ = ఏది, కర్తవ్యమ్ = చేయదగినదో, అది, కృతమ్ = చేయబడినది. రేణుకా = రేణుకాదేవి, భార్గవేణేవ=జమదగ్నితో వలె, పత్నీ = (భార్య) అహల్య, మునినా = గౌతమునితో, సంగతా=కలిసినది.

తా. మునిశ్రేష్ఠుడ వైన శతానందా ! చేయదగిన దంతయు చేసినాను. ఏమియు విడువలేదు. రేణుకాదేవి జమదగ్నిని చేరినట్లు అహల్య గౌతముని చేరినది. 11

మూ. తచ్ఛ్రుత్వా వచనం తస్య విశ్వామిత్రస్య భాషితమ్,
శతానన్దో మహాతేజా రామం వచనమబ్రవీత్. 12

ప్ర. అ. తస్య=ఆ, విశ్వామిత్రస్య=విశ్వామిత్రుని యొక్క, భాషితమ్= పలకబడిన, తత్ = ఆ, వచనమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, మహాతేజాః= గొప్ప తేజస్సు గల, శతానన్దః = శతానందుడు, రామమ్ = రాముని గూర్చి, వచనమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. విశ్వామిత్రుని మాటలను విని మహాతేజశ్శాలి యగు శతానందుడు రామునితో ఇట్లనెను. 12

మూ. స్వాగతం తే నరశ్రేష్ఠ దిష్ట్యా ప్రాప్తోఽసి రాఘవ,
విశ్వామిత్రం పురస్కృత్య మహర్షిమపరాజితమ్. 13

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడ వైన, రాఘవ=రామా, అపరాజితమ్ = పరాజయము లేని, మహర్షిమ్ = మహర్షి యైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, పురస్కృత్య = పురస్కరించుకొని, దిష్ట్యా = దైవవశముచేత, ప్రాప్తః అసి = వచ్చితివి. తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము.

తా. నరశ్రేష్ఠుడ వైన రామా! అడ్డు లేని మహిమ గల విశ్వామిత్ర మహర్షిని అనుసరించి దైవవశముచే (మా అదృష్టముచే) ఇచటికి వచ్చితివి. నీకు స్వాగతము. 13

మూ. అచిన్త్యకర్మా తపసా బ్రహ్మర్షిరతులప్రభః,
విశ్వామిత్రో మహాతేజా వేత్స్యేనం పరమాం గతిమ్. 14

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, అచిన్త్యకర్మా = ఊహింప శక్యము కాని పనులు కలవాడు. తపసా = తపస్సుచేత, బ్రహ్మర్షిః = బ్రహ్మర్షి, అతులప్రభః=సాటి లేని కాంతి కలవాడు. ఏనమ్= ఈతనిని, పరమామ్ = గొప్ప, గతిమ్ = గతినిగా, వేత్సి = ఎరుగుదువు.

తా. గొప్ప తేజస్సు గల ఈ విశ్వామిత్రుని కార్యములు మనసా కూడ ఊహింప శక్యము కానివి. తపస్సుచేత బ్రహ్మర్షి యైనాడు. ఈతని ప్రభావము సాటిలేనిది. ఈతనినే ఉత్తమగతిగా గ్రహించినావు. 14

మూ. నాస్తి ధన్యతరో రామ త్వత్తోఽన్యో భువి కశ్చన,
గోప్తా కుశికపుత్రస్తే యేన తప్తం మహత్తపః. 15

ప్ర. అ. రామ = రామా, భువి = ఈ భూలోకమునందు, త్వత్తః = నీకంటె, ధన్యతరః = ఎక్కువ ధన్యుడు, అన్యః = మరి యొకడు, కశ్చన = ఒక్కడును, నాస్తి = లేడు. యేన = ఎవనిచేత, మహత్ = గొప్ప, తపః =

తపస్సు, తప్తమ్ = చేయబడినదో, అట్టి, కుశికపుత్రః = విశ్వామిత్రుడు, తే = నీకు, గోప్తా = రక్షకుడు.

తా. రామా ! గొప్ప తపస్సు చేసిన విశ్వామిత్రుడు నీకు రక్షకుడుగా ఉన్నాడు. అందుచే నీకంటె ధన్యుడు మరెవ్వడును ఈ లోకములో లేడు. 15

మూ. శ్రూయతాం చాభిధాస్యామి కౌశికస్య మహాత్మనః,
యథాబలం యథావృత్తం తన్మే నిగదతః శృణు. 16

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, కౌశికస్య = విశ్వామిత్రుని, బలమ్ = బలము, యథా = ఎట్లో, వృత్తమ్ = చరిత్రము, యథా = ఎట్లో, అభిధాస్యామి = చెప్పెదను. తత్ = దానిని, నిగదతః = చెప్పుచున్న, మే = నా నుండి, శృణు = వినుము.

తా. విశ్వామిత్రుని బల మెంతటిదో, ఆతని చరిత్ర ఎట్టిదో చెప్పెదను, వినుము. 16

మూ. రాజాభూదేష ధర్మాత్మా దీర్ఘకాలమరిన్దమః,
ధర్మజ్ఞః కృతవిద్యశ్చ ప్రజానాం చ హితే రతః. 17

ప్ర. అ. ఏషః = ఇతడు, ధర్మాత్మా = ధర్మాత్ముడును, అరిన్దమః = శత్రువులను అణచివేయు వాడును, ధర్మజ్ఞః = ధర్మములు తెలిసినవాడును, కృతవిద్యః = విద్యల నభ్యసించినవాడును, ప్రజానామ్ = ప్రజలయొక్క, హితే = హితమునందు, రతః = ఆసక్తి కలవాడును అగు, రాజా = రాజుగా, దీర్ఘకాలమ్ = చాల కాలము, అభూత్ = ఉండెను.

తా. ఈ విశ్వామిత్రుడు, చాలకాలము పాటు, ధర్మాత్ముడును, శత్రువినాశకుడును, ధర్మవేత్తయు, సకలవిద్యలను అభ్యసించిన వాడును, ప్రజల మేలు కోరువాడును అగు రాజుగా ఉండెను. 17

మూ. ప్రజాపతిసుతశ్చాసీత్కుశో నామ మహీపతిః,
కుశస్య పుత్రో బలవాన్ కుశనాభస్సుధార్మికః. 18

ప్ర. అ. ప్రజాపతిసుతః = ప్రజాపతియొక్క కుమారు డైన, కుశో నామ=కుశుడను పేరు గల, మహీపతిః = రాజు, ఆసీత్=ఉండెను. బలవాన్= బలవంతుడును, సుధార్మికః = మంచి ధర్మాత్ముడును అగు, కుశనాభః = కుశ నాభుడు, కుశస్య = కుశునియొక్క, పుత్రః = పుత్రుడు.

తా. బ్రహ్మపుత్రు డైన కుశు డనెడు రాజు ఉండెను. ఆ కుశునకు, బలవంతుడును, ధార్మికుడును అగు కుశనాభు డను కుమారు డుండెను. 18

మూ. కుశనాభసుతస్త్వాసీద్గాధిరిత్యేవ విశ్రుతః,
గాధేః పుత్రో మహాతేజా విశ్వామిత్రో మహామునిః. 19

ప్ర. అ. గాధిః ఇత్యేవ = గాధి అని, విశ్రుతః = ప్రసిద్ధు డైన, కుశనాభ సుతః తు = కుశనాభుని కుమారుడు. ఆసీత్ = ఉండెను. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, గాధేః = గాధియొక్క, పుత్రః = కుమారుడు.

తా. ప్రసిద్ధు డగు గాధి కుశనాభుని కుమారుడు. మహాతేజశ్శాలి యైన ఈ విశ్వామిత్రముని ఆ గాధియొక్క కుమారుడు. 19

మూ. విశ్వామిత్రో మహాతేజాః పాలయామాస మేదినీమ్,
బహువర్షసహస్రాణి రాజా రాజ్యమకారయత్. 20

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, మేదినీమ్ = భూమిని, పాలయామాస = పరిపాలించెను. రాజా = ఈ రాజు, బహువర్షసహస్రాణి = చాల వేల సంవత్సరములు, రాజ్యమ్ = రాజ్యమును, అకారయత్ = చేసెను.

తా. మహాతేజఃశాలి యగు విశ్వామిత్రుడు రాజై చాల వేల సంవత్స రములు రాజ్యము చేసెను. 20

మూ. కదాచిత్తు మహాతేజా యోజయిత్వా వరూథినీమ్,
అక్షౌహిణీపరివృతః పరిచక్రామ మేదినీమ్. 21

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల ఆ విశ్వామిత్రుడు, కదాచిత్ = ఒకానొకప్పుడు, వరూధినీమ్ = సేనను, యోజయిత్వా = కూర్చుకొని, అక్షౌహిణీపరివృతః = అక్షౌహిణిప్రమాణము గల సైన్యముతో కూడిన వాడై, మేదినీమ్ = భూమిని, పరిచక్రామ = చుట్టు తిరిగెను.

తా. మహాతేజఃశాలి యగు విశ్వామిత్రుడు ఒకప్పుడు సైన్యమును సమకూర్చుకొని, అక్షౌహిణీ ప్రమాణములో నున్న సైన్యము వెంట రాగా భూమి అంతయును తిరిగెను. 21

మూ. నగరాణి సరాష్ట్రాణి సరితశ్చ తథా గిరీన్,
ఆశ్రమాన్ క్రమశో రామ విచరన్నాజగామ హ. 22

వసిష్ఠస్యాశ్రమపదం నానావృక్షసమాకులమ్,
నానామృగగణాకీర్ణం సిద్ధచారణసేవితమ్. 23

దేవదానవగన్ధర్వైః కిన్నరైరుపశోభితమ్,
ప్రశాన్తహరిణాకీర్ణం ద్విజసఙ్ఘనిషేవితమ్. 24

బ్రహ్మర్షిగణసఙ్కీర్ణం దేవర్షిగణసేవితమ్,
తపశ్చరణసంసిద్ధైరగ్నికల్పైర్మహాత్మభిః. 25

అబ్భక్షైర్వాయుభక్షైశ్చ శీర్ణపర్ణాశనైస్తథా,
ఫలమూలాశనైర్దాన్తైర్జితరోషైర్జితేన్ద్రియైః. 26

ఋషిభిర్వాలఖిల్యైశ్చ జపహోమపరాయణైః,
అన్యైర్వైఖానసైశ్చైవ సమన్తాదుపశోభితమ్. 27

ప్ర. అ. రామ = రామా! సరాష్ట్రాణి = రాష్ట్రములతో కూడిన, నగరాణి = నగరములను, సరితః = నదులను, తథా = మరియు, గిరీన్ = పర్వతములను, ఆశ్రమాన్ = ఆశ్రమములను, క్రమశః = క్రమముగా, విచరన్ = సంచరించుచు, నానావృక్షసమాకులమ్ = అనేకవిధము లైన వృక్షములతో ఆకుల మైనదియు,

నానామృగగణాకీర్ణమ్ = అనేక విధములైన మృగగణములతో నిండినదియు, సిద్ధచారణసేవితమ్ = సిద్ధులచేతను చారణులచేతను సేవింపబడినదియు, దేవదానవగన్ధర్వైః = దేవదానవగంధర్వులతోను, కిన్నరైః = కిన్నరులతోను, ఉపశోభితమ్ = ప్రకాశించుచున్నదియు, ప్రశాన్తహరిణాకీర్ణమ్ = ప్రశాంతము లైన లేళ్లతో కూడినదియు, ద్విజసఙ్ఘనిషేవితమ్ = పక్షుల సముదాయముచే సేవింపబడినదియు, బ్రహ్మర్షిగణసఙ్కీర్ణమ్ = బ్రహ్మర్షుల సముదాయముచే వ్యాప్తమైనదియు, దేవర్షిగణసేవితమ్=దేవర్షుల సముదాయములచే సేవింపబడినదియు, తపశ్చరణసంసిద్ధైః = తపస్సును ఆచరించుటచే సిద్ధి పొందినవారును, అగ్నికల్పైః = అగ్నితుల్యులును, మహాత్మభిః = మహాత్ములును, అబ్భక్షైః = ఉదకమును మాత్రమే భక్షించువారును, వాయుభక్షైశ్చ = వాయువును మాత్రమే భక్షించువారును, తథా = మరియు, శీర్ణపర్ణాశనైః = రాలిన ఆకులే ఆహారముగా కలవారును, ఫలమూలాశనైః = ఫలములను దుంపలను తినువారును, దాన్తైః = మనోనిగ్రహము కలవారును, జితరోషైః = జయింపబడిన కోపము కలవారును, జితేన్ద్రియైః = జయించబడిన ఇంద్రియములు కలవారును అగు, ఋషిభిః = ఋషీశ్వరులతోను, జపహోమపరాయణైః = జపహోమములందు ఆసక్తు లగు, వాలఖిల్యైః = వాలఖిల్యులతోను, (బ్రహ్మయొక్క వాలమునుండి పుట్టిన ఋషులు వాలఖిల్యులు), అన్యైః = ఇతరు లైన, వైఖానసైశ్చైవ = బ్రహ్మయొక్క నఖములనుండి పుట్టిన వైఖానసులతోడను, సమన్తాత్ = అంతటను, ఉపశోభితమ్ = ప్రకాశింపచేయబడిన, వసిష్ఠస్య = వసిష్ఠునియొక్క, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును, ఆజగామ=చేరెను.

తా. రామా ! విశ్వామిత్రుడు నగరములందును, రాష్ట్రములందును నదీగిరి ప్రాంతములందును, ఆశ్రమములందును క్రమముగా సంచరించుచు వసిష్ఠుని ఆశ్రమమును చేరెను. ఆ ఆశ్రమము నానావిధము లగు వృక్షములతోడను, పక్షిగణములతోడను వ్యాప్త మై యుండెను. అచట సిద్ధ-చారణ-దేవ-దానవ-గంధర్వ-కిన్నరాదులు నివసించుచుండిరి. ప్రశాంతములైన వేళ్లతోను, పక్షిసముదాయములతోను ఒప్పుచుండెను. బ్రహ్మర్షిగణములు, దేవర్షిగణములు ఆ ఆశ్రమమును ఆశ్రయించి ఉండిరి. తపస్సు నాచరించి సిద్ధి పొందిన వారును, అగ్నితో సమానులును, మహాత్ములును, మనస్సును నిగ్రహించిన వారును, రోషమును జయించినవారును జితేంద్రియులును అగు ఋషులు అచట నివసించుచుండిరి. వారిలో కొందరు నీరు

మాత్రమే భక్షింప కొందరు వాయువునే భక్షించుచుండిరి. కొందరు రాలిన ఆకులను మాత్రమే ఆహారముగా తీసికొనెడివారు. మరి కొందరు పండ్లు, దుంపలు మాత్రమే ఆహారముగా తీసుకొనెడివారు. జపహోమములందు ఆసక్తి గల వాలఖిల్యులు, ఇతరులైన వైఖానసులును దీనికి శోభ కలిగించుచుండిరి. 22-27

మూ. వసిష్ఠస్యాశ్రమపదం బ్రహ్మలోకమివాపరమ్,
దదర్శ జయతాం శ్రేష్ఠో విశ్వామిత్రో మహాబలః. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే
బాలకాణ్డే ఏకపఞ్చాశః సర్గః.

ప్ర. అ. జయతామ్=జయించువారిలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుడును, మహాబలః=మహాబలవంతుడును అగు, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, అపరమ్=రెండవ, బ్రహ్మలోకమివ=బ్రహ్మలోకము వలె నున్న, వసిష్ఠస్య=వసిష్ఠునియొక్క, ఆశ్రమపదమ్=ఆశ్రమమును, దదర్శ=చూచెను.

తా. విజయవంతులలో శ్రేష్ఠుడును, మహాబలశాలియు అగు విశ్వామిత్రుడు రెండవ బ్రహ్మలోకము వలె నున్న వసిష్ఠాశ్రమమును చూచెను. 28

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
ఏబది ఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్విపఞ్చాశః సర్గః

మూ. స దృష్ట్వా పరమప్రీతో విశ్వామిత్రో మహాబలః,
ప్రణతో వినయా ద్వీరో వసిష్ఠం జపతాం వరమ్. 1

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము కలవాడును, వీరః = వీరుడును అగు, సః = ఆ, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, జపతామ్ = జపము చేయు మునులలో, వరమ్ = శ్రేష్ఠు డైన, వసిష్ఠమ్ = వసిష్ఠుని, దృష్ట్వా = చూచి, పరమప్రీతః = చాల సంతసించినవాడై, వినయాత్ = వినయము వలన, ప్రణతః = నమస్కరించెను.

తా. గొప్ప బలము కలవాడును, వీరుడును అగు ఆ విశ్వామిత్రుడు మునులలో శ్రేష్ఠు డైన వసిష్ఠుని చూచి చాల సంతసించి, సవినయముగా నమస్కరించెను. 1

మూ. స్వాగతం తవ చేత్యుక్తో వసిష్ఠేన మహాత్మనా,
ఆసనం చాస్య భగవాన్ వసిష్ఠోఽస్యాదిదేశ హ. 2

ప్ర. అ. తవ = నీకు, స్వాగతమ్ = స్వాగతము, ఇతి = అని, మహాత్మనా = మహాత్ము డైన, వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ఉక్తశ్చ = పలకబడెను కూడ. భగవాన్ = భగవంతుడైన, వసిష్ఠః = వసిష్ఠుడు, అస్య = ఈతనికి, ఆసనం చ = ఆసనమును కూడ, వ్యాదిదేశ హ = ఇచ్చెను.

తా. మహాత్ముడును, పూజ్యుడును అగు వసిష్ఠుడు ఆతనికి స్వాగతము పలికి ఆసన మిచ్చెను. 2

మూ. ఉపవిష్టాయ చ తదా విశ్వామిత్రాయ ధీమతే,
యథాన్యాయం మునివరః ఫలమూలముపాహరత్. 3

ప్ర. అ. తదా = అప్పుడు, మునివరః = మునిశ్రేష్ఠుడు, ఉపవిష్టాయ = కూర్చున్న, ధీమతే = బుద్ధిమంతు డైన, విశ్వామిత్రాయ = విశ్వామిత్రునకు,

యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, ఫలమూలమ్ = ఫలమూలములను, ఉపాహరత్ = సమర్పించెను.

తా. అప్పుడు మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు కూర్చున్న, బుద్ధిమంతుడైన విశ్వామిత్రునకు న్యాయానుసారముగా ఫలమూలములను సమర్పించెను. 3

మూ. ప్రతిగృహ్య తు తాం పూజాం వసిష్ఠాద్రాజసత్తమః,
తపోఽగ్నిహోత్రశిష్యేషు కుశలం పర్యపృచ్ఛత. 4

విశ్వామిత్రో మహాతేజా వనస్పతిగణే తథా,
సర్వత్ర కుశలం చాహ వసిష్ఠో రాజసత్తమమ్. 5

ప్ర. అ. రాజసత్తమః = రాజులలో శ్రేష్ఠుడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును అగు, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వసిష్ఠాత్ = వసిష్ఠుని నుండి, తామ్ = ఆ, పూజామ్ = పూజను, ప్రతిగృహ్య = స్వీకరించి, తపోఽగ్నిహోత్రశిష్యేషు = తపస్సునందు, అగ్నిహోత్రమునందును, శిష్యులందును, తథా = మరియు, వనస్పతిగణే = వృక్షసముదాయమునందును, కుశలమ్ = కుశలమును, పర్యపృచ్ఛత = అడిగెను. వసిష్ఠః చ=వసిష్ఠుడుకూడ, సర్వత్ర= అన్నింటియందును, కుశలమ్ = కుశలమును, రాజసత్తమమ్ = ఆ రాజశ్రేష్ఠుని గూర్చి, ఆహ = చెప్పెను.

తా. మహాతేజఃశాలి యగు ఆ విశ్వామిత్రమహారాజు వసిష్ఠుడు చేసిన ఆ పూజను స్వీకరించి — "మీ తపస్సునకును, అగ్నిహోత్రమునకును, శిష్యులకును, వృక్షసముదాయమునకును క్షేమమా" అని ప్రశ్నించెను. "అన్నియు క్షేమముగా నున్నవి" అని వసిష్ఠుడు ఆతనికి చెప్పెను. 4, 5

మూ సుఖోపవిష్టం రాజానం విశ్వామిత్రం మహాతపాః,
పప్రచ్ఛ జపతాం శ్రేష్ఠో వసిష్ఠో బ్రహ్మణః సుతః. 6

ప్ర. అ. జపతామ్ = జపము చేయువారిలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడును, మహాతపాః = గొప్ప తపస్సు కలవాడును, బ్రహ్మణః=బ్రహ్మయొక్క, సుతః= కుమారుడును అగు, వసిష్ఠః = వసిష్ఠుడు, సుఖోపవిష్టమ్=సుఖముగా కూర్చున్న, రాజానమ్ = రాజైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, పప్రచ్ఛ = అడిగెను.

తా. మహాతపశ్శాలియు, మునులలో శ్రేష్ఠుడును, బ్రహ్మపుత్రుడును అగు వసిష్ఠుడు సుఖాసీనుడై ఉన్న విశ్వామిత్రమహారాజును ఇట్లు అడిగెను. 6

మూ. కచ్చిత్తే కుశలం రాజన్ కచ్చిద్ధర్మేణ రఞ్జయన్,
ప్రజాః పాలయసే వీర రాజవృత్తేన ధార్మిక. 7

ప్ర అ. రాజన్ = ఓ రాజా ! తే=నీకు, కుశలం కచ్చిత్=క్షేమమే కదా ! ధార్మిక = ధార్మికుడవైన, వీర = వీరుడా ! ప్రజాః = ప్రజలను, ధర్మేణ = ధర్మముచేత, రఞ్జయన్=రంజింపచేయుచు, రాజవృత్తేన=రాజధర్మానుసారముగా, పాలయసే కచ్చిత్ = పరిపాలించుచున్నావా ?

తా. రాజా ! నీకు క్షేమయే కదా ? ధార్మికుడవైన ఓ వీరుడా ! ధర్మముచే ప్రజలను రక్షింపచేయుచు, వారిని రాజవృత్తానుసారము పాలించుచున్నావా ?

వి. "న్యాయేనార్జన మర్థస్య వర్ధనం పాలనం తథా
సత్పాత్రే ప్రతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధమ్".

అని చెప్పినట్లు, ధనమును న్యాయముగా ఆర్జించుట, దానిని వృద్ధి పొందించుట, రక్షించుట, సత్పాత్రలకు ఇచ్చుట అనునది "రాజవృత్తము". 7

మూ. కచ్చిత్తే సంభృతా భృత్యాః కచ్చిత్తిష్ఠన్తి శాసనే,
కచ్చిత్తే విజితాః సర్వే రిపవో రిపుసూదన. 8

ప్ర. అ. తే=నీయొక్క, భృత్యాః=పోష్యవర్గములోనివారు, సంభృతాః= బాగుగా పోషింపబడుచున్నారా ? శాసనే = నీ ఆజ్ఞయందు, తిష్ఠన్తి కచ్చిత్ = ఉంటున్నారా ? రిపుసూదన = శత్రువులను సంహరించు వాడా ! తే=నీయొక్క, రిపవః = శత్రువులు, సర్వే = అందరును, విజితాః కచ్చిత్ = జయింపబడినారా ?

తా. నీవు నీ భృత్యులను చక్కగా పోషించుచున్నావా ? వారు నీ ఆజ్ఞను అతిక్రమించక ఉన్నారా ? ఓ శత్రుసంహారకా ! నీ శత్రువుల నందరిని జయించితివా ? 8

మూ. కచ్చిద్బలేషు కోశేషు మిత్రేషు చ పరంతప,
కుశలం తే నరవ్యాఘ్ర పుత్రపౌత్రే తవానఘ. 9

ప్ర. అ. పరంతప = శత్రువులను పీడించువాడా! అనఘ = పాపములు లేనివాడా! నరవ్యాఘ్ర = నరశ్రేష్ఠుడా! బలేషు = సేనలయందును, కోశేషు = ధనాగారములందును, మిత్రేషు = మిత్రులందును, తవ = నీయొక్క, పుత్రపౌత్రే = పుత్రపౌత్రులందును, తే = నీకు, కుశలమ్ = కుశలమా?

తా. శత్రుసంహారకు డవు, పాపరహితు డవు అయిన ఓ పురుష శ్రేష్ఠుడా! నీ సేనలు, కోశములు, మిత్రులు, పుత్రపౌత్రాదులును కుశలమా? 9

మూ. సర్వత్ర కుశలం రాజా వసిష్ఠం ప్రత్యుదాహరత్,
విశ్వామిత్రో మహాతేజా వసిష్ఠం వినయాన్వితః. 10

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రాజా = రాజైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వసిష్ఠమ్ = వసిష్ఠుని గూర్చి, వినయాన్వితః = వినయముతో కూడినవాడై, వసిష్ఠం ప్రతి = వసిష్ఠుని గూర్చి, సర్వత్ర = అంతటను, కుశలమ్ = కుశలమును, ఉదాహరత్ = చెప్పెను.

తా. మహాతేజశ్శాలి యైన విశ్వామిత్రమహారాజు అంతటను కుశలమే అని వసిష్ఠునకు సవినయముగ నివేదించెను. 10

మూ. కృత్వోభౌ సుచిరం కాలం ధర్మిష్ఠౌ తాః కథాః శుభాః,
ముదా పరమయా యుక్తౌ ప్రీయేతాం తౌ పరస్పరమ్. 11

ప్ర. అ. ధర్మిష్ఠౌ = ధర్మతత్పరులైన, తౌ ఉభౌ = వారిరువురును, పరమయా = గొప్ప, ముదా = సంతోషముతో, యుక్తౌ = కూడినవారై, సుచిరం కాలమ్ = చాలాకాలము, శుభాః = శుభమైన, తాః కథాః = ఆ యా విషయములను గూర్చిన సంభాషణములను, కృత్వా = చేసి, పరస్పరమ్ = ఒండొరులను, ప్రీయేతామ్ = సంతసింపచేసికొనిరి.

తా. ధర్మనిష్ఠులైన వారిరువురును మిక్కిలి ఆనందముతో చాల సేపు ఆ యా విషయములను గూర్చి సంభాషణలు చేసికొని ఒకరి నొకరు సంతోష పెట్టుకొనిరి. 11

మూ. తతో వసిష్ఠో భగవాన్ కథాన్తే రఘునన్దన,
విశ్వామిత్రమిదం వాక్యమువాచ ప్రహసన్నివ. 12

ప్ర. అ. రఘునన్దన = రామా, తతః = పిమ్మట, భగవాన్ = పూజ్యు డైన, వసిష్ఠః = వసిష్ఠుడు, కథాన్తే = సంభాషణము ముగిసిన తరువాత, ప్రహసన్నివ = నవ్వుచు, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రామా ! సంభాషణాంతమునందు, పూజ్యు డైన వసిష్ఠుడు నవ్వుచు విశ్వామిత్రునితో ఇట్లనెను. 12

మూ. ఆతిథ్యం కర్తుమిచ్ఛామి బలస్యాస్య మహాబల,
తవ చైవాప్రమేయస్య యథార్హం సంప్రతీచ్ఛ మే. 13

ప్ర. అ. మహాబల = గొప్ప బలము కలవాడా ! అస్య = ఈ, బలస్య = సైన్యమునకును, అప్రమేయస్య = సాటిలేని, తవ చైవ = నీకును, యథార్హమ్ = తగు విధముగా, ఆతిథ్యమ్ = ఆతిథ్యమును, కర్తుమ్ = చేయుటకు, ఇచ్ఛామి = ఇచ్ఛయించుచున్నాను. మే = నానుండి, సంప్రతీచ్ఛ = అంగీకరింపుము.

తా. సాటి లేనివాడ వైన ఓ విశ్వామిత్రా ! మహాబల శాలి వైన నీకును, నీ సైన్యమునకును యథోచితముగ ఆతిథిసత్కారము చేయ గోరుచున్నాను. దీనిని స్వీకరింపుము. 13

మూ. సత్క్రియాం తు భవానేతాం ప్రతీచ్ఛతు మయోద్యతామ్,
రాజా త్వమతిథిశ్రేష్ఠః పూజనీయః ప్రయత్నతః. 14

ప్ర. అ. భవాన్ = నీవు, మయా = నాచేత, ఉద్యతామ్ = ఇవ్వబడుచున్న, సత్క్రియామ్ = సత్కారమును, ప్రతీచ్ఛతు = అంగీకరింతువుగాక. రాజా = రాజు వైన, త్వమ్ = నీవు, ప్రయత్నతః = ప్రయత్నపూర్వకముగా, పూజనీయః = పూజించ దగిన, అతిథిశ్రేష్ఠః = శ్రేష్ఠాతిథివి.

తా. నీవు నేనిచ్చుచున్న ఈ సత్కారమును స్వీకరింపుము. రాజువైన నీవు ఉత్తము డైన అతిథివి. అందుచే నిన్ను ప్రయత్నపూర్వకముగ పూజింప వలసి యున్నది. 14

మూ. ఏవముక్తో వసిష్ఠేన విశ్వామిత్రో మహామతిః,
కృతమిత్యబ్రవీద్రాజా ప్రియవాక్యేన మే త్వయా. 15

ప్ర. అ. వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః = పలకబడిన, మహామతిః = గొప్పబుద్ధిగల, రాజా = రాజైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, త్వయా = నీచేత, ప్రియవాక్యేన = ప్రియవాక్యముచేతనే, కృతమ్ = ఆతిథ్యము చేయబడినది, ఇతి = అని, అబ్రవీత్ = పలికెను.

తా. వసిష్ఠుని మాటలు విన్న బుద్ధిశాలి యగు విశ్వామిత్రుడు ఇట్లు పలికెను :— "నీవు ప్రియ మైన మాటలు పలికితివి. ఇదియే నాకు ఆతిథ్యము". 15

మూ. ఫలమూలేన భగవన్విద్యతే యత్తవాశ్రమే,
పాద్యేనాచమనీయేన భగవద్దర్శనేన చ, 16

సర్వథా చ మహాప్రాజ్ఞ పూజార్హేణ సుపూజితః,
గమిష్యామి నమస్తేఽస్తు మైత్రేణేక్షస్వ చక్షుషా. 17

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! యత్ = ఏది, తవ = నీయొక్క, ఆశ్రమే = ఆశ్రమమునందు, విద్యతే = ఉన్నదో, అట్టి, ఫలమూలేన = ఫలమూలాదికముచేతను, పాద్యేన=పాద్యముచేతను, ఆచమనేన చ=ఆచమనముచేతను, భగవద్దర్శనేన = పూజ్యుడ వైన నీ దర్శనముచేతను, పూజార్హేణ = పూజార్హుడ వైన నీ చేత, సర్వథా=అన్ని విధములు, సుపూజితః=బాగుగా పూజింపబడితిని. మహాప్రాజ్ఞ = గొప్ప జ్ఞానము కలవాడా ! గమిష్యామి = నేను వెళ్లెదను. తే= నీకు, నమః = నమస్కారము, అస్తు = అగుగాక. మైత్రేణ = స్నేహపూర్ణ మైన, చక్షుషా = నేత్రముతో, ఈక్షస్వ = చూచుచుండుము.

తా. మహాప్రాజ్ఞుడ వైన ఓ పూజ్యుడా ! నీ ఆశ్రమములో లభించు ఫలమూలాదికమును. పాద్యమును, ఆచమనమును ఇచ్చి, పూజార్హుడ వైన నీవు నన్ను సర్వవిధముల సత్కరించితివి. ఇదియే చాలును; నేను వెళ్లెదను. స్నేహపూర్ణ మైన దృష్టితో చూచుచుండుము. 16, 17

మూ. ఏవం బ్రువన్తం రాజానం వసిష్ఠః పునరేవ హి,
న్యమన్త్రయత ధర్మాత్మా పునః పునరుదారధీః. 18

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, బ్రువన్తమ్ = మాటలాడు చున్న, రాజానమ్ = రాజును, ధర్మాత్మా = ధర్మాత్ముడును, ఉదారధీః = ఉదార మైన

బుద్ధి కలవాడును అగు, వసిష్ఠః = వసిష్ఠుడు, పునరేవ = మరల, పునః పునః = మాటిమాటికిని, న్యమంత్రయత = ఆహ్వానించెను.

తా. విశ్వామిత్రుడు ఇట్లు పలికినను, ధర్మాత్ముడును, ఉదారబుద్ధియు అగు వసిష్ఠుడు ఆతిథ్యము స్వీకరింపు మని ఆతనిని మాటిమాటికిని నిర్బంధించెను. 18

మూ. బాఢమిత్యేవ గాధేయో వసిష్ఠం ప్రత్యువాచ హ,
యథాప్రియం భగవత స్తథాస్తు మునిపుఙ్గవ. 19

ప్ర. అ. గాధేయః = విశ్వామిత్రుడు, వసిష్ఠమ్ = వసిష్ఠుని గూర్చి, మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠుడా! బాఢమ్ = తప్పక అటులనే చేసెదను. భగవతః = పూజ్యుడ వైన నీకు, యథా = ఏ విధముగా, అభిమతమ్ = సంమతమో, తథా = అట్లే, అస్తు = అగుగాక.

తా. చివరికి విశ్వామిత్రుడు, వసిష్ఠునితో, "మునిశ్రేష్ఠా! నీకు ఎట్లు ప్రియమో అట్లే తప్పక అగును గాక" అని పలికెను. 19

మూ. ఏవముక్తో మహాతేజా వసిష్ఠో జపతాం వరః,
ఆజుహావ తతః ప్రీతః కల్మాషీం ధూతకల్మషః. 20

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, జపతాం వరః = మునీశ్వరులలో గొప్పవాడైన, ధూతకల్మషః = తొలగించబడిన పాపములు గల, వసిష్ఠః = వసిష్ఠుడు, ప్రీతః = సంతసించినవాడై, తతః = పిమ్మట, కల్మాషీమ్ = చిత్రవర్ణము గల ధేనువును, ఆజుహావ = పిలచెను.

తా. మహాతేజశ్శాలియు, మునులలో గొప్పవాడును, పాపములను నశింపచేయువాడును అగు వసిష్ఠుడు విశ్వామిత్రుని మాటలు విని సంతోషించి, చిత్రవర్ణము గల కామధేనువును పిలిచెను. 20

మూ. ఏహ్యేహి శబలే క్షిప్రం శృణు చాపి వచో మమ,
సబలస్యాస్య రాజర్షేః కర్తుం వ్యవసితోఽస్మ్యహమ్. 21
భోజనేన మహార్హేణ సత్కారం సంవిధత్స్వ మే.

ప్ర. అ. శబలే = చిత్రవర్ణము గల ఓ ధేనువా! క్షిప్రమ్ = శీఘ్రముగా, ఏహి ఏహి = రమ్ము రమ్ము. మమ = నాయొక్క, వచః = వాక్కును, శృణు చ అపి = వినుము. అహమ్ = నేను, మహార్హేణ = శ్రేష్ఠమైన, భోజనేన = భోజనము చేత, సబలస్య = సేనతో కూడిన, అస్య = ఈ, రాజర్షేః = రాజర్షికి, సత్కారమ్ = సత్కారమును, కర్తుమ్ = చేయుటకు, వ్యవసితః అస్మి = నిశ్చయించితిని. మే = నాకు, సంవిధత్స్వ = ఏర్పాట్లు చేయుము.

తా. ఓ శబలా! రమ్ము రమ్ము. నా మాట వినుము. నేను సేనాసమేతుడైన ఈ రాజర్షికి శ్రేష్ఠమైన భోజన మొసగి సత్కరింప నిశ్చయించినాను. తగిన ఏర్పాట్లు చేయుము. 21

మూ. యస్య యస్య యథాకామం షడ్రసేష్వభిపూజితమ్, 22
తత్సర్వం కామధుక్ క్షిప్రమభివర్ష కృతే మమ.

ప్ర. అ. కామదుక్ = ఓ కామధేనువా! యస్య యస్య = ఎవరెవరికి, (యద్యత్ = ఏది ఏది), షడ్రసేషు = ఆరు రసములలో, అభిపూజితమ్ = ఇష్టమైనదో, తత్సర్వమ్ = దానినంతను, యథాకామం = ఆతడు కోరిన విధముగ, మమ కృతే = నా నిమిత్తమై, క్షిప్రమ్ = శీఘ్రముగా, అభివర్ష = వర్షించుము.

తా. ఎవరికి ఏది ఇష్టమో దానిని ఆతని కోరిక ప్రకారము, నాకుగాను, శీఘ్రముగా ఇమ్ము. 22

మూ. రసేనాన్నేన పానేన లేహ్యచోష్యేణ సంయుతమ్, 23
అన్నానాం నిచయం సర్వం సృజస్వ శబలే త్వర.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ద్విపఞ్చాశః సర్గః.

ప్ర. అ. శబలే = ఓ శబలా! రసేన = రసముతోడను, అన్నేన = అన్నముతోడను, పానేన = త్రాగదగిన వాటితోడను, లేహ్యచోష్యేణ = నాకదగిన

వాటితోడను, పిల్చదగిన దానితోడను, సంయుతమ్ = కూడిన, సర్వమ్ = సమస్తమైన, అన్నానామ్ = అన్నముల యొక్క, నిచయమ్=సముదాయమును, సృజస్వ = సృష్టించుము, త్వర = తొందరపడుము.

తా. ఓ శబలా ! రసాయనములతోను, తినదగినవి, త్రాగదగినవి, నాకదగినవి, పిల్చదగినవి మొదలయిన పదార్థములతోను కూడిన ఆహారసముదాయమును శీఘ్రముగా సమకూర్చుము. 23

'బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో ఏబదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిపఞ్చాశః సర్గః

మూ. ఏవముక్తా వసిష్ఠేన శబలా శత్రుసూదన,
విదధే కామధుక్కామాన్యస్య యస్య యథేప్సితమ్. 1

ప్ర. అ. శత్రుసూదన = శత్రువులను సంహరించు రామా! వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తా = పలకబడిన, కామధుక్ = కోరిన వస్తువులను పిదికెడు, శబలా = చిత్రవర్ణము గల ఆ ధేనువు, యస్య యస్య = ఎవనికి ఎవనికి, యథా = ఎట్లు, ఈప్సితమ్ = ఇష్టమో, ఆ విధముగా, కామాన్ = కామములను, విదధే = సమకూర్చెను.

తా. రామా! ఆ కామధేనువు వసిష్ఠుడు చెప్పిన విధముగ ఎవరెవరికి ఏది ఇష్టమో దాని నంతయు సమకూర్చెను. 1

మూ. ఇక్షూన్మధూంస్తథా లాజాన్ మైరేయాంశ్చ వరాసనాన్,
పానాని చ మహార్హాణి భక్ష్యాంశ్చోచ్చావచాంస్తథా. 2

ప్ర. అ. ఇక్షూన్ = చెరకుగడలను, మధూన్ = తేనెలను, తథా = మరియు, లాజాన్ = పేలాలను, వరాసనాన్ = మంచి పాత్రలు గల, మైరేయాన్ చ = మద్యములను, మహార్హాణి = శ్రేష్ఠ మైన, పానాని చ = పానములను, ఉచ్చావచాన్ = అనేక భేదములు గల, భక్ష్యాంశ్చ = తినుబండారములను, సృజించెను.

తా. ఆ కామధేనువు, చెరకు గడలు, తేనెలు, పేలాలు, మంచి పాత్రలలో పోసిన మద్యములు, శ్రేష్ఠము లైన పానీయములు, అనేక విధము లైన భక్ష్యములు సృజించెను. 2

మూ. ఉష్ణాఢ్యస్యోదనస్యాత్ర రాశయః పర్వతోపమాః,
మృష్టాన్నాని చ సూపాశ్చ దధికుల్యాస్తథైవ చ. 3
నానాస్వాదురసానాం చ షాడబానాం తథైవ చ,
భాజనాని సుపూర్ణాని గౌడాని చ సహస్రశః. 4

ప్ర. అ. అత్ర = ఇచట, ఉష్ణాఢ్యస్య = వేడితో కూడిన, ఓదనస్య = అన్నముయొక్క, పర్వతోపమాః = పర్వతముల వంటి, రాశయః = రాశులును, మృష్టాన్నాని చ = శ్రేష్ఠము లైన అన్నములును, సూపాశ్చ = పప్పులును, తథైవ = మరియు, దధికుల్యాః = పెరుగు కాలువలును, నానాస్వాదురసానామ్ = అనేక విధము లైన మధుర మైన రసము గల, షాడబానామ్ = షడ్రసభక్ష్యముల యొక్క, సుపూర్ణాని = బాగుగా నిండిన, భాజనాని = పాత్రలును, గౌడాని చ = బెల్లముతో వేసిన పదార్థములును, సహస్రశః = వేలకొలది, (ఏర్పడినవి).

తా. అచట పర్వతముల వంటి వేడిగా ఉన్న అన్నరాశులును, మధురాన్నములును, సూపములును, పెరుగు కాలువలును, వివిధ రసములను చేర్చి వండిన పదార్థములతో నింపబడిన పాత్రలును, బెల్లములో చేసిన పదార్థములును వేలకొలది ఏర్పడినవి. 4

మూ. సర్వమాసీత్సుసంతుష్టం హృష్టపుష్టజనాయుతమ్,
విశ్వామిత్రబలం రామ వసిష్ఠేనాభితర్పితమ్. 5

ప్ర. అ. రామ = రామా ! విశ్వామిత్రబలమ్ = విశ్వామిత్ర సైన్యము, సర్వమేవ = అంతయు, వసిష్ఠేన = వసిష్ఠునిచేత, అభితర్పితమ్ = తృప్తిపొందింపబడినదై, సుసంతుష్టమ్ = బాగుగా సంతోషించినది గాను, హృష్టపుష్టజనాయుతమ్ = బాగుగా తిని సంతసించిన జనులతో నిండినదిగాను, ఆసీత్ = ఆయెను.

తా. రామా ! ఈ విధముగా వసిష్ఠుని ఆతిథ్యముచే విశ్వామిత్రుని సైన్యములోనివా రందరును భుజించి, సంతృప్తి చెంది, ఆనందించిరి. 5

మూ. విశ్వామిత్రోఽపి రాజర్షిర్హృష్టః-పుష్టస్తదాఽభవత్,
సాన్తఃపురవరో రాజా సబ్రాహ్మణపురోహితః. 6

ప్ర. అ. తదా = అప్పుడు, సాన్తఃపురవరః = శ్రేష్ఠ మైన అంతఃపురముతో కూడిన, సబ్రాహ్మణపురోహితః = బ్రాహ్మణపురోహితులతో కూడిన, రాజర్షిః = ఋషి వంటి రాజైన, విశ్వామిత్రః రాజాపి = విశ్వామిత్ర మహారాజు

కూడ, హృష్టః=సంతసించినవాడును, పుష్టః=తృప్తి చెందినవాడును, అభవత్=అయెను.

తా. రాజర్షి యైన విశ్వామిత్రుడును, అతని అంతఃపురకాంతలును, అతనితో వచ్చిన బ్రాహ్మణపురోహితాదులును, తృప్తి చెంది ఆనందించిరి. 6

మూ. సామాత్యో మన్త్రిసహితః సభృత్యః పూజితస్తదా,
యుక్తః పరమహర్షేణ వసిష్ఠమిదమబ్రవీత్. 7

ప్ర. అ. తదా=అప్పుడు, పూజితః=పూజింపబడినవాడును, సామాత్యః=అమాత్యులతో కూడినవాడును, మన్త్రిసహితః = మంత్రులతో కూడినవాడును, సభృత్యః = భృత్యులతో కూడినవాడును అగు విశ్వామిత్రుడు, పరమహర్షేణ = గొప్ప సంతోషముతో, యుక్తః = కూడినవాడై, వసిష్ఠమ్ = వసిష్ఠుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అమాత్య-మంత్రి - భృత్యసమేతముగ వసిష్ఠుని పూజ లందుకొన్న విశ్వామిత్రుడు సంతోషించి వసిష్ఠునితో ఇట్లు పలికెను. 7

మూ. పూజితోఽహం త్వయా బ్రహ్మన్ పూజార్హేణ సుసత్కృతః,
శ్రూయతామభిధాస్యామి వాక్యం వాక్యవిశారద. 8

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణోత్తమా ! పూజార్హేణ = పూజింప దగిన, త్వయా = నీచేత, అహమ్ = నేను, పూజితః = పూజింపబడితిని. సుసత్కృతః= బాగుగా సత్కరింపబడితిని. వాక్యవిశారద = వాక్యములందు నేర్పు గలవాడా ! వాక్యమ్ = వాక్యమును, అభిధాస్యామి = చెప్పగలను ; శ్రూయతామ్ = వినబడుగాక.

తా. ఓ బ్రాహ్మణోత్తమా ! పూజార్హుడ వైన నీవు నన్ను పూజించి సత్కరించినావు. ఓ వాక్యవిశారదుడా ! నేనొక మాట చెప్పెదను. వినుము. 8

మూ. గవాం శతసహస్రేణ దీయతాం శబలా మమ,
రత్నం హి భగవన్నేతద్రత్నహారీ చ పార్థివః, 9
తస్మాన్మే శబలాం దేహి మామైషా ధర్మతో ద్విజ.

ప్ర. అ. గవామ్ = గోవులయొక్క, శతసహస్రేణ = నూరువేలకు, శబలా = శబల, మమ = నాకు, దీయతామ్ = ఇవ్వబడుగాక. భగవన్ = ఓ పూజ్యుడా ! ఏతత్ = ఇది, రత్నం హి = రత్నము కదా. పార్థివః = రాజు, రత్నహారీ = రత్నములను తీసికొనువాడు. ద్విజ = ఓ బ్రాహ్మణుడా, తస్మాత్= ఆ కారణము వలన, శబలామ్ = ఈ శబలను, మే = నాకు, దేహి = ఇమ్ము. ఏషా = ఇది, ధర్మతః = ధర్మానుసారముగా, మమ = నాకు చెందినది.

తా. లక్షగోవుల నిచ్చెదను; ఈ శబలను నా కిమ్ము. ఓ పూజ్యుడా ! ఈ ధేనువు రత్నము వంటిది. రత్నములు రాజు సొమ్ము. అందుచే ఇది నాకు చెందవలసి యున్నది. కావున ఈ ధేనువును నా కిమ్ము. 9

మూ. ఏవముక్తస్తు భగవాన్ వసిష్ఠో మునిసత్తమః, 10
విశ్వామిత్రేణ ధర్మాత్మా ప్రత్యువాచ మహీపతిమ్.

ప్ర. అ. విశ్వామిత్రేణ = విశ్వామిత్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః= పలక బడిన, భగవాన్=పూజ్యుడైన, ధర్మాత్మా=ధర్మాత్ముడైన, మునిసత్తమః= మునులలో శ్రేష్ఠుడైన, వసిష్ఠః = వసిష్ఠుడు, మహీపతిమ్ = రాజును గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. ధర్మాత్ముడైన వసిష్ఠమహాముని, విశ్వామిత్రుని మాటలు విని ఆతని కిట్లు బదులు చెప్పెను. 10

మూ. నాహం శతసహస్రేణ నాపి కోటిశతైర్గవామ్, 11
రాజన్ దాస్యామి శబలాం రాశిభీ రజతస్య చ.

ప్ర. అ. రాజన్ = రాజా ! అహమ్ = నేను, గవామ్ = గోవులయొక్క, శతసహస్రేణ = లక్షలకు, శబలామ్ = శబలను, న దాస్యామి = ఇవ్వను. కోటి శతైః అపి = వందల కొలది కోటుల ఆవులకు బదులుగా కూడ, న = ఇవ్వను. రజతస్య = వెండియొక్క, రాశిభిః చ = రాశులచేత కూడ, (ఇవ్వను).

తా. రాజా ! నీవు లక్షలకొలది ఆవు లిచ్చినను, కొన్ని వందల కోట్ల ఆవు లిచ్చినను, వెండి రాశు లిచ్చినను నేనీ శబలను ఇవ్వను. 11

మూ. న పరిత్యాగమర్హేయం మత్సకాశాదరిందమ, 12
శాశ్వతీ శబలా మహ్యం కీర్తిరాత్మవతో యథా.

ప్ర. అ. అరిందమ = శత్రువులను పీడించువాడా! ఇయమ్ = ఈ దేనువు, మత్సకాశాత్ = నా సమీపమునుండి, పరిత్యాగమ్ = విడచుటను గూర్చి, న అర్హా = తగినది కాదు. ఆత్మవతః = బుద్ధిశాలికి లేదా ధైర్యశాలికి, కీర్తిః యథా = కీర్తి వలె, శబలా = శబల, మహ్యమ్ = నాకు, శాశ్వతీ = శాశ్వత మైనది.

తా. శత్రుసంహారకుడ వైన ఓ విశ్వామిత్రా! ఈ దేనువు నానుండి దూర మగుటకు వీలు లేదు. ఈ ధేనువునకును నాకును ఉన్న సంబంధము బుద్ధిమంతున కును కీర్తికిని గల సంబంధము వలె శాశ్వత మైనది. 12

మూ. అస్యాం హవ్యం చ కవ్యం చ ప్రాణయాత్రా తథైవ చ, 13
ఆయత్తమగ్నిహోత్రం చ బలిర్హోమస్తథైవ చ.

ప్ర. అ. హవ్యం చ = (దేవతల కీయదగిన) హవ్యము, కవ్యం చ = (పితృదేవతల కీయ దగిన) కవ్యము, తథైవ చ = మరియు, ప్రాణయాత్రా = నా ప్రాణయాత్రయు, అగ్నిహోత్రం చ = అగ్నిహోత్రము, బలిః = భూతబలియు, తథైవ చ = మరియు, హోమః = హోమము, అస్యామ్ = ఈ దేనువునందు, ఆయత్తమ్ = ఆధారపడి యున్నది.

తా. హవ్యము, కవ్యము, నా ప్రాణయాత్ర, అగ్నిహోత్రము, భూతబలి, హోమము—ఇవి అన్నియు ఈ దేనువుపై ఆధారపడి యున్నవి. 13

మూ. స్వాహాకారవషట్కారౌ విద్యాశ్చ వివిధాస్తథా, 14
ఆయత్తమత్ర రాజర్షే సర్వమేతన్న సంశయః.

ప్ర. అ. రాజర్షే = ఓ రాజర్షి, స్వాహాకారవషట్కారౌ = 'స్వాహా' "వషట్" అనునవియు, తథా = మరియు, వివిధాః = అనేకవిధము లైన, విద్యాః = విద్య లును, ఏతత్ సర్వమ్ = ఇది అంతయు, అత్ర = ఈ దేనువునందు, ఆయత్తమ్ = ఆధారపడి యున్నది. సంశయః = సంశయము, న = లేదు.

తా. ఓ రాజర్షీ! స్వాహాకారవషట్కారములు, (అనగా దేవతాదులకు హవిరాదులు అర్పించుట అని అర్థము) నానావిధములైన విద్యలు, ఇవన్నియు ఈ కామధేనువు మీదనే ఆధారపడి యున్నవి. సందేహము లేదు. 14

మూ. సర్వస్వమేతత్సత్యేన మమ తుష్టికరీ సదా. 15
కారణైర్బహుభీ రాజన్న దాస్యే శబలాం తవ

ప్ర. అ. ఏతత్ = ఇది, సత్యేన = నిజముగ, మమ = నాయొక్క, సర్వస్వమ్ = సర్వస్వము. సదా = ఎల్లప్పుడును, తుష్టికరీ = ఆనందము కలిగించునది. రాజన్ = రాజా! బహుభిః = అనేకమైన, కారణైః = కారణములచేత, శబలామ్ = శబలను, తవ = నీకు, న దాస్యే = ఇవ్వను.

తా. రాజా! నిజముగ ఈ ధేనువు నా సర్వస్వము. నాకు ఆనందము కలిగించునది. ఇంకను అనేక కారణములను బట్టి కూడ ఈ ధేనువును నీకు ఇవ్వను. 15

మూ. వసిష్ఠేనైవముక్తస్తు విశ్వామిత్రోఽబ్రవీత్తతః, 16
సంరబ్ధతరమత్యర్థం వాక్యం వాక్యవిశారదః.

ప్ర. అ. వాక్యవిశారదః = మాటలలో నేర్పరి యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః = పలకబడినవాడై, తతః = అటుపిమ్మట, అత్యర్థమ్ = మిక్కిలి, సంరబ్ధతరమ్ = తొందరబాటుతో కూడిన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మాటలలో నేర్పరి యైన విశ్వామిత్రుడు వసిష్ఠుని మాటలు విని, మిక్కిలి తొందరబాటుతో ఇట్లు పలికెను. 16

మూ. హైరణ్యకక్ష్యాగ్రైవేయాన్ సువర్ణాఙ్కుశభూషితాన్, 17
దదామి కుఞ్జరాంస్తేషాం సహస్రాణి చతుర్దశ.

ప్ర. అ. హైరణ్యకక్ష్యాగ్రైవేయాన్ = బంగారు నడుము త్రాళ్లను మెడ త్రాళ్లను గల, సువర్ణాఙ్కుశభూషితాన్ = బంగారు అంకుశములచే అలంకరింప

బడిన, కుఞ్జరాన్ = ఏనుగులను, తేషామ్ = అట్టి ఏనుగులయొక్క, చతుర్దశసహ స్రాణి = పదునాలుగు వేలను, దదామి = ఇచ్చెదను.

తా. బంగారు నడుముత్రాళ్లను మెడత్రాళ్లను గలవియు, బంగారు అంకుశములు కలవియు అగు పదునాలుగు వేల ఏనుగులను ఇచ్చెదను. 17

మూ. హైరణ్యానాం రథానాం చ శ్వేతాశ్వానాం చతుర్యుజామ్, 18
దదామి తే శతాన్యష్టౌ కిఙ్కిణీకవిభూషితాన్.

ప్ర. అ. శ్వేతాశ్వానామ్ = తెల్లని గుఱ్ఱములు కలవియు, చతుర్యుజామ్ = నాలుగు గుఱ్ఱములు కట్ట వీలైనవియు అగు, హైరణ్యానామ్ = బంగారు వికారమైన, రథానాం = రథములయొక్క, కిఙ్కిణీకవిభూషితాన్ = చిరు గంటలచేత అలంకరించబడిన, అష్టౌ శతాని = ఎనిమిది వందలను, తే = నీకు, దదామి = ఇచ్చెదను.

తా. తెల్లని గుఱ్ఱములు కలవియు, నాలుగేసి గుఱ్ఱములు కట్టదగినవియు, చిరు గంటలచే అలంకరించబడినవియు అగు ఎనిమిది వందల బంగారురథములను నీ కిచ్చెదను. 18

మూ. హయానాం దేశజాతానాం కులజానాం మహౌజసామ్, 19
సహస్రమేకం దశ చ దదామి తవ సువ్రత.

ప్ర. అ. సువ్రత = మంచి వ్రతము కలవాడా ! దేశజాతానామ్ = మంచి దేశమునందు పుట్టినవియు, కులజానామ్ = మంచి కులమునందు పుట్టినవియు, మహౌజసామ్ = గొప్ప శక్తికలవియు అగు, హయానామ్ = అశ్వములయొక్క, ఏకం దశ చ = పదకొండు, సహస్రమ్ = సహస్రమును, తవ = నీకు, దదామి = ఇచ్చెదను.

తా. మంచి నియమములు కల ఓ మహర్షీ ! మంచి దేశమునందు, మంచి జాతియందు పుట్టిన గొప్ప బలముగల పదకొండువేల అశ్వములను నీ కిచ్చెదను. 19

మూ. నానావర్ణవిభక్తానాం వయస్థానాం తథైవ చ, 20
దదామ్యేకాం గవాం కోటిం శబలా దీయతాం మమ.

ప్ర. అ. నానావర్ణవిభక్తానామ్ = అనేక వర్ణములచే వేరువేరుగా ఉన్న వియు, తథైవ చ = మరియు, వయస్థానామ్ = మంచి వయస్సులో ఉన్న, గవామ్ = గోవులయొక్క, ఏకామ్ = ఒక, కోటిమ్ = కోటిని, దదామి = ఇచ్చెదను. మమ = నాకు, శబలా = ఈ శబల, దీయతామ్ = ఇవ్వబడుగాక.

తా. వివిధ వర్ణములు గల, మంచివయస్సులో ఉన్న ఒక కోటి గోవులను ఇచ్చెదను. నాకీ శబలను ఇమ్ము. 20

మూ. యావదిచ్ఛసి రత్నం వా హిరణ్యం వా ద్విజోత్తమ, 21
తావద్దదామి తత్సర్వం శబలా దీయతాం మమ.

ప్ర. అ. ద్విజోత్తమ = ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! రత్నం వా=రత్నములను కాని, హిరణ్యం వా = బంగారమును గాని, యావత్ = ఎంత, ఇచ్ఛసి = కోరుచున్నావో, తత్సర్వమ్ = దాని నంతను, తావత్ = అంత, దదామి=ఇచ్చెదను. శబలా = శబల, మమ = నాకు, దీయతామ్ = ఇవ్వబడుగాక.

తా. బ్రాహ్మణోత్తమా! రత్నములు కాని, బంగారము కాని ఎంత కావలెనని కోరెదవో అంత ఇచ్చెదను. ఈ శబలను నా కిమ్ము. 21

మూ. ఏవముక్తస్తు భగవాన్ విశ్వామిత్రేణ ధీమతా, 22
న దాస్యామీతి శబలాం ప్రాహ రాజన్ కథం చన.

ప్ర. అ. ధీమతా = బుద్ధిమంతు డైన, విశ్వామిత్రేణ = విశ్వామిత్రునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః=పలకబడిన, భగవాన్=పూజ్యు డైన వసిష్ఠుడు, రాజన్ = రాజా! కథంచన = ఏమైనను, శబలామ్ = శబలను, న దాస్యామి = ఇవ్వను, ఇతి = అని, ప్రాహ = పలికెను.

తా. బుద్ధిమంతు డైన విశ్వామిత్రుడు పలికిన మాటలు విని పూజ్యు డైన వసిష్ఠుడు—"రాజా! ఏమైనను శబలను ఇవ్వను" అని పలికెను. 22

మూ. ఏతదేవ హి మే రత్నమేతదేవ హి మే ధనమ్, 23
ఏతదేవ హి సర్వస్వమేతదేవ హి జీవితమ్.

ప్ర. అ. ఏతదేవ = ఇదియే, మే = నాకు, రత్నం హి = రత్నము. ఏతదేవ = ఇదియే, మే = నాకు, ధనమ్ = ధనము. ఏతదేవ హి = ఇదియే, సర్వస్వమ్ = సర్వస్వము. ఏతదేవ = ఇదియే, జీవితమ్ = జీవితము.

తా. నాకిదియే రత్నము ; ఇదే ధనము ; ఇదే సర్వస్వము. ఇదే జీవితము. 23

మూ. దర్శశ్చ పూర్ణమాసశ్చ యజ్ఞాశ్చైవా ప్తదక్షిణాః, 24
ఏతదేవ హి మే రాజన్ వివిధాశ్చ క్రియా స్తథా.

ప్ర. అ. రాజన్ = రాజా ! మే=నాకు, దర్శశ్చ=దర్శయాగము, పూర్ణమాసశ్చ = పూర్ణమాసయాగము, ఆప్తదక్షిణాః = సరి యైన దక్షిణలు గల, యజ్ఞాశ్చ = యజ్ఞములును, తథా = మరియు, వివిధాః = అనేకవిధము లైన, క్రియాశ్చ=క్రియలును, ఏతదేవ హి = ఇదియే.

తా. రాజా ! నాకు దర్శపూర్ణమాసయాగములు, మంచి దక్షిణలు గల యజ్ఞములు, వివిధము లైన ఇతరక్రియలును ఈ ధేనువే. 24

మూ. అదోమూలాః క్రియాః సర్వా మమ రాజన్న సంశయః, 25
బహునా కిం ప్రలాపేన న దాస్యే కామదోహినీమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రిపఞ్చాశః సర్గః.

ప్ర. అ. రాజన్ = రాజా ! మమ = నాయొక్క, సర్వాః = సమస్త మైన, క్రియాః = క్రియలు, అదోమూలాః = ఇదియే మూలముగలవి. సంశయః = సంశయము, న = లేదు. బహునా = అధిక మైన, ప్రలాపేన = నిరుపయోగ మైన మాటలచేత, కిమ్ = ఏమి ప్రయోజనము ? కామదోహినీమ్ = సర్వకామములను పిదికి ఇచ్చు ఈ ధేనువును, న దాస్యే = ఇవ్వను.

తా. రాజా ! నాక్రియ లన్నింటికిని ఇదియే ఆధారము. ఇంక ఉపయోగము లేని మాట లేల ? ఈ కామధేనువు నివ్వను. 25

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలోని
ఏబదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃపఞ్చాశః సర్గః

మూ. కామధేనుం వసిష్ఠోఽపి యదా న త్యజతే మునిః,
తదాస్య శబలాం రామ విశ్వామిత్రోఽన్వకర్షత. 1

ప్ర. అ. రామ = రామా : వసిష్ఠః మునిః అపి = వసిష్ఠముని, కామ ధేనుమ్ = కామధేనువును, యదా = ఎప్పుడు, న త్యజతే = ఇవ్వలేదో, తదా = అప్పుడు, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, శబలామ్ = శబలను, అన్వకర్షత = లాగెను.

తా. రామా ! ఈ విధముగా వసిష్ఠుడు కామధేనువు నిచ్చుటకు నిరాకరించగా విశ్వామిత్రుడు ఆ ధేనువును బలాత్కారముగా లాగికొనిపోయెను. 1

మూ. నీయమానా తు శబలా రామ రాజ్ఞా మహాత్మనా,
దుఃఖితా చిన్తయామాస రుదన్తీ శోకకర్శితా. 2

ప్ర. అ. రామ = రామా ! మహాత్మనా = మహాత్ముడైన, రాజ్ఞా = రాజుచేత, నీయమానా = తీసికొనివెళ్లబడుచున్న, శబలా = శబల, దుఃఖితా = దుఃఖించినదై, శోకకర్శితా = శోకముచే కృశించినదై, రుదన్తీ = ఏడ్చుచున్నదై, చిన్తయామాస = చింతించెను.

తా. రామా ! బలశాలి యగు ఆ రాజు తన నీ విధముగ లాగికొని పోవుచుండగా ఆ శబల దుఃఖార్తురాలై, ఏడ్చుచు ఇట్లు ఆలోచించెను. 2

మూ. పరిత్యక్తా వసిష్ఠేన కిమహం సుమహాత్మనా,
యాహం రాజభటైర్దీనా హ్రియేయ భృశదుఃఖితా. 3

ప్ర. అ. దీనా = దీనురాలును, భృశదుఃఖితా = మిక్కిలి దుఃఖితురాలును అగు, యా అహమ్ = ఏ నేను, రాజభటైః = రాజభటులచేత, హ్రియేయ = హరింపబడుచున్నానో, అహమ్ = అట్టి నేను, మహాత్మనా = మహాత్ముడైన, వసిష్ఠేన = వసిష్ఠునిచేత, పరిత్యక్తా కిమ్ = విడువబడితినా ?

తా. మిక్కిలి దుఃఖముతో దీనురాల నైన నన్ను ఈ రాజభటులు ఈ విధముగా తీసికొనిపోవుచున్నారు. నన్ని మహాత్ము డైన వసిష్ఠుడు విడిచివేసినాడా యేమి ? 3

మూ. కిం మయాపకృతం తస్య మహర్షేర్భావితాత్మనః,
యన్మామనాగసం భక్తామిష్టాం త్యజతి ధార్మికః. 4

ప్ర. అ. ధార్మికః = ధార్మికు డైన ఈ వసిష్ఠుడు, అనాగసమ్ = అపరాధము లేనిదానను, భక్తామ్ = భక్తురాలను, ఇష్టామ్ = ఇష్టురాలను అయిన, మామ్=నన్ను, యత్ త్యజతి = విడిచిపెట్టుచున్నాడే, భావితాత్మనః=పవిత్ర మైన అంతఃకరణము గల, తస్య=ఆ, మహర్షేః = మహర్షికి, మయా=నాచేత, కిమ్=ఏమి, అపకృతమ్ = అపకారము చేయబడినది ?

తా. పవిత్రహృదయు డైన ఈ మహర్షికి నే నేమి అపకారము చేసినాను? భక్తురాలను, ఇష్టురాలను, ఏ అపరాధము ఎరుగనిదానను అయిన నన్ని విధముగ విడచివేయుచున్నాడు ! 4

మూ. ఇతి సా చిన్తయిత్వా తు వినిశ్వస్య పునః పునః,
నిర్ధూయ తాం స్తదా భృత్యాన్ శతశః శత్రుసూదన,
జగామానిలవేగేన పాదమూలం మహాత్మనః. 5

ప్ర. అ. శత్రుసూదన=శత్రుసంహారకుడ వైన రామా ! సా=ఆ ధేనువు, ఇతి=ఈ విధముగా, చిన్తయిత్వా=ఆలోచించి, పునః పునః = మాటిమాటికి, వినిశ్వస్య=నిట్టూర్చి, తదా=అప్పుడు, తాన్=ఆ, శతశః=వందలకొలది ఉన్న, భృత్యాన్=భృత్యులను, నిర్ధూయ=విదిలించి, అనిలవేగేన = వాయువేగముతో, మహాత్మనః=మహాత్ము డైన వసిష్ఠునియొక్క, పాదమూలమ్=పాదసమీపమును గూర్చి, జగామ=వెళ్లెను.

తా. రామా ! ఆ ధేనువు ఈ విధముగ ఆలోచించి, మాటిమాటికి నిట్టూర్చుచు, వందలకొలది ఉన్న ఆ భృత్యులను విదల్చుకొని వాయువేగముతో వసిష్ఠుని దగ్గరకు పోయెను. 5

మూ. శబలా సా రుదన్తీ చ క్రోశన్తీ చేదమబ్రవీత్,
వసిష్ఠస్యాగ్రతః స్థిత్వా మేఘదున్దుభిరావిణీ. 6

ప్ర. అ. సా=ఆ, శబలా=శబల, రుదన్తీ చ=ఏడ్చుచున్నదై, క్రోశన్తీ చ=అరచుచున్నదై, వసిష్ఠస్య=వసిష్ఠునియొక్క, అగ్రతః=ఎదుట, స్థిత్వా=నిలచి, మేఘదున్దుభిరావిణీ = మేఘమువలెను దుందుభివలెను ధ్వని చేయుచున్నదై, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. ఆ శబల, ఏడ్చుచు, అరచుచు వసిష్ఠుని ఎదుట నిలచి మేఘదుందుభుల వంటి ధ్వనితో ఇట్లు పలికెను. 6

మూ. భగవన్ కిం పరిత్యక్తా త్వయాహం బ్రహ్మణః సుత,
యస్మాద్రాజభృతా మాం హి నయన్తే త్వత్సకాశతః. 7

ప్ర. అ. బ్రహ్మణః=బ్రహ్మయొక్క, సుత=కుమారుడా, భగవన్=ఓ పూజ్యుడా! అహమ్=నేను, త్వయా=నీచేత, పరిత్యక్తా కిమ్=విడువబడితినా? యస్మాత్=ఏ కారణమువలన, రాజభృతాః=రాజభృత్యులు, త్వత్సకాశతః=నీ సమీపమునుండి, మామ్ = నన్ను, నయన్తే హి=తీసికొనిపోవుచున్నారు.

తా. బ్రహ్మపుత్రుడవైన ఓ పూజ్యుడా! ఈ రాజభృత్యులు నన్ను నీ వద్దనుండి తీసికొని పోవుచున్నారు; నీవు నన్ను విడిచివేసితివా? 7

మూ. ఏవముక్తస్తు బ్రహ్మర్షిరిదం వచనమబ్రవీత్,
శోకసన్తప్తహృదయాం స్వసారమివ దుఃఖితామ్. 8

ప్ర. అ. ఏవమ్=ఈ విధముగా, ఉక్తః = పలకబడిన, బ్రహ్మర్షిః=బ్రహ్మర్షి, శోకసంతప్తహృదయామ్ = శోకముచే తప్తమైన హృదయము గల ఆ ధేనువును గూర్చి, దుఃఖితామ్=దుఃఖించిన, స్వసారమివ = సోదరిని గూర్చి వలె, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. ఈ మాటలు విని ఆ బ్రహ్మర్షి, శోకముచే తపించుచున్న మనస్సు గల ఆ ధేనువుతో, దుఃఖించుచున్న సోదరితో పలికినట్లు ఇట్లు పలికెను. 8

మూ. న త్వాం త్యజామి శబలే నాపి మేఽపకృతం త్వయా,
ఏష త్వాం నయతే రాజా బలాన్మత్తో మహాబలః. 9

ప్ర. అ. శబలే = ఓ శబలా ! త్వామ్ = నిన్ను, న త్యజామి=విడచుట లేదు. త్వయా = నీ చేత, మే = నాకు, న అపకృతమపి = అపకారము కూడ చేయబడలేదు. మహాబలః = గొప్ప బలము గల, ఏషః = ఈ, రాజా = రాజు, మత్తః = నా నుండి, బలాత్ = బలాత్కారముగా, త్వామ్ = నిన్ను, నయతే = తీసికొని వెళ్లుచున్నాడు.

తా. ఓ శబలా ! నేను నిన్ను విడచుటలేదు. నీవు నా కేమియు అప కారము చేయలేదు. మహాబలవంతు డైన ఈ రాజు నిన్ను నా వద్దనుంచి బలాత్కారముగ తీసికొని పోవుచున్నాడు. 9

మూ. న హి తుల్యం బలం మహ్యం రాజా త్వద్య విశేషతః,
బలీ రాజా క్షత్రియశ్చ పృథివ్యాః పతిరేవ చ. 10

ప్ర. అ. మహ్యమ్ = నాయొక్క, బలమ్ = బలము, తుల్యమ్ = ఈతని బలముతో తుల్య మైనది, న హి = కాదు కదా. అద్య = ఇపుడు, విశేషతః = విశేషముగా, రాజా తు = రాజుగా ఉన్నాడు. రాజా = రాజైన ఇతడు, బలీ = బలవంతుడు. క్షత్రియశ్చ = క్షత్రియుడు. పృథివ్యాః = భూమియొక్క, పతిరేవ చ = ప్రభువుగా కూడ ఉన్నాడు.

తా. నా బలము ఈతని బలముతో తుల్యము కాదు. విశేషించి ఇతడు రాజుగా ఉన్నాడు. రాజైన ఇతడు బలవంతు డైన క్షత్రియుడు, పృథివి కంతకును ప్రభువు కూడ. 10

మూ. ఇయమక్షౌహిణీ పూర్ణా సవాజిరథసఙ్కులా,
హస్తిధ్వజసమాకీర్ణా తేనాసౌ బలవత్తరః. 11

ప్ర. అ. సవాజిరథసంకులా=అశ్వములతో కూడిన రథములతో ఇరుకుగా నున్నదియు, హస్తిధ్వజసమాకీర్ణా=ఏనుగులతో ధ్వజములతో వ్యాప్త మైనదియు

అగు, ఇయమ్ = ఈ, అక్షౌహిణీ = అక్షౌహిణి, పూర్ణా = నిండియున్నది. తేన = ఆ కారణముచేత, అసౌ = ఇతడు, బలవత్తరః = చాల బలము కలవాడు.

తా. ఇతనికి అశ్వములతోను, రథములతోను, గజములతోను, ధ్వజములతోను వ్యాప్తమైన పూర్తి అక్షౌహిణి సేన ఉన్నది. అందుచేత ఇతడు ఎక్కువ బలము కలవాడు. 11

మూ. ఏవముక్తా వసిష్ఠేన ప్రత్యువాచ వినీతవత్,
వచనం వచనజ్ఞా సా బ్రహ్మర్షిమమితప్రభమ్. 12

ప్ర. అ. వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తా = పలకబడిన, వచనజ్ఞా = మాటలందు నేర్పు గల, సా = ఆ ధేనువు. అమితప్రభమ్ = అనంతమైన కాంతి గల, బ్రహ్మర్షిమ్ = బ్రహ్మర్షిని గూర్చి, వచనమ్ = వచనమును, వినీతవత్ = వినయవంతురాలుగా ఉండి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. వసిష్ఠుని వాక్యమును విని వాక్యములందు నేర్పు గల ఆ ధేనువు అమితమైన కాంతి గల ఆ బ్రహ్మర్షిని గూర్చి, సవినయముగా ఇట్లు పలికెను. 12

మూ. న బలం క్షత్రియస్యాహు ర్బ్రాహ్మణో బలవత్తరః,
బ్రహ్మన్ బ్రహ్మబలం దివ్యం క్షాత్తు బలవత్తరమ్. 13

ప్ర. అ. క్షత్రియస్య = క్షత్రియుని బలమును, బలమ్ = బలమునుగా, నాహుః = చెప్పరు. బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, బలవత్తరః = ఎక్కువ బలము కలవాడు. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణోత్తమా! క్షత్రాత్ తు = క్షత్రియ బలముకంటె, బ్రహ్మబలమ్ = బ్రాహ్మణ బలము, దివ్యమ్ = శ్రేష్ఠమైనది, బలవత్తరమ్ = అధికబలయుక్తము.

తా. బ్రాహ్మణోత్తమా! క్షత్రియబలము బలము కాదు; బ్రాహ్మణుడు ఎక్కువ బలముకలవాడు. క్షత్రియబలము కంటె బ్రహ్మబలము దివ్యమైనది; అధికమైనది. 13

మూ. అప్రమేయబలం తుభ్యం న త్వయా బలవత్తరః,
విశ్వామిత్రో మహావీర్య స్తేజస్తవ దురాసదమ్. 14

ప్ర. అ. తుభ్యమ్ = నీకు, అప్రమేయబలమ్ = లెక్కపెట్ట రాని బల మున్నది. మహావీర్యః = మహావీర్య వంతు డైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, త్వయా = నీ కంటె, బలవత్తరః = ఎక్కువ బలము కలవాడు, న = కాడు. తవ = నీయొక్క, తేజః = తేజస్సు, దురాసదమ్ = సమీపింప శక్యము కానిది.

తా. నీ బలము అంతము లేనిది. ఎంతటి మహావీర్యవంతు డైనను విశ్వామిత్రుడు నీ కంటె అధికబలము కలవాడు కాడు. నీ తేజస్సు సమీపింప శక్యము కానిది. 14

మూ. నియుఙ్క్ష్వ మాం మహాభాగ త్వద్బ్రహ్మబలసంభృతామ్
తస్య దర్పబలం యత్తన్నాశయామి దురాత్మనః. 15

ప్ర. అ. మహాభాగ = ఓ మహాభాగ్యవంతుడా! త్వద్బ్రహ్మబలసంభృతామ్ = నీ యొక్క బ్రహ్మబలముతో నిండిన, మామ్ = నన్ను. నియుఙ్క్ష్వ = నియమించుము. దురాత్మనః = దుర్బుద్ధి యైన, తస్య = ఆతనియొక్క, యత్ = ఏ, దర్పబలమ్ = దర్పము బలము ఉన్నదో, తత్ = దానిని, నాశయామి = నశింపచేసెదను.

తా. మహాత్మా! నీ బ్రహ్మబలముతో నిండిన నన్ను ఆజ్ఞాపించుము. ఆ దురాత్ముని దర్పమును, బలమును నశింపచేసెదను. 15

మూ. ఇత్యుక్తస్తు తయా రామ వసిష్ఠస్తు మహాయశాః,
సృజస్వేతి తదోవాచ బలం పరబలారుజమ్. 16

ప్ర. అ. రామ = రామా! తయా = ఆమెచేత, ఇతి = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మహాయశాః = గొప్ప కీర్తి గల, వసిష్ఠః తు = వసిష్ఠుడు, తదా = అప్పుడు, పరబలారుజమ్ = శత్రుబలమును పీడించు, బలమ్ = సేనను, సృజస్వ = సృజించుము, ఇతి = అని, ఉవాచ = పలికెను.

తా. ఆ ధేనువు మాటలు విని, మహాయశఃశాలి యగు వసిష్ఠుడు —"శత్రు సైన్యమును నశింపచేయు సైన్యమును సృజింపుము" అని పలికెను. 16

మూ. తస్య తద్వచనం శ్రుత్వా సురభిస్సాసృజత్తదా,
తస్యా హుమ్భారవోత్సృష్టాః పహ్లవాః శతశో నృప, 17
నాశయన్తి బలం సర్వం విశ్వామిత్రస్య పశ్యతః.

ప్ర. అ. తస్య = ఆతనియొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, సా = ఆ, సురభిః = కామధేనువు, తదా=అప్పుడు, అసృజత్= (సైన్యమును) సృజించెను. నృప = రాజా ! తస్యాః = ఆ కామధేనువుయొక్క, హుంభారవోత్సృష్టాః = హుంభా అను ధ్వనినుండి బయలుదేరిన, పహ్లవాః = పహ్లవులు, శతశః = వందలకొలది, విశ్వామిత్రస్య = విశ్వామిత్రుడు, పశ్యతః= చూచుచుండగనే, సర్వమ్ = సమస్తమైన, బలమ్ = సైన్యమును, నాశయన్తి = నశింపచేసినారు.

తా. వసిష్ఠుని మాటలు విని ఆ కామధేనువు సైనికులను సృజించెను. రామా ! ఆ కామధేనువు యొక్క హుంభాధ్వనినుండి పుట్టిన వందలాది పహ్లవులు, విశ్వామిత్రుడు చూచుచుండగనే ఆతని సైన్యము నంతను నశింపచేసిరి. 17

మూ. బలం భగ్నం తతో దృష్ట్వా రథేనాక్రమ్య కౌశికః, 18
స రాజా పరమక్రుద్ధో రోషవిస్ఫారితేక్షణః,
పహ్లవాన్నాశయామాస శస్త్రైరుచ్చావచైరపి. 19

ప్ర. అ. తతః=పిమ్మట, సః=ఆ, రాజా=రాజైన, కౌశికః=విశ్వామిత్రుడు, భగ్నమ్=నశింపచేయబడిన, బలమ్=సైన్యమును, దృష్ట్వా = చూచి, పరమక్రుద్ధః=మిక్కిలి కోపగించినవాడై, రోషవిస్ఫారితేక్షణః=కోపముచేత పెద్దవైన నేత్రములు కలవాడై, రథేన = రథముచేత, ఆక్రమ్య = ఆక్రమించి; ఉచ్చావచైః=అనేక విధములైన, శస్త్రైః=ఆయుధములచేత, పహ్లవాన్=పహ్లవులను, నాశయామాస అపి=నశింపచేసెను కూడ.

తా. అంతట విశ్వామిత్రమహారాజు తన సైన్యము ఈ విధముగ నశించుచుండగా చూచి, చాల కోపించి, కోపముచేత కళ్లు పెద్దవి చేసి, రథము నధిరోహించి, అనేకవిధములైన ఆయుధములతో పహ్లవులను నశింపచేసెను. 18, 19

మూ. విశ్వామిత్రార్దితాన్ దృష్ట్వా పహ్లవాంశ్శతశస్తదా,
భూయ ఏవాసృజత్కోపాచ్ఛకాన్ యవనమిశ్రితాన్. 20

ప్ర. అ. విశ్వామిత్రార్దితాన్=విశ్వామిత్రునిచేత పీడింపబడిన, శతశః= వందలకొలది, పహ్లవాన్ = పహ్లవులను, దృష్ట్వా = చూచి, తదా = అప్పుడు, కోపాత్ = కోపమువలన. భూయ ఏవ = మరల, యవనమిశ్రితాన్ = యవనులతో కలిసిన, శకాన్ = శకులను, అసృజత్ = సృజించెను.

తా. అప్పు డా కామధేనువు ఆ పహ్లవుల నందరిని విశ్వామిత్రుడు చంపివేయుట చూచి, కోపముతో, మరల, యవనులను శకులను సృజించెను. 20

మూ. తైరాసీత్సంవృతా భూమిః శకైర్యవనమిశ్రితైః,
ప్రభావద్భిర్మహావీర్యైర్హేమకిఞ్జల్కసన్నిభైః. 21

ప్ర. అ. ప్రభావద్భిః = కాంతి కలవారును, మహావీర్యైః = గొప్ప పరాక్రమము కలవారును, హేమకిఞ్జల్కసన్నిభైః = బంగారు కింజల్కములతో సమానులును అగు, తైః = ఆ, యవనమిశ్రితైః = యవనులతో కలిసిన, శకైః= శకులచేత, భూమిః = భూమి, సంవృతా=కప్పబడినది, ఆసీత్ = ఆయెను.

తా. కాంతి కలవారును, మహావీర్యవంతులును, బంగారు కింజల్కముల వలె నున్నవారును అగు ఆ యవనులును, శకులును, భూమిని కప్పివేసిరి. 21

మూ. దీర్ఘాసిపట్టసధరైర్హేమవర్ణామ్బరావృతైః,
నిర్దగ్ధం తద్బలం సర్వం ప్రదీప్తైరివ పావకైః. 22

ప్ర. అ. దీర్ఘాసిపట్టసధరైః = దీర్ఘము లైన ఖడ్గములను పట్టసములను ధరించినవారును, హేమవర్ణామ్బరావృతైః = బంగారు రంగు గల వస్త్రములచే ఆచ్ఛాదింపబడినవారును అగు ఆ శకయవనులచేత, ప్రదీప్తైః = ప్రజ్వలించుచున్న, పావకైరివ = అగ్నులచేత వలె, తత్ = ఆ, సర్వమ్ = సమస్త మైన, బలమ్ = సైన్యము, నిర్దగ్ధమ్ = దహింపబడినది.

తా. పొడ వైన ఖడ్గములను పట్టసములను చేత పట్టుకొని, బంగారు వస్త్రములను ధరించి మండుచున్న అగ్నుల వలె ఉన్న ఆ శకయవనులు ఆ సైన్యమునంతను నశింపచేసిరి. 22

మూ. తతోఽస్త్రాణి మహాతేజా విశ్వామిత్రో ముమోచ హ
తైస్తైర్యవనకామ్బోజాః పహ్లవాశ్చాకులీకృతాః. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే బాలకాణ్డే
చతుఃపఞ్చాశః సర్గః.

ప్ర. అ. తతః = పిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, అస్త్రాణి = అస్త్రములను, ముమోచ హ = విడచెను. తైస్తైః = ఆ యా అస్త్రములచేత, యవన కామ్భోజాః = యవనులు కాంభోజులును, పహ్లవాశ్చ = పహ్లవులును, ఆకులీకృతాః = వ్యాకులము చేయబడినారు.

తా. పిమ్మట మహాతేజఃశాలి యైన విశ్వామిత్రుడు మహాస్త్రములను ప్రయోగింపగా యవనులును, కాంభోజులును, పహ్లవులును చెల్లాచెదరై పోయిరి. 24

బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండలో ఏబదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చపఞ్చాశః సర్గః

మూ. తతస్తానాకులాన్ దృష్ట్వా విశ్వామిత్రాస్త్రమోహితాన్,
వసిష్ఠశ్చోదయామాస కామధుక్సృజ యోగతః. 1

ప్ర. అ. తతః = పిమ్మట, వసిష్ఠః = వసిష్ఠుడు, విశ్వామిత్రాస్త్రమోహితాన్ = విశ్వామిత్రుని అస్త్రములచే మోహము చెందింపబడిన, ఆకులాన్ = వ్యాకులులైన, తాన్ = వారిని, దృష్ట్వా = చూచి, కామధుక్ = ఓ కామధేనువా! యోగతః = యోగబలమువలన, సృజ = సృజించుము అని, చోదయామాస = ప్రేరేపించెను.

తా. వారందరును విశ్వామిత్రుని అస్త్రములచే మోహితులై చెల్లాచెదరై పోవుట చూచి వసిష్ఠుడు— "ఓ కామధేనువా! యోగశక్తిచేత ఇంకను సృజింపుము" అని ఆ ధేనువును ప్రేరేపించెను. 1

మూ. తస్యా హుంభారవాజ్జాతాః కామ్భోజా రవిసన్నిభాః,
ఊధసస్త్వథ సంజాతాః పప్లవాః శస్త్రపాణయః. 2

యోనిదేశాచ్చ యవనాః శకృద్దేశాచ్ఛకాస్తథా,
రోమకూపేషు చ మ్లేచ్ఛా హారీతాః సకిరాతకాః. 3

ప్ర. అ. తస్యాః = ఆ కామధేనువుయొక్క, హుమ్భారవాత్ = హుంభా ధ్వనినుండి, రవిసన్నిభాః = సూర్యునితో సమానులైన, కామ్భోజాః = కాంభోజులు, జాతాః = పుట్టిరి. అథ = మరియు, ఊధసః = పొదుగునుండి, శస్త్రపాణయః = ఆయుధములు హస్తములందు గల, పప్లవాః = పప్లవులు, సంజాతాః = పుట్టిరి. యోనిదేశాత్ చ = యోనినుండి, యవనాః = యవనులు, తథా = మరియు, శకృద్దేశాత్ = గోమయప్రదేశమునుండి, శకాః = శకులును, రోమకూపేషు = రోమకూపములనుండి, మ్లేచ్ఛాః = మ్లేచ్ఛులును, సకిరాతాః = కిరాతులతో కూడిన, హారీతాః = హారీతులును (పుట్టిరి).

తా. ఆ కామధేనువు హుంభాధ్వని చేయగా దానినుండి సూర్యుని వంటి కాంతి గల కాంభోజులు పుట్టిరి. పొదుగునుండి ఆయుధములను హస్తములందు ధరించిన పప్లవులును, యోనినుండి యవనులును, గోమయప్రదేశమునుండి శకులును, రోమకూపములనుండి మ్లేచ్ఛులు, హారీతులు, కిరాతులును పుట్టిరి. 2, 3

మూ. తైస్తైర్నిషూదితం సర్వం విశ్వామిత్రస్య తత్క్షణాత్,
సపదాతిగజం సాశ్వం సరథం రఘునన్దన. 4

ప్ర. అ. రఘునన్దన=రామా! తైస్తైః = ఆయాకాంభోజాదులచేత, తత్క్షణాత్=వెంటనే, విశ్వామిత్రస్య = విశ్వామిత్రునియొక్క, సపదాతిగజమ్=కాలిబంటులతోను ఏనుగులతోను కూడినదియు, సాశ్వమ్=అశ్వములతో కూడినదియు, సరథమ్=రథములతో కూడినదియు అగు, సర్వమ్ = సైన్య మంతయు, నిషూదితమ్=నశింపచేయబడినది.

తా. రామా! ఈ విధముగ జనించిన కాంభోజాదు లందరును పదాతి-గజ-అశ్వ-రథములతో కూడిన విశ్వామిత్రసైన్యము నంతను క్షణములో నశింపచేసిరి. 4

మూ. దృష్ట్వా నిషూదితం సైన్యం వసిష్ఠేన మహాత్మనా,
విశ్వామిత్రసుతానాం చ శతం నానావిధాయుధమ్. 5

అభ్యధావత్సుసంక్రుద్ధం వసిష్ఠం జపతాం వరమ్,
హుంకారేణైవ తాన్ సర్వాన్ దదాహ భగవానృషిః. 6

ప్ర. అ. మహాత్మనా=మహాత్ము డైన, వసిష్ఠేన=వసిష్ఠునిచేత, నిషూదితమ్=నశింపచేయబడిన, సైన్యమ్=సైన్యమును, దృష్ట్వా = చూచి, విశ్వామిత్రసుతానామ్=విశ్వామిత్రుని కుమారులయొక్క, శతమ్ = శతము, నానావిధాయుధమ్=నానావిధము లైన ఆయుధములు కలదై, సుసంక్రుద్ధమ్=చాల కోపించినదై, జపతాం వరమ్=మునులలో శ్రేష్ఠు డైన, వసిష్ఠమ్=వసిష్ఠుని గూర్చి, అభ్యధావత్=పరుగెత్తెను. భగవాన్=భగవంతు డైన, ఋషిః=వసిష్ఠమహర్షి, తాన్=ఆ, సర్వాన్=అందరిని, హుంకారేణైవ=హుంకారముచేతనే, దదాహ=కాల్చివేసెను.

తా. మహాత్ముడైన వసిష్ఠుడు తమ సైన్యమును నశింపచేయుటను చూచి, విశ్వామిత్రుని నూర్గురు కుమారులు మిక్కిలి కోపించినవారై, అనేకవిధములైన ఆయుధములను ధరించి, వసిష్ఠమహాముని పైకి దుమికిరి. ఆతడు వారి నందరిని, హుంకారము చేసి, భస్మము చేసెను. 5, 6

మూ. తే సాశ్వరథపాదాతా వసిష్ఠేన మహాత్మనా,
భస్మీకృతా ముహూర్తేన విశ్వామిత్రసుతా స్తదా. 7

ప్ర. అ. తదా = అప్పుడు, సాశ్వరథపాదాతాః = అశ్వములతోడను, రథములతోడను, కాలిబంటులతోడను కూడిన, తే = ఆ, విశ్వామిత్రసుతాః = విశ్వామిత్రుని కుమారులు, మహాత్మనా = మహాత్ముడైన, వసిష్ఠేన = వసిష్ఠుని చేత, ముహూర్తేన = క్షణకాలములో, భస్మీకృతాః = భస్మము చేయబడినారు.

తా. ఆ విశ్వామిత్రకుమారుల సందరిని మహాత్ముడైన వసిష్ఠుడు, అశ్వ రథపదాతులతో సహా క్షణములో భస్మము చేసెను. 7

మూ. దృష్ట్వా వినాశితాన్ పుత్రాన్ బలం చ సుమహాయశాః,
సవ్రీడశ్చిన్తయావిష్టో విశ్వామిత్రోఽభవత్తదా. 8

ప్ర. అ. తదా = అప్పుడు, సుమహాయశాః = గొప్ప కీర్తి గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వినాశితాన్ = నశింపచేయబడిన, పుత్రాన్ = పుత్రులను, బలం చ = సైన్యమును, దృష్ట్వా = చూచి, సవ్రీడః = సిగ్గుతో కూడినవాడై, చిన్తయా = విచారముతో, ఆవిష్టః = కూడినవాడు, అభవత్ = ఆయెను.

తా. ఆ విధముగ తన సైన్య మంతయు, కుమారులును నశించిపోవుట చూచి విశ్వామిత్రుడు సిగ్గుతో చింతాక్రాంతు డయ్యెను. 8

మూ. సముద్ర ఇవ నిర్వేగో భగ్నదంష్ట్ర ఇవోరగః,
ఉపరక్త ఇవాదిత్యః సద్యో నిష్ప్రభతాం గతః. 9

ప్ర. అ. నిర్వేగః = వేగము లేని, సముద్రః ఇవ = సముద్రము వలె, భగ్నదంష్ట్రః = విరిగిపోయిన కోరలు గల, ఉరగః ఇవ = సర్పము వలె, ఉప

రక్తః = రాహువుచే మ్రింగబడిన, ఆదిత్యః ఇవ = సూర్యుడు వలె, సద్యః = వెంటనే, నిష్ప్రభతామ్ = కాంతిరహితత్వమును, గతః = పొందెను.

తా. వేగము లేని సముద్రము వలె, కోరలు తీసిన పాము వలె, రాహువు మ్రింగిన సూర్యుడు వలె కాంతివిహీను డయ్యెను. 9

మూ. హతపుత్రబలో దీనో లూనపక్ష ఇవ ద్విజః,
హతదర్పో హతోత్సాహో నిర్వేదం సమపద్యత. 10

ప్ర. అ. హతపుత్రబలః = చంపబడిన పుత్రులును సైన్యమును గల అతడు, లూనపక్షః = ఖండింపబడిన రెక్కలు గల, ద్విజః ఇవ = పక్షి వలె, దీనః = దీనుడై, హతదర్పః = తొలగిన దర్పముకలవాడై, హతోత్సాహః = తొలగిన ఉత్సాహము కలవాడై, నిర్వేదమ్ = దుఃఖమును, సమపద్యత = పొందెను.

తా. పుత్రులను సైన్యమును నశించుటచే అతడు రెక్కలు తెగగొట్టిన పక్షి వలె, దీనుడై దర్పోత్సాహములు అడగి దుఃఖమును పొందెను. 10

మూ. స పుత్రమేకం రాజ్యాయ పాలయేతి నియుజ్య చ,
పృథివీం క్షత్రధర్మేణ వనమేవాన్వపద్యత. 11

ప్ర. అ. సః = అతడు, పృథివీమ్ = భూమిని, క్షత్రధర్మేణ = క్షత్రియ ధర్మానుసారముగా, పాలయ = పాలించుము, ఇతి = అని, ఏకమ్ = ఒక, పుత్రమ్ = పుత్రుని, రాజ్యాయ = రాజ్యమునకై, నియుజ్య = నియమించి, వనమేవ = వనమునే, అన్వపద్యత = చేరెను.

తా. విశ్వామిత్రుడు, "ఈ భూమిని క్షత్రియధర్మానుసారముగా పాలింపుము" అని ఒక కుమారుని నియమించి వనమునకు వెళ్లిపోయెను. 11

మూ. స గత్వా హిమవత్పార్శ్వం కిన్నరోరగసేవితమ్,
మహాదేవప్రసాదార్థం తపస్తేపే మహాతపాః. 12

ప్ర. అ. మహాతపాః = గొప్ప తపస్సు గల, సః = అతడు, కిన్నరోరగ సేవితమ్ = కిన్నరులచేతను సర్పములచేతను సేవింపబడిన (ఉరగు లనువారు

ఒక జాతి కావచ్చును). హిమవత్పార్శ్వమ్=హిమవత్పర్వతప్రాంతమును గూర్చి, గత్వా=వెళ్లి, మహాదేవప్రసాదార్థమ్=మహాదేవుని అనుగ్రహముకొరకై, తపః=తపస్సును, తేపే=తపించెను.

తా. మహాతపశ్శాలి యగు ఆ విశ్వామిత్రుడు కిన్నరులతోడను ఉరగులతోడను కూడిన హిమవత్పర్వతసమీపము చేరి మహాదేవుని అనుగ్రహము కోరుచు తపస్సు చేసెను. 12

మూ. కేన చిత్త్వథ కాలేన దేవేశో వృషభధ్వజః,
దర్శయామాస వరదో విశ్వామిత్రం మహాబలమ్. 13

ప్ర. అ. అథ=పిమ్మట, కేన చిత్ కాలేన=కొంతకాలమునకు, దేవేశః=దేవతాప్రభువైన, వృషభధ్వజః=వృషభము ధ్వజముగా గల శివుడు, వరదః=వరముల నిచ్చువాడై, మహాబలమ్=గొప్ప బలము గల, విశ్వామిత్రమ్=విశ్వామిత్రునకు, దర్శయామాస=తనను చూపించెను.

తా. అంత కొంతకాలమునకు దేవాధీశు డైన పరమేశ్వరుడు మహాబలశాలి యగు విశ్వామిత్రునకు వరముల నిచ్చుటకై ప్రత్యక్ష మాయెను. 13

మూ. కిమర్థం తప్యసే రాజన్ బ్రూహి యత్తే వివక్షితమ్,
వరదోఽస్మి వరో యస్తే కాఙ్క్షితః సోఽభిధీయతామ్. 14

ప్ర. అ. రాజన్=రాజా! కిమర్థమ్=ఎందుకు, తప్యసే = తపస్సుచేయుచున్నావు? తే=నీకు, యత్ = ఏది, వివక్షితమ్ = చెప్ప నుద్దేశింపబడినదో, తత్=దానిని, బ్రూహి=చెప్పుము. వరదః=వరములనిచ్చువాడను, అస్మి=అయి ఉన్నాను. యః=ఏ, వరః=వరము, తే=నీచేత, కాఙ్క్షితః=కోరబడినదో, సః=అది, అభిధీయతామ్=చెప్పబడుగాక.

తా. రాజా! ఎందుకు తపస్సు చేయుచున్నావు? నీవు చెప్పదలచిన దేదియో చెప్పుము. నీకు వరముల నిచ్చెదను. నీవు కోరెడు కోరిక ఏదియో చెప్పుము. 14

మూ. ఏవముక్తస్తు దేవేన విశ్వామిత్రో మహాతపాః,
ప్రణిపత్య మహాదేవమిదం వచనమబ్రవీత్. 15

ప్ర. అ. దేవేన=ఈశ్వరునిచేత, ఏవమ్=ఈ విధముగా, ఉక్తః=పలకబడిన, మహాతపాః=గొప్ప తపస్సు గల, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, మహాదేవమ్=మహాదేవుని, ప్రణిపత్య=నమస్కరించి, ఇదమ్=ఈ, వచనమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. మహాదేవు డిట్లు పలుకగా విని మహాతపశ్శాలి యగు విశ్వామిత్రుడు ఆతనికి నమస్కరించి ఇట్లు పలికెను. 15

మూ. యది తుష్టో మహాదేవ ధనుర్వేదో మమానఘ,
సాఙ్గోపాఙ్గోపనిషదః సరహస్యః ప్రదీయతామ్. 16

ప్ర. అ. అనఘ=దోషములు లేని, మహాదేవ = మహాదేవుడా! తుష్టః యది = సంతసించినట్లైతే, సాఙ్గోపాఙ్గోపనిషదః = అంగములతోడను, ఉపాంగములతోడను ఉపనిషత్తులతోడను కూడినదియు, సరహస్యః = రహస్యములతో కూడినదియు అగు, ధనుర్వేదః=ధనుర్వేదము, మమ=నాకు, ప్రదీయతామ్=ఇవ్వబడుగాక.

తా. "మహాదేవా! నీవు అనుగ్రహించినట్లైతే, నాకు ధనుర్వేదము నంతను సాంగోపాంగముగా సరహస్యముగా ఇమ్ము" 16

మూ. యాని దేవేషు చాస్త్రాణి దానవేషు మహర్షిషు,
గన్ధర్వయక్షరక్షస్సు ప్రతిభాన్తు మమానఘ. 17

ప్ర. అ. అనఘ=దోషరహితుడా! దేవేషు=దేవతలయందు, దానవేషు=దానవులయందును, మహర్షిషు = మహర్షులయందును, గన్ధర్వయక్షరక్షస్సు=గంధర్వులందును, యక్షులందును, రాక్షసులందును, యాని = ఏ, అస్త్రాణి=అస్త్రము లున్నవో, అవి, మమ=నాకు, ప్రతిభాన్తు=స్ఫురించుగాక.

తా. "పాపరహితుడ వైన ఓ మహాదేవా! దేవతలకును, దానవులకును,

మహర్షులకును, గంధర్వయక్షరక్షస్సులకును తెలిసిన అస్త్రము లన్నియు నాకు స్ఫురించుగాక". 17

మూ. తవ ప్రసాదాద్భవతు దేవదేవ మమేప్సితమ్,
ఏవమస్త్వితి దేవేశో వాక్యముక్త్వా గతస్తదా. 18

ప్ర. అ. దేవదేవ = దేవతలకు దేవుడ వైన మహాదేవా! తవ = నీ యొక్క, ప్రసాదాత్ = అనుగ్రహమువలన, మమ = నాయొక్క, ఈప్సితమ్ = కోరిక, భవతు = సిద్ధించుగాక. ఏవమ్ = ఇటులనే, అస్తు = అగుగాక, ఇతి = అని, దేవేశః = మహాదేవుడు, ఉక్త్వా = పలికి, తదా = అప్పుడు, గతః = వెళ్లినాడు.

తా. "దేవాధిదేవా! నీ అనుగ్రహమువలన నా కోరిక తీరుగాక". ఈ వాక్యమును విని మహాదేవుడు— "అటులనే అగును" అని పలికి వెడలి పోయెను. 18

మూ. ప్రాప్య చాస్త్రాణి రాజర్షిర్విశ్వామిత్రో మహాబలః,
దర్పేణ మహతా యుక్తో దర్పపూర్ణోఽభవత్తదా. 19

ప్ర. అ. మహాబలః = గొప్ప బలముకలవాడును, రాజర్షిః = రాజర్షియు, మహతా = గొప్ప, దర్పేణ = దర్పముతో, యుక్తః = కూడినవాడును అగు, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, తదా = అప్పుడు, అస్త్రాణి = అస్త్రములను, ప్రాప్య = పొంది, దర్పపూర్ణః = దర్పముతో నిండినవాడు, అభవత్ = ఆయెను.

తా. మహాబలశాలి యగు విశ్వామిత్రుడు స్వతః దర్పముకలవాడు. ఆ అస్త్రములు లభించగనే ఆతని దర్పము ఇనుమడించెను. 19

మూ. వివర్ధమానో వీర్యేణ సముద్ర ఇవ పర్వణి,
హతమేవ తదా మేనే వసిష్ఠమృషిసత్తమమ్. 20

ప్ర. అ. పర్వణి = పర్వమునందు, సముద్ర ఇవ = సముద్రము వలె, వీర్యేణ = వీర్యముచేత, వివర్ధమానః = వృద్ధిపొందుచున్నవాడై, ఋషిసత్తమమ్=

ఋషిశ్రేష్ఠుడైన, వసిష్ఠమ్ = వసిష్ఠుని, తదా = అప్పుడు, హతమేవ = చంప బడినవానినిగానే, మేనే = తలచెను.

తా. పూర్ణిమాపర్వమునందు సముద్రము పొంగినట్లు వీర్యముచేత వృద్ధి పొందుచున్నవాడై, విశ్వామిత్రుడు— "ఇపు డిక ఈ వసిష్ఠుడు తప్పక నశింప గలడు" అని భావించెను. 20

మూ. తతో గత్వాశ్రమపదం ముమోచాస్త్రాణి పార్థివః,
యైస్తత్తపోవనం సర్వం నిర్దగ్ధం చాస్త్రతేజసా. 21

ప్ర. అ. తతః = పిమ్మట, పార్థివః = రాజు, ఆశ్రమపదమ్ = ఆశ్రమ మును గూర్చి, గత్వా = వెళ్లి, అస్త్రాణి = అస్త్రములను, ముమోచ = విడచెను. యైః = వేటిచేత, తత్ = ఆ, సర్వమ్ = సమస్తమైన, తపోవనమ్ = తపోవనము, అస్త్రతేజసా = అస్త్రముల తేజస్సుచేత, నిర్దగ్ధమ్ = కాల్చివేయబడినదో.

తా. విశ్వామిత్రుడు వసిష్ఠాశ్రమమునకు పోయి అస్త్రములను విడువగా ఆ అస్త్రముల తేజస్సుచే ఆ తపోవన మంతయు దగ్ధ మయ్యెను. 21

మూ. ఉదీర్యమాణమస్త్రం తద్విశ్వామిత్రస్య ధీమతః,
దృష్ట్వా విప్రద్రుతాః సర్వే మునయః శతశో దిశః. 22

ప్ర. అ. ధీమతః = బుద్ధిమంతుడైన, విశ్వామిత్రస్య = విశ్వామిత్రుని యొక్క, తత్ = ఆ, ఉదీర్యమాణమ్=విజృంభించుచున్న, అస్త్రమ్=అస్త్రమును, దృష్ట్వా = చూచి, శతశః = వందలకొలది, మునయః = మునులు, సర్వే = అందరును, దిశః = దిక్కులను గూర్చి, విప్రద్రుతాః = పారిపోయిరి.

తా. ఆ విశ్వామిత్రాస్త్రములు విజృంభించుట చూచి అచట నున్న మును లందరును దిక్కులను పట్టి పారిపోయిరి. 22

మూ. వసిష్ఠస్య చ యే శిష్యాస్తథైవ మృగపక్షిణః,
విద్రవన్తి భయాద్భీతా నానాదిగ్భ్యః సహస్రశః. 23

ప్ర. అ. వసిష్ఠస్య = వసిష్ఠునియొక్క, యే = ఏ, శిష్యాః = శిష్యులు కలరో వారును, తథైవ = మరియు, మృగపక్షిణః = మృగములును పక్షులును, భయాత్ = ఆ భయకారణమువలన, భీతాః = భీతులై, సహస్రశః = వేలకొలది, నానాదిగ్భ్యః = అన్నిదిక్కులకును, విద్రవన్తి = పారిపోయిరి.

తా. వసిష్ఠుని శిష్యులును, వేలకొలది మృగములును, పక్షులును భీతిచెంది నలు దిక్కులకును పారిపోయిరి. 23

మూ. వసిష్ఠస్యాశ్రమపదం శూన్యమాసీన్మహాత్మనః,
ముహూర్తమివ నిశ్శబ్దమాసీదిరిణసన్నిభమ్. 24

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, వసిష్ఠస్య = వసిష్ఠుని యొక్క, ఆశ్రమపదమ్ = ఆశ్రమము, శూన్యమ్ = శూన్యముగ, ఆసీత్ = అయెను. ముహూర్తమివ = క్షణకాలములో, ఇరిణసన్నిభమ్ = మరుస్థానముతో తుల్యమైనదై, నిశ్శబ్దమ్ = నిశ్శబ్దము, ఆసీత్ = ఆయెను.

తా. మహాత్ముడైన వసిష్ఠుని ఆశ్రమము, క్షణకాలములో మరుస్థలము వలె ప్రాణిశూన్యమును, నిశ్శబ్దమును అయెను. 24

మూ. వదతో వై వసిష్ఠస్య మా భైరితి ముహుర్ముహుః,
నాశయామ్యద్య గాధేయం నీహారమివ భాస్కరః. 25

ప్ర. అ. భాస్కరః = సూర్యుడు, నీహారమివ = పొగమంచును వలె, గాధేయమ్ = విశ్వామిత్రుని, అద్య = ఇప్పుడు, నాశయామి = నశింపచేయుదును. మాభైః = భయపడకుడు. ఇతి = అని, వసిష్ఠస్య = వసిష్ఠుడు, ముహుర్ముహుః = మాటిమాటికిని, వదతః = పలుకుచుండగనే, (పారిపోయిరి).

తా. "సూర్యుడు మంచును నశింపచేసి నట్లు ఈ విశ్వామిత్రుని నశింపచేసెదను. భయపడకుడు" అని వసిష్ఠుడు అనుచుండగనే అచటి మునులును, తదితరప్రాణులును పారిపోయిరి. 25

మూ. ఏవముక్త్వా మహాతేజా వసిష్ఠో జపతాం వరః,
విశ్వామిత్రం తదా వాక్యం సరోషమిదమబ్రవీత్. 26

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, జపతాం వరః = మునులలో శ్రేష్ఠుడైన, వసిష్ఠః = వసిష్ఠుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తదా = అప్పుడు, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, సరోషమ్ = రోషముతో కూడి నట్లుగా, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మునులలో శ్రేష్ఠుడును, మహాతేజశ్శాలియు అగు వసిష్ఠుడు ఈ విధముగా పలికి, క్రోధావిష్టుడై విశ్వామిత్రునితో ఇట్లనెను. 26

మూ. ఆశ్రమం చిరసంవృద్ధం యద్వినాశితవానసి,
దురాచారోఽసి తన్మూఢ తస్మాత్త్వం న భవిష్యసి. 27

ప్ర. అ. మూఢ = మూడుడా ! చిరసంవృద్ధమ్ = చిరకాలమునుండి పెంచబడిన, ఆశ్రమమ్ = ఆశ్రమమును, యత్ = ఏ కారణమువలన, వినాశితవాన్ = నశింపచేసినవాడవు, అసి = అయితివో, తత్ = ఆకారణమువలన, దురాచారః = దుష్ప్రవర్తన కలవాడవు, అసి=అయితివి. తస్మాత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, న భవిష్యసి = ఉండవు.

తా. "ఓరీ ! మూఢాత్మా ! చిరకాలమునుంచి పెంచిన ఆశ్రమమును నశింపచేసితివి. ఇంతటి దుష్కార్యము చేసితివి. ఇక నీవు జీవించవు". 27

మూ. ఇత్యుక్త్వా పరమక్రుద్ధో దణ్డముద్యమ్య సత్వరః,
విధూమమివ కాలాగ్నిం యమదణ్డమివాపరమ్. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పఞ్చపఞ్చాశః సర్గః.

ప్ర. అ. ఇతి = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, సత్వరః = తొందర కలవాడై, పరమక్రుద్ధః = చాల కోపించినవాడై, విధూమమ్ = ధూమము లేని,

కాలాగ్నిమివ=కాలాగ్ని వలె నున్నదియు, అపరమ్=రెండవ, యమదణ్డమివ= యమదండము వలె నున్నదియు అగు, దణ్డమ్=దండమును, ఉద్యమ్య= ఎత్తి, (నిలచెను).

తా. మిక్కిలి కోపించిన వసిష్ఠుడు ఈ విధముగ పలికి ధూమము లేని కాలాగ్ని వలె, రెండవ యమదండము వలె ఉన్న దండమును శీఘ్రముగ చేత ధరించి నిలచెను. 28

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు, బాలకాండలో ఏబదియెదవ సర్గ సమాప్తము.

అథ షట్పఞ్చాశః సర్గః

మూ. ఏవముక్తో వసిష్ఠేన విశ్వామిత్రో మహాబలః,
ఆగ్నేయమస్త్రముత్క్షిప్య తిష్ఠ తిష్ఠేతి చాబ్రవీత్. 1

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడినవాడై, ఆగ్నేయమ్ అస్త్రమ్ = ఆగ్నేయాస్త్రమును, ఉత్క్షిప్య = ఎత్తి, తిష్ఠ తిష్ఠ ఇతి = నిలువుము, నిలువుము అని, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. వసిష్ఠుని వాక్యములు విన్న మహాబలశాలి యగు విశ్వామిత్రుడు ఆగ్నేయాస్త్రమును ప్రయోగించుచు, "నిలువుము, నిలువుము" అని పలికెను. 1

మూ. బ్రహ్మదణ్డం సముత్క్షిప్య కాలదణ్డమివాపరమ్,
వసిష్ఠో భగవాన్ క్రోధాదిదం వచనమబ్రవీత్. 2

ప్ర. అ. భగవాన్ = పూజ్యుడైన, వసిష్ఠః = వసిష్ఠుడు, అపరమ్ = రెండవ, కాలదణ్డమివ = యమదండము వలె నున్న, బ్రహ్మదణ్డమ్ = బ్రహ్మదండమును, సముత్క్షిప్య = ఎత్తి, క్రోధాత్ = కోపముతో, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. పూజ్యుడైన వసిష్ఠుడు రెండవ కాలదండము వలె నున్న బ్రహ్మదండము నెత్తి కోపముతో ఇట్లు పలికెను. 2

మూ. క్షత్రబన్ధో స్థితోఽస్మ్యేష యద్బలం తద్విదర్శయ,
నాశయామ్యద్య తే దర్పం శస్త్రస్య తవ గాధిజ. 3

ప్ర. అ. క్షత్రబన్ధో = ఓ దుష్టక్షత్రియా ! ఏషః = ఈ నేను, స్థితః అస్మి = నిలచి ఉన్నాను. యత్ = ఏ, బలమ్ = బల మున్నదో, తత్ = దానిని, విదర్శయ = చూపుము. గాధిజ = ఓ గాధికుమారుడా ! అద్య = ఇప్పుడు, తే = నీయొక్క,

దర్పమ్=దర్పమును, తవ=నీయొక్క, శస్త్రస్య = ఆయుధముయొక్క, దర్ప
మును, నాశయామి=నశింపచేసెదను.

తా. ఓ దుష్టక్షత్రియా! నీ కున్న బల మేదియో చూపుము. ఇపుడు నీ
దర్పమును, నీ శస్త్రముల దర్పమును నశింపచేసెదను. 3

మూ. క్వ చ తే క్షత్రియబలం క్వ చ బ్రహ్మబలం మహత్,
పశ్య బ్రహ్మబలం దివ్యం మమ క్షత్రియపాంసన. 4

ప్ర. అ. క్షత్రియపాంసన = ఓ క్షత్రియాధమా! తే = నీయొక్క,
క్షత్రియబలమ్=క్షత్రియబలము, క్వ=ఎక్కడ! మహత్=గొప్పదైన, బ్రహ్మ
బలమ్=బ్రహ్మబలము, క్వ చ=ఎక్కడ! మమ=నాయొక్క, దివ్యమ్=దివ్య
మైన, బ్రహ్మబలమ్=బ్రహ్మబలమును, పశ్య=చూడుము.

తా. ఓ క్షత్రియాధమా! నీ క్షత్రియబల మెక్కడ, గొప్పదైన బ్రహ్మ
బల మెక్కడ! దివ్య మైన నా బ్రహ్మబలమును చూడుము. 4

మూ. తస్యాస్త్రం గాధిపుత్రస్య ఘోరమాగ్నేయముద్యతమ్,
బ్రహ్మదణ్డేన తచ్ఛాన్తమగ్నేర్వేగ ఇవామ్బసా. 5

ప్ర. అ. తస్య=ఆ, గాధిపుత్రస్య=విశ్వామిత్రునియొక్క, ఉద్యతమ్=
ప్రయోగింపబడిన, తత్=ఆ, ఆగ్నేయమ్=ఆగ్నేయ మను, అస్త్రమ్=అస్త్రము,
అమ్బసా=నీటిచేత, అగ్నేః=అగ్నియొక్క, వేగః ఇవ=వేగము వలె, బ్రహ్మ
దణ్డేన=బ్రహ్మదండముచేత, శాన్తమ్=శాంతించినది.

తా. విశ్వామిత్రుడు ప్రయోగించిన భయంకర మైన ఆ బ్రహ్మాస్త్రము
అగ్నివేగము ఉదకముచే శాంతించి నట్లు బ్రహ్మదండముచే శాంతించెను. 5

మూ. వారుణం చైవ రౌద్రం చ ఐన్ద్రం పాశుపతం తథా,
ఐషీకం చాపి చిక్షేప కుపితో గాధినన్దనః. 6

ప్ర. అ. కుపితః=కోపించిన, గాధినన్దనః = విశ్వామిత్రుడు, వారుణం
చైవ=వారుణాస్త్రమును, రౌద్రం చ=రౌద్రాస్త్రమును, ఐన్ద్రం చ=ఐంద్రాస్త్రమును,

తథా=మరియు, పాశుపతమ్=పాశుపతాస్త్రమును, ఐషీకం చాపి=ఐషీకాస్త్రమును, చిక్షేప=ప్రయోగించెను.

తా. విశ్వామిత్రుడు కోపించి వారుణ–రౌద్ర–ఐంద్ర–పాశుపత–ఐషీకాస్త్రములను ప్రయోగించెను. 6

మూ. మానవం మోహనం చైవ గాన్ధర్వం స్వాపనం తథా,
జృమ్భణం మాదనం చైవ సన్తాపనవిలాపనే. 7

శోషణం దారణం చైవ వజ్రమస్త్రం సుదుర్జయమ్,
బ్రహ్మపాశం కాలపాశం వారుణం పాశమేవ చ. 8

పైనాకాస్త్రం చ దయితం శుష్కార్ద్రే అశనీ ఉభే,
దణ్డాస్త్రమథ పైశాచం క్రౌఞ్చమస్త్రం తథైవ చ. 9

ధర్మచక్రం కాలచక్రం విష్ణుచక్రం తథైవ చ,
వాయవ్యం మథనం చైవ అస్త్రం హయశిర స్తథా. 10

శక్తిద్వయం చ చిక్షేప కఙ్కాళం ముసలం తథా,
వైద్యాధరం మహాస్త్రం చ కాలాస్త్రమథ దారుణమ్. 11

త్రిశూలమస్త్రం ఘోరం చ కాపాలమథ కఙ్కణమ్,
ఏతాన్యస్త్రాణి చిక్షేప సర్వాణి రఘునన్దన. 12
వసిష్ఠే జపతాం శ్రేష్ఠే తదద్భుతమివాభవత్.

ప్ర. అ. రఘునన్దన=రామా! మానవమ్=మానవాస్త్రమును, మోహనం చైవ=మోహము కలిగించు అస్త్రమును, గాన్ధర్వమ్=గాంధర్వమును, తథా=మరియు, స్వాపనమ్=నిద్రకలిగించు అస్త్రమును, జృమ్భణమ్=ఆవులింతలు కలిగించు అస్త్రమును, మాదనం చైవ=మత్తు కలిగించు అస్త్రమును, సన్తాపన విలాపనే=తాపమును విలాపమును కలిగించు అస్త్రములను, శోషణమ్=ఎండింపచేయు అస్త్రమును, దారణం చైవ=చీల్చివేయు అస్త్రమును, సుదుర్జయమ్=ఏమాత్రము జయింపశక్యము కాని, వజ్రమ్ అస్త్రం చ=

వజ్రాస్త్రమును, బ్రహ్మపాశమ్ = బ్రహ్మపాశమును, కాలపాశమ్ = కాలపాశమును, వారుణం పాశమేవ చ = వరుణపాశమును, పైనాకాస్త్రమ్ = పైనాకాస్త్రమును, దయితం చ = దయితాస్త్రమును, శుష్కార్ద్రే = శుష్కము (ఎండినది) ఆర్ద్రము (తడిసినది) అను, ఉభే = రెండు, అశనీ = వజ్రములను, అథ = మరియు, దణ్డాస్త్రమ్ = దండాస్త్రమును, పైశాచమ్ = పైశాచమును, తథైవ చ = మరియు, క్రౌఞ్చమస్త్రమ్ = క్రౌంచాస్త్రమును, ధర్మచక్రమ్ = ధర్మచక్రమును, కాలచక్రమ్ = కాలచక్రమును, తథైవ చ = మరియు, విష్ణుచక్రమ్ = విష్ణుచక్రమును, వాయవ్యమ్ = వాయవ్యమును, మథనం చైవ = మథనమును, తథా = మరియు, హయశిరః అస్త్రమ్ = హయశిరస్సు అను అస్త్రమును, కఙ్కాళమ్ = కంకాళము, తథా = మరియు, ముసలమ్ = ముసలము అనెడు, శక్తిద్వయం చ = రెండు శక్తులను, చిక్షేప = ప్రయోగించెను. వైద్యాధరమ్ = వైద్యాధర మనెడు, మహాస్త్రం చ = మహాస్త్రమును, అథ = అటుపిమ్మట, దారుణమ్ = భయంకరమైన, కాలాస్త్రమ్ = కాలాస్త్రమును, ఘోరమ్ = ఘోరమైన, త్రిశూలమ్ అస్త్రమ్ = త్రిశూలాస్త్రమును, అథ = మరియు, కాపాలమ్ = కాపాలమును, కఙ్కణమ్ = కంకణాస్త్రమును, ఏతాని = ఈ, సర్వాణి = సమస్తమైన, అస్త్రాణి = అస్త్రములను, జపతాం శ్రేష్ఠే = మునులలో శ్రేష్ఠుడైన, వసిష్ఠే = వసిష్ఠునిపై, చిక్షేప = ప్రయోగించెను. తత్ = అది, అద్భుతమివ = చాలఆశ్చర్యకరము, అభవత్ = ఆయెను.

తా. రామా ! ఆ విశ్వామిత్రుడు, మానవ—మోహన—గాంధర్వ—స్వాపన—జృంభణ—మాదన—సంతాపన—విలాపన—శోషణ—దారణ—వజ్రాస్త్రములను, బ్రహ్మపాశ—వరుణపాశములను, పైనాక—దయితాస్త్రములను, శుష్కము, ఆర్ద్రము అను రెండు వజ్రములను, దండ—పైశాచ క్రౌంచాస్త్రములను, ధర్మచక్ర—కాలచక్ర—విష్ణుచక్రములను, వాయవ్య—మథన—హయశిరోస్త్రములను, కంకాళ—ముసలము లను రెండు శక్తులను, వైద్యాధర—కాల—త్రిశూల—కాపాల—కంకణాస్త్రములను ప్రయోగించెను. 7-12

మూ. తాని సర్వాణి దణ్డేన గ్రసతే బ్రహ్మణః సుతః. 13
తేషు శాన్తేషు బ్రహ్మాస్త్రం క్షిప్తవాన్ గాధినన్దనః,

ప్ర. అ. బ్రహ్మణః సుతః = బ్రహ్మకుమారుడైన వసిష్ఠుడు, తాని

సర్వాణి = వాటి నన్నింటిని, దణ్డేన = దండముచేత, గ్రసతే = మ్రింగివేసెను. తేషు = ఆ అస్త్రములు, శాన్తేషు = శాంతించగా, గాధినన్దనః = విశ్వామిత్రుడు, బ్రహ్మాస్త్రమ్ = బ్రహ్మాస్త్రమును, క్షిప్తవాన్ = ప్రయోగించినాడు.

తా. వసిష్ఠుడు ఆ అస్త్రముల నన్నింటిని దండముచే మ్రింగివేసెను. ఆ అస్త్రము లన్నియు శాంతింపగా, విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రము ప్రయోగించెను. 13

మూ. తదస్త్రముద్యతం దృష్ట్వా దేవాః సాగ్నిపురోగమాః. 14
దేవర్షయశ్చ సంభ్రాన్తా గన్ధర్వాః సమహోరగాః,
త్రైలోక్యమాసీత్సంతప్తం బ్రహ్మాస్త్రే సముదీరితే. 15

ప్ర. అ. ఉద్యతమ్ = ప్రయోగించబడిన, తత్ = ఆ, అస్త్రమ్ = అస్త్రమును, దృష్ట్వా = చూచి, సాగ్నిపురోగమాః = అగ్నితో కూడిన, దేవాః = దేవతలును, దేవర్షయః చ = దేవర్షులును, సమహోరగాః = మహోరగులతో కూడిన, గన్ధర్వాః = గంధర్వులును, సమ్భ్రాన్తాః = కలతచెందిరి. బ్రహ్మాస్త్రే = బ్రహ్మాస్త్రము, సముదీరితే = ప్రయోగింపబడిన దగుచుండగా, త్రైలోక్యమ్ = మూడు లోకములు, సంతప్తమ్ = తపింపబడినవి, ఆసీత్ = ఆయెను.

తా. ఆ అస్త్రము ప్రయోగించుటను చూచి అగ్న్యాదిదేవతలును, దేవర్షులును, గంధర్వులును, మహోరగులును, కలత చెందిరి. బ్రహ్మాస్త్రము ప్రయోగింపగనే ముల్లోకములును బాధ చెందెను. 15

మూ. తదప్యస్త్రం మహాఘోరం బ్రాహ్మం బ్రాహ్మేణ తేజసా,
వసిష్ఠో గ్రసతే సర్వం బ్రహ్మదణ్డేన రాఘవ. 16

ప్ర. అ. రాఘవ = రామా! వసిష్ఠః = వసిష్ఠుడు, బ్రాహ్మేణ తేజసా = బ్రహ్మతేజస్సుచేత, బ్రహ్మదణ్డేన = బ్రహ్మదండముచేత, మహాఘోరమ్ = అతి భయంకర మైన, తత్ = ఆ, బ్రాహ్మమ్ అస్త్రమపి = బ్రహ్మాస్త్రమును కూడ, సర్వమ్ = పూర్తిగా, గ్రసతే = మ్రింగివేసెను.

తా. రామా! వసిష్ఠుడు, బ్రహ్మతేజః ప్రభావముచే, బ్రహ్మదండముచేత, ఆ అతిభయంకర మైన బ్రహ్మాస్త్రమును కూడ పూర్తిగా మ్రింగివేసెను. 16

మూ. బ్రహ్మాస్త్రం గ్రసమానస్య వసిష్ఠస్య మహాత్మనః,
త్రైలోక్యమోహనం రౌద్రం రూపమాసీత్సుదారుణమ్. 17

ప్ర. అ. బ్రహ్మాస్త్రమ్=బ్రహ్మాస్త్రమును, గ్రసమానస్య=మ్రింగుచున్న, మహాత్మనః=మహాత్ముడైన, వసిష్ఠస్య=వసిష్ఠునియొక్క, రూపమ్ = రూపము, త్రైలోక్యమోహనమ్=మూడు లోకములను మూర్ఛనొందించునదిగాను, రౌద్రమ్=భయంకర మైనదిగాను, సుదారుణమ్=చాల దారుణముగాను, ఆసీత్=ఆయెను.

తా. బ్రహ్మాస్త్రమును మ్రింగుచున్న సమయమున ఆ మహాత్ముడైన వసిష్ఠుని రూపము రౌద్రమై, అతిదారుణమై, ముల్లోకములను మూర్ఛనొందించునదిగా ఉండెను. 17

మూ. రోమకూపేషు సర్వేషు వసిష్ఠస్య మహాత్మనః,
మరీచ్య ఇవ నిష్పేతు రగ్నేర్ధూమాకులార్చిషః. 18

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, వసిష్ఠస్య = వసిష్ఠునియొక్క, సర్వేషు = సమస్తమైన, రోమకూపేషు = రోమకూపములందును, ధూమాకులార్చిషః = ధూమముతో నిండిన జ్వాలలు గల, అగ్నేః = అగ్నియొక్క, మరీచ్యః=కిరణములు, నిష్పేతురివ=బయల్వెడలిన ట్లుండెను.

తా. మహాత్ముడైన వసిష్ఠుని రోమకూపములనుండి ధూమముతో నిండిన జ్వాలలు గల అగ్నికిరణములు బయల్వెడలి నట్లు కనబడెను. 18

మూ. ప్రాజ్వలద్బ్రహ్మదణ్డశ్చ వసిష్ఠస్య కరోద్యతః,
విధూమ ఇవ కాలాగ్నిర్యమదణ్డ ఇవాపరః. 19

ప్ర. అ. వసిష్ఠస్య=వసిష్ఠునియొక్క, కరోద్యతః = హస్తమునందు ఎత్తబడిన, బ్రహ్మదణ్డశ్చ = బ్రహ్మదండము, విధూమః = ధూమములేని, కాలాగ్నిరివ = ప్రలయకాలాగ్ని వలె, అపరః = మరి యొక, యమదణ్డః ఇవ = యమదండము వలె, ప్రాజ్వలత్ = మండిపడెను.

తా. వసిష్ఠుని హస్తములో నున్న బ్రహ్మదండము ధూమము లేని ప్రలయ కాలాగ్ని వలె, రెండవ యమదండము వలె ప్రజ్వరిల్లెను. 19

మూ. తతోఽస్తువన్ మునిగణా వసిష్ఠం జపతాం వరమ్,
అమోఘం తే బలం బ్రహ్మన్ తేజో ధారయ తేజసా. 20

ప్ర. అ. తతః = పిమ్మట, మునిగణాః = మునిసముదాయములు, జపతాం వరమ్ = మునులలో శ్రేష్ఠుడైన, వసిష్ఠమ్ = వసిష్ఠుని, అస్తువన్ = స్తుతించిరి. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణా! తే = నీయొక్క, బలమ్ = బలము, అమోఘమ్ = శ్రేష్ఠమైనది. తేజః = తేజస్సును, తేజసా = తేజస్సుచేత, ధారయ = ధరించుము.

తా. అపుడు మునిగణములు మునిశ్రేష్ఠుడైన వసిష్ఠునితో ఇట్లు పలికిరి. "మహామునీ! నీ బలము అడ్డు లేనిది. నీ తేజస్సును నీ తేజస్సునందే నిగ్రహించుము". 20

మూ. నిగృహీత స్త్వయా బ్రహ్మన్ విశ్వామిత్రో మహాతపాః,
ప్రసీద జపతాం శ్రేష్ఠ లోకాస్సన్తు గతవ్యథాః. 21

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణా! త్వయా = నీచేత, మహాతపాః = గొప్ప తపస్సు గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, నిగృహీతః = నిగ్రహింపబడినాడు. జపతాం శ్రేష్ఠ = మునులలో శ్రేష్ఠుడా! ప్రసీద = అనుగ్రహింపుము. లోకాః = లోకములు, గతవ్యథాః = తొలగినవ్యథ కలవిగా, సన్తు = అగుగాక.

తా. బ్రాహ్మణోత్తమా! నీవు మహాతపశ్శాలియైన విశ్వామిత్రుని నిగ్రహించితివి. ఓ మునిశ్రేష్ఠా! అనుగ్రహింపుము. లోకముల బాధ తొలగుగాక. 21

మూ. ఏవముక్తో మహాతేజాః శమం చక్రే మహాతపాః,
విశ్వామిత్రోఽపి నికృతో వినిఃశ్వస్యేదమబ్రవీత్. 22

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః = పలకబడిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహాతపాః = గొప్ప తపస్సు గల వసిష్ఠుడు, శమమ్ = శాంతిని, చక్రే = చేసెను. నికృతః = అవమానింపబడిన, విశ్వామిత్రః అపి = విశ్వామిత్రుడు కూడ, వినిఃశ్వస్య = నిట్టూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మహాతేజశ్శాలియు, మహాతపశ్శాలియు అగు వసిష్ఠుడు వారి మాటలు

విని శాంతించెను. ఈ విధముగ భంగపాటు చెందిన విశ్వామిత్రుడు నిట్టూర్చుచు ఇట్లు పలికెను. 22

మూ. ధిగ్బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్,
ఏకేన బ్రహ్మదణ్డేన సర్వాస్త్రాణి హతాని మే. 23

ప్ర. అ. క్షత్రియబలమ్=క్షత్రియబలమును గూర్చి, ధిక్ = నింద అగుగాక. బ్రహ్మతేజోబలమ్ = బ్రహ్మతేజస్సుయొక్క బలమే, బలమ్ = బలము. ఏకేన = ఒక్క, బ్రహ్మదణ్డేన = బ్రహ్మదండముచేత, మే = నాయొక్క, సర్వాస్త్రాణి = అన్ని అస్త్రములును, హతాని = కొట్టబడినవి.

తా. ఛీ! క్షత్రియబల మేమి బలము! బ్రహ్మతేజోబలమే నిజమైన బలము. ఒక్క బ్రహ్మదండము నా అస్త్రముల నన్నింటిని మ్రింగివేసినది కదా! 23

మూ. తదేతత్సమవేక్ష్యాహం ప్రసన్నేన్ద్రియమానసః,
తపో మహత్సమాస్థాస్యే యద్వై బ్రహ్మత్వకారణమ్. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షట్పఞ్చాశః సర్గః.

ప్ర. అ. తత్ = ఆ కారణము వలన, ఏతత్ = ఈ విషయమును, సమవేక్ష్య=చూచి, అహమ్=నేను, ప్రసన్నేన్ద్రియమానసః=ప్రసన్న మైన ఇంద్రియములును మనస్సును కలవాడనై, యత్=ఏది, బ్రహ్మత్వకారణమ్ = బ్రాహ్మణత్వమునకు కారణమో అట్టి, మహత్=గొప్ప, తపః=తపస్సును, సమాస్థాస్యే= అవలంబింపగలను.

తా. ఇపుడు నే నీ విషయమును గ్రహించితిని. అందుచేత మనస్సును ఇంద్రియములను నిర్మలముగ ఉంచుకొని, నాకు బ్రాహ్మణత్వము నొసగు తీవ్ర తపస్సు చేసెదను. 24

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో ఏబదియారవ సర్గ సమాప్తము.

అథ సప్తపఞ్చాశః సర్గః

మూ. తతః సంతప్తహృదయః స్మరన్నిగ్రహమాత్మనః,
వినిశ్శ్వస్య వినిశ్శ్వస్య కృతవైరో మహాత్మనా. 1

స దక్షిణాం దిశం గత్వా మహిష్యా సహ రాఘవ,
తతాప పరమం ఘోరం విశ్వామిత్రో మహత్తపః, 2
ఫలమూలాశనో దాన్తశ్చకార సుమహత్తపః.

ప్ర. అ. రాఘవ=రామా! తతః=పిమ్మట, మహాత్మనా=మహాత్ముడైన వసిష్ఠునితో, కృతవైరః = చేయబడిన వైరము గల, సః=ఆ, విశ్వామిత్రః= విశ్వామిత్రుడు, సంతప్తహృదయః = తపింపచేయబడిన హృదయము కలవాడై, ఆత్మనః=తనయొక్క, నిగ్రహమ్ = పరాభవమును, స్మరన్ = స్మరించుచు, వినిశ్శ్వస్య వినిశ్శ్వస్య=మాటిమాటికి నిట్టూర్చి, మహిష్యా సహ=జ్యేష్ఠభార్యతో కూడ, దక్షిణాం దిశమ్ = దక్షిణదిక్కును గూర్చి, గత్వా = వెళ్లి, పరమం ఘోరమ్=మిక్కిలి ఘోర మైన, మహత్=గొప్ప, తపః=తపస్సును, తతాప= చేసెను. ఫలమూలాశనః=ఫలమూలములను ఆహారముగ గ్రహించుచు, దాన్తః= ఇంద్రియనిగ్రహము గలవాడై, సుమహత్=గొప్ప, తపః=తపస్సు, చకార= చేసెను.

తా. ఈ విధముగ మహాత్ము డైన వసిష్ఠునితో వైరము పెట్టుకొనిన ఆ విశ్వామిత్రుడు తనకు కలిగిన పరాభవమును స్మరించుచు, బాధపడు చున్న మన స్సుతో మాటి మాటికి నిట్టూర్చుచు, జ్యేష్ఠభార్యతో కూడ దక్షిణదిక్కునకు వెళ్లి, ఫలములు మూలములు మాత్రమే ఆహారముగా గొనుచు, ఇంద్రియములను నిగ్రహించుకొని అతి తీవ్ర మైన తపస్సు చేసెను. 1, 2

మూ. అథాస్య జజ్ఞిరే పుత్రాస్సత్యధర్మపరాయణాః,
హవిష్యన్దో మధుస్యన్దో దృఢనేత్రో మహారథః. 3

ప్ర. అ. అథ=పిమ్మట, అస్య=ఈతనికి, హవిష్యన్దః = హవిష్యందుడు, మధుస్యన్దః=మధుస్యందుడు, దృఢనేత్రః = దృఢనేత్రుడు, మహారథః=మహా

రథుడు అను, సత్యధర్మపరాయణాః=సత్యధర్మములం దాసక్తి గల, పుత్రాః=పుత్రులు, జజ్ఞిరే=పుట్టిరి.

తా. పిమ్మట, ఈ విశ్వామిత్రునకు హవిష్యందుడు, మధుష్యందుడు, దృఢనేత్రుడు, మహారథుడు అను సత్యధర్మపరాయణు లైన నలుగురు కుమారులు పుట్టిరి. 3

మూ. పూర్ణే వర్షసహస్రే తు బ్రహ్మా లోకపితామహః,
అబ్రవీన్మధురం వాక్యం విశ్వామిత్రం తపోధనమ్. 4

ప్ర. అ. వర్షసహస్రే=వేయి సంవత్సరములు, పూర్ణే = నిండగా, లోకపితామహః=లోకములకు పితామహు డైన, బ్రహ్మా=బ్రహ్మదేవుడు, తపోధనమ్=తపస్సే ధనముగా గల, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, మధురమ్=మధుర మైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. వేయి సంవత్సరములు పూర్తి యైనవి. అపుడు సర్వలోకములకును పితామహు డైన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై తపోధను డైన విశ్వామిత్రునితో మధుర మైన వాక్యము పలికెను. 4

మూ. జితా రాజర్షిలోకాస్తే తపసా కుశికాత్మజ,
అనేన తపసా త్వాం తు రాజర్షిరితి విద్మహే. 5

ప్ర. అ. కుశికాత్మజ=విశ్వామిత్రా! తే=నీయొక్క, తపసా=తపస్సుచేత, రాజర్షిలోకాః = రాజర్షిలోకములు, జితాః=జయింపబడినవి. అనేన=ఈ, తపసా=తపస్సుచేత, త్వామ్ = నిన్ను, రాజర్షిః ఇతి=రాజర్షి అని, విద్మహే=గుర్తించుచున్నాము.

తా. కుశికనందనా! నీవు తపస్సుచేత రాజర్షులు చేర గల్గిన లోకాలను జయించినావు. ఈ తపస్సుచే నీవు రాజర్షి వైనావు. 5

మూ. ఏవముక్త్వా మహాతేజా జగామ సహ దైవతైః,
త్రివిష్టపం బ్రహ్మలోకం లోకానాం పరమేశ్వరః. 6

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడును, లోకానామ్=లోకములకు, పరమేశ్వరః=పరమేశ్వరుడును అయిన బ్రహ్మదేవుడు, ఏవమ్=ఈ విధముగా, ఉక్త్వా=పలికి, దైవతైః=దేవతలతో కూడ, బ్రహ్మలోకమ్=బ్రహ్మలోకమైన, త్రివిష్టపమ్=స్వర్గమునుగూర్చి, జగామ=వెళ్లెను.

తా. మహాతేజశ్శాలియు, లోకములకు అధిపతియు అగు బ్రహ్మ ఈ విధముగ పలికి, దేవతలతో కూడ తన నివాసస్థానమైన స్వర్గమునకు వెళ్లెను. 6

మూ. విశ్వామిత్రోఽపి తచ్ఛ్రుత్వా హ్రియా కిఞ్చిదవాఙ్ముఖః,
దుఃఖేన మహతావిష్టః సమన్యు రిదమబ్రవీత్. 7

ప్ర. అ. విశ్వామిత్రోఽపి = విశ్వామిత్రుడు కూడ, తత్=ఆ వాక్యమును, శ్రుత్వా = విని, హ్రియా = సిగ్గుతో, కిఞ్చిత్ = కొంచెము, అవాఙ్ముఖః = వంచబడిన ముఖము కలవాడై, మహతా = గొప్పదైన, దుఃఖేన = దుఃఖముతో, ఆవిష్టః = కూడినవాడై, సమన్యుః = కోపముతో కూడినవాడై, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. విశ్వామిత్రుడు ఈ మాటలు విని, సిగ్గుతో తలవంచుకొని, గొప్ప దుఃఖముతో కూడినవాడై, కోపముతో ఇట్లనెను 7

మూ. తపశ్చ సుమహత్తప్తం రాజర్షిరితి మాం విదుః,
దేవాః సర్షిగణాః సర్వే నాస్తి మన్యే తపఃఫలమ్. 8

ప్ర. అ. సుమహత్ = చాల అధికమైన, తపః = తపస్సు, తప్తమ్ = చేయబడినది. మామ్ = నన్ను, రాజర్షిరితి = రాజర్షి యని, సర్షిగణాః = ఋషిగణములతో కూడిన, సర్వే = సమస్తమైన, దేవాః = దేవతలు, విదుః = గుర్తించుచున్నారు. తపఃఫలం = తపస్సుకు ఫలము, నాస్తి = లేదు అని, మన్యే = తలచుచున్నాను.

తా. ఇంత తపస్సు చేసినాను; అయినను, దేవతలును, ఋషిగణములును రాజర్షి యని మాత్రమే నన్ను గుర్తించుచున్నారు. ఇంత తపస్సు చేసి ఫలితమేమియు లేదని తలచుచున్నాను. 8

మూ. ఇతి నిశ్చిత్య మనసా భూయ ఏవ మహాయశాః,
తపశ్చకార కాకుత్స్థ పరమం పరమాత్మవాన్. 9

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! మహాయశాః = గొప్ప కీర్తి కలవాడును, పరమాత్మవాన్ = మంచి బుద్ధి కలవాడును అగు ఆ విశ్వామిత్రుడు, ఇతి = ఈ విధముగా, మనసా = మనస్సుచేత, నిశ్చిత్య = నిశ్చయించి, భూయః ఏవ = మరల, పరమమ్ = గొప్ప, తపః = తపస్సును, చకార = చేసెను.

తా. రామా ! గొప్ప కీర్తి కలవాడును, గొప్ప బుద్ధి కలవాడును అగు ఆ విశ్వామిత్రుడు మనస్సుచే ఈ విధముగా నిశ్చయించి మరల తీవ్ర మైన తపస్సు చేయ నారంభించెను. 9

మూ. ఏతస్మిన్నేవ కాలే తు సత్యవాదీ జితేన్ద్రియః,
త్రిశఙ్కురితి విఖ్యాత ఇక్ష్వాకుకులవర్ధనః. 10

ప్ర. అ. ఏతస్మిన్నేవ కాలే = ఈ కాలమునందే, సత్యవాదీ = సత్యమును పలుకువాడును, జితేన్ద్రియః = జయింపబడిన ఇంద్రియములు కలవాడును, ఇక్ష్వాకుకులవర్ధనః = ఇక్ష్వాకుకులమును వృద్ధిపొందించువాడును, త్రిశఙ్కురితి = త్రిశంకువు అని, విఖ్యాతః = ప్రసిద్ధు డైన (రాజు ఉండెను).

తా. ఆ కాలమునందే, సత్యవాదియు, జితేంద్రియుడు, ఇక్ష్వాకు వంశీయుడును అగు త్రిశంకు వను రాజు ఉండెను. 10

మూ. తస్య బుద్ధిః సముత్పన్నా యజేయమితి రాఘవ,
గచ్ఛేయం స్వశరీరేణ దేవానాం పరమాం గతిమ్. 11

ప్ర. అ. రాఘవ = రామా ! స్వశరీరేణ = స్వశరీరముతో, దేవానామ్ = దేవతలయొక్క, పరమాం గతిమ్ = ఉత్తమగతిని, గచ్ఛేయమ్ = పొందెదను; యజేయమ్ = యాగము చేయుదును; అని, తస్య = ఆతనికి, బుద్ధిః = బుద్ధి సముత్పన్నా = పుట్టినది.

తా. రామా ! యజ్ఞము చేసి ఈ శరీరముతోడనే స్వర్గమునకు వెళ్లవలెను అని ఆతనికి బుద్ధి పుట్టినది. 11

మూ. స వసిష్ఠం సమాహూయ కథయామాస చిన్తితమ్,
అశక్యమితి చాప్యుక్తో వసిష్ఠేన మహాత్మనా. 12

ప్ర. అ. సః=అతడు, వసిష్ఠమ్=వసిష్ఠుని, సమాహూయ = పిలిపించి, చిన్తితమ్=తన ఆలోచనను, కథయామాస=చెప్పెను. మహాత్మనా = మహాత్ముడైన, వసిష్ఠేన=వసిష్ఠునిచేత, అశక్యమితి = శక్యముకాదు అని, ఉక్తః అపి= పలకబడెను కూడ.

తా. అతడు వసిష్ఠుని పిలిపించి తన అభిప్రాయము తెలుపగా ఆ మహాత్ముడు ఇది శక్యము కాదు అని చెప్పెను. 12

మూ. ప్రత్యాఖ్యాతో వసిష్ఠేన స యయౌ దక్షిణాం దిశమ్,
తత స్తత్కర్మసిద్ధ్యర్థం పుత్రాంస్తస్య గతో నృపః. 13

ప్ర. అ. వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ప్రత్యాఖ్యాతః = నిరాకరింపబడిన అతడు, దక్షిణామ్ దిశమ్=దక్షిణదిక్కును గూర్చి, యయౌ=వెళ్లెను. తతః= పిమ్మట, నృపః=రాజు, తత్కర్మసిద్ధ్యర్థమ్ = ఆ కర్మయొక్క సిద్ధికొరకు, తస్య=వసిష్ఠునియొక్క, పుత్రాన్=పుత్రులను గూర్చి, గతః=వెళ్లినాడు.

తా. వసిష్ఠుడు నిరాకరింపగా, ఆ రాజు దక్షిణముగా వెళ్లి అచట అట్టి యజ్ఞము చేయింపుడని ప్రార్థించుటకై వసిష్ఠపుత్రులవద్దకు వెళ్లెను. 13

మూ. వాసిష్ఠా దీర్ఘతపస స్తపో యత్ర హి తేపిరే,
త్రిశఙ్కుస్సుమహాతేజాశ్శతం పరమభాస్వరమ్, 14
వసిష్ఠపుత్రాన్ దదృశే తప్యమానాన్ యశస్వినః.

ప్ర. అ. దీర్ఘతపసః=దీర్ఘమైన తపస్సుగల, వాసిష్ఠాః=వసిష్ఠపుత్రులు, యత్ర=ఎచట, తపః=తపస్సు, తేపిరే=చేసిరో, అచట, సుమహాతేజాః=గొప్ప తేజస్సు గల, త్రిశఙ్కుః=త్రిశంకువు, పరమభాస్వరమ్ = మిక్కిలి ప్రకాశించు చున్న, శతమ్=నూరుగురు, యశస్వినః=కీర్తి గల, తప్యమానాన్ = తపస్సు చేయుచున్న, వసిష్ఠపుత్రాన్=వసిష్ఠకుమారులను, దదృశే=చూచెను.

తా. గొప్ప తేజస్సు గల త్రిశంకువు దీర్ఘతపస్సు గల వసిష్ఠకుమారులు తపస్సు చేయుచున్న ఆశ్రమమునకు వెళ్లి అచట తపస్సు చేయుచున్నవారును, యశస్సు కలవారును తేజస్సు కలవారును అగు నూర్గురు వసిష్ఠపుత్రులను చూచెను. 14

మూ. సోఽభిగమ్య మహాత్మానః సర్వానేవ గురోః సుతాన్, 15
అభివాద్యానుపూర్వ్యేణ హ్రియా కిఞ్చిదవాఙ్ముఖః,
అబ్రవీత్సుమహాభాగాన్ సర్వానేవ కృతాఞ్జలిః. 16

ప్ర. అ. సః = అతడు, మహాత్మానః = మహాత్ములైన, సర్వానేవ = సమస్తమైన, గురోః సుతాన్=గురుపుత్రులను, అభిగమ్య = సమీపించి, ఆనుపూర్వ్యేణ=వయఃక్రమానుసారముగా, అభివాద్య = నమస్కరించి, హ్రియా = సిగ్గుచేత, కిఞ్చిత్=కొంచెము, అవాఙ్ముఖః = వంచబడిన ముఖము కలవాడై, కృతాఞ్జలిః=చేయబడిన దోసిలికలవాడై, సర్వానేవ = సమస్తమైన, మహాభాగాన్=ఆ మహాత్ములను గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. అతడు మహాత్ములగు ఆ గురుపుత్రులను సమీపించెను. ఆ మహాత్ముల నందరిని వారి వయఃక్రమము ననుసరించి నమస్కరించి సిగ్గుతో కొంచెము తలవంచి, దోసిలి యొగ్గి, వారితో ఇట్లనెను. 15, 16

మూ. శరణం వః ప్రపద్యేఽహం శరణ్యాన్ శరణాగతః,
ప్రత్యాఖ్యాతోఽస్మి భద్రం వో వసిష్ఠేన మహాత్మనా. 17

ప్ర. అ. శరణాగతః = శరణకోసమై వచ్చిన, అహమ్ = నేను, శరణ్యాన్=రక్షకులైన, వః = మిమ్ములను, శరణం ప్రపద్యే = శరణపొందుచున్నాను. వః=మీకు, భద్రమ్=క్షేమ మగుగాక. మహాత్మనా=మహాత్ముడైన, వసిష్ఠేన=వసిష్ఠునిచేత, ప్రత్యాఖ్యాతః అస్మి=ప్రత్యాఖ్యానము చేయబడితిని.

తా. నేను శరణాగతరక్షకులైన మీవద్దకు శరణము కోరి వచ్చినాను. మీకు క్షేమ మగుగాక. మహాత్ముడైన వసిష్ఠుడు నా కోరిక నిరాకరించినాడు. 17

మూ. యష్టుకామో మహాయజ్ఞం తదనుజ్ఞాతుమర్హథ,
గురుపుత్రానహం సర్వాన్నమస్కృత్య ప్రసాదయే. 18

ప్ర. అ. మహాయజ్ఞమ్=గొప్ప యజ్ఞమును, యష్టుకామః=చేయ కోరిక కలవాడను, తత్=ఆకారణమువలన, అనుజ్ఞాతుమ్=అనుజ్ఞ ఇచ్చుటకు, అర్హథ=తగియున్నారు. అహమ్=నేను, గురుపుత్రాన్ = గురుపుత్రు లైన, సర్వాన్=మిమ్ములనందరిని, నమస్కృత్య = నమస్కరించి, ప్రసాదయే=అనుగ్రహింప చేసుకొనుచున్నాను.

తా. మహాయజ్ఞ మొకటి చేయవలె నని నాకు కోరిక ఉన్నది. అందుకు అనుజ్ఞ ఇవ్వండి. గురుపుత్రు లైన మిమ్ముల నందరిని నమస్కరించి వేడు చున్నాను. 18

మూ. శిరసా ప్రణతో యాచే బ్రాహ్మణాన్ తపసి స్థితాన్.
తే మాం భవన్తః సిద్ధ్యర్థం యాజయన్తు సమాహితాః. 19
సశరీరో యథాహం హి దేవలోకమవాప్నుయామ్.

ప్ర. అ. శిరసా = శిరస్సుచేత, ప్రణతః = నమస్కరించుచున్నవాడనై, తపసి స్థితాన్=తపస్సు చేయుచున్న, బ్రాహ్మణాన్=బ్రాహ్మణు లైన మిమ్ములను, యాచే = ప్రార్థించుచున్నాను. తే=అట్టి, భవన్తః=మీరు, సమాహితాః=సావధానచిత్తులై, మామ్=నన్ను, సిద్ధ్యర్థమ్=కార్యసిద్ధికొరకు, యాజయన్తు=యజ్ఞము చేయించెదరు గాక. అహమ్=నేను, సశరీరః = శరీరముతో కూడిన వాడనై, యథా = ఎట్లు, దేవలోకమ్ = దేవలోకమును, అవాప్నుయామ్ = పొందుదునో.

తా. తపస్సు చేయుచున్న బ్రాహ్మణోత్తములు మీరు. మిమ్ములను తల వంచి నమస్కరించి ప్రార్థించుచున్నాను. నేను శరీరముతో స్వర్గమునకు వెళ్లు నట్లు చేయుటకై, మీరు సావధానచిత్తులై, యజ్ఞము చేయించుడు. 19

మూ. ప్రత్యాఖ్యాతో వసిష్ఠేన గతిమన్యాం తపోధనాః, 20
గురుపుత్రాన్ఋతే సర్వాన్నాహం పశ్యామి కాఞ్చన.

ప్ర. అ. తపోధనాః = ఓ తపోధనులారా! వసిష్ఠేన = వసిష్ఠునిచేత, ప్రత్యాఖ్యాతః = నిరాకరింపబడిన, అహమ్=నేను, సర్వాన్ = సమస్త మైన,

గురుపుత్రాన్ృతే=గురుపుత్రులు తప్ప, అన్యామ్=మరి యొక, గతిమ్=గతిని, కాఞ్చన=దేనినీ, న పశ్యామి=చూడను.

తా. ఓ తపోధనులారా! వసిష్ఠుడు నిరాకరించిన పిమ్మట గురుపుత్రులైన మీరు తప్ప నాకు మరొక గతి యేమియును లేదు. 20

మూ. ఇక్ష్వాకూణాం హి సర్వేషాం పురోధాః పరమా గతిః, 21
పురోధసస్తు విద్వాంసస్తారయన్తి సదా నృపాన్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
సప్తపఞ్చాశః సర్గః.

ప్ర. అ. సర్వేషామ్ = సమస్తమైన, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశీయులకు, పురోధాః = పురోహితుడు, పరమా = గొప్పదైన, గతిః హి = గతి కదా. విద్వాంసః = విద్వాంసులైన, పురోధసః = పురోహితులు, సదా = ఎల్లప్పుడును, నృపాన్ = రాజులను, తారయన్తి = తరింపచేయుదురు. తస్మాత్ = ఆ వసిష్ఠునికంటె, అనన్తరమ్ = తరువాత, భవన్తః = మీరు, సర్వే = అందరును, మమ = నాకు, దైవతమ్=దేవతలు.

తా. ఇక్ష్వాకువంశీయులందరికిని పురోహితుడే పరమగతి. విద్వాంసులైన పురోహితులు ఎల్లప్పుడును, రాజులను తరింపచేయుచుందురు. వసిష్ఠుని తరవాత మీరే నాకు దేవతలు. 21

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
ఏబదిఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టపఞ్చాశః సర్గః

మూ. తతస్త్రిశఙ్కోర్వచనం శ్రుత్వా క్రోధసమన్వితమ్,
ఋషిపుత్రశతం రామ రాజానమిదమబ్రవీత్. 1

ప్ర. అ. రామ=శ్రీరామా! త్రిశఙ్కోః=త్రిశంకువుయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా = విని, తతః = పిమ్మట, ఋషిపుత్రశతమ్ = ఋషిపుత్రుల శతము, క్రోధసమన్వితమ్ = కోపముతో కూడినదై, రాజానమ్=రాజును గూర్చి, ఇదమ్ = ఈ వాక్యము, అబ్రవీత్ = పలికెను.

తా. రామా! త్రిశంకుని వచనములు విన్న నూరుగురు ఋషికుమారులును, కోపావిష్టులై రాజుతో ఇట్లు పలికిరి. 1

మూ. ప్రత్యాఖ్యాతో హి దుర్బుద్ధే గురుణా సత్యవాదినా,
తం కథం సమతిక్రమ్య శాఖాన్తరముపేయివాన్. 2

ప్ర. అ. దుర్బుద్ధే = ఓ చెడ్డబుద్ధి కలవాడా, సత్యవాదినా = సత్యమును పలికెడు, గురుణా = గురువుచేత, ప్రత్యాఖ్యాతః = నిరాకరింప బడినవాడవై, తమ్ = ఆగురువును, అతిక్రమ్య = అతిక్రమించి, శాఖాన్తరమ్ = మరి యొక శాఖను, కథమ్=ఎట్లు, ఉపేయివాన్=పొందినావు ?

తా. ఓ దుర్బుద్ధీ! సత్యవాది యైన గురువు నిరాకరించిన పిమ్మట, ఆతనిని కాదని మరొకరిని ఎట్లు ఆశ్రయించుచున్నావు ? 2

మూ. ఇక్ష్వాకూణాం హి సర్వేషాం పురోధాః పరమో గురుః,
న చాతిక్రమితుం శక్యం వచనం సత్యవాదినః. 3

ప్ర. అ. సర్వేషామ్ = సమస్త మైన, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశ రాజులకు, పురోధాః=పురోహితుడు, పరమః = గొప్ప, గురుః = పూజ్యుడు. సత్యవాదినః = సత్యవాదియైన ఆ గురువుయొక్క, వచనమ్ = వాక్యము, అతిక్రమితుమ్=అతిక్రమించుటకు, న శక్యమ్=శక్యము కాదు.

తా. ఇక్ష్వాకువంశీయు లందరికిని పురోహితుడే పరమపూజ్యుడు. సత్యవాది యైన గురువుయొక్క వాక్యము అతిక్రమింపరానిది. 3

మూ. అశక్యమితి చోవాచ వసిష్ఠో భగవాన్ ఋషిః,
తం వయం వై సమాహర్తుం క్రతుం శక్తాః కథం తవ. 4

ప్ర. అ. భగవాన్=పూజ్యు డైన, వసిష్ఠః ఋషిః=వసిష్ఠమహర్షి, అశక్యమితి=అశక్య మైనది అని, ఉవాచ=చెప్పి ఉన్నాడు. తమ్=అట్టి, క్రతుమ్=యజ్ఞమును, తవ=నీకు, సమాహర్తుమ్=చేయుటకు, వయమ్=మేము, కథమ్=ఎట్లు, శక్తాః=సమర్థులము ?

తా. పూజ్యు డైన వసిష్ఠమహర్షి అశక్య మని చెప్పిన యజ్ఞమును మేము చేయించగలమా ? 4

మూ. బాలిశ స్త్వం నరశ్రేష్ఠ గమ్యతాం స్వపురం పునః,
యాజనే భగవాన్ శక్తస్త్రైలోక్యస్యాపి పార్థివ. 5
అవమానం చ తత్కర్తుం తస్య శక్ష్యామహే కథమ్.

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడా, త్వమ్=నీవు, బాలిశః=మూఢుడవు. పునః=మరల, స్వపురమ్ = నీపురమును గూర్చి, గమ్యతామ్=వెళ్లెదవు గాక. పార్థివ=రాజా ! భగవాన్ = పూజ్యుడైన వసిష్ఠుడు, త్రైలోక్యస్య=మూడు లోకములయొక్క, యాజనేఽపి=యజ్ఞము చేయించుటలో కూడ, శక్తః=సమర్థుడు. తత్=ఆకారణమువలన, తస్య=ఆతనియొక్క, అవమానమ్=అవమానమును, కర్తుమ్=చేయుటకు, కథమ్=ఎట్లు, శక్ష్యామహే=సమర్థులము కాగలము.

తా. ఓ నరశ్రేష్ఠుడా ! నీవు మూఢుడవు. నీ నగరమునకు తిరిగి వెళ్లుము. పూజ్యు డైన వసిష్ఠుడు ముల్లోకములలో ఉన్న ఎవ్వరిచేత నైనను యాగము చేయించ సమర్థుడు. ఆయన కాదనిన తరువాత యాగము చేయించి ఆయనను మేము అవమానించగలమా ? 5

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా క్రోధపర్యాకులాక్షరమ్, 6
స రాజా పునరేవైతానిదం వచన మబ్రవీత్.

ప్ర. అ. సః=ఆ, రాజా=రాజు, క్రోధపర్యాకులేక్షణమ్ = క్రోధముచేత వ్యాకుల మైన అక్షరములు గల, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా= విని, పునరేవ = మరల, ఇదమ్=ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్= పలికెను.

తా. క్రోధముచే అక్షరములు తడబడుచున్న, వారు పలికిన, మాటలు విని ఆ రాజు మరల ఇటనెను. 6

మూ. ప్రత్యాఖ్యాతోఽస్మి గురుణా గురుపుత్రైస్తథైవ చ, 7
అన్యాం గతిం గమిష్యామి స్వస్తి వోఽస్తు తపోధనాః.

ప్ర. అ. తపోధనాః = ఓ తపోధనులారా ! గురుణా = గురువుచేతను, తథైవ చ=మరియు, గురుపుత్రైశ్చ=గురుపుత్రులచేతను, ప్రత్యాఖ్యాతః అస్మి= నిరాకరింపబడితిని, అన్యామ్=మరి యొక, గతిమ్=గతిని, గమిష్యామి=పొంద గలను. వః=మీకు, స్వస్తి అస్తు=క్షేమమగుగాక.

తా. ఓ తపోధనులారా ! నా గురువు, గురుపుత్రులు కూడ నా కోరికను నిరాకరించినారు. మరొకగతి చూచుకొనెదను. మీకు క్షేమమగుగాక. 7

మూ. ఋషిపుత్రాస్తు తచ్ఛ్రుత్వా వాక్యం ఘోరాభిసంహితమ్, 8
శేపుః పరమసంక్రుద్ధా శ్చణ్డాలత్వం గమిష్యసి.

ప్ర. అ. ఋషిపుత్రాస్తు=ఋషిపుత్రు లైతే, ఘోరాభిసంహితమ్=ఘోర మైన అభిప్రాయము గల, తత్ = ఆ, వాక్యమ్=వాక్యమును, శ్రుత్వా=విని, పరమసంక్రుద్ధాః=చాల కోపించినవారై, చణ్డాలత్వమ్=చండాలత్వమును, గమి ష్యసి=పొందగలవు అని, శేపుః=శపించిరి.

తా. చెడ్డ అభిప్రాయముతో కూడిన ఆతని మాట విని, వసిష్ఠపుత్రులు చాల కోపించి, చండాలుడ వగుదువు గాక అని శపించిరి. 8

మూ. ఏవముక్త్వా మహాత్మానో వివిశుస్తే స్వమాశ్రమమ్, 9
అథ రాత్ర్యాం వ్యతీతాయాం రాజా చణ్డాలతాం గతః.

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, తే = వారు, ఏవమ్=ఈ విధముగా, ఉక్త్వా=పలికి, స్వమ్=తమసంబంధమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును, వివిశుః=ప్రవేశించిరి. అథ=పిమ్మట, రాత్ర్యామ్=రాత్రి, వ్యతీతాయామ్=గడచినదగుచుండగా, రాజా = రాజు, చణ్డాలతామ్ = చండాలత్వమును, గతః = పొందినాడు.

తా. ఈ విధముగ పలికి ఆ మహాత్ములు తమ ఆశ్రమములోనికి వెళ్లిపోయిరి. పిమ్మట రాత్రి గడవగానే రాజు చండాలుడైపోయెను. 9

మూ. నీలవస్త్రధరో నీలః పరుషో ధ్వస్తమూర్ధజః, 10
చిత్యమాల్యానులేపశ్చ ఆయసాభరణోఽభవత్.

ప్ర. అ. నీలవస్త్రధరః=నల్లని వస్త్రములు ధరించి, నీలః = నల్లనివాడుగను, పరుషః = సౌకుమార్యము లేనివాడుగను, ధ్వస్తమూర్ధజః = తగ్గిపోయిన కేశములు కలవాడుగను, చిత్యమాల్యానులేపశ్చ=శ్మశానములోని మాలలను బూడిదను ధరించినవాడుగను, ఆయసాభరణః=ఇనుప అలంకారములు కలవాడుగను, అభవత్=ఆయెను.

తా. ఆతడు నల్లనివాడై, నల్లని వస్త్రములు ధరించి, సౌకుమార్యము తొలగి, కురుచలైన కేశములతో, శ్మశానమునందలి మాలలను ధరించి, బూడిదను పూసికొని, ఇనుప ఆభరణములను ధరించి ఉండెను. తెల్లవారుసరికి ఆతని రాజవస్త్రభూషణాదు లన్నియు ఈ విధముగా మారిపోయెను. 10

మూ. తం దృష్ట్వా మన్త్రిణః సర్వే త్యజ్య చణ్డాలరూపిణమ్, 11
ప్రాద్రవన్ సహితా రామ పౌరా యేఽస్యానుగామినః.

ప్ర. అ. రామ = రామా! చణ్డాలరూపిణమ్ = చండాలరూపము గల, తమ్=ఆతనిని, దృష్ట్వా=చూచి, సర్వే=సమస్తమైన, మన్త్రిణః=మంత్రులును, పౌరాః=పౌరులును, యే=ఎవరు, అస్య = ఇతనియొక్క, అనుగామినః=అనుసరించి ఉండువారో వారును, సహితాః = కలిసిన వారై, ప్రాద్రవన్ = పారిపోయిరి.

తా. రామా! చండాలరూపము గల అతనిని చూచి, మంత్రులును, పౌరులును, ఆతని అనుచరులును, అందరును కలిసి దూరముగ పారిపోయిరి. 11

మూ. ఏకో హి రాజా కాకుత్స్థ జగామ పరమాత్మవాన్, 12
దహ్యమానో దివారాత్రం విశ్వామిత్రం తపోనిధిమ్.

ప్ర. అ. కాకుత్స్థ=రామా! పరమ్ = మిక్కిలి, ఆత్మవాన్=ధైర్యము గల, రాజా=రాజు, ఏకః = ఒక్కడే, దివారాత్రమ్ = రాత్రులందును పగటి యందును, దహ్యమానః = దుఃఖముచే దహింపబడుచు, తపోనిధిమ్=తపస్సుకు నిధి యైన, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని గూర్చి, జగామ=వెళ్లెను.

తా. రామా! మిక్కిలి ధైర్యము గల ఆ త్రిశంకుడు ఏకాకియై, దుఃఖముతో కుములుచు, విశ్వామిత్రమహామునివద్దకు వెళ్లెను. 12

మూ. విశ్వామిత్రస్తు తం దృష్ట్వా రాజానం విఫలీకృతమ్, 13
చణ్డాలరూపిణం రామ మునిః కారుణ్యమాగతః.

ప్ర. అ. రామ=రామా, మునిః = ముని యైన, విశ్వామిత్రస్తు=విశ్వామిత్రుడైతే, విఫలీకృతమ్=వ్యర్థుడుగా చేయబడిన, చణ్డాలరూపిణమ్ = చండాల రూపము ధరించిన, తమ్=ఆ, రాజానమ్ = రాజును, దృష్ట్వా=చూచి, కారుణ్యమ్=కారుణ్యమును, ఆగతః=పొందెను.

తా. రామా! వసిష్ఠాదులచే విఫలీకృతుడై చండాలత్వము చెందిన ఆ రాజును జూచి విశ్వామిత్రుడు జాలి చెందెను. 13

మూ. కారుణ్యాత్స మహాతేజా వాక్యం పరమధార్మికః, 14
ఇదం జగాద భద్రం తే రాజానం ఘోరరూపిణమ్.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గలవాడును, పరమధార్మికః= మిక్కిలి ధార్మికుడును అగు, సః=ఆతడు, కారుణ్యాత్ = కారుణ్యమువలన, ఘోరరూపిణమ్=ఘోర మైన రూపము గల, రాజానమ్ = ఆ రాజును గూర్చి, తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక అని ముందుగ పలికి, ఇదమ్=ఈ వాక్యమును, జగాద=పలికెను.

తా. మహాతేజశ్శాలియు పరమధార్మికుడును అగు విశ్వామిత్రుడు, ఘోర రూపము గల ఆ త్రిశంకుని చూచి, జాలిగొని, "నీకు భద్ర మగుగాక" అని అనుచు, ఇట్లు పలికెను. 14

మూ. కిమాగమనకార్యం తే రాజపుత్ర మహాబల, 15
అయోధ్యాధిపతే వీర శాపాచ్చణ్డాలతాం గతః.

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గల, రాజపుత్ర = రాజా! తే = నీయొక్క, ఆగమనకార్యమ్ = వచ్చుటలోని పని, కిమ్ = ఏమి? అయోధ్యాధిపతే = అయోధ్యకు అధిపతి యైన, వీర = ఓ వీరుడా! శాపాత్ = శాపమువలన, చణ్డాలతామ్ = చండాలత్వమును, గతః = పొందినావు.

తా. మహాబలుడ వైన ఓ రాజపుత్రా! నీవు ఎందుకు వచ్చినావు? అయోధ్యాధిపతి వైన ఓ వీరుడా! పాపము! శాపమువలన చండాలుడ వైతివి కదా! 15

మూ. అథ తద్వాక్యమాజ్ఞాయ రాజా చణ్డాలతాం గతః, 16
అబ్రవీత్ ప్రాఞ్జలిర్వాక్యం వాక్యజ్ఞో వాక్యకోవిదమ్.

ప్ర. అ. అథ = పిమ్మట, చణ్డాలతామ్ = చండాలత్వమును, గతః = పొందిన, వాక్యజ్ఞః = మాటలనెరిగిన, రాజా = రాజు, తద్వాక్యమ్ = అతని వాక్యమును, ఆజ్ఞాయ = విని, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, వాక్యకోవిదమ్ = వాక్యముల నెరిగిన ఆ విశ్వామిత్రుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. చండాలత్వమును పొందిన ఆ త్రిశంకుడు ఆ మాటలు విని, మాటలలో నేర్పు గల ఆ విశ్వామిత్రునితో, చేతులు జోడించి, ఇట్లనెను. 16

మూ. ప్రత్యాఖ్యాతోఽస్మి గురుణా గురుపుత్రైస్తథైవ చ, 17
అనవాప్యైవ తం కామం మయా ప్రాప్తో విపర్యయః.

ప్ర. అ. గురుణా = గురువుచేతను, తథైవ చ = మరియు, గురుపుత్రైః = గురుపుత్రులచేతను, ప్రత్యాఖ్యాతః అస్మి = నిరాకరింపబడితిని, తమ్ = ఆ,

కామమ్ = కోరికను, అనవాప్యైవ = పొందకుండగనే, మయా = నాచేత, విప ర్యయః = ఈ విపరీతఫలము, ప్రాప్తః = పొందబడినది.

తా. గురువు గురుపుత్రులు కూడ నా కోరికను మన్నింపలేదు. ఆ కోరిక తీరకుండగనే ఈ విపరీతఫలమును పొందితిని. 17

మూ. సశరీరో దివం యాయామితి మే సౌమ్య దర్శనమ్,
మయా చేష్టం క్రతుశతం తచ్చ నావాప్యతే ఫలమ్. 18

ప్ర. అ. సౌమ్య = ఓ సౌమ్యుడా! సశరీరః = శరీరముతో కూడిన వాడనై, దివమ్ = స్వర్గమును గూర్చి, యాయామ్ = వెళ్లుదును, ఇతి = అని, మే = నాయొక్క, దర్శనమ్ = అభిప్రాయము. మయా = నాచేత, క్రతుశతమ్ = నూరు క్రతువులు, ఇష్టమ్ = చేయబడినది. తత్ = ఆ, ఫలమ్ = ఫలము, నావా ప్యతే చ = పొందబడుటలేదు.

తా. ఓ సౌమ్యుడా! ఈ శరీరముతో స్వర్గమునకు వెళ్లవలె నని నా అభి ప్రాయము. నూరు యజ్ఞములు చేసితిని కాని ఆ ఫలము లభింపలేదు. 18

మూ. అనృతం నోక్తపూర్వం మే న చ వక్ష్యే కదా చన, 19
కృచ్ఛ్రేష్వపి గతః సౌమ్య క్షత్రధర్మేణ తే శపే.

ప్ర. అ. సౌమ్య = ఓ సౌమ్యా! మే = నాచేత, అనృతమ్ = అసత్యము, న ఉక్తపూర్వమ్ = పూర్వము పలకబడలేదు. కదాచన = ఎన్నడును, కృచ్ఛ్రేషు గతః అపి = కష్టములు చెందినను, న వక్ష్యే = పలకను. క్షత్రధర్మేణ = క్షత్రియధర్మముచేత, తే = నీకు, శపే = ఒట్టుపెట్టుచున్నాను.

తా. మహామునీ! నే నెన్నడును అసత్యము పలికి ఎరుగను. ఇటుపైన కూడ ఎన్ని కష్టములు వచ్చినను అబద్ధ మాడను. నా క్షత్రియధర్మముపై ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. 19

మూ. యజ్ఞైర్బహువిధై రిష్టం ప్రజా ధర్మేణ పాలితాః, 20
గురవశ్చ మహాత్మానః శీలవృత్తేన తోషితాః.

ప్ర. అ. బహువిధైః = అనేకవిధములైన, యజ్ఞైః = యజ్ఞములచేత, ఇష్టమ్ = యజ్ఞము (దేవతాపూజ) చేయబడినది. ప్రజాః = ప్రజలు, ధర్మేణ = ధర్మముచేత, పాలితాః = పాలింపబడినారు. మహాత్మానః = మహాత్ములైన, గురవశ్చ = పెద్దలు కూడ, శీలవృత్తేన = శీలముచేతను నడవడికచేతను, తోషితాః = సంతోషపెట్టబడిరి.

తా. అనేకవిధములైన యజ్ఞములు చేసితిని. ప్రజలను ధర్మముగా పాలించితిని. మహాత్ములగు పెద్దలను మంచి శీలముచేతను నడవడికచేతను సంతోషపెట్టితిని. 20

మూ. ధర్మే ప్రయతమానస్య యజ్ఞం చాహర్తుమిచ్ఛతః, 21
పరితోషం న గచ్ఛన్తి గురవో మునిపుఙ్గవ.

ప్ర. అ. మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠుడా ! ధర్మే = ధర్మమునందు, ప్రయతమానస్య = ప్రయత్నము చేయుచున్నవాడను, యజ్ఞమ్ = యజ్ఞమును, ఆహర్తుమ్ = చేయుటకు, ఇచ్ఛతశ్చ = ఇచ్ఛయించుచున్నవాడను అయిన, నా విషయమున, గురవః = గురువులు, పరితోషమ్ = సంతోషమును, న గచ్ఛన్తి = పొందుటలేదు.

తా. ఓ మునిశ్రేష్ఠా! నేను ధర్మాచరణమునకై ప్రయత్నించుచు యాగము చేయవలెనని అభిలషింపగా గురువులు అభినందింపకున్నారు. 21

మూ. దైవమేవ పరం మన్యే పౌరుషం తు నిరర్థకమ్. 22
దైవేనాక్రమ్యతే సర్వం దైవం హి పరమా గతిః.

ప్ర. అ. దైవమేవ = దైవమునే, పరమ్ = శ్రేష్ఠ (బల) మైన దానినిగా, మన్యే = తలచెదను. పౌరుషం తు = పౌరుష మైతే, నిరర్థకమ్ = వ్యర్థమైనదే. సర్వమ్ = అంతయు, దైవేన = దైవముచేత, ఆక్రమ్యతే = ఆక్రమించబడును. దైవమ్ = దైవమే, పరమా = గొప్పదైన, గతిః హి = గతి కదా ?

తా. దైవమే బలవత్తర మైనది; పురుషప్రయత్నము వ్యర్థము. అంతయు దైవవశమే. దైవమే ఉత్తమగతి. 22

మూ. తస్య మే పరమార్తస్య ప్రసాదమభికాఙ్క్షతః, 23
కర్తుమర్హసి భద్రం తే దైవోపహతకర్మణః.

ప్ర. అ. పరమ్ = మిక్కిలి, ఆర్తస్య = పీడితుడును, అభికాఙ్క్షతః = ప్రార్థించుచున్నవాడును, దైవోపహతకర్మణః = దైవముచేత కొట్టబడిన కర్మగల, తస్య=అట్టి, మే = నాకు, ప్రసాదమ్ = అనుగ్రహమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. దైవముచేత విఫలప్రయత్నుడ నైన నేను మిక్కిలి అర్తుడనై నీ అనుగ్రహమునకై వేడుచున్నాను. అనుగ్రహింపుము. నీకు మంగళ మగును. 23

మూ. నాన్యాం గతిం గమిష్యామి నాన్యః శరణమస్తి మే, 24
దైవం పురుషకారేణ నివర్తయితుమర్హసి.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
అష్టపఞ్చాశః సర్గః.

ప్ర. అ. అన్యామ్ = మరి యొక, గతిమ్ = గతిని, న గమిష్యామి = పొందను. మే = నాకు, అన్యః = మరియొకడు, శరణమ్ = రక్షకుడు, నాస్తి= లేడు. దైవమ్=దైవమును, పురుషకారేణ=పురుషకారముచేత, నివర్తయితుమ్= మరల్చుటకు, అర్హసి = తగియున్నావు.

తా. నేను మరి యెవ్వరి వద్దకును వెళ్లను. మరొక రక్షకు డెవ్వడును లేడు. పురుషకారముచే దైవమును నివర్తింపచేయుము. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో
ఏబది యెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనషష్టితమః సర్గః

మూ. ఉక్తవాక్యం తు రాజానం కృపయా కుశికాత్మజః,
అబ్రవీన్మధురం వాక్యం సాక్షాచ్చణ్డాలరూపిణమ్. 1

ప్ర. అ. ఉక్తవాక్యమ్ = పలకబడిన వాక్యము కలవాడును, సాక్షాత్ = ప్రత్యక్షముగా, చణ్డాలరూపిణమ్ = చండాలరూపము గలవాడును అగు, రాజానమ్=రాజును గూర్చి, కృపయా = జాలితో, కుశికాత్మజః = విశ్వామిత్రుడు, మధురమ్ = మధుర మైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పూర్తిగా చండాలరూపు డైన ఆ రాజు మాటలు విని విశ్వామిత్రుడు జాలిచెంది, ఆతనితో మధుర మైన వాక్యము పలికెను. 1

మూ. ఐక్ష్వాక స్వాగతం వత్స జానామి త్వాం సుధార్మికమ్,
శరణం తే భవిష్యామి మా భైషీర్నృపపుఙ్గవ. 2

ప్ర. అ. ఐక్ష్వాక = ఇక్ష్వాకువంశమునందు పుట్టిన, వత్స = ఓ వత్సా! స్వాగతమ్ = నీకు స్వాగత మగుగాక. త్వామ్ = నిన్ను, సుధార్మికమ్ = మంచి ధార్మికునిగా, జానామి = నే నెరుగుదును, నృపపుఙ్గవ = ఓ రాజశ్రేష్ఠా! మా భైషీః = భయపడకుము. తే = నీకు, శరణమ్ = రక్షకుడను, భవిష్యామి = కాగలను.

తా. ఇక్ష్వాకువంశసంజాతుడ వైన ఓ వత్సా! నీకు స్వాగతము. నీవు ధార్మికుడ వని నాకు తెలియును. ఓ రాజశ్రేష్ఠా! నేను నీకు రక్ష నొసగెదను; భయపడకుము. 2

మూ. అహమామన్త్రయే సర్వాన్మహర్షీన్ పుణ్యకర్మణః,
యజ్ఞసాహ్యకరాన్ రాజన్ తతో యక్ష్యసి నిర్వృతః. 3

ప్ర. అ. అహమ్ = నేను, పుణ్యకర్మణః = పుణ్య మైన కర్మలు గల, యజ్ఞసాహ్యకరాన్ = యజ్ఞమునందు సాహాయ్యము చేయు, సర్వాన్ = సమస్త

మైన, మహర్షీన్ = మహర్షులను, ఆమన్త్రయే = ఆహ్వానించెదను. నిర్వృతః= ఆనందముకలవాడవై, యక్ష్యసి = యాగము చేయగలవు.

తా. రాజా! పుణ్యాత్ము లైన మహర్షులను యజ్ఞములో సాహాయ్యము చేయుటకై నేను ఆహ్వానించెదను. నీవు నిశ్చింతగ యజ్ఞము చేయగలవు. 3

మూ. గురుశాపకృతం రూపం యదిదం త్వయి వర్తతే,
అనేన సహ రూపేణ సశరీరో గమిష్యసి. 4

ప్ర. అ. గురుశాపకృతమ్ = గురువుయొక్క శాపముచేత చేయబడిన, యత్ = ఏ, ఇదమ్ = ఈ, రూపమ్ = రూపము, త్వయి = నీయందు, వర్తతే= ఉన్నదో, అనేన = ఈ, రూపేణ సహ = రూపముతో కూడ, సశరీరః = శరీరసహితుడవై, గమిష్యసి = వెళ్లగలవు.

తా. గురుశాపముచే ఏర్పడిన ఈ రూపముతో, సశరీరుడవై స్వర్గమునకు వెళ్లగలవు. 4

మూ. హస్తప్రాప్తమహం మన్యే స్వర్గం తవ నరాధిప,
యస్త్వం కౌశికమాగమ్య శరణ్యం శరణాగతః. 5

ప్ర. అ. నరాధిప = రాజా! యః = ఏ, త్వమ్ = నీవు, శరణ్యమ్ = శరణు పొంద దగిన, కౌశికమ్ = విశ్వామిత్రుని, ఆగమ్య=చేరి, శరణాగతః = శరణు చొచ్చితివో, తవ=అట్టి నీకు, స్వర్గమ్=స్వర్గమును, హస్తప్రాప్తమ్=చేతికి అందినదానినిగా, మన్యే=తలచెదను.

తా. రాజా! శరణాగతరక్షకు డైన విశ్వామిత్రుని శరణు జొచ్చితివి. ఇక స్వర్గము నీ చేతిలో నున్నది. 5

మూ. ఏవముక్త్వా మహాతేజాః పుత్రాన్ పరమధార్మికాన్,
వ్యాదిదేశ మహాప్రాజ్ఞాన్ యజ్ఞసంభారకారణాత్. 6

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల ఆ విశ్వామిత్రుడు, ఏవమ్= ఈ విధముగా, ఉక్త్వా = పలికి, పరమధార్మికాన్=మిక్కిలి ధార్మికులును, మహా

ప్రాజ్ఞాన్=గొప్ప బుద్ధి కలవారును అగు, పుత్రాన్=పుత్రులను, యజ్ఞసంభార కారణాత్=యజ్ఞసంభారములను సమకూర్చుటకై, వ్యాదిదేశ=ఆజ్ఞాపించెను.

తా. గొప్ప తేజస్సు గల ఆ విశ్వామిత్రుడు ఈ విధముగ పలికి యజ్ఞ సంభారములను సమకూర్చు డని, పరమధార్మికులును, గొప్ప బుద్ధిమంతులును అగు కుమారులను ఆజ్ఞాపించెను. 6

మూ. సర్వాన్ శిష్యాన్ సమాహూయ వాక్యమేతదువాచ హ,
సర్వానృషిగణాన్వత్సా ఆనయధ్వం మమాజ్ఞయా, 7
సశిష్యసుహృదశ్చైవ సర్త్విజః సబహుశ్రుతాన్.

ప్ర. అ. సర్వాన్=సమస్తమైన, శిష్యాన్=శిష్యులను, సమాహూయ=పిలచి, ఏత్=ఈ, వాక్యమ్=వాక్యమును, ఉవాచ హ=పలికెను. వత్సాః = ఓ శిష్యులారా! మమ=నాయొక్క, ఆజ్ఞయా=ఆజ్ఞచేత, సశిష్యసుహృదశ్చైవ=శిష్యులతోడను స్నేహితులతోడను కూడిన, సర్త్విజః=ఋత్విక్కులతో కూడిన, సబహుశ్రుతాన్=బహు విద్యావంతులతో కూడిన, సర్వాన్=సమస్తమైన, ఋషి గణాన్=ఋషిగణములను, ఆనయధ్వమ్=తీసికొనిరండి.

తా. విశ్వామిత్రుడు శిష్యు లందరిని పిలచి ఇట్లు పలికెను. "ఓవత్స లారా! నా ఆజ్ఞానుసారముగా వెళ్లి శిష్యులతోడను, స్నేహితులతోడను, ఋత్వి క్కులతోడను, విద్యావంతులతోడను కూడిన ఋషుల నందరిని తీసికొని రండు. 7

మూ. యదన్యో వచనం బ్రూతే మద్వాక్యబలచోదితః, 8
తత్సర్వమఖిలేనోక్తం మమాఖ్యేయమనాదృతమ్.

ప్ర. అ. అన్యః=ఇతరుడు, మద్వాక్యబలచోదితః=నా వాక్యముయొక్క బలముచేత ప్రేరేపింపబడిన వాడై, యత్=ఏ, వచనమ్=వచనమును, బ్రూతే= పలుకునో, అఖిలేన = అందరిచేతను, ఉక్తమ్ = పలకబడిన, అనాదృతమ్= అనాదరపూర్వక మైన, తత్=ఆ, సర్వమ్=అంతయు, మమ = నాకు, ఆఖ్యే యమ్=చెప్పదగినది.

తా. నా సందేశమును విని ఎవరెవరు అనాదరపూర్వకముగా ఏ మాటలు పలుకుదురో ఆ మాట లన్నియు నాకు చెప్పవలెను. 8

మూ. తస్య తద్వచనం శ్రుత్వా దిశో జగ్ముస్తదాజ్ఞయా, 9
ఆజగ్మురథ దేశేభ్యః సర్వేభ్యో బ్రహ్మవాదినః.

ప్ర. అ. తస్య=ఆతని యొక్క, తత్=ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా=విని, తదాజ్ఞయా=ఆతని ఆజ్ఞచే, దిశః=దిక్కులను గూర్చి, జగ్ముః=వెళ్లిరి. అథ=పిమ్మట, సర్వేభ్యః=సమస్తమైన, దేశేభ్యః = దేశములనుండి, బ్రహ్మవాదినః=వేదాధ్యయనసంపన్నులైన మునులు, ఆజగ్ముః=వచ్చిరి.

తా. విశ్వామిత్రుని ఆజ్ఞ ప్రకారము శిష్యులు నలుదిక్కులకును వెళ్లి ఆహ్వానింపగా వేదాధ్యయనసంపన్నులైన బ్రాహ్మణులు అన్ని దేశములనుండియు వచ్చిరి. 9

మూ. తే చ శిష్యాః సమాగమ్య మునిం జ్వలితతేజసమ్, 10
ఊచుశ్చ వచనం సర్వే సర్వేషాం బ్రహ్మవాదినామ్.

ప్ర. అ. తే=ఆ, శిష్యాః=శిష్యులు, సర్వే=అందరును, సమాగమ్య=తిరిగి వచ్చి, జ్వలితతేజసమ్=ప్రకాశించుచున్న తేజస్సు గల, మునిమ్=విశ్వామిత్రుని గూర్చి, సర్వేషామ్=సమస్తమైన, బ్రహ్మవాదినామ్ = వేదాధ్యయనసంపన్నుల యొక్క, వచనమ్=వాక్యమును, ఊచుశ్చ=చెప్పిరి.

తా. తిరిగి వచ్చిన ఆ శిష్యు లందరును, తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ విశ్వామిత్రునితో, వేదాధ్యయన సంపన్ను లగు బ్రాహ్మణు లందరును పలికిన మాటలను చెప్పిరి. 10

మూ. శ్రుత్వా తే వచనం సర్వే సమాయాన్తి ద్విజాతయః, 11
సర్వదేశేషు చాగచ్ఛన్ వర్జయిత్వా మహోదయమ్.

ప్ర. అ. తే=నీయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, సర్వే=సమస్తమైన, ద్విజాతయః = బ్రాహ్మణులు, సమాయాన్తి = వచ్చుచున్నారు.

మహోదయం వర్జయిత్వా=మహోదయుని మినహాయించి, సర్వదేశేషు = సమస్త దేశములం దున్నవారు, ఆగచ్ఛన్=వచ్చిరి.

తా. మీ సందేశము విని బ్రాహ్మణు లందరును వచ్చుచున్నారు. మహోదయుడు తక్క, సకలదేశములలోని బ్రాహ్మణులును వచ్చినారు. 11

మూ. వాసిష్ఠం తచ్ఛతం సర్వం క్రోధపర్యాకులాక్షరమ్, 12
యదాహ వచనం సర్వం శృణు త్వం మునిపుఙ్గవ.

ప్ర. అ. మునిపుఙ్గవ=మునిశ్రేష్ఠుడా ! సర్వమ్=సమస్త మైన, తత్=ఆ, వాసిష్ఠం శతమ్=వసిష్ఠకుమారుల శతము, క్రోధపర్యాకులాక్షరమ్ = క్రోధముచే వ్యాకుల మైన అక్షరములు గల, యత్=ఏ, వచనమ్ = వచనమును, ఆహ = పలికెనో, సర్వమ్=దాని నంతనూ, త్వమ్=నీవు, శృణు=వినుము.

తా. మునిశ్రేష్ఠా ! నీ వాక్యము విని వసిష్ఠకుమారులు నూర్వురును, ఏమనిరో వినుము. 12

మూ. క్షత్రియో యాజకో యస్య చణ్డాలస్య విశేషతః, 13
కథం సదసి భోక్తారో హవిస్తస్య సురర్షయః.

ప్ర. అ. యస్య=ఎవనికి, క్షత్రియః=క్షత్రియుడు, యాజకః=యజ్ఞము చేయించువాడో, విశేషతః=విశేషించి, చణ్డాలస్య=చండాలు డైన, తస్య=వాని యొక్క, సదసి=యజ్ఞసదస్సునందు, సురర్షయః = సురులును ఋషులును, హవిః=హవిస్సును, కథమ్=ఎట్లు, భోక్తారః=భుజించగలరు ?

తా. క్షత్రియుని యాజకునిగా స్వీకరించినవాడు, విశేషించి చండాలుడు, సమర్పించు హవిస్సును యాగములో దేవతలును, ఋషులును ఎట్లు గ్రహింతురు ? 13

మూ. బ్రాహ్మణా వా మహాత్మానో భుక్త్వా చణ్డాలభోజనమ్, 14
కథం స్వర్గం గమిష్యన్తి విశ్వామిత్రేణ పాలితాః.

ప్ర. అ. విశ్వామిత్రేణ=విశ్వామిత్రునిచేత, పాలితాః = పాలింపబడిన, మహాత్మానః=మహాత్ము లైన, బ్రాహ్మణాః వా=బ్రాహ్మణు లైనను, చణ్డాల

భోజనమ్=చండాలుని భోజనమును, భుక్త్వా=భుజించి, స్వర్గమ్ = స్వర్గమును గూర్చి, కథమ్=ఎట్లు, గమిష్యన్తి=వెళ్లగలరు?

తా. విశ్వామిత్రుని మాటలు విని చండాలుని అన్నము భుజించిన మహాత్ము లైన బ్రాహ్మణు లైనను స్వర్గమున కెట్లు వెళ్లెదరు? 14

మూ. ఏతద్వచననైష్ఠుర్యమూచుస్సంరక్తలోచనాః, 15
వాసిష్ఠా మునిశార్దూల సర్వే తే సమహోదయాః.

ప్ర. అ. మునిశార్దూల = ఓ మునిశ్రేష్ఠా! సమహోదయాః=మహోదయునితో కూడిన, తే = ఆ, సర్వే = సమస్త మైన, వాసిష్ఠాః = వసిష్ఠకుమారులు, సంరక్తలోచనాః = ఎఱ్ఱనైన నేత్రములు కలవారై, ఏతత్ = ఈ వాక్యమును, వచననైష్ఠుర్యమ్ = వచనములో నైష్ఠుర్య ముండునట్లుగా, ఊచుః = పలికిరి.

తా. మునిశ్రేష్ఠా! మహోదయుడును, వసిష్ఠకుమారు లందరును, క్రోధముచే ఎఱ్ఱ నైన నేత్రములలో ఈ విధముగ పరుషముగా మాట్లాడిరి. 15

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా సర్వేషాం మునిపుఙ్గవః, 16
క్రోధసంరక్తనయనః సరోషమిద మబ్రవీత్.

ప్ర. అ. మునిపుఙ్గవః = ఆ మునిశ్రేష్ఠుడు, తేషాం సర్వేషామ్ = ఆ అందరియొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, క్రోధసంరక్తనయనః = క్రోధముచే ఎఱ్ఱ నైన నేత్రములు కలవాడై, సరోషమ్ = కోపముతో, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మునిశ్రేష్ఠు డైన ఆ విశ్వామిత్రుడు వారి మాటలు విని, క్రోధముతో నేత్రములు ఎఱ్ఱబారగా, ఇట్లు పలికెను. 16

మూ. యే దూషయన్త్యదుష్టం మాం తప ఉగ్రం సమాస్థితమ్, 17
భస్మీభూతా దురాత్మానో భవిష్యన్తి న సంశయః.

ప్ర. అ. ఉగ్రమ్ = ఉగ్ర మైన, తపః = తపస్సును, ఆస్థితమ్ = అవలంబించినవాడను, అదుష్టమ్ = దుష్టుడు కానివాడను అగు, మామ్ = నన్ను,

యే = ఎవరు, దూషయన్తి = దూషించుచున్నారో, అట్టి, దురాత్మానః = దురాత్ములు, భస్మీభూతాః = భస్మమైన వారుగా, భవిష్యన్తి = కాగలరు. సంశయః = సంశయము, న = లేదు.

తా. ఎట్టి దోషములును లేక ఉగ్రమైన తపస్సు ఆచరించుచున్న నన్ను దూషించు ఆ దురాత్ములు భస్మమై పోయెదరు. సంశయము లేదు. 17

మూ. అద్య తే కాలపాశేన నీతా వైవస్వతక్షయమ్, 18
సప్తజాతిశతాన్యేవ మృతపాః సన్తు సర్వశః.

ప్ర. అ. తే = వారు, అద్య = ఇప్పుడు, కాలపాశేన = యమపాశముచేత, వైవస్వతక్షయమ్ = యముని గృహమును గూర్చి, నీతాః = తీసికొని వెళ్లబడినవారై, సప్తజాతిశతాన్యేవ = ఏడువందల జన్మముల పాటు, సర్వశః = అన్ని విధముల, మృతపాః = శవభక్షకులుగా, సన్తు = అగుదురుగాక.

తా. వాశందరును ఈ నాడే యమపాశబదులె యమలోకమునకు పోయి ఏడువందల జన్మముల పాటు శవభక్షకులుగా ఉందురుగాక. 18

మూ. శ్వమాంసనియతాహారా ముష్టికా నామ నిర్ఘృణాః, 19
వికృతాశ్చ విరూపాశ్చ లోకాననుచరన్త్విమాన్.

ప్ర. అ. నిర్ఘృణాః = జాలిలేని, ముష్టికాః నామ = ముష్టికు లనే జాతి వారుగా పుట్టి, శ్వమాంసనియతాహారాః = కుక్కమాంసమునే నిత్యము భక్షించుచు, వికృతాశ్చ = వికారము కలవారై, విరూపాశ్చ = చెడ్డ రూపము కలవారై, ఇమాన్ = ఈ, లోకాన్ = లోకములను (లో), అనుచరన్తు = సంచరింతురు గాక.

తా. వసిష్ఠపుత్రు లందరును జాలి లేని ముష్టికజాతిలో పుట్టి, నిత్యము కుక్కమాంసమును భక్షించుచు, వికృతరూపములతో ఈ లోకమునందు సంచరిం చెదరు గాక. 19

మూ. మహోదయస్తు దుర్బుద్ధిర్మామదూష్యం హ్యదూషయత్, 20
దూషితః సర్వలోకేషు నిషాదత్వం గమిష్యతి.

ప్ర. అ. దుర్బుద్ధిః = చెడ్డ బుద్ధి గల, మహోదయస్తు = మహోదయుడై తే, అదూష్యమ్ = దూషింపకూడని, మామ్ = నన్ను, అదూషయత్ హి = దూషించినాడు కదా. సర్వలోకేషు = సకలలోకములయందును, దూషితః = దూషింపబడినవాడై, నిషాదత్వమ్ = నిషాదత్వమును, గమిష్యతి = పొందగలడు.

తా. దూషింపరాని నన్ను దూషించిన మహోదయుడు సకలజనులును దూషించు నిషాదజాతిలో పుట్టగలడు. 20

మూ. ప్రాణాతిపాతనిరతో నిరనుక్రోశతాం గతః, 21
దీర్ఘకాలం మమ క్రోధాద్దుర్గతిం వర్తయిష్యతి.

ప్ర. అ. మమ = నాయొక్క, క్రోధాత్ = కోపమువలన, ప్రాణాతిపాతనిరతః = ప్రాణములను తీయుటయందు ఆసక్తి కలవాడై, నిరనుక్రోశతామ్ = దయారాహిత్యమును, గతః = పొందినవాడై, దీర్ఘకాలమ్ = చాల కాలము, దుర్గతిమ్ = చెడ్డ జీవన విధానమును, వర్తయిష్యతి = అనుసరించగలడు.

తా. నా కోపమునకు ఫలితముగ ఆ మహోదయుడు, దయావిహీనుడై, ప్రాణములు తీయుటయందు ఆసక్తి కలవాడై, చాలకాలము దుష్టమైన జీవికను పొందగలడు. 21

మూ. ఏతావదుక్త్వా వచనం విశ్వామిత్రో మహాతపాః,
విరరామ మహాతేజా ఋషిమధ్యే మహామునిః. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకోనషష్టితమః సర్గః.

ప్ర. అ. మహాతపాః = గొప్ప తపస్సు కలవాడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, మహామునిః = మహామునియు అగు, విశ్వామిత్రః =

విశ్వామిత్రుడు, ఋషిమధ్యే=ఋషులమధ్యయందు, ఏతావత్ = ఇంతమాత్రము, వచనమ్ = వచనమును, ఉక్త్వా = పలికి, విరరామ = విరమించెను.

తా. మహాతేజశ్శాలి యగు విశ్వామిత్రమహాముని, ఋషుల మధ్య ఇట్లు పలికి విరమించెను. 22

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో ఏబది తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ షష్టితమః సర్గః

మూ. తపోబలహతాన్ కృత్వా వాసిష్ఠాన్ సమహోదయాన్,
ఋషిమధ్యే మహాతేజా విశ్వామిత్రోఽభ్యభాషత. 1

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, సమహోదయాన్ = మహోదయునితో కూడిన, వాసిష్ఠాన్ = వసిష్ఠ కుమారులను, తపోబలహతాన్=తపోబలముచేత చంపబడిన వారినిగా, కృత్వా= చేసి, ఋషిమధ్యే = ఋషుల మధ్యయందు, అభ్యభాషత = పలికెను.

తా. మహాతేజస్సు గల విశ్వామిత్రుడు మహోదయుని, వసిష్ఠకుమారులను ఈ విధముగ శపించి ఋషులతో ఇట్లు పలికెను. 1

మూ. అయమిక్ష్వాకుదాయాదస్త్రిశఙ్కురితి విశ్రుతః,
ధర్మిష్ఠశ్చ వదాన్యశ్చ మాం చైవ శరణం గతః, 2
తేనానేన శరీరేణ దేవలోకజిగీషయా.

ప్ర. అ. ఇక్ష్వాకుదాయాదః = ఇక్ష్వాకువంశమునందు పుట్టినవాడును, త్రిశఙ్కురితి = త్రిశంకువు అని, విశ్రుతః=ప్రసిద్ధి చెందిన వాడును, ధర్మిష్ఠః= ధర్మాత్ముడును, వదాన్యశ్చ = దాతయు అగు, అయమ్ = ఇతడు, తేన = అట్టి, అనేన = ఈ, శరీరేణ = శరీరముతో, దేవలోక జిగీషయా = దేవలోకమును జయించవలె ననెడు కోరికతో, మామ్ = నన్ను, శరణం గతః = శరణజొచ్చి నాడు.

తా. ఇతడు ఇక్ష్వాకువంశమునకు చెందిన త్రిశంకువు. ధర్మిష్ఠుడు. దాతృత్వము కలవాడు. ఈ శరీరముతోడనే స్వర్గమునకు వెళ్లవలె నను కోరికతో నా సాహాయ్య మర్థించినాడు. 2

మూ. యథాయం స్వశరీరేణ స్వర్గలోకం గమిష్యతి, 3
తథా ప్రవర్త్యతాం యజ్ఞో భవద్భిశ్చ మయా సహ.

ప్ర. అ. అయమ్ = ఈతడు, స్వశరీరేణ = తన శరీరముతో, స్వర్గలోకమ్ = స్వర్గలోకమును గూర్చి, యథా = ఎట్లు, గమిష్యతి = వెళ్లగలడో, తథా=ఆ విధముగా, భవద్భిః=మీచేత, మయా సహ=నాతో కలిసి, యజ్ఞః = యజ్ఞము, ప్రవర్త్యతామ్ = చేయబడుగాక.

తా. ఈతడు శరీరముతో స్వర్గమును చేరుటకై నేను చేయు యజ్ఞమునందు మీరు సహాయపడవలెను. 3

మూ. విశ్వామిత్రవచః శ్రుత్వా సర్వ ఏవ మహర్షయః, 4
ఊచుః సమేత్య సహితా ధర్మజ్ఞా ధర్మసంహితమ్.

ప్ర. అ. ధర్మజ్ఞాః = ధర్మము తెలిసినవారును, సహితాః = అచట సమావేశమైనవారును అగు, సర్వే ఏవ = సమస్తమైన, మహర్షయః = మహర్షులు, విశ్వామిత్రవచః = విశ్వామిత్రుని వాక్యమును, శ్రుత్వా = విని, సమేత్య = కలిసి, ధర్మసంహితమ్ = ధర్మయుక్తముగా, ఊచుః = పలికిరి.

తా. ధర్మజ్ఞులైన ఆ మహర్షు లందరును విశ్వామిత్రుని మాటలు విని, (తమలో తాము) ఒక్కుమ్మడిగా, ధర్మసంమతమైన మాట పలికిరి. 4

మూ. అయం కుశికదాయాదో మునిః పరమకోపనః, 5
యదాహ వచనం సమ్యగేతత్కార్యం న సంశయః,
అగ్నికల్పో హి భగవాన్ శాపం దాస్యతి రోషితః. 6

ప్ర. అ. కుశికదాయాదః = కుశికుని వంశమునందు పుట్టిన, పరమకోపనః = ఎక్కువ కోపస్వభావము గల, అయమ్ = ఈ, మునిః = ముని, యత్ = ఏ, వచనమ్ = వచనమును, ఆహ = పలుకుచున్నాడో, ఏతత్ = ఇది, సమ్యక్ = బాగుగా, కార్యమ్ = చేయదగినది. న సంశయః = సంశయము లేదు. అగ్నికల్పః=అగ్నితో సమానుడైన, భగవాన్=పూజ్యుడైన ఇతడు, రోషితః= కోపగింపచేయబడినవాడై, శాపమ్ = శాపమును, దాస్యతి = ఇవ్వగలడు.

తా. ఈ కౌశికుడు చాల కోపస్వభావము కలవాడు. ఈతడు చెప్పిన విధముగ చేయవలెను. ఇతడు అగ్నివలె తీవ్రస్వభావుడు. కోపము కలిగించినచో శపించును. 6

మూ. తస్మాత్ప్రవర్త్యతాం యజ్ఞః సశరీరో యథా దివమ్,
గచ్ఛేదిక్ష్వాకుదాయాదో విశ్వామిత్రస్య తేజసా, 7
తథా ప్రవర్త్యతాం యజ్ఞః సర్వే సమధితిష్ఠత.

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, యజ్ఞః = యజ్ఞము, ప్రవర్త్యతామ్ = జరుపబడుగాక. ఇక్ష్వాకుదాయాదః = ఇక్ష్వాకువంశీయుడైన ఈ త్రిశంకువు, విశ్వామిత్రస్య = విశ్వామిత్రునియొక్క, తేజసా = తేజస్సుచేత, సశరీరః = సశరీరుడై, యథా = ఎట్లు, దివమ్ = స్వర్గమును గూర్చి, గచ్ఛేత్ = వెళ్లునో, తథా = ఆవిధముగా, యజ్ఞః = యజ్ఞము, ప్రవర్త్యతామ్ = జరుపబడుగాక. సర్వే = అందరును, సమధితిష్ఠత = ప్రారంభింపుడు.

తా. ఈ త్రిశంకువు విశ్వామిత్రుని తపఃప్రభావముచే సశరీరముగ స్వర్గమునకు వెళ్లుటకై యజ్ఞము చేయుడు. అందరును ప్రారంభింపుడు. 7

మూ. ఏవముక్త్వా మహర్షయశ్చక్రుస్తాస్తాః క్రియాస్తదా, 8
యాజకశ్చ మహాతేజా విశ్వామిత్రోఽభవత్క్రతౌ.

ప్ర. అ. మహర్షయః = మహర్షులు, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, తదా = అప్పుడు, తాస్తాః = ఆయా, క్రియాః = క్రియలను, చక్రుః = చేసిరి. క్రతౌ = ఆ యజ్ఞమునందు, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, యాజకః = యజ్ఞము చేయించు ప్రధానఋత్విక్కుగా, అభవత్ = ఆయెను.

తా. మహర్షు లీ విధముగ పలికి యజ్ఞమునకు కావలసిన ఆ యా పనులను చేసిరి. మహాతేజశ్శాలి యగు విశ్వామిత్రుడు ఆ క్రతువులో యాజకుడుగా ఉండెను. 8

మూ. ఋత్విజశ్చానుపూర్వ్యేణ మన్త్రవన్మన్త్రకోవిదాః, 9
చక్రుః కర్మాణి సర్వాణి యథాకల్పం యథావిధి.

ప్ర. అ. మన్త్రకోవిదాః = మంత్రములందు ప్రవీణులైన, ఋత్విజశ్చ = ఋత్విక్కులు కూడ, మన్త్రవత్ = మంత్రసహితముగా, యథాకల్పమ్ = కల్పోక్త ప్రకారముగా, యథావిధి = యథాశాస్త్రముగా, సర్వాణి = సమస్తమైన, కర్మాణి = కర్మలను, ఆనుపూర్వ్యేణ = క్రమానుసారముగా, చక్రుః = చేసిరి.

తా. మంత్రము లెరిగిన ఋత్విక్కులు కల్పోక్తప్రకారమున, యథావిధిగా సర్వకర్మలును క్రమము తప్పక మంత్రపూర్వకముగా నిర్వహించిరి. 9

మూ. తతః కాలేన మహతా విశ్వామిత్రో మహాతపాః, 10
చకారావాహనం తత్ర భాగార్థం సర్వదేవతాః.

ప్ర. అ. తతః = పిమ్మట, మహాతపాః = గొప్ప తపస్సు గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, మహతా కాలేన = చాల కాలమునకు, తత్ర=అచట, సర్వదేవతాః = సర్వదేవతలను, భాగార్థమ్ = భాగములకొరకు, ఆవాహనం చకార=ఆవాహనము చేసెను.

తా. ఈ విధముగా చాల దినములు గడచిన పిమ్మట మహాతపఃశాలి యగు విశ్వామిత్రుడు సమస్తదేవతలను వారివారియజ్ఞ భాగములను స్వీకరించుటకై ఆహ్వానించెను. 10

మూ. నాభ్యాగమం స్తదాహూతా భాగార్థం సర్వదేవతాః, 11
తతః క్రోధసమావిష్టో విశ్వామిత్రో మహామునిః,
స్రువముద్యమ్య సక్రోధస్త్రిశఙ్కుమిదమబ్రవీత్. 12

ప్ర. అ. తదా = అప్పుడు, ఆహూతాః = పిలవబడిన, సర్వదేవతాః= సకలదేవతలును, భాగార్థమ్=భాగముల కొరకై, నాభ్యాగమన్=రాలేదు. తతః= పిమ్మట, క్రోధసమావిష్టః = క్రోధముతోకూడిన, విశ్వామిత్రః మహామునిః = విశ్వామిత్రమహాముని, స్రువమ్=స్రువమును, ఉద్యమ్య=ఎత్తి, సక్రోధః=క్రోధముతో కూడిన వాడై, త్రిశఙ్కుమ్ = త్రిశంకువును గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. ఈ విధముగ ఆహ్వానించినను తమ భాగములు గ్రహించుటకై దేవతలు రాకుండుట జూచి, విశ్వామిత్రమహాముని, కోపోద్దీపితుడై, స్రువ మనెడు హోమసాధనమును చేత ఎత్తి, త్రిశంకునితో ఇట్లనెను. 11, 12

మూ. పశ్య మే తపసో వీర్యం స్వార్జితస్య నరేశ్వర,
ఏష త్వాం సశరీరేణ నయామి స్వర్గమోజసా. 13
దుష్ప్రాపం సశరీరేణ దివం గచ్ఛ నరాధిప.

ప్ర. అ. నరేశ్వర=రాజా ! స్వార్జితస్య=స్వయముగా సంపాదింపబడిన, మే=నాయొక్క, తపసః = తపస్సుయొక్క, వీర్యమ్ = వీర్యమును, పశ్య= చూడుము. ఏషః=ఈ నేను, ఓజసా=నా తేజస్సుచేత, త్వామ్=నిన్ను, సశరీరేణ=శరీరసహితముగా, స్వర్గమ్ = స్వర్గమును, నయామి = పొందించెదను. నరాధిప=రాజా ! దుష్ప్రాపమ్=పొంద శక్యము కాని, దివమ్=స్వర్గమునుగూర్చి, సశరీరేణ=శరీరముతో, గచ్ఛ=వెళ్లుము.

తా. రాజా ! నా తపఃప్రభావమును చూడుము. నా తపఃశక్తిచే నిన్ను సశరీరముగా స్వర్గమునకు పంపెదను. సశరీరుడవై ఇతరు లెవ్వరును వెళ్లజాలని స్వర్గమునకు వెళ్లుము. 13

మూ. స్వార్జితం కించిదప్యస్తి మయా హి తపసః ఫలమ్, 14
రాజన్ స్వతేజసా తస్య సశరీరో దివం వ్రజ.

ప్ర. అ. రాజన్=రాజా ! మయా = నాచేత, స్వార్జితమ్=స్వయముగా సంపాదింపబడిన, తపసః ఫలమ్ = తపస్సుయొక్క ఫలము, కించిదపి=కొంచె మైనను, అస్తి హి=ఉన్నది కదా. తస్య=దానియొక్క, స్వతేజసా=తేజస్సుచేత, సశరీరః = శరీరముతో కూడినవాడవై, దివమ్ = స్వర్గమును గూర్చి, వ్రజ= వెళ్లుము.

తా. రాజా ! నేను స్వయముగా సంపాదించిన తపఃఫలము కొంత ఉన్నది. దాని తేజస్సుచే, సశరీరుడవై స్వర్గమునకు వెళ్లుము. 14

మూ. ఉక్తవాక్యే మునౌ తస్మిన్ సశరీరో నరేశ్వరః, 15
దివం జగామ కాకుత్స్థ మునీనాం పశ్యతాం తదా.

ప్ర. అ. కాకుత్స్థ=రామా, తస్మిన్ = ఆ, మునౌ=ముని, ఉక్తవాక్యే= పలకబడిన వాక్యము కలవాడగుచుండగా, నరేశ్వరః = రాజు, సశరీరః = శరీరముతో కూడినవాడై, తదా = అప్పుడు, మునీనామ్=మునులు, పశ్యతామ్= చూచుచుండగా, దివమ్ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. విశ్వామిత్రు డీవిధముగా పలికిన వెంటనే ఆ రాజు, ఆ ముని లందరును చూచుచుండగా, సశరీరుడై స్వర్గమునకు వెళ్లెను. 15

మూ. దేవలోకగతం దృష్ట్వా త్రిశఙ్కుం పాకశాసనః, 16
సహ సర్వైస్సురగణైరిదం వచనమబ్రవీత్.

ప్ర. అ. దేవలోకగతమ్ = దేవలోకమునకు వచ్చిన, త్రిశఙ్కుమ్ = త్రిశంకువును, దృష్ట్వా = చూచి, సర్వైః = సమస్త మైన, సురగణైః సహ = దేవతాగణములతో కూడిన, పాకశాసనః = దేవేంద్రుడు, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. దేవతాగణములతోకూడిన దేవేంద్రుడు త్రిశంకువు స్వర్గములో ప్రవేశించుట చూచి ఇట్లనెను. 16

మూ. త్రిశఙ్కో గచ్ఛ భూయస్త్వం నాసి స్వర్గకృతాలయః, 17
గురుశాపహతో మూఢ పత భూమిమవాక్శిరాః.

ప్ర. అ. త్రిశఙ్కో = ఓ త్రిశంకూ ! స్వర్గకృతాలయః = స్వర్గనివాసివి, న అసి = కావు. త్వమ్ = నీవు, భూయః = మరల, గచ్ఛ = వెళ్లుము. గురుశాపహతః = గురుశాపముచే హతుడ వైన, మూఢ = మూఢుడా ! అవాక్శిరాః = తలక్రిందుగా ఉన్నవాడవై, భూమిమ్ = భూమివైపు, పత = పడుము.

తా. ఓ త్రిశంకూ ! నీవు స్వర్గనివాసమునకు అర్హుడవు కావు. తిరిగి పొమ్ము. గురుశాపహతుడ వైన ఓ మూఢాత్మా ! తలక్రిందులుగా భూమిపై పడుము. 17

మూ. ఏవముక్తో మహేన్ద్రేణ త్రిశఙ్కురపతత్పునః, 18
విక్రోశమానస్త్రాహీతి విశ్వామిత్రం తపోధనమ్.

ప్ర. అ. మహేన్ద్రేణ = మహేంద్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, త్రిశఙ్కుః = త్రిశంకువు, త్రాహి ఇతి = రక్షించుము అని, తపోధనమ్ = మహర్షి యైన, విశ్వామిత్రం = విశ్వామిత్రుని గూర్చి, విక్రోశమానః = అరచుచు, పునః = మరల, అపతత్ = పడెను.

తా. మహేంద్రుడు ఇట్లు పలుకగా, త్రిశంకువు, రక్షింపు మని విశ్వామిత్రునితో మొరపెట్టుచు మరల క్రిందికి పడెను. 18

మూ. తచ్ఛ్రుత్వా వచనం తస్య క్రోశమానస్య కౌశికః, 19
రోషమాహారయత్తీవ్రం తిష్ఠ తిష్ఠేతి చాబ్రవీత్.

ప్ర. అ. కౌశికః = విశ్వామిత్రుడు, క్రోశమానస్య = అరచుచున్న, తస్య=అతనియొక్క, తత్=ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, తీవ్రమ్=తీవ్రమైన, రోషమ్=కోపమును, ఆహారయత్ = తెప్పించుకొనెను. తిష్ఠ తిష్ఠ ఇతి=ఆగుము ఆగుము అని, అబ్రవీత్ చ=పలికెను.

తా. విశ్వామిత్రుడు, ఆ విధముగా అరచుచున్న అతని మాటలు విని, తీవ్రమైన కోపముతో ఆగుము, ఆగుము అని పలికెను. 19

మూ. ఋషిమధ్యే స తేజస్వీ ప్రజాపతిరివాపరః, 20
సృజన్ దక్షిణమార్గస్థాన్ సప్తర్షీనపరాన్ పునః,
నక్షత్రమాలామపరామసృజత్క్రోధమూర్ఛితః, 21
దక్షిణాం దిశమాస్థాయ మునిమధ్యే మహాయశాః.

ప్ర. అ. ఋషిమధ్యే=ఋషులమధ్యమునందున్న, సః=ఆ, తేజస్వీ=తేజశ్శాలియైన విశ్వామిత్రుడు, అపరః=రెండవ, ప్రజాపతిః ఇవ = బ్రహ్మవలె, దక్షిణమార్గస్థాన్=దక్షిణ మార్గమునందున్న, అపరాన్=వేరైన, సప్తర్షీన్=సప్తర్షులను, సృజన్=సృజించుచు, మునిమధ్యే=మునుల మధ్యయందు, క్రోధమూర్ఛితః = కోపముచే వ్యాపింపబడినవాడై, దక్షిణాం దిశమ్ = దక్షిణదిక్కును, ఆస్థాయ= ఆశ్రయించి, మహాయశాః=గొప్ప కీర్తి గల అతడు, అపరామ్ = మరియొక, నక్షత్రమాలామ్=నక్షత్రపంక్తిని, అసృజత్ = సృజించెను.

తా. ఋషుల మధ్య నున్న ఆ విశ్వామిత్రుడు కోపోద్దీపితుడై, రెండవ బ్రహ్మ వలె, దక్షిణ దిక్కునందు, ఇతరులైన సప్తర్షులను, మరియొక నక్షత్రమాలను సృజించెను. 20, 21

మూ. సృష్ట్వా నక్షత్రవంశం చ క్రోధేన కలుషీకృతః, 22
అన్యమిన్ద్రం కరిష్యామి లోకో వా స్యాదనిన్ద్రకః,
దైవతాన్యపి స క్రోధాత్స్రష్టుం సముపచక్రమే. 23

ప్ర. అ. నక్షత్రవంశం చ=నక్షత్రవంశమును కూడ, సృష్ట్వా=సృజించి, క్రోధేన=క్రోధముచేత, కలుషీకృతః=కలుషముగా చేయబడినవాడై, అన్యమ్=మరియొక, ఇన్ద్రమ్=ఇంద్రుని, కరిష్యామి = చేసెదను; లోకః = లోకము, అనిన్ద్రకః వా=ఇంద్రుడు లేని దైనను, స్యాత్ = అగుగాక, (అని వలుకుచు), సః = ఆతడు, దైవతాన్యపి = దేవతలను కూడ, క్రోధాత్ = కోపమువలన, స్రష్టుమ్=సృజించుటకు, సముపచక్రమే=ఉపక్రమించెను.

తా. ఆ విశ్వామిత్రుడు క్రోధముతో నక్షత్రవంశమును కూడ సృజించి, "మరొక ఇంద్రు నైనను సృజించెదను; లేదా లోకములో ఇంద్రు డైన లేకుండ వలెను" అని పలుకుచు, దేవతాసృష్టి కూడ చేయ ప్రారంభించెను. 22, 23

మూ. తతః పరమసంభ్రాన్తాస్సర్షిసఙ్ఘాస్సురాసురాః,
విశ్వామిత్రం మహాత్మానమూచుస్సానునయం వచః. 24

ప్ర. అ. తతః=పిమ్మట, పరమసంభ్రాన్తాః = మిక్కిలి భయపడిన, సర్షిసఙ్ఘాః = ఋషిసంఘములతో కూడిన, సురాసురాః = దేవతలును అసురులును, మహాత్మానమ్ = మహాత్ము డైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, సానునయమ్=అనునయముతో కూడినట్లుగా, వచః=వాక్కును, ఊచుః=పలికిరి.

తా. పిమ్మట మిక్కిలి భయపడిన దేవాసురులును, ఋషులును మహాత్ము డైన విశ్వామిత్రుని అనునయించుచు ఇట్లు పలికిరి. 24

మూ. అయం రాజా మహాభాగ గురుశాపపరిక్షతః,
సశరీరో దివం యాతుం నార్హత్యేవ తపోధన. 25

ప్ర. అ. తపోధన=ఓ మహర్షీ! మహాభాగ=ఓ పూజ్యుడా! గురుశాపపరిక్షతః=గురుశాపముచేత కొట్టబడిన, అయమ్=ఈ, రాజా=రాజు, సశరీరః=

శరీరసహితుడై, దివమ్ = స్వర్గమును గూర్చి, యాతుమ్=వెళ్లుటకు, నార్హత్యేవ= అర్హుడు కానే కాడు.

తా. మహాప్రభావశాలి వగు ఓ తపోధనా! గురుశాపముచేత దెబ్బ తిన్న ఈ రాజు సశరీరముగా స్వర్గమునకు వెళ్లుటకు అనర్హుడు. 25

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా దేవానాం మునిపుఙ్గవః,
అబ్రవీత్సుమహద్వాక్యం కౌశికః సర్వదేవతాః. 26

ప్ర. అ. మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడైన, కౌశికః = విశ్వామిత్రుడు, తేషామ్=ఆ, దేవానామ్=దేవతలయొక్క, తత్=ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా=విని, సర్వదేవతాః=ఆ సకలదేవతలను గూర్చి, సుమహత్ = చాల గొప్పదైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. మునిశ్రేష్ఠుడైన ఆ విశ్వామిత్రుడు దేవతల మాటలు విని వారితో ప్రశంసనీయ మగు ఒక వచనము పలికెను. 26

మూ. సశరీరస్య భద్రం వస్త్రిశఙ్కోరస్య భూపతేః,
ఆరోహణం ప్రతిజ్ఞాయ నానృతం కర్తుముత్సహే. 27

ప్ర. అ. వః=మీకు, భద్రమ్=మంగళ మగుగాక. సశరీరస్య = శరీరముతో కూడిన, అస్య=ఈ, త్రిశఙ్కోః భూపతేః = త్రిశంకు మహారాజునకు, ఆరోహణమ్ = స్వర్గారోహణమును, ప్రతిజ్ఞాయ = ప్రతిజ్ఞ చేసి, అనృతమ్ = అసత్యమును, కర్తుమ్=చేయుటకు, న ఉత్సహే=ఇష్టపడను.

తా. దేవతలారా! మీకు క్షేమ మగు గాక. ఈ త్రిశంకువును సశరీరముగా స్వర్గమునకు పంపెద నని ప్రతిజ్ఞ చేసి ఆ ప్రతిజ్ఞను అసత్యము చేయ నంగీకరింపను. 27

మూ. స్వర్గోఽస్తు సశరీరస్య త్రిశఙ్కోరస్య శాశ్వతః,
నక్షత్రాణి చ సర్వాణి మామకాని ధ్రువాణ్యథ. 28

యావల్లోకా ధరిష్యన్తి తిష్ఠన్త్వేతాని సర్వశః,
మత్కృతాని సురాః సర్వే తదనుజ్ఞాతుమర్హథ. 29

ప్ర. అ. అస్య=ఈ, త్రిశఙ్కోః=త్రిశంకువునకు, సశరీరస్య=శరీరముతో కూడి యుండగనే, శాశ్వతః=శాశ్వత మైన, స్వర్గః=స్వర్గము, అస్తు=అగుగాక. అథ=మరియు, మత్కృతాని=నాచేత సృజింపబడిన, ఏతాని=ఈ, సర్వాణి=సమస్త మైన, నక్షత్రాణి=నక్షత్రములు, మామకాని=నావిగా, సర్వశః=అంతటను, లోకాః=లోకములు, యావత్=ఎంతవరకు, ధరిష్యన్తి = నిలచునో (అంతవరకు), ధ్రువాణి=స్థిరములై, తిష్ఠన్తు=ఉండుగాక. సురాః = ఓ దేవతలారా ! సర్వే=మీరందరును, తత్=దానిని, అనుజ్ఞాతుమ్ = అనుమతించుటకు, అర్హథ=తగియున్నారు.

తా. ఈ త్రిశంకువు సశరీరుడై, శాశ్వతముగా స్వర్గమునందు నివసించవలెను. నేను సృజించిన నక్షత్రము లన్నియు ఈ లోకము లున్నంతవరకును స్థిరముగ ఉండవలెను. ఓ దేవతలారా ! మీరు నాకు దీనిని అనుమతింపుడు. 28, 29

మూ. ఏవముక్తాః సురాః సర్వే ప్రత్యూచుర్మునిపుఙ్గవమ్,
ఏవం భవతు భద్రం తే తిష్ఠన్త్వేతాని సర్వశః. 30

గగనే తాన్యనేకాని వైశ్వానరపథాద్బహిః,
నక్షత్రాణి మునిశ్రేష్ఠ తేషు జ్యోతిష్షు జాజ్వలన్, 31
అవాక్ఛిరాస్త్రిశఙ్కుశ్చ తిష్ఠత్వమరసన్నిభః.

ప్ర. అ. ఏవమ్=ఈ విధముగా, ఉక్తాః=పలకబడిన, సర్వే = సమస్తమైన, సురాః=దేవతలు, మునిపుఙ్గవమ్=మునిశ్రేష్ఠుని గూర్చి, ప్రత్యూచుః=తిరిగి పలికిరి. ఏవమ్=ఇట్లు, భవతు=అగుగాక. మునిశ్రేష్ఠ=ఓ మునిశ్రేష్ఠుడా ! తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక. ఏతాని=ఈ, తాని=ప్రసిద్ధమైన, అనేకాని=అనేకమైన, నక్షత్రాణి = నక్షత్రములు, వైశ్వానరపథాత్ = జ్యోతిశ్చక్రము కంటె, బహిః=వెలుపల, గగనే=ఆకాశమునందు, సర్వశః=అన్ని వైపుల, తిష్ఠన్తు=ఉండుగాక. తేషు=ఆ, జ్యోతిష్షు=నక్షత్రములమధ్య, జాజ్వలన్=ప్రకాశించుచు, త్రిశఙ్కుశ్చ = త్రిశంకువు కూడ, అమరసన్నిభః = దేవతలతో సమానుడై, అవాక్ఛిరాః = తలక్రిందుగ తిష్ఠతు=ఉండుగాక

తా. ఆ దేవతలు మునిపుంగవునితో ఇట్లని ఓ మునిశ్రేష్ఠా! నీవు చెప్పి
ట్లే అగును. నీకు భద్ర మగుగాక. నీవు సృష్టించిన నక్షత్రము లన్నియు
్యోతిశ్చక్రమునకు వెలుపల నుండుగాక. త్రిశంకువు ఆ నక్షత్రముల
డుమ ప్రకాశించుచు, దేవతాతుల్యుడై, తలక్రిందుగ నివసించుగాక. 30, 31

మూ. అనుయాస్యన్తి చైతాని జ్యోతీంషి నృపసత్తమమ్, 32
కృతార్థం కీర్తిమన్తం చ స్వర్గలోకగతం యథా.

ప్ర. అ. ఏతాని=ఈ, జ్యోతీంషి చ = నక్షత్రములును, కృతార్థమ్=
రవేరిన వనులు గలవాడును, కీర్తిమన్తం చ = కీర్తి కలవాడును అయిన,
ృపసత్తమమ్=రాజశ్రేష్ఠుని, స్వర్గలోకగతం యథా=స్వర్గలోకములో ఉన్న
ానిని వలె, అనుయాస్యన్తి=అనుసరించగలవు.

తా. చరితార్థుడై కీర్తిమంతుడైన ఈ రాజశ్రేష్ఠుని, ఈ నక్షత్రము
న్నియు స్వర్గములో ఉన్నవానిని అనుసరించినట్లు అనుసరింపగలవు. 32

మూ. విశ్వామిత్రస్తు ధర్మాత్మా సర్వదేవైరభిష్టుతః, 33
ఋషిభిశ్చ మహాతేజా బాఢమిత్యాహ దేవతాః.

ప్ర. అ. సర్వదేవైః=సమస్త మైన దేవతలచేతను, ఋషిభిశ్చ=ఋషుల
తను, అభిష్టుతః=స్తుతింపబడిన, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, ధర్మాత్మా=
ర్మాత్ముడైన, విశ్వామిత్రస్తు = విశ్వామిత్రుడైతే, దేవతాః = దేవతలను
ూర్చి, బాఢమ్ ఇత్యేవ=సరే అని, ఆహ=పలికెను.

తా. ఈ విధముగా సకలదేవతలును, ఋషులును స్తుతింపగా, ధర్మాత్ము
డును, తేజోవంతుడును అగు విశ్వామిత్రుడు 'సరే' అని అంగీకరించెను. 33

మూ. తతో దేవా మహాత్మానో మునయశ్చ తపోధనాః,
జగ్ముర్యథాగతం సర్వే యజ్ఞస్యాన్తే నరోత్తమ. 34

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షష్టితమః సర్గః.

ప్ర. అ. నరోత్తమ=నరులలో ఉత్తముడవైన రామా! తతః=పిమ్మట, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, అన్తే=అంతమునందు, మహాత్మానః=మహాత్ములైన, దేవాః=దేవతలును, తపోధనాః = తపస్సే ధనముగా గల, మునయశ్చ = మునులును, సర్వే=అందరును, యథాగతమ్=వచ్చినట్లుగనే, జగ్ముః = వెళ్లిరి.

తా. రామా! యజ్ఞము పూర్తియైన పిమ్మట మహాత్ములైన దేవతలును, తపోధనులైన మునులును తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. 34

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో అరువదవ సర్గ సమాప్తము.

అథ ఏకషష్టితమః సర్గః

మూ. విశ్వామిత్రో మహాత్మాథ ప్రస్థితాన్ ప్రేక్ష్య తాన్ ఋషీన్,
అబ్రవీన్నరశార్దూల సర్వాంస్తాన్వనవాసినః. 1

ప్ర. అ. నరశార్దూల=ఓ నరశ్రేష్ఠుడా! అథ=పిమ్మట, మహాత్మా = మహాత్ము డైన, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, ప్రస్థితాన్ = ప్రయాణ మైన, వనవాసినః = వనములందు నివసించు, తాన్=ఆ, సర్వాన్ = సమస్త మైన, ఋషీన్=ఋషులను, ప్రేక్ష్య=చూచి, అబ్రవీత్=పలికెను

తా. రామా! మహాత్ము డైన విశ్వామిత్రుడు, ప్రయాణ మైన ఆ ఋషు లందరిని చూచి ఇట్లు పలికెను. 1

మూ. మహాన్విఘ్నః ప్రవృత్తోఽయం దక్షిణామాస్థితో దిశమ్,
దేశమన్యాం ప్రపత్స్యామస్తత్ర తప్స్యామహే తపః. 2

ప్ర. అ. దక్షిణాం దిశమ్=దక్షిణ దిక్కును, ఆస్థితః = అవలంబించి నదై, అయమ్=ఈ, మహాన్=గొప్ప, విఘ్నః=విఘ్నము, ప్రవృత్తః = ఏర్ప డినది. అన్యామ్=మరియొక, దిశమ్=దిక్కును, ప్రపత్స్యామః = పొందెదము. తత్ర=అచట, తపః=తపస్సు, తప్స్యామహే=తపించెదము.

తా. ఈదక్షిణపు దిక్కున గొప్ప విఘ్నము సంభవించినది. మరొక దిక్కునకు వెళ్లి అచట తపస్సు చేసెదము. 2

మూ. పశ్చిమాయాం విశాలాయాం పుష్కరేషు మహాత్మనః,
సుఖం తపశ్చరిష్యామః పరం తద్ధి తపోవనమ్. 3

ప్ర. అ. మహాత్మనః=ఓ మహాత్ములారా! విశాలాయామ్=విశాల మైన, పశ్చిమాయామ్=పశ్చిమదిక్కునందు, పుష్కరేషు = పుష్కరక్షేత్రమునందు, సుఖమ్=సుఖముగా, తపః=తపస్సు, చరిష్యామః=చేసెదము. తత్=అది, పరమ్=శ్రేష్ఠ మైన, తపోవనం హి=తపోవనము కదా?

తా. ఓ మహాత్ములారా! విశాల మైన పశ్చిమదిక్కునకు పోయి, అచట పుష్కరక్షేత్రమునందు తపస్సు చేయుదము. అది ఉత్తమ మైన తపోవనము. 3

మూ. ఏవముక్త్వా మహాతేజాః పుష్కరేషు మహామునిః,
తప ఉగ్రం దురాధర్షం తేపే మూలఫలాశనః. 4

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, మహామునిః=ఆ మహాముని, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, పుష్కరేషు=పుష్కరమునందు, మూలఫలాశనః= దుంపలను ఫలములను మాత్రము భుజించుచు, దురాధర్షమ్=ఎదిరింప శక్యము కాని, ఉగ్రమ్=ఉగ్ర మైన, తపః=తపస్సును, తేపే=చేసెను.

తా. మహాతేజశ్శాలి యైన ఆ విశ్వామిత్రుడు ఇట్లు పలికి, పుష్కర క్షేత్రము చేరి, అచట, మూలఫలములను మాత్రమే భుజించుచు ఉగ్ర మైన తపస్సు చేసెను. 4

మూ. ఏతస్మిన్నేవ కాలే తు అయోధ్యాధిపతిర్నృపః,
అమ్బరీష ఇతి ఖ్యాతో యష్టుం సముపచక్రమే. 5

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, కాలే ఏవ = కాలమునందే, అమ్బరీషః ఇతి = అంబరీషుడు అని, ఖ్యాతః = ప్రసిద్ధు డైన, అయోధ్యాధిపతిః = అయోధ్యాప్రభు వైన, నృపః = రాజు, యష్టుమ్ = యాగముచేయుటకు, సముపచక్రమే=ప్రారంభించెను.

తా. ఈ కాలమునందే అయోధ్యాధిపతి యైన అంబరీషు డను రాజు యాగము చేయ ప్రారంభించెను. 5

మూ. తస్య వై యజమానస్య పశుమిన్ద్రో జహార హ,
ప్రణష్టే తు పశౌ విప్రో రాజానమిదమబ్రవీత్. 6

ప్ర. అ. యజమానస్య = యాగము చేయుచున్న, తస్య=ఆతనియొక్క, పశుమ్ = పశువును, ఇన్ద్రః = ఇంద్రుడు, జహార హ = అపహరించెను. పశౌ = పశువు, ప్రణష్టే సతి = కనబడకపోగా, విప్రః = పురోహితుడు, రాజానమ్ = రాజును గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అతడు యాగము చేయుచుండగా ఇంద్రుడు పశువును హరించెను. యజ్ఞపశువు కనబడకపోయినతోడనే పురోహితుడు రాజుతో ఇట్లు పలికెను. 6

మూ. పశురద్య హృతో రాజన్ ప్రణష్టస్తవ దుర్నయాత్,
అరక్షితారం రాజానం ఘ్నన్తి దోషా నరేశ్వర. 7

ప్ర. అ. రాజన్ = రాజా, అద్య = ఇపుడు, పశుః = పశువు, హృతః = హరింపబడినది. తవ = నీ యొక్క, దుర్నయాత్ = అధర్మమువలన, ప్రణష్టః = కనబడకుండపోయినది. నరేశ్వర = రాజా! అరక్షితారమ్ = రక్షించని, రాజానమ్ = రాజును, దోషాః = దోషములు, ఘ్నన్తి = చంపును.

తా. రాజా! పశువు నెవరో హరించినారు. నీ అధర్మముచే ఇది పోయినది. పశువును రక్షింపజాలని రాజును దోషములు చంపివేయును. 7

మూ. ప్రాయశ్చిత్తం మహద్ధ్యేతన్నరం వా పురుషర్షభ,
ఆనయస్వ పశుం శీఘ్రం యావత్కర్మ ప్రవర్తతే. 8

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! ఏతత్ = ఇది, మహత్ = గొప్పదైన, ప్రాయశ్చిత్తమ్ = ప్రాయశ్చిత్తము. నరం వా = మనుష్యు నైనను, పశుమ్ = పశువునుగా, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఆనయస్వ = తీసికొనిరమ్ము. కర్మ = కర్మ, యావత్ ప్రవర్తతే = జరుగగలదు.

తా. రాజా! దీనికి చాల పెద్ద ప్రాయశ్చిత్తము చేయవలసి యున్నది. పశువు లభించనిచో మనుష్యు నైనను పశువుగా తీసికొని రమ్ము. అపుడు యజ్ఞము జరుగగలదు. 8

మూ. ఉపాధ్యాయవచః శ్రుత్వా స రాజా పురుషర్షభ,
అన్వియేష మహాబుద్ధిః పశుం గోభిః సహస్రశః. 9

ప్ర. అ. పురుషర్షభ = ఓ పురుషశ్రేష్ఠుడా! మహాబుద్ధిః = గొప్ప బుద్ధిగల, సః = ఆ, రాజా = రాజు, ఉపాధ్యాయవచః = ఉపాధ్యాయుని వాక్యమును, శ్రుత్వా = విని, సహస్రశః = వేలకొలది, గోభిః = గోవులచే, పశుమ్ = పశువును, అన్వియేష = అన్వేషించెను.

తా. పురుషశ్రేష్ఠుడ వైన ఓ రామా! మహాబుద్ధిశాలి యగు ఆ రాజు ఉపాధ్యాయుని మాటలు విని, వేలకొలది ఆవుల నిచ్చి నరపశువును సంపాదించుటకు ప్రయత్నించెను. 9

మూ. దేశాన్ జనపదాంస్తాంస్తాన్నగరాణి వనాని చ,
ఆశ్రమాణి చ పుణ్యాని మార్గమాణో మహీపతిః. 10

స పుత్రసహితం తాత సభార్యం రఘునన్దన,
భృగుతుఙ్గే సమాసీనమృచీకం సందదర్శ హ. 11

ప్ర. అ. తాత=నాయనా! రఘునన్దన=రామా! సః=ఆ, మహీపతిః=రాజు, తాంస్తాన్=ఆయా, దేశాన్ = దేశములను, జనపదాన్=పల్లెలను, నగరాణి చ = నగరములను, వనాని చ = వనములను, పుణ్యాని = పుణ్యమైన, ఆశ్రమాణి చ = ఆశ్రమములను, మార్గమాణః = వెదకుచు, భృగుతుఙ్గే = భృగుతుంగపర్వతమునందు, పుత్రసహితమ్=పుత్రులతో కూడినవాడును, సభార్యమ్=భార్యాసమేతుడును, సమాసీనమ్ = కూర్చుని ఉన్న, ఋచీకమ్=ఋచీకమహర్షిని, సందదర్శ హ = చూచెను.

తా. రామా! ఆ రాజు ఆయా దేశములందును, పల్లెలందును, నగరములందును, పవిత్ర మైన ఆశ్రమములందును వెదకుచు భృంగతుంగపర్వతముపై భార్యాపుత్రసమేతుడై సుఖముగా కూర్చొని ఉన్న ఋచీకమహర్షిని చూచెను. 10, 11

మూ. తమువాచ మహాతేజాః ప్రణమ్యాభిప్రసాద్య చ,
బ్రహ్మర్షిం తపసా దీప్తం రాజర్షిరమితప్రభః, 12
పృష్ట్వా సర్వత్ర కుశలమృచీకం తమిదం వచః.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గలవాడును, అమితప్రభః = అనంత మైన కాంతి కలవాడును అగు ఆ రాజు, తపసా=తపస్సుతో, దీప్తమ్=ప్రజ్వరిల్లుచున్న, తమ్ = ఆ, బ్రహ్మర్షిమ్ = బ్రహ్మర్షిని, ప్రణమ్య = నమస్కరించి, అభిప్రసాద్య చ = అనుగ్రహింపచేసికొని, సర్వత్ర = అన్నింటియందును,

కుశలమ్ = క్షేమమును, పృష్ట్వా=అడిగి, తం ఋచీకమ్ = ఆ ఋచీకుని గూర్చి, ఇదమ్ = ఈ, వచః = వచనమును, ఉవాచ = పలికెను.

తా. మహాతేజశ్శాలి యగు ఆ రాజు తపస్సుతో ప్రకాశించుచున్న ఆ ఋచీకుని నమస్కరించి, అనుగ్రహింపచేసికొని, అన్నింటను కుశలవార్త లడిగి, ఇట్లు పలికెను. 12

మూ. గవాం శతసహస్రేణ విక్రీణీషే సుతం యది, 13
పశోరర్థే మహాభాగ కృతకృత్యోఽస్మి భార్గవ.

ప్ర. అ. మహాభాగ = గొప్ప భాగ్యము గల, భార్గవ = భృగువంశ సంజాతుడ వైన ఓ ఋచీకమునీ ! గవామ్ = గోవులయొక్క, శతసహస్రేణ = నూరువేలచేత, సుతమ్ = నీ కుమారుని, పశోః అర్థే = పశువుకొరకై, విక్రీణీషే యది = అమ్మినట్లైతే, కృతకృత్యః = కృతకృత్యుడను, అస్మి=అగుదును.

తా. మహామునీ ! నీవు లక్ష ఆవులను తీసికొని నీ కుమారుని యజ్ఞపశువుగా అమ్మినచో నేను చరితార్థుడ నగుదును. 13

మూ. సర్వే పరిసృతా దేశా యజ్ఞీయం న లభే పశుమ్,
దాతుమర్హసి మూల్యేన సుతమేకమితో మమ. 14

ప్ర. అ. సర్వే = సమస్త మైన, దేశాః = దేశములు, పరిసృతాః = సంచరించబడినవి. యజ్ఞీయమ్ = యజ్ఞసంబంధ మైన, పశుమ్=పశువును, న లభే= పొందజాలకున్నాను. ఇతః = వీరిలోనుండి, ఏకమ్ = ఒక, సుతమ్ = కుమారుని, మూల్యేన = మూల్యముచేత, మమ = నాకు, దాతుమ్=ఇచ్చుటకు, అర్హసి= తగి యున్నావు.

తా. అన్ని దేశములు తిరిగితిని కాని యజ్ఞపశువు లభించలేదు. నీ కుమారులలో నుండి ఒకనిని నాకు మూల్యమున కిమ్ము. 14

మూ. ఏవముక్తో మహాతేజా ఋచీకస్త్వబ్రవీద్వచః, 15
నాహం జ్యేష్ఠం నరశ్రేష్ఠ విక్రీణీయాం కథం చన.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ఋచీకస్తు = ఋచీకమహర్షి యైతే, వచః=వచనమును, అబ్రవీత్= పలికెను. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా ! అహమ్ = నేను, కథం చన = ఎట్లైనను, జ్యేష్ఠమ్= పెద్దవానిని, న విక్రీణీయామ్=అమ్మను.

తా. రాజు మాటలు విని ఋచీకుడు— "నే నే విధమున నైనను జ్యేష్ఠ పుత్రుని అమ్మజాలను" అని పలికెను. 15

మూ. ఋచీకస్య వచః శ్రుత్వా తేషాం మాతా మహాత్మనామ్,
ఉవాచ నరశార్దూలమమ్బరీషం తపస్వినీ. 16

ప్ర. అ. ఋచీకస్య=ఋచీకునియొక్క, వచః=వచనమును, శ్రుత్వా= విని, మహాత్మనామ్=మహాత్ములైన, తేషామ్=వారియొక్క, మాతా=తల్లియైన, తపస్వినీ=తాపసి, నరశార్దూలమ్ = నరులలో శ్రేష్ఠుడైన, అమ్బరీషమ్=అంబరీషుని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. ఆ మహాత్ముల తల్లి యైన తపోధనురాలు ఋచీకుని మాటలు విని అంబరీషునితో ఇట్లనెను. 16

మూ. అవిక్రేయం సుతం జ్యేష్ఠం భగవానాహ భార్గవః. 17
మమాపి దయితం విద్ధి కనిష్ఠం శునకం నృప,
తస్మాత్కనీయసం పుత్రం న దాస్యే తవ పార్థివ. 18

ప్ర. అ. భగవాన్=పూజ్యుడైన, భార్గవః=ఋచీకమహాముని, జ్యేష్ఠమ్= జ్యేష్ఠుడైన, సుతమ్=కుమారుని, అవిక్రేయమ్=అమ్మకూడనివానినిగా, ఆహ= చెప్పుచున్నాడు, నృప=రాజా, శునకమ్=శునకుడనే, కనిష్ఠమ్=చిన్నపిల్లవానిని, మమ=నాకు. దయితమ్=ఇష్టునిగా, విద్ధి = తెలుసుకొనుము. పార్థివ=రాజా ! తస్మాత్=ఆ కారణమువలన, కనీయసం పుత్రమ్ = చిన్న కుమారుని, తవ= నీకు, న దాస్యే=ఇవ్వను.

తా. ఋచీకమహాముని పెద్దకుమారుని అమ్మ నని చెప్పుచున్నాడు. రాజా ! చిన్న కుమారు డైన శునకుడు నాకు ఇష్టుడు. అందుచేత ఆతనిని నీకు ఇవ్వను. 17, 18

మూ. ప్రాయేణ హి నరశ్రేష్ఠ జ్యేష్ఠాః పితృషు వల్లభాః,
మాతౄణాం తు కనీయాంసస్తస్మాద్రక్షే కనీయసమ్. 19

ప్ర. అ. నరశ్రేష్ఠ = ఓ నరశ్రేష్ఠుడా! ప్రాయేణ = సాధారణముగా, జ్యేష్ఠాః=పెద్దవాళ్లు, పితృషు=తండ్రులయందు, వల్లభాః=ప్రియులు మాతౄణాం తు=తల్లులకైతే, కనీయాంసః=చిన్నవాళ్లు ప్రియులు. తస్మాత్ = ఆ కారణము వలన, కనీయసమ్=చిన్నవానిని, రక్షే=రక్షించెదను.

తా. రాజా! సాధారణముగా జ్యేష్ఠుడు తండ్రికి ఇష్టుడు కాగా చిన్నవాడు తల్లికి ఇష్టుడగును. అందుచేత చిన్నవానిని రక్షించుకొందును. 19

మూ. ఉక్తవాక్యే మునౌ తస్మిన్ మునిపత్న్యాం తథైవ చ,
శునశ్శేఫస్స్వయం రామ మధ్యమో వాక్యమబ్రవీత్. 20

ప్ర. రామ = రామా! తస్మిన్ = ఆ, మునౌ = ముని, ఉక్తవాక్యే = పలకబడిన వాక్యము కలవాడగుచుండగా, తథైవ చ = అట్లే, మునిపత్న్యామ్ = మునిపత్ని పలకబడిన వాక్యముకలదగుచుండగా, మధ్యమః = మధ్యముడైన, శునఃశేఫః = శునశ్శేపుడు, స్వయమ్ = స్వయముగా, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మునియు, మునిపత్నియు పలికిన మాటలు విని మధ్యముడైన శునశ్శేపుడు స్వయముగ ఇట్లు పలికెను. 20

మూ. పితా జ్యేష్ఠమవిక్రేయం మాతా చాహ కనీయసమ్,
విక్రీతం మధ్యమం మన్యే రాజన్ పుత్రం నయస్వ మామ్. 21

ప్ర. అ. రాజన్ = రాజా! పితా = తండ్రి, జ్యేష్ఠమ్ = జ్యేష్ఠకుమారుని, అవిక్రేయమ్ = అమ్మ శక్యము కాని వానినిగా, ఆహ = చెప్పుచున్నాడు. మాతా చ = తల్లియు, కనీయసమ్ = చిన్న వానిని అమ్మ వీలు కాని వానినిగా చెప్పుచున్నది. మధ్యమం పుత్రమ్=మధ్యమ పుత్రుడనైన నన్ను, విక్రీతమ్= అమ్మబడిన వానినిగా, మన్యే = తలచుచున్నాను. మామ్ = నన్ను, నయస్వ = తీసికొని వెళ్లుము.

తా. రాజా! జ్యేష్ఠకుమారుని అమ్మజాల నని తండ్రి చెప్పుచున్నాడు. చిన్నవానిని అమ్మజాల నని తల్లి చెప్పుచున్నది. దీనిని బట్టి మధ్యముడ నైన నన్ను అమ్ముచున్నా రని అనుకొనుచున్నాను. అందుచే నన్ను తీసికొని పొమ్ము. 21

మూ. గవాం శతసహస్రేణ శునఃశేఫం నరేశ్వరః,
గృహీత్వా పరమప్రీతో జగామ రఘునన్దన. 22

ప్ర. అ. రఘునన్దన = రామా! నరేశ్వరః = రాజు, గవామ్ = గోవుల యొక్క, శతసహస్రేణ = నూరువేలచేత, శునఃశేఫమ్ = శునఃశేఫుని, గృహీత్వా = గ్రహించి, పరమప్రీతః = మిక్కిలి సంతసించినవాడై, జగామ = వెళ్లెను.

తా. రామా! ఆ రాజు లక్ష గోవులతో ఆ శునఃశేఫుని కొని ఆనందముతో వెళ్లెను. 22

మూ. అమ్బరీషస్తు రాజర్షి రథమారోప్య సత్వరః,
శునఃశేఫం మహాతేజా జగామాశు మహాయశాః. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకషష్టితమః సర్గః.

ప్ర. అ. మహాతేజాః = గొప్పతేజస్సు గల, మహాయశాః = గొప్ప కీర్తి గల, రాజర్షిః = రాజర్షి యైన, అమ్బరీషస్తు = అంబరీషుడైతే, సత్వరః = తొందరతో కూడినవాడై, శునఃశేఫమ్ = శునఃశేఫుని, రథమ్ ఆరోప్య = రథ మెక్కించి, ఆశు = శీఘ్రముగా, జగామ = వెళ్లెను.

తా. గొప్ప తేజోయశస్సులు గల రాజర్షి యైన ఆ అంబరీషుడు శునఃశేఫుని శీఘ్రముగా రథముపై కూర్చుండబెట్టుకొని వెళ్లెను. 23

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో అరువది యొకటవ సర్గ సమాప్తము.

అథ ద్విషష్టితమః సర్గః

మూ. శునఃశేఫం నరశ్రేష్ఠ గృహీత్వా తు మహాయశాః,
వ్యశ్రామ్యత్పుష్కరే రాజా మధ్యాహ్నే రఘునన్దన. 1

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడ వైన, రఘునన్దన = రామా ! మహాయశాః = గొప్ప కీర్తి గల, రాజా = ఆ రాజు, శునఃశేఫమ్ = శునశ్శేఫుని, గృహీత్వా = గ్రహించి, మధ్యాహ్నే = మధ్యాహ్నమునందు, పుష్కరే=పుష్కరమునందు, వ్యశ్రామ్యత్ = విశ్రమించెను.

తా. రామా ! ఆ రాజు శునఃశేఫుని తీసికొని వెళ్లుచు, మధ్యాహ్నసమయమునందు పుష్కరక్షేత్రమున విశ్రాంతి తీసికొనెను. 1

మూ. తస్య విశ్రమమాణస్య శునఃశేఫో మహాయశాః,
పుష్కరక్షేత్రమాగమ్య విశ్వామిత్రం దదర్శ హ, 2
తప్యన్తమృషిభిస్సార్ధం మాతులం పరమాతురః.

ప్ర. అ. తస్య = ఆతడు, విశ్రమమాణస్య = విశ్రాంతి తీసికొనుచుండగా, మహాయశాః=గొప్ప కీర్తి గల, శునఃశేఫః=శునఃశేఫుడు, పరమాతురః=మిక్కిలి బాధపడుచున్నవాడై, పుష్కరక్షేత్రమ్ = పుష్కరక్షేత్రమును గూర్చి, ఆగమ్య= వచ్చి, ఋషిభిః సార్ధమ్ = ఋషులతో కూడ, తప్యన్తమ్=తపస్సు చేయుచున్న, మాతులమ్ = తన మేనమామ యైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, దదర్శ హ = చూచెను.

తా. ఆ రాజు విశ్రాంతి తీసికొనుచున్న సమయమున మహాయశస్వి యగు ఆ శునఃశేఫుడు మనస్సులో చాల బాధపడుచు, ఆ పుష్కరక్షేత్రమునందు ఇతరఋషులతో కలిసి తపస్సు చేసుకొనుచున్న మేనమామ యగు విశ్వామిత్రుని దర్శనము చేసెను. 2

మూ. వివర్ణవదనో దీనస్తృష్ణయా చ శ్రమేణ చ, 3
పపాతాఙ్కే మునేరాశు వాక్యం చేదమువాచ హ.

ప్ర. అ. తృష్ణయా చ = దప్పికచేతను, శ్రమేణ చ = శ్రమచేతను, విషణ్ణవదనః = రంగు మారిన ముఖముకలవాడై, దీనః = దీనుడై, ఆశు = శీఘ్రముగా, మునేః = మునియొక్క, అఙ్కే = ఒడిలో, పపాత = పడెను. ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. దప్పికచేతను, అలనటచేతను ఎండిపోయిన ముఖముతో, శీఘ్రముగా విశ్వామిత్రుని ఒడిలో పడి ఇట్లు పలికెను. 3

మూ. న మేఽస్తి మాతా న పితా జ్ఞాతయో బాన్ధవాః కుతః, 4
త్రాతుమర్హసి మాం సౌమ్య ధర్మేణ మునిపుఙ్గవ.

ప్ర. అ. సౌమ్య = శాంతుడ వైన, మునిపుఙ్గవ = ఓ మునిశ్రేష్ఠా, మే = నాకు, మాతా = తల్లి, నాస్తి = లేదు. పితా = తండ్రి, న = లేదు. జ్ఞాతయః = జ్ఞాతులును, బాన్ధవాః = బంధువులును, కుతః = ఎక్కడ ? మామ్ = నన్ను, ధర్మేణ = ధర్మముచేత, త్రాతుమ్ = రక్షించుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ మహామునీ ! నాకు తల్లి లేదు. తండ్రి లేదు. ఇంక జ్ఞాతు లైన ఇతర బంధువు లెక్కడ ? అందుచే నన్ను ధర్మానుసారముగా రక్షింపుము. 4

మూ. త్రాతా త్వం హి మునిశ్రేష్ఠ సర్వేషాం త్వం హి భావనః. 5
రాజా చ కృతకార్యః స్యాదహం దీర్ఘాయురవ్యయః,
స్వర్గలోకముపాశ్నీయాం తప స్తప్త్వా హ్యనుత్తమమ్. 6

ప్ర. అ. మునిశ్రేష్ఠ = ఓ మునిశ్రేష్ఠుడా ! త్వమ్ = నీవు, సర్వేషామ్ = అందరికిని, త్రాతా హి = రక్షకుడవు కదా ? త్వమ్ = నీవు, భావనః హి = హితము చేయువాడవు కదా ? రాజా చ = రాజు, కృతకార్యః = చేయబడిన కార్యము కలవాడు, స్యాత్ = అగుగాక. అహమ్ = నేను, దీర్ఘాయుః = దీర్ఘాయుర్దాయము కలవాడనై, అవ్యయః = నాశములేనివాడనై, అనుత్తమమ్ = గొప్ప, తపః = తపస్సు, తప్త్వా = చేసి, స్వర్గలోకమ్ = స్వర్గలోకమును, ఉపాశ్నీయామ్ = అనుభవించెదను గాక.

తా. ఓ మహామునీ ! నీవు అందరిని రక్షించువాడవు. అందరికిని హితము చేకూర్చువాడవు. రాజు కార్యము సఫల మగునట్లును, నేను దీర్ఘాయుర్దాయవంతుడనై, తపస్సు చేసి స్వర్గము చేరకల్గు నట్లును చేయుము. 5, 6

మూ. త్వం మే నాథో హ్యనాథస్య భవ భవ్యేన చేతసా,
పితేవ పుత్రం ధర్మాత్మంస్త్రాతుమర్హసి కిల్బిషాత్. 7

ప్ర. అ. అనాథస్య = రక్షకుడు లేని, మే = నాకు, త్వమ్ = నీవు, భవ్యేన = మంగళకర మైన, చేతసా = చిత్తముతో, నాథః = రక్షకుడవుగా, భవ = అగుము. ధర్మాత్మన్ = ధర్మాత్ముడా ! పితా = తండ్రి, పుత్రమివ = పుత్రుని వలె, కిల్బిషాత్ = పాపమునుండి, త్రాతుమ్ = రక్షించుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ ధర్మాత్మా ! మంగళకర మైన చిత్తముతో, నాథుడు లేని నాకు నాథుడ వగుము. తండ్రి కుమారుని రక్షించి నట్లు నన్ని ఆపదనుండి రక్షింపుము. 7

మూ. తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రో మహాతపాః,
సాన్త్వయిత్వా బహువిధం పుత్రానిదమువాచ హ. 8

ప్ర. అ. మహాతపాః = గొప్ప తపస్సు గల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, తస్య = ఆతనియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, బహువిధమ్ = అనేక విధములుగా, సాన్త్వయిత్వా = ఓదార్చి, పుత్రాన్ = పుత్రులను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. ఆతని మాటలు విన్న విశ్వామిత్ర మహాముని ఆతనిని బహువిధముల ఓదార్చి తన పుత్రులతో ఇట్లనెను. 8

మూ. యత్కృతే పితరః పుత్రాన్ జనయన్తి శుభార్థినః,
పరలోకహితార్థాయ తస్య కాలోఽయమాగతః. 9

ప్ర. అ. శుభార్థినః = శుభమును కోరు, పితరః = తలిదండ్రులు, యత్కృతే = దేని కొరకై, పరలోకహితార్థాయ = పరలోకమునందు హిత

మనెడు ప్రయోజనము కొరకై, పుత్రాన్ = పుత్రులను, జనయన్తి = కను చుందురో, తస్య = దానికి, అయమ్ = ఈ, కాలః = కాలము, ఆగతః = వచ్చినది.

తా. మంగళమును కోరు తలిదండ్రులు ఏ పరలోకహితమును కోరి పుత్రులను కనుచుందురో దానిని సాధించు సమయము ఇప్పుడు వచ్చినది. 9

మూ. అయం బాలో మునిసుతో మత్తః శరణమిచ్ఛతి,
అస్య జీవితమాత్రేణ ప్రియం కురుత పుత్రకాః. 10

ప్ర. అ. మునిసుతః = మునికుమారు డైన, అయమ్ = ఈ, బాలః = బాలుడు, మత్తః = నానుండి, శరణమ్ = శరణమును, ఇచ్ఛతి = కోరుచున్నాడు. పుత్రకాః = పుత్రులారా ! అస్య = వీనికి, జీవితమాత్రేణ = జీవితమును మాత్ర మిచ్చుటచేత, ప్రియమ్ = ప్రియమును, కురుత = చేయుడు.

తా. మునిసుతు డైన ఈ బాలుడు రక్షింపు మని నన్ను వేడుచున్నాడు. పుత్రులారా ! ఈతనికి జీవితదానము చేసి ప్రియము చేకూర్చుడు. 10

మూ. సర్వే సుకృతకర్మాణః సర్వే ధర్మపరాయణాః,
పశుభూతా నరేన్ద్రస్య తృప్తిమగ్నేః ప్రయచ్ఛత. 11

ప్ర. అ. సర్వే = మీరందరును, సుకృతకర్మాణః = పుణ్యకర్మ కల వారు. సర్వే = మీరందరును, ధర్మపరాయణాః = ధర్మమునం దాసక్తి కల వారు. నరేన్ద్రస్య = రాజునకు, పశుభూతాః = యజ్ఞపశువులై, అగ్నేః = అగ్నికి, తృప్తిమ్ = తృప్తిని, ప్రయచ్ఛత = ఇవ్వండి.

తా. ధర్మపరాయణు లైన మీ రందరును పుణ్యకర్మలు చేసి ఉన్నారు. మీరు రాజునకు యజ్ఞపశువులుగా అయి అగ్నికి తృప్తి కలిగింపుడు. 11

మూ. నాథవాంశ్చ శునఃశేఫో యజ్ఞశ్చావిఘ్నితో భవేత్,
దేవతాస్తర్పితాశ్చ స్యుర్మమ చాపి కృతం వచః. 12

ప్ర. అ. శునఃశేఫః = శునశ్శేఫుడు, నాథవాన్ చ = రక్షకుడు కలవాడు (అగును). యజ్ఞశ్చ = యజ్ఞము కూడ, అవిఘ్నితః = విఘ్నము లేనిది, భవేత్ =

అగును. దేవతాః = దేవతలు, తర్పితాః = తృప్తి పొందింపబడినవారు, స్యుః= అగుదురు. మమ = నాయొక్క, వచః చ = మాట కూడ, కృతమ్ = చేయబడిన దగును.

తా. మీ రట్లు చేసినచో శునఃశేపునకు రక్షణ ఇచ్చి నట్లగును; యజ్ఞము నిర్విఘ్నముగ కొనసాగును; దేవతలకు తృప్తి లభించును; నే నిచ్చిన మాట నిలబెట్టుకొని నట్లగును. 12

మూ. మునేస్తు వచనం శ్రుత్వా మధుష్యన్దాదయః సుతాః,
సాభిమానం నరశ్రేష్ఠ సలీలమిదమబ్రువన్. 13

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా ! మధుష్యన్దాదయః = మధుష్యందుడు మొదలైన, సుతాః = కుమారులు, మునేః = మునియొక్క, వచనమ్= వచనమును, శ్రుత్వా=విని, సాభిమానమ్=అహంకారపూర్వకముగా, సలీలమ్= పరిహాసపూర్వకముగా, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రువన్ = పలికిరి.

తా. రామా ! విశ్వామిత్రుని మాటలు విని ఆతని కుమారు లైన మధుష్యందాదులు అహంకారముతో పరిహాసపూర్వకముగా ఇట్లనిరి. 13

మూ. కథమాత్మసుతాన్హిత్వా త్రాయసేఽన్యసుతం విభో,
అకార్యమివ పశ్యామః శ్వమాంసమివ భోజనే. 14

ప్ర. అ. విభో = ఓ ప్రభూ ! ఆత్మసుతాన్=తన కుమారులను, హిత్వా= విడచి, అన్యసుతమ్ = ఇతరుల కుమారుని, కథమ్ = ఎట్లు, త్రాయసే=రక్షించుచున్నావు ? భోజనే = భోజనమునందు, శ్వమాంసమివ=కుక్కమాంసమును వలె, అకార్యమివ = చేయకూడని కార్యమునుగా, పశ్యామః = చూచుచున్నాము.

తా. తండ్రీ ! తన కుమారులను త్యజించి ఇతరుల కుమారుని రక్షించుట శ్వమాంసము భుజించుటవంటి దని మా అభిప్రాయము. 14

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా పుత్రాణాం మునిపుఙ్గవః,
క్రోధసంరక్తనయనో వ్యాహర్తుముపచక్రమే. 15

ప్ర. అ. మునిపుఙ్గవః = ఆ మునిశ్రేష్ఠుడు, తేషామ్ = ఆ, పుత్రాణామ్ = పుత్రులయొక్క, తద్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, క్రోధసంరక్తనయనః = క్రోధముచే ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, వ్యాహర్తుమ్ = పలుకుటకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. విశ్వామిత్రుడు పుత్రుల మాటలు విని, క్రోధముచే ఎఱ్ఱబారిన కండ్లతో వారితో నిట్లనెను. 15

మూ. నిస్సాధ్వసమిదం ప్రోక్తం ధర్మాదపి విగర్హితమ్,
అతిక్రమ్య తు మద్వాక్యం దారుణం రోమహర్షణమ్. 16

ప్ర. అ. మద్వాక్యమ్ = నామాటను, అతిక్రమ్య = అతిక్రమించి, ధర్మాదపి = ధర్మానుసారముగా కూడ, విగర్హితమ్ = నింద్య మైనదియు, దారుణమ్ = భయంకర మైనదియు, రోమహర్షణమ్ = గగుర్పాటు కలిగించునదియు, అగు, ఇదమ్ = ఈ వాక్యము, నిస్సాధ్వసమ్ = భయము లేకుండగా, ప్రోక్తమ్ = పలకబడినది.

తా. మీరు నా మాటను అతిక్రమించుటయే కాక, ఎట్టి సంకోచము లేక ధర్మవిరుద్ధమును, భయంకరమును అగు ఈ వాక్యమును పలికినారు. 16

మూ. శ్వమాంసభోజినః సర్వే వాసిష్ఠా ఇవ జాతిషు,
పూర్ణం వర్షసహస్రం తు పృథివ్యామనువత్స్యథ. 17

ప్ర. అ. సర్వే = మీరందరును, శ్వమాంసభోజినః = కుక్కమాంసమును తినుచు, పూర్ణం వర్షసహస్రమ్ = పూర్తిగా వేయి సంవత్సరములు, పృథివ్యామ్ = భూమియందు, వాసిష్ఠాః ఇవ = వసిష్ఠకుమారులు వలె, జాతిషు = ముష్టికులను జాతులలో, అనువత్స్యథ = ఉండగలరు.

తా. మీ రందరును వసిష్ఠకుమారుల వలె ముష్టికజాతులందు పుట్టి, కుక్కమాంసమును తినుచు పూర్తిగా వేయి సంవత్సరముల పాటు భూమిపై సంచరించగలరు. 17

మూ. కృత్వా శాపసమాయుక్తాన్ పుత్రాన్ మునివర స్తదా,
శునఃశేఫమువాచార్తం కృత్వా రక్షాం నిరామయమ్. 18

ప్ర. అ. మునివరః = ఆ మునిశ్రేష్ఠుడు, పుత్రాన్ = పుత్రులను, శాపసమాయుక్తాన్ = శాపముతో కూడినవారినిగా, కృత్వా = చేసి, తదా = అప్పుడు, నిరామయమ్ = బాధ లేని విధముగా, రక్షామ్ = రక్షను, కృత్వా = చేసి, ఆర్తమ్ = దుఃఖితు డైన, శునఃశేఫమ్ = శునఃశేపుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. విశ్వామిత్రుడు పుత్రులను ఈ విధముగ శపించి, దుఃఖితు డైన శునఃశేపునకు ఎట్టి బాధయు లేకుండు నట్లు మంత్రాదులచే రక్ష చేసి ఆతనితో ఇట్లనెను. 18

మూ. పవిత్రపాశైరాసక్తో రక్తమాల్యానులేపనః,
వైష్ణవం యూపమాసాద్య వాగ్భిరగ్నిముదాహర. 19

ప్ర. అ. వైష్ణవం యూపమ్ = విష్ణుదేవతాక మైన యూప స్తంభమును, ఆసాద్య = పొంది, పవిత్రపాశైః = పవిత్ర మైన పాశములచే, ఆసక్తః = కట్టబడిన, రక్తమాల్యానులేపనః=ఎఱ్ఱని మాలలు, మైపూతయు గల నీవు, వాగ్భిః = (నే చెప్పబోవు) వాక్కులతో, అగ్నిమ్ = అగ్నిని, ఉదాహర = చెప్పుము (స్తుతింపుము).

తా. నీకు ఎఱ్ఱని పుష్పమాలలు వేసి, ఎఱ్ఱని మైపూత పూసి, పవిత్రము లైన పాశములతో వైష్ణవయూప స్తంభమునకు కట్టుదురు. అప్పుడు ఈ మంత్రములతో అగ్నిని స్తుతింపుము. 19

మూ. ఇమే తు గాథే ద్వే దివ్యే గాయేథా మునిపుత్రక,
అమ్బరీషస్య యజ్ఞేఽస్మిం స్తతస్సిద్ధిమవాప్స్యసి. 20

ప్ర. అ. మునిపుత్రక = మునికుమారా ! అమ్బరీషస్య = అంబరీషుని యొక్క, అస్మిన్ = ఈ, యజ్ఞే = యజ్ఞమునందు ఇమే = ఈ, ద్వే = రెండు,

దివ్యే = దివ్య మైన, గాథే = గాథలను, గాయేథాః = గానము చేయుము. తతః = పిమ్మట, సిద్ధిమ్ = సిద్ధిని, అవాప్స్యసి = పొందగలవు.

తా. ఓ మునికుమారా! అంబరీషుని యజ్ఞములో శ్రేష్ఠము లైన ఈ రెండు మంత్రములను పఠించినచో నీకు కార్యసిద్ధి లభించును. 20

మూ. శునఃశేఫో గృహీత్వా తే ద్వే గాథే సుసమాహితః,
త్వరయా రాజసింహం తమమ్బరీషమువాచ హ. 21

ప్ర. అ. శునఃశేఫః = శునఃశేఫుడు, సుసమాహితః = సావధానచిత్తుడై, తే = ఆ, ద్వే = రెండు, గాథే = గాథలను, గృహీత్వా = గ్రహించి, రాజసింహమ్ = రాజశ్రేష్ఠు డైన, తమ్ = ఆ, అమ్బరీషమ్ = అంబరీషుని, త్వరయా = తొందరతో, ఉవాచ హ = పలికెను.

తా. శునఃశేఫుడు శ్రద్ధాపూర్వకముగ ఆ రెండు మంత్రములను గ్రహించి రాజశ్రేష్ఠు డైన ఆ అంబరీషుని తొందరపెట్టుచు ఇట్లనెను. 21

మూ. రాజసింహ మహాసత్త్వ శీఘ్రం గచ్ఛావహే సదః,
నిర్వర్తయస్వ రాజేన్ద్ర దీక్షాం చ సముపావిశ. 22

ప్ర. అ. మహాసత్త్వ = గొప్ప బలము గల, రాజసింహ = రాజశ్రేష్ఠుడా! సదః = యజ్ఞసదస్సును గూర్చి, శీఘ్రమ్ = శీఘ్రముగా, గచ్ఛావహే = వెళ్లుదము. రాజేన్ద్ర = ఓ రాజేంద్రా! దీక్షామ్ = దీక్షను, నిర్వర్తయస్వ = నడిపింపుము. సముపావిశ = దీక్షలో కూర్చుండుము.

తా. గొప్ప బలము గల రాజశ్రేష్ఠా! యజ్ఞశాలకు శీఘ్రముగా వెళ్లుదము. దీక్షలో కూర్చుండి యజ్ఞము జరిపింపుము. 22

మూ. తద్వాక్యమృషిపుత్రస్య శ్రుత్వా హర్షసముత్సుకః,
జగామ నృపతిః శీఘ్రం యజ్ఞవాటమతన్ద్రితః. 23

ప్ర. అ. నృపతిః = రాజు, ఋషిపుత్రస్య = ఋషిపుత్రునియొక్క, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, హర్షసముత్సుకః = సంతోషముతో

ఉత్సాహవంతుడై, అతన్ద్రితః = ఆలస్యము లేనివాడై, యజ్ఞవాటమ్ = యజ్ఞ వాటమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. ఋషిపుత్రుని మాటలు విన్న ఆ రాజు సంతోషోత్సాహభరితుడై, మాంద్యము లేనివాడై, శీఘ్రముగా యజ్ఞవాటికకు వెళ్లెను. 23

మూ. సదస్యానుమతే రాజా పవిత్రకృతలక్షణమ్,
పశుం రక్తామ్బరం కృత్వా యూపే తం సమబన్ధయత్. 24

ప్ర. అ. రాజా = రాజు, సదస్యానుమతే = సభ్యుల అనుమతిప్రకారము, తమ్ = ఆ శునఃశేపుని, పవిత్రకృతలక్షణమ్ = దర్భపవిత్రముచే ఏర్పరుపబడిన గుర్తు గల, రక్తామ్బరమ్ = ఎఱ్ఱని వస్త్రములు గల, పశుమ్ = పశువునుగా, కృత్వా = చేసి, యూపే = యూపస్తంభమునందు, సమబన్ధయత్ = కట్టించెను.

తా. ఆ రాజు సదస్యుల అనుమతి పొంది, ఆ శునఃశేపునకు దర్భపవిత్రముచే గుర్తు లుంచి, ఎఱ్ఱని వస్త్రము కట్టి, యజ్ఞపశువునుగా ఆతనిని యూపస్తంభమున బంధింపచేసెను. 24

మూ. స బద్ధో వాగ్భిరగ్ర్యాభిరభితుష్టావ వై సురౌ,
ఇన్ద్రమిన్ద్రానుజం చైవ యథావన్మునిపుత్రకః. 25

ప్ర. అ. బద్ధః = కట్టబడిన, సః = ఆ, మునిపుత్రకః = మునికుమారుడు, ఇన్ద్రమ్ = ఇంద్రుని, ఇన్ద్రానుజం చైవ = ఉపేంద్రుని, సురౌ = ఈ ఇద్దరు దేవతలను, అగ్ర్యాభిః = శ్రేష్ఠము లైన, వాగ్భిః = వాక్కులచేత, యథావత్ = యథాశాస్త్రముగా, అభితుష్టావ = స్తుతించెను.

తా. యూపమున బంధింపబడిన ఆ మునికుమారుడు ఇంద్రుని, ఉపేంద్రుని శ్రేష్ఠము లైన వాక్కులతో యథాశాస్త్రముగా స్తుతించెను. 25

మూ. తతః ప్రీతః సహస్రాక్షో రహస్యస్తుతితర్పితః,
దీర్ఘమాయుస్తదా ప్రాదాచ్ఛునఃశేఫాయ రాఘవ. 26

ప్ర. అ. రాఘవ = రామా ! తతః = పిమ్మట, రహస్యస్తుతితర్పితః = రహస్యముగా స్తుతించుటచే తృప్తిపొందింపబడిన, సహస్రాక్షః = దేవేంద్రుడు, ప్రీతః = సంతసించినవాడై, తదా = అప్పుడు, శునఃశేఫాయ=శునఃశేపునకు, దీర్ఘమ్ = దీర్ఘమైన, ఆయుః = ఆయుర్దాయమును, ప్రాదాత్ = ఇచ్చెను.

తా. రామా ! రహస్యముగా చేసిన స్తుతికి సంతసించి దేవేంద్రుడు శునఃశేపునకు దీర్ఘాయువును ప్రసాదించెను. 26

మూ. స చ రాజా నరశ్రేష్ఠ యజ్ఞస్య చ సమాప్తవాన్,
ఫలం బహుగుణం రామ సహస్రాక్షప్రసాదజమ్. 27

ప్ర. అ. నరశేష్ఠ=నరులలో శ్రేష్ఠుడవైన, రామ=రామా ! సః=ఆ, రాజా చ=రాజు కూడ, సహస్రాక్షప్రసాదజమ్ = దేవేంద్రుని అనుగ్రహము వలన కలిగిన, బహుగుణమ్ = చాలరెట్లైన, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, ఫలమ్=ఫలమును, సమాప్తవాన్=పొందినాడు.

తా. నరశ్రేష్ఠుడవైన రామా ! అంబరీషమహారాజునకు దేవేంద్రుని అనుగ్రహముచే ఎన్నో రెట్లు యజ్ఞఫలము లభించెను. 27

మూ. విశ్వామిత్రోఽపి ధర్మాత్మా భూయస్తేపే మహాతపాః,
పుష్కరేషు నరశ్రేష్ఠ దశవర్షశతాని చ. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ద్విషష్టితమః సర్గః.

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా ! ధర్మాత్మా = ధర్మాత్ముడును, మహాతపాః = గొప్ప తపస్సు కలవాడును అగు, విశ్వామిత్రోఽపి = విశ్వామిత్రుడు కూడ, పుష్కరేషు = పుష్కరమునందు, దశవర్షశతాని = వేయి సంవత్సరములు, భూయః = మరల, తేపే = తపస్సు చేసెను.

తా. రామా ! మహాతపఃశాలియు, ధర్మాత్ముడును అగు విశ్వామిత్రుడు పుష్కరక్షేత్రమునందు మరల వేయి సంవత్సరములపాటు తపస్సు చేసెను. 28

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండలో
అరువది రెండవ సర్గ సమాప్తము.

అథ త్రిషష్టితమః సర్గః

మూ. పూర్ణే వర్షసహస్రే తు వ్రతస్నాతం మహామునిమ్,
అభ్యాగచ్ఛన్ సురాః సర్వే తపఃఫలచికీర్షవః. 1

ప్ర. అ. వర్షసహస్రే = వేయి సంవత్సరముల కాలము, పూర్ణే=నిండిన దగుచుండగా, సర్వే = సమస్త మైన, సురాః = దేవతలు, తపః ఫలచికీర్షవః = తపస్సునకు ఫలమును ఇవ్వగోరినవారై, వ్రతస్నాతమ్ = వ్రతాంతమునందు స్నానము చేసిన, మహామునిమ్ = విశ్వామిత్రుని, అభ్యాగచ్ఛన్ = సమీపించిరి.

తా. వేయి సంవత్సరములు గడచిన పిమ్మట ఆ మహాముని వ్రతము పూర్తి చేసికొని యుండగా దేవతల లందరును ఆతని తపస్సునకు ఫలము ఇవ్వ గోరి వచ్చిరి. 1

మూ. అబ్రవీత్సుమహాతేజా బ్రహ్మా సురుచిరం వచః,
ఋషిస్త్వమసి భద్రం తే స్వార్జితైః కర్మభిః శుభైః. 2

ప్ర. అ. సుమహాతేజాః = గొప్ప తేజస్సు గల, బ్రహ్మా = బ్రహ్మ, సురుచిరమ్ = చాల అంద మైన, వచః = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. త్వమ్= నీవు, స్వార్జితైః = నీచేత సంపాదింపబడిన, శుభైః కర్మభిః = పుణ్య కర్మలచే, ఋషిః అసి = ఋషి అయితివి. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. మహాతేజస్సు గల బ్రహ్మ— "నీవు ఆచరించిన శుభకర్మలచేత, ఋషి వయినావు. నీకు క్షేమ మగుగాక" అని విశ్వామిత్రునితో మధుర మైన వాక్యమును పలికెను. 2

మూ. తమేవముక్త్వా దేవేశస్త్రిదివం పునరభ్యగాత్,
విశ్వామిత్రో మహాతేజా భూయస్తేపే మహత్తపః. 3

ప్ర. అ. దేవేశః = దేవతల ప్రభు వైన బ్రహ్మ, తమ్ = ఆతనిని గూర్చి, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, పునః = తిరిగి, త్రిదివమ్ = స్వర్గమును

గూర్చి, అభ్యగాత్ = వెళ్లెను. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, విశ్వామిత్రః= విశ్వామిత్రుడు, భూయః = మరల, మహత్ = గొప్ప, తపః=తపస్సును, తేపే= చేసెను.

తా. బ్రహ్మదేవుడు విశ్వామిత్రునితో ఇట్లు పలికి స్వర్గమునకు వెళ్లి పోయెను. గొప్ప తేజస్సు గల విశ్వామిత్రుడు మరల గొప్ప తపస్సు చేసెను.

వి. ఈ శ్లోకములో "విశ్వామిత్రః" అనుపదములో 'వి' అని గాయత్రీ మంత్రములోని మూడవ అక్షరము గ్రహింపబడినది. 3

మూ. తతః కాలేన మహతా మేనకా పరమాప్సరాః,

పుష్కరేషు నరశ్రేష్ఠ స్నాతుం సముపచక్రమే. 4

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడా ! తతః=పిమ్మట, మహతా= గొప్ప, కాలేన=కాలముచేత, మేనకా=మేనక యనెడు, పరమాప్సరాః=గొప్ప అప్సరస్త్రీ, పుష్కరేషు=పుష్కరమునందు, స్నాతుమ్ = స్నానముచేయుటకు, సముపచక్రమే=ప్రారంభించెను.

తా. రామా ! పిమ్మట చాలకాలమునకు మేనక యనెడు గొప్ప అప్సరస పుష్కరమునందు స్నాన మాడ మొదలిడెను. 4

మూ. తాం దదర్శ మహాతేజా మేనకాం కుశికాత్మజః,

రూపేణాప్రతిమాం తత్ర విద్యుతం జలదే యథా. 5

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, కుశికాత్మజః=విశ్వామిత్రుడు, తత్ర=ఆ పుష్కరమునందు, జలదే=మేఘమునందు, విద్యుతం యథా=మెరుపు వలె నున్న, రూపేణ=రూపముచేత, అప్రతిమామ్=సాటి లేని, తామ్=ఆ, మేనకామ్=మేనకను, దదర్శ=చూచెను.

తా. మహాతేజశ్శాలి యగు విశ్వామిత్రుడు, ఆ పుష్కరతీర్థములో, మేఘములో మెరుపు వలె నున్న, సాటి లేని రూపము గల ఆ మేనకను చూచెను. 5

మూ. దృష్ట్వా కన్దర్పవశగో మునిస్తామిదమబ్రవీత్,
అప్సరః స్వాగతం తేఽస్తు వస చేహ మమాశ్రమే, 6
అనుగృహ్ణీష్వ భద్రం తే మదనేన సుమోహితమ్.

ప్ర. అ. దృష్ట్వా=చూచి, మునిః=ముని, కన్దర్పవశగః=మన్మథునకు వశ మైనవాడై, తామ్=ఆమెను గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. అప్సరః=ఓ అప్సరసా ! తే=నీకు, స్వాగతమ్ అస్తు=స్వాగత మగుగాక. మమ=నాయొక్క, ఇహ=ఈ, ఆశ్రమే=ఆశ్రమమునందు, వస చ = నివసింపుము. మదనేన=మన్మథునిచేత, సుమోహితమ్=అధికముగా మోహితుడనైన నన్ను, అనుగృహ్ణీష్వ=అనుగ్రహింపుము. తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక.

తా. ఆమెను చూడగనే కామపరవశు డైన విశ్వామిత్రుడు ఆమెతో ఇట్లనెను — "ఓ ! అప్సరసా ! నీకు స్వాగతము. నా యీ ఆశ్రమములో నివసింపుము. మన్మథునిచే మిక్కిలి మోహితుడ నైన నన్ను అనుగ్రహింపుము. నీకు క్షేమ మగుగాక." 6

మూ. ఇత్యుక్తా సా వరారోహా తత్ర వాసమథాకరోత్. 7
తస్యాం వసన్త్యాం వర్షాణి పఞ్చ పఞ్చ చ రాఘవ,
విశ్వామిత్రాశ్రమే రామ సుఖేన వ్యతిచక్రముః. 8

ప్ర. అ. రాఘవ = రామా ! సా = ఆ, వరారోహా = స్త్రీ, ఇతి = ఇట్లు, ఉక్తా=పలకబడినదై, అథ=పిమ్మట, తత్ర=అచట, వాసమ్=నివాసమును, అకరోత్ = చేసెను. రామ = రామా ! తస్యామ్ = ఆమె, విశ్వామిత్రాశ్రమే = విశ్వామిత్రుని ఆశ్రమమునందు, వసన్త్యామ్=నివసించుచుండగా, పఞ్చ పఞ్చ చ= పది, వర్షాణి=సంవత్సరములు, సుఖేన = సుఖముగా, వ్యతిచక్రముః = గడచిపోయినవి.

తా. విశ్వామిత్రు డిట్లు పలుకగా ఆ అప్సరస అచట నివసించెను. ఆమె విశ్వామిత్రాశ్రమములో నివసించుచుండగా పది సంవత్సరములు సుఖముగ గడచిపోయినవి. 7, 8

మూ. అథ కాలే గతే తస్మిన్విశ్వామిత్రో మహామునిః,
సవ్రీళ ఇవ సంవృత్తశ్చిన్తాశోకపరాయణః. 9

ప్ర. అ. అథ = పిమ్మట, తస్మిన్ కాలే = ఆ (పది సంవత్సరముల) కాలము, గతే = గడచిపోయిన దగుచుండగా, మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, చిన్తాశోకపరాయణః = చింతాశోకములతో కూడిన వాడై, సవ్రీళ ఇవ = సిగ్గు కలవాడుగా, సంవృత్తః = అయినాడు.

తా. పది సంవత్సరములు గడచిన తరువాత విశ్వామిత్రమహాముని చింతాదుఃఖములతో నిండినవాడై సిగ్గుపడెను. 9

మూ. బుద్ధిర్మునేః సముత్పన్నా సామర్షా రఘునన్దన,
సర్వం సురాణాం కర్మైతత్తపోపహరణం మహత్. 10

ప్ర. అ. రఘునన్దన = రామా ! మునేః = మునికి, సామర్షా = కోపముతో కూడిన, బుద్ధిః = బుద్ధి, సముత్పన్నా = పుట్టినది. ఏతత్ సర్వమ్ = ఇది యంతయు, మహత్ = గొప్పదైన, తపోపహరణమ్ = తపస్సును అపహరించు, సురాణామ్ = దేవతలయొక్క, కర్మ = కర్మ.

తా. రామా ! అపుడు విశ్వామిత్రునకు కోపముతో కూడిన ఆలోచన ఒకటి కలిగినది — "ఇది అంతయు, నా తపస్సు హరించుటకై దేవతలు చేసిన పని." 10

మూ. అహోరాత్రాపదేశేన గతాః సంవత్సరా దశ,
కామమోహాభిభూతస్య విఘ్నోఽయం సముపస్థితః. 11

ప్ర. అ. కామమోహాభిభూతస్య = కామమోహములచేత ఆవహింపబడిన నాకు, దశ సంవత్సరాః = పది సంవత్సరములు, అహోరాత్రాపదేశేన = పగళ్లు రాత్రులు అను మిషచేత, గతాః = గడచిపోయినవి. అయమ్ = ఈ, విఘ్నః = విఘ్నము, సముపస్థితః = వచ్చినది.

తా. పగలు, రాత్రి అని అనుకొనుచుండగనే కామమోహములో చిక్కు-

కొనియున్న నాకు పది సంవత్సరములు గడచిపోయినవి. ఈ విధముగ పెద్ద విఘ్నము వచ్చి పడినది. 11

మూ. వినిశ్శ్వసన్మునివరః పశ్చాత్తాపేన దుఃఖితః,
భీతామప్సరసం దృష్ట్వా వేపన్తీం ప్రాఞ్జలిం స్థితామ్. 12

మేనకాం మధురైర్వాక్యైర్విసృజ్య కుశికాత్మజః,
ఉత్తరం పర్వతం రామ విశ్వామిత్రో జగామ హ. 13

ప్ర. అ. రామ = రామా! మునివరః = మునిశ్రేష్ఠుడైన, కుశికాత్మజః = కుశికుని కుమారుడైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, పశ్చాత్తాపేన = పశ్చాత్తాపముచేత, దుఃఖితః = దుఃఖించినవాడై, వినిశ్శ్వసన్ = నిట్టూర్చుచు, భీతామ్ = భయపడినదియు, ప్రాఞ్జలిం స్థితామ్ = దోసిలికట్టి నిలచినదియు, వేపన్తీమ్ = వణకుచున్నదియు, అప్సరసమ్ = అప్సరస యైన, మేనకామ్ = మేనకను, దృష్ట్వా = చూచి, మధురైః = మధురములైన, వాక్యైః = వాక్యముల చేత, విసృజ్య = విడచి, ఉత్తరం పర్వతమ్ = హిమవత్పర్వతమును గూర్చి, జగామ హ = వెళ్లెను.

తా. రామా! విశ్వామిత్రమహాముని పశ్చాత్తాపముచే పీడితుడై, నిట్టూర్చుచున్నవాడై, తన ఎదుట అంజలి ఘటించి వణకుచు నిలచిన మేనక భయపడినదని గ్రహించి, ఆమెను తీయని మాటలతో పంపివేసి, హిమవత్పర్వతమునకు వెళ్లెను. 12, 13

మూ. స కృత్వా నైష్ఠికీం బుద్ధిం జేతుకామో మహాయశాః,
కౌశికీతీరమాసాద్య తపస్తేపే సుదారుణమ్. 14

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, సః = ఆతడు, నైష్ఠికీమ్ = నిష్ఠకు సంబంధించిన, బుద్ధిమ్ = బుద్ధిని, కృత్వా = చేసి, జేతుకామః = జయింపవలెనను కోరిక గలవాడై, కౌశికీతీరమ్ = కౌశికీనదీతీరమును, ఆసాద్య = పొంది, సుదారుణమ్ = మిక్కిలి భయంకరమైన, తపః = తపస్సును, తేపే = చేసెను.

తా. విశ్వామిత్రుడు నిష్ఠ నవలంబింపవలె నని దృఢనిశ్చయము చేసికొని, ఇంద్రియములను (లేదా వసిష్ఠుని) జయింపగోరుచున్నవాడై, కౌశికీనదీతీరము చేరి అతితీవ్ర మైన తపస్సు చేసెను. 14

మూ. తస్య వర్షసహస్రం తు ఘోరం తప ఉపాసతః,
ఉత్తరే పర్వతే రామ దేవతానామభూద్భయమ్. 15

ప్ర. అ. రామ = రామా ! తస్య = అతడు, ఉత్తరే పర్వతే = హిమవత్పర్వతముమీద, వర్షసహస్రమ్ = వేయిసంవత్సరములు, ఘోరమ్ = ఘోరమైన, తపః = తపస్సును, ఉపాసతః = చేయుచుండగా, దేవతానామ్ = దేవతలకు, భయమ్ = భయము, అభూత్ = కలిగెను.

తా. విశ్వామిత్రుడు హిమవత్పర్వతముపై వేయి సంవత్సరముల పాటు ఘోరమైన తపస్సు చేయుచుండగా దేవతలకు భయము కలిగెను. 15

మూ. ఆమన్త్రయన్ సమాగమ్య సర్వే సర్షిగణాః సురాః,
మహర్షిశబ్దం లభతాం సాధ్వయం కుశికాత్మజః. 16

ప్ర. అ. సర్షిగణాః = ఋషిగణములతో కూడిన, సర్వే = సమస్త మైన, సురాః = దేవతలు, సమాగమ్య = కలిసి, అయమ్ = ఈ, కుశికాత్మజః = విశ్వామిత్రుడు, సాధు = బాగుగా, మహర్షిశబ్దమ్ = మహర్షి అను పేరును, లభతామ్ = పొందుగాక అని, ఆమంత్రయన్ = ఆలోచించిరి.

తా. ఋషులును దేవత లందరును కలిసి ఈ విశ్వామిత్రుని "మహర్షి" అనవచ్చును అని నిశ్చయించిరి. 16

మూ. దేవతానాం వచః శ్రుత్వా సర్వలోకపితామహః,
అబ్రవీన్మధురం వాక్యం విశ్వామిత్రం తపోధనమ్. 17

ప్ర. అ. సర్వలోకపితామహః = బ్రహ్మదేవుడు, దేవతానామ్ = దేవతల యొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, తపోధనమ్ = తపస్సే ధనముగా గల, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, మధురమ్ = మధురమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. దేవతల అభిప్రాయము ననుసరించి బ్రహ్మదేవుడు విశ్వామిత్రునితో మధుర మైన వాక్యము పలికెను. 17

మూ. మహర్షే స్వాగతం వత్స తపసోగ్రేణ తోషితః,
మహత్త్వమృషిముఖ్యత్వం దదామి తవ కౌశిక. 18

ప్ర. అ. మహర్షే = మహర్షీ ! వత్స = నాయనా ! స్వాగతమ్ = స్వాగత మగుగాక. ఉగ్రేణ = ఉగ్ర మైన, తపసా = తపస్సుచేత, తోషితః = సంతోషింప చేయబడితిని. కౌశిక = విశ్వామిత్రా ! తవ = నీకు, మహత్త్వమ్ = గొప్ప తనమును, ఋషిముఖ్యత్వమ్ = ఋషులలో శ్రేష్ఠత్వమును, దదామి = ఇచ్చు చున్నాను.

తా. మహర్షీ ! నీవు చేసిన ఉగ్ర తపస్సుకు సంతోషించినాను. నీకు మహత్త్వమును, ఋషిత్వమును, (అనగా మహర్షిత్వమును) ఇచ్చుచున్నాను. 18

మూ. బ్రహ్మణః స వచః శ్రుత్వా సర్వలోకేశ్వరస్య హ,
న విషణ్ణో న సన్తుష్టో విశ్వామిత్రస్తపోధనః. 19

ప్ర. అ. తపోధనః = తపోధను డైన, సః = ఆ, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, సర్వలోకేశ్వరస్య = సర్వలోకాధిపతి యైన, బ్రహ్మణః = బ్రహ్మ యొక్క, వచః = వాక్కును, శ్రుత్వా = విని, న విషణ్ణః = విషాదము పొంద లేదు. న సన్తుష్టః = సంతోషించ లేదు.

తా. సర్వలోకాధీశ్వరు డైన బ్రహ్మ మాటలను విన్న ఆ విశ్వామిత్ర మహామునికి విషాదము కలుగలేదు. సంతోషము కలుగలేదు. 19

మూ. ప్రాఞ్జలిః ప్రణతో భూత్వా సర్వలోకపితామహమ్,
ప్రత్యువాచ తతో వాచం విశ్వామిత్రో మహామునిః. 20

ప్ర. అ. తతః = పిమ్మట, మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, ప్రణతః = నమ్రుడుగా,

భూత్వా = అయి, సర్వలోకపితామహమ్ = బ్రహ్మదేవుని గూర్చి, వాచమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. పిమ్మట ఆ విశ్వామిత్ర మహాముని అంజలి ఘటించి, నమ్రుడై బ్రహ్మదేవునితో ఇట్లనెను. 20

మూ. మహర్షిశబ్దమతులం స్వార్జితైః కర్మభిః శుభైః,
యది మే భగవానాహ తతోఽహం విజితేన్ద్రియః. 21

ప్ర. అ. భగవాన్ = పూజ్యుడ వైన నీవు, స్వార్జితైః = నాచే చేయబడిన, శుభైః = శుభము లైన, కర్మభిః = కర్మలచేత, అతులమ్ = సాటిలేని, మహర్షి శబ్దమ్ = 'మహర్షి' అను పేరును, మే = నాకు, ఆహ యది = చెప్పినట్లయితే, తతః = అందువలన, అహమ్ = నేను, విజితేన్ద్రియః = జయింపబడిన ఇంద్రియములు కలవాడను.

తా. నేను చేసిన శుభకర్మలచే నాకు మహర్షిత్వము లభించిన దని పూజ్యుడ వైన నీవు చెప్పుచున్నావు కదా. అందుచే నేను జితేంద్రియుడ నైతిని. 21

మూ. తమువాచ తతో బ్రహ్మా న తావత్త్వం జితేన్ద్రియః,
యతస్వ మునిశార్దూల ఇత్యుక్త్వా త్రిదివం గతః. 22

ప్ర. అ. తతః = పిమ్మట, బ్రహ్మా = బ్రహ్మ, తమ్ = ఆతనిని గూర్చి, ఉవాచ = పలికెను. త్వమ్ = నీవు, జితేన్ద్రియస్తావత్ = ఇంద్రియములను జయించినవాడవు మాత్రము, న = కాదు. మునిశార్దూల = ఓ మునిశ్రేష్ఠుడా ః యతస్వ = ఇంకను ప్రయత్నింపుము. ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, గతః = వెళ్లెను.

తా. "నీవు జితేంద్రియుడవు మాత్రము కావు. ఇంకను ప్రయత్నింపుము" అని బ్రహ్మ విశ్వామిత్రునితో పలికి స్వర్గమునకు వెళ్లెను. 22

మూ. విప్రస్థితేషు దేవేషు విశ్వామిత్రో మహామునిః,
ఊర్ధ్వబాహుర్నిరాలమ్బో వాయుభక్షస్తపశ్చరన్. 23

ప్ర. అ. దేవేషు = దేవతలు, విప్రస్థితేషు సత్సు = ప్రయాణ మైనవా రగుచుండగా, మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, ఊర్ధ్వబాహుః = పైకి ఎత్తబడిన బాహువులు కలవాడై, నిరాలంబః = ఆలంబనము (ఊత) లేనివాడై, వాయుభక్షః = వాయువును భక్షించుచున్నవాడై, తపః చరన్ = తపస్సు చేయుచు ఉండెను.

తా. దేవత లందరును వెడలిపోయిన పిమ్మట, విశ్వామిత్ర మహాముని, చేతులు పైకెత్తి ఆలంబన మేదియు లేకుండ నిలచి, వాయువును మాత్రమే ఆహారముగ గొని తపస్సు చేయ మొదలిడెను. 23

మూ. ఘర్మే పఞ్చతపా భూత్వా వర్షాస్వాకాశసంశ్రయః,
శిశిరే సలిలస్థాయీ రాత్ర్యహాని తపోధనః. 24
ఏవం వర్షసహస్రం హి తపో ఘోరముపాగమత్.

ప్ర. అ. తపోధనః = ఆ విశ్వామిత్రమహర్షి, ఘర్మే = గ్రీష్మర్తువునందు, పఞ్చతపాః = అయిదు అగ్నుల మధ్య తపస్సు చేయువాడు, భూత్వా = అయి, వర్షాసు=వర్షకాలమునందు, ఆకాశ సంశ్రయః=బయటనే నివసించుచు, శిశిరే = శిశిరర్తువునందు, రాత్ర్యహాని = రేయింబగళ్లు, సలిలస్థాయీ = నీటిలో నిలచినవాడై, ఏవమ్ = ఈ విధముగా, వర్షసహస్రమ్ = వేయి సంవత్సరములు, ఘోరమ్ = ఘోర మైన, తతః = తపస్సును, ఉపాగమత్ = పొందెను.

తా. విశ్వామిత్రమహర్షి గ్రీష్మమునందు పంచాగ్నిమధ్య తపస్సు చేయుచు, వర్షాకాలమునందు ఆరుబైటనే వసించుచు, శీతకాలమున రేయింబగళ్లు జలమునందు నిలచుచు, వేయి సంవత్సరములపాటు ఘోరతపస్సు చేసెను. 24

మూ. తస్మిన్ సంతప్యమానే తు విశ్వామిత్రే మహామునౌ, 25
సంభ్రమః సుమహానాసీత్సురాణాం వాసవస్య చ.

ప్ర. అ. మహామునౌ=మహాముని యైన, తస్మిమ్=ఆ, విశ్వామిత్రే=విశ్వామిత్రుడు, సంతప్యమానే = తపము చేయుచుండగా, సురాణామ్ = దేవతలకును, వాసవస్య చ = దేవేంద్రునకును, సుమహాన్ = చాల గొప్ప దైన, సంభ్రమః = భయము, ఆసీత్ = కలిగెను.

తా. విశ్వామిత్రమహాముని ఈ విధముగ తపస్సు చేయుట చూచి దేవేంద్రుడును, దేవతలును చాల భయపడిరి. 25

మూ. రమ్భామప్సరసం శక్రః సహ సర్వైర్మరుద్గణైః,
ఉవాచాత్మహితం వాక్యమహితం కౌశికస్య చ. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రిషష్టితమః సర్గః.

ప్ర. అ. శక్రః=దేవేంద్రుడు, సర్వైః=సమస్త మైన, మరుద్గణైః సహ=దేవతాగణములతో కూడినవాడై, ఆత్మహితమ్ = తనకు హిత మైనదియు, కౌశికస్య = విశ్వామిత్రునకు, అహితం చ = హితము కానిదియు అగు, వాక్యమ్ = వాక్యమును, రమ్భామ్ = రంభ అనెడు, అప్సరసమ్ = అప్సరస్త్రీని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. సకలదేవతాసమేతు డైన దేవేంద్రుడు రంభ యను అప్సరసతో, తనకు హితకరమును, విశ్వామిత్రునకు అహితకరమును అగు వాక్యము పలికెను. 26

"బాలానన్దిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండములో
అరువది మూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃషష్టితమః సర్గః

మూ. సురకార్యమిదం రమ్భే కర్తవ్యం సుమహత్త్వయా,
లోభనం కౌశికస్యేహ కామమోహసమన్వితమ్. 1

ప్ర. అ. రమ్భే = ఓ రంభా ! ఇహ = ఇపుడు, కౌశికస్య=విశ్వామిత్రుని యొక్క, (విశ్వామిత్రుని), కామమోహనమన్వితమ్ = కామముచే కలిగిన మోహముతో కూడుకున్నట్లుగా, లోభనమ్=లోభపెట్టుట యనెడు, సుమహత్ = చాల గొప్పదైన, ఇదమ్=ఈ, సురకార్యమ్=దేవతా కార్యము, త్వయా=నీచేత, కర్తవ్యమ్ = చేయదగినది.

తా. రంభా ! విశ్వామిత్రుని కామమోహితుని చేసి ఆశ కల్పించ వలెను. ఈ గొప్ప దేవతాకార్యమును నీవు చేయవలెను. 1

మూ. తథోక్తా సాప్సరా రామ సహస్రాక్షేణ ధీమతా,
వ్రీళితా ప్రాఞ్జలిర్వాక్యం ప్రత్యువాచ సురేశ్వరమ్. 2

ప్ర. అ. రామ = రామా ! ధీమతా = బుద్ధిమంతుడైన, సహస్రాక్షేణ = దేవేంద్రునిచేత, తథా = ఆ విధముగా, ఉక్తా = పలకబడిన, సా=ఆ, అప్సరాః= అప్సరన, వ్రీళితా = సిగ్గుపడుచున్నదై, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలి కలదై, సురేశ్వరమ్=దేవేంద్రుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. రామా ! ధీమంతుడైన దేవేంద్రుని మాటలు విని రంభ సిగ్గుపడుచు, చేతులు జోడించి ఆతనితో ఇటు పలికెను. 2

మూ. అయం సురపతే ఘోరో విశ్వామిత్రో మహామునిః,
ఘోరముత్సృజతే క్రోధం మయి దేవ న సంశయః. 3
తతో హి మే భయం దేవ ప్రసాదం కర్తు మర్హసి.

ప్ర. అ. సురపతే = ఓ దేవేంద్రా ! అయమ్ = ఈ, మహామునిః = మహా మునియైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, ఘోరః = భయంకరుడు. దేవ = ప్రభూ ! మయి = నాయందు, ఘోరమ్ = భయంకర మైన, క్రోధమ్ = క్రోధమును, ఉత్సృజతే = విడచును. సంశయః = సంశయము, న = లేదు. తతః = ఆకారణమువలన, మే=నాకు, భయమ్=భయము. దేవ=ప్రభూ ! ప్రసాదమ్= అనుగ్రహమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ సురాధీశా ! విశ్వామిత్రమహాముని చాల కోపస్వభావుడు. నాపై తప్పక తన క్రోధమును చూపి నన్ను శపించగలడు. అందుచే నాకు భయము కలుగుచున్నది. నన్ను అనుగ్రహింపుము. 3

మూ. ఏవముక్తస్తయా రామ రమ్భయా భీతయా తదా, 4
తాముువాచ సహస్రాక్షో వేపమానాం కృతాఞ్జలిమ్.

ప్ర. అ. రామ=రామా! భీతయా=భయపడిన, తయా=ఆ, రమ్భయా= రంభచేత, తదా = అప్పుడు, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, సహస్రాక్షః= దేవేంద్రుడు, వేపమానామ్ = వణకుచున్నదియు, కృతాఞ్జలిమ్ = కట్టబడిన దోసిలి గలదియు అగు, తామ్ = ఆమెను గూర్చి, ఉవాచ = పలికెను.

తా. రామా ! రంభ భయముతో వణకుచు, చేతులు జోడించి పలికిన మాటలు విని దేవేంద్రు డిట్లు పలికెను. 4

మూ. మాభైషీ రమ్భే భద్రం తే కురుష్వ మమ శాసనమ్, 5
కోకిలో హృదయగ్రాహీ మాధవే రుచిరద్రుమే,
అహం కన్దర్పసహితః స్థాస్యామి తవ పార్శ్వతః. 6

ప్ర. అ. రమ్భే = ఓ రంభా ! మా భైషీః = భయపడకుము. తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక. మమ = నాయొక్క, శాసనమ్ = ఆజ్ఞను, కురుష్వ= చేయుము. అహమ్ = నేను, రుచిరద్రుమే = అంద మైన వృక్షములు గల, మాధవే = వసంతర్తువునందు, హృదయగ్రాహీ = హృదయము నాకర్షించు, కోకిలః = కోకిలగా అయి, కన్దర్పసహితః = మన్మథసమేతుడనై, తవ = నీ యొక్క, పార్శ్వతః = పార్శ్వమునందు, స్థాస్యామి = ఉండగలను.

తా. ఓ రంభా ! భయపడకుము. నీకు క్షేమ మగును. నా శాసనమును చేయుము. అంద మైన వృక్షములు గల వసంతర్తువునందు కోకిల రూపము ధరించి, నేను మన్మథునితో కూడ నీ ప్రక్కనే ఉందును. 5, 6

మూ. త్వం హి రూపం బహుగుణం కృత్వా పరమభాస్వరమ్,
తమృషిం కౌశికం రమ్భే భేదయస్వ తపస్వినమ్. 7

ప్ర. అ. రమ్భే=రంభా! త్వమ్ = నీవు, బహుగుణమ్=అనేక శృంగార చేష్టాదిగుణములు గల, పరమభాస్వరమ్=మిక్కిలి ప్రకాశించుచున్న, రూపమ్= రూపమును, కృత్వా = చేసికొని, తపస్వినమ్ = తపశ్శాలి యైన, తమ్ = ఆ, ఋషిమ్ = ఋషి యైన, కౌశికమ్ = విశ్వామిత్రుని, భేదయస్వ = (తపస్సునుండి) విడదీయుము.

తా. ఓ రంభా ! అనేక శృంగారచేష్టాదిగుణములు గల చాల ప్రకాశించు రూపము వహించి విశ్వామిత్రమహర్షి తపస్సుకు భంగము చేయుము. 7

మూ. సా శ్రుత్వా వచనం తస్య కృత్వా రూపమనుత్తమమ్.
లోభయామాస లలితా విశ్వామిత్రం శుచిస్మితా. 8

ప్ర. అ. సా = ఆమె, తస్య = ఆతనియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా=విని, అనుత్తమమ్=అత్యుత్తమ మైన, రూపమ్=రూపమును, కృత్వా= చేసి, లలితా = సుందర మైనదై, శుచిస్మితా = తెల్లని చిరునవ్వు గలదై, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, లోభయామాస = లోభపెట్టెను.

తా. రంభ దేవేంద్రుని మాటలు విని అత్యుత్తమ మైన రూపమును ధరించి, సౌందర్యవతియై తెల్లని చిరునవ్వు నవ్వుచు విశ్వామిత్రుని లోభింప చేసెను. 8

మూ. కోకిలస్య చ శుశ్రావ వల్గు వ్యాహరతః స్వనమ్,
సంప్రహృష్టేన మనసా తత ఏనాముదైక్షత. 9

ప్ర. అ. వల్గు = మధురముగా, వ్యాహరతః=కూయుచున్న, కోకిలస్య= కోకిలయొక్క, స్వనమ్ = ధ్వనిని, శుశ్రావ = వినెను. తతః = పిమ్మట,

సంప్రహృష్టేన = సంతసించిన, మనసా = మనస్సుతో, ఏనామ్ = ఈమెను, ఉదైక్షత = చూచెను.

తా. విశ్వామిత్రుడు కోకిలయొక్క మధురధ్వనిని విని, సంతసించిన మనస్సుతో రంభను చూచెను. 9

మూ. అథ తస్య చ శబ్దేన గీతేనాప్రతిమేన చ,
దర్శనేన చ రమ్భాయా మునిస్సన్దేహమాగతః. 10

ప్ర. అ. అథ = పిమ్మట, తస్య = ఆ కోకిలయొక్క, శబ్దేన = కూత చేతను, అప్రతిమేన = సాటిలేని, గీతేన = గానముచేతను, రమ్భాయాః = రంభ యొక్క, దర్శనేన చ = దర్శనముచేతను, మునిః = ముని, సన్దేహమ్ = సందేహ మును, ఆగతః = పొందెను.

తా. కోకిలధ్వనియు, మధుర మైన సంగీతధ్వనియు వినబడిన పిమ్మట రంభ కనబడగనే విశ్వామిత్రునకు సందేహము కలిగెను. 10

మూ. సహస్రాక్షస్య తత్కర్మ విజ్ఞాయ మునిపుఙ్గవః,
రమ్భాం క్రోధసమావిష్టః శశాప కుశికాత్మజః. 11

ప్ర. అ. మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠు డైన, కుశికాత్మజః = విశ్వామిత్రుడు, తత్ = దానిని, సహస్రాక్షస్య = ఇంద్రునియొక్క, కర్మ = పనినిగా, విజ్ఞాయ = తెలుసుకొని, క్రోధసమావిష్టః = క్రోధముతో కూడినవాడై, రమ్భామ్ = రంభను, శశాప = శపించెను.

తా. ఇదంతయు ఇంద్రుడు చేసిన పని యని తెలిసికొని విశ్వామిత్ర మహాముని రంభను ఇట్లు శపించెను. 11

మూ. యన్మాం లోభయసే రమ్భే కామక్రోధజయైషిణమ్,
దశవర్షసహస్రాణి శైలీ స్థాస్యసి దుర్భగే. 12

ప్ర. అ. దుర్భగే = దౌర్భాగ్యవంతురాలైన, రమ్భే = ఓరంభా! కామ క్రోధజయైషిణమ్ = కామక్రోధములను జయింపవలె నని కోరుచున్న, మామ్ =

నన్ను, యత్ = ఎందువలన, లోభయసే = లోభపెట్టుచున్నావో, అందువలన, దశ = పది, వర్షసహస్రాణి=వేల సంవత్సరములు, శైలీ=ఱాయిగా, స్థాస్యసి= ఉండగలవు.

తా. దౌర్భాగ్యవంతురాలైన ఓ రంభా! కామక్రోధములను జయించవలెనని కోరుచున్న నన్ను లోభపెట్టుటకై ప్రయత్నించితివి గాన పదివేల సంవత్సరములు ఱాతిబండవై పడియుందువుగాక. 12

మూ. బ్రాహ్మణః సుమహాతేజా స్తపోబలసమన్వితః,
ఉద్ధరిష్యతి రమ్భే త్వాం మత్క్రోధకలుషీకృతామ్. 13

ప్ర. అ. రమ్భే = రంభా! సుమహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, తపోబలసమన్వితః = తపోబలముతో కూడినవాడును అగు, బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, మత్క్రోధకలుషీకృతామ్=నా క్రోధముచే పీడింపబడిన, త్వామ్= నిన్ను, ఉద్ధరిష్యతి = ఉద్ధరించగలడు.

తా. ఓ రంభా! నా కోపమునకు గురియైన నిన్ను, గొప్ప తేజస్సు కలవాడును, తపోబలసంపన్నుడను అగు ఒక బ్రాహ్మణుడు ఉద్ధరించగలడు. 13

మూ. ఏవముక్త్వా మహాతేజా విశ్వామిత్రో మహామునిః,
అశక్నువన్ ధారయితుం క్రోధం సన్తాపమాగతః. 14

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, మహామునిః = గొప్ప మునియు అగు, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, క్రోధమ్ = క్రోధమును, ధారయితుమ్ = నిగ్రహించుకొనుటకు, అశక్నువన్ = సమర్థుడు కానివాడై. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సన్తాపమ్ = చింతను, ఆగతః = పొందెను.

తా. విశ్వామిత్రమహాముని కోపము పట్టలేక రంభను ఈ విధముగ శపించి, పశ్చాత్తాపము పొందెను. 14

మూ. తస్య శాపేన మహతా రమ్భా శైలీ తదాభవత్,
వచః శ్రుత్వా తు కన్దర్పో మహర్షేః స చ నిర్గతః. 15

ప్ర. అ. తదా = అప్పుడు, మహతా = గొప్పదైన, తస్య = ఆతనియొక్క, శాపేన = శాపముచేత, రమ్భా = రంభ, శైలీ = ఱాయిగా, అభవత్ = ఆయెను. మహర్షేః = మహర్షియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, కన్దర్పః = మన్మథుడును, సః చ = ఆదేవేంద్రుడును, నిర్గతః = వెడలిపోయిరి.

తా. ఆతని శాపముచేత రంభ వెంటనే శిల ఐపోయెను. మహర్షి మాటలు విని మన్మథుడును, ఇంద్రుడును పారిపోయిరి. 15

మూ. కోపేన స మహాతేజా స్తపోపహరణే కృతే,
ఇన్ద్రియైరజితై ర్రామ న లేభే శా న్తిమాత్మనః. 16

ప్ర. అ. రామ = రామా ! మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః = ఆతడు, కోపేన = కోపముచేత, తపోపహరణే = తపస్సుయొక్క హరణము, కృతే = చేయబడిన దగుచుండగా, అజితైః = జయింపబడని, ఇన్ద్రియైః = ఇంద్రియములచేత, ఆత్మనః = మనస్సుయొక్క, శాన్తిమ్ = శాంతిని, న లేభే = పొందలేదు.

తా. ఇట్లు కోపము కలుగుటచే తపస్సు క్షీణింపగా మహాతేజశ్శాలి యగు ఆవిశ్వామిత్రుడు, ఇంద్రియములను జయించకపోవుటచే మనఃశాంతి పొందజాలక పోయెను. 16

మూ. బభూవాస్య మనశ్చిన్తా తపోఽపహరణే కృతే,
నైవ క్రోధం గమిష్యామి న చ వక్ష్యే కథంచన. 17

ప్ర. అ. తపోపహరణే = తపస్సుయొక్క హరణము, కృతే = చేయబడిన దగు చుండగా, అస్య = ఈతనికి, మనశ్చిన్తా = మనస్సులో ఆలోచన, బభూవ = ఆయెను. క్రోధమ్ = కోపమును, నైవ గమిష్యామి = పొందను. కథంచన = ఎట్లైనను, న చ వక్ష్యే = మాటలాడను కూడ.

తా. ఇట్లు తపస్సు క్షీణించగా విశ్వామిత్రుడు ఈ విధముగ నిశ్చయించు కొనెను— "నేను కోపము చెందను. ఏమైనను మాట కూడ పలుకను". 17

మూ. అథవా నోచ్ఛ్వసిష్యామి సంవత్సరశతాన్యపి,
అహం విశోషయిష్యామి హ్యాత్మానం విజితేన్ద్రియః. 18

ప్ర. అ. అథవా = లేదా, సంవత్సరశతాన్యపి = నూరు సంవత్సరము లైనను, నోచ్ఛ్వసిష్యామి = ఊపిరి విడువను. అహమ్ = నేను, విజితేన్ద్రియః = జయించబడిన ఇంద్రియములు కలవాడనై, ఆత్మానమ్ = శరీరమును, విశోషయిష్యామి = ఎండింపచేసెదను.

తా. "లేదా వందల కొలది సంవత్సరములు ఊపిరి విడవక ఉండి, జితేంద్రియుడనై శరీరమును శుష్కింపచేసెదను". 18

మూ. తావద్యావద్ధి మే ప్రాప్తం బ్రాహ్మణ్యం తపసార్జితమ్,
అనుచ్ఛ్వసన్నభుఞ్జానస్తిష్ఠేయం శాశ్వతీః సమాః. 19
న హి మే తప్యమానస్య క్షయం యాస్యన్తి మూర్తయః.

ప్ర. అ. మే = నాకు, తపసా = తపస్సుచేత, ఆర్జితమ్ = సంపాదింపబడిన, బ్రాహ్మణ్యమ్ = బ్రాహ్మణత్వము, యావత్ = ఎప్పటికి, ప్రాప్తమ్ = ప్రాప్తమగునో, తావత్ = అంతవరకు, అనుచ్ఛ్వసన్ = ఊపిరి విడవనివాడనై, అభుఞ్జానః = భుజించనివాడనై, శాశ్వతీః సమాః = శాశ్వతమైన సంవత్సరములు, తిష్ఠేయమ్ = ఉందును. తప్యమానస్య = తపస్సుచేయుచున్న, మే = నాయొక్క, మూర్తయః = అవయవములు, క్షయమ్ = క్షయమును, న యాస్యన్తి = పొందవు.

తా. "తపస్సుచేత నాకు బ్రాహ్మణ్యము లభించువరకును అనేక సంవత్సరములు ఊపిరి విడవక, ఆహారమును పరిత్యజించి ఉండెదను. తపస్సు చేయునంతవరకును నా అవయవములు క్షీణింపవు". 19

మూ. ఏవం వర్షసహస్రస్య దీక్షాం స మునిపుఙ్గవః, 20
చకారాప్రతిమాం లోకే ప్రతిజ్ఞాం రఘునన్దన.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
చతుఃషష్టితమః సర్గః

ప్ర. అ. రఘునన్దన = రామా ! సః = ఆ, మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడు, ఏవమ్ = ఈ విధముగా, లోకే = లోకమునందు, అప్రతిమామ్ = సాటిలేని, వర్ష సహస్రస్య దీక్షామ్ = వేయి సంవత్సరముల దీక్షను గూర్చి, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, చకార = చేసెను.

తా. రామా ! ఆ విశ్వామిత్ర మహాముని, ఇట్లు, లోకములో ఎన్నడును కని విని ఎరుగని విధముగ వేయి సంవత్సరముల పాటు దీక్షను గూర్చి ప్రతిజ్ఞ చేసెను. 20

"బాలానన్దిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో అరువదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చషష్టితమః సర్గః

మూ. అథ హైమవతీం రామ దిశం త్యక్త్వా మహామునిః,
పూర్వాం దిశమనుప్రాప్య తపస్తేపే సుదారుణమ్. 1

ప్ర. అ. రామ = రామా ! అథ = పిమ్మట, మహామునిః = విశ్వామిత్రుడు, హైమ తీమ్ = హిమవత్పర్వతముతో సంబంధించిన, దిశమ్ = దిక్కును, త్యక్త్వా = విడచి, పూర్వాం దిశమ్ = తూర్పు దిక్కును, అనుప్రాప్తః = చేరిన వాడై, సుదారుణమ్ = చాల తీవ్ర మైన, తపః = తపస్సును, తేపే = చేసెను.

తా. రామా ! అటుపిమ్మట విశ్వామిత్రమహాముని ఉత్తరదిక్కు విడచి తూర్పుదిక్కునకు వెళ్లి అచట అతితీవ్ర మైన తపస్సు చేసెను. 1

మూ. మౌనం వర్షసహస్రస్య కృత్వా వ్రతమనుత్తమమ్,
చకారాప్రతిమం రామ తపః పరమదుష్కరమ్. 2

ప్ర. అ. రామ = రామా ! వర్షసహస్రస్య = వేయి సంవత్సరముల యొక్క, అనుత్తమమ్ = గొప్ప దైన, మౌనం వ్రతమ్ = మౌనవ్రతమును, కృత్వా = చేసి, అప్రతిమమ్ = సాటి లేని, పరమదుష్కరమ్ = మిక్కిలి చేయ శక్యముకాని, తపః = తపస్సును, చకార = చేసెను.

తా. రామా ! వేయి సంవత్సరముల పాటు చాల గొప్ప దైన మౌన వ్రతము నవలంబించి, చేయ శక్యము కానిదియు, సాటి లేనిదియు అగు తపస్సు చేసెను. 2

మూ. పూర్ణే వర్షసహస్రే తు కాష్ఠభూతం మహామునిమ్,
విఘ్నైర్బహుభిరాధూతం క్రోధో నాన్తర ఆవిశత్, 3
స కృత్వా నిశ్చయం రామ తప ఆతిష్ఠదవ్యయమ్.

ప్ర. అ. వర్షసహస్రే = వేయి సంవత్సరముల కాలము, పూర్ణే = నిండగా, కాష్ఠభూతమ్ = కట్టె వలె అయిన, మహామునిమ్ = మహామునిని, బహుభిః =

అనేక మైన, విఘ్నైః = విఘ్నములంచేత, అధూతమ్ = కదల్చి వేయబడినను, క్రోధః = క్రోధము, అన్తరే = హృదయమునందు, న అవిశత్ = ప్రవేశించలేదు. రామ = రామా ! సః = ఆతడు, నిశ్చయమ్ = నిశ్చయమును, కృత్వా = చేసి, అవ్యయమ్ = నాశములేని, తపః = తపస్సును, అతిష్ఠత్ = చేసెను.

తా. వేయి సంవత్సరములు నిండునరికి విశ్వామిత్రుడు కట్టె వలె ఆయెను. ఎన్ని విఘ్నములు వచ్చినను ఆతని మనస్సులో క్రోధము కలుగలేదు. ఆతడు దృఢనిశ్చయముతో నాశము లేని తపస్సు చేసెను. 3

మూ. తస్య వర్షసహస్రస్య వ్రతే పూర్ణే మహావ్రతః, 4
భోక్తుమారబ్ధవానన్నం తస్మిన్ కాలే రఘూత్తమ,
ఇన్ద్రో ద్విజాతిర్భూత్వా తం సిద్ధమన్నమయాచత. 5

ప్ర. అ. రఘూత్తమ = రామా ! తస్య = ఆ, వర్షసహస్రస్య = వేయి సంవత్సరముల, వ్రతే = వ్రతము, పూర్ణే=పూర్ణ మైన దగుచుండగా, మహావ్రతః = గొప్ప నియమము గల ఆ విశ్వామిత్రుడు, అన్నమ్ = అన్నమును, భోక్తుమ్=తినుటకు, ఆరబ్ధవాన్=ప్రారంభించినాడు, తస్మిన్ = ఆ, కాలే = సమయమునందు, ఇన్ద్రః=ఇంద్రుడు, ద్విజాతిః=బ్రాహ్మణుడుగా, భూత్వా = అయి, తమ్=ఆతనిని, సిద్ధమ్ = సిద్ధమై యున్న, అన్నమ్ = అన్నమును, అయాచత=కోరెను.

తా. రామా ! వేయి సంవత్సరముల వ్రతము పూర్తి యైన పిమ్మట, మహావ్రతు డైన విశ్వామిత్రుడు అన్నము తినవలె నని అనుకొనుచుండగా ఇంద్రుడు బ్రాహ్మణ వేషమున వచ్చి, ఆ సిద్ధాన్నమును యాచించెను. 4, 5

మూ. తస్మై దత్త్వా తదా సిద్ధం సర్వం విప్రాయ నిశ్చితః,
నిశ్శేషితేఽన్నే భగవానభుక్త్వైవ మహాతపాః. 6

న కించిదవదద్విప్రం మౌనవ్రతముపస్థితః,
అథ వర్షసహస్రం వై నోచ్ఛ్వసన్మునిపుఙ్గవః. 7

ప్ర. అ. భగవాన్=పూజ్యుడును, మహాతపాః = గొప్ప తపస్సు కలవాడును, మౌనవ్రతమ్=మౌనవ్రతమును, ఉపస్థితః = అవలంబించినవాడును

అగు విశ్వామిత్రుడు, నిశ్చితః=దృఢ నిశ్చయము కలవాడై, తదా=అప్పుడు, సిద్ధమ్=సిద్ధముగా నున్న, సర్వమ్ = ఆ అన్నమునంతను, తస్మై = ఆ, విప్రాయ=బ్రాహ్మణునకు, దత్త్వా=ఇచ్చి, అన్నే = అన్నము, నిశ్శేషితే= శేషములేకుండ భుజింపబడగా, అభుక్త్వైవ = తాను తినకుండగనే ఉండి, విప్రమ్=ఆ బ్రాహ్మణుని గూర్చి, కించిత్=ఏమియు, న అవదత్=పలకలేదు. అథ=అటు పిమ్మట, మునిపుఙ్గవః=ఆ మునిశ్రేష్ఠుడు, వర్షసహస్రం = వేయి సంవత్సరముల పాటు, నోచ్ఛ్వసత్=ఊపిరి పీల్చలేదు.

తా. మౌనవ్రత మవలంబించిన మహాతపఃశాలి యైన ఆ విశ్వామిత్రుడు సిద్ధాన్నము నంతను ఆ బ్రాహ్మణున కిచ్చివేసెను. ఆతడు పూర్తిగా భుజించెను. విశ్వామిత్రుడు భోజనము లేకయే ఉండిపోయెను. ఆ బ్రాహ్మణుని మాత్రము ఏమియు అనలేదు. పిదప వేయి సంవత్సరముల పాటు ఉచ్ఛ్వాసనిఃశ్వాసములను బంధించి తపస్సు చేసెను. 6, 7

మూ. తస్యానుచ్ఛ్వసమానస్య మూర్ధ్ని ధూమో వ్యజాయత,
త్రైలోక్యం యేన సంభ్రాన్తమాదీపితమివాభవత్. 8

ప్ర. అ. అనుచ్ఛ్వసమానస్య=ఊపిరి పీల్చకుండ ఉన్న, తస్య=విశ్వామిత్రుని యొక్క, మూర్ధ్ని=శిరస్సుపై, ధూమః = ధూమము, వ్యజాయత = పుట్టెను. యేన=దేనిచేత, త్రైలోక్యమ్=ముల్లోకమును, సంభ్రాన్తమ్ = భయపడినదై, ఆదీపితమివ=కాల్చబడినది వలె, అభవత్=ఆయెను.

తా. విశ్వామిత్రు డా విధముగ ఉచ్ఛ్వాసనిశ్శ్వాసములను బంధించి యుండగా ఆతని శిరస్సునుండి ధూమము బయలుదేరెను. దానిచే ముల్లోకములును దహింపబడి నట్లు అయి భయపడిపోయినవి. 8

మూ. తతో దేవాః సగన్ధర్వాః పన్నగాసురరాక్షసాః,
మోహితాస్తేజసా తస్య తపసా మన్దరశ్మయః, 9
కశ్మలోపహతాస్సర్వే పితామహమథాబ్రువన్.

ప్ర. అ. తతః=పిమ్మట, దేవాః=దేవతలును, సగన్ధర్వాః=గంధర్వులతో కూడిన, పన్నగాసురరాక్షసాః = పన్నగులు, అసురులు రాక్షసులును, తస్య=

ఆతని యొక్క, తేజసా = తేజస్సుచేత, మోహితాః=మోహితులై తపసా= తపస్సుచేత, మన్దరశ్మయః=మంద మైన కాంతి గలవారై, కశ్మలోపహతాః= దుఃఖముచే పీడితులై, అథ=పిమ్మట, సర్వే=అందరును, పితామహమ్=బ్రహ్మ దేవుని గూర్చి, అబ్రువన్=పలికిరి.

తా. అపుడు దేవగంధర్వ పన్నగాసుర రాక్షసులు ఆ విశ్వామిత్రుని తేజస్సుచే తెలివి తప్పినవారై, ఆతని తపస్సుచే కాంతి తొలగినవారై, పీడితులై బ్రహ్మవద్దకు వెళ్లి ఇట్లు పలికిరి. 9

మూ. బహుభిః కారణైర్దేవ విశ్వామిత్రో మహామునిః, 10
లోభితః క్రోధితశ్చైవ తపసా చాభివర్ధతే.

ప్ర. అ. దేవ=బ్రహ్మదేవా ! మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, బహుభిః=అనేక మైన, కారణైః = కారణములచేత, లోభితః = లోభపెట్టబడినను, క్రోధితశ్చైవ = కోపపెట్టబడినను, తపసా = తపస్సుచే, అభివర్ధతే=వృద్ధిపొందుచునే ఉన్నాడు.

తా. ప్రభూ ! ఈ విశ్వామిత్ర మహామునిని అనేక విధముల లోభపెట్టినను, కోపము కలిగించినను, ఈతని తపస్సు వృద్ధిపొందుచునే ఉన్నది. 10

మూ. న హ్యస్య వృజినం కించిద్దృశ్యతే సూక్ష్మమప్యథ, 11
న దీయతే యది త్వస్య మనసా యదభీప్సితమ్,
వినాశయతి త్రైలోక్యం తపసా సచరాచరమ్. 12

ప్ర. అ. అథ=ఇంక, అస్య=ఈతని యొక్క, సూక్ష్మమపి = సూక్ష్మ మైన దైనను, వృజినమ్=పాపము, కించిత్=ఏదియు, న దృశ్యతే=కనబడుట లేదు. అస్య=ఇతని యొక్క, మనసా=మనస్సుచేత, యత్=ఏది, అభీప్సితమ్= కోరబడినదో అది, న దీయతే యది=ఇవ్వబడక పోయినచో, తపసా=తపస్సుచేత, సచరాచరమ్=చరాచరములతో కూడిన, త్రైలోక్యమ్ = మూడు లోకములను, వినాశయతి=నశింపచేయును.

తా. ఈతనిలో కొంచె మైనను పాపము కనబడుటలేదు. ఈతడు కోరిన

వరము నీయకున్నచో తపస్సుచేత చరాచరాత్మక మగు లోకత్రయమును దహించివేయగలడు. 12

మూ. వ్యాకులాశ్చ దిశః సర్వా న చ కించిత్ప్రకాశతే,
సాగరాః క్షుభితాః సర్వే విశీర్యన్తే చ పర్వతాః. 13

ప్ర. అ. సర్వాః=సమస్త మైన, దిశః=దిక్కులు, వ్యాకులాః=వ్యాకుల మైనవి. కించిత్=ఏమియు, న ప్రకాశతే=ప్రకాశించుటలేదు. సర్వే = సమస్త మైన, సాగరాః=సాగరములు, క్షుభితాః=క్షోభపడుచున్నవి. పర్వతాః=పర్వత ములు, విశీర్యన్తే=బ్రద్దలగుచున్నవి.

తా. దిక్కు లన్నియు వ్యాకుల మైనవి. ఏమియు ప్రకాశించుటలేదు. సాగరములు క్షోభ చెందుచున్నవి. పర్వతములు బ్రద్ద లగుచున్నవి. 13

మూ. ప్రకమ్పతే చ పృథివీ వాయుర్వాతి భృశాకులః,
బ్రహ్మన్న ప్రతిజానీమో నాస్తికో జాయతే జనః. 14

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రహ్మదేవా ! పృథివీ చ = భూమి కూడ, ప్రకమ్పతే=కంపించుచున్నది. వాయుః = వాయువు, భృశాకులః = వ్యాకుల మైనదై, వాతి=వీచుచున్నది. న ప్రతిజానీమః=ఏమి చేయవలెనో తెలియజాల కున్నాము. జనః=జనులు, నాస్తికః=నాస్తికులుగా, జాయతే=అగుచున్నారు.

తా. బ్రహ్మదేవా ! భూమి కంపించుచున్నది. వాయువు చాల వ్యాకులముగ వీచుచున్నది. జనులందరును నాస్తికు లగుచున్నారు. మా కేమియు తోచ కున్నది. 14

మూ. సంమూఢమివ త్రైలోక్యం సంప్రక్షుభితమానసమ్,
భాస్కరో నిష్ప్రభశ్చైవ మహర్షేస్తస్య తేజసా. 15

ప్ర. అ. త్రైలోక్యమ్=మూడు లోకముల సముదాయము, సంప్రక్షుభిత మానసమ్=క్షోభచెందిన మనస్సు కలదై, సంమూఢమివ = మూర్ఛ పొంది నట్లున్నది. తస్య మహర్షేః = ఆ మహర్షియొక్క, తేజసా = తేజస్సుచేత, భాస్కరశ్చ=సూర్యుడు కూడ, నిష్ప్రభః=కాంతి విహీనుడుగా ఉన్నాడు.

తా. క్షోభించిన మనస్సుతో మూడు లోకములును మార్పు చెంది నట్లున్నవి. ఆ మహర్షి తేజస్సుచేత సూర్యుడు కాంతివిహీను డైనాడు. 15

మూ. బుద్ధిం న కురుతే యావన్నాశే దేవ మహామునిః,
తావత్ప్రసాద్యో భగవానగ్నిరూపో మహాద్యుతిః. 16

ప్ర. అ. దేవ = దేవా ! మహామునిః = ఈ మహాముని. నాశే = మూడు లోకములను నశింపచేయుటయందు, యావత్ = ఎంతలో, బుద్ధిం న కురుతే = నిర్ణయము చేయడో, తావత్ = అంతలో, అగ్నిరూపః = అగ్నితుల్యుడును, మహాద్యుతిః = గొప్ప కాంతికలవాడును అగు, భగవాన్ = ఈ పూజ్యుడైన విశ్వామిత్రుడు, ప్రసాద్యః = సంతోషింపచేయదగినవాడు.

తా. అగ్నితుల్యుడును, మహాకాంతిమంతుడును అగు ఈ పూజ్యుడైన్ మహాముని లోకత్రయనాశము చేయ నిర్ణయించుటకు ముందుగా ఇతనికి కోరిన వరము లిచ్చి ప్రసన్నుని చేయుము. 16

మూ. కాలాగ్నినా యథా పూర్వం త్రైలోక్యం దహ్యతేఽఖిలమ్,
దేవరాజ్యం చికీర్షేత దీయతామస్య యన్మతమ్. 17

ప్ర. అ. అఖిలమ్ = సమస్తమైన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, పూర్వమ్ = పూర్వము, కాలాగ్నినా = కాలాగ్నిచేత, యథా = ఎట్లు దహింపబడెనో, అట్లు, దహ్యతే = దహింపబడుచున్నది. దేవరాజ్యమ్ = దేవరాజ్యమును, చికీర్షేత (యది) చేయదలచినట్లైతే, అస్య = ఇతనికి, యత్ = ఏది, మతమ్ = ఇష్టమో అది, దీయతామ్ = ఇవ్వబడుగాక.

తా. ముల్లోకములును, పూర్వము ప్రలయాగ్నిచే దహింపబడినట్లు దహింపబడుచున్నవి. ఇతడు దేవలోకరాజ్యము చేయ వలె నని కోరినను ఈతని కేది కావలెనో అది ఇమ్ము. 17

మూ. తతః సురగణాః సర్వే పితామహపురోగమాః,
విశ్వామిత్రం మహాత్మానం మధురం వాక్యమబ్రువన్. 18

ప్ర. అ. తతః = పిమ్మట, పితామహపురోగమాః = బ్రహ్మదేవుడు మొదలైన, సర్వే = సమస్తమైన, సురగణాః = దేవతలు, మహాత్మానమ్ = మహాత్ముడైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, మధురమ్ = మధురమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రువన్ = పలికిరి.

తా. పిమ్మట బ్రహ్మదేవుడు మొదలగు దేవత లందరును మహాత్ముడైన విశ్వామిత్రునితో మధుర మైన వాక్యము పలికిరి. 18

మూ. బ్రహ్మర్షే స్వాగతం తేఽస్తు తపసా స్మ సుతోషితాః,
బ్రాహ్మణ్యం తపసోగ్రేణ ప్రాప్తవానసి కౌశిక. 19

ప్ర. అ. బ్రహ్మర్షే = ఓ బ్రహ్మర్షీ ! తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము, అస్తు = అగుగాక, తపసా = తపస్సుచేత, సుతోషితాః = బాగుగా సంతోషపెట్టబడినవారము, స్మః = అయినాము. కౌశిక = విశ్వామిత్రా, ఉగ్రేణ = ఉగ్రమైన, తపసా = తపస్సుచేత, బ్రాహ్మణ్యమ్ = బ్రాహ్మణత్వమును, ప్రాప్తవాన్ = పొందినవాడవు, అసి = అయితివి.

తా. ఓ బ్రహ్మర్షీ ! నీకు స్వాగత మగుగాక. నీ తపస్సుచేత చాల సంతోషించినాము. ఓ విశ్వామిత్రా ! ఉగ్రమైన తపస్సుచేత బ్రాహ్మణత్వమును పొందితివి. 19

మూ. దీర్ఘమాయుశ్చ తే బ్రహ్మన్ దదామి సమరుద్గణః,
స్వస్తి ప్రాప్నుహి భద్రం తే గచ్ఛ సౌమ్య యథాసుఖమ్. 20

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణా ! సమరుద్గణః = దేవతాగణములతో కూడిన నేను, తే = నీకు, దీర్ఘమ్ = దీర్ఘ మైన, ఆయుశ్చ = ఆయుర్దాయమును కూడ, దదామి = ఇచ్చుచున్నాను. స్వస్తి = క్షేమమును, ప్రాప్నుహి = పొందుము. తే = నీకు, భద్రమ్ = భద్ర మగుగాక. సౌమ్య = ఓ సౌమ్యుడా ! యథాసుఖమ్ = సుఖముగా, గచ్ఛ = వెళ్లుము.

తా. ఓ బ్రాహ్మణా ! దేవతాగణములతో కూడిన నేను నీకు దీర్ఘాయుర్దాయము కూడ ఇచ్చుచున్నాను. క్షేమమును పొందుము. నీకు భద్ర మగును. ఓ సౌమ్యుడా ! నీకు సుఖము కలుగువిధముగ సంచరించుము. 20

మూ. పితామహవచః శ్రుత్వా సర్వేషాం చ దివౌకసామ్,
కృత్వా ప్రణామం ముదితో వ్యాజహార మహామునిః. 21

ప్ర. అ. మహామునిః = విశ్వామిత్రమహాముని, పితామహవచః = బ్రహ్మ యొక్క వచనమును, సర్వేషామ్ = సమస్త మైన, దివౌకసాం చ = దేవతల వచనమును, శ్రుత్వా = విని, ముదితః = సంతసించినవాడై, ప్రణామమ్ = నమస్కారమును, కృత్వా = చేసి, వ్యాజహార = పలికెను.

తా. విశ్వామిత్రుడు బ్రహ్మాదిదేవతల మాటలు విని, సంతసించి, నమస్కరించి ఇట్లు పలికెను. 21

మూ. బ్రాహ్మణ్యం యది మే ప్రాప్తం దీర్ఘమాయు స్తథైవ చ,
ఓంకారశ్చ వషట్కారో వేదాశ్చ వరయన్తు మామ్. 22

ప్ర. అ. మే = నాకు, బ్రాహ్మణ్యమ్ = బ్రాహ్మణ్యము, ప్రాప్తం యది = లభించినట్లైతే, తథైవ చ = మరియు, దీర్ఘమ్ = దీర్ఘ మైన, ఆయుశ్చ = ఆయుర్దాయము కూడ లభించినట్లైతే, ఓంకారశ్చ = ఓంకారము, వషట్కారశ్చ = వషట్కారము, వేదాశ్చ = వేదములును, మామ్ = నన్ను, వరయన్తు = వరించుగాక.

తా. నాకు బ్రాహ్మణత్వము, దీర్ఘాయుర్దాయము లభించినచో, ఓంకార వషట్కారములును, వేదములును నన్ను వరించుగాక. నాకు వేదములను ఇతరులకు బోధించు అధికారము, యజ్ఞయాగాదులు చేయించు అధికారము లభించుగాక. 22

మూ. క్షత్రవేదవిదాం శ్రేష్ఠో బ్రహ్మవేదవిదామపి,
బ్రహ్మపుత్రో వసిష్ఠో మామేవం వదతు దేవతాః. 23
యద్యయం పరమః కామః కృతో యాన్తు సురర్షభాః.

ప్ర. అ. దేవతాః = దేవతలారా ! క్షత్రవేదవిదామ్ = క్షత్రియులకు యోగ్యములైన ధనుర్వేదాదివిద్యల నెరిగినవారిలోను, బ్రహ్మవేదవిదామపి = బ్రాహ్మణులకు యోగ్యము లైన వేదములను ఎరిగినవారిలోను, శ్రేష్ఠః = శ్రేష్ఠ

డును, బ్రహ్మపుత్రః = బ్రహ్మపుత్రుడును అయిన, వసిష్ఠః = వసిష్ఠుడు, మామ్= నన్ను గూర్చి, ఏవమ్ = ఇట్లు, వదతు = పలుకుగాక. అయమ్=ఈ, పరమః= గొప్పదైన, కామః = కోరిక, కృతః యది = చేయబడినట్లైతే, సురర్షభాః = సుర శ్రేష్ఠులైన మీరు, యాన్తు = వెళ్లుదురుగాక.

తా. క్షత్రియుల విద్యలను బ్రాహ్మణుల వేదములను ఎరిగినవారిలో శ్రేష్ఠుడును, బ్రహ్మపుత్రుడును అగు వసిష్ఠుడు నన్ను బ్రహ్మర్షి యని అంగీకరించుగాక. నాకీ శ్రేష్ఠమైన వరమును ఇచ్చినచో మీరందరు వెళ్లవచ్చును. 23

మూ. తతః ప్రసాదితో దేవైర్వసిష్ఠో జపతాం వరః, 24
సఖ్యం చకార బ్రహ్మర్షిరేవమస్త్వితి చాబ్రవీత్.

ప్ర. అ. తతః = పిమ్మట, దేవైః = దేవతలచేత, ప్రసాదితః = అనుగ్రహింపచేసికొనబడిన, జపతాం వరః = మునులలో శ్రేష్ఠుడైన, వసిష్ఠః = వసిష్ఠుడు, సఖ్యమ్ = స్నేహమును, చకార = చేసెను. ఏవమ్ = ఇట్లు, బ్రహర్షిః = బ్రహ్మర్షి, అస్తు = అగుగాక, ఇతి = అని, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. పిమ్మట దేవతలు బ్రతిమాలుకొనగా వసిష్ఠమహాముని వచ్చి, విశ్వామిత్రునితో మైత్రి చేసికొని, 'నీవు బ్రహ్మర్షివి' అని పలికెను. 24

మూ. బ్రహ్మర్షిస్త్వం న సన్దేహః సర్వం సంపత్స్యతే తవ, 25
ఇత్యుక్త్వా దేవతాశ్చాపి సర్వా జగ్ముర్యథాగతమ్.

ప్ర. అ. త్వమ్ = నీవు, బ్రహ్మర్షిః = బ్రహ్మర్షివి. సన్దేహః=సందేహము, న = లేదు. తవ = నీకు, సర్వమ్ = అంతయు, సంపత్స్యతే = సిద్ధించును. ఇతి= ఇట్లు, ఉక్త్వా=పలికి, సర్వాః=సమస్తమైన, దేవతాః=దేవతలు, యథాగతమ్= వచ్చినట్లుగనే, జగ్ముః = వెళ్లిరి.

తా. "నీవు బ్రహ్మర్షివే. సందేహము లేదు. నీకు అన్నియు సమకూరును" అని పలికి దేవత లందరును వచ్చిన దారినే వెళ్లిపోయిరి. 25

మూ. విశ్వామిత్రోఽపి ధర్మాత్మా లబ్ధ్వా బ్రాహ్మణ్యముత్తమమ్, 26
పూజయామాస బ్రహ్మర్షిం వసిష్ఠం జపతాం వరమ్.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విశ్వామిత్రోఽపి = విశ్వామిత్రుడు కూడా, ఉత్తమమ్ = ఉత్తమమైన, బ్రాహ్మణ్యమ్ = బ్రాహ్మణ్యమును, లబ్ధ్వా = పొంది, బ్రహ్మర్షిమ్ = బ్రహ్మర్షియు, జపతామ్ = జపము చేయువారిలో, వరమ్= శ్రేష్ఠుడును అగు, వసిష్ఠమ్ = వసిష్ఠుని, పూజయామాస = పూజించెను.

తా. ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు ఉత్తమమైన బ్రాహ్మణ్యమును సంపాదించి, బ్రహ్మర్షియైన వసిష్ఠమహామునిని పూజించెను. 26

మూ. కృతకామో మహీం సర్వాం చచార తపసి స్థితః. 27
ఏవం త్వనేన బ్రాహ్మణ్యం ప్రాప్తం రామ మహాత్మనా.

ప్ర. అ. కృతకామః = చేయబడిన కోరికకలవాడై, తపసి = తపస్సునందు, స్థితః = ఉన్నవాడై, సర్వామ్ = సమస్తమైన, మహీమ్ = భూమిని, చచార = సంచరించెను. రామ = రామా ! మహాత్మనా = మహాత్ముడైన, అనేన= ఇతనిచేత, ఏవమ్= ఈ విధముగా, బ్రాహ్మణ్యమ్=బ్రాహ్మణత్వము, ప్రాప్తమ్= పొందబడినది.

తా. విశ్వామిత్రుడీ విధముగ కోరికను తీర్చుకొని, తపస్సు ఆచరించుచు భూమండలము నంతను సంచరించెను. రామా ! ఈ మహాత్ముడు బ్రాహ్మణత్వమును ఈ విధముగ సంపాదించుకొనెను. 27

మూ. ఏష రామ మునిశ్రేష్ఠ ఏష విగ్రహవాంస్తపః, 28
ఏష ధర్మపరో నిత్యం వీర్యస్యైష పరాయణమ్.

ప్ర. అ. రామ = రామా ! ఏషః = ఇతడు, మునిశ్రేష్ఠః = మునులలో శ్రేష్ఠుడు. ఏషః = ఇతడు, విగ్రహవాన్ = శరీరము గల, తపః = తపస్సు. ఏషః=ఇతడు, నిత్యమ్ = ఎల్లప్పుడును, ధర్మపరః = ధర్మమునందాసక్తి గలవాడు. ఏషః=ఇతడు, వీర్యస్య=పరాక్రమమునకు, పరాయణమ్=గొప్పస్థానము.

తా. రామా ! ఈతడు మునులలో శ్రేష్ఠుడు. ఇతడు మూర్తీభవించిన తపస్సు. ఇతడు ఎల్లప్పుడును ధర్మపరుడు. ఇతడు వీర్యమునకు నివాసస్థానము. 28

మూ. ఏవముక్త్వా మహాతేజా విరరామ ద్విజోత్తమః, 29
శతానన్దవచః శ్రుత్వా రామలక్ష్మణసన్నిధౌ,
జనకః ప్రాఞ్జలిర్వాక్యమువాచ కుశికాత్మజమ్. 30

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ద్విజోత్తమః=ద్విజశ్రేష్ఠుడు, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, విరరామ=విరమించెను. జనకః=జనకమహారాజు, రామలక్ష్మణసన్నిధౌ = రామలక్ష్మణుల సమీపమునందు, శతానన్దవచః = శతానందుని వాక్యమును, శ్రుత్వా=విని, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలికలవాడై, కుశికాత్మజమ్=విశ్వామిత్రుని గూర్చి, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. మహాతేజశ్శాలి యగు శతానందుడు ఈ విధముగా పలికి ఊరకుండెను. రామలక్ష్మణులతో శతానందుడు చెప్పిన మాటలు విని జనకమహారాజు, చేతులు జోడించి విశ్వామిత్రునితో ఇట్లనెను. 29, 30

మూ. ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే మునిపుఙ్గవ,
యజ్ఞం కాకుత్స్థసహితః ప్రాప్తవానసి ధార్మిక. 31

ప్ర. అ. ధార్మిక = ధర్మాత్ముడా! మునిపుఙ్గవ = ఓ మునిశ్రేష్ఠుడా! కాకుత్స్థసహితః=రామలక్ష్మణసమేతుడవై, యస్య=ఏ, మమ = నాయొక్క, యజ్ఞమ్ = యజ్ఞమును గూర్చి, ప్రాప్తవాన్ అసి = వచ్చినావో అట్టినేను, ధన్యః అస్మి = ధన్యుడ నైతిని. అనుగృహీతః = అనుగ్రహింపబడినవాడను, అస్మి= అయితిని.

తా. ధార్మికుడ వైన ఓ మునిపుంగవా! రామలక్ష్మణసమేతుడవై నా యజ్ఞమునకు వచ్చితివి; నేను ధన్యుడ నైతిని. అనుగ్రహపాత్రుడ నైతిని. 31

మూ. పావితోఽహం త్వయా బ్రహ్మన్ దర్శనేన మహామునే,
గుణా బహువిధాః ప్రాప్తాస్తవ సందర్శనాన్మయా. 32

ప్ర. అ. మహామునే = ఓ మహామునీ! బ్రహ్మన్ = బ్రాహ్మణోత్తమా! త్వయా=నీచేత, దర్శనేన=దర్శనముచేతనే, అహమ్ = నేను, పావితః=పవిత్రింపచేయబడితిని. తవ=నీయొక్క, సందర్శనాత్=దర్శనమువలన, మయా=

నాచేత, బహువిధాః=అనేకవిధము లైన, గుణాః=గుణములు, ప్రాప్తాః=పొంద బడినవి.

తా. బ్రాహ్మణోత్తముడ వైన ఓ మహామునీ ! నీ దర్శనముచే నేను పవిత్రుడ నైతిని. నీ దర్శనమువలన నేను అనేకవిధము లగు లాభములను పొందితిని. 32

మూ. విస్తరేణ చ తే బ్రహ్మన్ కీర్త్యమానం మహత్తపః,
శ్రుతం మయా మహాతేజో రామేణ చ మహాత్మనా. 33

ప్ర. అ. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా ! బ్రహ్మన్=బ్రాహ్మణోత్తమా! విస్తరేణ=సవిస్తరముగా, కీర్త్యమానమ్=చెప్పబడుచున్న, తే=నీయొక్క, మహత్=గొప్ప, తపః=తపస్సు, మయా = నాచేతను, మహాత్మనా=మహాత్ముడైన, రామేణ=రామునిచేతను, శ్రుతమ్=వినబడినది.

తా. మహాతేజశ్శాలి వైన ఓ బ్రహ్మర్షీ ! నీ తపస్సును గూర్చి సవిస్తరముగ వర్ణించి శతానందుడు చెప్పగా నేనును, మహాత్ము డైన రాముడును వింటిమి. 33

మూ. సదస్యైః ప్రాప్య చ సదః శ్రుతాస్తే బహవో గుణాః,
అప్రమేయం తపస్తుభ్యమప్రమేయం చ తే బలమ్, 34
అప్రమేయా గుణాశ్చైవ నిత్యం తే కుశికాత్మజ.

ప్ర. అ. సదస్యైః=సభ్యులచేత, సదః=యజ్ఞవాటికను, ప్రాప్య = పొంది, తే=నీయొక్క, బహవః=అనేక మైన, గుణాః=గుణములు, శ్రుతాః= వినబడినవి. తుభ్యమ్ = నీయొక్క, తపః = తపస్సు, అప్రమేయమ్ = కొలత లేనిది. తే=నీయొక్క, బలమ్ = బలము, అప్రమేయమ్ = కొలవశక్యము కానిది. కుశికాత్మజ = విశ్వామిత్రా ! తే = నీయొక్క, గుణాశ్చైవ = గుణములు కూడ, నిత్యమ్ = నిత్యము, అప్రమేయాః = కొలవశక్యము కానివి.

తా. యజ్ఞసభలో ఉన్న సదస్యు లందరును నీ గుణములను వినిరి. ఓ విశ్వామిత్రా ! నీ తపస్సు, నీ బలము, నీ గుణములును కొలతకు అందనివి. 34

మూ. తృప్తిరాశ్చర్యభూతానాం కథానాం నాస్తి మే విభో, 35
కర్మకాలో మునిశ్రేష్ఠ లమ్బతే రవిమణ్డలమ్.

ప్ర. అ. విభో = ప్రభూ ! ఆశ్చర్యభూతానామ్ = ఆశ్చర్యకరము లైన, కథానామ్ = కథల విషయమున, మే = నాకు, తృప్తిః = తృప్తి, నాస్తి = లేదు. మునిశ్రేష్ఠ = మునిశ్రేష్ఠుడా ! రవిమణ్డలమ్ = సూర్యమండలము, లమ్బతే = వ్రేలాడుచున్నది. కర్మకాలః = కర్మానుష్ఠానకాలము (సమీపించినది).

తా. మహాత్మా ! ఆశ్చర్యకరము లైన నీ కథలను వినుచుండగా తృప్తి కలుగుట లేదు. ఓ మునిశ్రేష్ఠా ! సూర్యుడస్తాద్రికి పోవుచున్నాడు. కర్మకాలము సమీపించుచున్నది. 35

మూ. శ్వః ప్రభాతే మహాతేజో ద్రష్టుమర్హసి మాం పునః, 36
స్వాగతం తపతాం శ్రేష్ఠ మామనుజ్ఞాతుమర్హసి.

ప్ర. అ. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా ! శ్వః = రేపు, ప్రభాతే = ప్రాతఃకాలమున, మామ్ = నన్ను, పునః = మరల, ద్రష్టుమ్ = చూచుటకు, అర్హసి = తగియున్నావు. తపతామ్ = తపస్సు చేసేవారిలో, శ్రేష్ఠ = శ్రేష్ఠుడా ! స్వాగతమ్ = నీకు స్వాగతము. మామ్ = నన్ను, అనుజ్ఞాతుమ్ = అనుజ్ఞ ఇచ్చుటకు, అర్హసి = తగియున్నావు.

తా. గొప్ప తేజస్సు గల మునిశ్రేష్ఠుడా ! రేపు ప్రాతఃకాలమున మరల నన్ను చూడుము (నా వద్దకు రమ్ము). నీకు స్వాగతము. నాకు అనుజ్ఞ 36

మూ. ఏవముక్తో మునివరః ప్రశస్య పురుషర్షభమ్, 37
విససర్జాశు జనకం ప్రీతం ప్రీతమనాస్తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మునివరః = మునిశ్రేష్ఠుడు, ప్రీతమనాః = సంతోషించిన మనస్సు కలవాడై, ప్రీతమ్ = సంతసించిన, పురుషర్షభమ్ = పురుషశ్రేష్ఠుడైన, జనకమ్ = జనకుని, ప్రశస్య = ప్రశంసించి, ఆశు = శీఘ్రముగా, విససర్జ = విడచెను.

తా. జనకుడిట్లు పలుకగా సంతసించిన ఆ మహాముని, సంతోష యుక్తుడైన ఆ పురుషశ్రేష్ఠుడగు దశరథుని ప్రశంసించి, వెంటనే ఆతనికి వెళ్లుటకు అనుజ్ఞ ఇచ్చెను. 37

మూ ఏవముక్త్వా మునిశ్రేష్ఠం వైదేహో మిథిలాధిపః, 38
ప్రదక్షిణం చకారాశు సోపాధ్యాయః సబాన్ధవః.

ప్ర. అ. వైదేహః = విదేహదేశాధిపతి యైన, మిథిలాధిపః=మిథిలానగర రాజు, మునిశ్రేష్ఠమ్ = ఆ మునిశ్రేష్ఠుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సోపాధ్యాయః = ఉపాధ్యాయునితో కూడినవాడై, సబాన్ధవః = బంధువులతో కూడినవాడై, ఆశు = శీఘ్రముగా, ప్రదక్షిణం చకార = ప్రదక్షిణము చేసెను.

తా. జనకమహారాజు ఆ మహామునితో ఇట్లు పలికి ఆతనికి ప్రదక్షిణ నమస్కారములు చేసెను. ఆతని ఉపాధ్యాయులును, బంధువులును కూడ విశ్వామిత్రునకు ప్రదక్షిణ నమస్కారములు చేసిరి. 38

మూ. విశ్వామిత్రోఽపి ధర్మాత్మా సహరామః సలక్ష్మణః, 39
స్వవాటమభిచక్రామ పూజ్యమానో మహర్షిభిః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పఞ్చషష్టితమః సర్గః.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విశ్వామిత్రోఽపి = విశ్వామిత్రుడు కూడ, సహరామః = రామునితో కూడినవాడై, సలక్ష్మణః = లక్ష్మణునితో కూడినవాడై, మహర్షిభిః = మహర్షులచే, పూజ్యమానః = పూజింపబడుచున్నవాడై, స్వవాటమ్ = తన నివాసస్థానమును గూర్చి, అభిచక్రామ = నడచెను.

తా. ధర్మాత్ముడగు విశ్వామిత్రుడు రామలక్ష్మణసమేతుడై, మహర్షులు పూజింప తన నివాసస్థానమునకు వెళ్లెను. 39

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
అరువదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్షష్టితమః సర్గః

మూ. తతః ప్రభాతే విమలే కృతకర్మా నరాధిపః,
విశ్వామిత్రం మహాత్మానమాజుహావ సరాఘవమ్. 1

ప్ర. అ. తతః = పిమ్మట, విమలే = తెల్లవారిన, ప్రభాతే = ప్రాతః కాలమునందు, నరాధిపః = రాజు, కృతకర్మా = చేయబడిన ప్రాతఃకాలకృత్యములు కలవాడై, సరాఘవమ్ = రాఘవులతో కూడిన, మహాత్మానమ్ = మహాత్ముడైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని, ఆజుహావ = పిలచెను.

తా. తెల్లవారిన పిమ్మట జనకమహారాజు ప్రాతఃకాలకృత్యములను దీర్చుకొని, రామలక్ష్మణసమేతు డైన, మహాత్ము డైన విశ్వామిత్రుని పిలిపించెను. 1

మూ. తమర్చయిత్వా ధర్మాత్మా శాస్త్రదృష్టేన కర్మణా,
రాఘవౌ చ మహాత్మానౌ తదా వాక్యమువాచ హ. 2

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ము డైన జనకుడు, తమ్ = ఆ విశ్వామిత్రుని, మహాత్మానౌ = మహాత్ము లైన, రాఘవౌ చ = రామలక్ష్మణులను, శాస్త్రదృష్టేన = శాస్త్రమునందు చూడబడిన, కర్మణా = కర్మచేత, అర్చయిత్వా = పూజించి, తదా = అప్పుడు, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. జనకుడు, విశ్వామిత్రుని, రామలక్ష్మణులను యథావిధిగ పూజించి ఇట్లు పలికెను. 2

మూ. భగవన్ స్వాగతం తేఽస్తు కిం కరోమి తవానఘ,
భవానాజ్ఞాపయతు మామాజ్ఞాప్యో భవతా హ్యహమ్. 3

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము, అస్తు = అగుగాక. అనఘ = పాపములు లేనివాడా ! తవ = నీకు, కిమ్ = ఏమి, కరోమి = చేయుదును ? భవాన్ = నీవు, మామ్ = నన్ను, ఆజ్ఞాపయతు =

ఆజ్ఞాపింతువుగాక. అహమ్ = నేను, భవతా = నీచేత, ఆజ్ఞాప్యః హి = ఆజ్ఞాపింపదగినవాడను కదా.

తా. పూజ్యుడా! నీకు స్వాగత మగుగాక. పాపరహితుడా! నీ కేమి చేయుదును? నేను నీచే ఆజ్ఞాపింపదగినవాడను. ఆజ్ఞాపింపుము. 3

మూ. ఏవముక్తస్స ధర్మాత్మా జనకేన మహాత్మనా,
ప్రత్యువాచ మునిర్వీరం వాక్యం వాక్యవిశారదః. 4

ప్ర. అ. మహాత్మనా = మహాత్ము డైన, జనకేన = జనకునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ధర్మాత్మా = ధర్మాత్ము డైన, వాక్యవిశారదః = మాటలలో నేర్పు గల, సః = ఆ, మునిః = విశ్వామిత్రుడు, వీరమ్ = ఆ వీరుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. మహాత్ము డగు జనకుని మాటలు విని, ధర్మాత్ముడును మాటలలో నేర్పరియు అగు ఆ విశ్వామిత్రు డిట్లు పలికెను. 4

మూ పుత్రౌ దశరథస్యేమౌ క్షత్రియౌ లోకవిశ్రుతౌ,
ద్రష్టుకామౌ ధనుఃశ్రేష్ఠం యదేతత్త్వయి తిష్ఠతి. 5

ప్ర. అ. దశరథస్య = దశరథునియొక్క, పుత్రౌ = పుత్రులును, క్షత్రియౌ = క్షత్రియులును, లోకవిశ్రుతౌ = లోకములో ప్రసిద్ధులును అగు, ఇమౌ = వీరిరువురు, యత్ = ఏ, ధనుఃశ్రేష్ఠమ్ = శ్రేష్ఠ మైన ధనస్సు, త్వయి = నీయందు, తిష్ఠతి = ఉన్నదో, ఏతత్ = దానిని, ద్రష్టుకామౌ = చూడ కోరిక గలవారు.

తా. దశరథుని పుత్రులును, క్షత్రియులును, లోకప్రసిద్ధులును అగు ఈ రామలక్ష్మణులు నీవద్ద నున్న శ్రేష్ఠ మైన ధనస్సును చూడ దలచుచున్నారు. 5

మూ. ఏతద్దర్శయ భద్రం తే కృతకామౌ నృపాత్మజౌ,
దర్శనాదస్య ధనుషో యథేష్టం ప్రతియాస్యతః. 6

ప్ర. అ. ఏతత్ = ఈ ధనస్సును, దర్శయ = చూపుము. తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక. అస్య = ఈ, ధనుషః = ధనస్సు యొక్క, దర్శనాత్ = దర్శనమువలన, కృతకామౌ = తీరిన కోరిన గలవారై, నృపాత్మజౌ = ఈ రాజకుమారులు, యథేష్టమ్ = ఇష్టమువచ్చి నట్లుగా, ప్రతియాస్యతః = తిరిగి వెళ్లగలరు.

తా. ఆ ధనస్సును చూపుము. నీకు భద్ర మగుగాక. ఈ రాజకుమారులు దానిని చూచి, కోరిక తీరినవారై వారి ఇష్టము ప్రకారము తిరిగి వెళ్లెదరు. 6

మూ. ఏవముక్తస్తు జనకః ప్రత్యువాచ మహామునిమ్,
ప్రూయతామస్య ధనుషో యదర్థమిహ తిష్ఠతి. 7

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, జనకుడు, మహామునిమ్ = మహామునిని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. ఇహ = ఇచట, యదర్థమ్ = ఎందు నిమిత్తమై, తిష్ఠతి = ఉన్నదో, అస్య = ఈ, ధనుషః = ధనస్సునకు సంబంధించిన ఆ వృత్తాంతము, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. విశ్వామిత్రుని మాటలు విని జనకు డీవిధముగ ప్రతివచనము పలికెను. "ఈ ధనస్సు ఇచట ఎందువలన ఉన్నదో ఆ వృత్తాంతమును చెప్పెదను, వినుము. 7

మూ. దేవరాత ఇతి ఖ్యాతో నిమేః షష్ఠో మహీపతిః,
న్యాసోఽయం తస్య భగవన్ హస్తే దత్తో మహాత్మనా. 8

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! నిమేః = నిమినుండి, షష్ఠః = ఆరవవాడైన, దేవరాతః ఇతి = దేవరాతు డని, ఖ్యాతః = ప్రసిద్ధు డైన, మహీపతిః = రాజు (ఉండెను). సః అయమ్ = ఆ యీ ధనస్సు, తస్య = ఆ రాజుయొక్క, హస్తే = హస్తమునందు, న్యాసః = దాచి మరల ఇవ్వవలసిన వస్తువుగా, మహాత్మనా = మహాత్ము డైన శివునిచేత, దత్తః = ఇవ్వబడినది.

తా. ఈ ధనస్సును మహాత్ము డైన శివుడు నిమిచక్రవర్తికి ఆరవవా డైన దేవరాతు డనెడు రాజువద్ద న్యాసముగా ఉంచెను. 8

మూ. దక్షయజ్ఞవధే పూర్వం ధనురాయమ్య వీర్యవాన్,
రుద్రస్తు త్రిదశాన్ రోషాత్సలీలమిదమబ్రవీత్. 9

ప్ర. అ. పూర్వమ్ = పూర్వము, దక్షయజ్ఞవధే=దక్షయజ్ఞవినాశము చేయు సమయమున, వీర్యవాన్=పరాక్రమవంతు డైన, రుద్రః=రుద్రుడు, ధనుః= ధనస్సును, ఆయమ్య = వంచి, త్రిదశాన్=దేవతలను గూర్చి, రోషాత్=కోపము వలన, సలీలమ్=విలాసముతో కూడినట్లుగా, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. పూర్వము దక్షయజ్ఞధ్వంస చేయుచు వీర్యవంతు డైన రుద్రుడు ధనస్సును వంచి, కుపితుడై దేవతలతో ఇట్లనెను. 9

మూ. యస్మాద్భాగార్థినో భాగాన్నాకల్పయత మే సురాః,
వరాఙ్గాణి మహార్హాణి ధనుషా శాతయామి వః. 10

ప్ర. అ. సురాః = దేవతలారా! భాగార్థినః = యజ్ఞభాగమును కోరు చున్న, మే = నాకు, యస్మాత్ = ఏ కారణమువలన, భాగాన్ = భాగములను, నాకల్పయత = కల్పింపలేదో, అందువలన, వః = మీ యొక్క, మహార్హాణి = విలువైన, వరాఙ్గాణి = శ్రేష్ఠ మైన అవయవములను, ధనుషా = ఈ ధనస్సుతో, శాతయామి = ఖండించెదను.

తా. దేవతలారా! యజ్ఞభాగముల నపేక్షించుచున్న నాకు మీరు యజ్ఞ భాగములను కల్పింపలేదు గాన ఈ ధనస్సుతో మీ శిరస్సులను ఖండించెదను. 10

మూ. తతో విమనసః సర్వే దేవా వై మునిపుఙ్గవ,
ప్రసాదయన్తి దేవేశం తేషాం ప్రీతోఽభవద్భవః. 11

ప్ర. అ. మునిపుఙ్గవ = ఓ మునిశ్రేష్ఠా! తతః = పిమ్మట, సర్వే = సమస్త మైన, దేవాః=దేవతలు, విమనసః=వ్యాకుల మైన మనస్సు కలవారై, దేవేశమ్= దేవేశు డైన శివుని, ప్రసాదయన్తి = అనుగ్రహింపచేసికొనిరి. భవః = శివుడు, తేషామ్ = వారి విషయమున, ప్రీతః = సంతసించినవాడు, అభవత్ = ఆయెను.

తా. మహామునీ ! పిమ్మట, ఆ దేవత లందరును భయపడి మహేశ్వరుని అనుగ్రహింపచేసుకొనగా ఆ మహేశ్వరుడు వారి విషయమున అనుగ్రహించెను. 11

మూ. ప్రీతియుక్తస్స సర్వేషాం దదౌ తేషాం మహాత్మనామ్,
తదేతద్దేవదేవస్య ధనూరత్నం మహాత్మనః, 12
న్యాసభూతం తదా న్యస్తమస్మాకం పూర్వకే విభో.

ప్ర. అ. సః = మహేశ్వరుడు, ప్రీతియుక్తః = ఆనందముతో కూడిన వాడై, తేషామ్ = ఆ, మహాత్మనామ్ = మహాత్ములకు, దదౌ = ఇచ్చెను, విభో = ప్రభూ ! మహాత్మనః = మహాత్ముడైన శివునియొక్క, తత్ = ఆ, ఏతత్ = ఈ, ధనూరత్నమ్ = శ్రేష్ఠమైన ధనస్సు, తదా = అప్పుడు, అస్మాకమ్ = మా యొక్క, పూర్వకే = పూర్వపురుషునియందు, న్యాసభూతమ్ = న్యాసముగా, న్యస్తమ్ = ఉంచబడినది.

తా. శివుడు దేవతల విషయమున అనుగ్రహించి ఆ ధనస్సును వారికి ఇచ్చివేయగా దానిని దేవతలు మా పూర్వపురుషుని వద్ద న్యాసముగా ఉంచిరి. 12

మూ. అథ మే కృషతః క్షేత్రం లాఙ్గలాదుత్థితా మయా, 13
క్షేత్రం శోధయతా లబ్ధా నామ్నా సీతేతి విశ్రుతా.

ప్ర. అ. అథ = పిమ్మట, మే = నేను, క్షేత్రమ్ = యాగభూమిని, కృషతః = దున్నుచుండగా, లాఙ్గలాత్ = నాగలినుండి, ఉత్థితా = వెడలినదియు, నామ్నా = పేరుచేత, సీతేతి = సీత అని, విశ్రుతా = ప్రసిద్ధురాలును అగు కన్య, క్షేత్రమ్ = ఆ క్షేత్రమును, శోధయతా = పరిశుద్ధము చేయుచున్న, మయా = నా చేత, లబ్ధా = పొందబడినది.

తా. నేనొకప్పుడు యజ్ఞభూమిని దున్ని పరిశుద్ధము చేయుచుండగా నాగలి నుండి బైటకు వచ్చిన సీత అను కన్య నాకు లభించినది. 13

మూ. భూతలాదుత్థితా సా తు వ్యవర్ధత మమాత్మజా, 14
వీర్యశుల్కేతి మే కన్యా స్థాపితేయమయోనిజా.

ప్ర.అ. భూతలాత్=భూతలమునుండి, ఉత్థితా=లేచిన, సా=ఆమె, మమ=నాయొక్క, ఆత్మజా=కుమార్తెగా, వ్యవర్ధత = పెరిగెను. అయోనిజా = స్త్రీ గర్భమునుండి పుట్టని, ఇయమ్=ఈ, కన్యా=కన్య, వీర్యశుల్కా = వీర్యమే శుల్కముగా కలది అని, మే=నాచేత, స్థాపితా=ఉంచబడినది.

తా. భూమినుండి బైటకు వచ్చిన ఆమె నా కుమార్తెగా పెరిగినది. అయోనిజ యైన ఈమెను వివాహ మాడవలె నన్న పరాక్రమమే శుల్క మని నేను నియమము చేసితిని. 14

మూ. భూతలాదుత్థితాం తాం తు వర్ధమానాం మమాత్మజామ్, 15
వరయామాసురాగమ్య రాజానో మునిపుఙ్గవ.

ప్ర. అ. మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠా! భూతలాత్ = భూతలమునుండి, ఉత్థితామ్=లేచినదియు, వర్ధమానామ్=పెరుగుచున్న, తామ్=ఆ, మమ ఆత్మజామ్=నా కుమార్తెను, రాజానః=రాజులు, ఆగమ్య=వచ్చి, వరయామాసుః= వరించిరి.

తా. మహామునీ! భూతలమునుండి ఆవిర్భవించి, నా కుమార్తెగా పెరుగు చున్న ఈమెను వివాహ మాడదలచి ఎందరో రాజులు వచ్చిరి. 15

మూ. తేషాం వరయతాం కన్యాం సర్వేషాం పృథివీక్షితామ్, 16
వీర్యశుల్కేతి భగవన్ న దదామి సుతామహమ్.

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! తేషామ్ = ఆ, సర్వేషామ్=సమస్తమైన, మహీక్షితామ్ = రాజులు, కన్యామ్ = కన్యను, వరయతామ్ = వరించుచుండగా, వీర్యశుల్కేతి = వీర్యశుల్క యని చెప్పి: అహమ్ = నేను, సుతామ్ = కుమార్తెను, న దదామి = ఇవ్వలేదు.

తా. మహామునీ! ఆ రాజు లందరును వచ్చి కన్య నిమ్మని కోరగా, నేను, ఈమె వీర్యశుల్క యని చెప్పి వారి కీయలేదు. 16

మూ. తతః సర్వే నృపతయః సమేత్య మునిపుఙ్గవ, 17
మిథిలామభ్యుపాగమ్య వీర్యజిజ్ఞాసవస్తదా.

ప్ర. అ. మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠా! తతః = పిమ్మట, సర్వే = సమస్తమైన, నృపతయః = రాజులు, సమేత్య = కలసి, తదా = అప్పుడు, వీర్యజిజ్ఞాసవః = తమ వీర్యమును తెలిసికొన దలచినవారై, మిథిలామ్ = మిథిలాపట్టణమును గూర్చి, అభ్యుపాగమ్య = వచ్చి, (ఉండిరి).

తా. మునిశ్రేష్ఠా! పిమ్మట ఆ రాజు లందరును కలిసి తమ బల మెంత యున్నదో పరీక్షించుకొన గోరి మిథిలకు వచ్చిరి. 17

మూ. తేషాం జిజ్ఞాసమానానాం వీర్యం ధనురుపాహృతమ్. 18
న శేకుర్గ్రహణే తస్య ధనుషస్తోలనేఽపి వా.

ప్ర. అ. వీర్యమ్ = బలమును, జిజ్ఞాసమానానామ్ = తెలియగోరుచున్న, తేషామ్ = వారికి, ధనుః = ధనస్సు, ఉపాహృతమ్ = తేబడినది. తస్య = ఆ, ధనుషః = ధనస్సుయొక్క, గ్రహణే = గ్రహించుటయందు గాని, తోలనేఽపి = కదల్చుటయందుగాని, న శేకుః = సమర్థులు కాకపోయిరి.

తా. తమ బలమును పరీక్షించ దలచిన వారికి ధనస్సును చూపగా దానిని పట్టుకొనుటకు గాని, కదల్చుటకు గాని వారికి శక్యము కాలేదు. 18

మూ. తేషాం వీర్యవతాం వీర్యమల్పం జ్ఞాత్వా మహామునే, 19
ప్రత్యాఖ్యాతా నృపతయస్తన్నిబోధ తపోధన.

ప్ర. అ. మహామునే = మహామునీ, తేషామ్ = ఆ, వీర్యవతామ్ = రాజుల యొక్క, వీర్యమ్ = బలమును, అల్పమ్ = అల్పమైనదానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, నృపతయః = ఆ రాజులు, ప్రత్యాఖ్యాతాః = నిరాకరింపబడినారు. తపోధన = విశ్వామిత్రమహర్షీ! తత్ = ఆవిషయమును, నిబోధ = తెలిసికొనుము.

తా. ఆ రాజుల బలము అల్ప మైన దని తెలిసికొని నేను వారికి సీత నీయ నిరాకరించితిని. విశ్వామిత్రమహర్షీ! ఈ విషయము తెలిసికొనుము. 19

మూ. తతః పరమకోపేన రాజానో మునిపుఙ్గవ,
న్యరున్ధన్ మిథిలాం సర్వే వీర్యసన్దేహమాగతాః. 20

ప్ర. అ. మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠుడా ! తతః = పిమ్మట, సర్వే = నమస్త మైన, రాజానః = రాజులు, వీర్యసన్దేహమ్ = తమ బలమును గూర్చిన నందేహ మును, ఆగతాః = పొందినవారై, పరమకోపేన = ఎక్కువ కోపముతో, మిథి లామ్ = మిథిలానగరమును, న్యరున్ధన్ = ముట్టడించిరి.

తా. మహామునీ ! ఈ విధముగ తమ బలము విషయమున నందేహము కలుగగా రాజు లందరును మిక్కిలి కోపించి మిథిలానగరమును ముట్ట డించిరి. 20

మూ. ఆత్మానమవధూతం తే విజ్ఞాయ నృపపుఙ్గవాః, 21
రోషేణ మహతావిష్టాః పీడయన్ మిథిలాం పురీమ్.

ప్ర. అ. తే = ఆ, నృపపుఙ్గవాః = రాజశ్రేష్ఠులు, ఆత్మానమ్ = తమను, అవధూతమ్ = తిరస్కరింపబడినవారినిగా, విజ్ఞాయ = తెలుసుకొని, మహతా = గొప్ప, కోపేన = కోపముతో, ఆవిష్టాః = కూడినవారై, మిథిలాం పురీమ్ = మిథిలానగరమును, పీడయన్ = బాధించిరి.

తా. ఆ రాజు లందరును ఇది ఒక అవమాన మని భావించి, కోపముతో మిథిలాపురిని బాధించిరి. 21

మూ. తతః సంవత్సరే పూర్ణే క్షయం యాతాని సర్వశః, 22
సాధనాని మునిశ్రేష్ఠ తతోఽహం భృశదుఃఖితః.

ప్ర. అ. మునిశ్రేష్ఠ = మునిశ్రేష్ఠుడా ! తతః = పిమ్మట, సంవత్సరే = సంవత్సరము, పూర్ణే = నిండిన దగుచుండగా, సర్వశః=అంతటను, సాధనాని= జీవనోపకరణములు, క్షయం యాతాని = క్షయము పొందినవి. తతః = అందు వలన, అహమ్ = నేను, భృశదుఃఖితః = చాల దుఃఖితుడ నైతిని.

తా. ఈ విధముగా సంవత్సరము గడవగా నగరములో నున్న జీవనోప కరణము లన్నియు తరిగిపోయినవి. దానితో నాకు చాల దుఃఖము కలిగెను. 22

మూ. తతో దేవగణాన్ సర్వాం స్తపసా౽హం ప్రసాదయమ్, 23
దదుశ్చ పరమప్రీతాశ్చతురఙ్గబలం సురాః.

ప్ర. అ. **తతః** = పిమ్మట, అహమ్ = నేను, తపసా = తపస్సుచేత, సర్వాన్ = సమస్తమైన, దేవగణాన్ = దేవగణములను, ప్రసాదయమ్ = అనుగ్రహింపచేసికొంటిని. సురాః = దేవతలు, పరమప్రీతాః = చాల సంతసించినవారై, చతురఙ్గబలమ్ = చతురంగసైన్యమును, దదుః = ఇచ్చిరి.

తా. అపుడు నేను తపస్సుచే దేవతల నందరిని అనుగ్రహింపచేసికొనగా వారు నాకు చతురంగబలమును ఇచ్చిరి. 23

మూ. తతో భగ్నా నృపతయో హన్యమానా దిశో యయుః, 24
అవీర్యా వీర్యసన్దిగ్ధాః సామాత్యాః పాపకర్మణః.

ప్ర. అ. తతః=పిమ్మట, అవీర్యాః=బలము లేనివారును, వీర్యసన్దిగ్ధాః= బలము విషయమున సందేహము కలవారును, పాపకర్మణః = పాపకర్మ కలవారును అగు, నృపతయః = రాజులు, హన్యమానాః = కొట్టబడుచున్నవారై, **భగ్నాః** = ఓడిపోయినవారై, సామాత్యాః = పరివారసమేతులై, దిశః = దిక్కులనుగూర్చి, యయుః = పారిపోయిరి.

తా. తమ బలమును గూర్చి సందేహము గల ఆ వీర్యశూన్యు లగు పాపాత్ము లైన రాజులు యుద్ధమునందు పరాజితులై, సపరివారముగ దిక్కులు పట్టి పారిపోయిరి. 24

మూ. తదేతన్మునిశార్దూల ధనుః పరమభాస్వరమ్, 25
రామలక్ష్మణయోశ్చాపి దర్శయిష్యామి సువ్రత.

ప్ర. అ. సువ్రత = మంచి వ్రతము గల, మునిశార్దూల = మునిశ్రేష్ఠుడా ! **తత్** = ఆ, ఏతత్ = ఈ, పరమభాస్వరమ్ = మిక్కిలి ప్రకాశించుచున్న, ధనుః = ధనస్సును, రామలక్ష్మణయోశ్చాపి = రామలక్ష్మణులకు కూడ, దర్శయిష్యామి = చూపగలను.

తా. ఓ మునిశ్రేష్ఠా ! మిక్కిలి ప్రకాశించు అట్టి ఈ ధనస్సును రామలక్ష్మణులకు కూడ చూపగలను. 25

మూ. యద్యస్య ధనుషో రామః కుర్యాదారోపణం మునే, 26
సుతామయోనిజాం సీతాం దద్యాం దాశరథేరహమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షట్షష్టితమః సర్గః.

ప్ర. అ. మునే = ఓ మునీ ! రామః = రాముడు, అస్య = ఈ, ధనుషః = ధనస్సుయొక్క, ఆరోపణమ్ = ఎక్కుపెట్టుటను, కుర్యాద్యది = చేసిన ట్లయితే అయోనిజామ్ = అయోనిజ యైన, సుతామ్ = కుమార్తె యగు, సీతామ్=సీతను, అహమ్ = నేను, దాశరథేః = రామునకు, దద్యామ్ = ఇచ్చెదను.

తా. మహామునీ ! రాము డీ ధనస్సును ఎక్కుపెట్టగలిగినచో, అయోనిజ యగు సీతను ఈతని కిచ్చెదను. 26

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
అరువది ఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తషష్టితమః సర్గః

మూ. జనకస్య వచః శ్రుత్వా విశ్వామిత్రో మహామునిః,
ధనుర్దర్శయ రామాయ ఇతి హోవాచ పార్థివమ్. 1

ప్ర. అ. మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, జనకస్య = జనకునియొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, రామాయ = రామునకు, ధనుః = ధనస్సును, దర్శయ = చూపుము, ఇతి = అని, పార్థివమ్ = రాజును గూర్చి, ఉవాచ హ = పలికెను.

తా. విశ్వామిత్రమహాముని జనకుని మాటలు విని, "రామునకు ఆ ధనస్సును చూపుము" అని ఆతనితో పల్కెను. 1

మూ. తతః స రాజా జనకః సామన్తాన్వ్యాదిదేశ హ,
ధనురానీయతాం దివ్యం గన్ధమాల్యవిభూషితమ్. 2

ప్ర. అ. తతః = పిమ్మట, సః = ఆ, రాజా = రాజైన, జనకః = జనకుడు, సామన్తాన్ = సామంతరాజులను, వ్యాదిదేశ హ = ఆజ్ఞాపించెను. గన్ధమాల్యవిభూషితమ్ = గంధమాల్యములచే అలంకరింపబడిన, దివ్యమ్ = దివ్యమైన, ధనుః = ధనస్సు, ఆనీయతామ్ = తీసికొనిరాబడుగాక.

తా. విశ్వామిత్రుని వాక్యము విని జనకమహారాజు గంధమాల్యాదులచే అలంకరించిన ఆ దివ్యధనస్సును తీసికొని రండు అని సామంతులను ఆజ్ఞాపించెను. 2

మూ. జనకేన సమాదిష్టాః సచివాః ప్రావిశన్ పురీమ్,
తద్ధనుః పురతః కృత్వా నిర్జగ్ముః పార్థివాజ్ఞయా. 3

ప్ర. అ. జనకేన = జనకునిచేత, సమాదిష్టాః = ఆజ్ఞాపింపబడిన, సచివాః = మంత్రులు, పురీమ్ = పట్టణమును, ప్రావిశన్ = ప్రవేశించిరి. తద్ధనుః = ఆ ధన

స్సును, పార్థివాజ్ఞయా = రాజుయొక్క ఆజ్ఞచేత, పురతః = ఎదుట, కృత్వా = ఉంచుకొని, నిర్జగ్ముః = బయలుదేరిరి.

తా. జనకుని ఆజ్ఞ ప్రకారము మంత్రులు నగరమును ప్రవేశించి ఆ ధనస్సును ముందిడుకొని బయలుదేరి వచ్చిరి. 3

మూ. నృణాం శతాని పఞ్చాశద్వ్యాయతానాం మహాత్మనామ్,
మఞ్జూషామష్టచక్రాం తాం సమూహుస్తే కథంచన. 4

ప్ర. అ. మహాత్మనామ్ = గొప్ప బలము కలవారును, వ్యాయతానామ్ = పొడగరులును అగు, నృణామ్ = పురుషుల, పఞ్చాశత్ = ఏబది, శతాని = వందలు, అష్టచక్రామ్ = ఎనిమిది చక్రములు గల, మఞ్జూషామ్ = పెట్టెను, సమూహుః = లాగికొని వచ్చిరి. తే = వారు, తామ్ = ఆపెట్టెను, కథంచన = అతికష్టముగ, (లాగికొనివచ్చిరి).

తా. మంచి బలము కలవారును, దీర్ఘకాయులును అగు ఏబది వందల మంది పురుషులు ఆ ధనస్సు ఉంచిన పెట్టెను అతికష్టముగ లాగికొని వచ్చిరి. 4

మూ. తామాదాయ తు మఞ్జూషామాయసీం యత్ర తద్ధనుః,
సురోపమం తే జనకమూచుర్నృపతిమన్త్రిణః. 5

ప్ర. అ. తే = ఆ, నృపతిమన్త్రిణః = రాజుయొక్క మంత్రులు, యత్ర = ఏ పెట్టెయందు, తత్ = ఆ, ధనుః = ధనస్సు ఉన్నదో, తామ్ = ఆ, ఆయసీమ్ = ఇనుపదైన, మఞ్జూషామ్ = పెట్టెను, ఆదాయ = గ్రహించి, సురోపమమ్ = దేవతలతో సమానుడైన, జనకమ్ = జనకమహారాజును గూర్చి, ఊచుః = పలికిరి.

తా. జనకుని మంత్రులు ధనస్సు ఉన్న ఆ ఇనుప పెట్టెను తీసికొనివచ్చి, దేవతా సమానుడైన ఆతనితో ఇట్లనిరి. 5

మూ. ఇదం ధనుర్వరం రాజన్ పూజితం సర్వరాజభిః,
మిథిలాధిప రాజేన్ద్ర దర్శనీయం యదిచ్ఛసి. 6

ప్ర. అ. రాజేన్ద్ర = రాజశ్రేష్ఠుడా! మిథిలాధిప = మిథిలాప్రభువైన, రాజన్ = ఓ రాజా! యత్ = దేనిని, దర్శనీయమ్ = చూపదగినదానినిగా, ఇచ్ఛసి = కోరుచున్నావో, అట్టి, సర్వరాజభిః = సమస్తరాజులచేతను, పూజితమ్ = పూజింపబడిన, ధనుర్వరమ్ = శ్రేష్ఠమైన ధనస్సు, ఇదమ్ = ఇదిగో.

తా. రాజులలో శ్రేష్ఠుడవైన ఓ మిథిలాధిపతీ! నీవు దేనిని రామునకు చూపదలచుచున్నావో అట్టి, సర్వరాజపూజిత మగు శ్రేష్ఠధనస్సు ఇదిగో. 6

మూ. తేషాం నృపో వచః శ్రుత్వా కృతాఞ్జలిరభాషత,
విశ్వామిత్రం మహాత్మానం తౌ చోభౌ రామలక్ష్మణౌ. 7

ప్ర. అ. నృపః = రాజు, తేషామ్ = వారియొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలికలవాడై, మహాత్మానమ్ = మహాత్ముడైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చియు, తౌ = ఆ, ఉభౌ = ఇద్దరైన, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులను గూర్చియు, అభాషత = పలికెను.

తా. రాజు వారి వాక్యము విని, కరములు జోడించి, మహాత్ముడైన విశ్వామిత్రునితోను, రామలక్ష్మణులతోను ఇట్లు పలికెను. 7

మూ. ఇదం ధనుర్వరం బ్రహ్మన్ జనకైరభిపూజితమ్,
రాజభిశ్చ మహావీర్యైరశక్తైః పూరితుం పురా. 8

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణోత్తమా! జనకైః = జనకవంశీయులచేతను, పురా = పూర్వము, పూరితుమ్ = ఎక్కుపెట్టుటకు, అశక్తైః = అసమర్థులైన, మహావీర్యైః = గొప్ప పరాక్రమము గల, రాజభిశ్చ = రాజులచేతను, అభిపూజితమ్ = పూజింపబడిన, ధనుర్వరమ్ = శ్రేష్ఠ మైన ధనస్సు, ఇదమ్ = ఇదే.

తా. విశ్వామిత్రమహామునీ! మా జనకవంశీయులును, పూర్వము దీనిని ఎక్కుపెట్టపోయి విఫలు లైన మహావీర్యవంతు లగు రాజులును పూజించిన శ్రేష్ఠ ధనస్సు ఇదియే. 8

మూ. నైతత్సురగణాః సర్వే నాసురా న చ రాక్షసాః,
గన్ధర్వయక్షప్రవరాస్సకిన్నరమహోరగాః. 9

ప్ర. అ. ఏతత్ = దీనిని (ఎక్కుపెట్టుటకు) సర్వే = సమస్తమైన, సుర గణాః = దేవతాగణములు, న = సమర్థులు కాలేదు. అసురాః = అసురులు, న = సమర్థులు కాలేదు. రాక్షసాః = రాక్షసులును, సకిన్నరమహోరగాః = కింనరులతోడను, మహోరగులతోడను కూడిన, గన్ధర్వయక్షప్రవరాః = గంధర్వయక్షశ్రేష్ఠులును, న = సమర్థులు కాలేదు.

తా. సురగణములు కాని, అసురులు కాని, రాక్షసులు కాని, గంధర్వ-యక్ష-కిన్నర-మహోరగులు గాని దీనిని ఎక్కుపెట్టజాలకపోయిరి. 9

మూ. క్వ గతిర్మానుషాణాం చ ధనుషోఽస్య ప్రపూరణే,
ఆరోపణే సమాయోగే వేపనే తోలనేఽపి వా. 10

ప్ర. అ. అస్య = ఈ ధనస్సుయొక్క, ప్రపూరణే = వంచుటయందుగాని, ఆరోపణే = నారిని ఎక్కించుటయందు గాని, సమాయోగే = బాణమును సంధించుటయందు గాని, వేపనే = నారిని లాగుటయందు గాని, తోలనేఽపి వా = కదల్చుటయందు గాని, మానుషాణామ్ = మనుష్యులకు, గతిః = గతి, క్వ = ఎక్కడ.

తా. ఈ ధనస్సును వంచుటకు గాని, నారి కట్టుటకు గాని, బాణము సంధించుటకు గాని, నారిని లాగుటకు గాని, కదల్చుటకు గాని మనుష్యులకు శక్తి ఎక్కడిది? 10

మూ. తదేతద్ధనుషాం శ్రేష్ఠమానీతం మునిపుఙ్గవ,
దర్శయైతన్మహాభాగ అనయో రాజపుత్రయోః. 11

ప్ర. అ. మునిపుఙ్గవ = మునిశ్రేష్ఠా, తత్ = అట్టి, ఏతత్ = ఈ, ధనుషామ్ = ధనస్సులలో, శ్రేష్ఠమ్ = శ్రేష్ఠమైన ధనస్సు, ఆనీతమ్ = తీసికొనిరాబడినది. మహాభాగ = మహాభాగ్యవంతుడా! ఏతత్ = దీనిని, అనయోః = ఈ, రాజపుత్రయోః = రాజపుత్రులకు, దర్శయ = చూపుము.

తా. ఓ మునిశ్రేష్ఠా ! అట్టి ఈ ధనస్సును తీసికొని వచ్చినారు. దీనిని ఈ రాజపుత్రులకు చూపుము. 11

మూ. విశ్వామిత్రస్తు ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితమ్,
వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్. 12

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడైన, విశ్వామిత్రస్తు = విశ్వామిత్రుడైతే, జనకభాషితమ్ = జనకునిమాటను, శ్రుత్వా = విని, వత్స = నాయనా ! రామ = రామా ! ధనుః = ధనస్సును, పశ్య = చూడుము, ఇతి = అని, రాఘవమ్ = రామునిగూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు జనకుని మాటలు విని– "వత్సా ! రామా ! ఆ ధనస్సును చూడు" అని రామునితో పలికెను. 12

మూ. బ్రహ్మర్షేర్వచనాద్రామో యత్ర తిష్ఠతి తద్ధనుః,
మఞ్జూషాం తామపావృత్య దృష్ట్వా ధనురథాబ్రవీత్. 13

ప్ర. అ. రామః = రాముడు, బ్రహ్మర్షేః = బ్రహ్మర్షియొక్క, వచనాత్= వచనమువలన, తత్ = ఆ, ధనుః = ధనస్సు, యత్ర = దేనియందు, తిష్ఠతి = ఉన్నదో, తామ్ = అట్టి, మఞ్జూషామ్ = పెట్టెను, అపాకృత్య = తెరచి, ధనుః= ధనస్సును, దృష్ట్వా = చూచి, అథ = పిమ్మట, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ బ్రహ్మర్షి ఆదేశానుసారము రాముడు ధనస్సు ఉన్న ఆ పెట్టెను తెరిచి, ధనస్సును చూచి, ఇట్లు పలికెను. 13

మూ. ఇదం ధనుర్వరం బ్రహ్మన్ సంస్పృశామీహ పాణినా,
యత్నవాంశ్చ భవిష్యామి తోలనే పూరణేఽపి వా. 14

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రహ్మర్షీ ! ఇహ = ఇప్పుడు, ఇదమ్=ఈ, ధనుర్వరమ్ = శ్రేష్ఠమైన ధనస్సును, పాణినా = హస్తముచేత, సంస్పృశామి = స్పృశింతును. తోలనే = కదల్చుటయందు గాని, పూరణేఽపి వా=ఎక్కుపెట్టుటయందు గాని, యత్నవాన్ = ప్రయత్నముకలవాడను, భవిష్యామి = కాగలను.

తా. బ్రహ్మర్షీ! ఇపుడీ శ్రేష్ఠమైన ధనస్సును హస్తముతో స్పృశించెదను. దానిని కదల్చుటకు గాని శక్యమైనచో ఎక్కుపెట్టుటకు గాని ప్రయత్నించెదను. 14

మూ. బాఢమిత్యేవ తం రాజా మునిశ్చ సమభాషత,
లీలయా స ధనుర్మధ్యే జగ్రాహ వచనాన్మునేః. 15

ప్ర. అ. రాజా = రాజును, మునిశ్చ = మునియు, బాఢమ్ ఇత్యేవ = సరే అని, తమ్ = ఆరాముని గూర్చి, సమభాషత = పలికెను. సః = రాముడు, మునేః = మునియొక్క, వచనాత్ = వచనమువలన, ధనుః = ధనస్సును, మధ్యే = మధ్యయందు, లీలయా = అనాయాసముగా, జగ్రాహ = పట్టుకొనెను.

తా. "అటులే చేయుము" అని జనకమహారాజును, విశ్వామిత్రుడును పలికిరి. విశ్వామిత్రుని ఆజ్ఞ ప్రకారము రాముడు అనాయాసముగా ఆ ధనస్సును మధ్యయందు పట్టుకొనెను. 15

మూ. పశ్యతాం నృసహస్రాణాం బహూనాం రఘునన్దనః,
ఆరోపయత్స ధర్మాత్మా సలీలమివ తద్ధనుః. 16

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ము డైన, సః = ఆ, రఘునన్దనః = రాముడు, బహూనామ్ = అనేకు లైన, నృసహస్రాణామ్ = వేలకొలది జనులు, పశ్యతామ్ = చూచుచుండగా, తత్ = ఆ, ధనుః = ధనస్సును, సలీలమివ = అనాయాసముగా, ఆరోపయత్ = ఎక్కుపెట్టెను.

తా. ధర్మాత్ము డైన ఆ రఘునందనుడు, వేలకొలది జనులు చూచుచుండగా ఆ ధనస్సును అనాయాసముగ ఎక్కుపెట్టెను. 16

మూ. ఆరోపయిత్వా ధర్మాత్మా పూరయామాస తద్ధనుః,
తద్బభఞ్జ ధనుర్మధ్యే నరశ్రేష్ఠో మహాయశాః. 17

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ము డైన ఆ రాముడు, తత్ = ఆ, ధనుః = ధనస్సును, ఆరోపయిత్వా = ఎక్కుపెట్టి, పూరయామాస = ఆకర్ణాంతము

లాగెను. మహాయశాః = గొప్ప కీర్తి గల, నరశ్రేష్ఠః = ఆ నరశ్రేష్ఠుడు, తత్ = ఆ, ధనుః = ధనస్సును, మద్యే = మధ్యయందు, బభఞ్జ = విరచెను.

తా. ధర్మాత్ముడును, మహాయశఃశాలియు, నరశ్రేష్ఠుడును అగు ఆ రాముడు ఆ ధనస్సును ఎక్కుపెట్టి, నారిని ఆకర్ణాంతము లాగి దానిని విరచివేసెను. 17

మూ. తస్య శబ్దో మహానాసీన్నిర్ఘాతసమనిస్వనః,
భూమికమ్పశ్చ సుమహాన్ పర్వత స్యేవ దీర్యతః. 18

ప్ర. అ. తస్య = దానియొక్క, శబ్దః = శబ్దము, నిర్ఘాతసమనిస్వనః = పిడుగుతో సమాన మైన ధ్వని కలది గాను, మహాన్ = చాలపెద్దదిగాను, ఆసీత్ = ఆయెను. పర్వతస్య = పర్వతము. దీర్యతః ఇవ = బ్రద్దలగుచున్నపుడు వలె, సుమహాన్ = చాల పెద్దదైన, భూమికమ్పశ్చ = భూకంపము గూడ కలిగెను.

తా. ఆ ధనస్సు విరిగి నపుడు పిడుగు ధ్వనితో సమాన మైన గొప్ప ధ్వని వచ్చెను. పర్వతము బ్రద్దలగు చున్నపుడు అదరినట్లు భూమి అదరెను. 18

మూ. నిపేతుశ్చ నరాః సర్వే తేన శబ్దేన మోహితాః,
వర్జయిత్వా మునివరం రాజానం తౌ చ రాఘవౌ. 19

ప్ర. అ. తేన = ఆ, శబ్దేన = శబ్దముచేత, మోహితాః = మూర్ఛితులై, మునివరం = విశ్వామిత్రుని, రాజానమ్ = జనకుని, తౌ = ఆ, రాఘవౌ చ = రాఘవులను, వర్జయిత్వా = విడచి, సర్వే = నమస్త మైన, నరాః = మనుష్యులు, నిపేతుః = పడిరి.

తా. విశ్వామిత్ర–జనక–రామలక్ష్మణులు తప్ప మిగిలిన జను లందరును ఆ ధ్వనికి మూర్ఛితులై క్రింద పడిరి. 19

మూ. ప్రత్యాశ్వస్తే జనే తస్మిన్రాజా విగతసాధ్వసః,
ఉవాచ ప్రాఞ్జలిర్వాక్యం వాక్యజ్ఞో మునిపుఙ్గవమ్. 20

ప్ర. అ. తస్మిన్ = ఆ, జనే = జనము, ప్రత్యాశ్వస్తే = ఊరడిల్లినదగు-

చుండగా, వాక్యజ్ఞః = మాటలలో నేర్పుగల, రాజా = రాజు, విగతసాధ్వసః = భయము లేనివాడై, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలికలవాడై, మునిపుఙ్గవమ్ = మునిశ్రేష్ఠుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అచట వారందరు యథాపూర్వస్థితికి వచ్చిన పిమ్మట మాటలలో నేర్పరి యైన జనకుడు, కంగారు లేనివాడై, ఆ మునిశ్రేష్ఠునితో ఇట్లు పలికెను. 20

మూ. భగవన్ దృష్టవీర్యో మే రామో దశరథాత్మజః, 21
అత్యద్భుతమచిన్త్యం చ న తర్కితమిదం మయా.

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! దశరథాత్మజః = దశరథకుమారు డైన, రామః = రాముడు, మే = నాచేత, దృష్టవీర్యః = చూడబడిన పరాక్రమము కలవాడు. అత్యద్భుతమ్ = చాల ఆశ్చర్యకరము, అచిన్త్యం చ = ఊహింపరానిదియు అగు, ఇదమ్ = ఇది, మయా = నాచేత, న తర్కితమ్ = ఊహింపబడలేదు.

తా. మహామునీ ! దశరథాత్మజు డైన రాముని వీర్యమును ప్రత్యక్షముగ చూచితిని. అత్యద్భుతము, ఊహింప అశక్యము అగు ఈ కార్య మిట్లు జరుగునని నేను అనుకొనలేదు. 21

మూ. జనకానాం కులే కీర్తిమాహరిష్యతి మే సుతా, 22
సీతా భర్తారమాసాద్య రామం దశరథాత్మజమ్.

ప్ర. అ. మే=నాయొక్క, సుతా = కుమార్తె యైన, సీతా=సీత, దశరథాత్మజమ్ = దశరథునికుమారుడైన, రామమ్ = రాముని, భర్తారమ్=భర్తనుగా, ఆసాద్య=పొంది, జనకానామ్=జనకులయొక్క, కులే=కులమునందు, కీర్తిమ్= కీర్తిని, ఆహరిష్యతి = తీసికొని రాగలదు.

తా. నా కుమార్తె యైన సీత దశరథుని పుత్రు డైన రాముని భర్తగా పొంది మా వంశమునకు కీర్తిని తీసికొని రాగలదు. 22

మూ. మమ సత్యా ప్రతిజ్ఞా చ వీర్యశుల్కేతి కౌశిక,
సీతా ప్రాణైర్బహుమతా దేయా రామాయ మే సుతా. 23

ప్ర. అ. కౌశిక = విశ్వామిత్రా! వీర్యశుల్కేతి = వీర్యశుల్క అని, మమ=నాయొక్క, ప్రతిజ్ఞా చ=ప్రతిజ్ఞ కూడ, సత్యా = నిజ మైనది. ప్రాణైః= నాప్రాణములతో, బహుమతా = నమముగా ఆదరింపబడిన, మే = నాయొక్క, సుతా = కుమార్తె యైన, సీతా = సీత, రామాయ = రామునకు, దేయా = ఇవ్వ దగినది.

తా. విశ్వామిత్ర మహామునీ! నా కుమార్తె యగు సీతను వివాహమాడు టకు వీర్యమే శుల్క మని నేను చేసిన ప్రతిజ్ఞ ఇపుడు సత్య మైనది. నా ప్రాణము లతో నమానురా లగు ఈమెను రామున కిచ్చెదను. 23

మూ. భవతోఽనుమతే బ్రహ్మన్ శీఘ్రం గచ్ఛన్తు మన్త్రిణః, 24
మమ కౌశిక భద్రం తే అయోధ్యాం త్వరితా రథైః.

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ బ్రాహ్మణోత్తమా! కౌశిక = విశ్వామిత్రా! భవతః = నీయొక్క, అనుమతే = అనుమతియందు, మన్త్రిణః = మంత్రులు, త్వరితాః = తొందర గలవారై, రథైః = రథములచేత, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, శీఘ్రమ్ = శీఘ్రముగా, గచ్ఛన్తు = వెళ్లెదరుగాక. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. విశ్వామిత్రమహర్షీ! నీ ఆజ్ఞ ప్రకారము నా మంత్రులు రథముల నధిరోహించి శీఘ్రముగా అయోధ్యకు వెళ్లెదరుగాక. నీకు భద్ర మగు గాక. 24

మూ. రాజానం ప్రశ్రితైర్వాక్యైరానయన్తు పురం మమ, 25
ప్రదానం వీర్యశుల్కాయాః కథయన్తు చ సర్వశః.

ప్ర. అ. వీర్యశుల్కాయాః=వీర్యశుల్క యైన సీతయొక్క, ప్రదానమ్= రామున కిచ్చుటను, సర్వశః = పూర్తిగా, కథయన్తు=చెప్పుదురుగాక. ప్రశ్రితైః= వినయపూర్వక మైన, వాక్యైః = వాక్యములచేత, రాజానమ్ = దశరథ మహా రాజును, మమ = నాయొక్క, పురమ్ = పురమును గూర్చి, ఆనయన్తు = తీసి కొని వచ్చెదరు గాక.

తా. వీర్యశుల్క యగు సీతను రామున కీయ నిర్ణయించుట మొదలగు

వృత్తాంతము నంతను సవినయముగ దశరథునకు తెలిపి ఆతనిని నా నగరమునకు తీసికొని వచ్చెదరు గాక. 25

మూ. మునిగుప్తౌ చ కాకుత్స్థౌ కథయన్తు నృపాయ వై, 26
ప్రీయమాణం తు రాజానమానయన్తు సుశీఘ్రగాః.

ప్ర. అ. కాకుత్స్థౌ = రామలక్ష్మణులను, మునిగుప్తౌ = మునిచేత రక్షింపబడినవారినిగా, నృపాయ = దశరథునకు, కథయన్తు = చెప్పెదరుగాక. సుశీఘ్రగాః = చాల శీఘ్రముగా పోయినవారై, ప్రీయమాణమ్ = ఆనందించుచున్న, రాజానమ్ = రాజును, ఆనయన్తు = తీసికొని వచ్చెదరుగాక.

తా. శీఘ్రముగ వెళ్లి, రామలక్ష్మణులు విశ్వామిత్రుని సంరక్షణలో నున్నారని దశరథునకు తెలిపి, సంతోషించిన ఆతనిని తీసికొనివత్తురుగాక. 26

మూ. కౌశికశ్చ తథేత్యాహ రాజా చాభాష్య మన్త్రిణః, 27
అయోధ్యాం ప్రేషయామాస ధర్మాత్మా కృతశాసనాన్,
యథావృత్తం సమాఖ్యాతుమానేతుం చ నృపం తదా. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
సప్తషష్టితమః సర్గః.

ప్ర. అ. కౌశికశ్చ = విశ్వామిత్రుడు కూడ, తథేతి = అటులనే అగుగాక అని, ఆహ = పలికెను. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రాజా చ = జనకుడు కూడ, మన్త్రిణః = మంత్రులను, ఆభాష్య = సంప్రదించి, తదా = అప్పుడు, యథావృత్తమ్ = జరిగినది జరిగినట్లుగా, సమాఖ్యాతుమ్ = చెప్పుటకును, నృపమ్ = రాజును, ఆనేతుం చ = తీసికొని వచ్చుటకును, కృతశాసనాన్ = అనుచరులను, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, ప్రేషయామాస = పంపెను.

తా. అటులే చేయు మని విశ్వామిత్రుడు పలుకగా జనకమహారాజు మంత్రులతో సంప్రదించి, దశరథునకు జరిగిన దంతయు చెప్పి ఆతనిని తీసికొని వచ్చుటకై తన ఆజ్ఞానిర్వాహకు లగు భృత్యులను అయోధ్యకు పంపెను. 27-28

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
అరువది యేడవ సర్గ సమాప్తము.

అథ అష్టషష్టితమః సర్గః

మూ. జనకేన సమాదిష్టా దూతాస్తే క్లాన్తవాహనాః,
త్రిరాత్రముషితా మార్గే తేఽయోధ్యాం ప్రావిశన్ పురీమ్. 1

ప్ర. అ. జనకేన = జనకునిచేత, సమాదిష్టాః = ఆజ్ఞాపింపబడిన, తే = ఆ, దూతాః = దూతలు, మార్గే = మార్గమునందు, త్రిరాత్రమ్ = మూడు రాత్రులు, ఉషితాః = ఉన్నవారై, క్లాన్తవాహనాః = అలసిపోయిన అశ్వములు కలవారై, అయోధ్యాం పురీమ్ = అయోధ్యానగరమును, ప్రావిశన్ = ప్రవేశించిరి.

తా. జనకు డాజ్ఞాపించిన దూతలు మూడు దినములు ప్రయాణము చేసి, అలసిపోయిన గుఱ్ఱములతో అయోధ్యానగరము చేరిరి. 1

మూ. రాజ్ఞో భవనమాసాద్య ద్వారస్థానిదమబ్రువన్,
శీఘ్రం నివేద్యతాం రాజ్ఞే దూతాన్నో జనకస్య చ. 2

ప్ర. అ. రాజ్ఞః = రాజుయొక్క, భవనమ్ = భవనమును, ఆసాద్య = పొంది, ద్వారస్థాన్ = ద్వారపాలకులను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యము, అబ్రువన్ = పలికిరి. జనకస్య = జనకమహారాజుయొక్క, దూతాన్ = దూతల మైన, నః = మమ్ములను గూర్చి, శీఘ్రమ్ = శీఘ్రముగా, రాజ్ఞే = రాజుకు, నివేద్యతామ్ = తెలుపబడుగాక.

తా. అచట రాజభవనమునకు వెళ్లి, ద్వారపాలకులతో— "జనకమహారాజు దూతలు వచ్చినా రని దశరథమహారాజుతో చెప్పుడు" అని పల్కిరి. 2

మూ. ఇత్యుక్తా ద్వారపాలాస్తే రాఘవాయ న్యవేదయన్,
తే రాజవచనాద్దూతా రాజవేశ్మ ప్రవేశితాః, 3
దదృశుర్దేవసఙ్కాశం వృద్ధం దశరథం నృపమ్.

ప్ర. అ. ఇతి = ఇట్లు, ఉక్తాః = పలకబడిన, తే = ఆ, ద్వారపాలాః = ద్వారపాలులు, రాఘవాయ = దశరథునకు, న్యవేదయన్ = తెలిపిరి. తే = ఆ,

దూతాః=దూతలు, రాజవచనాత్ = రాజుయొక్క వచనమువలన, రాజవేశ్మ=రాజుయొక్క గృహమును, ప్రవేశితాః=ప్రవేశపెట్టబడినవారై, దేవసంకాశమ్=దేవతలతో సమానుడును, వృద్ధమ్ = వృద్ధుడును అగు, దశరథం నృపమ్=దశరథమహారాజును, దదృశుః=చూచిరి.

తా. వారి మాటలు విని ద్వారపాలులు దశరథునకు నివేదించిరి. పిమ్మట రాజాజ్ఞ ప్రకారము రాజభవనములో ప్రవేశించిన ఆ దూతలు దేవతాసదృశుడును, వృద్ధుడును అగు దశరథుని చూచిరి. 3

మూ. బద్ధాఞ్జలిపుటాః సర్వే దూతా విగతసాధ్వసాః, 4
రాజానం ప్రయతా వాక్యమబ్రువన్ మధురాక్షరమ్.

ప్ర. అ. సర్వే=సమస్తమైన, దూతాః=దూతలు, బద్ధాఞ్జలిపుటాః=కట్టబడిన దోసిళ్లు కలవారై, విగతసాధ్వసాః = పోయిన భయము కలవారై, ప్రయతాః = నియమసంపన్నులై, రాజానమ్ = రాజును గూర్చి, మదురాక్షరమ్=మదురమైన అక్షరములు గల, వాక్యమ్ = వాక్యమును, అబ్రువన్=పలికిరి.

తా. ఆ దూత లందరును చేతులు జోడించి, కంగారు పడనివారై, నియమబద్ధులై దశరథునితో మధురాక్షరములు గల వాక్యమును పలికిరి. 4

మూ. మైథిలో జనకో రాజా సాగ్నిహోత్రపురస్కృతమ్, 5
కుశలం చావ్యయం చైవ సోపాధ్యాయపురోహితమ్,
ముహుర్ముహుర్మధురయా స్నేహసంయుక్తయా గిరా, 6
జనకస్త్వాం మహారాజ పృచ్ఛతే సపురస్సరమ్.

ప్ర. అ. మహారాజ = ఓ మహారాజా ! మైథిలః = మిథిలాధిపతియైన, జనకః రాజా = జనకమహారాజు, సాగ్నిహోత్రపురస్కృతమ్ = అగ్నిహోత్రాది కర్మలను పురస్కరించు వాడవును, సోపాధ్యాయపురోహితమ్ = ఉపాధ్యాయుల తోడను పురోహితులతోడను కూడినవాడవును, సపురస్సరమ్ = ముందు నడచు పరివారజనముతో కూడినవాడవును అగు, త్వామ్ = నిన్ను, మదురయా=మదురమైనదియు, స్నేహసంయుక్తయా = స్నేహముతో కూడినదియు అగు, గిరా=వాక్కుతో, కుశలం చ = కుశలమును, అవ్యయం చైవ=నాశము లేకుండుటను, ముహుః = మాటిమాటికిని, పృచ్ఛతే=అడుగుచున్నాడు.

తా. "మహారాజా ! మిథిలాధిపతి యైన, జనకమహారాజు, స్నేహపూర్ణ మగు మధుర మైన వాక్కుతో, అగ్నిహోత్రాదినిరతుడ వగు నీ యొక్కయు, నీ ఉపాధ్యాయులయొక్కయు, పురోహితులయొక్కయు, పరివారజనము యొక్కయు యోగక్షేమములను విచారించుచున్నాడు. 5-6

మూ. పృష్ట్వా కుశలమవ్యగ్రం వైదేహో మిథిలాధిపః, 7
కౌశికానుమతే వాక్యం భవన్తమిదమబ్రవీత్.

ప్ర. అ. మిథిలాధిపః=మిథిలాధిపతి యగు, వైదేహః=జనకుడు, అవ్యగ్రమ్=చిత్తవిక్షేపము లేకుండగ, కుశలమ్=క్షేమమును, పృష్ట్వా=అడిగి, కౌశికానుమతే = విశ్వామిత్రుని అనుమతి ప్రకారము, భవన్తమ్ = నిన్ను గూర్చి, ఇదమ్=ఈ, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. మిథిలాధీశు డగు జనకమహారాజు శ్రద్ధాపూర్వకముగ నిన్ను కుశల ప్రశ్న చేసి, కౌశికుని అనుమతి పొంది, నీతో ఈ మాట చెప్పుచున్నాడు. 7

మూ. పూర్వం ప్రతిజ్ఞా విదితా వీర్యశుల్కా మమాత్మజా, 8
రాజానశ్చ కృతామర్షా నిర్వీర్యా విముఖీకృతాః.

ప్ర. అ. ఆత్మజా=నా కుమార్తె, వీర్యశుల్కా = వీర్యశుల్కము కలది అను, పూర్వమ్=పూర్వము చేయబడిన, ప్రతిజ్ఞా=ప్రతిజ్ఞ, విదితా=అందరికిని తెలిసినదే. కృతామర్షాః=చేయబడిన అమర్షముగల, నిర్వీర్యాః = వీర్యరహితులైన, రాజానః చ=రాజులు కూడ, విముఖీకృతాః = విముఖులుగా చేయబడినారు.

తా. నా పుత్రిక వీర్యశుల్క యని నేను పూర్వము చేసిన ప్రతిజ్ఞ ప్రసిద్ధమే కదా. కోపించి వచ్చిన రాజులు నిర్వీర్యులై పరాజితులై పోయిరి. 8

మూ. సేయం మమ సుతా రాజన్ విశ్వామిత్రపురస్సరైః, 9
యదృచ్ఛయా గతైర్వీరై ర్నిర్జితా తవ పుత్రకైః.

ప్ర. అ. రాజన్=రాజా ! సా=ఆ, ఇయమ్=ఈ, మమ=నాయొక్క, సుతా=కుమార్తె, విశ్వామిత్రపురస్సరైః=విశ్వామిత్రుడు ముందు నడచువాడుగా

గల, యదృచ్ఛయా=దైవవశముచేత, ఆగతైః=వచ్చిన, తవ = నీయొక్క, వీరైః=వీరుడైన, పుత్రకైః=చిన్న పుత్రునిచేత, నిర్జితా=జయింపబడినది.

తా. దశరథమహారాజా! అట్టి నా ఈ పుత్రికను విశ్వామిత్రుని వెంట దైవవశముచే మిథిలకు వచ్చిన, వీరుడైన నీ చిన్నికుమారుడు, సంపాదించు కొన్నాడు.

వి. రాముడు వయస్సుచే చిన్నవాడు గావున "పుత్రకైః" అని కప్రత్యయము, గౌరవసూచకముగా బహువచనము ప్రయోగింపబడినవి. 9

మూ. తచ్చ రాజన్ ధనుర్దివ్యం మధ్యే భగ్నం మహాత్మనా, 10
రామేణ హి మహారాజ మహత్యాం జనసంసది.

ప్ర. అ. మహారాజ = రాజులలో గొప్పవాడవైన, రాజన్=దశరథా! తత్=ఆ, దివ్యమ్=దివ్యమైన, ధనుః = ధనస్సు, మహత్యామ్=గొప్పదైన, జనసంసది=జనుల సభయందు, మహాత్మనా=మహాత్ముడైన, రామేణ=రాముని చేత, మధ్యే=నడుమ, భగ్నమ్=విరవబడినది.

తా. దశరథమహారాజా! గొప్ప సభలో, మహాత్ముడైన రాముడు, ఆ దివ్యధనస్సును మధ్యకు విరచెను. 10

మూ. అస్మై దేయా మయా సీతా వీర్యశుల్కా మహాత్మనే, 11
ప్రతిజ్ఞాం కర్తుమిచ్ఛామి తదనుజ్ఞాతుమర్హసి.

ప్ర. అ. వీర్యశుల్కా=వీర్యశుల్క యైన, సీతా=సీత, అస్మై=ఈ మహాత్మనే=మహాత్మునకు, మయా=నాచేత, దేయా=ఇవ్వదగినది. ప్రతిజ్ఞామ్=ప్రతిజ్ఞను, కర్తుమ్=చేయుటకు, (నిలుపుకొనుటకు), ఇచ్ఛామి=కోరుచున్నాను. తత్ = ఆకారణమువలన, అనుజ్ఞాతుమ్ = అనుజ్ఞ ఇచ్చుటకు, అర్హసి = తగియున్నావు.

తా. వీర్యశుల్క యైన సీతను ఈ మహాత్మున కిచ్చి నా ప్రతిజ్ఞను నెరవేర్చుకొనవలెను గాన అందులకు అనుజ్ఞ ఇమ్ము. 11

మూ. సోపాధ్యాయో మహారాజ పురోహితపురఃసరః, 12
శీఘ్రమాగచ్ఛ భద్రం తే ద్రష్టుమర్హసి రాఘవౌ.

ప్ర. అ. మహారాజ = మహారాజా! సోపాధ్యాయః = ఋత్విక్కులతో కూడినవాడవై, పురోహితపురఃసరః=పురోహితుడు ముందు నడచువాడుగా కలవాడవై, (పురోహితుని ముందిడుకొని), శీఘ్రమ్=శీఘ్రముగా, ఆగచ్ఛ=రమ్ము. తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక. రాఘవౌ=రామలక్ష్మణులను, ద్రష్టుమ్=చూచుటకు, అర్హసి=తగియున్నావు.

తా. దశరథమహారాజా! నీకు క్షేమ మగుగాక. నీవు ఉపాధ్యాయ పురోహితసహితుడవై శీఘ్రముగ వచ్చి రామలక్ష్మణులను చూడుము. 12

మూ. ప్రీతిం చ మమ రాజేన్ద్ర నిర్వర్తయితుమర్హసి,
పుత్రయోరుభయోరేవ ప్రీతిం త్వమపి లప్స్యసే. 13

ప్ర. అ. రాజేన్ద్ర = రాజశ్రేష్ఠుడా! మమ = నాకు, ప్రీతిమ్ = ఆనందమును, నిర్వర్తయితుమ్ = కలిగించుటకు, అర్హసి=తగియున్నావు. త్వమపి = నీవు కూడ, ఉభయోః = ఇరువురు, పుత్రయోః = పుత్రులయొక్క, ప్రీతిమ్ = ఆనందమును, లప్స్యసే = పొందగలవు.

తా. దశరథమహారాజా! ఇచటికి వచ్చి నాకానందమును కలిగింపుము. నీకు కూడ పుత్రవివాహోత్సవాది దర్శనానందము కలుగగలదు. 13

మూ. ఏవం విదేహాధిపతిర్మధురం వాక్యమబ్రవీత్,
విశ్వామిత్రాభ్యనుజ్ఞాతః శతానన్దమతే స్థితః, 14
ఇత్యుక్త్వా విరతా దూతా రాజగౌరవశఙ్కితాః.

ప్ర. అ. విదేహాధిపతిః = విదేహదేశరాజు, విశ్వామిత్రాభ్యనుజ్ఞాతః = విశ్వామిత్రునిచే అనుజ్ఞ ఇవ్వబడినవాడై, శతానన్దమతే = శతానందునిమతమునందు, స్థితః = ఉన్నవాడై, ఏవమ్ = ఇట్లు, మధురమ్ = మధుర మైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. దూతాః = దూతలు, ఇతి = ఇట్లు,

ఉక్త్వా = పలికి, రాజగౌరవశఙ్కితాః = రాజుపై గౌరవముచే భయపడుచు, విరతాః = విరమించిరి.

తా. జనకమహారాజు విశ్వామిత్రుని అనుజ్ఞ పొంది, శతానందుని అనుమతి కూడ గ్రహించి ఈ విధముగ మధురవాక్యమును చెప్పినాడు". దూతలు ఈ విధముగా జనకుని సందేశమును వినిపించి రాజుపై గల గౌరవముచే అధికముగ మాటలాడ జంకి ఊరకుండిరి. 14

మూ. దూతవాక్యం చ తచ్ఛ్రుత్వా రాజా పరమహర్షితః,
వసిష్ఠం వామదేవం చ మన్త్రిణోఽన్యాంశ్చ సోఽబ్రవీత్. 15

ప్ర. అ. సః = ఆ, రాజా = రాజు, తత్ = ఆ, దూతవాక్యమ్ = దూతల వాక్యమును, శ్రుత్వా = విని, పరమహర్షితః = చాల సంతసించినవాడై, వసిష్ఠమ్ = వసిష్ఠుని, వామదేవం చ = వామదేవుని, అన్యాన్ = ఇతరులైన, మన్త్రిణశ్చ = మంత్రులను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. దూతవాక్యములు విన్న దశరథుడు మిక్కిలి సంతసించి, వసిష్ఠ వామదేవులతోడను, ఇతరమంత్రులతోడను ఇట్లు పలికెను. 15

మూ. గుప్తః కుశికపుత్రేణ కౌసల్యానన్దవర్ధనః,
లక్ష్మణేన సహ భ్రాత్రా విదేహేషు వసత్యసౌ. 16

ప్ర. అ. అసౌ = ఈ, కౌసల్యానన్దవర్ధనః = కౌసల్యానందమును వృద్ధి పొందించు రాముడు, కుశికపుత్రేణ = విశ్వామిత్రుని చేత, గుప్తః = రక్షింపబడినవాడై, భ్రాత్రా = సోదరుడైన లక్ష్మణునితో కూడ, విదేహేషు = విదేహదేశమునందు, వసతి = నివసించుచున్నాడు.

తా. కౌసల్యానందవర్ధనుడైన మన రాముడు విశ్వామిత్రపరిరక్షితుడై, సోదరుడైన లక్ష్మణునితో కూడ ఇపుడు విదేహదేశమునం దున్నాడు. 16

మూ. దృష్టవీర్యస్తు కాకుత్స్థో జనకేన మహాత్మనా,
సంప్రదానం సుతాయాస్తు రాఘవే కర్తుమిచ్ఛతి. 17

ప్ర. అ. కాకుత్థ్సః = రాముడు, మహాత్మనా = మహాత్ముడైన, జనకేన= జనకునిచేత, దృష్టవీర్యః = చూడబడిన పరాక్రమము కలవాడు. (ఆ జనకుడు), సుతాయాః = కుమార్తెయొక్క, సంప్రదానమ్ = దానమును, రాఘవే = రామునియందు, కర్తుమ్ = చేయుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు.

తా. మహాత్ముడైన జనకుడు రాముని పరాక్రమమును చూచి తన కుమార్తెను అతని కీయ గోరుచున్నాడు. 17

మూ. యది వో రోచతే వృత్తం జనకస్య మహాత్మనః,
పురీం గచ్ఛామహే శీఘ్రం మాభూత్కాలస్య పర్యయః. 18

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, జనకస్య = జనకునియొక్క, వృత్తమ్ = చరితము, వః = మీకు, రోచతే యది = ఇష్టమైనట్లైతే, శీఘ్రమ్ = శీఘ్రముగా, పురీమ్ = మిథిలాపట్టణమును గూర్చి, గచ్ఛామహే = వెళ్లుదము. కాలస్య = కాలముయొక్క, పర్యయః = జరుగుబాటు, మాభూత్ = లేకపోవుగాక.

తా. మహాత్ముడైన జనకుని ఆచారసంపత్తి మీకు నచ్చినట్లయితే విలంబమేమియు చేయక శీఘ్రముగ మిథిలాపురికి వెళ్లుదము. 18

మూ. మన్త్రిణో బాఢమిత్యాహుః సహ సర్వైర్మహర్షిభిః,
సుప్రీతశ్చాబ్రవీద్రాజా శ్వో యాత్రేతి స మన్త్రిణః. 19

ప్ర. అ. సర్వైః = సమస్తమైన, మహర్షిభిః సహ=మహర్షులతో గూడ, మన్త్రిణః = మంత్రులు, బాఢమితి = మంచిది అని, ఆహుః = పలికిరి. సుప్రీతః= మిక్కిలి సంతసించిన, సః = ఆ, రాజా = రాజు, శ్వః = రేపు, యాత్రా = ప్రయాణము, ఇతి = అని, మన్త్రిణః = మంత్రులను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. మంత్రులును, మహర్షు లందరును, "తప్పక అట్లే చేయుదము" అని పల్కగా దశరథుడు చాల సంతసించి "రేపే ప్రయాణము" అని మంత్రులతో అనెను. 19

మూ. మన్త్రిణస్తు నరేన్ద్రస్య రాత్రిం పరమసత్కృతాః,
ఊషుస్తే ముదితాః సర్వే గుణైః సర్వైః సమన్వితాః. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
అష్టషష్టితమః సర్గః.

ప్ర. అ. సర్వైః=సమస్తమైన, గుణైః = గుణములతో, సమన్వితాః= కూడిన, తే=ఆ, నరేన్ద్రస్య=జనకమహారాజుయొక్క, మన్త్రిణస్తు=మంత్రులైతే, పరమసత్కృతాః=చాలా సత్కరింపబడినవారై, ముదితాః = సంతసించినవారై, రాత్రిమ్=ఆ రాత్రి, ఊషుః=నివసించిరి.

తా. సకలసద్గుణ సంపన్నులగు జనకుని మంత్రులు మంచి సత్కారములనంది, సంతసించినవారై ఆ రాత్రి ఆ నగరముననే ఉండిపోయిరి. 20

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండలో
అరువదియెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనస ప్తతితమః సర్గః

మూ. తతో రాత్ర్యాం వ్యతీతాయాం సోపాధ్యాయః సబాన్ధవః,
రాజా దశరథో హృష్టః సుమన్త్రమిదమబ్రవీత్. 1

ప్ర. అ. సోపాధ్యాయః=ఉపాధ్యాయులతో గూడిన, సబాన్ధవః=బంధువులతో గూడిన, రాజా=రాజైన, దశరథః = దశరథుడు, హృష్టః=సంతసించినవాడై, తతః=పిమ్మట, రాత్ర్యామ్ = రాత్రి, వ్యతీతాయామ్ = గడచిన దగుచుండగా, సుమన్త్రమ్=సుమంత్రుని గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. రాత్రి గడచిన పిమ్మట, బంధువులతోను, ఉపాధ్యాయులతోను, కూడిన దశరథమహారాజు సంతసించి సుమంత్రునితో ఇట్లు పలికెను. 1

మూ. అద్య సర్వే ధనాధ్యక్షా ధనమాదాయ పుష్కలమ్,
వ్రజన్త్వగ్రే సువిహితా నానారత్నసమన్వితాః. 2

ప్ర. అ. అద్య=ఇప్పుడు, సర్వే = సమస్తమైన, ధనాధ్యక్షాః = ధనాగారాధ్యక్షులు, పుష్కలమ్ = అత్యధికమైన, ధనమ్=ధనమును, ఆదాయ=గ్రహించి, నానారత్నసమన్వితాః=అనేకవిధములైన రత్నములతో కూడినవారై, సువిహితాః=బాగుగా సిద్ధులై, అగ్రే=ముందు, యాన్తు=వెళ్లెదరుగాక.

తా. ధనాధ్యక్షు లందరును పుష్కలముగా ధనము తీసికొని, వివిధ రత్నములను గూడ గ్రహించి, బాగుగా సంసిద్ధులై ముందుగా వెళ్లెదరుగాక. 2

మూ. చతురఙ్గబలం చాపి శీఘ్రం నిర్యాతు సర్వశః,
మమాజ్ఞాసమకాలం చ యానయుగ్యమనుత్తమమ్. 3

ప్ర. అ. మమ=నాయొక్క, ఆజ్ఞాసమకాలమ్=ఆజ్ఞకు వెంటనే, చతురఙ్గబలమ్=చతురంగసైన్యము, సర్వశః = నలువైపులనుండి, నిర్యాతు=బయలు

దేరుగాక. అనుత్తమమ్=శ్రేష్ఠ మైన, యానయుగ్యమ్=పల్లకీలు, రథములు మొద లగునవి కూడ, (బయలుదేరుగాక).

తా. నేను ఆజ్ఞాపించిన క్షణమునందే చతురంగ బలసైన్యము, శ్రేష్ఠ మైన పలకీలు రథములు మొదలగునవియు బయలుదేరుగాక. 3

మూ. వసిష్ఠో వామదేవశ్చ జాబాలిరథ కాశ్యపః,
మార్కణ్డేయశ్చ దీర్ఘాయుః ఋషిః కాత్యాయనస్తథా. 4

ఏతే ద్విజాః ప్రయాన్త్వగ్రే స్యన్దనం యోజయస్వ మే,
యథా కాలాత్యయో న స్యాద్దూతా హి త్వరయన్తి మామ్. 5

ప్ర. అ. వసిష్ఠః = వసిష్ఠుడును, వామదేవశ్చ = వామదేవుడును, అథ= మరియు, జాబాలిః = జాబాలియు, కాశ్యపః = కాశ్యపుడును, దీర్ఘాయుః = దీర్ఘా యుర్దాయవంతు డగు, మార్కణ్డేయశ్చ=మార్కండేయుడును, తథా=మరియు, ఋషిః = ఋషి యైన, కాత్యాయనః = కాత్యాయనుడు, ఏతే = ఈ, ద్విజాః = బ్రాహ్మణులు, అగ్రే = ముందు, ప్రయాన్తు = నడచెదరుగాక. మే = నాయొక్క, స్యన్దనమ్ = రథమును, యోజయస్వ = కూర్చుము. కాలాత్యయః = కాలము గడచిపోవుట, యథా = ఎట్లు, న స్యాత్ = కాకుండునో, (అట్లు చేయుము). దూతాః = దూతలు, మామ్ = నన్ను, త్వరయన్తి హి = తొందర పెట్టుచున్నారు కదా.

తా. వసిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, దీర్ఘాయుర్దాయవంతు డైన మార్కండేయుడు, కాత్యాయనఋషి —ఈ బ్రాహ్మణు లందరును ముందు వెళ్లెదరుగాక. నా రథమును కూర్చి శీఘ్రముగ తీసికొని రమ్ము. విలంబము చేయవలదు. జనకుని దూతలు నన్ను తొందర పెట్టుచున్నారు. 4, 5

మూ. వచనాత్తు నరేన్ద్రస్య సా సేనా చతురఙ్గిణీ,
రాజానమృషిభిః సార్ధం వ్రజన్తం పృష్ఠతోఽన్వగాత్. 6

ప్ర. అ. నరేన్ద్రస్య = దశరథమహారాజుయొక్క, వచనాత్ = ఆజ్ఞ వలన, చతురఙ్గిణీ=నాలుగు అంగములు గల, సా=ఆ, సేనా=సేన, ఋషిభిః

సార్ధమ్ = ఋషులతో కూడ, వ్రజన్తమ్ = వెళ్లుచున్న, రాజానమ్ = రాజును, పృష్ఠతః = వెనుకనే, అన్వగాత్ = అనుసరించి వెళ్లెను.

తా. దశరథమహారాజు ఋషులతో కలిసి వెళ్లుచుండగా, అతని ఆజ్ఞాను సారము చతురంగబలము అతని వెనుకనే వెళ్లెను. 6

మూ. గత్వా చతురహం మార్గం విదేహానభ్యుపేయివాన్,
రాజా తు జనకః శ్రీమాన్ శ్రుత్వా పూజామకల్పయత్. 7

ప్ర. అ. చతురహమ్ = నాల్గు దినముల, మార్గమ్=మార్గమును, గత్వా = ప్రయాణము చేసి, విదేహాన్ = విదేహదేశమును, అభ్యుపేయివాన్ = చేరినాడు. రాజా = రాజైన, శ్రీమాన్ = శ్రీమంతుడైన, జనకః = జనకుడు, శ్రుత్వా=విని, పూజామ్ = పూజను, అకల్పయత్ = చేసెను.

తా. నాల్గు దివసముల మార్గ ప్రయాణము చేసి, దశరథుడు విదేహ దేశము చేరగా జనకమహారాజు ఆ విషయము విని, దశరథునకు ఆయా ప్రాంత ములలో తగు విధముగ సత్కారముల నేర్పరచెను. 7

మూ. తతో రాజానమాసాద్య వృద్ధం దశరథం నృపమ్,
జనకో ముదితో రాజా హర్షం చ పరమం యయౌ. 8

ప్ర. అ. తతః = పిమ్మట, రాజా = రాజైన, ముదితః = సంతసించిన, జనకః = జనకుడు, నృపమ్ = మనుష్యులకు పాలకుడును, రాజానమ్=రాజును, వృద్ధమ్ = వృద్ధుడును అగు, దశరథమ్ = దశరథుని, ఆసాద్య = సమీపించి, పరమమ్ = గొప్ప, హర్షమ్ = ఆనందమును, యయౌ = పొందెను.

తా. పిమ్మట జనకమహారాజు వృద్ధుడైన దశరథమహారాజును కలిసి కొని చాల సంతోషించెను. 8

మూ. ఉవాచ చ నరశ్రేష్ఠో నరశ్రేష్ఠం ముదాన్వితః,
స్వాగతం తే మహారాజ దిష్ట్యా ప్రాప్తోఽసి రాఘవ, 9
పుత్రయోరుభయోః ప్రీతిం లప్స్యసే వీర్యనిర్జితామ్.

ప్ర. అ. నరశ్రేష్ఠః = నరశ్రేష్ఠుడైన జనకుడు, ముదా = ఆనందముతో, అన్వితః = కూడినవాడై, నరశ్రేష్ఠమ్ = నరశ్రేష్ఠుడైన దశరథుని గూర్చి, ఉవాచ = పలికెను. రాఘవ = రఘువంశమునందు పుట్టిన, మహారాజ = దశరథ మహారాజా! తే = నీకు, స్వాగతమ్ = స్వాగత మగుగాక. దిష్ట్యా = భాగ్య వశముచేత, ప్రాప్తః అసి = వచ్చినావు. ఉభయోః = ఇద్దరు, పుత్రయోః = పుత్రులయొక్క, వీర్యనిర్జితామ్ = పరాక్రమముచే జయింపబడిన, ప్రీతిమ్ = ఆనందమును, లప్స్యసే = పొందగలవు.

తా. దశరథమహారాజా! నీకు స్వాగతము. నా భాగ్యవశముచే వచ్చి నావు. నీ ఇరువురి కుమారుల పరాక్రమముచే ప్రాప్తించిన ఆనందమును పొంద గలవు. 9

మూ. దిష్ట్యా ప్రాప్తో మహాతేజా వసిష్ఠో భగవానృషిః, 10
సహ సర్వైర్ద్విజశ్రేష్ఠైర్దేవైరివ శతక్రతుః.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, భగవాన్ = పూజ్యుడును అగు, వసిష్ఠః ఋషిః = వసిష్ఠమహర్షి, సర్వైః = సమస్తమైన, ద్విజశ్రేష్ఠైః = బ్రాహ్మణోత్తములతో కూడ, దేవైః = దేవతలతో, శతక్రతురివ = దేవేంద్రుడు వలె, దిష్ట్యా = భాగ్యవశముచేత, ప్రాప్తః = వచ్చినాడు.

తా. మహాతేజఃశాలియు, భగవంతుడును అగు వసిష్ఠమహర్షి, బ్రాహ్మణోత్తములతో కలిసి, దేవతలతో కలిసి దేవేంద్రుడు వలె, నా భాగ్యవశమున ఇచటికి వచ్చినాడు. 10

మూ. దిష్ట్యా మే నిర్జితా విఘ్నా దిష్ట్యా మే పూజితం కులమ్, 11
రాఘవైః సహ సమ్బన్ధాద్వీర్యశ్రేష్ఠైర్మహాత్మభిః.

ప్ర. అ. వీర్యశ్రేష్ఠైః = వీర్యముచేత శ్రేష్ఠులును, మహాత్మభిః = మహాత్ములును అగు, రాఘవైః సహ = రఘువంశీయులతో కూడ, సంబన్ధాత్ = సంబంధమువలన, దిష్ట్యా = భాగ్యవశముచేత, మే = నాయొక్క, విఘ్నాః = విఘ్న

ములు, నిర్జితాః = జయింపబడినవి. దిష్ట్యా = భాగ్యవశముచేత, మే = నాయొక్క, కులమ్ = కులము, పూజితమ్=పూజింపబడినది.

తా. పరాక్రమముచే శ్రేష్ఠులును మహాత్ములును అగు రఘువంశరాజులతో వియ్య మందుటవలన, భాగ్యవశముచే నా విఘ్నము లన్నియు తొలగినవి. భాగ్యవశముచే నా కులము పూజనీయ మైనది. 11

మూ. శ్వః ప్రభాతే నరేన్ద్రేన్ద్ర నిర్వర్తయితుమర్హసి, 12
యజ్ఞస్యాన్తే నరశ్రేష్ఠ వివాహమృషిసమ్మతమ్.

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరశ్రేష్ఠుడ వైన, నరేన్ద్రేన్ద్ర = రాజాధిరాజా! శ్వః = రేపు, ప్రభాతే = ప్రాతఃకాలము, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, అన్తే = అంతమునందు, ఋషిసంమతమ్=ఋషులకు అంగీకారయోగ్య మైన, వివాహమ్= వివాహమును, నిర్వర్తయితుమ్=జరుపుటకు, అర్హసి = తగియున్నావు.

తా. మునిశ్రేష్ఠుడ వైన ఓ రాజాధిరాజా! రేపు ప్రాతఃకాలము యజ్ఞముపూర్తి యైన పిమ్మట ఋషిసంమత మైన వివాహమును నెరవేర్పుము. 12

మూ. తస్య తద్వచనం శ్రుత్వా ఋషిమధ్యే నరాధిపః, 13
వాక్యం వాక్యవిదాం శ్రేష్ఠః ప్రత్యువాచ మహీపతిమ్.

ప్ర. అ. వాక్యవిదామ్ = వాక్యవేత్తలలో, వరః=శ్రేష్ఠుడగు, నరాధిపః= రాజు, తస్య = ఆతనియొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, ఋషిమధ్యే = ఋషుల మధ్యయందు, మహీపతిమ్ = రాజునుగూర్చి, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. మాటల నేర్పరులలో శ్రేష్ఠు డగు దశరథమహారాజు జనకుని వచనము విని, అచటి ఋషు లందరును వినుచుండగా ఆతనితో ఇట్లనెను. 13

మూ. ప్రతిగ్రహో దాతృవశః శ్రుతమేతన్మయా పురా, 14
యథా వక్ష్యసి ధర్మజ్ఞ తత్కరిష్యామహే వయమ్.

ప్ర. అ. ప్రతిగ్రహః = ప్రతిగ్రహము, దాతృవశః = దాతవశములో నున్నది. ఏతత్ = ఇది, పురా = పూర్వము, మయా = నాచేత, శ్రుతమ్=వినబడి

నది. ధర్మజ్ఞ = ధర్మము నెరిగినవాడా ! యథా = ఎట్లు, వక్ష్యసి = చెప్పగలవో, తత్ = అది, వయమ్ = మేము, కరిష్యామహే = చేయగలము.

తా. ధర్మముల నెరిగిన జనకమహారాజా ! ప్రతిగ్రహ మనునది దాత చేతిలో నున్నది. దాత ఇచ్చినప్పుడే కదా ప్రతిగ్రహీత ప్రతిగ్రహించునది. నీ కన్యాదాననిర్ణయాదికమును వినియున్నాము. నీ వెట్లు చెప్పెదవో అట్లే చేసెదము. 14

మూ. ధర్మిష్ఠం చ యశస్యం చ వచనం సత్యవాదినః, 15
శ్రుత్వా విదేహాధిపతిః పరం విస్మయమాగతః.

ప్ర. అ. సత్యవాదినః = సత్యవాది యైన దశరథునియొక్క, ధర్మిష్ఠం చ = ధర్మసమ్మతము, యశస్యం చ = యశఃకరము అగు, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, విదేహాధిపతిః = జనకుడు, పరమ్ = మిక్కిలి, విస్మయమ్ = ఆశ్చర్యమును, ఆగతః = పొందెను.

తా. జనకమహారాజు, సత్యవాది యైన ఆ దశరథుడు పలికిన ధర్మసమ్మతము, యశఃకరము అగు వచనము విని చాల ఆశ్చర్యపడెను. 15

మూ. తతః సర్వే మునిగణాః పరస్పరసమాగమే, 16
హర్షేణ మహతా యుక్తాస్తాం నిశామవసన్ సుఖమ్.

ప్ర. అ. తతః = పిమ్మట, సర్వే = సమస్త మైన, మునిగణాః = మునిగణములు, పరస్పరసమాగమే = పరస్పరము కలియుటయందు, మహతా = గొప్ప, హర్షేణ = సంతోషముతో, యుక్తాః = కూడినవై, తామ్ = ఆ, నిశామ్ = రాత్రిని, సుఖమ్ = సుఖముగా, అవసన్ = నివసించినవి.

తా. ఆ మునీశ్వరు లందరును పరస్పరము కలిసినందులకు చాల సంతసించినవారై, ఆ రాత్రి సుఖముగ గడపిరి. 16

మూ. రాజా చ రాఘవౌ పుత్రౌ నిశామ్య పరిహర్షితః, 17
ఉవాస పరమప్రీతో జనకేన సుపూజితః.

ప్ర. అ. రాజా చ = దశరథమహారాజు, పుత్రౌ = పుత్రులైన, రాఘవౌ= రామలక్ష్మణులను, నిశామ్య=చూచి, పరిహర్షితః = సంతసించినవాడై, జనకేన= జనకునిచేత, సుపూజితః=బాగుగా పూజింపబడినవాడై, పరమప్రీతః=మిక్కిలి ఆనందించినవాడై, ఉవాస=నివసించెను.

తా. దశరథమహారాజు పుత్రులైన రామలక్ష్మణులను జూచి ఆనందభరితుడై, జనకుని సత్కారములకు సంతుష్టుడై నివసించెను. 17

మూ. జనకోఽపి మహాతేజాః క్రియాం ధర్మేణ తత్త్వవిత్, 18
యజ్ఞస్య చ సుతాభ్యాం చ కృత్వా రాత్రిముమవాస హ.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకోనసప్తతితమః సర్గః.

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సుగల, తత్త్వవిత్=ధర్మరహస్యముల నెరిగిన, జనకోఽపి=జనకుడు కూడ, యజ్ఞస్య=యజ్ఞముయొక్కయు, సుతాభ్యాం చ=కుమార్తెలకొరకును, క్రియామ్=క్రియను, కృత్వా=చేసి, రాత్రిమ్=రాత్రి, ఉవాస హ=నివసించెను.

తా. గొప్ప తేజస్సు కలవాడును, ధర్మరహస్యముల నెరిగినవాడును అగు జనకమహారాజు, యజ్ఞమునకు సంబంధించిన కర్మలను, కుమార్తెల వివాహమునకు సంబంధించిన అంకురారోపణాదిక్రియలను పూర్తిచేసికొని ఆ రాత్రి గడపెను. 18

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలోని అరువదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ సప్తతితమః సర్గః

మూ. తతః ప్రభాతే జనకః కృతకర్మా మహర్షిభిః,
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః శతానన్దం పురోహితమ్. 1

ప్ర. అ. తతః=పిమ్మట, ప్రభాతే=ప్రాతఃకాలమున, మహర్షిభిః=మహర్షులచేత, కృతకర్మా=చేయబడినకర్మలుగల, వాక్యజ్ఞః=మాటలలో నేర్పరియైన, జనకః=జనకుడు, పురోహితమ్ = పురోహితుడైన, శతానన్దమ్=శతానందుని గూర్చి, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. ప్రాతఃకాలమున మహర్షులు కర్తవ్యకర్మ లన్నియు చేయించిన పిమ్మట వాక్యకుశలు డైన జనకుడు పురోహితు డైన శతానందునితో ఇట్లనెను. 1

మూ. భ్రాతా మమ మహాతేజా యవీయానతిధార్మికః,
కుశధ్వజ ఇతి ఖ్యాతః పురీమధ్యవసచ్ఛుభామ్. 2

వార్యాఫలకపర్యన్తాం పిబన్నిక్షుమతీం నదీమ్,
సాఙ్కాశ్యాం పుణ్యసంకాశాం విమానమివ పుష్పకమ్. 3

ప్ర. అ. అతిధార్మికః = మిక్కిలిధార్మికుడును, కుశధ్వజః ఇతి=కుశధ్వజు డని, ఖ్యాతః = ప్రసిద్ధుడును అగు, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మమ=నాయొక్క, యవీయాన్=చిన్న, భ్రాతా=సోదరుడు, ఇక్షుమతీమ్=ఇక్షుమతి అనెడు, నదీమ్=నదిని, పిబన్=త్రాగుచు, వార్యాఫలకపర్యన్తామ్=నీటిలో నాటబడిన శూలములు సరిహద్దుగా గల, శుభామ్=శుభమైన, పుణ్యసంకాశామ్=పుణ్యముతో సమానమైన (పరిశుద్ధమైన), సాంకాశ్యామ్ = సాంకాశ్య మనెడు, పురీమ్=పట్టణమును, పుష్పకమ్ = పుష్పక మనెడు, విమానమివ=విమానమును వలె, అధ్యవసత్=నివసించియున్నాడు.

తా. మహాతేజశ్శాలియు, అతిధార్మికుడును అగు నా తమ్ముడగు కుశధ్వజుడు, ఇక్షుమతీజలమును త్రాగుచు (ఇక్షుమతీనదీతీరమున) నీటిలో

పాతిన ఇనుప శూలములు సరిహద్దుగా గలదియు, పరిశుద్ధ మైనదియు, పుష్పక విమానమువంటిదియు అగు శుభ మైన సాంకాశ్యనగరములో నివసించు చున్నాడు.

వి. "వార్యామలకపర్యన్తామ్" అను పాఠమున "చుట్టును నీటి ఉసిరిక చెట్లు కలది" అని యర్థము. 2, 3

మూ. తమహం ద్రష్టుమిచ్ఛామి యజ్ఞగోప్తా స మే మతః,
ప్రీతిం సోఽపి మహాతేజా ఇమాం భోక్తా మయా సహ. 4

ప్ర. అ. అహమ్ = నేను, తమ్ = ఆతనిని, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను. సః=అతడు, మే=నాయొక్క, యజ్ఞగోప్తా = యజ్ఞమును రక్షించువాడుగా, మతః=అంగీకరింపబడినవాడు. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సోఽపి=అతడు కూడ, మయా సహ=నాతో కూడ, ఇమామ్=ఈ, ప్రీతిమ్=ఆనందమును, భోక్తా=అనుభవింపగలడు.

తా. ఆతడు సంభారములను సమకూర్చుట మొదలగు పనుల ద్వారా నాకు యజ్ఞసంరక్షణ చేసినవాడు. ఆతనిని చూడవలె నని అనుకొనుచున్నాను. ఆ మహాతేజస్వి కూడ నాతో ఈ ఆనందమును అనుభవించవలెను. 4

మూ. ఏవముక్తే తు వచనే శతానన్దస్య సన్నిధౌ,
ఆగతాః కేచిదవ్యగ్రా జనకస్తాన్ సమాదిశత్. 5

ప్ర. అ. శతానన్దస్య=శతానందునియొక్క, సన్నిధౌ = సంనిధియందు, ఏవమ్ = ఇట్లు, వచనే = వచనము, ఉక్తే సతి = పలకబడినదగుచుండగా, అవ్యగ్రాః=తొందరపాటు లేని, కేచిత్=కొంతమంది, ఆగతాః=వచ్చిరి. జనకః= జనకుడు, తాన్=వారిని, సమాదిశత్=ఆజ్ఞాపించెను.

తా. జనకుడు శతానందునితో ఇట్లు చెప్పగా అచటికి శతానందుడు పిలువ నంపగా వచ్చిన కొందరు ఉత్సాహవంతు లగు దూతలను జనకు డాజ్ఞాపించెను. 5

మూ. శాసనాత్తు నరేన్ద్రస్య ప్రయయుః శీఘ్రవాజిభిః,
సమానేతుం నరవ్యాఘ్రం విష్ణుమిన్ద్రాజ్ఞయా యథా. 6

ప్ర. అ. నరేన్ద్రస్య = జనకమహారాజుయొక్క, శాసనాత్ = ఆజ్ఞవలన, ఇన్ద్రాజ్ఞయా=ఇంద్రుని ఆజ్ఞచేత, విష్ణుం యథా=విష్ణువును వలె, నరవ్యాఘ్రమ్= నరశ్రేష్ఠుడైన కుశధ్వజుని, సమానేతుమ్ = తీసికొని వచ్చుటకు, శీఘ్రవాజిభిః= శీఘ్రముగా నడచు గుఱ్ఱములచే, ప్రయయుః=వెళ్లిరి.

తా. ఆ దూతలు జనకుని ఆజ్ఞ ప్రకారము, ఇంద్రుని ఆజ్ఞ ప్రకారము విష్ణువును వలె, ఆ కుశధ్వజుని తీసికొని వచ్చుటకై శీఘ్రముగా పరుగెత్తు అశ్వము లధిరోహించి వెళ్లిరి. 6

మూ. సాఙ్కాశ్యాం తే సమాగత్య దదృశుశ్చ కుశధ్వజమ్,
న్యవేదయన్యథావృత్తం జనకస్య చ చిన్తితమ్. 7

ప్ర. అ. తే=ఆ దూతలు, సాఙ్కాశ్యామ్=సాంకాశ్యనగరమును, సమాగమ్య=చేరి, కుశధ్వజమ్=కుశధ్వజుని, దదృశుశ్చ=చూచిరి. యథావృత్తమ్= జరిగిన విషయము నంతను, జనకస్య=జనకునియొక్క, చిన్తితమ్ = ఆలోచనను, న్యవేదయన్ చ=తెలిపిరికూడ.

తా. వారు సాంకాశ్యమునకు వెళ్లి కుశధ్వజుని చూచి, జరిగిన విషయము నంతను తెలిపి జనకుని అభిప్రాయమును నివేదించిరి. 7

మూ. తద్వృత్తం నృపతిః శ్రుత్వా దూతశ్రేష్ఠైర్మహాబలైః,
ఆజ్ఞయాథ నరేన్ద్రస్య ఆజగామ కుశధ్వజః. 8

ప్ర. అ. నృపతిః=రాజైన, కుశధ్వజః = కుశధ్వజుడు, మహాబలైః= గొప్పబలముగల, దూతశ్రేష్ఠైః = శ్రేష్ఠులైన దూతలచే చెప్పబడిన, తత్=ఆ, వృత్తమ్=వృత్తాంతమును, శ్రుత్వా = విని, అథ=పిమ్మట, నరేన్ద్రస్య=జనకమహారాజుయొక్క, ఆజ్ఞయా=ఆజ్ఞచేత, ఆజగామ=వచ్చెను.

తా. కుశధ్వజుడు మహాబలవంతు లగు ఆ దూతలు చెప్పిన వృత్తాంతమును విని జనకుని ఆజ్ఞ ననుసరించి మిథిలానగరమునకు వచ్చెను. 8

మూ. స దదర్శ మహాత్మానం జనకం ధర్మవత్సలమ్,
సోఽభివాద్య శతానన్దం రాజానం చాపి ధార్మికమ్, 9
రాజార్హం పరమం దివ్యమాసనం చాధ్యరోహత.

ప్ర. అ. సః=అతడు, ధర్మవత్సలమ్ = ధర్మమునందు ఆసక్తి గల, మహాత్మానమ్ = మహాత్ముడైన, జనకమ్ = జనకుని, దదర్శ = చూచెను. సః = అతడు, శతానన్దమ్ = శతానందుని, ధార్మికమ్ = ధార్మికుడైన, రాజానం చ = జనకుని, అభివాద్య = నమస్కరించి, రాజార్హమ్ = రాజుకు తగిన, పరమమ్ = గొప్పదైన, దివ్యమ్ = శ్రేష్ఠమైన, ఆసనమ్ = ఆసనమును, అధ్యరోహత = అధిష్ఠించెను.

తా. ఆ కుశధ్వజుడు, ధర్మనిరతుడును మహాత్ముడును అగు జనకుని చూచెను. శతానందునకును, ధార్మికుడైన జనకునకును అభివాదనము చేసి, రాజోచిత మగు శ్రేష్ఠమైన ఆసనమును అధిష్ఠించెను. 9

మూ. ఉపవిష్టావుభౌ తౌ తు భ్రాతరావతితేజసౌ, 10
ప్రేషయామాసతుర్వీరౌ మన్త్రిశ్రేష్ఠం సుదామనమ్.

ప్ర. అ. అతితేజసౌ = గొప్ప తేజస్సు గల, తౌ = ఆ, వీరౌ = వీరులైన, ఉభౌ = ఇద్దరు, భ్రాతరౌ = సోదరులు, ఉపవిష్టౌ = కూర్చున్న వారై, మన్త్రిశ్రేష్ఠమ్ = మంత్రులలో శ్రేష్ఠుడైన, సుదామనమ్ = సుదామనుని, ప్రేషయామాసతుః = పంపిరి.

తా. మహాతేజఃశాలులును, వీరులును అగు ఆ సోదరు లిరువురును కూర్చుండి మంత్రులలో శ్రేష్ఠుడైన సుదామనుని (దశరథుని వద్దకు) పంపిరి. 10

మూ. గచ్ఛ మన్త్రిపతే శీఘ్రమైక్ష్వాకుమమితప్రభమ్, 11
ఆత్మజైః సహ దుర్ధర్షమానయస్వ సమన్త్రిణమ్.

ప్ర. అ. మన్త్రిపతే = మన్త్రిశ్రేష్ఠుడా, శీఘ్రమ్ = శీఘ్రముగా, అమితప్రభమ్ = సాటి లేని కాంతి గలవాడగు, ఐక్ష్వాకుమ్ = దశరథ మహారాజును గూర్చి, గచ్ఛ = వెళ్లుము. దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యము కానివాడును, సమన్త్రిణమ్ = మంత్రులతో కూడిన వాడును అగు అతనిని, ఆత్మజైః సహ = కుమారులతో కూడ, సమానయస్వ = తీసికొని రమ్ము.

తా. మహామంత్రీ ! ఎదిరింప శక్యము కానివాడును, అమితమైన తేజస్సు కలవాడును అగు దశరథుని వద్దకు వెళ్లి, పుత్రమంత్రి సమేతముగ అతనిని తీసికొని రమ్ము. 11

మూ. ఔపకార్యం స గత్వా తు రఘూణాం కులవర్ధనమ్, 12
దదర్శ శిరసా చైనమభివాద్యేదమబ్రవీత్.

ప్ర. అ. సః = ఆతడు, ఔపకార్యమ్ = విడిదిని గూర్చి, గత్వా = వెళ్లి, రఘూణామ్ = రఘువంశీయుల, కులవర్ధనమ్ = కులమును వృద్ధి పొందించు ఆ దశరథుని, దదర్శ = చూచెను. ఏనమ్ = ఈతనిని, శిరసా = శిరస్సుచేత, అభివాద్య = నమస్కరించి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అతడు విడిదికి వెళ్లి, అచట రఘువంశవర్ధను డైన దశరథుని చూచి, తల వంచి నమస్కరించి ఇట్లు చెప్పెను. 12

మూ. అయోధ్యాధిపతే వీర వైదేహో మిథిలాధిపః, 13
స త్వాం ద్రష్టుం వ్యవసితః సోపాధ్యాయపురోహితమ్.

ప్ర. అ. వీర = వీరుడ వైన, అయోధ్యాధిపతే = అయోధ్యాధీశా ! మిథిలాధిపః = మిథిలారాజైన, సః = ఆ, వైదేహః = జనకుడు, సోపాధ్యాయపురోహితమ్ = ఉపాధ్యాయులతోడను పురోహితులతోడను కూడిన, త్వామ్ = నిన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, వ్యవసితః = నిశ్చయించినాడు.

తా. మహావీరుడ వైన దశరథమహారాజా ! మిథిలాధిపతి యైన జనకమహారాజు, ఉపాధ్యాయపురోహితసమేతుడ వైన నిన్ను చూడవలె నని అనుకొనుచున్నాడు. 13

మూ. మన్త్రిశ్రేష్ఠవచః శ్రుత్వా రాజా సర్షిగణస్తదా, 14
సబన్ధురగమత్తత్ర జనకో యత్ర వర్తతే.

ప్ర. అ. తదా = అప్పుడు, రాజా = దశరథుడు, మన్త్రిశ్రేష్ఠవచః = మంత్రిశ్రేష్ఠుని వచనమును, శ్రుత్వా = విని, సర్షిగణః = ఋషిగణముతో కూడినవాడై, సబన్ధుః = బంధువులతో కూడినవాడై, జనకః = జనకుడు, యత్ర = ఎచట, వర్తతే = ఉంటున్నాడో, తత్ర = అచటికి, అగమత్ = వెళ్లెను.

తా. దశరథమహారాజు మంత్రి మాటలు విని, ఋషులతోను, బంధువుల తోను కలిసి జనకు డున్న చోటికి వెళ్ళెను. 14

మూ. స రాజా మన్త్రిసహితః సోపాధ్యాయః సబాన్ధవః, 15
వాక్యం వాక్యవిదాం శ్రేష్ఠో వైదేహమిదమబ్రవీత్.

ప్ర. అ. మన్త్రిసహితః = మంత్రులతో కూడిన, సబాన్ధవః = బంధువు లతో కూడిన, సః = ఆ, వాక్యవిదామ్ = వాక్యవేత్తలలో, శ్రేష్ఠః = శ్రేష్ఠ డైన, రాజా = రాజు, వైదేహమ్ = జనకమహారాజును గూర్చి, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. బంధువులతోడను, ఉపాధ్యాయులతోడను కూడినవాడును, మాట లలో నేర్పరియు అగు దశరథుడు జనకునితో ఇట్లు పలికెను. 15

మూ. విదితం తే మహారాజ ఇక్ష్వాకుకులదైవతమ్, 16
వక్తా సర్వేషు కృత్యేషు వసిష్ఠో భగవానృషిః.

ప్ర. అ. మహారాజ = మహారాజా! భగవాన్ = పూజ్యు డైన, వసిష్ఠః = వసిష్ఠమహర్షి, ఇక్ష్వాకుకులదైవతమ్ = ఇక్ష్వాకువంశీయులకు దేవత యనియు, సర్వేషు = సమస్త మైన, కృత్యేషు = కార్యములందు, వక్తా = మాటలాడువా డనియు, తే = నీకు, విదితమ్ = తెలియును కదా.

తా. మహారాజా! పూజ్యు డైన వసిష్ఠమహర్షి మా వంశమువారికందరికిని దేవత అనియు, అన్ని పనులందును మా పక్షమున మాటలాడువా డనియు నీకు తెలియును గదా? 16

మూ. విశ్వామిత్రాభ్యనుజ్ఞాతః సహ సర్వైర్మహర్షిభిః, 17
ఏష వక్ష్యతి ధర్మాత్మా వసిష్ఠో మే యథాక్రమమ్.

ప్ర. అ. సర్వైః = సమస్త మైన, మహర్షిభిః సహ = మహర్షులతో కూడ, విశ్వామిత్రాభ్యనుజ్ఞాతః = విశ్వామిత్రునిచే అనుజ్ఞ ఇవ్వబడినవాడై, ధర్మాత్మా = ధర్మాత్ము డైన, ఏషః = ఈ, వసిష్ఠః = వసిష్ఠుడు, యథాక్రమమ్ = క్రమాను సారముగా, మే = నాయొక్క (వంశమును గూర్చి), వక్ష్యతి = చెప్పగలడు.

తా. విశ్వామిత్రుని అనుజ్ఞను, సకలమహర్షుల అనుజ్ఞను పొంది ధర్మాత్ము డైన వసిష్ఠుడు నా వంశములోని పూర్వపురుషులను గూర్చి యథాక్రమముగా చెప్పగలడు. 17

మూ. ఏవముక్త్వా నరశ్రేష్ఠే రాజ్ఞాం మధ్యే మహాత్మనామ్, 18
తూష్ణీంభూతే దశరథే వసిష్ఠో భగవానృషిః,
ఉవాచ వాక్యం వాక్యజ్ఞో వైదేహం సపురోధసమ్. 19

ప్ర. అ. నరశ్రేష్ఠే = నరులలో శ్రేష్ఠు డైన, దశరథే = దశరథుడు, మహాత్మనామ్ = మహాత్ము లైన, రాజ్ఞామ్ = రాజులయొక్క, మధ్యే = మధ్య యందు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తూష్ణీంభూతే = మౌనముగా నుండగా, వాక్యజ్ఞః = వాక్యముల నెరిగినవాడును, భగవాన్ = పూజ్యుడును అగు, వసిష్ఠః ఋషిః = వసిష్ఠమహర్షి, సపురోధసమ్ = పురోహితులతో గూడిన, వైదేహమ్ = జనకుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. నరులలో శ్రేష్ఠు డగు దశరథుడు ఈ విధముగ పలికి ఊరకుండెను. అపుడు మాటలలో నేర్పరి యగు పూజ్యు డైన వసిష్ఠమహర్షి, పురోహితులతో గూడిన జనకమహారాజుతో ఇట్లనెను. 18, 19

మూ. అవ్యక్తప్రభవో బ్రహ్మా శాశ్వతో నిత్య అవ్యయః,
తస్మాన్మరీచిః సంజజ్ఞే మరీచేః కాశ్యపః సుతః. 20

ప్ర. అ. అవ్యక్తప్రభవః = అవ్యక్తమునుండి పుట్టినవాడును, శాశ్వతః = ఎల్లప్పుడు ఉండువాడును, నిత్యః = నిత్యుడును, అవ్యయః = వినాశము లేని వాడును అగు, బ్రహ్మా = బ్రహ్మదేవుడు (ఉన్నాడు). తస్మాత్ = అతనినుండి, మరీచిః = మరీచిమహర్షి, సంజజ్ఞే = పుట్టెను. మరీచేః = మరీచినుండి, కాశ్యపః = కాశ్యపుడను, సుతః = కుమారుడు (జనించెను.)

తా. అవ్యక్తమునుండి పుట్టినవాడును, ఎల్లప్పుడు ఉండువాడును, నిత్యుడును, వినాశరహితుడును అగు బ్రహ్మదేవునినుండి మరీచియు, మరీచినుండి కాశ్యపు డనెడు కుమారుడును పుట్టెను. 20

మూ. వివస్వాన్ కాశ్యపాద్ జజ్ఞే మనుర్వైవస్వతః స్మృతః,
మనుః ప్రజాపతిః పూర్వమిక్ష్వాకుస్తు మనోస్సుతః. 21

ప్ర. అ. కాశ్యపాత్ = కాశ్యపునినుండి, వివస్వాన్ = సూర్యుడు, జజ్ఞే = పుట్టెను. వైవస్వతః = సూర్యుని కుమారుడు, మనుః = మనువు అని, స్మృతః = చెప్పబడినాడు. మనుః = మనువు, పూర్వమ్ = పూర్వము, ప్రజాపతిః = ప్రజాపతిగా ఉండెను. ఇక్ష్వాకుః = ఇక్ష్వాకువు, మనోః = మనువుయొక్క, సుతః = కుమారుడు.

తా. కాశ్యపునకు సూర్యుడు జనించెను. సూర్యుని కుమారుడు మనువు. పూర్వము ప్రజాపతిగ ఉన్న మనువునకు ఇక్ష్వాకువు అను పుత్రుడు జనించెను. 21

మూ. తమిక్ష్వాకుమయోధ్యాయాం రాజానం విద్ధి పూర్వకమ్,
ఇక్ష్వాకోస్తు సుతః శ్రీమాన్ కుక్షిరిత్యేవ విశ్రుతః. 22

ప్ర. అ. తమ్ = ఆ, ఇక్ష్వాకుమ్ = ఇక్ష్వాకువును, అయోధ్యాయామ్ = అయోధ్యయందు, పూర్వకమ్ = మొదటివాడైన, రాజానమ్=రాజునుగా, విద్ధి= తెలుసుకొనుము. శ్రీమాన్ = శ్రీమంతుడైన, కుక్షిరిత్యేవ=కుక్షి అని, విశ్రుతః= ప్రసిద్ధ మైనవాడు, ఇక్ష్వాకోః=ఇక్ష్వాకువుయొక్క, సుతః = కుమారుడు.

తా. ఆ ఇక్ష్వాకువు అయోధ్యలో మొదటి రాజుగా ఉండెను. శ్రీమంతుడగు కుక్షి ఇక్ష్వాకుని పుత్రుడు. 22

మూ. కుక్షేరథాత్మజః శ్రీమాన్ వికుక్షిరుదపద్యత,
వికుక్షేస్తు మహాతేజా బాణః పుత్రః ప్రతాపవాన్. 23

ప్ర. అ. అథ = పిమ్మట, కుక్షేః = కుక్షికి, శ్రీమాన్ = శ్రీమంతుడైన, వికుక్షిః = వికుక్షి, ఆత్మజః = కుమారుడుగా, ఉదపద్యత = పుట్టెను. మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, ప్రతాపవాన్ = ప్రతాపము కలవాడును అగు, బాణః = బాణుడు, వికుక్షేః = వికుక్షియొక్క, పుత్రః = పుత్రుడుగా, పుట్టెను.

తా. పిమ్మట కుక్షికి వికుక్షి అను నతడు కుమారుడుగా పుట్టెను. వికుక్షి కుమారుడు, మహాతేజఃశాలియు ప్రతాపవంతుడును అగు బాణుడు. 23

మూ. బాణస్య తు మహాతేజా అనరణ్యః ప్రతాపవాన్,

అనరణ్యాత్పృథుర్జజ్ఞే త్రిశఙ్కుస్తు పృథోః సుతః. 24

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కల, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, అనరణ్యః = అనరణ్యుడు, బాణస్య = బాణుని కుమారుడు. అనరణ్యాత్ = అనరణ్యునినుండి, పృథుః = పృథువు, జజ్ఞే = పుట్టెను. త్రిశఙ్కుః తు = త్రిశంకువు, పృథోః = పృథువుయొక్క, సుతః = కుమారుడు.

తా. మహాతేజస్వి, ప్రతాపవంతుడు అయిన అనరణ్యుడు బాణుని కుమారుడు. అనరణ్యునకు పృథువు, పృథువునకు త్రిశంకువు కుమారుడుగా జనించెను. 24

మూ. త్రిశఙ్కోరభవత్పుత్రో దున్దుమారో మహాయశాః,

యువనాశ్వసుతస్త్వాసీన్మాన్ధాతా పృథివీపతిః. 25

ప్ర. అ. త్రిశఙ్కోః = త్రిశంకువునకు, మహాయశాః = గొప్ప కీర్తిగల, దున్దుమారః = దుందుమారుడను, పుత్రః = పుత్రుడు, అభవత్ = పుట్టెను. మాన్ధాతా = మాంధాత అను, పృథివీపతిః = రాజు, యువనాశ్వసుతః = యువనాశ్వుని కుమారుడుగా, ఆసీత్ = పుట్టెను.

తా. త్రిశంకువునకు దుందుమారు డను గొప్ప కీర్తి గల కుమారుడు పుట్టెను. ఆతనికి యువనాశ్వ దని కూడ పేరు. మాంధాతచక్రవర్తి యువనాశ్వుని కుమారుడు. 25

మూ. మాన్ధాతుస్తు సుతః శ్రీమాన్ సుసంధిరుదపద్యత,

సుసన్ధేరపి పుత్రౌ ద్వౌ ధ్రువసన్ధిః ప్రసేనజిత్. 26

ప్ర. అ. మాన్ధాతుః = మంధాతకు, సుసన్ధిః = సుసంధి అను, శ్రీమాన్ = శ్రీమంతుడైన, సుతః = కుమారుడు, ఉదపద్యత = పుట్టెను. సుసన్ధేరపి = సుసంధికి

కూడ, ధ్రువసన్ధిః=ధ్రువసంధి అనియు, ప్రసేనజిత్=ప్రసేనజిత్తు అనియు, ద్వౌ= ఇరువురు, పుత్రౌ=పుత్రులు జనించిరి.

తా. మాంధాతకు సుసంధి యను శ్రీమంతు డగు కుమారుడు జనించెను. ఆతనికి ధ్రువసంధి, ప్రసేనజిత్ అను ఇరువురు కుమారులు జనించిరి. 26

మూ. యశస్వీ ధ్రువసన్ధేస్తు భరతో నామ నామతః,
భరతాత్తు మహాతేజా అసితో నామ జాతవాన్. 27

ప్ర. అ. ధ్రువసన్ధేః తు=ధ్రువసంధికి, నామతః=పేరుచే, భరతః నామ= భరతుడను, యశస్వీ=కీర్తిశాలియు, భరతాత్ తు=భరతునినుండి, మహాతేజాః= గొప్ప తేజస్సు గల, అసితో నామ=అసితు డను పేరు గలవాడు, జాతవాన్= పుట్టెను.

తా. ధ్రువసంధికి కీర్తిమంతు డగు భరతు డను కుమారుడు పుట్టెను. భరతునకు గొప్ప తేజస్సు గల అసితు డను కుమారుడు పుట్టెను. 27

మూ. యస్యైతే ప్రతిరాజాన ఉదపద్యన్త శత్రవః,
హైహయాస్తాలజఙ్ఘాశ్చ శూరాశ్చ శశిబిన్దవః. 28

ప్ర. అ. యస్య=ఏ అసితునకు, హైహయాః=హైహయులును, తాలజఙ్ఘాశ్చ=తాలజంఘులును, శూరాః=శూరు లైన, శశిబిన్దవశ్చ=శశిబిందువులును అను, ఏతే=ఈ, ప్రతిరాజానః = ఎదిరించే రాజులు, శత్రవః = శత్రువులుగా, ఉదపద్యన్త=అయిరో.

తా. హైహయ— తాలజంఘ— శశిబిందు వంశములకు చెందిన రాజులు ఈ అసితునకు శత్రువు లైరి. 28

మూ. తాంస్తు స ప్రతియుధ్యన్ వై యుద్ధే రాజా ప్రవాసితః,
హిమవన్తముపాగమ్య భృగుప్రస్రవణేఽవసత్. 29
అసితోఽల్పబలో రాజా మనిభిః సహిత సదా.

ప్ర. అ. సః=ఆ, రాజా=రాజు, తాన్=వారిని, యుద్ధే=యుద్ధమునందు, ప్రతియుధ్యన్=ఎదిరించి యుద్ధము చేయుచు, ప్రవాసితః=రాజ్యమునుండి తొల

గింపబడినాడు. రాజా=రాజైన, అసితః=అసితుడు, అల్పబలః=అల్ప మైన సేన కలవాడై, మన్త్రిభిః=మంత్రులతో, సహితః=కూడినవాడై, తదా=అపుడు, హిమవన్తమ్=హిమవత్పర్వతమును, ఉపాగమ్య=చేరి, భృగుప్రస్రవణే=భృగుప్రస్రవణ మను ప్రదేశమునందు, అవసత్=నివసించెను.

తా. ఆ అసితమహారాజు శత్రువులతో యుద్ధము చేసి, పరాజితుడై రాజ్యభ్రష్టు డయ్యెను. అల్ప మైన సైన్యముతోడను, మంత్రులతోడను కలిసి హిమవత్పర్వతమునకు వెళ్లి అచట భృగుప్రస్రవణ మను ప్రదేశమున నివసించెను. 29

మూ. ద్వే చాస్య భార్యే గర్భిణ్యౌ బభూవతురితి శ్రుతమ్, 30
ఏకా గర్భవినాశాయ సపత్న్యై సగరం దదౌ.

ప్ర. అ. అస్య = ఇతనియొక్క, ద్వే=ఇరువురు, భార్యే = భార్యలు, గర్భిణ్యౌ=గర్భవతులై, బభూవతుః=ఉండిరి. ఏకా = ఒక భార్య, గర్భవినాశాయ=గర్భము నశించుటకై, సపత్న్యై=సవతికి, సగరమ్=విషముతో కూడిన ఆహారమును, దదౌ=ఇచ్చెను, ఇతి=అని, శ్రుతమ్=వినబడినది.

తా. ఆ సమయమున ఆతని భార్యలలో ఇద్దరు గర్భవతులై యుండిరి. వారిలో ఒకతె సవతి గర్భము నష్ట మగుటకై ఆమెకు విషముతో కూడిన ఆహారమిచ్చినదట. 30

మూ. తతః శైలవరం రమ్యం బభూవాభిరతో మునిః, 31
భార్గవశ్చ్యవనో నామ హిమవన్తముపాశ్రితః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రమ్యమ్=రమ్యమైన, శైలవరమ్=శైలశ్రేష్ఠమును గూర్చి, అభిరతః=అభిరుచిగల, భార్గవః = భృగువంశోద్భవు డైన, చ్యవనో నామ=చ్యవను డను ఋషి, హిమవన్తమ్=హిమవత్పర్వతమును, ఉపాశ్రితః=ఆశ్రయించినాడు.

తా. ఆ దివసములలో రమ్య మైన పర్వతశ్రేష్ఠమునందు అభిరుచి గల, భృగువంశసంజాతు డగు చ్యవనుడు హిమవత్పర్వతమునకు వచ్చెను. 31

మూ. తత్రైకా తు మహాభాగా భార్గవం దేవవర్చసమ్, 32
వవన్దే పద్మపత్రాక్షీ కాఙ్క్షన్తీ సుతమాత్మనః.

ప్ర. అ. మహాభాగా=గొప్ప భాగ్యము కలదియు, పద్మపత్రాక్షీ=పద్మపత్రముల వంటి కన్నులు కలదియు అగు, తయోః ఏకా = ఆ ఇరువురు రాజ భార్యలలో ఒకతె, ఆత్మనః=తనకు, సుతమ్=పుత్రుని, కాఙ్క్షన్తీ=కోరుచున్నదై, దేవవర్చసమ్=దేవతల వంటి కాంతి గల, భార్గవమ్ = చ్యవనుని, వవన్దే=నమస్కరించెను.

తా. గొప్ప భాగ్యము కలదియు, పద్మపత్రాక్షియు అగు ఒక రాజభార్య తనకు కుమారుడు కావలె నని కోరుచు, దేవతల వంటి కాంతి గల ఆ చ్యవనుని నమస్కరించెను. 32

మూ. తమృషిం సాభ్యుపాగమ్య కాళిన్దీ చాభ్యవాదయత్, 33
స తామభ్యవదద్విప్రః పుత్రేప్సుం పుత్రజన్మని.

ప్ర. అ. సా=ఆ, కాళిన్దీ చ = కాళింది అను పేరు గల విషము పెట్టిన భార్యకూడ, తమ్=ఆ, ఋషిమ్=ఋషిని, అభ్యుపాగమ్య=సమీపించి, అభ్యవాదయత్=నమస్కరించెను. సః=ఆ, విప్రః=బ్రాహ్మణుడు, తామ్=ఆ, పుత్రేప్సుమ్=పుత్రుని కోరు భార్యను గూర్చి, పుత్రజన్మని = పుత్రజన్మవిషయమున, అభ్యవదత్=పలికెను.

తా. సవతికి విషము పెట్టిన కాళింది కూడ ఆ మునివద్దకు వెళ్లి నమస్కరించెను. ఆతడు పుత్రాభిలాషిణి యగు రాజభార్యతో ఇట్లు చెప్పెను. 33

మూ. తవ కుక్షౌ మహాభాగే సుపుత్రః సుమహాబలః, 34
మహావీర్యో మహాతేజా అచిరాత్సంభవిష్యతి,
గరేణ సహితః శ్రీమాన్మా శుచః కమలేక్షణే. 35

ప్ర. అ. మహాభాగే=గొప్ప భాగ్యము కలదానా ! తవ=నీయొక్క, కుక్షౌ=కుక్షియందు, సుమహాబలః=చాల గొప్ప బలము కలవాడును, మహావీర్యః=గొప్ప వీర్యము కలవాడును, మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడును

అగు, సుపుత్రః = సుపుత్రుడు, (ఉన్నాడు). శ్రీమాన్ = శ్రీమంతు డైన అతడు, గరేణ = విషముతో, సహితః = కూడినవాడై, అచిరాత్ = కొంచెము కాలములో, సంజనిష్యతి=పుట్టగలడు ; కమలేక్షణే=పద్మముల వంటి నేత్రములు కలదానా! మా శుచః = దుఃఖింపకుము.

తా. "మహాభాగ్యవంతురాలా ! మహాబలుడు, మహావీర్యుడు, మహాతేజస్వియు అగు సుపుత్రుడు నీ గర్భములో ఉన్నాడు. ఐశ్వర్యవంతు డైన ఆ కుమారుడు కొలది కాలములో పుట్టగలడు ; దుఃఖింపకుము". 34, 35

మూ. చ్యవనం తు నమస్కృత్య రాజపుత్రీ పతివ్రతా,
పతిశోకాతురా తస్మాత్పుత్రం దేవీ వ్యజాయత. 36

ప్ర. అ. రాజపుత్రీ = రాజపుత్రియు, పతివ్రతా = పతివ్రతయు, పతిశోకాతురా = భర్తృమరణశోకముచే వ్యాకులురాలును అగు, దేవీ = ఆ పట్టమహిషి, చ్యవనమ్ = చ్యవనుని, నమస్కృత్య = నమస్కరించి, తస్మాత్ = ఆ కారణము వలన, పుత్రమ్ = పుత్రుని, వ్యజాయత = కనెను.

తా. రాజపుత్రియు, పతివ్రతయు, భర్తృమరణముచే దుఃఖితురాలును అగు ఆ రాజమహిషి ఈ విధముగ చ్యవనుని అనుగ్రహముచే పుత్రుని కనెను. 36

మూ. సపత్న్యా తు గర స్తస్యై దత్తో గర్భజిఘాంసయా,
సహ తేన గరేణైవ జాతః స సగరోఽభవత్. 37

ప్ర. అ. సపత్న్యా = సవతిచేత, తస్యై = ఆమెకు, గర్భజిఘాంసయా = గర్భమును హింసించవలె నను కోరికచే, గరః = విషము, దత్తః = ఇవ్వబడినది. తేన = ఆ, గరేణ సహ ఏవ = గరముతోడనే, జాతః = పుట్టిన, సః = అతడు, సగరః = సగరుడు, అభవత్ = ఆయెను.

తా. గర్భమును నశింపచేయవలె నను అభిప్రాయముతో సవతి ఆమెకు ఇచ్చిన గరముతో పాటు పుట్టుటచే ఆ పుత్రుడు 'సగరుడు' అయ్యెను. 37

మూ. సగరస్యాసమంజస్తు అసమంజా త్తథాంశుమాన్,
దిలీపోఽంశుమతః పుత్రో దిలీపస్య భగీరథః. 38

ప్ర. అ. అసమంజః = అసమంజుడు, సగరస్య = సగరుని కుమారుడు. తథా = మరియు, అసమంజాత్ = అసమంజునివలన, అంశుమాన్ = అంశుమంతుడు జనించెను. దిలీపః = దిలీపుడు, అంశుమతః = అంశుమంతునియొక్క, పుత్రః = పుత్రుడు. భగీరథః = భగీరథుడు, దిలీపస్య = దిలీపుని కుమారుడు.

తా. సగరుని కుమారుడు అసమంజుడు. అతని కుమారుడు అంశుమంతుడు. అంశుమంతుని పుత్రుడు దిలీపుడు. అతని కుమారుడు భగీరథుడు. 38

మూ. భగీరథాత్ కకుత్స్థశ్చ కకుత్స్థస్య రఘుః సుతః,
రఘోస్తు పుత్రస్తేజస్వీ ప్రవృద్ధః పురుషాదకః, 39
కల్మాషపాదో హ్యభవత్తస్మాజ్జాతస్తు శఙ్ఖణః.

ప్ర. అ. భగీరథాత్ = భగీరథునినుండి, కకుత్స్థః = కకుత్స్థుడు పుట్టెను. రఘుః = రఘువు, కకుత్స్థస్య = కకుత్స్థునియొక్క, సుతః = కుమారుడు. తేజస్వీ = తేజఃశాలియైన, ప్రవృద్ధః = ప్రవృద్ధుడు, రఘోః = రఘువుయొక్క, పుత్రః = పుత్రుడు. అతడే, పురుషాదకః = పురుషాదకుడును, కల్మాషపాదః = కల్మాషపాదుడును, అభవత్ = అయెను. తస్మాత్ = అతనినుండి, శఙ్ఖణః = శంఖణుడు, జాతః = పుట్టెను.

తా. భగీరథునకు కకుత్స్థుడును, అతనికి రఘువును పుట్టెను. తేజఃశాలియగు ప్రవృద్ధుడు రఘువుయొక్క కుమారుడు. అతడు వసిష్ఠుని శాపముచే పురుషాదకుడు (మనుష్యమాంసము తినువాడు) అయ్యెను. అతడు వసిష్ఠునకు ప్రతిశాప మిచ్చుటకై జలము గ్రహించెను. అపుడు అతని భార్య నివారించుటచే ఆ శాపోదకమును తన పాదములపైననే విడచుటచే కల్మాషపాదుడు (కల్మషముతో కూడిన పాదములు కలవాడు) అయ్యెను. అతనికి శంఖణుడు పుట్టెను. 39

మూ. సుదర్శనః శఙ్ఖణస్య అగ్నివర్ణః సుదర్శనాత్, 40
శీఘ్రగస్త్వగ్నివర్ణస్య శీఘ్రగస్య మరుః సుతః,
మరోః ప్రశుశ్రుకస్త్వాసీదమ్బరీషః ప్రశుశ్రుకాత్. 41

ప్ర. అ. శఙ్ఖణస్య = శంఖణునకు, సుదర్శనః = సుదర్శనుడును, సుదర్శనాత్ = సుదర్శనునివలన, అగ్నివర్ణః = అగ్నివర్ణుడును, అగ్ని

వర్ణస్య = అగ్నివర్ణునకు, శీఘ్రగః = శీఘ్రగుడును, శీఘ్రగస్య = శీఘ్రగునకు, మరుః = మరువు అను, సుతః = కుమారుడును, మరోః = మరువునకు, ప్రశుశ్రుకః = ప్రశుశ్రుకుడును, ప్రశుశ్రుకాత్ = ప్రశుశ్రుకునినుండి, అంబరీషః = అంబరీషుడును, ఆసీత్=పుట్టెను.

తా. శంఖణుని కుమారుడు సుదర్శనుడు. సుదర్శనుని కుమారుడు అగ్నివర్ణుడు. ఆతని కుమారుడు శీఘ్రగుడు. ఆతని కుమారుడు మరువు. ఆతని కుమారుడు ప్రశుశ్రుకుడు. ప్రశుశ్రుకుని కుమారుడు అంబరీషుడు. 40, 41

మూ. అమ్బరీషస్య పుత్రోఽభూన్నహుషః పృథివీపతిః,
నహుషస్య యయాతిస్తు నాభాగస్తు యయాతిజః. 42

ప్ర. అ. పృథివీపతిః=రాజైన, నహుషః=నహుషుడు, అమ్బరీషస్య= అంబరీషునియొక్క, పుత్రః=పుత్రుడు, అభూత్=ఆయెను. నహుషస్య=నహుషునికి, యయాతిః=యయాతి పుట్టెను. నాభాగః తు=నాభాగుడు, యయాతిజః= యయాతివలన పుట్టినవాడు.

తా. అంబరీషుని పుత్రుడు నహుషమహారాజు. నహుషునకు యయాతి యను పుత్రుడు జనించెను. ఆతని కుమారుడు నాభాగుడు. 42

మూ. నాభాగస్య బభూవాజః అజాద్దశరథోఽభవత్,
అస్మాద్దశరథాజ్జాతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. 43

ప్ర. అ. నాభాగస్య = నాభాగునకు, అజః = అజు దను కుమారుడు, బభూవ=పుట్టెను. అజాత్=అజునినుండి, దశరథః = దశరథుడు, అభవత్= పుట్టెను. అస్మాత్=ఈ, దశరథాత్ = దశరథునినుండి, భ్రాతరౌ=సోదరులైన, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులు, జాతౌ=పుట్టినారు.

తా. నాభాగునకు అజు దను కుమారుడు కలిగెను. అజుని కుమారుడు దశరథుడు. ఈ దశరథుని కుమారులే ఈ రామలక్ష్మణులు. 43

మూ. ఆదివంశవిశుద్ధానాం రాజ్ఞాం పరమధర్మిణామ్,
ఇక్ష్వాకుకులజాతానాం వీరాణాం సత్యవాదినామ్. 44

రామలక్ష్మణయోరర్థే త్వత్సుతే వరయే నృప,
సదృశాభ్యాం నృపశ్రేష్ఠ సదృశే దాతుమర్హసి. 45

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
సప్తతితమః సర్గః.

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడవైన, నృప = రాజా ! ఆదివంశ విశుద్ధానామ్ = మొదటినుండియు వంశముచే వరిశుద్ధులును, పరమధర్మిణామ్= మిక్కిలి ధర్మాత్ములును, వీరాణామ్=వీరులును, సత్యవాదినామ్ = సత్యమునే పలుకువారును అగు, ఇక్ష్వాకుకులజాతానామ్=ఇక్ష్వాకువంశీయులైన, రాజ్ఞామ్= రాజులకు సంబంధించిన, రామలక్ష్మణయోరర్థే = రామలక్ష్మణులకొరకై, త్వత్సుతే=నీ కుమార్తెలను, వరయే=వరించుచున్నాను. సదృశాభ్యామ్=తగిన ఈ రామలక్ష్మణులకు, సదృశే=తగిన నీ పుత్రికలను, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి=తగి యున్నావు.

తా. నరశ్రేష్ఠుడవైన జనకమహారాజా ! ఆదినుండియు పరిశుద్ధమైన వంశము కలవారును, పరమధార్మికులును, వీరులును, సత్యవాదులును అగు ఇక్ష్వాకువంశీయరాజుల వంశములో జనించిన ఈ రామలక్ష్మణులకొరకై నీ కుమార్తెలను వరించుచున్నాను. నీ కుమార్తెలకు తగిన వరులైన ఈ రామలక్ష్మణులకు, వీరికి తగిన వధువులైన నీ కుమార్తెల నిచ్చి వివాహము చేయుము. 44

'బాలానందిని' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
బాలకాండలో డెబ్బదవ సర్గ సమాప్తము.

అథ ఏకసప్తతితమః సర్గః

మూ. ఏవం బ్రువాణం జనకః ప్రత్యువాచ కృతాఞ్జలిః,
శ్రోతుమర్హసి భద్రం తే కులం నః పరికీర్తితమ్. 1

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్ = పలుకుచున్న వసిష్ఠుని గూర్చి, జనకః=జనకుడు, కృతాఞ్జలిః=చేయబడిన దోసిలి కలవాడై, ప్రత్యువాచ= తిరిగి పలికెను. తే=నీకు, భద్రమ్=క్షేమ మగుగాక. పరికీర్తితమ్=చెప్పబడిన, నః=మాయొక్క, కులమ్ = కులమును గూర్చి, శ్రోతుమ్=వినుటకు, అర్హసి= తగియున్నావు.

తా. ఈ విధముగ దశరథుని వంశమును వర్ణించి చెప్పిన వసిష్ఠునితో జనకుడు, చేతులు జోడించి ఇట్లు పలికెను. నీకు మంగళ మగుగాక. నా వంశ మును గూర్చి చెప్పుచున్నాను ; వినుము. 1

మూ. ప్రదానే హి మునిశ్రేష్ఠ కులం నిరవశేషతః,
వక్తవ్యం కులజాతేన తన్నిబోధ మహామునే. 2

ప్ర. అ. మునిశ్రేష్ఠ = మునులలో శ్రేష్ఠుడ వైన, మహామునే=ఓ మహా మునీ ; కులజాతేన = సత్కులమునందు పుట్టినవానిచేత, ప్రదానే = కన్యాదాన సమయమునందు, నిరవశేషతః=పూర్తిగా, కులమ్ = కులము, వక్తవ్యం హి= చెప్పదగినది కదా. తత్=దానిని గూర్చి, నిబోధ=తెలుసుకొనుము.

తా. మహామునీ ! సత్కులప్రసూతు లైనవారు, కన్యాదానసమయమున తమ కులమును గూర్చి పూర్తిగా చెప్పవలెను. దానిని వినుము. 2

మూ. రాజాఽభూత్త్రిషు లోకేషు విశ్రుతః స్వేన కర్మణా,
నిమిః పరమధర్మాత్మా సర్వసత్త్వవతాం వరః. 3

ప్ర. అ. స్వేన=తనసంబంధమైన, కర్మణా=కర్మచేత, త్రిషు=మూడు, లోకేషు=లోకములందు, విశ్రుతః = ప్రసిద్ధుడును, పరమధర్మాత్మా = మిక్కిలి

ధర్మాత్ముడును, సర్వసత్త్వవతామ్=బలము కలవా రందరిలో, వరః=శ్రేష్ఠుడును అగు, నిమిః=నిమిచక్రవర్తి, అభూత్=ఉండెను.

తా. తన పనులచే మూడు లోకములందును ప్రసిద్ధుడును, పరమ ధర్మాత్ముడును, బలము కలవా రందరిలోను శ్రేష్ఠుడును అగు నిమిచక్రవర్తి ఉండెను. 3

మూ. తస్య పుత్రో మిథిర్నామ మిథిలా యేన నిర్మితా,
ప్రథమో జనకో నామ జనకాదప్యుదావసుః. 4

ప్ర. అ. మిథిర్నామ = మిథి అను పేరు గలవాడు, తస్య = ఆతని యొక్క, పుత్రః=పుత్రుడు; యేన = ఎవనిచేత, మిథిలా = మిథిల, నిర్మితా= నిర్మింపబడినదో, అతడు, ప్రథమః = మొదటి, జనకః నామ=జనకుడు. జనకాత్=జనకునినుండి, ఉదావసుః=ఉదావసువు పుట్టెను.

తా. మిథిలను నిర్మించిన మిథి ఆ నిమిచక్రవర్తి కుమారుడు. ఇతడే మొట్టమొదటి జనకుడు. ఆతని కుమారుడు ఉదావసువు. 4

మూ. ఉదావసోస్తు ధర్మాత్మా జాతో వై నన్దివర్ధనః,
నన్దివర్ధనపుత్రస్తు సుకేతుర్నామ నామతః. 5

ప్ర. అ. ఉదావసోః తు = ఉదావసువునకు, ధర్మాత్మా=ధర్మాత్ముడైన, నన్దివర్ధనః=నందివర్ధనుడు, జాతః = పుట్టెను. నన్దివర్ధనపుత్రః తు=నందివర్ధనుని పుత్రుడు, నామతః = పేరుచే, సుకేతుర్నామ = సుకేతు వను ప్రసిద్ధి గలవాడు.

తా. ఉదావసువునకు ధర్మాత్ముడైన నందివర్ధను డను కుమారుడు కలిగెను. ఆతని కుమారుడు సుకేతువు. 5

మూ. సుకేతోరపి ధర్మాత్మా దేవరాతో మహాబలః,
దేవరాతస్య రాజర్షేర్బృహద్రథ ఇతి స్మృతః. 6

ప్ర. అ. సుకేతోః అపి = సుకేతువునకు, ధర్మాత్మా = ధర్మాత్ముడును, మహాబలః = గొప్ప బలము కలవాడును అగు, దేవరాతః=దేవరాతుడు పుట్టెను.

రాజర్షేః=రాజర్షియైన, దేవరాతస్య=దేవరాతునకు, బృహద్రథః ఇతి = బృహద్రథు దని, స్మృతః=చెప్పబడిన కుమారుడు పుట్టెను.

తా. సుకేతువునకు ధర్మాత్ముడును, మహాబలుడును అగు దేవరాతుడు పుట్టెను. రాజర్షి యైన దేవరాతునకు బృహద్రథు డను పుత్రుడు జనించెను. 6

మూ. బృహద్రథస్య శూరోఽభూన్మహావీరః ప్రతాపవాన్,
మహావీరస్య ధృతిమాన్ సుధృతిః సత్యవిక్రమః. 7

ప్ర. అ. బృహద్రథస్య=బృహద్రథునకు, శూరః=శూరుడును, ప్రతాపవాన్=ప్రతాపవంతుడును అగు, మహావీరః = మహావీరు డను పుత్రుడు కల్గెను. మహావీరస్య=మహావీరునకు, ధృతిమాన్=ధైర్యము కలవాడును, సత్యవిక్రమః=సత్య మైన పరాక్రమము కలవాడును అగు, సుధృతిః=సుధృతి పుట్టెను.

తా. బృహద్రథునకు శూరుడును ప్రతాపవంతుడును అగు మహావీరుడు పుట్టెను. మహావీరునకు ధైర్యవంతుడును, సత్య మైన పరాక్రమము కలవాడును, అగు సుధృతి జన్మించెను. 7

మూ. సుధృతేరపి ధర్మాత్మా దృష్టకేతుస్సుధార్మికః,
దృష్టకేతోస్తు రాజర్షేర్హర్యశ్వ ఇతి విశ్రుతః. 8

ప్ర. అ. సుధృతేః = సుధృతికి, ధర్మాత్మా = ధర్మమునందు బుద్ధి కలవాడును, సుధార్మికః = బాగుగా ధార్మికుడును అయిన, దృష్టకేతుః = దృష్టకేతువు, రాజర్షేః = రాజర్షియైన, దృష్టహేతోః = దృష్టకేతువునకు, హర్యశ్వః ఇతి = హర్యశ్వు దని, విశ్రుతః = ప్రసిద్ధు డైన కుమారుడును జన్మించెను.

తా. ధర్మబుద్ధి కలవాడును, ధర్మాచరణశీలుడును అగు దృష్టకేతువు సుధృతికి కుమారుడుగ జన్మించెను. రాజర్షి యైన దృష్టకేతువునకు హర్యశ్వు డని ప్రసిద్ధు డైన పుత్రుడు జనించెను. 8

మూ. హర్యశ్వస్య మనుః పుత్రో మరోః పుత్రః ప్రతిన్ధకః,
ప్రతిన్ధకస్య ధర్మాత్మా రాజా కీర్తిరథః సుతః 9

ప్ర. అ. హర్యశ్వస్య = హర్యశ్వునకు, మరుః = మరువు, పుత్రః = పుత్రుడు. మరోః = మరువునకు, ప్రతిన్ధకః = ప్రతింధకుడు, పుత్రః = పుత్రుడు. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రాజా = రాజైన, కీర్తిరథః = కీర్తిరథుడు, ప్రతిన్ధకస్య = ప్రతింధకునియొక్క, సుతః = కుమారుడు.

తా. హర్యశ్వునకు మరుడు అను పుత్రుడు జనించెను. మరుని పుత్రుడు ప్రతింధకుడు. ధర్మాత్ముడైన కీర్తిరథమహారాజు ప్రతింధకుని కుమారుడు. 9

మూ. పుత్రః కీర్తిరథస్యాపి దేవమీఢ ఇతి స్మృతః,
దేవమీఢస్య విబుధో విబుధస్య మహీంధ్రకః. 10

ప్ర. అ. కీర్తిరథస్యాపి = కీర్తిరథునియొక్క, పుత్రః = పుత్రుడు, దేవమీఢః ఇతి = దేవమీఢు డని, స్మృతః = చెప్పబడినాడు. దేవమీఢస్య = దేవమీఢుని కుమారుడు, విబుధః = విబుధుడు. విబుధస్య = విబుధునకు, మహీంధ్రకః = మహీంధ్రకుడు కుమారుడు.

తా. కీర్తిరథునికి దేవమీఢుడు, దేవమీఢునకు విబుధుడు, అతనికి మహీంధ్రకుడును పుట్టెను. 10

మూ. మహీంధ్రకసుతో రాజా కీర్తిరాతో మహాబలః,
కీర్తిరాతస్య రాజర్షేర్మహారోమా వ్యజాయత. 11

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, రాజా = రాజైన, కీర్తిరాతః = కీర్తిరాతుడు, మహీంధ్రకసుతః = మహీంధ్రకుని కుమారుడు. రాజర్షేః = రాజర్షియైన, కీర్తిరాతస్య = కీర్తిరాతునకు, మహారోమః = మహారోముడు, వ్యజాయత = పుట్టెను.

తా. మహీంధ్రకునకు మహాబలుడైన కీర్తిరాతు డను కుమారుడు జనించెను. రాజర్షి యైన కీర్తిరాతునకు మహారోముడు పుట్టెను. 11

మూ. మహారోమ్ణస్తు ధర్మాత్మా స్వర్ణరోమా వ్యజాయత,
స్వర్ణరోమ్ణస్తు రాజర్షేర్హ్రస్వరోమా వ్యజాయత. 12

ప్ర. అ. మహారోమ్ణః తు = మహారోమునకు, స్వర్ణరోమా=స్వర్ణరోముడు, అజాయత = జనించెను. రాజర్షేః = రాజర్షి యైన, స్వర్ణరోమ్ణస్తు = స్వర్ణరోమునకు, హ్రస్వరోమా = హ్రస్వరోముడు, వ్యజాయత = పుట్టెను.

తా. మహారోమునకు ధర్మాత్ము డైన స్వర్ణరోముడు పుట్టెను. రాజర్షి యైన స్వర్ణరోమునకు హ్రస్వరోముడు పుట్టెను. 12

మూ. తస్య పుత్రద్వయం జజ్ఞే ధర్మజ్ఞస్య మహాత్మనః,
జ్యేష్ఠోఽహమనుజో భ్రాతా మమ వీరః కుశధ్వజః. 13

ప్ర. అ. ధర్మజ్ఞస్య = ధర్మజ్ఞు డైన, తస్య = ఆ, మహాత్మనః = మహాత్మునకు, పుత్రద్వయమ్ = పుత్రద్వయము, జజ్ఞే = పుట్టెను ; అహమ్ = నేను, జ్యేష్ఠః = పెద్దవాడను, వీరః = వీరుడైన, కుశధ్వజః = కుశధ్వజుడు, మమ = నాయొక్క, అనుజః భ్రాతా = తమ్ముడు.

తా. ధర్మము నెరిగిన ఆ మహాత్మునకు ఇద్దరు పుత్రులు జనించిరి. నేను పెద్దవాడను. వీరు డైన కుశధ్వజుడు నా తమ్ముడు. 13

మూ. మాం తు జ్యేష్ఠం పితా రాజ్యే సోఽభిషిచ్య నరాధిపః,
కుశధ్వజం సమావేశ్య భారం మయి వనం గతః. 14

ప్ర. అ. పితా = మా తండ్రి యైన, సః నరాధిపః=ఆ రాజు, జ్యేష్ఠమ్= పెద్దవాడ నైన, మామ్ = నన్ను, రాజ్యే = రాజ్యమునందు, అభిషిచ్య = అభిషేకించి, కుశధ్వజమ్=కుశధ్వజుని, భారమ్=పోషింపవలసినవానినిగా, మయి= నాయందు, సమావేశ్య = ఉంచి, వనమ్ = వనమునుగూర్చి, గతః = వెళ్లినాడు.

తా. మా తండ్రి యైన హ్రస్వరోమమహారాజు జ్యేష్ఠుడ నైన నన్ను రాజ్యాభిషిక్తుని చేసి, కుశధ్వజుని పోషణభారమును నాపై ఉంచి వనమునకు పోయెను. 14

మూ. వృద్ధే పితరి స్వర్యాతే ధర్మేణ ధురమావహమ్,
భ్రాతరం దేవసంకాశం స్నేహాత్పశ్యన్ కుశధ్వజమ్. 15

ప్ర. అ. వృద్ధే = వృద్ధు డైన, పితరి = తండ్రి, స్వర్యాతే సతి = స్వర్గమునకు వెళ్లగా, భ్రాతరమ్ = సోదరుడైన, దేవసంకాశమ్ = దేవతలతో సమానుడైన, కుశధ్వజమ్ = కుశధ్వజుని, స్నేహాత్ = స్నేహమువలన, పశ్యన్ = చూచుచు, ధర్మేణ = ధర్మముతో, ధురమ్ = రాజ్యభార మును, ఆవహమ్ = వహించితిని.

తా. వృద్ధు డైన తండ్రి స్వర్గస్థు డైన పిమ్మట, దేవసదృశు డైన నా తమ్ముడు కుశధ్వజుని స్నేహముతో చూచుకొనుచు, ధర్మానుసారముగా రాజ్యభారము వహించితిని. 15

మూ. కస్య చిత్త్వథ కాలస్య సాఙ్కాశ్యాదగమత్పురాత్,
సుధన్వా వీర్యవాన్రాజా మిథిలామవరోధకః. 16

ప్ర. అ. అథ = పిమ్మట, కస్యచిత్ కాలస్య = కొంత కాలమునకు, వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, సుధన్వా = సుధన్వు డను, రాజా = రాజు, మిథిలామ్ = మిథిలానగరమును, అవరోధకః = ముట్టడింప నున్నవాడై, సాఙ్కాశ్యాత్ = సాంకాశ్య మనెడు, పురాత్ = పురమునుండి, (మిథిలను) అగమత్ = పొందెను.

తా. కొంత కాలమునకు, పరాక్రమవంతు డగు సుధన్వు డను రాజు సాంకాశ్యపురమునుండి మిథిల పైకి దండెత్తివచ్చెను. 16

మూ. స చ మే ప్రేషయామాస శైవం ధనురనుత్తమమ్,
సీతా కన్యా చ పద్మాక్షీ మహ్యం వై దీయతామితి. 17

ప్ర. అ. అనుత్తమమ్ = శ్రేష్ఠ మైన, శైవం ధనుః = శివధనస్సు, పద్మాక్షీ = పద్మముల వంటి నేత్రములుగల, కన్యా = నీ కుమా ర్తెయైన, సీతా చ = సీతయు, మహ్యమ్ = నాకు, దీయతామ్ = ఇవ్వబడుగాక. ఇతి = అని, సః = అతడు, మే = నాకు, ప్రేషయామాస = కబురుపంపెను.

తా. "శ్రేష్ఠ మగు శివధనస్సును, పద్మపత్రాక్షి యగు సీతను నా కిమ్ము" అని అతడు నాకు వార్త పంపెను. 17

మూ. తస్యాప్రదానాద్బ్రహ్మర్షే యుద్ధమాసీన్మయా సహ,
స హతోఽభిముఖో రాజా సుధన్వా తు మయా రణే. 18

ప్ర. అ. బ్రహ్మర్షే = బ్రహ్మర్షీ ! అప్రదానాత్ = ఇవ్వకపోవుటవలన, తస్య = ఆతనికి, మయా సహ = నాతో కూడ, యుద్ధమ్ = యుద్ధము, ఆసీత్ = జరిగెను. రణే = యుద్ధమునందు, అభిముఖః = నాకు ఎదురుగా వచ్చిన, సః = ఆ, సుధన్వా రాజా = సుధన్వరాజు, మయా = నాచేత, హతః = చంపబడినాడు.

తా. సీతాశివధనస్సులను ఇవ్వక పోవుటచే ఆతనికిని నాకును యుద్ధము జరుగగా, రణరంగమున నే నాతనిని వధించితిని. 18

మూ. నిహత్య తం మునిశ్రేష్ఠ ! సుధన్వానం నరాధిపమ్,
సాఙ్కాశ్యే భ్రాతరం వీరమభ్యషిఞ్చం కుశధ్వజమ్. 19

ప్ర. అ. మునిశ్రేష్ఠ = ఓ మునిశ్రేష్ఠుడా ! నరాధిపమ్ = రాజైన, తమ్ = ఆ, సుధన్వానమ్ = సుధన్వుని, నిహత్య = చంపి, భ్రాతరమ్ = నా సోదరుడైన, వీరమ్ = వీరుడైన, కుశధ్వజమ్ = కుశధ్వజుని, సాఙ్కాశ్యే = సాంకాశ్యమునందు, అభ్యషిఞ్చమ్ = అభిషేకించితిని.

తా. వసిష్ఠమహామునీ ! ఆ సుధన్వుని సంహరించి, నా సోదరుడైన ఈ కుశధ్వజుని సాంకాశ్యపురమున రాజ్యాభిషిక్తుని చేసితిని. 19

మూ. కనీయానేష మే భ్రాతా అహం జ్యేష్ఠో మహామునే,
దదామి పరమప్రీతో వధ్వౌ తే మునిపుఙ్గవ. 20
సీతాం రామాయ భద్రం తే ఊర్మిళాం లక్ష్మణాయ చ.

ప్ర. అ. మహామునే = ఓ మహామునీ ! ఏషః = ఇతడు, మే = నాయొక్క, కనీయాన్ = చిన్నవాడైన, భ్రాతా = సోదరుడు. అహమ్ = నేను, జ్యేష్ఠః = పెద్దవాడను. మునిపుఙ్గవ = ఓ మునిశ్రేష్ఠా ! పరమప్రీతః = మిక్కిలి సంతసించినవాడనై, తే = ఆ, వధ్వౌ = కన్యలను, దదామి = ఇచ్చుచున్నాను. సీతామ్ = సీతను,

రామాయ=రామునకును, ఊర్మిళామ్=ఊర్మిళను, లక్ష్మణాయ చ=లక్ష్మణునకును ఇచ్చుచున్నాను. తే=నీకు, భద్రమ్=మంగళమగు గాక.

తా. మునిశ్రేష్ఠుడ వైన వసిష్ఠా! సోదరులలో నేను పెద్దవాడను. ఇతడు చిన్నవాడు. కన్య లిద్దరిని ఆనందపూర్వకముగ ఇచ్చెదను. సీతను రామునకును, ఊర్మిళను లక్ష్మణునకును ఇచ్చెదను. 20

మూ. వీర్యశుల్కాం మమ సుతాం సీతాం సురసుతోపమామ్, 21
ద్వితీయామూర్మిళాం చైవ త్రిర్దదామి న సంశయః.

ప్ర. అ. వీర్యశుల్కామ్=వీర్యమే శుల్కముగా గలదియు, సురసుతోపమామ్ = దేవకన్యతో సమానురా లైన, మమ సుతామ్=నాకుమార్తె యైన, సీతామ్=సీతను, ద్వితీయామ్ = రెండవ కుమార్తె యైన, ఊర్మిళాం చైవ= ఊర్మిళను, త్రిః=మూడు సార్లు, దదామి=ఇచ్చుచున్నాను. సంశయః=సంశయము, న=లేదు.

తా. వీర్యశుల్కయు, దేవకన్యతో సమానురాలును అగు నా పుత్రిక యైన సీతను, రెండవ కుమార్తె యైన ఊర్మిళను ఇచ్చెద నని మూడు పర్యాయములు నొక్కి వక్కాణించుచున్నాను. ఈ విషయమున సందేహము లేదు.

వి. "త్రిః దదామి" అను దానికి "మనోవాక్కాయము లను మూడు కరణముల చేత ఇచ్చుచున్నాను" అని కొంద రర్థము చెప్పినారు. 21

మూ. దదామి పరమప్రీతో వధ్వౌ తే రఘునన్దన, 22
రామలక్ష్మణయో రాజన్ గోదానం కారయస్వ హ,
పితృకార్యం చ భద్రం తే తతో వైవాహికం కురు. 23

ప్ర. అ. రఘునన్దన = దశరథమహారాజా! పరమప్రీతః=చాల సంతసించినవాడనై, తే=ఆ, వధ్వౌ=కన్యలను, దదామి=ఇచ్చుచున్నాను. రాజన్= రాజా! రామలక్ష్మణయోః=రామలక్ష్మణులకు, గోదానమ్=గోదానవ్రతమును, కారయస్వ హ=చేయించుము. పితృకార్యం చ=నాందీశ్రాద్ధమును కూడ, కురు= చేయుము. తతః=పిమ్మట, వైవాహికమ్=వివాహమును, (చేయుము).

తా. దశరథమహారాజా! ఈ కన్యలను ఆనందపూర్వకముగా ఇచ్చు చున్నాను. రామలక్ష్మణులకు గోదానమును (సమావర్తనవ్రతమును) చేయించుము. నాందీశ్రాద్ధము చేసిన పిమ్మట వివాహము జరిపించుము. 22

మూ. మఘా హ్యద్య మహాబాహో తృతీయే దివసే ప్రభో, 23
ఫల్గున్యాముత్తరే రాజన్ తస్మిన్ వైవాహికం కురు,
రామలక్ష్మణయో రాజన్ దానం కార్యం సుఖోదయమ్. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ఏకసప్తతితమః సర్గః.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల, ప్రభో=ఓ మహారాజా! అద్య = నేడు, మఘా హి = మఘానక్షత్రము కదా. రాజన్ = మహారాజా! దివసే = నేటినుండి మూడవ దివసమున, ఫల్గున్యామ్ = ఫల్గుని యనెడు, తస్మిన్=ఆ, ఉత్తరే=ఉత్తరనక్షత్రమునందు, వైవాహికమ్=వివాహకార్యమును, కురు = చేయుము, రాజన్ = రాజా, రామలక్ష్మణయోః=రామలక్ష్మణులయొక్క సుఖోదయమ్ = సుఖమే భావిఫలముగా గల, దానమ్ = దానము, కార్యమ్ = చేయదగినది.

తా. దశరథమహారాజా! ఈ దివసమున మఘానక్షత్రము కదా. నేటికి మూడవరోజున, ఉత్తరఫల్గునీ నక్షత్రమునందు, వివాహము చేయుము. ముందుగా, రామలక్ష్మణుల భావిసుఖహేతు వగు గోహిరణ్యభూమ్యాదిదానము కూడ చేయింపవలెను. 23, 24

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు, బాలకాండలో
డెబ్బదిఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్విసప్తతితమః సర్గః

మూ. తముక్తవన్తం వైదేహం విశ్వామిత్రో మహామునిః,
ఉవాచ వచనం వీరం వసిష్ఠసహితో నృపమ్. 1

ప్ర. అ. మహామునిః = మహాముని యైన, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, వసిష్ఠసహితః = వసిష్ఠునితో కూడినవాడై, ఉక్తవన్తమ్ = ఇట్లు పలికిన, వీరమ్ = వీరుడైన, వైదేహమ్ = విదేహాధిపతి యైన, నృపమ్ = జనకమహారాజును గూర్చి, వచనమ్ = వచనమును, ఉవాచ = పలికెను.

తా. విదేహాధిపతి యగు జనకమహారాజు పలికిన మాటలు విని వసిష్ఠ విశ్వామిత్రు లాతనితో ఇట్లు పలికిరి. 1

మూ. అచిన్త్యాన్యప్రమేయాని కులాని నరపుఙ్గవ,
ఇక్ష్వాకూణాం విదేహానాం నైషాం తుల్యోఽస్తి కశ్చన. 2

ప్ర. అ. నరపుఙ్గవ = నరశ్రేష్ఠుడా! ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకురాజుల యొక్కయు, విదేహానాం చ = విదేహరాజులయొక్కయు, కులాని = కులములు, అచిన్త్యాని = ఊహింప శక్యముకానివి. అప్రమేయాని = కొలత పెట్టరానివి. ఏషామ్ = ఈ ఇక్ష్వాకు విదేహరాజులకు, తుల్యః = సమాన మైనవాడు, కశ్చన = ఎవ్వడును, నాస్తి = లేడు.

తా. జనకమహారాజా! ఇక్ష్వాకువిదేహవంశములు ఊహింపరాని, కొలత పెట్టశక్యము కాని, ప్రభావము కలవి. ఏతద్వంశీయులతో సమాను లెవ్వరును లేరు. 2

మూ. సదృశో ధర్మసంబన్ధః సదృశో రూపసమ్పదా,
రామలక్ష్మణయో రాజన్ సీతా చోర్మిళయా సహ. 3

ప్ర. అ. రాజన్ = రాజా, ఊర్మిళయా సహ = ఊర్మిళతో గూడ, సీతా = సీత, రామలక్ష్మణయోః = రామలక్ష్మణులకు (ఇవ్వబడుచున్నది. ఇది), సదృశః =

తగిన, ధర్మసంబన్ధః=వివాహరూప మైన ధర్మసంబంధము. రూపసమ్పదా చ=రూపసంపదచేత కూడ, సదృశః=తగినది.

తా. రాజా ! సీతా, ఊర్మిళలను రామలక్ష్మణుల కిచ్చి వివాహము చేయుట అనునది పరస్పరకులగౌరవాదులకును, రూపసంపదకును తగిన సంబంధము. 3

మూ. వక్తవ్యం చ నరశ్రేష్ఠ శ్రూయతాం వచనం మమ,
భ్రాతా యవీయాన్ ధర్మజ్ఞ ఏష రాజా కుశధ్వజః. 4

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడా ! మమ = నాయొక్క, వక్తవ్యం చ=చెప్పదగిన, వచనమ్=వచనము, శ్రూయతామ్=వినబడుగాక. యవీయాన్ భ్రాతా=నీ తమ్ము డైన, ఏషః=ఈ, రాజా=రాజైన, కుశధ్వజః = కుశధ్వజుడు, ధర్మజ్ఞః=ధర్మము లెరిగినవాడు.

తా. నరశ్రేష్ఠుడ వైన జనకమహారాజా ! మేము చెప్పదలచిన వచనమును వినుము. నీ తమ్ము డైన ఈ కుశధ్వజుడు ధర్మము నెరిగినవాడు. 4

మూ. అస్య ధర్మాత్మనో రాజన్ రూపేణాప్రతిమం భువి,
సుతాద్వయం నరశ్రేష్ఠ పత్న్యర్థం వరయామహే. 5

ప్ర. అ. రాజన్=రాజా ! నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడా ! రూపేణ = సౌందర్యము చేత, భువి=భూలోకమునందు, అప్రతిమమ్ = సాటిలేని, అస్య ధర్మాత్మనః = ఈ ధర్మాత్మునియొక్క, సుతాద్వయమ్ = పుత్రికాద్వయమును, పత్న్యర్థమ్ = భరతశత్రుఘ్నుల భార్య లగుటకై, వరయామహే = వరించుచున్నాము.

తా. జనకనరేంద్రా ! భూలోకమునందు సాటి లేని రూపము గలవారగు ఈ ధర్మాత్ముని ఇరువురు పుత్రికలను భరతశత్రుఘ్నులకు భార్యలనుగా వరించుచున్నాము. 5

మూ. భరతస్య కుమారస్య శత్రుఘ్నస్య చ ధీమతః,
వరయామః సుతే రాజన్ తయోరర్థే మహాత్మనోః. 6

ప్ర. అ. రాజన్=రాజా! కుమారస్య=కుమారుడైన, భరతస్య=భరతుని కొరకును, ధీమతః=బుద్ధిమంతుడైన, శత్రుఘ్నస్య చ=శత్రుఘ్నుని కొరకును, మహాత్మనోః=మహాత్ములైన, తయోరర్థే = వారిరువురికొరకును, సుతే = మీ తమ్ముని కుమార్తెలను, వరయామః=వరించుచున్నాము.

తా. రాజా! భరతకుమారుని కొరకును, ధీమంతుడైన శత్రుఘ్నుని కొరకును నీ తమ్ముని కుమార్తెలను కోరుచున్నాము. 6

మూ. పుత్రా దశరథస్యేమే రూపయౌవనశాలినః,
లోకపాలసమాః సర్వే దేవతుల్యపరాక్రమాః. 7

ప్ర. అ. ఇమే=ఈ, దశరథస్య పుత్రాః = దశరథుని పుత్రులు, సర్వే= అందరును, రూపయౌవనశాలినః=సౌందర్యముతోడను యౌవనముతోడను ప్రకాశించుచున్నారు. లోకపాలసమాః = లోకపాలులతో సమానులు. దేవతుల్యపరాక్రమాః=దేవతలతో సమానమైన పరాక్రమము గలవారు.

తా. ఈ దశరథకుమారు లందరును రూపయౌవనములతో ప్రకాశించుచున్నవారు. లోకపాలులతో సమానులు. దేవతల వంటి పరాక్రమము గలవారు. 7

మూ. ఉభయోరపి రాజేన్ద్ర సంబన్ధేనానుబధ్యతామ్,
ఇక్ష్వాకోః కులమవ్యగ్రం భవతః పుణ్యకర్మణః. 8

ప్ర. అ. రాజేన్ద్ర = మహారాజా! ఇక్ష్వాకోః = ఇక్ష్వాకువుయొక్కయు, పుణ్యకర్మణః=పుణ్యమైన కర్మగల, భవతః = నీయొక్కయు, ఉభయోరపి= ఇద్దరియొక్కయు, కులమ్ = కులము, సమ్బన్ధేన = వివాహసంబంధముచేత, అవ్యగ్రమ్ = దృఢముగా, అనుబధ్యతామ్=కట్టబడుగాక.

తా. జనకమహారాజా! పుణ్యకర్మ గల నీ కులమునకును, ఇక్ష్వాకుకులమునకును ఈ వివాహసంబంధముచే దృఢమైన బంధము ఏర్పడుగాక. 9

మూ. విశ్వామిత్రవచః శ్రుత్వా వసిష్ఠస్య మతే తదా,
జనకః ప్రాఞ్జలిర్వాక్యమువాచ మునిపుఙ్గవౌ. 9

ప్ర. అ. తదా=అప్పుడు, వసిష్ఠస్య=వసిష్ఠునియొక్క, మతే = అనుజ్ఞ ప్రకారము, విశ్వామిత్రవచః=విశ్వామిత్రుని వాక్యమును, శ్రుత్వా=విని, జనకః= జనకుడు, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలి కలవాడై, మునిపుఙ్గవౌ = మునిపుంగవు లను గూర్చి, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. వసిష్ఠుని అనుమతి ననుసరించి విశ్వామిత్రుడు పలికిన ఈ మాటలు విని, జనకమహారాజు, అంజలి ఘటించి, ఆ వసిష్ఠవిశ్వామిత్రులతో నిట్లనెను. 9

మూ. కులం ధన్యమిదం మన్యే యేషాం నో మునిపుఙ్గవౌ,
సదృశం కులసమ్బన్ధం యదాజ్ఞాపయథః స్వయమ్. 10

ప్ర. అ. యేషామ్=ఏ, నః=మాకు, సదృశమ్=తగిన, కులసంబన్ధమ్= కులసంబంధమును, మునిపుఙ్గవౌ=మునిపుంగవులైన మీరు, స్వయమ్=స్వయ ముగా, యత్=ఏకారణమువలన, ఆజ్ఞాపయథః = ఆజ్ఞాపించుచున్నారో అట్టి, ఇదమ్=ఈ, కులమ్=కులమును, ధన్యమ్=ధన్యమైనదానినిగా, మన్యే=తలచు చున్నాను.

తా. మునిశ్రేష్ఠులైన మీరు మాకు తగిన కులసంబంధమునుగూర్చి స్వయ ముగ ఆజ్ఞాపించుచున్నారు. అందుచే మా కులము ధన్యమైనది. 10

మూ. ఏవం భవతు భద్రం వః కుశధ్వజసుతే ఇమే,
పత్న్యౌ భజేతాం సహితౌ శత్రుఘ్నభరతావుభౌ. 11

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, భవతు=అగుగాక ; వః = మీకు, భద్రమ్= కుశల మగుగాక. ఇమే=ఈ, కుశధ్వజసుతే=కుశధ్వజుని కుమార్తెలు, సహితౌ= కలిసియుండువారైన, శత్రుఘ్నభరతౌ=శత్రుఘ్నభరతులను, ఉభౌ=ఇద్దరిని, పత్న్యౌ=భార్యలుగా, భజేతామ్=సేవింతురు గాక.

తా. అట్లే అగుగాక. మీకు భద్ర మగుగాక. ఈ కుశధ్వజుని కుమార్తెలగు మాండవీశ్రుతకీర్తులు, కలసి సంచరించెడు ఈ భరతశత్రుఘ్నులకు (వరుసగ) భార్యలై వారిని సేవింతురుగాక. 11

మూ. ఏకాహ్నే రాజపుత్రీణాం చతసృణాం మహామునే,
పాణీన్ గృహ్ణన్తు చత్వారో రాజపుత్రా మహాబలాః. 12

ప్ర. అ. మహామునే = ఓమహామునీ ! మహాబలాః=గొప్ప బలముగల, చత్వారః=నలుగురు, రాజపుత్రాః = రాజపుత్రులు, ఏకాహ్నే = ఒకేదివసమున, చతసృణామ్=నలుగురు, రాజపుత్రీణామ్ = రాజపుత్రికలయొక్క, పాణీన్= హస్తములను, గృహ్ణన్తు=గ్రహింతురుగాక.

తా. మహామునీ ! మహాబలశాలు లగు నలుగురు రాజపుత్రులును ఒకే దివసమున నలుగురు రాజపుత్రికలను వివాహ మాడుదురు గాక. 11

మూ. ఉత్తరే దివసే బ్రహ్మన్ ఫల్గునీభ్యాం మనీషిణః,
వైవాహికం ప్రశంసన్తి భగో యత్ర ప్రజాపతిః. 13

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణోత్తమా ! ఫల్గునీభ్యామ్ = పూర్వఫల్గుని, ఉత్తరఫల్గుని, అను రెండు ఫల్గునీనక్షత్రములతో కూడిన దినములలో, యత్ర= ఏ దినమునందు, ప్రజాపతిః = ప్రజాపతి యైన (సంతానదాతయైన), భగః= భగుడు, (దేవతా=దేవతయో), అట్టి, ఉత్తరే దివసే=ఉత్తరఫల్గునీనక్షత్రముతో కూడిన దివసమున, వైవాహికమ్=వివాహకృత్యమును, మనీషిణః=విద్వాంసులు, ప్రశంసన్తి=ప్రశంసించుచున్నారు.

తా. బ్రాహ్మణోత్తమా! సంతానదాత యగు భగుడు దేవతగా గల ఉత్తర నక్షత్రముతో కూడిన దివసమున వివాహకృత్యము శ్రేష్ఠ మని బుద్ధిమంతులు చెప్పుదురుకదా ? 13

మూ. ఏవముక్త్వా వచః సౌమ్యం ప్రత్యుత్థాయ కృతాఞ్జలిః,
ఉభౌ మునివరౌ రాజా జనకో వాక్యమబ్రవీత్. 14

ప్ర. అ. జనకః రాజా = జనకమహారాజు, ఏవమ్=ఇట్లు, సౌమ్యమ్= మధుర మైన, వచః = వచనమును, ఉక్త్వా=పలికి, ప్రత్యుత్థాయ=లేచి, కృతాఞ్జలిః=చేయబడిన దోసిలి కలవాడై, ఉభౌ=ఇద్దరు, మునివరౌ = మునివరులను గూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. జనకమహారాజు ఈ విధముగ సౌమ్య మగు వాక్యము పలికి, లేచి, దోసిలి కట్టి, ఆ మహాముని లిరువురితో మరల ఇట్లనెను. 14

మూ. పరో ధర్మః కృతో మహ్యం శిష్యోఽస్మి భవతోః సదా,
ఇమాన్యాసనముఖ్యాని ఆసాతాం మునిపుఙ్గవౌ. 15

ప్ర. అ. మహ్యమ్=నాకు, పరః=గొప్ప, ధర్మః=ధర్మము, కృతః=చేయబడినది. సదా=ఎల్లప్పుడును, భవతోః=మీ ఇద్దరికిని, శిష్యః అస్మి=శిష్యుడ నైయున్నాను. మునిపుఙ్గవౌ=ముని శ్రేష్ఠు లైన మీరు, ఇమాని=ఈ, ఆసనముఖ్యాని=సింహాసనములను, ఆసాతామ్=అధిష్ఠింతురుగాక.

తా. మీరు నాకు గొప్ప ధర్మకార్యమును నెరవేర్చినారు. నేను ఎల్లప్పుడును మీ శిష్యుడనే. మునిపుంగవు లైన మీ రిరువురును ఈ మూడుసింహాసనములను (జనక–దశరథ-కుశధ్వజుల సింహాసనములను) అధిష్ఠింతురు గాక.

వి. సింహాసనము నధిష్ఠించుట యనగా లక్షణచే అధికారము నిర్వహించుట అని అర్థము, మీ రిరువురును మా ముగ్గురి రాజ్యములపై అధికారము నిర్వహింతురు గాక అని భావము. 15

మూ. యథా దశరథస్యేయం తథాయోధ్యా పురీ మమ,
ప్రభుత్వే నాస్తి సన్దేహో యథార్హం కర్తుమర్హథ. 16

ప్ర. అ. ఇయమ్=ఈ మిథిల, దశరథస్య=దశరథునకు, యథా=ఎట్లో, అయోధ్యా పురీ=అయోధ్యానగరము, మమ=నాకు, తథా=అట్లే. ప్రభుత్వే=ప్రభుత్వము విషయమున, సన్దేహః=సందేహము, నాస్తి=లేదు, యథార్హమ్=తగు విధముగ, కర్తుమ్=చేయుటకు, అర్హథ=తగియున్నారు.

తా. దశరథునకు మిథిలపై అధికార మున్నట్లే నాకును అయోధ్యపై అధికార మున్నది. అందుచేతనే దశరథుని రాజ్యముపై కూడ మీకు అధికారము నిచ్చుచున్నాను. ప్రభుత్వవిషయమున సందేహము లేదు. తగు విధముగ కార్యము నిర్వహింపుడు. 16

మూ. తథా బ్రువతి వైదేహే జనకే రఘునన్దనః,
రాజా దశరథో హృష్టః ప్రత్యువాచ మహీపతిమ్. 17

ప్ర. అ. వైదేహే = విదేహదేశరాజైన, జనకే = జనకుడు, తథా = అట్లు, బ్రువతి = పలుకుచుండగా, రఘునన్దనః = రఘువంశానందకరుడైన, రాజా దశరథః = దశరథమహారాజు, హృష్టః = సంతసించినవాడై, మహీపతిమ్ = జనకమహారాజును గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. దశరథమహారాజు జనకుని మాటలకు సంతసించి ఆతనితో ఇట్లనెను. 17

మూ. యువామసఙ్ఖ్యేయగుణౌ భ్రాతరౌ మిథిలేశ్వరౌ,
ఋషయో రాజసంఘాశ్చ భవద్భ్యామభిపూజితాః. 18

ప్ర. అ. మిథిలేశ్వరౌ = మిథిలాధిపతులును, భ్రాతరౌ = సోదరులును అగు, యువామ్ = మీరిరువురును, అసంఖ్యేయగుణౌ = లెక్కింప శక్యము కాని గుణములు కలవారు. భవద్భ్యామ్ = మీచేత, ఋషయః = ఋషులును, రాజ సంఘాశ్చ = రాజసముదాయములును, అభిపూజితాః = పూజింపబడినారు.

తా. "మిథిలాధిపతులైన మీ సోదరు లిరువురును లెక్కింపరాని సద్గుణములు గలవారు. మీ రెండరో ఋషులను, రాజులను పూజించి వారినుండి సద్గుణముల నలవరచుకొనినారు". 18

మూ. స్వస్తి ప్రాప్నుహి భద్రం తే గమిష్యామి స్వమాలయమ్,
శ్రాద్ధకర్మాణి సర్వాణి విధాస్యామీతి చాబ్రవీత్. 19

ప్ర. అ. స్వస్తి = క్షేమమును, ప్రాప్నుహి = పొందుము. తే = నీకు, భద్రమ్ = క్షేమమగుగాక. స్వమ్ = నా సంబంధమైన, ఆలయమ్=నివాసమును గూర్చి, గమిష్యామి = వెళ్లగలను, సర్వాణి = సమస్తమైన, శ్రాద్ధకర్మాణి = శ్రాద్ధకర్మలను, విధాస్యామి చ = చేయగలను. ఇతి = అని, అబ్రవీత్ = పలికెను.

తా. "నీవు మంగళమును పొందెదవు గాక. నీకు భద్ర మగు గాక. నా నివాసమునకు వెళ్లెదను. నాందీముఖశ్రాద్ధాదికర్మలు కూడ చేసెదను" అని పలికెను. 19

మూ. తమాపృష్ట్వా నరపతిం రాజా దశరథ స్తదా,
మునీన్ద్రౌ తౌ పురస్కృత్య జగామాశు మహాయశాః. 20

ప్ర. అ. తదా = అప్పుడు, మహాయశాః = గొప్ప కీర్తి గల, రాజా దశరథః = దశరథమహారాజు, తమ్ = ఆ, నరపతిమ్ = రాజును, ఆపృష్ట్వా = అడిగి, తౌ = ఆ, మునీన్ద్రౌ = మునీంద్రులను, పురస్కృత్య = ముందిడుకొని, ఆశు = శీఘ్రముగా, జగామ = వెళ్లెను.

తా. మహాయశశ్శాలి యగు దశరథమహారాజు అపుడు, జనకునివద్ద సెలవు గైకొని వసిష్ఠవిశ్వామిత్రులతో నిజనివాసమునకు వెళ్లెను. 20

మూ. స గత్వా నిలయం రాజా శ్రాద్ధం కృత్వా విధానతః,
ప్రభాతే కాల్యముత్థాయ చక్రే గోదానముత్తమమ్. 21

ప్ర. అ. సః = ఆ, రాజా = రాజు, నిలయమ్ = గృహమును గూర్చి, గత్వా = వెళ్లి, విధానతః=శాస్త్రానుసారముగా, శ్రాద్ధమ్=శ్రాద్ధమును, కృత్వా= చేసి, ప్రభాతే = ప్రాతఃకాలమున, ఉత్థాయ = లేచి, కాల్యమ్ = కాలోచిత మైన, ఉత్తమమ్=ఉత్తమ మైన, గోదానమ్=సమావర్తన(స్నాతక)వ్రతమును, చక్రే= చేసెను.

తా. దశరథమహారాజు తన నివాసగృహముచేరి యథాశాస్త్రముగ శ్రాద్ధము చేసి, మరునాడు ప్రాతఃకాలముననే లేచి అపుడు చేయవలసిన స్నాతకవ్రతమును జరిపించెను. 21

మూ. గవాం శతసహస్రాణి బ్రాహ్మణేభ్యో నరాధిపః,
ఏకైకశో దదౌ రాజా పుత్రానుద్దిశ్య ధర్మతః. 22

ప్ర. అ. నరాధిపః = నరులకు అధిపతి యగు, రాజా=రాజు, పుత్రాన్= పుత్రులను, ఏకైకశః = ఒక్కొక్కరిని, ఉద్దిశ్య = ఉద్దేశించి, బ్రాహ్మణేభ్యః =

బ్రాహ్మణులకొరకు, గవామ్ = గోవులయొక్క, సహస్రాణి = సహస్రములను, ధర్మతః = ధర్మానుసారముగా, దదౌ=ఇచ్చెను.

తా. దశరథమహారాజు ఒక్కొక్క కుమారు నుద్దేశించి ఒక్కొక లక్ష చొప్పున గోవులను బ్రాహ్మణులకు దానము చేసెను. 22

మూ. సువర్ణశృఙ్గాః సమ్పన్నాః సవత్సాః కాంస్యదోహనాః,
గవాం శతసహస్రాణి చత్వారి పురుషర్షభః. 23

విత్తమన్యచ్చ సుబహు ద్విజేభ్యో రఘునన్దనః,
దదౌ గోదానముద్దిశ్య పుత్రాణాం పుత్రవత్సలః. 24

ప్ర. అ. పురుషర్షభః=పురుషశ్రేష్ఠుడును, పుత్రవత్సలః=పుత్రులయందు ప్రేమ కలవాడును అగు, రఘునన్దనః = దశరథుడు, పుత్రాణామ్ = పుత్రుల యొక్క, గోదానమ్ = గోదానవ్రతమును, ఉద్దిశ్య = ఉద్దేశించి, సువర్ణశృఙ్గాః= బంగారు కొమ్ములు కలవియు, సమ్పన్నాః = క్షీరసమృద్ధి కలవియు, సవత్సాః= లేగదూడలతో కూడినవియు, కాంస్యదోహనాః=పాలు పిదుకుటకై కంచుపాత్రలు కలవియుఅగు, గవామ్=గోవులయొక్క, చత్వారి = నాలుగు, శతసహస్రాణి= లక్షలను, అన్యత్ = ఇతరమైన, సుబహు = చాల అధిక మైన, విత్తం చ = ధనమును, ద్విజేభ్యః = బ్రాహ్మణులకు, దదౌ=ఇచ్చెను.

తా. పురుషశ్రేష్ఠుడును, పుత్రులయందు అత్యధికప్రేమకలవాడును అగు దశరథమహారాజు, బంగారు కొమ్ములు కలవియు, లేగదూడలతో కూడినవియు, కంచుపాత్రలతో కూడినవియు, క్షీరసమృద్ధములును అగు నాలుగు లక్షల గోవులను, అత్యధిక మైన ఇతరద్రవ్యమును, పుత్రుల గోదానవ్రతసమయమున బ్రాహ్మణులకు దానము చేసెను. 23, 24

మూ. స సుతైః కృతగోదానైర్వృతస్తు నృపతిస్తదా,
లోకపాలైరివాభాతి వృతః సౌమ్యః ప్రజాపతిః. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
ద్విసప్తతితమః సర్గః.

ప్ర. అ. కృతగోదానైః = చేయబడిన గోదానవ్రతము గల, సుతైః = కుమారులతో, వృతః = కూడి యున్న, సః = ఆ, నృపతిః = రాజు, తదా = అప్పుడు, లోకపాలైః = లోకపాలులచేత, వృతః = చుట్టుకొనబడి ఉన్న, సౌమ్యః = ప్రసన్నుడైన, ప్రజాపతిరివ = బ్రహ్మ వలె, ఆభాతి = ప్రకాశించు చుండెను.

తా. గోదానవ్రతము పూర్తిచేసికొనిన కుమారులు చుట్టును నిలచి యుండ ఆ దశరథమహారాజు లోకపాలుల మధ్య నున్న బ్రహ్మ వలె ప్రకాశించెను.

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో డెబ్బదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిసప్తతితమః సర్గః

మూ. యస్మింస్తు దివసే రాజా చక్రే గోదానముత్తమమ్,
తస్మింస్తు దివసే శూరో యుధాజిత్సముపేయివాన్. 1

ప్ర. అ. రాజా = దశరథుడు, యస్మిన్ = ఏ, దివసే = దివసమునందు, ఉత్తమమ్ = ఉత్తమ మైన, గోదానమ్ = గోదానవ్రతమును, చక్రే = చేసెనో, తస్మిన్ తు = ఆ, దివసే = దివసమునందు, శూరః = శూరు డైన, యుధాజిత్ = యుధాజిత్తు, సముపేయివాన్ = వచ్చెను.

తా. దశరథమహారాజు కుమారులకు గోదానవ్రతము జరిపించిన దివసముననే భరతుని మేనమామ యగు యుధాజిత్తు వచ్చెను. 1

మూ. పుత్రః కేకయరాజస్య సాక్షాద్భరతమాతులః,
దృష్ట్వా పృష్ట్వా చ కుశలం రాజానమిదమబ్రవీత్. 2

ప్ర. అ. కేకయరాజస్య = కేకయరాజుయొక్క, పుత్రః = పుత్రుడును, సాక్షాత్ = సాక్షాత్తుగ, భరతమాతులః = భరతుని మేనమామయు నైన ఆ యుధాజిత్తు, రాజానమ్ = రాజును, దృష్ట్వా = చూచి, కుశలమ్ = కుశలమును, పృష్ట్వా చ = అడిగి, రాజానమ్ = రాజును గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. కేకయరాజుకుమారుడును, సాక్షాత్తుగ భరతుని మేనమామయు అగు ఆ యుధాజిత్తు రాజును చూచి, కుశలప్రశ్న మడిగి ఇట్లు పలికెను. 2

మూ. కేకయాధిపతీ రాజా స్నేహాత్కుశలమబ్రవీత్,
యేషాం కుశలకామోఽసి తేషాం సంప్రత్యనామయమ్. 3

ప్ర. అ. కేకయాధిపతిః = కేకయదేశప్రభు వైన, రాజా = రాజు, స్నేహాత్ = స్నేహమువలన, కుశలమ్ = కుశలమును, అబ్రవీత్ = పలికెను.

యేషామ్ = ఎవరియొక్క, కుశలకామః = కుశలమునందు కోరిక గలవాడవుగ, అసి = అయి ఉన్నవో, తేషామ్ = వారందరికిని, సంప్రతి = ఇప్పుడు, అనామయమ్=ఆరోగ్యము.

తా. కేకయదేశప్రభు వైన మా తండ్రి స్నేహపూర్వకముగ నిన్ను కుశలప్రశ్న చేసినారు. నీవు ఎవరి కుశలమును కోరుచుందువో వారందరును ఇపుడు ఆరోగ్యముగ నున్నారు. 3

మూ. స్వస్రీయం మమ రాజేన్ద్ర ద్రష్టుకామో మహీపతిః,
తదర్థముపయాతోఽహమయోధ్యాం రఘునన్దన. 4

ప్ర. అ. రఘునన్దన = రఘువంశానందకరుడ వగు, రాజేన్ద్ర = మహారాజా! మహీపతిః = కేకయరాజు, మమ = నాయొక్క, స్వస్రీయమ్ = మేనల్లుని, ద్రష్టుకామః = చూడ కోరిక గలవాడు. తదర్థమ్ = దాని(అవని)కొరకు, అహమ్ = నేను, అయోధ్యామ్ = అయోధ్యాపట్టణమును గూర్చి, ఉపయాతః = వెళ్లితిని.

తా. మహారాజు మా తండ్రి మా మేనల్లుని చూడవలె నని కోరుటచే అందుకొరకై నేను అయోధ్యానగరమునకు వెళ్లి యుంటిని. 4

మూ. శ్రుత్వా త్వహమయోధ్యాయాం వివాహార్థం తవాత్మజాన్,
మిథిలాముపయాతాంస్తు త్వయా సహ మహీపతే, 5
త్వరయాభ్యుపయాతోఽహం ద్రష్టుకామః స్వసుః సుతమ్.

ప్ర. అ. మహీపతే = రాజా! తవ = నీయొక్క, ఆత్మజాన్=కుమారులను, వివాహార్థమ్=వివాహముకొరకై, త్వయా సహ=నీతో కూడ, మిథిలామ్= మిథిలను గూర్చి, ఉపయాతాన్=చేరినవారినిగా, అయోధ్యాయామ్=అయోధ్యలో, శ్రుత్వా=విని, అహమ్=నేను, స్వసుః=సోదరియొక్క, సుతమ్=కుమారుని, ద్రష్టుకామః=చూచుటకు కోరిక గలవాడనై, త్వరయా = తొందరతో, అః యాతః=వచ్చినాను.

తా. రాజా! నీ కుమారులు వివాహముకొరకై సీతో కలిసి మిథిలకు వెళ్లినా రని అయోధ్యలో తెలియగా నేను నాసోదరీపుత్రుని చూచుటకై శీఘ్రముగా ఇచటికి వచ్చినాను. 5

మూ. అథ రాజా దశరథః ప్రియాతిథిముపస్థితమ్, 6
దృష్ట్వా పరమసత్కారైః పూజార్హం సమపూజయత్.

ప్ర. అ. అథ = పిమ్మట, రాజా = రాజైన, దశరథః = దశరథుడు, ఉపస్థితమ్ = వచ్చిన, ప్రియాతిథిమ్ = ప్రియుడైన అతిథిని, దృష్ట్వా=చూచి, పూజార్హమ్=పూజకు అర్హుడైన ఆతనిని, పరమసత్కారైః = అధికసత్కారములచే, సమపూజయత్=పూజించెను.

తా. పిమ్మట దశరథుడు వచ్చిన ఆ ప్రియాతిథిని చూచి, పూజార్హుడైన ఆతనిని అధికసత్కారములతో పూజించెను. 6

మూ. తతస్తాముషితో రాత్రిం సహ పుత్రైర్మహాత్మభిః, 7
ప్రభాతే పునరుత్థాయ కృత్వా కర్మాణి కర్మవిత్,
ఋషీంస్తదా పురస్కృత్య యజ్ఞవాటముపాగమత్. 8

ప్ర. అ. తతః=పిమ్మట, మహాత్మభిః=మహాత్ములైన, పుత్రైః సహ=పుత్రులతోకూడ, తామ్=ఆ, రాత్రిమ్=రాత్రి, ఉషితః=ఉన్నవాడై, కర్మవిత్=కర్మల నెరిగిన ఆ దశరథుడు, ప్రభాతే = ప్రాతఃకాలమున, పునః=మరల, ఉత్థాయ=లేచి, కర్మాణి=యథోచితకర్మలను, కృత్వా=చేసి, తదా=అప్పుడు, ఋషీన్=ఋషులను, పురస్కృత్య = ముందిడికొని, యజ్ఞవాటమ్ = యజ్ఞవాటమును, ఉపాగమత్=చేరెను.

తా. కర్మవేత్తయైన దశరథుడు మహాత్ములైన పుత్రులతో ఆ రాత్రి గడపి, ప్రాతఃకాలమున లేచి, కర్మ లాచరించి, ఆ ఋషులను ముందిడుకొని యజవాటమును చేరెను. 7, 8

మూ. యుక్తే ముహూర్తే విజయే సర్వాభరణభూషితైః,
భ్రాతృభిః సహితో రామః కృతకౌతుకమఙ్గలః. 9

వసిష్ఠం పురతః కృత్వా మహర్షీనపరానపి,
పితుః సమీపమాశ్రిత్య తస్థౌ భ్రాతృభిరావృతః. 10

ప్ర. అ. యుక్తే=తగిన, విజయే=విజయ మనెడు, ముహూర్తే=ముహూర్తమునందు, సర్వాభరణభూషితైః=సమస్త మైన అలంకారములచే అలంకరింపబడిన, భ్రాతృభిః=సోదరులతో, సహితః=కూడిన, రామః = రాముడు, కృతకౌతుకమఙ్గలః = చేయబడిన తోరముకట్టుట మొదలైన వివాహమంగలములు కలవాడై, వసిష్ఠమ్=వసిష్ఠుని, అపరాన్=ఇతరులైన, మహర్షీనపి=మహర్షులను, పురతః=ముందు, కృత్వా=ఉంచుకొని, పితుః = తండ్రియొక్క, సమీపమ్=సమీపమును, ఆశ్రిత్య=ఆశ్రయించి, భ్రాతృభిః=సోదరులచే, ఆవృతః=చుట్టుకొనబడినవాడై, తస్థౌ=ఉండెను.

తా. సర్వాలంకారములచే అలంకృతులైన సోదరులతో కూడిన రాముడు విజయ మనెడు యుక్త మైన ముహూర్తమునందు తోరముకట్టుట మొదలగు వివాహమంగళములు జరుపుకొని, వసిష్ఠాదిమహర్షులను ముందిడికొని, సోదరసహితుడై తండ్రివద్దకు చేరెను. 9, 10

మూ. వసిష్ఠో భగవానేత్య వైదేహమిదమబ్రవీత్,
రాజా దశరథో రాజన్ కృతకౌతుకమఙ్గలైః, 11
పుత్రైర్నరవరశ్రేష్ఠ దాతారమభికాఙ్క్షతే.

ప్ర. అ. భగవాన్=పూజ్యుడైన, వసిష్ఠః = వసిష్ఠుడు, వైదేహమ్=జనకుని, ఏత్య=సమీపించి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను. రాజన్=రాజా! నరవరశ్రేష్ఠ=నరవరులలో శ్రేష్ఠుడా! రాజా = రాజైన, దశరథః=దశరథుడు, కృతకౌతుకమఙ్గలైః=చేయబడినకౌతుకమంగళము గల, పుత్రైః=పుత్రులతో, దాతారమ్=కన్యాదాత వైన నిన్ను, అభికాఙ్క్షతే=ఎదురుచూచుచున్నాడు.

తా. వసిష్ఠమహాముని జనకుని వద్దకు వెళ్లి ఇట్లు చెప్పెను. నరోత్తములలో ఉత్తముడ వైన జనకమహారాజా! దశరథమహారాజు కుమారుల కౌతుకమంగళము పూర్తిచేసి కన్యాదాత వైన నీకొరకు ఎదురుచూచుచున్నాడు. 11

మూ. దాతృప్రతిగ్రహీతృభ్యాం సర్వార్థాః ప్రభవన్తి హి, 12
స్వధర్మం ప్రతిపద్యస్వ కృత్వా వైవాహ్యముత్తమమ్.

ప్ర. అ. సర్వార్థాః = అన్ని పనులును, దాతృప్రతిగ్రహీతృభ్యామ్= దాతద్వారా ప్రతిగ్రహీతద్వారా, ప్రభవన్తి హి=జరుగుచున్నవి కదా. ఉత్తమమ్= ఉత్తమ మైన, వైవాహ్యమ్ = వివాహకృత్యమును, కృత్వా=చేసి, స్వధర్మమ్= స్వధర్మమును, ప్రతిపద్యస్వ=నిర్వహించుము.

తా. ఇట్టి పనులు దాత, ప్రతిగ్రహీత ఇరువురు కలిసినప్పుడే జరుగును. ఉత్తమ మైన వివాహమును చేసి స్వధర్మము నాచరించుము. 12

మూ. ఇత్యుక్తః పరమోదారో వసిష్ఠేన మహాత్మనా, 13
ప్రత్యువాచ మహాతేజా వాక్యం పరమధర్మవిత్.

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, వసిష్ఠేన=వసిష్ఠునిచేత, ఇతి= ఇట్లు, ఉక్తః=పలకబడినవాడును, పరమోదారః=గొప్ప ఔదార్యము కలవాడును, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడును, పరమధర్మవిత్ = గొప్ప ధర్మ వేత్తయు అగు ఆ జనకుడు, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. పరమౌదార్యవంతుడును, మహాతేజఃశాలియు, పరమధర్మవేత్తయు అగు జనకుడు వసిష్ఠుని మాటలు విని ఇట్లు పలికెను. 13

మూ. కః స్థితః ప్రతిహారో మే కస్యాజ్ఞా సంప్రతీక్ష్యతే, 14
స్వగృహే కో విచారోఽస్తి యథా రాజ్యమిదం తవ.

ప్ర. అ. మే=నాయొక్క, ప్రతిహారః = ద్వారపాలకుడు, కః=ఎవ్వడు, స్థితః=ఉన్నాడు ? కస్య = ఎవనియొక్క, ఆజ్ఞా = అనుజ్ఞ, సంప్రతీక్ష్యతే= ఎదురుచూడబడుచున్నది? స్వగృహే=స్వగృహమునందు, కః=ఏమి, విచారః= ఆలోచన, అస్తి=ఉన్నది. ఇదమ్=ఈ, రాజ్యమ్ = రాజ్యము, తవ యథా= నీరాజ్యమువంటిదే.

తా. ద్వారమువద్ద అడ్డగించు ద్వారపాలకుడు ఎవ్వడైన ఉన్నాడా? లోనికి ఏల రాకూడదు? ఎవరి ఆజ్ఞకై ఎదురుజూచుచున్నారు? స్వగృహములో సంకోచ మెందుకు? ఈ రాజ్యము కూడ నీ రాజ్యమువంటిదే. 14

మూ. కృతకౌతుకసర్వస్వా వేదిమూలముపాగతాః, 15
మమ కన్యా మునిశ్రేష్ఠ దీప్తా వహ్నేరివార్చిషః.

ప్ర. అ. మునిశ్రేష్ఠ = మునిశ్రేష్ఠుడా! మమ = నాయొక్క, కన్యాః = కన్యలు, కృతకౌతుకసర్వస్వాః = చేయబడిన పరిపూర్ణకౌతుకమంగళము గలవారై, దీప్తాః = ప్రకాశించుచున్న, వహ్నేః = అగ్నియొక్క, అర్చిషః ఇవ = జ్వాలలు వలె, వేదిమూలమ్ = వేదిసమీపమును, ఉపాశ్రితాః = ఆశ్రయించి ఉన్నారు.

తా. వసిష్ఠమునీన్ద్రా! పూర్తిగ కౌతుకమంగళములు చేసికొనిన నా కన్యలు, ప్రజ్వలించుచున్న అగ్నిజ్వాలల వలె వేదికసమీపము చేరి యున్నారు. 15

మూ. సజ్జోఽహం త్వత్ప్రతీక్షోఽస్మి వేద్యామస్యాం ప్రతిష్ఠితః, 16
అవిఘ్నం కురుతాం రాజా కిమర్థమవలమ్బతే.

ప్ర. అ. సజ్జః = సిద్ధముగా నున్న, అహమ్ = నేను, అస్యామ్ = ఈ, వేద్యామ్ = వేదియందు, ప్రతిష్ఠితః = ఉన్నవాడనై, త్వత్ప్రతీక్షః = నిన్ను ఎదురుచూచుచు, అస్మి = ఉన్నాను. రాజా = రాజు, అవిఘ్నమ్ = విఘ్నములు లేకుండా! కురుతామ్ = చేయుగాక, కిమర్థమ్ = ఎందుకు, అవలమ్బతే = ఆలస్యము చేయుచున్నాడు.

తా. నేను సిద్ధుడనై వేదిదగ్గర ఉండి మిమ్ములను ఎదురుజూచుచున్నాను. దశరథమహారాజు విఘ్నము లేవియు లేకుండ కార్యము జరుపుగాక. ఆలస్య మెందులకు? 16

మూ. తద్వాక్యం జనకేనోక్తం శ్రుత్వా దశరథస్తదా, 17
ప్రవేశయామాస సుతాన్ సర్వానృషిగణానపి.

ప్ర. అ. తదా = అప్పుడు, దశరథః = దశరథుడు, జనకేన = జనకుని చేత, ఉక్తమ్ = పలకబడిన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని,

సుతాన్ = కుమారులను, సర్వాన్ = సమస్తమైన, ఋషిగణానపి = ఋషిగణములను కూడ, ప్రవేశయామాస = లోనికి ప్రవేశపెట్టెను.

తా. దశరథు డప్పుడు జనకుని వాక్యము విని, కుమారులను, సకల ఋషులను కూడ లోనికి తీసికొని వెళ్లెను. 17

మూ. తతో రాజా విదేహానాం వసిష్ఠమిదమబ్రవీత్, 18
కారయస్వ ఋషే సర్వమృషిభిః సహ ధార్మిక,
రామస్య లోకరామస్య క్రియాం వైవాహికీం విభో. 19

ప్ర. అ. తతః = పిమ్మట, విదేహానాం రాజా = విదేహదేశరాజు, వసిష్ఠమ్ = వసిష్ఠుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ధార్మిక = ధర్మము నాచరించువాడా ! విభో = సమర్థుడా ! ఋషే = వసిష్ఠమహర్షీ ! ఋషిభిః సహ = ఋషులతో కూడ కలిసి, లోకరామస్య = లోకమనోహరుడైన, రామస్య = రామునియొక్క, వైవాహికీమ్ = వివాహసంబంధమైన, క్రియామ్ = క్రియను, కారయస్వ = చేయించుము.

తా. పిమ్మట జనకుడు వసిష్ఠునితో నిట్లు పలికెను. ధార్మికుడవైన వసిష్ఠ మహామునీ ! ఇతరఋషుల సహాయముతో, లోకాభిరాముడైన రాముని వివాహక్రియను జరిపింపుము. 18, 19

మూ. తథేత్యుక్త్వా తు జనకం వసిష్ఠో భగవానృషిః,
విశ్వామిత్రం పురస్కృత్య శతానన్దం చ ధార్మికమ్, 20

ప్రపామధ్యే తు విధివద్వేదిం కృత్వా మహాతపాః,
అలఞ్చకార తాం వేదిం గన్ధపుష్పైః సమన్తతః. 21

సువర్ణపాలికాభిశ్చ ఛిద్రకుమ్భైశ్చ సాఙ్కురైః,
అఙ్కురాఢ్యైః శరావైశ్చ ధూపపాత్రైః సధూపకైః. 22

శఙ్ఖపాత్రైః స్రువైః స్రుగ్భిః పాత్రైరర్ఘ్యాభిపూరితైః,
లాజపూర్ణైశ్చ పాత్రీభిరక్షతైరభిసంస్కృతైః. 23

ప్ర. అ. భగవాన్ = పూజ్యుడును, మహాతపాః = గొప్ప తపస్సు కలవాడును అగు, వసిష్ఠః ఋషిః=వసిష్ఠమహర్షి, జనకమ్=జనకునిగూర్చి, తథా ఇతి= అట్లే అని, ఉక్త్వా=పలికి, విశ్వామిత్రమ్=విశ్వామిత్రుని, ధార్మికమ్=ధార్మికుడైన, శతానన్దం చ = శతానందుని, పురస్కృత్య = ముందు ఉంచుకొని, ప్రపామధ్యే=పందిలి మధ్యయందు, విధివత్ = యథాశాస్త్రముగా, వేదిమ్ = వేదిని, కృత్వా=చేసి, గన్ధపుష్పైః = సుగంధపుష్పములతోడను, సువర్ణపాలికాభిశ్చః = బంగారుపాలికలతోడను, సాఙ్కురైః=అంకురములతో కూడిన, ఛిద్రకుమ్భైశ్చ= రంధ్రములు గల కుంభములతోడను, అఙ్కురాఢ్యైః = అంకురములతో నిండిన, శరావైశ్చ = మూకుళ్లతోడను, సధూపకైః=ధూపముతో కూడిన, ధూపపాత్రైః= ధూపపాత్రల తోడను, శఙ్ఖపాత్రైః=శంఖాకారము లైన పాత్రలతోడను, స్రువైః= హోమసాధనము లగు స్రువము లను పాత్రలతోడను, స్రుగ్భిః=హోమసాధనము లగు స్రుక్కు లను పాత్రలతోడను, అర్ఘ్యాభిపూరితైః = అర్ఘ్యోదకముచే నింపబడిన, పాత్రైః = పాత్రలచేతను, లాజపూర్ణైః = పేలాలతో నిండిన, పాత్రీభిః = పాత్రలచేతను, అభిసంస్కృతైః = సంస్కరింపబడిన, అక్షతైః = అక్షతలచేతను, తామ్ = ఆ, వేదిమ్ = వేదిని, సమన్తతః=నలుమూలల, అలఙ్కార=అలంకరించెను.

తా. వసిష్ఠమహర్షి "అటులనే చేసెదను" అని జనకునకు చెప్పి, విశ్వామిత్ర శతానందులను ముందిడుకొని, మండపము మధ్య యథాశాస్త్రముగ అగ్ని వేదికను నిర్మించెను. దాని చుట్టును, గంధపుష్పములు, బంగారుపాలికలు, అంకురములు గల రంధ్రములతో కూడిన కుంభములు, అంకురములతో నిండిన మూకుళ్లు, ధూపముతో కూడిన ధూపపాత్రలు, శంఖాకారము లైన పాత్రలు, స్రుక్కులు, స్రువములు, అర్ఘ్యోదకము నింపిన పాత్రలు, పేలాలు నింపిన పాత్రలు, సంస్కరించిన అక్షతలు, ఉంచి అలంకరించెను. 20, 21, 22

మూ. దర్భైః సమైః సమాస్తీర్య విధివన్మన్త్రపూర్వకమ్,
అగ్నిమాదాయ వేద్యాం తు విధిమన్త్రపురస్కృతమ్, 24
జుహావాగ్నౌ మహాతేజా వసిష్ఠో భగవానృషిః.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, భగవాన్ = పూజ్యుడైన, వసిష్ఠః ఋషిః = వసిష్ఠమహర్షి, సమైః = సమప్రమాణము గల, దర్భైః =

దర్భలతో, విధివత్ = యథాశాస్త్రముగా, మన్త్రపురస్కృతమ్ = మంత్రపూర్వకముగా, సమాస్తీర్య = కప్పి, విధిమన్త్రపురస్కృతమ్ = యథాశాస్త్రముగా మంత్రపూర్వకముగా, వేద్యామ్ = వేదియందు, అగ్నిమ్ = అగ్నిని, ఆదాయ = గ్రహించి (ఉంచి), అగ్నౌ = అగ్నియందు, జుహావ = హోమము చేసెను.

తా. మహాతేజశ్శాలియు పూజ్యుడును అగు వసిష్ఠుడు వేది చుట్టు, యథాశాస్త్రముగను, మంత్రపూర్వకముగను, సమము లైన దర్భలను పరిచి యథాశాస్త్రముగా, మంత్రపూర్వకముగా వేదియందు అగ్నిని ఉంచి, అగ్నిలో హోమము చేసెను. 24

శ్రీ సీతారామ వివాహ ఘట్టః

మూ. తతః సీతాం సమానీయ సర్వాభరణభూషితామ్, 25
సమక్షమగ్నేః సంస్థాప్య రాఘవాభిముఖే తదా,
అబ్రవీజ్జనకో రాజా కౌసల్యానన్దవర్ధనమ్. 26

ప్ర. అ. తతః = పిమ్మట, రాజా = రాజైన, జనకః = జనకుడు, సర్వాభరణభూషితామ్ = సమస్త మైన ఆభరణములచే అలంకరింపబడిన, సీతామ్ = సీతను, ఆనీయ = తీసికొని వచ్చి, అగ్నేః = అగ్నికి, సమక్షమ్ = ఎదుట, రాఘవాభిముఖే = రామునకు అభిముఖముగా, సంస్థాప్య = నిలబెట్టి, తదా = అప్పుడు, కౌసల్యానన్దవర్ధనమ్ = కౌసల్యయొక్క ఆనందమును వృద్ధి పొందించు రాముని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట జనకమహారాజు, సర్వాభరణభూషితురా లగు సీతను తీసికొని వచ్చి, అగ్ని సమక్షమున, రామునకు ఎదురుగా నిలబెట్టి, కౌసల్యానందవర్ధను డగు ఆ రామునితో ఇట్లనెను. 25, 26

మూ. ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ,
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా. 27

ప్ర. అ. మమ = నాయొక్క, సుతా = కుమార్తెయు, తవ = నీయొక్క, సహధర్మచరీ = (ఇటుపై) కూడా ఉండి ధర్మము నాచరించు నదియు అగు,

సీతా=సీత, ఇయమ్=ఇదిగో. ఏనామ్=ఈమెను, ప్రతీచ్ఛ చ=అంగీకరింపుము. తే=నీకు, భద్రమ్ = మంగళ మగుగాక. పాణిమ్ = ఈమె హస్తమును, పాణినా=హస్తముతో, గృహ్ణీష్వ=గ్రహింపుము.

తా. "ఇదిగో నా కుమార్తె యైన సీత, ఈమె నీకు సహధర్మచారిణి కాగలదు. ఈమెను స్వీకరింపుము. నీ హస్తముతో ఈమె హస్తమును పట్టు కొనుము. 26

మూ. పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా,
ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మన్త్రపూతం జలం తదా. 27

ప్ర. అ. మహాభాగా=గొప్ప భాగ్యము గల ఈమె, పతివ్రతా=పతి వ్రతయై, సదా=ఎల్లప్పుడును, ఛాయేవ=నీడ వలె, అనుగతా=నిన్ను అను సరించియుండును. ఇతి=ఇట్లు, ఉక్త్వా=పలికి, రాజా=రాజు, తదా=అప్పుడు, మన్త్రపూతమ్=మంత్రముచే పవిత్రము చేయబడిన, జలమ్=జలమును, ప్రాక్షి పత్=విడచెను.

తా. మహాభాగ్యవంతురా లగు ఈమె పతివ్రతయై నీడ వలె సర్వదా నిన్ను అనుసరించి యుండగలదు" జనకమహారాజు ఇట్లు పలికి, మంత్రపూత మైన జలము వదలెను. 27

మూ. సాధు సాధ్వితి దేవానామృషీణాం వదతాం తదా,
దేవదున్దుభినిర్ఘోషః పుష్పవర్షో మహానభూత్. 28

ప్ర. అ. తదా=అప్పుడు, సాధు సాధు ఇతి=బాగు బాగు అని, వద తామ్=పలుకుచున్న, ఋషీణామ్=ఋషులయొక్కయు, దేవానామ్=దేవతల యొక్కయు ధ్వనియు, దేవదున్దుభినిర్ఘోషః = దేవదుందుభుల ధ్వనియు, మహాన్=గొప్ప, పుష్పవర్షః=పుష్పవర్షమును, అభూత్=ఆయెను.

తా. ఆ సమయమున దేవతలును ఋషులును "బాగు బాగు" అని పలికిరి. దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము కురిసినది. 28

మూ. ఏవం దత్త్వా తదా సీతాం మన్త్రోదకపురస్కృతామ్,
అబ్రవీజ్జనకో రాజా హర్షేణాభిపరిప్లుతః. 29

ప్ర. అ. తదా = అప్పుడు, జనకః రాజా = జనకమహారాజు, మన్త్రోదక పురస్కృతామ్ = మంత్రోదకముచే పురస్కృతురా లగు, సీతామ్ = సీతను, దత్వా = ఇచ్చి, హర్షేణ = సంతోషముచేత, అభిపరిప్లుతః = నిండినవాడై, అబ్రవీత్ = పలికెను.

తా. జనకమహారాజు మంత్రోదకపూర్వకముగా సీతను ఇచ్చిన పిమ్మట ఆనందముతో నిండినవాడై ఇట్లు పలికెను. 29

మూ. లక్ష్మణాగచ్ఛ భద్రం తే ఊర్మిళాముద్యతాం మయా,
ప్రతీచ్ఛ పాణిం గృహ్ణీష్వ మాభూత్కాలస్య పర్యయః. 30

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! ఆగచ్ఛ = రమ్ము. మయా = నాచేత, ఉద్యతామ్ = ఇవ్వనిశ్చయింపబడిన, ఊర్మిళామ్=ఊర్మిళను, ప్రతీచ్ఛ=అంగీకరించుము. పాణిమ్=హస్తమును, పాణినా = హస్తముతో, గృహ్ణీష్వ = గ్రహింపుము. కాలస్య = కాలముయొక్క, పర్యయః = గడచిపోవుట, మా భూత్ = కాకుండుగాక.

తా. "లక్ష్మణా ! రమ్ము. నీకు క్షేమ మగు గాక. నే నిచ్చుచున్న ఊర్మిళను స్వీకరింపుము. ఈమె హస్తమును హస్తముతో గ్రహింపుము. ఆలస్యము చేయకుము". 30

మూ. తమేవముక్త్వా జనకో భరతం చాభ్యభాషత,
గృహాణ పాణిం మాణ్డవ్యాః పాణినా రఘునన్దన. 31

ప్ర. అ. జనకః = జనకుడు, తమ్ = ఆ లక్ష్మణుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, భరతం చ = భరతుని గూర్చి కూడ, అభ్యభాషత = పలికెను. రఘునన్దన = భరతా ! పాణినా = హస్తముచేత, మాణ్డవ్యాః=మాండవి యొక్క, పాణిమ్ = హస్తమును, గృహాణ = గ్రహింపుము.

తా. జనకుడు లక్ష్మణునితో ఇట్లు పలికి పిదప భరతునితో ఇట్లనెను. "భరతా! మాండవి హస్తమును హస్తముతో పట్టుకొనుము." 31

మూ. శత్రుఘ్నం చాపి ధర్మాత్మా అబ్రవీజ్జనకేశ్వరః,
శ్రుతకీర్త్యా మహాబాహో పాణిం గృహ్ణీష్వ పాణినా. 32

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, జనకేశ్వరః = జనకమహారాజు, శత్రుఘ్నం చాపి = శత్రుఘ్నుని గూర్చి కూడ, అబ్రవీత్ = పలికెను. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా ! పాణినా = హస్తముతో, శ్రుతకీర్త్యాః = శ్రుతకీర్తియొక్క, పాణిమ్ = హస్తమును, గృహ్ణీష్వ = గ్రహింపుము.

తా. ధర్మాత్ముడైన జనకమహారాజు శత్రుఘ్నునితో కూడ ఇట్లనెను. "ఓ మహాబాహూ ! శ్రుతకీర్తి హస్తమును హస్తముతో పట్టుకొనుము". 32

మూ. సర్వే భవన్తః సౌమ్యాశ్చ సర్వే సుచరితవ్రతాః,
పత్నీభిస్సన్తు కాకుత్స్థా మా భూత్కాలస్య పర్యయః. 33

ప్ర. అ. కాకుత్స్థాః = ఓ రామలక్ష్మణభరతశత్రుఘ్నులారా ! భవన్తః = మీరు, సర్వే = అందరును, సౌమ్యాః చ = సౌమ్యస్వభావము కలవారు. సర్వే = మీరందరును, సుచరితవ్రతాః = మంచి నడవడిక నియమము కలవారు. పత్నీభిః = భార్యలతో, (సహితాః = కూడినవారు), సన్తు = అగుదురుగాక. కాలస్య = కాలముయొక్క, పర్యయః = కడచిపోవుట, మాభూత్ = కాకుండుగాక.

తా. "ఓ రామలక్ష్మణభరతశత్రుఘ్నులారా ! మీరందరును సౌమ్యులు. అందరును మంచినడవడిక, నియమములు కలవారు. భార్యలను స్వీకరింపుడు. ఆలస్యము చేయవద్దు". 33

మూ. జనకస్య వచః శ్రుత్వా పాణీన్ ప్రాణిభిరాస్పృశన్,
చత్వారస్తే చతసృణాం వసిష్ఠస్య మతే స్థితాః. 34

ప్ర. అ. తే = ఆ, చత్వారః = నలుగురును, జనకస్య = జనకునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, వసిష్ఠస్య = వసిష్ఠునియొక్క, మతే = మతమునందు, స్థితాః = ఉన్నవారై, పాణిభిః = హస్తములతో, చతసృణామ్ = ఆ నలుగురి కన్యలయొక్క, పాణీన్ = హస్తములను, అస్పృశన్ = స్పృశించిరి.

తా. జనకుని వాక్యము విని ఆ నలుగురు రాజకుమారులును, వసిష్ఠుని అనుమతి పొంది, తమ హస్తములతో ఆ నలుగురి కన్యల హస్తములను గ్రహించిరి. 34

మూ. అగ్నిం ప్రదక్షిణీకృత్య వేదిం రాజానమేవ చ,
ఋషీంశ్చైవ మహాత్మానస్సభార్యా రఘుసత్తమాః, 35
యథోక్తేన తదా చక్రుర్వివాహం విధిపూర్వకమ్.

ప్ర. అ. మహాత్మానః=మహాత్ములైన, రఘుసత్తమాః = ఆ రఘువంశ శ్రేష్ఠులు, సభార్యాః = భార్యలతో కూడినవారై, అగ్నిమ్ = అగ్నిని, వేదిమ్= వేదిని, రాజానమేవ చ = జనకమహారాజును, ఋషీంశ్చైవ = ఋషీశ్వరులను, ప్రదక్షిణీకృత్య = ప్రదక్షిణము చేసి, యథోక్తేన = చెప్పిన ప్రకారము, విధిపూర్వకమ్ = శాస్త్రపూర్వకముగా. వివాహమ్ = వివాహమును, చక్రుః = చేసిరి.

తా. మహాత్ములైన ఆ రఘువంశకుమారులు, భార్యాసమేతులై, అగ్నికిని, వేదికిని, జనకమహారాజునకును, ఋషులకును ప్రదక్షిణము చేసి, వసిష్ఠాదులు చెప్పిన విధమున, యథావిధిగ వివాహము చేసికొనిరి. 35

మూ. కాకుత్స్థైశ్చ గృహీతేషు లలితేషు చ పాణిషు, 36
పుష్పవృష్టిర్మహత్యాసీద న్తరిక్షాత్సుభాస్వరా.

ప్ర. అ. కాకుత్స్థైః = రామలక్ష్మణభరతశత్రుఘ్నులచేత, లలితేషు = సుందరములైన, పాణిషు=హస్తములు, గృహీతేషు సత్సు=గ్రహింపబడిన వగుచుండగా, అన్తరిక్షాత్=ఆకాశమునుండి, సుభాస్వరా = చాల ప్రకాశించుచున్న, మహతీ=గొప్ప, పుష్పవృష్టిః = పుష్పవృష్టి, ఆసీత్=ఆయెను.

తా. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు, సీతా—ఊర్మిళా—మాండవీ—శ్రుతకీర్తుల సుకుమారములైన హస్తములు గ్రహించగనే ఆకాశమునుండి, మిక్కిలి ప్రకాశించుచున్న గొప్ప పుష్పవృష్టి పడినది. 36

మూ. దివ్యదున్దుభినిర్ఘోషైర్గీతవాదిత్రనిస్వనైః, 37
ననృతుశ్చాప్సరఃసంఘా గన్ధర్వాశ్చ జగుః కలమ్,
వివాహే రఘుముఖ్యానాం తదద్భుతమదృశ్యత. 38

ప్ర. అ. రఘుముఖ్యానామ్ = రాఘవుల, వివాహే = వివాహమునందు, దివ్యదున్దుభినిర్ఘోషైః=దివ్యమైన దుందుభిధ్వనులతోడను, గీతవాదిత్రనిస్వనైః= గీతవాద్యధ్వనులతోడను, అప్సరఃసంఘాః = అప్సరఃసంఘములు, ననృతుః = నాట్యముచేసినవి. గన్ధర్వాశ్చ=గంధర్వులుకూడ, కలమ్=మధురముగా, జగుః= పాడిరి. తత్=అది, అద్భుతమ్=ఆశ్చర్యకరముగ, అదృశ్యత=చూడబడెను.

తా. రాఘవుల వివాహసమయమున, స్వర్గమునందు దుందుభులు మ్రోగినవి. గీతమంగళవాద్యధ్వనులతో అప్సరసలు నాట్యము చేసిరి. గంధర్వులు మధురముగా గానము చేసిరి. ఇది అంతయు ఆశ్చర్యకరముగ కనబడెను. 37, 38

మూ. ఈదృశే వర్తమానే తు తూర్యోద్ఘుష్టనినాదితే,
త్రిరగ్నిం తే పరిక్రమ్య ఊహుర్భార్యాం మహౌజసః. 39

ప్ర. అ. ఈదృశే = ఇట్టి, తూర్యోద్ఘుష్టనినాదితే = నృత్తగీతవాద్యాదుల ధ్వనిచే కలిగిన శబ్దము, వర్తమానే = జరుగుచుండగా, మహౌజసః = గొప్ప తేజస్సు గల, తే = ఆసోదరులు, త్రిః = మూడు పర్యాయములు, అగ్నిమ్= అగ్నిని, పరిక్రమ్య=ప్రదక్షిణముచేసి, భార్యాః = భార్యలను, ఊహుః=వివాహ మాడిరి.

తా. ఈ విధముగ తూర్యాదిధ్వని ప్రవర్తిల్లుచుండగా ఆ రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు మూడు పర్యాయములు అగ్నిప్రదక్షిణము చేసి, భార్యలను వివాహ మాడిరి.

మూ. అథోపకార్యాం జగ్ముస్తే సభార్యా రఘునన్దనాః,
రాజాప్యనుయయౌ పశ్యన్సర్షిసంఘః సబాన్ధవః. 40

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
త్రిసప్తతితమః సర్గః

ప్ర. అ. అథ=పిమ్మట, తే=ఆ, రఘునన్దనాః = రాఘవులు, సభార్యాః= భార్యలతో కూడినవారై, ఉపకార్యామ్ = విడిదిని గూర్చి, జగ్ముః = వెళ్లిరి.

రాజాపి=రాజు కూడ, సర్షిసంఘః=ఋషిసంఘముతో కూడినవాడై, సబాన్ధవః=బంధువులతో కూడినవాడై, పశ్యన్ = చూచుచు, అనుయయౌ = అనుసరించి వెళ్లెను.

తా. పిమ్మట రామలక్ష్మణభరతశత్రుఘ్నులు భార్యలతో గూడి తమ విడిదికి వెళ్లిరి. ఋషులతోను, బంధువులతోను కూడిన దశరథుడు కూడ భార్యాసమేతుడైన పుత్రులను చూచుకొనుచు వెనుకనే వెళ్లెను. 40

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో డెబ్బదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃసప్తతితమః సర్గః

మూ. అథ రాత్ర్యాం వ్యతీతాయాం విశ్వామిత్రో మహామునిః,
ఆపృష్ట్వా తౌ చ రాజానౌ జగామోత్తరపర్వతమ్, 1
ఆశీర్భిః పూరయిత్వా చ కుమారాంశ్చ సరాఘవాన్.

ప్ర. అ. అథ = పిమ్మట, రాత్ర్యామ్ = రాత్రి, వ్యతీతాయాం సత్యామ్= గడచిన దగుచుండగా, సః = ఆ, మహామునిః=మహాముని యైన, విశ్వామిత్రః= విశ్వామిత్రుడు, రాఘవాన్ = రఘువంశోద్భవు లైన, కుమారాన్ చ = రాజ కుమారులను, ఆశీర్భిః = ఆశీర్వాదములచేత, పూరయిత్వా = నింపి, తౌ=ఆ, రాజానౌ = రాజులను, ఆపృష్ట్వా = అడిగి, ఉత్తరపర్వతమ్ = ఉత్తరపర్వత మునుగూర్చి, జగామ = వెళ్లెను.

తా. రాత్రి గడచిన పిదప విశ్వామిత్రమహాముని ఆ రాజకుమారులకు అనేకాశీర్వాదముల నిచ్చి, జనకదశరథమహారాజులవద్ద సెలవు గైకొని హిమ వత్పర్వతమునకు వెళ్లిపోయెను. 1

మూ. విశ్వామిత్రే గతే రాజా వైదేహం మిథిలాధిపమ్, 2
ఆపృష్ట్వాథ జగామాశు రాజా దశరథః పురీమ్.

ప్ర. అ. విశ్వామిత్రే = విశ్వామిత్రుడు, గతే= వెళ్లినవాడగుచుండగా, అథ = పిమ్మట, రాజా = ప్రజారంజకు డైన, దశరథః రాజా = దశరథమహా రాజు, మిథిలాధిపమ్ = మిథిలాధిపతి యైన, వైదేహమ్ = జనకమహారాజును, ఆపృష్ట్వా = అడిగి, ఆశు = శీఘ్రముగా, పురీమ్ = పట్టణమునుగూర్చి, జగామ= వెళ్లెను.

తా. విశ్వామిత్రుడు వెళ్లిన పిమ్మట దశరథమహారాజు జనకమహారాజు వద్ద సెలవు గైకొని శీఘ్రముగ అయోధ్యకు బయలుదేరెను. 2

మూ. గచ్ఛన్తం తం తు రాజానమన్వగచ్ఛన్నరాధిపః, 3
అథ రాజా విదేహానాం దదౌ కన్యాధనం బహు.

ప్ర. అ. నరాధిపః = జనకమహారాజు, గచ్ఛన్తమ్ = వెళ్లుచున్న, తమ్ = ఆ, రాజానమ్ = దశరథమహారాజును, అన్వగచ్ఛత్ = అనుసరించి వెళ్లెను. అథ = పిమ్మట, విదేహానాం రాజా = జనకమహారాజు, బహు = అత్యధిక మైన, కన్యాధనమ్ = కన్యాధనమును, దదౌ = ఇచ్చెను.

తా. జనకమహారాజు ప్రయాణమై వెళ్లు చున్న దశరథమహారాజును అనుసరించి వెళ్లి సాగనంపెను. ఆతడు తన కుమార్తెలకు అరణముగా అత్యధిక మగు ధనము నిచ్చెను. 3

మూ. గవాం శతసహస్రాణి బహూని మిథిలేశ్వరః, 4
కమ్బలానాం చ ముఖ్యానాం క్షౌమకోట్యమ్బరాణి చ,
హస్త్యశ్వరథపాదాతం దివ్యరూపం స్వలంకృతమ్, 5
దదౌ కన్యాపితా తాసాం దాసీదాసమనుత్తమమ్.

ప్ర. అ. కన్యాపితా = కన్యల తండ్రి యైన, మిథిలేశ్వరః = జనకమహారాజు, గవామ్ = గోవులయొక్క, బహూని = అనేకము లైన, శతసహస్రాణి = లక్షలను, ముఖ్యానామ్ = ముఖ్యము లైన, కమ్బలానామ్ = కంబళ్ల యొక్క లక్షలను, క్షౌమకోట్యమ్బరాణి చ = కోట్లకొలది పట్టువస్త్రములను, హస్త్యశ్వరథ పాదాతమ్ = ఏనుగులను, గుఱ్ఱములను, రథములను, కాలిబంటులను, దివ్య రూపమ్ = దివ్య మైన రూపము గలదియు, స్వలంకృతమ్ = బాగుగా అలంక రింపబడినదియు, అనుత్తమమ్ = శ్రేష్ఠ మైనదియు అగు, దాసీదాసమ్ = దాసీ దాసజనమును, తాసామ్ = వారికి, దదౌ = ఇచ్చెను.

తా. ఆ మిథిలేశ్వరుడు లక్షల కొలది ఆవులను, శ్రేష్ఠ మైన కంబళీలను, కోట్ల కొలది పట్టువస్త్రములను, ఏనుగులు, అశ్వములు, రథములు, కాలిబంటు లును గల చతురంగసైన్యమును, మంచి సౌందర్యము కలవారును బాగుగా అలంకరించుకున్నవారును, శ్రేష్ఠులును అగు దాసీదాసులను కుమార్తెలకు అరణ ముగా పంపెను. 4, 5

మూ. హిరణ్యస్య సువర్ణస్య ముక్తానాం విద్రుమస్య చ, 6
దదౌ పరమసంహృష్టః కన్యాధన మనుత్తమమ్.

ప్ర. అ. పరమసంహృష్టః = మిక్కిలి సంతసించినవాడై, హిరణ్యస్య= వెండియొక్కయు, సువర్ణస్య = బంగారముయొక్కయు, ముక్తానామ్ = ముత్య ములయొక్కయు, విద్రుమస్య = పగడములయొక్కయు, అనుత్తమమ్ = శ్రేష్ఠ మైన, కన్యాధనమ్=కన్యాధనమును, దదౌ = ఇచ్చెను.

తా. అతడు చాల సంతసించినవాడై, వెండి, బంగారము, ముత్యములు, పగడములు, వీటి రూపములో నున్న అత్యధిక మగు కన్యాధనమును ఇచ్చెను. 6

మూ. దత్త్వా బహుధనం రాజా సమనుజ్ఞాప్య పార్థివమ్, 7
ప్రవివేశ స్వనిలయం మిథిలాం మిథిలేశ్వరః.

ప్ర. అ. మిథిలేశ్వరః = మిథిలాధిపతి యైన, రాజా = జనకమహారాజు, బహు = అత్యధిక మైన, ధనమ్ = ధనమును, దత్త్వా = ఇచ్చి, పార్థివమ్ = దశరథమహారాజును, సమనుజ్ఞాప్య=అనుజ్ఞ ఇచ్చువానినిగా చేసి, స్వనిలయమ్= తన నివాస మైన, మిథిలామ్ = మిథిలానగరమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. మిథిలాధిపతి యైన జనకమహారాజు కుమార్తెలకు అత్యధిక మైన ధనము నిచ్చి, దశరథమహారాజు వద్ద అనుజ్ఞ గైకొని తన నివాసస్థాన మగు మిథిలాపురిని ప్రవేశించెను. 7

మూ. రాజా ప్యయోధ్యాధిపతిః సహ పుత్త్రైర్మహాత్మభిః, 8
ఋషీన్ సర్వాన్ పురస్కృత్య జగామ సబలానుగః.

ప్ర. అ. అయోధ్యాధిపతిః = అయోధ్యాధిపతి యైన, రాజాపి = దశరథ మహారాజు కూడ, మహాత్మభిః = మహాత్ము లైన, పుత్త్రైః సహ = పుత్రులతో కూడ, సర్వాన్ = సమస్త మైన, ఋషీన్ = ఋషులను, పురస్కృత్య = ఎదుట ఉంచుకొని, సబలానుగః = సైన్యముతోడను అనుచరులతోడను కూడినవాడై, జగామ=వెళ్లెను.

తా. దశరథమహారాజు, మహాత్ము లైన కుమారులతో కూడ, ఋషు

లందరిని ముందు ఉంచుకొని, సైన్యమును, అనుచరులును వెంట రాగా, వెళ్లెను. 8

మూ. గచ్ఛన్తం తం నరవ్యాఘ్రం సర్షిసంఘం సరాఘవమ్. 9
ఘోరాః స్మ పక్షిణో వాచో వ్యాహరన్తి తతస్తతః,

ప్ర. అ. సర్షిసంఘమ్ = ఋషిసముదాయముతో కూడి నట్టియు, సరాఘవమ్ = రామలక్ష్మణభరతశత్రుఘ్నులతో కూడిన, నరవ్యాఘ్రమ్=నరశ్రేష్ఠుడైన, తమ్ = ఆ దశరథుని గూర్చి, తతస్తతః = అచ్చటచ్చట, ఘోరాః = భయంకరమైన, పక్షిణః = పక్షులు, వాచః = వాక్కులను, వ్యాహరన్తి స్మ = పలికెను.

తా. ఆ దశరథుడు, రామలక్ష్మణభరతశత్రుఘ్నసమేతుడై, ఋషులతో కూడ ప్రయాణము చేయుచుండగా, అక్కడక్కడ భయంకరములైన పక్షులు ధ్వనులుచేయ నారంభించినవి. 9

మూ. భౌమాశ్చైవ మృగాః సర్వే గచ్ఛన్తి స్మ ప్రదక్షిణమ్. 10
తాన్ దృష్ట్వా రాజశార్దూలో వసిష్ఠం పర్యపృచ్ఛత,

ప్ర. అ. భౌమాః = భూమికి సంబంధించిన, సర్వే = సమస్తమైన, మృగాః=మృగములు, ప్రదక్షిణమ్ = ప్రదక్షిణముగా, గచ్ఛన్తి స్మ=వెళ్లినవి. తాన్=వాటిని, దృష్ట్వా = చూచి, రాజశార్దూలః = రాజశ్రేష్ఠుడు, వసిష్ఠమ్=వసిష్ఠుని, పర్యపృచ్ఛత=అడిగెను.

తా. భూమిపై నున్న మృగములు ప్రదక్షిణముగా వెళ్లినవి. దీని నంతయు చూచి దశరథమహారాజు వసిష్ఠుని ఇట్లు ప్రశ్నించెను. 10

మూ. అసౌమ్యాః పక్షిణో ఘోరాః మృగాశ్చాపి ప్రదక్షిణాః, 11
కిమిదం హృదయోత్కమ్పి మనో మమ విషీదతి.

ప్ర. అ. ఘోరాః=భయంకరమైన, పక్షిణః = పక్షులు, అసౌమ్యాః= ప్రతికూలముగా నున్నవి. మృగాశ్చాపి=మృగములు, ప్రదక్షిణాః=ప్రదక్షిణములుగా ఉన్నవి. హృదయోత్కమ్పి = హృదయమును కంపింపచేయు, ఇదమ్=

ఇది, కిమ్=ఏమిటి ? మమ=నాయొక్క, మనః = మనస్సు, విషీదతి=క్రుంగి పోవుచున్నది.

తా. ఘోరము లైన పక్షులు ప్రతికూలముగా నున్నవి. మృగములు ప్రదక్షిణముగా నంచరించుచు అనుకూలముగా ఉన్నవి. హృదయమును కంపింప చేయు ఇది యంతయు ఏమిటి ? నా మనస్సు విషాదము చెందుచున్నది. 11

మూ. రాజ్ఞో దశరథస్యైతచ్ఛ్రుత్వా వాక్యం మహానృషిః, 12
ఉవాచ మధురాం వాణీం శ్రూయతామస్య యత్ ఫలమ్.

ప్ర. అ. మహానృషిః=ఆ వసిష్ఠమహర్షి, రాజ్ఞః = రాజైన, దశరథస్య= దశరథునియొక్క, ఏతత్=ఈ, వాక్యమ్=వాక్యమును, శ్రుత్వా=విని, మధురామ్=మధుర మైన, వాణీమ్=వాక్కును, ఉవాచ = పలికెను. అస్య=దీనికి, యత్=ఏది, ఫలమ్=ఫలమో, శ్రూయతామ్=వినబడుగాక.

తా. దశరథమహారాజు మాటలు విని వసిష్ఠమహర్షి మధుర మైన వాక్యము పలికెను. దీని ఫల మేదియో చెప్పెదను వినుము. 12

మూ. ఉపస్థితం భయం ఘోరం దివ్యం పక్షిముఖాచ్చ్యుతమ్, 13
మృగాః ప్రశమయన్త్యేతే సంతాపస్త్యజ్యతామయమ్.

ప్ర. అ. పక్షిముఖాత్=పక్షుల ముఖమునుండి, చ్యుతమ్=జారిన, (సూచింపబడిన), దివ్యమ్=దైవకృత మైన, ఉపస్థితమ్=వచ్చిపడిన, ఘోరమ్=ఘోర మైన, భయమ్=భయమును, ఏతే=ఈ, మృగాః=మృగములు, ప్రశమయన్తి= శాంతింపచేయుచున్నవి. అయమ్=ఈ, సన్తాపః = మనస్తాపము, త్యజ్యతామ్= విడువబడుగాక.

తా. ఆకస్మికముగ దైవకృతమై ఘోర మైన భయము వచ్చిపడ నున్నట్లు పక్షులు సూచించుచున్నవి. మృగములు ఆ భయము శాంతింప నున్నట్లు సూచించుచున్నవి. అందుచేత మనస్తాపము పొందకుము. 13

మూ. తేషాం సంవదతాం తత్ర వాయుః ప్రాదుర్బభూవ హ, 14
కమ్పయన్ పృథివీం సర్వాం పాతయంశ్చ ద్రుమాఞ్ఛుభాన్.

ప్ర. అ. తేషామ్ = వారు, సంవదతామ్ = మాటలాడుచుండగా, తత్ర = అచట, పృథివీమ్ = భూమిని, కమ్పయన్ = కంపింపచేయుచు, శుభాన్ = శుభమైన, ద్రుమాన్ = వృక్షములను, పాతయన్ = పడవేయుచు, వాయుః = వాయువు, ప్రాదుర్బభూవ హ = పుట్టెను.

తా. వారిట్లు మాటలాడుకొనుచుండగా అచట, భూమిని కంపింపచేయుచు, మంగళకరములైన వృక్షములను పడగొట్టుచు వాయువు బయలుదేరెను. 14

మూ. తమసా సంవృతః సూర్యః సర్వా న ప్రబభుర్దిశః, 15
భస్మనా చావృతం సర్వం సమ్మూఢమివ తద్బలమ్.

ప్ర. అ. సూర్యః = సూర్యుడు, తమసా = చీకటిచే, ఆవృతః = ఆవరింపబడెను. సర్వాః = సమస్తమైన, దిశః = దిక్కులు, న ప్రబభుః = ప్రకాశింపలేదు. తత్ = ఆ, సర్వమ్ = సమస్తమైన, బలమ్ = సైన్యము, భస్మనా = దుమ్ముచేత, ఆవృతమ్ = కప్పబడినదై, సంమూఢమివ = మూర్ఛనొందినట్లయినది.

తా. సూర్యుని చీకటి ఆవరించెను. దిక్కులన్నియు ప్రకాశవిహీనములయ్యెను. ఆ సైన్యమంతయు బూడిద కప్పగా మూర్ఛపొందినట్లుండెను. 15

మూ. వసిష్ఠశ్చర్షయశ్చాన్యే రాజా చ ససుతస్తదా, 16
ససంజ్ఞా ఇవ తత్రాసన్ సర్వమన్యద్విచేతనమ్.

ప్ర. అ. తదా = అప్పుడు, వసిష్ఠశ్చ = వసిష్ఠుడును, అన్యే = ఇతరులైన, ఋషయశ్చ = ఋషులును, ససుతః = కుమారులతో కూడిన, రాజా చ = రాజును, ససంజ్ఞాః ఇవ = చైతన్యమున్నవారు వలె, ఆసన్ = ఉండిరి. అన్యత్ = ఇతరమైన, సర్వమ్ = అంతయు, విచేతనమ్ = చైతన్యరహితమైనది.

తా. ఆ సమయమున, వసిష్ఠాదిఋషులు, దశరథుడు, అతని కుమారులు వీరుమాత్రమే చైతన్యమున్నట్లు కనబడిరి. మిగిలినవారందరును విచేతనుల వలె అయిరి. 16

మూ. తస్మింస్తమసి ఘోరే తు భస్మచ్ఛన్నేవ సా చమూః. 17
దదర్శ భీమసఙ్కాశం జటామణ్డలధారిణమ్,
భార్గవం జామదగ్న్యం తం రాజరాజవిమర్దినమ్, 18
కైలాసమివ దుర్ధర్షం కాలాగ్నిమివ దుఃసహమ్,
జ్వలన్తమివ తేజోభిర్దుర్నిరీక్ష్యం పృథగ్జనైః, 19
స్కన్దే చాసజ్య పరశుం ధనుర్విద్యుద్గణోపమమ్,
ప్రగృహ్య శరముఖ్యం చ త్రిపురఘ్నం యథా శివమ్. 20

ప్ర. అ. తస్మిన్ = ఆ, ఘోరే = భయంకర మైన, తమసి = అంధకారమునందు, భస్మచ్ఛన్నేవ = భస్మముచేత కప్పబడినది వలె ఉన్న, సా = ఆ, చమూః = సేన, భీమసఙ్కాశమ్ = భయంకరుడుగా ఉన్నవాడును, జటామణ్డలధారిణమ్ = జటామండలమును ధరించినవాడును, రాజరాజవిమర్దినమ్ = రాజులరాజులను గూడ నశింపచేసినవాడును, కైలాసమివ = కైలాసపర్వతము వలె, దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యముకానివాడును, కాలాగ్నిమివ = ప్రలయ కాలాగ్ని వలె, దుస్సహమ్ = సహింప శక్యముకానివాడును, తేజోభిః = తేజస్సుల చేత, జ్వలన్తమివ = ప్రజ్వరిల్లుచున్నవాడును, పృథగ్జనైః = సామాన్యులచేత, దుర్నిరీక్ష్యమ్ = చూడ శక్యముకానివాడును, పరశుమ్ = గండ్రగొడ్డలిని, స్కన్దే = భుజమునందు, ఆసజ్య = తగల్చుకొని, విద్యుద్గణోపమమ్ = మెరపుల గుంపుతో సమాన మైన, ధనుః = ధనస్సును, శరముఖ్యమ్ = శ్రేష్ఠ మైన శరమును, ప్రగృహ్య = గ్రహించి, త్రిపురఘ్నమ్ = త్రిపురధ్వంసము చేసిన, శివం యథా = శివుడు వలె ఉన్న, తమ్ = ఆ, భార్గవమ్ = భృగువంశసంజాతు డైన, జామదగ్న్యమ్ = పరశురాముని, దదర్శ = చూచెను.

తా. ఆ ఘోర మైన అంధకారములో, బూడిద కప్పినట్లున్న ఆ సైన్యము, జటామండలమును ధరించినవాడును, భయంకరుడును, రాజులను సంహరించిన వాడును అగు పరశురాముని చూచెను. అతడు కైలాసము వలె ఎదిరింప శక్యము కానివాడై, ప్రళయకాలాగ్ని వలె సహింప శక్యముకానివాడై యుండెను. తేజస్సులచే మండుచున్నట్లున్న అతనిని సామాన్యజనులు చూడజాలకుండిరి. గండ్ర గొడ్డలిని బుజముపై వ్రేలాడదీసికొని, మెరపుల గుంపు వంటి ధనస్సును, శ్రేష్ఠ మైన శరమును చేతులలో ధరించి త్రిపురసంహారము చేయు శివుడు వలె నుండెను. 17, 18, 19

మూ. తం దృష్ట్వా భీమసంకాశం జ్వలన్తమివ పావకమ్,
వసిష్ఠప్రముఖా విప్రా జపహోమపరాయణాః, 21
సంగతా మునయః సర్వే సంజజల్పురథో మిథః.

ప్ర. అ. భీమసంకాశమ్ = భయంకరుడును, జ్వలన్తమ్ = ప్రజ్వలించుచున్న, పావకమ్ ఇవ = అగ్ని వలె ఉన్న, తమ్ = ఆతనిని, దృష్ట్వా = చూచి, జపహోమపరాయణాః = జపమునందును హోమమునందును ఆసక్తి గలవారును, విప్రాః = బ్రాహ్మణులును అయిన, వసిష్ఠప్రముఖాః = వసిష్ఠుడు మొదలైన, సర్వే = సమస్తమైన, మునయః = మునులు, సంగతాః = కలిసినవారై, అథో = పిమ్మట, మిథః = పరస్పరము, సంజజల్పుః = మాటలాడుకొనిరి.

తా. ప్రజ్వరిల్లుచున్న అగ్ని వలె భయంకరముగా ఉన్న ఆతనిని చూచి, జపహోమాదిపరాయణులును, శాంతస్వభావులును అగు వసిష్ఠాదిమును లందరును కలిసి, పరస్పరము ఇట్లనుకొనిరి. 20, 21

మూ. కచ్చిత్పితృవధామర్షీ క్షత్రం నోత్సాదయిష్యతి, 22
పూర్వం క్షత్రవధం కృత్వా గతమన్యుర్గతజ్వరః,
క్షత్రస్యోత్సాదనం భూయో న ఖల్వస్య చికీర్షితమ్. 23

ప్ర. అ. పితృవధామర్షీ = తండ్రియొక్క వధచేత కోపించిన ఇతడు, క్షత్రమ్ = క్షత్రియజాతిని, నోత్సాదయిష్యతి కచ్చిత్ = నశింపచేయడు కదా ? పూర్వమ్ = పూర్వము, క్షత్రవధమ్ = క్షత్రియవధను, కృత్వా = చేసి, గతమన్యుః = పోయిన కోపము గలవాడును, గతజ్వరః = పోయిన మనస్తాపము గలవాడును అయినాడు కదా ? భూయః = మరల, క్షత్రస్య = క్షత్రియజాతియొక్క, ఉత్సాదనమ్ = వినాశము, అస్య = ఈతనికి, న చికీర్షితం ఖలు = చేయనభిలషింపబడలేదు కదా ?

తా. (కార్తవీర్యార్జునుడు) తండ్రిని చంపుటచే కోపించిన ఇతడు క్షత్రియజాతిని నశింపచేయడు కదా ? పూర్వము క్షత్రియవధ చేసి కోపతాపములు తగ్గి శాంతించిన ఇతడు మరల క్షత్రియవంశవినాశమునకు పూనుకొనునా ? 22, 23

మూ. ఏవముక్త్వార్ఘ్యమాదాయ భార్గవం భీమదర్శనమ్,
ఋషయో రామ రామేతి వచో మధురమబ్రువన్. 24

ప్ర. అ. ఋషయః = ఋషులు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = తమలో తాము చెప్పుకొని, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, ఆదాయ = గ్రహించి, భీమదర్శనమ్ = భయంకర మైన దర్శనము గల, భార్గవమ్ = పరశురాముని గూర్చి, రామ రామ ఇతి = రామా రామా అని, మధురమ్ = మధుర మైన, వచః = వచనమును, అబ్రువన్ = పలికిరి.

తా. ఋషులు తమతో తా మీ విధముగ మాటలాడుకొని, భయంకరుడుగా కనబడుచున్న ఆ పరశురామునకై అర్ఘ్యము గ్రహించి, "రామా ! రామా!" అని మధురముగ పిలచి పూజించిరి. 24

మూ. ప్రతిగృహ్య తు తాం పూజామృషిదత్తాం ప్రతాపవాన్,
రామం దాశరథిం రామో జామదగ్న్యోఽభ్యభాషత. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
చతుఃసప్తతితమః సర్గః.

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపము గల, జామదగ్న్యః = జమదగ్ని కుమారు డైన, రామః = పరశురాముడు, ఋషిదత్తామ్ = ఋషులచేత ఇవ్వబడిన, తామ్ = ఆ, పూజామ్ = పూజను, ప్రతిగృహ్య = స్వీకరించి, దాశరథిమ్ = దశరథుని కుమారుడైన, రామమ్ = రాముని గూర్చి, అభ్యభాషత = పలికెను.

తా. ప్రతాపవంతు డైన ఆ పరశురాముడు ఋషులు సమర్పించిన ఆ పూజను స్వీకరించి, దశరథుని కుమారు డగు రామునితో ఇట్లనెను. 24

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు, బాలకాండలో
డెబ్బది నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చసప్తతితమః సర్గః

మూ. రామ దాశరథే రామ వీర్యం తే శ్రూయతేఽద్భుతమ్,
ధనుషో భేదనం చైవ నిఖిలేన మయా శ్రుతమ్. 1

ప్ర. అ. దాశరథే = దశరథకుమారుడ వైన, రామ = రామా ! రామ = రామా ! తే = నీయొక్క, వీర్యమ్ = పరాక్రమము, అద్భుతమ్ = అద్భుతమైనదిగా, శ్రూయతే = వినబడుచున్నది. ధనుషః = ధనస్సుయొక్క, భేదనం చైవ = భేదనము కూడ, నిఖిలేన = పూర్తిగా, మయా = నాచేత, శ్రుతమ్ = వినబడినది.

తా. రామా ! రామా ! నీ పరాక్రమము అత్యద్భుత మైన దని వినుచున్నాము. శివధనుర్భంగమును గూర్చి గూడ పూర్తిగ విని యున్నాము. 1

మూ. తదద్భుతమచిన్త్యం చ భేదనం ధనుషస్త్వయా,
తచ్ఛ్రుత్వాహమనుప్రాప్తో ధనుర్గృహ్యాపరం శుభమ్. 2

ప్ర. అ. త్వయా = నీచేత, ధనుషః = ధనస్సుయొక్క, తత్ = ఆ, భేదనమ్ = విరచుట, అద్భుతమ్ = ఆశ్చర్యకర మైనది. అచిన్త్యం చ = ఊహింప శక్యము కానిది. తత్ = దానిని, శ్రుత్వా = విని, అహమ్ = నేను, అపరమ్ = మరియొక, శుభమ్ = శుభ మైన, ధనుః = ధనస్సును, గృహ్య = గ్రహించి, అనుప్రాప్తః = వచ్చినాను.

తా. నీవు శివుని విల్లు విరచుట చాల ఆశ్చర్యకర మైనది, ఊహింప రానిది. ఆ వార్త విని నేను మరొక శుభ మైన విల్లు తీసికొని వచ్చినాను. 2

మూ. తదిదం ఘోరసంకాశం జామదగ్న్యం మహద్ధనుః,
పూరయస్వ శరేణైవ స్వబలం దర్శయస్వ చ. 3

ప్ర. అ. ఘోరసంకాశమ్ = భయంకరముగా నున్నదియు, జామదగ్న్యమ్ = జమదగ్నివలన వచ్చినదియు అగు, తత్ = ఆ, ఇదమ్ = ఈ, మహత్ =

గొప్ప, ధనుః = ధనస్సును, శరేణైవ=బాణముచే, పూరయస్వ = పూరింపుము. స్వబలమ్ = నీ బలమును, దర్శయస్వ చ = చూపుము.

తా. ఘోర మైనదియు, జమదగ్ని ద్వారా లభించినదియు అగు అట్టి ఈ మహాధనస్సును, ఎక్కుపెట్టి, బాణముచే పూరించి, నీ బలమును చూపుము. 3

మూ. తదహం తే బలం దృష్ట్వా ధనుషోఽస్య ప్రపూరణే,
ద్వన్ద్వయుద్ధం ప్రదాస్యామి వీర్యశ్లాఘ్యస్య రాఘవ. 4

ప్ర. అ. రాఘవ = రామా ! తత్ = అప్పుడు, అహమ్ = నేను, అస్య= ఈ, ధనుషః=ధనస్సుయొక్క, ప్రపూరణే=పూరించుటయందు, తే=నీయొక్క, బలమ్=బలమును, దృష్ట్వా=చూచి, వీర్యశ్లాఘ్యస్య = పరాక్రమముచే శ్లాఘింప దగిన నీకు, ద్వన్ద్వయుద్ధమ్=ద్వంద్వయుద్ధమును, ప్రదాస్యామి=ఇవ్వగలను.

తా. రామా ! ఈ ధనస్సును పూరించినచో అపుడు నీ బలమును చూచి, వీర్యముచే శ్లాఘింప దగిన నీతో ద్వంద్వయుద్ధము చేయగలను. 4

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రాజా దశరథ స్తదా,
విషణ్ణవదనో దీనః ప్రాఞ్జలిర్వాక్యమబ్రవీత్. 5

ప్ర. అ. తదా=అప్పుడు, రాజా దశరథః=దశరథమహారాజు, తస్య= అతనియొక్క, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, విషణ్ణవదనః= దిగులుపాటు చెందిన ముఖము కలవాడై, దీనః=దీనుడై, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలి కలవాడై, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. అపుడు, దశరథమహారాజు అతని మాటలు విని, వాడిపోయిన ముఖముతో దీనుడై, చేతులు జోడించి ఇట్లు పలికెను. 5

మూ. క్షత్రరోషాత్ప్రశాన్తస్త్వం బ్రాహ్మణశ్చ మహాయశాః,
బాలానాం మమ పుత్రాణామభయం దాతుమర్హసి. 6

ప్ర. అ. క్షత్రరోషాత్=క్షత్రియులపై రోషమునుండి, ప్రశాన్తః=శాంతించినవాడవును, బ్రాహ్మణః=బ్రాహ్మణుడవును, మహాయశాః = గొప్ప కీర్తి కల

వాడవును అగు, త్వమ్=నీవు, బాలానామ్ = బాలులైన, మమ=నాయొక్క పుత్రాణామ్=పుత్రులకు, అభయమ్ = అభయమును, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి=తగియున్నావు.

తా. గొప్ప యశస్సు కలవాడవు, బ్రాహ్మణుడవు అయిన నీవు క్షత్రియులపై ఉన్న కోపము తొలగి శాంతుడవుగా ఉన్నావు కదా? ఇపుడు బాలులైన నా కుమారులకు అభయ మిమ్ము. 6

మూ. భార్గవాణాం కులే జాతః స్వాధ్యాయవ్రతశాలినామ్,
సహస్రాక్షే ప్రతిజ్ఞాయ శస్త్రం నిక్షిప్తవానసి. 7

ప్ర. అ. స్వాధ్యాయవ్రతశాలినామ్ = వేదాధ్యయనముచేతను ఇతరవ్రతములచేతను ప్రకాశించుచున్న, భార్గవాణామ్ = భృగువంశీయుల, కులే=కులమునందు, జాతః=పుట్టితివి. సహస్రాక్షే = దేవేంద్రునియందు, ప్రతిజ్ఞాయ=ప్రతిజ్ఞ చేసి, శస్త్రమ్=ఆయుధమును, నిక్షిప్తవాన్ అసి=విడచిపెట్టితివి.

తా. నీవు స్వాధ్యాయమునందును, తదితరవ్రతములందును ఆసక్తులైన భృగువంశీయుల కులమునందు పుట్టినావు. దేవేంద్రుని ముందు ప్రతిజ్ఞ చేసి శస్త్రమును విడచితివి. 7

మూ. స త్వం ధర్మపరో భూత్వా కాశ్యపాయ వసున్ధరామ్,
దత్త్వా వనముపాగమ్య మహేన్ద్రకృతకేతనః. 8

ప్ర. అ. సః=అట్టి, త్వమ్=నీవు, ధర్మపరః=ధర్మపరుడవు, భూత్వా=అయి, కాశ్యపాయ = కాశ్యపునకు, వసున్ధరామ్=భూమిని, దత్త్వా = ఇచ్చి, వనమ్=వనమును, ఉపాగమ్య = పొంది, మహేన్ద్రకృతకేతనః = మహేంద్రపర్వతముపై చేయబడిన నివాసము కలవాడవు.

తా. నీవు ధర్మపరుడవై, భూమి నంతను కాశ్యపునకు దానము చేసి, వనము చేరి, మహేంద్రపర్వతముపై నివాస మేర్పరచుకున్నావు. 8

మూ. మమ సర్వవినాశాయ సంప్రాప్తస్త్వం మహామునే,
న చైకస్మిన్ హతే రామే సర్వే జీవామహే వయమ్. 9

ప్ర. అ. మహామునే = ఓ మహామునీ! త్వమ్ = నీవు, మమ = నా యొక్క, సర్వవినాశాయ = సర్వవినాశమునకు, సంప్రాప్తః = వచ్చినావు. ఏకస్మిన్ = ఒక, రామే = రాముడు, హతే = చంపబడినవాడగుచుండగా, వయమ్ = మేము, సర్వే = అందరము, న జీవామహే = జీవించము.

తా. మహామునీ! ఈనాడు నీవు మా అందరి వినాశార్థమై వచ్చితివి. ఒక్క రాముడు మరణించినను మే మందరము మరణింతుము కదా? 9

మూ. బ్రువత్యేవం దశరథే జామదగ్న్యః ప్రతాపవాన్,
అనాదృత్యైవ తద్వాక్యం రామమేవాభ్యభాషత. 10

ప్ర. అ. దశరథే = దశరథుడు, ఏమ్ = ఇట్లు, బ్రువతి = చెప్పుచుండగా, ప్రతాపవాన్ = ప్రతాపము గల, జామదగ్న్యః = పరశురాముడు, తద్వాక్యమ్ = ఆతని వాక్యమును, అనాదృత్యైవ = ఆదరించకయే, రామమేవ = రాముని గూర్చియే, అభ్యభాషత = పలికెను.

తా. దశరథు డీ విధముగ మాటలాడుచుండగా ప్రతాపవంతు డైన పరశురాముడు, ఆతని మాటలు లెక్కచేయకుండగనే, రామునితో మాత్రమే ఇట్లు పలికెను. 10

మూ. ఇమే ద్వే ధనుషీ శ్రేష్ఠే దివ్యే లోకాభివిశ్రుతే,
దృఢే బలవతీ ముఖ్యే సుకృతే విశ్వకర్మణా. 11

ప్ర. అ. ఇమే = ఈ, ద్వే = రెండు, ధనుషీ = ధనస్సులు, శ్రేష్ఠే = శ్రేష్ఠ మైనవి. దివ్యే = స్వర్గమున పుట్టినవి. లోకాభివిశ్రుతే = లోకములలో ప్రసిద్ధ మైనవి. దృఢే = దృఢ మైనవి. బలవతీ = బలము కలవి. ముఖ్యే = ప్రధాన మైనవి. విశ్వకర్మణా = విశ్వకర్మచేత, సుకృతే = బాగుగా నిర్మింపబడినవి.

తా. ఈ రెండు ధనస్సులును శ్రేష్ఠ మైనవి. దేవలోకమునకు సంబంధించినవి. లోకములలో ప్రసిద్ధిపొందినవి. దృఢ మైనవి. బలము గలవి. ప్రధాన మైనవి. విశ్వకర్మ వీటిని బాగుగ నిర్మించెను. 11

మూ. అతిసృష్టం సురై రేకం త్ర్యమ్బకాయ యుయుత్సవే,
త్రిపురఘ్నం నరశ్రేష్ఠ భగ్నం కాకుత్స్థ యత్త్వయా. 12

ప్ర. అ. నరశ్రేష్ఠ=నరులలో శ్రేష్ఠుడ వైన, కాకుత్స్థ=రామా ! యత్= ఏ ధనస్సు, త్వయా = నీచేత, భగ్నమ్ = విరుగకొట్టబడినదో, అది, యుయుత్సవే = యుద్ధము కోరుచున్న, త్ర్యమ్బకాయ = ఈశ్వరునకు, సురైః = దేవతల చేత. అతిసృష్టమ్ = ఇవ్వబడిన, త్రిపురఘ్నమ్ = త్రిపురములను నశింపచేసిన, ఏకమ్ = (ఆ రెండింటిలో) ఒకధనస్సు.

తా. నరశ్రేష్ఠుడ వైన రామా ! వాటిలో ఒక ధనస్సును దేవతలు యుద్ధము చేయ గోరుచున్న ఈశ్వరునకు ఇచ్చిరి. త్రిపురవినాశక మగు దానినే నీవు విరిచితివి. 12

మూ. ఇదం ద్వితీయం దుర్ధర్షం విష్ణోర్దత్తం సురోత్తమైః,
తదిదం వైష్ణవం రామ ధనుః పరమభాస్వరమ్,
సమానసారం కాకుత్స్థ రౌద్రేణ ధనుషా త్విదమ్. 13

ప్ర. అ. దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యముకాని, ఇదమ్= ఈ, ద్వితీయమ్= రెండవధనస్సు, సురోత్తమైః = సురోత్తములచేత, విష్ణోః=విష్ణువునకు, దత్తమ్= ఇవ్వబడినది. కాకుత్స్థ = కకుత్స్థవంశమునందు పుట్టిన, రామ = రామా, పరమ భాస్వరమ్=మిక్కిలి ప్రకాశించుచున్న, తత్ = ఆ, ఇదమ్ = ఇది, వైష్ణవమ్ = విష్ణుసంబంధ మైన, ధనుః = ధనస్సు. ఇదమ్ = ఇది, రౌద్రేణ ధనుషా = శివ ధనస్సుతో, సమానసారమ్ = సమానమైన సారము గలది.

తా. ఎదిరింప రాని ఈ రెండవ ధనస్సును దేవతలు విష్ణువున కిచ్చినారు. రామా ! అట్టి ఈ మిక్కిలి ప్రకాశించుచున్న ధనస్సు విష్ణువునకు సంబంధించినది. ఇది శివధనస్సుతో సమాన మైన సారము గలది. 13

మూ. తదా తు దేవతాః సర్వాః పృచ్ఛన్తి స్మ పితామహమ్,
శితికణ్ఠస్య విష్ణోశ్చ బలాబలనిరీక్షయా. 14

ప్ర. అ. తదా = అప్పుడు, సర్వాః = సమస్త మైన, దేవతాః=దేవతలు,

శితికణ్ఠస్య = శివునియొక్కయు, విష్ణోః చ = విష్ణువుయొక్కయు, బలాబలనిరీక్షయా=బలాబలముల పరీక్షచేత, పితామహమ్=బ్రహ్మదేవుని, పృచ్ఛన్తి స్మ=ప్రశ్నించిరి.

తా. అపుడు దేవత లందరును శివవిష్ణువుల బలాబలములను తెలిసికొనగోరి బ్రహ్మను అడిగిరి. 14

మూ. అభిప్రాయం తు విజ్ఞాయ దేవతానాం పితామహః,
విరోధం జనయామాస తయోః సత్యవతాం వరః. 15

ప్ర. అ. సత్యవతామ్ = సత్యవంతులలో, వరః = శ్రేష్ఠుడైన, పితామహః = బ్రహ్మదేవుడు, దేవతానామ్ = దేవతలయొక్క, అభిప్రాయమ్ = అభిప్రాయమును, విజ్ఞాయ = తెలిసికొని, తయోః = వారిరువురకును, విరోధమ్ = విరోధమును, జనయామాస = పుట్టించెను.

తా. సత్యవంతులలో గొప్పవా డగు బ్రహ్మదేవుడు దేవతల అభిప్రాయము తెలిసికొని వారిద్దరికిని విరోధము కల్పించెను. 15

మూ. విరోధే చ మహద్యుద్ధమభవద్రోమహర్షణమ్,
శితికణ్ఠస్య విష్ణోశ్చ పరస్పరజిగీషుణోః. 16

ప్ర. అ. విరోధే = విరోధము కలుగగా, పరస్పరజిగీషుణోః = ఒండొరులను జయింప గోరిన, శితికణ్ఠస్య = శివునకును, విష్ణోశ్చ = విష్ణువునకును, రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించు, మహత్ = గొప్ప, యుద్ధం=యుద్ధము, అభవత్ = ఆయెను.

తా. విరోధము కలుగగా, పరస్పరము జయించ వలె నని కోరుచున్న శివునకును విష్ణువునకును గొప్ప భయంకర మగు యుద్ధము జరిగెను. 16

మూ. తదా తు జృమ్భితం శైవం ధనుర్భీమపరాక్రమమ్,
హుంకారేణ మహాదేవః స్తంభితోఽథ త్రిలోచనః. 17

ప్ర. అ. తదా = అప్పుడు, హుంకారేణ = విష్ణువు 'హుం' అని అనుటచే,

భీమపరాక్రమమ్ = భయంకర మైన పరాక్రమము గల, శైవం ధనుః = శివ ధనుస్సు, జృమ్భితమ్=ఆవులించినది. అనగా జడమై పోయినది. అథ=పిమ్మట, త్రిలోచనః = మూడు నేత్రములు గల, మహాదేవః = ఈశ్వరుడు, స్తమ్భితః = స్తంభింపచేయబడినాడు.

తా. అపుడు విష్ణువు హుంకారము చేయగా భయంకర మైన పరాక్రమము గల ఆ శివధనస్సు జడ మైపోయినది. త్రిలోచనుడు కూడ కదలలేక పోయెను. 17

మూ. దేవైస్తదా సమాగమ్య సర్షిసంఘైః సచారణైః,
యాచితౌ ప్రశమం తత్ర జగ్మతుస్తౌ సురోత్తమౌ. 18

ప్ర. అ. తదా = అప్పుడు, సర్షిసంఘైః = ఋషిసంఘములతో కూడిన, సచారణైః = చారణులతో కూడిన, దేవైః = దేవతలచేత, తత్ర = అచట, సమాగమ్య = వచ్చి, యాచితౌ = ప్రార్థింపబడినవారై, తౌ = ఆ, సురోత్తమౌ = దేవతాశ్రేష్ఠులు, ప్రశమమ్ = శాంతిని, జగ్మతుః = పొందిరి.

తా. అపుడు దేవతలు, ఋషులు, చారణులు వచ్చి ప్రార్థింపగా ఆ దేవతాశ్రేష్ఠు లిరువురును శాంతించిరి. 18

మూ. జృమ్భితం తద్ధనుర్దృష్ట్వా శైవం విష్ణుపరాక్రమైః,
అధికం మేనిరే విష్ణుం దేవాః సర్షిగణాస్తదా. 19

ప్ర. అ. విష్ణుపరాక్రమైః = విష్ణువుయొక్క పరాక్రమములచేత, జృమ్భితమ్ = నిర్వీర్యముగచేయబడిన, తత్ = ఆ, శైవమ్ = శివుని సంబంధ మైన, ధనుః = ధనస్సును, దృష్ట్వా = చూచి, తదా = అప్పుడు, సర్షిగణాః = ఋషిగణములతో కూడిన, దేవాః = దేవతలు, విష్ణుమ్ = విష్ణువును, అధికమ్ = గొప్పవానినిగా, మేనిరే = తలచిరి.

తా. విష్ణుపరాక్రమముచే ఆ శివధనస్సు జడ మైపోవుట జూచి దేవతలును, ఋషిగణములును, విష్ణువే అధికు డని తెలిసికొనిరి. 19

మూ. ధనూ రుద్రస్తు సంక్రుద్ధో విదేహేషు మహాయశాః,
దేవరాతస్య రాజర్షేర్దదౌ హస్తే ససాయకమ్. 20

ప్ర. అ. సంక్రుద్ధః = కోపగించిన, మహాయశాః = గొప్ప కీర్తి గల, రుద్రస్తు = రుద్రుడైతే, విదేహేషు = విదేహదేశమునందు, ససాయకమ్ = బాణముతో కూడిన, ధనుః = ధనస్సును, రాజర్షేః = రాజర్షి యైన, దేవరాతస్య = దేవరాతునియొక్క, హస్తే = హస్తమునందు, దదౌ = ఇచ్చెను.

తా. మహాయశస్సు గల రుద్రుడు కోపించి, బాణసహిత మైన ఆ ధనస్సును, విదేహదేశములో దేవరాతు డను రాజర్షి చేతికి ఇచ్చివేసెను. 20

మూ. ఇదం చ వైష్ణవం రామ ధనుః పరపురఞ్జయమ్,
ఋచీకే భార్గవే ప్రాదాద్విష్ణుః స న్యాసముత్తమమ్. 21

ప్ర. అ. రామ = రామా! సః = ఆ, విష్ణుః = విష్ణువు, పరపురఞ్జయమ్ = పరుల పురములను జయించు, ఇదమ్ = ఈ, వైష్ణవం ధనుః = వైష్ణవధనస్సును, భార్గవే = భృగువంశమునకు చెందిన, ఋచీకే = ఋచీకునియందు, ఉత్తమమ్ = ఉత్తమ మైన, న్యాసమ్ = న్యాసమునుగా, ప్రాదాత్ = ఇచ్చెను.

తా. రామా! శత్రుపురవినాశక మగు తన ధనస్సును, విష్ణువు, భృగువంశమునకు చెందిన ఋచీకుని వద్ద ఉత్తమ మైన, న్యాసమునుగా ఇచ్చెను. 21

మూ. ఋచీకస్తు మహాతేజాః పుత్రస్యాప్రతికర్మణః,
పితుర్మమ దదౌ దివ్యం జమదగ్నేర్మహాత్మనః. 22

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ఋచీకస్తు = ఋచీకుడు, పుత్రస్య = తన కుమారుడును, అప్రతికర్మణః = సాటి లేని కార్యములు కల వాడును, మహాత్మనః = మహాత్ముడును, మమ = నాయొక్క, పితుః = తండ్రియు అయిన, జమదగ్నేః = జమదగ్నికి, దదౌ = ఇచ్చెను.

తా. మహాతేజఃశాలి యగు ఋచీకుడు, దానిని సాటి లేని కర్మ కల వాడును, మహాత్ముడును, తన కుమారుడును, నా తండ్రియు అగు జమదగ్ని కిచ్చెను. 22

మూ. న్యస్తశస్త్రే పితరి మే తపోబలసమన్వితే,
అర్జునో విదధే మృత్యుం ప్రాకృతాం బుద్ధిమాస్థితః. 23

ప్ర. అ. తపోబలసమన్వితే = తపోబలముతో కూడిన, మే = నాయొక్క, పితరి = తండ్రి, న్యస్తశస్త్రే = విడువబడిన ఆయుధములు కలవాడై యుండగా, అర్జునః = కార్తవీర్యార్జునుడు, ప్రాకృతామ్ = ప్రాకృత మైన, బుద్ధిమ్ = బుద్ధిని, ఆస్థితః = అవలంబించినవాడై, మృత్యుమ్ = మరణమును, విదదే = చేసెను.

తా. తపోబలసమన్వితు డగు నా తండ్రి అస్త్రసంన్యాసము చేసి ఉన్నపుడు కార్తవీర్యార్జునుడు పామరబుద్ధికలవాడై అతనిని చంపెను. 23

మూ. వధమప్రతిరూపం తు పితుః శ్రుత్వా సుదారుణమ్,
క్షత్రముత్సాదయన్రోషాజ్జాతం జాతమనేకశః, 24
పృథివీం చాఖిలాం ప్రాప్య కాశ్యపాయ మహాత్మనే,
యజ్ఞస్యాన్తే తదా రామ దక్షిణాం పుణ్యకర్మణే,
దత్వా మహేన్ద్రనిలయస్తపోబలసమన్వితః. 25

ప్ర. అ. రామ = రామా! అప్రతిరూపమ్ = సాటి లేనిదియు, సుదారుణమ్ = చాల దారుణ మైనదియు అగు, పితుః = తండ్రియొక్క, వధమ్ = వధను; శ్రుత్వా = విని, రోషాత్ = కోపమువలన, జాతం జాతమ్ = పుట్టినవానినిపుట్టినట్లుగనే, క్షత్రమ్ = క్షత్రియజాతివానిని, అనేకశః = అనేకవిధములుగ, ఉత్సాదయన్ = నశింపచేయుచున్నవాడనై, అఖిలామ్ = సమస్తమైన, పృథివీమ్ = భూమిని, ప్రాప్య = పొంది, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, అన్తే = అంతమునందు, మహాత్మనే = మహాత్ముడును, పుణ్యకర్మణే = పుణ్యమైన కర్మ గలవాడును అగు, కాశ్యపాయ = కాశ్యపునకు, దత్వా = ఇచ్చి, తపోబలసమన్వితః = తపోబలముతో కూడినవాడనై, మహేన్ద్రనిలయః = మహేంద్రపర్వతమే నివాసముగ కలవాడనైతిని.

తా. చాల దారుణము, క్రౌర్యమున సాటి లేనిదియు అగు నా తండ్రి వధను గూర్చి విన్న నేను రోషముతో అనేకపర్యాయములు క్షత్రియజాతికి చెందిన ప్రతి ఒక్కనిని, పుట్టినవానిని పుట్టినట్లుగనే సంహరించితిని. ఈ భూమి

నంతను జయించి, యజ్ఞాంతమునందు మహాత్ముడును, పుణ్యకర్మ కలవాడును అగు కాశ్యపునకు దానము చేసితిని. పిదప తపోబలసమన్వితుడనై, మహేంద్ర పర్వతముపై నివసించుచున్నాను. 24, 25

మూ. అద్య తూత్తమవీర్యేణ త్వయా రామ మహాబల,
శ్రుతవాన్ ధనుషో భేదం తతోఽహం ద్రుతమాగతః. 26

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గల, రామ=రామా! అద్య= ఇపుడు, ఉత్తమవీర్యేణ=గొప్ప పరాక్రమము గల, త్వయా=నీచేత, ధనుషః= ధనస్సుయొక్క, భేదమ్=భంగమును, శ్రుతవాన్ = విన్నవాడనై, అహమ్= నేను, తతః=ఆ కారణమువలన, ద్రుతమ్=శీఘ్రముగా, ఆగతః=వచ్చితిని.

తా. మహాబలుడ వగు రామా! ఉత్తమ మైన పరాక్రమము గల నీవు ఇపుడు ధనస్సు విరచితి వని విని శీఘ్రముగా వచ్చినాను. 26

మూ. తదిదం వైష్ణవం రామ పితృపైతామహం మహత్,
క్షత్రధర్మం పురస్కృత్య గృహ్ణీష్వ ధనురుత్తమమ్. 27

ప్ర. అ. రామ = రామా! క్షత్రధర్మమ్ = క్షత్రియధర్మమును, పురస్కృత్య = పురస్కరించుకొని, తత్=ఆ, ఇదమ్=ఈ, పితృపైతామహమ్= పితృపితామహక్రమమున వచ్చుచున్న, మహత్=గొప్ప దైన, ఉత్తమమ్=శ్రేష్ఠ మైన, వైష్ణవమ్ = విష్ణుసంబంధ మైన, ధనుః = ధనస్సును, గృహ్ణీష్వ = గ్రహింపుము.

తా. రామా! క్షత్రియధర్మమును మన్నించి, మా పితృపితామహక్రమ మున లభించినదియు, శ్రేష్ఠ మైనదియు అగు అట్టి ఈ విష్ణుధనస్సును గ్రహింపుము. 27

మూ. యోజయస్వ ధనుః శ్రేష్ఠే శరం పరపురఞ్జయమ్,
యది శక్నోషి కాకుత్స్థ ద్వన్ద్వం దాస్యామి తే తతః. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
పఞ్చసప్తతితమః సర్గః.

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! ధనుఃశ్రేష్ఠే=శ్రేష్ఠ మైన ఈ ధనస్సుపై, పరపురఞ్జయమ్ = శత్రుపురములను జయించు, శరమ్ = బాణమును, యోజయస్వ=కూర్చుము. శక్నోషి యది = అట్లు చేయ సమర్థుడ వైనచో, తతః= పిమ్మట, తే=నీకు, ద్వన్ద్వమ్=ద్వంద్వయుద్ధమును, దాస్యామి=ఇవ్వగలను.

తా. రామా ! శ్రేష్ఠ మైన ఈ ధనస్సు మీద శత్రువుల పురములను జయించు ఈ శరమును సంధించుము. నీ వట్లు చేయ గలిగినచో నీతో ద్వంద్వ యుద్ధము చేయగలను. 28

"బాలానందిని"యను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు బాలకాండలో
డెబ్బదిఐదవ సర్గ సమాప్తము.

అథ షట్సప్తతితమః సర్గః

మూ. శ్రుత్వా తజ్జామదగ్న్యస్య వాక్యం దాశరథిస్తదా,
గౌరవాద్యన్త్రితకథః పితూ రామమథాబ్రవీత్. 1

ప్ర. అ. తదా=అప్పుడు, దాశరథిః=రాముడు, జామదగ్న్యస్య=పరశు రామునియొక్క, వాక్యమ్=వాక్యమును, శ్రుత్వా = విని, పితుః=తండ్రియొక్క, గౌరవాత్ = గౌరవమువలన, యన్త్రితకథః = తగ్గింపబడిన సంభాషణము కల వాడై. అథ=పిమ్మట, రామమ్=బలరాముని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. అపుడు రాముడు పరశురాముని మాటలు విని, తండ్రి దగ్గర నుండుటచే ఆయనపై నున్న గౌరవభావముచే, అధికముగ మాటలాడక ఇట్లనెను. 1

మూ. శ్రుతవానస్మి యత్కర్మ కృతవానసి భార్గవ,
అనురున్ధ్యామహే బ్రహ్మన్ పితురానృణ్యమాస్థితమ్. 2

ప్ర. అ. భార్గవ=ఓ పరశురామా! యత్=ఏ, కర్మ=కర్మను, కృతవాన్ అసి=చేసితివో, దానిని, శ్రుతవాన్ అస్మి = విని యుంటిని. బ్రహ్మన్= బ్రాహ్మణా! పితుః=తండ్రికి, ఆనృణ్యమ్=ఋణము తీర్చివేయుటను, ఆస్థితమ్= పొందిన నిన్ను, అనురున్ధ్యామహే=మెచ్చుకొనుచున్నాము.

తా. పరశురామా! నీవు చేసిన పనులను వింటిమి. తండ్రి విషయమున స్వధర్మమును నిర్వహించి ఆనృణ్యమును పొందిన నిన్ను అభినందించుచున్నాము. 2

మూ. వీర్యహీనమివాశక్తం క్షత్రధర్మేణ భార్గవ,
అవజానాసి మే తేజః పశ్య మేఽద్య పరాక్రమమ్. 3

ప్ర. అ. భార్గవ = పరశురామా! వీర్యహీనమివ = పరాక్రమము లేని వానిని వలెను, క్షత్రధర్మేణ = క్షత్రియధర్మము చేత, అశక్తమివ=సామర్థ్యము లేనివానిని వలె, అవజానాసి = నన్ను అవమానము చేయుచున్నావు. అద్య =

ఇప్పుడు, మే = నాయొక్క, తేజః = తేజస్సును, పరాక్రమమ్=పరాక్రమమును, పశ్య = చూడుము.

తా. పరశురామా ! నన్ను, పరాక్రమము లేనివానిని వలె, క్షత్రియధర్మా నుసారము ప్రవర్తింప సామర్థ్యము లేనివానిని వలె, అవమానించుచున్నావు. ఇపుడు నా తేజస్సును, పరాక్రమమును చూడుము. 3

మూ. ఇత్యుక్త్వా రాఘవః క్రుద్ధో భార్గవస్య శరాసనమ్,
శరం చ ప్రతిజగ్రాహ హస్తాల్లఘుపరాక్రమః. 4

ప్ర. అ. లఘుపరాక్రమః=శీఘ్ర మైన పరాక్రమము గల, రాఘవః = రాముడు, క్రుద్ధః = కోపించినవాడై, ఇతి=ఇట్లు, ఉక్త్వా = పలికి, భార్గవస్య = పరశురామునియొక్క, హస్తాత్ = హస్తమునుండి, శరాసనమ్ = ధనస్సును, శరం చ = బాణమును, ప్రతిజగ్రాహ = తీసికొనెను.

తా. శీఘ్ర మైన పరాక్రమము గల రాముడు కోపముతో ఇట్లు పలికి పరశురాముని చేతిలోనుండి ధనస్సును, బాణమును తీసికొనెను. 4

మూ. ఆరోప్య స ధనూ రామశ్శరం సజ్యం చకార హ,
జామదగ్న్యం తతో రామం రామః క్రుద్ధోఽబ్రవీద్వచః. 5

ప్ర. అ. సః = ఆ, రామః = రాముడు, ధనుః = ధనస్సును, ఎక్కుపెట్టి, శరమ్ = బాణమును, సజ్యమ్=నారితో కూడినదానినిగా, చకార= చేసెను. రామః = రాముడు, తతః = పిమ్మట, క్రుద్ధః = కోపించినవాడై, జామదగ్న్యమ్ = జమదగ్నికుమారు డైన, రామమ్ = రాముని గూర్చి, వచః = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు ధనస్సును ఎక్కుపెట్టి నారిపై బాణము సంధించి, క్రుద్ధుడై పరశురామునితో ఇట్లనెను. 5

మూ. బ్రాహ్మణోఽసీతి పూజ్యో మే విశ్వామిత్రకృతేన చ,
తస్మాచ్ఛక్తో న తే రామ మోక్తుం ప్రాణహరం శరమ్. 6

ప్ర. అ. రామ = పరశురామా ! బ్రాహ్మణః = బ్రాహ్మణుడవు, అసి = అయియున్నావు, ఇతి = ఈ కారణమువలనను, విశ్వామిత్రకృతేన చ = విశ్వామిత్రుని పట్టియు, మే = నాకు, పూజ్యః = పూజింపదగినవాడవు. తస్మాత్ = ఆ కారణమువలన, తే = నీయొక్క, ప్రాణహరమ్ = ప్రాణములను హరించు, శరమ్ = బాణమును, మోక్తుమ్ = విడచుటకు, న శక్తః = సమర్థుడను కాను.

తా. పరశురామా ! నీవు బ్రాహ్మణుడ వగుటచేతను, విశ్వామిత్రునికి నీవు బంధు వగుట చేతను నాకు పూజ్యుడవు. అందుచే ప్రాణములను హరించు ఈ బాణమును నీపై ప్రయోగింపజాలను.

వి. పరశురాముని తండ్రి యైన జమదగ్ని విశ్వామిత్రుని సోదరి యగు సత్యవతి కుమారుడు. 6

మూ. ఇమాం పాదగతిం రామ తపోబలసమార్జితాన్,
లోకాన ప్రతిమాన్వా తే హనిష్యామి యదిచ్ఛసి. 7

ప్ర. అ. రామ=రామా ! తే=నీయొక్క, ఇమామ్=ఈ, పాదగతిమ్=పాదగమనమును గాని, తపోబలసమార్జితాన్ = తపోబలముచే సంపాదింపబడిన, అప్రతిమాన్=సాటి లేని, లోకాన్ వా=లోకములను గాని, హనిష్యామి = కొట్టెదను. యత్=దేనిని, ఇచ్ఛసి=కోరుచున్నావో అది చెప్పుము.

తా. రామా ! నీ పాదగమనశక్తిని గాని, తపోబలముచే నీవు సంపాదించిన సాటి లేని ఉత్తమలోకములను గాని, కొట్టివేసెదను. ఏది ఇష్టమో చెప్పుము. 7

మూ. న హ్యాయం వైష్ణవో దివ్యః శరః పరపురఞ్జయః,
మోఘః పతతి వీర్యేణ బలదర్పవినాశనః. 8

ప్ర. అ. పరపురఞ్జయః = శత్రువుల పురమును జయించునదియు, వీర్యేణ = పరాక్రమముచేత, బలదర్పవినాశనః = బలదర్పములను నశింపచేయునదియు, దివ్యః=స్వర్గమునందు పుట్టినదియు అగు, అయమ్=ఈ, వైష్ణవః శరః=విష్ణువుయొక్క బాణము, మోఘః=వ్యర్థ మైనదై, న పతతి హి=పడదు కదా.

తా. స్వర్గములో పుట్టినదియు, శత్రుపురములను జయించునదియు, వీర్యముచే బలమును దర్పమును నశింపచేయునదియు అగు ఈ విష్ణుబాణము వ్యర్థ మగుటకు వీలు లేదు. 8

మూ. వరాయుధధరం రామం ద్రష్టుం సర్షిగణాః సురాః,
పితామహం పురస్కృత్య సమేతాస్తత్ర సంఘశః. 9

గన్ధర్వాప్సరసశ్చైవ సిద్ధచారణకిన్నరాః,
యక్షరాక్షసనాగాశ్చ తద్ద్రష్టుం మహదద్భుతమ్. 10

ప్ర. అ. వరాయుధధరమ్=శ్రేష్ఠ మైన ఆ వైష్ణవధనస్సును ధరించిన, రామమ్=రాముని, ద్రష్టుమ్=చూచుటకై, సర్షిగణాః=ఋషిగణములతో కూడిన, సురాః=దేవతలు, పితామహమ్=బ్రహ్మదేవుని, పురస్కృత్య = ఎదుట ఉంచుకొని, తత్ర=అచట, సంఘశః=గుంపులు గుంపులుగా, సమేతాః = కూడిరి. గన్ధర్వాప్సరసశ్చైవ=గంధర్వులును అప్సరసలును, సిద్ధచారణకిన్నరాః=సిద్ధులు, చారణులు, కిన్నరులును, యక్షరాక్షసనాగాశ్చ=యక్షులు, రాక్షసులు, నాగులును, తత్=ఆ, మహత్=గొప్ప, అద్భుతమ్=ఆశ్చర్యమును, ద్రష్టుమ్=చూచుటకు, వచ్చిరి.

తా. శ్రేష్ఠ మైన విష్ణుధనస్సును ధరించిన రాముని చూచుటకై బ్రహ్మాది దేవతలును, ఋషులును గుంపులు గుంపులుగా ఆచటికి వచ్చిరి. గంధర్వులు, అప్సరసలు, సిద్ధులు, చారణులు, కిన్నరులు, యక్షులు, రాక్షసులు, నాగులు కూడ ఆ అద్భుతమును చూచుటకై వచ్చిరి. 9, 10

మూ. జడీకృతే తదా లోకే రామే వరధనుర్ధరే,
నిర్వీర్యో జామదగ్న్యోఽసౌ రామో రామముదీక్షత. 11

ప్ర. అ. తదా=అప్పుడు, రామే=రాముడు, వరధనుర్ధరే = శ్రేష్ఠ మైన ధనస్సును ధరించినవాడగుచుండగా, లోకే = లోకము, జడీకృతే = జడముగ చేయబడిన దగుచుండగా, అసౌ=ఈ, జామదగ్న్యః = జమదగ్నికుమారు డైన, రామః=పరశురాముడు, నిర్వీర్యః=తొలగినశక్తిగలవాడై, రామమ్ = రాముని, ఉదైక్షత=చూచెను.

తా. రాముడు ఆ శ్రేష్ఠ మైన ధనస్సును ఎక్కు పెట్టగానే పరశురాముడు నిర్వీర్యు డయ్యెను. లోక మంతయు స్తంభించిపోయెను. అపు డా పరశురాముడు రాముని సాశ్చర్యముగ చూచెను. 11

మూ. తేజోభిహతవీర్యత్వాజ్జామదగ్న్యో జడీకృతః,
రామం కమలపత్రాక్షం మన్దం మన్దమువాచ హ. 12

ప్ర. అ. తేజోభిహతవీర్యత్వాత్ = రాముని తేజస్సుచే అణచివేయబడిన పరాక్రమము కలవా డగుటచే, జడీకృతః=జడుడుగా చేయబడిన, జామదగ్న్యః= పరశురాముడు, కమలపత్రాక్షమ్ = కమలపత్రములవంటి నేత్రములు గల, రామమ్ = రాముని గూర్చి, మన్దం మన్దమ్ = మెల్లమెల్లగా, ఉవాచ హ = పలికెను.

తా. రాముని తేజస్సుచే పరాక్రమము అణగి పోయి జడు డైన పరశురాముడు పద్మపత్రాక్షు డైన రామునితో మెల్లమెల్లగ ఇట్లు పలికెను. 12

మూ. కాశ్యపాయ మయా దత్తా యదా పూర్వం వసున్ధరా,
విషయే మే న వస్తవ్యమితి మాం కాశ్యపోఽబ్రవీత్. 13

ప్ర. అ. పూర్వమ్ = పూర్వము, వసున్ధరా = భూమి, యదా = ఎప్పుడు, మయా = నాచేత, కాశ్యపాయ = కాశ్యపునకు, దత్తా = ఇవ్వబడినదో, అప్పుడు, మే = నాయొక్క, విషయే = దేశమునందు, న వస్తవ్యమ్ = నివసించకూడదు. ఇతి = అని, మామ్ = నన్ను గూర్చి, కాశ్యపః = కాశ్యపుడు, అబ్రవీత్ = పలికెను.

తా. నేను పూర్వ మీ భూమి నంతను కాశ్యపున కిచ్చినపుడు— "నీవు నా దేశములో నివసింపగూడదు" అని కాశ్యపుడు నన్నాదేశించెను. 13

మూ. సోఽహం గురువచః కుర్వన్ పృథివ్యాం న వసే నిశామ్,
కృతా ప్రతిజ్ఞా కాకుత్స్థ కృతా భూః కాశ్యపస్య హి. 14

ప్ర. అ. సః = అట్టి, అహమ్ = నేను, గురువచః = నా గురువైన కశ్య

పునివచనమును, కుర్వన్ = చేయుచు, పృథివ్యామ్ = భూమియందు, నిశామ్ = రాత్రి, న వసే = వసించను. కాకుత్స్థ = రామా ! ప్రతిజ్ఞా = ప్రతిజ్ఞ, కృతా = చేయబడినది. భూః = ఈ భూమి యంతయు, కాశ్యపస్య = కాశ్యపునిదిగా, కృతా హి = చేయబడినది కదా ?

తా. రామా ! ఈ భూమిని కాశ్యపునకు దానము చేసి, ఆయన కోరిన విధమున ఇచట నివసించ నని ప్రతిజ్ఞచేసితిని. గురు వైన ఆ కాశ్యపుని మాట ననుసరించి నేను రాత్రి ఈ భూమిపై నివసించను. 14

మూ. తదిమాం త్వం గతిం వీర హన్తుం నార్హసి రాఘవ,
మనోజవం గమిష్యామి మహేన్ద్రం పర్వతోత్తమమ్. 15

ప్ర. అ. వీర = వీరుడవైన, రాఘవ = రామా ! తత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, ఇమామ్ = ఈ, గతిమ్ = నడచు శక్తిని, హన్తుమ్ = కొట్టుటకు, నార్హసి = తగవు, మనోజవమ్ = మనోవేగముతో కూడినట్లుగా, మహేన్ద్రమ్ = మహేంద్ర మనెడు, పర్వతోత్తమమ్ = పర్వతశ్రేష్ఠమును గూర్చి, గమిష్యామి = వెళ్లగలను.

తా. కావున, పరాక్రమశాలి వగు ఓ రామా ! నీవు నా గమనశక్తిని కొట్టవద్దు. మనోవేగముతో మహేంద్రపర్వతమునకు వెళ్లిపోయెదను. 15

మూ. లోకాస్త్వప్రతిమా రామ నిర్జితాస్తపసా మయా,
జహి తాన్ శరముఖ్యేన మా భూత్కాలస్య పర్యయః. 16

ప్ర. అ. రామ = రామా ! మయా = నాచేత, అప్రతిమాః = సాటిలేని, లోకాః = లోకములు, తపసా = తపస్సుచేత, నిర్జితాః = జయింపబడినవి. తాన్ = వాటిని, శరముఖ్యేన = ప్రధాన మైన బాణముచేత, జహి = కొట్టుము. కాలస్య = కాలముయొక్క, పర్యయః = కడచిపోవుట, మాభూత్ = కాకుండుగాక.

తా. రామా! నేను తపస్సుచేత జయించిన ఉత్తమలోకములను ఈ బాణముచే కొట్టుము. కాలవిలంబము చేయవద్దు. 16

మూ. అక్షయ్యం మధుహన్తారం జానామి త్వాం సురేశ్వరమ్,
ధనుషోఽస్య పరామర్శాత్స్వస్తి తేఽస్తు పరంతప. 17

ప్ర. అ. అస్య = ఈ, ధనుషః = ధనస్సుయొక్క, పరామర్శాత్ = ఆరోపించుటవలన, త్వామ్=నిన్ను, అక్షయ్యమ్=నశింపచేయ శక్యముకాని వాడును, సురేశ్వరమ్ = దేవతలకు అధిపతియు అగు, మధుహన్తారమ్ = మధువును సంహరించిన విష్ణువునుగా, జానామి = తెలిసికొనుచున్నాను. పరంతప = శత్రువులను పీడించువాడా ! తే = నీకు, స్వస్తి = క్షేమము, అస్తు = అగుగాక.

తా. ఈ ధనస్సును ఎక్కుపెట్టుటవలన, నీవు సురేశ్వరుడును, నాశరహితుడును, మధుసంహారియు అగు మహావిష్ణువే అని గ్రహించినాను. ఓ శత్రువినాశకా ! నీకు క్షేమ మగుగాక. 17

మూ. ఏతే సురగణాః సర్వే నిరీక్షన్తే సమాగతాః,
త్వామప్రతిమకర్మాణమప్రతిద్వన్ద్వమాహవే. 18

ప్ర. అ. సమాగతాః = వచ్చిన, ఏతే = ఈ, సర్వే = సమస్తమైన, సురగణాః = సురగణములు, అప్రతిమకర్మాణమ్ = సాటి లేని కర్మ కలవాడవును, ఆహవే = యుద్ధమునందు, అప్రతిద్వన్ద్వమ్ = ఎదిరి లేనివాడవును అగు, త్వామ్ = నిన్ను, నిరీక్షన్తే = చూచుచున్నారు.

తా. నీవు చేయు పనులు సాటిలేనివి. యుద్ధములో నిన్ను ఎదిరించువాడు ఎవ్వడును లేడు. అట్టి నిన్ను దేవత లందరును వచ్చి చూచుచున్నారు. 18

మూ. న చేయం మమ కాకుత్స్థ వ్రీడా భవితుమర్హతి,
త్వయా త్రైలోక్యనాథేన యదహం విముఖీకృతః. 19

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! త్రైలోక్యనాథేన = మూడు లోకములకును ప్రభువైన, త్వయా = నీచేత, అహమ్ = నేను, యత్ = ఎందువలన, విముఖీకృతః = పరాజితుడ నైతినో, అందువలన, ఇయమ్ = ఇది, మే = నాకు, వ్రీడా = సిగ్గు, భవితుమ్ = అగుటకు, న అర్హతి = తగదు.

తా. రామా ! నేను ముల్లోకములకును ప్రభు వైన నీ చేతిలో పరాజితుడ నైనాను. అందుచే నాకు సిగ్గు పడవలసిన పని లేదు. 19

మూ. శరమప్రతిమం రామ మోక్తుమర్హసి సువ్రత,
శరమోక్షే గమిష్యామి మహేన్ద్రం పర్వతోత్తమమ్. 20

ప్ర. అ. సువ్రత = మంచి వ్రతము గలవాడా ! రామ = రామా ! అప్రతిమమ్ = సాటి లేని, శరమ్ = బాణమును, మోక్తుమ్ = విడచుటకు, అర్హసి = తగియున్నావు. శరమోక్షే = బాణము విడచిన పిమ్మట, పర్వతోత్తమమ్ = పర్వతశ్రేష్ఠ మైన, మహేన్ద్రమ్ = మహేంద్రపర్వతమును గూర్చి, గమిష్యామి= వెళ్లగలను.

తా. ఉత్తమ మైన నియమము గల రామా ! నీవు బాణమును ప్రయోగింపుము. బాణము ప్రయోగించిన పిమ్మట నేను మహేంద్రగిరికి వెళ్లెదను. 20

మూ. తథా బ్రువతి రామే తు జామదగ్న్యే ప్రతాపవాన్,
రామో దాశరథిః శ్రీమాన్ చిక్షేప శరముత్తమమ్. 21

ప్ర. అ. జామదగ్న్యే = జమదగ్నికుమారు డైన, రామే = రాముడు, తథా = అట్లు, బ్రువతి = మాటలాడుచుండగా, ప్రతాపవాన్ = ప్రతాపవంతు డైన, దాశరథిః = దశరథకుమారు డైన, రామః = రాముడు, ఉత్తమమ్ = ఉత్తమ మైన, శరమ్ = బాణమును, చిక్షేప = ప్రయోగించెను.

తా. పరశురాముని మాటలు విని ప్రతాపవంతు డైన దశరథరాముడు బాణమును ప్రయోగించెను. 21

మూ. స హతాన్ దృశ్య రామేణ స్వాన్ లోకాన్ తపసార్జితాన్,
జామదగ్న్యో జగామాశు మహేన్ద్రం పర్వతోత్తమమ్. 22

ప్ర. అ. సః = ఆ, జామదగ్న్యః = పరశురాముడు, తపసా = తపస్సుచే, అర్జితాన్ = సంపాదింపబడిన, స్వాన్=తన సంబంధ మైన, లోకాన్ = పుణ్య

లోకములను, రామేణ = రామునిచేత, హతాన్ = కొట్టబడినవాటినిగా, దృశ్య= చూచి, ఆశు = శీఘ్రముగా, పర్వతోత్తమమ్ = పర్వతశ్రేష్ఠ మైన, మహేన్ద్రిమ్= మహేంద్రపర్వతమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. తాను తపస్సుచే సంపాదించిన పుణ్యలోకములను రాముడు కొట్టగా జూచి, పరశురాముడు శీఘ్రముగ మహేంద్రపర్వతమునకు పోయెను. 22

మూ. తతో వితిమిరాః సర్వా దిశశ్చోపదిశ స్తథా,
సురాః సర్షిగణా రామం ప్రశశంసురుదాయుధమ్. 23

ప్ర. అ. తతః = పిమ్మట, సర్వాః = సమస్త మైన, దిశః = దిక్కులును, తథా = మరియు, ఉపదిశః = విదిక్కులును, వితిమిరాః = చీకటి లేనివి అయినవి. సర్షిగణాః = ఋషిగణములతో కూడిన, సురాః=దేవతలు, ఉదాయుధమ్= ఎత్తబడిన ఆయుధముగల, రామమ్ = రాముని, ప్రశశంసుః = ప్రశంసించిరి.

తా. అపుడు, దిక్కులును, విదిక్కులును చీకటి తొలగి ప్రకాశించినవి. ఆయుధము ధరించిన ఆ రాముని దేవతలును ఋషులును స్తుతించిరి. 23

మూ. రామం దాశరథిం రామో జామదగ్న్యః ప్రశస్య చ,
తతః ప్రదక్షిణీకృత్య జగామాత్మగతిం విభుః. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాణ్డే
షట్సప్తతితమః సర్గః.

ప్ర. అ. ప్రభుః = సమర్థుడైన, జామదగ్న్యః = జమదగ్నికుమారు డైన, రామః = పరశురాముడు, దాశరథిమ్ = దశరథకుమారు డైన, రామమ్ = రాముని, ప్రశస్య చ = ప్రశంసించి. తతః = పిమ్మట, ప్రదక్షిణీకృత్య = ప్రదక్షిణము చేసి, ఆత్మగతిమ్ = తన మార్గమును, జగామ = పొందెను.

తా. సమర్థు డగు ఆ పరశురాముడు దశరథరాముని స్తుతించి, ప్రదక్షిణము చేసి తన దారిని తాను పోయెను. 24

"బాలానన్దిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండలో డెబ్బదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తసప్తతితమః సర్గః

మూ. గతే రామే ప్రశాన్తాత్మా రామో దాశరథిర్ధనుః,
వరుణాయాప్రమేయాయ దదౌ హస్తే ససాయకమ్. 1

ప్ర. అ. రామే = రాముడు, గతే=వెళ్లినవాడగుచుండగా, ప్రశాన్తాత్మా= కోపము తొలగుటచే శాంత మైన చిత్తము కలవాడై, దాశరథిః=దశరథకుమారుడైన, రామః = రాముడు, ససాయకమ్ = బాణములతోకూడిన, ధనుః = ధనస్సును, అప్రమేయాయ = కొలవశక్యము కాని వాడగు, వరుణాయ = వరుణునకు, హస్తే = హస్తమునందు, దదౌ = ఇచ్చెను.

తా. పరశురాముడు వెళ్లిన పిమ్మట రాముడు ఆ ధనస్సును, బాణమును, అప్రమేయప్రభావశాలి యగు వరుణునకు ఇచ్చివేసెను. 1

మూ. అభివాద్య తతో రామో వసిష్ఠ ప్రముఖాన్ ఋషీన్,
పితరం విహ్వలం దృష్ట్వా ప్రోవాచ రఘునన్దనః. 2

ప్ర. అ. తతః = పిమ్మట, రఘునన్దనః = రఘువంశీయులను ఆనందింపచేయు, రామః = రాముడు, వసిష్ఠప్రముఖాన్ = వసిష్ఠుడు మొదలైన, ఋషీన్ = ఋషులను, అభివాద్య = నమస్కరించి, విహ్వలమ్=వ్యాకులు డైన, పితరమ్= తండ్రిని, దృష్ట్వా = చూచి, ప్రోవాచ = పలికెను.

తా. పిమ్మట రాముడు, వసిష్ఠుడు మొదలైన ఋషులకు నమస్కరించి, వ్యాకులుడై యున్న తండ్రిని జూచి ఇట్లనెను. 2

మూ. జామదగ్న్యో గతో రామః ప్రయాతు చతురఙ్గిణీ,
అయోధ్యాభిముఖీ సేనా త్వయా నాథేన పాలితా. 3

ప్ర. అ. జామదగ్న్యః = జమదగ్నికుమారుడైన, రామః = రాముడు, గతః = వెళ్లినాడు. నాథేన = ప్రభువైన, త్వయా = నీచేత, పాలితా = పాలింప

బడిన, చతురఙ్గిణీ = చతురంగములు గల, సేనా = సేన, అయోధ్యాభిముఖీ = అయోధ్యకు అభిముఖ మైనదై, ప్రయాతు = వెళ్లుగాక.

తా. పరశురాముడు వెళ్లిపోయినాడు. నీ సంరక్షణలో నున్న చతురంగ బలము అయోధ్యాభిముఖముగ పయనించుగాక. 3

మూ. సన్దిశస్వ మహారాజ సేనాం త్వచ్ఛాసనే స్థితామ్,
శాసనం కాఙ్క్షతే సేనా చాతకాళిర్జలం యథా. 4

ప్ర. అ. మహారాజ=మహారాజా! త్వచ్ఛాసనే=నీ ఆజ్ఞయందు, స్థితామ్=ఉన్న, సేనామ్ = సేనను, సన్దిశస్వ = ఆజ్ఞాపింపుము. చాతకాళిః = చాతకముల పంక్తి, జలం యథా = జలమును వలె, సేనా = సేన, శాసనమ్ = నీ ఆజ్ఞను, కాఙ్క్షతే = కోరుచున్నది.

తా. మహారాజా నీ అజ్ఞ ననుసరించు సైన్యమును ఆజ్ఞాపింపుము. చాతకముల పంక్తి జలమును కోరి నట్లు సేన నీ శాసనమును కోరుచున్నది. 4

మూ. రామస్య వచనం శ్రుత్వా రాజా దశరథస్సుతమ్,
బాహుభ్యాం సంపరిష్వజ్య మూర్ధ్ని చాఘ్రాయ రాఘవమ్. 5

గతో రామ ఇతి శ్రుత్వా హృష్టః ప్రముదితో నృపః,
పునర్జాతం తదా మేనే పుత్రమాత్మానమేవ చ. 6

ప్ర. అ. రాజా = రాజైన, దశరథః = దశరథుడు, రామస్య = రాముని యొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, సుతమ్ = కుమారుడైన, రాఘవమ్ = రాముని, బాహుభ్యామ్ = బాహువులచేత, సంపరిష్వజ్య=కౌగలించు కొని, మూర్ధ్ని = తలపై, ఆఘ్రాయ చ = వాసనచూచి (ఆనందించెను). రామః= రాముడు, గతః ఇతి = వెళ్లెను అని, శ్రుత్వా = విని, హృష్టః=హర్షించినవాడై, ప్రముదితః = చాల ఆనందించినవాడై, నృపః = రాజు, తదా = అప్పుడు, పుత్రమ్ = పుత్రుని, ఆత్మానమేవ చ = తనను, పునః = మరల, జాతమ్= పుట్టినవానినిగా, మేనే=తలచెను.

తా. దశరథమహారాజు రాముని వచనము విని ఆతనిని బాహువులతో కౌగలించుకొని, శిరస్సుపై మూర్కొనెను. పరశురాముడు వెళ్లిపోయె నని విన్న రాజు ఆనందభరితుడై తనను, తన కుమారులను కూడ మరల పుట్టినట్లుగా భావించెను. 5, 6

మూ. చోదయామాస తాం సేనాం జగామాశు తతః పురీమ్,
పతాకాధ్వజినీం రమ్యాం తూర్యోద్ఘుష్టనినాదితామ్. 7

సిక్తరాజపథాం రమ్యాం ప్రకీర్ణకుసుమోత్కరామ్,
రాజప్రవేశసుముఖైః పౌరైర్మఙ్గలవాదిభిః, 8
సమ్పూర్ణాం ప్రావిశద్రాజా జనౌఘైస్సమలఙ్కృతామ్.

ప్ర. అ. రాజా=దశరథుడు, తామ్=ఆ, సేనామ్=సేనను, చోదయామాస=ప్రేరేపించెను. పతాకాధ్వజినీమ్=చిన్నవి పెద్దవి అయిన జండాలు కలదియు, రమ్యామ్=సుందర మైనదియు, తూర్యోద్ఘుష్టనినాదితామ్=తూర్యముల మ్రోతచే ప్రతిధ్వనించినదియు, సిక్తరాజపథామ్ = తడపబడిన రాజమార్గములు కలదియు, ప్రకీర్ణకుసుమోత్కరామ్=చిమ్మబడిన పుష్పసముదాయము గలదియు, రాజప్రవేశసుముఖైః = రాజుయొక్క ప్రవేశముచే సంతసించిన, మఙ్గలవాదిభిః= మంగళధ్వనులు చేయుచున్న, పౌరైః=పౌరులతో, సంపూర్ణామ్=నిండినదియు, జనౌఘైః=జనుల సముదాయములచే. సమలంకృతామ్ = అలంకరింపబడిన, పురీమ్=అయోధ్యాపురిని, ఆశు=శీఘ్రముగా, జగామ=వెళ్లెను.

తా. పిదప దశరథుడు సైన్యమును ముందుగా నడచుటకై ఆజ్ఞాపించెను. ప్రయాణము చేసి శీఘ్రముగా అయోధ్యాపురి చేరెను. ఆ పట్టణము చిన్న జండాలతోడను, పెద్ద జండాలతోడను రమ్యమై తూర్యనాదములతో ప్రతిధ్వనించుచుండెను. రాజమార్గములను జలముతో తడిపి పుష్పములు చల్లి పౌరు లందరును రాజప్రవేశము చూచుటకై ఆనందముతో ఎదురుచూచుచుండిరి. మంగళవాద్యములను మ్రోగించుచుండిరి. 7, 8

మూ. పౌరైః ప్రత్యుద్గతో దూరం ద్విజైశ్చ పురవాసిభిః,
పుత్రైరనుగతః శ్రీమాన్ శ్రీమద్భిశ్చ మహాయశాః, 9
ప్రవివేశ గృహం రాజా హిమవత్సదృశం పునః.

ప్ర. అ. పౌరైః=పౌరులచేతను, పురవాసిభిః = పురమునందు నివసించు చున్న, ద్విజైః చ=బ్రాహ్మణులచేతను, దూరమ్=దూరమునుండి, ప్రత్యుద్గతః= ఎదుర్కొనబడినవాడును, శ్రీమద్భిః=శోభాయుక్తులైన, పుత్రైః = పుత్రులచేత, అనుగతః = అనుసరింపబడినవాడును, శ్రీమాన్ = శోభాయుక్తుడును, మహాయశాః=గొప్ప యశస్సు కలవాడును అగు, రాజా=రాజు, పునః = మరల, హిమవత్సదృశమ్ = హిమవత్పర్వతముతో సమాన మైన, గృహమ్=గృహమును, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. శ్రీమంతుడును, మహాయశస్వియు అగు ఆ దశరథుని శ్రీమంతులగు పుత్రులు అనుసరించి వెళ్లిరి. పౌరులును, పురమునందలి బ్రాహ్మణులును దూరమునుండి ఎదురు వచ్చి స్వాగతము చెప్పిరి. ఈ విధముగ అయోధ్యానగరము ప్రవేశించి అతడు హిమవత్పర్వతముతో సమాన మైన గృహమును ప్రవేశించెను. 9

మూ. ననన్ద సజనో రాజా గృహే కామైః సుపూజితః, 10
కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ సుమధ్యమా,
వధూప్రతిగ్రహే యుక్తా యాశ్చాన్యా రాజయోషితః. 11

ప్ర. అ. రాజా=రాజు, గృహే=గృహమునందు, కామైః=భోగ్యవస్తువులచేత, సుపూజితః=బాగుగా పూజింపబడినవాడై, సజనః=కుటుంబబంధుజనులతో కూడినవాడై, ననన్ద=ఆనందించెను. కౌసల్యా చ=కౌసల్యయు, సుమిత్రా చ=సుమిత్రయు, సుమధ్యమా=మంచి నడుముగల, కైకేయీ చ=కైకేయియు, యాః=ఏ, అన్యాః=ఇతరులైన, రాజయోషితః = రాజస్త్రీలు గలరో వారును, వధూప్రతిగ్రహే = కోడండ్రను గ్రహించుటయందు, యుక్తాః = వ్యగ్రలై, (ననన్దుః=సంతసించిరి).

తా. బాంధవజనులతో కూడిన దశరథమహారాజు సకలభోగ్యవస్తువుల చేతను పూజితుడై ఆనందించెను. కౌసల్యా—సుమిత్రా—కైకేయులును, తదితర రాజస్త్రీలును క్రొత్త కోడండ్రను ప్రతిగ్రహించుటలో వ్యగ్రలై ఆనందించిరి. 10, 11

మూ. తతస్సీతాం మహాభాగామూర్మిళాం చ యశస్వినీమ్,
కుశధ్వజసుతే చోభే జగృహుర్నృపపత్నయః. 12

ప్ర. అ. తతః=పిమ్మట, నృపపత్న్యః=రాజభార్యలు, మహాభాగామ్=గొప్ప భాగ్యము గల, సీతామ్=సీతను, యశస్వినీమ్ = కీర్తి గల, ఊర్మిళాం చ=ఊర్మిళను, ఉభే = ఇద్దరు. కుశధ్వజసుతే = కుశధ్వజుని కుమార్తెలను, జగృహుః=గ్రహించిరి.

తా. అంత రాజభార్యలు మహాభాగ్యవతి యగు సీతను, కీర్తిమంతురా లగు ఊర్మిళను, మాండవీశ్రుతకీర్తులను గ్రహించిరి. 12

మూ. మఙ్గళాలమ్భనైశ్చాపి శోభితాః క్షౌమవాససః.
దేవతాయతనాన్యాశు సర్వాస్తాః ప్రత్యపూజయన్. 13

ప్ర. అ. తాః=ఆ, సర్వాః=అందరును, మఙ్గలాలమ్భనైశ్చాపి=మంగళకరము లైన శరీరమునకు పూసికొను ద్రవ్యములచేత, శోభితాః=ప్రకాశింపచేయబడినవారై, క్షౌమవాసనః = పట్టువస్త్రములు ధరించినవారై, ఆశు = శీఘ్రముగా, దేవతాయతనాని=దేవాలయములను, ప్రత్యపూజయన్=పూజించిరి.

తా. ఆ నూతనవధువు లందరును మంగళకరము లగు వస్తువులను అలదికొని, పట్టుబట్టలు ధరించి గృహదేవతలను పూజించిరి. 13

మూ. అభివాద్యాభివాద్యాంశ్చ సర్వా రాజసుతాస్తదా,
స్వం స్వం గృహమథాసాద్య కుబేరభవనోపమమ్, 14

గోభిర్ధనైశ్చ ధాన్యైశ్చ తర్పయిత్వా ద్విజోత్తమాన్,
రేమిరే ముదితాః సర్వా భర్తృభిః సహితా రహః. 15

ప్ర. అ. తదా = అప్పుడు, సర్వాః = సమస్త మైన, రాజసుతాః = రాజపుత్రికలు, అభివాద్యాన్ = నమస్కరింపదగిన వారిని, అభివాద్య = నమస్కరించి, అథ = పిదప, కుబేరభవనోపమమ్ = కుబేరభవనముతో సమాన మైన, స్వం స్వమ్ = తమ తమ, గృహమ్ = గృహమును, ఆసాద్య=పొంది, గోభిః=గోవులచేతను, ధనైశ్చ = ధనములచేతను, ధాన్యైశ్చ = ధాన్యములచేతను, ద్విజోత్తమాన్ = బ్రాహ్మణశ్రేష్ఠులను, అర్చయిత్వా = పూజించి, రహః =

రహస్యమునందు, భర్తృభిః = భర్తలతో, సహితాః = కూడినవారై, ముదితాః= ఆనందించినవారై, రేమిరే = క్రీడించిరి.

తా. అపుడు, ఆ రాజపుత్రికలు నమస్కరింపదగిన పెద్ద లందరికిని నమస్కరించి, కుబేర భవనముతో సమాన మైన తమ తమ గృహమును పొంది, గోవులను, ధనధాన్యములను దానము చేసి బ్రాహ్మణోత్తములను సంతృప్తిపరచి, రహస్యమున భర్తలతో కలిసి ఆనందముతో క్రీడించిరి. 14, 15

మూ. కుమారాశ్చ మహాత్మానో వీర్యేణాప్రతిమా భువి,
కృతదారాః కృతాస్త్రాశ్చ సధనాః ససుహృజ్జనాః, 16
శుశ్రూషమాణాః పితరం వర్తయన్తి నరర్షభాః.

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములును, వీర్యేణ = పరాక్రమముచేత, భువి = భూమియందు, అప్రతిమాః = సాటి లేనివారును, కృతదారాః=వివాహము చేసి కొన్నవారును, కృతాస్త్రాశ్చ=అస్త్రములందు నేర్పుగలవారును, సధనాః= ధనముతో కూడినవారును, ససుహృజ్జనాః = స్నేహితులతో కూడినవారును, నరర్షభాః = మనుష్యులలో శ్రేష్ఠులును అగు, కుమారాః = కుమారులు, పితరమ్= తండ్రిని, శుశ్రూషమాణాః = శుశ్రూషచేయుచు, వర్తయన్తి = అనుసరించు చుండిరి.

తా. మహాత్ములును, పరాక్రమముచే భూలోకమున సాటి లేనివారును, అస్త్రములందు సమర్థులును, ధనము, మిత్రులు మొదలగు వాటితో కూడినవారును, నరశ్రేష్ఠులును అగు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వివాహము చేసికొని, తండ్రికి శుశ్రూష చేయుచు అతని అజ్ఞను పాటించుచు ఉండిరి. 16

మూ. కస్య చిత్త్వథ కాలస్య రాజా దశరథః సుతమ్, 17
భరతం కైకయీపుత్రమబ్రవీద్రఘునన్దనః.

ప్ర. అ. అథ = పిమ్మట, కస్యచిత్ఃకాలస్య = కొంత కాలమునకు, రఘునన్దనః=రఘువంశీయులకు ఆనందకరు డైన, రాజా=రాజైన, దశరథః=

దశరథుడు, కైకయీపుత్రమ్ = కైకయీపుత్రు డైన, సుతమ్ = కుమారు డైన, భరతమ్=భరతుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. తరువాత కొంత కాలమునకు దశరథమహారాజు కైకయీపుత్రు డైన భరతునితో ఇట్లనెను. 17

మూ. అయం కేకయరాజస్య పుత్రో వసతి పుత్రక, 18
త్వాం నేతుమాగతో వీరో యుధాజిన్మాతుల స్తవ.

ప్ర. అ. పుత్రక = కుమారా! త్వామ్ = నిన్ను, నేతుమ్ = తీసికొని వెళ్లుటకు, ఆగతః = వచ్చినవాడును, కేకయరాజస్య = కేకయదేశరాజు యొక్క, పుత్రః = పుత్రుడును, వీరః = వీరుడును, తవ = నీయొక్క, మాతులః = మేనమామయు అగు, అయమ్ = ఈ, యుధాజిత్ = యుధాజిత్తు, వసతి = ఉన్నాడు.

తా. కుమారా! కేకయరాజు పుత్రుడును, నీ మేనమామయు అగు ఈ యుధాజిత్తు, నిన్ను తీసికొని వెళ్లుటకై వచ్చి యున్నాడు. 18

మూ. ప్రార్థిత స్తేన ధర్మజ్ఞ మిథిలాయామహం తథా, 19
ఋషిమధ్యే తు తస్య త్వం ప్రీతిం కర్తుమిహార్హసి.

ప్ర. అ. ధర్మజ్ఞ = ధర్మము నెరిగినవాడా! అహమ్ = నేను, తేన = అతనిచేత, మిథిలాయామ్ = మిథిలలో, ఋషిమధ్యే = ఋషుల మధ్యయందు, తథా = అట్లు, ప్రార్థితః = ప్రార్థింపబడితిని. త్వమ్ = నీవు, తస్య = అతనికి, ప్రీతిమ్ = ఆనందమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. ఓ ధర్మజ్ఞుడా! మిథిలలో, ఋషుల సమక్షమున అతడు నన్నా విధముగ ప్రార్థించినాడు. అతనికి ఆనందమును కలిగించుము. 19

మూ. శ్రుత్వా దశరథస్యైతద్భరతః కైకయీసుతః, 20
అభివాద్య గురుం రామం పరిష్వజ్య చ లక్ష్మణమ్,
గమనాయాభిచక్రామ శత్రుఘ్నసహిత స్తదా. 21

ప్ర. అ. కైకయీసుతః = కైకయీకుమారు డైన, భరతః = భరతుడు, దశరథస్య=దశరథుని యొక్క, ఏతత్ = ఈ వాక్యమును, శ్రుత్వా = విని, గురుమ్=తండ్రిని, రామమ్=రాముని, అభివాద్య=నమస్కరించి, లక్ష్మణమ్= లక్ష్మణుని, పరిష్వజ్య చ=కౌగలించుకొని, తదా=అప్పుడు, శత్రుఘ్నసహితః= శత్రుఘ్నసమేతుడై, గమనాయ=వెళ్లుటకు, ఉపచక్రామ=ఉపక్రమించెను.

తా. భరతుడు దశరథుని మాటలు విని, తండ్రికిని, రామునకును అభివాదనము చేసి, లక్ష్మణుని కౌగలించుకొని, శత్రుఘ్నసమేతుడై ప్రయాణ మాయెను. 20, 21

మూ. ఆపృచ్ఛ్య పితరం శూరో రామం చాక్లిష్టకారిణమ్,
మాతౄశ్చాపి నరశ్రేష్ఠః శత్రుఘ్నసహితో యయౌ. 22

ప్ర. అ. శూరః=శూరుడును, నరశ్రేష్ఠః = నరులలో శ్రేష్ఠుడును అగు భరతుడు, పితరమ్=తండ్రిది, అక్లిష్టకారిణమ్ = శ్రమపడకుండ పనులుచేయు, రామమ్=రాముని, మాతౄశ్చాపి = తల్లులను, ఆపృచ్ఛ్య=అడిగి, శత్రుఘ్న సహితః=శత్రుఘ్నసహితుడై, యయౌ=వెళ్లెను.

తా. శూరుడును, నరశ్రేష్ఠుడును అగు భరతుడు తండ్రివద్దను, అనాయాస ముగ పనులు చేయు రాముని వద్దను, తల్లులవద్దను సెలవు గైకొని, శత్రుఘ్న సహితుడై వెళ్లెను. 22

మూ. గతే తు భరతే రామో లక్ష్మణశ్చ మహాబలః,
పితరం దేవసఙ్కాశం పూజయామాస తు స్తదా. 23

ప్ర. అ. తదా=అప్పుడు, భరతే=భరతుడు, గతే=వెళ్లినవాడగుచుండగా, రామః=రాముడును, మహాబలః=గొప్ప బలము గల, లక్ష్మణశ్చ = లక్ష్మణు డును, దేవసఙ్కాశమ్=దేవతలతో సమాను డైన, పితరమ్=తండ్రిని, పూజ యామాసతుః=సేవించిరి.

తా. భరతుడు వెళ్లిన పిమ్మట, రాముడును మహాబలశాలి యగు లక్ష్మణు డును, దేవసమాను డైన తండ్రికి సేవ యొనర్చుచుండిరి. 23

మూ. పితురాజ్ఞాం పురస్కృత్య పౌరకార్యాణి సర్వశః,
చకార రామో ధర్మాత్మా ప్రియాణి చ హితాని చ. 24

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ము డైన, రామః=రాముడు, పితుః=తండ్రి యొక్క, ఆజ్ఞామ్=ఆజ్ఞను, పురస్కృత్య = పురస్కరించుకొని, ప్రియాణి = ప్రియ మైనవియు, హితాని చ = సుఖమును సంపాదించునవియు అగు, పౌర కార్యాణి=పౌరులకార్యములను, సర్వశః=అన్నియు, చకార=చేసెను.

తా. ధర్మాత్ము డైన రాముడు తండ్రి యాజ్ఞ ననుసరించి, పౌరులకు ప్రియములును, లాభకరములును అగు కార్యముల నన్నింటిని చేసెను. 24

మూ. మాతృభ్యో మాతృకార్యాణి కృత్వా పరమయన్త్రితః,
గురూణాం గురుకార్యాణి కాలే కాలేఽన్వవైక్షత. 25

ప్ర. అ. పరమయన్త్రితః=మిక్కిలి నియమబద్ధుడై, మాతృభ్యః=తల్లులకు, మాతృకార్యాణి=తల్లులకు చేయవలసిన కృత్యములను, కృత్వా = చేసి, గురూణామ్ = పూజ్యు లైన వారికి, గురుకార్యాణి = గురువులకు చేయవలసిన కార్యములను, కాలే కాలే=ఆయా కాలమునందు, అన్వవైక్షత = పరిశీలించుచుండెను.

తా. రాముడు నియమములను పూర్తిగ పాటించుచు, తల్లులకు చేయవలసిన కార్యములను చేయుచు, ఆయా కాలములందు పూజ్యులకు చేయవలసిన కార్యములను పర్యవేక్షించుచుండెను. 25

మూ. ఏవం దశరథః ప్రీతో బ్రాహ్మణా నైగమాస్తథా,
రామస్య శీలవృత్తేన సర్వే విషయవాసినః. 26

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, రామస్య = రామునియొక్క, శీలవృత్తేన=శీలము చేతను, నడపడిక చేతను, దశరథః = దశరథుడు, ప్రీతః= సంతసించెను. బ్రాహ్మణాః=బ్రాహ్మణులును, తథా=మరియు, నైగమాః = నగర వాసులును, సర్వే=సమస్త మైన, విషయవాసినః=దేశమునందు నివసించువారును (సంతసించిరి).

తా. రాముని ఈ శీలమును, నడవడికను చూచి దశరథుడు చాల సంత సించెను. బ్రాహ్మణులును, నాగరికులును, రాజ్యములో అందరును సంత సించిరి. 26

మూ. తేషామతియశా లోకే రామః సత్యపరాక్రమః,
స్వయమ్భూరివ భూతానాం బభూవ గుణవత్తరః. 27

ప్ర. అ. లోకే=లోకమునందు, అతియశాః=గొప్ప కీర్తి కలవాడును, సత్యపరాక్రమః=సత్యమైన పరాక్రమము కలవాడును, గుణవత్తరః=అధికముగ గుణవంతుడును అగు, రామః=రాముడు, తేషామ్ = ఆ దేశవాసులకు, భూతా నామ్=ప్రాణులకు, స్వయమ్భూః ఇవ=బ్రహ్మ వలె, బభూవ=ఆయెను.

తా. లోకమునందు గొప్ప కీర్తి గలవాడును, సత్యమైన పరాక్రమము కలవాడును, ఎక్కువ గుణములు కలవాడును అగు రాముడు రాజ్యములోని వారి కందరికిని ప్రాణులకు బ్రహ్మదేవు డెట్లో అట్లుండెను. 27

మూ. రామస్తు సీతయా సార్ధం విజహార బహూనృతూన్,
మనస్వీ తద్గతస్తస్యా నిత్యం హృది సమర్పితః. 28

ప్ర. అ. మనస్వీ=మంచిమనస్సు గల, రామస్తు=రాముడైతే, తద్గతః= ఆసీతనే పొందినవాడై, తస్యాః=ఆమెయొక్క, హృది = హృదయమునందు, నిత్యమ్ = ఎల్లప్పుడును, సమర్పితః = ఉంచబడినవాడై, సీతయా సార్ధమ్ = సీతతో కూడ, బహూన్ = అనేకమైన, ఋతూన్ = ఋతువులను, విజహార = విహరించెను.

తా. ఉత్తమమైన, మనస్సు గల రాముడు సీతయందే మనస్సు నిలిపెను. ఆమె తన హృదయమునందు రామునే సర్వదా నిలుపుకొనెను. ఈ విధముగ అన్యోన్యాసక్తులై సీతారాములు అనేక ఋతువులపాటు (చాలకాలము) విహరించిరి. 28

మూ. ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి,
గుణాద్రూపగుణాచ్చాపి ప్రీతిర్భూయోఽభ్యవర్ధత. 29

కన్యయా = ఉత్తము డైన జనకమహారాజుయొక్క కన్య యైన సీతతో, సమేయివాన్= కలిసినవాడై, శ్రియా=లక్ష్మితో కూడిన, అమరేశ్వరః = దేవతా ప్రభువైన, విభుః=సమర్థు డైన, విష్ణుః ఇవ=విష్ణువు వలె, ముదా=ఆనందముతో, అన్వితః=కూడినవాడై, శుశుభే=ప్రకాశించెను.

తా. దశరథమహారాజపుత్రు డైన రాముడు జనకమహారాజపుత్రియు, మనోహరురాలును అగు సీతతో కలిసినవాడై, ఆనందించుచు, లక్ష్మితో గూడిన, అమరాధీశ్వరు డైన మహావిష్ణువు వలె ప్రకాశించెను. 32

పుల్లెల శ్రీ రామచంద్రుడు రచించిన

"బాలానన్దిని"యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు బాలకాండములో డెబ్బదియేడవ సర్గ సమాప్తము.

యత్కృపాలేశసంసర్గాద్వ్యాఖ్యేయం రచితా మయా,
తస్యైవ జానకీజానేః పదయోరియమర్ప్యతే.

దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చాచార్యసత్కృపా,
కర్త్రాస్మద్గ్రన్థజాతస్య కారణం కేవలం వయమ్.

శ్రీః శ్రీః శ్రీః

శ్రీః

అనుబంధము

కొన్ని శ్లోకాలకు వ్యాఖ్యావిశేషాలు

1

కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా,
అర్ధాదర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః.
కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థకారణాత్,
ప్రదదౌ చావశిష్టార్ధం పాయస స్యామృతోపమం,
అనుచింత్య సుమిత్రాయై పునరేవ మహీపతిః,
ఏవం తాసాం దదౌ రాజా భార్యాణాం పాయసం పృథక్.
బాల. 16 స. 27-29

పాయసవిభాగమునుగూర్చి చెప్పు పై శ్లోకాల భావమును వ్యాఖ్యాతలు వివిధరీతుల తెలిపియున్నారు.

1. మహేశ్వరతీర్థ గోవిందరాజుల వ్యాఖ్యప్రకారము— దశరథుడు పాయసములో సగము కౌసల్యకును, నాల్గవపాలు సుమిత్రకును, ఎనిమిదవపాలు కైకేయికిని, మఱల మిగిలిన యెనిమిదవ పాలు సుమిత్రకును ఇచ్చెను. ఈ వ్యాఖ్య శ్లోకాక్షరానుగుణముగా ఉన్నది.

2. మునిభావ ప్రకాశికాకారుల వ్యాఖ్య మాత్రము మఱియొక విధముగా ఉన్నది. తదా = అప్పుడు, పుత్రార్థకారణాత్ = పుత్ర ప్రయోజనము నిమిత్తము, నరపతిః = దశరథమహారాజు, కౌసల్యాయై = కౌసల్యకొరకు, పాయసార్ధమ్ = పాయసము యొక్క సగమును, దదౌ = ఇచ్చెను. నరాధిపః = రాజు, సుమిత్రాయై చాపి=సుమిత్రకొఱకును, శేషస్య (అధ్యాహారము)=కౌసల్య కివ్వగా మిగిలిన సగముయొక్క అర్ధాత్ = సగము నుండి, అనగా నాల్గవభాగము నుండి, అర్ధమ్ = సగమును, (ఎనిమిదవ భాగమును), దదౌ = ఇచ్చెను. కైకేయ్యై చ =

కైకేయికొరకును, అవశిష్టార్ధమ్ = కౌసల్యకీయగా మిగలిన సగములో సుమిత్ర కిచ్చుటకు రెండు భాగములు చేసిన సగము పోగా సగమును, అనగా నాల్గవ భాగమును, దదౌ = ఇచ్చెను. మహీపతిః = దశరథుడు, అనుచిన్త్య = ఆలోచించి, పునరేవ = మరల, సుమిత్రాయై = సుమిత్రకు, అమృతోపమమ్ = అమృతముతో సమానమైన, పాయసస్య = పాయసముయొక్క, అవశిష్టార్ధం చ = పూర్వము సుమిత్ర కిచ్చుటకై రెండు భాగములు చేసిన నాల్గవ భాగములో అపుడు సుమిత్ర కివ్వగా మిగిలిన సగమును, అనగా రెండవ ఎనిమిదవ భాగమును) ప్రదదౌ = ఇచ్చెను. మిగిలినది పూర్వము వలెనే.

ఈ అర్థము ప్రకారము— కౌసల్యకు సగము, సుమిత్రకు సగములోని సగములో సగము, అనగా ఎనిమిదవ భాగమును, సుమిత్రకై విభజించిన నాల్గవ పాలుగాక మిగిలిన నాల్గవపాలును కైకేయికిని ఇచ్చెను. పూర్వమొక నాల్గవ పాలు విభజించి అందు సగము సుమిత్ర కియ్యగా మిగిలిన సగమును (రెండవదగు ఎనిమిదవ భాగమును) మరల సుమిత్రకే ఇచ్చెను. అనగా కౌసల్యకు పాయసములోని సగము, కైకేయికి నాల్గవపాలు, సుమిత్రకు రెండు ఎనిమిదవ పాళ్లు లభించెను.

3. పురాణాంతరములతో విరోధము లేకుండుటకై మరొక అర్థము కూడ చెప్పబడినది— కౌసల్యకు నాల్గవపాలును, సుమిత్రకు నాల్గవపాలును, కైకేయికి నాల్గవపాలును, మిగిలిన నాల్గవపాలు మరల సుమిత్రకును ఇచ్చెను.

దశరథుడు పాయసమును రెండు సమభాగములుగ చేసి కౌసల్యా కైకేయిల కీయగా వారు తమ తమ భాగములనుండి సగమును సుమిత్ర కిచ్చినట్లు అధ్యాత్మరామాయణములో ఉన్నది. దీనిని పట్టియే పై మూడవ వ్యాఖ్యానము చేయబడినది. అయితే దశరథుడే సుమిత్ర కిచ్చినట్లు ఈ రామాయణములో ఉండగా కౌసల్యా కైకేయు లిచ్చినట్లు అధ్యాత్మరామాయణములో ఉన్నది గాన గ్రంథవిరోధము ఉండనే ఉన్నది.

దశరథుడు వసిష్ఠఋశ్యశృంగుల ఆజ్ఞ ప్రకారము పాయసమును కౌసల్యా కైకేయీల కిచ్చినట్లు అధ్యాత్మ రామాయణములో ఉన్నది. తమ భర్త అభిప్రాయమునకు విరుద్ధముగా వారు (తాము మాత్రమే భుజింపక) సుమిత్రకు కూడ ఎట్లు

ఇచ్చినారు అని ప్రశ్న. దీనికి సమాధానముగా— ఆ మునులు త్రికాలద్రష్టలుగాన సుమిత్రాగర్భమున లక్ష్మణశత్రుఘ్ను లుదయించవలసియున్నదని తెలిసి ఆమెకు కూడ పాయస మీయవలెనని దశరథునకు చెప్పియే ఉందురు. ఆ విషయ మెరిగినవా రగుటచే కౌసల్యా కైకేయులు సుమిత్రకు కూడ ఇచ్చినారని మన మూహించుకొనవలెనని ఒక వ్యాఖ్యాత.

మరొక వ్యాఖ్య :— దశరథుడు మొదట కౌసల్యకు పాయసములో సగము తీసి ఇచ్చెను. మరల ఆ ఇచ్చిన పాయసమునే రెండు భాగములు చేసి ఒక భాగము సుమిత్ర కిచ్చి, రెండవ భాగము కౌసల్య కిచ్చెను. అనగా కౌసల్యా సుమిత్రలకు రెండు నాల్గవభాగములు ముట్టినవి. మిగిలిన సగమును కైకేయి కిచ్చెను. సుమిత్ర కిద్దరు కుమారులు పుట్ట దగియుండుట నెరిగిన మునుల ప్రేరణచే మరల ఆ సగమును రెండు భాగములు చేసి ఒక భాగము మాత్రమే కైకేయి కిచ్చి మిగిలినది సుమిత్ర కిచ్చెను. అనగా కైకేయితోబాటు మరల సుమిత్రకు మరొక నాల్గవ భాగము లభించెను.

ఈ శ్లోకాల కీ అర్థము లెట్లు వచ్చునో ఆ వ్యాఖ్యాతలకే తెలియవలెను. శ్రీమద్రామాయణము ఆది కావ్యము. వైదికవాఙ్మయము తప్ప ఇతర వాఙ్మయ మంతయు దీని తరవాతనే వచ్చినది. వాటిలో చెప్పిన విషయాలతో విరోధము వచ్చునని రామాయణ శ్లోకాలకు ఇలాంటి అర్థాలు కల్పించుట ఎంతవరకు సమంజసమో సహృదయులే ప్రమాణము. ఈ చివరి వ్యాఖ్యానము ప్రకారము పాయసము నాలుగుపాళ్లకును నలుగురు పుత్రులు పుట్టిరి అని చెప్పినట్లయినది. అనగా విష్ణువు అంశ నలుగురిలోను సమమైన పాళ్లలోనే ఉన్నదని చెప్పవలసి ఉన్నది. ఇలా చెప్పిన పక్షాను—

"కౌసల్యాజనయద్రామం సర్వలక్షణసంయుతమ్
విష్ణోరర్ధం మహాభాగం పుత్రమైక్ష్వాకవర్ధనమ్,
భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః,
సాక్షాద్విష్ణోశ్చతుర్భాగః సర్వైః సముదితో గుణైః,
అథ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాజనయత్సుతౌ
వీరౌ సర్వాస్త్రకుశలౌ విష్ణోరర్ధసమన్వితౌ."

అని అష్టాదశసర్గలో చెప్పనున్నదానితో విరోధము వచ్చును. "కౌసల్యాయై నరపతిః" ఇత్యాది (27-29) శ్లోకాల స్పష్టార్థానికి కూడా దీనితో విరోధము వచ్చుచున్నది. దానిని పట్టి రాముడు విష్ణువు యొక్క అర్ధభాగము, లక్ష్మణుడు చతుర్థభాగము, భరతుడు అష్టమభాగము, శత్రుఘ్నుడు కూడ అష్టమభాగము కావలెను. ఈ శ్లోకాలలో రాముడు అర్ధభాగమనీ, భరతుడు చతుర్థాంశమనీ, లక్ష్మణశత్రుఘ్నులు అర్ధరూపులనీ చెప్పబడినది. అందుచేత మహేశ్వరతీర్థ గోవిందరాజులు "విష్ణోః చతుర్భాగః" అను దానిని విష్ణువుయొక్క ఎనిమిదవ భాగమనీ, "విష్ణోః అర్ధసమన్వితాః" అనుదానికి విష్ణువుయొక్క అంశతో కూడినవారనీ అర్థం చెప్పినారు. 'చతుర్భాగః' అనుదానికి అష్టమభాగమనే అర్థము ఎట్లు లభించినదో తెలియదు.

విష్ణ్వంశ పాయసాంశాలని పట్టి ఉండునని ఎచటను చెప్పలేదు గాన ఈ శ్లోకాలకును పాయసవిభాగశ్లోకాలకును విరోధము లేదని ఒక సమాధానము.

పాయసవిభాగశ్లోకాలలో ఉన్న 'అర్ధ' శబ్దానికి సగము అనే అర్థము గ్రహించక అంశము, భాగము అను అర్థమును మాత్రమే (అంతటను) గ్రహించినచో ఈ ప్రయాస ఏదియు ఉండదని నా అభిప్రాయము.

మన ప్రాంతంలో ఉన్న రామాయణం దాక్షిణాత్యపాఠము. దీనికి ఉత్తర దేశపాఠము మరొక్కటి ఉన్నది. దీనిలో కూడా కొంచెము భేదాలతో ఈశాన్య ప్రాంత పాఠమనియు, వాయవ్య ప్రాంతపాఠమనియు రెండు పాఠములున్నవి. ఈశాన్యప్రాంతపాఠానికి ప్రాచ్యపాఠమని కూడ పేరు. దీనిని 1843-67 సంవత్సరాలలో, గార్రెసియో అను ఇటలీ దేశ పండితుడు పదకొండు సంపుటాలలో ప్రచురించెను. ఈతడు ఇటలీలోని టూరిన్ విశ్వవిద్యాలయంలో సంస్కృత ప్రొఫెసర్‌గా ఉండెను. వీటిలో ఏడు సంపుటాలు మూలము నాలుగు సంపుటాలు ఇటాలియన్ భాషలోనికి అనువాదము. ఈ సంపుటాలను 1981లో మరల మద్రాసు నుండి ప్రచురించుట జరిగినది. దానిలో ఈ ఘట్టాలలో ఉన్న పాఠాలు చూచినచో ఈ వ్యాఖ్యాభేదాలన్నియు అనావశ్యములని తోచక మానదు. అయితే మా పాఠమే సరియైన పాఠము అనే వాదం ఉండనే ఉంటుంది. అచటి శ్లోకములు ఈ విధముగా ఉన్నవి.

"పుత్రీయం పాయసం దేవి ప్రాశేదం హితమాత్మనః
ఇత్యుక్త్వా ప్రదదౌ తస్యై హవిషోఽర్ధం నరాధిపః,
స్వయమేవ సమం కృత్వా భాగం భాగచతుష్టయమ్
అర్ధాదర్ధం దదౌ చాపి కైకేయ్యై స నరాధిపః.
చతుర్భాగం ద్విధా కృత్వా సుమిత్రాయై దదౌ తదా
ప్రదదౌ చావశిష్టం తత్ పాయసం దేవనిర్మితమ్
అనుచిన్త్య సుమిత్రాయై పునరేవ నరాధిపః.
(ఆదికాండ 15వ సర్గ 21-23 శ్లోకాలు)

పుత్రుల నిచ్చు ఈ పాయసమును భక్షింపుమని చెప్పి ఆతడు సమముగా సగము అగునట్లుగను, మొత్తము నాలుగుభాగములు అగునట్లుగను స్వయముగనే విభజించి కౌసల్యకు సగము భాగమును ఇచ్చెను (అనగా కౌసల్యకు సగము పాయసము లభించినది). సగములో సగము కైకేయి కిచ్చెను (ఆమెకు నాల్గవవంతు లభించినది). మిగిలిన నాల్గవవంతును రెండు భాగములు చేసి ఒక భాగము సుమిత్ర కిచ్చెను. మరల ఆలోచించి రెండవభాగము కూడ సుమిత్రకే ఇచ్చెను (ఆమెకు రెండు ఎనిమిదవ భాగములు లభించినవి).

రామాదుల ఉత్పత్తిని వర్ణించు ఘట్టములో కూడ పాఠము వేరుగా నున్నది. అది పాయసభాగాలకు అనుగుణముగా ఉన్నది.

జన్మతేజోగుణజ్యేష్ఠం పుత్రమప్రతిమౌజసమ్,
కౌసల్యాజనయద్రామం విష్ణుతుల్యపరాక్రమమ్,
కౌసల్యా శుశుభే తేన పుత్రేణామితతేజసా
యథాధిపేన దేవానామదితి ర్వజ్రపాణినా
భవాయ స హి లోకానాం రావణస్య వధాయ చ.
విష్ణోర్వీర్యార్ధతో జజ్ఞే రామో రాజీవలోచనః
తేజోవీర్యాధికః శూరః శ్రీమాన్ గుణగణాకరః
బభూవానవరశ్చైవ శక్రాద్విష్ణోశ్చ పౌరుషే.
తథాలక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాజనయత్సుతౌ

దృఢభక్తిమహోత్సాహౌ రామస్యాపరజౌ గుణైః
తావప్యాస్తాం చతుర్భాగౌ విష్ణోః సంపిణ్డితావుభౌ
ఏకఏకచతుర్భాగాదపరస్మాదజాయత
భరతో నామ కైకేయ్యాః పుత్రః సత్యపరాక్రమః.
(ఆదికాండము. 15వ సర్గ. శ్లో. 10-16)

ఇచట రాముడు అర్ధభాగమనియు, లక్ష్మణశత్రుఘ్నులిరువురును కలిసి ఒక చతుర్థభాగమనియు, భరతుడు మరొకచతుర్థభాగమనియు స్పష్టముగా చెప్పబడినది. ఇది పాయస భాగాలకు కూడ అనుగుణముగా ఉన్నది.

2

కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే,
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్.
బా. కా. 23 స॥ 2 శ్లో॥

విశేషార్థములు :— మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు రామలక్ష్మణులను మేలు కొలుప వచ్చి రాముని అచింత్యాద్భుతరూపము చూడగనే ఆశ్చర్యపడి, తాను వచ్చిన పని మరచి "నిన్ను గన్న తల్లి ఎంత ధన్యాత్మురాలో కదా" అని చెప్పుచున్నాడు. రామ = సర్వోత్తమసౌందర్యవంతుడగు ఓ రామా ! కౌసల్యా = సర్వేశ్వరుడవైన నిన్ను గన్న కౌసల్య, సుప్రజాః = నీవు కొడుకుగా పుట్టుట వలన మంచి కొడుకుగలది. లేదా మాతృశుశ్రూష చక్కగా చేయు నీచేత కౌసల్య సత్పుత్రవతి అయినది.

లేదా రాముని అమేయ స్వరూపమును చూచి విశ్వామిత్రుడు మనస్సులో ఈ విధముగ వితర్కించుకొనుచున్నాడు. కౌసల్యా = ఇట్టి రాముని కన్న కౌసల్యాదేవి, సుప్రజాః=మంచి సంతానము కలది. (ఈ అర్థమున "రామ" అనునది తరువాతి వాక్యమున అన్వయించును). రాముడు కుమారుడుగా పుట్టుటచే మంచి కుమారుడు కలిగి యుండుట కౌసల్యకు దశరథునకును సమానమే అయినను "పితుః శతగుణం మాతా (తండ్రి కంటె తల్లి నూరింతలు)" అని స్మృతిలో

చెప్పుటచే కౌసల్యాదేవి మాత్రము మంచి కొడుకుగలది అని ఇక్కడ వర్ణింప బడినది.

కౌసల్యాదశరథులకు చాల అంతరమున్నది. విశ్వామిత్రుడు "అహం వేద్మి మహాత్మానమ్" ఇత్యాదివిధముల ఎంతగా చెప్పినను దశరథుడు రాముని విశ్వామిత్రున కిచ్చుటకు సంశయించెను. కౌసల్య స్త్రీయైనను, దశరథుని కన్న రెండింతలు పుత్రవాత్సల్యము కలదైనను ఎంత మాత్రమును సందేహించలేదు. అందుచే కౌసల్య పేరు చెప్పబడినది. రామ = రాముడా, పూర్వా సన్ధ్యా ప్రవర్తతే = తూర్పు దిక్కునందు కలుగు సంధ్య ప్రవర్తించుచున్నది. నీవు కౌసల్యకు చేసినట్లు ఈ సంధ్యకు కూడ ఉపచారము చేయవలెను. లేదా—ఇంక సూర్యు డుదయింపనున్నాడు. సూర్యునకువలె నీకును ఇంక శత్రువులను చంప సమయము వచ్చినది. లేదా—పూర్వా సన్ధ్యా ప్రవర్తతే = అంధకారము పోయినది. తెల్లవార వచ్చినది. నా అజ్ఞానము నశించినది. భగవంతుడవైన నీ దర్శనము కలిగినది. ఉత్తిష్ఠ = లెమ్ము, నీ నిద్రాకాలలక్ష్మిని (నీవు నిద్రించు సమయమున ఉండు లక్ష్మిని) చూచితిని. ఇక ప్రబోధలక్ష్మిని చూడగోరుచున్నాను. నర శార్దూల = పురుషశ్రేష్ఠుడా! నరశ్రేష్ఠుడవు కావున "యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదే వేతరో జనః" అన్నట్లు నీవును సంధ్యను ఉపాసింపవలసినదే కదా? లేదా—నీవు ఆశ్రితులను రక్షింపవలెను. దుష్టులను శిక్షింపవలెను. నీకు నిద్రించుట కవకాశ మెక్కడిది?

దైవమ్ ఆహ్నిక- కర్తవ్యమ్— దైవమ్ = దేవునిచే, అనగా సర్వేశ్వరునిచే ఏర్పరుపబడిన, ఆహ్నికమ్ = నిత్యకర్మము, కర్తవ్యమ్ = చేయదగినది. లేదా— ఇచట 'దేవ' 'శబ్దమునకు 'నీవు' అని అర్థము. దైవమ్ = నీచే ఏర్పరుపబడిన, ఆహ్నికం కర్తవ్యమ్=నీ వేర్పరచిన నియమమును నీవే అనుష్ఠింపక పోరాదు కదా అని భావము.

లేదా నేను నీచే ఆజ్ఞాపింపబడిన భగవత్పూజనరూపమైన నిత్యకర్మము చేయవలెను కదా. దానిని ప్రతిగ్రహించుటకు లెమ్ము అని భావము. ఇట్లు ఇంకను అనేకార్థములు బుద్ధిమంతు లూహించు కొనవలెను అని గోవిందరాజులు.

"కౌసల్యా సుప్రజాః" అను పదమునకు "కౌసల్యయొక్క సుపుత్రుడా!" అని అర్థము చెప్పి సంబోధన ప్రథమా విభక్తిగా గ్రహించుటకు వీలులేదు.

అపుడు అది "కౌసల్యా సుప్రజాః" అని కావలెను. అందుచేత "కౌసల్యా = కౌసల్య, సుప్రజాః = మంచి సంతానము కలది" ఇత్యాది విధముల అర్థములు కల్పించవలసి వచ్చినది. వాస్తవమున దీనిని ఆర్షప్రయోగముగ గ్రహించి సంబోధన ప్రథమా విభక్తిగా అంగీకరించవచ్చును. పాణినీయవిరుద్ధములైన ఎన్నో ప్రయోగాలు వాల్మీకిరామాయణంలో ఉన్నవి. ప్రాచ్యపాఠంలో ఈ శ్లోకము పూర్తిగా భిన్నముగా ఉన్నది.

"కౌసల్యామాతరుత్తిష్ఠ పూర్వాసంధ్యా ఉపాస్యతామ్,
పౌర్వాహ్ణికం విధిం కర్తుం తాత కాలోఽయమాగతః"
(అ. కాం. 26. 2)

3

ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ,
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా.
(బా. కాం. 73. 26)

విశేషార్థములు :— 1. ఇయమ్ = ఇదిగో. నీవు పరాక్రమముచేత శివ ధనస్సు విరచి జయించుకొన్న సీత ఇదిగో. ఈమె రూపసౌందర్యలావణ్యము చూడుము. సీతా = సీత అనగా నాగటి చాలు, అందుబుట్టినదగుటచే సీత అను పేరు గలది. ఈమె అనుపమ సౌందర్యాదులు కలది మాత్రమే కాదు. నాగటి చాలునందు పుట్టినది. అయోనిజ. అందుచే ఈమెయందు సమస్తసద్గుణములును ఒప్పి ఉండును.

ఇయం సీతా :— "జనకునివద్ద శివధనస్సు ఉన్నది. దానిని వంచిన వానికి అతడు తన కుమార్తె యైన సీత నిచ్చి పెండ్లి చేయును" అని నీవు సిద్ధాశ్రమములో విన్న నాటినుండియు ఏ సీతను చూడవలెనని కూతూహలము చెంది ఉన్నావో "ఆ సీత ఇదిగో" చూడుము.

లేదా—సీత మెరుపు వంటిది గాన సీతను చూడగానే, మెరుపును చూచినట్లు రాముని కేమియు కనబడలేదు. ఈ విధముగ సీతాశరీరకాంతిని చూడగనే

కండ్లు మిరుమిట్లు గొలిపి సీతాశరీరమును చూడజాలకున్న రాముని జూచి జనకుడు "ఇయం సీతా" "ఇదిగో సీత" అని చెప్పుచున్నాడు.

లేదా—సిద్ధాశ్రమములో సీతను గూర్చి విన్నది మొదలు రాముని మనస్సులో సీతా దర్శన కుతూహలము తీవ్రముగ ఉండుటచే ప్రాసాదే సా పథి పథి చ సా పృష్ఠతః సా పురః సా" (మేడపైనను ఆమెయే, ప్రతిమార్గమునందును ఆమెయే వెనుకను ఆమెయే. ముందును ఆమెయే) అని చెప్పినట్లు, విరహిజనులకు భావనావిశేషముచే, అంతటను, ప్రియజనము కనబడుచుండును గాన, అతడు ప్రపంచమంతయు సీతామయముగనే చూచుచుండెను. అందుచే తా నీయబోవు సీత సరిగా తెలియుటకై జనకుడు "ఇయం సీతా" అని చెప్పుచున్నాడు.

మమ సుతా=నా కూతురు ఈమె సౌందర్యవతియైనను, అయోనిజయైనను, దుష్టకులనివాసముచే దూషితయను సందేహము వలదు. కర్మఠులమని ప్రసిద్ధి కెక్కిన మాచే పోషింపబడినది కావున జన్మశుద్ధి మాత్రమే కాక కులశుద్ధి కూడ కలిగియున్నది.

లేదా—నా కూతురు, నీ వెట్లు దశరథునకు ప్రియకుమారుడవో అట్లే ఈమెయు నాకు ప్రియపుత్రి. కావున ఈమెయందు స్థిరమైన ప్రేమను ఉంచవలెను. సహధర్మచరీ తవ=నీకు ధర్మపత్ని కాగలదు. ఈమె భోగమునకు మాత్రమే అని తలపకుము, ఈమెతో నీవు ధర్మము లాచరించుచు ఈమెనే ధర్మపత్నిగా చేసికొనుము. అయోనిజత్వమను జన్మశుద్ధి గల మరొక కన్య లభింపదు. దానితో కులశుద్ధి కూడ ఉన్నది దొరకదని వేరుగా చెప్పనవసరము లేదు. కావున ఈమెను తప్ప మరెవ్వరిని ధర్మపత్నిగా చేసికొనుట యుక్తము కాదు.

లేదా—తవ సహధర్మచరీ— నీకు సరియైన ధర్మ మాచరించునది. అనగా నీవు ఎట్లు, ఏ ధర్మము నాచరింతువో ఈమెయును అట్లే ఆధర్మమును ఆచరించునది. లోకములో ఒకరు మరియొకరివలె ఉండరు. ఈమె అట్లు కాదు. లోక విలక్షణముగా సర్వథా నీవలెనే ప్రవర్తించును గాన నీకే ఈమె తగినది. ఈమె తప్ప మరి ఏ వనితయు నీకు పత్ని యగుటకు తగదు.

ఏనాం ప్రతీచ్ఛ చ = ఈ సీతను ప్రతిగ్రహింపుము. 'చ' కారముచే ధర్మ పత్నిగా చేసికొనుము అని అర్థము. ఈమె ఇట్టి లక్షణముకలది గాన, "నేను నా పరాక్రమముచే జయించుకొంటిని" అను సాధారణబుద్ధి యుంచక నేను చెప్పి నట్లు ఈమెనే ధర్మపత్నిగా వరింపుము.

తే భద్రమ్ = నీకు మంగళమగు గాక. ఇట్టి శుభలక్షణములు కలదానిని పెండ్లాడుటవలన నీకు సమస్త మంగళములును ఘటిల్లును. లేదా—దృష్టి దోషము కలుగకుండు గాక.

పాణినా పాణిం గృహ్ణీష్వ = నీ హస్తముచే ఈమె హస్తమును పట్టు కొనుము. ప్రణయకోపము కలిగిన సందర్భములలో నీ హస్తముతో ఈమె పాదము పట్టుకొనుటయు ఘటిల్లవచ్చును. ఇప్పుడు మాత్రము హస్తమునే పట్టు కొనుము.

లేదా—సిద్ధాశ్రమములో సీతను గూర్చి వినిన నాటి నుండియు రామునకు సీతపై అనురాగము కలిగి యుండుటచేత భావనాబలముచే సీతకు ప్రణయ కోపము కలిగినట్లు తోచి ఆమె పాదమునే పట్టుకొనుట సంభవించునని తలచి "పాణిం గృహ్ణీష్వ పాణినా" అని చెప్పుచున్నాడు.

2. ఎవ్వరును కదల్పజాలని శివధనస్సును రాముడు అనాయాసముగ విరచుటవలనను ఆతని అప్రమేయమగు రూపమువలనను, ఆ కాలమునందు కలిగిన సంవిధానవైచిత్ర్యము వలనను జనకుడు బ్రహ్మనిష్ఠుడగుట వలనను రాముడు విష్ణుదేవుడనియు, సీత మహాలక్ష్మియనియు తెలిసికొని, ఈ దేవ రహస్యము ఇతరులకు తెలియకుండుటకై, ధ్వనివృత్తిచే సీతారాముల అనాది సంబంధమును సూచించుచున్నాడు— ఇయమ్ = ఇదిగో! జగత్సృష్ట్యాది కారణ భూతుడవును, సాక్షాద్విష్ణుదేవుడవును అగు నీవు రామ రూపమున అవత రించినట్లే లక్ష్మియు సీతా రూపమున అవతరించి ఉన్నది. చూడుము. మీ దాంపత్యము నిత్యమే యైనను మనుష్య ధర్మము ననుసరించి సీతను శీఘ్రముగ పెండియాడుము.

సీతా = నాగటి చాలున పుట్టుటచే అయోనిజ, నీవు దేవకార్యార్థమై కౌసల్యా గర్భమున పుట్టినావు. అట్లు పుట్టుకయే లేనిదై నిన్ను అనుసరించుటకై కేవలము

మనుష్యత్వము మాత్ర మవలంబించి, నిన్నే వరించుచు తనకు నీతో నిత్య దాంపత్య మున్నట్లు సూచించుచున్నది.

మమ సుతా— నా కూతురు నా యింటిలో పెరుగుటచే నేను కూతురుగా భావించి నీకిచ్చుచున్నాను.

తవ సహధర్మచరీ— నీకు ధర్మపత్ని. నీవలెనే ధర్మముల నాచరించునది. నీవలెనే ఉండునది. నీ కవినాభూతయై జగత్సృష్ట్యాదులందు నీకు సహకరించుచుండునది.

ఏనాం ప్రతీచ్ఛ చ- ఈమెను అంగీకరింపుము. నిత్యపత్నిగా యున్నదైనను ఇపుడు మనుష్యత్వమును అభినయించుటకై అంగీకరింపుము.

తే భద్రమ్ :— నీకు మంగళమగు గాక. నీ వెంత మనుష్యుడవై యున్నను, జగదీశ్వరుడ వగు నీకు నిత్యసిద్ధయగు ఈమె నిచ్చెదను అని చెప్పుటకు నేను సాహసించినందులకు మన్నింపవలెను.

పాణినా పాణిం గృహ్ణీష్వ :— నీ వెల్లప్పుడును వక్షస్థలముపై ధరించినవాడవు. ఇపుడు మనుష్య ధర్మము ననుసరించుటకై హస్తమును పట్టుకొనుము. లేదా— నీ విదివర కెన్నిమారులో ప్రణయకోపకాలమునందు హస్తముచే ఈమె పాదము పట్టుకొని యుందువు. ఇప్పుడు చిరవియోగము కలిగినది గాన విరహిజన సాధారణమైన ఉత్కంఠచే, ఈమెను అనునయించుటకై పాదములు పట్టెదవేమో. అట్లు చేయకుము. వివాహమునందు మేము చేయునట్లు, ఇప్పుడు మాత్రము, చేయి పట్టుకొనుము.

3. ఇయమ్ = ఈ "ఈమె వీర్యశుల్క. పరాక్రమము చూపి క్రయము చేతవలె కొనబడినది. శివధనువును విరచినందున నాచే జయింపబడినది." అని అలతిగా తలపకుము. మెరుపువలె మెరయుచున్నది. "ఇదిగో." చూడుము. నీకును గౌరవింప దగినది. నీవెంతగా గౌరవించినను దానికి తగినది.

సీతా :— నాగటి చాలున పుట్టినది. నీవు మొదలు సమస్త జంతుజాలమును భరించుచున్న సాక్షాద్భూదేవికి కూతురు. కావున నీవిప్పుడవశ్యము ఈవిడ

యందు బహుమానముంచవలెను. భార్యగా నున్నపుడు విశేషము అభిమానముంచ వలెనని చెప్పనవసరమే లేదు. మరియు, సీతా = ఈమె అయోనిజ. నీవు కౌసల్యకు పుట్టినావు. అందుచే ఈమెకును నీకును చాల అంతరమున్నది. అందు చేత కూడ నీవు ఈమె విషయమున చాల గౌరవబుద్ధి ఉంచవలెను.

మమ సుతా = నా కూతురు. రాజరాజునైన నేను పెంచినది. కావున నాయందుండు గౌరవమును నీవు ఈమెయందు చూపవలెను.

మమ సుతా=నా కూతురు. నేను బ్రహ్మనిష్ఠుడను. చాల తపస్విని. ఈమెను గౌరవించకున్నచో నాకు కోపము కలుగును. దానిచే నీకు కీడు వాటిల్లును.

తవ సహధరచరీ— నీవు ఈమెను అగ్రపత్నిగా ఉంచుకొనవలెను.

ఏనాం ప్రతీచ్ఛ చ— ఈమెను ప్రతిగ్రహింపుము. తే భద్రమ్— అట్లు మేము చెప్పినట్లు చేసిన నీకు మంగళము కలుగును.

4. ఇయమ్ = ఈ, ఎవ్వరికిని కదలింప శక్యము కాని శివధనస్సును రెండుగా విరిచి, అసదృశపరాక్రమము చూపి నీవు జయించినది ఈమెనే. నీ పరాక్రమమునకు సరియైనది కాకున్నకు కరుణింపవలెను.

సీతా = నాగటి చాలున పుట్టినది. తల్లి లేనిది లోకములో తల్లి కాని బిడ్డపై ప్రేమ హెచ్చుగా చేయుదురు. నీవును ఈమె యందు దయయుంచ వలెను.

మమ సుతా = నా కూతురు. నేను పెంచినవాడను మాత్రమే. నేను బ్రహ్మ నిష్ఠుడను గాన నావలన పెంపుడు సౌఖ్యము ఈమెకు కలిగియుండదు. నేను బ్రహ్మనిష్ఠుడ నగుటచే, నీవు ఈమె నుపేక్షించినను విచారించువారు లేక పోవు టచే అట్లు చేయక, ఈమెపై దృఢమగు ప్రేమ నుంచవలెనని ఇప్పుడే చెప్పు చున్నాను.

తవ సహధర్మచరీ :— నీవు ఈమెను ధర్మపత్నిగా గ్రహించిన చాలును. మేము కర్మఠులము కావున అదియే మాకు ప్రార్థనీయము.

ఏనాం ప్రతీచ్ఛ :— ఈమెను అంగీకరింపుము. చాల గౌరవము గల తలి దండ్రు లివ్వగా గ్రహించుటకు తామే త్వరపడుదురు. ఇట్టి కన్యను గ్రహించుటకు కొంత ప్రార్థించిననే గాని కాదని అర్థము.

తే భద్రమ్ :— నీకు మంగళము అగుగాక. ఇట్టి వారియందు ప్రేమ ఉంచుటవలనను, బ్రహ్మనిష్ఠులమైన మా మాట వినుట వలనను నీకు మంగళము కలుగును (గోవిందరాజ మహేశ్వర తీర్థులు).

5. (తనిశ్లోకి) ఇయమ్ = ఇదిగో, రూపసౌందర్యములచే నేనే గొప్ప వాడనని అనుకొనకుము. నీవలె సౌందర్యము గల ఈ సీతను చూడుము.

సీతా = నాగటి చాలున పుట్టినది. బంగారు తీగెయు భూమియందే పుట్టును బంగారు తీగెవంటిది గాన భూమియందు పుట్టినది. ఈ విధముగ అయోనిజ గాన ఆభిజాత్యాదులను గూర్చి విచారింపబనిలేదు.

మమ సుతా = నా కొమార్తె, ఇట్టి దానిని పెంచుటచే నేను ధన్యుడనైతిని.

తవ సహధర్మచరీ :— నీకు "కూడ ధర్మమాచరించునది" ధర్మమాచరించుటకు సహాయురాలు. నీవు చేయు ధర్మములకు సహాయురాలు. నీవు చేయు ధర్మములకు ప్రవర్తకురాలు.

ఏనాం ప్రతీచ్ఛ :— నిన్ను వరించియున్న ఈమెను విడిచి పెట్టక ఆదరించి గ్రహించుము.

భద్రం తే :— నీకు మంగళమగు గాక. ముందు ప్రార్థింపబోవు కార్యము విషయమున అనుకూలుడ వగుము.

పాణినా పాణిం గృహ్ణీష్వ :— హస్తముచే హస్తము పట్టుకొనుము. ఎవ్వరికిని కదిలించుటకు కూడ శక్యము కాని శివధనస్సును లీలగా విరచిన హస్తము కలవాడవు నీవు. సీత హస్తము అతిమృదులము. కావున సరిగా పట్టుకొనుము.

6. (మరికొందరి వ్యాఖ్య) ఇయమ్ = ఈ నిన్ను విడువనప్పుడు మాత్రమే ఈమె జీవించియుండగలరు. "ఆర్తార్తే ముదితే కృష్టా ప్రోషితే మలినా కృశా, మృతే మ్రియేత యా నారీ సా స్త్రీ జ్ఞేయా పతివ్రతా" (ఏస్త్రీ భర్త దుఃఖితుడైనపుడు దుఃఖించునో, సంతుష్టుడైనపుడు సంతోషించునో, ఆతడు ప్రవాసములో నున్నపుడు మలినయై కృశించునో, మరణించినపుడు మరణించునో ఆమె పతివ్రత) అని

చెప్పినట్లు సాధారణపతివ్రతయే భర్తను విడిచి యుండజాలనప్పుడు శాస్త్రములలో చెప్పిన సర్వసల్లక్షణములు కలిగి లోకవిలక్షణయై, సర్వోత్తమురాలుగా ఉన్న ఈమె విషయము చెప్పవలెనా ?

ఇయమ్ = ఈ, నీ ఆత్మయనియు, నీ శరీరమనియు, నీ ఛాయయనియు వేదములలో చెప్పబడినది కావున ఈమె నిర్దోషయే. ఒకవేళ దోషమున్నను అది నీదే కదా ? స్వాత్మదోషము కాని, స్వశరీర దోషము కాని, స్వచ్ఛాయా దోషము కాని, తనదే అగును కదా ! నీ వెట్లు నిర్దోషుడవో ఈమెయు అట్లేనిర్దోషురాలు.

సీతా :— నాగటి చాలున పుట్టినది. "మాతరమజ్ఞనాః" (స్త్రీలు తల్లిని పోలియుందురు) అని చెప్పినట్లు భూదేవి కుమార్తె అగుటచే ఈమె యందు క్షమాది సద్గుణములన్నియు ఉన్నవని చెప్ప పని లేదు.

మమ సుతా :— నా కుమార్తె, భూమి కుమార్తెయైనను నేను పురాకృత పుణ్యవశముచేత ఈమెను పెంచినవాడ నగుటవలన నీ కిచ్చుచున్నాను.

ఏనాం ప్రతీచ్ఛ చ :— ఇట్టి దానిని అంగీకరింపుము .ఇట్టి దానిని నీవంటి ప్రాజ్ఞులుతామే కోరుదురు. 'కావున అంగీకరింపుమని చెప్పుటగూడ ఉపచారార్థమే.

భద్రం తే :— నీకు మంగళమగు గాక. ఈమెయందు ఇట్టి సల్లక్షణములుండుట నీకే ఫలము. భోగ్యపదార్థము పుష్కలముగా నున్నచో భోక్తకే కదా ఫలము లభించును !

పాణినా పాణిం గృహ్ణీష్వ :— నీ హస్తముచే ఈమె హస్తమును గ్రహింపుము, సీత ముగ్ధ గావున చేయి చాచి నీ చేయి పట్టుకొనజాలదు. కావున నీవే పట్టుకొనుము.

వ్యాఖ్యాతలు ఇంకా ఎన్నెన్నో అర్థాలు ఊహించి వాల్మీకికి ఆపాదించినారు. వినే వారికి ఓపిక ఉండవలెను గాని వాగ్ధాటి గలవారు ఇంకా ఎన్నెన్నో అర్థాలుచెప్ప వచ్చును, జనకుడు లక్ష్మణుని ఉద్దేశించి కూడ—

"లక్ష్మణాగచ్ఛ భద్రం తే ఊర్మిళాముద్యతాం మయా,
ప్రతీచ్ఛ పాణిం గృహ్ణీష్వ మాభూత్కాలస్య పర్యయః"
(బా. కా. 73. 30)

అని చెప్పినాడు. దానికి వ్యాఖ్యాత లీ యర్థాలేవీ చెప్పలేదు. పఠితలు స్వయముగనే ఊహించుకొనగలరని విడిచినారేమో!

ప్రాచ్య పాఠంలో ఈ శ్లోకం (ఇయం సీతా అనునది) మరొక విధంగా ఉన్నది.

ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ,
గృహాణ పాణినా పాణిం త్వమస్యా రఘునన్దన"
(ఆ. కాం. 75. 19)

ఈ శ్లోకం తరువాత దాక్షిణాత్యపాఠంలో ఉన్న–

"పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా"

అనువాక్యము ప్రాచ్య పాఠంలో లేదు.

16896